RNI No. APTEL/2003/12253

భావవీథి

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ప్రత్యేక సంచిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 9 Special Issue September 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

సాహిత్య సమాలోచన

(అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో సమర్పించిన వ్యాసాలు)

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Special Issue. 9 - September 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu (Rtd.),** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Associate Professor,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

సాహిత్య సమాలోచన

(2020 జూన్ 17, 18, 19 తేదీలలో జరిగిన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు పత్రాలు)

సంపాదకవర్గం :

డాక్టర్ కోదండ లక్ష్మణ

డాక్టర్ మానమ మునిరత్నం

డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి

డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

సాహిత్య సమాలోచన

Prof. Madabhushi Sampath Kumar Sahitya Samalochana

(Articles presented in the International Webinar)

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

ప్రథమ ముద్రణ	:	**17 సెప్టెంబర్ 2020**
ప్రతులు	:	**500**
కాపీలకు	:	**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ (విశ్రాంత ఆచార్యులు), పూర్వ శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం. చెన్నై.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.**
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. కాదేదీ కవిత కనర్హం	- శ్రీ భువనచంద్ర	8
2. జీవితానికి కవిత్వానికి ఉన్న అనుబంధం	- డాక్టర్ ప్రవాసి	11
3. ఆలోచనలు - ఒక పరిశీలన	- డాక్టర్ మహెజబీన్	15
4. ఆచార్య మాడభూషి వచన కవిత్వం - వస్తువైవిధ్యం	- డాక్టర్ తరపట్ల సత్యనారాయణ	18
5. తమిళ జానపద కళారూపాలు - జీవన వైవిధ్యాలు	- డాక్టర్ యస్.దివిజాదేవి	24
6. జీవితానికి కవిత్వానికి గల అవినాభావ సంబంధం	- డాక్టర్ ఎం.మురళి	27
7. బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య మాడభూషి	- యడవల్లి శ్రీనివాసరావు	32
8. మాడభూషి వ్యాకరణ విజ్ఞానం - ఒక పరిశీలన	- డాక్టర్ వీపూరి వేంకటేశ్వర్లు	35
9. 'మూడో మనిషి' కవిత్వం - మానవత్వం	- డాక్టర్ యం.ప్రసాద్	39
10. 'శత్రువుతో ప్రయాణం' - తెలుగు కవుల కవితా వైశిష్ట్యం	- డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు	43
11. వెల్లివిరిసిన మానవత్వం మాడభూషి కవిత్వం	- డాక్టర్ కప్పగంతుల మధుసూధన్	48
12. కర్షక 'కవిమిత్రుడు'.....మాడభూషి	- డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి	52
13. మొదటి అబద్ధం	- డాక్టర్ కె.రామలక్ష్మి	57
14. 'మూడో మనిషి' - సామాజిక అధ్యయనం	- బోయపల్లి చిట్టెమ్మ	60
15. మాడభూషి సంపత్ కుమార్ - కవితా వైభవం	- భూక్యా కాశీరామ్	64
16. మాడభూషి సంపత్ కుమార్ - మానవత్వపు 'ఆ'లోచనలు'	- బి.మహేష్	68
17. 'వికారి' కవితా వైభవం	- డాక్టర్ ఎస్.బాలాజి	72
18. మాడభూషి వారి 'ఆలోచనలు' - పరిశీలన	- డాక్టర్ పూసల రజనీగంగాధర్	75
19. మాడభూషి సంపత్ కుమార్ రచనలు - అమ్మ పాత్రచిత్రణ	- డాక్టర్ ఎస్.యజ్ఞశేఖర్	80
20. సంపత్ కుమార్ గారి సాహిత్యం - కవితా వసంతం	- డాక్టర్ వి.శివనాగార్జున రెడ్డి	83
21. ఆచార్య మాడభూషి 'ఆలోచనలు': సమాలోచన	- డాక్టర్ పులపర్తి శ్రీనివాసరావు	86
22. ఆచార్య మాడభూషి సాహిత్యావలోకనం	- యు.వి.రత్నం	91
23. చెరుపు శాపం	- డాక్టర్ ఏ.వెంకట ప్రసాదు	94
24. మాడభూషి 'శత్రువుతో ప్రయాణం'	- డాక్టర్ మురహరి రాథోడ్	96
25. వెంటాడే 'ఆ-లోచనలు'	- ఎమ్వి రామిరెడ్డి	98
26. మానవతావాది - మాడభూషి	- డాక్టర్ అందుగులపాటి శ్రీనివాసరావు	100
27. 'మూడో మనిషి' తాత్విక చింతన	- డాక్టర్ నగరి చాముండేశ్వరరావు	105
28. మాడభూషి కవిత్వంలో తల్లి ఆవేదన	- ఉల్లెంగ ముత్యం	110
29. మాడభూషి తమిళ జానపదకళలు-వ్యవసాయపు పాటలు	- డాక్టర్ ఎం.ప్రభావతి	112
30. 'శత్రువుతో ప్రయాణం' - మానవతా విలువలు	- తాళ్ళపాక గీత	117
31. మాడభూషి "జీవితం-కవిత్వం"-భాషా వైవిధ్యం	- డాక్టర్ ఎన్.దీపిక	120
32. 'ఆలోచనలు' - సమకాలీన సమస్యల ప్రతిబింబాలు	- డాక్టర్ పి. జయచంద్రుడు	124
33. వికారి - స్త్రీ	- నూకల విజయలక్ష్మి	128

34. మూడో మనిషి కవిత్వం - వస్తువిశ్లేషణ - రాసాల బాలసుబ్రమణ్యం 131
35. 'జీవితం-కవిత్వం' వస్తువైవిధ్యం - పొంకం నాగరాజు 140
36. మాడభూషి - మూడోమనిషి - తేళ్ళ అరుణ 143
37. 'శత్రువుతో ప్రయాణం' - కవిత్వ పరిశీలన - డాక్టర్ జి.రవికుమార్ 146
38. తమిళ జానపద కళలు - గంగిరెద్దుల వాళ్ళ జీవన విధానం - యం.నాగమ్మ 149
39. శత్రువుతో ప్రయాణం-జెండర్ స్పృహ - డాక్టర్ ఎం.దేవేంద్ర 152
40. బహుముఖ ప్రజ్ఞాశాలి మాడభూషి - డాక్టర్ ఎస్.విజయ భాస్కర్ 155
41. మానవత్వానికి మార్గం - మాడభూషి సాహిత్యం - జి.శ్రీదేవి 157
42. ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు - సామాజిక శ్రేయస్సు - పల్లెం జ్యోతి 161
43. 'శత్రువుతో ప్రయాణం' కవిత్వం - స్త్రీ - డాక్టర్ ఓరుగంటి సరస్వతి 165
44. వికారి - మానవత్వపు విలువలు - పాలడుగుల శివ నాగ రాజారావు 168
45. సంపాదక 'విజేత' మాడభూషి - శ్రీమతి చివుకుల లక్ష్మి 170
46. చైతన్య వీచికల విహారి - వికారి - డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ 174
47. సంపత్ కుమార్ కవిత్వం - సామాజిక తత్వం - ఎలగొండ రాములు 176
48. మాడభూషి కవిత్వంలో స్త్రీవాదం - శ్రీమతి జి.యన్.శ్యామలరాణి 180
49. మూడో మనిషి - జెండర్ స్పృహ - జాగర్ల మహేందర్ 184
50. 'వికారి' వస్తు వైవిధ్యం - సుజిత రెడ్డి 186
51. జానపద కళలు - కావడి చిందు - డాక్టర్ జి.సుహాసిని 190
52. చివరకు నువ్వే గెలుస్తావు - సామాజిక విశ్లేషణ - డాక్టర్ డి.సుశీల 193
53. మాడభూషి 'వికారి' కవిత్వం - పరిశీలన - డాక్టర్ ఇ.వాసు 195
54. సంపత్ కుమార్ ఆవిష్కరించిన 'మూడో మనిషి' అంతరంగం - డాక్టర్ కాళిశెట్టి సంధ్య 198
55. వ్యాకరణ విజ్ఞాన గ్రంథం భాషా దృక్కోణ పరిశీలన - ఆచార్య శివుని రాజేశ్వరి 202
56. సంపత్ కుమార్ వచన కవిత్వం - సామాజిక స్పృహ - డాక్టర్ బశెట్టి ఉపేంద్ర 206
57. చివరికి నువ్వే గెలుస్తావు - సామాజిక దృక్పథం - పి.జ్యోతి 208
58. మూడోమనిషి- సామాజిక విశ్లేషణ - డాక్టర్ టి. షర్మిలాప్రతిమ 211
59. మాడభూషి కవిత్వంలో రాజకీయాలు - మద్దిరాల సత్యనారాయణరెడ్డి 217
60. మాడభూషి కవిత్వంలో మహిళా సమస్యలు - పోల్కం రాములు 220
61. సామాజిక సమస్యలకు దర్పణం 'శత్రువుతో ప్రయాణం' - డా. ఒభిన్ని శ్రీహరి 223
62. 'వికారి' కవిత్వం - తాత్వికత - డాక్టర్ పి. వరలక్ష్మి 229
63. మధురాక్షరాల మృదుభాషి - మాడభూషి - డాక్టర్ పి.విజయకుమార్ 233
64. 'వికారి' కవిత్వం-ప్రకృతి స్పృహ - డాక్టర్ సి.చిన్నపాపమ్మ 236
65. జీవితసత్యాలు - కవితాతత్వాలు - డాక్టర్ ఎ. రవీంద్రబాబు 239
66. మాడభూషి కవిత్వం-వస్తువైవిధ్యం - దోర్నాదుల సిద్ధార్థ 243
67. మాడభూషి కవిత్వం - మానవతావాదం - డాక్టర్ కె.లక్ష్మణ 248
68. మాడభూషి 'వ్యాస సంపద' వైశిష్ట్యం - ముత్యాలు రాఘవ గణేష్ కుమార్ 255

69. మూడోమనిషి-సామాజిక ప్రతిబింబం - డాక్టర్ కందిరాజు వేణుగోపాలరాజు 258
70. వికారి కవిత్వం - మాడభూషి వ్యక్తిత్వం - యు.లావణ్య 261
71. జీవితం-కవిత్వం-అవినాభావ సంబంధం - మాధవి. బొల్లు 264
72. జీవితమే కవిత్వం - కవిత్వమే జీవితం - డాక్టర్ కె.కరుణశ్రీ 266
73. సంపత్ కవిత్వం - ప్రకృతి - గిడుగు శ్రీనివాసరావు 268
74. మాడభూషి వచన కవిత్వం - సామాజిక దృక్పథం - డాక్టర్ డి.మస్తానమ్మ 271
75. నిజం విలువ తెలిపిన 'మొదటి అబద్ధం' - డాక్టర్ అనుగూరు చంద్రశేఖరరెడ్డి 274
76. 'జీవితం కవిత్వం'లో అంతర్గత విశేషాలు - డాక్టర్ జరీనావహబ్ షేక్ 278
77. 'సంపాదక' ఆచార్యులు మాడభూషి - డాక్టర్ లేబాకు విజయకృష్ణారెడ్డి 284
78. మాడభూషి 'చెరువు శాపం' - మానవ స్వభావ చిత్రణం - డాక్టర్ దోమల ధాత్రికుమారి 292
79. 'మొదటి అబద్ధం' - పరిశీలన - చిట్టూరి జగదంబిక 298
80. తమిళ జానపద కళలు - తెలుగు వారితో సంబంధాలు - పూషడపు.సుబ్బారావు 301
81. మానవ సమాజ వికారాలను పోకార్చే విబోధి - వికారి - పి. యామిని అమ్మాజీ 309
82. తమిళ, తెలుగు జానపద కళలు-తులనాత్మక అధ్యయనం - డాక్టర్ డి.విజయకుమారి 312
83. అబద్ధాన్ని అందంగా చెక్కిన మాడభూషి కవిత్వం - శ్రీపతి మారుతి 319
84. మనోవైజ్ఞానిక కోణంలో సాహితీ సవ్యసాచి మాడభూషి.... - లంకా ఎల్.ఆర్.వెంకటరమణ 321
85. మాడభూషి 'వ్యాకరణ విజ్ఞానం' - పరిశీలన - డాక్టర్ కె.బాలకృష్ణ 324
86. మూడో మనిషి కవిత్వం - మనోవిశ్లేషణ - డాక్టర్ వి.శాంతిలక్ష్మి 327
87. మాడభూషి సాహిత్యం సృజనాత్మకత - పరిశోధనా దృష్టి - విద్వాన్ ఆర్.రమేష్ 331
88. కవితే తానై.....! - డాక్టర్ ఎస్.ఎల్.వి.ఉమామహేశ్వరరావు 335
89. మాడభూషి కవిత్వం - వాస్తవిక ధోరణులు - జ్ఞానేశ్వరి 337
90. 'శత్రువుతో ప్రయాణం' స్త్రీ మనోవిశ్లేషణ - పులి చినబాబు 342
91. వికారి కవిత్వం - సామాజిక దృక్పథం - టి.సోమశేఖర్ 345
92. 'ఆ'లోచనలు-వస్తుతత్త్వం - డాక్టర్ జి. శైలమ్మ 354
93. డాక్టర్ మాడభూషి కవిత్వంలో స్త్రీవాద కోణం - డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి 360
94. మానవతావాదం డాక్టర్ మాడభూషి కవిత్వం - డాక్టర్ నందనవనం శివకుమార్ 364
95. 'సంప'ద్వంత కవితా విరించి 'మాడభూషి' - డాక్టర్ జడా సుబ్బారావు 370
96. జీవన సమరం - డాక్టర్ డి.వేలాయుధం 377
97. మాడభూషి సంపత్ కుమార్ కవిత్వం - వస్తు విశ్లేషణ - గొంగులూరి కృష్ణవేణి 381
98. ఆవేదన, సంవేదనల అక్షరరూపం 'ఆలోచనలు' - షేక్ జరీనా 392
99. 'మొదటి అబద్ధం': విశ్లేషణ - డి.స్వాతి 396
100.ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ జీవితం-సాహిత్యం - డాక్టర్ బూసి వెంకటస్వామి 402
101. మాడభూషి సంపత్కుమార్ సాహిత్యం - అత్యాధునికత, సామాజికత - డా॥. పి. కాళియప్ప 411
102.మాడభూషి 'ఆలోచనల' హృదయావిష్కృతి - డా॥ డి.యువశ్రీ 416
103.అబద్ధపు సౌందర్యం - డా॥. వై. సుభాషిణి 421

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"కాదేదీ కవిత కనర్హం"

- శ్రీ భువనచంద్ర, ప్రముఖ సినీగేయ రచయిత.

పాఠకులకు నమస్కారం!

ఏనాడు శ్రీశ్రీగారామాట అన్నారో గానీ, అది ముమ్మాటికీ నిజమని రుజువు చేశారు డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్‌గారు. "చివరకు నువ్వే గెలుస్తావు" కవితా సంకలనంలో మొత్తం 57 కవితలున్నాయి. అన్నీ వైవిధ్య భరితమైనవే! "కుక్కపిల్ల - అగ్గిపుల్ల - సబ్బు బిళ్ళ - అరటి తొక్క - తలుపు గొళ్ళెం - హారతి పళ్ళెం - గుర్రపు కళ్ళెం - పిచ్చుకపై బ్రహ్మాస్త్రం - త్రిశంకుడు - స్వముఖం-" ఇలా- ఎన్నుకున్న వస్తువు మనకు తెలిసినదే అయినా, మనం చూడని దృష్టికోణాన్ని సంపత్‌గారు చూడటమే గాక కొత్తగా మనకి చూపిస్తారు. కొన్ని భావచిత్రాలైతే, కొన్ని బాధా వీచికలు. దేనికవే. చర్వితచర్వణమనేది యీ సంకలనంలో కనపడనే కనపడదు. మనిషి - మానవత్వం - మనసు - ప్రకృతి - ప్రవృత్తి ఇత్యాదుల్ని అద్భుతంగా స్పృశించారు కవిగారు. పైపైకి అలతి అలతి పదాలతో కనిపించినా, లోతుకు వెడుతున్న కొద్దీ అగాథాల్ని మధించిన భావం కలుగుతుందీ కవితల్ని చదివాక. ఒక్కసారి చదివితే మనసుకు హత్తుకుపోయే కవితల్ని విశ్లేషించడమో, విశదీకరించడమో చెయ్యాల్సిన పనిలేదు. కానీ ఓ పాఠకుడిగా నా ఆనందాన్ని మీతో పంచుకోవాలిగా మరీ!

"బావి (భావి) లో చాలా భూతాలున్నాయి
ఎంతో మంది (స్త్రీలు) బావి నుండి అభయం పొందారు" (బావి)

ఈ కవిత చదివాక మనసు నిస్పృహతో నిట్టూరు స్తుంది.

"ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో" అక్కడే బావులు చావుల్ని ప్రసాదిస్తు వుంటాయనే నగ్న సత్యం మనముందు నిస్సిగ్గుతో నిలబడుతుంది.

"ఎవడూ దేనికీ కారణం కాకుండా
అన్నిటికీ ఎవర్నో కారకుల్ని చేస్తూ -
అకారణంగా - ఆ - కారణంగా
ఆత్మహత్యలు జరుగుతూనే వుంటై" (కారణం)

అంటూ నిప్పులాంటి నిజాన్ని కళ్ళెదూట నిలబెడతారు.

"రైతులా ... కార్మికుల్లా
కాలిపోయింది అగ్గిపుల్ల" (అగ్గిపుల్ల)

అబ్బ... ఎంతటి పోలిక తెచ్చారూ... నిజాన్ని ఎంత సింపుల్‌గా నినదించారూ.

"మనిషి నిండా అంటురోగం వుంది
అంటరాని రోగం వుంది"

అని 'కులం' అనే కవితలో

ఘోషించినా-

"ఒకడికి కడుపుమంట... ఇంకోడికి
కడుపులో మంట" అని "రొట్టెముక్క"లో నినదించినా,
"నువ్వు బూమ్', మీద ఆధారపడ్డావు.... నేను
'భూమ్మీద' ఆధారపడ్డాను" అని సత్యాన్ని ప్రవచించినా మనకి కనిపించేది ఒకటే ఏ పక్షపాతమూలేని, జనం కోసం పరితపించే సంపత్ కుమార్ గారి మనసే.

"ఎంతో మంది 'పుట్టకుండా' మరణిస్తారు .... (మరణం నా శాశ్వత చిరునామా) తల్లిబిడ్డని గానంతో లాలించినట్టు మరణం లక్ష్యం మనల్ని మరణింపచెయ్యడమే!" అంటారు. మరణాన్ని ప్రేమిస్తూ ప్రేమించమంటారు.

"ఆకాశం నదిలో దూకి సముద్రంలో కలుస్తుంది"
(సముద్రం)

"ఏనాడు దేశం కోసం 'పనిముట్టు'కోని నేను 'వాడి'కి 'పనిముట్టు'గా మారిపోయా" అంటారు. 'డాలర్ మయం' కవితలో. అక్షర సత్యాలు కాదూ!

"సముద్రంలో ఉప్పు నీళ్ళు... కవిత్వంలో కన్నీళ్ళు"
"జీవితాన్ని యీదినవాడికి సముద్రం పేలిక"
(సముద్రం)

"వాడు.... ఎవడో పోసిన ఇంకుతో
తీర్పుల్ని రాస్తాడు" (మరణం శాసనం)

ఈ ఒక్క వాక్యం చాలదూ... రచయిత మనసు 'లోతు' తెలుసుకోవడానికీ.

''చెరువుని పూడ్చినట్టు నిజాన్ని పూడ్చలేక ఏడుస్తున్నాడు'' అంటారు. 'చెరువు' కవితలో. కబ్జాలకు గురైన చెరువులే కన్నీళ్ళకు ఆలవాలమైన చిత్రమూ యీ కవితలో మనకి కనిపిస్తుంది.

"దొంగ లెందరో జెండా నీడన దర్జాగా బతుకుతుంటే-
జెండా మాత్రం ఎండలో ఎండుతూ వుంది"

అంటారు 'జెండా'లో.

''కవిత్వంతో జడత్వాన్ని వొదిలించేవాడే కవి'' అని 'కవి'కి నిర్వచనం చెబుతారు కవిగారు.

''గెలిచేంతవరకూ ఓడిపోతూనే వుంటాడు'' (ఓడిన వాడు) కవితలో అంతులేని స్ఫూర్తినిస్తారు సంపత్‌గారు.

''చంపడానికే నన్ను పెంచుతాడు'' అంటుంది కోడి. కార్యకర్తలూ కోళ్ళ గుంపులాంటి వారే. బడుగువారూ ఎరగా మారే కోళ్ళే!

''నిన్ను నమ్ముకుని ఎందరు వీరులు అనాథ శవాలయ్యారో'' అని 'హారతి పళ్ళెం'లో ఆక్రోసిస్తారు కవి. నిజంగా ఇదో అద్భుతమైన కవిత. ఇంత: పూర్వం ఎవ్వరూ ఎంచుకోని కవితా వస్తువిది.

''చెట్టునించి రాలిన విత్తనం చెట్టుగానే పుట్టినట్టు అమ్మ అమ్మగానే పుడుతుంది'' అంటూ అమ్మను కీర్తిస్తారు (అమ్మకవిత).

"నీ పక్కన నిద్ర నటించాలే తప్ప నిద్రపోకూడదు
నమ్మించి గొంతుకోసే నీ సావాసాన్ని ఎలా కొన
సాగించేదీ?"

అంటారు 'సునామి' అనే కవితలో.

"చెరువు గుండెలో గునపాలుదించినవాడు
చెరువు కన్నీళ్ళకి ఉక్కిరి బిక్కిరవుతున్నాడు"
(అంతదాకా కవిత)

"అద్భుతమూ.... అబ్దుల్ కలామూ..." (అఖండ జ్యోతి)

"కాళ్ళ కిందముళ్ళు నలిగిపోతున్నా
కళ్ళు కిందకి వాలడంలేదు" (ఒక సాయంత్రం)

"గుండె నిండుగా గాలిపీల్చి వదిలితే
వెదజల్లేది ప్రేమ పరిమళమే (ప్రేమ)

పండించిందంతా పరాయి వాడి చేతిలో పెట్టి
అన్నం కోసం అంగడి ముందు నిలబడే"
(రైతుకూలీ)

రైతు - తన భూమిలో తనే కూలీ అంటారు. అంతే కాదు-

''వేలకోట్లు ఎగ్గొట్టిన వాడి ముందు మోకరిల్లే బ్యాంకులు ''వేల రూపాయల కోసం రైతుని మోకాళ్ళమీద నిలబెడుతున్నాయి'' అంటారు. ఎంతటి నిజమిదీ!

"డైనోసార్‌కి రూపం పోసినవాడు
పిడికెడు పిచ్చుకకి చోటులేకుండా చేశాడు
(పిచ్చుకపై బ్రహ్మాస్త్రం)

పులిని కాపాడుతున్నాడు - పిచ్చుకమాయమైంది
పాముని కాపాడుతున్నాడు - పిచ్చుకపై బ్రహ్మాస్త్రం
సంధించాడు" అంటారు.

"సెల్ఫీలో ఎంత అందంగా ఉన్నారో - సెల్ఫిష్‌లో
కూడా అంతే ఆనందంగా ఉన్నాడు" అంటారు.

''త్రిశంకుడు చేసిన పోరాటం - సామాన్యుడి జీవన సంకేతం అంటూ - ఒకనాడు త్రిశంకుడి లాంటి సామాన్యుడే

''దుర్గాని ఛేదిస్తాడు - స్వర్గాన్ని చేరుకుంటాడు'' అని అత్యంత ఆశావాదాన్ని మనకి ఆయుధంగా అందిస్తారు.

ఈ సంకలనంలో ఏ కవిత విలువ దానిదే. ఏకబిగిన చదువుతాం. చదువుతూ స్పందిస్తాం... స్పందిస్తూ

చదువుతాం. ఇవన్నీ మనని ఆకాశంలో విహరింప చెయ్యవు. నేలకి దింపి చుట్టూ ఒకసారి చూడమంటాయి. మారుతున్న విలువల్నీ పరిస్థితుల్నీ మనని గమనించ మంటాయి.

'నేలవిడిచి సాము చెయ్యని' యీ కవితా సంకలనం చదివాక ప్రతి పాఠకుడికీ ఓ కనువిప్పు కలుగుతుంది. ఎన్నో అర్థాలు గోచరిస్తాయి. నిజాన్ని నిజంగా చూడ మంటాయి. నిజాన్ని నిర్భయంగా అంగీకరించమంటాయి.

ఎంతో రాయాలని వుంది. మరెంతో మీతో పంచు కోవాలని వుంది. కానీ ఒక 'పరిధి'ని పాటించాలి గనక ఇంతటితో ముగిస్తూ, ఇటువంటి కవితా సంకలనాల్ని శ్రీమాడభూషి సంపత్ కుమార్ గారు మరిన్ని వెలువరిం చాలనీ, త్రిశంకు స్వర్గంలో ఊగుతున్న మానవుల మనసుకి కాస్త ఆలోచననీ, ఆహ్లాదాన్నీ కలిగించాలని కోరుకుంటున్నాను.

గుండెల్లో నూటిగా నాటుకోవడమే కవిత యొక్క లక్షణమూ, లక్ష్యమూ అయితే ఆ లక్ష్యం యీ సంక లనంలో సంపూర్ణంగా సిద్ధించిందని మనవి చేస్తూ -

చెన్నై నగరంబందున
అన్నగ సంపత్కుమారు డంతర్జాతీ
యోన్నతి సభలను జరుపగ
మిన్నగ నుతియింతు నిపుడు మిక్కిలి దక్షున్!

నాడు నేడు రేపు నయముగా జరిగిన
జరుగుతున్న యింక జరుగబోవు
సుపరిశోధనమును సులువగా చర్చింప
సదసు జరుపు మిత్రు సన్నుతింతు!

చూడ సన్నయై చోద్యంపు ప్రతిభతో
కదలు చుండునట్టి ఘనుడితండు
పనులు చేయుటందు బాహుబలి యితండు
మాడభూషి వంశ్య మరి నుతింతు!

- డాక్టర్ గుమ్మా సాంబశివరావు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవితానికి కవిత్వానికి ఉన్న అనుబంధం

- డాక్టర్ ప్రుతోసి, మహాత్మాగాంధీ ఇన్స్టిట్యూట్, మారిషస్.

"కవిత్వం, జీవితం అన్నవి రెండూ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నాయి. మానవుడు భాష నేర్చిన నాటినుంచి కవిత్వాన్ని ఆదరిస్తున్నాడు. తాను చెప్పదలచుకొన్న విషయాన్ని అందంగా, ఆకర్షణీయంగా చెప్పాలన్న ప్రయత్నంనుంచే కవిత్వం పుట్టింది. అందుకే కవి కళాకారుడయ్యాడు. సామాన్య మానవులు దర్శించలేని విషయాలను కూడా కవి దర్శించి, దాన్ని అందరికీ అందిస్తాడు కాబట్టే కవి ముందువరసలో ఉంటాడు. మిగిలిన ప్రజలకు ఆదర్శప్రాయుడుగా ఉంటాడు." అప్పుడే జీవితానికి కవిత్వానికి ఉన్న అనుబంధాలను కవిత్వీకరించగలం.

"సముద్రాన్ని గురించి
ఆలోచించు!
జీవితాన్ని అందులో దించు!
కవిత్వాన్ని గురించి
ఆలోచించు!
సముద్రాన్ని అందులో ముంచు!
అప్పుడు
కవిత్వంలో
జీవితం
ప్రతిఫలిస్తుంది!"

పై కవితలో జీవితం ఒక మహాసాగరమన్నారు. సాగర మధనం చేస్తే అమృతం జనిస్తుంది. ఆ అమృత తుల్యమే కవితా కన్యక అని మాడభూషివారు వెలిబుచ్చారు. జీవితానికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని సముద్రంతో పోల్చిచెప్పడం రచయితలోని కవితా వైభవానికి నిదర్శనం.

"కవిత్వాన్ని బతిమాలుకో
జీవితంలో మేలుకో
కవిత్వాన్ని నమ్ముకో
జీవితాన్ని ఏలుకో"

కవిత్వానికి, జీవితానికి అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తూ- కవిత్వాన్ని బతిమాలుకొని జీవితంలో మేలుకోమంటున్నారు.

"దేహికి
ప్రాణికి ఉన్న బంధాన్ని
కవికి
కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని
సంకలించడానికి
పుస్తకం చాలదు
జీవిలాగే
జీవితంలాగే"

దేహానికి, ప్రాణానికి బంధాన్ని గురించి, కవికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని పరిశీలించడానికి పుస్తకం చాలదనే దృక్పథాన్ని స్పష్టం చేశారు. ఎందుకంటే జీవిలాగ, జీవితంలాగ జీవితాన్ని గడపాలని మాడభూషి ఈ రెండింటికి మధ్య అనుబంధాన్ని గురించి తెలియజేయాల్సిన అవసరం వచ్చింది. అలా మనిషి ప్రాణం పోయిన తరువాత ఎవరు అతడి దగ్గరికి వెళ్ళడానికి ఇష్ట పడరు. అందరూ అతడిని చూసి భయపడతారు.

"కవిత్వమే నాకు ప్రాణం
నేనే కవిత్వానికి ప్రాణం
ప్రాణానికి ప్రాణం
కవిత్వానికి కవిత్వం
అంతా నేనే అయినప్పుడు
కవిత్వాన్ని, ప్రాణాన్ని
విడిగా విడివిడిగా
విడదీసి చూసి
కవిత్వంలోని ప్రాణాన్ని
ప్రాణంలోని కవిత్వాన్ని

నిలువునా ఉరిదీసి
కవిత్వమే లేదంటూ
ప్రాణమే కాదంటూ
ప్రాణహాని
కవిత్వఘ్నాని
కలిగిస్తూ
ప్రాణాన్ని హరిస్తావు
కవిత్వాన్ని కరిగిస్తావు"

పై కవితలో మొత్తం కవిత్వానికి సంబంధించిన విషయాలను క్రోడీకరించారు. కవిత్వమే నాకు ప్రాణ మంటున్నారు. అంతే కాకుండా నేనే కవిత్వానికి ప్రాణం అన్నారు. కవిత్వం, ప్రాణం అంతా నేను అయినప్పుడు విడివిడిగా విడదీసి కవిత్వంలోని ప్రాణాన్ని గానీ, ప్రాణం లోని కవిత్వాన్ని గానీ విడదీసి చూడలేమన్నారు. ఇక్కడ కవికి కవిత్వానికి అభేదాన్ని చెప్పారు. కవిని కవిత్వాన్ని విడదీసి చూడకూడదన్నదే ఇందులోని భావం.

"నేను
కవిత్వమై మొలుస్తాను!
జీవితమై నిలుస్తాను!"

రచయిత కవిత్వంలో మొలుస్తానంటారు, జీవితంలో నిలుస్తానన్నారు. అంటే ఈ రెండింటికి అవినాభావ సంబం ధాన్ని తెలియపరిచారు. కవిత్వంద్వారా జీవితంలో చిర స్థాయిగా నిలుస్తానని చెబుతున్నారు.

"కవిత్వం బరువయింది
జీవితం తేలికయింది
కవిత్వాన్ని జీవితంలోకి
తర్జుమా చేస్తే
జీవితం బరువుగా సాగుతుంది
కవిత్వం తేలికగా ఎగురుతుంది
జీవితాన్ని కవిత్వంలోకి మారిస్తే
కవిత్వం వేడెక్కుతుంది
జీవితం చల్లారిపోతుంది"

కవిత్వంలో జీవితం ఎలా ఇమడగలదన్న విషయాన్ని గురించి చెబుతూ-కవిత్వం బరువుగా, జీవితం తేలికగా ఉంటుందన్నారు. అంటే కవిత్వాన్ని జీవితంలోకి అను వాదం చేసినప్పుడు జీవితం బరువుగా కవిత్వం తేలికగా ఉంటుందని వెల్లడించారు. అదే జీవితాన్ని కవిత్వంలోకి మార్చితే కవిత్వం వేడిగా, జీవితం చల్లగా ఉంటుందని ఒక తాత్విక చింతనను మాడభూషి వారు ప్రతిపాదించారు. అంటే జీవితాన్ని గురించి కవిత్వానికి పదును వస్తుందని, కవిత్వం చదవడంద్వారా ఆందోళనతో ఉన్న జీవితం ప్రశాంతంగా మారుతుందని కవి భావన.

"దారి తప్పిన జీవితానికి
కవిత్వం వెలుగు చూపిస్తుంది
గురి పెట్టిన కవిత్వానికి
జీవితం లక్ష్యమై నిలుస్తుంది"

మనిషి జీవితంలో దారి తప్పిపోతే అతనికి కవిత్వం వెలుగును చూపిస్తుంది. అలాగే గురి పెట్టిన కవిత్వానికి జీవితం లక్ష్యమై నిలుస్తుం దంటున్నారు. కవిత్వానికి లక్ష్యం జీవితమే. కవిత్వాన్ని గురిపెట్టడమంటే జీవితాన్ని లక్ష్యంగా చేసుకొని రాయడమే.

"జీవితాన్ని
కవిత్వం ముంచదు
కవిత్వాన్ని
జీవితం తుంచదు
మునిగిన జీవితాన్ని
కవిత్వం తేలుస్తుంది!
తునిగిన కవిత్వాన్ని
జీవితం అతుకుతుంది!"

ఇందులో కవి జీవితాన్ని కవిత్వం ముంచదన్నారు. వెంటనే కవిత్వాన్ని జీవితం తుంచదన్నారు. కానీ మునిగిన జీవితాన్ని కవిత్వం తేలుస్తుందంటూనే తునిగిన కవిత్వాన్ని కూడా జీవితం అతుకుతుందన్నారు. అంటే మనిషి జీవితంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. అంటే

జీవితాన్ని ముక్కలు చేస్తుందన్నమాట. అలాంటి సమయంలో కవిత్వం జీవితాన్ని అతికిస్తుందన్న భావనను తెలియపరిచారు.

"అంతరాంతరాల్లోనుంచి
ఉబికేది కవిత్వం!
అనంతవాయువుల్లోకి
దూకేది జీవితం!"

మనిషి ఎప్పుడు జన్మిస్తాడో తెలియదు. ఎప్పుడు మరణిస్తాడో తెలియదు. అలాగే కవిత్వం ఎప్పుడు? ఎలా? ఎక్కడ? పుడుతుందో కూడా తెలియదు. ఇలా కవిత్వాన్ని జీవితాన్ని గురించి వైవిధ్యభరితంగా స్పష్టం చేశారు. కవిత్వాన్ని ఉబుకుతుందని, జీవితాన్ని దూకుతుందని చెప్పడంద్వారా కవిత్వానికున్న సృజనాత్మకతను, జీవితానికున్న క్షీణగుణాన్ని తెలియజేశారు.

"జీవితానికో
నమస్కారం
కవిత్వానికో
పురస్కారం
పురస్కారమే
జీవితమనుకొంటే
కవిత్వానికో
నమస్కారం"

సన్మానాలు కోసం కవిత్వంరాసే వాళ్ళు కొందరు, పేరు కోసం కవిత్వాన్ని వెలువరించే వాళ్ళు కొందరు, సామాజిక స్పృహ కోసం కవిత్వాన్ని రచించేవాళ్ళు కొందరు. ఇలా కవిత్వీకరించే వారి గుణాలు చూస్తే ఒక్కొక్కరు ఒక్కొ పనిగా కవిత్వం రాస్తారు. పై కవితలో రచయిత పుర స్కారం కోసం జీవితం ఉండాలంటే, అలాంటి కవిత్వాన్ని రచించడానికి పూనుకోను అంటున్నారు. అంటే కవులు రచనలు సన్మానాలు, బిరుదులు, పురస్కారాలు కోసం చేయకూడదన్నారు. వారి రచనలు చీకటిలో ఉన్న ప్రజ లను వెలుగులోకి తీసుకొచ్చే విధంగా ఉండాలన్నదే రచయిత ఉద్దేశం.

"కవిత్వమే
తెలియనివాడు
జీవితాన్ని నడిపిస్తున్నాడు!
జీవితమే ఎరుగనివాడు
కవిత్వాన్ని రచిస్తున్నాడు!
కవిత్వం, జీవితం
ఎరుగకుండానే
గడిపేస్తున్నాడు!"

కవిత్వం తెలియనివాడు కూడా జీవన సాగరంలో పైకొస్తున్నాడు. అలాగే జీవితాన్ని ఎరుగనివాడు కూడా కవిత్వాన్ని వెలువరిస్తున్నాడనే దృక్పథాన్ని ప్రతిపాదించారు. అంటే కవిత్వం, జీవితం రెండూ కూడా తెలియకుండా జీవితాన్ని గడిపేస్తున్నాడనే విషయాన్ని స్పష్టం చేశారు. ఎందుకంటే కొంతమంది వ్యక్తులు అటూ సంసార సాగరంలో జీవితాన్ని కూడా బాగా చూసుకోలేరు. అలాంటి వారు కవిత్వీకరించడంలో మాత్రం ముందుంటారు. అలాగే కవిత్వాన్ని వెలువరించడానికి తెలియకపోయినా జీవితాన్ని నడిపించడంలో ప్రధాన కర్తలుగా ఉంటారు.

"కవిత్వంతో
పైకి వచ్చినవాడు
కవి
జీవితంలో పైకి వచ్చినవాడు
రవి
రవిగాంచనిచోటు కవిగాంచును!"

కవులు వెలుగులోకి రావడానికి ప్రధానమైన కారణం వాళ్ళ కవిత్వమే. అలా తమ రచనలతో సమాజానికి పరిచయమైన వాళ్ళు కవులు. అలాగే కష్ట నష్టాలను అనుభవించి జీవితంలో పైకి వచ్చేవాడు రవి. రవి ఒక వ్యక్తిని ఉద్దేశించింది. జీవితంలో బాగా పైకి ఎదిగిన వ్యక్తికన్నా కవి సమాజంలోని అన్ని కోణాలను దర్శించ గలడు. కాబట్టి రవి కన్నా కవే గొప్పవాడన్న విషయాన్ని కవి అందంగా తెలియజేశాడు.

"చివరకు పోయేది
జీవితం
చివరి వరకూ మిగిలేది
కవిత్వం"

'పుట్టిన వాడు గిట్టక తప్పదు' అనే నానుడి సరయినది. మనిషి వంద సంవత్సరాలు బతికిన కాని చివరకు మరణిస్తాడు. కాని కవి కలం నుండి జాలువారిన కవిత్వం మాత్రం చిరకాలం జీవిస్తున్నది అన్నది సుస్పష్టం.

"కత్తితో
జీవితం తెగుతుంది!
కలంతో
కవిత్వం అతుకుతుంది!"

ఇద్దరి మధ్య తగాదాలు వల్ల ఇద్దరు పోటాపోటీగా కత్తులతో దాడులు చేసుకోవడం వల్ల వారి వారి తలలు తెగుతాయి. కాని అదే కవి తన కలంతో ఎన్నో అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కవిత్వానికి వన్నె తెస్తాడు. కవిత్వంవల్ల మనుషుల మధ్య తెగిన బంధం అతుకుతుంది. కానీ కత్తివల్ల బంధాలు తెగుతాయి.

"ఉత్తరం వంగి
దక్షిణానికి నమస్కరిస్తుంది
దక్షిణం లేచి
ఉత్తరానికి పాదాలు కడుగుతుంది
కవిత్వం జీవితం
ఉత్తర దక్షిణ ధ్రువాలు"

పై కవిత ఉత్తర దక్షిణ ధ్రువాలు వేరు వేరు అయినా, అవి ఎప్పటికీ కలవకపోయినా, ఒకదానిపై మరొక దానికి గౌరవం ఉండాలన్న విషయాన్ని సూచిస్తుంది. భారత దేశంలో ఉత్తరాన హిమాలయాలు, దక్షిణాన హిందూ మహాసముద్రం ఉన్నాయి. హిమాలయం వంగి సముద్రానికి నమస్కరించినట్టు, అలాగే సముద్రం ఉవ్వెత్తున లేచి హిమాలయాల పాదాలను కడిగినట్టు ఊహించి రాశారు. ఈ రెండూ ఉత్తర దక్షిణ ధ్రువాలుగా ఉన్నప్పటికీ ఒక దానిపై మరొకదానికి గౌరవాన్ని కలిగి ఉన్నాయన్న విషయాన్ని ఈ కవిత గుర్తు చేస్తుంది. అలాగే మనుషులు కూడా తమకు గిట్టనివాళ్ళతో కూడా స్నేహంగా మెలగాలన్న విషయాన్ని గ్రహించాలి. అప్పుడే సమాజం సజావుగా సాగుతుంది.

"జీవితపు రహదారిలో
సేద తీర్చే చెట్టు కవిత్వం"

అంటారు. అంటే మనిషికి జీవితమంతా ప్రయాణమే. ఈ ప్రయాణంలో అలసిపోయిన మనిషికి ఎక్కడో ఒక చోట విశ్రాంతి కావాలి. అలా విశ్రాంతినిచ్చేదే కవిత్వం. కవిత్వం చదవడంవల్ల అలసిన మనిషికి ఎంతో విశ్రాంతి దొరుకుతుంది, ప్రశాంతత లభిస్తుందన్న విషయాన్ని ఇక్కడ చెప్పారు. ప్రతి కళాకారుడు ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి, ప్రజలకు శాంతిని చేకూర్చడానికి ప్రయత్నం చెయ్యాలి. ఇలా కవి చిన్న చిన్న కవితలద్వారా జీవితానికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని ఎంతో ఆహ్లాదంగా, అపూర్వంగా, అందంగా విశ్లేషించారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆలోచనలు - ఒక పరిశీలన

- శ్రీమతి మహెజబీన్, కవయిత్రి, సామాజిక వేత్త, మానవ హక్కుల న్యాయవాది, ఫెమినిస్ట్, హైదరాబాద్.

"ఇది అచ్చంగా కవిత్వం కాదు, కొన్ని ఆలోచనలు మాత్రమే" అన్నారు కవి సంపత్ కుమార్ గారు ఈ పుస్తకానికి (ఆలోచనలు) తొలి పేజీ పరిచయంలో. 'పొయిటికల్ థాట్స్' అంటూ తన ఆలోచనల్ని మన ముందు ఉంచారు. 'ఆలోచనలు' కవితా సంపుటిలోని 'జెండా సాక్షిగా' కవితను సమీక్షించి, ఈ కవితలో ఉండే అనేక చారిత్రక అంశాలను (స్వాతంత్ర్యా నంతర భారతదేశంలో జరిగిన సంఘటనలు) పరిశీలించి, తద్వారా కవి యొక్క సామాజిక దృక్పథాన్ని అంచనా వేయడం ఈ పరిశోధనా పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం. కవిలో ఎలాంటి సామాజిక చైతన్యం ఉంది? ఈ కవిత ద్వారా కవి సమాజానికి ఏం చెప్పదల్చుకున్నారు? కవి యొక్క సామాజిక దృక్పథాన్ని వర్తమానానికి అన్వయిస్తూ, వర్తమాన రాజకీయ, సామాజిక అవసరాలకు కవి ఆలోచనలు ఎలా సరిపోతాయో తేల్చి చెప్పడం ఈ పరిశీలనా వ్యాసం సారాంశం.

కవి వ్యక్తిత్వం, అతని ఆలోచనా విధానం, అతని సామాజిక చైతన్యం అతని కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. ఒక విధంగా కవి ప్రతిబింబమే అతని కవిత్వం. ఇక్కడ ఆచార్య సంపత్ కుమార్ తన గురించి, తన కవిత్వం గురించి ఒక మాట చెప్తారు.

"జీవితం ఎవరికీ గులాంగిరి కాదు
కవిత్వం ఎవరికీ వంగి సలాం చెయ్యదు
నిలువెత్తు కవిత్వంలో
జీవితం తలెత్తుకు తిరుగుతుంది"

ఈ కవితా వాక్యాల్లో మనకు కవి ఆవేదనా ధోరణి స్పష్టంగా అర్థం అవుతుంది. కవికి, కవి రాసే కవిత్వానికి ఒక స్థాయి ఒక వ్యక్తిత్వం ఉన్నాయి అనేది మనకు కనిపిస్తుంది. అలాగే తలవంచని వామపక్ష ఆలోచనా ధోరణి కూడ మనకు కనిపిస్తుంది.

'ఆలోచనలు' కవితా సంపుటిలో తొలి కవిత జెండా సాక్షిగా. సంపత్ కుమార్ గారు చెప్పినట్లు నిజానికి ఇది కవిత కాదు. ఇందులో ఉండే చారిత్రిక తేదీలు, స్వాతంత్ర్యం వచ్చిన రోజు మొదలుకొని 50 సంవత్సరాల స్వాతంత్ర్య (15 ఆగస్టు 1997) స్వేచ్ఛలో లేదా ప్రజాస్వామ్య భారతదేశంలో, అనేక విషాదాలు, బాధాకర సంఘటనలు జరిగాయి. కవి ఒక ప్రజాస్వామిక వాది. ఆయన స్వేచ్ఛయిన భారతదేశాన్ని స్వప్నిస్తున్నారు. సమతా మమతల నవ సమాజం కోసం కలలు కంటున్నారు. అందుకే తనను బాధపెట్టిన (యావత్ భారతీయ సమాజాన్ని బాధపెట్టిన) సంఘటనల్ని వరుసగా డాక్యుమెంట్ చేశారు. ఈ తేదీలు మనల్ని కొన్ని కవితాత్మకంగా, కొన్ని మామూలు వాక్యాలుగా, కొన్ని వ్యంగ్యంగా అలరిస్తాయి. ఈ తేదీల్లో చారిత్రాత్మక ప్రాధాన్యత ఉండబట్టి, నేను కేవలం 'జెండా సాక్షిగా' అనే ఒక కవితను తీసుకున్నాను. దీని విశ్లేషిస్తున్నాను.

"తిరగబడిన జనం / విరిగి పడిన ప్రభుత్వం"

1947 ఆగస్టు 15

మనకు స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపి, పోరాటంతో, ప్రజాస్వామిక భారతదేశాన్ని మనం సాధించుకున్నాం.

"కలిసుండమంటే / కాల్చేసే లోకం"

1948 జనవరి 30

మన జాతిపిత గాంధీజీని కాల్చి చంపిన దినం. అహింసా సిద్ధాంతంతో ప్రపంచంలో తనదైన గుర్తింపు సాధించిన గాంధీని, స్వాతంత్ర్య సమర యోధుణ్ని మనం దక్కించుకోలేక పోయాం.

"అంటరానిపూలు/ అయ్యాయి దేవుడి మాలలు"

1955 జూన్ 1

భారతదేశంలో అంటరాని తనాన్ని నిషేధిస్తూ చట్టం చేయబడింది. ప్రోహిబిషన్ ఆఫ్ అన్‌టచ్‌బిలిటీ ఆక్టు.

"మాటకోసం పోట్లాట / తెలుగువారికి తేటగీత"

1956 నవంబర్ 1

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. భాషా ప్రాతిపదికగా, తెలుగు రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రం.

"చీలికలకు పునాది / సిద్ధాంతానికి సమాధి"

1964 ఏప్రిల్ 1

కమ్యూనిస్ట్ పార్టీ రెండుగా చీలిపోయింది. వామపక్ష భావజాలం ఉన్న ప్రతీ ఒక్కరు బాధపడ్డ రోజు ఇది. సిపిఐ మరియు సిపిఎంగా చీలిపోయింది. ఆ తర్వాత కాలంలో మరెన్నో చీలికలు వచ్చి, ముక్క చెక్కలైంది కమ్యూనిస్ట్ పార్టీ.

"పంచశీల బోధించాడు / పాంచభౌతికం చాలించాడు"

1964 మే 27

నెహ్రూ మరణించిన రోజు. భారత జాతి కన్నీరు పెట్టుకున్న రోజది. భారత ప్రజల సంక్షేమం కోసం నెహ్రూ పంచశీల సూత్రాలను ప్రతిపాదించారు. అదే ఫైవ్ పాయింట్ ఫార్ములాగా అనంతర కాలంలో ప్రసిద్ధి చెందింది.

"మన్నోడెను / తన్నోడెను / భారత్ - పాక్"

1971 డిసెంబరు 3

భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. భారత్ భూభాగం పోగొట్టుకుంటే, పాకిస్తాన్ యుద్ధంలో ఓడిపోయింది. ఎవరికి ఏం లాభం? ఈ ప్రశ్న మనల్ని వెంటాడుతుంది. భావి తరాలను కూడ.

"చీకటి ప్రభవించెను / రాహువు కబళించెను"

1975 జూన్ 25

ఎమర్జెన్సీ చీకటి రోజుల దినం ఇది. ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించారు. అంటే ప్రెస్ ఫ్రీడమ్ లేదు, మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఎంతో మంది ప్రజాస్వామిక వాదులు అరెస్ట్ అయి జైలులో మగ్గిపోయిన కాలం అది. భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిలిన రోజు ఇది.

"చేసిన తప్పులకు శిక్ష / ప్రతిపక్షాలకు పరీక్ష"

1977 మార్చి 24

ఎమర్జెన్సీ కారణంగా ఇందిరా గాంధీ పదవి పోగొట్టుకొంటే, జనతా దళ్ అధికారంలో కొచ్చింది. చేసిన తప్పులకు శిక్ష అనుభవించారు అంటారు కవి ఈ సందర్భంలో.

"అమ్మగారి అధికారం / అన్నగారి హస్తగతం"

1983 జనవరి 25

తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రేసేతర ప్రభుత్వం అధికారంలో కొచ్చింది. ఎన్.టి.రామారావు గారి ప్రభుత్వం.

"రక్షకులే భక్షించినారు / రణతంత్రము సృష్టించినారు"

1984 అక్టోబర్ 31

ఇందిరా గాంధిని తన సొంత అంగ రక్షకులే కాల్చి చంపిన బాధాకర దినం ఇది.

"పేరు చుండూరు / హృదయం మండే చూరు"

1991 ఆగస్టు 6

చుండూరు అనే ఊరిలో దళితుల మీద ఊచకోత జరిగింది. దళిత స్త్రీల మీద అత్యాచారాలు జరిగాయి. జరగకూడని సంఘటన ఇది. ఆ తర్వాత మరెన్నో జరిగాయి. దళిత ఉద్యమాలు రూపు సంతరించుకున్నాయి. ఆ రోజును తలచుకొంటే అందరి గుండెలు మండు తాయని కవి ఆవేదన.

"అసలే కోతి / ఆపై కల్లు తాగెను"

1992 డిసెంబర్ 6

అయోధ్యలో బాబ్రి మజీద్‌ను కూల్చివేశారు. హిందు మతోన్మాదం, హిందుత్వ రాజకీయాలు దీనికి మూలం.

ఈ సంఘటన వెంబడి దేశమంతా మతకల్లో లాలు రగులుకున్నాయి. ఈ సంఘటనతో భారతదేశం తనకున్న సెక్యూలర్ ఇమేజ్‌ని పోగొట్టుకుంది. ప్రపంచ ప్రజలు దీన్ని ప్రశ్నించారు.

1991లో దళితుల మీద దాడి, 1992లో ముస్లింల ప్రార్థనా మందిరాల మీద దాడి, ముస్లింల చారిత్రక కట్టడాల మీద దాడి, వాళ్ళ సంస్కృతి మీద దాడి ఒక పథకం ప్రకారం జరిగిందనే చెప్పవచ్చు. కవి దీన్ని డాక్యుమెంట్ చేసి సాహిత్య చరిత్రకు అందించారు.

"పదమూడునాళ్ళ ముచ్చట / తీరింది అధికారపు తీట"

1996 జూన్ 17

వాజ్‌పాయి ప్రభుత్వం 13 రోజులకే అధికారం కోల్పోయింది.

"స్వేచ్ఛకోసం గింజుకొంటున్న జెండా / అవినీతే నేటి ఎజెండా"

1997 ఆగస్టు 15

50 సంవత్సరాల స్వాతంత్ర్యదినం ఇది. 50 సంవత్సరాలు అంటే చిన్న విషయం ఏమీ కాదు. అర్ధ శతాబ్దం. ఎన్నో తరాలు మారాయి. కాని ప్రజల తలరాత మారిందా? నిజంగా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామా? పేదరికం సమసిపోయిందా?అంటూ కవి 50 సంవత్సరాల భారత స్వాతంత్ర్యం పట్ల బాధ వ్యక్తం చేస్తారు.

ఇక్కడ కవి 50 సంవత్సరాల్లో జరిగిన ప్రత్యేకమైన సంఘటనా తేదీలను సాహిత్య చరిత్రలో పొందపర్చడం ద్వారా, మనకు ఆ సంఘటనల్ని నిశితంగా పరిశీలించే అవకాశం కలిగింది. ఎందుకు పరిశీలించాలి. అంటే గడిచిన కాలంలో జరిగిన తప్పుల్ని సరిదిద్దుకొని, రాబోయే కాలంలో దేశాన్ని మరింత ప్రజాస్వామికంగా మలచుకోవడానికి వీలుకలుగుతుంది. అప్రజాస్వామికంగా జరిగిన సంఘటనలు పునరావృత్తం కాకుండా జాగ్రత్త పడే అవకాశం ఈ తరానికి ఉంటుంది.

"స్వేచ్ఛ కోసం జెండా గింజుకుంటుంది" అంటారు కవి. అవినీతి అజెండా అయిన వైనం బాధగా చెప్తారు. 50 సంవత్సరాలు స్వాతంత్ర భారతావనిని చూసిన కవి, ఏ మాత్రం స్వేచ్ఛ లేని తనాన్ని ప్రశ్నిస్తారు. అసహనం వ్యక్తం చేస్తారు. ఇప్పుడు మనం 70 సంవత్సరాల స్వాతంత్ర్యదినాలు చూసాం. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులు మరింత దిగజారాయి. వర్తమాన కాలంలో ఈ పొయిటికల్ థాట్స్ మనల్ని ఆలోచింప జేస్తాయి. కవికి ఉన్న సామాజిక దృక్పథం అత్యంత చైతన్యవంతమైంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య మాడభూషి వచన కవిత్వం - వస్తు వైవిధ్యం

- డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, తెలుగు శాఖాధిపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

మృదుభాషి - ఆచార్య మాడభూషి

తెలుగు లిపికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకు రావడమేకాదు ఉత్తమ లిపి అన్న ఖ్యాతిని తీసుకొచ్చిన తెలుగు ఆచార్యుడు మాడభూషి సంపత్ కుమార్. ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రిని తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు పై పరిశోధన చేసి డి.లిట్ పట్టాను అందు కున్న అసామాన్యుడి ఆచార్య మాడభూషి అని వేనోళ్ల శ్లాఘించిన కీర్తి శిఖరం సంపత్‌కుమార్! వీరికోసం ఎంత చెప్పినా తక్కువే. అసలు చెప్పాలంటే పరిచయమే అవసరం లేని మర్యాదస్థుడు. మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖక చరిత్రలోనే నిలువేత్తు సంతకం ఆచార్య సంపత్‌కుమార్. వీరి రచనల్లో అనువాదాలు, సంకలనాలు, సంపుటిలు, పరిశోధ గ్రంథాలు, భాషా సాహిత్య వ్యాసాలు, పరిశోధన వ్యాసాలు, వచన కవితా రచనలు ఎన్నో వున్నాయి. అన్ని ప్రక్రియల్లో అరుదైన జ్ఞానాన్ని సంపాదించడమే కాకుండ వివిధ భాషల్లో విజ్ఞాన సర్వస్వంగా నిలబడెలాంటి రచనలు చేసిన తెలుగు సాహితీ వేత్త సంపత్‌కుమార్. కవికోకిల, సాహిత్యరత్న, ఆంధ్ర భాషా భూషణ, ధ్రువతారగా వెలిగిన వీరు ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందించిన వీరి పర్య వేక్షణలో ఇరవై ఎనిమిది మంది విద్యార్థులు పిహెచ్.డి.పొందారు. డెబ్భై ఆరు మంది విద్యార్థులు ఎం.ఫిల్ పట్టాలు పొందారు. అంతేకాదు విరామ మెరుగుక పరిశ్రమించే సాహితీ శ్రామికుడు మాడభూషి. మాటలో మితా చేతల్లో అవన్యం. అంతర్జాతీయ సదస్సులో వీరి ప్రదర్శించిన ప్రతిభ సమర్పించిన పత్రాలు వారి ప్రతిభా సంపత్తికి కీర్తి కిరీటాలుగా కనిపిస్తాయి. ఇటువంటి విశిష్టత గత సాహితీ వేత్తకు ఈ చిఱు పరిచయం చాలని భావిస్తూ మాడభూషి వారి రచనల్లో విశిష్టతను తెలిసుకుందాం.

పత్రముఖ్య ఉద్దేశ్యం :

ఆచార్య మాడభూషి రాసిన సాహిత్య ప్రక్రియల్లో వచన కవిత్వం ఒకటి. వీరు పరిశోధాత్మక వ్యాస రచనలతో పాటు వచన కవిత్వ రచనల్లో కూడ చేయి తిరిగిన వారే. వీరి కవిత్వంలో చురుపులు, చురకలు, వ్యంగ్య భావ వీచికలు, ప్రణయం-ప్రయాణం, నడికారం, వెటకారం, ఆకాశం, భూమి, సముద్రం చుట్టు ఇలా అన్నిటిని స్పృశిస్తారు. వీటితోపాటు మూడో వాని అంతరంగాన్ని ఆవిష్కరించి శత్రువుతో ప్రయాణం చేసి చివరకు నువ్వే గెలుస్తావంటూ విభిన్న ఆలోచనలతో ఒక విజేతను ఆవిష్కరించి అకుంటిత దీక్షతో హిందీ నుండి జన్మ భూమిని దర్శించి తమిళం నుండి అమ్మవాసన కమ్మ దనాన్ని తెలుగు వారికి పంచిన ప్రముఖ మాతృప్రేమికుడు ఆచార్య మాడభూషి. వివిధ దేశాలు తిరిగి తెలుగు గౌరవాన్ని దిశదిశలు చాటి అచ్చమైన తెలుగువాణిని వినిపించిన వీరు తమ విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచేటట్టు 24 గంటల నిరవధిక కవి సమ్మేళనం నిర్వహించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో సరికొత్త రికార్డ్ నేలకొల్పిన ఉత్తమ ఆచార్యుడ మాడ భూషి. ఇంత ప్రత్యేకత కల ఆచార్య మాడభూషి వచన కవిత్వంలో వస్తువైవిధ్యాన్ని వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

వచన కవిత్వంలో-తనదైన శైలి :

ఆచార్య మాడభూషి వారు వచన కవిత్వాన్ని గమనిస్తే వస్తునిర్వీశంలోను, వ్యక్తీకరణలోను, వస్తువైవిధ్యంలోను కొన్ని ప్రత్యేకతలు కనిపిస్తాయి. కవి సహజంగా తన ప్రతిభా సంపత్తితో వ్యక్తీకరణ చేసి పాఠకుల్ని, పాత్రికేయుల్ని, శ్రోతల్ని, సామాజకుల్ని రంజంప చేస్తారు. నూతన ఆలో చనలు రేక్కిత్తించి సామాజిక స్పృహను కలిగిస్తారు. ఇవి

కవి యొక్క సహజ లక్షణాలని భావిస్తే మాడభూషివారు కవిత్వంలో శైలి భాష ముఖప్రజ్ఞకు నిలువెత్తు సాక్ష్యలుగా నిలుస్తాయి. వారు రాసిన కవితల్లో సరళంగా సహజంగా మనం మాట్లాడుకునేటట్టు కవితను కూడా సహజ సౌందర్యాలు ఆవిష్కరిస్తు

ఒక తల్లి
పదిమంది పిల్లల్ని
కనిపెంచి పోషిస్తుంది
పదిమంది
పిల్లలు

ఒక తల్లిని పోషించలేక పోతున్నారు.. అంటూ నాటి స్థితిని నేటి దుస్థితిని సహజంగా వివరిస్తు రానురాను మనుషులు బలహీనపడిపోతున్నారు అందుకే తల్లి ఇప్పుడు ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటుంది అంటారు. మాడభూషి పలికిన పలుకులు సహజంగా మనిద్దరం మాట్లాడుకున్నట్టే ఉంది. కాని రెండు సంస్కృతుల, రెండు తరాల, రెండు యుగాల రెండు కుటుంబ వ్యవస్థల అంతరంగం అందులో ఉంది. ఒకప్పుడు మన కుటుంబ వ్యవస్థ ఎలా ఉండేది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. అందులో పిల్లలను కనడం, పెంచడం అన్నీ బాధ్యతలు అందరికీ సమానంగానే ఉండేవి. ఇపుడు ఎవరి బాధ్యతలు వారివి ఎవరి సంపాదన వారిది. ఎవరి ఇష్టాలు వారిది. పెద్దరికం, గౌరవ మర్యాదలు ఎక్కడ కనపడవు. సమిష్టి కుటుంబాలు స్నేహాలు లేవు. దాంతో స్వార్థ ఖరీత వ్యవస్థ. కుటుంబాలు అన్ని చిన్నవైపోయాయి. ఉమ్మడి కుటుంబాలు చితికిపోయాయ్ అందుకే మాడభూషి గతకాలాన్నీ నేటికాలన్నీ ఉదాహరణగా చూపిస్తు తల్లిని పెంచడం ఇప్పుడు కొడుకులికి భార మనిపిస్తుంది. అందుకే వృద్ధాశ్రమాలు సంఖ్య పెరుగు తోంది కన్నతల్లి తండ్రిల్ని వృద్ధాశ్రమాల్లో చేర్పించి ఎవరి ఉద్యోగం వాళ్లు చేసుకుంటున్నారు. రేపు వీళ్ల పరిస్థితి అంతే అని ఆలోచనలు లేవు ఈతరానికి. ఇది ఒక సజీవ సాక్ష్యం. అలాగే అప్పుడప్పుడు ఎదురయ్యే కొన్ని సంఘ టనలు చూసి మనం నవ్వుకుంటాం. బాధ పడతాం అటువంటి చిన్నవిషయాన్ని ఒక సందర్భాన్ని కవిత్వీకరిస్తు సహజంగా అరటితొక్క కోసం రాస్తు

ఎవడో వేసిన తొక్కమీద
ఎవడో కాలువేసి
నడ్డి విరగొట్టు కుంటాడు
తొక్కవేసిన వాడు ఎవరికీ కనిపించడు

కాలువేసిన వాడు అందరి సానుభూతి పొందుతాడు... అంటారు. ఇది చిన్న సందర్భం. కాని దీని వెనుక అంత ర్యాన్ని ఎవడో త్రొక్క వేయడం. ఎవడో కాలుజారి పడటం. నడుం విరిగిన వాలు సానుభూతి పొందడం. మధ్యలో అరటి తొక్క తొక్కగా యిగిలిపోవడం ఇటువంటివి అనేకం కనిపిస్తాయ్. శ్రీశ్రీ అన్నట్టు కాదేది కవితకు అనర్హం అన్నట్టు మాడభూషికి కవితా వస్తువు ఏదైనా సరే ఇట్టే ఆకర్షిస్తుంది.

మనిషిని ఆవిష్కరిస్తు అర్థాతంగా చిత్రిస్తు మాడ భూషివారు

యుద్ధాన్ని గురించి భయంలేదు
మరణాన్ని గురించి భయంలేదు
క్రూర మృగాల గురించి
విషనాగుల గురించి
ఉప్పొంగే నదుల గురించి భయంలేదు
నాభయమంతా మనుషుల గురించే
మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే... అంటారు.

ఇక్కడ ప్రజా జీవన యానం మానవుడు ఒక వింత జీవి. అంటే సాధు జీవిగా కాకుండా సంఘజీవిగానే ఉంటున్నాడు. పైకి చూస్తే అందరూ మనుషులే మనసులే వేరుగా మారిపోతాయ్. వేమన అన్నట్టు పురుషుల్లో పుణ్యపురుషులు వేరగద. అలాగే మాడభూషిగారు భయమంతా మనచుట్టూ ఉన్న ప్రకృతి, పర్యావరణాన్ని కాదు, మనలో ఉంటు, మనతో మాట్లాడుతు, సూర్యుడు ఉదయించేటప్పటికి మనకు ప్రత్యక్షమేతిగన్న మనిషి కోసమే భయం. ఎవరి మనసులో ఏముంది. ఎవరిని

నమ్మాలో ఏవరిని నమ్మకూడదో, స్నేహితులెవరో ద్రోహులెవరో, నమ్మించేదెవరో, నమ్మకద్రోహం చేసేదెవరో, అవసరానికి ఉపయోగపడేవారెవరో, అవసరాన్ని ఉపయోగించుకునే వారెవరో. ఎవరు వెర్రి ఉపయోగించుకుంటున్నారో, ఎవరు ఎవరికి ఉపయోగపడుతున్నారో తెలియని పరిస్థితి. అలా నటించేవాడు మనిషి అంటూ మనుషుల స్వార్థాన్ని సరళమైన భాషలో వ్యక్తీకరించారు మాడభూషి. ఇలా వ్యక్తీకరణలో ఏవో వర్ణనలు, సద్గల ఆడంబరాలు, వర్ణనా వైవిధ్యాల కోరు అర్థమైన శైలిలో కనువిప్పు కలిగించడమే కవిత్వమనే వాదనకు మాడభూషి వారి కవిత్వమే నిదర్శనం. శైలిలోని కాదు వస్తువైవిధ్యంలో కూడ వారికి ఒక ప్రత్యేక ఉంది.

వచన కవిత్వం-వస్తువైవిధ్యం :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు ప్రతిభా సంపత్తి కలిగిన ఆదర్శవాద కవి. ఆడంబరాలకు అతీతంగా మితంగా మాట్లాడు అమితంగా కవిత్వాన్ని వ్యక్తీకరించడం ఆయన రచనలను పరిశీలిస్తే అర్థమౌతుంది. అందుకు ఉదాహరణగా వీరు రాసిన వాటిలో ఆలోచనలు, మూడోమనిషి, చివరకు నువ్వే గెలుస్తావు, శత్రువుతో ప్రయాణం ఉదాహరణగా చెప్పవచ్చు. ఆ కవితా సంపుటిల్లో వస్తువైవిధ్యాన్ని పరిశీలిస్తే వారు చిత్రించిన అంశాలను వర్ణించిన వర్ణనలు వ్యక్తీకరించిన భావాలు ఒక కీర్తి పరిధిని ఏర్పరచినట్లు తెలుస్తుంది. కొన్నిచోట్ల భిన్నత్వం మరికొన్ని చోట్ల ఆదర్శవాదం మరికొన్ని చోట్ల సహజత్వం ఇలా ఆయా సందర్భాల్లో రాసిన కవితల్లో వస్తు విశ్లేషణ పరిశీలిద్దాం. ముఖ్యంగా రైతు పరిస్థితిని, ప్రకృతి వాతావరణాన్ని ప్రకృతి సంపదను గూర్చి ఆలోచిస్తే మాడభూషివారు వ్యక్తీకరించి విషయాల్లో చాలా ఆవేదన కలుగుతుంది. దీనికి ఒక పరిష్కారం ఏమిటీ అనీ ఆలోచనా కలుగుతుంది. రైతు శారీరక శ్రమను గుర్తు చేస్తు శ్రమకీ వస్తువుగా స్వీకరిస్తు నవ్వు అనే కవితలో

నేను బురదలో
కాలుపెట్టకపోతే
నువ్వు బువ్వలో
చెయ్యి పెట్టలేవు...

అంటూ నీవు నవ నాగరికుడుగా ఎదుగుతున్నావ్. రైతులు కష్టాలు నీకు తెలియవ్. పాస్ట్‌ఫుడ్ అంటూ తిరుగుతున్నావ్. అసలు నీ నోటిలోకి వెళ్లు వెళ్లాలంటే ముద్ద నోటికి చేరాలంటే ఎవరురా! ఆలోచించు. నీవంత నాగరికుడవు అయినా అక్షరాలు రాని రైతు ఎండనక వాననక శారీరక కష్టంతో బూరదలో మోకాలు లోయ మట్టిలో అడుగుపెట్టి నీకు ప్లేటులో అన్నం అందెస్తు అన్న అవుతున్నాడు. ముద్ద అద్దిస్తు తినడానికి ముద్దలేక రైతు ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. నాన్న ఆలోచించు రైతు కష్టాన్ని అంటారు మాడభూషి. అంతే కవితలు చివరిగా

నీవు బూమ్‌ని నమ్ముకున్నావ్
నీవు భూమిని నమ్ముకున్నాను

అంటూ ఆ కవిత ముగిస్తాడు. ఇది చిన్నకవితే కాని రైతు కష్టాలు కళ్ల ఎదుట కన్నీటి పాగా వినిపించారు మాడభూషి.

ప్రపంచానికి అన్నం పెడుతున్న రైతన్న గోడో వినిపిస్తు 'రైతుకూలి' అనే కవితలో

అన్నం పెట్టిన చెయ్యి
అప్పుకోసం పడిగాపులు కాస్తోంది
వేలకోట్లు ఎగొట్టిన వాడి ముందు
మొకరిల్లుతున్న బ్యాంకులు

వేల రూపాయలు కోసం రైతును మోకాళ్లపై నిల బెడుతున్నాయ్.. అంటారు మాడభూషి. ఈ కవితను పరిశీలిస్తే నేటి రైతు దుస్థితి. ప్రభుత్వాల దమన నీతి ఏమిటో అర్థం అవుతుంది. ప్రభుత్వాలు బ్యాంకులు రైతుల పాటే శాపాలుగా మారుతున్నాయి. పంట చీడలను పొగొట్టడానికి క్రిమి సంహారక మందులకు, బ్యాంకుల దగ్గర కాళ్లు అరిగేలా తిరుగుతున్నా అప్పు లభించడం లేదు. ఇచ్చినా సరైన సమయంలో ఇవ్వక పోవడం దీని

ఫలితం పురుగు మందే రైతులకు పెరుగు అన్నం అవుతుంది. చేను పక్కన నిలబడ్డ చెట్టే ఉరి. కంచ మేతుంది. అందుకే వ్యంగ్యంగా రాస్తూ ''అప్పులు ఎగగొట్టిన చేపల రాజును సముద్రంలో వదిలేసి, అప్పులు తీర్చడానికి అవస్థలు పడుతున్న చేపపిల్లను గట్టున పడుస్తున్నాయ్! అంటారు. తన భోయిలు తానే కనిపోయిన ఎందరో రైతుల ఆవేదన ఆత్మహత్యలు ఈ కవితల్లో దర్శనయిస్తాయి.

మట్టి పిసిగే రైతు దుస్థితిని కవితా వస్తువుగా చేస్తు వాటిని నమ్ముకున్న రైతును మట్టితల్లే మోసం చేసిందంటూ రైతు కవితలో

మట్టిని పిసుక్కుంటు
ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటు
ఆవేదన చెందుతున్నాడు
అప్పిచ్చినవాడు అరుగుమీదకూర్చున్నాడు
పాలం ఎండిపోయి వెక్కిరిస్తుంది...

అంటూ కంటతడితో కవితను ఆవిష్కరిస్తారు. ఈ కవితలో చేసిన అప్పుల తీరక అన్నీ అమ్ముకున్న రైతుల కన్నీటిగాథకు హృదాయ విదారకంగా కనిపిస్తుంది. చివరకు కూర్చున్న వీధి అరుగు కూడ అప్పిచ్చినవాడు పాలై ఆత్మహత్యకు దారితీసిందంటారు. అప్పు తీసుకున్న రోజే ఆస్థితో పాటు అరుగు కూడా వాడికి దాఖలై పోయింది. ఇప్పుడు రైతుకి తలదాచుకోడానికి కూడ స్థలం లేదు. తాకట్టు పెట్టడానికి తలకూడా లేదంటు ఆవిష్కరించిన ఈ కవితలో ఎంత దు:ఖం ఉంది. ఎంత ఆవేదన వుందో తెలుస్తుంది. ఇలా కలచి వేచే దుష్టాంతాలు ఎన్నో వస్తువగా స్వీకరించారు మాడభూషి. కొనేవాడికి అమ్మే వాడు లోకువ అన్నట్టు దళారిచేతిలో మోసపోయినరైతు పస్తులతో చావలా ఆత్మహత్య చేసుకోవాలా అనే ప్రశ్నలతో నతమతమయ్యే దుస్థితిని వస్తువుగా చేసుకున్న మాడభూషి కవిత్వం సహజత్వంతో పాటు సామాజిక అంశాలను సమాజానికి అందించిన తీరు అనన్య సామాన్యం.

ప్రకృతి పర్యావరణం-మాడభూషి అంతరంగం:

ప్రజలు సుఖంగా జీవించాలంటే కాలుష్య రహిత సమాజం అవసరం. దీని కోసం పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పాఠ్యాంశాలుగా బోదిస్తు ప్రజల్లో అవగాహన కల్గిస్తున్నారు. అందులో భాగంగా పర్యావరణ వేత్తలు ఎన్ని సూచనలు చేసినా ఖాతరు చేయడం లేదు. ముక్కలను పెంచండి, పరిశుభ్రత పాటించండని ఇవి తలకెక్కడం లేదా ఈ తరానికి, పల్లెలు కూడా పట్టణాలుగా మారి పోతున్నాయ్. మనిషి జీవితం యాంత్రికమైంది. మనిషే అమంతమైపోయాడు. ఈ దుస్థితికి కారణాలు పర్యావరణం ప్రాణవాయువును నాశనం చేస్తుంది. అందుకే మాడభూషి వారి కవిత్వంలో చెట్టు అమ్మలాంటిదంటూ చేయెత్తి మొక్కుతూ

అమ్మ ఒక చెట్టు
పూలు పూస్తుంది
కాయలు కాస్తుంది
పళ్లు పంచుతుంది
అమ్మ చిగురించిన చెట్టు...

అంటారు. అమ్మలేకపోతే నీడ కరువవుతున్నట్లు చెట్టు లేకపోతే పచ్చని నీడ కరువు అవుతుంది. నిజంగా చిగు రించే చెట్టు అమ్మే అంటూ, చెట్లను నరకకండి, మొక్కల్ని పెంచండి. ప్రాణవాయువును ప్రకృతిలో నింపండి. పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ

నేను పచ్చని చెట్టుగా ఎదిగాను
నీవు వెచ్చని కూర్చీలో కూర్చున్నావ్...

అంటూ చెట్ల ఉపయోగాలతోపాటు అవి బ్రతికినా చనిపోయినా ప్రపంచానికి నిత్యవసర వస్తువుల్లా మనకళ్ల ముందు కనిపిస్తూనే ఉంటాయ్. ప్రతిక్షణం గుర్తకు తెస్తూనే ఉంటాయ్. అందుకే 'ఆకు' అనే కవితలో

చెట్టు ఒక కన్నీటి
బొట్టును కార్చింది
కవిత్వం కోసం కాయితంగా మారడానికి...

ఇది ఎంత అద్భుతమైన కవిత్వం. ఇప్పుడు కాయిత యొక్క రూపాంతరాన్ని, తయారినీ, పుట్టు పూర్వోత్తరాలను తెలుసుకోం. కాయితం అంటే ఒక తెల్లని ముక్క అని తీసి పారేస్తాం. ఎన్ని చెట్లు నరికితే ఎన్ని కాగితాలు తయారు అవుతున్నాయి. ఉదయాన్నే లేని మన చేతిల్లో ఒక న్యూస్ పేపర్ కోసం ఎన్ని చెట్లు తలలు నరకబడ్డాయ్. ఆలోచించాయో అనే ప్రశ్న వేసి మాడభూషి చెట్ల ప్రయోజనాన్ని గుర్తు చేసి పర్యావరణ కాలుష్యం ఎందుకు తయారవుతుందో అర్థం చేసుకోమంటారు.

ఒక చెట్టు ప్రాణత్యాగం చేసి
నిలువెత్తు జెండాగా ఎదిగింది
ఒక గొడ్డ శరీరాన్ని ముక్కలు చేసుకుని
బోయి తన గుండెల్లో గునపం
నింపుకుని జెండాను నిలబెట్టింది... అంటారు.

చెట్టు గొప్పతనాన్ని అవి అందించే ప్రాణవాయువని తెలియ చేయడమేకాదు. వీటి ప్రయోజనం ఒక అధ్యయనంగా స్వీకరించి కవితా వస్తువుగా మలచిన మాడభూషి పర్యావరణ ప్రేమకునిగా కనిపిస్తారు. అందుకే ఆయన 'ప్రకృతి' కవితలో

ప్రకృతిని ఎదిరించి బెదిరించి
గొప్పట్లో పెట్టుకున్న మానవుగా
ప్రకృతి జూలు దూలిపిందంటే
నీటెక్నాలజి నీ టెక్నిక్కులు
టైటాన్‌లా కుప్పకూలవలసిందే...

అంటూ ప్రకృతిని పరిరక్షించండి. పర్యావరణాన్నే పెంపొందించండి అంటూ భయంకరమైన కాలుష్యాలను గూర్చి జాగ్రత్తపడడంటూ ఇచ్చిన సందేశం ఈ కవితల్లో కనిపిస్తుంది. అందుకే ఇంటింటికి మొక్క నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షిందాం అనే నినాదానికి మాడభూషి ఆదర్శ ప్రాయుడయ్యారు.

మాడభూషి ఆలోచనలు-సరికొత్త సుభాషితాలు :

వీరు ఆలోచనలు విచిత్రంగా ఉంటాయి. కవితలు కూడా పొట్టి కవులగానే ఉంటాయ్. అల్పాక్షరాల్లో అంతరంగాన్ని, అనల్పార్థాలతో వ్యక్తికరించడం ఆయన కవితా శైలికి నిదర్శనం. అందులో ఆలోచనలు ఒక ఉదాహరణ. ఇందులో చలాకిగా ఉన్న సహజ ప్రేమను చెబుతూ ఆలోచనల్లో

పూసిన పూలన్నీ
గుడికి చేరవు
పెళ్లికాని ప్రేమికులు.... అంటారు.

ఇది చమత్కారంలో ఉన్నా. నిజం ఉంది.

నరికేసిన కొమ్మ
కొడవలై మొలుస్తుంది
దళిత చైతన్యం... అంటారు.

ఇది దళిత చైతన్యానికి, దళిత ఉద్యమానికి, అణచితకు, సాధికారితకు ఇచ్చిన ఒక నిర్వచనం. అలాగే రాజకీయ విధానాన్ని, రాజకీయ నాయకుల విన్యాసాలు, మోసపోయే ప్రజల పర్సలను వివరిస్తు

ఎన్ని సార్లు కాటేసినా
పాము ఆరాధ్య దైవమే
ఓట్లెయ్యడానికి బారులు తీరిన జనం...అంటారు.

ఇవి వ్యంగ్యమైన, అసలు సిసలైన నిజం. ఇదొక మాడభూషి సుభాషితాల్లో ఒకటి. అలాగే స్త్రీ హక్కుల కోసం రాస్తు, ఉద్యమాల తీరును వర్ణిస్తూ

శూన్యంలో సగం
సంపదలో సగం
స్త్రీలకు సమాన హక్కులు... అంటారు.

ఇన్నాళ్లకు పార్లమెంట్‌లో స్త్రీల సమాన హక్కు బిల్లు చెత్త బుట్టలో చిత్తు కాగితంలా ఉంది. అలాగే నాయకులు, వస్తున్న పార్టీలు కోసం చెబుతూ

చివరకు చెట్ల కన్నా
జెండా కొమ్మలే ఎక్కువ అవుతాయి
నాయకుడికో పార్టీ.... అంటారు మాడభూషి.

ముగింపు :

ఈ విధంగా మాడభూషి సంపత్‌కుమార్ వచన కవిత్వంలో కనిపించే ఆధునిక శైలి, వస్తు వివరణ, వ్యక్తీకరణ, వర్ణనా నైపుణ్యం, కవితాశైలి. కనిపించే సరికొత్త ఆలోచనలు, పర్యావరణం పచ్చదనం, మాతృహృదయం, వస్తు వైవిధ్యం గమనిస్తే వీరు రాసిన కవితల్లో సహజమైన శైలి విలక్షమైన భావన కనిపిస్తుంది. చివరిగా మాడభూషి సుభాషితాలుగా చెప్పుకోదగిన ఆలోచనలు ఒక కొత్త వరవడిని సృష్టించి ఆధునిక కవిత్వంలో నూత్న ధోరణులలో ప్రవేశపెట్టిన మాడభూషి నేటి కవులకు దిక్సూచిగా నిలిచారని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. ఆలోచనలు - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
2. మూడో మనిషి - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
3. చివరకు నువ్వే గెలుస్తావు - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
4. శత్రువుతో ప్రయాణం - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

సంపత్‌కుమార్ ఉన్నతుడు
సంపద అందరికి ఉండొచ్చు
పదిమందికి పంచేటోడే నిజమైన ధనవంతుడు
తుంపరి జల్లులా చల్లగా మనిషిని తాకి
కుశల ప్రశ్నలు మెత్తగా అడిగి
మానవత్వపు దారుల్లో పయనించువాడు
రుజుమార్గపు మిత్రుడు
అక్షర కోసం తపించే
తెలుగు రక్షణకోసం వేదనపడే
మహోన్నతుడు
ఇది అతిశయోక్తికాదు
తమిళ నాట
తెలుగు మాట
సముద్రపు అలల సోయగాలబాట

- యడవల్లి శైలజ

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తమిళ జానపద కళారూపాలు - జీవన వైవిధ్యాలు

- డాక్టర్ యస్. దివిజాదేవి, తెలుగు అధ్యాపకులు, డి.కె.ప్రభుత్వ మహిళ కళాశాల (స్వ.(ప), నెల్లూరు.

ఏ జాతి సంస్కృతినైనా ప్రతిబింబించేవి దాని జానపద కళారూపాలే. మానవుని అనుభూతులకు, మానసిక చైతన్యానికి అవి ప్రతిబింబాలు. శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలకు జానపద సాహిత్యమే మాతృక. జానపద విజ్ఞానం గతకాలానికి ప్రతిధ్వని మాత్రమే కాక వర్తమానంలోని బలమైన గొంతుక. జానపద కళా సాహిత్యం ద్వారా ఒక జాతి సంస్కృతి తెలుస్తుంది. ఒక జాతి నిర్మాణానికి అవసరమైన ఆకారాలు జానపద కళలు అందిస్తాయి. కాబట్టి ఆ సంస్కృతీ వారసత్వాన్ని కాపాడు కోవడం మన బాధ్యత. ఆ విషయంలో తమిళులు ఎప్పుడూ ముందే వుంటారు.

ఒక ప్రాంత ఆచార వ్యవహారాలు ఆ ప్రాంత సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. వాటిని గురించి తెలుసు కోవాలి అంటే మనం ఆయా ప్రాంతాల సాహిత్యాన్ని చదవాలి, అధ్యయనం చెయ్యాలి. మనకు ఆ భాష రానప్పుడు అనువాదాలపైన ఆధారపడతాం. కానీ, ఆచార్య మాడభూషి సంపత్కుమారాచార్యగారు మద్రాసు విశ్వవిద్యాలయంలోనే పని చేస్తుండడం వల్ల తమిళ ప్రజల జీవన విధానాలతో మమేకమై, వారి సంస్కృతీ కళలను దగ్గరగా గమనించి, ఆకళింపు చేసుకొని, ఔపోసన పట్టి, వెలయించిన పొత్తం "తమిళ జానపద కళలు". ఇది తమిళ సంస్కృతికి ప్రతిబింబం. తమిళుల గురించి తెలుసుకోవాలనుకునే, తమిళేతరులకు దర్పణమీ పుస్తకం.

తమిళ సాహిత్యం సుసంపన్నమవడంలో వారి జానపద కళలు ఇతోదికంగా తోడ్పడ్డాయి. సామాజిక మార్పులు ఎన్నివచ్చినా, వారు తమ జానపద కళల్నీ ఆదరిస్తూనే ఉన్నారు. క్రీ.పూ.3వ శతాబ్దానికి చెందిన "తోలక్కాపియం" లో జానపద నాటక ప్రస్తావన ఉంది. అలాగే ఇలంగో అడిగల్ క్రీ.శ.1వ శతాబ్దంలో రాసిన 'శిలప్పదికారం'లో జానపద నాటకాల్ని సూచించే అంతరక్కూత్తు, పాదు వియల్‌క్కూత్తు, దేశిక్కూత్తు వంటివి ఉన్నాయి. దీనిని బట్టి క్రీ.పూ. 3వ శతాబ్దికి పూర్వమే తమిళ సాహిత్యంలో నాటకాలపై పరిశోధన జరిగిందని చెప్పవచ్చు. "తమిళ జానపద కళలు"లో రచయిత ఇరవై ఒక్క కళారూపాలను గూర్చి వివరించారు. వాటిని విషయ సౌలభ్యం కోసం 1.వృత్తి జానపద కళలు. 2.అనియతాశ్రయ జానపద కళలు. 3.ఆశిత జానపద కళలు అని మూడు రకాలుగా ఈ పరిశోధనా వ్యాసంలో విభజించాను.

అ) వృత్తి జానపద కళలు :

వ్యవసాయము, దాని అనుబంధరంగాల పనివారు ప్రదర్శించే కళలు.

1. ఏట్రప్పాట్టు (ఏతం పాటలు) :

ఏతం వేసి నీళ్ళు తోడేటప్పుడు ఆ శ్రమ మరచిపోవడా నికి, పాడుకుంటారు.

"మనోవేదన తీర్చు స్వామి వినాయకుడా
శక్తినివ్వగ రారా గురు వినాయకుడా
పాడేశక్తి నివ్వు..."

అంటూ ఆ భగవంతున్ని ప్రార్థిస్తారు. ఎద్దుల సహాయంతో చేసే 'కపిల' సమయంలో కూడా ఎంత నీరు తోడిందీ లెక్కకట్టే పాటల్ని పాడుతారు.

2. ఏర్‌ప్పాట్టు : (వ్యవసాయ పాటలు) :

పొలాన్ని దున్నేటప్పుడు పాడే పాటలు ఇవి. వ్యవ సాయ కూలీలు ఆదాయం, జీవనం, ఇల్లు, బంధాలు మొదలైన వన్నిటినీ కలుపుకొని ఈ పాటలు ఉంటాయి. పాడేటప్పుడు వాళ్ళు సంగీతంలాంటి శబ్దాల్నిచ్చే మాటల్ని కలుపు కుంటారు. ఉదా :

"దూరం పో సాలు చూసుకో
ఏ... ఏ... ఏ...
సాలుచూసి గట్టుకట్టు... రాయుడా
తల్లి మాటలు వినరా
ఓ... ఓ... ఓ...

ఈ పాటల ద్వారా చోళ, చేర, పాండ్య దేశాల్లో వ్యవసాయం పరిపుష్టంగా సాగినట్లు తెలుస్తోంది.

"వాన వచ్చింది మామా
మట్టి తడిసింది మామా
ఎద్దును బయటికి తీసుకురా
నాగలిని సిద్ధం చెయ్యి.."

అంటూ వాన పడటంతోనే వ్యవసాయ పనులకు సమాయాత్తమవుతు వారు పాడుకునే పాటలు, వారిలో ఉత్సాహాన్ని నింపుతాయి.

3. నడువు ప్పాట్టు (నాట్లు పాట) :

నాట్లు వేసేటప్పుడు పంటబాగా పండాలని కోరుకుంటూ, దేవుణ్ణి ప్రార్థిస్తూ, వరసయినవాళ్ళను ఎగతాళి చేస్తూ, ఉత్పత్తి చేసే ధాన్యాల గురించి పాడతారు.

4. బండి కారన్ పాట్ (బండోడి పాట) :

వ్యవసాయ ఉత్పత్తి వస్తువులను సంతకు తీసుకొని వచ్చి అమ్మడానికి ఎద్దులబండి పనికొస్తుంది. ఈ బండ్లను తోలుకుంటూ బండోడి పాటలను మగవాళ్ళు మాత్రమే పాడుతారు. ఈ పాటల్లో చాలా వరకు ప్రేమ, శ్రమ, కుటుంబం, జీవితం, ప్రకృతి, బంధం మొదలైనవి వస్తువులుగా ఉంటాయి. సమాజ అవసరాలు, నాగరికత, చారిత్రకాంశాలు, ఆచార వ్యవహారాలు, జీవితానుభవాలు, లాంటి అనేక అంశాలు బండోడి పాటల్లో కనిపిస్తాయి. బండిశబ్దమే ఆ పాటలకు తాళం.

ఆ) అనియతాశ్రయ జానపద కళలు :

ఏ కులం వారినీ ఆశ్రయించకుండా, ఊరందరి వినోదం కోసం ప్రదర్శించేవి.

1. కాళివేషం :

కాళికాదేవి వేషం వేసుకొని ఆడే ఆట. దీనిని పురుషులు ధరిస్తారు. వీరు కఠినమైన వ్రతం చేపట్టి ఈ వేషం వేసుకుంటారు. ఇది భారత కథా ప్రదర్శనకు సంబంధించింది. ఈ దేషం వేసే హక్కు కొన్ని కుటుంబా లకు మాత్రమే ఉంటుంది.

2. కాళైమాట్టు వడనం: (ఎద్దుల ఆట) :

కళాకారులు ఎద్దు గూడును కప్పుకొని ఎద్దులాగా ఆడతారు. మొదట ఒక స్త్రీ ఎద్దుతో సంతోషంగా కలిసి ఆడుతుంది. అందువల్ల ఆ ఎద్దు ఆమెతో ప్రేమగా ఉంటుంది. దాన్ని ప్రేమ ఎద్దు అంటారు. ఆ తరువాత దాన్ని అణచడానికి ఒక వీరుడు వస్తాడు. వాన్ని ఎద్దు కుమ్మడంతో మరో వీరుడు వచ్చి ఆ ఎద్దు మూపురం మీద చెయ్యి వేసి పోరాడి గెలిచినట్టు, గెలిచిన వీరుడికి ఆ ఎద్దును పెంచిన అమ్మాయినిచ్చి పెళ్ళి చేసినట్టు దృశ్యాలను ప్రదర్శిస్తారు. జల్లికట్టు దృశ్యం కూడా ఇందులో ప్రదర్శిస్తారు.

3. కావడి పాట్టు :

మురుగన్‌కు భక్తులు కావడి మొక్కులు చెల్లిస్తారు. తమ కోరిక నెరవేరాక భక్తులు కావళ్ళు భుజాలకెత్తుకొని పాటకు, తాళానికి అనుగుణంగా కావడిని రకరకాలుగా తిప్పుతూ ప్రేక్షకులకు ఆనందం కలిగిస్తారు.

4. పొయ్‌క్కాల్ కుదిరైయాట్టం (కొయ్యగుర్రం ఆట) :

రెండు కాళ్ళకు కట్టెలనుకట్టుకొని, గుర్రపు గూడును భుజం మీద మోస్తూ ఆడే ఆట. గుర్రపు స్వారీని కళ్ళకు కట్టినట్టు చూపించడమే ఈ ఆటలోని గొప్పదనం. 'అశ్వగతి'కి తగినట్టుగా ఆడతారు.

5. పొట్టవెళపాడల్‌గల్ :

ఇస్లాములోని ఫకీర్‌షాలు తాహీరా అనే తోలు సంగీత సాధనాన్ని వాయిస్తూ కొన్ని కథాగేయాలను, కళారూపాలను ప్రదర్శించి చూపుతారు.

6. బూం బూం మట్టుకారర్ - (గంగిరెద్దుల వాళ్ళు) :

వీరి మాతృభాష తెలుగే కానీ, వీరికి తమిళం కూడా బాగా తెలుసు, వీరు తమ ఎద్దును అలంకరించు కొని, తమ భుజానికి తగిలించుకున్న ఉరుము మేళాన్ని చిన్న పుల్లతోరాసి శబ్దం చేస్తారు. ఆ శబ్దం బూం బూం బ్రూం బ్రూం అని వస్తుంది. వీరిది సంచారజాతి.

7. మన్మదన్ నాట్యనాడకం :

ఇది వివిధ రూపాల కలయిక పురాణ కథను ఇద్దరు ఎదురెదురుగా నిలబడి పాటీగా ఆడుతూ, పాడుతూ చేసే నృత్యం. ఇది కాముని పున్నమి రోజు ప్రదర్శిస్తారు.

8. మయిల్ నడనం - (నెమలి ఆట) :

నెమలిలా ఈకలను కట్టుకొని పురివిప్పి నాట్యం చేయడం. తరువాతి కాలంలో ఇది భరతనాట్య కళా కారులు కూడా ప్రదర్శిస్తున్నారు.

ఇ) ఆశ్రిత జానపద కళలు :

తమకు దాతలైన కులాలవారి కోసం మాత్రమే ప్రదర్శించేవి. అయితే ప్రదర్శించేవి. అయితే వీటిని ఇతరులు కూడా చూడవచ్చు.

1. జాతిపిళ్ళైలు :

జాతి చరిత్రలను గొప్పగా కీర్తిస్తూ కానుకలు తీసుకునే వాళ్ళను జాతిపిళ్ళైలు అంటారు. 'వణ్ణియర్లు' ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వారిని రక్షకులుగా భావించి, వాళ్ళ ఇళ్ళకు సంవత్సరానికి ఒకసారి వెళ్ళి ధాన్యం డబ్బు, బట్టలు తీసుకోవడం వీరికి అలవాటు. అగివణ్ణియర్లకు, తెలుగు నాయకర్ల అమ్మాయికి పుట్టినవాళ్ళే జాతిపిళ్ళై, అందుకే వీరి మాతృభాష తెలుగు, పితృభాష తమిళం.

2. ఫకీర్ షా పాడల్‌గళ్ :

ఇస్లాంలో ప్రత్యేక ఆచారాలు కలిగిన ఫకీర్‌షాలు ఇస్లాములు నివసించే ఇళ్ళముందు నిలబడి తాహీరా లను మోగిస్తు పాడతారు. వీరు పచ్చరంగు కలిగిన పెద్ద తలపాగా ధరించి ఉంటారు. మెడలో పగడాల మాలలతో మసీదులను ఆధారంగా చేసుకొని జీవిస్తారు.

ఇవే కాకుండా ఇందులో, బాలలకు సంబంధించిన 'ఆట'పాటలు, 'కణియాన్' అనే ఒక ప్రత్యేక సమూహం యొక్క విలక్షణ సంప్రదాయాన్ని, 'కువన్ జాతి యొక్క ధీన స్థితిని, తెలుగు మాతృభాషగా కలిగిన 'కుళువర్' అనే సంచారజాతి గురించి, వారి నియమ నిబంధనల గురించి, సామెత కథల గురించి, ఆ కథలోని మూర్ఖుల గురించి, ఈ పుస్తకం ద్వారా తెలుసుకుంటాం. దూర ప్రయాణాలు కాలి నడకన చేసేటప్పుడు అలసటను మర్చిపోవడం కోసం పాడే పాటల్ని తమిళంలో వళిన డైప్పాట్టు (నడక పాట) అంటారు. అలాగే రామేశ్వరం రైలు ప్రమాద సంఘటను పాటగా మలుచుకున్న తీరు హృదయలిదారకంగా ఉంటుంది. దీనిని విపత్తు పాడల్ గళ్ (ప్రమాదం పాటలు) అంటారు.

ఇలా ఎన్నో విషయాలను "తమిళ జానపద కళలు" ద్వారా తమిళుల జీవన వైవిధ్యాన్ని, వారి సంస్కృతీ వైశిష్ట్యాన్ని తెలుసుకుంటాం. రచయిత కూడా వారి జీవన స్రవంతిలో భాగమవడం వల్ల ఈ కళల వెనకవున్న కథలూ, వాటి చుట్టూ అల్లుకున్న కులాలు, జాతి ప్రాంత విశ్వాస భేదాల వల్ల వచ్చిన వైవిధ్యాలూ. ఇంత భిన్నత్వం ఉన్ననూ ఈ కళలన్నీ తమిళ ప్రాంతంలో ఎలా ఆదరణ పొందుతూ అలరిస్తున్నాయో, వారి జీవన విధానంలో ఎలా అంతర్భాగమయ్యాయో, పోషకులు లేక కాల ప్రవాహంలో ఎలా కనుమరుగువుతున్నాయో ఈ పుస్తకంలో వివరించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. తమిళ జానపద కథలు-ఆచార్య మాడభూషి సంపత్కుమారాచార్యులు.
2. తెలుగువారి జానపద కళారూపాలు-మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.

❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవితానికి కవిత్వానికి గల అవినాభావ సంబంధం

- డాక్టర్ ఎం. మురళి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై.

మాడభూషి సంపత్‌కుమార్ గారు తన "జీవితం - కవిత్వం"లో జీవితమంటే ఏమిటి, మనిషి నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలేంటి మొదలగు విషయాలను గురించి వివరంగా చెప్పారు. ఇలా జీవితానికి సంబంధించి ఇంత వరకు ప్రపంచ సాహిత్య చరిత్రలో ఎవరూ చెప్ప లేదు. ఈ ఘనత ఈయనకే దక్కుతుంది. జీవితం అడవి గాచిన వెన్నెలలాంటిది అంటాడు. జీవితం గురించి పూర్తిగా తెలియని వాడికి కవిత్వం అంతుపట్టదు. జీవితం గురించి తెలిసినా కవిత్వం మీద మంచి పట్టుండాలి అంటాడు. అసలు కవిత్వం అంటే ఏమిటి అన్నవారికి సమాధానంగా "జీవితం-కవిత్వం" అనే చెప్పుకోవాలి.

ఈ కవితా సంపుటిలో మొత్తం 108 కవితలున్నాయి. ఈ 108 కవిత్వాల్లోనూ జీవితం కవిత్వం అనే ముక్త పదాలతోనే కవిత్వం ప్రారంభమవుతుంది. ఆ ముక్త పదాలతోనే కవిత్వం సమాప్తమౌతుంది.

"జీవితం-కవిత్వం" అనే రెండు విషయాలను ఒకే ఒరలో తీసుకొని వెళ్ళడం అనేది కత్తిమీద సాములాంటిది. అలా రెండు విషయాలను ఒక చోట ఇమడ్చగలిగాడంటే ఆ ఘనత మాడభూషిగారిదే అని చెప్పవచ్చు. ఈయన కవితా నియమ నిబంధనలను మార్చి సరళమైన భాషతో, అలతి అలతి పదాలతో సమాజంలోని ప్రజలందరికి అర్థమయ్యేలా తన కవిత్వాన్ని తీర్చి దిద్దారు. ఈనాటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కవితా వస్తువుగా స్వీకరించి కవిగా, కళాకారుడిగా సామాజిక దృక్పథాన్ని ఏ విధంగా ఆకళింపు చేసుకొన్నాడో, కవితా రూపంలో ఏ విధంగా చెప్పాడో గ్రహింపవచ్చు.

తన సొంత తెలివి తేటలతో వాస్తవాన్ని కవితా రూపంలో అక్షర సత్యం చేశారు మాడభూషి.

"జీవితాన్ని విడిచిపెట్టి
కవిత్వం ఎలా రాస్తవ్!
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా దాస్తావ్?"

అనే ప్రశ్నలోనే కవిత ప్రారంభమవుతుంది. జీవితానికి కవిత్వానికి గల అవినాభావ సంబంధం దీనిని బట్టి అర్థ మౌతుంది. కాబట్టి జీవితాన్ని పూర్తిగా అవగాహన చేసుకోక పోతే కవిత్వాన్ని రాయలేవు.

"కవిత్వం రాయడానికి ముందు
జీవితాన్ని చదవాలి!
జీవితాన్ని చదవడానికి ముందు
కవిత్వంలో ఎదగాలి!"

కవిత్వం రాయాలంటే మానవ జీవితాన్ని పూర్తిగా చద వాలి, అలా చదివిన దానిని కవిత్వ రూపంలో రాయా లంటే కవిత్వంలో మంచి పట్టుండాలి అంటే రెండు విషయాల మీద మంచి అవగాహన ఉండాలి.

"సముద్రాన్ని గురించి
ఆలోచించు!
జీవితాన్ని అందులోదించు
కవిత్వాన్ని గురించి
ఆలోచించు!
సముద్రాన్ని అందులో ముంచు!"

ఇందులో జీవితమనేది ఒక మహాసాగరం. దీనిని మదిస్తే అమృతం వస్తుంది. ఈ అమృతమే కవిత ఇలా కవిత్వాన్ని గురించి ఆలోచించమంటాడు కవి.

"జీవితమంతా ముళ్ళు, కవిత్వమంతాకళ్ళు" జీవిత మనేది అనేక ఒడుదుడుకులతో కూడుకున్నది. ఇలాంటి జీవితం గురించి రాయాలంటే కచ్చితంగా ప్రత్యేక దృష్టి జీవితం మీద చూపాల్సిందే. జీవితమనే ముళ్ళపొదను, కళ్ళు అనే కవిత్వంతో రచింపమంటాడు కవి.

"కవిత్వాన్ని బతిమాలుకో
జీవితంలో మేలుకో
కవిత్వాన్ని నమ్ముకో
జీవితాన్ని ఏలుకో"

కవిత్వాన్ని బతిమాలుకొని జీవితం మేలుకోమంటాడు. కవిత్వాన్ని నమ్ముకొని జీవితాన్ని ఏలుకోమనడంలో ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధం తెలుస్తుంది. కవిత్వాన్ని నమ్ముకున్న కవి నిత్యం ప్రజల నాలుకలమీద నివసిస్తాడ నేది సత్యం.

"పాడు జీవితానికి
పాట దొరకదు!
పాట జీవికి
జీవితం దొరకదు
జీవితంలో పాడడానికి లేదు
పాడడానికి జీవితం లేదు!"

పాడైన జీవితానికి పాటదొరకలేదు, పాడే జీవికి, జీవితం లేదు. మొదటివాడు పాట తెలియక పాడలేదు. రెండవ వాడికి పాట తెలిసినా తనకు జీవితం లేదు. ఇవి రెండూ ఒక నాణ్యానికి రెండు వైపులా ఉన్న బొమ్మ లాంటిది. ఇలాగే

"దేహికి, ప్రాణికి
ఉన్న బంధాన్ని
కవికి - కవిత్వానికి
ఉన్న అనుబంధాన్ని
సంకలించడానికి పుస్తకం చాలదు".

దేహానికి, ప్రాణానికి ఉన్న బంధాన్ని, కవికి, కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని గురించి తెలుసుకోవడానికి ఎన్ని పుస్తకాలను వెతికి చూచినా సరిపోదు అంటాడు కవి. ఇంకా పోల్చి చెప్పడమనేది తాత్విక భావనకు సంబంధించి నది.

"ఆకాశపు కవిత్వం
భూమ్మీద జీవితాన్ని
కనిపెట్టదు"

ఆకాశమంత ఎత్తులోని కవిత్వం. భూమి మీద జీవించే జీవితాన్ని గురించి ఆలోచించదు అంటాడు కవి. అలాగే జీవితానికి కవిత్వానికి చుక్కెదురు ఉండకూడదంటాడు. అలాగే

"కవిత్వమే నాకు ప్రాణం
నేనే కవిత్వానికి ప్రాణం
ప్రాణానికి ప్రాణం
కవిత్వానికి కవిత్వం"

తెలుగు సాహిత్యంలో కవులు కవిత్వాన్ని ఎంతగా ప్రేమించేవారో ఈ కవిత్వం వల్ల తెలుస్తుంది. కవిత్వం నాకు ప్రాణం నేను కవిత్వానికి ప్రాణం పోశాను. ప్రాణానికి ప్రాణం లాగే కవిత్వానికి కవిత్వం వీటిని విడిగా విడదీసి, నిలువుగా ఉరిదీసి ప్రాణమే లేదు. కవిత్వమే లేదు అని చెప్పవద్దు. ఇవి రెండు నేనే అంటాడు కవి.

నేను కవిత్వంగా మొలుస్తాను, జీవితమై నిలుస్తాను అంటాడు. మానవ జీవితమంతా కవిత్వమే అదే విధంగా కవిత్వమంతా మానవ జీవితమే వీటి రెండింటిలో ఏ ఒక్కటి లేకపోయినా జీవితం లేదు. కవిత్వం ఉండదు అనేదే కవి మతం. కవిత్వాన్ని రాయాలనుకుంటే జీవితాన్ని దారబోసి, వెన్నెల్లో కవిత్వాన్ని ఆరబోసి జీవితమంతా కాపలాకాసి జీవితానికి పండు వెన్నెల్ని ఆసరా చేస్తా నంటాడు.

"మంచు కురుస్తున్నప్పుడు
కవిత్వం గుర్తొస్తుంది!
గాలి వీచినప్పుడు
జీవితం మురిపిస్తుంది!
కవిత్వం జీవితానికి హాయినిస్తుంది!
జీవితం కవిత్వానికి ప్రాణమిస్తుంది!"

మంచు కురిచేటప్పుడు కవిత్వం గుర్తొస్తే కవిత్వం జీవితానికి హాయినిస్తుంది. గాలి వీచినపుడు జీవితం మురిపించి జీవితం కవిత్వానికి ప్రాణమిస్తుందని కవి అభిప్రాయం.

"కవిత్వం బరువయింది
జీవితం తేలికయింది
కవిత్వాన్ని జీవితంలోకి
తర్జుమా చేస్తే
జీవితం బరువుగా సాగుతుంది
కవిత్వం తేలికగా ఎగురుతుంది
జీవితాన్ని కవిత్వంలోకి మారిస్తే
కవిత్వం వేడెక్కుతుంది
జీవితం చల్లారిపోతుంది"

బరువుగా ఉన్న కవిత్వాన్ని తేలికగా ఉన్న జీవితంలోకి పంపితే జీవితం బరువుగా సాగుతుందని దీనివల్ల కవిత్వం తేలికవుతుంది. అదే జీవితాన్నే కవిత్వంలోకి పంపితే కవిత్వం వేడెక్కి జీవితం చల్లారిపోతుందని కవి జీవితానికి కవిత్వానికి గల ప్రత్యేకతలను తెలియజేశాడు.

జీవితాన్నే భద్రంగా దాచుకోమని, కవిత్వాన్ని పది మందికి పంచమని చెబుతూ, జీవితాన్ని కవిత్వం నుంచి గాని, కవిత్వాన్ని జీవితం నుంచి గాని వేరుచెయ్య కూడదంటాడు. అలాగే జీవితం తిక్కదని, కవిత్వం పక్కదని కవిత్వం పక్కలోఉన్నప్పుడే జీవితమౌతుందని అలా దారి తప్పిన జీవితానికి కవిత్వం వెలుగునిస్తుందని కవిత్వానికి జీవితం లక్ష్యమై నిలుస్తుందని, అలాంటి జీవితాన్ని అధిష్టించమని, అధిష్టించిన జీవితం నుంచి కవిత్వాన్ని ఆదరించమని, ఆరాధించమని కవి చెబుతాడు.

జీవితానికి కవిత్వం నలుగులాంటిదనడంలో జీవితాన్నే కవిత్వం అలంకరింపజేస్తుందనేది కవి అభిప్రాయం. కవిత్వానికి జీవితం వెలుగునిస్తుందంటే కవిత్వానికి జీవితమే మార్గం, ఆధారం అని కవి మతం అదే విధంగా కలుగులో ఏముంది చూడాలంటే వెలుగు కావాలని, దాని కంటే ముందు వెలుగుంటే కదా కలుగుని వెతకాలి. కనుక కవిత్వాన్ని వెలిగించడానికి, జీవితాన్ని రగిలించడానికి ఆధారం కావాలి అంటాడు కవి.

"జీవితానికి పోరాటం తప్పదు
కవిత్వానికి ఆరాటం తప్పదు
జీవితానికి కవిత్వానికి
వెటకారం నప్పదు"

నిత్య జీవితంలో పగలు - రాత్రి అనేవి సాధారణంగా ఉంటాయి. జీవితం చీకటిలోకి వెళ్ళినప్పుడు పోరాటం తప్పదు ఆ జీవితం నుంచి పుట్టిన కవిత్వానికి ఆరాటం తప్పదు వెటకారానికి ఆస్కారం లేదంటాడు కవి.

"కవిత్వం ఒక ఉబలాట
జీవితం ఒక పెనుగులాట
రెండూ ఆటలు కావు"

కవిత్వం రాయాలన్న కోరిక దాదాపుగా అందరికీ ఉంటుంది కానీ రాయలేరు. అదే విధంగా అందరూ జీవితంలో అభివృద్ధి మార్గంలో ముందకెళ్లాలని భావిస్తారు కానీ కుదరదు. ఈ రెండింటినీ సాధించడానికి ఎంతో ప్రయత్నం చెయ్యాలి. ఇలా ప్రయత్నం లేకుండా ఏమీ సాధించలేమన్నది ఇందులోని అర్థం. చూడ్డానికి ఇవి ఆటలులా కనిపించినా ఆటలుకావు అన్న సత్యాన్ని విప్పి చెప్పారు. కవిత్వం రాయాలంటే ఎంతో నైపుణ్యం, ప్రతిభ కావాల అదే విధంగా జీవితంలో పైకి రావాలంటే ఎంతో పట్టుదల, కృషి, ఓర్పు, ప్రతిభల్లాంటివి కావాలి వీటిని సాధించాలంటే అంత తేలిక కాదు అనేది కవి అభిప్రాయం.

జీవితం కవిత్వం రెండూ రెండు కళ్ళు, కాళ్ళు లాంటివి. కళ్ళు జీవితాన్ని చదవడానికి ఉపయోగపడుతాయి. రెండోదైన కాళ్ళు కవిత్వంలో తిరగడానికి అంటాడు. జీవితమంతా కవితామయంగా ఉండాలి. జీవి కన్నా కవే నయం. ఎందుకంటే జీవితంలో భయం కనిపిస్తుంది. కవిత్వంలో అభయం కనిపిస్తుంది.

"ఎన్నో జీవితాలు / ఒకే కవిత్వం!
ఎన్నో కవిత్వాలు / ఒకే జీవితం!
ఎన్నెన్నో కవిజీవితాలు
ఎన్నెన్నో జీవికవిత్వాలు"

కవి కవిత్వం రాయాలంటే ఎంతోమంది జీవితాలను ఆధారంగా తీసుకోవాలి ఈ అందరి జీవితాలను కవి

ఒకచోటే ఇమడ్చగలడు. ఇలాగే ఒకే జీవితానికి సంబంధించి ఎన్నో కవిత్వాలను రాయవచ్చును అంటాడు.

జీవితానికి కవిత్వానికి ఉన్న భేదాన్ని జీవితం ఖేదమని కవిత్వం మోదమని అన్నింటినీ అంగీకరిస్తే ఆమోదమని చెబుతాడు. అలాగే జీవితాన్ని కవిత్వం ముంచదంటాడు ఎందుకంటే ఒక మంచి కవిత్వం వల్ల తన జీవితంలో ఎంతో మార్పురావచ్చునంటాడు. కవిత్వాన్ని జీవితం ఎన్నటికీ చెరపదు అంటాడు.

"కవిత్వంలో / ఎన్ని అబద్ధాలయినా అందమే!
జీవితంలో / ఒక అబద్ధమయినా అసంబద్ధమే!"

కవి తన కవిత్వంలో ఎన్ని అబద్ధాలైనా అందంగా చెప్పవచ్చు అది కవిత్వం. అదే నిజ జీవితంలో ఒక అబద్ధమైనా చాలు ఆ జీవితం నాశనం.

"జీవితంలో నుంచి / కవిత్వం
కవిత్వంలో నుంచి / జీవితం
పిండుకోవడమే పరమార్థం!"

సాధారణంగా జీవితంలో నుంచి కవిత్వం పుడుతుంది. ఆ కవిత్వాన్ని చదివిన పాఠకుడు తను మంచి జీవితాన్ని ఎన్నుకోవడమే పరమార్థం అని కవి భావన.

"జీవితమొక వెతుకులాట
కవిత్వమొక బతుకుబాట"

జీవితమనేది వెతుకులాటవంటిది, పైకి ఎదగాలంటే మంచి మార్గాన్ని చూసుకోవాలి, కాని కవిత్వం బతకడానికి మంచి మార్గాన్ని చూపుతుంది.

"కవిత్వంలో / పైకి వచ్చినవాడు / కవి
జీవితంలో పైకి వచ్చినవాడు / కవి
రవి గాంచనిచోటు కవిగాంచును!"

కవి తన కవిత్వం ద్వారా సమాజ చైతన్యాన్ని కలిగించి పైకి వచ్చినవాడు కవి. కవి ఇతరులను చైతన్య పరచి అభివృద్ధి వైపు నడిపించేవాడు. అందుకే సాధారణ రూపంలో ఉండే రవి కంటే, సమాజానికి వెలుగునిచ్చే సూర్యునికంటే, సృష్టికి ప్రతి సృష్టి చేసే కవి బ్రహ్మతో సమానం అంటారు. అందుకే ఇక్కడ కవి సమయం, వాక్కు, మార్గం, ఆశయం సమాజాన్ని అద్దంలో పెట్టి చూపించగలరు. రవి జీవితంలో అభివృద్ధి చెందాలంటే కవి మార్గం చూపాలి. రవి కవి గొప్పగా ఎదగాలంటే కవి లాంటి జీవితం కష్టపడగలగాలి. ఏది ఏమైనా బాహ్య ప్రపంచాన్ని చూడగలిగిన రవి కంటే, అంతర్ ప్రపంచాన్ని దర్శింపచేసే కవి గాంచును ఇందులో అతిశయోక్తి లేదు.

"ఉత్తరం వంగి / దక్షిణానికి నమస్కరిస్తుంది
దక్షిణం లేచి /ఉత్తరానికి పాదాలు కడుగుతుంది
కవిత్వం, జీవితం / ఉత్తర దక్షిణ ధ్రువాలు!"

అని ఉత్తర దక్షిణ ధ్రువాలు వేరు వేరైనా, ఉత్తరం వంగి దక్షిణానికి నమస్కరిస్తుందనడంలో ఉత్తరాన హిమాలయ పర్వతాలు దక్షిణాన ఉన్న హిందూ మహా సముద్రానికి వంగి నమస్కరించినట్లు, దక్షిణం లేచి ఉత్తరానికి పాదాలు కడుగుతుందనడంలో, దక్షిణాన ఉన్న హిందూ మహాసముద్రం లేచి హిమాలయ పర్వతాలను తాకిందని చెప్పడం కవి చాతుర్యం. ఇలాగే సమాజంలోని మనుషులు ఎటువంటి భేద భావాలు లేకుండా నివసించాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కవి ఆశయం.

"జీవితం తెరచిన పుస్తకం / కవిత్వం
మూసి ఉంచిన జీవితం!"

సాధారణంగా జీవితం మూసే ఉంచుతుంది, కవిత్వం తెరచిన పుస్తకం. దీనిని తారుమారు చేసి రచించారు. ఇచ్చట మనల్ని కవి ఆలోచింపజేశారు. కవిత్వానికి జీవితం దొరికిందంటే ఆ జీవితం ఎంత ఘోరంగా ఉండి బట్టబయలై ఉండాలి అందుకని అలాంటి జీవితాన్ని దాచేశారు కవి. కవిత్వం శాశ్వతమై ఎన్నో ఏళ్ళు స్థితిగతులను చూపించగలుగుతుంది. జీవితం స్పష్టంగా తేలిపోతుంది. జీవితం శాశ్వతం కాదని, తెరచిన పుస్తకంలో కవిత్వం నిలకడైనదని ఇందులో కొన్ని మాత్రమే చూడగలమని. మూసి ఉంచిన జీవితంలో ఎన్నో రహస్యాలు దాగి ఉంటాయంటాడు కవి.

"జీవితానికి / అర్థం ముఖ్యం
కవిత్వానికి / పరమార్థం ముఖ్యం!"

రెండు అక్షర సత్యాలను ఒక ఒరలో ఇమడ్చడం తేలికైన పనికాదు. ఇది కవులకే సాధ్యం. ఎలాగైనా బతికేయ వచ్చుగాని అర్థవంతమైన జీవితం ఉండాలి అంటాడు కవి. పుట్టినందుకు మంచి పనులను చేసి పదిమందిచేత సభాష్ అనిపించుకోవాలి. తలెత్తుకు తిరిగేలా బతకాలి అంటాడు. ఆలోచింపచేసేది కవిత్వం అర్థం కంటే పరమార్థం ముఖ్యమైనదని చాటారు. పరమార్థంలో పలు సమస్యలుంటాయి. ఇవన్నీ కలిసిందే జీవితమని దీనికి ప్రత్యేక స్థానం కల్పించి సుస్థిర చిరస్థాయిని అమర్చేది కవిత్వం అదే పరమార్థం.

"జీవితాన్ని / అమ్ముకోవడం వృత్తి
కవిత్వాన్ని / నమ్ముకోవడం ప్రవృత్తి!"

జీతానికి పనిచేస్తే వృత్తి, జీవితానికి పనిచేస్తే ప్రవృత్తి. ఇష్టంతో పనిచేస్తే ప్రవృత్తి, కష్టంతో పనిచేస్తే వృత్తి, కొంతమంది కవులు కవిత్వాన్ని అమ్ముకున్న వాళ్ళున్నారు, నమ్ముకున్నవాళ్ళున్నారు.అమ్ముకున్నవాళ్ళు అష్టకష్టాలు అనుభవిస్తే, నమ్ముకున్న వాళ్ళు సమాజంలో ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. దీనినే కవి వృత్తి, ప్రవృత్తి అన్నారు. ఇచ్చట కవి ఆశయం ప్రతి మనిషి తన వృత్తిని ప్రేమించడం.

జీవితానికి, కవిత్వానికి గల అవినాభావ సంబంధాన్ని మాడభూషిగారు ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలాగా తనదైన శైలితో, సులభమైన భాషతో, తేలికైన పదాలతో తెలియ జేశాడు. భగవంతుడు మానవుడికి జీవితాన్ని ప్రసాదిస్తే, ఆ జీవితంలో కష్టాలను ఎదుర్కోడానికి, మంచి మార్గంలో ప్రయాణించడానికి, అభివృద్ధివైపు వెళ్ళడానికి, జీవితానికి వెలుగు నివ్వడానికి కవి కవిత్వాన్ని ప్రసాదించాడు. మాడభూషిగారు నిజాన్ని చెప్పే సందర్భంలో జీవితానికున్న సత్యాలను, కవిత్వానికున్న దృక్కోణాలను ఈ కవిత్వంలో పొందుపరిచారు. ఇందులో మాడభూషిగారు ఒకచోట భావకవిగా, మరొకచోట విప్లవకవిగా, అభ్యుదయకవిగా, దిగంబరకవిగా, స్త్రీవాద కవిగా ఇలా ఎన్నో విధాలుగా తన కవితల్లో కనబడుతాడు. బతుకు పోరాటంలో మనిషన్నవాడు ప్రశాంతంగా జీవించాలంటే మాడభూషి కవిత్వంలో జీవితాన్ని చదవాలి, అలా చదివినట్లయితే జీవితం సుగమవమౌతుంది.

❖ ❖ ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య మాడభూషి

- యడవల్లి శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకులు, నూజివీడు, కృష్ణాజిల్లా.

మాటలో గాంభీర్యం....బాషలో మాధుర్యం.. నటనా రంగంలో వినూత్న శైలి...ఇటు కళాపోషణలోనూ, ఇటు సాహిత్యరంగంలోనూ...ఇంకో వైపు అధ్యాపకుడిగా ఎందరో విద్యార్థులను అత్యుత్తములుగా తీర్చిదిద్దటంలో తిరుగులేని ధృవతారగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య మడభూషి సంపత్ కుమార్. ఓ వైపు అధ్యాపక వృత్తిలో ఎందరో విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. సాహితీ వేత్తగా..కవి..రచయితగా..కళాకారుడిగా విభిన్న అంశాల్లో ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. సమాజంలోని అంశాలను ఇతివృత్తంగా తీసుకుని వాటిపై పరిశోధనలు చేస్తూ ఫలితాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. సాహిత్యంలో కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. విభిన్న కళారూపాలను ప్రదర్శించటం ద్వారా ఆ కళలో కూడా విశేషమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించి పలువురు మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. ఓ వైపు విద్యారంగంలో అధ్యాపక వృత్తిని కొనసాగిస్తూ మరో వైపు సాహిత్య రంగ విలీనాకాశంలో తన ప్రస్థానాన్ని అత్యంత హుందాగా కొనసాగిస్తున్నారు. కళాకారుడిగా రాణిస్తున్నారు మడభూషి సంపత్‌కుమార్. ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే లక్షణం ఆయనది. సుదీర్ఘ సాహితీ ప్రయాణంలో ఎన్నో అవార్డులను కైవసం చేసుకున్నారు. ఇటు విద్యా రంగంలోనూ ఉత్తమ అధ్యాపకుడిగా పురస్కారా లను ఏటేటా అందుకుంటూనే ఉన్నారు. ఏక కాలంలో బహు ముఖ ప్రజ్ఞాపాటవాలతో శిఖరాగ్రాన నిలువగలిగే వారు అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తులలో ఆచార్య మఢభూషి సంపత్‌కుమార్ ఒకరు. సాహిత్యంతో పాటు సమజాన్ని అధ్యయనం చేస్తేనే ఉత్తమమైన కవిత్వం రాయగలం. సమ సమాజ నిర్మాణానికి నవ సమాజ నిర్మాణానికి తమ కలాలను, గళాలను విప్పి కవన రంగంలో జ్వాలా తోరణాలుగా కవిత్వాన్ని ఆవిష్కరించాలి. సామాజిక అంశాలపై దృష్టిని కేంద్రీకరించాలి. కవిత్వాన్ని సాధనంగా ఆయుధంగా నందించాలి. నిజాన్ని నిర్భయంగా ఖండనతో కదిలించాలి. అలాంటి చైతన్య వంతమైన కవిత్వం నేటి సమాజానికి చాలా అవసరం. వర్తమాన, సుప్రసిద్ధ కవులు ఉత్తమమైన కవిత్వం కోసం ప్రాచీన ఆధునిక రచనలను విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేస్తేనే కవిత్వం కొద్ది కాలాలపాటు నిలబడగలుగుతుంది. అలాంటి కవులు, రచయితలు అరుదుగానే కనిపిస్తారు. అలాంటి సాహితీ సీమలో వికసించి తెలుగుశాఖ ఖ్యాతిని ప్రపంచం నలుదిశలా వ్యాపించిన జేసిన ఘనత మధ్యాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య మడ భూషి సంపత్‌కుమార్‌కే దక్కుతుందనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

తెలుగు సాహిత్యం ప్రపంచ వ్యాప్తికి కృషి :

తెలుగు సాహితీ ప్రియులైన ప్రతి ఒకరి మదిలో మెదిలాడే వ్యక్తుల్లో ఆచార్య మఢభూషి సంపత్‌కుమార్ ఒకరు. తమిళనాడు రాష్ట్రంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగే తెలుగు సాహితీసదస్సులకు ఆయన హాజరవుతుంటారు. వృత్తినే దైవంగా భావించిన మడభూషి సంపత్‌కుమార్ తన జీవితాన్ని సాహిత్యానికే అంకితం చేశారు. తెలుగు సాహత్యంలో ప్రముఖ విమర్శకునిగా, పుస్తకసమీక్షకునిగా అన్నింటికి మించి మంచి అధ్యా పకునిగా అందరిమదిలో స్థిరమైన స్థానాన్ని పొందిన వ్యక్తుల్లో ఆచార్య మఢభూషి సంపత్‌కుమార్‌ను అగ్ర గణ్యులుగా చెప్పొచ్చు.

అధ్యాపకునిగా వినూత్న శైలిలో బోధన :

మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు, ఆచార్యులు మడభూషి సంపత్ కుమార్ పరిశోధకుడిగా, పర్యవేక్షకుడిగా ఎందరో విద్యార్థులకు మార్గదర్శకం చూపించారు. అధ్యాపకునిగా తనదైన శైలిలో విద్యాబోధన కొనసాగిస్తూ ఆత్మీయ పలకరింపులతో పలువురి విద్యార్థులను శిష్యులుగా పొందిన ధన్యజీవి. తమిళనాడు రాష్ట్రంలో తెలుగు భాష అంతరించే స్థితిలో ఉంటే దాని ఉద్ధరణకు కంకణ బద్దులై కృషిచేస్తున్నారు. ఆయన వద్ద తెలుగు చదువుకొనే విద్యార్థులు ఏదో రీతిలో స్థిరపడి జీవిస్తున్నారు. మద్రాస్ పరిసర ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థలన్నిటిలో తెలుగు అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా ఎందరో ఉన్నారు. గురువుగారి నుండి అందిపుచ్చుకున్న సద్గుణాలతో కవులు, రచయితలు, వ్యాస కర్తలు, విమర్శకులు ఎందరో! వారి గ్రంథాలను సైతం సమీక్షలు చేయడం, ఇదే నా పుత్రోత్సాహం అంటూ వారి ముఖం ఆనందతాండవం చేస్తుంది. అందుకే వారు "అభినవ వ్యాసులు".

సాహితీ మిత్రునిగా అందరికీ సుపరిచితులు. అందుకే ఆయన్ను అజాత శత్రువుగా పిలుస్తుంటారు. వ్యాసకర్తగా సాహిత్యంలోని అనేక అంశాల మీద వ్రాసిన ఉపన్యాస పత్రాలు ముద్రితమయ్యాయి. సృజనాత్మక రచయితగా విమర్శ, సృజనం అనే రెండు అంశాల్లో ఆయన రచనలు సాగాయి. కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, పాత్రికేయుడిగా, భాషావేత్తగా అందరికీ సుపరిచితులు. ఉత్తమ సాహితీవేత్తగా మడభూషి సంపత్ కుమార్ అందరి నోటా శబాష్ అనిపించుకుంటున్నారు.

కవిగా కవితా ఓ కవితా, మద్రాసులో తెలుగు పరిశోధన, వ్యాస సంపద, వ్యాకరణ విజ్ఞానం, తమిళ జానపద కళలు, అనువాద విజ్ఞానం, కవాతు, రెండో ఓటమి వంటి రచనలు చేశారు. జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, మూడో మనిషి, చివరకు నీవే గెలుస్తావు, వికారి వంటి కవితా సంపుటాలను ప్రచురించారు.

మహిళల సమస్యలకు అద్దంపట్టే రచనలు :

ఆడపిల్ల లేని ఇల్లు చంద్రుడు లేని ఆకాశం ఒక్కటే... అందుకే ప్రతి ఇంటికీ ఓ వెన్నెలలా ఓ కూతురు అవసరమే... ఈరోజు ఆడపిల్లను వద్దనుకుంటే రేపటి సమాజం అమ్మలేని అనాధ అవ్వటం ఖాయం.. తరంతరం.. నిరంతరంగా జరుగుతున్న సామాజిక జీవన ప్రక్రియలో అమ్మాయిలు లేని జీవితం...జీవనం... సమాజం వర్ణించలేం. నేటి డిజిటల్ యుగంలోనూ పురాతనకాలం నాటి సనాతన భావాలతో కొందరు అమ్మాయిలను అమ్మ కడుపులోనే సమాధి చేస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించినా...చంద్ర మండలంలోకి మహిళలు వెళ్లి వస్తున్నా...సమాజంలో సగభాగంగా ఉండి, అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తున్నా నేటికీ పురుషాధిక్య సమాజంలో హింస కొత్త రూపాల్లో కొనసాగుతోంది. కొత్త టెక్నాలజీ, సైబర్ హింస కొత్త రూపాలను తీసుకుంది. కారణాలు ఎన్ని ఉన్నా నేటి సమాజంలో మహిళలపై వివక్ష, హింస కొనసాగుతోంది. ఫలితంగా సమాజంలో బాలికల నిష్పత్తి అమాంతంగా తగ్గిపోతోంది. స్త్రీ లేకపోతే... జననం లేదు..స్త్రీ లేకపోతే గమనం లేదు...సృష్టిలో జీవం లేదు. నేటి ఆడపిల్లే..రేపటి వెలుగు.. ఆడపిల్లలను కాపాడుకుందాం...అమృతనానికి విలువిద్దాం అంటూ ఆయన రచనలు సాగాయి.

ఇంటా..బయటా వేధింపులు నిత్యకృత్యం :

బాలికలు, యువతులు, మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. ఇంటా - బయటా, పాఠశాలలో... ప్రయాణంలో, పనిప్రదేశంలో, ఉద్యోగం చేసేచోటఅరాచకాల పరంపర కొనసాగుతోంది. ప్రేమ పేరుతో ఉన్మాదం, పేట్రేగి ప్రాణాలు తీసేస్తున్న ఆకృత్యాలు, లైంగిక వేధింపులతో వెంటపడుతూ చేస్తున్న అఘాయిత్యాలే నిత్యం దర్శనమిస్తున్నాయి. ఏదైనా జరిగినప్పుడు కఠిన ప్రకటనలతో హడావుడి చేసే ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం వీటిని ఆచరణలో పెట్టడంలో ఏమాత్రం ఆశించిన స్థాయిలో పనిచేయట్లేదు. గ్రామాల

మధ్య ఎక్కడో విసిరేసినట్లుగా పాఠశాలలూ, బస్సు వసతి లేని గ్రామాలు...వీటి మధ్య పదో తరగతి దాకా వచ్చే అమ్మాయిల సంఖ్య అంతమాత్రంగానే ఉంది. ఇంటర్మీడియట్ ఆపై ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థినుల సంఖ్య గ్రామీణ భారతంలో చాలా తక్కువుగానే ఉంటోంది. నిత్యం వేలాదిమంది శిశువులు కడుపులో ఉండగానే హత్యకు గురౌతున్నారు. ఆ గండాన్ని తప్పించుకుని పుట్టినా నెలలు తిరక్కుండానే మృత్యువాకిట పడుతున్నారు. ఇన్ని ప్రతికూలతలు తట్టుకుని బ్రతికి బయటపడ్డా చదువుకు దూరమై..సంపూర్ణ మానవిగా ఎదగలేక పోతున్నారని మడభూషి సంపత్‌కుమార్ తన రచనల్లో ఆవేదన వ్యక్తంచేశారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడటమే లక్ష్యం :

భిన్నత్వంలో ఏకత్వంతో అలరాలుతున్న భారతీయ సంస్కృతిని కాపాడాలని కోరుతూ ఆయన చేసిన రచనలు స్ఫూర్తిదాయకం. ప్రాచీన కాలం నుంచి భారత దేశం అనేక సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. సిరి సంపదలకు, పాడి పంటలకు ప్రసిద్ధి చెందింది. ఎందరో మహానాయకులకు ఇది పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన సమైక్య దేశం మన భారతదేశం. మన దేశ గౌరవాన్ని దశదిశలా చూడటం మన కర్తవ్యం. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడాలి. ఆయా జిల్లా లేక ప్రాంత ప్రజల సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేదై ఉండాలి. భాష, సాహిత్యాల పురాతన పత్రాల సేకరణ, పరిరక్షణ చేపట్టాలి. ఆ జిల్లా పరిధిలోని పురాతన వస్తువులు సేకరించాలి. వాటి వివరాలను గ్రంథస్థం చేయాలి. వాటి చారిత్రక పరిశోధన చేపట్టాలి. పురాతన కట్టడాలను పరిరక్షించే నిపుణులను కల్గివుండాలి. వాటి పరిరక్షణకోసం ప్రజలను చైతన్య పరిచే, సహకరించే కేంద్రంగా ఉండాలని ఆయన రచనల ద్వారా ఆకాంక్షించారు.

ఆధారగ్రంథాలు :

1. కవితా..! ఓ కవితా!-వస్తువు, భాషా శైలి,2020.
2. మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ 2020.
3. వ్యాస సంపద 2013.
4. తమిళ జానపద కళలు 2014.

జీవితములోని కవితాత్మ జిలుగు తెలిసి
వర్తమానము కనుగొనవలసినట్టి
తత్వసారము కవితా లతగ నిలిపిన
మాడభూషి సంపత్కుమార్ మానవీయ!

గుణము నిత్య సుధారస గుణఘుణమ్ము
కవిత కలిగిన గమనమే భవిత యనిన
గురువు మార్గమె శిష్యుల గుప్తధనము
వంచితి శిరమందుకొనుము వందనమ్ము!-

– డాక్టర్ మున్నవ గంగాధర ప్రసాద్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'వ్యాకరణ విజ్ఞానం' - ఒక పరిశీలన

- డాక్టర్ వీధూరి వేంకటేశ్వర్లు, పి.జి.టి. తెలుగు, సెయింట్ జోసఫ్ ఆంగ్ల పాఠశాల, కర్నూలు.

''అవ్యాకరణ మధీతం భిన్న ద్రోణ్యా తరంగిణీ తరణమ్ భేషజమపథ్య యుక్తం త్రయమిదకృతం వరం నకృతమ్'' అని సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది. వ్యాకరణం లేకుండా భాషను నేర్చుకోవడం, చిల్లులు పడిన పుట్టిలో నదిని దాటడం, పథ్యం చేయకుండా ఔషధాన్ని సేవించడం - ఈ మూడు వ్యర్థ ప్రయత్నాలేనని ఈ శ్లోక తాత్పర్యం. దీన్ని బట్టి భాషాధ్యయనంలో వ్యాకరణానికి ఎంత ప్రాధాన్యముందో తెలుస్తుంది. ఈ దృక్పథంతోనే సాహిత్య విద్యార్థులకు వ్యాకరణం ప్రాధాన్యాన్ని తెలియ జేయడానికి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు 'వ్యాకరణ విజ్ఞానం' అనే వ్యాస సంపుటిని వెలయించారు. ఈ గ్రంథం వ్యాకరణానికి సంబంధించిన ప్రాథమిక అవగాహనను విద్యార్థులకు కలిగించడానికి, ముఖ్యంగా సాహిత్య విద్యార్థులు సాహిత్యాధ్యయనంలో ప్రవేశించి నప్పుడు వ్యాకరణాన్ని అవగాహన చేసుకోవడానికి ఈ వ్యాస సంపుటి ఉపయోగపడుతుందని రచయిత ముందుమాటలో మనవి చేశారు. ఎందుకంటే వ్యాకరణ విజ్ఞానం అందకుండా భాషకు సంబంధించిన జ్ఞానార్జన పరిపూర్ణం కాదు కనుక.

'వ్యాకరణ విజ్ఞానం' అనే గ్రంథంలో 1. పరిచయం, 2. వ్యాకరణం - ప్రాచీనత, 3. వ్యాకరణం - వ్యుత్పత్తి - నిర్వచనం, 4. వ్యాకరణ ప్రయోజనం, 5. తెలుగు వ్యాకరణాల పరిచయం, 6. బాల వ్యాకరణం - విశిష్టత, 7. బాల వ్యాకరణం - పరిచ్ఛేద పరిచయం, 8. బాల ప్రౌఢ వ్యాకరణాలు, 9. వ్యాకరణ సంజ్ఞలు, 10. పారిభాషిక పదాల వివరణ అని పది అంశాలకు సంబంధించిన వ్యాసాలున్నాయి.

మొదట 'పరిచయం' అనే వ్యాసంలో ప్రపంచంలో మాట్లాడే అన్ని భాషలకు వ్యాకరణముంటుందని చెబుతూ ''మాట్లాడే భాషకన్నా రాసే భాషలో నియమా లను ఎక్కువగా పాటించడం జరుగుతుంది. అందువల్ల వ్యాకరణాంశాలు ఎక్కువగా రాసే భాషకు సంబంధించి నవిగానే ఉంటాయి. కాబట్టే వ్యాకరణమంటే లిఖిత భాషకు సంబంధించిన నియమాలను తెలిసేదన్న అభి ప్రాయం లోకంలో రూఢిగా నిలిచిపోయింది'' అని రచ యిత పేర్కొంటున్నారు. ఇది అక్షర సత్యం! ఎందుకంటే ప్రాచీన కాలంలో వచ్చిన వ్యాకరణాలన్నీ లిఖిత భాషకు సంబంధించినవే కావడం, వాగ్రూపంలో ఉన్న భాషకు వ్యాకరణాలున్నట్టు ఆధారాలు లేకపోవడం ఇక్కడ గమనార్హం.

రెండవదయిన 'వ్యాకరణం - ప్రాచీనత' అనే వ్యాసంలో

1. రుగ్వేద కాలం నుంచీ మనకు వ్యాకరణానికి సంబం ధించిన అంశాలు కన్పిస్తున్నాయి కాబట్టి అనే కాంశాల్లాగే వ్యాకరణం వేదకాలం నుంచే ఉన్నట్లు భావించ వచ్చు.
2. వేదాలలో మనకు అలిఖిత భాషకు సంబంధిం చిన వ్యాకరణాంశాలు కన్పిస్తాయి తప్ప, లిఖిత భాష కున్నట్టు నిర్దిష్టమైన వ్యాకరణ నియమాలు కని పించవు. దానిక్కారణం అంతకుముందు లిఖిత సాహిత్యం లేకపోవడమే!
3. వేదల్లాగే వ్యాకరణం కూడా మౌఖికంగా ఒకరి నుంచి మరొకరికి అందుబాటులోకి వచ్చినట్టు గుర్తిం చవచ్చు. ఇలా ఈ మూడు అంశాలను వేద మంత్రాలను వాటి అర్థాలను ప్రామాణికంగా చూపుతూ, వ్యాకరణం అత్యంత ప్రాచీనమయిన దని నిరూపిస్తారు. దీనివల్ల పాఠకులకు వ్యాకరణం ఆధునిక శాస్త్రం కాదని లిఖిత సంప్రదాయం

ఏర్పడక ముందు నుంచే వ్యాకరణ సంప్రదాయం కూడా ఉందన్న విషయం రూఢి అవుతుంది.

మూడవదైన వ్యాకరణం :

'వ్యుత్పత్తి - నిర్వచనం' అనే వ్యాసంలో సంస్కృతంలో నపుంసక లింగమైన 'వ్యాకరణం' అనే పదాన్ని రూపసాధన వివరణతో నిర్వచించి, తెలుగులో అమహద్వాచకాన్ని సూచించే 'ము' చేరి వ్యాకరణమయినది పేర్కొంటారు. తర్వాత పతంజలి మహాభాష్యంలోని వ్యాకరణ శబ్ద వ్యుత్పత్తిని వివరిస్తూ, కేవలం సూత్రాలు, ఉదాహరణలు మాత్రమే కావు. వ్యాఖ్యానాలు కూడా వ్యాకరణం విభాగం లోనే చేరుతా యన్నది పతంజలి కాలం నాటికే స్థిరపడిన అభిప్రాయమని పేర్కొంటారు. ఈ వ్యాసం వలన వ్యాకరణమనేది లక్ష్యాన్ని - లక్షణాన్ని వివరిస్తూ, పదంలోని వివిధ భాగాలను వేరు చేసి, అవి ఎలా కలుస్తాయి - ఎలా విడిపోతాయి, వాటి సాధు అసాధుత్వాలు మొదలైన విషయాలను విశ్లేషించి చెప్పేదని పఠితులకు అర్థమవుతుంది.

నాలుగవదయిన 'వ్యాకరణ ప్రయోజనం' అనే వ్యాసంలో మాట్లాడే భాషకు అయుష్షు తక్కువని కానీ అది లిఖిత రూపం ధరించినప్పుడు దాని ప్రయోజనం చాలా ఎక్కువగా ఉంటుందని చాలా విపులంగా చెబుతూ, పతంజలి మహర్షి పేర్కొన్న 1. రక్ష, 2. ఊహ, 3. ఆగమం, 4. లఘ్వర్థం, 5. అసందేహం అనే అయిదు రకాల వ్యాకరణాల ప్రయోజనాలను విశ్లేషించారు. తర్వాత చిన్నయసూరి బల వ్యాకరణం రాయడానికి గల కారణాన్ని వివరించి, దాని ప్రయోజనాలను వర్తమాన కాలానికి ఇలా అనుసంధానిస్తూ వివరించారు. అవి వరుసగా

1. వర్ణ క్రమం తెలుసుకోవడానికి
2. అపశబ్దాలు ఉచ్చరించకుండా చూడడానికి, శబ్దదోషాలు రాయకుండా ఉండడానికీ, ఆయా శబ్దాల సరయిన రూపాలను తెలుసుకోవడానికి
3. సమాసాన్ని ఎక్కడ విరవాలి? అన్న విషయాన్ని గ్రహించడానికి
4. ప్రకృతి ప్రత్యయ జ్ఞానానికి
5. ఏది అపశబ్దం, ఏది సుశబ్దం, దేన్ని ఎలా ఎప్పుడు ఉపయోగించాలో తెలుసుకోవడానికి
6. భాషా నియమాలను తెలుసుకోవడానికి
7. అపశబ్దంగా ఉండని ప్రయోగాన్ని అనుసరించడానికి మొదలైన విషయాలకు వ్యాకరణం ఉపయోగ పడుతుందని రచయిత చాలా విశ్లేషణాత్మకంగా వివరించారు.

విద్యావంతులైన వాళ్ళు సరైన ఉచ్చారణతో, శబ్దశుద్ధితో, ఇతరుల్ని ఆకట్టుకొనే శబ్ద సౌందర్యంతో, తమ అభిప్రాయాల్ని ఇతరులు సులభంగా అర్థం చేసుకొనే పటిష్టమైన భాషతో మాట్లాడాలని అభిలషిస్తారు. వీటన్నిటికీ వ్యాకరణబద్ధమైన భాష అనివార్యం. కాబట్టి భవిష్యత్తులో వ్యాకరణ ప్రయోజనం మరింత అనివార్యం అవుతుంది.

అయిదవదయిన 'తెలుగు వ్యాకరణాల పరిచయం' అనే వ్యాసంలో తెలుగు భాషకు రెండు వందలకు పైగా వ్యాకరణాలున్నాయని చెబుతూ వాటిలో కొన్ని ముఖ్యమైన వ్యాకరణ గ్రంథాలను విపులంగా వివరిస్తారు. అవేమంటే 1) 11వ శతాబ్దంలో వెలువడి, వివాదాస్పద కర్తృత్వంగా మిగిలి, నన్నయ గారిచే సంస్కృతంలో వెలువడిన ఆంధ్రశబ్ద చింతామణిని, 2) 12వ శతాబ్దానికి చెందిన వేములవాడ భీమకవి గారి కవిజనాశ్రయమనే ఛందో గ్రంథాన్ని, 3) 13వ శతాబ్దానికి చెందిన మూలఘటిక కేతన గారి తెలుగు వ్యాకరణ గ్రంథమైన ఆంధ్రభాషా భూషణాన్ని, 4) 15వ శతాబ్దానికి చెందిన విన్నకోట పెద్దన గారి మొదటి ఆంధ్ర ఛందోలంకార వ్యాకరణ లక్షణ గ్రంథమైన కావ్యాలంకార చూడామణిని, 5) అలాగే అనంతామాత్యుని ఛందోదర్పణం గ్రంథాన్ని, 6) వెల్లంకి తాతంభట్టు రచించిన కవి చింతామణి గ్రంథాలను విశ్లేషించారు. ఆ తర్వాత 16,17, 18, 19, 20 శతాబ్దంలో వెలువడిన అనేక వ్యాకరణ గ్రంథాలను, గ్రంథ

రచయితలను ప్రస్తావించారు. ఆ తర్వాత తెలుగు భాషకు పదిమంది పాశ్చాత్యులు వ్రాసిన వ్యాకరణ గ్రంథాలను కూడా పేర్కొన్నారు. ఇలా తెలుగు వ్యాకరణ చరిత్ర చాలా విస్తారమైనదని, ఎంతోమంది తెలుగు వ్యాకరణాలపైన విశేష కృషి చేసిన వాళ్ళున్నారని, తెలుగు వ్యాకరణాలకు సంబంధించి అనేక ఖండనమండనలు జరిగాయని, అయినా తెలుగు వ్యాకరణ దీపం చిన్నదన్న అపవాదు మాత్రం పోలేదని రచయిత వ్యాసాన్ని ముగిస్తారు. ఇందులో వాస్తవం లేకపోలేదు. చిన్నయసూరి బాల వ్యాకరణంలోని అంశాలను వ్యతిరేకించినా, వ్యతిరేకించక పోయినా, ఆధునిక భాషకు ప్రత్యేకంగా వ్యాకరణం కావాలన్న తాపత్రయంతో చాలామంది వ్యాకరణాలు రాశారు. ఇలాంటి వ్యాకరణాల సంఖ్య వందల్లో ఉన్న ప్పటికీ అవి ఏవీ పాఠకుల మన్ననలు పొందలేకపోవడం గమనార్హం. దీనికి కారణం కూడా లేకపోలేదు. బాల వ్యాకరణాన్ని కావ్య భాషకు వర్ణనాత్మక వ్యాకరణంగా భావించకుండా, నిర్దేశాత్మక వ్యాకరణంగా భావించి, దాన్ని అనివార్యంగా అనుసరించడమే!

'బాల వ్యాకరణం - వైశిష్ట్యం' అనే ఆరవ వ్యాసంలో తెలుగు వ్యాకరణ చరిత్రలో బాల వ్యాకరణానికి ప్రత్యేక స్థానం ఉందని, చిన్నయసూరే బాల వ్యాకరణాని కన్నా ముందే 1840లో పద్యాంధ్ర వ్యాకరణం, 1842లో శబ్ద శాసన పద్యాంధ్ర వ్యాకరణం, 1853లో శబ్ద లక్షణ సంగ్రహం అనే మూడు వ్యాకరణాలు రచించినప్పటికీ, అవన్నీ కూడా బాల వ్యాకరణం వచ్చిన తరువాత మరుగునపడిపోయాయని, దీనికి కారణం శ్రుతి సుభగ మైన సూత్ర రచన, ఉచితమైన ప్రయోగాలు, ప్రాచీన వ్యాకరణాలను అనుసరిస్తూనే, కొత్త పంథాలో భాషను వ్యాఖ్యానించడం మొదలైన సుగుణాలు బాల వ్యాకరణం ప్రాధాన్యాన్ని పెంచాయని వివరణాత్మకంగా తెలియ జేశారు. అంతేకాదు "అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతో ముఖమ్! అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్ర విదో విదుః!!' అని సంస్కృత వ్యాకర్తలు సూత్రానికుండవలసిన లక్షణాలను చెప్పినారని, వాటిని చిన్నయసూరి అద్భుతంగా తన బాలవ్యాకరణంలో ఆచరించి చూపాడని రచయిత విశ్లేషించారు. ఇది ముమ్మాటికీ నిజమే! కనుకనే మిగిలిన వ్యాకరణాలకు లేని ప్రాధాన్యం బాల వ్యాకరణానికి వచ్చింది. విమర్శల వల్ల దీని ప్రాధాన్యత మరింత పెరిగి, తిరుగులేని వ్యాకరణంగా సాహిత్య చరిత్రలో నిలిచిపోయింది. పరిచ్ఛేదమంటే అది వ్యాకరణ శాస్త్రానికి సంబంధించిన విభజనేనని, సూత్రాలంటే అవి వ్యాకరణానికి సంబంధించిన సూత్రాలు మాత్రమేనని సూత్రకారుడంటే కేవలం చిన్నయసూరి మాత్రమేనని బాలవ్యాకరణం వచ్చిన తర్వాత సాహిత్య లోకంలో రూఢి అయిపోయింది.

'బాల వ్యాకరణం - పరిచ్ఛేద పరిచయం' అనే ఏడవ వ్యాసంలో చిన్నయసూరి పేరు వినగానే పిల్లలకు నీతి చంద్రిక, పెద్దలకు బాల వ్యాకరణం గుర్తుకు వస్తుందని రచయిత ప్రారంభించి, బాల వ్యాకరణంలో 465 సూత్రాలు ఉన్నాయని, వివిధ కావ్యాల్లోని 3,193 ప్రయో గాలున్నాయని చెప్పి, మొత్తం పది పరిచ్ఛేదాలైన సంజ్ఞా, సంధి, తత్సమ, అచ్చిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణక పరిచ్ఛేదాలను చాలా సుదీర్ఘంగా, విశ్లేషణాత్మకంగా వివరించారు. అంతేకాదు సూరి సంధి విధానాన్ని - భాషా శాస్త్ర దృక్కోణంలో కూడ విశ్లేషించారు. వర్ణమాల ప్రకారం అత్తు, ఇత్తు వచ్చిన తర్వాత ఉత్తు రావాలి. అలా కాకుండా ఉత్తు గురించి చిన్నయసూరి ఎందుకు ముందు చెప్పారంటే ఉత్వసంధి నిత్యం అందుకని దానిని మొదట చెప్పారని, భాషాశాస్త్రంలో కూడా ఇదే పద్ధతిని పాటిస్తారని వివరించారు. పరిచ్ఛేద పరిచయమెందుకంటే కావ్య భాషలోని అనేక విషయాలను బాలవ్యాకరణం ప్రతిబింబిస్తుంది. కనుక సాహిత్య కారులందరు బాలవ్యాకరణాన్ని పఠించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ అవసరాన్ని పురస్కరించుకొని బాలవ్యాక రణానికి ఎంతోమంది పండితులు నేటికీ వ్యాఖ్యానాలు వ్రాస్తున్నారు.

'బాల-ప్రౌఢ వ్యాకరణాలు' అనే ఎనిమిదవ వ్యాసంలో బహుజనపల్లి సీతారామాచార్యులు రచించిన ప్రౌఢ వ్యాకరణాన్ని బాలవ్యాకరణ పురాణ గ్రంథంగా పండితులు భావిస్తారని, ఇందులో సంజ్ఞ, సంధి, శబ్ద, కారక, సమాస, తద్ధిత, క్రియ, కృదంత, వాక్య, ముక్త లక్షణ వివేచనం అనే పది పరిచ్ఛేదాలున్నాయని, మొత్తం 314 సూత్రా లున్నాయని, బాలవ్యాకరణంలో లేని వాక్య పరిచ్ఛేదం ప్రౌఢ వ్యాకరణంలో కనిపిస్తుందని వివరించారు. తర్వాత బాల - ప్రౌఢ వ్యాకరణాలలోని కారక, సమాస పరిచ్ఛేదా లను విపులంగా విశ్లేషించారు. చివరలో ప్రౌఢ వ్యాకరణం విశేష ప్రయోగాలకు సంబంధించినది కాగా, బాల వ్యాకరణం సాధారణ ప్రయోగాలకు సంబంధించినదని పేర్కొన్నారు. చివరలో ఉత్తరోత్తరం బలీయమంటారు కాని బాలవ్యాకరణ విషయంలో పూర్వమే బలీయమని నిర్ధారించారు. ఎందుకంటే బహుజనపల్లి బాల వ్యాక రణానికి మినహాయింపుగా, సవరణగా, పూరణగా ప్రయోగాలు సేకరించి ప్రౌఢ వ్యాకరణాన్ని రాసినా అది బాలవ్యాకర ణానికున్న ప్రసిద్ధిగాని, ప్రయోజనాన్ని గాని తగ్గించలేక పోయింది. దానిక్కారణం బాలవ్యాకరణంలోని విశిష్టమైన రచనా విధానమే!

'వ్యాకరణ సంజ్ఞలు' అనే తొమ్మిదో వ్యాసంలో సంజ్ఞలు అంటే గుర్తులని, వాటినే మనం పారిభాషిక పదాలని అంటామని, ఇవి 'గురు సంజ్ఞలు - లఘు సంజ్ఞలు' అని రెండు రకాలని, వ్యాకరణాన్ని సూత్ర రూపంలో రాస్తున్నప్పుడు సంజ్ఞలు అనివార్యమని, అందుకనే వ్యాకర్తలందరూ తమ లక్షణ గ్రంథాల్లో పారిభాషిక పదాలను ఉపయోగించుకున్నారని వివరించారు.

చిన్నయసూరి పూర్వ వ్యాకరణ గ్రంథాలయిన అష్టాధ్యాయి, ఆంధ్రశబ్ద చింతామణి, అథర్వణీయం, ప్రాకృతం వంటి తదితర వ్యాకరణాల నుంచి గ్రహిం చడంతో పాటు, తనే కొన్నిటిని సృజించాడని చెప్పి, మొత్తం బాలవ్యాకరణంలోని 150 కి పైగా పారిభాషిక పదాలను తెలియజేశారు. పైగా ఆ పారిభాషిక పదాలు ఏ పరిచ్ఛేదంలో, ఏ సూత్రంలో ఉన్నది కూడా పేర్కొ నడం ఇక్కడ విశేషం.

'పారిభాషిక పదాల వివరణ' అనే పదో వ్యాసంలో బాలవ్యాకరణంలోని 91 పారిభాషిక పదాలను వివ రణాత్మకంగా తెలియజేసి, వాటి నిర్వచనాలను తెల్పి నారు. ఈ వివరణ సాహిత్య విద్యార్థులకు, వ్యాకరణం మీద పరిశోధన చేసే వాళ్ళకు ఎంతో ఉపయోగకరం.

నేటి అధ్యాపక లోకం తమ విద్యార్థులు భయపెట్టి విద్యార్థి దశనుంచే వ్యాకరణానికి దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నారు. దానితో వారికి వ్యాకరణం మరింత కష్టంగా మారి దూరంగా జరిగిపోతూ ఉంది. విద్యార్థి దశలో కలిగిన ఈ అభిప్రాయం చివరిదాకా వారిలో మార కుండా ఉండిపోతుంది. కనుక ప్రాథమిక దశలోనున్న విద్యార్థులకు వ్యాకరణ భయాన్ని పారద్రోలడానికి, సాహిత్య విద్యార్థులకు వ్యాకరణానికి సంబంధించిన అంశాలను అవగాహన చేసుకోవడానికి ఈ వ్యాకరణ విజ్ఞాన గ్రంథం చాలా ప్రయోజనకరంగా ఉంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మూడో మనిషి' కవిత్వం - మానవత్వం

- డాక్టర్ యం. ప్రసాద్, పాఠశాల సహాయకులు(తెలుగు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాపూరు, నెల్లూరు జిల్లా.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో కవితా ప్రక్రియకు వచ్చినంత ఆదరణ వేరొక ప్రక్రియకు రాలేదనుట అతిశయోక్తికాదు. నేటి సమాజంలోని దురాచారాలను కవితల ద్వారా వ్యక్తం చేసినట్లుగా ఇతర ప్రక్రియల్లో తెలియజేయడం క్లిష్ట తరంగా భావించడమో లేక మరే కారణమో తెలియదు గానీ ఆధునిక సాహిత్యం అంటే కవితామయం అనే స్థాయిలో సాహిత్యం స్థిరపడిపోతుంది. సాహిత్యం ఏ ప్రక్రియలో ఉన్నా, ఏ రూపంలో ఉన్నా సాహిత్యం యొక్క పరమావధి సమాజ శ్రేయస్సు అనేది సర్వ విదితమే. అలాంటి కమనీయ కవితా రచనలతో వాసికెక్కిన రచయితల్లో మాడభూషి సంపత్ కుమార్ సుప్రసిద్ధులు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషావేత్త, తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సుస్థిర పరుచుకున్న సాహితీవేత్త మాడభూషి సంపత్ కుమార్. గాఢమైన విమర్శతో పాటు హాస్య, వ్యంగ్య రచనల్లో చేయి తిరిగిన రచయిత. వీరి కలం నుండి పుంఖాను పుంఖలుగా అనేక కవితా సంపుటాలు వెలువడ్డాయి. వాటిలో 'మూడో మనిషి కవితా సంపుటి' ఒకటి. ఈ సంపుటిలో మానవత్వం గుబాళించే కొన్ని కవితలను విశ్లేషించడమే నా వ్యాసం ప్రధాన ఉద్దేశం

ఆకురాలిన కాలం :

నవ మాసాలు మోసి జన్మనిచ్చే తల్లి తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. అలాంటి తల్లి వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతుందని ఈ కవితలో ఇలా అంటారు.

'అమ్మ ఆకులా రాలిపోయింది
పండీ పండకముందే
నిండా పండకముందే / ఎన్ని గాలుల్ని
ఎన్ని తుఫానుల్ని / తట్టుకొని నిలబడినట్టే
కాలాన్ని ఎదిరించి నిలబడుతుందనుకొన్నాం
కానీ అమ్మ పండుటాకులా రాలిపోయింది!
క్రమశిక్షణను పెంచి పోషించిన అమ్మ
కాలుడి అక్రమానికి గురైనప్పుడు
ఒక్కరూ నోరు మెదపలేకపోయారు
ఎవరికి వారు
అమ్మ లేకపోతే
తామే అధినాయకులమనుకున్నారు
ఇప్పుడు అమ్మ లేకపోవడంతో
అందరూ అనాథలే!'

అమ్మ విశిష్టతను కొనియాడడానికి త్రిమూర్తులకు కూడా సాధ్యం కాదు. అమ్మ నిరాదరణకు గురికావడంతో అమ్మ ఆకులాగా రాలిపోతుంది అంటారు కవి. ఇంకా ముదిమి రాక ముందే అంపశయ్యకు చేరువ అవుతుంది. ఆమె జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని కాలాన్ని ఎదిరించి నిలబడిన అమ్మ పండుటాకులా రాలి పోయిందని కవి ఆవేదన వ్యక్తం చేస్తాడు. అమ్మ తన బిడ్డలను క్రమశిక్షణతో పెంచుతుంది. అలాంటి అమ్మ మృత్యువాత పడినప్పుడు ఎవరూ ఆదరించలేదు. అమ్మ లేకపోతే ఎవరికి వారు కథానాయకులుగా మురిసి పోయారు. కానీ అమ్మ లేకపోవడంతో అందరూ అనాథలుగా మారిపోయారని తెలుసుకొని విలపిస్తారని, అమ్మలను ఆదరించాలనే మానవత్వం ప్రతి ఒకరూ కలిగి ఉండాలనే విషయాన్ని ఈ కవిత ద్వారా రచయిత విశదీకరించారు.

తల్లి :

అమ్మకు అవని అంత ఓర్పు ఉంటుందని పెద్దల నానుడి. తన జీవితాన్ని త్యాగం చేసి కంటికి రెప్పలా

బిడ్డలను పోషించుకుంటుంది. అలాంటి తల్లిని చరమాంక దశలో బిడ్డలు ఆదరణ చూపకుండా నిరాదరణకు గురిచేస్తే ఆ తల్లి బాధ ఎలా ఉంటుందో రచయిత ఈ కవిత ద్వారా తెలియజేస్తాడు.

'ఒక తల్లి / పదిమంది పిల్లల్ని
కని పెంచి పోషిస్తుంది!
పది మంది / పిల్లలు
ఒక తల్లిని పోషించలేకపోతున్నారు!
రాను రాను మనుషులు
బలహీనపడిపోతున్నారు!
అందుకే తల్లి / ఇప్పుడు
ఒకే బిడ్డతో సరి పెట్టుకొంటోంది!'

తల్లి తనకు కలిగిన పది మంది బిడ్డలను పంచ ప్రాణాలకంటే అధికంగా పెంచుకుంటుంది. ఏ కష్టం కలగకుండా కంటికి రెప్పలాగా కాపాడుకుంటుంది. అలాంటి తల్లిని ఆ పది మంది పిల్లలు ఒక తల్లిని పోషించ లేక వృద్ధాశ్రమాలో వదులుతున్నారని, అందువలన తల్లి పది మంది పిల్లల్ని కని పెంచడం కంటే ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటుందని రచయిత మాతృహృదయాన్ని హృద్యంగా విశదీకరించటంతో పాటు కన్నతల్లిని కాపాడు కోవాలని మానవతా దృక్పథాన్ని అలవరుచుకోవాలని హితోపదేశమిచ్చారు.

బాధ :

బాధ కలిగినప్పుడు ఈ బాధ పగవాడికి కూడా రాకూడదని చాలా మంది భావిస్తారు. కొంత మంది ఇతరులు బాధ పడుతుంటే ఆనందపడిపోతుంటారు. అలాంటి వాళ్ళ గురించి తెలియజేసేదే ఈ కవిత.

'మన బాధ మందికాదు

అవతలివాడు సాధించాడనే కదా మనం ఏడ్చేది!
మన సంతోషం మందికాదు
అవతలివాడు ఏడుస్తున్నాడనే కదా మన ఆనందం!
ఎంతమంది కన్నీళ్ళుకారిస్తే
నువ్వు అంతగా పన్నీటి స్నానం చెయ్యగలవు!
ఎంతమంది ఏడిస్తే
నీ కళ్ళలో ఆనందబాష్పాలు అంత రాలుతాయి!'

ఎదుటివాడు ఎదో సాధించాడు. నేను సాధించలేక పోయాను అనే పంతం పట్టడం వదిలేసి ఎదుటి వాడు ఎక్కడ బాగుపడిపోతున్నాడోనన్న బాధ అధికంగా కొంత మందికి కలుగుతుంది. అది కొన్ని సందర్భాలల్లో చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. దానికి గల కారణం ఎదుటివాడు ఏడుస్తుండమనే విషయం తెలుస్తుంది. ఇతరులు ఎంత బాధను అనుభవిస్తారో అంత ఆనందాన్ని పొందుతూ కొంత మంది కాలం గడుపుతారని రచయిత ఓర్వలేని తనం గల వాళ్ళ గురించి తెలియజేస్తూ ఇతరుల పట్ల మానవతా విలువలు కలిగి ఉండాలనే విషయాన్ని వ్యక్తంచేశారు.

అభివృద్ధిపథం :

ప్రతి మనిషి ఎదో ఒక రంగంలో అభివృద్ధిని సాధించ డానికి ప్రయత్నం చేసి సఫలికృతులు కావడం సర్వ విదితమే. కానీ కొంతమంది తాను బాగుపడకున్నా పర్వా లేదు ఎదుటివాళ్ళు బాగుపడరాదనే నెపంతో ఉంటారని ఈ కవిత ద్వారా కింది విధంగా తెలియజేస్తాడు.

'కింద ఉంటే
పైవాణ్ణి కాళ్ళు పట్టిలేగేస్తాడు!
పైనుంటే
కిందవాణ్ణి కాళ్ళతో అణగదొక్కేస్తాడు!
వాడు అభివృద్ధిలోకి రావడానికి
అవతలివాడి అంతుచూస్తాడు!
రాత్రికి రాత్రి
భూమ్యాకాశాలను తారుమారు చేస్తానంటాడు
ఆకాశాన్ని సులభంగా కిందికి లాగుతాడు!
మరి భూమిని?'

కొంతమంది పతనావస్తలో ఉంటూ పురోగతిని పొందే వ్యక్తిని కిందికి లాగడానికి ప్రయత్నం చేస్తాడు. అదే వ్యక్తి పై స్థాయిలో ఉన్నట్లయితే కింద ఉన్న వ్యక్తిని పైకి

ఎదగనీయకుండా అణగద్రొక్కడానికి ప్రయత్నిస్తాడు. తాను అభివృద్ధి చెందే క్రమంలో ఎంతమందినైనా తొక్కుకుంటూ వారి అంతుచూస్తాడు. అనుకున్నదే తడువుగా అనుకున్నది సాధిస్తాడు. భూమ్యాకాశాలను తారుమారు చేస్తూ అనుకున్నది సాధించే వరకు పట్టు వదలని విక్రమార్కునిలా అలుపెరుగని పోరాటం చేస్తాడని ఈర్ష్యా జీవుల స్వార్థ బుద్ధిని గురించి రచయిత తెలియజేశాడు.

రైతు :

రైతే రాజు. రైతే దేశానికి వెన్నెముక అనేవి ఒకప్పటి మాటలు. రైత నేడు కష్టాల కడంగడ్లతో జీవితాన్ని గడుపుతున్నాడని రచయిత రైతు దీన స్థితిని ఈ కవిత ద్వారా ఇలా తెలియజేశాడు.

'మట్టిని పిసుక్కుంటూ
ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటూ
ఆవేదన చెందుతూ ఉన్నాడు
కూర్చునే సింహాసనం
ఇప్పుడు ముళ్ళమీద కూర్చున్నట్టుంది
అరుగంటే అతనికి భయం
అరుగు అప్పులవాడికి దఖలుపడ్డ స్థలం
అప్పుతీసుకొన్నరోజే
ఆస్తితో పాటు అరుగు
కూడా వాడికి దఖలైపోయింది
రైతుకు ఇప్పుడు తలదాచుకోవడానికి
కూడా స్థలం లేదు
తల తాకట్టు పెట్టడానికి కూడా మార్గంలేదు
మట్టిని నమ్ముకున్న రైతును
మట్టితల్లి మోసం చేసింది!'

రైతు క్షేమంగా ఉంటే రాజ్యం క్షేమంగా ఉంటుందని పెద్దలు అంటారు. రైతు పొలంలో మట్టిని పిసుకుతూ తన్మయత్వాన్ని పొందుతూ పండబోయే పంటను తలుచుకుంటూ ఆనందానుభూతిని పొందుతాడు. అలాంటి రైతు నేడు గిట్టుబాటు ధర రాక చేసిన అప్పులు తీరక చేతులు పిసుక్కుంటూ వాపోతున్నాడు. పంట పండి ఇంటికి వస్తే ఆనందంతో తాను కూర్చున్న చోటును సింహాసనంగా భావించేవాడు. నేడు పండించిన పంట చేతికి వచ్చినా పంటకోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాక, తెచ్చిన అప్పులు తీరక ముళ్ళ కంచెపై కూచున్నట్లుగా ఉండడంతో శోకాతప్త హృదయుడవుతున్నాడు. తలతాకట్టు పెట్టి అయిన అప్పుతీర్చాలనకునే రైతు ఆశలు ఆడియాశలు అవుతున్నాయి. మట్టిని నమ్ముకుంటే నమ్ముకున్న ఆ మట్టే తనను మోసం చేసిందని తెలుసుకొన్న రైతు భోరున విలపిస్తాడు. దళారులు, వడ్డీ వ్యాపారస్తులు రైతుల పట్ల మానవత్వాన్ని చూపాలని రచయిత తన ఆవేదనను వ్యక్తంచేస్తాడు.

మూడో మనిషి :

మనుష్యులను రెండు లింగాలుగా వ్యవహరిస్తారు. పులింగం, స్త్రీలింగం, వీరితోనే సృష్టి కొనసాగుతుంది. జన్యు లోపం కారణంగా ఆడ, మగ గాకుండా పుట్టిన వారే మూడో మనిషి. వీరిని సమాజం చిన్న చూపు చూస్తుందని వారి దుస్థితిని తెలియజేయడమే ఈ కవిత ప్రధాన ఉద్ధేశం.

'రెండో మనిషిని గురించి
ఆలోచించే తీరిక లేని మనిషికి
మూడో మనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది
ఆడా మగా చేసిన తప్పుకు
ఆడామగా కాకుండా పోయాడు!
ఎవరిది తప్పు
ఎవరికి శిక్ష!
మూడో మనిషిని
మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని
ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి!'

ఎవరికి వారు వాళ్ళ పనులలో మునిగిపోవడం, ఇతరుల గురించి పట్టించుకొనే తీరిక లేనంతగా ఉన్న

ప్పుడు మగ వాళ్ళు ఆడవాళ్ళను, ఆడవాళ్ళు మగ వాళ్ళను పట్టించుకోకుండా ఎవరికి వారు యాంత్రిక జీవితాన్ని గడుపుతూ, స్వార్థంతో జీవిస్తూ రెండవ మనిషి గురించి పట్టించుకొనప్పుడు ఇక మూడో మనిషి గురించి ఎందుకు పట్టించుకుంటారు. వారు దైన్య స్థితిని ఎవరూ అర్థం చేసుకోరని మనుష్యుల స్వభావాన్ని రచయిత తెలిపారు. ఆడ, మగ ఇద్దరూ కలిసి చేసిన తప్పుకు ఆడా, మగా గాకుండా పుట్టిన మూడో మనిషికి ఎవరు విధించిన శిక్ష, ఎవరు చేసిన తప్పు ఇది అని రచయిత సమాజానికి సవాలు విసురుతాడు. మూడో మనిషిని మనిషిగా గుర్తించడానికి వారికి గల అంగవైకల్యాన్ని ఆదరించడానికి మనుషులలో మనోవైకల్యం అనగా దుష్ట బుద్ధి అంతరించాలని సాటి మనిషిని మానవత్వంతో ఆదరించాలని రచయిత ఈ కవిత ద్వారా మానవ స్వభావాన్ని విపులీకరించారు.

పక్కా ఇళ్ళు :

ప్రభుత్వం పేదలకు పక్కా ఇల్లు మంజూరు చేస్తుంది. ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయంతో ఆ ఇల్లు నిర్మాణానికి స్థలం కేటాయింపు ఎలా ఉంటుందో ఈ కవితలో రచయిత ఇలా తెలియజేస్తాడు.

'పక్కాఇళ్ళు తప్ప
పక్కనే ఇళ్ళు కట్టలేకపోయారు
అంటరాని విషయంలో
అంటీముట్టనట్టున్నారు!'

ప్రభుత్వం పేదలను ఆదుకోవడానికి వారికి పక్కాఇల్లు మంజూరు చేస్తుంది. ఆ ఇల్లు కట్టుకోవడానికి స్థలాన్ని ధనికులు నివసించే ప్రాంతాలకు దూరంగా కేటాయిస్తుంది. ప్రభుత్వం కూడా పరోక్షంగా అంటరానితనాన్ని పెంచిపోషిస్తుందనే భావన ఈ కవితలో ద్యోతకమవుతుంది. కులనిర్మూలనుకు దోహదపడాల్సిన ప్రభుత్వాలే అంటరానితనం విషయంలో అంటీ అంటనట్లు ఉంటూ ఉదాసీనత వైఖరిని కలిగి ఉండరాదని మానత్వంతో మసులుకోవాలని ఈ కవిత ద్వారా రచయిత తన అభిప్రాయాన్ని తెలిపారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు ప్రయోగాలు - ఆచార్య సి.నారాయణరెడ్డి
2. సాహిత్యంలో చర్చనీయాశాలు - ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం
3. తెలుగు కవితా వికాసం - రామ్మోహన్ రాయ్
4. మూడో మనిషి కవితా సంపుటి - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

తమిళదేశమందు తెలుగు తల్లికి మేలి
గుడులు కట్టి నుడులు కొల్లగొట్టి
మాతృభాష దివ్యమహిమను కాపాడు
మానవోత్తముడవు మాడభూషి!

– ఎన్.ఆర్.తపస్వి

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శత్రువుతో ప్రయాణం' - తెలుగు కవుల కవితా వైశిష్ట్యం

- డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, చిత్తూరు జిల్లా.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి కవితా సంపుటి "శత్రువుతో ప్రయాణం" లో తెలుగు వెలుగులు అనేది ఒక కవితాఖండిక. తెలుగుకు వెలుగులు విర జిమ్మిన సాహితీ మూర్తుల గొప్పతనాన్ని కీర్తిస్తూ వారు తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన కృషిని వివరిస్తూ కవితాత్మకంగా ఈ కవితా ఖండికను రాశారు. ఈ కవితా ఖండిక చదువుతుంటే ఎంతో సంతోషం కలిగింది. నాకే కాదు తెలుగువారెవరికైనా ఈ కవితా ఖండిక చదివితే తప్పక మనసు ఆనందంతో ఉప్పొంగిపోతుంది.

తెలుగు సాహిత్యంలో నన్నయ ఆదికవిగా ప్రసిద్ధుడు. 11 శతాబ్దం నుండే తెలుగులో సాహిత్యం లభిస్తున్నది. అయితే ఈ విషయంలో పండితలోకంలో కొందరిలో భిన్నాభిప్రాయాలున్నాయి. నన్నయకు పూర్వమే తెలుగు భాష ఉంది. ఆమాటకొస్తే హాలుని గాథాసప్తశతిలో కూడా తెలుగు పదాలున్నాయి. 11 శతాబ్దానికి పూర్వమే అనేక తెలుగు శాసనాలు కూడా లభిస్తున్నాయి. కావున నన్నయకు పూర్వం తెలుగుభాష ఉంది. కానీ తెలుగులో గ్రంథాలు లభించుట లేదు. కావున తెలుగులో నన్నయ గారే ఆదికవి. వారు ప్రారంభించిన "ఆంధ్ర మహా భారతం" తెలుగులో ఆదికావ్యం. నన్నయ వంటి మహా నీయుడు ఆదికవి కావడం తెలుగువారి అదృష్టం. అయితే ఒక రకంగా ఆదికవి విషయం 'తెలుగు ప్రాచీన భాష' హోదా సాధనలో కొంత ఇబ్బందిని కూడా కలిగించింది. మన సోదర భాషల వారు ఈ ఆదికవి, 11 శతాబ్దం విషయాలను చూపి తెలుగు అంత ప్రాచీన భాష కాదని న్యాయస్థానంలలో ప్రాచీనహోదాకు అడ్డంకులు కలి పించిన విషయం తెలుగువారందరికీ తెలిసిన విషయమే. ఏదిఏమైనా తెలుగు ప్రాచీన భాషగా గుర్తించబడింది. ఇది తెలుగువారందరికీ గర్వకారణం.

ఆదికవిగా తెలుగువారందరికీ సుపరిచితుడైన నన్నయను కీర్తిస్తూ రాసిన మొట్టమొదటి కవితను చూద్దాం-

"మబ్బుచాటునున్న
తెలుగు సొబగులకు
మల్లెవాసనలు జోడించి
తెలుగు సాహితీ తేనెలొలికించాడు నన్నయ!"

(శత్రువుతో ప్రయాణం,పుట.22)

అప్పటికీ తెలుగు భాష ఉంది. కాకుంటే అది మబ్బుల వెనుక ఉండిపోవడంతో కనిపించడం లేదు. అటువంటి ఆ తెలుగు భాషకు సౌందర్యాన్ని రంగరించి, కావ్య గౌరవాన్ని కల్పించి, మాధుర్యభరితంగా తీర్చిదిద్ది మబ్బుల మాటున దాగి ఉన్న తెలుగు వెలుగులు విరజిమ్మేలా చేసిన ఘనత నన్నయగారిదే. అటువంటి నన్నయగారిని కీర్తిస్తూ రాసిన ఈ కవిత ప్రశంసనీయం.

నన్నయ తర్వాత ఒక శతాబ్దంపాటు నన్నయ రాయగా మిగిలిన భారతాన్ని రాయడానికి ఎవరూ పూనుకోలేదు. అయితే ఆ కాలంలో తెలుగులో సాహిత్య సృజన జరగ లేదా అంటే జరిగింది. కానీ ఆ సాహిత్యమంతా కూడా మతపరమైన సాహిత్యమే. ఆ కాలంలో దక్షిణదేశంలో శైవ, వైష్ణవ మత భేదాలు ఉండేవి. అందువలన ఆ కాలంలో తెలుగులో ఎక్కువగా శైవ కావ్యాలు వెలు వడ్డాయి. పాల్కురికి సోమనాథుడు, నన్నెచోడుడు, మల్లి కార్జున పండితుడు వంటి కవులు ఆనాడు కావ్యాలు రచించారు. వీరిలో పాల్కురికి సోమనాథుడు తెలుగు భాషా, సాహిత్యాలకు చేసిన సేవను కీర్తిస్తూ రాసిన కవిత.

"దేశికవితకు పటంకట్టి
ద్విపదలోన కవితకట్టి

తెలుగుభాషకు వెలుగు
చూపినవాడు పాల్కురికి సోమన!"

(శత్రువుతో ప్రయాణం,పుట.22)

నాడు జనవ్యవహారంలో ఉన్న తెలుగుభాషలో కావ్యరచన చేయడమే కాదు. 'ద్విపద' అను ఒక కొత్త ప్రక్రియకు రూపకర్తయై తెలుగు వెలుగులు విరజిమ్మేలా తన రచనా చాతుర్యాన్ని ప్రదర్శించిన గొప్పకవి పాల్కురికి సోమనాథున్ని రచయిత ఈ కవితలో స్తుతించాడు.

11వ శతాబ్దంలో నన్నయ రెండున్నర పర్వాలు భారతాన్ని అనువదించి వదిలి పెట్టిన తర్వాత చాలా కాలం వరకు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. 13వ శతాబ్దంలో తిక్కన భారత రచనకు పూనుకున్నాడు. తిక్కన పేరు చెప్పగానే గుర్తుకువచ్చేది నాటకీయత. "ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ", 'మహాకవిత్వ దీక్షావిధి నొంది' తెలుగులో భారతాన్ని రసమయ కావ్యంగా తీర్చిదిద్దాడు. తిక్కన కాలానికి తెలుగునాట శైవ, వైష్ణవ మత వైషమ్యాలు ఎక్కువగా ఉండేవి. అటువంటి సందర్భంలో రెండు మతాల మధ్య సామరస్యాన్ని సాధించుటకు గాను 'హరిహరనాథ' తత్వాన్ని ప్రవేశపెట్టి, విష్ణురూపాయ నమ:శ్శివాయ అని అనగలిగిన గొప్ప ఉదాత్తుడు. మహా కవి తిక్కన. తేట తెలుగు పదాలు వాడడంలోను, అల్పా క్షరాలలో అనల్పార్థ రచన చేయుటలో గొప్ప నేర్పరి తిక్కన. ఇలా మహాభారతం 15 పర్వాలు తెలుగు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుడు తిక్కన. అటువంటి తిక్కనను కీర్తిస్తూ రాసిన కవితను చూడండి.

"ఇంపు సొంపైన తెలుగులో
భారత, రామాయణాలు వెలార్చి
తేట తెలుగుకు వెలుగులు
తెచ్చినవాడు తిక్కన!"

(శత్రువుతో ప్రయాణం,పుట.22)

తెలుగులో రామాయణ, భారతాలను రెండింటినీ రాసిన మొదటి కవి తిక్కన. వీరి మొదట రచన నిర్వచనోత్తర రామాయణము తర్వాత 15 పర్వాల భారతాన్ని రాశాడు. ఈ రెండు రచనలు కూడా ఇంపైన తెలుగు భాషలో రాసి తెలుగు సాహిత్యానికి వెలుగులు తెచ్చాడని రచయిత కీర్తించాడు. తిక్కన వీటితోపాటు విజయ సేనము, కృష్ణశతకము అనే రచనలు కూడా చేశాడని చెబుతారు. కానీ అవి అలభ్యములు.

తిక్కన గారిని రామరాజభూషణుడు ఆదిశేషునితో సమానంగా ప్రశంసించాడు.

"మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్,
గుండలీంద్రుడుద"

బహుముఖ ప్రజ్ఞకు ఆదిశేషుడు ప్రతీక. కుండలీంద్రుడంటే ఆదిశేషుడని, సోమయాజి అని అర్థాలు. విశ్వనాథవారు 'తిక్కనగారి శేషత్వ'మనే వ్యాసంలో తిక్కనను ఆదిశేషునితో పోలుస్తూ "ఈ సర్వ మహా ప్రపంచకమును ఆదిశేషుడు తన వేయి శిరసులమీద నెట్లు ధరించెనో, పడిపోకుండ నెట్లు పట్టుకొనుచున్నాడో, ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమును తిక్కన అట్లు ధరించియున్నాడని అర్థము. ఆదిశేషువు ఈ భూమిని తన సహస్రఫణా మండలమున ధరించుచున్నాడని పౌరాణికోక్తి! తిక్కన గారు కుండలీంద్రుడు. కుండలములు ధరించినవాడు కుండలీంద్రుడు. యజ్ఞయాగాదులను చేసిన సోమయాజులు కుండలములు ధరింతురు. తిక్కన సోమయాజిని, రామరాజ భూషణుడు అందుచేత కుండలీంద్రుడన్నాడు" (అన్న మయ్య బహుముఖ ప్రాభవం - డాక్టర్ ముదివేడు ప్రభాకరరావు, పీఠిక, పుట.36) అని రాశారు.

15వ శతాబ్దంలో కావ్యయుగకర్తగా ప్రసిద్ధిగాంచిన గొప్పకవి శ్రీనాథుడు. ఈయన కవి పండిత వంశంలో జన్మించాడు. తాత కమలనాభామాత్యుడు. తండ్రి మారయామాత్యుడు తల్లి భీమాంబిక. మరుత్తరాట్చరిత్ర, శాలివాహనసప్తశతి, శృంగారనైషధము, భీమేశ్వర పురాణము, పల్నాటివీరచరిత్ర, హరవిలాసము, కాశీ ఖండము వంటి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. శ్రీనాథుడంటే సీసం, సీసమంటే

శ్రీనాథుడు అన్నట్లుగా సాహిత్యంలో సీస పద్యానికి ఒక ప్రత్యేకస్థానాన్ని చూపినాడు. సమకాలీన సమాజంలోని విషయాలు ఆయన చాటువుల్లో ప్రతిబింబించాయి. శ్రీనాథుని కీర్తిని 'తెలుగు వెలుగులు'లో రచయిత ఇలా కీర్తించాడు.

"దేశదేశాలు తిరిగి
తెలుగు కంచుగంటను మోగించి
తెలుగువారి వీరచరితకు
కనకాభిషేకం చేయించాడు శ్రీనాథ కవిసార్వ భౌముడు!"

(శత్రువుతో ప్రయాణం,పుట.22)

అనేక దేశాలు తిరిగి సాహితీ చర్చల్లో ఎందరో కవులను వాదాల్లో ఓడించి తెలుగు కీర్తిని ఎందరో చాటాడు. ప్రౌఢ దేవరాయల ఆస్థానంలో గౌఢడిండిమ భట్టును వాదంలో ఓడించి ఆయన కంచుడక్కను పగులగొట్టించి కనకాభిషేకం చేయించుకున్న కవి సార్వభౌముడు శ్రీనాథుడని కీర్తించాడు. చివరి శ్వాసలో కూడా శ్రీనాథుడు ధైర్యాన్ని చూపిన ప్రతిభాశాలి.

"దివిజకవివరు గుండెయల్ దిగ్గు రనగ
నరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి"

అని ప్రకటించుకున్నాడు. సంస్కృతంలో వ్యాసమహర్షి విరచిత భాగవతాన్ని తెలుగులో అందించిన మహనీయులు పోతన గారు. 'పోతన తెలుగుల పుణ్యపేటి'గా ప్రసిద్ధిగాంచారు. పోతనగారు ఓరుగల్లు ప్రాంతవాసి. తండ్రి కేసన, తల్లి లక్కమాంబ. వీరభద్ర విజయము, భోగినీదండకము, నారాయణ శతకము, ఆంధ్ర మహా భాగవతము వీరి రచనలు. 'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ పురాణావళిన్' నన్నయ, తిక్కన మొదలైన కవులు భాగవతాన్ని తెలుగుచేయక పోవడం నాపాలిట మహద్భాగ్యం అని ప్రకటించుకున్న భక్తకవి పోతన. ''పలికించువిభుండు రామభద్రుండుట'' తన చేత భాగవతాన్ని పలికిస్తున్నది సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రుడేనని చెప్పి తన వినమ్రతను చాటుకున్నాడు. కావ్యాన్ని నరాంకితం చేయనని ప్రకటించి భగవంతునికి అంకితం చేస్తానని చెప్పిన గొప్ప భక్తితత్పరుడు పోతనగారు.

అటువంటి పోతన గారి గురించి రచయిత.

"మందార మకరందంలో
ముంచెత్తి తెలుగు పలుకులకు
మాధుర్యం తెచ్చాడు, భాగవతానికి
వెలుగులు ఇచ్చాడు పోతన!"

(శత్రువుతో ప్రయాణం,పుట.22)

మృదు మధురమైన పదాలతో పోతన భాగవత రచన చేసి తెలుగు పలుకులకు మాధుర్యం తేవడమే కాదు భాగవతానికి కూడా వెలుగులు తీసుకొచ్చారు పోతనగారని కీర్తించారు.

16వ శతాబ్దంలో తెలుగులో గొప్పకవిగా, అగ్రగణ్యుడుగా పేరుగాంచిన వారు అల్లసాని పెద్దనగారు. కడప జిల్లాలోని కోకటగ్రామం వీరి జన్మస్థలం. గురువు శఠగోపయతి. వీరు రచించిన 'మనుచరిత్ర' తెలుగులో తొలి ప్రబంధంగా విరాజిల్లుతున్నది. దీనికే స్వారోచిష మనుసంభవం అనికూడా పేరుగలదు. వీరి మరో రచన హరికథాసారము ఇది అలభ్యం. శ్రీకృష్ణదేవరాయల చేత గండపెండేరాన్ని తొడిగించుకున్న ప్రతిభామూర్తి అల్లసాని పెద్దనగారు. కావ్యం రాయడమంటే మాటలు కాదు. కావ్యరచనకు ఏమి కావాలో 'నిరుపహతి స్థలంబు....' అనే పద్యంలో స్పష్టం చేశారు. పెద్దన బోలు పండితులు పృథ్వినిలేరని నీవెరుంగవే' అన్న మాటలలో గల వారి ఆత్మవిశ్వాసం తెలుస్తున్నది.

"అష్టదిగ్గజాలలో అగ్రగణ్యుడు
ఆంధ్రభోజునికి ఆప్తుడు
జిగిబిగితో రమణీయ కవితలల్లినవాడు
ఆంధ్రకవితాపితామహుడల్లసాని పెద్దన!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23)

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో గల అష్టదిగ్గజ కవులలో అగ్రగణ్యుడు, ఆంధ్రభోజుని కీర్తిగాంచిన

శ్రీకృష్ణదేవరాయలకు అత్యంత ఆత్మీయుడు, రమణీయంగా కవిత్వం చెప్పినవాడు, ఆంధ్రకవితా పితామహ బిరుదాన్ని పొందిన వాడు అల్లసాని పెద్దన గారని కీర్తించారు.

16వ శతాబ్దానికి ప్రబంధయుగము అనేకాక రాయల యుగమని కూడా పేరు. ఆ రాయలే విజయనగర సామ్రాజ్యధీశుడు శ్రీకృష్ణదేవరాయలు. వీరు తుళువ వంశీయులు. వీరి తండ్రి నరసనాయకుడు తల్లి నాగాంబ. తిరుమలదేవి, చిన్నాదేవి వీరి భార్యలు. వీరి కాలం తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగం. వీరు సంగీత, సాహిత్య చర్చలో నిర్వహించడానికి 'భువన విజయం' పేరుతో సభామండపాన్ని నిర్మించారు. అష్టదిగ్గజ కవులను పోషించి వారి ద్వారా అనేక రచనలు వెలువరింపజేసి తెలుగు సాహిత్యం సుసంపన్నం కావడానికి కారకు లయ్యారు. ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు, మూరురాయరగండ అను బిరుదులు వీరికి కలవు. రాయలవారు తెలుగు, సంస్కృత భాషలలో గొప్ప పండితులు. వీరు తెలుగులో 'ఆముక్తమాల్యద' అను ప్రబంధాన్ని రచించారు. దీనికి 'విష్ణుచిత్తీయము' అని మరోపేరు కలదు.

రాయల వారి గురించి రచయిత

"దేశభాషలందు తెలుగు లెస్సని
చాటిన కవిచక్రవర్తి కృష్ణరాయలు
అష్టదిగ్గజాలతో వెలిగించినాడు
తెలుగు కీర్తి దిగంతాలలోన!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23)

రాయల వారిని కవిచక్రవర్తిగా కీర్తిస్తూ, తెలుగు దేశభాషలన్నింటిలోకి గొప్పది, ఉన్నతమైనదని చాటడమే కాదు అష్టదిగ్గజాల ద్వారా తెలుగు కీర్తిని దిగంతాల వరకు వ్యాపింపజేసిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలని కీర్తించాడు.

వేమన గొప్ప ప్రజాకవి, సంఘసంస్కర్త. సమాజంలోని ఉన్న అనేక దురాచారాలను వ్యతిరేకిం చాడు. కర్మ కాండలు, లోభితనం, కులతత్వం, లింగధారణ వంటివి అందులో కొన్ని వేమన కాలం, ప్రాంతం, కులం, పద్యాల సంఖ్య వంటి విషయాల్లో పండితుల్లో ఏకాభిప్రాయం లేదు.

వేమన గారి గురించి రచయిత

"ఆటవెలదిని ఈటెగా
చేపట్టినాడు / కుళ్ళిన సంఘాన్ని కూలదోసి
విశ్వదాభిరాముడై వెలిగినాడు!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23)

అనేక మూఢాచారాలతో, దురాచారాలతో కుళ్ళి పోయిన సంఘాన్ని సంస్కరించడానికి 'ఆటవెలది' ఛందస్సును బాణంగా ఉపయోగించి అభ్యుదయాన్ని కాంక్షిస్తూ ఆంధ్రలోకంలో వెలిగారని కీర్తించారు.

తెలుగులో రామాయణాన్ని రచించిన మొట్ట మొదటి కవయిత్రి మొల్ల. ఈమె రచించిన రామాయణం పేరు 'మొల్ల రామాయణం'. ఈమె కాలం 15వ శతాబ్దం. జన్మస్థలం గోపవరం. తండ్రి కేసన. ఈమె తన కావ్యాన్ని శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చింది.

కవయిత్రి మొల్ల గూర్చి రచయిత

"తెలుగు పద్యానికి తెచ్చింది వన్నె
రామాయణ కావ్యం రాసి
కవితా సేద్యంలో మల్లెలు
పూయించిన కవయత్రి మొల్ల!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23) అని కీర్తించారు.

ఆధునిక కాలంలో సాహిత్యాన్ని సంఘ సంస్కరణకు ఆయుధంగా ఉపయోగించుకున్న గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుగారు. వీరు నవయుగ వైతాళికులు. వీరు రచించిన 'రాజశేఖర చరిత్రము' తెలుగులో తొలి నవల. కవులచరిత్రను 'ఆంధ్రకవుల చరిత్రము' పేరుతో గ్రంథస్థం చేశారు. సంఘసంస్కరణ కోసం వివేక వర్ధిని, హాస్యసంజీవని, సతీహిత బోధిని వంటి

పత్రికలు నడిపారు. అనేక ప్రక్రియలకు ఆద్యుడు. గద్యతిక్కన, రావ్‌బహదూర్, దక్షిణదేశ విద్యాసాగరుడు అను బిరుదులు కలవు.

కందుకూరి వారి గురించి రచయిత

"సంఘ సంస్కరణే
సాహిత్యలక్ష్యమని చాటినాడు
కందుకూరి వీరేశలింగం
తెలుగులో అనేకప్రక్రియలకు
శ్రీకారం చుట్టినాడు!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23)

సాహిత్య లక్ష్యం సంఘ సంస్కరణ అని చాటడమే కాదు తెలుగు సాహిత్యంలో అనేక రకాల ప్రక్రియలైన నవల, వ్యాసరచన, స్వీయచరిత్ర, జీవితచరిత్రలు, ప్రహసనాలు వంటి వాటికి శ్రీకారం చుట్టారని కీర్తించారు.

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యానికి సరికొత్త మార్గం చూపిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పా రావు. వీరు రాసిన 'దిద్దుబాటు' కథానిక తెలుగులో మొట్ట మొదటిది. వీరి 'కన్యాశుల్కం' నాటకం సమకాలీన సామా జిక సమస్యలను వస్తువుగా తీసుకొని రచించిన నాటకం. వీరు ఇంకా ముత్యాలసరాలు, నీలగిరిపాటలు, సారంగ ధర వంటి రచనలు చేశారు. వీరి దేశభక్తి గేయం విశ్వ మానవ ప్రేమను కోరుతుంది. తెలుగు సాహిత్యాన్ని సరి కొత్త మలుపు తిప్పిన యుగకర్త గురజాడ. అటువంటి గురజాడ వారి గురించి రచయిత-

"పాతకొత్తల మేలు కలయికతో
కొమ్మెరుంగులు చిమ్మినాడు
తెలుగు తల్లి మెడలో
ముత్యాల సరాలు తొడిగి
అడుగుజాడగా నిలిచినాడు గురజాడ!"

(శత్రువుతో ప్రయాణం,పుట.23)

తెలుగు సాహిత్యానికి ప్రాచీన, ఆధునిక సాహిత్యాల కలయికతో కొత్త మెరుగులు దిద్దడమే కాదు వారి ముత్యాల సరాలు తెలుగుతల్లి మెడలో హారంలాగా తొడిగాడని ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒక మార దర్శిగా గురజాడ నిలిచాడని కీర్తించాడు.

ఇంకా ఈ కవితలో తెలుగు సాహిత్యాన్ని తమ రచనల ద్వారా పరిపుష్టం చేసిన రాయప్రోలు సుబ్బారావు, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా వంటి ఎందరో కవుల్ని, వారి సాహితీ కృషిని శ్లాఘించారు.

ఆధార గ్రంథాలు :

1. శత్రువుతో ప్రయాణం - ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్
2. తెలుగు సాహిత్య సమీక్ష-2 సంపుటాలు - ఆచార్య జి.నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వానా శాస్త్రి
4. అన్నమయ్య బహుముఖ ప్రాభవం (సం) - ఆచార్య చిట్రాజు గోవిందరాజు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వెల్లివిరిసిన మానవత్వం మాడభూషి కవిత్వం

- డాక్టర్ కప్పగంతుల సుధసూధన్, ప్రాచార్యులు, శ్రీసాధన డిగ్రీ కళాశాల, , మార్కాపురం, ప్రకాశం జిల్లా.

ఒక భయంకర మానసిక సంఘర్షణే కవిత్వం పెల్లు బకడానికి కారణం అంటారు విమర్శకులు. లోకంపట్ల సానుభూతి చూపడం వేరు, లోకానుభవాన్ని స్వాను భూతితో ఆవిష్కరించడం వేరు అని కవి మనసు కనలి నప్పుడు, ఊహలు, ఆలోచనలు, అభిప్రాయాలు, అనేక ప్రశ్నలు సంధిస్తూ అద్దంలా ముందు నిలబడితే అవి డాక్టర్ మాడభూషి కవిత్వంలా ఉంటాయని నా అభి ప్రాయం. మట్టి నుంచి, మనుషుల నుంచి, మమతాను రాగాల నుంచి, యథార్థ సంఘటనలనుంచి, ద్వంద్వ నీతులనుంచి, రీతులనుంచి, కుయుక్తులనుంచి, కుట్రల నుంచి అసలైనలోక వర్తననుంచి వచ్చే కవిత్వమే యిప్పుడు అవసరం. సమస్యలతో సతమతమౌతున్న ఈ రోజుల్లో కవిత్వం అంటే అషామాషీకాదు. ''అక్షరాలకు తడి, వెలుగు, వేడి వుండాలి. చదివించే లక్షణం వుండాలి. చైతన్యవంతమైన ఆలోచనలిచ్చే లక్ష్యం వుండాలి'' అంటారు నవ్యసాహిత్య వివేచకులు కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి. అందులోనూ వ్యథార్థ గాధలను చెప్పడంలో 'శిల్పం' ఒక అసాధారణ ప్రజ్ఞ. ఒక్క ఉదాహరణ చెప్పాలిక్కడ.

"కుక్కపిల్ల మొరిగింది
విశ్వాసం అడుగునుంచి ఉప్పొంగడంతో
ఛీ పాడుకుక్క
నిద్ర చెరిపేసిందని తరిమేస్తే
మళ్ళీ మొరిగింది
యజమాని ఉప్పుతిన్నామన్న విశ్వాసంతో
తన్నితగలేసినా
తలవంచుకుని పనిచేసేపాలేరులా"

కాస్త విరామం తీసుకొని మళ్ళీ ప్రారంభించండి.

"నన్నే ఎదిరిస్తావా
అనికోపంతో కాళ్ళిరగదన్నాడు"

యజమాని కదా! తన్నింది. అంతే! వాడికి కొన్ని ప్రత్యేకహక్కులు, కొమ్ములు ఉంటాయి. విశ్వాసజీవుల పైనే వీళ్ళ ప్రతాపాలు, ప్రకోపాలు. మాడభూషివారు యిక్కడదాకా కవితను నడిపించిన విధం ఒక యెత్తయితే

"ఉదయాన్నే బార్లతెరిచిన
తలుపుదగ్గర
కుప్పగూలిన కుక్కపిల్ల
జమిందారీ తుపాకీ గుండుకు
ఎరయిన పాలేరులా"

యిది - ముగింపు. చదవగానే ఎన్నో ఆలోచనలు మస్తిష్కంనిండా ఆవరిస్తాయి. దృష్టాంతాలు మొదలవు తాయి. సంఘ చరిత్ర మొత్తాన్ని సూక్ష్మంగా, ఒకింత సూటిగా చెప్పిన విధానం మనసును కదిలిస్తుంది. విభిన్న అంశాలపై కవిత్వం రాసినప్పటికీ అంత:సూత్రంగా మాడ భూషివారి ప్రతీ మాటలోనూ మానవత్వం వెల్లి విరుస్తుంది.

"ఎగసి ఎగసి పడుతున్న
నారక్తపు కెరటాలు
ఎన్నిసార్లు ఒడ్డుదాటలేక
వెనక్కి వెళపోయాయో"

అంటూ కవిత్వాన్ని ఆవాహనచేసిన మాడభూషి తనలో నిద్రిస్తున్న ఆవేశాన్ని కుప్పబోస్తారు. నవ్యకవుల తత్వాలు, వ్యక్తిత్వాలు, కవిత్వాలు - వాటి అవసరాలు, అందలాలు, వీటన్నింటి నడుమ కవిత్వ స్థితి, కొత్తతరం కలంయోధుల అపరిపక్వ ఆలోచనలు వంటివి మాడభూషి 'కవి'లో ధ్వని స్తాయి. వ్యంగ్యం, ప్రతీకలు, వాస్తవికతలతో గూడిన విసుర్లు వీరి కవిత్వంలో చాలా వాడిగా పాఠకులను తాకు తాయి.

"వ్యక్తిత్వాన్ని నిలదీస్తే
నాడుచ్ఛ్వాస నిశ్వాసమైన

నీపైన కూడా విశ్వాసం ఉంచలేను"

అంటారు. సాహిత్యం పట్ల, కవిత్వం పట్ల మాడభూషి వారికి మక్కువ. ఆరాధ్యభావం. శబ్దార్థాలలాగా వారి వ్యక్తిత్వానికి, కవిత్వానికి అవిభాజ్యబంధం. తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలన్నీ కవిత్వమే అంటారాయన. నన్నయ్య మొదలుగా ప్రతికవీ తన కవితా లక్ష్యాలను ప్రకటించుకోవడం, కవిత్వం పట్ల తన వైఖరిని వివరించడం గమనిస్తుంటాం కదా! అలాగే తన కవితా దృక్పథాన్ని కూడా మాడభూషి వారు ప్రకటించుకున్నారు.

"కవిత్వంలో
మడికాదు
తడి ఉండాలి"
"కవిత్వంతో
అందలం ఎక్కడంకాదు
అందరినీ ఎక్కించాలి"

అంటారాయన. మానవత్వం, కరుణ, ఆర్ద్రతలు లేకుండా పేర్చుకుంటూపోయే పదాలపై మాడభూషి వారిది నిరసనభావం. పదుగురి జీవితాలను సరిచేసి, వారి ఉన్నతికి పాటుపడే ప్రగతిశీల కవిత్వాన్ని ఆయన ఉపాశిస్తారు. మానవ జీవితంలోని పవిత్రత, బుద్ధివైశిష్ట్యం వంటి విషయాలన్నీ విశ్వప్రేమ తత్త్వంగా వీరి కవిత్వంలో ధ్వనిస్తాయి.

"గుండె నిండా గాలిపీల్చి వదిలితే
వెదజల్లేది ప్రేమపరిమళాలే"

అంటారు డాక్టర్ మాడభూషి. అమ్మను గురించి చెప్పని కవి యేభాషలోనూ ఉండరేమో. ఎవరు చెప్పినా, ఎన్నివిధాల చెప్పినా అమ్మ గురించి చెప్పడం ఎప్పటి కప్పుడు కొత్తగానే ఉంటుంది. ఆనందంగా ఉంటుంది. పేగుబంధం గుండెతీగను మీటుతుంది. సంపత్ కుమార్ గారు అమ్మ కష్టాన్ని చెప్పేందుకు ఎన్నో ప్రతీకలు వాడారు. అందులో ప్రతిదీ అమ్మ తత్త్వానికి సంకేతమే. అవన్నీ ఒకయెత్తయితే ఒకదశలో

"అమ్మ నిద్ర పోతుంటే
అప్పుడే కరెంటుపోయి ఆగిన యంత్రంలా కనుపిస్తుంది"

అనడం ఒక మంచి అభివ్యక్తి. "అమ్మ మరణించిన తరువాత అమ్మగానే పుడుతుంది" అనే ముగింపులోని అన్వయం అమ్మపట్ల కవికి గల భక్తి పరాకాష్టకు తార్కాణం. మనసులలోని కర్కశత్వాన్ని దునుమాడి, సున్నిత పరిస్తే మనిషి మనిషిగా వికసిస్తాడని మాడభూషివారి నమ్మకం. ఈవొరవడిలో తను నమ్మిన సిద్ధాంతాన్ని ప్రవచించే రచనలు అధిక సంఖ్యలోనే చేసారు. వీరు తొలిదశలో పాత్రికేయులుగా తర్వాత దశలో ఆచార్యులుగా పని చేయడం లోకపరిశీలన దారుల్ని విస్తృతం చేయడానికి దోహద పడియుండొచ్చు. మానవ సహజమైన అవకాశ వాద ధోరణుల్ని, ఆశావహ పోకడల్ని, గర్వాలను, అహంకారాలను, అలాగే బేలతనాన్ని భయాన్ని సునిశితంగా అధ్యయనం చేసారు. నవీనకాలంలో మరింతగా విజృంభిస్తున్న పాశవికత పట్ల ఆక్రోశం చెందారు. కంచే చేనుమేసే కసాయి ధోరణి మారాలని, మనిషికి మానవతా స్పృహ చేకూరాలని ఆకాంక్షించారు. కన్నబిడ్డల్నే కామించే తండ్రులను, వాస్తవాలను, తలచుకుంటూ

"మగాడినయినందుకు
తలవంచుకొంటున్నా
తండ్రినయినందుకు
సిగ్గుపడుతున్నా"

అంటారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "విపరీతం జరక్కముందే, జనం నాడుల్లోకి విషం పాకకముందే విరుగుడు మందు వాడాలి". కవిత్వం ద్వారా మాడభూషి సంకల్పించిన ఫలితం యిదే. వేర్పాటువాదాలు, కులమత భేదాలు, మసీదు - రామమందిర వివాదాలు, గోద్రా, చుండూరు, కారంచేడు సంఘటనలు - యిలా వర్తమాన వాస్తవ ఘటనలన్నీ ఈ కవిని కదిలించాయి. ఎక్కడ చూసినా కుటిలత్వం - కపటత్వంతో ఆవేదన కలిగి

"భవిష్యత్కాలంలోనైనా
మానవత్వాన్ని నటించకు
మొహానికి నవ్వుపులుముకొని
కడుపులో కత్తులుదించకు"

అంటూ సూటిగా హెచ్చరించారు. స్త్రీ సమాజంపై జరుగుతున్న దాష్టీకాలు, ఆధిపత్యవైఖరి, అణచివేత, వంచనలు, అత్యాచారాలు, హత్యలువంటి అమానవీయ సంఘటనల తాలూకు వేదన మాడభూషి కవితల్లో ప్రతి ధ్వనిస్తుంది. మహిళల్లో చైతన్యం, ధైర్యం రావాలని, సబలగా మారాలని అభిలషిస్తూ స్త్రీలను ప్రకృతిశక్తిగా సంభావించారు.

"చెవులు కుట్టారు
ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా
భరించాను నోరుమూసుకొని
అంతా నా అందంకోసమేనని
తీరానోరు తెరవాలని
ప్రయత్నించినప్పుడుగానీ
తెలియలేదు
ముందుగానే
నోరు కూడా కుట్టేశారని"

అంటారు. ఒక కవితలో మగాడిలోని పాశవిక కోణా లన్నిటినీ మహిళల పక్షంలో నిలబడి చూడగలిగారు. 'నేను సహజీవనం చేస్తున్నది శత్రువుతో' అంటూ నారీస్వరమై గర్జించారు. ఎదుటివారి కష్టాలను, బాధలను తనవిగా ఆపాదించుకొని కవి అనుభవించిన ఆవేదన పాఠకులను కదిలిస్తుంది. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని సర్కోత్కృష్టమైనదిగా భావించగలవారి మాటల్లోనే తడి కనిపిస్తుంది. దాంతో పాటు వసుధైక కుటుంబ భావన, విశ్వజనీనత యెద నిండితే ఆ కవిత్వంలో మానవత్వం పరిమళిస్తుంది. మాడ భూషి వారి కవిత్వంలో వాడికి, వేడికి కారణం వారి సమ సమాజకాంక్షే.

"దెయ్యంలా మారిన వాణ్ణి
దేహంలా ఎలా భరించగలను?"

యిలా చాలా సందర్భాలలో వీరి మాటలు బాకుల్లా కనుపిస్తాయి. తన ఆలోచనలు వాక్రుచ్చుతూ, మాడభూషి వారే 'మాటలు / గుచ్చుకొన్నాయంటే హృదయం గులాబిదై ఉంటుంది' అంటారు. ఈ వాక్యాలు ఆయనకూ వర్తిస్తాయి. వారి హృదయ సౌకుమార్యమే కర్కశ సమాజంపట్ల కఠినంగా కనుపిస్తుంది. ఎన్నికలు, అవినీతి, అధికారాలపై కూడా అక్షరశరాలు విరుచుక పడతాయి. మానవతావాద కవులు పదవులకు, పలుకు బడులకు, సంపదలకు, అందలాలకు భయపడరని, భౌతిక సుఖాలను ఆలోచించరని మాడభూషి రచనలు మరోదృష్టాంతంగా బుజువు చేస్తాయి.

అవని జనులందరికీ అన్నంపెడుతూ అందరిచేతా నిర్లక్ష్యం కాబడుతున్న రైతుసోదరులకు వీరి కవిత్వంలో సమున్నత స్థానం కనుపిస్తుంది. అందరి జీవనానికి తామే ఆధారమైనా తమకు సరైన ఆధారం దొరకక కర్షకులు అనుభవిస్తున్న కష్టాలు అక్షర రూపం తొడిగి ఈ అనాగరిక సమాజాన్ని వెక్కిరిస్తాయి. రాజ్యాలనుండి బ్యాంకుల దాకా.... విపణి నుండి వినియోగదారుల దాకా రైతుల శ్రమశక్తిని అలక్ష్యం చేసే నైజం పై కవి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పారిశ్రామికవేత్తలు, నేతలు కోట్లకు కోట్లు కాజేసి కుచ్చుటోపీలు పెట్టినా వారికి రాచమర్యాదలు, పాపం ఎండనక, వాననక శ్రమిస్తూ, చిక్కి శల్యమౌతూ, కరవులతో, ప్రకృతితో పోరాడుతూ జనంకోసం, ధర్మంకోసం కాలానికి ఎదురీదే రైతులకు కనీసం పెట్టుబడులకు కూడా మొండిచెయ్యి ఎదురవడం మనం గమనించేదే. చూసి, చూడనట్లు వెళ్ళే లోకనైజాన్ని తప్పుబడుతూ మాడభూషి వారు రైతు పక్షాన నిలిచారు. చైతన్య ధ్వానాలు ఆలపించారు.

"పండించినదంతా పరాయివాడి చేతిలోపెట్టి
అన్నదాత ఎవడి దయకోసమో చూస్తున్నాడు"
"రైతు తన భూమిలో తానే ఉరేసుకుంటే

ఊరంతా చోద్యం చూస్తూ ఉంది'' వంటి మాటలు మగత నిద్రలోని మనిషి తత్వానికి మేలుకొలుపు వాక్యాలు. జగతిని, ప్రకృతిని కబళిస్తున్న అత్యాశ, స్వార్థగుణాలను ప్రశ్నిస్తూ ఒకచోట

"ప్రకృతి జూలు విదిల్చిందంటే
నీటెక్కాలజీ
నీటెక్నిక్కులు
టైటానిక్‌లా కుప్పకూలి పోవలసిందే"

అంటూ మాడభూషి హెచ్చరించారు. ప్రచండ వానల్లో చెన్నపట్నం చూసిన జలవిలయాన్ని అక్షరీకరించిన తీరు పాఠకులకు స్వీయ మూల్యాంకనం చేయిస్తుంది.

"జేబు నిండా క్రెడిట్ కార్డులతో మురిసి పోయిన వాడు
పట్టెడు మెతుకుల కోసం అల్లాడుతున్నాడేమిటి?
రాత్రిళ్ళను పగళ్ళగా మార్చినవాడు
పగలే చీకట్లో గడుపుతున్నాడేమిటి?"

అంటూ సాగే పంక్తులు నిజానికి అక్షర తూణీరాలు. సంపదలతో, కొలువులతో తనకు తానే సర్వంసహ చక్రవర్తి అనుకున్న వాళ్ళు, పగళ్ళను, రాత్రులను డబ్బుతో నియంత్రించిన వాళ్ళు సైతం ప్రకృతి కన్నెర్రచేస్తే ఎలా బతకాల్సివస్తుందో! చారిత్రక సాక్ష్యాలు చూపుతారు మాడ భూషివారు. ఆరడుగుల నేలపై ఆరిపోయే బతుకుకోసం మనిషి చేస్తున్న ఆక్రమణలకు మనమే మూల్యం చల్లిస్తామని జాగృత గీతాలు ఆలపించారు.

"చెరువు గుండెలో గుణపాలు దించినవాడు
చెరువు కన్నీళ్ళకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నా డేమిటి?"

అన్న మాటలు మానవ దురాక్రమణ నైజాన్ని ఎండగట్టే ప్రశ్నలు. వచనం రాసినా, గేయం రాసినా, మినీకవిత్వమై మెరిసినా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి ప్రతి మాటలో సామాజిక అభ్యుదయం, కల్మష మనసులను క్షాళనచేసే మానవత్వం వెల్లివిరిసి కనుపిస్తుంది. పాఠకులలో చైతన్యాన్ని రగిలిస్తుంది.

'త్రిరత్నాలు'

మాడభూషి వారు మామంచి సంపత్తు
తెలుగు కవుల కెల్ల తెలియ బరిచి
చెన్న పట్నమందు చెవులార వినిపించె
కమ్మనైన తెలుగు కవిత లెన్నో-

జాతి గొప్పతనము జాతీయ స్థాయిలో
జాగృ తలార్చి ఆయె జగతిలోన
కవన సంద్రమాయె కమనీయ గతిలోన
శ్రవణపేయమాయె శాశ్వతమున

సంఘజీవనమెంతో సహజంగ చిత్రిస్తు
పల్లెటూళ్ళలోని డొల్లనంత
కవిగళముల తెలుగుకెత్తలు వినిపించె
ఆలకించి రంత ఆవరమున.

-వేంకటరాఘవతాపి ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కర్షక 'కవిమిత్రుడు'.....మాడభూషి

- డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి, పత్రికారచయిత, హైదరాబాద్

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారితో నాది అవినాభావ సంబంధం. 32 రోజుల తేడాతో సమ వయస్కులం. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో మా ఇద్దరి గురువు (ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి) ఒక్కరే. అలా అని సహాధ్యాయులం కాము. సోదరతుల్యులం.గురువుగారి వద్ద నేను ఎం.ఫిల్. పూర్తి చేసిన తరువాత ఆయన స్నాతకోత్తర విద్య,పరిశోధనలో పట్టాలు పొందారు. చదువు తర్వాత ఇద్దరం పత్రికా రచనలో ప్రవేశించాం. కాకపోతే, నేను అందులో స్థిరపడి పోయాను. సంపత్ గారు పుష్కర కాలం తర్వాత ఆ వృత్తికి వీడ్కోలు పలికి చదువుకున్న విశ్వవిద్యాలయం లోనే అధ్యాపకుడిగా చేరి ఆచార్య పదవికి ఎదిగారు. ఎన్నో విజయాలు సాధించారు.

కాస్త వెనక్కి వెళితే....గురువు గారి పర్యవేక్షణలో 'తెలుగులో సాంఘిక నాటికలు-సామాజిక స్పృహ-1947 వరకు' అనే అంశంపై 1981-82లో ఎం.ఫిల్. చేశాను. ఆ వెంటనే పీహెచ్‌డీ కోసం 'తెలుగు సినీగీతాలపై జానపద సాహిత్య ప్రభావం' అనే పరిశోధనాంశాన్ని నమోదు చేసుకున్నాను. కారణాంతరాల వల్ల పరిశోధన కార్యరూపం దాల్చలేదు. 'ఈనాడు' దిన పత్రికతో పాత్రికేయ జీవితం ప్రారంభించాను. మూడున్నర దశాబ్దాలలో మూడు పత్రికలు మారాను. ఇంచుమించు మూడు దశాబ్దాలుగా ఆకాశవాణిలో తాత్కాలిక ప్రాతిపదికపై వార్తా ప్రయోక్తగా ఉన్నాను.మరోవంక పరిశోధన అభిలాష వెన్నాడుతూనే ఉంది. ముందే చెప్పినట్లు నా పరిశోధనాసక్తిని గుర్తుంచుకున్న గురువుగారు ఎం.ఫిల్.పట్టా పొందిన మూడు పదులు ఏళ్ల తర్వాత (2012)నా కల సాకారం కావడానికి సహకరించారు. వారి సూచన మేరకు చెన్నై రాజధాని కళాశాలలో 'దాశరథి చలనచిత్ర గీతాలు - విమర్శనాత్మక పరిశీలన' అనే అంశంపై డాక్టర్ మానికొండ విజయలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేయగలిగాను.ఈ సమయంలో మాడభూషి సంపత్ కుమార్ గారు, తెలుగుశాఖలో సహా అచార్యులు డాక్టర్ విస్తాలి శంకరరావు గారి తోడ్పాటు వెలకట్టలేనిది. ఇదే విశ్వవిద్యాలయం రజతోత్సవ ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవం నాడు (2019 సెప్టెంబర్ 5)నా సిద్ధాంత వ్యాసం ముద్రిత గ్రంథాన్ని గురుదేవులు కృష్ణ మూర్తి గారు ఆవిష్కరించడం, సంపత్ గారు తొలి ప్రతిని స్వీకరించడం, విస్తాలి వారు గ్రంథాన్ని సమీక్షించడం నా భాగ్యంగా భావిస్తాను. మాడభూషి, విస్తాలి గార్లు నాకు ప్రత్యక్ష గురువులు కానీ, పర్యవేక్షకులు కానీ కారు కనుక 'గురువు' అనే సంబోధనను వారు ఆమోదించరు.అది వారి సంస్కారం. అయితే వారి హోదా, స్థానాలను బట్టి 'మిత్రులు' అనలేను. అందుకే మధ్యేమార్గంగా 'గురుమిత్రులు'గా సంభావించుకుంటాను. విశేషించి ఆచార్యుల వారి పిలుపులో నేను 'స్వామీజీ'ని, వారు నాకు 'సంపత్‌జీ/గురూజీ'.

చాలామంది మిత్రులు అంటున్నట్లు ఈ తెలుగుశాఖ మాబోంటి పూర్వ విద్యార్థులకు పుట్టినిల్లు. ఇక్కడికి రాగానే ఏదో తెలియని సాంత్వన, అవ్యక్తాను భూతి, ఆనందం. రెండుమాణ్నాళ్ల తర్వాత తిరుగు ప్రయాణంలో ఏదో తెలియని గుబులు.

ఇక సంపత్‌జీ విశిష్టతను చెప్పడం చర్విత చర్వణమే అవుతుంది. ఈ అభినందన సంచికలో చాలా మంది సాహితీమూర్తులు ఆయన ఉన్నతిని సందర్భాను గుణంగా వివరించే ఉంటారు. నాదీ అదే భావన. 'ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాల'నే అక్షరమాల ఆకారం ధరిస్తే మాడభూషి వారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి అనివార్యం.విశ్రాంతి

జీవితం ఇష్టమైన వ్యాపకాలకు అడ్డుకారాదు. నేను ఆ పర్వంలోనే ఉన్నాను. ముఖ్యంగా సంపత్ గారు లాంటి వారికి ఇది బాగా వర్తిస్తుంది. సాంకేతికంగా పదవీ విరమణ చేస్తున్నా 'అమ్మభాష' ఆయన సేవలను కోరుతూనే ఉంటుంది. అందుకు తగు శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని వీణాపాణిని వేడుకుంటూ, ఆయన తలపెట్టే సాహితీ అర్చనలో నేనూ ఒక పూవు కాగలిగే అదృష్టం దక్కాలని ఆశిస్తూ, అభివాదాలతో.....

విషయానికొస్తే.....ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ రచనలు, ముఖ్యంగా కవితల పరంగా చూస్తే ఆయన స్పృశించని అంశం లేదంటే అతిశయోక్తి లేదు.వాటిలో ఎన్నెన్నో నిత్యనూతనాలు. ఆయా సమస్యలకు కాలంతో నిమిత్తంలేదు. అవన్నీ సూటిగా మనసులోకి దూసుకు వెళ్లి ఆలోచింప చేసేవే. కొన్ని ఛెళ్ మనిపించేవి, ఇంకొన్ని గుండెను పిండేవి,మరికొన్ని హితవు చెప్పేవి.

మాడభూషి వారు జగమెరిగిన అధ్యాపకుడు, ఆచార్యులు, అంతకు మునుపు పాత్రికేయుడు.ఆ వృత్తి రీత్యా వార్త కథనాలతో పాటు ప్రవృత్తిగా కవితలల్లారు. అవి కాలక్షేపానికో, ఉబుసుపోకనో, కాగితాలను నలుపు చేయడానికో కాదు. వినోదం, విజ్ఞానాలను పంచడమే కాకుండా రచయిత/కవికి సామాజిక బాధ్యతా ఉంటుందంటారు. తన చుట్టూ చోటు చేసుకున్న, చోటుచేసుకుంటున్న వివిధ సంఘటలనకు, అనుభవాలకు అక్షర రూపం ఇవ్వాలంటారు. ఆ బాధ్యతను అక్షరాల పాటించారు సంపత్‌గారు. ఆయన వెలువరించిన ఆరు సంపుటాల్లోని కవితల్లో ఆయా సందర్భాలనుగుణంగా రాయవలసి వచ్చినవి కొన్నయితే, ఇష్టపూర్వకంగా రాసినవి ఇంకొన్ని. వెరసి వర్తమాన సామాజి కాంశాలకు అక్షర రూపం. అదీ అలతి అలతి పదాలతో విశేషార్థాలతో. ఆయన రాసిన కవితల్లో చాలా వాటికి దాదాపు మూడు పదుల వయసు దాటినా ఆ అంశాలు,సమస్యలన్నీ నిత్య నూతనాలే. ఆయన కవితల్లో ప్రస్తావనకు వచ్చిన అనేక కీలకమైన అంశాలలో 'రైతు జీవితం' ఒకటి. దాని గురించే రేఖా మాత్రంగా విశ్లేషించే ప్రయత్నమే ఈ లఘు వ్యాసం. దేశంలో అత్యధికశాతంమంది వ్యవసాయం, దాని అనుబంధ వృత్తులపైనే ఆధారపడ్డారని కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. కానీ వారి బతుకులకు భరోసా ఎంత? వారి సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు ఏ పాటివి? రైతన్న వ్యథ అనాదిగా చూస్తున్నదే వారికష్టాలు, కన్నీళ్లు, రుణబాధలు, ఆత్మహత్యలు లాంటివి వార్తా పత్రికల్లోను, ఇతర మాధ్యమాలలోనూ విరివిగా చూస్తూనే ఉన్నాం.

'రైతేరాజు, రైతులేనిదే రాజ్యం లేదు, రైతు దేశానికి వెన్నెముక, జైకిసాన్' లాంటి నినాదాలు పదేపదే వినిపిస్తుంటాయి. పల్లె నాయకుల నుంచి హస్తిన నేతలదాకా ఇవే ఉపన్యాసాలు. రైతు సంక్షేమం గురించి మాట్లాడని వారుండరు. అరకొర చర్యలతో రైతుకు తప్పని అవస్థలు. ప్రకృతి వైపరీత్యాలతో జూదంలా మారిన రైతు జీవితం. మరోవంక దళారీల బెడద, పెట్టుబడులు కూడా దక్కక బిక్క చచ్చిపోతున్న దైన్యం.పరాధీన బతుకులు.

ఇతర వస్తువులకు ఉత్పత్తిదారులు ధరను నిర్ణయించుకుంటారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకునే అన్నదాతకు మాత్రం ఆ వెసలుబాటు లేదు. వారి కష్టాలు, కన్నీళ్లను అక్షరీకరించారు మాడభూషి తమ కవితల్లో. రాజులా బతకాల్సిన రైతుకూలిగా మారాడని పరితపించారు.

'కష్టపడ్డం తప్ప తన కష్టానికి తానే గిట్టుబాటు ధర
నిర్ణయించుకోలేడు'దీనినే
'కొనేవాడికి అమ్మేవాడు లోకువ
దళారి వాత పడ్డ రైతు!'

(రైతే కూలి/ఆలోచనలు/పే13)

అనే పంక్తుల్లో పొదిగారు. కౌలు రైతు పరిస్థితి మరీ దుర్భరం.కాస్తోకూస్తో సర్కార్ సహాయం అందినా అది భూయజమానులకే పరిమితం. పట్టణాలు, నగరాలలో కాపురాలుంటున్న భూయజమానులు ఆ కొద్దిపాటి

ప్రభుత్వ సాయాన్ని అనుభవిస్తుండగా, కౌలు రైతులకు మిగిలేది రెక్కల కష్టమే.ఇది నడుస్తున్న చరిత్ర. సాగువిధానంలో సాంకేతిక మార్పులు వస్తున్నాయే కానీ రైతు జీవితం మారడం లేదు.కర్ణుడి మరణానికి ఆరు కారణాలైతే కర్షకుడి కష్టాలకు అంతకు మించి కారణాలు.

"యంత్రాలు పంటలు పండిస్తాయి
మంత్రాలు ప్రాణాలు తీస్తాయి
పల్లెమెదడులో మౌఢ్యం"

(ఆలోచనలు, పుట: 16)

లోకానికి అన్నం పెట్టే రైతుకు పంటసాగులో ఇష్టా నిష్టాలతో నిమిత్తంలేదు.'త్యాగమొకరిది ఫలిత మొకరిది...' అన్నట్లు

'ఎవరో ఇచ్చిన / విత్తనాలు విత్తాలి
ఎవడో చెప్పిన / ఎరువు వెయ్యాలి
ఎవడి ఆజ్ఞ ప్రకారమో
పంటలు పండించాలి
ఎవరో నిర్ణయించిన ధరకు / అమ్మకాలు సాగించాలి/
రైతు తన భూమిలో తానే కూలి'

(రైతే కూలి/చివరికి నువ్వే గెలుస్తావు/పే80)

అని రైతుకు గల బంధనాలను ఆవేశపూరితంగా ఆవిష్కరించారు సంపత్ కవి. సస్యరక్షణ చర్యలలో భాగంగా ఎరువులు,రసాయనాల వాడకంపై నిపుణులు, సంబంధిత అధికారులు సూచనలు చేయడం ఆమోద యోగ్యమే కావచ్చు కానీ కష్టానికి ప్రతిఫలానికి ధరను నిర్ణయించుకొనే హక్కు లేకపోవడం మాత్రం కలచివేసే అంశంగా చెబుతారాయన.

'పొలం ఎండిపోయి వెక్కిరిస్తోంది
ఆకాశం ఎండమావిలా ఉంది
పిల్లల కడుపులు కాయితం
పొరల్లా అతుక్కుపోయాయి
ప్రభువులకు జవాబుదారీతనం లేదు'

(మూడోమనిషి/ పు.34) అని ఏలిన వారి నిష్క్రియా ప్రియత్వాన్ని నిర్భీతిగా ఎత్తి చూపారు.

మట్టిని పిసుక్కుంటూ ఆనందించే రైతు ఈనాడు చేతులు పిసుక్కుంటూ ఆవేదన చెందుతున్నాడని ఆక్రోశించారు. రైతు బతుకు యాచకుడి కన్నా అధ్వాన్నమైందన్న పంక్తులు మనసున్న వారిని కదిలిస్తాయి.

'భిక్షగాడు వెళుతున్నాడు
జోలె నిండిపోయింది
దుర్భిక్షకుడైన రైతు'

(రైతే కూలి/ఆలోచనలు/పే13)

అనడం 'వండుకున్నవారికి ఒకటే కూర.. దండుకున్న వారికి...' సామెత గుర్తుకు తెస్తోంది.

చేతికి వచ్చిన పంటకు గిట్టుబాటు ధరరాని స్థితిలో రైతు కన్నీటి సుడితో పంటను కళ్లాల్లో వదిలేసే సంద ర్భాలు, రహదారి పక్కన పారవేసే సంఘటనలు కోకొల్లలు. పెట్టిన సొమ్ము దక్కక,రుణభారంతో 'పురుగుల మందే పెరుగన్నమాయె'అన్నట్లు ఎందరో రైతుల బతుకులు అర్ధాంతరంగా తెల్లారిపోతున్నాయి.

బహుళజాతినంస్థల దుకాణాలలో (కార్పొరేట్ సంస్థల్లో)పెద్దపెద్ద మాల్స్‌లో, సూపర్‌బజార్‌లలో ఎంత చెబితే అంతకు నోరెత్తకుండా కొనుగోలుచేసే జనం రైతుబజార్లు, వారపు సంతలలో మాత్రం గీచిగీచి బేరాలా డడం నిత్య వ్యవహారమే.

'పండించినదంతా పరాయివాడి చేతిలోపెట్టి
అన్నంకోసం అంగడిముందు నిలబడ్డాడు
అన్నదాత ఎవడిదయకోసమో చూస్తున్నాడు'

అన్న కవి మాటలు చదివితే ఇంతకాలం రైతు కష్టం పట్ల అంతగా అవగాహన లేని నగరవాసులు సయితం కలత చెందకమానరు.

నలుగురికి 'పట్టెడన్నం పెట్టే రైతుకు పంటదాహం తప్ప / ధనదాహం ఉండదు' అంటారు మాడభూషి వారు. ప్రతిపనికి ప్రతిఫలం ఆశిస్తాయి ఇతర వర్గాలు. అందుకు భిన్నమైనది కర్షకలోకం.

తన 'కష్టం పరోపకార్థం అనుకుంటాడు తప్ప
అర్థం కోసమని భావించడు
స్వార్థం కోసమని ఆలోచించడు'

అని రైతన్నల నిస్వార్థగుణాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. (రైతు ఆత్మకథ/వికారి/60)కుగ్రామంలో వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన మాబోంటి కుటుంబాల స్థితిని అక్షరీకరించారు.

దేవుడు రైతుకు ఇచ్చిన గొప్ప వరం సంతృప్తి కాబోలు. తాను పండించింది పదిమంది తింటుంటే చూసి ఆనందించే మనస్తత్వం రైతుది. తృప్తికి మించిన సంపద లేదనే మాట రైతుల విషయంలో అక్షర సత్యమని పిస్తుంది.

'మట్టే వాడికి వస్తువు
ఒళ్ళంతా మట్టిపూసుకొని
ఆత్మీయంగా,ఆప్యాయంగా
చూసుకున్నప్పుడు కలిగే ఆనందం
ఎందులో ఉంటుంది!'

అని వారి ఆనందం, తృప్తిని తెలియచెప్పారు. సంపన్నుడు మరింత సంపాదనతో 'నోట్ల కట్టల మీద పడుకున్నట్లు / రైతు మట్టిమీద పడుకుని మురిసిపోతాడు' (రైతు ఆత్మకథ/వికారి/పే60)అని, రైతు 'ఖేదాన్ని మోదంగా మార్చు కుంటాడు'అని భూపుత్రుల క్షమను చెబుతారు కవి.

బ్యాంకుల నుంచి రుణాల పేరిట వేల కోట్ల రూపాయల 'భోక్తలు' (తిమింగిలాలు) పలాయనం చిత్తగిత్త గిస్తున్నా పట్టని ఏలికలు అప్పులతో సతమతమవుతున్న 'చిన్న చేపల' వంటి కర్షకులను పట్టి బాధి స్తుంటాయని వర్తమాన పరిస్థితిని నిర్మొహమాటంగా నొక్కి చెప్పారు.

'అప్పు తీర్చమని వాణ్ణి మాలలు వేసి బతిమాలు తున్నాయి
అప్పుతీర్చకుంటే ఉరితాడని వీణ్ణి బెదిరిస్తున్నాయి'

అంటూ ఆర్థిక సంస్థల తీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలో రుణబాధతో

'పస్తులతో చావాలా
ఆత్మహత్య చేసుకోవాలా' అని మధనపడే రైతు
'తన భూమిలో ఉరేసుకుంటే
ఊరంతా చోద్యం చూస్తూ ఉంది
వాడు (ఎగవేతదారు
జైలుకు వెళ్లినా రాజవైభోగాలు'

అని లోకం తీరును బద్దలు చేశారు. ఈ సందర్భంగా

'ఉన్నవాడిదే రాజ్యమురా
లేనివాడి పని పూజ్యమురా'

అనే పాత చలనచిత్రం గీతం ఒకటి స్ఫురిస్తోంది.

రైతన్నకు లాభనష్టాలతో ప్రమేయంలేదు. జనం ఆకలి తీర్చడం తన ధ్యేయం. అలా అందరికి అన్నం పెట్టి తాను మాత్రం అప్పులపాలు అవుతున్న అన్నదాత 'అప్పుచేసిన పాపానికి/తన చేత్తో తనకే ఉరి'అనడంలో మాడభూషి వారికి రైతన్న గల సానుభూతి వెల్లడవుతోంది.

అన్నదాత లేని లోకాన్ని ఊహించుకోలేమ నేందుకు-

"నేను బురదలో
కాలు పెట్టకపోతే
నీవు బువ్వలో
చెయ్యి పెట్టలేవు"

అనే మాటలు చాలు. చేతినిండా బువ్వతినే వారిలో ఆ అన్నం పెట్టే చేతుల మేలు కోరే వారి శాతం ఎంతన్నది ప్రశ్న.

'పల్లెటూరు మన భాగ్యసీమరా
పాడిపంటలకు లోటులేదురా
మంచితనం మమకారం
మనిషి మనిషిలో కనపడురా'

లాంటి గీతాలు వినసొంపుగా ఉన్నా, వాస్తవంలో అర్థసత్యమే అని...

'ప్రపంచమంతా కంప్యూటరీకరణ
హైటెక్ సేద్యం, గ్లోబలీకరణ

బస్సు మొహం చూడని పల్లె' (ఆలోచనలు/పే15)అని మాడభూషి కలం చెబుతోంది.నిజమే స్వరాజ్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు అవుతున్నా 'ఎర్రబస్సు' ఎరుగని పల్లెలు కోకొల్లలు. పల్లెలు భాగ్యసీమలై, పాడిపంటలకు లోటులేనప్పుడు వలసలు ఎందుకన్నది అందరిని తొలిచే ప్రశ్న. పట్టణాలకు, నగరాలకు వలసల పెరగడానికి కారణం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడమేనని నగరలలోని 'కూలీల అడ్డా'లు చెబుతున్నాయి. వ్యవ సాయం గిడసబారుతోంది. రైతు రెక్కలుముక్కలు చేసు కొంటున్నా పంటకు గిట్టుబాటు ధర లేదు. తన కష్టానికి తాను ధరను నిర్ణయించుకోలేడు. ఈ దుస్థితిలో 'పల్లె పొమ్మంటోంది/పట్నం రమ్మంటోంది' పొట్ట కోసం వలస దారిపడుతున్నారు. రైతులోకానిది నిత్య సమస్య. వారి కథకు,కష్టానికి

'విశ్రాంతి ఉండదు/విరామం ఉండదు
తరతరాలకు సాగుతూనే ఉంటుంది'
'తన కథలో వ్యథలు ఉన్నాయి
అయినా ఆత్మకథ రాసుకోడు
కథగా బతక గలడు
ఇతరులకు కథ కాగలడు' ..

అంటారు కవి. కానీ...వారి కలతల కథలు కంచికి చేరి 'అన్నదాతా! సుఖీభవ' ఆర్యోక్తి పరిపూర్ణంగా సిద్ధిం చాలని ఆకాంక్షిద్దాం.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మొదటి అబద్ధం

- డాక్టర్ కె. రాములక్ష్మి, చెన్నై.

అబద్ధం చాలా తియ్యనిది. అందమైనది. ఒక్క అబద్ధంతో ఆనందం కలిగించవచ్చు, అనుబంధాలు విడగొట్టవచ్చు, కాపురాలు కూల్చవచ్చు, విషాదం కలిగించ వచ్చు, అబద్ధం చాలా శక్తివంతమైనది. ఇది అందరి జీవితాల్లోను పెద్ద పాత్రవహిస్తుంది. అటువంటి 'అబద్ధం' గురించి డా. మాడభూషి సంపత్‌కుమార్ గారు సుదీర్ఘమైన కవిత వెలయించారు.

తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం, ఆర్థిక తదితర స్వలాభాల కోసం, ఇతరుల నుంచి తప్పించుకోవడం కోసం, గొప్పలు చెప్పుకోవడం కోసం, ఇతరులకి సహాయం చేయడం కోసం, ఇతరులను కించపరచడంకోసం, పది మందిలో గౌరవం కోసం అబద్ధం చెబుతారు జనాలు.

"మొదటి అబద్ధం" కవితను ఎక్కడ మొదలు పెట్టాలి అంటూ పెళ్ళిలోనే మొదలు పెట్టారు రచయిత, వెయ్యి అబద్ధాలు ఆడైనా పెళ్ళి చేయాలంటారు పెద్దలు.

"ఎప్పుడో పెళ్ళిలో చెప్పిన అబద్ధాన్ని
జీవితాంతం కాపడుకొంటూ రావాలి"(క - 7)
"ప్రేమ మితిమీరినప్పుడో
కోపం కట్టలు తెంచుకున్నప్పుడో
ఆవేశం అదుపు తప్పినప్పుడో
మాటలు తడబడితే
పెళ్ళి గుల్లయిపోతుంది" (క - 8)

అవసరానికి, అవసరంకాని దానికి అన్నిటికి అబద్ధమే, చిన్నఅబద్ధం, పెద్ద అబద్ధం. ఒకసారి అబద్ధం చెబితే దాన్ని కప్పిపుచ్చడానికి మరొక అబద్ధం అతికించాల్సి వస్తుంది.

ఈ అబద్ధాలు మన ఇతిహాసాల నాటి నుండే ఉన్నాయి. అందుకు ఉదాహరణగా హరిశ్చంద్రుడు, ధర్మరాజు (హత:కుంజర:), వసుదేవుడు, దుర్యోధనుడుని తీసుకుని ఇలా తెలియచేసారు.

అలనాటి హరిశ్చంద్రుడు
ఎప్పుడడిగితే అప్పుడిస్తానని
ఎప్పుడోగాని ఇవ్వలేదు
ధర్మరాజు శబ్దచాతుర్యంతో
అబద్ధాన్ని నిజం చేయాలనుకొన్నాడు
వసుదేవుడు కన్నబిడ్డనే లేదన్నాడు.
దుర్యోధనుడు ఇస్తానన్న రాజ్యాన్ని ఇవ్వలేదు

(క - 10)

నిజాన్ని నిరూపించాలిగానీ, అబద్ధాన్ని నిరూపించాల్సిన అవసరం లేదు. "అబద్ధం చెప్పినవాడికి ఏ సమస్యా ఉండదు. నిజం చెప్పినవాడికి ఏ సంతోషమూ మిగలదు" అని రచయిత నగ్నసత్యాన్ని ఆవిష్కరించారు.

తాను ఎగ్గొట్టేవాడికి
అప్పు ఇస్తున్నానని తెలుసు
అప్పు తీసుకున్నవాడు
తీర్చబోయ్యేది లేదని తెలుసు
అయినా అప్పు ఇవ్వడానికి సిద్ధం
అవినీతికి అబద్ధానికి ఉన్న లంకె అలాంటిది

(క - 13)

అబద్ధం లేకపోతే ప్రపంచం ఏమైపోతుందో, వ్యాపార లావాదేవీలన్నీ అబద్ధంపై అంతస్థులు కట్టినవే అని కవి నర్మగర్భితంగా చెప్పారు.

అబద్ధం ఆడినా గోడకట్టినట్టుండాలి. తడికలా కట్ట కూడదు. కొందరికి అబద్ధం "వెన్నతో పెట్టిన విద్య". చంద్రమండలం, సూర్యగోళం, నక్షత్రాలు, గ్రహాల్లో అబద్ధం ఉందా లేదా? అవన్నీ అబద్ధాలా? నిబద్ధాలా? అని బద్ధాలా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.

న్యాయస్థానంలో, లాయర్లు, సాక్షులు, పోలీసులు, తీర్పులు అలాగే వైద్యరంగంలో మందులు, సూదులు, ఎక్స్‌రేలు, ఈసిజీలు, స్కేనింగులు ఆపరేషన్లు అవసరాన్ని బట్టి కాకుండా అబద్ధాన్నిబట్టి అవసరమ వుతాయట,వారి అబద్ధాలు డబ్బుకోసమేనంటారు. ఇక రాజకీయ రంగంలో నాయకులు చేసే వాగ్దానాలు, ఉచితాలు అన్నిటిలోను అబద్ధాలే.

ఎన్ని అబద్ధాలు చెబితే అన్ని ఓట్లు
ఎంతబాగా చెబితే అంత ప్రసిద్ధి (క - 19)
చెప్పిన అబద్ధాన్నే / మళ్ళీ మళ్ళీ చెబుతూ
జీవితాంతంరాణించేవాడు రాజకీయనాయకుడు

(క - 20)

అంతేకాదు అబద్ధాలు చెప్పడానికి ఇళ్ళు బళ్ళుకూడా తర్ఫీదు కేంద్రాలట అబద్ధం చెప్పడంలో ఆరితేరినవారట.

నాన్న ఇంట్లోనే ఉంటాడు
ఎవరయినా వస్తే లేదంటారు
ఇంట్లో అన్నీ ఉంటాయి
లేనే లేదంటుంది అమ్మ (క - 22)

బడిలో తోటివిద్యార్థులు, ఉపాధ్యాయులు, పని వాళ్ళు అందరూ అబద్ధాలే నూరిపోస్తారట... పుస్తకాల్లో కూడా.. అబద్ధాలే పుస్తకాలకు అలంకారాలు

ఉన్నది ఉన్నట్లు చెబితే సహజం
ఉన్నదాన్ని రెట్టిస్తే అతిశయోక్తి
లేనిదాన్ని ఊహించి చెబితే ఉత్ప్రేక్ష (క - 24)

చరిత్రలో కూడా రాజులు మంత్రులు చేసినవి అబద్ధాలే అయ్యుండొచ్చు. చరిత్ర రాసిన రచయితవి అబద్ధాలే అయ్యుండొచ్చు.

ఏ రాజు మీద / ఏ చరిత్ర కారుడికి
ఏం కడుపుమంటో ఎవరికి తెలుసు?
ఎవడికి ఇష్టం వచ్చినట్లు వాడు రాసిపారేశాడు

(క - 24)

అవినీతికి, దగాచేయడానికి, దుర్మార్గునికి, దౌర్జన్యానికి అపహరణకి, అత్యాచారానికి, జూదానికి, వాదానికి, క్రోధానికి, భేదానికి, వ్యభిచారానికి సకల అనర్థాలకు అబద్ధమే బలం. పురుగులొలుస్తున్నట్లు... అబద్ధాలు మెదడును తొలుస్తూ ఉంటాయని కవి ఆవిష్కరించారు.

సమాజంలో చదువు, శాస్త్రం, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, కష్టాలు తగ్గినా అబద్ధాలు మాత్రం పెరుగుతూనే ఉంటాయి. తగ్గవు.

హస్తవాణి (సెల్‌ఫోన్) అబద్ధానికి రాణి, మాటల్లో సందేశాల్లో, ఛాయాచిత్రాల్లో అబద్ధాల ప్రచారానికి, అవి చేస్తున్న సేవలకు అబద్ధ సేవారత్నం బిరుదు ఇవ్వవచ్చు అని వ్యంగ్య ధోరణిలో రచయిత వెల్లడించటం బాగుంది. హస్తవాణి అబద్ధాల స్వగతాలు ఇలా ఉంది. అక్కడే ఉంటూ... ఆకాశంలో ఉన్నట్లు భ్రమింప చేస్తుంది.

ఎక్కడున్నావు... ఒక అబద్ధం
ఏం చేస్తున్నావు... ఒక అబద్ధం
ఎప్పుడొస్తావు... ఒక అబద్ధం
ఎలా ఉన్నావు... ఒక అబద్ధం (క - 30)

అబద్ధానికి ఆది మూలం దేవుడు. మనిషి భయంతో, తెలియనితనంతో, అవివేకంతో రక్షణ కోసం చెప్పే అబద్ధం దేవుడు. నిజ జీవితంలో ఏమీ చేయలేక నివారించలేక బతుకును మోయలేక భారాన్ని మోసేవాళ్ళు లేక ఎవరి మీదో ఒకరి మీద వెయ్యాలన్న మనిషి దొరక్క చివరికి తోసెయడానికి చేసిన తొలి ప్రయత్నం దేవుడు. కనిపించని దేవుడిపై తోస్తే ఏ సమస్యా ఉండదు.

ఏనాడో చెప్పిన ఒక అబద్ధాన్ని

కప్పిపుచ్చుకోడానికి
చెప్పిన అబద్ధాన్ని
నిలబెట్టడానికి
కథలు కథలుగా
పాటలు పాటలుగా
పుస్తకాలు పుస్తకాలుగా

అబద్ధాలు అబద్ధాలుగా
పుట్టించాడు... పుట్టిస్తూనే ఉన్నాడు (క - 39)

బడికి ఆలశ్యంగా రావటానికి, హోం వర్క్ చేయక పోవడం వంటి చిన్నప్పుడు చిన్న విషయాల దగ్గర మొద లైన అబద్ధాలు వయసుతో పాటు పెరుగుతూ వచ్చాయని కవి అంటారు. పురాణాలు, చరిత్రలు, ఇతిహాసాలు, కావ్యాలు, కథలుగా విస్తరించిన సారస్వత ప్రక్రియలుగా వెలుగొందుతున్నాయంటారు. రచయితలు...తమ తమ మెదళ్ళలో

మొలిచిన అబద్ధాలకు / అక్షర రూపం కల్పించి
సమాజాన్ని నడిపించే / సృష్టికర్తలుగా ముందు
వరుసలో నిలబడ్డారు (క - 47)

వాళ్ళు అభూతకల్పనలతో చరిత్ర కావ్యాల్లో మత మౌఢ్యుని త్యాగమూర్తిగా, నరహంతకుణ్ణి యోధుడిగా, ధీరుడిగామలచడం అన్నీ అబద్ధాలే...

నిజాలను పాతేసి / అబద్ధాలతో కాంక్రీటు వేస్తాడు /
ఒక్కోనిజాన్ని తవ్వితియ్యడానికి
యుగాలు గడుస్తాయి..... (క - 49)

కండబలం, బుద్ధిబలం, కులబలం, ధనబలం, మత బలం, జనబలం, అధికారబలం కలిగిన వారందరూ కూడా ఆధారపడేది అబద్ధంపైనే అందరికి సమానంగా ఉన్న బలం అబద్ధమే.

అబద్ధాలాడే వాడికి నరకం ప్రాప్తిస్తుందని చెప్పినా, స్వర్గమోక్షం అని ఆశలు చూపినా ఎప్పుడో వచ్చే సుఖం కన్నా అబద్ధం ఇచ్చే సంతోషమే మిన్న అని అబద్ధంవైపే ఇష్టం చూపిస్తాడు.

అబద్ధం మనిషి ప్రాకృతిక ధర్మం. ప్రకృతిని పూర్తిగా అబద్ధం ఆవరించింది. మనిషి పులి, సింహం, ఏనుగు వంటి జంతు జాలాన్ని చంపాడు, గుట్టలను కొండలను తవ్వి కూలగొట్టి తానే సృష్టికర్తగా మరి అన్నిటినీ తయారు చేశాడు. తనకు తానే దేవుడై శిలలు చెక్కించు కుని, విగ్రహాలు పెట్టించుకొని గుళ్ళుకట్టించుకున్నాడు. రాజుగా, నాయకుడిగా కీర్తిపొందుతూ అబద్ధాల మేడలో బతుకుతున్నపుడు ఉన్నట్టుండి ఏదో ఒక రోజు గాలి వీచినా, వానకురిసినా భూమి కంపించినా భయపడి భోరున విలపిస్తాడు. ఆ ఒక్క సారికి జ్ఞానోదయం కలిగి తనను రక్షించమని "నిజం" కాళ్ళ మీద పడతాడు. ఆ తర్వాత మరల షరామామూలే.

నీళ్ళు సముద్రంలోకి వెళ్ళిపోయిన తరువాత
చెట్టు మళ్ళీ చిగురించిన తరువాత
ఆకాశం వర్షించిన తరువాత
మళ్ళీ మనిషి పుడతాడు. అబద్ధాలు మొదలెడతాడు
(క - 63)

"సర్వమూ అబద్ధం విజయ విలయ తాండవం చేస్తుంది. తారంగం తారంగం" అని రచయిత "అబద్ధం" తో నృత్యం చేయించారు.

నివురు గప్పిన నిజం / మళ్ళీ నిద్ర లేచేదాకా...
అబద్ధానిదే అరచేతిలో స్వర్గం
స్వర్గంలో కూడా అబద్ధానిదే పై వర్గం (క - 64)

అబద్ధం మనిషి జీవితంలో మమేకమై విడదీయరాని బంధంగా అయ్యింది. "అబద్ధం" ను కవితా వస్తువుగా గ్రహించి 64 పేజీల సుదీర్ఘమైన కవితగా ధారావాహికగా కవి రచించిన తీరు ప్రశంసనీయమైనది. అనన్య సామాన్య మైనది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మూడో మనిషి' - సామాజిక అధ్యయనం

- బోయపల్లి చిట్టెమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

దాదాపు కవి ఏవిధంగా శీర్షికను పెట్టడంలో తన ప్రతిభను కనబరుస్తున్నాడని ప్రధానమైన అంశంగా చెప్ప వచ్చు. శీర్షికను చూసిన వెంటనే పాఠకులకు ఎందుకు కవి ఈ శీర్షికను ఎంచుకున్నాడు. దాని అంతరార్ధం ఏమై ఉంటుంది? అనే ఆలోచనలు రంజింప చేసేవిగా ఉండాలి. ఈ పుస్తకంను చూడగానే నాలో కూడా పరిపరి విధాల ఆలోచనలు కలిగాయి.

ఈ 'మూడో మనిషి' సంపుటిలో రచయిత ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు ఎంచుకున్న ప్రతి అంశంలో సమాజంలోని వస్తువే మనకు కనిపిస్తుంది. తరాలతో పాటు మనుషులలో ఆలోచనలు కూడా మారుతున్నాయి. అందుకు ఈ కవితలను నిదర్శనంగా చెప్ప వచ్చు. ఈ కవిత సంపుటిలో భిన్నమైన వస్తువులలో 36 కవితలు ఉన్నాయి. ఆయా కవితల్లోని వస్తురూప శిల్పం గురించి విశ్లేషించదలచాను.

ఆకురాలిన కాలం :

5 డిసెంబర్ 2016లో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మరణం సందర్భంగా రాసిన కవిత. ప్రపంచంలో అమ్మ కన్నా గొప్పవారు ఎవరు ఉండరు. అలాంటి అమ్మతో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితను ఆ రాష్ట్ర ప్రజలందరూ భావించడం బహుధా ప్రశంసనీయంగా చెప్పవచ్చు. అలాంటి అమ్మ మరణంతో ఆ రాష్ట్రం మొత్తం ఒక్కసారిగా మూగబోయింది. ఎవరికి వారు వారి కన్నతల్లి మరణించిందనేలా వాపోయారు. అలాంటి సందర్భంలోనే కవులు, రచయితలు కూడా స్పందించడం జరుగుతుంది. ఈ విధంగా స్పందించి 'ఆకురాలిన కాలం' అనే శీర్షికను ఎంచుకొని రాశారు. కవి ఎందుకు ఈ శీర్షికను ఎంచుకున్నాడని గనుక ఆలోచిస్తే 'ఎఐఎడిఎంకె' పార్టీ యొక్క గుర్తు రెండు ఆకులు ఉండడం గమనించవచ్చు. ఆ పార్టీ అధినేత మరణించడంతో ఆ పార్టీనే వెళ్ళిపోయినట్టుగా కవి భావించినట్టు కనిపిస్తుంది. అందుకే ఇక్కడ కవి ఇలా వివరించారు.

"అమ్మ ఆకుల రాలిపోయింది
పండీ పండక ముందే / నిండా పండక ముందే"

(మూడో మనిషి, పుట.11)

సాధారణంగా ఆకులన్నీ రాలగానే మళ్ళీ చిగురిస్తుంది. అది ప్రకృతి ధర్మం. అందుకు విరుద్ధ పరిస్థితులు నెలకొనడంతో నిరాశే ఎదురైనట్లు ఇలా వివరించారు.

"ఆకులు రాలు మోడువారి పోతుందనుకొనలేదు మళ్ళీ
చిగురిస్తుందన్న ఆశతోకాయలు కాచిన కళ్ళు
మూసుకున్న అమ్మ మాత్రమే దర్శనమిస్తుందను కోలేదు!"

తాను మరణించినప్పుడు ఎవరికివారు తరువాత మేమే నాయకులం అవ్వోచు అనుకున్నారు. ఏ విషయమైన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తారు. తరువాత ఏమీ పట్టించుకోకపోవడం మనము చూస్తూనే ఉన్నాం. అలాగే తను అక్రమంగా చనిపోయిందని అందరికీ తెలిసినా ఎవరి స్వార్ధం వారికి ఉండడంతో ఎవరు నోర్లు మెదపలేదు. అందుకే కవి కూడా అది ప్రస్ఫుటంగా వివరించారు.''అమ్మలేకపోతే తామే అధినాయకుల మనుకున్నారు

ఇప్పుడు అమ్మ లేకపోవడంతో అందరూ అనాథలే'' (పుట.12)

కవిత్వం :

కవిత్వంలో ఎప్పుడు కూడా పొగడ్తలు కాకుండా విషయం ప్రధానంగా ఉండాలని ఇలా అంటారు.

"కవిత్వంలో / మడి కాదు
తడి ఉండాలి!" (పుట.14)

సమాజంలో మార్పు రావాలి అంటే మంచి నైపుణ్యాలను పెంపొందించే కథలు, నవలలు, కవితలు రావాల్సి ఉంటుంది. మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్ద గలిగేలా మన చదువులు ఉండాలి. ఆ చదువులు ఏ సమాజంలో ఎలా ఎదగాలి, మెలగాలి, సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాల గురించి చెప్పలంటారు.

"కవిత్వం / గుడికి కాదు
బడికి నడిపించాలి" (పుట.14)

ఇలాంటి రచనల వల్ల చదువుకుంటే ఎలా ఉంటుంది, చదువు లేకుంటే ఎలా ఉంటుంది అనే ఆలోచనలు ప్రజలలో కల్పించి వారిని చదువునే నమ్ముకునేటట్లు చేసి బడివైపే నడిపించాలని రచయిత ఉద్దేశ పూర్వకంగా చెప్పారు.

ఇక్కడి గుడిని నమ్ముకుంటే తమ మీద తమకి నమ్మకం ఉండకపోవచ్చు. ప్రతిదీ దేవుని మీద భారం వేసే అవకాశం ఉండవచ్చు. అదే బడిని నమ్ముకుంటే తమ మీద తమకి నమ్మకం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కవిత్వం ఏవిధంగా ఉండాలి, కవిత్వం వల్ల ఏయేమి ప్రయోజనాలు ఉన్నాయో 'కవిత్వం' అర్థవంతంగా చెప్పారు. కవిత్వం వల్ల కవి మాత్రమే కాదు కవితలు చదివినవారిని కూడా ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని కవి ఈ విధంగా ప్రస్తావించారు.

"కవిత్వంలో / అందలం ఎక్కడం కాదు
అందరినీ ఎక్కించాలి"(పుట.14)

తల్లి :

తల్లి అని పలకడంలోనే ఒళ్ళు పులకరిస్తుంది. అలాంటి తల్లి నేటి సమాజంలో ఆదరణ లేకుండా పోతుంది. సమాజంలో తల్లి తన పిల్లలకు ఉన్నత స్థాయిలో చూడాలనుకుంటుంది. అందుకే తను పస్తులుండైన సరే పిల్లలకు ఏ లోటూ లేకుండా చదువు, తిండి, బట్టలు, ఇలా అన్నీ విధాలుగా ఇవ్వగలుగుతుంది. చివరికి ఆ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి ఆ తల్లిదండ్రులను వదిలేస్తున్నారు. నిజంగా తల్లి 10 మంది పిల్లల్ని కని పెంచిపోషిస్తుంది.

కానీ ఆ పది మంది పిల్లలు కలిసి ఒక్క తల్లిని పోషించలేని దౌర్భాగ్యం ఏర్పడిందని కవి ఇలా వివరించారు.

"ఒక తల్లి / పదిమంది పిల్లల్ని
కనిపెంచి పోషిస్తుంది
పదిమంది / పిల్లలు
ఒక తల్లిని పోషించలేకపోతున్నారు"(పుట15)

ప్రస్తుత సమాజంలో ఓపికలు లేకుండా పోయాయి. ఏమి తెలియని వయసులో పిల్లలు అమ్మ నాది నాది అని కొట్టుకుంటారు. అదే పిల్లలు ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నాక విలువలన్నిటిని ఒక్కసారిగా మర్చిపోయి రేపటి నుంచి అమ్మ నీ వాటా, నా వాటా అని కొట్టుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటన్నింటి మూలం ఓపికలు బలహీనపడుతున్నాయి. మనుషులలో కూడా బలహీనమేర్పడుతుంది. అందుకేనేమో తల్లి ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటుందని కవి చెప్తున్నారు. ఈ విధంగా

"అందుకే తల్లి / ఇప్పుడు
ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటోంది" (పుట.13)

ప్రకృతి :

సృష్టిలో అమ్మ తరువాత అంతటి మాధుర్యాన్ని, ప్రేమను, ఆరోగ్యాన్ని ఇచ్చేది సృష్టిలో ప్రకృతియే. అమ్మ లేకపోతే సృష్టే లేదంటారు.అలాంటిదే ప్రకృతి కూడా. ఇప్పుడున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కవి ఈ 'ప్రకృతి' కవితను రాసినట్లు చెప్పవచ్చు. ఎవరికివారు వారు టెక్నాలజీని ఉపయోగించుకొని ప్రకృతిని ఎలా వాడుకుంటున్నారో చెప్పారు. కానీ ప్రకృతి ఒక్కసారిగా తిరగపడితే ఏ టెక్నాలజీ ఏమి చేయలేదని, వినాశనం తప్పదని కవి హెచ్చరిస్తున్నారు.

ప్రకృతి / ఎదిరించి / బెదిరించి / గుప్పిట్లో
పెట్టుకున్న మానవుడా / ప్రకృతి జులూ

విడిల్చిదంటే / నీ టెక్నాలజి / నీ టెక్నికులు
టైటాన్‌లా కుప్పకూలిపోవాల్సిందే"

టెక్నాలజి ఉపయోగించి ఒక్కసారి నాశనానికి ఒడి గట్టారంటే అదే టెక్నాలజితో దాన్ని నిలబెట్టలేము అంటు న్నారు. అందుకే ప్రకృతిని కాపాడుకుందాం ప్రకృతిని నీవు నేడు కాపాడగలిగితే రాబోయే తరాలను కూడా ప్రకృతి కాపాడగలుగుతుంది.

జయించడం :

ఎన్నో జంటలు ప్రేమ విఫలం కావడం, ఆత్మహత్యలు చేసుకోవడం ఇలాంటి వార్తలు నిత్యం పేపర్లలో, టి.వి.లలో చూస్తూనే ఉన్నాం. అందుకే-ప్రేమ అంటే బ్రతికి సాధించుకోవాలి. నీవు ఒకవేళ మరణిస్తే ఆ ప్రేమకి అర్థం లేదు. ఏదైనా సరే బ్రతికి ఉన్నప్పుడే సాధించు కోవాలి. ఒకసారి మరణిస్తే మళ్ళీ పుడతారో, పుట్టిన నీకు ముందు జన్మ గుర్తుంటుందనే నమ్మకం లేదు. అందుకే ఏదైనా సరే బ్రతికి జయించడాని కవి చెప్పుతున్నారు.

"ప్రేమలో / పరిగెత్తి పోవడమంటే
పారిపోవడం కాదు" (పుట.71)

అబద్ధం :

సమాజం ఎప్పటికీ అబద్ధం చెప్పేవాడినే నమ్ముతుంది. కానీ నిజం చెప్పేవాడిని నమ్మదు. అబద్ధం చెప్పేవాడు ప్రతి రోజు చావాల్సి ఉంటుంది. కానీ నిజం చెప్పడం వల్ల ఆ ఒక్కసారి బాధ పడి చివరికి నిజమే గెలుస్తుంది. ఒక్కసారి అబద్ధం అని ఎప్పటికైనా తెలిస్తే ఒక్కసారి తగలబడి పోవాల్సి వస్తుంది అని చెప్పారు కవి ఈ క్రింది విధంగా

"అబద్ధం చెప్పేవాడు / గెలుస్తూనే ఉంటాడు
ఒక్క నిజం చెప్పిన / తప్పకుండ తగులుకుంటాడు"
(పుట.18)

బాధ :

ఈ కవితను చూడగానే కవి ఎవరి బాధని వర్ణించాడో అనిపిస్తుంది. కవితను పూర్తిగా చదివితేగాని నాకు అర్థం కాలేదు. అవును నిజమే కదా మనం మన కోసం బాధపడట్లేదు. మన సంతోషం కూడా నిజంగా మనకు జరిగిన మంచి కోసం కాదని అర్థమవుతుంది. బహుశా అందరికీ ఎంతో కొంత ఈ కవితను చదివితే తమకు తాము నిజమే కదా అనుకోవాల్సిందే. అందరూ అందరే నేటి సమాజంలో పక్కోడికి నష్టం జరిగిందంటే ఆ సంతో షాన్ని వర్ణించలేం. నిజానికి బాధలు, సంతోషాలు వారి వారి వ్యక్తిగతాలు కాదు అని కవి ఇలా చెబుతున్నారు.

"మన బాధ మంది కాదు
అవతలివాడు సాధించాడనే కదా మనం
ఏడ్చేది" (పుట.20)

ఎప్పుడైతే పక్కోడి బాధని కోరుకుంటావో అప్పుడే నీకు బాధలు. అంతేగానీ ప్రత్యేకంగా నీకంటూ ఏమి బాధలు లేవని చెబుతున్నాడు. పక్కోడి ఏడుపు నీకు పన్నీటి స్నానం అని చెప్పారు. అంటే నువ్వు అంతా బాగా నవ్వుకుంటా వని అర్థం.

"ఎంతమంది కన్నీళ్ళు కారిస్తే
నువ్వు అంతా బాగా పన్నీటి స్నానం చెయ్యగలవు"

బాధ అనేది ఈ రకంగా ఉంటుందని చాలా బాధ పడుతూ 'బాధ' అనే కవితను చదివితే అర్థమవుతుంది.

మూడోమనిషి :

స్వీకృత కవిత సంపుటి శీర్షికనే ఈ కవితా శీర్షిక. 'మూడో మనిషి' అనగానే ఎవరూ ఈ మూడో మనిషి అనే ఆలో చనలు కలుగుతాయి. ఎందుకంటే మనకు మనుషులు ఇద్దరనే తెలుసు. వారు ఒకరు ఆడ, రెండు మగ. కానీ మనకు తెలియని నిజం ఒకటున్నది. మనుషులు ఇద్దరు కాదు ముగ్గురు ఆడ, మగ లాగే నపుంసక అనేవారు కూడా సహజంగానే లింగం అని తెలుసుకోవల్సిన అవ సరం ఉన్నట్లు కవి ఈ కవితను రాసినట్లు చెప్పవచ్చు. కానీ సమాజంలో మూడోమనిషి గురించి పట్టించుకునే వారు లేరు. సహజంగానే ఆడపిల్ల అంటే బరువుగా భావించే సమాజంలో ఇంకా మూడో మనిషి గురించి

ఆలోచిస్తారంటే అనుమానించాల్సిన అవసరం ఎంతైనా అనిపిస్తుంది. అందుకే కవి ఈ విధంగా వాపోయారు.

"రెండో మనిషి గురించి / ఆలోచించే తీరికే లేని
మనిషికి / మూడో మనిషిని గురించిన ఆలోచన
ఎక్కడిది"

(పుట.36)

కావాలని ఎవరు అలా పుట్టరు. కానీ సమాజం వాళ్ళకి ఒక గుర్తింపు ఇవ్వలేకపోతుంది. ఆడపిల్లల్ని పురిటిలోనే చంపేసే మనుషులకు నపుంసకులను స్వాగతిస్తారని ఎలా అనుకుందాం? అలా పుట్టడం వారినే తప్పు అన్నట్లు ముద్రే వేస్తుంది సమాజం. అది సహజ ధర్మం అని అందరికీ తెలిసేలోపే ఇంకా ఎన్ని అనర్థాలని చూడాల్సి వస్తుందో అని కవి ముందు చూపుతో ఆలోచించి ఈ కవిత రూపంలోనైనా సరే కొంత మార్పు వస్తుందని ఆశించి రాసే ఉంటారని చెప్పవచ్చు. అదే విషయాన్ని కవి ఇక్కడ సుస్పష్టంగా చెప్పారు.

"ఆస్తిపాస్తుల కోసం కాదు / తృతీయశ్రేణి
పౌరులుగా గుర్తింపు / కోసమే ఆరాటం!"

(పుట.37)

నిజానికి అంగవైకల్యం అనేది మన తప్పులు కాదు. అది దేవుడి తప్ప కానీ మనసు అంగవైకల్యంగా ఉంటే మాత్రం అది ముమ్మాటికి మనదే తప్పు అవుతుంది. అందుకే అలాంటి వైకల్యాన్ని విడిచి పెట్టి అందరినీ సమానంగా చూడాలని కవి ఇలా వివరించారు.

"మూడోమనిషిని / మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని / ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి!"

ఇద్దరు :

ఎంతమంది పిల్లలు ఉన్న ఎంతమంది బంధువులున్నా, స్నేహితులున్నా, చివరి వరకు కలిసి ఉండేది ఇద్దరే. ఆ ఇద్దరే భార్యాభర్తలు. ఆ గొప్ప బంధం భార్యా భర్తల బంధం. అందుకే కవి అటువంటి బంధం గురించి ఇలా అంటాడు-

"మేమిద్దరం / మాకిద్దరు
వారిద్దరిద్దరు / చివరకు
మేమిద్దరమే"

(మూడో మనిషి, పుట.39)

ఎవరికైనా ఇద్దరు పిల్లలు వారికి పెళ్ళి చేస్తే వారికిద్దరు ఇలా బంధాలు అనేవి పెరుగుతూనే ఉంటాయి. కానీ ప్రతిబంధంలో కూడా చివరి వరకు కలిసి ఉండేది భార్యా భర్తలే. అటువంటి పవిత్రమైన బంధం గురించి కవి ఇలా చెప్పడం గొప్ప విషయంగా భావించవచ్చు. ఇలా కవి వేరు వేరు వస్తువుతో సంబంధించిన కవితలను వర్ణించడం జరిగింది. శిల్పం, దృష్ట్యా, రూపకనిర్మాణ దృష్ట్యా ఎంతో చాతుర్యాన్ని ప్రదర్శించినట్లు చెప్పవచ్చు. రైతుల సమస్యల గురించి, రాజకీయాలలో ఎవరు ఎదుగుతున్నారు. చివరకు నష్టపోయేవారు ఎవరు. ఇలా సమాజంలో ఉన్న రకరకాల సమస్యలను కోకొల్లలుగా గుర్తిస్తూ సమాజానికి తెలియజేస్తున్నారు. సమాజంలో ఇంకా ఎన్నో మార్పులు రావాలని సూచనప్రాయంగా సూచిస్తున్నట్లు అనిపిస్తుంది.

ఈ కవిత సంపుటిలోని ఏ కవిత్వాన్ని పరిశీలించిన కూడా కవి సమాజ మార్పు కోసం, సమాజ హితం కోసం, సమాజంలో సమానత్వం కోసం, స్వేచ్ఛా కోసం పరితపిస్తున్నట్లు అవుతుంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సంపత్ కుమార్ - కవితా వైభవం

- భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సమకాలీన తెలుగు సాహిత్యంలో తెలుగు, తమిళ, కన్నడ భాషాల అనువాదకుడిగా, విమర్శకులుగా, వ్యాసకర్తగా, సంపాదకుడిగా, కవిగా, రచయితగా తెలుగు సాహితీక్షేత్రంలో తన ప్రత్యేకమైను అస్తిత్వాన్ని నిలుపు కుంటున్న వారు 'ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్'. ఈయన రచనలు సమాజానికి ప్రతిబింబించేలా ఉం టాయి. సామాన్య ప్రజల ప్రతి అంశంపైనా ఆయన ప్రతిస్పందిస్తారు. ప్రతి విషయాన్ని నిష్పాక్షికంగా, సంక్షిప్తంగా, నిర్భయంగా చెప్పడంలో ఆయన తాత్వికత కనిపిస్తుంది. సంపత్ కుమార్‌పై శ్రీశ్రీ ప్రభావం ఉందని అతని రచనలు చదివేటప్పుడు మనకు అర్థమవుతుంది. ఆయన రాసిన 'శత్రువుతో ప్రయాణం' కవితలోని 'కవిభేరి' ఖండికను చూస్తే శ్రీశ్రీ రచనకు సంపత్‌కుమార్ రచనాశైలి పోలిక కనిపిస్తుంది.

"నేను కూడా / స్వతంత్రానికి
కవిత నొక్కటి రాసి ఇచ్చాను
నేను కూడా / దేశ విముక్తికి
కంఠమెత్తి పాట పాడాను! (కవిభేరి/పుట15)

పై కవితను పరిశీలిస్తే శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానంలో 'జయభేరి' ఖండిక గుర్తుకు వస్తుంది. అందులో శ్రీశ్రీ ఇలా..."నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహు తిచ్చాను"అంటూ సాగే ఈ కవితాశైలిని సంపత్‌కుమార్ శైలికి దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. "కవిత్వం రాయడం కష్టం కాదు, కవిత్వం చేయడం కష్టం" అని ముదిగొండ వీరభద్రయ్యగారు చెప్పినట్టు అందరూ కవిత్వం రాస్తారు. కానీ ఒక నిర్మాణ పద్ధతిని, ఒక వాస్తవాన్ని, ఒక అను భూతిని బహిర్గతం చేసే దృక్కోణం ఉన్నప్పుడే కవిగా గుర్తింపు వస్తుంది. అటువంటి రచనాశైలి మాడభూషి సంపత్ కుమార్ కవితా రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కవి రచనలను చదివేటప్పుడు సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలపై ఎంత స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నారో తెలుస్తుంది. కొంతమంది కవులు భుక్తికోసం రచనలు చేస్తే, సంపత్ కుమార్ మాత్రం భక్తితో విశ్వ మానవాళి శ్రేయస్సుకై పాటుపడుతూ రచనలు ప్రకటిం చారు. ఈ నా పత్రంలో మాడభూషి సంపత్‌కుమార్ రాసిన రచనల్లో కవితా వైభవాన్ని పరిశీలిస్తాను.

కులతత్వం :

మాడభూషి రాసిన 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలోని 'నిజం' అనే ఖండికలో మన దేశంలో ఉన్నటువంటి కుల, మత, ప్రాంతాలవంటి బేధాల గురించి ఇలా చెప్తాడు కవి....

"నే చూసిన / నా దేశంలో
ఎన్ని ఇజాలు / కులిజం, మతిజం
భాషిజం, ప్రాంతీయిజం
లేదొక్కటే దేశిజం" (నిజం:18)

- అంటూ మన భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా కులాలని, మతాలని, భాషా వ్యత్యాసాలు చూడడం జరుగుతుంది. ఈనాటి సమాజంలో ప్రధాన సమస్య ఇదే. ఎక్కడ చూసినా మనిషిలో అహంకారం, వ్యత్యాసాలు చూపడం దాంతో హింసాత్మకమైన పనులకు పాల్పడడం నేటికీ జరుగుతూనే ఉంది. నాగరికత తెలిసిన మనిషి కూడా అతనిలో సమైక్యతా భావం లేకుండా మనిషి మనిషినే దహించడం జరుగుతుంది. ఎక్కడైతే సమన్వయం కలిగి ఉంటుందో అక్కడే ఎటువంటి యిజాలకు లోనుకాకుండా ఉంటా రంటూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలపై కవి ప్రతి స్పందించారని చెప్పవచ్చు.

స్త్రీలపై పురుషాధిపత్యం :

సమాజంలో స్త్రీకి ఎటువంటి విలువలు ఉన్నాయో, ప్రతి స్త్రీకి పెళ్లయ్యాక భర్త దగ్గర తన స్థానం ఎటువంటిదో 'ఆమె' కవితా ఖండికలో ఇలా వివరించారు.

"అతగాడికి కావలసింది ఒక మర మనిషి
సంపాదించడానికి / వండి పెట్టడానికి
కోరికలు తీర్చడానికి / పెళ్లి రోజున ఏటీఎం లాంటి
పెళ్ళాం దొరికిందని మురిసిపోయాడు
తాను దొరికిపోతున్నానని ఆమె మరిచిపోయింది
బానిస దొరికిందని అతడు ఆనందించాడు
రెక్కలు విప్పిన చేతనకు
కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదు" (ఆమె-26)

స్త్రీ అంటే కేవలం ఒక యంత్రంలాగా మాత్రమే చూస్తారు. వంట మనిషిగా, మగాడి కోరికలు తీర్చి ఆటబొమ్మగా, బానిసగా మాత్రమే సమాజంలో గుర్తిస్తున్నారు. స్త్రీలపై పురుషాధిక్యత ఆనాటి కాలం నుంచి ప్రభావం ఉందని చెప్పాలి. పుట్టింట్లో కొడుకుకు ఉన్న స్థానం స్త్రీకి(కూతురు) ఉండదు. అత్తగారింటికి వచ్చినప్పుడు స్త్రీ మొగాడికి బానిసగా మాత్రమే చూస్తారు. పిల్లల్ని కనడం, పెంచడం, భర్త కోరికలు తీర్చడం ఇదే సమాజంలో స్త్రీలు పురుషాధిపత్య ప్రపంచంలో నలిగి పోతున్నారని మగాడికి భార్య ఒక మిషన్ లాగా ఉండాలనే తప్ప భార్యను భార్యగా గుర్తించడం లేదని సమాజంలో స్త్రీలకు ప్రశ్నించేతత్వం లేదని కవి స్త్రీల బాధలను వివరించాడు. ఈ విధంగా సమాజంలో స్త్రీలకు ఎటువంటి కష్టాలున్నాయో కవి ఈ 'ఆమె' కవితలో కళ్ళకు కట్టినట్టు చూపారు.

దళిత దృక్పథం :

ఆనాది కాలం నుంచి దళితులను అంటరానివారిగా ముద్రవేసి సమాజానికి దూరంగా ఉంచడం జరిగింది. సంపత్ కుమార్ రాసిన ''చివరకు నువ్వే గెలుస్తావు'' కవితా సంపుటిలో

"మీరు మమ్మల్ని / బిచ్చగాళ్లలా
గబ్బిలాలుగా / హీనంగా చూస్తే
మేము మిమ్మల్ని / చింత మొద్దులా
పందికొక్కుల్లా / అసహ్యంగా చూస్తాం.

(మీరు-మేము-27)

ఆనాటి కాలం నుంచి దళితులను గబ్బిలాలుగా, బిచ్చగాళ్ళలాగా పోల్చి సమాజం నుంచి వెలి వేయడం జరిగింది. కానీ ఇప్పుడు అగ్రకులాల వాళ్లపై ధిక్కరించే అధికారం దళితుల్లో భావం ఏర్పడింది. మీరు మమ్మల్ని ఏ విధంగా చూస్తే మేము పందితోనూ, చింత మొద్దులాగా పరిగణిస్తాం. అంటూ దళితుల ధిక్కారస్వరంలో ఎంతో వాస్తవికత తెలియజేసారు. సంపత్‌కుమార్ పుట్టుగ పరంగా బ్రాహ్మణుడే అయినా దళితుల పట్ల తమకు గల అభిమానం చూస్తే ఒక గొప్ప మానవతావాదిగా కనిపిస్తాడు. ఒక కవికి కావాల్సింది కులం, మతం, భాష, ప్రాంతం కాదు గొప్ప మనసు.మానవత్వం ఉంటే చాలని మాడభూషి రచనలు చదువుతుంటే అర్థమవుతుంది.

రాజకీయ దృక్పథం :

మన దేశ రాజకీయ పరిస్థితులను నాయకుల పాలన గురించి, ప్రజాస్వామ్యం గురించి సంపత్ కుమార్ రాసిన ''ఆలోచనలు'' అనే కవితా సంపుటిలో

"దొంగ ఓట్లు వేసే / రౌడీలు నాయకులవుతారు
50 ఏళ్ల ప్రజాస్వామ్యం" (బాణీలు-17)

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 67 ఏళ్లు అవుతున్న రాజకీయ నాయకులు దొంగ ఓట్లు వేసి, రౌడీలు నాయకులు అవుతారు. ప్రజలను నమ్మించి చివరికి అన్నీ దోచేస్తారు.50 ఏళ్ళ ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులదే పైచేయి. ప్రతిసారి ప్రజలు నమ్మి మోస పోవడం తప్ప ఇంకా ఏమీ చేయలేరు.

"ఎన్నికలెప్పుడొస్తాయో / అధికారమెన్నినాళ్ళో
రాజకీయ పార్టీలు" (బాణీలు-19)

ప్రతి ఐదేళ్ళకు ఒకసారి భారతదేశ రాజకీయ ఎన్నికలు

వస్తుంటాయి. ఎన్నికలప్పుడు నాయకులు ప్రజల పక్షంవైపు వాదిస్తూ తమకు మంచి చేయాలని ఎన్నో ఆశయాలను రూపొందిస్తారు. కానీ పాలన నాయకుల చేతిలోకి వచ్చాక ప్రజలను పట్టించుకునే నాథుడే ఉండడు. అధికారం కోసం ఎన్నో రాజకీయ పార్టీలు ఆవిర్భవిస్తాయి తప్ప ప్రజా స్వామ్యంలో ఏ మాత్రం మార్పు రానివ్వరంటూ కవి ఎన్నికల, నాయకుల తీరు గురించి చెప్పారు.

అవినీతి :

ప్రస్తుత సమాజంలో ప్రజలపై ఎక్కువగా ప్రభావం చూపిస్తున్న ప్రధాన సమస్య అవినీతి. ఎక్కడ చూసినా అవినీతి భారీగా పెరిగిపోయింది. అవినీతిని గురించి ''మూడో మనిషి'' కవితా సంపుటిలో

"రోడ్డు మీద / ఎవర్ని చూసినా
నల్లగా కనిపిస్తున్నాడు / తెల్ల చొక్కా
తెల్ల ప్యాంటు ధరించి / ఫేషియల్ మొహాలతో
తెల్లగా కనిపించిన / ప్రతి ఒక్కడు
ఇప్పుడు నల్లగా కనిపిస్తున్నాడు (నల్లమొహాలు-25)

నేటి సమకాలీన సమాజంలో అందరూ అవినీతి పరులుగానే ఉన్నారు. రాజకీయ నాయకుల దగ్గర నుంచి గుమస్తా పనిచేసే చిన్న,చిన్న ఆఫీసుల వరకు అవినీతి రెండు చేతులలో కనిపిస్తుంది. రాత్రికి రాత్రి ప్రజల సొమ్మును దోచుకొని ధనవంతులు అయ్యి తెల్లారేసరికి అవినీతి గురించి ఉపన్యాసాలు ఇవ్వడం మొదలు పెడతారు. విశ్వవిద్యాలయాల్లోనూ, ప్రభుత్వసంస్థల్లోనూ, క్రీడారంగంలోనూ, రాజకీయాల్లో ఎక్కడ చూసినా అవినీతి ఉంటుంది. ప్రస్తుతం అవినీతిలో భారతదేశం అగ్ర స్థానంలో ఉంది. మనదేశంలో దాదాపు మూడవవంతు మంది అవినీతిపరులే. దేశంలో అవినీతి విపరీతంగా ఉన్నదని సర్వేలో కూడా వెల్లడి అయింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లోకంటే భారత్‌దే అవినీతిలో తొలి స్థానం అని నిర్ధారించడం జరిగింది. చట్టాలను కఠినంగా అమలు పరుస్తూ సమాజంలో అనేక మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విధంగా కవి సమాజంలో మార్పు రావాలని ఈ కవిత ద్వారా వెల్లడించాడు. అవినీతిపరుల గురించి చెప్పారు.

రైతు సమస్య :

''కోటి విద్యలు కూటి కోసమే'' అన్నట్టు మనిషి ఏ స్థాయిలో ఉన్నా కూడా రైతు పండించిన పంటనే తినాలి. భారతదేశం ప్రధానంగా వ్యవసాయరంగం మీద ఆధార పడి ఉంది. కాని నేడు ప్రపంచీకరణ ప్రభావం వల్ల రైతుకు నష్టం వాటిల్లుతుంది. రైతుల జీవనవిధానాన్ని 'వికారి' అనే కవితా సంపుటిలో రైతుల గురించి కవి ఇలా అంటున్నాడు.

"ఒళ్లంతా మట్టి పూసుకొని
ఆత్మీయంగా, ఆప్యాయంగా
చూసుకున్నప్పుడు / కలిగే ఆనందం
ఎందులో ఉంటుంది / కోటీశ్వరుడు
కోట్ల నోట్ల కట్టల మీద పడుకున్నట్టు
రైతు మట్టి మీద పడుకుని మురిసిపోతాడు"

(రైతు ఆత్మకథ-60)

ఆధునిక సమాజం ప్రాణం కంటే మిన్నగా ప్రపంచీ కరణ ప్రభావం వల్ల ఎన్నో టెక్నాలజీలు రావడంతో రైతు వ్యవసాయం మీద దెబ్బ కొట్టినట్లయింది. అన్నదాత నిత్యం కష్టపడితేనే ప్రతి మనిషికి ఆహారం దొరుకుతుంది. రైతులు మట్టినే నమ్ముకుని జీవితాన్ని గడుపుతాడు. మట్టి వాసనతోనే అనందాన్ని అస్వాదిస్తాడు. ధనవంతుడికి నోట్లకట్టల మీద ఎంత ప్రేమ ఉంటుందో రైతుకి మట్టి మీద అంత మమకారం ఉంటుంది. కాని ఎక్కడ చూసినా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. దేశంలో 35 కోట్ల ఎకరాల సాగు భూమి, పుష్కలంగా నీటి వనరులు, అనేక వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వందల వ్యవ సాయ పరిశోధన స్థానాలు లక్షలమంది ఉద్యోగులు, శాస్త్ర వేత్తలు, అనేక ప్రభుత్వ పథకాలు అరవైఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ఎన్నెన్నో వైజ్ఞానిక ఆవిష్కరణలు, యంత్రాలు ఉన్నప్పటికీ రైతుల జీవన స్థితిగతులు

మారడం లేదు. ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయని 'రైతు ఆత్మహత్య' కవితా ఖండికలో వివరించారు. రైతు నిరంతరం కృషి చేస్తున్నా చివరిగా ఆత్మహత్యలకు మూలకారకులుగా మిగిలిపోతున్నారని కవి రైతు సమస్య క్షుణ్ణంగా వివరించారు.

జెండర్ స్పృహ :

హిజ్రా (మూడో మనిషి) అనే పేరు వింటేనే చాలా మంది చీదరించుకుంటారు. రోడ్డుమీద కనిపిస్తే ఈసడించుకుంటారు. రైళ్లల్లో, బస్‌స్టాప్‌ల్లో అడుక్కుంటే అసహ్యించుకుంటారు. కనీసం వారిని మనిషిలాగా గుర్తించరు. అటువంటి వాళ్ళ జీవన పరిస్థితులను గురించి సంపత్‌కుమార్ 'మూడో మనిషి' కవితలో ఇలా చెపుతున్నారు.

"ఇంట్లో మొదలై / వీధిలోకి వచ్చి
సమాజంలోకి వెళ్లి / ప్రపంచమంతా పాకి
మూడో మనిషిని చూస్తే / అందరికీ ఎగతాళే"

(పుట-36)

ఈనాటి సమాజంలో మనిషి మరొక మనిషి గురించి ఆలోచించే తీరిక లేక ఉన్న పరిస్థితుల్లో ఇంకా మూడో మనిషి గురించి ఇంకేం ఆలోచిస్తాడు. వాళ్ల పరిస్థితులను ఎలా అర్థం చేసుకుంటాడు. మూడో మనిషి(హిజ్రా)కి ఇంట్లో, వీధుల్లో, సమాజంలో ఎక్కడికి వెళ్ళినా అందరూ ఎగతాళి చేసే వాళ్లే కాని మనిషిలా గుర్తించరు."మూడో మనిషిని / మనిషిగా గుర్తించడానికి

అంగవైకల్యాన్ని / ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి" (పుట-38)

హిజ్రాలను సమాజంలో వాళ్లని గౌరవించాలని, మనిషిలో మనిషిగా చూడాలని, ఆడ, మగ చేసిన తప్పుకు హిజ్రాలుగా పుట్టడం వారి తప్పు కాదని మనిషికి మానవత్వం ఉండాలని హిజ్రాలలో ఉన్న అంగవైకల్యాన్ని తొలగించి వారిని మనోబలంతో ఆదరించాలని కవి మూడో మనిషి గురించి ఆవేదన చెందుతున్నాడని అర్థమవుతుంది.

సైనికుడు మరణం :

'వికారి' కవితా సంపుటిలో మరణం అనే ఖండికలో సైనికుడికి 'మరణం' ఉండదని త్యాగఫలితమేనని కవి చెబుతున్నాడు.

"శత్రువుల కోసం / సరిహద్దుల్లో కాపలా కాసే
సైనికునికి మరణం ఉండదు!
దేశంలోనూ / అతను పొందే మరణం
మరణం కాదు త్యాగం / అతనికి మరణం ఉండదు

(మరణం-42)

సైనికులు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిత్యం దేశరక్షణ కోసం పాటుపడుతూ, గడ్డకట్టే మంచు మధ్యలో చివరికి ప్రాణాలను అర్పిస్తారు. అటువంటి సైనికులకు మరణం ఉండదని, దేశం కోసం ప్రాణ త్యాగం చేశాడని సైనికుడు మరణం గురించి గొప్పగా వివరించారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సంపత్ కుమార్ - మానవత్వపు 'ఆ'లోచనలు'

- జి.మహేష్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మాడభూషి సంపత్‌కుమార్ సార్‌తో నాకు ప్రత్యక్ష అనుబంధం లేదు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎం.ఏ. చదివిన నా మిత్రుడు మధు ఆ తర్వాత మద్రాస్‌లో సంపత్ గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేశాడు. అతని ద్వారా సంపత్ సార్ మంచితనం, నిజాయితీ, మానవత్వం లాంటి ఎన్నో విషయాలు తెలిశాయి. సహృదయత గల మనిషి. బీద పిల్లలకు హాస్టల్ ఖర్చు లకు, పరీక్ష ఫీజులు కట్టడానికి ఇబ్బందిపడే వారికి తన సొంత డబ్బులతో ఎంతోమందిని చదివించారని తెలుసు కున్నాను. నా పిహెచ్.డి. పరిశోధనకు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్న ఆచార్య డి.విజయలక్ష్మి గారు సంపత్ గారి సహాధ్యాయి కావడంతో ఆమె సందర్భానుసారంగా ఆయన గురించి చెప్పేవారు. సంపత్ సార్ ఉద్యోగం ఆచార్యులే అయినా కవిత్వం ఆయన ప్రవృత్తి. సమాజంలో ఏ చిన్న విషయాన్ని చూసినా వెంటనే స్పందించి అక్షరరూపం ఇచ్చేవారు. దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై ఆలోచన మెండు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దుఃఖాలు, సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి ఇలా చెప్పుకుంటూపోతే పలువిషయాలను కలంతో చెక్కేవారు. ఆయన రాసిన "ఆలోచనలు" అనే గ్రంథం గురించి పరిచయం చేస్తాను. ఆలోచన అనేది ప్రతి మనిషికి కూడా సాధారణంగానే వస్తూ ఉంటుంది. ఆలోచన లేకుండా మనిషి మనుగడనే ఉండదు. ఆలోచనలు అంటే సందర్భానికి అనుగుణంగా చేయడం ఒక ఎత్తు. తనకోసం, తన కుటుంబం కోసం, ఆస్తిపాస్తుల కోసం, భవిష్యత్తు కోసం ఆలోచించుకోవడం గొప్ప విషయమే కానీ అంతకుమించి తాను నివసిస్తున్న సమాజం కోసం తోటి సమాజానికి ఇంతో అంతో మంచి చేయాలనే ఉద్దేశం కొందరికే ఉంటుంది. కవి ఆలోచన ఎప్పుడు కూడా ఒక తాత్విక కోణంలో, సూక్ష్మంగా, లోతుగా ఉంటుంది. సంపత్ సార్ ఈ ఆలోచనలు అనేవి ఒకే ఒక్క రోజో చేసినవి కావు. ప్రతి రోజూ ఎన్నో ఆలోచనల సమాహారం నుంచి మంచివి అనిపించినవి కలం పట్టి రాసే వరకు గుర్తుకు ఉన్నవి మాత్రమే మన ముందుం చారు. ఒక వ్యక్తి జీవితం అంటే గత చరిత్ర సంగ్రహ రూపం. అలాంటి ఒక వ్యక్తి అసాధారణమైన ఆలోచనలు చేసి రాశాడు. ఆలోచన అంటేనే నిత్య జీవితంలో జరిగిన సంఘటన. ఆ నిజ జీవితంలో జరిగిన సంఘటనలను అనాటి కాలాన్ని మన ముందు అలాగే సాక్షాత్కరింప చేసే ఆలోచనలు ఏమిటో ఆ ఆలోచనలు చదివి మనం కూడా మనం ఎలాంటి ఆలోచనలు ఈ సమాజం గురించి ఆలోచించాలి అని చెప్పకనే చెప్పిన ఆలోచనలను ఒకసారి పరికిద్దాం.

"తిరగ బడిన జనం
విరిగి పడిన ప్రభుత్వం
1947 ఆగస్టు 15" (పుట:7)

అంటూ స్వాతంత్రోద్యమ కాలంలో మన దేశ ప్రజలు అన్యాయంగా అణగద్రొక్కుతున్నఆంగ్లేయుల పాలనకు ఎదురు తిరిగి సంపాదించుకున్న స్వాతంత్ర్యం గురించి చెప్పాడు. ఎన్నాళ్లనుంచో ఆంగ్లేయులు పెట్టే కష్టనష్టాలను భరిస్తూ వచ్చిన ప్రజలు ఒక్కసారిగా తిరగబడే సరికి విరగబడి పోయింది ఆంగ్లేయుల ప్రభుత్వం దానికి ప్రతిఫలమే 1947 ఆగస్టు 15 రోజున సాధించుకున్న స్వాతంత్ర్యం.

"కలిసి ఉండడమంటే
కాల్చేసే లోకం
1948 జనవరి 30" (పుట:7)

గాంధీ మహాత్ముని గాడ్సే చంపిన విషయాన్ని గురించి తెలుపుతున్నాడు కవి. అప్పుడు గాంధీ ముస్లింలకు ఆశ్రయం ఇచ్చాడనే నెపంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘానికి సంబంధించిన గాడ్సే గాంధీని హత్య చేయడం దారుణం అని అందరూ కలిసి ఉండాలనే ఆకాంక్ష బల పరచడం కవి సహృదయతకు నిదర్శనంగా భావించ వచ్చు.

"ఆవులకు అన్నం లేదు
నాయకులు గడ్డి తిన్నారు

లాలూ గెలుపు!" (పుట:11)

అంటూ లాలూ ప్రసాద్ యాదవ్ ఉత్తరప్రదేశ్లో ఆవులకు గడ్డి కోసం ప్రకటించిన బడ్జెటును లాల్ యాదవ్ గడ్డి కుంభకోణంలో ఇరుక్కొని జైలు పాలయిన సందర్భాన్ని ఆవులకేమో గడ్డి లేదు. అన్నం తినవలసిన నాయకులేమో గడ్డి తింటున్నారు. అని వ్యంగ్యాస్త్రాలతో చెప్పడం నాయకులు ఎలాంటి దుర్మార్గాలకు పాల్పడు తున్నారో ఆలోచించిన తీరులోనే అర్థమవుతుంది.

"చివరకు మిగిలేది
మొదట పొగొట్టుకున్నది

ప్రేమ అ ప్రేమ!" (పుట:13)

మనమందరం నంపాదన, ఆస్తిపాస్తుల కోసం పాకులాడుతూంటాం. కానీ మనకు శాశ్వతంగా నిలిచేది ప్రేమ ఒకటే. బ్రతికి ఉన్నప్పుడు అందరూ పొగొట్టుకునేది ప్రేమనే. కానీ చివరికి మిగిలేది మాత్రం ప్రేమ తప్ప మరొకటి ఏదీ లేదు. అందుకే మొదటి నుంచి చివరి వరకు శాశ్వతంగా మిగిలేది ప్రేమ ఒక్కటే. ప్రేమ గొప్ప తనం ఏమిటో చెప్పాడు కవి.

"ఆకాశమంత పందిరి
భూదేవంత అరుగు

పంజరంలో చిలుక!" (పుట:13)

ఈ ప్రపంచం ఎంతో విశాలమైనది. ఎక్కడికైనా విహరించవచ్చు. కానీ మన ఆలోచనల వల్ల గాని, మన నిస్సహాయత వల్లగాని పంజరంలో చిలుకలాగా బ్రతుకు తున్నాం. ఈ పంజరం లాంటి మనస్తత్వం నుంచి బయటపడాలనే విషయాన్ని కవి తెలుపుతున్నాడు.

"పల్లె పొమ్మంటుంది
పట్నం రమ్మంటుంది
పొట్ట కోసం వలస!" (పుట : 17)

పల్లెల్లో బ్రతకడానికి అవకాశాలు నానాటికి తగ్గి పోతున్నాయి. ప్రపంచమంతా గ్లోబలైజేషన్ అవుతున్నది. పరిశ్రమల్లో యంత్రాలు పెరుగుతున్నవి. అందుకే పల్లెల్లో బ్రతుకు భారం అవుతున్నది. పట్నం రమ్మంటుంది. పల్లె ప్రజలకు పట్నం వచ్చి బ్రతకడం ఇష్టం ఉండదు చాలా మందికి. కానీ నీ పల్లెల్లో వ్యవసాయానికి నీరు లేక, కొందరికి భూములు లేక తప్పని పరిస్థితుల్లో పట్నం రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయాన్ని కవి గమనించి ఎంతో హృద్యంగా చెప్పాడు.

"పస్తులతో చావాలా
ఆత్మహత్య చేసుకోవాలా
పాలుపోయిన రైతు!" (పుట : 17)

రైతు చేసే సేద్యానికి వచ్చే లాభానికి ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తే చివరికి తన చేతికి మిగులుతుంది అప్పులే. ఆకలితో చనిపోవాలా?

ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నా రైతుల గురించి ఆలోచించి చెబుతున్నాడు కవి.

"వోట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్
పార్లమెంట్ ప్రసంగాలు!" (పుట:23)

రాజకీయ నాయకులు ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో వాగ్దానాలు చేస్తూనే ఉంటారు. చేసేది తక్కువ. చెప్పే మాటలు ఎక్కువ. ఈ పరంపర అసెంబ్లీ, పార్లమెంట్ల లో కూడా అనేక వాగ్దానాలు చేస్తూనే ఉంటారు. ఈ వోట్టి మాటలను కట్టిపెట్టి ఒక్క మంచి పని అయినా చెయ్యండి అని కవి తెలుపుతున్నాడు.

"ఎన్నిసార్లు కాటేసినా
పాము ఆరాధ్య దైవమే
ఓట్లు వేయడానికి బారులు తీరిన జనం!" (పుట:33)

పాములో విషం ఉంటుందని తెలుసు. కానీ పాములే ప్రజలు ఆరాధ్యదైవంగా భావిస్తారు. అలాగే రాజకీయ నాయకులు కూడా తమను మోసం చేస్తారని తెలుసు. ఓటేసిన మంచి పని జరగదని తెలుసు. ఇవన్నీ తెలిసి కూడా ఓటు వేయకుండా ఉండలేరు. ఆ ఓటు కూడా పాములాగా విషం కక్కే నాయకుడిని ఎన్నుకోవడానికే ఓటు వేస్తారు తప్ప మంచి నాయకుడిని ఈ ప్రజలు ఎన్నుకోరనే సందేశాన్ని అందించాడు కవి.

"స్మశానాలు కూడా
ఊళ్లై పోతున్నాయి
మనుషులు జీవచ్ఛవాలే కదా!" (పుట:45)

ప్రజలు పెరిగిపోవడం వలన ఊరి పొలిమేరలో ఉండే స్మశానాలు కూడా ఊరి మధ్యలో ఉంటున్నాయి. కబ్జాదారులు స్మశానాలను కూడా వదిలిపెట్టడం లేదు. స్మశానలోనే అందమైన భవనాలు వెలుస్తున్నాయి. ఈ దురాగతాలను ఎదిరించలేని ప్రజలు కూడా బ్రతికి ఉన్న జీవచ్ఛవాల్లా కదా! అప్పుడు చనిపోయినవారికి బ్రతికిన వారికి పెద్దగా తేడా ఏమీ లేదని కవి చెప్పకనే చెబుతున్నాడు.

"మొగ్గలోనే తుంచేస్తున్నది
పూలనే కాదు పిల్లల్ని కూడా
బ్రూణ హత్యలు!" (పుట : 55)

కొన్ని పూలు పూయక ముందే మొగ్గ దశలోనే తుంచేస్తారు. మొగ్గగా ఉన్నప్పుడు తుంచేయడమే ఆ పూలకు అందం. కాని కడుపులో ఉన్న పసిగుడ్డును కూడా నేడు ఎంతోమంది బ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. ఇది నేరం. కర్కశమైన పనని కవి ఆవేదన వెలిబుచ్చుతున్నాడు. బ్రూణహత్యలను ఆపండి. పుట్టబోయే బంగారు బిడ్డల భవిష్యత్తు మొగ్గలోనే తుంచేయకండి అని ప్రాధేయ పడుతున్నాడు కవి.

"మాటలు
గుచ్చుకున్నాయంటే
హృదయం గులాబిదై ఉంటుంది! (పుట:57)

మంచి మనసు గల వ్యక్తులు ఎవరినీ నొప్పించలేరు. ఎందుకంటే వారి మనసు సున్నితం. కానీ కొందరు కర్కశత్వం లాంటి వారు ఉంటారు. వారి మనసులను కవి ముళ్ళతో పోల్చాడు. ఎదుటివారిని దూషించే స్వభావం ఉంటుంది. కానీ మంచి హృదయం కలవారు మౌనంతో చిరునవ్వు చిందిస్తారే తప్ప వారికి ఎలాంటి ఆపద తలపెట్టరని మంచి వ్యక్తిత్వమే శాశ్వతంగా నిలిచి ఉంటుందని కవి తెలుపుతున్నాడు.

"బుగ్గలు మొలవాల్సిన చోట
గుంటలు పడ్డాయి
పేదరికానికి ప్రతీకలు!" (పుట:57)

పసిపిల్లల బుగ్గలమీద సొట్ట పడితే ఆ ఆనందమే వేరు. కానీ కవి ఇక్కడ పసిపిల్లాడు చెంపమీద సొట్ట పడటం అంటే పేదరికానికి ప్రతీకగా చూపుతున్నాడు. పేదరిక పరిస్థితులవల్ల సరైన ఆహారం లేక పసిపిల్లలు బ్రతుకులు బుగ్గిపాలు అవుతున్నాయని కవి తెలుపు తున్నాడు.

"ఊహలకు
ఊపిరి పోయడమే సైన్స్
ఊహే గొప్పది!" (పుట : 63)

ప్రతి మనిషికి ఊహలుంటాయి. కొందరు మాత్రమే కొన్ని ఊహలకు ప్రాణం పోస్తారు. ఆ ఊహకు ప్రాణం పోసే శక్తి సైన్సుకు ఉంది. సైన్సు అభివృద్ధి పరిచే ఏ ఊహాయినా గొప్పది అని కవి సందేశాత్మక విషయాన్ని చెప్పాడు. సైన్స్‌లో జరిగిన ఆవిష్కరణలు అన్నింటికీ ఊహే మూలం. కేవలం ఊహించి వదిలివేయలేదు. సజీవమైన ప్రాణం పోశారని కవి విశ్లేషిస్తున్నాడు.

ముగింపు :

ఈ ''ఆలోచనలు'' గ్రంథంలో కవి ఏదో ఒకటి

రాయాలని రాసినట్లు లేదు. మనం నిత్యం గమనించే అనేకమైన విషయాలనే తనదైన కోణంలో ఆలోచించాడు. ఆలోచించడమే కాకుండా సమాజానికి అవసరమైన ఆలోచనలను ఆవిష్కరించాడు. ఆవిష్కరణ మరో నలు గురు నాలుగు విషయాలను కొత్త కోణంలో, కొత్త ఆలోచనలు చేయడానికి పురుడు పోశాడు. ఈ ఆలో చనలో ఎక్కడా కూడా కవి అనుభవించని ఆలోచనలను చెప్పలేదు. తన జీవితంలో నిత్యం ఎదుర్కొన్న సమస్యల మీద ఆలోచనలు చేశాడు. ఆలోచించడమే కాదు. ఆలోచనల్లో ఎంతో విజ్ఞానం, భవిష్యత్తుకు చైతన్యం నింపే శక్తివంతమైన ఆలోచనలతో రాశాడు. వారి జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలను, వివిధ అంశాలను మన జీవితాలకు కూడా అన్వయించుకునే విధంగా ఉండటం చాలా సంతోషకరమైన విషయం.

ఆధార గ్రంథాలు :

1. శత్రువుతో ప్రయాణం - మాడభూషి సంపత్‌కుమార్ 2. చివరకు నువ్వు గెలుస్తావు - మాడభూషి సంపత్‌కుమార్
3. ఆలోచనలు - మాడభూషి సంపత్‌కుమార్ 4. మూడో మనిషి - మాడభూషి సంపత్‌కుమార్
5. వికారి - మాడభూషి సంపత్‌కుమార్ 6. ఆధునిక తెలుగు కవిత్వం తీరుతెన్నులు - జె. బాపురెడ్డి
7. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ - యాకుబ్ 8. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - నారాయణరావు వేల్చేరు
9. అంతర్జాలం.

వినయ "విద్యాలంకార భూషితుండు"
మితభాషి - 'విల్లివాకపు వాసి'
నొప్పించడెవరిని - మెప్పించునేగాని
కార్యసాధకుడెగాదు - మంచి కవివరుండు
పలుకరించిన చాలు - చిలకరించును నవ్వు
అహంకారమేలేదు - విద్యాలంకారమేగాని
సంపత్‌కు సంపదలేదు - విద్యాసంపద తప్ప

మరియు

గర్వడంబముల్ మనసున - గానరావు
స్నేహసౌశీల్యములెదప్ప - చెడుగునెపుడు
'కలికము'నకైన నీయెడ చేరనీవు
సుగుణశీలుడ - సంపత్‌కుమార ధీర
సతము నినుగాచు గాత! శ్రీవేంకటేశ్వరుండు.

- శ్రీకాకాని వీరయ్య

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వికారి' కవితా వైభవం

- డాక్టర్ ఎస్.బాలాజి, తమిళనాడు.

ప్రస్తావన :

మాడభూషి సంపత్ కుమార్ రచించిన 'వికారి' కవితా సంపుటిలో మొత్తం ఇరవై తొమ్మిది కవితా ఖండికలు ఉన్నాయి.ఈ ఒక్కొక్క కవితా ఖండిక ఒక్కో ముక్తం. ప్రతి కవితలోనూ సామాజిక స్పృహ కనిపిస్తుంది. సమాజంలో జరిగే ప్రతి చిన్న విషయం మీద కవి ఆలోచించి ఒక సుస్థిర రూపాన్ని ఇచ్చారు. ఈ కవితలన్నిటినీ విశ్లేషించుకోవాలంటే సమయం సరిపోదు. కొన్ని కవితలను మాత్రమే విశ్లేషించుకొని నా భావాన్ని వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తాను.

భిక్షగాడు :

"భిక్షగాడు / దేవుడి మీద కన్నా
మనిషి మీదే / ఎక్కువ నమ్మకం-
అందుకే / గుడి బయటే
అడుక్కుంటాను!"

(వికారి, పుట.17)

'మానవుడే విశ్వనరుడని' తెలుసుకున్న భిక్షగాడు శాస్త్రీయ దృక్పథం కలవాడు. శిలను శిల్పంగా మార్చిన మనిషికి అంటరానితనం కట్టబెట్టింది మనిషే. వర్ణాశ్రమ ధర్మాన్ని నెలకొల్పింది మనిషే. సన్నాయి ఊదడానికి, సాకలి పనిచేయడానికి, దివిటీలు పట్టడానికి, పల్లకి మోయడానికి, పనులను చేసి పెట్టిన మనిషి మరలా తాను సృష్టించుకున్న కృత్రిమ బొమ్మను పూజించి, హంగులూ ఆర్భాటాలతో అలంకరణ చేసి, హొమాలు వేసి ఏదో శక్తి ఉందని అందరిని నమ్మించి పడి పడి మ్రొక్కి గుడినుండి వెలివేసిన మనిషి ప్రవర్తన వింతగా ఉంది. ఇక్కడ నిజమైన భిక్షగాడు ఎవరూ? దేవుడా? మనిషా? మనిషి మీద ఆధారపడి ఉన్న భగవంతుడు భిక్షగాడా? సాటి మనిషి మానవత్వంతో సహాయం చేస్తాడని యాచించే భిక్షగాడు ఎవరు? దేవుడా? మనిషా? భిక్షగాడా? ఎవరు ఈ భిక్షగాడు విగ్రహ ఆరాధన చేయరాదని చెప్పిన బుద్ధుడా? ఆత్మనే నమ్ముకుని జీవించమని చెప్పిన వివేకానందుడా? మనిషి ఎలాగైనా మానవత్వాన్ని చాటుకుంటాడని మనిషిని నమ్మిన మాన వతావాద! మనిషి నమ్మిన మానవత్వం ఉన్న మనిషా! గుడి కట్టడానికి అందరూ కావాలి కట్టిన గుడిలో ప్రవేశించ డానికి కొందరే కావాలి. ఇది ఎంతో విచిత్రంగా ఉం దన్నదే మాడభూషి గారి భావన. మాడభూషి చాలా జాగ్రత్తగా కవిత్వాన్ని కదం తొక్కించారు. ఇంతకీ దేవుడు లేడు అని చెప్పలేదు! దేవుడి మీద కన్నా మనిషి మీద ఎక్కువ నమ్మకం. పై విషయాన్ని బట్టి కవిలో అభ్యుదయ భావాలు మెండుగా ఉన్నాయని గ్రహించవచ్చు. భిక్షగాడికి కావలసింది జానెడు పొట్టనిండడం.. దానికోసం గుడి బయటే ఉండి మనిషిని యాచించే దృక్పథం ఉన్న మనిషి మనకంటికి భిక్షగాడు. భిక్షగాడు తన ఆకలి తీర్చుకోవా లంటే గుడి బయటే ఉండాలి. దేవుని పేరుతో జరుగు తున్న తంతును భిక్షగాడు గమనిస్తూనే ఉన్నాడు. అవసరా నికి ఇస్తాడు. అవసరానికి మించి కోరుకునేది ఎవరు ఈ విషయం మనమే తెలుసుకోవాలి. కవి సమాజంలో దేవుని పేరుతో జరిగే అక్రమాలను ఎంత నిశితంగా పరిశీలిం చాడో అందుకే ఈ తంతును గమనించి ఖండించాడు. మనకంటే భిక్షగాడే నయమని మాడభూషి ఎద్దేవా చేశారు. భిక్షగాడు అవసరానికి చేయి చాస్తాడు. అవసరానికి మించి కోరుకునేది ఎవరు? ఈ విషయం మనమే తెలుసుకోవాలి. కవిత చిన్నదే అయినా అందులో ఉన్న పట్టుత్వం గాఢమైంది. అందులోని భావజాలం ఎంతో విలువైనది. ఇదే వీరి కవితలో ఉన్న వైవిధ్యం.

హత్య-ఆత్మహత్య :

"హత్యకూ / ఆత్మహత్యకూ
ఒకటే తేడా- / ఇతరులు / మన మీద
కోపంతో చేసేది హత్య! / ఇతరుల మీద
కోపంత మనం చేసుకొనేది ఆత్మహత్య!"
(వికారి, పుట.21)

హత్యకు ఆత్మహత్యకు తేడాను ఇంతకుమించి కవిత్వీకరించడం అసాధ్యం. అలతి అలతి పదాలతో అద్భుత సాహిత్యం సృష్టించారు మాడభూషి. 'ఇతరులు', 'ఇతరుల' అని ఒక నూలు పోగువంటి అక్షరంతో హత్యకు ఆత్మహత్యకు తేడా నిరూపించారు. హత్యను ఇతరులు చేస్తారు. ఆత్మహత్యను మనం చేసుకుంటాం. మనకు మనంగా ఆత్మహత్య చేసుకోవడానికి బలమైన కారణం ఇతరులు. బలవంతంగా హత్య చేసేవాళ్ళు ఇతరులే. హత్యకు ఆత్మహత్య చాలా ఘోరమైనది. అందుకు కారణ మైన ఇతరులు సమాజాన్ని పట్టి పీడిస్తున్న, వేదిస్తున్నారని, వీరు నరహంతకులు అన్నది మాడభూషి గారి సమాధానం.

కులం :

"కులంకన్నా
మలమే గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం!"
(వికారి, పుట.23)

మానవ మనుగడను సాఫీగా సాగనివ్వకుండా ఆటంకం కలిగించే కులం సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి కరోనా కంటే వేయి రేట్లు ఘోరమైంది. మలమే గొప్ప. కులం కంటే అని కవి వాపోతున్నాడంటే కులం ఎంత నీచమైందో ఎంత దరిద్రమైందో తెలుసుకోవచ్చు, కానీ, మలాన్నే విసర్జించ గలిగిన మనిషి కులాన్ని ఎందుకు విసర్జన చేయలేకపోతున్నామన్నదే కవి ఆవేదన.

శబ్దం :

"శబ్దం / నిశ్శబ్దంగా / కవిత్వంలోకి దూరి
మనసును కలవరపెడుతుంది!
తిమిరంతో సమరం సలిపి
మనిషిలో వెలుగును రేపుతుంది!"
(వికారి, పుట.32)

నిశ్శబ్దం ఎంత భయంకరమైందో శబ్దం కవితా ఖండికలో కవి పొందుపరిచారు. మౌనం గొప్ప ఆయుధం అనడానికి నిశ్శబ్దమే ఉదాహరణ. ఇది నిశ్శబ్దంతో జీవిస్తేగాని తెలియదు.

గొప్ప :

"మరణంలేని
సమాజంకన్నా
మానవత్వంలేని
సమాజం గొప్పదికాదు!"
(వికారి, పుట.40)

మానవత్వంతో బతకాలని కవి ఎంతటి సందేశాన్నిచ్చారు. మరణం లేని సమాజం కన్నా మానవత్వం లేని సమాజం గొప్పదికాదని తన మానవత్వాన్ని చాటుకుంటారు మాడభూషి వారు.

నవ్వు :

"కొందరికి నవ్వేరాదు / నవ్వితే
సంతోషంగా ఉన్నామని / అవతలివాడు
సమస్యలు సృష్టిస్తాడని భయం!
కొందరికి నవ్వేపోదు / నవ్వకుంటే
మనం దు:ఖంలో ఉన్నామని
అవతలివాడు / సంతోషిస్తాడని బాధ!"
(వికారి, పుట.31)

కొందరికి నవ్వెందుకు రాదు - సమస్యలు సృష్టిసార్తనే భయం. కొందరికి నవ్వెందుకు పోదు. మనం దు:ఖంలో ఉన్నామని అవతలివాడు సంతోషిస్తాడనే బాధ! సమాజంలో మనిషి సంతోషంగా ఉన్నా చూసి ఓర్చు

కోలేడు. దు:ఖంలో ఉన్నా బాధ పడడు. మనకు మనంగా నవ్వలేక పోతున్నాం. దు:ఖించలేకపోతునూ ఉన్నాం. మన సమస్య అంతా అవతలి వారి గురించే. అవతలివాడు సంతోషంగా ఉన్నా సమస్యలు సృష్టిస్తాడు. దు:ఖంగా ఉంటే సంతోషిస్తాడు. అవతలి వాడు ఎవరు? మనం కాకుండా ఉంటే సరి. నవ్వు గురించి అందరికీ బాగా తెలిసినా కవి నవ్వుకి, దు:ఖానికి వినూత్నతను చేకూర్చారు.

భయం :

"భయం / భయపెడుతూనే ఉంటుంది
దాన్ని మోసినంత కాలం! / ఒకసారి
భయపెట్టి చూస్తే చాలు / జీవితాంతం
భయపడుతూనే ఉంటుంది!"

(వికారి, పుట.52)

రచయిత నువ్వు భయపెడితే భయమే నిన్ను చూసి భయపడుతూ ఉంటుందని, భయం మనిషిని అంత రాత్మకంగా పీడించే రాక్షసి అనిహెచ్చరిస్తున్నారు. భయ పడవద్దని అంటున్నారు. ఎవరూ బయపడవలసిన పని లేదని అందరికి భరోసాగా ఉండడాని కోసం తన కలం ద్వారా ఇంతటి సందేశాన్ని ఇచ్చి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

ముగింపు :

ఇలా ఒక్కొక్క కవిత్వంలో నూతన ఒరవడిని నింపు కొన్న మాడభూషి కవిత్వం గురించి మాట్లాడుకోవడం ఆషామాషీ కాదు. 'భిక్షగాడు' ఎందుకు బయట అడుక్కుం టున్నాడో? చెరువు ఎందుకు శాపమిచ్చింది? రియల్ ఎస్టేట్ బాడా బాబుల దురాగతాలకు తట్టుకోలేక! హత్య - ఆత్మహత్యకు ప్రేరేపించినవారెవరూ, దాహాన్ని గురించి, కులాన్ని గురించి, భయాన్ని గురించి, నవ్వు గురించి, శత్రువు గురించి, మరణ శాసనం గురించి, మానవత్వం గురించి, మరణం గురించి, రెండంచుల కత్తి గురించి, ప్రకృతి గురించి, సేవ గురించి, భయం గురించి, ఏడుపు గురించి, చీకటి గురించి, గుణపాఠం గురించి, చింతన గురించి, విసర్జన గురించి, అభినందన గురించి, రైతు ఆత్మ కథ గురించి, అద్దం గురించి, యుద్ధం గురించి అభయం గురించి వివరించిన మాడభూషి కుక్క లుంటాయి జాగ్రత్త అనే కవిత ఖండికలో ఈనాటి కూడా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, కవితా సంపుటాన్ని ముగించారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో విషయాలను చర్చించుకొవచ్చు. అయితే, వికారిలోని ప్రతి కవితా సమాజానికి నిలువుటద్దంగా నిలిచి, విజ్ఞాన జ్యోతులు వెదజల్లుతుందనడంలో సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథం :

1. వికారి - మాడభూషి సంపత్ కుమార్, ఏప్రిల్ 2019, వికారి, ఉగాది - పాలపిట్టబుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి వారి 'ఆలోచనలు' - పరిశీలన

- డాక్టర్ క్రొసల రజనీగంగాధర్, ఎల్.బి.నగర్, రంగారెడ్డిజిల్లా , హైదరాబాద్.

సమాజ శ్రేయస్సును హితాన్ని కోరేదే సాహిత్యం. సామాజిక స్పృహ, విలువలు లేని సాహిత్యం సాని శవంవంటిది.కవిత్వం కవిహృదయానికి దర్పణం. తన ముఖం అద్దంలో కనిపించినట్లుగానే తనకవిత్వం కవి హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. కవి హృదయం స్పందించిన తీరును బట్టి కవిత్వం పుడుతుంది. కవి తన ఆలోచనలకు భిన్నంగా వ్రాయలేడు ఒకవేళ ప్రభువుల లేదా ప్రజల మెప్పుకోసం తన మనసు చంపుకొని వ్రాయవలసి వస్తే అది వాసనలేని పువ్వులా, సారంలేనిఉప్పులా, జీవం లేని మనిషిలా నిస్తేజంగా ఉంటుంది అందుకే మంచి మనసున్న మనిషి మాత్రమే మంచి కవిత్వాన్ని వ్రాయగలుగుతాడు. సరళమైనభాష అల్పాక్షరాలలో అనల్పార్థాన్నివ్వగలిగే భాషాపటిమ, చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా పాఠకుని హృదయంలోకి చొచ్చుకు పోయేటట్లుగా చెప్పగలిగే సామర్థ్యం పుష్కలంగా ఉన్న కవి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ అని చెప్పడం అతిశయోక్తి ఎంతమాత్రమూ కానేరదు.

సంపుటి నామౌచిత్యం :

ఈ కవితా సంపుటికి ఆ లోచనలు అని నామకరణం చేయడం ఔచితీమంతంగా ఉంది. ద్వర్థి ధ్వనించేలా ఆలోచనలు-ఆ లోచనలు అని కవి ఇక్కడే అక్షరాలతో విన్యాసంచేయించాడు.అవును నిజమే కవి ఆ(తనవైన) లోచనలతోనే (కళ్ళతో) చూసి అంటే తాను ప్రత్యక్షంగా చూసిన దృశ్యాలపై తనఆలోచనలతో వ్యక్తీకరించబడిన అక్షర సముదాయమే ఈ కవితాసంపుటి అని నామకరణం చేయడంలోనే కవి తన ప్రతిభనుచాటుకొన్నారు. ఈ సంపుటిలోనే ఈశీర్షికతో ఆలోచనలు ,అని ఒక కవిత, కొన్నిఆలోచనలు అని మరో కవిత ఉండడం మరో విశేషం. మన బిడ్డకైనా మనం పెంచుకునే జంతువుకైనా ముద్దుగా అందంగా అర్థవంతంగా పేర్లుపెట్టుకొంటాం. అవికేవలం మనకోసమేకాదు ఇతరులు ఆపేరుతో పిలవడానికి ఇష్టపడేలా ఉండేందుకు ఆలోచించి ఆలోచించి పేర్లు పెడతాం.అదే కావ్యాలకు కథలకు లేదా కవితలకు శీర్షికలను నిర్ణయించేటప్పుడు పాఠకుడు శీర్షికను చదవగానే ఆసాంతం చదవాలనే కోరిక పుట్టేలా మనసును ఆకర్షించేలా ఉండేటట్లుగాఎంతో శ్రద్ధతీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో మాడభూషివారు నూటికి నూరుశాతం కృతకృత్యులయ్యారని చెప్పకతప్పదు. ఆ లోచనలు అనే ఈ శీర్షికను చదవగానే పాఠకుణ్ణికూడా ఆలోచింపచేస్తుంది. అదే ఈ నామకరణంచేయడంలోని కవిగారి ప్రధానోద్దేశమైయండవచ్చు ఆవిధంగా చూస్తే కవి సఫలీకృతులైనారు. కవితల్లోకి ప్రవేశించిచూస్తే ఛందోబద్ధమైన పద్యరచనల్లో విస్తారంగా కనిపించే అలంకారాలు యతి ప్రాసలు మాత్రాగణాలు అలవోకగా ఈ కవితల్లో ప్రయోగించబడిన విధానాన్ని పరిశీలిద్దాం.

అలంకారాలు :

ఏ కవిత్వానికైనా ఆభరణాల్లా మరింత శోభను చేకూర్చేది అలంకారమే. మనిషికైనా కవితకైనా. అందులో అనేక విధాలు. పద్యరచనకైతే ఛందోబద్ధమైన యతి గణ క్రమం ఉంటుంది పాదనియమం ప్రాసనియమం ఉంటుంది. వచన కవిత్వానికి రచయితే తగువిధంగా నియమనిబంధనలను నియమించుకొంటాడు. దానికి ఒక నడక ఒక తూగు ఉంటుంది.ఒక పాదాన్ని తనకుతానుగా స్వేచ్ఛగా నియమించుకొంటే తర్వాత పాదాలనుకూడా అదే నడక నడిపించుకోవవడం రచయిత నేర్పుమీదే ఆధారపడి ఉంటుంది. ఇటీవల సాహితీ రంగంలో వస్తున్న అనేక నూతన ప్రక్రియలలో హైకూలు, నానీలు, రెక్కలు వంటి మినీ కవితలు భిన్న నియమాలతో విభిన్న

ప్రక్రియలుగా రూపుదిద్దుకొంటున్నాయి వాటికి మరింత భిన్నంగా కేవలం మూడుపాదాలతోనే ముక్తకాలుగా చెప్పిన మాడభూషిగారి ఒక కవితలో

తిరగబడిన జనం
విరగబడిన ప్రభుత్వం

(జెండా సాక్షిగా పేజీ 6)

దీనిలోని ఆది ప్రాసాలంకారం 'తిరగబడిన, విరగ బడిన 'అనే పదాలు అల్పాక్షరాలలో అనంతార్థాన్ని వ్వడంతోబాటు ప్రాసపదాలు ఈపాదాలకు మరింత శోభను చేకూర్చాయనడంలో ఎలాంటి సందేహంలేదు .ఇంచుమించుగా ఈ సంపుటిలోని పలు కవితా శీర్షికలలో ఇటువంటి అది అంత్యప్రాసాలం కారాలు కోకొల్లలుగా ఉన్నాయి.మరికొన్ని అంత్య ప్రాసలను పరిశీలిద్దాం

చీలికలకు పునాది
సిద్ధాంతానికి సమాధి

(జెండాసాక్షిగా పేజీ 7)

చేసిన తప్పులకుశిక్ష
ప్రతిపక్షాలకు పరీక్ష

(జెండాసాక్షిగా పేజీ 8)

రక్షకులే భక్షించినారు
రణతంత్రం సృష్టించినారు

(జెండాసాక్షిగా పేజీ 9)

పేరు చుండూరు
హృదయం మండే చూరు

(జెండాసాక్షిగా పేజీ 10)

దళితుడికొక దళితుడు
తిరగబడితె బలితుడు

(ఆలోచనలు పేజీ 13)

పస్తులతో చావాలా
ఆత్మహత్య చేసుకోవాలా

(రైతే కూలి పేజీ 16)

ఇటువంటి అందమైన అంత్య, ఆది ప్రాసలతో పాఠకులను అలరించే కవితలు అనేకం అందులో ఇవికొన్ని మచ్చుతునకలుమాత్రమే

ఆలూలేదు చూలూలేదు
కొడుకుపేరు సోమలింగం
గెలుపో ఓటమో తేలకుండానే
ప్రధానట మన్మోహనసింగం

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజీ 72)

ఈ నాలుగు పాదాలలో పై రెండు పాదాలు సామాన్య విషయమైతే మిగిలిన రెండుపాదాలు విశేషవిషయం ఇలా ఒక విశేషవిషయాన్ని సామాన్యం చేతగానీ ఒక సామాన్యమైన విసయాన్ని విశేషంచేతగానీ సమర్థించినట్లైతే దాన్ని అర్థాంతరన్యాసాలంకారం అంటారు. ఈ కవితలో రెండుపాదాలను మరో రెండు పాదాలతో సమర్థించి అలంకారానికి న్యాయం చేశారు కవి. ఇక క్రమాలంకారాన్ని చూద్దాం

ఆమె ప్రపంచంగురించి బాధపడింది
ఆమె గురించి ప్రపంచం బాధపడింది
మదర్, డయానా

(విషాదాశ్రు తుషారాలు పేజీ 26)

ఆమె ప్రపంచంగురించి బాధపడింది మదర్ అని, ఆమె గురించి ప్రపంచం బాధపడింది డయానా అని అన్వయం చెప్పుకోవాలి.

ప్రాస తర్వాత అంతటి స్థానాన్ని ఆక్రమించింది యతి. తెలుగులో పద్యఛందస్సులో అత్యంత ప్రధానమైనది యతి స్థానం. ఇది పద్యానికైనా గద్యానికైనా వచన కవితకైనా చివరకు సామెతలు సూక్తులకైనా యతి ఎంతో అందాన్ని సంతరింపజేస్తుంది దాని ప్రాధాన్యతను బాగా తెలిసిన మాడభూషిగారు యతిస్థానానాన్ని విరివిగానే ప్రయోగించారనడానికి ఈ క్రింది ఉదాహరణలే సాక్షీ భూతాలు

వచన కవితల్లో యతులు :

పద్యపాదంలోని మొదటి అక్షరాన్ని యతి అని తిరిగి అదే అక్షరం నియమిత స్థానంలో ప్రయోగించడమే యతిమైత్రి అనిఅంటారు .ఇది పద్యనియమమేగాని కవితలకు కాదు. కానీ కవితకు మరింత అందాన్ని చేకూర్చడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. యతిప్రాసలు అలవోకగా ప్రయోగించబడినప్పుడే అది కవితా శరీరానికి సహజసౌందర్యంగా గుబాళిస్తుంది ఛందో నియమాల్లో యతి తప్పనిసరి.కానీ మాడభూషిగారు తన కవితల్లో అలవోకగా అమర్చిన యతుల సౌందర్యాన్ని ఆస్వాదిద్దాం.

కలిసుండమంటే
కాల్చేసేలోకం

(జెండాసాక్షిగా పేజీ 6)

ఈ రెండుపాదాలనూ ఒకే పాదంగా చేర్చి చదివినట్లైతే 'క - కా' యతి. యతిమైత్రి వర్ణాలుగా చక్కగా అమరిపోతాయి. ఇటువంటివే మరికొన్నిటిని పరిశీలిద్దాం

అంటరాని పూలు / అయ్యాయి దేవుడిమాలలు

(జెండాసాక్షిగా పేజీ 6)

పంచశీలబోధించాడు / పాంచభౌతికం చాలించాడు

(జెండాసాక్షిగా పేజీ 7)

ఈ రెండు పాదాలను ఒకపాదంగా చేర్చి కలిపి చదివితే ఆయా పాదాలలోని మొదటి అక్షరాలు యతిమైత్రి వర్ణాలుగా నిలుస్తాయి. ఈ విధానం అలవోకగా అప్రయత్నంగా జరిగినప్పుడే అవి ఆ శోభను సంతరించుకొంటాయి. అదే మాడభూషిగారి రచనలలోని సౌందర్యం ఈ కవితా సంపుటిలో మరెన్నో సరికొత్తవిధానాలు ఊహించని విధంగా చోటుచేసుకొన్నాయి. ప్రతి అక్షరాన్ని తరచి తరచి చూస్తే ఎంతో సాహితీసౌందర్యం మనకు లభిస్తుంది. మరికొన్ని విశేషాలను పరిశీలిద్దాం. సామెతలను యధాతధంగా ప్రయోగిస్తూనే ఆ కవితకు సరికొత్త సొబగులనద్దారు.

సామెతలు :

మంత్రాలకు చింతకాయలు రాలనపుడు
మంత్రులే దిగుతారు రంగంలోకి
గెలుపుధీమా లేనపుడు
కోడెదూడలై దూకుతారు ప్రతిపక్షాలపైకి

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 74)

దీనిలోని మొదటిపాదంలో ఇమిడ్చిన "మంత్రాలకు చింతకాయలు రాలవు" అనే సామెత జనబాహుళ్యంలో నిత్యంనలిగేదే. రాలవు అనే నిశ్చయవాక్యాన్ని రాలనపుడు అని దానికి కొనసాగింపుగా మిగిలిన మూడు పాదాలను అర్థవంతంగా అమర్చడం దీనిలోని ప్రత్యేకత అలాగే మరొకటి చూద్దాం

ఆలూలేదు చూలూలేదు
కొడుకుపేరు సోమలింగం
గెలుపో ఓటమో తేలకుండానే
ప్రధానట మన్మోహనసింగం

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజీ 72)

పై రెండు పాదాలలోని సామెత జానపదులనోట్లో నాట్యమాడుతూనే ఉంటుంది.ఆ సామెతకు రాజకీయ వింతలను జోడించడంలోనే కవిప్రతిభ కనబడుతుంది. ఇటువంటివే మరికొన్ని

గుమ్మడికాయ దొంగలంటే
భుజాలు తడుముకొంటున్నారు

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 63)

కట్టె కొట్టె తెచ్చె

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 55)

తిన్నఇంటివాసాలు లెక్కపెట్టడం

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 52)

ఆదిలోనే హంసపాదు

(ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 48)

దున్నేవాడిదేభూమి
ఏలేవాడిదే రాజ్యం

(కొన్నిఆలోచనలు పేజి27)

అరునెలలు కలిసుంటే
వారు వీరౌతారు
(విషాదాశ్రు తుషారాలు పేజి 26)

ఆకాశమంత పందిరి
భూదేవంత అరుగు
(ఆలోచనలు పేజి 12)

అసలే కోతి
ఆపై కల్లుతాగెను
(జెండాసాక్షిగా పేజి 9)

ఆంగ్లభాషా వ్యామోహంలో మరుగున పడిపోతున్న చక్కని అచ్చతెలుగు గ్రామీణ సామెతలను కవిత్వీకరించి తన రచనలో వాటికి పెద్దపీటవేసి మరలా ప్రాణంపోసిన మాడభూషిగారి కవిత్వం అజరామరం అమృతతుల్యం.

సినిమా పాటల పేరడీలు :

కొన్ని సినిమాపాటలలోని పదాలనుతీసుకొని పేరడీ చేశారు వాటిలో మురిసి తడిసిముద్దవుదాం రండి !

ఓటేస్తే మరచిపోగలను
మరచిపోతే ఓటెయ్యగలను
ప్రజానాయకుడు
(బాణీలు పేజి 19)

తాగితే మరచిపోగలను, మరచిపోతే తాగగలను అనే పాటకు పేరడీ దీనికి మూడవ పాదంగా ప్రజా నాయకుడు అని తగిలించడం కొసమెరుపు.

ఆదిభిక్షువు వాడినేదికోరేది
బూడిదిచ్చేవాడినేది అడిగేది
భార్యకు కోట్లు అల్లుడికి అధికారం
(బాణీలు పేజి 20)

ఇందులో భార్యకు కోట్లు అల్లుడికి అధికారం అనే చివరిపాదం దీనికి కొసమెరుపు. గురజాడవారి గేయాన్ని కూడా కవి ఎలా ఉప యోగించుకున్నారో చూడండి. దేశమంటే మట్టికాదు మనుషులని గురజాడ వారంటే మాడభూషివారు ఇలా నగ్నసత్యాన్ని చెప్పారు.

దేశమంటే మనిషికాదోయ్
దేశమంటే మట్టోయ్
భూబకాసురులు
(బాణీలు పేజి 19)

వీటిలో చివర ఉన్నవి వారిపై విసిరిన చెణుకులు

క్రొత్తపదాలసృష్టి :

కవి బ్రహ్మ అన్న మాటను సార్థకం చేసుకొంటూ కొన్ని పదాలను సృష్టించుకున్నవాడే కవిబ్రహ్మ, కాకపోతే అతడు కేవలం కవిమాత్రమే కాగలడుగాని కవి బ్రహ్మ కాలేడు. ఇది అక్షరసత్యమని మాడభూషివారు నిరూపించు కున్నారు.

ఊరంతా నిద్రపోతోంది
ఆకాశమంతా మగమేఘాలు
చెమ్మగిల్లిన కళ్ళతో రైతు
(రైతేకూలి పేజి 16)

కవి తనకుతానుగా సృష్టించుకొన్న పదం ''మగ మేఘాలు'' ఎంతనిగూఢమైన అర్థంతో ప్రయోగించారో చూడండి. మేఘాలలో ఆడమేఘాలు మగమేఘాలు ఉండవు కానీ వర్షించని మేఘాలతో రైతు కన్నీళ్ళు పెట్టు కొంటున్నాడనే ఆవేదనాభరితమైన సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించడానికి వాడిన పదం ''మగమేఘాలు'' అద్భుతమైన పదసృష్టి.

తెగిపోతే గాలిపటం
కట్టేస్తే నిర్బంధం
ఎటూతేల్చుకోలేని "జ నం ఢా "
(ఆలోచనలు పేజి 14)

ఇక్కడ కవి జండా అనే పదాన్ని ఎలా వాడు కున్నారో, ఆ పదంలోని అక్షరాలతో ఎలా ఆడుకున్నారో చూడండి. జనం ఢా అని ఒక అర్థమైతే న అనే అక్షరాన్ని తొలగించి చదివితే జండా అనే అర్థంలో అక్షరాలను విరిచి అర్థాలను చెప్పారు. ఇటువంటి సాహితీ సర్కస్ ఫీట్లు ఎన్నోమనల్ని కదిలిస్తాయి అలరిస్తాయి ఆలోచింపచేస్తాయి. అదే మాడ భూషివారి రచనల్లోని గొప్ప (ధ) తనం.

ఇంకా ఇంకా తరచిచూస్తే "నరికేసినకొమ్మ /కొడవలై మొలుస్తుంది/ దళితచైతన్యం (కొన్నిఆలోచనలు .పేజి 29)"దళితులూ దళితులూ రాసుకొంటే / రిజర్వేషన్లు రాలిపోతాయి / మాలమాదిగల హింసారిహింస" (ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 44) వంటి దళితులకు సున్నితమైన హెచ్చరికలు, "ఎన్నిసార్లుకాటేసినా / పాము ఆరాధ్యదైవమే /ఓట్లెయ్యడానికి బారులుతీరిన జనం" (దృశ్యాలు పేజి 33) "అడవంతా వెదికినా / ఒకనక్కా కనిపించలేదు / రాజధానిలో రాజకీయపండగ " (ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 48) "చివరకు చెట్లకన్నా / జెండాకొమ్మలే ఎక్కువవు తాయి /నాయకుడికోపార్టీ" (ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 48)"ఓటరుమహాశయులకు / మతిమరుపు జాస్తి / అవినీతి మహానాయకులకు/ అదేకదా ఆస్తి" (ప్రత్యక్ష సాక్ష్యాలు పేజి 66) వంటి రాజకీయాల నిజస్వరూపాలను బట్టబయలు చేయడం వంటి కవితలు "ఆయుష్షు తీరిపోయిన / నీ కళ్ళను ఇలాపడేయ్ /పసిగుడ్డునుచేసి / మరో వందేళ్ళు బతికిస్తా" (వికృతులు పేజి 31) "నీక్కావలసిన అన్నం దానంచేస్తే / నువ్వుచచ్చి ఊరు కుంటావ్ / నీకుపనికిరాని కన్నుదానంచేస్తే నువ్వు బతికిఊరేగుతావ్ " (వికృతులు పేజి 31) నేత్రదానం గురించి ప్రబోధాత్మకమైన కవితలు "ఆవులకు అన్నం లేదు / నాయకులు గడ్డితిన్నారు/లాలూ గెలుపు" (ఆలోచనలు పేజి 11) వంటి రాజకీయనాయకుల అవినీతికి చురకలు, వాతలుపెట్టే కవితలు అసంఖ్యా కంగా ఇందులో చోటుచేసుకొన్నాయి. పద్యకావ్యాలకు ఏమాత్రం తీసిపోనివిధంగా అలంకారాలు యతిప్రాసలు మాత్రాగణాలు నూతన పదప్రయోగాలతో పాఠకులను ఉత్తేజపరచడమేకాకుండా ఆలోచింప చేసేవిధంగా రచించబడిన ఈ ఆ లోచనలు కవితాసంపుటి పేరును సార్థకం చేసుకున్నది. జెండాసాక్షిగా కవిత మూడు పాదాలే అయినా మూడో పాదంలోని తేదీలను చదవగానే ఆరోజు యొక్క ప్రాముఖ్యత మన కళ్ళముందు సాక్షాత్కరించే విధంగా ఉందిఇదివరకెన్నడూ ఎవ్వరూ చేయని రచనా విధానమిది.

ఈ విధంగా మాడభూషివారి సాహిత్య బావి నుండి ఎంత తోడుకోగలిగితే అంత ఊటచెలమిలా ఊరుతూనే ఉంటుంది. క్రొత్త క్రొత్త ప్రక్రియలకు క్రొత్తక్రొత్త పదప్రయోగాలకు, క్రొత్త క్రొత్త పోకడలకు మార్గదర్శకంగా నిలిచే మాడభూషి సంపత్ కుమార్‌గారి రచనలను చేయి దిరిగిన రచయితలతోబాటు వర్ధమానకవులు సహితం పునః పునః పఠించాల్సిన అవసరం ఎంతైనాఉంది.

శుభమ్ భూయాత్ ! సర్వేజనా సుఖినోభవంతు !!

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సంపత్ కుమార్ రచనలు - అమ్మ పాత్రచిత్రణ

- డాక్టర్ ఎస్. యజ్ఞశేఖర్, శాఖాధిపతి, తెలుగు విభాగం, మద్రాసు క్రిష్టియన్ కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఆచార్య మాడభూషి గారితో నాకు రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. పరిచయమైన నాటినుండి నేటి వరకు వారిని మా కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్‌లో సభ్యులుగా ఉన్నారు. అనేక సంవత్సరాలుగా తెలుగు సాహితీ సేవలో తమను అంకితం చేసుకున్న మహామనీషి సంపత్ కుమార్ గారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తి లోనికి రాకముందు పాత్రికేయులుగా కూడా సేవ చేసిన ఘనత వీరిది. మితభాషిగా, నిరాడంబరుడు, నిగర్వి, పరోపకారి ఆంధ్రాంగ్ల, తమిళ భాషల్లో పట్టున్న మేధావి. అనేక సందర్భాల్లో నేను కూడా ఆశ్చర్యపరచే అంశం ఏమంటే ''ఇందుగలదండు లేడు'' అనే మాట చక్కగా వీరికి సరిపోతుంది. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన ఆదర్శమూర్తి. బహుశా తెలుగు శాఖ నిర్వహించినన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సులు మరే తెలుగు మరే ఇటీవలకాలంలో తెలుగుశాఖ నిర్వహించలేదన్నది నిజం. వీరి సాహితీ సేవకు వృత్తిపట్ల నిబద్ధత ఈస్థాయికి చేర్చింది.

సంపత్‌గారి రచనలన్నీ అభ్యుదయ భావాలతో కూడుకుని ఉన్నాయనడంలో సందేహం లేదు. వీరి రచనలన్నీ అమూలాగ్రం పలుమార్లు చదవడం ఒకటికి పదిమార్లు మననం చేసుకుంటూపోతే మరో శ్రీశ్రీ గోచరిస్తాడు. శ్రీశ్రీ గారి రచనలు వీరిని ప్రభావితం చేశాయని నమ్ముతున్నాను. ఈ శతాబ్ది శ్రీశ్రీగా మాడభూషి గారిని అభివర్ణించవచ్చు. ప్రతి కవితా ఖండికలోని వస్తువు నేల విడిచి సాము చేసినట్లు అగుపించదు. కవితా ఖండిక అత్యల్ప పదాల్లో అనల్పార్థం దాసి ఉందనడంలో సందేహం లేదు. ఒక్కొక్క స్థితిని రచయిత కవితా వస్తువులన్నీ సామాన్యుని స్థితి, దానావస్థలు సమాజంలోని రుగ్మతలు, రాజకీయాలు, దుర్మార్గం, శత్రువులు, మిత్రులు ఒక్కటేంటి ప్రపంచంలోని మంచి, చెడు, అవస్థ, దురవస్థలు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. తన కవిత్వంలో ఏదో ఒకటి రాద్దామనే ఆలోచనకన్నా ఏది రాస్తే పది కాలాలపాటు ప్రజల హృదయాల్లో నిలచిపోతుందనే విషయాన్ని పసిగట్టి ప్రజాహృదయాలను ఒక్కటి చేసే ప్రయత్నంలో మాడభూషి సఫలీకృతమయ్యారు. నేను ఎంచుకున్న అంశం ''మాడభూషి రచనల్లో అమ్మ పాత్ర చిత్రణ'' ఎప్పుడు వాటినైనా అనేకమార్లు చదవడం వల్ల అన్నింటికన్నా ముఖ్యగా నన్ను ప్రశంసించిన అంశం ''అమ్మ''.

సంతానానికి కారణభూతులైన వారు తల్లిదండ్రులైనా, నవమాసాలు మోసేది తల్లే. సృష్టిలో ప్రతి ప్రాణికి మూల కారణం అమ్మ. జన్మనిచ్చి పాలిచ్చి ఆహారం తినిపించి ప్రేమను పంచేది అమ్మ. విశ్వంలో అన్నింటికన్నా తీయనైన పదం అమ్మ. అమ్మ ప్రత్యక్ష దైవం. అమ్మ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిది.

కుమార శతకంలోని పద్యంలో పంచ మాతలు కనిపిస్తారు.

ధరణి నాయకు రాణియు
గురు రాణియు నన్న రాణి కులకాంతనుగ
న్నర మణి దను గన్నదియును
ధరనేవురు తల్లులనుచు దలుపు కుమారా
రాజు భార్య (రాణి) అన్న భార్య (వదిన)
గురుని భార్య (గురుపత్ని), భార్య తల్లి (అత్త)
కన్నతల్లి వీరిని పంచయాతలుగా భావించాలి.

అమ్మ మనకు ముద్దు - తియ్యని అనుబంధాన్ని అదే అమ్మ పిన్నమ్మ, సవతి తల్లో అయితే ఆ 'అమ్మ'తో మన కుండే అనుభూతి వేరే. వీరి రచనల్లో అమ్మ, చిన్నమ్మలు కనిపించి కొంత హడావుడి చేస్తారు. తీయని భావనను

వీరి రచనల్లో ఎలా ప్రతి ఫలింపజేయాలో తెలియజేస్తుంది. నా "అమ్మ" పాత్ర పరిశీలన.

శత్రువుతో ప్రయాణం...

"ఆమె"లో -
ఒక 'అమ్మ' కూతురి,
చిన్నప్పటినుండీ అంతే
చిన్నచూపుతోనే పెరిగింది
తాను నిద్రపోందే
ముద్దుల కొడుకుని నిద్రిపుస్తూ
"కర్రెముందా" అని తన్ని లేపే అమ్మ"

'ఆంధ్రలో అన్నలకు ఎలా కరువులేదో మాకు తమిళంలో అమ్మలకు, చిన్నమ్మలకు కరువు లేదు.'

మాడభూషి సంపత్ గారు అమ్మలు, చిన్నమ్మలు ఏ విధంగా రాజకీయాల్లో ఆరితేరారో, వారి మధ్య ఉన్న అవినాభవ సంబంధాన్ని మరియు రాజకీయాలతో ముడిపడిన తీరును వ్యంగ్యంగా, నర్మగర్భంగా తెలిపారు.

అదే కవితా ఖండికలో ఆమె అవ్వగా ఎలా భార్య బానిసగా, బాధల్ని పంచుకుని ఇంట్లో సెలవులేని పనిలో సేదదీరని తల్లి పరిమళించనివ్వందని మనిషిగా గుర్తించ మని కవి రోదిస్తాడు. బహుశా తల్లి పడ్డ కష్టాలు కళ్ళముందు నిలిస్తే పుట్టిన కవి.

"ఆమె"...

"మగాడు" - లో
మగాడంటే మొనగాడని చెప్పింది అవ్వ
అవుననుకున్నది అమ్మ
భర్తలంటే భరించే వాడని చెప్పింది
"వికారి"
చెరువు శాపం కవితా ఖండికలో
నా దాహం తీర్చిన కల్పవల్లి
నన్ను గుండెలకత్తుకున్న పాలవెల్లి
నాకు బువ్వ పెట్టిన అమ్మ తల్లి"

చెరువున్న చోటును పూడ్చేసి అపార్ట్‌మెంట్లు కట్టేసిన స్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణించిన తీరు అద్భుతం.

చివరకు నువ్వే గెలుస్తావు

"అమ్మ" అనే కవితా ఖండికలో

అమ్మను శ్రమకు, కష్టాలకు, కన్నీళ్ళకు, పాతతరం కొత్తతరం అమ్మలు, ఉదాహరణగా మిగిలిన తీరును వర్ణిస్తారు.

అమ్మ / ఒక ఇసుర్రాయి
ఒక రుబ్బురాయి
ఒక రోలు
ఒక రోకలి
పొయ్యిలోని కట్టె
కట్టెలోని పొగ
అంతలోనే అమ్మలో ఎంతమార్పు
అమ్మ

ఒక మిక్సీ / ఒక వాషింగ్ మిషన్ / అమ్మ ఒక గ్రైండర్ / అమ్మ ఒక గ్యాస్‌స్టవ్ / అమ్మలో నాకు అమ్మ కని పించదు. అమ్మ విశ్రాంతి లేని ఎండిపోయిన కొమ్మయి అమ్మంతా వస్తువులే

అమ్మ ఒక పనిమనిషి
గని మనిషి
ఎంత తప్పినా
పని వస్తూనే ఉంటుంది.
అమ్మంటే తరగని పని
అమ్మ నిద్ర పోతుంటే
అప్పుడే కరెంటు పోయి ఆగిన యంత్రంలా కనిపిస్తుంది.
అమ్మ మేల్కొని వుంటే గుడిలో వినిపించే మంత్రం
అమ్మ పనిచేస్తే బరువు మోస్తున్న బండి
పగలంతా యింట్లో దీపంలా అమ్మ
రాత్రి కలలో అమ్మకు పగలు కనిపిస్తుంది

అందర్నీ జాగ్రత్తగా పడుకోబెట్టి
వాళ్ళ అందర్నీ జాగ్రత్తగా లేపేది అమ్మే
అమ్మ ఒక చెట్టుపూలు పూస్తుంది
కాయలు కాస్తుంది
పళ్ళు పంచుతుంది
అమ్మ చిగురించిన చెట్టు
అమ్మ ఆకులు రాలిపోయిన రెమ్మ
అమ్మ మోడు వారిన
అమ్మ విశ్రాంతి లేని చెట్టు
ఎండిపోయిన కొమ్మయి
ఇంట్లోని పొయ్యిలోకి చేరి కాలిపోతూ వెలుగునిస్తుంది.
అమ్మ వెలిగిపోతూనే ఉంటుంది.
వెలుతురుగానే ఉంటుంది
చెట్టు నుండి రాలిన విత్తనం
చెట్టుగానే పుట్టినట్టు
అమ్మ మరణించిన తరువాత
అమ్మగానే పుడుతుంది.

స్త్రీ అంటే అమ్మ అని అమ్మంటే తన శరీరాన్ని కాల్చు కొని మాడి మసైపోయే ఒక వృక్షంలా, పళ్ళనిచ్చే చెట్టులా, నీడలా, తోడుగా ఉంటుందని చెప్పిన కవిత హృదయాన్ని తడుతుంది, కొట్టుతుంది, తట్టి లేపుతుంది. అమ్మ మరలా అమ్మగా పుట్టి మరలా మనకు అలుపెరుగని సేవ చేస్తుందని చెప్పే కవితలో హృదయం ఉన్న ప్రతి బిడ్డా "అమ్మ"ను దర్శిస్తారు.

మూడో మనిషి "తల్లి"...

ఒక తల్లి
పదిమంది పిల్లల్ని
కనిపెంచి పోషిస్తుంది
పదిమంది / పిల్లలు
ఒక తల్లిని పోషించలేక
రానురానుమనుషులు బలహీనపడిపోతున్నారు.
అందుకే తల్లి ఇపుడు ఒకే బిడ్డతో సరిపెట్టు కుంటుంది.

ముగింపు :

మాడభూషి సంపత్‌గారి కవిత్వంలో గాలిమేడలు గానీ అద్దాల మేడలు, అందాల రాశులు వారి అంద చంధాలు ఏవీ కనిపించవు. కవిత్వంలో కనిపించేదంతా ప్రత్యక్షంగా మనం చూస్తున్న సమాజం పరిస్థితులు ఈ కాలంలో అమ్మకు మమ్మీకీ తేడా కూడా తెలియని యువతకు అమ్మ అనురాగం, ఆప్యాయత, నిరంతర శ్రమ జీవితంలో పొందలేకపోయినవి మనకు స్పష్టంగా కనిపిస్తుంది. సంపత్ గారి రచనల్లో అమ్మను, అమ్మ ప్రేమను చవి చూసి, మనకూ పంచిపెట్టి అనేక ప్రతిరూపమే "అమ్మ"గా చిత్రించిన సంపత్‌కుమార్ రచనలు భావితరాలకు మార్గ దర్శకంగా ఉంటాయి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపత్ కుమార్ గారి సాహిత్యం - కవితా వసంతం

- డాక్టర్ ఐ. శివనాగార్జున రెడ్డి , తెలుగు అధ్యాపకుడు, ఐఐఐటి, ఒంగోలు.

కవి పరిచయం :

తెలుగు సాహిత్యం అంటేనే ఒక మధురమైన అమృత భాండాగారం. ఇందులో ప్రాచీన కవుల నుంచి నేటి వరకు అనేకమంది కవులు తెలుగును ఆస్వాదిస్తూ వస్తున్నారు. ఆధునిక తెలుగు కవుల్లో మాడభూషి సంపత్‌కుమార్ గారు తెలుగు ఆచార్యులుగా, కవిగా, సంపాదకులుగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, అనువాదకులుగా సాహిత్యంలో ప్రసిద్ధి పొందారు. వీరు 1959లో సెప్టెంబర్ 17వ తేదీన శ్రీనివాసాచార్యులు పట్టమ్మ దంపతులకు చిత్తూరు జిల్లా దేవళంపేట, కమ్మపల్లె గ్రామంలో జన్మించారు.

విద్యాభ్యాసం :

సంపత్ కుమార్ గారి విద్య ఒక సామాన్యస్థాయిలో మొదలై అత్యున్నత స్థాయి వరకు చేరుకుంది. బోడిదేవర పల్లెలో ప్రాథమిక విద్యను, కొత్తపల్లెమెట్టలో హైస్కూల్ విద్యను, చిత్తూరు పి.సి.ఆర్. కళాశాలలో ఇంటర్మీడియట్, వి.పి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు చదివి అక్కడే జి.వి.ఎన్.ఆర్. కృష్ణమూర్తి పర్యవేక్షణలో "ఎరుకల తమిళ బంధువాచకాలు - సామాజిక భాషాశాస్త్ర విశ్లేషణ" అన్న అంశంపై 1986లో ఎం.ఫిల్. డిగ్రీ పట్టభద్రులయ్యారు. ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో "ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం" రాసి మధురై రామరాజు విశ్వవిద్యాలయం నుంచి 1990లో డాక్టరేట్ పొందారు. మధుర రామనాథపురం జిల్లాలో తెలుగు భాషా జానపద సాహిత్యం అనే అంశంపై యూ.జి.సి. ప్రాజెక్టు కోసం పరిశోధన చేశారు. తెలుగుశాఖ మద్రాసు విశ్వవిద్యాలయం నుండి 2015లో "అత్యాధునిక ఆధునిక తెలుగు కవితా దృక్పథాలు" అన్న అంశంపై పరిశోధన చేసి డి.లిట్. పట్టాను పొందారు.

కవిత్వ ప్రస్థానం :

కవి అంటేనే కినిపించనివాటి చోటకూడా తాను ప్రవేశించేవాడు. అందుకే "రవిగాంచనిచో కవి గాంచును" అన్నారు. మాడభూషి వారి రచనలు సాహిత్యానికి, సమాజానికే కాకుండా భావిపరిశోధకులకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. ఒక్కసారి వీరి రచనలు గమనిస్తే, గడ్డిపరకతో విప్లవం, సామాజిక శాస్త్రవేత్త పెరియార్, అమ్మవాసన, జన్మభూమి, ఆంధ్ర మహాభారతం - వివిధ శాస్త్ర పరిజ్ఞానం, కవితా! ఒకవితా! వస్తువు భాషాశైలి, జీవితం కవిత్వం, వ్యాససంపద, వ్యాకరణ విజ్ఞానం, తెలుగు దీప్తి, తెలుగు వెలుగు, తెలుగు జానపద కళలు, అనువాద విజ్ఞానం, శత్రువుతో ప్రయాణం, ప్రజారోగ్యానికి పనికి వచ్చే సూత్రాలు సులబమైన మార్గాలు, ఒక విజేత, ఆలోచనలు, వికారి, పరిశోధననాడు, నేడు, రేపు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడో మనిషి, ధనికొండ హను మంతరావు సాహిత్య 21 సంపుటాలు, ఇలా అనేక రచనలు చేసి, వందకుపైగా వ్యాసాలను వివిధ రకాలుగా రచన చేసి తెలుగు సాహిత్యంలో ఆచార్యుర్యునిగానే ఉన్నా కవిగా కూడా తన అమూల్యమైన అనుభవాలను, వాక్కులను రచనలుగా పాఠకులకు అందించారు.

మాడభూషి సంపత్‌కుమార్ గారి రచనలలోని కవిత్వాన్ని అందులోని జీవిత సత్యాల్ని గమనిస్తే వికారి రచనను గమనిస్తే 'వికారి' అనేది తెలుగు సంవత్సరమైన ఇందులో వికృత చేష్టల మానవుల వికారాలకు అసహ్యింపుగా ఉంది. అందుకే పేరుకు దగ్గట్టు లోపలున్న కవితలను చదివితే 'వికారి'కి ఆ పేరు ఎందుకు పెట్టారో తెలున్తుంది. ఇందులో 29 కవితలున్నాయి. ప్రతి కవిత ప్రస్తుతమున్న కాలాను గునంగా ఏదో ఒక నిజజీవిత సన్నివేశ సంఘటనలకు అద్దం పడుతుంది.

"బిక్షగాడు" అనే కవితలో ఇలా అంటాడు సంపత్ గారు "నాకు దేవుడు మీద కన్నా / మనిషి మీదే ఎక్కువ నమ్మకం / అందుకే గుడిబయటే / అడుక్కుంటాను"

ఇందులో ఎక్కడున్నాడో కన్పించని దేవుడిని పదే పదే వేడుకోవడం కన్నా మన కల్లముందు కన్పించే మనిషిని అడుక్కుంటే కొంతైన ప్రతిఫలం ఉంటుందన్న సత్యాన్ని తెలిపారు."గుణపాఠం" కవితలో ఇలా వివరించారు.

"వానాకాలం వస్తుంది/ తడిసి ముద్దచేస్తుంది
ఎండకాలం వస్తుంది /కాల్చి బూడిదచేస్తుంది
వసంతకాలం వస్తుంది / సంతోషాన్ని వెదజల్లుతుంది"

సంవత్సరం పొడవున ప్రకృతి ఇన్ని పాఠలు నేర్పిస్తూ ఉంటే అన్ని తరగతులూ ఎగొట్టి నువ్వుజీవితంలో ఏం పాఠాలు నేర్చుకొంటావు ప్రకృతి నేర్పించడానికి తప్ప శిక్షించడానికి కాదు. నువ్వు మరీ మొండి కేస్తే తప్ప బెత్తం పట్టుకొని గుణపాఠాలు నేర్పదు అని ప్రకృతే మనకు ఆదర్శ గురువు అనే నగ్నసత్యంను తెలిపారు.

శత్రువుతో ప్రయాణం అనే రచనలో మొత్తం 36 కవితలు రాసారు. అందులో గమనిస్తే "తెలుగు వెలుగులు" అనే కవితలో తెలుగు భాష, తెలుగు కవుల గురించి వర్ణించిన తీరు అద్భుతం, అమోగం.

"మబ్బుచాటునున్న / తెలుగు సొబగులకు
మల్లెవాననలు జోడించి / తెలుగు సాహితీ
తేనెలొలికించాడు నన్నయ"
"దేశికవితకు పట్టంకట్టి / ద్వీపదలో కవితపట్టి /
తెలుగు భాషకు వెలుగు / చూపినవాడు పాల్కురికి
సోమన"
"ఇంపు సొంపైన తెలుగులో / భారత, రామాయణాలు
వెలార్చి / తేట తెలుగుకు వెలుగులు/ తెచ్చినవాడు
తిక్కన"

మందార మకరందంలో ముంచెత్తి తెలుగు పలుకులకు మాధుర్యం తెచ్చాడు, భాగవతానికి వెలుగులు ఇచ్చాడు పోతన, అష్టదిగ్గజాలలో అగ్రగణ్యుడు, ఆంధ్ర భోజునికి ఆప్తుడు జిగిబిగితో రమణీయ కవితలల్లినాడు ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన.

"తెలుగు సొరభాలు / విరజిమ్మినారు విశ్వ మంతా/ ఆధునికకవులెందరో/అద్భుతమైన సాహిత్య ప్రక్రియా ధోరణులతో / తాడి దన్నువాడి తలదన్ను వాడొకడు!"

ఈ విధంగా ప్రాచీన కవుల నుండి నేటి వరకు వచ్చిన ఆధునిక కవులందరిని ఈ తెలుగు వెలుగు కవితలో ప్రస్థావించారు.

"ఒక విజేత" సంపత్ కుమార్ గారి ఈ రచన కవితా సంకలనం. ఇది తెలుగువాళ్ళు "అబ్దుల్ కలాం"కు అందిస్తున్న నివాళి. ఇందులో 258 కవితలు ఉన్నాయి. వీటన్నింటిని సేకరించి ఒక కవితా సంకలనంగా తీసుకొచ్చిన ఘనత, ప్రధాన సంపాదకులుగా ఖ్యాతి వచ్చినది సంపత్ కుమార్ గారికే దక్కింది. ఈ సంకలనం చేస్తూ ఇలా అంటారు మాడభూషి గారు.

జీవితంలో కవిత్వం రాయాల్సిన సందర్భాలు చాలా తక్కువ. ఎందుకంటే జీవితం చాలా పెద్దది. బరువైంది. కాబట్టి దాన్ని మోసుకొని తిరగడానికే సమయం చాలదు. ఇక కవిత్వం ఎప్పుడు రాస్తాం. అయితే కవిత్వం రాయకుండా ఉండలేని సమయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయంలో వెలువడిన కవితాసంపుటి ఇది. మనం సాధారణంగా చెడ్డవాళ్ళకు ఎక్కువ సాయం చేస్తూ ఉంటాం. అనుకరిస్తూ ఉంటాం. అయితే అప్పుడప్పుడు మనకు తెలియకుండానే మంచివాళ్ళను కూడా అనుకరిస్తూ ఉంటాం. అలాంటి సందర్భంలో వెలువడిన కవితా సంకలనం ఇది. ఈ విధంగా మాడభూషిగారు తన జీవిత అనుభవంలోనుంచి, సమాజంను గమనించిన తీరును బట్టి ఈ మంచి వాక్యాలు చెప్పడం జరిగింది. "తమిళ జానపదకళలు" అనే రచనలో తమిళ సాహిత్యానికి చెందిన 21 కవితలను సమకూర్చి ఒక గ్రంథంగా వ్రాయడం జరిగింది. "ఏర్‌ప్పాపట్టు (వ్యవసాయపాటలు) ఇందులో పొలాన్ని దున్నేటప్పుడు పాడే పాటలు.

"వాన వచ్చింది మామా / మట్టి తడిసింది మామా / ఎద్దును బయటికి తీసుకురా / నాగలిని సిద్ధంచెయ్యి" అనే ఈ వ్యవసాయపాట వాన కురిసిన వెంటనే నేలను దున్నాలన్న విషయాన్ని తెలియజేస్తుంది.

"ఏటిగట్టున టేకుచెట్టు / పొంగి పొర్లే కావేరి కళ్ళ ముందే వరిపండు / పచ్చనైన పాండ్యదేశం" ఈ పాట పాండ్యదేశం, కావేరి గురించి. చోళ, పాండ్య చేర దేశాల్లో వ్యవసాయం పరిపుష్టిగా సాగినట్లు తెలు స్తుంది. "చివరకు నువ్వే గెలుస్తావు" ఈ కవితా సంపుటిలో అనేక విషయాలు ప్రస్తావించారు. ఇందులో 'మరణం నా శాశ్వత చిరునామా' కవితలో ఇలా చెప్పాడు.

"మరణం గురించి నాకు భయంలేదు
మరణాన్ని నేను చంకలో పెట్టుకొని తిరుగుతాను
మరణాన్ని నేను గుండెల్లో పెట్టుకొని నిద్రపోతాను
మరణం నాకళ్ళలో మెరుస్తూ ఉంటుంది
మరణం నా దగ్గరిబంధువు, ప్రాణస్నేహితుడు
మరణం గురువు, మరణం నా శాశ్వత చిరునామా!"

దేవుడు ఏ కోరిక కోరకపోయినా ఇచ్చేవరం మరణం. ఎవ్వరూ మరణాన్ని కోరుకోరు. కానీ అందరికీ ఇస్తాడు. ఈ విధంగా ఎంతో నిరాడంబరంగా జీవిత సత్యాన్ని మన కల్లముందు కన్పించేలా తన కవితా పలుకుల ద్వారా నిరూపించారు మాడభూషిగారు.

"ఆలోచనలు" ఇది అచ్చంగా కవిత్వం కాదు. కొన్ని ఆలోచనలు మాత్రమే అంటూనే మాడభూషి గారు అద్భుతంగా కవిత్వరూపంలో మలిచారు. "ప్రపంచమంతా కంప్యూటరీకరణ/ హైటెక్ సేద్యం, గ్లోబలీకరణ / బస్సు మోహం చూడని పల్లె" "యంత్రాలు పంటలు పండిస్తాయి / మంత్రాలు ప్రాణాలు తీస్తాయి / పల్లె మెదడులో మౌఢ్యం" ఈ విధంగా ప్రస్తుతం ఉన్న పల్లె ప్రపంచం తీరును నగ్నసత్యంగా చెప్పారు.

ముగింపు :

మాడభూషి సంపత్‌కుమార్ గారి జీవితం ఆయన రచనలు అన్నీ గమనిస్తే వృత్తిరీత్యా ఆచార్యులే అయినా ఆయనలో ఉన్న కవితా పిపాస అడుగంటి పోలేదు. అదే ఆయన ప్రవృత్తి సమాజంలో ఏ చిన్న విషయాన్ని చూసిన వెంటనే స్పందించి కాగితం మీద కలం పెట్టి అక్షరరూపం అమర్చేవారు. దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై ఆలోచన మెండు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దుఃఖాలు, సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి ఇలా చెప్పుకుంటూ పోతే పలు విషయాలను కలంతో చెక్కేవారు. అలతి అలతి పదాలతో అనంత అర్థాలు వచ్చే విధంగా అలవోకగా ఆశువు రూపంలో కవిత్వం చెప్పడం సంపత్ కుమార్ గారికే చెందును. ఆచార్యులు అనడం కన్నా ఆధునిక మహాకవి అనడంలో ఎంతమాత్రం తీసిపోరు మాడభూషి గారు.

ఆధార గ్రంథాలు :

1. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి రచనలు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య మాడభూషి 'ఆలోచనలు': సమాలోచన

- డాక్టర్ పులపర్తి శ్రీనివాసరావు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ఆధునిక కాలంలో సాహిత్యం కొత్తపుంతలు తొక్కుతూ ఉంది అనడంలో ఏవిధమైన సందేహం లేదు.దీనికి అనేక నిదర్శనాలను చెప్పొచ్చు. గురజాడ మొదలుకొని నిన్నమొన్నటి వరకూ పుట్టుకొచ్చిన కవులు, రచయితల తాలూకు రచనలను పరిశీలించినట్లైతే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. గత రెండు మూడు దశాబ్దాలుగా వచ్చిన తెలుగు సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే అనేక మంది యువ కవులు పుట్టుకొచ్చి, సమాజాంతర్గతాలను శోధించి రచనలు చేశారు. ప్రతీ రచయిత తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి, అందలి సమస్యలను బహిర్గతం చేసే క్రమంలో కలాన్ని ఆయుధంగా ఉపయోగించుకుని చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అలాగే వ్యక్తిగత అభివృద్ధికి మార్గాలను అన్వేషించారని వాళ్ళ రచనలను బట్టి తెలుస్తుంది. ఈ మధ్య కాలంలో కూడా అనేక మంది రచయితలు ఈ విధమైన విధానాన్ని అవలంభిస్తున్నారు. ఈ కోణంలో గత మూడు దశాబ్దాల క్రితం నుండి తన రచనలతో సమాజాన్ని చైతన్యం చేస్తున్న కవి, రచయిత, విమర్శకులు, సాహిత్య విశ్లేషకులు, అన్నింటికీ మించి ఆచార్యునిగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారిని పేర్కొవచ్చు. మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యునిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం శాఖాధ్యక్షులుగా ఉన్నారు.

మాడభూషివారు అత్యంత క్లిష్టమైన వర్ణనాత్మక వ్యాకరణంపై పరిశోధన చేసి భావి పరిశోధకులకు మార్గానిర్దేశం చేశారు. 'తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు' అనే అంశంపై డి.లిట్. చేశారు. వివిధ పత్రికల్లో లెక్కకుమించి వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఈ వ్యాసాలు నేటి పరిశోధకులకు రిఫరెన్సుగా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పరిశోధనలో నూతన మార్గాలను అన్వేషించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఈ దృక్పథమే ఆయన్ని ఎంతో గొప్ప పరిశోధకుణ్ణి చేసింది. అందుకే ఈయన ఆలోచన నుండి వెలువడిన ప్రతీ పరిశోధనా వ్యాసం ఎంతో లోతైన అధ్యయనం కలిగి ఉంటుందని చెప్పకతప్పదు.

మాడభూషివారిని పరిశోధనా రంగం ఒకవైపు అయితే మరోపక్క సృజనాత్మకత ఎంతో ఉన్నతుడిని చేసిందనడానికి ఆయన రచనలే ఉదాహరణగా చెప్పవచ్చు. జీవితం- కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడో మనిషి, వికారి వంటి రచనలు ఆయన కలం నుండి జాలువారిన అక్షర హృదయాలు. ఈ రచనలన్నింటిలో మాడభూషివారి భావజాలాన్ని అడుగడుగునా గుర్తించొచ్చు. మాడభూషి వారి హృదయం తెలియాలంటే ఆయన రచనలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ కోణంలో ఆయన రాసిన 'ఆలోచనలు' కవితా సంపుటిని సమీక్షించి వ్యాస రూపంలో పొందుపరుస్తున్నాను.

"ఇది అచ్చంగా కవిత్వం కాదు, కొనిన ఆలోచనలు మాత్రమే. ఈ ఆలోచనలు కూడా అవసరార్థమయినవే. ఆయా రోజుల్లో రాయాల్సిన అవసరాన్నిబట్టి, ఆయా రోజుల్లో జరిగిన సంఘటనలను బట్టి వెలువడినవే తప్ప కేవలం కవిత్వం దృష్టితో రాసినవి కావు. అందుకనే వీటిని 'జర్నలిస్టిక్' రచనగా పేర్కొనవచ్చు" అని ముందుమాటలో స్వయంగా మాడభూషివారు పేర్కొన్నదాన్ని బట్టి ఈ 'ఆలోచనలు' ఆయా కాలానికి సమకాలీనంగా రాసినవని అర్థమవుతుంది. అయినప్పటికీ సమాజంలోని అనేక విషయాలకు స్పందించి రాసిన ఈ కవితా ఖండికలు పాఠకులను ఆలోచింపచేసేలా ఉన్నాయి.

ఈ కవితా సంపుటిలో సామాన్య మానవుని జీవితం ప్రతిబింబిస్తుంది. రైతు జీవనం, స్త్రీల సమస్యలు, ప్రపంచీకరణ, మద్యపానం, అవినీతి, ఆధ్యాత్మికం, బాల కార్మికం, విజ్ఞానం ఇలా అనేక అంశాలను ఆలోచనల రూపంలో దర్శనమిచ్చాయి. ఈ అంశాలకు సంబంధించి మాడభూషి సంపత్ కుమార్ గారి సృజనాత్మక దృక్పథాన్ని ఒక్కొక్కటిగా విశ్లేషిస్తాను.

రైతు జీవనం :

నాటి నుండి నేటి వరకూ నిత్యం సమస్యలు ఎదుర్కొనే వ్యక్తుల్లో ముందువరునలో ఉండేది రైతు. ప్రకృతి విపత్తులతో ఒకవైపు, మానవ తప్పిదాలతో మరోవైపు ఇలా అనేక రకాలుగా ఇబ్బందిపడతాడు రైతు. ఇలాంటి విషయాలను ఈ కవితా సంపుటిలో చర్చించారు రచయిత. 'రైతే కూలి'అనే శీర్షికలో దళారి వ్యవస్థ వల్ల రైతు నష్టపోతున్నాడనే విషయాన్ని తెలియజేశారు.

కొనేవాడికి
అమ్మేవాడు లోకువ
దళారివాతపడ్డ రైతు!

(ఆలోచనలు, పుట:15)

పై వాక్యాలను పరిశీలిస్తే, అతివృష్టి, అనావృష్టిలతో సతమతమయ్యే రైతుకి వాటినుండి కొన్ని సందర్భాలలో విముక్తి లభించి పంట బాగా పండినా, సరైన గిట్టుబాటు ధర లభించక లబోదిబోమంటాడు. దీనంతటికీ కారణం దళారులు. రైతుల కష్టాన్ని గురించకుండా వారి స్వలాభాల కోసం కృత్రిమ కొరత సృష్టించుకుని, అప్పటికే రైతుల దగ్గర పంటను మిక్కిలి తక్కువకు కొని, వారు ఎక్కువ లాభాలు గడిస్తుంటారు. కనీసం వారు ఆర్జించే లాభాల్లో రైతుకు మేలు చేయాలనే ఆలోచన చేయరు. కానీ రైతు పండిస్తేనే కడుపునిండా తింటున్నాడనే విషయాన్ని దళారి మర్చిపోవడం విడ్డూరం. అయినప్పటికీ రైతు ప్రజల పక్షపాతి. ఎన్ని కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా పంటలు పండించడానికే మొగ్గుచూపుతాడు. కాబట్టి దళారి వ్యవస్థ నశించాలనేది రచయిత ఉద్దేశ్యంగా చెప్పవచ్చు. ఈ ఉద్దేశ్యంలో సామాజిక ఆలోచన దర్శనమిచ్చింది. రైతు బాగుండాలనే ఆలోచనలోనే రచయిత దృక్పథం ఏంటో వెల్లడైంది.

మరో కవితలో అప్పుల బాధలు రైతుల్ని ఆత్మహత్య వైపు నెట్టుతున్నాయని పేర్కొన్నారు రచయిత.

అప్పుల బాధ తాళలేక
సాగిపోతున్నాయి ఆత్మహత్యలు
అధికార దాహం తీరక
పుంజుకొంటున్నాయి!
(ఆలోచనలు, పుట:67)

రైతు తాను బ్రతకడానికే కాకుండా ప్రపంచమంతా బ్రతకడం కోసం పంట పండిస్తాడు. ముఖ్యంగా వ్యవసాయాధారితమైన భారతదేశంలాంటి దేశాల్లో రైతు లేకపోతే సమాజాన్ని ఊహించుకోలేం. అందుకే రైతే రాజు అనే నినాదం వచ్చింది. దేశానికి వెన్నెముకంటారు. కాని ఈ రోజు పరిస్థితులు వేరు. ఏదో ఆశతో పంటకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కించుకోలేని స్థితిలో రైతున్నాడు. పంట చేతికొస్తుందో లేదో తెలియని పరిస్థితి. ఒకవేళ చేతికొచ్చే సమయం ఆసన్నమయితే, ప్రకృతి విపత్తులు నాశనం చేస్తాయి. లేకపోతే దళారులు లాగేసుకుంటారు. ఇంకా ముందుకెళితే వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీ పేరుతో మొత్తం పంటను కాజేస్తారు. చేసిన అప్పులు అలాగే ఉండిపోతాయి. అటు అప్పులు తీరక, ఇటు కుటుంబాన్ని పోషించుకోలేక చివరకు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఇంతటి దారుణం యావత్ ప్రపంచాన్ని కదిలిస్తూనే ఉంది. అలాగే రచయితను కూడా కదిలించడంతో ఈ విధంగా వ్యక్తీకరించారనిపించింది.

బాల్య సమస్యలు :

తిరిగిరానిది బాల్యం. సున్నితమైన మనస్తత్వం కలిగి ఉండే బాల్యాన్ని నేడు యాంత్రికంగా మార్చేస్తున్నారు. దీనికి తల్లిదండ్రులే కారణం. వయసుతో సంబంధం

లేకుండా పిల్లల్ని పిల్లలుగా చూడకుండా, వాళ్ల సామర్థ్యాన్ని అంచనా వేయకుండా చదువుపేరుతో చిన్న తనంలోనే ఇబ్బందులకు గురుచేస్తున్న వైనం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని రచయిత కవిత రూపంలో ఎంతో లోతైన ఆలోచన కలిగేలా ఇలా తెలిపారు.

పుట్టుకతోనే పిల్లల
విద్యాభ్యాసం ప్రారంభం
'క్రష్' అయిపోతున్న బాల్యం!
(ఆలోచనలు, పుట: 38)

బాల్యం ఎంతో విలువైంది. సున్నితత్వంతో కూడుకుని ఉంటుంది. బాల్యంలో ఒత్తిడి ఉండకూడదు. సామర్థ్యానికి మించి ఉంటే మానసికంగా కృంగిపోతారు. కాబట్టి బాల్య జీవితాన్ని తల్లిదండ్రులు స్వేచ్ఛతో ఉండేలా తీర్చిదిద్దాలి. కానీ తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలపై రుద్దుతూ, వాటిని నెరవేర్చుకోవడానకి ప్రయత్నం చేస్తూ ఉంటారు. దీంతో పిల్లలు తమ బాల్యాన్ని కోల్పోవడమే కాకుండా, మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వెళ్తున్నారు. విద్యాభ్యాసం అలవడని వయసులో నర్సరీ పేరుతో, ప్లేస్కూళ్ళ పేరుతో ఇబ్బంది పెడుతున్నారు నేటి తల్లిదండ్రులు. ఇది సరైన విధానం కాదనేది రచయిత ఉద్దేశ్యం. ఇదే పై కవితా పంక్తుల్లో తెలియపరిచారు. ఇలా వ్యక్తం చేయడంలో రచయిత తల్లిదండ్రుల్లో పిల్లల గురించిన చైతన్యం ఆశించారని చెప్పవచ్చు.

క్రష్ అయిపోతున్న బాల్యం అనే వాక్య ప్రయోగంలోనే నేటి బాలల పరిస్థితిని తెలుసుకోవచ్చు. బాల్యం కుశించుకుపోకూడదని, స్వేచ్ఛా వాతావరణంలో, ప్రశాంతంగా జీవించేటట్లు చర్యలు తీసుకోవాలని రచయిత తల్లిదండ్రుల్లో ఆలోచన కలిగించే ప్రయత్నం చేశారని పించింది.

భ్రూణ హత్యలు :

గత దశాబ్దం చివరివరకూ ఎక్కడ చూసినా భ్రూణ హత్యలు గురించే చర్చలుండేవి. ఈ మధ్య కాలంలో కొంచెం తగ్గినా అక్కడక్కడా వెలుగు చూస్తూనే ఉంటున్నాయి. ఈ భ్రూణ హత్యల గురించి రచయిత తన కవితా సంపుటిలో సాలోచన చేశారు.

మొగ్గలోనే తుంచేస్తున్నది
పూలనే కాదు పిల్లల్ని కూడా
భ్రూణహత్యలు!
(ఆలోచనలు, పుట : 54)

ఇంటి వారసుల కోసం ఆరాటం. ఆస్తి సంక్రమణ కోసం ఆలోచన. ఇలా అనేక కారణాలతో మగబిడ్డే కావాలనేది ప్రాచీన కాలం నుండి వస్తున్న ఆచారం, సాంప్రదాయం. దీంతో కడుపులో ఉండగానే పుట్టే బిడ్డ మగా లేక ఆడా అని తెలుసుకునే ప్రయత్నాలు విపరీతంగా పెరిగాయి. మగబిడ్డ ఆశతో కడుపులో ఉన్నది ఆడబిడ్డని తెలిస్తే, ఆ గర్భంలో ఉండగానే చంపేయడమనేది చాలా విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఈ దుర్మార్గమైన చర్య ఎంతో నీచమైంది. సమస్త సృష్టికి స్త్రీయే మూల కారణం అనే విషయాన్ని మర్చిపోయి, పురుష సంతానం కావాలనుకునే వారు ఈ భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఇది సమంజసమైన ఆలోచన కాదని తన ఆలోచన ద్వారా చైతన్యం చేసే ప్రయత్నం చేశారు రచయిత.

భ్రూణహత్యలను నియంత్రించడానకి భారత ప్రభుత్వం చట్టం చేసింది. దీని ప్రకారం గర్భం ధరించిన నాటి నుండి, పురుడుపోసుకునే వరకూ కడుపులో ఉన్న బిడ్డ ఆడ లేక మగ అని ఏ ఆసుపత్రిగాని, డాక్టరుగాని సంబంధిత వ్యక్తికి తెలపకూడదు. అలా తెలిపిన యడల శిక్షర్హులవుతారు. కావుననే పరోక్షంగా రచయిత ఈ చట్టం గురించి తెలియజేశారనిపించింది.

ప్రపంచీకరణ :

యావత్ ప్రపంచాన్ని శాసిస్తున్న ఒకే ఒక మాట 'ప్రపంచీకరణ'. ఇది ప్రపంచ పటాన్నే మార్చేసింది. 'గత కాలము మేలు వచ్చుకాలము కంటే' అనే మాటకు

తూట్లుపొడిచి, నవ్యత, అతి నవ్యతకే ప్రాధాన్యతనివ్వడం నేర్చుకుంది ప్రపంచం. దీంతో భారత్‌లాంటి దేశాలలో ఆచార సంప్రదాయాలు, సంస్కృతి, విలువలు మొదలైన వన్నీ నశించిపోయాయి. ప్రపంచీకరణ చాపకింది నీరులా చొచ్చుకొచ్చింది. ఇలాంటి ప్రపంచీకరణ గురించి రచయిత స్పందించి ఈ కింది కవితను వెలువరించారు.

ప్రపంచమంతా కంప్యూటరీకరణ
హైటక్ సేద్యం, గ్లోబలీకరణ
బస్సు మొహం చూడని పల్లె!

(ఆలోచనలు, పుట: 17)

ప్రపంచీకరణ ముసుగులో గతాన్ని తుంగలో తొక్కి ఆధునికీకరణ పేరుతో ప్రకృతికి పంగనామం పెట్టారు. పల్లెలన్నింటినీ పట్టణాలు చేశారు. కూలి నాలి చేసుకుని బతికే సామన్య ప్రజలు వలసలకు మొగ్గుచూపుతున్నారు. హైటక్ హంగులతో చాలామంది జీవితాలు రోడ్డున పడ్డాయి. కంప్యూటరీకరణ వల్ల సాంప్రదాయ విధానం కాస్త నన్నగిల్లడంతో, దానిమీద ఆధారపడిన వారి బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఇలా అనేక మార్పులు ఈ ప్రపంచీకరణ వల్ల వచ్చాయి. అనేక నష్టాలను సవిచూడటం జరిగింది. యాంత్రిక రంగం బాగా అభివృద్ధి చెందడంతో కులవృత్తులు మూలన పడ్డాయి. పల్లె వాతావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. అనేక రోగాలభారిన పడ్డారు ప్రజలు. కనిపించని శత్రువువలే ప్రజలమీద పోరాటం చేస్తూనే ఉంది. ఈ సమాజంపై ఉన్న ప్రపంచీకరణ ప్రభావాన్ని పరిశీలించి ఈ కవిత ద్వారా బయటపెట్టారు రచయిత. ఈ ముసుగులో నాశనమయిపోతున్న పల్లె జీవనాన్ని, పల్లె వాతావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిమీద ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఈ కవితలో తెలియజేశారు రచయిత.

సంఘటనాత్మక కవిత్వం :

ఈ కవితా సంపుటిలో సంఘటనాత్మక కవిత్వానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు రచయిత. జరిగిన సంఘటనకు స్పందించి అప్పటికప్పుడు కవిత రాస్తే దానిని సంఘటనాత్మక కవిత్వం అంటారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు అనేక సంఘటనలకు స్పందించి కవితలను వెలువరించారు. ఈ 'ఆలోచనలు' కవితా సంపుటిలో ఇలాంటి సంఘటన కవితలు చాలానే ఉన్నాయి. దీనిలో భాగంగా రాజకీయం, అవినీతి, ఎన్నికలు, కుల హత్యలు మొదలగు అంశాలను స్పృశించారు రచయిత.

అవినీతి :

బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుంభకోణం చేశారు. బీహారు రాష్ట్రంలో ఇదే అతిపెద్ద కుంభకోణం. దీనికి స్పందించి రచయిత ఈ కింది కవితను వెలువరించారు.

నేను సైతం
అవినీతికి అజ్యం పోశాను
లాలూ ప్రసాద్ యాదవ్!

(ఆలోచనలు, పుట:21)

రాజకీయ రంగంలో లాలూ ప్రసాద్ పేరుమోసిన వ్యక్తి. బీహారు రాష్ట్రంలో సుభిక్షమైన పాలన అందించారనే ప్రచారం ఉండేది. కానీ తెరవెనుక చేసే రాజకీయం ప్రజలకు చాలా కాలానికి గాని తెలియలేదు. పశువుల దాణాను అక్రమంగా దోచి అమ్ముకోవడమే పనిగా వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచేశారు. ఇది బయటపడ్డ తరువాత రచయిత ఈ విధంగా స్పందించి కవిత రూపంలో వెలువరించారు. ఎంతో ఉన్నతమైన వ్యక్తులని ప్రజలు భావింపబడే వారందరూ అవినీతికి పాల్పడి ప్రజా ధనాన్ని కాజేయడం ఆధునిక రాజకీయాల్లోనే చూస్తున్నాం.అందుకే రచయిత ఆ కాలం నాటి కుంభకోణాన్ని ఇలా వ్యక్తీకరించారు.

రాజకీయం :

రాజకీయం అంటేనే ఒక చదరంగం. దీనిలో రాజు భంటు అను తేడాలున్నా, చివరికొచ్చేసరికి ఎవరు ఎవర్ని చంపుకుంటారో తెలియదు. ఎవరు గెలుస్తారో తెలియదు.

కానీ నేటి రాజకీయాలు చూస్తే చాలా నీచంగా ఉంటున్నాయనేది జగమెరిగిన సత్యం. పదవి కోసం ఎంతకైనా తెగించే నాయకులు, వారసత్వ రాజకీయాలు, కుంభకోణాలు ఇలా అనేక విధాలుగా రాజకీయం దిగజారిపోయింది. ఇలాంటి రాజకీయం గురించి సూచన ప్రాయంగా తెలిపారు రచయిత.

దున్నేవాడిదే భూమి
ఏలేవాడిదే రాజ్యం
రాజకీయనాయకులు!

(ఆలోచనలు, పుట : 27)

దున్నేవాడిదే భూమి అనే నినాదం చాలా కాలం నుండి ఉంది. అయితే అది రైతుల వరకూ నూటికి నూరు పాళ్ళు సరిపోయే నినాదం. కానీ ఏలేవాడిదే రాజ్యం అనే మాట అంగీకారయోగ్యం కాదు. ఐదు సంవత్సరాలకొకసారి వచ్చే ఎలక్షన్‌లో ఏ పార్టీ గెలుస్తుందో తెలియదు. ఒక పార్టీ గెలవడం మాత్రం నిజం. గెలిచిన పార్టీ ఐదు సంవత్సరాలు పదవిలో ఉంటుందనే నమ్మకం కూడా లేదు. అలాంటిది నేడు గెలిచిన ఈ రాజకీయ పార్టీలు రాజ్యం అంతా నాదే అన్నట్లు ప్రవర్తించడం ఆధునికి రాజకీయాల్లో కనిపిస్తుంది. తనకు నచ్చినట్లు పరిపాలన చేస్తాడు. ప్రజల సమస్యలు పట్టవు. అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వరు. ఇది మంచి పద్ధతి కాదనేది అందరికీ తెలిసిన విషయమే అయినా, రచయిత ఇలాంటి పార్టీలను ఎన్నుకునేటప్పుడు ఆలోచించి ఎన్నుకోవాలని సూచన చేయడం ఈ వాక్యాల్లో పరోక్షంగా తెలుసుకోవచ్చు.

ఈ విధంగా ఈ 'ఆలోచనలు' కవితా సంపుటిలో పైన వివరించిన అంశాలే కాకుండా, మహిళాబిల్లు, చుండూరు సంఘటన, వర్ణ వ్యవస్థ, బాల కార్మికులను వ్యతిరేకించడం, రాజకీయ నాయకులలో ఉన్న లోపాలు, పార్టీ ఫిరాయింపులు మొదలైన అంశాలను చర్చించారు. ప్రతీ అంశం సమాజానికి అనుగుణంగా వ్యక్తీకరిస్తూ తన ఆలోచనలను కవితల రూపంలో ఈ 'ఆలోచనలు' కవితా సంపుటి ద్వారా వెలువరించి పాఠకులలో ఆలోచన రేకెత్తించారని ఆయా కవితలు పరిశీలిస్తే అర్థమైంది.

ఆధార గ్రంథాలు :

1. ఆలోచనలు(కవితా సంపుటి)- ఆచర్య మాడభూషి సంపత్ కుమార్, పాలపిట్ట బుక్స్,హైదరాబాద్, 2015.
2. వికారి(కవితా సంపుటి)- ఆచర్య మాడభూషి సంపత్ కుమార్, పాలపిట్ట బుక్స్,హైదరాబాద్, 2019.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య మాడభూషి సాహిత్యావలోకనం

- యు.వి.రత్నం, 8-3-13, కోత్తపేట్, ఒంగోలు.

రచయితలు, కవులు, సమాజం నుండి దూరంగా జరిగి ఏవేవో కళల ప్రపంచంలోనో, ఊహల లూగుతుం టారని, సమాజం వారికి పట్టదని, సంఘటనలు చూసి స్పందించని వాడు కవే కాదని అంటుంటారు.

మనుషులు మనస్తత్వాలు, సంఘటనలు, కవులను, రచయితలను కదిలించినట్లు సామాన్యులు స్పందించరు. మానవులకి ఎవరో ఒకరు చెప్పాలి ఎవరో ప్రేరకం కావాలి. అల్లాంటి కేటలిస్ట్, కవి, రచయిత మందు వేసవి కాలంలో ఎడారిలో వోయసిస్సుల లాంటివారు కవులు, రచయితలు.

కొందరు ఆకాశంలో ఇంద్రధనుస్సులను, పరుగెత్తే మేఘాలను, వాటి మాటున చంద్రుడు, వెన్నెల పొదరిల్లు, కోయిల పాటలు, పిల్లగాలి తెమ్మెరలు, ఒకటేమిటి ప్రతి స్పందన కవిత్వమై వెలువడుతుంది. కొందరు నిజా యితీగా నిలబడి చైతన్యం తమ సాహిత్యాన్ని సమాజ శ్రేయస్సుకే అంకితం చేస్తారు. కొందరు ఇజాల ప్రిజంలో రంగులు రంగులుగా కనిపిస్తారు.

కొండ అద్దం ముందు చూపించినట్లు, చిన్నా దీపం వెలువద్ద చీకటిని పారద్రోలినట్లు, చిన్నదైన మనస్సుని బుద్ధిని వికసింపచేయటానికి తమ రచనలతో చదువరు లకు ఉద్దేపనం కలిగించి జ్ఞానదీపం వెలిగిస్తారు. బాధలు ఓ ప్రక్కన దిగమింగి తాము ఎలా ఉన్నా ఇతరులకు మేలు చేయాలని ఆలోచిస్తారు. లోకాన్ని నిశితంగా పరిశీలిస్తూ, పరికిస్తూ సమాజ శ్రేయస్సు కాంక్షిస్తూ, భూత భవిష్యత్ వర్తమానాలను బేరీజు వేసుకుంటూ తమ రచనలు సాగిస్తారు.

సమాజ స్వరూపం మారుతున్న విలువలు, మనస్త త్వాలు సమాజ స్వభావం తెలుపుతూ రచనలు చేసేవారి సంఖ్య ఎలా వున్నా, వర్తమాన అంతర్జాల మాధ్యమాలలో కవిత్వం వెల్లువలై వరదై పారుతోంది. ఈ నేపథ్యంలో ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి రచనలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయి అనటంలో సందేహం లేదు.

పరిసరాలను సమాజాన్ని నిరంతర అధ్యయానంలో వారి కవిత్వం ఉత్తమంగా వెల్లివిరుస్తుంది అనటంలో అతిశయోక్తి లేదు.

మారుతున్న యువతరాన్ని చూసి ఆవేదన చెందటం పాశ్చాత్య నాగరికత మోజులో, మానవతా విలువలు ఎలా దిగజారిపోతున్నవో వారి రచనలలో ద్యోతకమౌతాయి. సమస్యలను ఎత్తి చూపడం దుర్నీతిపై కసి కసిగా కత్తులు దూసి ఒక్కో చోట ఉప్పెనగా మారు తారు, వారి సంపు టాలలో నేను వ్రాస్తున్న ఆచార్య మాడభూషి వారి సాహితీ అవలోకనంలో వారు ప్రచురించిన గేయసంపుటులు, అనువాదాలు, వాడిన భాష, అంతర్యం, సమాజంలో విశృంఖలత పెరుగుతున్న అత్యాచారాలు వివిధంగా ఉ న్నాయో ప్రస్ఫుటంగా అందించారో నా ఈ వ్యాసం ప్రతిబింబిస్తుంది.

ఆచార్యుల వారు వెలువరించిన గేయ సంపుటులు, కవితా సంపుటులు, వ్యాస సంపుటులు, వ్యాకరణ విజ్ఞానం, తమిళ జానపద కళలు, కవాతు, రెండో ఓటమి, ఒక విజేత, పరిశోధన నాడు నేడు రేపు, తెలుగు దీప్తి. అనువాదాలు: గడ్డిపరకతో విప్లవం, సామాజిక శాస్త్రవేత్త పెరియార్, అమ్మవాసన, జన్మభూమి, ఆరోగ్యానికి పనికొచ్చే సులభమార్గాలు. కవితా సంపుటాలు: జీవిత - కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడో మనిషి, వికారి.

పైన ఉదాహరించిన వాటిని పట్టి చూస్తే ప్రతి సంవత్సరం ఒక సంపుటి వెలువరించినట్లు తెలుస్తుంది. వివిధ ప్రక్రియలలో వారు వెలువరించిన సాహిత్యం

నంపాదకత్వాన వచ్చిన గ్రంథాలు పాఠకులను, పరిశోధకులను ఉపయుక్తముగా ఉండి పరిశోధనాశక్తి గలిగిస్తాయి. రెండువేల పదమూడులో వారు వెలువ రించిన ఆంధ్ర మహాభారతం-వివిధ శాస్త్ర పరిజ్ఞానము, అలాగే వారు సంకలించిన అబ్దుల్ కలాం పైన వెలువ రించిన కవితా సంకలనము మొదలగు గ్రంథములు, తెలుగు దీప్తి, పరిశోధన నాడు నేడు రేడు గ్రంథములు, ఎంతోమంది పరిశోధకులకు మార్గదర్శకమౌతాయి అనటంలో సందేహం లేదు. మాడభూషి వారిసాహితీ ప్రయాణాన్ని అంచనా వేయటం ఈ చిన్న ప్రయత్నంలో అసాధ్యం. వడ్డున నుండి అలలు లెక్కిస్తూ సముద్రాన్ని కొలవటం లాటిదే అవుతుంది.

ప్రబంధకవులను ఆధునిక కవులను వారు అవలోకనం చేసినట్లు వారి సాహిత్యంలో మనకు కనిపిస్తుంది. మచ్చుకు వారి రచనల్లోని కవిత్వ రీతులను ఇక్కడ ప్రస్తావించడం వారికి చంద్రునికో నూలు పోగు వంటిదే.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి రచనల్లో ఇక్కడ గమనిస్తే, 'చివరకు నువ్వే గెలుస్తావు' అన్న కవితా సంపుటిలో సొబగులు ఇక్కడ ప్రస్తావిస్తాను.

శ్రీశ్రీగారన్నట్లు "అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, కాదేది కవితా కనర్హం" అని వాక్యం, ఈ గెలుపు మార్గం (2016) కవితలు 51 పేజీల సంపుటిలో వదిగిపోతాయి. మొదటిలో వారి రచనలు కాస్త అపక్వమై, లేతగా అగుపించినా తరువాతి రచనలు కాయలుగా పండ్లుగా మారి, ఉదాత్త సురభి లాత్తంగా అవతరిస్తాయి.

గెలుపు మార్గంలో ఇలా అనటం ఒకచోట "ఇంత మంది నుంచి / తప్పించుకుని, తప్పించుకుని, తప్పించు కుని / తరుముకొస్తున్న వారి నుండి తప్పించుకుని 'జెండర్ స్పృహ' అనే కవితా ఖండికలో మూడో జెండర్ గురించి ఇలా అంటారు. "మేం ఎజెండాలో లేనివారం/ మీ జెండా నీడలోకి రాని వాళ్ళం / తరతరాలుగా మా జెండరు గురించిన స్పృహ ఎవరికీ లేదు / మనుషులుగా పుట్టిన మేము ఆడ మగా ఉండకూడదని వాదిస్తూనే / మమ్ములను తేడాగా చూస్తారు అన్న వాక్యాలు థర్డ్ జెండర్ గురించి ఆలోచింప చేస్తాయి. కొండొకచో కన్నీటిని చిప్పిలుస్తాయి. ఈ నిషిద్ధ జాతిపైన ఆ రోజుల వచ్చిన ఈ కవిత బహుశా మొదటిదే అనుకుంటాను. ఆ తరువాత (2019) పి.సత్యవతి గారి అనువాద నవల "ఒక హిజ్రా ఆత్మకథ" కేంద్ర సాహిత్య అకాడెమీ వారి అవార్డు పొందింది. ఆ రోజులలోనే మాడభూషి వారు, ముందు చూపుతో పూజకు పనికి రాని పుష్పాలుగా రాలిపోతున్న వారిపైన, కవిత వ్రాసారని వారిని అభినందించాలి.

అదే సంపుటిలో కనుమరుగౌతున్న 'బావి', 'చెరువు' లను వదలకుండా సంపుటిలో చోటు కలిపించారు. అలాగే 'కవితా! ఓ కవితా!', 'గుర్రపు కళ్ళెం' అనే కవితలు, 'అనాథ జీవుల ఆక్రందనలకు, తరతరాల అక్రోశానికి' వెయ్యలేవు గుర్రపు కళ్ళెం అంటూ శ్రీశ్రీ "మహాప్రస్థానా"న్ని గుర్తుకు తెస్తారు.

వామపక్ష భావాల పరంపరలు (చివరకు నువ్వే గెలుస్తావు) ఈ సంపుటి నిండా కోకొల్లలు.

'అంత దాక' అనే కవితలో ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అన్న సామెతగా సునామీ ధాటికి కొట్టుకపోయిన ఊర్లను ప్రస్తావించి నిన్నటిదాకా వెలుగొందిన వాడు ప్రకృతి కన్నెర్ర చేసిన నాడు ఏమిలేని వాడుగా మిగిలిన వైనాన్ని వర్ణించుతారు. అంతర్లీనంగా ఆయనలో ఉన్న ఆధ్యాత్మిక భావన ఇక్కడ ద్యోతకమౌతుంది.

'ప్రేమ' అనే కవితా ఖండికలో సంపత్ కుమార్ గారు ఎంతటి ప్రకృతి ప్రేమికులో అర్థం అవుతుంది.

చెట్టును / పిట్టను / గుట్టను / ప్రేమించే వాళ్ళకు హృదయం వికసిస్తుంది / ఆస్తిని / అధికారాన్ని / వ్యక్తిని / ప్రేమించే వాళ్ళను ప్రేమ పరిహసిస్తుంది అంటారు. ఎంత సున్నిత భావన అది.

మరో పుస్తకం "జీవితం-కవిత్వం", ప్రొఫెసర్ శిఖామణిగారు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా

లయం, హైదరాబాద్ వారు 'జీవితం-కవిత్వం' పుస్తకంలో ముందుమాట రాస్తూ ఇలా అంటారు.

కవికి/ కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని సంకలించ టానికి పుస్తకం చాలదు. నిజమే కాంతిని మనం దీపం వెలిగినపుడు మాత్రమే చూడగలం, దీపం వెలగక ముందూ - వెలిగి ఆరిపోయాక కూడా కాంతి అస్థిత్వంలోనే వుంటుంది. కానీ దాన్ని మనం చూడలేం. స్పృశించలేము. అలాగే కవికీ కవిత్వానికీ ఉన్న బంధాన్ని దేహికీ ప్రాణానికి వున్న సంబంధంతో పోల్చడం తాత్వికమైన భావన-అందుకే ప్రముఖకళా విమర్శకులు సంజీవదేవ్‌గారు కవీ, కళా కారుడు ఇరవై నాలుగు గంటలూ కళాకారులుగా ఉం డలేరు. ఆ కళాత్మక ఘడియల్లోనేవారు కళాకారులు అంటారు. దీన్ని తిరగేసి "అజంతా" సరస్వతీ సాక్షాత్కారం అంటారు. అది పుష్కలంగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారిలో ఉంది. అంటారు శంఖంలో పోసిన తీర్థంలా, ఇటువంటి మన్ననలు పొందిన వారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు.

పండు వెన్నెట్లో / కవిత్వాన్ని / ఆరబోసి జీవిత మంతా కాపలా కాస్తాను / అనటానికి కవికి కవిత్వం పట్ల ఎంతటి ప్రేమ ఉండాలి, నిబద్ధత ఉండాలి. జీవితం / పిచ్చివాడి చేతిలో రాయి / కావచ్చు / కాని కవిత్వం రాసే వాడి చేతిలో పరసువేది. రాతిని రాతిగా మార్చి, వానరున్ని నరునిగా, మనిషిని మనీషిగా తీర్చిదిద్దే శక్తి కవిత్వానికి ఉందన్న దృఢ విశ్వాసం అది.

పిల్లలు / కవిత్వం / పెద్దలు / జీవితం / కవిత్వమే పెరిగి / జీవితం అవుతుంది. అనటం ద్వారా జీవితానికి కవిత్వానికి ఉన్న పరిణామ శీలతను చక్ర భ్రమణ రూపంలో వర్తింప చేసారు కవి. ఇలాంటి వాక్యాలు ప్రొఫెసర్ శిఖామణి గారి ముందు మాటలలో, 'జీవితం-కవిత్వం' కవితా సంపుటిలో ఎన్నో దర్శనమిస్తాయి.

కవిత్వానికి మూలం జీవితం / జీవితానికి అనుసృజన / కవిత్వం అనటం జీవితం మూలం అనువాదం లేక అనుసృజన లాంటివి అని చెప్పటం విడదీయరాని వాటి మమేకత్వాన్ని తెలియ చెప్పటమే. 'జీవితం-కవిత్వం' సంపుటి నిండా ఇలాంటి తాత్విక భావనలే నింపుకున్న ముక్తకాలు ఎన్నో.

కవిత్వం మీద చర్చ కరువవుతున్న తరుణంలో కావ్య శాస్త్రాన్ని కవిత్వం పలవరించిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారికి, సాహిత్య సమాలోచనానికి ఉద్యుక్తుల్లి చేసి రచయితలచే వ్యాస పరంపరల సృష్టికి ఆద్యంతం రచయితలను, విమర్శకులను ఉత్తేజితం చేస్తున్న వారి నిబద్ధతకు అభినందనలు. వారి కవిత్వం, సాహిత్యం రచయితలను, విమర్శకుల కలలాకు పదును పెట్టి వెంటాడే రచనలు వారి కాలాల నుండి జాలు వారిస్తాయి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చెరువు శాపం

– డాక్టర్ ఏ. వెంకట ప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వనపర్తి.

చెరువు కవిత్వంలో కవి చెప్పినట్లు చెరువు ఇచ్చిన శాపాన్ని చదివితే పాఠకుల గుండె చెరువవుతుంది. మనుషుల స్వార్థానికి చెరువులు, చెలకలు ఏవి కూడ మిగలటం లేదన్నది ఈనాటి నిత్యజీవన సత్యం. నేటి సమాజంలో ఆరంగుళాల నేలకోసం హత్యలు కూడ చేయటానికి వెనుకాడని రియల్ ఎస్టేట్ మాఫియా అనునిత్యం ఏదోచోట కనిపిస్తూనే వుంది.

ఈ 'చెరువు శాపం' కవిత్వం చెన్నైలో వచ్చిన వరదల సందర్భంగా కవి తాను చూసిన అనుభవాన్ని ఇందులో రాసినప్పటికి, చెన్నైలోనే కాక, హైదరాబాదులో మరియు అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఈ రియల్ ఎస్టేటు మాఫియా చెరువులను కబ్జాలు చేస్తూ ఎన్నో ప్రకృతి విపత్తులకు కారకులవుతూనే వున్నారు.

"చెరువులో అపార్ట్‌మెంట్ కట్టినపుడు
చెరువు కడుపులో మట్టిగొట్టినపుడు
అది ఎంతగా విలపించిందో
ఎవరికి తెలుసు!"

చెరువుకు కూడ మనసుం టుందని అట్టి చెరువులోకి నీరు రాకుండ మట్టి కొడుతుంటే ఆ చెరువు ఎంతగా విలపించిందో అన్నపుడు కవి హృదయం స్పష్టంగా కని పిస్తుంది.

"చెట్టుకూడ ఏడుస్తుందని / సుభాష్ చెప్పినట్టు
చెరువు కూడ ఏడుస్తుందని / దాని కంటినిండా
ఉన్న నీళ్ళను చూస్తే తెలియదా?"

అంటాడు కవి. చెట్టుకు కూడ మనసుంటుందని సుభాష్ చెప్పినట్లుగానే మానవులకు, జీవ జంతుజాలానికి పశుపక్ష్యాదులకు ఎంతో ఆసరాగా ఉండే చెరువు, తనను పూడుస్తుంటే ఇకనుండి తాను ఎవరికి సహాయపడలేనని తద్వార ఎన్నో జీవుల మనుగడ పోతుందని ఆ చెరువు కూడ కన్నీళ్లు పెడుతుందని, జడపదార్థాలకు కూడ చక్కని మనసుంటుందని కవి ఎంతో మనోహరంగా వర్ణించాడు.

"విశ్వాసంగా ఉన్న చెరువు / కుడిచేతికి
ఎడం చేతికి / నీరిచ్చి / ఆదుకున్నపుడు
ఒక్క నిమిషం కూడ ప్రతివిశ్వాసం చూపకుండా
దాని కడుపులో గునపాలు గుచ్చినపుడు
అది శపిస్తుందని ఊహించి ఉండరు"

అంటాడు కవి. చెరువు మానవుల నిత్య అవసరాలకు, మానవుల మనుగడకు ఆధారంగా ఉంటూ తనకు తానుగా మానవాళికోసం అర్పించుకుంటున్న ఆ చెరువు కడుపులో గునపాలు గుచ్చుతుంటే, ఆ చెరువు శపిస్తుందని ఎవరు ఊహిస్తారు. స్వార్థపరులు తమ స్వార్థం కోసం చెరువును మూసివేస్తున్నపుడు ఆ చెరువు శపిస్తుందని వారు ఊహించి ఉండరు కదా! ఆ చెరువు పెట్టే శాపం కబ్జాదారులకు రియల్ ఎస్టేటు మాఫియా దారులకు ఏమి తెలుస్తుందని అంటాడు కవి.

"ఇపుడు నాలుక పిడచ కట్టిన తరువాత
ఇక్కడ చెరువు ఉన్నట్టు గుర్తొస్తుంది కదూ!"

అంటాడు కవి. నీటి కొరతతో మానవాళి అల్లాడుతున్న పుడు నీరు దొరకక దాహంతో అల్లాడినపుడు కూడ అక్కడ గతంలో ఒక చెరువు వుండేది కదా! అని కూడ గుర్తుకు రాదు. ఎందుకంటే ఇపుడక్కడ ఉన్నవారికి ఒకప్పుడు అక్కడొక చెరువు ఉండేదని తెలియదు కదా! కాని ఆ చెరువు పరిసరాలలో ఉండే గతకాలపు వారు మాత్రం నీటికోసం అల్లాడుతున్నపుడు తెలిసొస్తుంది గతంలో అక్కడొక చెరువుండేదని, అదే గనుక ఇపుడుంటే నీటి కోసం ఇలా అవస్థలు పడేవారము కాదని తెలిసొస్తుంది.

"చెరువు గట్టు చుట్టూ ఉన్న చెట్లు
ఎవడి గొడ్డలికి బలయ్యాయో"

అంటాడు కవి. చెరువు ఉంటే చెరువు చుట్టూ ఉండే చెట్లు, దాని ద్వారా వచ్చే చల్లటి గాలులు, చక్కని ప్రాణవాయువు, పచ్చని పంటపొలాలు, చక్కని పాడి పంటలు ఉండటం వల్ల లభించే పర్యావరణ ప్రశాంతత అంతా, రియల్ ఎస్టేటు మాఫియా వారి మాయలో చిక్కుకుని తుడిచి పెట్టుకుపోయిన పచ్చనిచెట్లు ఆ తర్వాత కాలంలో ప్రజాజీవనానికి ఏర్పడే ఇబ్బందులు వివరిస్తున్నాడు కవి.

"చెరువులో ఎవడు భువనాలను తాకే / భవనాలు లేపాడో / వాడు ఇపుడు కనిపించడు / జేబులు నింపుకుని వాడు ఎపుడో / విమానాల్లో పారిపోయాడు / ఇక్కడే ఉండి / చెరువుతల్లి గుండెల మీద/ కూర్చున్న నీకే / ఇపుడు నోరు ఎండిపోయింది" చెరువులను నాశనం చేసి రియల్ ఎస్టేటు మాఫియాదారులు వాటి స్థానంలో భవనాలు లేపి వాటిద్వార తమ జేబులు నింపుకుని విదేశాలకు పారిపోయాక ఆ చెరువులోని భవనాల్లో నివసిస్తున్న వారు నీటి ఎద్దడి ఏర్పడినపుడు గుక్కెడు నీటికోసం అల్లాడుతున్న విషయం అద్భుతంగా చెప్పాడు.

"ఒక్క క్షణమయినా / నువ్వు / ఇదినా చెరువుతల్లి / నాదాహం తీర్చిన కల్పవల్లి నన్ను గుండెల కత్తుకున్న పాలవెల్లి / నాకు బువ్వపెట్టిన అమ్మతల్లిని / తలపోసి ఉంటే / నీఊరు మునిగి ఉండదు / నీనోరు ఎండి ఉండదు"

ఇది నాచెరవు తల్లి, నాదాహం తీర్చే కల్పవల్లి అని అనుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదంటాడు కవి. అదే చెరువులున్నపుడు, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి భయంకర తుఫానులు ఏర్పడినపుడు కుండపోతగా వర్షాలు కురిసినపుడు చెరువులుంటే నీరంతా చెరువులోకి వెలుతుంది. కాని ఆ చెరువే లేకపోతే ఆ నీటికి దారేది. అపుడు తప్పనిసరిగా ఊరువాడ నీటిలో మునిగిపోవడం జరుగుతుంది. "దిద్దు కోలేని తప్పుకు / చెరువు ఇచ్చిన శాపం / తప్పకుండా ఫలించింది / ఫలిత మిచ్చింది / చెరువు శాపానికి / కాలిన చేతులకు పట్టుకోవటానికి / ఆకులు కూడలేవు / అవి కూడ / నీ అర్ధాకలికి ఎపుడో/ రాలిపోయాయి"

కూలిపోయాయి చెరువును పోగొట్టుకోవటం వల్ల వరదల పరిస్థితిని వివరిస్తూ తుఫాను భీభత్సానికి చెన్నైలో లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగిన పరిస్థితిని వర్ణించాడు కవి. మనిషి తాను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా బాధపడితే ఏమి లాభం లేదని చేతులు కాలాక పట్టుకోవటానికి ఆకులు కూడ లేవంటూ అవికూడ మానవుల స్వార్థానికి రాలిపోయాయంటాడు కవి.

"చెరువు శాపాన్ని అనుభవించడమే
భవిష్యత్తును కాపాడుకోవడానికి మార్గం"

చెరువు ఇచ్చిన శాపాన్ని అనుభవించడమే ప్రస్తుతమని భవిష్యత్తును కాపాడుకోవాలంటే చెరువు శావం అనుభవించటమే మార్గమంటాడు కవి.

ఆనాటి మన పూర్వీకులు ఎంతో ముందు జాగ్రత్తతో చెరువుల వల్ల లాభాలను గమనించి గొలుసుకట్టు చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. ఒక చెరువు నిండితే దాని అలుగుద్వారా పారే ఎక్కువ నీరు మరో చెరువులోకి, అది నిండితే మరో చెరువులోకి ఇలా ఏర్పాటు చేసిన గొలుసుకట్టు చెరువుల గొప్పదనాన్ని దానివల్ల ఒనగూడే ప్రయోజనాలు, మన పూర్వీకుల ముందుచూపును మరోసారి మననం చేసుకుంటూ ఊరు మునిగిపోకుండా భవిష్యత్తును కాపాడుకోవడానికి ఏకైక మార్గం మరల చెరువులను ఏర్పాటు చేసుకోవటమే ఉత్తమమని తద్వార భూగర్భజల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ఉత్తమ మని, భవిష్యత్తు తరాలవారు చెరువులను కాపాడు కోవాలని మార్గనిర్దేశనం చేస్తున్నాడు కవి.

ఆధార గ్రంథాలు :

1. వికారి కవితా సంపుటి - మాడభూషి సంపత్ కుమార్, వికారి ఉగాది, ఏప్రియల్ 2019.

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'శత్రువుతో ప్రయాణం'

- డాక్టర్ మురళీ రాథోడ్, కొల్వారి, గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా, తెలంగాణ.

వర్తమాన సాహిత్య ప్రపంచంలో 'వర్తమాన' కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, పాత్రికేయుడిగా, భాషావేత్తగా అందరికీ తెలిసిన ఉత్తమ సాహితీవేత్త సుపరిచితులు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్. ఈయన జీవితం వడ్డించిన విస్తరికాదు. కష్టాల కంచంలో బాధల మెతుకులు తిన్నబడుగుజీవి. కవిత్వం పట్ల తపన, సహజంగా ఉన్న ప్రతిభ. నిరంతర సాహిత్య అధ్యయనం, మాడభూషి సంపత్‌కుమార్‌ని ఒక మంచికవిగా, విమర్శకునిగా, వక్తగా సాహిత్య లోకంలో నిలబెట్టాము. స్వయం ప్రకాశనం మాడభూషి సంపత్‌కుమార్ ప్రత్యేకత సమకాలీన సమాజంలో జరుగుతున్న సంఘటనకు స్పందించి సార్వకాలీన కవిత్వాన్ని సృష్టించగల దిట్ట సంపత్‌కుమార్. ఈయన 2015లో రాసుకున్న కవితల సమాహారాన్ని 'శత్రువుతో ప్రయాణం' కవిత్వం పేరుతో ప్రచురించారు.

శత్రువుతో ప్రయాణం కవితా సంపుటానికి కృతజ్ఞతలు రాస్తూ సంపత్‌కుమార్ ఈ కృషి వెనుక ఒక జీవిత కాలపు వేదన, కఠోరమైన పరిశ్రమ, ఎదుర్కొన్న కష్టాలు, పేదరికపు బాధాగ్ని భాష్యాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ అధిగమించి సంపత్ కుమార్ గొప్ప సాహిత్య వేత్తగా రాటుదేలడం ఆయన సాధించిన విషయం. సంపత్‌కుమార్ వీధిబడి నుంచి విశ్వవిద్యాలయం వరకూ ఎదిగి వచ్చారు. అన్న మాటల్ని గమనిస్తే సంపత్‌కుమార్ ప్రత్యేకత స్పష్టమవుతుంది.

''శత్రువుతో ప్రయాణం''లో మాడభూషి సంపత్ కుమార్ ఆత్మకథమైన అంశాలెన్నో ఉన్నాయి. ఆయా కవితా ఖండికల్ని పరిశీలిస్తే వివిధ సందర్భాల్లో ఆయన రాసిన కవితలు ఆయన ఆత్మకథనే చెబుతున్నాయని పిస్తుంది. అతడు మనిషిని జయించాడు! పేరుతో ఒక కవిత కూడా ఉంది. ''శత్రువుతో ప్రయాణం''లో ప్రతిబింబించే సంపత్‌కుమార్ ఆత్మకథను పరిచయం చేసే ప్రయత్నమే ప్రస్తుత వ్యాసం.

"కత్తి కింద పడకుండానే" అనే కవితలో తన జీవితాన్ని 'వీరుడు' జీవితాన్ని నిక్షిప్తం చేస్తూ-

కోడికన్నా, కోకిలకన్నా
ఆయనే ముందు లేస్తాడు!
చంద్రుడికి చాప చుట్టేసి
సూర్యుణ్ణి నిద్రలేపుతాడు!
ఊరు ఒళ్ళు విరుచుకొంటూ ఉండగానే
ఊరి కోసం
దేవుణ్ణి స్మరిస్తూ- (పుట.11)
ఆ రోజు రాత్రి దాకా
మాకు పెట్టడం తప్ప
ఒక్క పిడికెడు మెతుకులు
ఆశించని ధన్యుడు!
జీవన సమరంలో
కత్తి కింద పడకుండానే
మరణించిన వీరుడు. (పుట.120

అంటూ వీరుడు ప్రతిభల్ని సమాజం తొక్కి పెట్టటం వల్ల అని వెలుగులోనికి రాలేకపోయాయని సమాజం ఎన్నో విధాలుగా హింసించిందని, అయితే ఇప్పుడు రోజులు మారాయని.

''సమాజం'' అనే కవితలో మంచి సమాజం కోసం

మనం ఎప్పుడూ
అసమ సమాజంలోనే పయనిస్తూ ఉంటాం
పట్టాల్లా ప్రవహించడం తప్ప
జంక్షన్ రానే రాదు!
రంగుల రాట్నంలో
స్థితులు మారడం తప్ప

గతులు మారడం లేదు!
అందరూ రాజ్యాధికారం కోసమే-
తమ అధికారంలోనే సమత్వమంటారు
అధికారం వచ్చిన తరువాత
కొమ్మల్లేని చెట్టులా
తాము మాత్రం పెరుగుతూ ఉంటారు!

(పుట. 58)

అని చెబుతూ సమాజం అడిగితే నను మెట్టుకొని ఊరంత తిరిగావు. నిజమైన స్వచ్ఛమైన సమాజాన్ని ఆత్మసాక్షి మరొ సమాజమనని ఆత్మీయంగా అంతిమ తీర్పు నిచ్చింది అని కవితను ముగించారు.

"రంగులు" కవితలో కూడా సమాజంలో నల్లని రంగు భేదం వున్న వ్యక్తులు ఎంత కలవాలనుకున్నా సమాజం వారిని దూరం చేసేదని.

వర్ణాలను గురించి
ఎంతకాలం పోరాడేది
నలుపు, తెలుపు
రంగులు మార్చుకొంటున్నాయి తప్ప
రంగులు మాసిపోవడంలేదు
మనిషిగా నిలబడ్డానికి
ప్రయత్నం చేసినప్పుడల్లా
నా మొహానికి రంగు పులిమేస్తున్నారు
మొహం కడుక్కొని
అద్దంముందు నిలబడితే
రంగు మొహమే కనిపిస్తోంది
చేతులకున్న రంగు మొహానికంటుకొంది
రంగులు మారుతున్నాయి
రంగులు పెరుగుతున్నాయి
మనుషులు బావిలో నీళ్ళలా
అడుగంటిపోతున్నారు
ఇక పోరాటం రంగులపై కాదు
మనుషులపై -
మనసుల్లో పచ్చబోసుకొన్న రంగుభేదంపై!

అపుడు సమాజం ఆవేదనను గుర్తించిన సంపత్ కుమార్ కవిత్వీకరించిన తీరు ప్రశంసనీయం.

నాలుగు మబ్బులు నీలి గోడల్ని చీల్చుకుంటూ "శత్రువుతో ప్రయాణం" అని వర్ణవ్యవస్థ మీద చెంపదెబ్బ కొట్టారు. కాలం నా ఆత్మకథను పాఠ్యగ్రంథంగా చదువుకుంటుందని ఆశించారు. సంపత్‌కుమార్ "శత్రువుతో ప్రయాణం" సమాజం ఆవేదనలకు ప్రతీక అని చెప్పవచ్చు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వెంటాడే 'ఆ-లోచనలు'

– ఎమ్వి రెమిరెడ్డి, 3వ అంతస్తు, రామ్‌కీ ఫౌండేషన్, రామ్‌కీ గ్రాండియోస్, గచ్చిబౌలి, హైదరాబాదు.

సాహిత్యంలో క్లుప్తత అనేది పదునైన ఆయుధం. ఏ ప్రక్రియలోనైనా, ఒద్దికగా రాసే అక్షరాలకు ఒడుపు ఎక్కువ. మూడు, నాలుగు పాదాల్లోనే తాను చెప్పదలచుకున్న విషయాలను కవితాభరితం చేసి, ఆకట్టుకున్నారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. ఆయన ప్రచురించిన "ఆ-లోచనలు" కవితా సంపుటిని యథాలాపంగా చదవటం మొదలు పెట్టాను. ఒకటో రెండో పేజీలు చదివి, మూసేద్దామనుకున్నాను. కానీ, ఆయన కవితాత్మక ఆలోచనలు నన్ను వెంటాడాయి.

బానిసత్వపు సంకెళ్లు తెంచుకునేందుకు జనం తిరగబడి, తెల్లోణ్ని తరిమికొట్టి, స్వాతంత్ర్యం సాధించుకున్న సందర్భం మొదలు ఇవాళ్టి సామాజిక సంక్షోభాల వరకు వివిధ అంశాలపై కవితాక్షరాల మినీబాంబులు పేల్చారు. సమాజాన్ని చుట్టుముట్టిన సమస్యలు మొదలు మానవ జీవన చలనశీల పరిణామాల దాకా వివిధ కోణాలను ప్రతిభావంతంగా అక్షరీకరించారు.

ముఖ్యంగా 'జెండాసాక్షిగా...' మకుటం కింద రాసిన మినీ కవితలు వైవిధ్యంగా ఉన్నాయి.

పంచశీల బోధించాడు
పాంచభౌతికం చాలించాడు
1964 మే 27

అక్షరాలను కేవలం కళ్లతో చదివి, అక్కణ్నుంచి ముందుకు కదలడం అంత తేలిగ్గాదు. కచ్చితంగా అలోచించాలి. ఆ తేదీ ప్రాధాన్యాన్ని స్మరించుకోవాలి.

పేరు చుండూరు
హృదయం మండే చూరు
1991 ఆగస్టు 6

అదొక లోతైన గాయం. గాల్లోనే చెలరేగిన గాయాల సంకలనం. చూస్తుండగానే తుపానులా మారిన మారణ హోమం. ఈ దుర్మార్గం దుమారమై వీచి, సమాజాన్ని చుట్టుముట్టి, మరెన్నో ఉద్యమాలకు దారితీసిన పరిణామాలపై కవి సృజించిన మరో 'ఆలోచన'....

దళితుడికొక దళితుడు
తిరగబడితె బలితుడు
మాదిగ దండోరా!

బలితుడు మంచి ప్రయోగం. ఆ పదాన్ని 'బలి'తుడు అని అరిగిపోయిన పద్ధతిలో రాయకుండా సంపత్‌కుమార్ పరిణతి ప్రదర్శించారు.

చేతల విషయానికొచ్చేసరికి "అందరిదీ ఒకటే బాట / అవినీతి ప్రతిఘటన / నీతిబుట్ట మాయం!" అంటూ చాచి లెంపకాయ కొట్టారు.

''ఊరంతా నిద్ర పోతోంది / ఆకాశమంతా మగమేఘాలు / చెమ్మగిల్లిన కళ్లతో రైతు"....'రైతే కూలి' కవితలో మరో ఘాటైన గుళిక.

"ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్ / గట్టి మేల్ తల పెట్టవోయ్ / పార్లమెంటు ప్రసంగాలు"... ప్రత్యేక పరిచయమూ ప్రస్తావనా అక్కర్లేని ప్రజాస్వామిక విషాదం!

మనిషి ఇవ్వాళ డబ్బు వెంట పరుగులు తీస్తున్నాడు. రంగుల కలలు కంటూ స్వార్థం చుట్టూ పరిభ్రమిస్తున్నాడు. ఎదుటివారు కష్టాల్లో ఉంటే ఆదుకోవాలన్న ప్రాథమిక సూత్రాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నాడు. ఇందుకు భిన్నంగా మొన్నటి దాకా ఓ మానవీయమూర్తి అవసరంలో ఉన్నవారికి అపురూపమైన సేవలందించారు. సేవానిరతికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచారు. ఆమె నిష్క్రమణ అనంతరం పరిస్థితిపై మూడు లైన్ల కవిత...ముమ్మూర్తులా ఆమెకు అక్షర సన్మానమే...

ప్రపంచం తల్లిలేక
తల్లడిల్లిపోతోంది
మదర్ థెరిసా!

బడుగుజీవిలో పోరాటస్పృహ అనివార్యంగా మొగ్గ తొడుగుతుంది. ఆ విషయాన్ని "నరికేసిన కొమ్మ / కొడవలై మొలుస్తుంది / దళిత చైనత్యం" అని అద్భుతంగా కవిత్వీకరించారు.

అనుబంధాల్ని అహం ఆక్రమిస్తున్న సామాజిక వరవ్రమానంలో సహజాతి సహజంగా నడవాల్సినవన్నీ తిరగబడుతున్నాయి. అవే అనేక రకాల 'వికృతులు'గా కవికి కనిపిస్తున్నాయి. ఓ వికృతిని చూడండి..

ఇష్టంగా వందేళ్లు కలిసి
కాపురం చెయ్యమన్నారు!
ఇష్టానికి విరుద్ధంగా ఉండలేక
వందరోజులకే విడిపోయారు!

మేక-కసాయివాడి సామెతలాగా ప్రజలు హామీలకు దాసులయ్యారు. మోసపోవటానికి అలవాటు పడ్డారు. ఆ విషయాన్ని గొప్పగా చెప్పారు..

ఎన్నిసార్లు కాటేసినా
పాము ఆరాధ్యదైవమే
ఓట్లెయ్యడానికి బారులు తీరిన జనం!

ప్రకృతి ప్రసాదించే ఉప్పు మీద తెల్లవాడి అధికార మేమిటని ప్రశ్నించి, సముద్రం నుంచి ఉప్పును తీశారు గాంధీజీ. రాట్నం వడికారు. ఖద్దరు ధరించారు. స్వయం సమృద్ధ భారతావనిని కలగన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని కాంక్షించారు. కానీ, మనమేం చేస్తున్నామంటే..

కుటీర పరిశ్రమలద్వారా
తయారయిన వస్తువులనే వాడండి
చైనా బజారులో క్యూ!

చేతులు సాచి, శరీరాలు సాచి ఒక్కో అంగుళాన్నీ ఆక్రమించుకుంటూ ఆఖరికి అక్కడికీ వెళతాం. ఒకటీ అరా అడ్డంకులున్నా చదును చేసి జెండాలు పాతుతున్నాం. కాంక్రీటు అరణ్యాలు నిర్మిస్తున్నాం. మనమెలా మారుతున్నామో గుర్తించటం మర్చిపోతున్నాం. కానీ, కవి మర్చిపోడు...

శ్మశానాలు కూడా
ఊళ్ళయిపోతున్నాయి
మనుషులూ జీవచ్ఛవాలే కదా!

పర్యావరణం మీద రాసిన కవిత మరింత ఆలోచనాత్మకం...

నీళ్ళిచ్చి చెట్లను పోషించింది
చెట్లనుకొట్టి పొగపెట్టింది
భూమ్యాకాశాల సంబంధం!

ఒకటేమిటి...ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు; మానవ జీవనయానంలోని శ్రుతులూ అపశ్రుతులూ, పెడధోరణుల నాశ్రయిస్తున్న వ్యాపారాలు, మృగ్యమవుతున్న సేవాభావం... ఇలా అనేక అంశాల మీద మూడు పాదాల్లోనే ముచ్చటైన కవితలు రాశారు. ప్రతి కవితా మనల్ని వెంటాడుతుంది. శరపరంపరగా 'ఆలోచనలు' ముట్టించి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. సంపత్‌కుమార్ గారి నుంచి మరిన్ని పదునైన కవితాస్త్రాలు వెలువడతాయనడంలో సందేహం లేదు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవతావాది - మాడభూషి

- డాక్టర్ అందుగులపాటి శ్రీనివాసరావు, పార్వతీపురం, వినుకొండ మండలం, గుంటూరు జిల్లా.

నేటి ఆధునిక సమాజంలో అనేకమంది ప్రముఖ కవుల, కవయిత్రుల వచన కవిత్వం ద్వారా తమ మనో భావాలను, ఆశయాలను తెలియజేస్తూ సామాజిక చైతన్యం కోసం రచనలు చేశారు, చేస్తున్నారు. వీరిలో ప్రస్తుత రచయిత మాడభూషి సంపత్‌కుమార్‌గారొకరు ఏ రచయిత అయినా తన కాలంనాటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కవితా కంకణం కట్టుకుంటారు. అతి కొద్దిమంది మాత్రమే తన కాలం నాటి సమాజ పరిస్థితులను బేరీజు వేసుకుని తన ముందు తరాల వారి కోసం, నవ సమాజ నిర్మాణం కోసం సాహిత్య రచన చేస్తారు మాడభూషి సంపత్‌కుమార్ గారు. రేపటి సమాజం కోసం మార్గ నిర్దేశం చేస్తూ కవిత్వ సేద్యం చేస్తున్న కవి కర్షకుడు. దీనికి నిదర్శనమే ఆయన కలం నుండి జాలువారిన రచనలు. (వీరి కవిత్వంలో అనుభూతి, ఆత్మాశ్రయత్వం, స్త్రీసమస్యలు, రైతు ఆత్మమత్యలు, ప్రజాస్వామ్య ఎన్నికల తీరు, తల్లి ఆవేదన, దళితుల జీవితం, ప్రపంచీకరణ పర్యయసానం, రాజకీయ నాయకుల అనైతికత, సామాజిక సమస్యలు.... వంటివి అనేకం దర్శనమిస్తున్నాయి. ఇన్ని సమస్యలపై స్పందించాలంటే కవికి మానవత్వం ఉం డాలి.

అభ్యుదయ సాహిత్యం సమాజంలో చైతన్యం రగుల్కొల్పుతుంది. ప్రజలను తిరుగుబాటును పురిగొల్పు తుంది. అయితే ఏ కవి అయినా మానవతావాది కాకుండా అభ్యుదయవాది లేదు. మాడభూషి సంపత్‌కుమార్ గారు ఒక మానవతావాది. మానవతావాదం జాతి, సమాజం, వర్ణం, కులం, మతాల పేర్లతో వ్యక్తిని అణగద్రొక్కటాన్ని సహించదు మానవ సమాజానికి మానవుడే మూలమని ఘోషిస్తుంది. సమాజాభ్యుదయానికి మానవాభ్యుదయమే గీటురాయి అని ప్రబోధిస్తూ, జీవితాలు యాంత్రికం కాకూడదని మానవతావాదం నిర్దేశిస్తుంది)

ఏ కాలం నాటి కవి అయినా తన ఉనికికి ఆధారమైన సంఘాన్ని విడిచి సాము చెయ్యలేడు. సంఘమే అతని నృత్యరూపకం. ఒక సంఘం యొక్క తత్వాన్ని కవి నిరూపించినట్లు మరెవ్వరూ నిరూపించలేరు. అతనికి సంఘంలో ఉన్న సంబంధమే దీనికి కారణం. మాడభూషి సంపత్‌కుమార్ గారు విశాల మానవతా దృక్పథంతో సాహిత్యంలోకి నడిసొచ్చిన కవి. స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మనిషి కోసం ప్రజాస్వామ్య బద్ధంగా కవిత్వం రాస్తున్న మానవతావాది.

ప్రపంచీకరణ నేపథ్యంలో జరుగుతున్న వ్యాపారంలో రైతులకు జరుగుతున్న అన్యాయాలను మానవత్వంతో స్పృశించారు.

"కొనేవాడికి / అమ్మేవాడు లోకువ / దళారివాతపడ్డ రైతు!
భిక్షగాడు వెళుతున్నాడు / జోలెనిండిపోయింది /
దుర్భిక్షకుడైన రైతు!"
పల్లె పొమ్మంటోంది / పట్నం రమ్మంటోంది /
పొట్టకోసం వలస!"...

అంటూ నిర్వీర్యమవుతున్న వ్యవసాయ రంగాన్ని చూసి చలించిపోయాడు. దళారి వ్యవస్థ రైతాంగాన్ని ఏ విధంగా దోచుకుంటుందో తెలిపారు. ఆరారు కాలాలు శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతే కూలీగా మారుతున్న వైనం తెలుపుతున్నారు. బతుకు దెరువుకోసం రైతు వలస కూలీగా మారుతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశారు. లోకానికి తిండిపెట్టి ఆకలి కేకలతో అలమటించే రైతులను మనం ప్రసారమాద్యమాల ద్వారా చూస్తూనే ఉన్నాము. అందరికీ వెలుగునిచ్చి చీకటిగా మారిపోయే అగ్గిపుల్ల లాంటి జీవితం రైతుదని కవి కలత చెందుతున్నారు.

కాదేది కవిత కనర్హం అన్నారు. మనసున్న కవి దేనినయినా కవిత్వీకరించగలరు. సంపత్‌కుమార్ గారు 'సబ్బు'ను గురించి తెలియజేస్తూ-

"ప్రపంచమంతా మురికి / నీవొంటికి అంటదు!
లోక పరిశుభ్రతకు / కరగిపోయిన / జీవితం నీది!
బురదలోని బతుకుల్ని / తామరులుగా చేసిన /
నీ జీవితం ధన్యం!"....

అంటూ మానవాళిని పరిశుభ్రంగా ఉంచే సబ్బు గురించి 'సబ్బుబిళ్ళ' అనే కవితలో తెలిపారు. ఇక్కడ కవి యొక్క ఆంతర్యం గొప్పది సబ్బు పరిశ్రమ నుండి వస్తుంది. పరిశ్రమ శ్రామికుడి శ్రమతో నడుస్తుంది. ఇక్కడ సబ్బు శ్రామికుడి శ్రమకు చిహ్నం. ప్రపంచపు మురికిని పొగొడుతున్నాడు లోక పరిశుభ్రత కోసం తన జీవితాన్ని పరిశ్రమలో అరగదీసుకుంటున్నాడు. బురదలోని బతుకులను తామరులుగా చేస్తున్నాడు. అరకొర జీతాలతో తన జీవితాన్ని వెలదీసుకుంటున్నాడు కవి శ్రామిక పక్షపాలి.

నేటి ఆధునికపు పోటీ ప్రపంచంలో గెలిచిన వాడు గొప్పవాడా? ఓడినవాడు గొప్పవాడా? అని ప్రశ్నించుకుంటే ఓడినవాడే గొప్పవాడంటున్నారు కవి సంపత్‌కుమార్ గారు. గెలిచిన వారిని అభినందించడమే కాదు ఓడిన వారిని వెన్నుతట్టడం, వెన్నంటి ప్రోత్సహించడం మానవతా లక్షణం. ఓటమిని తట్టుకునే శక్తి అందరికీ ఉండదు. కాబట్టే చాలా మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆశించిన మార్కులు రాలేదని, ఉత్తీర్ణత పొందలేదని, ఆశించిన రంగంలో సీటు రాలేదని, అప్పులు తీరలేదని... ఇలాంటివి కొన్ని కారణాలు ఇది తప్పు. కవి ఓటమిలోని గొప్పతనం తెలియజేస్తున్నాడు.

"గెలిచినవాడికన్నా
ఓడినవాడే గొప్ప
గెలవడంకోసం
చాలా ప్రయత్నించి ఉంటాడు!
ఓడిన ప్రతిసారీ
గెలవాలనుకొంటాడు
గెలిచేంతవరకూ
ఓడిపోతూనే ఉంటాడు!"....

అంటూ ఓడిన వ్యక్తి పోరాట పటిమను, గెలవడానికి అతనిలో రగులుతున్న పోరాట ఆరాటాన్ని తెలియ జేస్తున్నాడు. ఇదే కవితను కొనసాగిస్తూ

"గెలుపుగురించి పలవరిస్తూ ఉంటాడు
గెలుపుకోసం అలుపును సహిస్తారు
తన ఓటమి ఫలితాలను
అందరికీ పంచి గెలుపుదారి చూపిస్తాడు
తన ఒక్కడి ఓటమినుంచి
వందమందిని గెలిపించడానికి స్ఫూర్తిని పంచు తాడు"....

అంటూ తెలియజేస్తున్నాడు. సృష్టికి ప్రతి సృష్టినివ్వగల శక్తి ఒక స్త్రీకి మాత్రమే ఉంది. తినే రొట్టెలు మూడు ఉన్నప్పుడు, తినవలసిన వ్యక్తులు నలుగురు ఉన్నప్పుడు - నాకు ఆకలిగా లేదని సుతారంగా తప్పుకొనే గుణం కూడా స్త్రీకే ఉంది. అలాంటి స్త్రీ అణచివేతకు, ఇంటి చాకిరీకి పరిమితమైన యథార్థాన్ని కవి మాడభూషి మానవతా కోణం నుండి దర్శించాడు.

"అమ్మ
ఒక ఇస్త్రీయి / ఒక రుబ్బురాయి
ఒక రోలు, ఒక రోకలి
పొయ్యిలోని కట్టె / కట్టెలోని పొగ
పొగతోపాటు వెలిగే మంట-
అంతలోనే అమ్మలో ఎంతమార్పు
అమ్మ / ఒక మిక్సీ / అమ్మ ఒకవాషింగ్ మిషన్
అమ్మ ఒక గ్రైండర్ / అమ్మ ఒక గ్యాస్ స్టౌవ్
అమ్మలో నాకు అమ్మ కనిపించదు
అమ్మంతా వస్తువులే
అమ్మ ఒక పనిమనిషి
అమ్మ ఒక గనిమనిషి
అమ్మను ఎంత తవ్వినా
పని వస్తూనే ఉంటుంది"[5]

స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకుచితం చేస్తుందో, ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో కవి తెలియజేస్తున్నారు.

స్త్రీవాద సాహిత్యంలో విమల గారి 'వంటిల్లు' కవిత ఇక్కడ గుర్తొస్తుంది. "వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మో రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరు" అంటారామే. ఇదే స్పృహతో కవి సంపత్ కుమార్ గారు స్పందించడం విశేషం.

1930లో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో తినడానికి తిండిలేని రోజుల్లో గోదుమ రొట్టెలతో ఆకలి తీర్చుకుని ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన వ్యక్తి అబ్దుల్ కలామ్. ఈ తమిళనాడు గడ్డ మీదే అతి సామాన్య, అధిక సంతాన కుటుంబంలో పుట్టిన వ్యక్తి. ఒక మంచి వ్యక్తిని గురించి సమున్నతంగా సద్భావంతో చెప్పడం కూడా మానవత్వమే. 'అఖండజ్యోతి' అనే కవితలో అబ్దుల్ కలామ్ గారి గురించి తెలియజేస్తూ-

"ప్రేమికుడా / స్వాప్నికుడా
శ్రామికుడా / సైనికుడా
శాంతికాముకుడా / అనంతజీవనయానంలో
అంతరిక్షంలో / అద్భుతాలు సృష్టించినవాడా
క్షిపణులు విసిరిన సైనికుడా
మనిషిగా వెలిగినవాడా / మనుషుల్లో తిరిగినవాడా
స్ఫూర్తిగా నిలిచినవాడా / మనసు విప్పి మానవత్వం చల్లినవాడా.."

అంటూ ఉన్నతీకరించాడు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పాడు. అంత్యప్రాస పదాలతో శ్రీశ్రీ గారిని గుర్తుకు తెచ్చాడు.

చెట్టును, పిట్టను, గుట్టను ప్రేమించే వాళ్ళకు హృదయం వికసిస్తుంది. సంపత్‌కుమార్ గారు ప్రకృతి ప్రేమికుడు ప్రకృతిలో భాగమైన పిచ్చుకపై తన మాన వతను ప్రకటించాడు. ప్రపంచీకరణ ప్రభావంతో పిచ్చుక తన అస్థిత్వాన్ని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

"కల్తీగింజలు తిన్న పిచ్చుక కలివిడిగా తిరగలేదు
నీళ్ళు, నేల, మాట, తిండి
కల్తీని పిచ్చుక తట్టుకోలేక పోయింది
కిచకిచమంటూ ఎన్ని ఉపకారాలు చేసింది
చివరకు పిచ్చుక మాయమైపోయింది
పులిని కాపాడుతున్నాడు
తన మానాన తాను బతికే
పిచ్చుకపై బ్రహ్మాస్త్రం సంధించాడు"...

అంటూ పిచ్చుక జాతి మనుగడ గురించి ఆవేదన వ్యక్తం చేశాడు కవి. తొలి రోజుల్లో పిచ్చుక చెట్లపై గూడు కట్టుకొని నివసిస్తూ ఉండేది. చెట్లు కొట్టేస్తే పూరిళ్ళలోకి చేరింది. పూరిళ్ళు మాయమైతే మిద్దింట్లోకి చేరింది. మిద్దిళ్ళు పోయి అపార్ట్‌మెంట్లు వచ్చాయి. సౌకర్యాలు పెరిగాయి. సాధనాలు పెరిగాయి. రేడియేషన్ పెరిగింది. పిచ్చుక జీవితం ప్రశ్నార్థకమయింది. దీన్ని కవి మానవతా కోణం నుండి చూశాడు.

అంతరాత్మ మానవత్వానికి అసలైన ప్రతీక ఎందుకంటే అది ఎప్పుడూ సత్యాన్ని శోధిస్తుంది. సహజత్వాన్ని బోధిస్తుంది. ఆత్మీయతానుబంధాలను వెల్లడిస్తుంది. కనుకనే కవి సంపత్ కుమార్ గారు తన తండ్రి స్మృతి పథంలో, తన తండ్రి త్యాగాన్ని, శ్రమను అక్షరీకరించాడు-

"కోడికన్నా, కోకిలకన్నా
ఆయనే ముందు లేస్తాడు
చంద్రుడికి చాప చుట్టేసి
సూర్యుణ్ణి నిద్రలేపుతాడు!
రెక్కాడితేగాని / డొక్కాడని
కుటుంబంకోసం / పక్షులతోపాటు
రెక్కలు విదుల్చుకొని / బయలు దేరుతాడు
చెమట ముక్కల్ని / నీటి చుక్కలు చేసి
పిడచకట్టిన పిల్లల / నాల్కలపై పోస్తాడు!"...

అంటూ కుటుంబ పోషణ కోసం ఒక సామాన్య వ్యక్తి ఎంత కృషి చేస్తాడో అంతకృషి తన తండ్రి చేశాడని కవి గుర్తెరుగుతున్నాడు. ఇదే కవితను కొనసాగిస్తూ-

"ఆ రోజు రాత్రిదాకా
మాకు పెట్టడం తప్ప

ఒక్క పిడికెడు మెతుకులు
ఆశించని ధన్యుడు!
జీవన సమరంలో
కత్తి కింద పడకుండానే!
మరణించిన వీరుడు"...

అంటూ తన తండ్రిలేని జ్ఞాపకాలను నెమరువేసు కుంటున్నారు. తన తండ్రి జీవిత పర్యంతం రెపరెప లాడించిన నీతి పతాకను తానందుకుని పయనిస్తున్నాడు.

ఒక వ్యక్తి మరొక వ్యక్తి మీద దాడి చేయడాన్ని, ఒక వర్గం మరొక వర్గం మీద దాడి చేయడాన్ని, ఒక జాతి మరొక జాతి మీద దాడి చేయడాన్ని, ఒక దేశం మరొక దేశం మీద దాడి చేయడాన్ని కవి ఖండిస్తున్నాడు. స్వాతంత్ర్యానంతరం దేశ విభజన జరిగిన తరువాత ముస్లిం సమాజం మీద జరిగిన దాడులను కవి సహింప లేకపోయాడు. తీవ్రంగా కలత చెందాడు. ఆ కలత నుండి కవిత రేగింది-

"అయోధ్య మసీదు
మానసికంగా కుంగదీస్తే
గోద్రా రైలు / మానవత్వాన్నే కూల్చేసింది
చుండూరులో ఊచకోత కొస్తే
కారంచేడులో కడుపుకోత నింపింది!"....

అంటూ అగ్రమతాల అహంకారాన్ని, అగ్రవర్ణాల దురహంకారాన్ని ఎండగడుతున్నాడు. 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదు విధ్వంసంలో ముస్లింల అస్తిత్వంపై దెబ్బపడింది. 2002లో గుజరాత్‌లో ముస్లింల ఊచకోత జరిపి వందల ప్రాణాలను హరించారు. చుండూరు కారంచేడులలో దళితులను సంహరించారు. ఈ నాలుగు సంఘటనల్లో దాడికి గురైన ప్రజలు అల్పవర్గ ప్రజలే, అమాయక ప్రజలే. ఇటువంటి సంఘటనలు మానవాభ్యు దయానికి గొడ్డలిపెట్టులాంటివని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనిషిలో మానవత్వాన్ని అభిలషిస్తున్నారు.

"రాతిలో మొక్క మొలకెత్తినట్లు
మనిషిలో మనసు మొలకెత్తినప్పుడు
నేనూ మనిషిగా నిలబడతా!
మనిషి మారకపోతే
మనిషిపైనే తిరగబడతా!"...

అంటూ మారని మనిషిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవాభ్యు దయమే సమాజాభ్యుదయమని, సమాజాభ్యుదయమే దేశాభ్యుదయమని కవి ధంకా వాయించి చెప్తున్నాడు.

"భవిష్యత్కాలంలోనైనా
మానవత్వాన్ని నటించకు
మోహానికి నవ్వు పులుముకొని
కడుపులో కత్తులుదించకు
మనసులకు అంతరాయం
కలిగించకు"

అంటూ హితవు పలుకుతు న్నాడు. కలహాలు లేని సమాజాన్ని ఆశిస్తున్నాడు. అసమానతలు లేని సమాజాన్ని ఆకాంక్షిస్తున్నాడు. ఒక బిక్షగాడు చేత మనిషి విలువను, మానవ సమాజ ఔన్నత్యం గురించి కవి చెప్పించాడు.

"నాకు
దేవుడి మీద కన్నా
మనిషి మీదే
ఎక్కువ నమ్మకం-
అందుకే
గుడి బయటే
అడుక్కుంటాను!"

అంటాడు. మనిషి మీద మనిషికి నమ్మకం కలిగిస్తు న్నాడు. మనిషే అన్నిటికి కేంద్ర బిందువంటున్నాడు కవి. తనదైన దృక్కోణం నుంచి మనిషి విలువను వివరించి, విస్తరించి, విశ్లేషిస్తున్నాడు. మానవత్వానికి హద్దులు లేవని తెలుపుతున్నారు.

మతం కన్నా మానవత్వం గొప్పది. మానవత్వంతో మెలగమని అన్ని మత గ్రంథాలూ బోధిస్తున్నవి. మనిషికి మానవతే ప్రాణం. మానవత్వం దైవత్వానికి గుర్తు. సమాజంలోని ప్రజలందరూ స్నేహ సౌజన్యాలతో, శాంతి యుత భావాలతో జీవించాలని, మానవీయ సంబంధాలు పరిఢవిలాలని కోరుకుంటున్నారు. కవిగా సంపత్ కుమార్ గారు మానవ శ్రేయస్సును అభిలషిస్తున్న అందరి శ్రేయోభిలాషి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మూడో మనిషి' తాత్త్విక చింతన

- డాక్టర్ నగలి చొముండేశ్వరరెడ్డి, తెలుగు శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

కవి పరిచయం :

ప్రఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి "మూడో మనిషి" కవిత్వంలో నవ్యత్వం, సమత్వం, శివత్వం, జీవిత్వం, మానవత్వం కనిపిస్తున్నవి.

ఈ "మూడో మనిషి" కవిత్వంలో మాడభూషి వారు మణిభూషి అయ్యారు. ఆర్ద్రతను వర్ణించే సందర్భంలో వారు వెన్నపూస అయిపోయారు. వారి రచన కనిపించే వాస్తవాలకు, వారి జీవితంలో చవి చూసిన, అనుభూతి పొందిన యథార్థాలను సమత్వం కనిపిస్తున్నది. సారూప్య భావం తొణికిసలాడుతున్నది. నిజ జీవితంలో వారు చవిచూసిన ప్రళయ తాండవాన్ని, శివతాండం వలె అక్షరూపాన్నిచ్చారు.

ప్రకృతి స్త్రీ రూపానికి ప్రతీక. ప్రకృతి పంచ భూతములచేత (కృతి) నిర్మించబడింది. పృథివి, జలా, వాయు, అగ్ని, ఆకాశం (నింగి, నేల, నీరు, నిప్పు, గాలి) చేత ఆవరించియున్నది. శివుడు లయకారుడు, ప్రళయ కాలంలో రుద్రతాండవం చేస్తాడు. ప్రతిజీవి హృదయంలో సాక్షిభూతుడిగా శివుడు సూక్ష్మరూపంలో రహస్యంగా మనస్సు చేసే పనుల్ని చిత్రించుతూ వుంటాడు. ఈ సృష్టిలో స్త్రీలందరూ అమ్మవారి ప్రతీకలు. పురుషలందరూ శివునికి ప్రతీకులు. స్త్రీ, పురుషులు ఇరువురిలో నిగూఢంగా దాగివున్న వాడే మూడోమనిషి. వాడు గుప్తంగా వుండి అన్నింటినీ రికార్డ్ చేస్తూ వుంటారు. వాడికి స్త్రీ, పురుష రూపాలు వుండవు. పంచభూతాలు వాడిని స్పృశించలేవు. వాడినే భగవద్గీతలో

"నైనం చిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావక:
నచైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుత:"

ఆత్మను శస్త్రం చేధించజాలదు, అగ్ని దహింపచాలదు, జలం తడుప జాలదు. వాయువు స్పృసింపజాలదు అని గీతాచార్యుడు. గీతలో బోధించడమైనది. భగవాన్ రమణ మహర్షి 'నేనెవరు' 'నేనెవడను' అని ప్రశ్నించాడంటే ఆత్మతత్వం తానని తెలుస్తుందని చెప్పడమైనది. ఆత్మ ఎప్పుడూ చైతన్య శీలం. సాక్షీభూతమైనది.

మాడభూషి వారు కవిత్వం ఆరంభంలోనే "మహా ఆత్మఘోష"లో ఆత్మతత్వాన్ని గురించి ప్రస్తావించడ మైనది. "మహాఆత్మఘోష" అనే కవితలో జీవుడు శరీరం వదిలిపెట్టినపుడు ఆత్మ దేహం చుట్టూ మమకారం ఆశాపాశాలు వదలలేక ఘోషిస్తాయి. కవి ఇక్కడ దేహాలు శాంతి వేదం వింటున్నాయి అని చమత్కరించడమైనది.

ఆధునిక కాలంలో "రాజకీయ నాయకులు వారి పదవులకోసం దారిలో జనాలు నడిచే రహదారిలో యాగం చేసి, మంత్రి పదవులు ఇతర ఉన్నత పదవులు పొంద డానిని బ్రాహ్మణులచేత వేదమంత్రులు చెప్పిస్తూ ఇలాంటి కర్మకాండ యాగ క్రతువులు చేస్తుంటారు. అయితే వారి పదవులకోసం, అధికారం కోసం ఆ యజ్ఞంలో ఎంతోమందిని బలిచేయడం విచారకరమైనది. మనుషులను పశువులవలె చేసి తమ చుట్టూ తిప్పుకుని ఎన్నికల్లో గెలిచాక అధికారం వచ్చి అందలం ఎక్కాక సాధారణ జనాలను మరచి సాయం చేసిన వారిని వదిలేస్తారు.

అధికారం వుంది కాబట్టి ఇంద్రుడి వైపు ఇంద్రుడి పక్షాన చేరి రుషులు శాంతి మంత్రాలు వంటి పఠిస్తున్నారని కవి పేర్కొనడం విశేషం. నేటి సమాజంలో కూడా మేధస్సువున్నా మేధావి వర్గం, పండిత వర్గం రాజ్యాధికారం వున్న వైపు చేరి బలి పశువులు అవుతున్నారు. వారి ఆశపడి అవార్డులను, బిరుదులను, నామినేటెడ్ పదవులకు ఆశపడి వారి వలలో చిక్కుకుంటున్నారు.

ప్రతిభ వున్న చంద్రుణ్ణి, వెలుగుతో ప్రకాశిస్తుంటే అధికార బలంతో ఇంద్రుడు మబ్బులతో కప్పివేయాలని చూస్తారు. నేటి కాలంలో కూడా ప్రతిభ వున్న వారికి పట్టం కట్టకుండా వారి ప్రతిభను అణద్రొక్కాలని చూడటం వల్ల వారు విదేశాలకు వలసవెళ్ళి ఆ దేశాల ప్రగతికి కారకులౌతున్నారు.

అక్కడ వారి ప్రతిభను మెరుగు పరచుకుని వారి గౌరవాన్ని, విధేయుతను కాపాడుకుంటున్నారు. "మహాఆత్మ" యజ్ఞం వాటికి చుట్టు ఘోషిస్తూ వుంటుందని వాస్తవ సత్యాన్ని కవి చెప్పడమైనది. అయినా ఇంద్రుడు అంత రాజ్యాధినేత శాంతివేదం వింటున్నాడు అని అనడంలో నేటి సామాజిక స్పృహ ఇందులో కనిపిస్తున్నది.

"ఆకురాలిన కాలం" ఖండికలో అమ్మను ఆకుతో మరియు పండుటాకుతో పోల్చి చెప్పడం కవి దర్శనానికి నిదర్శనం. అమ్మ శరీరం పండుటాకులుగా పూర్తిగా పండిపోయినపుడు శరీరం ముడతలు పడి ఆమెకు వృథాప్య ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అపుడు నిండు అమ్మదనం ఆమెలో కనిపిస్తుంది. ముడతలు పడని శరీరంలో ఇంకా జవత్వం ఉంటుంది. పరిపక్వత రాదు. పరిపక్వత వచ్చినపుడు మాత్రమే మాతృతత్వం వికసిస్తుంది.

"కాలాన్ని ఎదిరించి" అని అనుకుంటే మధ్యలో ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని కాలధర్మం చెందడం విషాదకరం. పచ్చని చెట్టుతో అమ్మను పోల్చడం విశేషం.

"పరోపకారాయ ఫలన్తి వృక్షాः" అని సూక్తి పరుల కోసమే చెట్టు పళ్ళను ఇస్తుంది. అమ్మ కూడా ఇతరుల కోసం ప్రతిఫలం ఆశించకుండా సేవ చేస్తుంది. ఆకలితో వున్న వారికి అన్నం పెట్టి అన్నపూర్ణా దేవిలాగా ఆదరిస్తుంది.

చివర్లో కవి అద్భుతమైన పదజాలంతో అమ్మ యొక్క ఔన్నత్యాన్ని వర్ణించడం కనిపిస్తున్నది.

సహజంగా చాలామంది నాయకులు, అధినాయకులుగా తాము భావిస్తున్నాంటారు. అయితే అమ్మ వున్న వారేం నిజమైన అధినాయకులు మరియు నాథులు. అయితే అమ్మలేనివారే నిజమైన అనాథలని కవి చక్కగా విశ్లేషించి చెప్పడమైనది.

"నేను-నవ్వు" కవితలో

"నువ్వు పైకి రావడానికి నేను మెట్టుగా వున్నాను, నువ్వు మెట్టును మరచి కాలికింద రాయి అనుకుంటున్నావు." నేటి కాలానికి ఇది సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. ఇంటికింద వున్న పునాది కనిపించకపోయిన అది ఇంటికి ఆధారమైనది. అలాగే సహాయం చేసిన వారిని మరువరాదని ఈ కవిత సారాంశం.

ఈ సంకలనానికి మకుటాయమానమైనది. "కవిత్వం" శీర్షికలో మూడు మాటలు మూడు సాహితీ వేదంలో మంత్రాల వంటివి. ప్రతి పాఠకుడు, ప్రేక్షకుడు, రస హృదయాలు అనుభూతి చెందే రచనా శైలి పదలాలిత్యం ఇందులో కనిపిస్తుంది.

"కవిత్వంలో మడికాదు, తడి వుండాలి"

మడి కట్టుకొని కూర్చోవడం అంటే ఎవరితో కలవకుండా వుండటం అనే అర్థం ముంది. తడి అంటే ఆర్ద్రత కవిత్వం చదివిన వెంటనే సహృదయుడి హృదయం ద్రవించాలి. కరుణ రసం అతనిలో కదిలిస్తుంది. అదే తడి.

"కవిత్వం గుడికి కాదు. బడికి నడిపించాలి"

కవిత్వం చదివితే విజ్ఞానవంతుడు కావాలని కవి అభిలాష. బడికి వేళితే అక్షర జ్ఞానం కలిగి విజ్ఞానం వస్తుంది. విజ్ఞానం వల్ల మంచి, చెడుల విచక్షణ తెలుస్తుంది.

ఈ మధ్య కాలంలో బదుగుల జీవితాల గురించి కవిత్వం రాసి బదుగు కవులు బిరుదులు, అందలాలు ఎక్కుతున్నారు. గద్దెలు ఎక్కి పెద్దలు గద్దలౌతున్నారే తప్ప వారి సామాజిక వర్గానికి, వారి ఉన్నతి కోసం కృషి చేయడం లేదన్నది కఠోర సత్యం.

"కవిత్వంతో అందలం ఎక్కించడం కాదు అందరినీ ఎక్కించాలి."

తాము పొందిన ఆనందాన్ని పదిమందికి పంచాలే తప్ప తమ కోసం కాదు. పదుగురి కళ్ళలో కన్నీళు తుడిచి ఆనందం పొందటం చూసినపుడు మనకు కలిగే ఆనందం నిజమైన ఆనందం అలాగే మనం పొంది ఉన్నతి స్థానాన్ని ఇతరులు కూడా పొందడానికి కృషి చేయాలో కవి యొక్క సామ్యవాద దృక్కోణం కనిపిస్తున్నాయి. సమ సమాజ స్థాపనే మన ధ్యేయం కావాలనడం శుభపరిణామం.

"తల్లి" అనే కవితలో

"ఒక తల్లి పదిమంది పిల్లల్ని పోషిస్తుంది - నాడు పదిమంది పిల్లలు ఒక తల్లిని పోషించలేక పోతున్నారు - నేడు

మూడు దశాబ్దాల ముందు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అప్పుడు వివాహాలు అయినా కూడా పిల్ల లందరూ తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ హాయిగా జీవిస్తుండేవారు. అయితే నేటి ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరు ఉద్యోగాల కోసం పట్టణాలను వలస పక్షులులాగా వెళ్ళి అక్కడ వెట్టి చాకిరి చేస్తూ చివరికి తమకు పుట్టిన ఒక్క సంతానాన్ని కూడా పోషించడం ఆలనా పాలనా చూడటం కష్టంగా మారింది. భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తేగాని నగరంలో జీమా సాగించలేని దుస్థితి అంతేగాక తల్లిలో జవసత్వా లుడికి ఒకరికంటే ఎక్కువ సంతానం పట్ల ఆసక్తిని కనబరచక పోవడానికి కారణమౌతున్నారు. కవి ఈ కవితలో తన అనుభూతిని రంగరించి ఆధునిక జీవన శైలిని కళ్ళకు కట్టినట్లు నాటకీయతను ఇందులో జోడించి వివరించడ మైనది.

మనీ వుంది కానీ మనుషులు లేరు పిల్లల పోషణ కరువైంది.

"అబద్ధం" కవితలో అబద్ధం చెప్పేవారు గెలుస్తారని చెపుతూ తాత్కాలికంగా జరగవచ్చు ఏవెా కాని శాశ్వతంగా వుండదు. "యథార్థ వాది లోక విరోధి" అనే సూక్తి వుంది. ప్రియమైనపుడు అబద్ధం చెబుదాం. అప్రియమైనప్పటికి సత్యం చెప్పరాదని శాస్త్ర వచన. అందుకే సుమతి శతక కారుడు "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నాడు. "సత్యమేవ జయతే" అనేది పేరుకే.

"ప్రయాణం" కవితలో చిటికెలో ముగిసే ప్రయాణానికి చిందులు తొక్కటం దేనికి. "జీవన స్రవంతిలో జీవితకాలం చిటికెలో ముగిసి పోతుందని కవి నిర్భయంగా నిజం చెప్పారు. బొందిలో ఊపిరి ఉన్నంత వరకు మనిషికి అధికారాలు, పదవులు, బిరుదులు ఉంటాయి.

ఊపిరి పోయిన వెంటనే ఆ శరీరాన్నే దూరంగా ఇంటి నుంచి బయటికి గెంటి వేస్తారు. అంతమాత్రం దానికి ఆవేశాలు, అహంకారాలు, ఆందోళనలు అనవసరమని కవి ప్రబోధించడమైనది. ఈ జీవితమనే ప్రయాణం పూర్తి అయ్యేలోపు మనిషి తత్వాన్ని ఇతరులు అర్థం చేసుకుంటే చాలని తెలపటమైనది.

"బాధ" కవిత్వంలో మనకు సహజంగా కలిగే బాధ కంటే ఇతరులు సాధించిన బిరుదులు, సన్మానాలు, అవార్డులు, రివార్డులు చూసి గుండె తరుక్కుపోయి ఈర్ష్య, అసూయలతో బాధపడుతున్నామనే ఆధునిక వాస్తవ సత్యాన్ని కవిత ఉద్బోదించడమైనది.

ఇతరులు బాధపడితే కన్నీరు తుడవాల్సింది పోయి, వాడిని చూసి ఆనందం పొందుతున్నారు నేటి మానవుడు. అదే ఆనందం అనుకుంటున్నాడు.తాను సాధించినపుడు కలిగే ఆనందం కంటే ఇతరులకు దు:ఖం కలిగినపుడు తాను పొందే అల్ప సంతోషం ఆనందం సైశాచిక ఆనందం వంటిది.

"లెనిన్" కవితలో భూగ్రహంలో లెనిన్ మరణించినా, హృదయ గృహంలో జనించాడని కవి ప్రకటించడమైనది. కవి మరణించినా అతని రచనల ద్వారా అతని మంచి పనుల ద్వారా లోకంలోని జనులు నిత్యం స్మరిస్తూనే

ఉంటారు. ఆ విధంగా లెనిన్ కూడా మరణించినా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాడని కవి చక్కగా పేర్కొన్నారు.

"రాజ్యాధికారం" కవితలో

"రంగుల రాట్నంలో
స్థితులు మారడం తప్ప
గతులు మారడం లేదు!"

నేటి సమాజంలో జరుగుతున్న రాజకీయ జూదంలో ఓట్లు వేసిన ప్రజలు ఓడిపోతున్నారు. రాజకీయ నాయకులు ఎప్పుడూ గెలుస్తూనే వున్నారు. అధికారం రాక ముందు వాగ్దానాలు చూసి, అందలమెక్కిన తరువాత అట్టడుగ వర్గాల వారిని విస్మరించి, తన బంధు వర్గాన్ని అత్యున్నత నామినేటెడ్ పోస్టుల్లో నియామకాలు చేసి, సాధారణ జనాన్ని తన నియంత్రణలో వుంచు కుంటున్నాడు. రంగుల రాట్నంలో పైకి, కిందికి స్థితులు మారతాయి.

అయితే రంగుల రాట్నం ఒక్క అంగుళం కూడా ముందుకు కదలదు. గతి మారటం లేదు. పురోగమనం చెందకపోవడాన్ని కవి చక్కగా విమర్శనాత్మకంగా వివరించడమైనది.

నేటి రాజకీయ నాయకులు నిరంతరం సామాన్య ప్రజానీకాన్ని, అజ్ఞానంలోకి, అంధకారంలోకి తీసుకుని పోయి వారిని పైకి రానీకుండా చేయటం నేడు కనిపిస్తున్నది. చెట్టుకి కొమ్మలుంటే బలంగా వుంటుంది.

అయితే అది పైకి పోదు చెట్లు విస్తరిస్తుంది. రాజకీయ నాయకుడు తాను పైకి ఎదిగి తన చుట్టూ వున్న చోట మోట నాయకుల్ని కొమ్మలు కొట్టేసిన చెట్టులాగా వారందరినీ ఎదగనీయకుండా చూసుకుంటాడు. ఎందుకంటే వారు ఉన్నతిని, అభివృద్ధిని సాధిస్తే తనకే ముప్పుగా పరిణమిస్తుందని భయం. ఎన్నికలపుడు జనాన్ని మోసం చేసి అందలమెక్కినపుడు వాగ్దానాలన్నీ మరచి పోతారు రాజకీయ నాయకులు.

"నల్లమొహాలు" కవితలో

రోడ్డుమీదఎవణ్ణి చూసినా నల్లగా కనిపిస్తున్నాడని కవి చమత్కరించడమైనది. ఇంతక మునుపు ఐటి దాడులు, ఈడి దాడులు జరగక పూర్వం తెల్లదుస్తులు వేసుకునే పెద్ద మనుషుల్లాగా చలామణి అవుతూ వుండేవారు.

అయితే రాత్రికి రాత్రే ఆదాయపు పన్ను అధికారుల దాడులలో చాలామంది తెల్లవారే సరికల్లా జైలు దారిపట్టి తలదించుకుని అక్రమంగా సంపాదించి కూడబెట్టిన కోట్ల రూపాయుల ధనం ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకోవడం వల్ల తెల్లమొఖాలు వేశారు. నల్ల ధనం బయటబడింది.

ప్రభుత్వానికి కట్టాల్సిన పన్ను కట్టకపోగా అక్రమంగా ఆదాయ వనరులు కూడబెట్టుకున్న తెల్లచొక్కాలు వేసుకున్నారు. ఇపుడు నల్లవారు బ్లాక్ మనీ హెూల్డర్స్‌గా మారిపోవడం చూసి కవి చక్కగా చమత్కరించడమైనది.

"రాత్రికి రాత్రి కుబేరులైనవారు
కబీరులైనారని వ్యాఖ్యానించడమైంది"

నేడు ప్రతి చిన్న విఆర్ఒ స్థాయి అధికారి కూడా కోట్లకు పడగలెత్తి బినామీ ఆస్తులు కూడబెట్టుకోవడం నిత్యం టివీల్లో, పత్రికల్లో చూస్తున్నాం. పది సంవత్సరాల ముందు ప్రభుత్వం యొక్క స్కామ్‌లు బయటపడితే గత ఆరు సంవత్సరాలుగా ప్రజల్లో వున్న పెద్ద మనుషుల్లో చెలామణి అయిన నల్ల మనుషులు బయటపడుతున్నారు.

"ఒకవాన" కవితలో

గోలపాటకు, లాలిపాటకు భేదం గుర్తించలేక నిద్రలోకి జారుకున్నారని కవి అనడంలో నిద్ర అంతా ఇక్కడ శాశ్వత నిద్రగా మారింది. కనులు తెరవకముందే రాత్రికి రాత్రి వాన అందరినీ ముంచేసింది.

మొదటి రోజు "నీళ్ళు" ఆకాశానికి
రెండోరోజు నీళ్ళు కన్నీటికి
మొదటి రోజు ఊరుమునిగితే
రెండవ రోజు జీవితం మునిగింది

ఊరంతా నీళ్ళు వున్నా
జనం కన్నీళ్ళు తాగి బతికారు.

ఒక రోజు వాన పడినపుడు అందరు సంతోషించారు. పది రోజులు ఎడతెరపిలేకుండా కురిసి, ఇళ్ళు జలమయ మైనపుడు, జనుల కన్నీళ్ళు ఏరులై పారింది.

మొదటి రోజు ఊరుమునిగింది
రెండో రోజు ప్రజల ప్రాణాలు పోయాయి.

ఇపుడు నీళ్ళు వున్నా అవి దప్పిక తీర్చలేకపోయింది. చివరికి కన్నీళ్ళు తాగవలసి వస్తుందని ప్రజలు ఊహించ లేకపోయారని చెన్నైలో వరదలు పడినపుడు కవి మాడభూషి గారు మణిభూషి మనుషుల రుషిగా మారి వారి వేదనను ఆర్ధతను వివరించడమైనది.

"పక్కా ఇళ్ళు" కవితలో రాజకీయ నాయకులు - ప్రజలకు పక్కా ఇళ్ళు కట్టిస్తానని వాగ్దానాలు చేస్తారు. అయితే వారి ఇంటి పక్కనే ఎందుకు ఇళ్ళు కట్టించ కూడదని ప్రశ్నించడమైనది. ఊరికి దూరంగా వెలివేసి నట్లుగా రాళ్ళు, రప్పలు, కొండల్లో, చెరువుల్లో, ఇళ్ళ స్థలం ఇస్తారు. అయితే వాటికి కనీస వసతులు, సౌకర్యాలు వుండవు. ఇక్కడ కవి "అంటరాని విషయంలో అంటీముట్ట నట్టున్నారు" అని చెబుతున్నాడు.

ఆధార గ్రంథాలు :

1. మూడో మనిషి - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వంలో తల్లి ఆవేదన

- ఉల్లెంగ ముత్యం, తెలుగు ఉపన్యాసకులు, రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, బాసర.

మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేస్తున్న శ్రీ మాడభూషి సంపత్‌కుమార్ గారు వారి కవితల ద్వారా సమాజంలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రయత్నం చేశారు. అనేక సామాజిక, రాజకీయ విషయాల మీద వారు రాసిన కవితా సంపుటాలు చాలా ఆలోచన కలిగించేలాగా ఉన్నాయి. తెలుగు కోసం తన జీవితాన్ని అంకితం చేసినవారు సంపత్‌కుమార్‌గారు. తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన పరిశోధకుడు. సామాజిక, సమకాలీన పరిస్థితుల గురించి అనేక పరిశోధనలు చేసి కవిత్వం రాశారు. ఈ వ్యాసంలో మాడభూషి కవిత్వంలో తల్లి యొక్క ఆవేదన గురించి మాడభూషి సంపత్‌కుమార్ గారి భావాలను వివరించడమే ఈ ప్రయత్నం.

సృష్టిలో అమ్మకు విశిష్టమైన స్థానం ఉంది. ఆ స్థానంను ఎవరితోను పోల్చలేము. అమ్మ తన పిల్లవాడి కోసం ఎన్నోరకాల సేవలు చేసి పెంచి ప్రయోజకున్ని చేస్తుంది. అలా ప్రయోజకుడైన పిల్లవాడు పెద్ద వాడైన తర్వాత తల్లి చేసిన సేవలను మరిచిపోయి వాడి సుఖం వాడే చూసుకుంటు ఉంటే ఆ తల్లి పడే ఆవేదనను మాడభూషి గారు తమ కవిత్వంలో ఎంతో చక్కగా వివరించారు. ఆమ్మ ప్రేమను వివరించడానికి మూడో మనిషి అనే పుస్తకంలో వారు ఇలా రాశారు.

"అమ్మకు / పక్షపాతం ఉంటుంది
అమ్మకు / స్వార్థం ఉంటుంది
అమ్మ / నిర్దాక్షణ్యంగా ఉంటుంది"

(మూడోమనిషి పేజి 62)

అమ్మ తన పిల్లల పట్ల విశేషమైన గుణాలను కలిగి ఉంటుందని కవి అంటారు. తన పిల్లలు తెలిసోతెలియకో చిన్న తప్పు చేస్తే తల్లి పక్షపాతంగా వ్యవహరిస్తుంది.తన పిల్లలు అలాంటి వారు కాదని అంటుంది. తన పిల్లల ఎదుగుదల గురించి, భవిషత్తు గురించి తల్లికి స్వార్థం ఉంటుందని అంటారు.

"నిన్ను ఎలా కనాలి / నీకు ఎం పెట్టాలి
నిన్ను ఎలా పెంచాలి / నిన్ను ఎం చెయ్యాలి
అన్ని అమ్మమనుసులోనే అనుకుంటుంది
అవన్ని నీకు సెప్పి సెయ్యను బిడ్డ"

(మూడో మనిషి, పేజి 52)

తల్లి ఏంచేసినా తన మనసులో ఆలోచించుకొని, పిల్లవాడి మంచి భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకుంటుంది. ఏమి చెప్పి చెయ్యరు. అన్ని మనసులో అనుకొని చేస్తుంది అని కవి అంటారు. కాని ఆ తల్లి పట్ల పిల్లల ప్రేమ సరిగా ఉండదని కవి ఆరోపించాడు.

"ఒక తల్లి / పది మంది పిల్లల్ని
కని పెంచి పోషిస్తుంది / పది మంది
పిల్లలు / ఒక తల్లిని పోషిచలేకపోతున్నారు"

తల్లి తను కని పెంచిన పదిమంది పిల్లల పట్ల సమానమైన ప్రేమతో పోషించి వారిని పెద్ద చేస్తుంది. పదిమంది పిల్లలను సమానంగా చూస్తుంది. కాని ఆ తల్లి ముసలిదై పోయినప్పుడు పెళ్ళిళ్ళు, కుటుంబాలు వేరుగా అయి పోయిన ఆ పదిమంది పిల్లలు అంతా కలిసి కూడా ఈ ఒక్క తల్లిని సరిగా పోషించలేకపోతున్నారు. ఎంత భాధాకరం. అందుకనే ఇలాంటి దృశ్యాలను చూసిన మనుసు బలహీనమైపోతుందని కవి అంటారు.

"రాము రాము మనుషులు / బలహీన పడిపోతున్నారు
అందుకే తల్లి / ఇప్పుడు /ఒకే బిడ్డతో సరిపెట్టు
కొంటోంది"

ఇలా పదిమందిని కని, పెంచి, పోషించి వారు సరిగా చూడటంలేదని ఆలోచించి మనుషుల బలహీన

పడిపోతున్నారని అందుకే గతంలో పది మందిని కని పెంచిన తల్లి నేడు ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటుంది. అని కవి వివరిస్తారు.

ప్రస్తుతం పిల్లలు పెరిగి పెద్దవారై ఉద్యోగాల పేరుతో నగరాల బాటపట్టి లేదా విదేశాల బాటపట్టిన తరుణంలో ఇంటిదగ్గర ఉన్న మసలి తల్లిదండ్రుల యొక్క బాధను వివరించారు. తల్లి దండ్రులు మసలివారైన తర్వాత వారి బాగోగులను చూసే పరిస్థితి నేడు లేకుండా పోయిందని కవి అంటున్నారు. ఈవిధంగా తల్లి యొక్క ఆవేదనను కవి వివరించారు.

"అమ్మ ఆకులా రాలిపోతుంది / పండి పండకముందే / నిండా పండకముందే / ఎన్ని గాలుల్ని

ఎన్ని తుపానుల్ని / తట్టుకొని నిలబడినట్టే / కాలాన్ని వివరించి నిలబడుతుందనుకున్నాం / కాని అమ్మ పడులాకుటా రాలిపోతుంది"

ఒక చెట్టుకు ఉన్న ఆకు ఏవిధంగా ఎండకు ఎండి పోయి చివరకు రాలిపోతుందో అదే విధంగా తల్లి పండకముందే బాధతో రాలి పోతుందని కవి అంటారు. జీవితంలో ఎన్నో కష్ట సుఖాలను చూసిన అమ్మ వాటిని తట్టుకొని నిలబడిన అమ్మ తన పిల్లలు పెడుతున్న బాధలను చూసి, పండి, పండకముందే పండుటాకులా రాలిపోతుందని అంటారు. శ్రీమాడభూషి జీవితంలో కాలాన్ని ఎదురించి ధైర్యంగా నిలబడిన అమ్మ తన వృద్ధాప్యంలో పిల్లల పరిస్థితిని, వారు తన పట్ల చూపుతన్న వివక్షను చూసి తల్లి పండుటాకులా రాలిపోయిందని కవి అంటున్నారు. ఇలా అకురాలిన కాలం అనే కవిత ద్వారా తల్లి పడుతున్న ఆవేదనను గురించి వివరించారు. ఇలా తన కవితల ద్వారా తల్లిపడే ఆవేదనను వివరించారు.

పచ్చని చెట్టులా వెచ్చని తన ఒడిలో ప్రజలకు సేదతీర్చిన / ఆకురాలి మోడువారి పోతుందనుకోలేదు / మళ్ళీ చిగురిస్తుందన్న ఆశతో కాయలు కాచిన కళ్ళకు

కళ్లు మూసుకున్న అమ్మ మాత్రమే దర్శనమిస్తుందను కోలేదు చెట్టు ఏ విధంగా తన నీడను ఇచ్చి కాపాడు తుందో అమ్మ తన ఒడిలో ప్రజలను సేదతీరుస్తుందని అంటారు. కాని తన పిల్లతో బాధను చూసిన తల్లి వారిలో ప్రేమ మళ్లీ చిగురిస్తుందనుకొని కళ్ళు కాయలు కాసే పరిస్థితి ఉందని అన్నారు. అమ్మలో ప్రేమ, పట్టుదల, ధైర్యం, ఆత్మవిశ్వాసం, చాతుర్యం, సేవ అన్ని గుణాలు కలిగి ఉంటుందని అన్నారు. ఈ విధంగా అమ్మ ఆవేదనను వర్ణించిన కవి చివరికి ఆ అమ్మ లేకపోతే అందరు అనాధలుగా మిగిలిపోతారని అంటారు.

"క్రమశిక్షణను పెంచి పోషించిన అమ్మ / కాలుడి అక్రమానికి గురైనప్పుడు / ఒక్కరూ నోరుమెదప లేకపోయారు / ఎవరికి వారు / అమ్మ లేకపోతే తామె అధినాయకులమనుకున్నారు / ఇప్పుడు అమ్మ లేపపోవడంతో / అందరూ అనాధలే" (మూడో మనిషి, పేజి 12)

ఈ విధంగా అమ్మ ఉన్నపుడు పట్టించుకోకుండా ఉండి, తను లేని పరిస్థితి చూసి అందరూ అనాధలుగా మారి పోయారని అంటారు.ఈ విధంగా తల్లి యొక్క ఆవేదనను కవి కళ్ళకు కట్టినట్టుగా తన కవిత్వం ద్వారా వివరించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాల :

1. మూడో మనిషి- ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్
2. ఆలోచనలు-ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి తమిళ జానపదకళలు - వ్యవసాయపు పాటలు

- డాక్టర్ ఎం. ప్రభావతి

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు పాత్రికేయులుగా, ఆచార్యులుగా, రచయితగా, మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖాధ్యక్షులుగా అందరికి సుపరిచితులే. గొప్ప పేరు ప్రఖ్యాతలు కలిగిన మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో మొట్ట మొదటి డి.లిట్.పట్టాన్ని అందుకున్న వ్యక్తి. తెలుగు సాహిత్యానికి ఒక గుర్తింపును, ఎనలేని వ్యక్తిని తీసుకువచ్చినటువంటి వారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. ఒక్క తమిళనాడులోని కాదు ప్రక్క రాష్ట్రాలు అయిన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు, సింగపూర్, మలేషియా, మారిషస్ లాంటి దేశాలలో కూడా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పేరును వింటున్నా మంటే దానికి కారణం ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. మన దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు, మలేసియా, థాయ్‌లాండ్, సింగపూర్, మారిషస్ వంటి దేశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్రసమర్పణ చేసారు. వీరు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు అనేక అవార్డులు, బిరుదులు అందుకున్నారు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు ఎన్నో రచనలు, వ్యాసాలు, కవితా సంపుటాలు, అనువాదాలు చేసారు. రచనలలో సరళమైన భాషను ఉపయోగించి, మధురమైన భావవ్యక్తీకరణతో పాఠకుల్ని మెప్పించే సామర్థ్యం ఆచార్య మాడభూషి వారికి వెన్నతో పెట్టిన విద్య. మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో వీరి పర్యవేక్షణలోనే ఎక్కువ పిహెచ్.డి.లు, ఎం.ఫిల్.లు జరిగాయి. వివిధ అంశాలను కవితా వస్తువులుగా స్వీకరించి రచనలు కొనసాగించారు. అటువంటి రచనల లోని ఒక రచనే "తమిళ జానపద కళలు" తమిళనాడు లోని వివిధ ప్రాంతాలలో వాడుకలో ఉన్న జానపద పాటల గూర్చి వివరించారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు తమిళంలో ఉన్న జానపదపాటలను తెలుగు వారికి అందించాలనే ఉద్దేశంతో "తమిళ జాన పద కళలు" అనే పుస్తకాన్ని 2014వ సంవత్సరంలో ప్రచు రించారు. రచయిత ఈ పుస్తకంలో మనకు 21 రకాల తమిళ జానపద పాటలు గురించి తెలియపరిచారు. ప్రస్తుతం నేను ఈ తమిళ జానపద కళలు అనే రచనలోని వ్యవసాయపు పాటల గురించి తెలియ జేస్తున్నాను.

పల్లెటూరులు పట్టానికి పట్టుకొమ్మలాంటివి. పల్లె టూరులోని ప్రజలు పొలాల్లో పని చేసుకునేటప్పుడు వారి శ్రమను మరిచి పోవడానికి పాటలు పాడుకుంటూ ఉంటారు. అలా పాడే పాటను జానపద పాటలు అంటారు. జనపదంలో నివశించే వారిని జానపదులు అంటారు. ఈ జానపద పాటలు అనేవి మౌఖికంగా ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడం జరుగుతోంది. వీటికి సంగీత పరమైన నిబంధనలతో పనిలేకుండా చాలా రకాలైన పాటలు పాడుకుంటూ ఉంటారు. జానపద కళలు అనేవి పల్లెటూరి ప్రజల యొక్క జీవన శైలిని ప్రతిబింబిస్తూ ఉంటాయి.

ఈ జానవద పాటలు అనేవి శృంగారంగాను, హాస్యంగాను, వ్యంగ్యంగాను, భక్తిపరంగాను ఉంటాయి. తోలుబొమ్మలాట, వీధిభాగోతం, తప్పెటగుళ్ళు, బుర్రకథ, హరికథ, యక్షగానం, కోలాటం, చెక్కభజన, కురవంజి అనే మొదలైన అనేక రకాల జాన పదకళలు ఉన్నాయి. కానీ ఇటువంటివి చాల వరకు కనుమరుగు అయిపోతున్నాయి. కానీ కొన్ని ప్రాంతాలలో కొన్ని కళలు మాత్రమే జీవించి ఉన్నాయి. ప్రస్తుత కాలంలో సినిమాలు, చరవాణిలు, అంతర్జాలంతో ఎక్కువ సమయం గడపడం వలన మన ప్రాచీన జానపదకళలు మరుగున పడిపోతు

న్నాయి. జానపద గీతాలు అనేవి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రకమైన బావసారుప్యతను కలిగి ఉంటాయి. మన తెలుగులో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ, కొనసీమ జానపద పాటలు అంటూ వివిధ రకాలుగా ఉన్నాయి. సోదర భాషలు అయిన తమిళం, కన్నడ, మలయాళం మొదలైన భాషలలో కూడా జానపద పాటలు ఉన్నాయి.

మన ప్రాచీన జానపద పాటల గురించి, జానపద కళల గురించి ఏ సినిమాలలోనూ, టి.వి. కార్య క్రమాలలోనూ చూసి తెలుసుకుంటున్నాము. వాటి గురించి మనకందరికీ మరియు రాబోవు తరాల వారికి తెలియజేయడానికి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు వాటికి అక్షర రూపం ఇచ్చి పుస్తకంగా ప్రచురించి నటువంటి గొప్ప తెలుగు పండితులు. ప్రాచీన సాహిత్యాల్లో తమిళ సాహిత్యం ఒకటి. తమిళులకు తమ భాషపై మక్కువ ఎక్కువ కాబట్టి తమిళ సాహిత్యంలో జానపద కళలు కొన్ని ప్రాంతాలలో ఇంకా బ్రతికి ఉన్నాయి. తిరునల్వేలి, తూత్తుకుడి, కన్యాకుమారి మొదలైన దక్షణ తమిళనాడు జిల్లాల్లో ఉన్న సుడలై మాడన్ అనే జానపద దైవానికి ఇప్పటికి కూడా వారి వారి సాంప్రదాయాల ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్పుడు జానపద పాటలతో దేవుడిన్నీ వెడుకోవడం జరుగు తోంది అని కవి వ్యక్తీకరించారు.

జానపద పాటలు తెలుగులో ఉన్నట్లే తమిళంలో కూడా చిన్న పిల్లలపాటలు మొదలుకొని పెద్దవారు పాడుకునే వరకు అనేక రకాల పాటలు ఉన్నాయి.

ఏట్రప్పాట్టు (ఏతం పాటలు) :

వ్యవసాయదారులు బావిలో లేదా చెరువులో ఉన్న నీళ్ళను ఏతం వేసి తోడి పొలానికి నీళ్ళను పారించే సమయంలో పాడే పాటల్ని ఏతం పాటలు అంటారు. పని చేసేటప్పుడు ఆ పనిలోని కష్టం తెలియకుండా ఉండడానికి పాటలు పాడుతూ పని చేస్తుంటారు. ఈ రకం ఏతం పాటలను పాత కాలపు సినిమాలలో అందరం చూసి ఉంటాము. తాటినార లేదా తోలుతో చేసిన సంచులును లేదా ఇనుముతో చేసిన బాన లాంటి వస్తువులతో ఏతంను తయారు చేస్తారు.

1. ఎత్తు ఎరవై మరం 2. కమల ఎరవై 3. ఇరవై ఏట్రం... అనే మూడు రకాల ఏతం పాటలు ఉన్నట్లు తమిళ జానపద రచన ద్వారా తెలుస్తున్నది.

1. ఎత్తు ఎరవై మరం :

ఎత్తు ఎరవై మరం అన్న దాన్ని ఎత్తు ఎరవై లేదా ఎతా ఎరవై అని కూడా అంటారు. ఏతం ఎత్తడానికి ఒకరు లేదా ఇద్దరు కావాలి. బావి లోపల వున్న నీటిని బయటకు తీయటానికి పొడవైన కొయ్యకు తోలు లేదా ఇనుపతో చేసిన కుండలాంటి దాన్ని కట్టి ఉంటారు. ఆ కొయ్యను ముందుకు వెనుకకు తొక్కడం వలన కుండలో నీళ్లు భూమి పైకి వస్తాయి.

2. కమలై ఎరవై :

బావిలో నీటిని బయటకు తీయటానికి ఇనుముతో లేదా తోలుతో చేసిన బానను ఉపయోగిస్తారు. ఇలా నీటిని తోడి పొలానికి పారించడాన్నీ కపిల అంటారు. కపిలను కబిల అని కూడా అంటారు. ఈ కపిలతో నీళ్ళను తొడడానికి రెండు ఎద్దులు, చక్రం, మోకు కావాలి. ఈ కపిలతో ఒకసారికి సుమారు ఎనిమిది బిందెల నీళ్లను బయటకు తీస్తారు.

"ఒరచూపు కన్నోడు
దాగి ఉన్నాడు వేటగాడు
మూడుకు ఒక లెక్క మూలపుటమ్మ
విపరీతమైన అలంకారమమ్మ...."

అని పాడుతూ పల్లంలోని నీటిని పైకి తోడి పొలానికి నీటిని కడుతారు.

"వేరు శెనగ బాగా అమ్మితే
నల్లమ్మ.....నీకు
చెవికి కమ్మలు చేసి వేస్తాను".

అని కాలానికి అనుగుణంగా వేసే పంటని బట్టి

పాటలు పాడుతూ కపిల ద్వారా బావిలోని నీటిని తోడుతారు. ఈ ఏతం పాటల్లోని ఛందస్సుకు తగిన విధంగా శబ్దాలను చేర్చడాన్ని ఇళువై తెమ్మాంగు లేదా నెట్టు తెమ్మాంగు అంటారు.

3. ఇరవై ఏతం :

పొడవైన కొయ్యకు చివరన ఒక పెద్ద పాత్ర కట్టి ఉంటుంది. రెండో పక్క చివరన మనిషి ఉంటాడు. ఆ మనిషి ఒకవైపు నుండి మరొక వైపు నడవడం వల్ల బావిలోకి పాత్ర వెళ్లి నీరు తీసుకుని బయటకు వస్తుంది. తోలుతో, కొయ్యతో, తాటి నారతో, లోహంతో చేసిన వాటిని గ్రామీణ ప్రజలు ఏతమనే అంటారు. సాధారణంగా పొలాల్లో పని చేసుకుంటూ పాడే పాటలకు సంగీతం చరణాలు ఉండవు. కానీ ఎరవై పాటల్లో సహజంగా సంగీతంతో కూడి ఒకే చరణంగా ఉంటాయి. అన్న విషయం మనకు తెలియదు. ఇటువంటి తెలియని విషయాలు ఎన్నింటినో మాడభూషి వారి రచనలు ద్వారా మనం తెలుసుకోవచ్చు.

ఏర్‌ప్పాట్టు (వ్యవసాయ పాటలు) :

పొలాన్ని దున్నేటప్పుడు పాడే పాటలను ఏర్‌ప్పాట్టు అంటారు. గత అరవై సంవత్సరాల నుండి తమిళనాడులో వాడుకలో ఉన్నట్లు తెలుస్తోంది.

"మేడి పట్టిన వాడి చెయ్యి
మేడితో సంపాదించింది దొంగల పాలుకాదు"
"ఏరు దున్నడం కన్నా ఎరువు వెయ్యడం మంచిది"

అనే మొదలైన సామెతలు వాడుకలో ఉన్నట్లు మరియు తిరుక్కురళ్ అనే కావ్యంలో కూడా వ్యవసాయం గురించి సామెతలు ఉన్నట్లు కవి తన రచన ద్వారా తెలియజేశారు. అంతేకాకుండా ఏరు ఓట్టుదళ్, ఉళవు ఓట్టుదళ్.... అనే వ్యవసాయ పాటలు పుదుక్కోట్టై తంజావూరు ప్రాంతాలలో వాడుకలో ఇప్పటికి వుండడం మనం గమనించవచ్చు.

1. కోడై ఓట్టు 2. నడువుసాల్ ఓట్టు 3. పిరంబడి సాల్ ఓట్టు.... అనే పద్ధతులు వాడుకలో వున్నట్లు వివరించారు కవి. పల్లెల్లో దున్నడం తెలియని కుర్రాళ్ళను వరుసకు మరదళ్ళూ అయిన అమ్మాయిలు ఎగతాళి చేసి పాటలు పాడుతారు అంటూ....

"దున్నడానికి తెలియని
బుద్ధిలేని బావగారూ
దున్నడానికి నేనొస్తా
దూరంగా నువ్వుండు..."

అనే పాటలు పాడుతుంటారు అని కవి చమత్కారంగా వర్ణించారు. ఇలాంటి పాటలను బట్టి చూస్తే దున్నడం రాని కుర్రాళ్లను వ్యవసాయ సమాజం గౌరవం ఇవ్వదు అని, ముఖ్యంగా పల్లెల్లోని ప్రజలు ఒక మనిషిగా కూడ లెక్కచేయకుండా వారికి పిల్లని ఇచ్చి పెళ్ళి చెయ్యరు అనే విషయాన్ని వర్ణిస్తూ...

"మేడి పట్టణానికి తెలియని
బావగారికి - మనిషికి
పొద్ద పోబోయ్యేలేదు
పిల్లను ఇవ్వబోయ్యేలేదు"

అనే పాట ద్వారా వ్యవసాయదారుల యొక్క ప్రాముఖ్యత మరియు వ్యవసాయం ప్రధాన వృత్తిగా కలవారికి మడక దున్నడం తెలిసి ఉండాలి అనే విషయాల గురించి తెలుసుకోవచ్చు. ప్రస్తుత కాలంలో నాగలి అంటే ఏమిటి అన్న విషయం కూడా తెలియదు. వాటిని చిత్రాలతో, పుస్తకాలలో చూసి నాగలి అంటే ఇలా ఉంటుంది అని తెలుసుకునే పరిస్థితి ఏర్పడింది. విజ్ఞానం పెరగడంతో నాగలి మరుగున పడిపోయి వాటి స్థానంలో యంత్రాలు వచ్చేసాయి. వ్యవసాయదారులు కూడా వాటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే పని త్వరగా అయిపోతుంది. పల్లెల్లో ప్రతి ఒక ఇంటికి నాగలి తప్పనిసరిగా ఉండాలి. అలా లేకపోతే వాళ్లకి గౌరవం ఉండదని భావిస్తారు. అటువంటిది ఇప్పుడు పల్లెల్లో నాగలి కను మరుగైపోయింది. నాగలిని మడక అని కూడా అంటారు.

మడక అనే పదాన్ని రాయలసీమ ప్రాంతంలో ఉపయోగిస్తారు.

"ఏటిగట్టున టేకు చెట్టు
పొంగిపొర్లే కావేరి
పచ్చనైన పాండ్య దేశం....
పదినాగళ్ళు దున్ను
పచ్చనైన పాండ్య దేశంలో
కరువు లేని వానలు కురియు
కళ్ళముందే వరి పండు".

అనే పాటను కొళ్ళిమల వాసులు వ్యవసాయం చేసే టప్పుడు పాడుకునేవారని, ఈ పాట ద్వారా చోళ, పాండ, చేర దేశాల్లో వ్యవసాయం చేసి పంటలు బాగా పండినట్లు తెలియుచున్నది. ఇప్పటి కాలంలో వ్యవసాయపు పాటలు విందాం అన్నా ఎక్కడా వినపడడం లేదు చూద్దాం అన్నా కనపడడం లేదు అని కవి తన ఆవేదనను వెల్లడించారు.

నడువు ప్పాట్టు (నాట్లు పాట) :

పొలంలో వారినాట్లు వేసే సమయంలో పాడే పాట లను నడువుప్పాట్టు అంటారు. సాధారణంగా నాట్లు వేసే సమయంలోను, పంట పండి కుప్పనూర్చె సమయంలో వ్యవసాయదారులు దేవుణ్ణి ప్రార్థించడం ఆనవాయితీగా జరుగుతుండేది. కానీ నేడు అటువంటి సంఘటనలను అరుదుగా చేస్తున్నామని చెప్పవచ్చు. ఎందుకంటే మనుషులు చెయ్యవలసిన పనిని యంత్రాలు చేస్తు న్నాయి. వ్యవసాయంలో నేడు యంత్రాలు ప్రముఖ స్థానం పొందడం వలన నాట్లు పాటలను జానపద సినిమాలలోను, బుల్లితెరల్లోను చూసి తెలుసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. నాట్లు వేయడం ప్రారంభించే సమయంలో దేవుణ్ణి ప్రార్థిస్తూ పాడే పాటను "దేవుణ్ణి తోహర" అంటారు. ఒకరు పాడుతుంటే మిగిలిన వారు ఆ పాటను అనుసరించి పాడుతూ నాట్లు వేయడం జరుగుతోంది. కానీ నేడు నాట్లు వేయడానికి కూడా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. పొలంలో నాట్లు నాటి సమయంలో పాడే పాటలను పాఠకులకు అందిస్తూ....

"చందురుడా, సూరిడా
సామీ బగమంతుడా
ఇందురుణ్ణి కొలిచి మొదలు పెట్టినా
చందురుణ్ణి కొలిచి మొదలు పెట్టినా
పైరు చెదరకుండా
నెలకు మూడు వానలు కురియాలి
పరలోకపు దేవుడా
వస్తువులను సృష్టించిని వాడా
వస్తువుల కంతా నాయకుడా
పైరు తీసి వేళలోనా
చిక్కుపడకుండా చెదరకుండా
చిన్నదిగా చిన్నదిగా రానీవయ్యా
క్రొంగొత్త కుండ
మారియమ్మ అరుగుమీద
పొంగలు పెట్టే మట్టికుండ
తింటే అమృతంలా ఉంటుంది
ఆది బగమంతుడా..."

అని తమిళంలోని వరి నాట్లు పాటను తెలుగులో చక్కగా కవి వర్ణించారు. అంతే కాకుండా నాట్లు వేయడం పూర్తి అయిన వెంటనే పొలం వదలి గట్టు ఎక్కె సమయంలో కూడా పాటలు పాడుతారు అనే విషయాల్ని వర్ణిస్తూ...

"ఎగిరి కోస్తారు
మునక్కాయ వండుతారు
తట్ట మీద తట్ట పెట్టి
తల నొప్పి అంటారు
పచ్చని చిలక లాగా
పాండియరామ్ దున్నుతాడు
అందాల చిలక లాగా కూడు తెస్తాది".

అన్న విధంగా పాట పాడి పొలం గట్టు ఎక్కుతారు అని "నడువు ప్పాట్టు" గురించి ఎంతో చక్కగా కవి వివరించారు. పచ్చని పంట పొలాల మధ్య వెళ్తుంటే ఎంతో ఆహ్లాదకరంగాను ఆనందంగాను ఉంటుంది. గ్రామీణ

ప్రజలు ఎండను, వానను లెక్కచేయకుండా పొలాల్లో పని చేస్తుంటారు. ''కాయలు కాసే చెట్టుకే ఎక్కువ దెబ్బలు'' అన్నట్లు, కష్టపడే రైతన్నలకు ఎన్నో కష్టాలు వస్తాయి. వాటన్నింటినీ ఎదుర్కొని పంటను పండిస్తారు. వ్యవసాయం చేయలేక నేడు వ్యవసాయ భూములను ప్లాట్లుగా వేసి అమ్మేస్తున్నారు. రోజు మూడు పూటలా కడుపునిండా తిండి తింటూన్నామంటే దాని వెనుక వ్యవసాయదారుల కష్టం ఎంతో దాగి ఉంది.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు అంతరించి పోతున్న తమిళ జానపదుల గురించి ఎంతో చక్కగా వివరించారు. గ్రామీణ జానపద పాటలు రాబోవు కాలంలో వినటం సాధ్యం కాదు, ఎందుకంటే ప్రస్తు కాలంలో టి.వి.మరియు గ్రామీణ నేపథ్యం కలిగిన సినిమాలలో మాత్రమే చూస్తున్నాము. జానపద పాటలపై పరిశోధన చేసే వారికి మాడభూషి వారి ఈ తమిళ జాన పద కళలు అనే పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తెలియని విషయాలను అందరికీ తెలియ పరచాలి అనే తపనతో తన దృక్పథాన్ని ఎంతో చక్కగా సులభమైన పదజాలం ఉపయోగించి రచనలను రచించారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. తాను చూసిన విషయాలను, తెలుసుకున్న అంశాలను పాఠకుల కళ్ళముందు కదలాడేలా రచనలు కొనసాగించడం అనేది మాడభూషి వారి కవిత్వంలో కనిపించే ప్రత్యేకమైన కవితా నిర్మాణ పద్ధతి.

ఉపయుక్త గ్రంథాలు :

1. తమిళ జానపద కళలు - ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్
2. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి
3. తమిళ నాట్టుపుర పాడల్గళ్ - అరవిందన్.ము.వై.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శత్రువుతో ప్రయాణం' - మానవతా విలువలు

- తొళ్ళపాక గీత, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

పరిచయం :

కవిత్వం ఒక నులివెచ్చని స్పర్శ. అది పండితులకు ప్రణమిల్లగలదు. పామరులను పరవసింపచేయగలదు. అతిథులను ఆదరించగలదు. అభ్యాగతులను ఆహ్వానించగలదు. మొత్తంగా కవిత్వం అంటే ఆలోచింప చేసే విధంగా ఉంటుంది ఉండాలి కూడా. ఇది వరకే మానవీయ కోణంలో 'జీవితం-కవిత్వం' అనే కవితా సంకలనాన్ని ప్రచురించిన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి కలం నుండి జాలువారిన మరొక అనర్ఘ రత్నం 'శత్రువుతో ప్రయాణం' కవితా సంకలనం. ఈ కవితా సంకలనంలో చాలా మటుకు మానవతా ఛాయలు కనిపిస్తున్న కవితలున్నాయి. వాటిని చదువుతుంటే అమాంతం ఆపకుండా చదవాలనిపిస్తుంది. వాటిలోని సారాంశాన్ని విశ్లేషిస్తూ పాఠకులకు తెలియజేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

మానవతా విలువలు :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు రచించిన కవితా సంకలనం 'శత్రువుతో ప్రయాణం' అనే శీర్షిక పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉంది. శత్రువు అంటే ఇక్కడ భౌతికమైన శత్రువులే అనుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అంతకంటే మించిన మానసికమైన శత్రువులు అనేకం ఉంటాయని కవి చెప్పకనే చెబుతున్నారు. ఈయన కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు ఆయన దృక్పథాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. "సాహిత్యాన్ని ఆనందించే వ్యక్తి, అనుశీలించే వ్యక్తీ దాని పరిధిని, పరిమితిని గుర్తించక తప్పదు. సాహిత్యానుశీలన అనుభూతితోనే మొదలైనా ఒక అవగాహన లేకుండా అది కొనసాగదు. ఈ అవగాహన ఒక దృక్పథం వల్ల ఏర్పడుతుందని" (పాపినేని శివశంకర్, సాహిత్యం మౌలిక భావనలు, స్వీయప్రచురణ (1996), పుట. 33) పాపినేని శివ శంకర్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తుకుచేసుకోవాలి.

"అందరికి లాగే
అతనికి తనువూ కనిపించదు
మనసే అతనికి గుర్తింపు తెచ్చింది
మనిషి కోసం వెతుకుంటూ
తిరుగుతున్నాడు!"(పుట.9)

ప్రపంచీకరణ వేగవంతం అవుతున్న తరుణంలో యాంత్రిక జీవనానికి మనిషి అలవాటు పడిపోయాడు. ఈ క్రమంలో ప్రేమ, జాలి, కరుణ, దయ అనే నైతిక విలువలను పూర్తిగా మరిచిపోయాడు. అటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనే పై పంక్తులను రాసినట్టుగా తెలుస్తుంది. అలా మానవత్వపు కోణాన్ని పరిచయం చేసి చివరగా..

"అతడు మనిషిని జయించాడు
మనిషి కోసం వెతకడం మానేశాడు!" (పుట. 9)

అంటూ తన ఆవేదనని తెలియజేశాడు. మనిషి ఒక నైతికతను గూర్చి ఆలోచిస్తున్నప్పుడు కవిత్వం వెలువడుతుందని పై వాక్యాలు సూచిస్తున్నాయి. దు:ఖం, ఆవేశం, ఆశ, నిరాశ, సంతోషం, సౌందర్యం, దర్శనం-ఇలా కవితకు ప్రేరణ ఏదైనా కావచ్చు. ఈ కవి అనేకమైన ప్రేరణల నుండి ఈ కవితలను రాసినట్టుగా తెలుస్తుంది.

"పగలు రాత్రి
తేడా లేకుండా
అలలు ఎగసి ఎగసి పడుతూనే ఉంటాయి
ఏదో ఉప్పెనలా ఊరంతా ముంచేయాలని ప్రయత్నం
తీరా తీరం చేరేటప్పటికి

చల్లగా కాళ్ళలో వణుకు పుట్టి
మెల్లగా వెనక్కు తగ్గడమే" (పుట.13)

అంటూ "అలలు అలసిపోవు" అనే కవితలో 'ఆశ' అనే మానసిక లక్షణాన్ని పై విధమైన భావ చిత్రాలతో కవి వివరించే ప్రయత్నం చేసారు. 'ఆశ'ను ఎగసిపడే అలలతో పోల్చటం వల్ల కవి చెప్పే భావనలో ఆర్ద్రత, ఆత్మీయత ఏర్పడ్డాయి. మంచి పదచిత్రాల సహాయంతో ఒక అనుభవాన్ని ఎంత ప్రతిభావంతంగా చెప్పవచ్చో ఈ కవిత నిరూపిస్తుంది.

అనేక విధాలైన సామాన్య సామాజికాంశాలను సూక్ష్మమైన సంఘటనల్ని తీసుకుని కవిత్వం రాయటం ఈ కవి ప్రత్యేక లక్షణంగా తెలుస్తుంది. ఇవి నిత్య జీవితంలో అందరికి ఎదురయ్యేవే కాబట్టి, పాఠకుడు వాటికి త్వరగా స్పందించి, వాటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఉదాహరణకు 'విరోధి' అనే కవితలోని కొన్ని కవితా పంక్తులను పరిశీలిస్తే...

"మానవ సంబంధాలకు
సెల్లు చీటి రాసి
ద్రవ్యోల్బణంలో
తలదాచుకున్న
మధ్య తరగతి!
ఆకలికి
కొలమానంగా /ధరల చంద్రయానం!(పుట.20)

... అంటూ ధరలు నిరంతరం పెరిగి పేదలకు ఆటంకంగా మారిన దృశ్యాన్ని కవిత్వీకరించాడీ కవి. ఆకలి అనేది అందరికి సర్వ సాధారణమైన విషయమే అయినా ధరల పెరుగుదల స్థాయిని ఎదుర్కోవడంలో ఉన్న తేడాలను గమనించవలసిందిగా కవి మానవతా దృక్పథంతో వివరిస్తున్నారు.

"అతగాడికి కావలసింది ఒక మర మనిషి
సంపాదించడానికి
వండిపెట్టడానికి
కోరికలు తీర్చడానికి
పెళ్లి రోజున ఎటిఎం లాంటి
పెళ్ళాం దొరికిందని మురిసిపోయాడు
తాను దొరికి పోతున్నానని ఆమె
మరిచిపోయింది
బానిస దొరికిందని అతను ఆనందించాడు
రెక్కలు విప్పిన చేతనకు
కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదు" (పుట.26)

పై కవితలోని పంక్తులు కవి స్వభావంలోని భాగాలే అని చెప్పొచ్చు. స్త్రీవాదం ప్రభావంతో కవిత్వం రాసిన అనేకమంది కవయిత్రులు స్త్రీలకు మాత్రమే పరిమితమైన శారీరక సమస్యలు, వారి ఇంద్రియాను భవాలు, వారికి ఎదురయ్యే ఇబ్బందులు - ఇటువంటి వాటి గురించి రాసిన కవితలే ఎక్కువగా ఉంటాయి. స్త్రీ సహజమైన చేతనా సౌకుమార్యం ప్రదర్శించే కవితలు తక్కువగానే ఉంటాయి. ఆ విధమైన కోణం నుండి మాడభూషి సంపత్‌కుమార్ గారు రాసిన 'ఆమె' అనే కవితను రాసారు. 'స్వర్గం', 'మగాడు', 'భయం', 'తండ్రి' అనే కవితలను కూడా ఈ రకమైన దృష్టి కోణం నుండి రాసినట్టుగా తెలుస్తుంది.

ఈ మధ్య కాలంలోని కవితలలో మానవ సంబంధాల విషయంలో కోల్పోతున్న సహజత్వం లేదా ఏర్పడుతున్న కృత్రిమత్వం గురించి కవులు ఎక్కువగా బాధపడు తున్నట్టు కనిపిస్తుంది. ఈ క్రమంలోనే "శత్రువుతో ప్రయాణం" అనే కవితా సంపుటిని వెలువరించినట్టుగా తెలుస్తుంది. అసలు కవిత్వంలో ఎలాంటి అంశాలు ఉండాలి అనే నేపథ్యం నుండి రాసిన కవిత 'కవి'. ఈ కవితలో కవిత్వానికి ఉండవలసిన లక్షణాలను కూడా చెప్పే ప్రయత్నం చేసారు. వాటిని కింది విధంగా చెప్పుకోవచ్చు.

"నాలో నిద్రిస్తున్న ఆవేశానికి
నిన్ను బలి చేస్తున్నందుకు క్షమించు!"

అని, మరొక చోట.....

"కవిత్వం పలుచబడిపోతూ ఉంటే
కవి బలపడుతూ ఉంటాడు
అందుకని నువ్వు మడి కట్టుకొని
ఇలాగే ఉండాలనుకోకు!"(పుట.34)

అంటూ కవిత్వానికున్న విస్తృతిని తెలియజేస్తూ పై వాక్యాలను చెప్పినట్టుగా తెలుస్తుంది. పైన వివరించిన కవితా పంక్తులనే మరింత లోతుగా అధ్యయనం చేస్తే వాటిలో కవి మానవతా దృక్పథం, నైతిక దృక్పథం, సామాజిక దృక్పథం, ఆశావాహ దృక్పథం, స్త్రీల సమస్యల పై స్పందించే గుణం కనిపిస్తాయి. మధ్య తరగతి జీవితమే సంక్లిష్టమైందన్న అభిప్రాయం ఆయన రచనలో కనిపిస్తుంది. ఈ అంశాలన్నింటిని ఆయన ఒకే వాతావరణ నేపథ్యంగా గ్రహించి ఈ రచన చేసినట్లుగా తెలుస్తుంది.

ముగింపు :

మాడభూషి గారి కలం నుండి ఎన్నో రచనలు వెలువడ్డాయి. వాటిలో "శత్రువుతో ప్రయాణం" అనే కవితా సంకలనం నన్ను ఎంతగానో ఆకర్షించింది. అందుకే ఈ కవితా సంకలనంపై వ్యాసం రాశాను. వ్యాసా నికున్న పరిమితి దృష్ట్యా పుటలను కుదించాల్సి వచ్చింది. వీరి రచనలను కేవలం ఒక్క వ్యాసంలోనే విశ్లేషించు కోవడానికి వీలుపడదు. కొన్ని సిద్ధాంత గ్రంథాలు రాయడానికి సరిపోయేంత సాహిత్య కృషి వారు చేశారని చెప్పవచ్చు. ఇంతటితో ఈ పత్రాన్ని ముగిస్తున్నాను.

సీ. మాడభూషి రచన మానవ వేదనల్
వినిపించు నెలుగెత్తి విశ్వమంత
కార్మిక రోదనల్ కర్షక బాధలన్
మహిళల కన్నీటి మౌన మ్లాన
గాధలన్ తెలిపేటి కష్టాల కడగండ్లు
గుందించు, నెడదల గ్రుచ్చి గ్రుచ్చి
దారుణ ఘాతుక దావనలాగ్నుల
బీదసాదల తీరు ఖేదపరచు

తే.గీ. లేదు లేదని జెప్పంగ లేశమైన
అంశ మేమియు కవితల యందు గనము
వచన కవితల కీతండు వచనపటువు
భావి తరముల కాదర్శ భాస్కరుండు

– టేకుమళ్ళ వెంకటప్పయ్య

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి "జీవితం - కవిత్వం" - భాషా వైవిధ్యం

- డాక్టర్ ఎన్.దీపిక, సహాయాచార్యులు, తెలుగుశాఖ, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ జిల్లా, తెలంగాణ

మాడభూషి సంపత్కుమారచార్య గారు రచించిన "జీవితం-కవిత్వం" కవితా సంపుటి జీవితానికి, కవిత్వానికి ఉన్న సంబంధాన్ని అనేక కోణాల్లో ఆవిష్కరించారు. జీవితానికి కవిత్వంతో, కవిత్వానికి జీవితంతో ఉన్న కార్యకారణ సంబంధాన్ని చాలా సరళమైన, సులభమైన పదాలతో చక్కని భావాలతో వ్యక్తీకరించారు. మానవ జీవిత ప్రయాణంలో వచ్చే ప్రతి కోణాన్ని తమ లలిత పదాలతో మినీ కవిత్వంగా రూపొందించారు. జీవితంలో ప్రతివారికి వచ్చే అడ్డంకులు, అతిక్రమణ వీరి కవిత్వంలో కనబడుతుంది. మనిషి జీవితంలో వచ్చే అంతర్గత సంఘర్షణను, తాత్విక సంబంధాన్ని వీరి కవిత్వంలో చూడవచ్చు. "జీవితం-కవిత్వం"-ఈ రెండింటి సమాన సారూప్యతల తో, వైరుధ్య భావాలతో నానీల వలె శీర్షికలు లేకుండా 108 సంఖ్యలతో మినీ కవితలు రచించారు.

"రమణీయార్థ ప్రతిపాదక శబ:కావ్యమ్" అన్న జగన్నాథ పండితరాయలు, శబ్దార్థాల మేలు కలయికే కవిత్వం అన్న చందంగా వీరి కవిత్వం సాగింది. కవికి-కవిత్వానికి, శరీరానికి-ప్రాణానికి ఉన్న సంబంధంతో పోల్చి గొప్ప తాత్విక భావనలను ఉద్దీపించారు. మనిషిని, మనిషిగా చేసే శక్తి కవిత్వానికి మాత్రమే ఉందనే విశ్వాసాన్ని కలిగించారు. జీవితానికి కవిత్వమెంత ముఖ్యమో, కవిత్వానికి జీవితమెంత అవసరమో, ఈ రెండు పరస్పరా కర్షకాలని, పరస్పరాధారితాలని చక్రభ్రమరా రూపంలో ముక్తకాల ద్వారా తేల్చిచెప్పారు. జీవితాన్ని పూర్తిగా కవిత్వంలో మమేకం చేసినపుడే కవి భావనల్లోంచి ఈ పదాలు పురుడుపోసుకుంటాయి. కవిత్వం రాయడమంటే అది ఎక్కడినుండి రావాలి... జీవితాన్ని చదవాలి.... చదవాలంటే కవిత్వంలో ఎదగాలి... ఈ రెండు ఒకదాని కొకటి అంతర్గత సంబంధమున్న జంటలు.

వీరి "జీవితం-కవిత్వం" కవితా సంపుటిలోని భాషా వైవిధ్యాన్ని పరిశీలిస్తే శబ్దాలంకారాలైన అంత్యానుప్రాసలు, వృత్త్యానుప్రాసలు, అర్థాలంకారాలైన ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక, దృష్టాంత, అనన్వయాలంకా రాలు, లోకోక్తులు, సామెతలు, జాతీయాలు, అన్యదేశ్యాలు, వ్యతిరేకార్థాలు, ప్రకృతి-వికృతులు, ధర్మాలు, కవిసమయాలు, మూర్త - అమూర్తభావనలు, అమూర్త-మూర్తభావనలు, కుకవి నింద, వినూత్న పదబంధాలు, వినూత్న అభివ్యక్తీకరణలు మొదలైన భాషాపరమైన ప్రయోగాలు వీరికవిత్వంలో కనబడతాయి. పుస్తకం యొక్క ప్రధాన శీర్షికలోనే కవివైవిధ్యాన్ని ప్రదర్శించారు. కవిత్వం-అమూర్త భావన, జీవితం- మూర్తభావన అనే ప్రతిపంక్తిలోను దర్శన మిస్తుంది.

"జీవితమంతా ముళ్ళు / కవిత్వమంతా కళ్ళు" - అన్న కవితలో ముళ్ళు, కళ్ళు అని ద్విత్వ 'ళ' కారంతో శబ్దాలంకారమైన అంత్యాను ప్రాసను స్ఫురింపజేస్తారు. ఇందులో జీవితాన్ని ముళ్ళతో, కవిత్వాన్ని కళ్ళతో పోల్చారు కాబట్టి ఇందు ఉపమాలంకారం ఉంది. "జీవనమే కవనం / కవనమే జీవనం" - ఇచ్చట జీవితాన్ని ఉపమేయం గాను, కవనాన్ని ఉపమానంగాను, రెండవ పాదంలో కవనాన్ని ఉపమేయంగాను, జీవితాన్ని ఉపమానంగాను, ఉపమాన ఉపమేయాలను పరస్పరంగా తీసుకోవడం వల్ల ఇందు అనన్వయాలంకార ఛాయలు కనబడుతున్నాయి. "కవిత్వం ఒక ఉబలాట / జీవితమొక పెనుగులాట" - అనే కవితలో ఉబలాట - పెనుగులాట అనే పదాలలో 'ఆట' అనే శబ్దానికి ఆనందాన్నిచ్చేది అనే అర్థం వాడుకలో ఉంది. కాని సార్థక (స్వ+అర్థం) అర్థంలో కాకుండా వ్యతిరేకార్థంలో ప్రయోగించి, వినూత్న అభివ్యక్తీకరణ చేశారు.

"జీవితం, కవిత్వం రెండూ రెండు కళ్ళు, కాళ్ళూ / ఒకటి జీవితాన్ని చదవడానికి / రెండోది కవిత్వంలో సంచరించడానికి" - అనే కవితలో కళ్ళు చదవడానికి, కాళ్ళు సంచరించడానికి కాని, ధర్మాలను వ్యతిరేక దిశలో ఉపయోగించి వినూత్న పదప్రయోగం చేశారు. "జీవితంలో భయం / కవిత్వంలో అభయం" - వ్యతిరేక పదాలనుపయోగించి జీవితంలో భయముంటుందని, కవిత్వంలో మాత్రం అభయముంటుదని (భయం× అభయం) పదాలలో వ్యతిరేక దిశలను చూపించారు. కాబట్టి జీవితం కన్నా కవిత్వమే గొప్పదని ఇది చిరస్థాయిగా నిలిచి పోయేదనే భావన పాఠకులకు కలిగేలా వీరి రచన సాగింది. "జీవితంలో కెరటాల్లా / అలల్లా / చుక్కాని / దిక్కు" - అనే కవితలో ద్విత్వ 'ల' కారం, ద్విత్వ 'క' కారం పునరావృతం అవడం వల్ల వృత్యానుప్రాసలంకార మవుతుంది. "జీవనవేదం / కవితానాదం / కవితావేదం / జీవన నాదం"- అనే కవితలో ఆధునిక వచన కవిత్వ రూపకాలని వాడారు. "జీవితాన్ని కవిత్వం నుంచి లాగకు / కవిత్వాన్ని జీవితంలో నుంచి పీకకు" అనే కవితలో లాగకు, పీకకు అనే అతిసాధారణ పదాలు వాడి గొప్పనైన తాత్వికచింతన కలిగిన జీవన భావాన్ని స్ఫురింపజేశారు. "జీవితం పిచ్చోడి చేతిలోరాయి / కవిత్వం రాసేవాడి చేతిలో పరసువేది" అనే కవితలో "జీవితం పిచ్చోడి చేతిలో రాయి" అనే సామెతను ఉపయోగిస్తూ- మరికొన్ని సామెతలను సృష్టించే ప్రయత్నం చేశారు. అందుకే కవిని స్రష్ట, ద్రష్ట అంటారు. కవిత్వాన్ని సృష్టించేవాడు. జీవితాన్ని దర్శించేవాడు, దర్శింపజేసేవాడు అని దృగ్గోచరమవు తుంది. "జీవితాన్ని కవిత్వంతో తొలుస్తాను / కవిత్వాన్ని జీవితంతో కొలుస్తాను"- భేదం / ఖేదం / మోదం / ఆమోదం" - "జీవితాన్ని లాంగిచాలి / కవిత్వాన్ని సాగించాలి" - "జీవితమొక వెతుకులాట / కవిత్వమొక బతుకుబాట" - "కవిత్వాన్ని ఆరాధించు / జీవితాన్ని వినోదించు" - "జీవితాన్ని ఇమడ్చగలం / జీవితాన్ని మార్చగలం / కవిత్వాన్ని కూర్చగలం" - "కవిత్వం దిద్దుబాటు / జీవితం సర్దుబాటు" - "కవిత్వంలో ఎన్నో వాదాలు / జీవితంలో ఎన్నెన్నో వివాదాలు" - "కవిత్వం అబద్ధాలు అందగత్తె / జీవితం అసంబద్ధాల చెలికత్తె" - "కవిత్వంలో పొద్దు పొడుస్తుంది / జీవితంలో పొద్దు ముడుస్తుంది" - "కవిత్వం కవిత్వాన్ని మెచ్చదు / జీవితం జీవితానికి నచ్చదు" - "కవిత్వం జీవితాన్ని మెచ్చుతుంది / జీవితం కవిత్వానికి నచ్చుతుంది"- "కవిత్వంలో ఎన్నో వాదాలు / జీవితంలో ఎన్నెన్నో వివాదాలు" - "కవిత్వమొక ఆరనిదీపం / జీవితమొక తీరని దాహం" - "కవిత్వ నాలుగు పాదాలు / జీవితం నాలుగు కాలాలు" - "కవిత్వమొక శక్తి / జీవితమొక ముక్తి" రెండూ కలిసి నడవడం ముక్తి. "జీవితంలో చిక్కదనం / కవిత్వంలో చక్కదనం" - "కవిత్వంలో తత్వంలేదు / జీవితంలో జీవం లేదు" - "కవిత్వానికి రెండు కళ్ళు / జీవితానికి రెండు ఒళ్ళు" - "కవిత్వమై మొలుస్తాను / జీవితమై నిలుస్తాను" - "జీవితమొక వెతుకులాట / కవిత్వమొక బతుకుబాట" - అని ఈ విధంగా అనేకచోట్ల ఉపమాన ఉపమేయాలను తీసుకోవడం అనేక అంత్యానుప్రాసలను వాడి కవిత్వానికి అందాన్ని తీసుకొచ్చారు. కవిత్వానికి శబ్దాలంకారాలు స్వరూపమైతే, అర్థాలంకారాలు స్వభావమనే స్ఫురణను తీసుకువచ్చారు.

"పాడు జీవితానికి పాట దొరకదు" అనే కవితలో "ఎద్దున్నవాడికి బుద్ధుండదు, బుద్ధి ఉన్నవాడికి ఎద్దుండదు" అనే జానపద సామెతల ప్రభావం ప్రతిఫలిస్తుంది. "నేలబారు జీవితాన్ని / నేలబారు కవిత్వం" అనే కవితలో సాధారణమైన జీవితాన్ని సాధారణ కవిత్వం పసికట్టదని, పెద్ద పెద్ద సమాసాల కూర్పుతో రాసే కవిత్వం సాధారణ జీవితాలను ప్రతిఫలింపజేయదని తెలిపారు. కవిత్వం, ప్రాణం అనే రెండు పదాలలో ఒకదానిని మరొకదానితో పోలుస్తూ, శరీరానికి ప్రాణమెంత అవసరమో కవిత్వానికి ప్రాణమంత అవసరమనే అంశాన్ని ఉపమాలంకారంలో వెలిబుచ్చారు.

"కవిత్వమై మొలుస్తాను / జీవితమై నిలుస్తాను" అనే కవితలో కవిత్వం అనేది అమూర్త భావన మొలవడం అనేది మూర్త భావన ఈ విధంగా అమూర్త భావనలకి, మూర్త భావనలను అన్వయిస్తూ అంత్యాను ప్రాసలతో రాశారు. మునిగిన జీవితాన్ని కవిత్వం తెలుస్తుంది / తునిగిన కవిత్వాన్ని జీవితం అతుకుతుంది. అతికే గుణం కలిగిన 'బంక' మూర్త భావన. దీనిని అంటుపెట్టడమనే అమూర్త భావనతో కలుపబడింది. పండు వెన్నెల్లో కవిత్వాన్ని ఆరబోయడం అనేది చేతన చర్య. కవిత్వాన్ని ఆరబోయడమంటే - వెన్నెలారబోసినట్టు (ధాన్యాన్ని ఆరబోస్తాం) కవిత్వాన్ని వాచ్యం చేయకుండా, వ్యంగ్యం చేయడంవల్ల వచ్చే ధ్వని ఇందు ప్రతిఫలిస్తుంది. "మంచు కురుస్తున్నప్పుడు కవిత్వం గుర్తొస్తుంది / గాలి వీచినపుడు జీవితం మురిపిస్తుంది" అనే కవితలో కార్య కారణ సంబంధం లేకున్నా, కార్య కారణ సంబంధం ఉన్నట్టుగా ఉత్ప్రేక్షించడం అంటే భ్రాంతిచెందడం అమూర్త భావనలో వ్యక్తం చేయడంతో కవితా నిర్మాణరీతులను భావికవులకు సూచనా ప్రాయంగా మార్గదర్శనం చేశారు.

"జీవితాన్ని కవిత్వంలోకి మారిస్తే కవిత్వం వేడెక్కుతుంది / జీవితం చల్లారిపోతుంది" - అనే కవితలో "జీవితం-కవిత్వం" అనే రెండు విషయాలను, వాటి ధర్మాలను తీసుకొని పరస్పరం అన్వయిస్తే, ఆ ధర్మాలు వ్యతిరేక దిశలో ప్రయాణిస్తాయని ఈ కవిత ద్వారా తెలియజేశారు. "జీవితంలోనుంచి కవిత్వం / కవిత్వంలో నుంచి జీవితం / పిండుకోవడమే పరమావధి" - అనే కవితలో కార్యకారణ సంబంధాన్ని సూచించారు. "జీవితం ఊరేగింపు / కవిత్వం పవ్వళింపు"లో జీవితాన్ని ఊరేగింపుతో, కవిత్వాన్ని పవళింపుతో పోల్చి ఉపమాలంకారం సాధించారు. "జీవితాన్ని ఆరాధించు / కవిత్వాన్ని ముందుంచు" అనే కవితలో క్రియలపై 'ఇంచుక' ప్రత్యయం చేర్చి విధ్యర్థ కాన్ని సాధించారు.

"కవిత్వమే తెలియనివాడు / జీవితాన్ని నడిపిస్తున్నాడు / జీవితమే ఎరుగనివాడు కవిత్వాన్ని రచిస్తున్నాడనే" కుకవినింద కనబడుతుంది. "జీవితంలో కవిత్వం దొర బడితే / ఎందులోనో జారిపడతావు" - అనే కవితలో జొర, జార అనే పదాలు వినూత్న అభివ్యక్తీకరణలు. "జీవితం ఎవరికి గులాంగిరి కాదు / కవిత్వం ఎవరికి సలాం చెయ్యదు / నిలువెత్తు కవిత్వంలో జీవితం తలెత్తుకు తిరుగుతుంది" అనే కవితలో గులాంగిరి, సలాం అనే అన్యదేశ్యాలను, తలెత్తుకు తిరగడం అనే జాతీయాన్ని ఉపయోగించారు. కవిత్వంలో పైకి వచ్చినవాడు కవి / జీవితంలో పైకి వచ్చినవాడు రవి / రవిగాంచని చోటు కవిగాంచును" ఇందు "కవి గాంచని చోటు రవిగాంచడు" అనే లోకోక్తి కనబడుతుంది.

"జీవితం తెరచిన పుస్తకం / కవిత్వం మూసి ఉంచిన జీవితం" లోకంలో వ్యవహారంలో ఉన్న సూక్తులను పయోగించి, వినూత్న సూక్తులను సృష్టించడం వీరికి వెన్నతో విద్య. "జీవితానికి అర్థం ముఖ్యం / కవిత్వానికి పరమార్థం ముఖ్యం" - కవిత్వానికి అర్థం కంటే కూడా పరమార్థం (శ్రేష్ఠమయిన అర్థం) ప్రామాణికమైన అర్థం ఉండాలని ఈ కవితలో తేల్చి చెప్పారు.

"కవిత్వం జీవితాన్ని వెలిగిస్తుంది / జీవితం కవిత్వాన్ని వెలికితీస్తుంది" ఇందు కవిత్వం-జీవితం పరస్పరాశ్రయాలని తెలుస్తుంది. "కవిత్వంలో ఎన్ని అబద్ధాలయిన అందమే / జీవితంలో ఒక అబద్ధమయినా అసంబద్ధమే" అనే కవితలో, కవిత్వంలో కవి సమయాలవలె సందర్భాను సారంగా వాడే వర్ణవస్తువులను పాఠకులకు దృశ్యమానం చేయడానికి, స్వరూప స్వభావాలను వ్యక్తం చేస్తారని, కవిత్వంలో అబద్ధం అందాన్నిస్తుంది. కాని "జీవిత భాగస్వామిగా కవిత్వం / కవితా భోగస్వామిగా జీవితం" అనే కవితలో కవులు - ఒక పద సామ్యాన్ని బట్టి వేరొక పదాన్ని సృష్టించేయడం మనకు వ్యవహారంలో ఉంది. (ఉదా: శ్రీమంతుడు అనే పదాన్ని తీసుకొని పనిమంతుడు అనే పదాన్ని ప్రయోగించారు) వీరు భాగస్వామి అనే పదంలో భోగస్వామి అనే వినూత్న పదబంధాన్ని సృష్టించారు. "జీవితమొక ఆకాశం / కవిత్వమొక

సముద్రం'' అనే కవితలో జీవితాన్ని ఆకాశంతో, కవిత్వాన్ని సముద్రంతో పోల్చి ఉపమాలంకారంతో పరిపుష్టం చేశారు. ''చివరకు పోయేది జీవితం / చివరివరకు మిగిలేది కవిత్వం'' అనే కవితలో కవి మరణించినా కవికృతి మరణించదనే సార్వకాలీన సత్యాన్ని వ్యక్తీకరించారు. ''జీవితమొక ఎడారి / కవిత్వమొక ఒయాసిస్సు'' అనే కవితలో జీవితాన్ని ఎడారితో, కవిత్వాన్ని ఒయాసిస్సుతో పోల్చడం ద్వారా భాషాచిత్యాన్ని పాటించారు. ''జీవిత సాగరంలో మొసళ్ళు కవిత్వాన్ని / కవితా మథనంలో ఐరావతాలు జీవితాన్ని'' అనే కవితలో జీవితానికి - కవిత్వానికి - మొసళ్ళకి - ఐరావతాలకి బింబ ప్రతిబింబ భావంతో దృష్టాంతాలంకారంతో పరిపుష్టం చేశారు.

''జీవితం వేరు / కవిత్వం వేరు / జీవితానికి వేరు కవిత్వం / కవిత్వానికి వేరు జీవితం'' - అనే కవితలో 'వేరు' అనే పదాన్ని అనేకార్థాలలో వాడడంతో యమ కాలంకారం గోచరమవుతుంది. ''కవిత్వం శిల్పం'' అనే కవితలో శిలను శిల్పం చేయడమే కవిత్వమని, శిలకు శిల్పానికి అంతర్గత సామ్యం, పదౌచిత్యం కల్పించడంతో భాషా సౌందర్యం భాసిల్లుతుంది. ''జీవితపు రహదారిలో / సేదతీర్చే చెట్టు కవిత్వం'' - అనే కవితలో జీవితమనెడి రహదారిలో అంటూ రూపకాలంకార చర్చ గావించారు. ''చివరకుపోయేది జీవితం / చివరకు మిగిలేది కవిత్వం'' - అనే కవితలో కవి మరణించినా, కవి కృతి మరణిం చదనే సార్వకాలీన సత్యాన్ని వ్యక్తీకరించారు. జీవితం సాయం సంధ్యలాంటిదని, కవిత్వం పదిమందిని కలిపే సంవిధానం లాంటిదనే భావాన్ని వ్యక్తీకరిస్తూనే, జీవితాన్ని, కవిత్వాన్ని సానుకూల ధోరణిలో రచించిన వీరే పరస్పర ప్రతికూల భావనలు కలిగే విధంగా కూడా రచించారు. ఏ విధంగా చూసినా, ''కవిత్వం-జీవితం'' స్వరూప స్వభావాలను విశదీకరించ డానికి నిర్వచించడానికి, స్పష్టపరచడానికి వీరు చేసిన ప్రయత్నంలో సర్వదా కృతకృత్యుయ్యా రనడంలో ఎలాంటి సందేహం లేదు.

శతక సంప్రదాయాన్నునుసరించి అష్టోత్తర శతక సంఖ్యని అలతి అలతి పదాలతో సులభంగా అందరికి అర్థమయ్యే రీతిలో మినీకవిత్వం రాయడం వీరికే చెల్లింది. అల్పాక్షరాలతో అనల్పార్థ రచన చేసి, కవిత్వాన్ని మధించి, వడబోసి, సారాన్ని మాత్రం మనకందించారు. వీరి కవిత్వం రెండు పాదాలతో మొదలై పది పాదాలకు మించకుండా సింపుల్ అండ్ స్వీట్‌గా, ఇక్షురసాస్వాద నానుభూతి కలిగించి, పాఠకుల హృదయపీఠంలో చిర స్థాయిగా నిలిచిపోయారనడం అతిశయోక్తి కాదు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'ఆలోచనలు' - సమకాలీన సమస్యల ప్రతిబింబాలు

- డాక్టర్ పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

మానవున్ని మనిషిగా మలిచేది అక్షరశిల్పం. మానవుని లోని అజ్ఞానాన్ని పారద్రోలి విజ్ఞానాన్ని వెలిగించు దివ్య జ్యోతి అక్షరం. అక్షరం కళాత్మకమైతే అది సాహిత్యం. అక్షరము యొక్క విశ్వస్వరూపము సాహిత్యం. అలాంటి సాహిత్యం సమాజంలోని కల్మష భావాలను పారద్రోలి నూతన చైతన్యాన్ని సమాజానికి జవసత్వాలుగా అంది స్తుంది. అలాంటి సాహిత్యంలో కవిత్వం ఒక మార్గం లేదా ఒక పద్ధతి. లయాత్మకమైన తన పదవిన్యాసంతో కవిత్వం సమాజాన్ని ఒక లయబద్ధమైన మార్గంలో నడిపిస్తుం దనడంలో సందేహం ఏమాత్రం లేదు. అలాగే కవిత్వం సమాజాన్ని దర్శించిన కవి నుండి పుడుతుంది. ప్రతి కవి సమాజాన్ని సమాజంలోని ప్రజలకు దర్శింపజేయాలని ఆరాటపడుతూఉంటాడు. తద్వారా సమాజం పట్ల ప్రజలలో చైతన్యభావాల్ని పెంపొందింపజేయాలని పరి తపిస్తూ ఉంటాడు. అలాంటి కవుల సామాజిక స్పృహల వల్ల ఎన్నో సారవంతమైన, సజీవమైన, మార్గదర్శకమైన, చైతన్యవంతమైన కవితలు ఆవిష్కరింపబడుతూ ఉం టాయి. అలాంటి కవితల్లో సమకాలీన సమస్యలు, సామాజిక పరిస్థితులు, ప్రాపంచిక పోకడలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. అలాంటి కవితల్లో ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ వచించిన 'ఆలోచనలు' అనే కవితల సమాహారం ఒకటి. ఈ 'ఆలోచనలు'లోని కవితలు ఆనాటి సమకాలీన సమాజానికి ప్రతిబింబమని చెప్ప వచ్చు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సమాజంలోని సమస్యలపై తన గళాన్ని విప్పి ప్రవచించిన కవితా మాలికలు ఈ ఆలోచనలు. ఈయన గొప్ప మానవతా వాది. తమ కర్తవ్యం పట్ల నిబద్ధత కల్గిన ఆదర్శపురుషుడు. మంచి గురువుగా, పరిశోధకుడిగా, పర్యవేక్షకులుగా పేరు గడించినవారు. సాహిత్యానికి తన జీవితాన్ని అంకితం చేసిన కళాపిపాసి. విద్యార్థుల భవితకు పరితపించిన ఆదర్శగురువు. కవి, వ్యాసకర్త, విమర్శకుడు, అనువాద కుడు, పాత్రికేయుడుగా తెలుగు సాహిత్యానికి సేవ చేసిన భాషాభిమాని. తానే కాకుండా సమాజాన్ని సాహిత్యసేవకు మల్లించిన గొప్ప భాషాసేవకుడు. తెలుగు లిపికి అంతర్జా తీయ ఖ్యాతిని తెచ్చిన తెలుగుతల్లి ముద్దుబిడ్డడు. అలాంటి భాషాసేవకుని సాహిత్యాన్ని విశ్లేషించుటకు నా పరిశోధనా ప్రయత్నం ఈ వ్యాసం.

'ఆలోచనలు' అన్నవి ఒక కవితా సంపుటి కావు. అవి కేవలం 'జర్నలిస్టిక్' రచనలుగా పేర్కొనడం వారి నిరాడం బర ఆలోచనలకు ప్రతీక. ఇందులోని కవితలు చాలా సూక్ష్మరూపాల్లో ఉన్నప్పటికీ అణువంత భావాల్ని పేల్చు తున్నవి. అణువు పరిమాణంలో చిన్నవే అయినా ఎంతో శక్తివంతమైనవని మనకు తెలిసిందే. ఇందులో హైకూ కవిత్వం, మినీ కవితా లక్షణాలు కనిపిస్తూ పాఠకుల్ని చైతన్యవంతం చేస్తున్నాయి. సుప్రసిద్ధ అభ్యుదయ కవి ఆరుద్ర గారి 'కూనలమ్మ పదాలు'లో ఉన్న చమత్కారం, నడకలు మనకు ఈ కవితల్లో కనిపిస్తాయి. అలాగే చురకలు, సూచనలు, సామాజిక స్పృహ వీటిలో మనకు కానవస్తాయి. ఈ కవితల్లో ప్రధానంగా రాజకీయ సమస్యలు, బాలల సమస్యలు, రైతు జీవితం, అవినీతి, శ్రామికుల సమస్యలు, స్త్రీ హక్కులు, దళిత చైతన్యం, కళాకారుల జీవితం, కవిత్వస్థానం, గ్రామీణజీవితం, మానవ సంబంధాలు, ప్రపంచీకరణ, పేదరికం, ఓటు ప్రాధాన్యతల వంటి అనేక సమస్యలు మనకు దర్శన మిస్తాయి.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌కు పిల్లలన్నా, విద్యార్థులన్నా అమితమైన ప్రేమ. అలాంటి సంపత్ కుమార్ గారి 'ఆలోచనలు' కవితల్లోని సమస్యల్లో మొట్ట మొదటిగా బాలల సమస్యలను పరిశీలిద్దాం.

"గది నిండా బందీలైన / సీతాకోక చిలుకలు/ బడిపిల్లలు!"
"ప్లాట్‌ఫామే తల్లి / చెత్తకుప్పే తండ్రి / అనాథ బాలలు!"
"గొంగళి పురుగును / సీతాకోక చిలుకగా మార్చండి / అందరికీ విద్య!"
"దారాన్ని తెంచుకోడానికి / తనకలాడుతున్న పూలు / బాలకార్మికులు!"
"పూలను కాళ్ళకింద పడేసిందీ/ మెడలో వేసిందీ మనిషే / నలిగిపోతున్న బాల్యం!",
"బాల్యం ఒక వరం / బాల్యమే శాపం కూడా/ డబ్బు చేతిలో కీలుబొమ్మ!"
"పిచ్చుక గూళ్ళు కట్టే వయసులో / సాలెగూళ్ళో ఇరుక్కొన్నారు బాలయంత్రాలు"
"పుట్టుకతోనే పిల్లల / విద్యాభ్యాసం ప్రారంభం / క్రష్ అయిపోతున్న బాల్యం!"

మానవుని మేథస్సు అడవి నుండి అంతరిక్షయానం వరకు ఎదిగినా తన సమాజంలో జడలు విప్పి నర్తిస్తున్న సామాజిక పీడనపిశాచాలను అణచివేయలేకపోతున్నాడు నేటి యాంత్రిక మానవుడు. మానవజీవితంలో బాల్యం అత్యంత ప్రధానమైనది, మనుగడుకు పునాది బాల్యం. అలాంటి బాల్యంలో పేదవాళ్ళు, అణగారినవర్గాలు, బడుగుజీవులు నేటికీ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నాయి. సరైన ఆర్థిక పరిస్థితులు లేక విద్యకు దూరమౌతున్నారు కొందరు, తల్లిదండ్రులు లేని పిల్లలు అనురాగ ఆప్యాయతలకు దూరమౌతున్నారు కొందరు, సరైన విద్యావ్యవస్థ లేక సాంప్రదాయ బడుల్లో సీతాకోక చిలుకల్లా బందీలై విద్యను అభ్యసిస్తున్నారు కొందరు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల పిల్లలు బాలకార్మిక వ్యవస్థలో చిక్కుకొని అందమైన బాల్యాన్ని కోల్పోతున్నారు కొందరు. నేటి పోటీప్రపంచంలో రాణించాలని ఆనందంగా ఆడుకోవాల్సిన పిల్లల్ని పుస్తకాల మధ్య ఇరికించి పుస్తకాల పురుగుల్లా మార్చేస్తున్నారు తల్లిదండ్రులు. ఇలా బాల్య దశలో మానవుడు ఎదుర్కొంటున్న సమస్యల్ని చక్కగా కవిత్వీకరించారు.

బాలల సమస్యలు సమాజాన్ని ఎలా కుంగతీస్తుందో స్త్రీ సమస్యలు కూడా సమాజాభివృద్ధికి శరాఘాతంగా తయారవుతూవుంది. అలాంటి స్త్రీ సమస్యలను సంపత్ కుమార్ ఎలా చిత్రించారో చూద్దాం.

"లేచింది నిదుర లేచింది
మహిళా లోకం
పార్లమెంట్‌లో పారని బిల్లు!"
"ఆకాశమంత పందిరి
భూదేవంత అరుగు
పంజరంలో చిలక!"
"అర్ధరాత్రి ఆడవాళ్ళు
ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం
సామూహిక అత్యాచారం!"
"శూన్యంలో సగం
సంపదలో శూన్యం
స్త్రీలకు సమాన హక్కులు!"

భారత దేశం వేదభూమి, కర్మభూమి, ధర్మభూమి యని, స్త్రీలకు ఎనలేని గౌరవాన్ని ఇస్తుందని యావత్ ప్రపంచమే కొనియాడుతూ ఉంది. కానీ ఆస్తులు, అంతస్థులు వద్ద మాత్రం స్త్రీకి మొండిచేయే చూపించింది భారతీయ సమాజం. మహాత్మాగాంధీ స్త్రీ అర్ధరాత్రి భయం లేకుండా, స్వేచ్ఛగా నడిచిన రోజే నిజమైన స్వాతంత్ర్య మని భావించాడు. కానీ నేడు పట్టపగలే ఆ స్త్రీ ఇంటా బయటా సర్వత్రా సామూహిక అత్యాచారాలకు గురౌతూనే ఉంది. సమాజంలో మహిళలకు సగభాగం స్థానం కల్పించాలనే ప్రభుత్వాల డాంభికపు మాటలను పార్లమెంట్‌లో ఇప్పటివరకు ఆమోదానికి నోచుకోలేదని సంపత్ కుమార్ వాపోయారు.

నేడు సమాజంలో దయనీయమైన జీవితాన్ని అనుభవిస్తున్నవారు రైతులు. దేశంలో రైతు సమస్య నేడు

ప్రధాన సమస్యగా తలెత్తింది. దేశానికే అన్నం పెట్టే రైతు మూడుపూటలా తిండి దొరక్క ఆకలితో అలమటిస్తూ, చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. సంపత్‌కుమార్ తన "ఆలోచనలు"ల్లో చిత్రించిన రైతు జీవితాలను పరిశీలిద్దాం.

"పల్లె పొమ్మంటోంది / పట్నం రమ్మంటోంది / పొట్టకోసం వలస!" / "ఊరంతా నిద్రపోతుంది / ఆకాశమంతా మగమేఘాలు / చెమ్మగిల్లిన రైతు!" / "భిక్షగాడు వెళుతున్నాడు / జోలె నిండిపోయింది / దుర్భిక్షకుడైన రైతు !" / "కొనేవాడికి / అమ్మేవాడు లోకువ / దళారి వాతపడ్డ రైతు!"

భారత దేశం సాంప్రదాయకంగా వ్యవసాయ దేశం. శ్రమైక జీవనం సాగించే మనస్తత్వం గల ప్రజలు భారత దేశానికి గల గొప్పవరం. కానీ అలాంటి భారత దేశంలో రైతులు తాము పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర లభించక, చేసిన అప్పులు తీరక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. కన్నతల్లి లాంటి ఉన్న ఊరిలో బ్రతుకలేక జీవనం కోసం కొందరు వలసపోతున్నారని, రోజురోజుకు రైతు జీవితం కన్నీటి కడలిలో చిక్కుకు పోతున్నదని ఆవేదన వ్యక్తపరచాడు. దేశాన్ని సస్యశ్యామల భూమిగా తీర్చిదిద్దిన రైతు బిక్షగాడిలా తయారవుతున్నా డని, దళారుల చేత దోపిడికి గురౌతున్నడని ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని ఆశిస్తున్నాడు.

దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలో రాజకీయ సమస్య అత్యంత ప్రధానమైనదని చెప్పవచ్చు. ప్రభుత్వాల తీరు తెన్నులను, ప్రజల జీవన విధానాల్ని అత్యంత ప్రభావితం చేసేవి ఆ దేశ రాజకీయాలని చెప్పవచ్చు. ఒక దేశాభివృద్ధి ఆ దేశ సిద్ధాంతాలను నిస్వార్థపూరితంగా అమలు చేయకపోతే ఆ సమాజం అనాగరికంగా తయారవుతుంది. అవినీతిలో కూరుకుపోయి ప్రజలు దుర్భర జీవితాలను అనుభవించాల్సివస్తుంది. సమాజం భ్రష్టుపట్టి అధఃపాతాళానికి పోయే ప్రమాదం లేకపోలేదు. నేటి సమాజం లోని రాజకీయ సమస్యలు ఎలా జడలు విప్పి నాట్యం చేస్తున్నవో 'ఆలోచనలు' సంపుటిలో పరిశీలిద్దాం.

"రాజకీయ నాయకుడు / ఓట్లు దోచుకువెళుతున్నాడు / హరించుకుపోయిన హక్కు !"
"ప్రజలే వేళ్ళు / ప్రభుత్వమే ఫలం / అధికారం మీదే అందరి ప్రేమ!"
"పాలించడానికి ఒక పార్టీ / పరిపాలించడానికి ఒక రాష్ట్రం / నాయకుల అత్యవసరాలు!"
"గోడ దూకితే ఫిరాయింపు / గోడవతలే ఉంటే అవినీతి / రాజకీయ సహకారం !"
"అడవంతా వెదికినా / ఒక నక్కా కనిపించదు / రాజధానిలో రాజకీయుల ఊళ !"
"అధికార దాహం / తీరడానికి మార్గాంతరం / మధ్యంతరం!"
"అవకాశం / ఒకరికే ఉంటే / అవకాశవాదమే రాజీ ఫార్ములా !"
"అన్నీ మావేనని వాళ్ళు / అన్నీ మాకేనని వాళ్ళు / తెలిసిందేమిటంటే / ప్రజలే ఏమీ లేనివాళ్ళు !"
"ప్రజలు ఎజెండాలో లేని / జెండా పండగలు / ఎన్నికలు !"
"అధికారం అశాశ్వతం / ప్రజాసేవే పరమార్థం / ఎన్నికలు దగ్గర పడ్డట్టుంది !"
"దున్నేవాడిదే భూమి / ఏలేవాడిదే రాజ్యం / రాజకీయనాయకులు !"

అధికారం కోసం నేటి రాజకీయ నాయకులు పడేపాట్లు ఎలాంటివో, ప్రజలను ఎలా మభ్యపెడతారో, ప్రజల హక్కులను ఎలా కాలరాస్తున్నారో, అధికార దాహం వల్ల సిద్ధాంతాలను ఎలా తారుమారు చేస్తున్నారో తమ స్వార్థపరమైన ప్రయోజనాలకోసం జిత్తులమారి నక్కల్లాగా ప్రవర్తిస్తున్నారో సంపత్‌కుమార్ గారు నేటి రాజకీయ నాయకుల మనస్తత్వాలను చక్కగా చిత్రీకరించారు. అలాగే ప్రజాస్వామ్య సమాజంలో ఓటరు మహాశయుల ప్రవర్తనలను, ఓట్ల ప్రాధాన్యతను ఎలా చిత్రీకరించారో పరిశీలిద్దాం.

"దొంగ ఓట్లేస్తే / రౌడీలు నాయకులవుతారు / 50 ఏళ్ళ ప్రజాస్వామ్యం !" / "కిందా మీదాపడి / ముగించారు 'సర్వే'శ్వరులు / ఇక గుండె విప్పడానికి / సిద్ధం కావాలి ఓటరేశ్వరులు!" / "ప్రథమ పౌరుడే క్యూలో / నిలబడి వేశాడు ఓటు / మామూలు ప్రజలారా / మీకెందుకు ఇక లేటు !" భారతదేశ విభిన్నత్వంలో ఏకత్వం గల దేశమని కీర్తి గడించింది. కానీ భిన్నత్వంలో ఎప్పుడూ వర్గపోరాటాలే, వర్ణవివక్షతలేనని సంపత్‌కుమార్ గారి అభిప్రాయం. శాస్త్ర, సాంకేతికరంగాల్లో మానవుడు ఆకాశమంత ఎదుగుతున్నా వివక్షతలో పాతాళంలోకి పాతుకుపోతున్నాడు. నేటి సమాజంలో దళితుల పరిస్థితులు ఎలా ఉన్నాయో చూద్దాం.

"దళితులూ దళితులూ రాసుకొంటే / రిజర్వేషన్లు రాలిపోతాయి / మాల మాదిగల హింసారిహింస !"

"నరికివేసిన కొమ్మ / కొడవలై మొలుస్తుంది / దళితచైతన్యం!"

"పేరు చుండూరు / హృదయం మండే చూరు / 1991 ఆగష్టు 6 !"

దేశం ఎదుర్కొంటున్న సమస్యలో అవినీతి సమస్య నేడు అత్యంత ప్రధానమైన సమస్యగా చెప్పుకోవచ్చు. దేశాభివృద్ధిని తలక్రిందులు చేస్తున్న అత్యంత ప్రభావితమైన అరాచక పద్ధతి ఈ అవినీతి. ఈ అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందక పక్కదారిన పడి ప్రజలు అభివృద్ధికి నోచుకోరు. అలాంటి సమాజం ఎప్పటికీ ప్రగతిపథంలో దూసుకుపోదని ఎలా భావించారో సంపత్‌కుమార్ కవితల్లో పరిశీలిద్దాం

"అందరిదీ ఒకటే బాట / అవినీతి ప్రతిఘటన / నీతిబుట్ట మాయం !"

"దేశమంటే మనిషికాదోయ్ / దేశమంటే మట్టోయ్ / భూ బకాసురులు!"

"దేశాభివృద్ధి అంటే / నైతికాభివృద్ధే / అవినీతి స్వర్ణోత్సవం !"

"ఉప్పయినా సరే నీళ్ళు / నీళ్ళవైపే మళ్ళుతాయి / అవినీతి అధికారుల అండ !"

ఇలా దేశంలోని ప్రతి సమస్యను సంపత్ కుమార్ తమదైన బాణీలో ముక్తకాలుగా కవిత్వీకరించారు. ఇంకా శ్రామిక సమస్యలు, పర్యావరణం, గ్రామీణ జీవితం, కళాకారుల దుస్థితి, మానవ సంబంధాలు వంటి అనేక అంశాలను చిత్రీకరించారు. దేశం ఇలాంటి సమస్యలను అధికమించి సమస్యల రహిత దేశంగా, సమసమాజ దేశంగా, అవినీతిరహిత సమాజంగా, ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్యదేశంగా పరిణమించాలని కవిగారి అభిప్రాయమని చెప్పవచ్చు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వికారి - స్త్రీ

- నూకల విజయలక్ష్మి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, రాజధాని కళాశాల,చెన్నై, తమిళనాడు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు ఒక సాధారణ కుటుంబంలో పుట్టి, బి.కామ్ చదువుకొని, ఎం.ఎ. తెలుగు ప్రధానాంశంగా తీసుకొని విశ్వవిద్యాలయానికే ప్రప్రథమంగా వచ్చినవారు. అంతేకాక ఎం.ఫిల్ థీసిస్‌ను ఆంగ్లంలోకి రాసిన రెండవ వ్యక్తి. పిహెచ్.డి. మరియు డి.లిట్ పట్టాను తీసుకొని, స్వయంకృషితో ''ఇంతింతై వడుడింతై'' అన్నట్లుగా పాత్రికేయుడిగా మొదలుపెట్టిన జీవితం, బూదరాజు రాధాకృష్ణగారితో సహచర్యం చేసి, ఆ తరువాత 2001లో మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ప్రవేశించి తెలుగు శాఖాధ్యక్షులుగా , మద్రాసు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్స్ ఫోరం ప్రెసిడెంటుగా, సెనెట్ మెంబరుగా, కేంద్ర సాహిత్య పురస్కార ఎంపికలో సభ్యులుగా, యుజిసి, యుపిఎస్‌సి, సిబిఎస్‌సి సభ్యులుగా ఎన్నో సేవలను అందిస్తున్నారు. వీరు ఇంత స్థాయికి ఎదగడానికి దీని వెనుక ఎంతో కృషి, పట్టుదల మనకి కనిపిస్తుంది. ఇవి నేటి యవతకు ఆదర్శము.

డిగ్రి నుంచి అభ్యుదయ వాదయిన మాడభూషివారు తరువాత అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యులై, అభ్యుదయ భావాలతో ఎన్నో కవితా సంపుటులను రచియించారు. వందమంది కవులు రచియించిన కవితా సంకలనంలో గురజాడ నుంచి ఇప్పటివరకు ఉన్న కవుల కవిత్వాలలో ఆచార్య సంపత్‌కుమార్ గారి కవితలు కూడా అచ్చయ్యాయి.

కొన్ని వందల రచనలు, విమర్శలు, వ్యంగ్యరచనలు, రాజకీయ కవితలు రచియించిన వీరు ఎదిగినకొద్ది ఒదిగి ఉండే నిగర్వి, నిరాడంబరులు, స్నేహశీలి, మితభాషి అయిన సంపత్‌కుమార్‌గారు మద్రాసు విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ కీర్తిని ఆకాశం అంత ఎత్తుకు తీసుకెళ్ళిన ఘనత వీరిదే.

ఇతర రాష్ట్రంలో ఉంటూ తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన పరిశోధకుడు కావడం తెలుగువారం దరమూ గర్వించదగ్గ విషయము. వీరు చేసిన సాహిత్య కృషి మర్రిమానులాంటిది. వీరి సాహితీ సంపదను ఎందరో విద్యార్థులకు పంచి ఇచ్చారు. వీరిదగ్గర చదువుకున్నవారు ప్రపంచంలో నలుమూలల విస్తరించి ఉన్నారు. అటువంటి చల్లటి మర్రిమాను నీడలో నాకూ చోటు దొరకటం, నేను వారి విద్యార్థిని అయినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, వారు రచియించిన వికారి అనే కవితా సంపుటిలో నా శీర్షిక ''మాడభూషివారి వికారిలోని స్త్రీ'' గురించి నా విశ్లేషణ.

ఈ వికారి కవిత సంపుటిలో చిన్నచిన్న పదాలతో ఎంతో ఆలోచించే విధంగా నేటి సమాజానికి; అతి దగ్గరగా ఉన్న ఇతివృత్తాలను, తన సూక్ష్మదృష్టితో మనల్ని ఆలోచింపజేసే కవితలయిన బిక్షగాడు, ఆత్మహత్య, విసర్జన, రైతు ఆత్మకథ, కుక్కలుంటాయి జాగత్ర, నోరు తెరవండి వంటి కవితలు, భిన్నమైన భావవ్యక్తీకరణతో, నగ్నసత్యలను మనముందుంచారు.

నోరు తెరవండి
ఇకనైనా నోరు తెరచి మాట్లాడండమ్మా
వేల సంవత్సరాల నుంచి, మౌనంగా ఉంచిన నోరు.....

అంటూ తన రచనలో ఆడవాళ్ళు నోరు తెరచి మాట్లాడమని, నోరు తెరచి మాట్లాడడం వల్ల నీకు పొయ్యేదేమీ లేదంటూ తన కవితలో చిన్న చిన్న పదాలతో అంతర్లీనంగా మనముందుంచారు.

అనాదిగా మగవాళ్ళదే ఆధిపత్యం. ఆది నుండి చదువు, ఉద్యోగాలు అన్నీ మగవాళ్ళవే. కనుక ఆడవాళ్ళు వంటింటికి మగవారి సేవల వరకే పరిమితం.

ఆడవారిని నోరెత్తకుండా, మాట్లాడకుండా చేసారు. ఎంత కష్టం వచ్చిన తమ గుండెల్లో దాచుకున్న దుఃఖాన్ని దిగమింగుకొని బ్రతకడం అలవాటయింది. ఎన్నిమాటలు పడుతున్నా నిప్పులు చెరగకుండా, నీళ్ళు నములుతూ మౌనంగా భరించారు. ఇప్పుడు తాను మాట్లాడితే తన జీవితానికి ఎంతవరకు రక్షణ? ఎంత చదువులు చదివినా, ఎంత గొప్ప ఉద్యోగాలు చేసినా కష్టాలు, నష్టాలన్నీ దిగమింగుకొని, నలిగిపోయి, నోరు మెదపక అన్నింటిని భరిస్తూ, భర్తచాటు భార్యగానే మిగిలిపోయిన ఆడ వాళ్ళు ఎందరో. ఒకవేళ నీవు కష్టాలు పడితే, ఆ బాధలను బయటపెడితే అప్పుడు నీ బిరుదు తెగించినదానివని, బరితెగించినదానివని, బలిసిన దానివని, మర్యాద లేని దానివని అంటుంది ఈలోకం. ఒకవేళ నీవు నోరు తెరిచినా అదీ నీకు అవమానమే. నీవు చెడ్డదానివని, వగలాడివని, మర్యాదలేనిదానివని అంటుంది ఈ లోకం. ఏమి తెలియని పసిపిల్లలని "టచ్" పేరుతో హింసలు, స్కూలు, కాలేజీ పిల్లలకు మార్కులు తక్కువవేస్తాం అనే బెదిరింపులు, బస్సుల్లో రైళ్ళల్లో ఎక్కడెక్కడో తడిమే చేతులు, ఆఫీసుల్లో అల్లరి మూకలు, వీధిల్లో రౌడీలు వీటన్నిటికీ ఒకటే సమాధానం "స్వీయరక్షణ పద్ధతులు"

నిన్నటి సంఘటన "గుండెలపై బ్లేడుతో నా పేరు రాసుకో" అని బెదిరించిన కిరాతకుడి బాధలు మౌనంగా భరియించిన ఓ మహిళ నోరు తెరచి మాట్లాడమ్మా. నీకు అండగా మేమందరం ఉన్నాం. మహిళందరూ కలిసి కట్టుగా వస్తాం. ఆడపిల్లలకి రక్షణ కల్పిద్దాం. వేధింపులను మౌనంగా భరించకండి. మీ వెనుక పోలీసు బలగం ఉంది. షి టీమ్స్ ఉన్నాయి. ధైర్యంగా నోరు తెరచి మాట్లాడమ్మా.

ఆడవాళ్ళు నోరు తెరవకుండా బాధలను అనుభవిస్తుంటే ఇది ఒక పరిస్థితి అయితే, ఇంకొక పరిస్థితి ఆడవాళ్ళు జాగ్రత్త అంటూ హెచ్చరించారు తన కవిత "కుక్కలుంటాయి జాగ్రత్త" ద్వారా.

ఒక ఆడపిల్ల బయటకి వెళ్ళి క్షేమంగా తిరిగి రావాలని బయటకు వెళ్ళిన ఆడపిల్ల ఇంటికి తిరిగి వచ్చే వరకు ఆ తల్లిదండ్రులు ఎంత భయపడతారో మనందరికి తెలుసు. చిన్న చిన్న పదాలతో ఎంతో అర్థవంతంగా "కుక్కలుంటాయి జాగ్రత్త" అని మనల్ని చాలా ఆలోచింప చేసే విధంగా రచియించిన కవిత ఇది.

"నువ్వు పసికందువు కావచ్చు, పండు ముదుసలివి కావచ్చు, యవ్వవతివికావచ్చు, ఒంటరిదానివి కావచ్చు" అంటూ రోడ్డు మీద కుక్కలుంటాయి అని నేటి సమాజానికి ఎంతో దగ్గరగా గమనించి, ఇలాంటి సమస్యను మనం రోజు వార్తలలో చూస్తూనే ఉంటున్నాం. చిత్తకార్తె కుక్కలు చిత్తచాంచల్యంతో తిరుగుతూ ఉంటాయి. అలాంటి మనస్తత్వం గల మగవాళ్ళు తిరుగుతూనే ఉంటారు. వారి బారిన పడిన పసికందువు కావచ్చు, పండు ముసలివి కావచ్చు, అనుభవించడానికి ఒత ఆడది కావాలి. అలా అనుభవించిన మృగాలకు ఆనందం ఎంతవరకు ఉంటుంది?

ఆ కుక్క బారిన పడిన ఆడది అనుభవించే బాధ ఎందరి హృదయాలను కలచివేస్తుంది. మొన్నటి నిర్భయ నుంచి నిన్నటి కన్నూర్ సంఘటన వరకు ఎందరో ఆడ పిల్లలు లేదా మహిళలు ఎంతో బాధపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినా ఎంతమంది కేసులు పెడుతున్నారు. ఎంతమంది బయటకు చెప్పలేక దాచేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ఆమెకు, ఆ కుటుంబానికి నరకం చూపిస్తారు. బాధితులకు శిక్ష తొందరగా పడుతుందా? అసలు శిక్షపడితే ఎంతవరకు అమలవుతుంది ఆ దేవుడికే తెలియాలి. బాధపడిన వ్యక్తి కేసుపెడితే కోర్టును నమ్మించాలి. లాయర్ అడిగే అసభ్యకరమైన ప్రశ్నలకు బదులు చెప్పాలి. పత్రికలు ప్రసార మాధ్యమాలలో జరిగే చర్చముందు తలొంచాలి. ఆ స్త్రీ లేదా ఆ కుటుంబం ఎంతవరకు తట్టుకోగలుగుతుంది. దీనివలన నష్టపోయేది ఒక ఆడపిల్ల జీవితం, పరువు, ఆ కుటుంబ గౌరవ మర్యాదలు వీధిలోకి వస్తాయి. చిత్తకార్తె కుక్కలు త్తచాంచల్యము కేవలం చిత్తకార్తెలోనే

ఉంటుంది.

చిత్తచాంచల్యంతో తిరుగుతున్న చిత్తకార్తెలాంటి మనస్తత్వం గల ఈ కుక్కలు అవకాశం వచ్చిన ప్రతిక్షణాన్ని ఉపయోగించుకుంటాయి. దానికంటే హీనమైన స్థితిలో ఇలాంటి మృగాలు ఉన్నారు. ఇలాంటి మృగాల ఆటలు కట్టాలంటే కఠినమైన చట్టాలు తేవాలి. శిక్షలను వెంటనే అమలుపరచాలి. అప్పుడు చిత్తచాంచల్యంతో ఎలాంటి చిత్తకార్తె కుక్కలు తిరగవు.

మాడభూషి వారి వికారిలోని స్త్రీలను గురించి చదువుతుంటే ఎంతో ఆర్ద్రత, సంవేదన నిండి ఉన్న ఇలాంటి కవితలను ఒక పురుషుడైయుండి స్త్రీల గురించి ఇంతలా ఆలోచించగలగడం వారికి స్త్రీల పట్ల ఉన్న గౌరవమే. ఒక స్త్రీలో తల్లిని చూసిన వ్యక్తులకే ఇలాంటి భావాలు గలిగి ఇలాంటి రచనలు చేయగలుగుతున్నారు. వికారిలోని స్త్రీ, కుక్కలుంటాయి జాగ్రత్త, నోరుతెరవండి కవితలు అందుకు నిదర్శనం.

సమాజ శత్రువుతో సాహిత్య పోరాటం

నియోగి :

డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సాహిత్యలోకానికి సుపరిచితుడు. వివిధ పత్రికలతో సామాజిక, సాహిత్య వ్యాసాలు వందలాదిగా రాశారు. విమర్శతో పాటు హాస్య, వ్యంగ్య రచనలు చేయడంలో ఒక ప్రత్యేకతను సాధించారు. ప్రస్తుతం మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖా ధ్యక్షులుగా ఉన్నారు. ఇప్పుడు 'శత్రువుతో ప్రయాణం' పేరుతో కవితా సంపుటిని వెలువరించారు.

చరిత్రను తవ్వడమంటే / వర్తమానంపై / మనకు మనమే మట్టిపోసుకోవడమే / చరిత్రను తెలుసు కోవడమంటే / వర్తమానానికి చరిత్రను కల్పించడం! నేడు జరిగినదంతా రేపు చరిత్ర ఆ చరిత్రని రేపటితరాలు తెలుసుకొని ముందు కు నడవాలి. చరిత్రలోని తప్పిదాలను పునరా వృతం కాకుండా వర్తమానం నుండి భవిష్యత్తుకు దారులు పరుచుకోవాలి అదే చెపుతారు మాడభూషి.

వర్తమానం / గతానికి బాధ్యత వహించదు / భవిష్యత్తుకు పూచిపడుతుంది / చరిత్రంటే / అయిపోయిందికాదు / రాబోయేది. కాబోయేది / అంటారు. మగాళ్ళు మృగాళ్లుగా మారి చేస్తున్న వికృత చేష్టల్ని కళ్ళకు కడతారు మాడభూషి. స్త్రీలపట్ల ఒక సానుభూతి చూపిస్తారు. అయితే స్త్రీలు నేడు సానుభూతిని కోరడం లేదు. వారికి కావాల్సి వారి అస్తిత్వం. అది ఒక అవసరమైనది. అది తమకు తాముగా స్త్రీలు సాధించే క్రమంలో ఎదగాల్సి ఉంది, ఎదిరించాల్సి ఉంది. నన్నేకాదు /నేను కుట్టిన / చెప్పుల్ని కూడా / వాడు బయటే వదిలేస్తాడు! కానీ వాణ్ణి / అక్కడిదాకా తీసుకెళ్లిందెవరు? అంటూ దళిత పక్షం వహించి ప్రశ్నిస్తాడు. ఈ సంపుటిలోని మొత్తం 36 కవితలు దేనికదే ప్రత్యేకత కలిగి ఉన్నాయి.

(ఆదివారం, ఆంధ్రప్రభ, 26 ఏప్రిల్ 2015)

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడో మనిషి కవిత్వం- వస్తు విశ్లేషణ

- రొసాల బాలసుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

మూడో మనిషి కవితా సంపుటి పరిచయం :

ఆధునిక సమాజంపై ప్రభావం చూపిస్తున్న అనేక అంశాలపైన రచయిత తన బలమైన గొంతుకను చాలా సున్నితంగా మనస్సుకు తగిలేలా ఆలోచనలు మెదిలేల, తన అనుభవాలను ఉపయోగించి కళ్లముందు కదులుతున్న అన్యాయాలను, విపత్తులను, వివక్షతలను వేలెత్తి చూపిస్తున్నాయనడానికిఈ మూడోమనిషి కవిత్వసంపుటి నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు.

సమాజంలో ప్రతి వస్తువు కవిత్వానికి అర్హమే అని శ్రీశ్రీ గారి "కాదేది కవితకనర్హం" అనే ఖండికలో చెప్పినట్లు కవి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు ఈ సంపుటిలో చాలా వరకు సంఘర్షణ మేటిగా ఉన్న వస్తువును ప్రధానం చేసుకొని రాశారు. కవిలో వాడి వేడితో గ్రంథాన్ని చక్కని శైలిలో రాశారు. వాక్యాల్లో అక్కడక్కడ హృదయం నుండి పొంగి పొరలి కవిత్వ ధారకూడా కనిపిస్తుంది. స్పష్టతను ఆత్మాశ్రేయతను మరింత అర్థవంతంగా చెప్పాలనుకునే అక్షర వేధనగా దీన్ని అర్థం చేసుకోవాలి. సామాన్యుని సైతం తన భావాల్ని చక్కగా అందుకోగలిగేలా కవిత్వాన్ని రాయడం మాడభూషి గారికి అందవేసిన చెయ్యి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని ఈ కవితా సంపుటి బుజువు చేసింది. ఈ కవితా సంపుటిలో 38 ఖండికలు ఉన్నాయి. ప్రతి ఖండిక కూడా దేనికవే ప్రత్యేకమైనవే. ఒక్కొక్క ఖండిక ఒక్కొక్క సంఘర్షణతో సమాజాన్ని ఆలోచింపజేసి వారిలో చైతన్యం కలిగించేలా ఉన్నవని నా అభిప్రాయం.

ఫరిది :

సన్నగిల్లుతున్న మానవతా విలువలు :

నేటి సమాజంలో మానవతా విలువలు క్షీణించి పోతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మనిషి తాను తన భార్య, తన పిల్లలు ఇదే తన ప్రపంచంగా గిర్ర గీసుకొని జీవిస్తున్నాడు. పెంచి పెద్ద చేసిన తల్లి దండ్రుల నడ్డిమీద తంతూ వారిని నడిరోడ్డుమీద వదిలేసిన సుపుత్రులు చాలా మందే కన్పిస్తారు. చివరికి ముసలి తల్లిదండ్రులకు వృద్ధాశ్రమాలే దిక్కవుతున్నాయి. సూటిపోటి మాటలతో ముసలి మనసును ఎంతో క్షోభకి గురిచేస్తున్న ఉత్తమ కోడల్లు ఆధునిక సమాజంలో కోకొల్లలు. ఇలాంటి దౌర్భాగ్య స్థితిలో ఉన్న సమాజానికి మాతృత్వ మధురిమను రచయిత సంపత్ కుమార్ గారు తాను రాసిన "తల్లి కవితా ఖండిక"లో ఈ విధంగా తెలియ జేశారు.

ఒక తల్లి / పదిమంది పిల్లల్ని
కనిపెంచి పోషిస్తుంది / పది మంది
పిల్లలు / ఒక తల్లిని పోషించలేకపోతున్నారు
రాను రాను మనుషులు
బలహీన పడిపోతున్నారు!
అందుకే తల్లి / ఇవ్వుడు ఒకే బిడ్డతో
సరిపెట్టుకుంటుంది

(మూడోమనిషి పుట: 15)

ఒక తల్లి పదిమంది పిల్లల్ని ఏ లోటు లేకుండా పెంచ కలుగుతుంది. కాని ఆ పదిమంది కలిసి ఆ ఒక్క తల్లిని పోషించలేకపోతున్నారు. ఇంత దౌర్భాగ్య స్థితికి నేటి సమాజం చేరుకుందని తన కవిత ద్వారా మనుషులలో మాయమవుతున్న మానవితా విలువలను గురించి తెలియచేశారు. అలాగే "ఇద్దరు" అనే కవితా ఖండికలో కూడా రచయిత ఈ విధంగా తెలియజేశారు.

"మే మిద్దరం / మా కిద్దరు
వా రిద్దరిద్దరు / చివరకు
మేమిద్దరమే! (మూడోమనిషి పుట: 39)

నాలుగు వరసల ఈ ఖండికలో రెండు తరాల చరిత్రను రచయిత బంధించారు. వివాహంతో ఇద్దరు ఒకటై. ఇద్దరి పిల్లలతో సంసారం సాగించి, ఆ ఇద్దరు పిల్లలకు పెళ్లిల్లు చేసి చివరికి తిరిగి వారు ఇద్దరిగానే మిగిలిపోతున్నాము. వచ్చిన కోడళ్లు అత్తమామల్లో తల్లిదండ్రులను చూసుకుంటే కోడళ్లలో అత్తమామలు కూతుర్ని చూసుకుంటే ఎలాంటి భేదాభిప్రాయాలు రాకుండా కలసిమెలసి జీవించగలరని నా అభిప్రాయం. ఈ రోజు తాము గెంటేస్తే ఏదో రోజు తాము గెంటివేయ బడతారనే సత్యాన్ని తెలుసుకుని జీవించాలని రచయిత సమాజంలో మార్పును కాంక్షిస్తున్నారు.

మైనారిటీలు :

మైనారిటీలు అనే కవిత ద్వారా మైనారిటీల ఆత్మ ఘోషని సాహితి ప్రియులకు అందజేసిన గణత రచయిత గారికే దక్కుతుంది.

"మైనారిటీలు
దిక్కులేకుండా ఉన్నారు
దిక్కులు చూస్తున్నారు
దు:ఖంగా ఉన్నారు
దుర్దశలో ఉన్నారు!" (మూడోమనిషి పుట: 22)

ఒక ప్రాంతంలో గాని ఒక దేశంలో గాని అత్యల్ప సంఖ్యకులను మైనారిటీలు అంటారు. వీరు ఎక్కువుగా వలసలపై వచ్చినవారై ఉంటారు. కాబట్టి స్థిరాస్తులు ఉండవు. బంధువర్గాలు కూడా అధికంగా ఉండవు. నిత్యం కష్టపడుతూ శ్రమనే నమ్ముకుని జీవనం కొన సాగిస్తున్నారు.

"జనబలం/ ధనబలం
లేనివారు
హీనంగా/ బలహీనంగా
బతుకీడుస్తున్నారు!
ఆస్తిలేదు / అధికారంలేదు
తలరాతను నముకున్నవాళ్ళు!
(మూడోమనిషి పుట: 22)

జనబలం ధనబలం రెండూ లేవు కాబట్టి వీరంటే ప్రతి ఒక్కరికి చులకనే. ప్రతి ఒక్కరు వీరిపై పెత్తనం చలాయించాలనుకునేవారు. కానీ జీవించడానికి కనీస వసతులు కూడా లేకుండా చాలా హీనంగా వీరి బతుకులు ఉంటాయని అన్నింటికి తమ తలరాత అంతేనని సరిపెట్టుకుంటారని చాలా బలహీనమైన జీవినాన్ని కొనసాగిస్తున్నారని ఎంతో హృదయ విధారకంగా ఈ కవితలో రచయిత చిత్రించారు. అంతేకాకుండా సమాజం ఎప్పుడూ వీరిని దొంగలలాగో లేక ఉగ్ర వాదులులాగో, గొడ్డుచాకిరి చేసే మర మనుషులులాగో చూస్తుంది కానీ తోటి మానవులే అన్న మాటని మరిచి పోతున్నారని నేటి సమాజాన్ని అంచనా వేసి చెప్పవచ్చు.

మూడో మనిషి :

సమాజంలో అధికంగా వివక్షతకు గురౌతున్న వారిలో ముందు వరుసలో ఉన్నవారు నపుంసకులు.వా రు ఆడ, మొగ లక్షణాలు కలుపుకొని మనుషులలో మూడవ రకం మనుషులుగా జీవిస్తున్నారు. కాని మిగిలిన రెండు రకాల మనుషులు వీరిని మనస్ఫూర్తిగా తమలాంటి మనుషులే అని ఒప్పుకోలేకపోతున్నారు. వారిని చులకనగా చూడటం, వీరితో అసభ్యంగా ప్రవర్తించడం. వారిని చూస్తేనే భయ బ్రాంతులకు గురై పక్కకు పారిపోవడం లాంటివి చేస్తూ వారిని దూరం పెడుతున్నారు. ఉపాదులు లేక తగిన ప్రోత్సహాలు లభించక చివరకు బిచ్చమెత్తుకోవడం ఒక ఉపాదిగా భావించి దానికే అలవాటై బతుకునీడుస్తు న్నారు. కాని ఏమాత్రం సంతృప్తిలేని అలాంటి జీవితాల పట్ల వారు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తూ మమ్మల్ని కూడా మనుషులుగా గుర్తించండి, మీలో కలుపుకోండి అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కోర్టులు, న్యాయాలు ఎన్ని తీర్పులు ఇచ్చినా వారికి జరిగిన న్యాయం చాలా తక్కువే అని నేటి సమాజంలో జరుగు తున్న సంఘటనలను ఆధారంగా చేసుకొని చెప్పవచ్చు. మనిషి ఆలోచనలు మారాలి. నపుంశకుల పట్ల ఉన్న అభిప్రాయాలలో మార్పు రావాలి. వారూ మనుషులే అని

గుర్తించాలి అని అంటూ వారి జీవన స్థితిగతులను, వారు అనుభవిస్తున్న బాధలను, వారి కాంక్షలను రచయిత ఈ మూడో మనిషి కవితలో ఈ విధంగా చిత్రించారు.

"రెండో మనిషిని గురించి
ఆలోచించే తీరికే లేని మనిషికి
మూడో మనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది"

(మూడోమనిషి పుట : 36)

నేటి ఈ పోటీ ప్రపంచంలో మానవుడు మానవ సంబంధాలను, మానవతా విలువలను మరిచి జీవిస్తున్నాడు. ఎంతసేపు తాను తన కుటుంబం అనే స్వంత ప్రయోజనాలకై ఆలోచించే మనిషి వక్కవాడు ఏమౌతున్నాడో కూడా పట్టించుకోకుండా తయారయ్యాడు. రోడ్డుమీద చావు బతుకులతో కొట్టుమిట్టాడుతున్న పట్టించుకోకుండా చూసి చూడనట్లుగా వెళ్లిపోతున్నారు. తోటివాళ్లు ఎంతటి ఆపదలో వున్నా కన్నెత్తి చూడనంత కఠినంగా మారారు. అలాంటి మనిషికి మానవత దృక్పథంతో మూడో మనిషిని ఎలా చేరదీస్తాడు. కనీసం వారి గురించి ఆలోచించే సమయం కూడా లేదే అంటూ నేటి సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని తన ప్రశ్నతో సమాజంలో వున్న వారు సిగ్గుపడేలా, ఆలోచించేలా తన కవితతో సమాజానికి సందేశమిచ్చారు. అంతేకాకుండా

"ఇక్కడ / ఆడబిడ్డ బరువు
మూడో బిడ్డ నిషేదం /
ఇక మూడో మనిషి గురించి.....!?"

(మూడోమనిషి పుట : 36)

నేటి సమాజంలో ఆడపిల్లలు పుడితే చెత్తకుండీలలో పడేయడం లేద పురుట్లోనే చంపేయడం, లేదా బస్టాండుల్లో, రైల్వేస్టేషన్‌లో, వీధి చివర్లో వదిలేయడం లాంటివి తల్లిదండ్రులు చేస్తున్నారు. వారిని పెంచి పెద్దచేసి లక్షలకు లక్షలు కట్నాలిచ్చి పెళ్ళిళ్లు చేసే స్తోమతి లేకే అలా చేస్తున్నారని ఒక వాధన. అందుకే రచయిత నేటి సమాజంలో ఆడబిడ్డపుట్టడం భారంగా భావిస్తున్నారని జన సాంద్రత పెరిగిపోతుందని ఇద్దరి పిల్లలకే అనుమతించి మూడో బిడ్డకి నిషేధం విధించారు ప్రభుత్వం. తల్లి తండ్రులు కూడా కుటుంబపోషణ దృష్టిలో పెట్టుకొని ఒకరు లేదా ఇద్దరితో సరిపెట్టుకుంటున్నారు. అలాంటి సమాజం మూడో మనిషి గురించి ఏం? ఆలోచిస్తుంది అంటున్నారు రచయిత.

"ఇంట్లో మొదలై...../ వీధిలోకి వచ్చి.....
సమాజంలోకి వెళ్ళి..... / ప్రపంచమంతా పాకి.....
మూడో మనిషిని చూస్తే.... / అందరికీ ఎగతాళీ!
తాళి కట్టే అర్హత / తాళికట్టించుకొనే అర్హత
లేదనేకదా ఇంత నవ్వులాట!"

(మూడోమనిషి, పుట: 36)

ఇంట్లో మొదలైన వివక్షత మెల్లమెల్లగా వీధిలోకి, సమాజంలోకి మొత్తంగా ఈ ప్రపంచమంతా పాకింది. అందరూ వారి ప్రవర్తనను చూసి ఎగతాళి చేసేవారే. ఎందుకంత వివక్షత తాళికట్టే, తాళి కట్టించుకునే అర్హత లేదనేగా మీకు ఇంత చులకన ఇంత నవ్వులాట అంటూ ఆవేశపూరితంగా సమాజాన్ని నిలదీస్తున్నారు రచయిత గారు.

"అన్నీ ఉన్న జెండర్లను గురించే
జెండాలను పట్టుకొని తిరుగుతున్నారు తప్ప
అందరూ నిర్లక్ష్యంచేసే జెండర్ వాళ్లకు
ఏ జెండా నీడా దొరడంలేదు!"

(మూడోమనిషి పుట: 37)

వారికంటే మెరుగైన స్థితిలో ఉన్న వారికి కొద్దోగొప్ప ప్రతివారి దగ్గరినుండి కొంతైనా సహాయం లభిస్తుందికాని, అందరూ నిర్లక్ష్యం చేసే ఈ నపుంసకులకు ఏ పార్టీవాడు ఆదుకోవడం లేదు అంటూ రాజకీయనాయకులు వారిపట్ల ఆలోచించవలసిందిగా సూచించారు రచయిత.

"బృహన్నల / శిఖండి
పేడి / కొజ్జా
నపుంసక / అంగనక
ఉదంబర / షండ

శంఠ / ఊబ
పోట / హిజ్రా
.....
ఎన్నిపేర్లు పెట్టినా
ఎంత హేళన చేసినా
సహించాల్సిందే తప్ప
మూడో కన్ను తెరవకూడదు!

(మూడోమనిషి పుట: 37)

బృహన్నల, శిఖండి, పేడి, కొజ్జా.... మొదలైన ఎన్ని పేర్లతో పిలిచనా ఎంత హేలన చేసిన ఎవ్వరిని ఏమన కూడదు అన్నీ సహించుకోవాల్సిందే అంటూ నపుంసకుల మనోవేదనను తన కవితద్వారా తెలియజేసారు రచయిత ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు.

"ఎందుకూ పనికిరానివారిగా ముద్రవేసి
దౌర్జన్యంగా భిక్షాపాత్ర చేతిలో పెట్టి
అడుక్కోవడానికి అనుమతిచ్చేశారు!

(మూడోమనిషి పుట: 37)

వీరిపట్ల అందరికీ చులకనభావం, అసహ్యం ఉండడం వల్ల ఎవరూ కూడా ఉపాధి ఇవ్వకుండా, చేరదీయకుండా ఎందుకు పనికిరాని వారిలా తయారుచేసి భిక్షమెత్తుకోవడం తప్ప వేరేదారి లేకుండా చేసి వారి కలలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా తయారుచేశారు. మూడోరకం మనిషిలో కూడా ఎంతో తెలివైనవారు ఉన్నప్పటికి వారి తెలివిని బయటపెట్టడానికి తగిన అవకాశాలను ఎవరూ ఇవ్వలేకపోయారు. చివరికి వారి కలలన్నీ వారిలోనే సమాధైపోయి భిక్షమెత్తడంలో బిజి అయిపోయారంటూ వారి దీనస్థితిని తెలియజేశారు.

"అన్తిపాస్తులకోసం కాదు
తృతీయశ్రేణి పౌరులుగా గుర్తింపుకోసమే ఆరాటం!
ఆడామగా చేసిన తప్పుకు
ఆడామగా కాకుండా పోయారు!
ఎవరిదితప్పు
ఎవరికి శిక్ష!
మూడో మనిషిని / మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని / ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి!

(మూడోమనిషి పుట: 38)

మాకు ఏ ఆస్తులు, పాస్తులు అవసరం లేదు. మమ్మల్ని తృతీయశ్రేణి పౌరులుగా గుర్తించడం చాలు. ఒక ఆడామగా చేసిన తప్పుకు ఆడామగా కాకుండా పోయిం. ఎవరో చేసిన తప్పుకు ఎవరికి శిక్ష? మమ్మల్ని కూడా మనుషులే అని గుర్తించండి అంటూ మీలో ఉన్న చులకన భావాన్ని తీసివేయండని వేడుకుంటున్నారని రచయిత కవిత ద్వారా వారి కాంక్షలను ఎంతో దయా నీయంగా చిత్రించారు.

అంటరానితనం :

మన సమాజాని శాపం అంటరానితనం. దీన్ని రూపు మాపడానికి ఎంతోమంది మహానుభావులు ఎన్నో ప్రయత్నాలు చేసినా గ్రామీణ ప్రాంతంలో ఇంకా అరాచకం కొనసాగుతూనే ఉంది. దళితులని అంటరానివారిగా భావిస్తూ వారిని దూరం పెడుతూ చులకనగా చూడడం నేటికి చాలా గ్రామాల్లో కనిపిస్తూనే ఉంది. అలాంటి వివక్షతపై మాడభూషిగారు తన కవిత ద్వారా ఈ అర్థంలేని వ్యవహారాల పట్ల ప్రభుత్వం కూడా ఎలాంటి ఇస్తుందో పక్కా ఇళ్ళ కవిత ద్వారా రచయిత పాఠకులకు తెలియజేశారు.

"పక్కా ఇళ్ళు తప్ప
పక్కనే ఇళ్ళు కట్టలేకపోయారు
అంటరాని విషయంలో
అంటే ముట్టనట్టున్నారు!"

(మూడోమనిషి పుట: 49)

అంటరానితం అనేది ఒక మూఢవిశ్వాసం. తోటి మనిషిని మినిషిగా చూడలేని మూఢవిశ్వాసం. అంటరాని తనం అనాదిగా మన సమాజంలో కొనసాగుతూనే ఉంది. పూర్వం హిందూమతంలోని చతుర్వర్ణ వ్యవస్థ

అనేది ఉండేది. కాని ఈ రోజుల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, వర్ణలలో తేడా తగ్గినప్పటికి శూద్రుల పట్ల ఈ సాంఘిక దూరాన్ని అంటరానితనంగా ఇప్పటికి పాటిస్తు న్నారు. గుళ్లు, గోపురాల్లో ప్రవేశం కల్పించిన గ్రామంలో తమతోపాటు నివాసం ఉంచుకోవడానికి ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం దయతో పక్కాఇళ్ళు ప్రకటి స్తుంది. కాని అది ఊరి బయటే కాని అగ్రవర్ణాల ఇంటిపక్కల మాత్రం కట్టుకోవడానికి, అందరూ కలిసి ఒకే ఊరిలో నివసించేలా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతూనే ఉంది. అని నాలుగువరుసల్లో వివక్షతకు గురౌతున్న దళితుల ఆవేదనను కవితారూపంలో చిత్రిస్తూ ప్రభుత్వం ఇంకెవరిపై అంటీముట్టనట్లెండురని తెలియజేశారు.

సుఖం దు:ఖం :

నేటి సమాజంలో ఒక వ్యక్తి మిక్కిలి ఆనందపడేది తాను అనుకున్నది సాధించినప్పుడే కాని అంతకన్న ఎక్కువ సంతోషించేది మాత్రం తన పక్కనున్న వాడు బాధపడితేనే! అదేస్థితి ఇప్పుడు తయారయ్యింది. తాను బాగుపడకపోయినా పర్లేదుకాని పక్కోడు బాగుపడితే మాత్రం ఓర్చుకోలేకపోతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి విషయం పట్ల ప్రతి ఒక్కరు సిగ్గుపడాలి. ఆలోచన ధోరణి మారాలని ఒకడు ఏదైనా సాధిస్తే ప్రోత్సాహాన్ని అందిచేలాగాని కుమిలి కుమిలి బాధపడ కూడదని అంటారు ఆచార్యా మాడభూషి సంపత్‌కుమార్ గారు.

"దు:ఖంమీదుగా
సుఖం సాగుతుంది
ఒకడి దు:ఖం
ఇంకొకడికి సుఖం"

(మూడోమనిషి పుట: 52)

మానవుని జీవితంలో సుఖదు:ఖాలు ఎప్పుడు ఎదురవుతూనే ఉంటాయి. సుఖాలవెంట దు:ఖాలు, దు:ఖాల వెంట సుఖాలు వస్తూనే ఉంటాయి. కాని మనిషి తన సుఖాలకన్నా ఇంకొకరు దు:ఖమే తన సుఖంగా వుండేలా తయారయ్యాడు. ఎంతటి ధారుణం.

సామాన్యుని జీవితం :

మానవుని కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ. అందులో మొదటిది కూడు. ఈ కూడును మననోటి వరకు రావడం రైతు శ్రమే అధికం. రైతులు తాము ఎన్నో కష్టాలు పడి సమాజానికి ఆకలి అనేది లేకుండా చేస్తున్నారు. ప్రపంచానికి భోజనం పెట్టువానికి భుక్తిలేదు అని గుర్రం జాషువా 'గబ్బిలం' అనే కవితా ఖండికలో తెలియజేసినట్లు అందరి ఆకలి తీరుస్తున్న రైతు మాత్రం తాను కడుపునిండా తిండిలేక కటిక పేదరికంతో జీవిస్తున్నాడు. అలాంటి రైతులను ప్రభుత్వ పరంగాగాని ఏ ఇతర వ్యవస్థలనుండి సహాయ సహకారాలు అందిస్తే రైతుల ఆత్మహత్యలు కొంతవరకైనా వ్యవసాయాభివృద్ధి జరిగి సమాజంలో కూటికి ఏడోకా లేకుండా జీవించడానికి ఎక్కువ అవకాశం ఉందని నా భావన. అలాంటి పరిణా మాలు జరగాలంటే ఖచ్చితంగా ప్రతి ఒక్కరికి రైతు సమస్యలు, వారు ఎదుర్కొంటున్న కష్ట నష్టాలను వారి జీవన స్థితిగతులను సమాజానికి తెలియజేయడం కవులు, రచయితల పాత్ర ఎంతో ఉంది. అందులో భాగంగానే రచయిత ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు రైతు సమ్యలను ఈ కవితా ఖండికలో తమదైన శైలిలో చిత్రిస్తూ తనవంతు పాత్ర పోషించినట్లుగా ఈ ఖండిక ద్వారా తెలుస్తుంది.

"మట్టిని పిసుక్కుంటూ
ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటూ
ఆవేదన చెందుతూ ఉన్నాడు
అప్పిచ్చినవాడు
అరుగుమీద కూర్చున్నాడు
పొలం ఎండిపోయి వెక్కిరిస్తోంది
ఆకాశం ఎండమావిలా ఉంది

పిల్లల కడుపులు కాయితం పొరల్లా అతుక్క పోయాయి."

(మూడోమనిషి పుట: 34)

వ్యవసాయాన్నే నమ్ముకుని జీవించే రైతుకు సరైన సమయంలో, సకాలంలో వానలు పడకపోవడంతో పంటలు పండక అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నాడని తినడానికి తిండిలేక పిల్లల కడుపులు కాయితం పొరల్లా అతక్కు పోయాయి అనడంలో ఎంతటి దారిద్రమైన జీవితాన్ని అనుభవిస్తున్నారో అర్థంచేసుకోవచ్చు.

"ప్రభువులకు జవాబుదారీతనం లేదు
మట్టిని నమ్ముకున్నవాడు
నట్టేట్లో మునగడానికి కూడా నీళ్ళులేవు
మట్టిని అమ్ముకున్నవాడు
మహారాజులా బతుకుతున్నాడు
తీసుకొన్న అప్పు అప్పణంగా
ఎరువుగా, విత్తనంగా
మట్టిలో ఎప్పుడో కలిసిపోయింది
అప్పుమాత్రం అభివృద్ధిచెంది
అరుగుమీద వచ్చి కూర్చుంది"

(మూడోమనిషి పుట: 34)

మట్టినే నమ్ముకొని జీవిస్తున్న రైతుకు పంటను పండించడానికి నీళ్ళులేక అప్పుచేసి తెచ్చిన ఎరువులు, విత్తనాలు బూడిదలో పోసిన పన్నీరు కావడంతో ఏమి చేయలేని స్థితిలో మిగిలిపోయాడు. అప్పు ఇచ్చినవాడు అరుగుమీద వచ్చి కూర్చుంటే అటుపంటలు పండక ఇటు అప్పులు తీర్చలేక ఏమి చేయలేక ఆత్మహత్యనే సరైన నిర్ణయం అని భావించి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రాజకీయ నాయకులకు మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా తమ స్వార్థాలనే ఆలోచిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారు. మట్టిని నమ్ముకున్న రైతును మట్టితల్లి మోసంచేసిందని రైతుల జీవితాలలో వున్న అలజడిని చాలా చక్కగా ఈ కవితలో బంధించారు రచయిత.

వలస :

మనుషులు తాము పుట్టి పెరిగిన ప్రాంతంలో సరైన వసతులు, ఉపాదులు లేక వలసలకి వెళ్తుంటారు. అలా వెళ్ళిన వారికి ఆ ప్రాంతంలో వారు ఎలా కష్టాలకు ఎదుర్కొంటారో. వారి గుర్తింపు ఏ విధంగా వుంటుందో వలస కవిత ద్వారా రచయిత పాఠకులకు తెలియజేశారు.

"అనది కాలంలో / నీళ్ళకోసం
ప్రారంభమయిన వలస
సొంతనేలమీద / కాళ్ళు నిలపడానికి
తావులేక / కొందరు
పట్టినగడ్డమీదే / వివక్షకుగురై
అణగారినవారు / కొందరు
పూటగడవడమే / గగనమై
పొట్టచేతపట్టుకొని / కొందరు
జన్మభూమిమీద / స్వేచ్ఛకోసం
పోరాడినందుకు / శిక్షగా
కొందరు
ఆస్తులు, అంతస్తులు / పెంచుకోవడానికి
మరికొందరు

(మూడోమనిషి పుట: 58)

మొదటగా నీళ్ళతో మొదలైన వలస మెల్లమెల్లగా సొంత ఊర్లో జీవించలేక కొందరు, వివిక్షితగురై కొందరు, ఉపాదులులేక పొట్టచేతపట్టుకొని కొందరు, ఎదురు తిరినందుకు బహిష్కరణగా కొందరు ఆస్తులు పెంచు కోవడానికి కొందరు ఇలా వలస మొదలయ్యాయని వలసకి చాలా ముఖాలున్నాయని తెలియజేశారు.

"ఎవరు ఎందుకు వెళ్ళినా
వలసవెళ్ళినచోట
రెండో వరుసలోనో
మూడో వరుసలోనో
చివరి వరుసలోనో
బిక్కుబిక్కుమంటూ

కూర్చోవాల్సిందే!

(మూడోమనిషి పుట: 58)

ముందుకురావడానికి
ప్రయత్నిస్తే
మరో వలస తప్ప
వరస మారదు"

(మూడోమనిషి పుట: 58)

ఇలా బతుకుదెరువు కోసం వలస వెళ్ళడం వల్ల వెళ్ళిన చోట సరైన గుర్తింపులేక ఎవరు ఏమన్నా ఎదురుతిరగలేక బిక్కుబిక్కుమంటు బ్రతుకుతున్నారు. ఒకవేళ ఎదురు తిరిగితే వారికి మరో వలస తప్ప ఇక్కడ న్యాయం మాత్రం జరగదు. అన్నింటికి సహనంతోనే సర్దుకుపోయి చాలా దీనమైన స్థితిని అనుభవిస్తున్నారని వలస బతుకుల్లో వున్న సమస్యలను ఈ కవితలో కళ్ళకు కట్టేలా చిత్రించారు రచయిత.

ప్రకృతి :

ఈ భూమిపై వున్న జీవరాశులు, చెట్టుచేమలు, నదీనదులు, సముద్రాలు, పర్వతాలు, కొండగుహలు, అరణ్యాలు మొదలైన వాటన్నింటిని కలిపి ప్రకృతి అనవచ్చు. ఇంతటి ప్రకృతిని మనిషి తన తెలివితేటలతో అరచేతిలో బంధించాననుకోవడం మూర్ఖత్వమని ప్రకృతి తన ప్రతాపాన్ని చూపిస్తే ప్రపంచమంతా ఉనికి కూడా లేకుండా పోతుందని రచయిత ప్రకృతి కవిత్వాన్ని తన ఖండిక ద్వారా తెలియజేశారు.

"ప్రకృతిని
ఎదిరించి
బెదిరించి
గుప్పిట్లో పెట్టుకొన్న మానవుడా
ప్రకృతి జూలు విదిల్చిందంటే
నీ టెక్నాలజీ
నీ టెక్నిక్కులు
టైటాన్‌లా కుప్పకూలిపోవలసిందే!"

(మూడో మనిషి పుట: 16)

మానవుడు తన తెలివితేటలతో ఎన్నో టెక్నిక్కులతో ప్రపంచాన్ని తన గుప్పిట్లో బంధించే ప్రయత్నంలో చాలా బిజీగా ఉన్నాడు. ప్రకృతి నిశబ్దంగా వున్నదని భావించక తన ప్రయోగాలు ఫలించాయని కుప్పిగంతులు వేస్తు న్నాడు. కాని ఒక్కసారిగా తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తే తన ప్రయోగాలు తన టెక్నిక్కులు అన్నీ కూడా ప్రకృతిలో కలసిపోవాల్సిందే అంటారు రచయిత. ఎన్ని పరికరాలు కనిపెట్టిన ఎన్ని ప్రయత్నాలు చేసినా భూకంపాలు, సునామీలు లాంటివి వచ్చినప్పుడు ఆ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా ఉపయోగం లేకుండా పోతుందని రచయిత తెలియజేశారు.

ఒకవాన :

వర్షంకోసం అందరూ ఎదురుచూస్తూ వుంటారు. ఎందుకంటే జీవకోటి బతకాలన్న, పంటలు పండాలన్న ఏ పనికైనా నీళ్లు అవసరమే ఎక్కువ. ఈ వర్షాలే లేకపోతే కరువుతో ఆ ప్రాంతం పేదరికంలోకి నెట్టబడి అనేక పరి ణామాలకు దారితీస్తుంది. కాబట్టి అనేక కారణాల చేత వర్షం పడాలని ప్రతీ ఒక్కరు ఆశాభావం వ్యక్తం చేస్తారు. కాని అది ఎంతవరకి పడాలో అంతవరకే పడితే అందరికీ సంతోషం ప్రయోజనం కూడా కాని అలాకాకుండా విపరీత మైన వర్షం పడితే అతివృష్టి, ఇటు సరిగ్గా వర్షం పడకపోతే అనావృష్టి. అతివృష్టి, అనావృష్టి రెండూకూడా ఆ ప్రాంతంపైన విపరీతమైన ప్రభావం చూపి అనేక సమస్య లకు దారితీస్తుంది. అలాగే వర్షాలు ఎక్కువ పడడం వలన ఆస్థినష్టం, ప్రాణనష్టం కూడా జరిగిన సంఘటనలు కూడా అధికంగానే ఉన్నాయి. అలా ఒక పెద్దజడివాన ఒక ప్రాంతాన్ని ఎలా కృంగదీసిందో రచయిత ఒకవాన అనేక ఖండికలో కళ్ళకు కట్టినట్లు చూపించారు.

"ఒకే ఒక వాన / ఒకే ఒక రాత్రి
పగలంతా కురిసిన వానకు
మురిసిపోయిన వాళ్ళు
రాత్రికి రాత్రి కొంపముంచుతుందని
పసిగట్టలేకపోయారు

ఎప్పుడూ వానకన్నెరగనివారు
ఆకాశం ఇంతగా ప్రేమ ఒలకబోస్తున్నప్పుడే
సందేహపడాల్సింది / అమ్మ ప్రేమకు
చిన్నమ్మ ప్రేమకు / తేడా తెలియక
గోలపాటకు / లాలిపాటకు
భేదం గుర్తించలేక / నిద్రలోకి జారుకున్నారు-
మళ్ళీ లేవనివాళ్ళు
తేలి మునిగిపోయినవాళ్ళు
మునిగిపోయినవాళ్ళను చేసి / పుట్టెడు దు:ఖంలోకి
జారుకున్నవాళ్ళు"

(మూడోమనిషి పుట: 31)

ఒకవాన ఎన్నో కుటుంబాలకి రోదనను మిగిల్చింది. ఎన్నో కుటుంబాలను వీధిన పడేలా చేసింది. ఎంతో మందిని అనాదులను చేసింది. ఎంతోమందిని పొట్టన బెట్టుకుంది. ఎన్నడూ లేని వర్షం తమ గోడు విని తమని ప్రేమగా పలకరిద్దామని అనుకున్న జనాలకి తల్లిప్రేమ లేక చిన్నమ్మ ప్రేమను తెలుసుకునేలోపే జరగరాని నష్టమంత జరిగిపోయింది. అంటూ రచయిత ఆ దయనీయమైన నన్నివేశాన్ని కళ్ళముందు కదిలేలా తెలియజేశాడు.

"మొదటిరోజు నీళ్ళు ఆకాశానిది
రెండో రోజు నీళ్ళు కన్నీటిది
మొదటి రోజున ఊరుమునిగితే
రెండో రోజున జీవితం మునిగింది
ఊరంతా నీళ్ళున్నా
జనం కన్నీళ్ళు తాగి బతికారు!

(మూడోమనిషి పుట: 32)

అతి అనర్థాలకు దారి అన్నమాట నిజమే. ఈ అతివృష్టి వల్ల రోజులు గడుస్తున్నకొద్ది జనాలలో భయభ్రాంతులు ఎక్కువయ్యాయి. తినడానికి తిండిలేక, తాగడానికి నీళ్లు లేక ఉండడానికి ఇల్లు లేక జనాలు అష్టకష్టాలు అనుభవిస్తూ నీళ్ళలోనే బిక్కుబిక్కుమంటూ తమని రక్షించమని దేవున్ని ప్రాధేయపడతారు. బాధతో వస్తున్న కన్నీళ్ళను తప్ప ఇంకెవరు జీవించడానికి ఎలాంటి ఆహారం తీసుకునే స్థితిలో తన పరిస్థితి ఏర్పడింది.

"ఆకాశం ఇంతగా భోరున వర్షించాల్సిన అవసరం
/ భూమి ఇంతగా విలపించాల్సిన అవసరం
ఎవరికీ అంతుబట్టలేదు!
మళ్ళీ ఎండాకాలం వచ్చినా
ఎవరూ వాన కావాలని మాత్రం
ధైర్యంగా అడగరు!
ఒకే ఒక వాన
మనిషిని ఎంతగా మార్చేసింది!"

(మూడోమనిషి పుట : 32)

ఇంతగా విలపించాల్సిన అవసరం ఎవరికీ అంతు బట్టడం లేదు. ఈ దెబ్బకి మళ్ళీ ఎండాకాలంలో కూడా వర్షాన్ని కోరుకునేలా లేడు అంటూ వర్షం యొక్క ప్రతాపం మానవుని మనస్సును ఎంత బాదకు గురిచేసిందో ఈ ఖండిక ద్వారా రచయిత తెలియజేశారు.

అలాగే ఏడ్చినట్టుంది వాన అనే కవితా ఖండికలో కూడా రచయిత వర్షం యొక్క తీవ్రప్రభావం చెన్నై మహా నగరాన్ని ఎలా వణికిస్తుందో ఈ కవిత ఖండికను చూస్తే అర్థమవుతుంది. డ్రైనేజీ రోడ్లు ఇళ్ళకంటే ఎక్కువ ఎత్తులో ఉండడం మొదలైన అనేక రకాల అంశాలు మహా నగరంలోని ప్రజలను పలు ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రభుత్వం వీటిపట్ల చర్యలు చేపట్టి డ్రైనేజి సమస్యలాంటి పలు రకాల సమస్యలపై స్పందించి పలు చర్యలు చేపడితే ధననష్టం, ప్రాణనష్టం వుండకుండా కొంత వర్షపాతం యొక్క తీవ్రతను తట్టుకోగలమని నా అభిప్రాయం. సమస్య కొంతవరకన్నా తగ్గుముఖం పడుతుందని నా భావన.

ఇలా చెప్పుకుంటూ పోతే ఈమూడో మనిషి కవితలో రచయిత ప్రకృతి మొదలు మనిషి పుట్టుక, చావుల మధ్య అనుభవిస్తున్న ప్రతి చిన్న విషయాన్ని కూలం కుషంగా తెలియచెప్పారు. ప్రకృతిలో ఏదీ కూడా శాశ్వతమైనది లేదు అనడానికే అప్పుడప్పుడు ప్రకృతి తన

ప్రతాపంను చూపిస్తూ ఉంటుందని ఆయన మరోమారు తన కవిత ద్వారా సమాజానికి గుర్తు చేశారు. ప్రకృతిలో మనిషి కూడా ఒక భాగమే. అంతమాత్రం చేత ప్రకృతిని మనిషి జయించినట్లు కాదంటారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి అన్నింటా ఎదుగుతున్నప్పటికీ మనిషిలో ఉండాల్సిన ప్రేమ, కరుణ, దయ, జాలి, మానవత్వపు విలువలు నానాటికి క్షీణిస్తున్నాయని వాటిని వ్యక్తిలో పెంపొందింపజేసే శక్తి కావ్యాలకు మాత్రమే ఉంటుందంటారు. భారతీయులు పవిత్రంగా భావించే రామాయణం, భారతం, భాగవతంలోని సారాంశాన్ని చిన్న వయస్సు నుండి పిల్లలకు నేర్పించినప్పుడే పెరుగుతున్న పిల్లవాడితో పాటు మానవత్వపు విలువలు కూడా పెరుగుతాయి. అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సదస్సు ద్వారా ఆచార్య మాడభూషి సంపత్‌సార్ గారి గురించి, వారి రచన గురించి ఎంత చెప్పినా తక్కువ అనటంలో అతిశయోక్తి కాదు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'జీవితం-కవిత్వం' వస్తువైవిధ్యం

- సౌంకం నాగరాజు, తెలుగు అధ్యాపకులు, శ్రీ శిరిడి సాయి డిగ్రీ కళాశాల, వరదయ్యపాళెం.

మనిషి సంఘజీవి. ఇంకో మనిషి మమతా, భుజం మీద చెయ్యేసే స్నేహము, అభిమానం పెల్లుబిగితే ఆలింగనమూ ఇవన్నీ మనిషికి అవసరం. అలాగే అభిప్రాయాలు, ఆలోచనలు కూడా అవన్నీ మా గురువు ఆచార్య సంపత్‌కుమార్ గారిలో ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అతిశయోక్తి అంతకన్నా కాదు. యత్నం-ప్రయత్నం-ఫలప్రదం అన్నారు పెద్దలు. ఇదే విషయాన్ని గట్టిగా నమ్మిన వ్యక్తి, రచయిత ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. అందుకనే కాబోలు జీవితం-కవిత్వం అన్న రెండు పదాలలోని నిగూఢార్థంను 108కవితలతో "జీవితం-కవిత్వం" అన్న కవితా సంపుటిని వెలువరించి అందరి మన్ననలను పొందారు. ఒక్క జీవితం-కవిత్వమే కాక ఆలోచనలు, శత్రువుతో ప్రయాణం, చివరకు నువ్వే గెలుస్తావ్, మూడో మనిషి, వికారి, మొదటి అబద్ధం వంటి రచనలను ఆయన చేశారు. తన కలం నుండి జాలు వారిన ఒక్కొ కవితా సంపుటిలో ఒక్కొ వస్తువుతో రచనలు చేపట్టి తనలోని విన్నూత ఆలోచనలకు (కొదవ)తావులేదని చాటుకున్నారు.

సూర్యుడు ప్రవేశించ లేని ప్రపంచంలోకి కవి ప్రవేశించ గలడు. కాబట్టే "రవి కనని కవి యెరుగును" అన్నారు. అందుకే కాబోలు ప్రకృతిలోని ప్రతిదీ కవికి ఎలా ఇష్టం అయితే అలా మారిపోతుందనడంలో ఏలాంటి సందేహం లేదు. అలాగే 'జీవితం-కవిత్వం' కవితా సంపుటిలో ఆరెండింటికి గల అన్యోన్య సంబంధమును, వైరుధ్యమును అనేక చోట్ల చెప్పి మెరిపించారు రచయిత సంపత్‌కుమార్ గారు. "కవిని కన్న తల్లి గర్భంబు ధన్యంబు" అని జాషువా గారు చెప్పినట్లు తాను వ్రాసిన మొదటి రచనను తన తల్లిదండ్రులైన మాభూషి శ్రీనివాసాచార్యులు, మాడభూషి పట్టమ్మలకు అంకితమిచ్చి తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణంను కూడా తీర్చుకోవడంతో పాటు జాషువా గారి అక్షరరూపానికి ప్రాణం పోశారు. ఇక విషయానికి వస్తే రచయిత మొదటి రచన అయిన "జీవితం-కవిత్వం వస్తు విశ్లేషణ" అను దానిని నా కవితా శీర్షికగా తీసుకుని కొన్ని కవితలను మాత్రమే ఉదహరించుచున్నాను. ఇందులో తప్పులు ఏవైనా దొర్లితే సరిదిద్ది నా అభ్యున్నతికి భాటలు వేయ గలరని ఆశిస్తున్నాను.

జీవితం - కవిత్వం వస్తువిశ్లేషణ :

ప్రకృతిలో జీవం ఉన్న వాటిలో మనిషికి ఉన్న ప్రత్యేకత మరే జీవికి లేదు. అలాంటి మానవ జీవిత యానం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంటుంది. ఈ ప్రయాణంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అతిక్రమించి మానవుడు తన జీవనంను కొనసాగిస్తుంటాడు. అందుకనే వ్యక్తికీ వ్యక్తికి మధ్య ఆలోచన ధోరణిలో భిన్నత్వం ఉంటుంది. ఈ జీవితం-కవిత్వ కవితా సంపుటిలోనూ ఇలాంటి వాగార్థాలు ఇచ్చే వాక్యాలు మనకు కనబడుతాయి. ఈకవితల్లో జీవితానికి, కవిత్వానికి గల అవినాభావ సంబంధం కనబడుతుంది. 'జీవితాన్ని విడిచిపెట్టి కవిత్వం ఎలా రాస్తావ్, కవిత్వానికి తెలియకుండా జీవితాన్ని ఎలా దాస్తావ్?' అన్న ప్రశ్నార్థకంను బట్టే జీవితానికి, కవిత్వానికి గల అవినాభావ సంబంధం మనకు తెలుస్తోంది. జీవిత అనుభవాలను పక్కన పెట్టి కవిత్వం రాయడం కుదరదు. కాబట్టి జీవితాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి. మనిషి సముద్రానైనా ఈదగలడు కానీ జీవితాన్ని ఈదను లేడు అన్నట్లు 'సముద్రాన్ని గురించి ఆలోచించు! జీవితాన్ని అందులో దించు !' (3) సముద్రం తన అలలను ముందుకు తీసుకొచ్చినంత సమయం పట్టదు తిరిగి వెనుకకు వెళ్ళడానికి అలాగే

మనిషి జీవితంలోనూ కష్ట, సుఖాలు. మనిషి ఏం సాధించినా, సంపాదించినా జీవితం గమనంలో ఏదో తెలియని వెలితి కనబడుతూనే ఉంటుంది. 'దారి తప్పిన జీవితానికి - కవిత్వం వెలుగు చూపిస్తుంది- గురి పెట్టిన కవిత్వానికి - జీవిత లక్ష్యమై నిలుస్తుంది' (19)అనడంలో జీవితంలో మనిషి ఎటువైపు ప్రయాణిస్తున్నాడో తెలియక పోవచ్చును కానీ ఆ మనిషిలో మంచి, మానవత్వం, ప్రేమ, వాత్సాల్యం అన్న భావనను నింపగలిగే శక్తి ఒక కవిత్వంకు మాత్రమే ఉందనేది ప్రగాఢ విశ్వాసం. ఇన్ని లక్షణాలతో ఉన్న కవిత్వం ప్రతి వ్యక్తి జీవితానికి ఒక లక్ష్యంను ఏర్పరుస్తుందనే ధృడ విశ్వాసం. ''జీవితమొక ఆకాశం - కవిత్వమొక సముద్రం

అందుకోనూలేం - ఈదనూలేం''. (63)

జీవితమొక ఆకాశం అనుకున్నప్పుడు అంత ఎత్తుకు ఎదగడం అసాధ్యం. అలాగే కవిత్వము ఒక సముద్రమైతే, కవిత్వాన్ని అంత లోతులోనికి తీసుకెళ్ళడం కూడా అసాధ్యం. కానీ మనిషి ఆరెండింటి కోసం నిరంతరం ప్రయత్నం కొనసాగిస్తూనే ఉంటాడన్నది మాత్రం నిజం.

'పిల్లలు-కవిత్వం / పెద్దలు-జీవితం / కవిత్వమే పెరిగి / జీవితమౌవుతుంది(67) అనడం ద్వారా మనిషి జీవన విధానంలోని పరిణామక్రమాన్ని తెల్పడం జరిగింది. మొక్కై వంగనిది మానై వొంగునా అన్నట్లు. పిల్లలకు చిన్నతనంలో చుట్టూ కల్పించే వాతావరణం, తల్లి దండ్రులు, గురువులు నేర్పించే మంచి విలువలే వారి బంగారు భవిష్యత్తుకు భాటలు వేయగలుగుతుంది. అలాంటి ఏవీ పిల్లలకు అందివ్వనప్పుడు ఓ మంచి జీవితాన్ని కూడా అందివ్వలేమన్నది అందరికి తెలిసిందే. ప్రతి వ్యక్తి జీవితంలో వెలుగు, నీడలు(చీకటి) రెండూ ఉంటాయి. జీవితం నీడలోకి చేరుకున్నప్పుడు పోరాటం తప్పదు. అందుండి పుట్టిన దేనికైనా (కవిత్వం, ఆలోచన, లక్ష్యం) సరే ఆరాటం తప్పదు. దీనిలో వెటకారానికి ఎక్కడా ఆస్కారం లేదు. అందుకనే ఒక చోట ఇలా చెబుతారు. 'జీవితానికి పోరాటం తప్పదు / కవిత్వానికి ఆరాటం తప్పదు / జీవితానికి కవిత్వానికి / వెటకారం నప్పదు'(22). ఏ ఆటలోనైనా గెలుపు, ఓటమి అనేవి ఉంటాయి. కానీ మనిషికి కోర్కెలు అనంతం. జీవితం అనే పెనుగులాటలో మనిషికి మాత్రం గెలుపు తీరని దాహంలా మిగిలిపోతుంది. అలాగే కవి ఎన్ని కవ్వింతలు గుప్పించినా ఏదో తెలియని వెలితితో ఏదో చెప్పాలనే స్పృతో ఆరాటపడుతూనే ఉంటాడని గెలుపు దాహం తీర్చనది ఏదైనా ఆట కాలేదని అందూ ఇవి రెండూ కూడా ఆటలు కావంటూ

'కవిత్వం ఒక ఉబలాట / జీవితం ఒక పెనుగులాట / రెండూ ఆటలు కావు' (23) చెబుతారు.

ఓటమి గెలుపుకు పునాది లాంటిది. అలాగే కవిత్వం రాయాలంటే జీవితంను చదవాలి. జీవితంను చదవాలంటే కవిత్వంను ఆస్వాదించాలంటూ సరళమైన భాషలో ఒక చోట ఇలా చెబుతారు. కవిత్వం రాయడానికి ముందు / జీవితాన్ని చదవాలి! / జీవితాన్ని చదవడానికి ముందు / కవిత్వంలో ఎదగాలి!(2) ఎప్పుడూ మన కళ్ళెదురుగానే ఉండే ఓ రాయిని శిల్పి తన ఉలి దెబ్బలతో (శిల్పం) చక్కని రూపాన్ని ఇచ్చి దానికి ప్రాణం పోస్తాడు. అలా ఒక రూపాన్ని ఏర్పరుచుకున్న ఆ శిల్పం(రాయి)నే మహిమ గల దేవునిగా, దేవతగా కొలుస్తాం. స్వార్థం, ద్వేషం, ఓర్వలేనితనం, పగ, ప్రతీకార వాంఛలతో జీవితాన్ని ఓ శిలగా మార్చుకున్న మనిషిని, మనిషిగా తీర్చి దిద్దుతూ వానిలో అప్పటి వరకు ఉన్న దుర్గుణాలను తొలగించి మానవత్వం, పరోపకారగుణం, మంచి విలువలను నింపగలిగే శక్తి ఓ కావ్యానికి మాత్రమే ఉంటుందనే విషయాన్ని మన పురాణా గ్రంథాలు నిరూపితం చేయ బడ్డాయి. 'జీవి ఉలితో రాతిని శిల్పం చేస్తాడు !

కవి శిల్పంతో కవిత్వానికి జీవం పోస్తాడు!'.(83), 'జీవితం శిల - కవిత్వం శిల్పం'.(107)

ఒక చోట ''జీవితం ముళ్ళబాట అయితే కవిత్వం మల్లెతోట అంటారు'' శిలగా ఉన్న కవిత్వాన్ని చెక్కితే

అందంగా, - శిల్పంగా రూపుదిద్దుకుంటుంది. మనిషి ఆలోచన ధోరణిలో మార్పు వచ్చి అటుగా అడుగులు వేయగల్గితే మహాత్ముడుగా చరిత్రలో నిలిచిపోగలడు. చరిత్ర కూడా అదే చెబుతుంది.

గమ్యం స్థానం తెలియని ఓ బాటసారి తన ప్రయాణంలో అలసిపోయినప్పుడు ఏలాగైతే చెట్టును ఆశ్రయించి సేద తీరుతాడో అలాగే మనిషికి కూడా గమ్యస్థానం తెలియ జీవితపు రహదారిలో తల్లి దండ్రులు, భార్య, కుమారుడు, కుమార్తె, మనవడు, మనుమరాళ్ళు, చదువు, ఉద్యోగం, సంపాదన అంటూ జీవితంలో నిరంతరం పరుగులు తీస్తూ అలసిపోయి, విసిగిపోయిన ఆ మనిషికి నేనున్నాను తోడంటూ భరోసాను కల్పించేది కావ్యాలేనని చెబుతారు. 'జీవితపు రహదారిలో - సేద తీర్చే చెట్టు కవిత్వం'. (108) "రాజు మరణించే నొక తార రాలిపోవు... కవి మరణించే నొక తార నింగికెగసే... రాజు నిద్రించు రాత్రి విగ్రహముల యందు...సుకవి జీవించు ప్రజల నాల్కలయందు" అన్నాడు ఓ కవి(జాషువా).. అది ఎంత అక్షర సత్యమో ఈ కవితా సంపుటిలో ఓచోట "చివరకు పోయేది జీవితం - చివరి వరకు నిలిచేది కవిత్వం"(65) అని చెప్పడంలో కూడా అంతే నిజం ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మనిషి తన జీవిత కాలంలో ఎంత సాధించాడు అనడం కన్నా.. ఎంత కాలం జీవించగలిగేలా జీవితాన్ని మలుచుకో గలిగాడు అన్నదే ముఖ్యం.

'కవిత్వమొక శక్తి / జీవితమొక యుక్తి / రెండూ కలిసి నడవడం ముక్తి'.(72) అనడంలో కవికి కవిత్వంపై ఉన్న ప్రేమ, నమ్మకం, జీవితం పట్ల ఉన్న దార్శినికత ఉట్టే ఉట్టిపడుతుంది. మరో చోట 'జీవితానికి అర్థం ముఖ్యం - కవిత్వానికి పరమార్థం ముఖ్యం'.(50) మనిషి జీవితంలో బ్రతకాలంటే అర్థం(ధనం) ఎంత ముఖ్యమో ఓ కావ్యం అన్నీ కాలాలలో వెలుగొందాలంటే ఆ కావ్యంలో జీవితాన్ని చేధించగలిగే పరమార్థంను తెలియజేయడం ముఖ్యమంటారు.

ఎడారి చుట్టుపక్కల నాగరికత నిలబడడానికి, ఎడారుల గుండా ప్రయాణాలకు ఒయాసిస్సులు చాలా ముఖ్యమైన పాత్రను కలిగి ఉంటాయి. అలాగే మనిషి జీవితంలో ఎదరయ్యే ఎత్తు పల్లాలను జయించాలన్న, మనిషిలో కొరవడుతున్న ప్రేమ, కరుణ, జాలి, మాన వత్వంను పెంపొందించాలన్న అది ఒక కావ్యానికి మాత్రమే ఉంటుందనే అభిప్రాయంను

"జీవితం ఒక ఎడారి / కవిత్వం ఒక ఒయాసిస్సు"ని తెలుపుతారు. అంటే భావితరాలకు విలువలతో కూడిన సంస్కృతి సాంప్రదాయాలను వారసత్వంగా అందివ్వా లంటే బ్రతుకు ఎడారిలో ఒయాసిస్సులు సృష్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటారు. ఇంకా చెప్పుకుంటూ పోతే ఈ "జీవితం - కవిత్వం" కవితా సంపుటి నిండా ఇలాంటి తాత్విక భావాలను నింపుకున్న ముక్తకాలు ఎన్నో! అయితే జీవితానికి కవిత్వానికి మధ్య గల అంతర్గత సంబంధాన్ని విశ్లేషించడానికి పూనుకోవడం వల్ల కొన్ని సూక్తలు గానూ, నిర్వచనాలు గానూ, వ్యాఖ్యానాలుగాను అనిపించవచ్చు. ఈ కవితా సంపుటి అసాంతం 'జీవితం - కవిత్వం' అన్న ఒక్కదానినే కవితా వస్తువుగా స్వీకరించి వ్రాయడం వలన మనకు అలా కనిపించడం సహజమే.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి - మూడోమనిషి

- తేళ్ల అరుణ, అధ్యక్షురాలు, నవ్యాంధ్ర రాష్ట్రరచయిత్రుల సంఘం .

డాక్టర్ శ్రీమాడభూషి సంపత్‌గారు స్వతహాగా ఎంతో సంస్కారమున్న వ్యక్తి చదువుతోపాటు సుగుణాలను, సాహిత్యం పాటు ఔన్నత్యాన్ని జత చేసుకొని ఎదిగి ఒదిగిన సాహితీ మూర్తి. సున్నితమైన మనసు, చక్కని వాచకం, ఆత్మీయత ఆయన సుగుణాలు, తన వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకుంటూ, సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న సంపత్‌కుమార్ గారి సాహితీ వనంలో నాకు నచ్చిన కొన్ని సుమ పరీమళాల్ని మీముందుంచు తున్నా! మూడోమనిషి కవితా సంపుటిలో "మహాఆత్మ ఘోష" కవితలో "మార్చురీగదుల్లో శవాలు వేదమంత్రాలు వింటున్నాయ్" ఒక్క శవాలు మాత్రమే శాంతిని అనుభ వించగలవని, నిత్య జీవన సంఘర్షణలో శాంతికి స్థానం లేదని కవివేదన.

అర్ధరాత్రి జాబిలి జంటగా ఉన్నా, నడవటానికి జంకు తోంది చీకటి. చంద్రుణ్ణి మబ్బుల క్రింద కుక్కేసి, చీకటితో స్వైరవిహారం చేస్తున్నారు. "ఇంద్రుడు సింహసనం మీదే ఉన్నాడు. రుషులు శాంతి వేదం పఠిస్తూనే ఉన్నారు". అధికార దాహం క్రింద నలిగిపోతున్న ప్రజల్ని, వారి శాంతి సౌఖ్యాలు కాజేస్తున్న పాలకుల దౌష్ట్యాన్ని ఈ కవితలో తనదైన శైలిలో ఇమిడ్చారు.

"కవిత్వం" అనే కవితలో కవిత్వంలో మడి ఉంటేనే సరిపోదు, అందులో తడి ఉండాలని చెప్పారు. కవి బాధ్యత అక్షరాస్యత పెంపొందించడం అని చెప్పారు. అందలాలు ఎక్కడం కాదు, అందర్నీ పైకి తేవాలి అనే సందేశం ఇచ్చారు.

"ప్రయాణం" కవితలో ఎవరు ఎపుడు, ఎక్కడ దిగుతారో తెలియని ఈ జీవన ప్రయాణంలో, ఈ ఉరుకులెందుకు, పరుగులెందుకు, ప్రయాసలెందుకు అంటారు. ప్రయాణం ముగిసేలోపు నువ్వేమిటో ఎదుటివారికి అర్థమైతే చాలు అంటారు.

అలాగే "బాధ" అనే కవితలో బాధల్ని కొత్తరకంగా చెప్పారు కవి. అవతలివాడు ఏదో సాధించినపుడు మనకు ఏడుపు, అవతలివాడు బాధపడితే మనకు ఆనందం. ఎంతమంది ఏడిస్తే నీ కళ్లల్లో అన్ని ఆనందభాష్పాలు, అని నేటి సామాజిక మానసిక స్థితిని వర్ణించారు. ఇది చాలా గొప్ప భావం. నిజమైన ఆనందాన్ని వెతుక్కోవడంలో విఫలమైన మనిషి, ఎదుటి వాడి ఏడుపులో తన ఆనం దాన్ని వెతుక్కొనే స్థితికి దిగజారాడు అని చెబుతారు. తనకే కాదు ఎదుటివాడి కూడా ఏడుపుంది అనే భావనతో మనసుని జోకొట్టు కుంటున్నారని చెబుతారు.

"తల్లి" కవితలో తల్లీ, బిడ్డల మధ్య పెరిగిన దూరాన్ని తెలియజేసారు. ఒకతల్లి పదిమంది పిల్లల్ని కనిపెంచి పోషిస్తుంది. కానీ పదిమంది పిల్లలు ఒకతల్లిని పోషించలేక పోతున్నారు, అందుకే తల్లి ఒక బిడ్డతో సరిపెట్టు కొంటోంది. అనల్పమైన మాటలలో అత్యంత బరువైన భావాన్ని చూపించగలిగారు కవి.

ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త పరిపాలకుడు అయిన లెనిన్‌గారి గురించి వ్రాస్తూ, ఆయన విగ్రహం ధ్వంసం చేస్తే మాత్రం ఏం? జనం గుండెల్లో ఉదయించాడు. మరణించి కూడా జీవించాడని లెనిన్‌పై తనకున్న ప్రేమను తెలియజేసారు.

తప్పతాగే వాణ్ణి మార్చగలం. కానీ తప్పు చేసేవాణ్ణి మాత్రం మార్చలేం.వాడికి సమర్థించుకోవడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని చెబుతారు "తప్పు" కవితలో. నిజమే ఈ రోజు ప్రతి నేరస్తుడు తన తప్పును సమర్థించుకుంటూ, సమాజాన్ని వేలెత్తి చూపిస్తున్నాడు. ఇక ఆయన "ఆలోచనలు" పుస్తకంలో మాటకోసం పోట్లాట తెలుగు వారికే తేటగీత. 1956 నవబర్ 1. అలాగే చీలిపోయిన కమ్యూనిస్టు పార్టీ గురించి... చీలికలకు పునాది..

సిద్ధాంతానికి సమాధి 1964 ఏప్రియల్ ఒకటి అని వ్యంగాస్త్రాలు సంధించారు, కమ్యూనిస్టు పార్టీ చీలికపైన, పూచినపూలన్నీ గుడికి చేరవు. పెళ్లికాని ప్రేమికులు అంతే... అంటే ప్రేమ ఫలిస్తేనే, అది వివాహ వ్యవస్థలో ఇమిడి నపుడే, దానికి పరమార్థం అని ఆయన ఉద్దేశ్యం. పెళ్లిళ్లు దాకా వెళ్లని ప్రేమలు, గుడికి చేరని పువ్వు లాంటివి అని చిన్న వాక్యాలలో, ఒక వ్యవస్థనే ఇమిడ్చారు. కొండకరిగి సముద్రంలోకి జారుకుంది. అది ఉప్పు సత్యాగ్రహం అన్నారు.ఉప్పుసత్యాగ్రహం ఉద్యమాన్ని కొండంత ఔన్నత్యంతో పోల్చారాయన.

ఆవులకు అన్నం లేదు - నాయకులు గడ్డి తిన్నారు అని లాలూ గెలుపు గురించి ఎగతాళి చేసారు. కొనేవాడికి అమ్మేవాడు లోకువ - దళారివాత పడ్డ రైతు అన్నారు. ఇంకా భిక్షగాడు వెళుతున్నాడు, జోలెనిండి పోయింది దుర్భిక్షుడైనరైతు అంటారు. ఇక్కడ రైతుకంటే భిక్షమెత్తు కొనేవాడే నయమని ఈ దేశంలో రైతాంగం హీనస్థితిని తెలియజేసారు.

దేశమంటే మనిషి కాదోయ్ - దేశమంటే మట్టోయి, భూబకాసురులే... అంటూ భూకబ్జాల మీద మాటలు విసిరారు.

విషాదాశ్రు తుషారాలులో... మైత్రీవనంలో ఒకపువ్వు మాయమయ్యింది. స్నేహితురాలిపెళ్లి పెళ్లితో ఆడ పిల్లలకు స్నేహితులు బంధువులు అన్నీ దూరమై కేవలం ఒక బాధ్యతల బంధీగానీ మిగిలిపోతుందని అంతర్లీ నంగా చెప్పారు.

మనుషులకే కాదు, మానవత్వానికి కూడా మరణం ఉంటుందా? అని మధర్ థెరిస్సా మరణం గురించి ఆవేదన పడ్డారు. నరికేసిన కొమ్మ కొడవలై మొలు స్తుంది. అదే దళిత చైతన్యం అంటూ దళితుల ఆత్మ గౌరవ పోరాటాన్ని వినూత్నంగా చెప్పారు.

ఇక 'జీవితం' కవిత్వంలో... జీవితాన్ని వదిలిపెట్టి కవిత్వాన్ని ఎలా వ్రాస్తావ్, ఇది సాధారణ వ్యక్తీకరణే! కానీ కవిత్వానికి తెలియకుండా జీవితాన్నెలా వ్రాస్తావు? అన్న వాక్యం కవికి కవిత్వం పట్ల ఉన్న ప్రేమానురాగాల గాఢతను తెలియజేస్తోంది. కవిత్వం జీవితంలో ఎంత అంతర్భాగమో ఆ వాక్యాల ద్వారా తెలియజేసారు సంపత్‌కుమార్‌గారు.

జీవితమంతా ముళ్ళు - కవిత్వమంతా కళ్లు. నిజమే జీవితంలో గుచ్చుకున్న ముళ్లతాలూకూ గాయాల అనుభ వాలన్నీ తన కళ్ళతో కవిత్వం చూస్తుంది, గుండె ఆర్ద్రతను వొలక బోస్తుంది. ఎంతో చక్కని భావుకతని ఈ చిన్ని కవితలో చెప్పారు.

అసలు జీవిత మార్గమే కవిత్వమన్నారు. జీవన తత్వం కవిత్వమన్నారు. కవిత్వమే జీవితానికి జీవమన్నారు. కవిత్వాన్ని నమ్ముకుంటే, బ్రతిమాలుకుంటే, జీవితాన్ని ఏలుకోవచ్చు అని అద్భుతంగా చెప్పారు.

సంపత్‌కుమార్ గారికి కవిత్వం అంటే ఎంత ప్రేమో ఆయన జీవితం కవిత్వంలో ఎంత మమేకమయ్యిందో ఈ క్రింది పదాలు చెబుతాయి.

నేను కవిత్వమై మొలుస్తాను
జీవితమై నిలుస్తాను
జీవితాన్ని కవిత్వంతో కొలుస్తాను
కవిత్వాన్ని జీవితంతో కొలుస్తాను
పండువెన్నెల్లో కవిత్వాన్ని ఆరబోసి
జీవితమంతా కాపలా కాస్తాను
కవిత్వానికి జీవితాన్ని ధారబోస్తాను.

పై వాక్యాలు కవికి కవిత్వం పట్ల ఉన్న గాఢమైన భావోద్వేగ తీవ్రతను, అనన్యమైన ప్రేమానురాగాలను తెలియజేస్తాయి. నిజంగానే తన సున్నితమైన దరహసం వెనుక, సౌశీల్యం వెనుక, స్నేహభావం వెనుక దాగి ఉన్నది. ఈ కవిత్వంలో తనకు ఉన్న ప్రగాఢమైన మైత్రియే ప్రధాన అంశమేమో!

కవితలతోపాటుగా ఆయన అనువదించి నక్రీటి దేవరాజన్ మరియు శ్రీఎల్. విజయ సుందరం గార్లు

వ్రాసిన ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు అన్న పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకంలో మానవుల ఆరోగ్యానికి సంబంధించిన తడమని అంశం అంటూ ఏదీలేదు. తమిళంలో మంచి ప్రజాదరణ పొందిన ఈ పుస్తకాన్ని తెలుగులో కూడా అనువదించాలనే ఆలోచనే మాడభూషి గారికి తెలుగు ప్రజల మీద కూడా ఎంత ప్రేమ ఉందో, (అంటే ఒక్క తెలుగు భాష మీదే గాక) అర్థం అవుతుంది.

తెలుగు సాహిత్యంలో ఎం.ఎ.పట్టా పొంది మదరాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో తెలుగు భాషా చార్యులుగా తెలుగు భాష కీర్తిప్రతిష్టలు పెంచేందుకు తానొక నిరంతర శ్రామికునిలా కష్టించిన వారు సంపత్ కుమార్ గారు. తెలుగులో "అత్యాధునిక కవితా దృక్ప థాలు"పై డి.లిట్.పట్టాను పొందిన సంపత్ కుమార్‌గారు నిజంగానే తెలుగు సాహిత్యంలో ఆధునికత వైపు పయనించడానికి కాలానుగుణంగా మారే సాహిత్య పరిణామ క్రమంలో తెలుగును కూడా ఒక సజీవమైన భాషగా నిలబెట్టడానికి, శ్రీశ్రీగారి మాటల్లోల్లాగా నేను సైతం అన్నట్లు కష్టించిన సాహితీమూర్తి వారు. ఆయన వ్రాసిన ఎన్నో రచనలు అనువాదాలు, పత్ర సమర్పణలు, అంతర్జాతీయ స్థాయిలో వారికి పేరు తెచ్చాయి.

మొట్టమొదటి సారిగా మాడభూషి సంపత్ కుమార్ గారు ఒంగోలులో డాక్టర్ నూనె అంకమరావుగారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కళామిత్రమండలి జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్నప్పుడు చూసాను. అందులో నేను కూడా ఒక అతిథిగా పాల్గొన్నాను. కళా మిత్రమండలి అవార్డు కమిటీ ఛైర్మన్‌గా కూడా ఉన్నాను. చూడగానే మనసులో నిలిచిపోయే వ్యక్తిత్వం అయనది అనిపించింది. ఎంతగా ఎదిగినా ఒదిగే నమ్రత, మృదుభాషణ, సంస్కారంతో కూడిన చిరునవ్వు. ఆయనకు ఎవరైనా ఇష్టపడతారు అనడంలో సందేహం లేదు. తదనంతరం నేను అంకమ్మరావుగారు, కప్పగంతుల మధుసూదనశాస్త్రి, వంకాయలపాటి రామకృష్ణ తది తరులం, తెలుగు భాషా ఆధ్వర్యంలో శ్రీమాడభూషి సంపత్ కుమార్ గారి నిర్వహణలో నిర్వహించబడిన శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారి శతవర్ధంతి సదస్సులో పత్రసమర్పణలు చేయడం జరిగింది. ఆ సభలను ఆయన ఎంతో ఓర్పుగా నేర్పుగా నిర్వహించారు. మరొక్కసారి ఆ సదస్సులో ఆయనను చూసాక, వారి భాషాభిమానానికి, ఆదరణకు నమస్కరించాలని పించింది. వారికి ఈ సందర్భంగా నాహృదయ పూర్వక అభినందనలు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శత్రువుతో ప్రయాణం' - కవిత్వ పరిశీలన

- డాక్టర్ జి. రవికుమార్, సహాయ ఆచార్యులు (సి), తెలుగు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు.

తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన వారిలో అగ్ర గణ్యులు మాడభూషి సంపత్‌కుమార్ గారు. ఈయన నిగర్వి, మృదుస్వభావి, నిరాడంబరుడు, స్నేహశీలి, గొప్ప విమర్శకులు, పరిశోధకులు. తమిళనాడులో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులకు తన బోధన ద్వారా ప్రేరణ కలిగించాడు. పలుజాతీయ అంతర్జాతీయ తెలుగు సదస్సుల్లో పాల్గొని అధ్యాపకులకు మార్గనిర్దేశం చేశాడు. విమర్శతోపాటు, హాస్య, వ్యంగ్య రచనలూ చేశారు. సరళమైన భాష, చక్కనైన భావవ్యక్తీకరణతో పాఠకులను ఆనందింపజేశాడు. వివిధ పత్రికల్లో అనేక కవితలు రాశారు. తమిళం, హిందీ, ఇంగ్లీషు భాషల నుండి అనేక కవితలు అనువాదం చేశారు. జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు మొదలైన కవితా సంపుటాలు వీరి కలం నుండి జాలువారాయి. ప్రతీ కవితాసంపుటిలో తన వ్యక్తిత్వం కనిపిస్తుంది. చిన్న చిన్న పదాలతో అర్థవంతమైన కవితలు రాశారు.

ప్రస్తుత పత్రంలో ఆచార్యులు మాడభూషి సంపత్ కుమార్ గారు రచించిన 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిని పరిశీలించడం ప్రధాన ఉద్దేశం. వీరు శత్రువుతో ప్రయాణం కవితా సంపుటిని 2015లో ప్రచురించారు. ఇందులో మొత్తం 36 కవితలున్నాయి. ఇందులోని కవితలన్నీ ఒకేసారి రాసినవి కావు. సుమారు ఇరవై ముప్పై సంవత్సరాల కాలంలో రాసిన కవితల్ని పుస్తకరూపంలోకి తీసుకొచ్చానని కవి పీఠికలో చెప్పారు. వీటిలో కొన్ని కవితలు ఇదివరకే కొన్ని పత్రికల్లో అచ్చయ్యాయి.

'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటి పేరులోనే సమాజాన్ని పట్టిపీడించే శత్రువులు కులం, మతం, వర్గం, వర్ణం, స్త్రీవివక్షత, అసమానతలు, పేదరికం, భయం మొదలైనవాటిపట్ల జాగ్రత్తగా ప్రయాణం చేయాలని తన కవితల ద్వారా ఉపదేశాన్నిచ్చారు.

శ్రీశ్రీ అభ్యుదయాన్ని కాంక్షించి 'జయభేరి' గేయాన్ని రాశారు. గేయం సమాజాన్ని ఎంత ప్రభావితం చేస్తుందో శ్రీశ్రీ "నేను సైతం / ప్రపంచాగ్నికి / సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అంటూ ప్రజల్ని ఆలోచింపచేశాడు. శ్రీశ్రీ లాగే సంపత్‌గారు కూడా స్వాతంత్ర్యం కోసం కవిత రాస్తానని, ఆ కవిత ప్రజల్ని చైతన్యపరచాలని కాంక్షించాడు. కవి సమాజాన్ని పరిశీలిస్తుంటాడు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్ని కవితల ద్వారా కవులు వారి భావాల్ని వ్యక్తం చేస్తారు. అలాగే సంపత్‌గారు కూడా 'కవిభేరి' కవితలో శ్రీశ్రీని అనుసరిస్తూ

'నేను కూడా / స్వతంత్ర్యానికి
కవిత నొక్కటి రాసియిచ్చాను
నేను కూడా / దేశవిముక్తికి
కంఠమెత్తి పాటపాడాను
నేను కూడా / తెల్లవారల
గుండెలోన నిద్రపోయాను'

సమాజంలో అభ్యుదయం స్థాపన తర్వాత కవి (శ్రీశ్రీ) విశ్వమనే వీణకు తీగగా స్వరాలు పలుకు తానన్నాడు.

'నేనుమాత్రం లోకమంతా / నిండిపోయి
నా అభ్యుదయ ప్రపంచాన్ని
ఆవరించే మంచి రోజులు
రానే వస్తాయి / నేను కూడా
నేను కూడా ప్రపంచానికి
మహాకవిగా వెలిగిపోతాను'

శ్రీశ్రీ లాగే సంపత్ గారు కూడా ప్రపంచానికి మహా కవిగా వెలుగుతాననీ, యుగకర్తగా మారి స్థిరస్థాయిగా ఉండిపోతానని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాజంలో కులమతాలు ప్రాధాన్యం రోజురోజుకు పెరిగిపోతున్నదనే భావాన్ని సంపత్‌కుమార్ గారు 'నిజం' అనే కవితలో -

'నే చూసిన / నా దేశంలో
ఎన్నియిజాలు / కులిజం, మతిజం
భాషిజం / ప్రాంతీయిజం
లేదొక్కటే దేశిజం!' అంటారు.

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం. అయితే మానవులు పరస్పరం జాతి, మత, భాష, ప్రాంత, కుల భేదాలతో విడిపోయి పరస్పరం కలహించుకొంటున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశారు. మానవులంతా ఒక్కటే అన్న భావన ప్రతి భారతీయుడు గ్రహించాలని పిలుపునిచ్చాడు. మతమౌఢ్యాన్ని గురించి కవి-

'నేను చూసిన /నా దేశంలో
విద్యాలయ గోడలపై / చెక్కేసిన
మతతత్వం / విద్యార్థి హృదయ కుహరంలో
ముసుగేసిన / కులతత్వం'

విశ్వవిద్యాలయాల్లో ఉన్న కులమతాల గురించి విమర్శించారు. కళాశాలకు వచ్చిన విద్యార్థులు కుల మతాల జోలికి పోకుండా విద్యనభ్యసించి గొప్పవారు కావాలని కవి ఆకాంక్షిస్తున్నారు.

'తెలుగు వెలుగులు' కవితలో మాడభూషి వారు తెలుగుకవులపట్ల, వారి రచనల పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ నన్నయ నుండి నేటి ఆధునిక కవులందరినో స్మరించాడు, కీర్తించాడు. ఆదికవి నన్నయ గురించి-

'మబ్బుచాటునున్న / తెలుగు సొబగులకు
మల్లెవాసనలు జోడించి / తెలుగు సాహితీ
తేనెలొలికించాడు నన్నయ'

నిజమే, అస్తవ్యస్తంగా ఉన్న తెలుగు భాషకు రూపాన్ని ఏర్పరచి రచనలు చేసిన ధన్యుడు నన్నయ. ఆయన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. తెలుగుభాషకు ఆద్యుడు, దీపదారి నన్నయ.

భాగవతాన్ని తెలుగువారికి అందించిన పోతన తెలుగువాడు కావడం మనందరం చేసుకున్న పుణ్యం. భక్తిలోనే ముక్తి ఉన్నదని భాగవత కథామృతాన్ని అందించిన పోతన గురించి

'మందార మకరందంలో
ముంచెత్తి తెలుగు పలుకులకు
మాధుర్యం తెచ్చాడు, భాగవతానికి
వెలుగులు ఇచ్చాడు పోతన'

అంటూ కీర్తించాడు. సమాజాన్ని సంస్కరించడం కోసం జన్మించిన కవి వేమన.

'ఆట వెలదిని ఈటెగా / చేపట్టినాడు
కుళ్ళిన సంఘాన్ని కూలదోసి
విశ్వదాభిరాముడై వెలిగినాడు'

అంటూ వేమన తన పద్యాల ద్వారా సమాజాన్ని ఎంత ప్రేరేపితం చేశాడో మనందరికీ తెలిసిందే.

ఈ కవితలో ఇంకా పాల్కురికి సోమన, తిక్కన, శ్రీనాథుడు, పెద్దన, రాయలు, మొల్ల, కందుకూరి, గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, విశ్వనాథ, జాషువా మొదలైన తెలుగు కవుల్ని ప్రశంసించాడు.

'చరిత్ర' కవితలో చరిత్ర గురించి చక్కని భావాన్ని వ్యక్తం చేశారు. చరిత్ర అంటే 'గత వర్తమానాల మధ్య సంభాషణ' అని ఇ.హెచ్. కార్ నిర్వచించారు. సంపత్ కుమార్‌గారు చరిత్రకు కొత్త నిర్వచనం యిచ్చారు. కేవలం గతం-వర్తమానమే కాదు

'చరిత్ర అంటే / అయిపోయింది కాదు / రాబోయేది, కాబోయేది' భవిష్యత్తు కూడా తెలిపేది చరిత్రగా ఈ కవితలో తెలిపారు.

'భయం' కవితలో భయం ఎలా ఉంటుందో, వివరించారు.

'భయం / మగాడిలా ఉండచ్చు
మగడి / రూపంలో ఉండచ్చు
మైనరు రూపంలో ఉండచ్చు

మైరావణుడి రూపంలో ఉండచ్చు
రూపం ఏదయినా
భయం మాత్రం ఒకటే / అది భయమే.'

ఎలా ఉన్నా, ఏ రూపమైన భయం - భయమే అంటూ ఆలోచింపజేశారు ఈ కవితలో.

'కలలు కూడా' అన్న కవితలోకలల్ని అలలుగా చిత్రించారు. ప్రతి వారికి కలలు రావడం సాధారణాంశం. అయితే ఆ కలల్ని ఎంత జాగ్రత్తగా దాచుకోవాలో చెప్పిన తీరు చూడండి.

'కలలు కళ్ళలోనే దాచుకోవాలి
కలలు చెదిరిపోతేనే మంచిది
అలలు చెదిరిపోయినట్టు
కలలు కళ్ళను దాటకుండా ఉంటేనే మంచిది
అలలు తీరం దాటనట్టు'

'సమాజం' అన్న కవితలో రాజ్యాధికారం వచ్చిన తర్వాత రాజకీయ నాయకుల ప్రవర్తన ఎలా ఉందో విమర్శించాడు.

'అందరూ రాజ్యాధికారం కోసమే
తమ అధికారంలోనే సమత్వమంటారు /
అధికారం వచ్చిన తరువాత
కొమ్మల్లేని చెట్టులా / తాము మాత్రం పెరుగుతూ ఉంటారు.'

'పని' కవితలో పనిపట్ల కవి ఎంత ఆసక్తి కనబరచారో చక్కగా వివరించారు.

'అందరికీ పొద్దుపొడుస్తుంది / నాకు పని పొడుస్తుంది / అందరూ నీళ్ళలో స్నానం చేస్తారు / నేను పనిలో స్నానం చేస్తాను / అందరూ సబ్బు రాసుకొంటారు / పొడరు పూసుకొంటారు / నేను పని రాసుకొంటాను / పని పూసు కొంటాను / ముప్పూటలా అందరూ బువ్వ తింటారు / నేను పొద్దుటి నుంచి రాత్రి దాకా పనినే తింటాను / అందరూ జీవితం కోసం పని చేస్తారు / నేను పనికోసం పని చేస్తా / నేను పనిచెయ్యకపోతేపనే ఉండదు'

అంటూ పని విలువని ఈ కవితలో తెలిపారు. కవి ఎంతటి శ్రమ చేశాడో ఈ కవిత ద్వారా తెలుస్తుంది.

ముగింపు :

ఈ కవితాసంపుటిలో తాను చెప్పాలనుకున్న భావాన్ని సూటిగా, సరళంగా, స్పష్టమైన భాషను ప్రయోగించి పాఠకులకు అర్థమయ్యే రీతిలో తెలిపారు. ఇంకా చాలా కవితల్ని పరిశీలించాల్సి ఉంది. కానీ వ్యాసం నాలుగు పుటలకు మించకూడదనే నిబంధనను అతిక్రమించ కుండా వ్యాసాన్ని కుదించి, వివరించే ప్రయత్నం చేశాను. 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటాన్ని మాడభూషి వారు తన అన్నా వదినలకు అంకితం చేశారు.

ఆధార గ్రంథాలు :

1. శత్రువుతో ప్రయాణం (కవితా సంపుటి) - మాడభూషి సంపత్‌కుమార్
2. మహాప్రస్థానం - శ్రీశ్రీ

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తమిళ జానపద కళలు - గంగిరెద్దుల వాళ్ళ జీవన విధానం

- యం.నాగమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

సాహిత్యచరిత్రలో తమిళ సాహిత్యం తన ప్రత్యేకతను చాటుకొంది. ముఖ్యంగా జానపద సాహిత్యంలో తమిళం వారు ప్రత్యేకతను చాటుకొన్నారు. తమిళ సాహిత్యాన్ని, కళల్ని పరిరక్షించుకొవడానికి శ్రమించారు. ఏది ఏమైన తమిళ జానపద కళలు వాటి ప్రాధాన్యతను, ఉనికిని తెలియజేయడానికి అధునిక తెలుగు సాహితీవేత్త మాడభూషి సంపత్ కూమార్‌గారు తెలుగు వారికి 'తమిళ జానపదకళల' ను పరిచయం చేశారు. ఈ పుస్తకంలో రచయిత తమిళ జానపదకళలను ఇరవై ఒకటిని సేకరించి పరిచయం చేశారు. అందులో గంగిరెద్దుల వారి జీవితవిధానం, ఆచారవ్యవహారాలు గురించి ఈ విధంగా తెలియజేశారు. తెలుగు మాతృభాషగా కలిగిన వున్న గంగిరెద్దులవాళ్ళు తమిళనాడులోని ఉత్తర జిల్లాల్లోని అనేక నగరాల్లో గ్రామాల్లో తిరుగుతూ తమిళంను మాతృభాషగా భావించి, నేర్చుకొని తమకు తెలిసిన పాటలు, ఆటలు, కథలు, రావణమేళం మొదలయిన కళలు ప్రదర్శించి డబ్బులు, ధాన్యం లేదా అన్నం సంపాదించుకొనే గంగిరెద్దులవాళ్ళు (బూంబూం మాట్టు కారర్). వీళ్ళను ' పూ విడయర్' అని కూడా పిలుస్తారు. అంటే పూలను కట్టే వాళ్ళు అని అర్థం. ఈ జాతివారిని పూ మాట్టుకారర్, బూంబూ మాట్టుకారర్, పెరుమాళ్ మాట్టు కారర్ అని ప్రజలు పిలుస్తారు. దక్షిణ జిల్లాల్లో వీళ్ళను ఆళగర్ మాట్టుకరర్ అని పిలుస్తారు. అయినా వీళ్ళ జాతి పేరును అడిగినప్పుడు తాము ఆట్టియిడర్, మాట్టియిడర్, మాల్లిడయర్, పాన్నుడియర్ జాతి అని చెబుతారు. తమను పూలు కట్టేవాళ్ళు అని చెప్పుకొంటున్నారు. దీనికి ఆధారంగా అనేక కథలు చెబుతారు. ఈ కథలను రెండు విధాలుగా చెప్పుకొవచ్చు. వీళ్ళ పూర్వీకులు పూలుకట్టే వృత్తి చేసేవారు. ఆ పూర్వీకులకు సంబంధించిన కథ ఒకటి. 'మా పూర్వీకులు అయోధ్య రాముడికి, ఆయన కులానికి చెందిన వాళ్ళకు పూలు కట్టి వాళ్ళకు సేవలు చేసేవారు. రాముడికి పూలు కట్టి ఇవ్వడం, ఆయనకు సేవలు చేయడమే మా ముఖ్యమైన పని' అని పూవి డయర్లు తమ జీవితం గురించి చెబుతారు. అంతే కాకుండా కొన్ని తరాలకు ముందు పూలను కట్టే వ్యాపారంలో ఉండేవారని చెప్పుకొవచ్చు.

పూవిడయర్, పూలవాళ్ళు :

పూలు కట్టి అమ్మే వ్యాపారం చేసే వాళ్ళు మా పూర్వీ కులు అని కథలు ఆధారంగా పూవిడయర్ (గంగిరెద్దుల వాళ్ళు) తమ జాతి పేరుకు వ్యాఖ్యానం చెప్పినప్పటికీ 'అభిధాన చింతామణి' అనే గ్రంధంలో పూవిడయర్ అనే పేరుకు వేరే అర్థం ఉంది. పూ+ఇడయర్=పూవిడయర్ అంటే పూ(భూ)టే భూమి మధ్యలో ఉన్నవారు అని అర్థం. కురింజి అంటే కొండ ప్రాంతం. 'మరుదం' అంటే మైదాన ప్రాంతం. నెయిదల్ అంటే తీరప్రాంతం. కొండకు అనుకొని ఉన్న ప్రాంతంలో ఉన్నవాళ్ళే పూవిడయర్. వీళ్ళకు సంబంధించిన ప్రాచీనత్వాన్ని తెలుసుకోవడానికి ఒక భాగవత కథ ఉంది. 'అభిధాన చింతామణి' గ్రంధం వాళ్ళ మాతృభాషగా తెలుగని చెబుతోంది. అందువల్ల అభిధాన చింతామణి చెబుతున్న దాని బట్టి తమిళంలోని భూమి విభాగాలైన అయిదింల్లో పూ లేదా నేల అయిన మలై నేలలో జీవించిన వాళ్ళు పూవిడయర్ అని భావిస్తారు. భూమి మధ్యలో ఉన్నవాళ్ళు భూ+ ఇడయర్ అని జాతిపేరుకు తగ్గట్టుగా ఉన్నప్పటికీ, ఆ జాతి ప్రజల్లో ఉన్న 'మా పూర్వీకులు అయోధ్య రాముడికి, ఆయన కులానికి చెందిన వాళ్ళకు పూలు కట్టి ఇచ్చేవాళ్ళు' అన్న కథను అంత సులభంగా తోసిపుచ్చడానికి వీల్లేదు. అదే సమయంలో ఇప్పటి పూవిడయర్లలో పూలు కట్టేవాళ్ళు ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించాలి.

గంగిరెద్దుల వాళ్ళు :

పూవిడయర్ అని పిలవబడే ప్రజలకి బూం బూం మాట్టుకారర్, బ్రూం బ్రూం మాట్టుకార్ (గంగిరెద్దుల వాళ్ళు), పూ ఎద్దుల వాళ్ళు, పెరుమాళ్ మాట్టుకారర్ (దేవర ఎద్దులవాళ్ళు) లాంటి పేర్లున్నాయి. సాధారణంగా భిక్షాటనకు వెళ్ళినప్పుడు అక్కడున్న ప్రజలు వీళ్ళని ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. కానీ వీళ్ళు పూవియడర్లు, తమను తాము పరిచయం చేసుకొనేటప్పుడు గంగిరెద్దుల వాళ్ళును దేవర ఎద్దులవాళ్ళు అని చెప్పుకోవడంకద్దు. తంజావూరు, నాగపట్నం మొదలయిన జిల్లాల్లో ఈ ప్రజ లను గంగిరెద్దుల వాళ్ళు బూం బూం అని శబ్దం చేసు కొంటూ వస్తారు. అప్పుడు తమ భూజానికి తగిలించుకొని ఉన్న ఉరుము మేళాన్ని చిన్న పుల్లతో రాసి శబ్దం చేస్తారు. ఆ శబ్దం బూం బూం బ్రూం బ్రూం మేళం అంటారు. వాళ్ళ తోలు వాయిద్యాన్ని, తోలుకొని వచ్చే పశువును చూసి తంజావురు, నాగపట్నం జిల్లాల్లో నివసించే ప్రజలు పూవిడియర్లును బూం బూం ఎద్దులవాళ్ళు అని పిలవడం మెదలు పెట్టారు.

పెరుమాళ్ మాట్టుకారర్ (దేవర ఎద్దులవాళ్ళు) అన్నది వీళ్ళను తెలిపే మరో జాతి పేరుగా ఉంది. దైవభక్తులుగా ఉన్న గంగిరెద్దుల వాళ్ళు అలియలూర్ దగ్గరున్న కలియ పెరుమాళ్ గుడికి కానుకగా ఇచ్చే అవుల్ని, ఎద్దుల్ని తక్కువ ధరకు తీసుకొని వచ్చి తమ భిక్షాటనకు ఉమయోగించు కోవడం వల్ల వీళ్ళను దేవ ర ఎద్దులవాళ్ళు అని పిలుస్తారు.

పురాణ కథలు :

పూవిడియర్లు సంచారులుగా ఊరూరు తిరిగి భిక్షాటన చేసి జీవితాన్ని గడిపేవాళ్ళు. పూవిడయర్లు ఇటీవలి కాలంలో తమ పూర్వీకులు అనుకోని కారణం వల్ల సంచార జీవితం గడిపారని భావిస్తున్నారు. సహజంగానే తమ పూర్వీకులు వ్యవసాయం చేసుకొంటూ స్థిరమయిన జీవితాన్ని గడిపిన వాళ్ళని చెబుతున్నారు. సహజమయిన వృత్తి అయిన వ్యవసాయాన్ని, స్థిరమయిన జీవితాన్ని వదిలి పెట్టి సంచార జీవితాన్ని నడపవలసిన అవసరం, భిక్షకుడి వేషంలో వచ్చిన రాముడి శాపంవల్లే తమ పూర్వీకులకు వచ్చిందని వాళ్ళ వాదన. దీనికి ఆధారంగా కథను చెబు తారు. పూర్వం ఒక రోజు రాముడు భిక్షకుడిగా వేషం ధరించుకొని పూవిడయర్లు (గంగిరెద్దుల వాళ్ళు) నివసించే చోటుకు వచ్చి వాళ్ళతో కరుణతో నాకు ఆకలిగా ఉంది ధర్మం చేయ్యండి అని అడిగాడు. పూవిడయర్లు ధర్మం చేయడానికి ఇష్టపడలేదు. వారు రాముడి దగ్గర నుంచి తప్పించుకోవడానికి ఒక షరత్తు చెప్పారు. మాకు పండిన పంటల్లో నుంచి నీకు పైభాగం కాని కిందిభాగం కాని ఏది కావాలో అని రాముడిని అడుగగా రాముడు పై భాగం కావాలని కొరడంతో ఆ సంవత్సరం వారు అనుకున్నట్టుగానే వేరుసెనగ వేశారు. పంట చేతికి వచ్చిన వెంటనే రాముడు వచ్చి పూవిడయర్ల ఊహలను తెలుసు కొని సంతోసించి సవ్వుతూ ఇదిగో స్వామి! నీవు అడిగిన పై భాగం అవి వేరుసెనగ తీగల రూపంలో వుండటంతో, కోపంతో మోసపోయిన రాముడు వాటిని తీసుకొని వెళ్ళాడు. వేరుసెనగలను మాత్రం తీసుకొన్నారు. "దేవుడంతంటి వాడిని వీరు మోసం చేయడం మూలాన స్వామి నిజ స్వరూపంతో వారికి కన్పించి మీరు నన్ను మోసం చేశారు కాబట్టి మీ దగ్గర వున్న సొరకాయను బుర్రగా అంటే వాయిద్యంగా చేసుకొని ప్రతి ఇంటి దగ్గరకు వెళ్ళి రామా! గోవిందా! అంటూ పాడుతూ భీక్షం తీసుకొమ్మని శాపం ఇచ్చాడు. అంతటితో పూవిడయర్లు నేటికి ఆ బూర్రను వాయిస్తూ కడుపు నింపుకొని జీవితం కొనసాగిస్తున్నారు. ఇంక అప్పటి నుంచి వీరి వంశీకులకు ఆ రోజు నుంచి పూవిడయర్లు తమ పొలాన్ని పోగొట్టుకొని, స్థిరజీవితాన్ని వదిలి పెట్టి భిక్షకులుగా సంచార జీవితాన్ని గడుపుతున్నారు. సంచార జీవితం గడపవలసిన ఆగత్యం తమ పూర్వీకులు పొందిన శాపం వల్ల కలిగిందన్న పూవిడయర్లు నమ్మకాన్ని ఈ కథ చెబుతోంది ప్రస్తుతం పూవిడయర్లుకు సొంత భూమిలేదు. వ్యవసాయం చెయ్యడం లేదు అన్నది గుర్తించాల్సిన అంశం. పూవి

డయరు శాపం పొందిన కథలో సొరకాయ బుర్ర వాళ్ళ భిక్షాపాత్రలాగా చెప్పబడింది. 1990 వరకు వాళ్ళు సొరకాయ బుర్రను ఉపయోగించిన విషయాన్ని గుర్తుంచుకొవాలి. ప్రస్తుతం వాటి స్థానంలో స్టీలు, అల్యూమినియం పాత్రలు వచ్చి చేరాయి. ఇలాగే మరోక కథ కలియుగ ఆరాధ్యుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆజ్ఞ ప్రకారంగా పూర్వీకులు దేవుడి ఎద్దును తీసుకొని సంచార జీవితానికిపావలసి వచ్చిందని మరోక కథ.

పూర్వం తిరుపతిలో వేంకటేశ్వరుడికి వచ్చే కానుకల్లో రెండు తోకల ఆవులు, అయిదు కాళ్ళున్న ఎద్దు, నాలుగు కొమ్ములున్న దూడలు ఉండేది. ఈ జంతువులన్ని మేపడానికి పూవిడయర్లను (గంగిరెద్దువాళ్ళు) ను ఏర్పరచుకొన్నాడు. అయితే వీరి మనసులో నుంచి జంతువులను మేపడం గౌరవంగా వుంటుంది కాని ఇలా పుట్టిన జంతువులను మేపడం మా పాపం అని భావించారు. వారి పాపాలను కడుక్కోవడానికి వేంకటేశ్వరస్వామిని వేడుకొన్నారు. ఒకే చోట స్థిరంగా ఇళ్ళు కట్టుకొని వ్యవసాయం, వృత్తి, వ్యాపారం మొదలయిన వాటి ద్వారా స్థిలరమయిన ఆదాయంతో జీవించే ప్రజలతో పాటు ఎటువంటి వసతి సదుపాయం లేకుండా సంచార జీవింతో భిక్షకులుగా జీవించే వీళ్ళూ ఉన్నారు. ఈ రెండు రకాల ప్రజల మధ్య హెచ్చుతగ్గులు బాగా కనిపిస్తున్నాయి. రెండు కథల్లోనూ సరిగా గుర్తించలేని ఒక కాలాన్ని తమ పూర్వీకుల జీవిత విధానాన్ని, రాముడు, వేంకటేశ్వరుడు మొదలయిన దేవుళ్ళు విధించిన శాపం, వలనే వారు నేడు సొరకాయ బూర్రలను వాయిస్తూ రామా! గోవిందా! అంటూ ప్రతి ఇంటి దగ్గరకు వెళ్ళి అడుక్కొని కడుపునింపుకొంటూ జీవనం కొనసాగిస్తూన్నారు పువిడయర్లు.

పై విషయాన్ని మట్టి చూస్తే మనుష్యులు ఇచ్చే శాపాలు కొన్నిరోజులు వుండి తొలగిపోతాయి కాని, దైవ శాపాలు మాత్రం వంశపార్యంపరంగా కొనసాగుతూనే ఉంటాయి అన్నడానికి నిదర్శనం పూవిడయర్లు (గంగిరెద్దుల వాళ్ళు). ఈ రెండు కథల్లోనూ రెండు రకాల కాలాల గురించి చెప్పారు. అవి పురాణ కాలం, పూర్వీకులకు సంబంధించిన చరిత్ర కాలం వీటిలో ముఖ్యమైనవి. గంగిరెద్దుల వాళ్ళ పూర్వీకుల నిజమైన కాలంలోకి పురాణ కాలం ప్రవేశిస్తుంది. ఈ రెండు కాలాల్లోనే ఈ కథలు ఉంటాయి. అద్భుతశక్తి కలిగిన దేవుడు లేదా పురాణ వ్యక్తులకు సమానమయిన శక్తి పూవిడయర్ల పూర్వీకులకు లేదు. పురాణ వ్యక్తులరు దర్శించిన కాలాలు వేర్వేరుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికి ఆ కథలు చెబూతునే ఉన్నారు. పూవిడయర్లు ఈ కథను నమ్మి అలాగే జీవితాన్ని గడుపుతున్నారు. శాపం పొందిన వాళ్ల జీవితాన్ని ఎదిరించి జయించే ఆలోచన వాళ్ళకు కలగలేదు. దేవుణ్ణి మార్చిన పూర్వీకులకు రాముడు ఇచ్చిన శాపం తరతరాలుగా కొనసాగుతూ వస్తోందని, అదే తమ తలరాత అని అంగీకరించి జీవిస్తున్నారు. మరోప్రక్క శాపం నుంచి విమోచన కోరి దేవుడి ఎద్దును తోలుకొంటూ శాపవిమోచన ప్రయాణం చిరకాలంగా ఎల్లలు లేకుండా చేస్తూనే ఉన్నారు పువిడయర్లు (గంగిరెద్దుల వాళ్ళు).

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శత్రువుతో ప్రయాణం - జండర్ స్పృహ

- డాక్టర్ ఎం.దేవేంద్ర, తెలుగు అధ్యాపకులు, కోఠి మహిళా కళాశాల, హైదరాబాద్.

ఈ ఉగాది
నాకు విరోధి
షడ్రుచులు వడ్డించిన
భూమి తల్లిపై
అత్యాచారం

అంటూ స్త్రీల పక్షాన నిలబడి అక్షరగొంతుకను వినిపించిన కవి, విమర్శకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. శ్రీశ్రీ కోరినట్లుగా పీడితుల పక్షాన నిలబడి అభ్యుదయ దృక్పథంతో పయనిస్తున్నారు. 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలో ఉన్న 36 కవితలు సమాజాన్ని అనేక కోణాల్లో ప్రశ్నిస్తాయి. మార్పుతో కూడిన మానవత్వాన్ని కోరుకుంటాయి. రాజకీయ రంగులను ఎండగడుతాయి. స్త్రీవాద ఉద్యమాన్ని సమర్థిస్తాయి.

అస్తిత్వ ఉద్యమాల్లో భాగంగా వచ్చిందే స్త్రీవాదం. స్త్రీల ఉనికిని, స్త్రీల హక్కులను, స్త్రీల సమస్యలను స్త్రీలే వ్యక్తపరిచే సాహిత్యాన్ని స్త్రీవాద సాహిత్యం అంటున్నాం. తరతరాల వ్యవస్థ నిర్మాణంలో మాతృస్వామ్యం రూపాంతరం చెంది పితృస్వామ్యంగా స్థిరపడిపోయింది. ఆనాటి నాగరిక సమాజం నుండి నేటికి ఆ మూలాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించి, ఎదిరించే క్రమంలో వచ్చిందే స్త్రీవాదం. జెండర్ స్పృహ, గృహహింస, మాతృత్వం, ఇంటి చాకిరి మొదలైన అంశాలెన్నో స్త్రీవాద ఉద్యమంలో వెలుగులోకి వచ్చిన అంశాలు. జండర్ సహజంగా ఏర్పడింది కాదు. కుటుంబం, సమాజం, మతం 'స్త్రీలు' అంటే ఇలా ఉండాలి, 'పురుషులు' అంటే ఇలా ఉండాలి అని జీవన విధానంలో అలవాటు చేసే క్రమపద్ధతిని జండర్‌స్పృహ అంటున్నాం. ఎంగెల్స్ ప్రకారం "పురుషత్వం, స్త్రీత్వం అనేవి శరీర ధర్మాల ప్రకారం ఏర్పడినవి కావు. ఒక సుదీర్ఘ చారిత్రక యుగంలోను పురుషత్వం, స్త్రీత్వం అనేవి వేరువేరుగా నిర్వచించబడ్డాయి. ఈ నిర్వచనం ఆయా యుగాలలోని ప్రధానఉత్పత్తి విధానంమీద ఆధారపడి ఉంటుంది" అన్నారు. అంటే స్త్రీత్వ, పురుషత్వాల గురించి భావజాలాన్ని సమాజం తయారుచేసి అందిస్తోంది. ఆ భావజాలం తిరిగి సమాజక్రమాన్ని స్థిరపరచడంలో సహాయపడుతుంది. ఈ క్రమానంతటిని స్త్రీవాదం పరిశీలించింది. స్త్రీవాదం అంటే పురుషులను ద్వేషించడం కాదు. స్త్రీల సమస్యలను గుర్తించి స్త్రీలందరు ఏకమై పురుషులకు అర్థమయ్యేలా చెయ్యడం. ఈ భావజాలాన్ని అర్థంచేసుకున్న సహృదయ కవి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. 'ఆమె' కవితలో స్త్రీల సమస్యలను కళ్ళకు కట్టినట్లు లోతైన భావుకతతో అక్షరీకరించారు.

"చిన్నప్పటినుండి అంతే
చిన్నచూపుతోనే పెరిగింది" అంటారు
.....
ఇంకా
ఆమె నిఘంటువు నుంచి నిషేదం
అందుకే
ఎందుకు, ఏమిటి
లాంటి ప్రశ్నలు ఆమెనోట్లో రాకూడదని శాసనం"

బాల్యం నుండే ఆడపిల్ల జండర్‌వివక్షను ఎదుర్కొంటుంది. కన్నతల్లే కొడుకును ఒకరకంగా కూతురును మరొరకంగా పెంచుతుంది. లేకపోతే తల్లిపెంపకం బాగా లేదంటారు. దుస్తులు, ఆటలు, ఆహారం, ఇలా అన్నిట్లోను ఆ వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కుటుంబంలో ఆడపిల్ల ఇట్లా ఉండాలి అని తర్ఫీదు నివ్వబడుతుంది. తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో పెరిగిన ఆడపిల్లకు పెళ్ళి అనే బంధం మరిన్ని బాధ్యతలను, పరిమితులను విధిస్తుంది. అందుకే కవి ఇలా అంటారు.

"అతగాడికి కావలసింది ఒక మరమనిషి
సంపాదించడానికి / వండిపెట్టడానికి
కోరికలు తీర్చడానికి / పెళ్ళిరోజున ఎ.టి.ఎం లాంటి
/ పెళ్ళాం దొరికిందని మరిసిపోతాడు"

స్త్రీకి పెళ్ళి జీవితం అనేవి రూపాయి బిల్లకు ఉండే బొమ్మ, బొరుసు లాగా మారిపోయింది. మంచి భర్త దొరికితే పరవాలేదు కాని, ఆమెను అర్థంచేసుకోలేని కుటుంబంలోకి అడుగుపెట్టినప్పుడు జీవితఖైదీగా మారిపోతుంది. అసలు కుటుంబమే స్త్రీని కంట్రోల్ చేసే బంధిఖానా అవుతుంది. ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం అన్ని స్త్రీల బాధ్యతలే. ఉద్యోగం చేసే ఆడవాళ్ళు కూడా వీటన్నింటిని బాలెన్స్ చేసుకోవాలి. తద్వార స్త్రీల శారీరక, మానసిక ఆరోగ్యాలమీద ఒత్తిడి పెరుగుతుంది. ఎదిగే క్రమంలో అనేక సవాళ్ళను స్త్రీ ఎదుర్కోవలసి వస్తుంది. 'ఆమె' కవితలోనే ఈ పంక్తులు చూడండి.

"ఆకాశమంత వ్యాపించి
అందీ అందని ఆ తేజోమూర్తిని చూసి
నిందలు వేసే వాళ్ళెందరో!

మబ్బుల నడుమనుంచి / అప్పుడప్పుడు మెరుస్తూ ఉంటేనే / ఇంత అసూయగా ఉంటే / పున్నమి వెన్నెల విరిస్తే / రెక్కలు ముక్కలు చేసుకొని / ఆకాశానికి ఎగురుతున్న ఆమె రెక్కల్ని / ముక్కలు చేయడానికి ఎందరో"

అన్న పంక్తులు బాధ్యతల దొంతరలో, ఉరుకుల పరుగుల 'ఆమె' జీవితంలో పడగనీడలా నిందలు, ఆధిపత్యాలు, అకృత్యాలు, వివక్షలు, చిన్నచూపులు ఇలా ఎన్నో ఎన్నెన్నో సంఘర్షణల మధ్య స్త్రీ తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటు ముందుకు వెళ్ళే సాహసం చేస్తుంది. అయినప్పటికి స్త్రీలు తమను తాము నిరూపించుకుంటూ అన్నిరంగాలలో ముందుకు వెళ్ళే ప్రయత్నంచేస్తున్నారు. అయినప్పటికి అడగడుగున పరీక్షలపర్వాలను దాటక తప్పడంలేదు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లి కలలు కంటుంది. అన్నీ తానై భరిస్తుంది. అయినప్పటికి తండ్రి అంటే పిల్లలకు గౌరవం. తల్లి అంటే చిన్నచూపు. 'ఆమె' గురించి కవి మాటల్లో ...

ఇంట్లో సెలవులేదు / పనిలో సెలవులేదు
జీవితమంతా పిల్లలకోసం పరుగెత్తి పరుగెత్తి
అలిసిపోయిన ఆమెకు / ఆసరా లేదు
..... / ఆమె లేకుండా
మానవ చక్రం పరిభ్రమించదు
అందుకే ఆమెను / పరిమళించనివ్వండి

కవితా ముగింపులో స్త్రీ ఉన్నతిని ఆకాంక్షిస్తున్నారు కవి. ఈ విశ్వమానవ కాలభ్రమణంలో స్త్రీ, పురుషులిద్దరు అవసరమే. ఎవరికివారుగా బాధ్యత నిర్వహణలో పోటీ పడాలి గాని ఆధిపత్యాలు, అహంకార పెత్తనాలు స్త్రీల అశాంతికి కారణమౌతున్నాయి. హింసకు దారితీస్తున్నాయి. స్త్రీల చుట్టు భయాన్ని గుర్తుచేస్తూ 'భయం' కవిత లో ఇలా అంటారు.

భయం / కట్నంలా రావచ్చు
పట్నంలో రావచ్చు / అత్యాచారంలా రావచ్చు
నిత్యాచారంలా ఉండవచ్చు / భయం
మగాడిలా ఉండవచ్చు
మగడి రూపంలో ఉండవచ్చు
మైరావుణుడి రూపంలో ఉండవచ్చు
రూపం ఏదైనా / భయం మాత్రం ఒక్కటే

అది భయమే / స్త్రీలకు ఉన్న భయాలు అన్ని ఇన్ని కావు. పురుషస్వామ్య ప్రపంచంలో ఎక్కడ పొంచి ఉంటుందో ఆ భయం. కవి పై కవితలో కట్నం వలన భయం అనడంలో మనం ఇప్పటికి వరకట్న వేదింపులకు బలైన స్త్రీలను మీడియా ముఖంగా చూస్తునే ఉన్నాం. స్త్రీలపై అత్యాచారం అన్నది ఈనాటికి రూపు మాపలేకపోయాం. ప్రభుత్వాలు నిర్భయ చట్టాలు చేసినా.. దిశ లాంటి అమ్మాయిలు ఇంకా బలవుతూనే ఉన్నారు. ఇవన్నీ ఒకెత్తయితే కన్న తండ్రి కళ్ళు కామంతో కప్ప

బడినపుడు కూతురు పరిస్థితి అగమ్యగోచరం. 'తండ్రి' అన్న కవితలో

"కన్న బిడ్డనే కామించే తండ్రులు
తండోపతండాలుగా పత్రికల్లో మొలుస్తూనే
టీవీలో మెరుస్తునే ఉన్నారు

వాటిని చూసిన మొహంతో /కన్నబిడ్డను చూసే శక్తిలేక / ఆత్మహత్య చేసుకుంటున్న" అంటారు. ఇక్కడ కవి ఈ సంఘటనను కరుణరసభరితాక్షరాలలో మన ముందుంచారు. ఎవరో చేసిన పనికి తండ్రిగా కూతురు ముందు నిలబడలేని స్థితిని తండ్రులందరి పక్షాన నిలబడి బలమైన సందేశాన్నిచ్చారు. 'మగాడు' కవిత జండర్ వివక్షను మరింత స్పష్టంగా చెప్తుంది.

"వాడు కావాలనుకొన్నప్పుడు / నేను రావాలి
వాడు తేవాలన్నప్పుడు /నేను తేవాలి
వాడు తిరగమన్నట్టు / నేను తిరగలిగా తిరగాలి"

స్త్రీ, పురుషులిద్దరు మనుషులే. ఇద్దరిలో ప్రవహించే రక్తం ఎర్రగానే ఉంటుంది. కాని, స్వేచ్ఛా పరిధిలోకి వచ్చే సరికి జండర్ వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తుంది. పితృ స్వామ్య వ్యవస్థ పురుషుడిని 'మగాడు'గా చూడాలను కుంటుంది. మగాడు అంటే ఎలా ఉండాలని సమాజం, కుటుంబం చెప్పిందో కవి ప్రతిసందర్భంలో మగాడి రంగును తేటతెల్లం చేస్తాడు. స్త్రీ ఎల్లప్పుడు పిల్లలకోసమో, పుట్టింటి వారి కోసమనో, పరువు మర్యాదల కోసమనో తను ఉండాలనుకున్నట్టుగా ఉండలేకపోతుంది. తన అస్తిత్వాన్ని ఉనికిని పరిస్థితులకు ఫణంగాపెట్టి అన్నిటికి సర్దుబాటుతనపు సంకెళ్ళు వేసుకుంటుంది. అందుకే 'కవి' స్త్రీ, పురుషుల సహవాసాన్ని శత్రువుతో పోల్చడం సమస్య తీవ్రతను తెలియజేస్తుంది.

"నేను సహవాసం చేస్తున్నది / శత్రువుతో
నేను సహజీవనం చేస్తున్నది / శత్రువుతో
నేను పంచుకొంటున్నది / శత్రువుతో
పనిచేస్తున్నది / శత్రువుతో"

ఈ శత్రువులు మిత్రులు అయ్యేదెప్పుడు! జండర్ వివక్ష తగ్గినప్పుడు ఒకరికొకరు పరస్పర సహకారంతో ముందుకెళ్ళినప్పుడు అంటే స్త్రీవాదాన్ని పురుషుడు అర్థంచేసుకున్నప్పుడే సమన్య పరిష్కారం దిశగా ముందుకు కదులుతుంది. ఆచార్యస్థానంలో ఉన్న మాడ భూషి సంపత్‌కుమార్‌గారు మహిళల ఆర్తిని, ఆవేదనను, వివక్షను అర్థంచేసుకున్న వ్యక్తిగా, కవిగా, ప్రగతిశీల మార్గదర్శకుడిగా స్త్రీల గొంతుకను 'శత్రువుతో ప్రయాణం' పేరుతో తన కవితాధారతో బలం చేకూర్చిన మానవతా మూర్తి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బహుముఖ ప్రజ్ఞాశాలి మాడభూషి

- డాక్టర్ ఎస్. విజయభాస్కర్

ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నాయి కవిత, కథ, గేయం, పద్యం, వచనం, కథానిక, నవల, నాటకం, నాటిక, అనువాదం, విమర్శ, పాట, జీవిత చరిత్ర, వ్యాసం, గజల్, పరిశోధన..... మొదలైనవి.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల లో విశిష్టమైన కృషి చేసి తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం ను సంపాదించుకున్నారు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కవిగా, రచ యితగా, అనువాదకునిగా, విమర్శకునిగా, పరిశోధ కునిగా, ఉత్తమ ఉపాధ్యాయునిగా, కావ్య కర్తగా, అంతర్జాతీయ సదస్సుల నిర్వాహకునిగా.... బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నారు.

పరిచయం :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ .. శ్రీనివాసాచారి, పట్టమ్మ అనే పుణ్య దంపతులకు జన్మించారు. చిత్తూరు జిల్లా, ఖమ్మవారి పల్లె వీరి స్వస్థలం. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు చిత్తూరు లోనే చదువుకున్నారు. ఎం.ఏ., పిహెచ్.డి. (అంశం - ఎరుకుల భాషకు వర్ణ నాత్మక వ్యాకరణం) యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుండి పూర్తి చేసారు. తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు అనే అంశంపై డి.లిట్. పొందారు. మద్రాస్ యూనివర్సిటీ లోనే అసిస్టెంట్ ప్రొఫేసర్ గా చేరారు. అసోసియేట్ ప్రొఫేసర్, ప్రొఫేసర్, తెలుగు శాఖాధ్యక్షులుగా వివిధ పదవులు నిర్వహించారు. ఆయన దగ్గర 75 మంది ఎం.ఫిల్, 27 మంది పిహెచ్.డి పట్టా కోసం పరిశోధన చేసారు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ రచనలు :

1. కవితా ఓ కవితా... వస్తువు, భాషా, శైలి 2010
2. మద్రాస్ లో తెలుగు పరిశోధన 2012
3. వ్యాస సంపద 2013, 4. వ్యాకరణ విజ్ఞానం 2013
5. తమిళ జానపద కళలు 2014 ,6. అనువాద విజ్ఞానం 2014 , 7. కవాతు 2020, 8. రెండో ఓటమి 2020

సంపాదకత్వం వహించిన గ్రంథాలు :

1. ఆంధ్ర మహాభారతం - వివిధ శాస్త్ర పరిజ్ఞానం 2009.
2. ఒక విజేత (అబ్దుల్ కలామ్ కు తెలుగు వారి నివాళి 2015).
3. పరిశోధన-నాడు , నేడు , రేపు 2016.
4. తెలుగు దీప్తి.

అనువాద గ్రంథాలు :

1. గడ్డి పరక లో విప్లవం 2001 , 2. సామాజిక శాస్త్రవేత్త పెరియార్ 2002, 3. అమ్మ వాసన 2008, 4. జన్మ భూమి 2008, 5. ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు, సులభమైన మార్గాలు 2015

కవితా సంపుటాలు :

1. జీవితం - కవిత్వం 2013, 2. శత్రువుతో ప్రయాణం 2015, 3. ఆలోచనలు 2015, 4. చివరకు నువ్వే గెలుస్తావు 2016, 5. మూడో మనిషి 2017, 6. వికారి 2019, 7. మొదటి అబద్ధం 2020

అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ :

శ్రీశ్రీ, గురజాడ, శ్రీకృష్ణ దేవరాయలు, అన్నమయ్య, గుర్రం జాషువా, సి.పి. బ్రౌన్, పరిశోధన నాడు నేడు రేపు మొదలైన అంశాలపై అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు.

అంతర్జాతీయ సదస్సులు - పత్రసమర్పణలు :

సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, మారిషస్.. తదితర దేశాల్లో అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణ చేసారు. తెలుగు లిపి పై బ్యాంకాక్ లో జరిగిన అంతర్జాతీయ లిపుల సమావేశంలో పాల్గొని తెలుగు లిపికి ఉత్తమ లిపి అన్న ఖ్యాతి ని తీసుకొని వచ్చారు. 24 గంటల నిరవధిక కవి సమ్మేళనం నిర్వహించి తెలుగు బుక్ రికార్డులో స్థానం సంపాదించారు.

బిరుదులు - ఉత్తమ ఉపాధ్యాయ , వివిధ సంస్థల నుండి కవికోకిల, సాహిత్య రత్న, ఆంధ్ర బాషా భూషణ, ధ్రువతార ..మొదలైన బిరుదులు పొందారు.

సాహిత్య సేవ , పత్రిక సేవ :

తెలుగు సాహిత్యానికి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ విశిష్ట సేవలందించారు. తెలుగు భాషపై ఎక్కడ సెమినార్లు, సదస్సులు ఉన్నా హాజరయ్యే వారు. హైదరాబాద్, ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్నారు. అభ్యుదయ కవి ఆరుద్ర....

తరానికో వంద కవులు / తయారౌతారెపుడు
వందలోనూ మందలోనూ
మిగల గలిగే దొక్కడు అన్నారు.

తెలుగు సాహిత్య చరిత్ర (ద్వా. నా. శాస్త్రి 2004)

ప్రతి తరంలో ఎంతో మంది కవులు వస్తుంటారు, పోతుంటారు. ఎవరి కవిత్వాన్ని పాఠకులు ఆదరిస్తారో, ఎవరి కవిత్వమైతో ప్రజలకు దగ్గరగా ఉంటుందో వారు మాత్రమే మిగులుతారు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సులభమైన భాషలో, శైలిలో అందరికీ అర్థమయ్యేలా రాశారు కాబట్టే తెలుగు సాహిత్యంలో నిలబడగలిగి నారు.

పుస్తకాల పై విశ్లేషణ :

మహాకవి శ్రీశ్రీ .... కుక్కపిల్లా, అగ్గిపుల్లా సబ్బు బిళ్ళా / హీనంగా చూడకు దేన్నీ / కవితామమమేనోయ్ అన్నీ ..... కవిత్వం ప్రతి విషయం పై రాయవచ్చు.

ఈ విషయం ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ పై ప్రగాఢ ప్రభావం పడింది. ఆయన రాసిన అన్ని పుస్తకాలలో వస్తువు మనం నిత్యం వాడే వస్తువులు, చూసే వ్యక్తులు ఎక్కువగా ఉన్నారు.

జీవితం కవిత్వం అనే పుస్తకంలో 108 పేజీలతో ప్రచురించారు.. దీనిలో ముక్తకాలు ఉన్నాయి.

జీవితాన్ని విడిచి పెట్టి
కవిత్వం ఎలా రాస్తావ్
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా దాస్తావ్
కవిత్వం రాయడానికి ముందు
జీవితాన్ని చదవాలి
జీవితాన్ని చదవడానికి ముందు
కవిత్వంలో ఎదగాలి.

ఈ విధంగా జీవితం, కవిత్వం అవినాభావ సంబంధం కలిగి ఉంటాయని తెలిపారు.

పోతన / జీవిక కోసం
కవిత్వాన్ని ధారపోయలేదు
వేమన / కవిత్వం కోసం
జీవితాన్ని / ధారబోశాడు

అంటూ చక్కటి విశ్లేషణ తో జీవితం, కవిత్వం ఒకదానికొకటి పెనవేసుకున్నాయని చెప్పారు.

కవితా.. ఓ కవితా.. వస్తువు, భాష, శైలి :

శ్రీశ్రీ రచించిన కవితా ఓ కవితా అన్న పుస్తకానికి వస్తువు, భాష, శైలి.. ని విమర్శనాత్మకంగా వివరించారు.

మూడో మనిషి - ఈ కవితా సంపుటిలో 36 కవితలు ఉన్నాయి. 78 పేజీల ఈ పుస్తకంలో అమ్మ పై చక్కని కవిత ఉంది. అకు రాలిన కాలం శీర్షిక..ఇందులో

అమ్మ ఆకులా రాలిపోయింది
.....
ఇప్పుడు అమ్మ లేక పోవడంతో

అందరూ అనాథలే అంటూ హృదయానికి హత్తు కునేలా చెప్పారు. కవిత్వం బ్రాహ్మణుల సొమ్మే అని అప్పకవి గాని, మరి ఒకరు మాదే అని ఎవరో గాని రిజిష్టర్ చేయించుకోవడానికి యత్నించడం పరిహాసాస్పదం .. దేవుని పెండ్లికి అందరూ పెద్దలే అన్న చేళ్లపిళ్ల (కథలు - గాథలు) కి ఉన్నంత పెద్ద మనసు చాలా మందికి లేక పోయింది... అని చెప్పడం జరిగింది.

కవిత్వంలో / మడి కాదు / తడి ఉండాలి / కవిత్వం ఏ ఒక్కరి సొత్తో కాదు అని తెలియ చేసారు. తల్లి గురించి చెబుతూ.. / ఒక తల్లి / ..... / ..... / ఒకే బిడ్డతో సరి పెట్టు కుంటుంది. అంటూ తల్లిపై పిల్లల ప్రేమను, పిల్లల పై తల్లి ప్రేమను విశదీకరించడం కనిపిస్తుంది.

వికారి :

వికారి అనే కవితా సంపుటిలో ప్రతి కవిత ఎంతో అద్భుతంగా ఉంది. సైనికుడు, ప్రకృతి, రైతు, మూడో మనిషి, ఇద్దరు, అక్షరాలు, వలసలు, అమ్మ... లాంటి భిన్న అంశాలపై 29 కవితలతో 78 పేజీలతో చక్కని భాష, సులభ శైలీ లో రాశారు.

చివరకు నువ్వే గెలుస్తావు :

ఈ కవితా సంపుటిలో అమ్మ, నాన్న, జండా, సునామి, జెండర్ స్పృహ ..ల గురించి చక్కని కవితలు ఉన్నాయి.

మొదటి అబద్ధం :

ఇది దీర్ఘ కవిత అని చెప్పవచ్చు. 64 పేజీల పుస్తకం,అబద్ధం గురించి సులభ రీతిలో చెప్పడం జరిగింది.

పత్రికా సేవ :

హైదరాబాద్‌లో పుష్కర కాలం పాటు పాత్రికేయునిగా పనిచేసారు. వివిధ పత్రికలలో అనేక సామాజిక, సాహిత్య అంశాలపై వందలాది వ్యాసాలు రాసారు. గాఢమైన విమర్శతో పాటు హాస్య, వ్యంగ్య రచనల్లో కూడా చేయి తిరిగిన రచయిత. సరళ భాష, చక్కని భావ వ్యక్తికరణ పాఠకులను అలరింప జేస్తాయి.

ముగింపు :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ పై శ్రీశ్రీ, అరుద్ర లాంటి అభ్యుదయ కవుల ప్రభావం ప్రస్ఫుటంగా కని పిస్తుంది. తెలుగు సాహిత్యానికి మద్రాస్ లో ఉంటూ సేవ చేయడం గొప్ప విషయం. పూర్తి స్థాయి తమిళ ప్రభావం గల ప్రాంతంలో ఉంటూ తెలుగు సాహితీ సేవ చేయడం ఘనమైన కార్యం. కవిత్వం అంటే సులభ మైన శైలి, వస్తువు, రూపం ఉండి చదువరులను కవిత్వంలో లీనయమ్యేటట్లు ఉండాలి. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ప్రతి కవిత ప్రతి ఒక్కరూ స్వీయానుభూతి కలిగేటట్టు ఉంటుంది. కరోన ప్రభావం వలన వలస కూలీల గురించి చదువుతున్నాం...కానీ వీరు వలస కూలీలపే అపుడే రాశారు. ఈ విధంగా తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్న ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ తెలుగు సాహిత్యంలో నిత్య కృషివలుడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. జీవితం - కవిత్వం, మాడభూషి సంపత్ కుమార్
2. శత్రువుతో ప్రయాణం - మాడభూషి సంపత్ కుమార్
3. ఆలోచనలు -మాడభూషి సంపత్ కుమార్
4. చివరకు నువ్వే గెలుస్తావు - మాడభూషి సంపత్ కుమార్
5. మూడో మనిషి - మాడభూషి సంపత్ కుమార్
6. వికారి - మాడభూషి సంపత్ కుమార్
7. మొదటి అబద్ధం - మాడభూషి సంపత్ కుమార్

❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవత్వానికి మార్గం - మాడభూషి సాహిత్యం

– జి.శ్రీదేవి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

పూజ్యులు మా గురువర్యులు డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ గారికి హృదయపూర్వక నమస్సులు. వీరు బహుభాషా కోవిదులు, మృదు స్వభావి, స్నేహశీలి. అన్నింటికన్నా నన్ను వారి మానవతా దృక్పథం ఎంతో ఆకర్షించింది. నచ్చింది. ఎదుటివారికి సహాయం చేయాలనే తపనను నేను వారిలో చూసాను. మా గురువుగారు ఎంతో అదృష్టవంతులు వారి గురువులు, వారి శిష్యులు, వారి స్నేహితులు, కటుంబం అందరూ వారిని ఎంతో అభిమానిస్తారు, గౌరవిస్తారు.

చదవాలనే ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించి పై చదువులు చదివేట్టు సహకారం అందిస్తారు. అలా వారి ద్వారా ప్రోత్సాహం ప్రయోజనం పొందిన అనేక మందిలో నేను కూడా ఉన్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. నేను ఎం.ఎ.(సోషియోలజీ), పర్సనల్ మేనేజ్మెంట్ చేసినా కూడా వారి సలహాతోనే నేను ఎం.ఎ.(తెలుగు), ఎం.ఫిల్ చేసి ఇప్పుడు పిహెచ్.డి. చేసేట్టు ప్రోత్సాహాన్ని అందించారు మా గురువు మాడభూషి సంపత్ కుమార్ గారు. నాకు ఆశ్చర్యం అనిపించేది ఒక్కోసారి, ప్రతి సభలో, సమావేశాల్లో, జాతీయ సదస్సుల్లో అనేకమంది చెప్పేవారు ఈ రోజు మేము ఇలాంటి మంచి స్థానంలో ఉన్నామంటే దానికి కారణం సంపత్ కుమార్ గారే అని. ఎంత మంది జీవితాల్లో నిశ్శబ్దంగానే వెలుగు నింపారో మీరు.

శిష్యురాలిగా నేను వారిలో గమనించిన విషయం ఏమిటంటే సమాజం పట్ల వారు ఎంతో బాధ్యతతో నడుచుకుంటారు. మంచి ఆలోచన చేస్తారు. అదే మాట్లాడుతారు. అదే ఆచరణలో చూపిస్తారు. అలాగే సమాజంలోని ప్రతి వ్యక్తి కూడా సమాజం కోసం తమవంత సహాయం చేయాలని వారి అభిలాషగా వారి కవితల ద్వారా అర్థం అవుతుంది.

సమాజంలోని ప్రతి మనిషిని వారి అద్భుతమైన రచనల ద్వారా, కవితల ద్వారా కట్టిపడేస్తారు. వారి ప్రతి కవిత చదివే పాఠకుణ్ణి ఆ విషయం పట్ల ఆలోచించెట్టు చేస్తుంది. సమాజంలోని కుళ్ళుని వారంతా కలిసి నశింప చేసేట్టు ప్రోత్సహిస్తుంది. మాడభూషి సంపత్ కుమార్ గారి రచనలు, కవితలు అన్నీ "ఆణిముత్యాలే". నాకు అన్నీ నచ్చినవే. అయితే నిబంధనలకు లోబడి నాకు నచ్చిన కొన్ని తెలియచేస్తాను.

"వికారి" అనే కవితా సంపుటిలో 'భిక్షగాడు' అనే కవిత మొట్టమొదటి కవిత. ఆ కవిత ఇలా ఉంటుంది.

"నాకు
దేవుడి మీద కన్నా
మనిషి మీదే
ఎక్కువ నమ్మకం
అందుకే
గుడి బయటే
అడుక్కుంటాను" (వికారి, పుట.17)

సరిగ్గా 12 పదాలతో, 7 లైన్లలో భిక్షగాడి మనోభావాన్ని పాఠకులకు అతి సులువుగా అర్థం అయి, వారి మనసుకి హత్తుకునేట్టు రాసారు. భిక్షమెత్తుకునే భిక్షగాడికి గుడి బయటే నలుగురు డబ్బు వేస్తే కొంత డబ్బు చేతికి దొరుకుతుంది అని అతని నమ్మకం. ఇంత చిన్న కవిత ద్వారా భిక్షగాడి మనస్సులోని బాధని వ్యక్తీకరించారు.

'కులం' అనే చిట్టి కవిత చదివిన పాఠకుడు సమాజంలో జరిగే కుల, మత ద్వేషాలను వదిలి ఆలోచించేట్టు రాసారు.

"కులంకన్నా
మలమే గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం"(వికారి, పుట.23)

ఈ కవిత చూడండి ఎంత హృద్యంగా రాసారో, మలాన్ని విసర్జిస్తున్నాము కానీ, కులాన్ని మాత్రం ఎంతో అభివృద్ధి దశలో పయనిస్తున్నా కూడా ఇంకా వదిలేయడం లేదు అని మూడు చిట్టి వాక్యాల్లో స్పష్టంగా తెలియచేశారు. కులం మతం అని లేని సమాజాన్ని వారు ఆశించినట్టు తెలుస్తుంది ఈ కవితలో.

"చెరువు శాపం" (వికారి, పుట.18)

'చెరువు శాపం' అనే ఈ కవితలో మనుషులు చెరువు కడుపులో గునపాలు గుచ్చి, చెరువు కడుపుని కొట్టి అపార్ట్మెంట్స్ కడుతున్నారని. అలా చెరువులో గునపాలు గుచ్చినప్పుడు చెట్టు ఏడ్చినట్టు చెరువు కూడా ఏడుస్తుందని. చెరువు కన్నీళ్ళు చూస్తే తెలియదా చెరువు కూడా ఏడుస్తుందని అని, కవిత చదివే పాఠకుడు ఆ దృశ్యాన్ని ఊహించుకుని గుండె బరువయ్యేంత బరువైన మాటలు రాశారు.

త్రాగటానికి నీళ్ళులేక ఇప్పుడు మనుషులకు దాహం వేసి నాలుక పిడుచకట్టిన తర్వాత ఇక్కడ చెరువు ఉన్నట్టు గుర్తొస్తుంది కదా? ఈ చెరువు గట్టున చెట్లు ఎవరి గొడ్డలికి బలై పోయాయో కదా? ఈ చెరువు మీద ఆకాశాన్ని అంటే భవనాలు ఎవరు కట్టారో కదా? ఆ భవనాలు కట్టిన వారు, చేతికందినంత డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితంతో విదేశాలకు పారిపోయారు అని, ఇక్కడే ఉండి చెరువు తల్లి గుండెలమీద కూర్చున్న నీకు ఇప్పుడు నోరు ఎండిపోతుంది నీరు లేక. నువ్వు ఒక్కక్షణమైనా ఆలోచించావా ఇది నా 'చెరువు తల్లి' అని, నా దాహం తీర్చిన కల్పవల్లి అని, అలా అనుకుని ఉంటే ఇప్పుడు ఈ ఊరు మునిగివుండదు నీ నోరు ఎండి ఉండదు అని, దిద్దుకోలేని తప్పు చేసావు కనుక ఇది నీకు, నీలాంటి వారికి చెరువు తల్లి ఇచ్చిన శాపం అని హృదయం తల్లడిల్లి తట్టిలేపేలా రాసారు మాడభూషి గారు.

"నోరు తెరవండి" (వికారి, పుట.28)

మోసపోయిన మహిళ ఆక్రందన గురించి "నోరు తెరవండి" అనే కవితలో ఎంతో వాస్తవమైన విషయాలను తెలియచేశారు. మోసపోయిన మహిళ హృదయ వేదన చదివే పాఠకుడికి కన్నీరు పెట్టే విధంగా ఉంటుంది. మగవాడి దురాగతానికి మోసపోయిన మహిళకు చెపుతున్నట్టుగా ఉంటుంది ఈ కవిత. నువ్వు మోసపోతే నీకు ఎవరూ సానుభూతి చూపరు, నువ్వు నోరు తెరవకున్నా కూడా, ఈ లోకం నోరు మూసుకోదు. ఆ పాడు లోకానికి నీ గురించి చాల సమాచారం ఉంటుంది. రోజు నీ గురించే మాట్లాడుకుంటుంది. "వదిలేసిన దానివి", "తెగించిన దానివి" అంటూ అసభ్యమైన మాటలు నీకు అంటగడుతూ వుంటారు. దీనికన్నా వాళ్ళు నిన్ను "ఎదిరించేదానివి" అని అనుకుంటే సంతోషంగా ఉంటుంది.

నోరు తెరిస్తే నీకు వచ్చిన నష్టం లేదు. అవమానాలు ఎటూ తప్పవు. పక్కింటి ముచ్చట్లు మాట్లాడటం కన్నా, నీ దు:ఖాన్ని పంచుకో, నీ కష్టాలను తెంచుకో. అప్పుడు ఇంట్లోని కామాంధుల నుండి, ఆఫీసులో అల్లరి మూకలు నిన్ను కాలరాసేవారు అందరూ నువ్వు నోరు తెరిస్తే హడలిపోతారు. పరారు అవుతారు. ఇప్పటికైనా నువ్వు "నోరు తెరవమ్మా" అని మోసపోయిన ఆ మహిళకు చేదోడువాదోడుగా ఉన్నట్టు ధైర్యాన్ని చెపుతూ అమూల్యమైన సందేశం ఇచ్చారు ఈ కవిత ద్వారా.

మరణం (వికారి,పుట.41)

దేశ రక్షణకు ప్రాణాన్ని పణంగా పెట్టి సరిహద్దు సైనికుడికి సలాం చేసి గౌరవిస్తూ రాసినట్టు ఉంది ఈ అద్భుతమైన కవిత. ఈ కవితలో తెలిపిన అన్ని విషయాలు గుండెకు హత్తుకునే వాస్తవిక విషయాలే కనిపించాయి నాకు. దేశ భద్రత కాపాడుతున్న సైనికుడిని ఉద్దేశించి ఇలా అంటారు కవి తన మనోభావాన్ని తెలియచేస్తూ. "ప్రాణాలను త్యాగం చేసే వారికి మరణం దరి చేరదు", "సున్నా డిగ్రీ చలిలో కూడా తుపాకీ పట్టుకుని, చేతులు కదపకుండా, అవతల వున్న శత్రువుకి మరణశాసనం రాసే

సైనికుడి మరణం ఉండదు'' అని. ''భార్య, పిల్లలు, కుటుంబాన్ని వదిలి, ప్రతికూల వాతావరణంలోకి వెళ్ళి ప్రాణాలను కూడా త్యాగం చేసేవారికి మరణం అంటదు'' అని. ''దేశం కోసం అతను పొందే మరణం మరణం కాదు త్యాగం''. అతన్ని మరణం ఏమి చేయలేదు అంటూ. చదివే పాఠకుడికి హృదయానికి హత్తుకునేలా అద్భుతమైన కవిత రాసి వారి దేశభక్తి, దేశ సైనికుల పైన వారికున్న అమూల్యమైన స్పందన ''మరణం'' అనే కవిత ద్వారా తెలియజేశారు కవి.

''జై జవాన్ - జై కిసాన్'' అన్నట్టు దేశాన్ని రక్షించే సైనికుడి కవిత మాత్రమే కాకుండా, దేశ ప్రజలకు ఆహారాన్ని అందించేది దేశానికి వెన్నెముక లాంటి 'రైతు' అని గుర్తుంచుకొని 'రైతు ఆత్మకథ' అని శీర్షికతో ఒక కవిత రాసారు.

"రైతు ఆత్మకథ" (వికారి, పుట.60)

రైతుల ఆత్మకథ అనే కవితలో సరైన పంటలు లేక, డబ్బు చేతికి అందక ఆత్మహత్య చేసుకుంటున్న రైతులదర్భరమైన జీవితం గురించి ఏంతో హృద్యంగా రాసారు. చివర్లో.. 'రైతుల కథకు విశ్రాంతి ఉండదు, విరామం ఉండదు, ఇది తరతరాలుగా సాగుతున్నరైతుల చరిత్ర'' అంటారు కవి. ఆత్మవంచన చేసుకునేవాళ్ళు ఉన్నంత వరకు రైతు తన ఆత్మకథ రాసుకోలేడు అని ఈ కవిత చదివిన పాఠకుడి హృదయం చలించిపోయి, తన వంతు బాధ్యత గుర్తుకువచ్చేట్టు చేశారు కవి 'రైతు ఆత్మకథ' కవిత ద్వారా. చివరిగా కవి మాడభూషి కోరుకునేది ఏమిటో వారి మనోభావం ఎలా ఉంటుందో 'గొప్ప' అనే కవిత ద్వారా నాలుగు పదాల్లో వేద వాక్యాల్లా రాసారు.

"గొప్ప" (వికారి, పుట.40)

"మరణం లేని సమాజం కన్నా
మానవత్వం లేని సమాజం గొప్పది కాదు"

మరణం లేని సమాజం కన్నా మానవత్వం ఉన్న సమాజానికే వారు ఏంతో ప్రాముఖ్యత ఇచ్చి వారి మనసు లోని భావుకతను ఈ చిట్టి కవిత ద్వారా అద్భుతంగా తెలిపారు. ఇలా మాడభూషి సంపత్ కుమార్ గారి రచనలు, కవితలు సమాజం గురించి వారు ఆలోచించి నట్టు, చదివే పాఠకుడు కూడా ఆలోచించేట్టు చేసేవిగా ఉంటాయి. అందుకే వీరి రచనలు ''మానవత్వానికి మార్గం''గా ఉంటాయి. పాఠకుడిని చైతన్యపరుస్తాయి.

ఉపయుక్త గ్రంథం :

1. వికారి కవితా సంపుటి - మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు - సామాజిక శ్రేయస్సు

- పల్లెం జ్యోతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

'సాహిత్యం సమాజాభ్యుదయం కోసం' అన్న సిద్ధాంతం దృఢంగా కాలూనుకొని నిలిచింది. ప్రతిభావంతులైన సాహితీకారులు ఈ సాహిత్య ప్రయోజనాన్ని అక్షరాస్యులకు చేరవేయడానికి విభిన్నాంశాల్ని, విభిన్న రీతుల్లో, వైవిధ్యంతో రచనలు చేస్తున్నారు. సాహిత్య సృజనలో రచయిత అంతర్గతంగా తనకు గల సామాజిక బాధ్యతని కూడా గుర్తించి అవసరమైతే సమాజం దశా దిశా మార్చే దిశగా సామాజిక ప్రయోజనం చేకూర్చడానికి తన వంతు కృషి చేస్తాడు.

తమిళ సాహిత్యంలో అశేష పాఠక ప్రజాదరణ పొందిన డాక్టర్ డి.వి.దేవరాజన్ మరియు డాక్టర్ ఎల్.విజయ సుందరం అనే వైద్య ఆచార్యుల కలం నుండి జాలువారిన ఆరోగ్య సంబంధమైన సృజనాత్మక రచనను స్వీకరించి, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారూ సమాజ శ్రేయస్సుకు పెద్దపీట వేస్తూ "ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు సులభమైన మార్గాలు" అనే శీర్షికతో తెలుగు ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో అనుసృజన చేశారు. అనువాదం అంటే సంస్కృత భాషలో పున:కథనం అని అర్థం. ఆధునిక యుగంలో ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం అనే ప్రక్రియకు "అనువాదం" అనే పేరు స్థిరపడిపోయింది. రెండు భాషల్లో మంచి పట్టు ఉంటేనే రచయిత అనువదించడం జరుగుతుంది.

శ్రీమాడభూషి గారు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు మరియు ఆచార్యులు. ఈయన కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, పాత్రికేయుడిగా, భాషావేత్తగా అందరికీ తెలిసిన ఉత్తమ సాహితీవేత్త. ఎందరో తెలుగు ఉపాధ్యాయుల మరియు సాహితీవేత్తల, కవుల, కళాకారుల సేవలను తెలుగులోనికి తీసుకువచ్చి, సన్మానాలు చేసిన సాహిత్య సేవకుడు. పారిశ్రామికవేత్తల పరిచయాలతో ఎందరో పేద విద్యార్థుల జీవితాలకు దారి చూపిన సౌజన్య శీలి. తెలుగు శాక సభలకు సినీ కవులను, గాయకులను, స్వచ్ఛంద సేవా సంస్థలను ఆహ్వానించి మమేకం చేసిన తేజోమూర్తి. 24 గంటల నిర్విరామ కవిసమ్మేళనం జరిపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో తెలుగు శాఖ స్థానంను సుస్థిరం చేసిన కార్యశీలి. ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు తమిళనాడు పాఠ్యప్రణాళిక అధ్యక్షునిగా, అనేక విశ్వ విద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబరుగా, ప్రొఫెసర్స్ ఫోరం ప్రెసిడెంటుగా, సెనేట్ మెంబర్‌గా, మెరీనా క్యాంపస్ డైరెక్టర్‌గా, యూజీసీ, ఏపీ సెట్, సిబిసిఎస్, ఎపిసెట్, టిఎన్ సెట్ లకు అమూల్యమైన సేవలందించారు. మాడభూషి గారు తన ఆధ్వర్యంలో ఇరవై జాతీయ సదస్సులు, పది అంతర్జాతీయ సదస్సులు జరిపించడంతో పాటు, వీరి పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులు ఇరవై ఎనిమిది మంది పిహెచ్.డి.లను, డెబ్భై ఆరు మంది ఎం.ఫిల్.పట్టాలను పొందారు. తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసిన వారి రచనలను హైస్కూల్ స్థాయి నుంచి డిగ్రీ స్థాయి వరకూ పాఠ్యాంశాలుగా ఎంపిక చేయడం గమనార్హం. విదేశాల్లో అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్ర సమర్పణ చేసిన ఘనులు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు 2015వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయంలో తన సేవలందిస్తూ అత్యున్నత డిగ్రీ అయినా డి.లిట్.పట్టా అందుకున్న వారిలో ప్రప్రథముడు. తెలుగు శాఖ కీర్తి నలుదిశలా వ్యాపింపజేసిన ఘనత మాడభూషి గారికే దక్కుతుంది. వృత్తినే దైవంగా భావిస్తూ తన జీవితాన్ని సాహిత్య సేవకు అంకితం చేసిన ఆదర్శమూర్తి.

'వైద్యో నారాయణో హరి'..... వైద్యులు ఈ భూమిపై నడయాడే దేవతలు. కనిపించని దేవుడు ప్రాణం పోస్తే, ఆ ప్రాణం కాపాడటానికి కనిపించే దేవుడే డాక్టరు. నిబద్ధత, సహనంతో రోగికి తగిన చికిత్స అందిస్తూ మాన సిక ధైర్యాన్ని కూడా పెంపొందించే ప్రయత్నం వైద్యుడు చేస్తాడు. ప్రపంచంలో అన్ని వృత్తులూ గొప్పవే అయినా వైద్యవృత్తి పవిత్రమైనది.

ఆచార్య మాడభూషి గారి 'ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు సులభమైన మార్గాలు' అనే అనువాద రచనలో మానవ దేహానికి సంభవించే హృదయ వ్యాధులు, రక్తపోటు, చక్కెరవ్యాధి, కన్ను, చెవి, గొంతు సంబంధిత వ్యాధులు, కాలేయ వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్‌లు, ఆస్తమా, క్షయ, ఎయిడ్స్, జ్వరము, కడుపు నొప్పి, లైంగిక వ్యాధులు మొదలగు వాటిపై పాఠకులకు చక్కని అవగాహన కలిగిస్తూ, గర్భస్థ పిండం దశ నుండి వృద్ధాప్యం వరకూ మానవ జీవితంలో వివిధ దశల్లో సంక్రమించే వ్యాధులు, ఆయా వ్యాధులు సంక్రమించడానికి గల కారణాలు, వైద్య పరిభాషలో ఏ ఏ వ్యాధులను ఏ పేర్లతో పిలుస్తారో వివరిస్తూ ఆయా సందర్భాలలో వైద్యుని సలహాతో చేయించుకోవలసిన వివిధ రకాల వైద్య పరీక్షలను విపులంగా వివరిస్తూ, వ్యాధులు సంక్రమించి నప్పుడు కనిపించే సాధారణ లక్షణాలు, వివిధ రోగాలలో రోగి ఎదుర్కొనే అతి విషమ పరిస్థితులు, వాటి నుండి బయటపడే మార్గాలు, రోగంతో సహజీవనం చేసే రోగి తన దైనందిన కార్యకలాపాలను ఏ విధంగా గడపాలో వివరించిన తీరు అద్భుతం. ఈ ప్రపంచంలో 'ఆరోగ్య సంపద కలవాడే అత్యంత సంపన్నుడు'. ఆరోగ్యం అంటూ ఉంటేనే మానవుడు తాను అనుకున్న లక్ష్యాలను అందుకుంటూ ఆనందమయ జీవితం అనుభవిస్తాడు. అటువంటి ఆనందమయ జీవితానికి పాఠకులకు దిశానిర్దేశం చేస్తూ చెడు వ్యసనాలు అయిన పొగ తాగడం, మద్యపానం, మితిమీరి తినడం, అధిక కొవ్వు గల ఆహా రాలను స్వీకరించడం, చిన్నచిన్న రోగకారక లక్షణాలను అలక్ష్యం చేయడం, వ్యాయామం చేయకపోవడం, విదేశీ చిరుతిళ్ళ పై మోజు, సోమరితనం, అధికమైన కోపాన్ని కలిగి ఉండటం వలన మానవులకు సంభవించే మార్పులు, దానివల్లనే ఏ శరీర భాగాలు రోగానికి గురి అవుతాయో చక్కగా వివరించడం జరిగింది. ఈ అవ లక్షణాలను అధిగమించడానికి వైద్యుని సలహాతో రోగులు తగిన వ్యాయామం, నడక, సమయపాలనతో కూడిన భోజనం, తగిన నిద్ర, ఒత్తిడి జయించే విధానం, సమస్యలను ఎదుర్కొనేవిధానం నైపుణ్య సహితంగా వివరించడం జరిగింది.

ఈ గ్రంథంలో పాఠకునిగా ఆశ్చర్యానికి గురిచేసే విషయాలు ఏమిటంటే చిన్నపిల్లలకు బాల్యంలో సాధా రణంగా కనిపించే గొంతు నొప్పి గుండెజబ్బుకు ఒక సాధా రణ లక్షణం కావడం. శరీరం మీద కనిపించే పుట్టుమచ్చ పెరుగుతూ ఉండడం క్యాన్సర్ వ్యాధి లక్షణం, చంటి బిడ్డకు మాటలు రాకపోవడం నాలుక క్రింది భాగంలో అతుక్కొని ఉండడం కూడా ఒక కారణం కావచ్చు. అలాగే రోగులు తమకు ఏదైనా దీర్ఘకాలిక వ్యాధి వచ్చినప్పుడు వారి మీద వారు విపరీతమైన శ్రద్ధ చూపడం, తరువాత అన్నింటినీ విస్మరించడం చేస్తూ ఉంటారు. ఇక్కడ వైద్య రచయితలు రోగి నాడిని పూర్తిగా అర్థం చేసుకున్నారు అనటంలో సందేహం లేదు.

ఎంత ఎత్తుకు ఎంత బరువుండాలి, బరువును బట్టి ఎన్ని కేలరీల ఆహారాన్ని స్వీకరించాలి, దానికోసం ఏ విధంగా లెక్కలు కట్టాలో వివరించే తీరు సామాన్య పాఠకు లకు సైతం సులభంగా అర్థమవుతుంది. అలాగే అంత ర్జాల ఉద్యోగస్తులకు కంటి సంబంధ వ్యాధులు రాకుండా వివరించే నివారణోపాయాలు సులభమైనవి, ఆచరణకు అనువైనవి. అలాగే పర్యావరణ సమతుల్యాన్ని విషతుల్యం చేసే వివిధ రకాల కారణాలను చర్చించడం ఎంతో ప్రయోజనకరం.

దుర్వ్యసనాలు వలన జ్ఞాపకశక్తి నశిస్తుంది. శరీరంలో అనేక అవయవాలు రోగాల బారిన పడతాయి. పైగా

తాగిన మైకంలో సంఘ విద్రోహక చర్యలకు కూడా పాల్పడే అవకాశం ఉంది. మత్తుపానీయాలు, ధూమపానం అయినా ఒకేసారి మానివేస్తే రోగిలో తెలియని అయోమయం, వణుకు, విపరీతమైన కోపం, విసుగు, ఫిట్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్య అవగాహనతో వ్యసనాలకు దూరం కావాలని భావించే వారు వైద్యుని పర్యవేక్షణలోనే తమ దురలవాట్లను దూరం చేసుకోవాలి.

'అధికం అమృతం విషం'.... ఎక్కువగా తీసుకుంటే అమృతం కూడా విషంగా మారిపోతుంది. 'నాలుక దాటితే నరకంలో పడిపోతుంది' అనే పెద్దల ఉవాచ ప్రకారం పోషక విలువలతో కూడిన మితమైన ఆహార స్వీకరణ అత్యుత్తమం. రచయిత వివిధ రకాల రోగులు వారి దైనందిన జీవితంలో తమ రోగాన్ని అదుపులో ఉంచుకోవడానికి ఏ ఏ ఆహార పదార్థాలను ఎంత మోతాదులో స్వీకరించాలి, ఏ విధంగా స్వీకరించాలి, సమయపాలన సహితంగా వివరించడం ఎంతో ఉపయోగకరం. అంతేకాకుండా వివిధ రకాల ధాన్యాలు, గింజలు, మాంసాహారం, దుంపలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దినుసులు, నూనెలు, మత్తు పానీయాలు, వివిధ రకాల ప్రకృతి పానీయాలు, కృత్రిమ పానీయాలు, అల్పాహారాలు మొదలగు వాటిలో గల పోషక విలువలను పట్టికతో సహా వివరించడం ముదావహం. అలాగే శిశువులకు పెరిగే క్రమంలో ఆయా దశల్లో ఇవ్వగల పోషకాహారం సూచిస్తూ వయస్సును అనుసరిస్తూ ఇప్పించే టీకాల గురించి, ఆధునిక వైద్య విధానాలు మరియు వివిధ రకాల మానవ ఆరోగ్య నిర్ధారణ పరీక్షల గురించి కూలంకషంగా వివరించడం ప్రశంసనీయం.

సనాతన హిందూ సంప్రదాయంలో మన భారతీయ జీవన విధానం ఎంతో ఉత్కృష్టమైనది. మన సాహిత్య సంపదకు తలమానికమైన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మొదలైన వాటిని తరచి చూస్తే ఆరోగ్య, ఆధ్యాత్మిక విలువలతో కూడిన భారతీయ జీవన శైలి ఋషుల నుండి మనకు సంక్రమించిన పారంపర్య నిధి. అటువంటి జీవన విధానాన్ని విడనాడి, విదేశీ మోజులో పడి, ఆధునికత వైపు అర్రులుచాస్తూ మనం కొని తెచ్చుకున్న వివిధ రకాల రోగాలను, వాటి నివారణ విధానాలను వివరిస్తూ, చక్కని జీవనశైలికి రచయిత సామాజిక బాధ్యతతో ఆరోగ్యవంతమైన మానవ సమాజ శ్రేయస్సే తన ధ్యేయంగా చేసిన అనుసృజన ఇది.

ప్రకృతిలో ఉన్న ఏ జీవినయినా పరిశీలిస్తే అవి ఎప్పుడూ ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తించవు. కానీ మానవుడు సమయపాలనను విస్మరించి, నాగరికత పేరుతో, మితి మీరిన ఆధునిక జీవనశైలిలో పయనిస్తూ శరీరాన్ని నరకప్రాయంగా మార్చుకుంటున్నాడు. అటువంటి నరకం నుండి బయట పడి, జీవితంను స్వర్గధామంగా మార్చుకోవడానికి ఉపయోగపడే సాధనమే ఈ గ్రంథం. ఒక స్త్రీ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన బాటలో తన కుటుంబాన్ని నడపగలదు. రచయిత స్త్రీల యొక్క గౌరవాన్ని ఇనుమడింప చేస్తూ, స్త్రీ ఆరోగ్యం గురించి అన్ని రకాల పార్శ్వాల నుండి చక్కగా విశ్లేషించారు.

బిడ్డ ఆరోగ్యంపై తల్లి యొక్క అవగాహనా శక్తిని పెంచుతూ శిశువులకు స్తన్యం ఇవ్వడంవలన స్త్రీల ఆర్యోగం మరింత ఇనుమడించి రాబోయే కాలంలో బ్రెస్ట్ క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. ఇది స్త్రీలకు ప్రకృతి ప్రసాదించిన వరం. అందువలన గర్భస్థ పిండం నుండి నవజాత శిశువు వరకు తల్లి పాటించవలసిన విధివిధానాలను వివరిస్తూ తల్లిపాలశ్రేష్ఠతను నొక్కి వక్కాణించారు. సర్వమానవాళి చెడు అలవాట్లను విసర్జించి, ఆరోగ్యకరమైన సమాజం స్థాపనకు ఆధ్యాత్మిక బాటలో పయనిస్తూ, యోగ, ధ్యానంను సాధన చేస్తూ, శాంతియుత ఆహ్లాదకర జీవనానికి కుటుంబంతో మమేకమై సంప్రదాయ ఆహారపు అలవాట్లను అనుసరిస్తూ, ఋషుల వలె మితమైన ఆహారం స్వీకరిస్తూ, శారీరకంగా, మానసికంగా

బల సంపన్నులమై రచయిత యొక్క రచనా దృక్పథాన్ని అవగాహన చేసుకుంటూ, అనుసరిస్తూ, ఆచరిస్తూ, ఆరోగ్యకర జీవన విధి విధానంతో వ్యాధినిరోధక శక్తిని పెంచుకుంటూ, హాయిగా ఆనందంగా జీవనం సాగిద్దాం. కరోనా మహమ్మారి ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న ప్రస్తుత తరుణంలో మూఢాచారాలు, చాదస్తపు అలవాట్లు అంటూ ప్రక్కన పెట్టిన హిందూ సనాతన జీవన విధానాన్ని పాటిస్తూ, ఆహారాన్నే ఔషధంగా స్వీకరిస్తూ ఎటువంటి వైరస్‌లను అయినా తరిమికొట్టగలిగే సత్తా మన భారతీయులకు ఉందని ప్రపంచానికి చాటి చెబుదాం.

ప్రస్తుత సమాజంలో స్త్రీ పురుషులను సైతం పట్టి పీడిస్తున్న హార్మోన్ల అసమతుల్యత వలన ఏర్పడిన థైరాయిడ్ సమస్యను గురించి వివరంగా విశ్లేషిస్తూ తగిన సూచనలు సలహాలతో కూడిన అనుసృజన రచన చేయగలరని విశ్వసిస్తూ మరిన్ని రచనలు మాడభూషి వారి కలం నుండి జాలువారాలని ఆశిద్దాం.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు సులభమైన మార్గాలు (తమిళ మూలం : డాక్టర్ డి.వి.దేవరాజన్, డాక్టర్ ఎల్.విజయ సుందరం, తెలుగు అనువాదం: ఆచార్య మాడభూషి సంపత్ కుమార్)

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శత్రువుతో ప్రయాణం' కవిత్వం - స్త్రీ

- డాక్టర్ ఒరుగంటి సరస్వతి, నిఘంటు నిర్మాణ శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాదు.

సమాజంలోని అన్ని కోణాల్ని స్పృశించగలిగేదే సాహిత్యం. కవి లేదా రచయిత సమాజంలో తన చుట్టూ జరుగుతున్నటువంటి సంఘటనల్ని నేపథ్యంగా తీసుకొని, ఆయా సందర్భాల్ని పాఠకులకు అందిస్తున్నారు. సమస్య లేదా సందర్భం ఏదైనా కావచ్చు. కానీ సమాజాన్ని మేల్కొలిపే రీతిలో ఆయా రచయితల రచనా పాఠవం అద్వితీయం. ఆ కోవలోనే ఆచార్యులు, కవి, రచయిత, మాడభూషి సంపత్‌కుమార్ గారి గురించి ప్రస్తావించుకోవాలి.

కవి రాసే రచనలే వారి హృదయాన్ని ఆవిష్కరించేలా చేస్తాయనడంలో సందేహం లేదు. సమాజంలో నిత్యం జరిగే ఎన్నో సమస్యల్ని కళ్ళముందు చూస్తూ భరించలేక, ఆ బాధాతప్త హృదయంలోంచి "శత్రువుతో ప్రయాణం" అనే కవిత్వం జాలువారిందని చెప్పవచ్చు. ఈ కవితా సంపుటానికి ప్రముఖ రచయిత, సాహితీవేత్త ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ రాశారు. వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యులుగా, రచయితగా, విమర్శకులుగా, వక్తగా ప్రసిద్ధి చెందారు. వీరు ఎంతో మంది పరిశోధక విద్యార్థులను, పరిశోధనలో మార్గంగా నిలిచారు. వీరు ''జీవితం-కవిత్వం'', శత్రువుతో ప్రయాణం, కవితా సంపటులు జన్మభూమి, అమ్మ వాసిన, సామాజిక శాస్త్రవేత్త పెరియార్, కవితా ఓ కవితా, వస్తువు, భాష, శైలి, మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ అనే గ్రంథాలు రచించారు. ''శత్రువుతో ప్రయాణం" కవితా సంపుటిలో రచయిత సమాజంలోని మనుష్యుల జీవిత రహస్యాల్ని అంతర్నిగూఢంగా తెలియజేశారు.

ఆధునికయుగంగా చెప్పుకుంటున్న నేటికాలంలో కూడా ఆడపిల్లలపై అన్నిరకాలుగా వివక్షత కొనసాగుతూనే ఉంది. ''ఆమె కవితను ఒక్కసారి పరికించి నట్లయితే.....

ఆకాశమంతా వ్యాపించి
అందీఅందని ఆ తేజోమూర్తిని చూసి
నిందలు మోపేవాళ్ళెందరో -
మబ్బుల నడుమ నుంచి
అప్పుడప్పుడూ మెరుస్తూ ఉంటేనే
ఇంత అసూయగా ఉంటే
పున్నమి వెన్నెల్లా విరిస్తే
రెక్కలు ముక్కలు చేసుకొని
ఆకాశానికి ఎగురుతున్న ఆమె రెక్కల్ని
ముక్కలు చెయ్యడానికి ఎందరో.....అంటే

స్త్రీని ఎంత అణచినా ఆమెలో ఉండే చైతన్యం వెల్లివిరుస్తూనే ఉంటుంది. ఇంత అణచివేతలోనే కొద్ది ప్రయత్నానికే ఆమె అంటే (స్త్రీ) ఏమిటో చూపించే శక్తి గలది స్త్రీ. అలాంటి స్త్రీని ముందుకు పోనియ్యని వైనాన్ని పై కవితలో చిత్రించారు.

అంతేకాకుండా...."చేసిన పనికి కృతజ్ఞత లేదు
చెయ్యాల్సిన పనికి మాత్రం దబాయింపులు
మొగుడింటికి
పోతే చెప్పుదెబ్బలు తింటావని శాపనార్థాలు
ముందుగానే మొగుడికి అనుమతి లభించింది
ఇక పెళ్ళాంగా ఆమె గతి అధోగతి!.....

అంటే ఆడపిల్లకు ఎక్కడా విలువలేని వైనాన్ని ఈ కవితలో కన్పిస్తుంది. అంతేకాకుండా స్త్రీ మనోభావాలికి దెబ్బతగిలినా ప్రశ్నించకూడదన్న వైఖరిని కవి ఈ క్రిందివిధంగా వివరించారు.

"ఆమె నిఘంటువు నుంచి "ఎ" నిషేదితం
అందుకే / ఎందుకు? ఏమిటి? ఎవరు? ఎలా?
ఎప్పుడు? ఎక్కడ?

లాంటి ప్రశ్నలు ఆమె నోట్ల రాకూడదని శాసనం

శాసనోల్లంఘన చేస్తే / తిట్లు రాట్లు పాట్లు
కండబలంతో అణగదొక్కడం
పదిమంది ముందే అవమానించడం
పశువులా ప్రవర్తించడం / గొడ్డును బాదినట్టే
అన్నీ ఓర్చుకొని పడివుంటేనే.
లోకంలో భార్యనే అంతస్తు నిలబడుతుంది!
స్త్రీని ఎదగనివ్వాలి అని సందేశాన్ని కూడా కవి ఇచ్చారు.
మానవ జీవితాన్ని నడిపించే / ఆమెకు
మానవతిగా పేరు లేదు
ఆమెను మానవత్వంతో చూడ్డం లేదు
కనీసం / మనిషిగా గుర్తింపులేదు
అయినా / ఆమె లేకుండా
మానవ చక్రం పరిభ్రమించదు /అందుకే

ఆమెను / పరిమళించనివ్వండి / లోకాన్ని సుభరితం చెయ్యండి! అని స్త్రీ ఎదుగుదలను ఆమె కివ్వాల్సిన స్వేచ్ఛను, గౌరవించాల్సిన తీరును కవి వివరించారు.

"శత్రువుతో ప్రయాణం" కవితా సంపుటిలో స్త్రీని గురించి చర్చించిన మరో కవిత్వ "స్వర్గం". ఈ కవిత్వాన్ని ఒక్కసారి పరికిస్తే స్వర్గం అనే పదం వినడానికి అందరికీ స్వర్గంలాగా వినిపించిన, అనుభవించే తీరుల్లో ఎంతో తేడా ఉంటుందన్న విషయాన్ని ఈ క్రింది కవిత్వం చూస్తే అర్థమవుతుంది.

"వాడి కోరికలు తీర్చే / దేవతను నేను
నా కోరికల్ని అణచివేసే / రాక్షసుడు వాడు
స్వర్గంపైకి దండయాత్ర చేస్తాడు
నరకాన్ని స్థాపించాలంటాడు"

అంటూ క్రూరంగా స్త్రీలను హింసించే మూగ రాక్ష సత్వాన్ని కవి వివరించారు.

"వాడు సచ్చి స్వర్గానికిపోతాడు / నేను సచ్చి నరకానికి పోతాను / అక్కడకూడా వాడు / స్వర్గసుఖాలు అనుభ విస్తాడు / వాడు లేని నరకం / నాకు స్వర్గం

నేను స్వర్గస్తురాలినవుతున్నా!" అంటూ స్త్రీ ఇష్టాన్ని గౌరవించలేని మగాళ్ళ దుస్థితికి ఈ కవిత్వం నిదర్శనం. స్త్రీల ఇష్టాల్ని, మనోభావాల్ని గౌరవించాల్సిన సందేశాన్ని కవి పై కవిత ద్వారా అందించాడు.

నేటి సమాజం దుస్థితి చూస్తే ఎటువైపు వెళ్ళి పోతున్నామో అర్థంకాని దుస్థితి. కన్నతండ్రి కసాయిలుగా మారి కన్నబిడ్డలపై పైశాచికత్వం ఏమిటి? వినడానికే గుండె పగిలినంత పని అవుతుంది. ఈ కోణాన్ని కూడా కవి స్పృశించి "తండ్రి" అనే కవితను రాశారు.

"ఇది ఒకసారి కాదు / ఒకరోజు కాదు / ఒక తండ్రి కాదు / కన్నబిడ్డనే కామించే తండ్రులు / తండోప తండాలుగా పత్రికల్లో మొలుస్తూనే ఉన్నారు / టీవీల్లో మెరుస్తూనే ఉన్నారు" అంటూ ఆడపిల్లలపై వావివరుసలు మరచి అఘాయిత్యాలకు పాల్పడే వైనాన్ని వివరించారు.

ఇలా ఏరకంగా చూసినా స్త్రీ అందరి వివక్షతలకూ, పైశాచికత్వానికి బలవ్వడానికే పుట్టిందా? అన్న ఆలోచనలు ప్రతిఒక్కరికీ కలుగక మానవు. ఆడపిల్లకు చిన్నప్పటినుంచే బుద్ధులు నేర్పే సమాజం మగవారికి స్త్రీల పట్ల ఉండాల్సిన బాధ్యతను ఎందుకు గుర్తు చెయ్యదు. ఆడపిల్ల అణగి మణగి ఉండేలా చూసుకోమనే సంస్కృతిని నేర్పకనే మగాడికి నేర్పిస్తుందేమోనని "మగాడు" అనే ఈ క్రింది కవిత ద్వారా అర్థం చేసుకోవచ్చు.

"ఆడామగా / వైవిధ్యం అనుకున్నా
కానీ వైరుధ్యం / వివిధ భావాలతో
కట్టుకున్న గూడు వైవిధ్యం / వివిధ విరోధాలతో
నడిచేతోడు వైరుధ్యం"

- అంటూ స్త్రీ పురుషుల భావాల తీరును వివరించారు.

ఇంకా స్త్రీ మనోవేదనకు అద్దం పట్టే వాక్యాలు ఈ కవితకు సంబంధించి పరిశీలించినట్లయితే

"చెవులు కుట్టారు / ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా / భరించాను నోరుమూసుకొని

అంతా నా అందం కోసమేనని
తీరా నోరు తెరవాలని /ప్రయత్నించినప్పుడుగానీ
తెలియలేదు / ముందుగానే
నోరుకూడా కుట్టేశారని!"

- స్త్రీని అణచివేసే పరిస్థితులను కవి చెప్పకనే చెప్పారు. అంతేకాకుండా ఇంకా ఈ కవితలోనే

నాకు దుఃఖం వచ్చినా / వాడు ఆనందిస్తాడు
వాడు భర్తయినందుకు / బరితెగిస్తున్నాడు
నేను భార్యనయినందుకు / భరిస్తున్నాను!"

అంటూ స్త్రీ మనోవేదనను, ఆమె అంతరంగాన్ని వివరించాడు. స్త్రీగా ఆమె ఔన్నత్యాన్ని గుర్తించాల్సిన సందేశాన్నిచ్చాడు.

అలాగే "రెక్కలు తొడుక్కొని / పక్షిలా ఎగిరే మనసుని / ముక్కలుచేసి / మూల కూర్చోబెట్టారు /దానిపేరు పెళ్ళి" - / "ఇతరుల ఇష్టాన్ని గురించి / ఆలోచించడానికి / ఏ తల్లోనూ మెదడుండదు" అని కవి వివరించారు.

ఆడపిల్లగా పుట్టిన ప్రతిఒక్కరికి ఎన్నో ఊహలు, కలలు, ఆశలు ఉంటాయి. పెళ్ళి పేరుతో ఒక్కసారిగా జీవితం మారుతుంది స్త్రీకి. ఆ జీవితం సంతోషంగా సాగని స్త్రీ పరిస్థితిని ఆలోచించని, తల్లిదండ్రుల, కుటుంబ, సమాజ ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న సందేశాన్నిచ్చారు కవి మాడభూషి సంపత్ కుమార్.

పై విధంగా కవి, రచయిత స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాల్ని ఎండగట్టాల్సిన తీరును తన కవితల ద్వారా సందేశాన్నిచ్చారు. ప్రతినిత్యం వావివరుసలు మరిచే తండ్రిలాంటివారు కూడా ఆడపిల్లలపై అఘాయిత్యాలు చేసే పైశాచికత్వాన్ని "తండ్ర" అనే కవితలో చిత్రించారు. స్త్రీని అణచివేసిన కొద్దీ ఎదుగగలదన్న సందేశాన్ని "మగాడు" అనే కవిత ద్వారా తెలుసుకుంటాం. స్త్రీని నోరు తెరవనియ్యని సంస్కృతిని కూడా "మగాడు" కవిత ద్వారా ఎండగట్టించాలని రచయిత ప్రయత్నం. అంతే కాకుండా శత్రువుతో ప్రయాణం అనే ఈ కవితా సంపుటిలో అన్ని కవితలు సమాజాన్ని ప్రశ్నించే ఆణిముత్యాలే. అందులో "ఆమె" కవిత స్త్రీ జాతి ఔన్నత్యాన్ని ఆకాశంలో సగం, అవనిలో సగం, అంతటా స్త్రీలే ఉండాలన్న స్ఫూర్తిని కలిగించగలిగే నేపథ్యంలో ఉన్న కవిత. స్త్రీ ముందుకు నడవాలి, ప్రశ్నించాలి, మనుగడను కాపాడుకోవాలి. ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలన్న ధైర్యాన్ని నింపేలా ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి "శత్రువుతో ప్రయాణం" సాహిత్యంలో స్త్రీ అభ్యున్నతిని కాంక్షించే మైలురాయి లాంటి కవిత్వం.

ఇంతటి స్త్రీ అభ్యున్నతిని కాంక్షించి సమాజంలో స్త్రీకి ఇవ్వాల్సిన హోదాను, గౌరవాన్ని, స్వేచ్ఛను ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న సందేశాన్నిచ్చిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి "శత్రువుతో ప్రయాణం" కవితా సంపుటి తెలుగు సాహిత్య చరిత్ర ఉన్నన్నాళ్ళు మరువలేం. వారి కలం నుండి సమాజాన్ని మేల్కొలిపే మరెన్నో రచనలు వెలువడాలని ఆంకాంక్షిద్దాం.....

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వికారి - మానవత్వపు విలువలు

- పాలడుగుల శివ నాగ రాజారావు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా, పరిషత్ ఉన్నతపాఠశాల, కృష్ణా జిల్లా.

ఒక్కసారి గడిచిన కాలంలోనికి వెనక్కి తిరిగి చూసుకుంటే వంద సంవత్సరాల క్రితం మద్రాసు మహా నగరం తెలుగు భాషకు కాణాచియై గొప్ప గొప్ప పండితులతో, కవులతో పరిశోధకులతో, అద్భుతమైన సాహిత్య పరిశోధనలతో, అజరామరమైన సాహిత్యంతో , సాహితీ సమావేశాలతో అలరారుతూ ఉండేది. మరలా ఆనాటి వైభవాన్ని గుర్తుకు తెస్తూ ఈ నవీన యుగపు నూతన శతాబ్దంలో తమిళదేశంలో అదే మద్రాస్ మహానగరం లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా తెలుగు భాషాభివృద్ధి కొరకు కషి చేస్తూ మానవాళికి ఉపయోగపడేటటువంటి అనేక సాహిత్య రచనలు చేస్తున్న నిత్య సాహితీ కృషీవలులు శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు. వారు రచించిన వికారి కవితా సంపుటి సరళమైన భాషతో మృదు మధురమైన పదాలతో మానవత్వపు పరిమళాలతో మనసుకు హత్తుకునేటట్లుగా సుమనోహరంగా వుంది. నాకు దేవుని మీద కన్నా మనిషి మీదే నమ్మకం ఎక్కువ అంటారు "భిక్షగాడు" కవితలో. " గుడిలో దేవుని కంటే అన్నం పెట్టే మానవుడే దేవుడని, మానవసేవయే మాధవ సేవ" అని తక్కువ పదాలలో ఎక్కువ భావము వచ్చేలా వివరించారు. "చెరువుశాపం" అను కవితలో నీటిని తన కడుపునందు దాచుకుని పశు పక్ష్యాదులకే కాదు మానవులకు కూడా దాహార్తిని తీరుస్తూ వ్యవసాయానికి ఉపయోగపడే చెరువులను అభివఅద్ధి పేరిట దానిని ఉపయోగించుకున్న మానవులే నాశనం చేస్తుంటే ఆ చెరువు బాధపడుతూ ఏమీ చేయలేక ఇచ్చిన శాపము వల్లనే ఈ వరదలు, ప్రకృతి ప్రళయాలు, విలయాలు,కరువులు అన్నీ సంభవిస్తున్నాయని కనుక చెరువులను కాపాడుకోవలిసిన బాధ్యత మనందరిదీ అని సుతిమెత్తగా మనలను హెచ్చరించారు. ఆత్మహత్య అనేది మహా పాపమని, కోపమే అన్నింటికీ కారణమని కావున కోపాన్ని తగ్గించుకోవడము చాలా మంచిదని " హత్య-ఆత్మహత్య" కవిత ద్వారా మనము ఆలోచించేలా చేశారు. 3 + 3 = 33 కవిత ద్వారా కాలం ఎంత విలువయినదో చక్కగా విశదీకరించారు. తరతరాలుగా మానవుడు ఎంత నాగరికంగా అభివఅద్ధి చెందినా స్త్రీల పట్ల హింసా ప్రవృత్తి మాత్రం అనాగరిక స్థాయి కన్నాహీనస్థాయికి చేరి పోయింది. ఈ దారుణాలను చూసి తట్టుకోలేకపోయిన రచయిత " నోరు తెరవండి" అన్న కవితలో స్త్రీలు ఎలా ఉద్యమించాలో మార్గనిర్దేశం చేశారు. "ఇకనైనా నోరు తెరచి మాట్లాడండమ్మా వేల సంవత్సరాల నుంచి మౌనంగా ఉంచిన నోరు తెరవడానికి కొంచెం ఇబ్బందిగా ఉన్నా నోరు తెరచి మాట్లాడండి. నోరు తెరిస్తే పోయేదేమి లేదు అవమానాలు తప్ప" అంటూ స్త్రీలను ఉత్తేజపరచారు. "శబ్దం" అనే కవిత ద్వారా "శబ్దం నిశ్శబ్దంగా కవిత్వం లోకి దూరి మనసును కలవర పెడుతుంది .మానవ మనుగడకు శాశ్వత రూపాన్నిస్తుందని "శబ్దం యొక్క గొప్పదనాన్ని వివరించారు. మాడభూషి సంపత్ కుమార్ గారి రచనల్లో మరో కోణం అద్భుతమైన మనస్తత్వ విశ్లేషణాత్మక రచన శత్రువు "కవిత." " నీకు శత్రువు లెవ్వరూ లేరు నీకు నీవే శత్రువు. నీ అసూయే నీకు శత్రువు నిన్ను పతనం చేస్తుంది "అంటూ మానసిక పరిపక్వత లేని వాళ్ళకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని సరియైన దారిలో పెట్టగల రచన ఈ శత్రువు కవిత. "నా మరణానికి కారణం నా పుట్టుకే "అని అంత్యాను ప్రాసాలంకారములతో "మరణశాసనం" అన్న కవిత మనల్ని మరింతగా ఆకట్టుకుంటుంది. చిరునవ్వుతో పలకరింపు యొక్క గొప్ప

దనం గురించి "చెరగని చిరునవ్వు" కవిత మన పెదాలపై చిరునవ్వులు పూయిస్తుంది. "మరణం లేని సమాజం కన్నా మానవత్వం లేని సమాజం గొప్పది కాదు" అని మానవత్వం గురించి చెప్పారు. "ప్రాణాలను సైతం త్యాగం చేసేవాడికి మరణం అంటదు. దేశం కోసం అతను పొందే మరణం మరణం కాదు త్యాగం అతన్ని మరణం అంటదు "దేశ రక్షణ కోసం త్యాగాలు చేసే సైనికుల గొప్పదనాన్ని మరణం కవిత ద్వారా మనకు మనోవికాసం కలిగించారు. నేటి సమకాలీన రాజకీయ ముఖచిత్రాన్ని,ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రజల ఆలోచన లలో వచ్చే మార్పులను ఓటు అనే ఆయుధం ద్వారా రాజకీయాలను ప్రజలు ఎలా ప్రభావితం చేయగలరో కళ్ళకు కట్టినట్లు చూపిన మరో అద్భుత కవిత "రెండం చుల కత్తి". "రాత్రంతా వెలిగిన చంద్రుడు ఇంకో చోట వెలగడానికి వెళుతున్నాడు తప్ప సేద తీరడానికి కాదు. పగలంతా నడిచిన సూర్యుడు రాత్రి అయిందని పడుకోవ డానికి పోవడంలేదు. ఇంకో తీరానికి నడక సాగిస్తాడు. అక్కడా వెలుగు చూపడానికి. అలాగే ఇతరులకు సేవ చేసేవారికి నిద్ర వుండదు.నిలకడ వుండదు."అని పరులకు సేవచేయడం గురించి సూర్య చంద్రులను ఉపమానా లుగా తీసుకొని "సేవ "అనే కవితలో చక్కగా అలం కారమయం చేశారు.". భయం భయపెడుతునే ఉంటుంది దాన్ని మోసినంతకాలం. ఒకసారి భయపెట్టి చూస్తేచాలు జీవితాంతం అది భయపడుతునే ఉంటుంది" అని భయంతో భయపడేవారికి ధైర్యం చెప్పిన "భయం "అనే కథ చక్కని మనోవిశ్లేషణాత్మక కవిత. "పువ్వులు రాలి పోయేటప్పుడు కన్నీళ్ళు కార్చవు హృదయాలు పరిమళింప జేస్తాయి. పువ్వులు ఆకులు పండ్లు పరోప కారము చేసి కన్నీరు కారుస్తాయి. మనిషి తాను ఎవరికీ ఉపయోగ పడలేకపోయాననే ఆలోచనలో బాధ పడినపుడు మాత్రమే ఆ ఏడుపుకు అర్థం వుంటుంది. "అని ఏడుపు పర మార్థాన్ని "ఏడుపు" అనే కవితలో వివరించారు. చీకటి, గుణపాఠం, చింతన అనే రచనలు మనిషిని మనిషిగా మార్చగలిగే లోతైన విశ్లేషణఉన్నటువంటి వేదాంత ధోరణికలిగిన రచనలు. మనం అసహ్యించుకునే మల మూత్రాదులను శుభ్రపరచే పాకీ పనివారి పట్ల మంచి భావాన్ని ఏర్పాటు చేసుకోవాలని "వినర్జన "కవిత ద్వారా విశ్లేషించారు. మన కోసం అనునిత్యము కష్టపడి సరైన ఫలితము పొందలేని రైతు గురించి "రైతు ఆత్మకథ" అనే కవిత నందున "రైతు ఆత్మకథ కు విరామం ఉండదు. తరతరాలుగా సాగుతునే ఉంటుంది "అనిమనసుకు హత్తుకునేటట్లుగా రచన చేశారు. అబద్దాన్ని కూడా అందంగా చూపించే అద్దం గురించి చెపుతూ నలుగురిని కలుపుకొని చూస్తేనే నిజం ఏదో తెలుస్తుందని "అద్దం" కవితలో ప్రతిరూపంగా చూపిం చారు. యుద్ధం తప్పనిసరి అని యుద్ధముఅప్పుడప్పుడు నీరసంగా ఉన్న జనానికి గ్లూకోజ్ వంటిదని, యుద్ధము కవులు, మేధావుల మేథస్సుకు పదును పెడుతుందని, సమాజంలో మార్పులు సమూలంగా జరుగుతాయని "యుద్ధం "కవితలో యదార్థ విశ్లేషణ చేశారు. ఆడపిల్లల మీద జరుగుతున్న దారుణాలకు, దుర్మార్గాలకు రచయిత చలించిపోయి వ్రాసిన కవిత "కుక్కలున్నాయి జాగ్రత్త". మానవ రూపంలో పిచ్చి కుక్కలుంటాయని ఆడపిల్లలను సుతిమెత్తగా హెచ్చరిస్తూ వ్రాసిన కవిత కుక్కలున్నాయి జాగ్రత్త. శ్రీ శ్రీ, గురజాడ, కందుకూరి వారి లాంటి మహాకవుల రచనలన్నీకూడా మానవుడు మారాలని మూఢ నమ్మకాలను వదలి వేయాలని, పరోపకారము మానవత్వము కలిగివున్న సమాజ మును కలిగివుండాలనే దఅష్టి తోనే ఉంటాయి. అలాంటి కోవకు చెందిన రచనే ఈ వికారి కవితా సంపుటి. మాడభూషి సంపత్ కుమార్ గారి లాంటి సాహితీ సేవకులు, సాహిత్య కృషీవలులు చేసిన ఈ కృషి, చేస్తున్న కృషి తెలుగు భాషాభిమానులుగా మనకు గర్వకారణం.

"దేశభాషలందు తెలుగు లెస్స". జై తెలుగుతల్లి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపాదక 'విజేత' మాడభూషి

- శ్రీమతి చిక్కుల లక్ష్మి, విజయనగరం.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు "ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం" అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పొందారు. "తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు" అన్న అంశంపై డి.లిట్ పట్టా పొందారు. అనేక అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్ర సమర్పణ చేసారు. తెలుగు లిపిపై బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ లిపుల సమావేశంలో పాల్గొని తెలుగు లిపికి 'ఉత్తమ లిపి' అన్న ఖ్యాతిని తీసుకువచ్చిన విజేత మాడభూషి. తాను సదస్సుల్లో పాల్గొనడమే కాక పరిశోధన నాడు - నేడు - రేపు, శ్రీశ్రీ, గురజాడ, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య, గుర్రం జాషువా, సి.పి.బ్రౌన్ మొదలైన అంశాలపై అనేక అంతర్జాతీయ సదస్సులు నిర్వహించిన భాషాభిమాని.

24 గంటల నిరవధిక కవిసమ్మేళనం నిర్వహించిన 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్' లో విజేతగా నమోదయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ, కవికోకిల, సాహిత్య రత్న, ఆంధ్ర భాషా భూషణ, ధ్రువతార బిరుదాంకితులు. వివిధ పత్రికలలో వందలాది హాస్య, వ్యంగ్య, విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి తెలుగు భాషాభిమాని నిరంతర అన్వేషణశీలి అయిన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ అనేక కవితా సంపుటాలు వెలువరించారు. అనువాదకుడిగా తమిళ, హిందీ, ఇంగ్లీషు భాషల నుంచి అనేక కవితలను అనువదించారు. 12 సంవత్సరాలు పాత్రికేయునిగా పనిచేసిన అనుభవంతో పాటు భాషా, సాహిత్య విషయాలపై అభిమానంతో వివిధ కలం పేర్లతో వివిధ శీర్షికలతో 'ఆలోచన' జర్నలిస్టిక్ రచన వెలువరించారు. సంపాదకునిగా విజేత దినపత్రికలో పని చేయడం విజేతగా నిలవడానికి దోహదమైంది. సంపాదకీయాల వలన చారిత్రక ఉపయోగం ఉంటుందని నమ్మిన వ్యక్తి మాడభూషి.

ఇతనిసంపాదకత్వంలో 1. ఆంధ్రమహా భారతం-వివిధ శాస్త్ర పరిజ్ఞానం-2009, 2. ఒక విజేత అబ్దుల్ కలాముకు తెలుగువారి నివాళి-2015, 3. పరిశోధన నాడు - నేడు - రేపు - 2016, 4. తెలుగుదీప్తి. వెలువడగా, సంపాదకునిగా దేశవ్యాప్తంగా ఒక మహనీయుని గురించి రాసిన కవితా సుమాలను సంకలనము అనే హారంగా అమర్చడం అనేది కత్తిమీద సాము చేసినట్లే. అయినా చక్కని ప్రణాళికతో ఆ పనిని విజయవంతంగా చేసి సంపాదకునిగా విజేత స్థానంలో నిలిచారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. ఆచార్య పదవికి కూడా వన్నె తెచ్చినట్లుగా 76 మంది ఎం.ఫిల్ కోసం 28 మంది పిహెచ్.డి.కోసం ఇతని వద్ద పరిశోధనలు చేసారు.

కవిత్వాన్ని ఎంతగా ప్రేమిస్తారు అంటే తన తల్లి దండ్రులకు అంకితం ఇచ్చిన

"జీవితం-కవిత్వం" అనే సంపుటిలో

"జీవితాన్ని విడిచిపెట్టి కవిత్వాన్ని ఎలా రాస్తావ్? / కవిత్వానికి తెలియకుండా జీవితాన్ని ఎలా దాస్తావ్" అంటూ జీవితానికి కవిత్వానికి గల అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తారు.

"నేను కూడా యుగకర్తనై చిరస్థాయిగా ఉండిపోతాను" జీవితమనే సాగరమథనంలో ఉద్భవించిన అమృతమే కవితా కన్యక అంటారు.

పండువెన్నెల్లో / కవిత్వాన్ని ఆరబోసిన / జీవితమంతా కాపలా కాస్తాను.

ఇలాంటి పదాలతో రాసిన కవితలు కోకొల్లలు.

కవిత్వంతో / అందలం ఎక్కడం కాదు / అందరినీ ఎక్కించాలి / అంటు చెప్పడమే కాదు ఆచరణలో చూపించారు. ప్రపంచానికే ఆదర్శవంతమైన విజేతగా నిలిచిన భారతరత్న ఏపీజే కలాం గారి మరణానంతరం వేదనతో

తాను కవిత రాయడమే కాదు దేశవ్యాప్తంగా అనేకమంది రాసిన 258 కవితలను సంకలనం చేసి ఒక విజేత అబ్దుల్ కలాం అంటూ మనముందు నిలిపారు. చివరకు నువ్వే గెలుస్తావు అనే సంపుటిలో అఖండజ్యోతి శీర్షికతో కలాం గారి గురించి ఇలా రాసుకున్నారు.

ప్రేమికుడా / స్వాప్నికుడా / సైనికుడా / శాంతి కాముకుడా / అనంతజీవనయానంలో / అంతరిక్షంలో / అద్భుతాలు సృష్టించినవాడా / సాదాసీదా ప్రయాణం మొదలు పెట్టి / అసాధ్యాలను సాధించి / సామాన్య మానవుల మనసుల్లో తేనెగూడు కట్టినవాడా / యువత కలల్లో సొనెలు / నింపినవాడు / మేధస్సు అంతరిక్షంలో తిరుగుతున్నా / నేల విడిచి సాము చెయ్యనివాడా / పదవులకు అలంకారమైనవాడా / పారదర్శకంగా బతికిన వాడా / కలం పట్టి కవితలల్లినవాడా / మనసు విప్పి మానవత్వం చల్లినవాడా / క్షిపణులు విసిరిన సైనికుడా / సంగీతం కురిపించిన వైణికుడా / మనిషిగా వెలిగిన వాడా / మనుషుల్లో తిరిగినవాడా / స్ఫూర్తిగా నిలిచినవాడా / ఆర్తితో పలుకరించినవాడా / నీటి బొట్టువుగా పుట్టి / అలగా, కలగా / స్వప్నించి, సాధించి / ఆదర్శంగా నిలిచిన వాడా / అందరి ఆమోదం పొందినవాడా / అందరికీ ప్రమోదం కలిగించినవాడా / అద్భుతమా! అబ్దుల్ కలామా / ఇహంలో పరాన్ని దర్శించినవాడా! సంపదలో నాస్తికుడా / పేదల ఆస్తికుడా / హృదయాన్ని నిమిరినవాడా / గుండెల్లో నిండినవాడా / తాపంలేనివాడ / కోపం రానివాడా / భూగోళంలో అజాతశత్రువా / ఖగోళంలో విజేత మిత్రమా / మరణించి జీవించినవాడా / జీవించి మరణించినవాడా / అద్భుతాలు సృష్టించినవాడా / మాన్యుడా / అసామాన్యుడా /భరతావనిలో వెలిగిన అఖండజ్యోతి / అద్భుతమా! / అబ్దుల్ కలామా!

తక్కువ మాట్లాడడంలోనూ, ఎదుటి వ్యక్తిని గౌరవించడంలోనూ ఉన్నతమైన ఆశయాలను కలిగి ఉండడంలోనూ మాడభూషి వారికి అబ్దుల్ కలాం గారికి పోలికలున్నాయి. అందుకే అబ్దుల్ కలాం గారి గురించి తన కవితలో ఆణిముత్యాలలాంటి పదాలు దేశవ్యాప్తంగా కవితలు రాసిన ఎందరో కవులకు కవితా శీర్షికలు అయ్యాయి. అబ్దుల్ కలాంకు తెలుగువారి కవితా నివాళి ఒక విజేతగా..... రూపుదిద్దుకున్న పుస్తకానికి సంపాదకత్వం వహించడంలో ఎనలేని ఆనందాన్ని పొందారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. ప్రజల మనసులలో గల భావాలను వెలికితీయడంలో వాటిని క్రమబద్ధం చేయడంలో సంపాదకత్వం చేసి పుస్తకంగా మన ముందు ఉంచడంలో సంపాదక విజేతలయ్యారు మాడభూషి.

మాడభూషి వారి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గల తెలుగువారు పంపించిన కవితలలో చాలావరకు 'అఖండ జ్యోతి'లోని భావాలకు దగ్గరగా ఉండడం చదువుతుంటే ఆశ్చర్యం కలుగుతుంది. అంటే కలామ్‌కు సంబంధించి అందరిదీ ఒకటే మాట అన్న విషయం స్పష్టమైంది. భారతరత్న అబ్దుల్‌కలాం పట్ల గౌరవంతో తమ ప్రేమాను రాగాలను తెలియజేస్తూ తమ కవితా నివాళులు అందించిన వారిలో అనేకమంది ప్రముఖ కవులు, కవయిత్రులు, డాక్టరేట్లు పొందినవారు. అధ్యాపకులు, విద్యార్థులు, పత్రికా సంపాదకులు, విలేఖరులు, గృహిణులు, వివిధ రకాల ఉద్యోగ వ్యాపారాలు చేసేవారు అచ్చమైన తెలుగు భాషలో వచన కవితలుగా పద్య రూపంలో సీస పద్యాలు ఆటవెలదులు తేటగీతులు అనేక ప్రక్రియలలో తమ భావాలను ప్రకటించారు. కలాంగారి కవితలను అనువాదం చేసే సాహసం కూడా కొందరు చేసారు. వీటన్నింటిని క్రోడీకరించి ప్రణాళికా బద్ధంగా ఒక చారిత్రక బుజువుగా నిక్షిప్తం చేయడంలో విజేత అయినారు ఆచార్య మాడభూషి.

అందుకే విషయసూచికలో కలాంబాటలో... అంటూ అందరి పేర్లను 'అ'తో మొదలుపెట్టి 'హ' వరకూ వర్ణ మాల క్రమంలో అందించారు. కవితా శీర్షిక వద్ద కవిపేరు రాసి కవిత పూర్తి అయిన తర్వాత వారి చిరునామా, ఫోన్ నెంబరు అందించారు.

ఒక విజేతగా... పుస్తకం గురించి

జీవితమే ఒక సందేశంగా వెలిగిన మనీషి అబ్దుల్ కలాం (15 అక్టోబర్ 1931 - 27 జూలై 2015) జీవిత సారాన్ని ఒక్క పేజీలో చెప్పే సాహసం చేసి కృతకృత్యులయ్యారు పాలపిట్ట బుక్స్‌వారు. మేధావి, శాస్త్రవేత్త, సున్నిత హృదయుడు అయిన కలాంకు పట్టుదల, తపన, కార్యశీలత తోడైన ఆ మహనీయుని జీవితం ముందుతరాలకు సందేశం.

258 కవితలను సమీక్ష చేయడం చాలా బాగుంటుంది. కానీ స్థలాభావం వల్ల అక్కడక్కడ కొన్ని ఎంపిక చేసి మాత్రమే చెప్పవలసివస్తోంది.

సామూహికం అంటూ మొదటి కవితలోనే అద్దంకి తుషారగారు జీవితాన్ని జాతికి అంకితమిచ్చిన వాని మరణం సామూహికం కాకుండా ఎలా పోతుంది? అన్నారు. అతని మరణం కూడా స్ఫూర్తిదాయకమే కదా! అని ప్రశ్నిస్తారు. ఆమె ఇంజనీరింగ్ విద్యార్థిని కావడం విశేషం. రోదసీలోకి ఎగిరిన పక్షిని చూస్తే క్షిపణి చేయాలనే యోచన సాధ్యమా? ఎంతమంది చూడలేదు పక్షలు ఎగరడాన్ని? అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్, క్షిపణుల రూప కల్పన చేసిన కర్మయోగి అంటారు. డాక్టర్ ఆర్.అనంత పద్మరావుగారు. నిద్రను నిరాశను ఆకలిని జయిస్తేనే గాని దార్శనికులు కాలేరు అంటూ జాతికి శాస్త్రీయతను అందించిన పరిశోధనలకు రెక్కలు తొడిగి రోదసిలోకి ఎగురవేసి ప్రజల రాష్ట్రపతి అంటూ... అగ్ని రెక్కలు కట్టుకుని అనిశెట్టి రజిత. డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారు తన తల్లిపై రాసిన కవితను నా జనని అంటూ తెలుగులో అనువదించి కృతకృత్యులయ్యారు రైల్వే ఇంజనీర్ గుండాన జోగారావు గారు.

అనేకమంది కవులు జ్ఞానతపస్వి. అన్వేషి. తాత్వికుడు. సాత్వికుడు. అజాతశత్రువు. మహర్షి. మహామేధా పాధ్యాయుడు. అణుపరీక్ష విజయాన్ని ఆస్వాదించిన తపస్వి అంటూ కీర్తించారు. హిందూ ముస్లిం క్రైస్తవ జనం ఏకకంఠంతో కోహినూరు వజ్రంతో పోల్చినా భారతరత్న అని కీర్తించినా, ఆస్తికులైనా నాస్తికులైనా యుగానికి ఒక్కడు అన్నా, అమరవీర అన్నా, స్వాప్నికుడు అన్నా, జనమనోహరుడు, మార్గదర్శి అన్నా అన్నీ ఆ మహనీయునికే చెందుతాయి. క్షిపణులు, అణుబాంబులు, రాకెట్ వాహన నౌకలు తయారీ నీ విద్యకు సార్థకతగా భావించావు. 'మిస్సైల్ మాన్' అని పేరు పొందావు. రాష్ట్రపతి భవన్ నీవు మాత్రమే కాదు జనమంతా చూడాలని అది భారతీయులదని భావించావు. అవుల్ ఫకీర్ జైనులాబ్దిన్ అబ్దుల్ కలాం ఎ.పి.జె.అబ్దుల్ కలాంగారి గొప్పతనాన్ని నిరాడంబరతను అల్వీదా...అమరుడా! అంటూ ఒకే కవితలో చెప్పగలిగారు జమీన్ రైతు ఉప సంపాదకులు అల్లూరు రహీం. ఐతా చంద్రయ్య అమరవీర అంటూ రాసిన కవిత ఏ భావజాలాన్ని కలిగిన వారైనా కలాంగారి విషయంలో ఏకభావన కలిగి ఉండడమే కాదు అతనిలో మాధవుణ్ణి చూడడం అనేది పరాకాష్ట! దిక్కుల్ని దున్నేసిన దిక్సూచి అతడు అంటూ దక్షిణతీరాన ప్రభవించి, పశ్చిమతీరాన సేవించి, ఉత్తర దిక్కును శాసించి, తూరుపు కొండల్లో అస్తమించిన జనమనోహరం అంటారు. ఏనుగు కిశోర్‌బాబు, విశ్వగురుడు అని ఒకరు అంటే నిత్య విద్యార్థి అని ఒకరు అంటారు. కలల మారాజు అంటే దైవం మానుషరూపేణా....

కలలు కనండి అని కలాం చెబితే ఎలాంటి కలలు కనారో చెప్పారు చింతా అప్పారావుగారు. అగ్ని శిఖల రెక్కలు విప్పుకుని అంగారక గ్రహంపై మానవ ఆవాసానికి తొలి పాదముద్రల అడుగులు వేసాడు అంటారు కె.పవన్‌కుమార్. ఆణిముత్యంలో ఆయన నువ్వు వెంటి పువ్వు అని ఆయన జీవితం స్ఫూర్తి గ్రంథం అని అంటారు జరీనా వహాబ్. అవును నువ్వు వారధివి సారధివి అంటారు డాక్టర్ తమిళ్ సెల్వి. అంతరాత్మన తాను ఆనందపడుచు భరతనేలకు తాను బద్ధుడై నిలిచె అంటారు డాక్టర్ దాసుగారు. కళ్ళతో కరుణరసం పొంగించి లోకానికి కాంతిధారలు కురిపించావు అంటారు నాగశేషు. ఆకాశంలో కలాం కళ్ళు సూర్యచంద్రులై నిలిచిపోయాయి అంటారు

బడబాగ్నిగారు. తన యుగ వైతాళికుడులో శాస్త్రాలు, శస్త్రాలు ఆ జ్యోతి ముందు మిణుగురులయ్యాయి అంటూ మౌనభాష్పాలు రాలుస్తారు ఆచార్య బూదాటి. భోగమునొల్లక నతడొక / యోగిగ జీవించుచుండె - నుర్వీతలిపై / రాగ ద్వేషము లెరుగని / వాగీశుండతడు విశ్వపౌరుడు గాదా అంటూ ప్రశ్నిస్తారు యోగిలో కృష్ణ మోహన్‌గారు.

మిస్సైల్ బ్రహ్మవు నీవు / వింగ్ ఆఫ్ ఫైర్‌లు నీవు / ఇగ్నైటెడ్ మైండ్స్ నీవు / మా గుండె రోగులకు కరోనరి స్టెంట్‌లు నీవు ఆని క్షిపణి పితామహుడులో శ్రీనివాస్ అంటారు. కులమతాలకతీతుడైన తాత్వికుడు అన్నారు చక్రపాణి. అవినీతి రహిత సమాజాన్ని సుపరిపాలనను కోరుకున్న నిస్వార్థ సేవాతత్పరుడవనీ విశ్వనరుడు అనీ, మానవతావాది అనీ, మార్గదర్శి అనీ, చుక్కానిగా భావించి అక్షర ప్రణామం చేసారు.

నిష్కళంక దార్శనిక వైతాళికుడుగా విశ్వహితుడుగా దార్శనికతకు నిలువెత్తు నిఘంటువు అంటూనే భీకర క్షిపణులను శృతి చేసిన వైణికునిగా, అణ్వస్త్రాన్ని పేల్చి చూపిన స్మైలింగ్ బుద్ధగా వర్ణిస్తారు వడలి రాధాకృష్ణ. 258 కవితగా ఆరు సూత్రాలు అంటూ అబ్దుల్ కలాం యొక్క విజయ రహస్యాన్ని మొదలి శ్రీరామప్రసాద్‌గారు ఇలా అన్నారు.

నినైక్కలాం - అనుకుందాం / సిందిక్కలాం - ఆలోచిద్దాం / అళైక్కలాం - ఆహ్వానిద్దాం / అమైక్కలాం - అమర్చుకుందాం / ముడిక్కలాం - ముగిద్దాం / జయిక్కలాం - జయిద్దాం

258 మంది కవుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వాటిని పుస్తక రూపంలో అందించడమనే మహా యజ్ఞాన్ని విజయవంతంగా పూర్తిచేసి చూపిన మాడ భూషిగారు నిబద్ధత కలిగిన సంపాదకులు. ప్రాథమికంగా మంచి కవి. ఆదర్శ అధ్యాపకులు. పరిశోధకులు. 'భారతరత్న' అబ్దుల్ కలాం గారి జీవనాన్ని ఆదర్శంగా తీసుకున్నారు కనుకనే యావద్భారత దేశంలోని కవులే కాక విదేశాలలో ఉన్న తెలుగువారి కవితలు కూడా ఇందులో పొందుపరచబడ్డాయి. ఒక మహనీయుని జీవన చిత్రాన్ని మన కనులముందు ఉంచడంలో భావితరాలకు అందించడంలో సఫలీకృతులయ్యారు.

మథనంతో మనస్సు / కవిత్వం అవుతుంది
మౌనం దానికి / మరింత ఆయుష్షును పోస్తుంది
ఎంత చక్కని తాత్విక భావన!

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చైతన్య వీచికల విహారి - వికారి

- డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గురించి ఎరుగనివారు అరుదు అని చెప్పవచ్చు. బహుభాషలలో ప్రావీణ్యులు. దేశవిదేశాలలో అనేక సదస్సులలో పత్ర సమర్పణ గావించారు. అనేక అనువాద రచనలు చేశారు. సౌమ్యులు. ఆనందవిహారి. ఆత్మీ యతానురాగాలకు అభేదంగా పంచే ప్రేమమూర్తులు. ఇలా చెప్పుకుంటూ వెళితే.... ఎన్నో మరెన్నో...

ఆచార్య సంపత్ కుమార్ గారి 29 కవితలతో కూడిన వికారి.... నిజానికి మానవ నైజాలను వివరిస్తున్న గ్రంథం ఇది. మనిషి చేతల వల్ల జరిగే (జరిగిన) అనర్థాలను వివరిస్తూ మనిషిని జాగృతపరిచారు. కవిత్వం ఏం చేస్తుంది. అంటే వాస్తవాలను మనముందుంచుతుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వివరిస్తుంది. మనిషిలో మానవత్వాన్ని నిర్మిస్తుంది. మననులో ఆలోచనాలోచనాలను సృజిస్తుంది. లోకంలోని కుళ్ళు కుతంత్రాలను కవితాగ్నితో శుద్ధి చేస్తుంది. ఆచార్య సంపత్ కుమార్ గారి వికారి అదే మార్గంలో పయనించిం దనడంలో ఎలాంటి సందేహం లేదు.

కనిపించని దేవుని నమ్మడం కన్నా కనిపించే దేవుడిని అంటే మనిషిని నమ్మడమే ఉత్తమం అనే గొప్ప నిజాన్ని 'భిక్షగాడు' ద్వారా మనకందించారు. విశ్వాసం కోల్పోయిన మనిషి స్వార్థంతో చేసిన కర్మ చివరికి మనకే శాపంగా ఎదురౌతుందని "చెరువుశాపం" లో వివరిస్తూ, చెట్టుకు కూడా మనసుందని, దాని కడుపులో గునపాలు గుచ్చి నపుడు ఎంతా ఏడ్చి ఉంటుంది అన్న భావాన్ని పాఠకుని మదిలో జోప్పించారు. ఒకడి స్వార్థాన్ని ఎవరూ అడ్డకోక పోవడం వల్ల జరిగే అనర్థాల్ని చక్కగా వివరిస్తూ సమాజానికి ఒక హెచ్చరికను జారీ చేశారు.

కులమతాలు నేటి సమాజంలో ఎంతటి ప్రభావాన్ని చూపుతున్నాయో మనందరికి తెలిసిందే. కులపిచ్చి కలిగిన వ్యక్తులవల్ల సమాజం ఎంతో నష్టపోతుంది. దేశభక్తికి కూడా కులమే ప్రమాణమైంది. వర్ణ విచక్షణ, వర్గ విచక్షణ లేని సమసమాజం కోసం ఎందరో మహనీయులు తమ జీవితాలని త్యాగం చేశారు. కులాలకంపు మన సమాజాన్ని వీడినప్పుడు ఆరోగ్యవంతమైన సమాజం జనిస్తుంది. అందుకే మలంలాంటి కులాన్ని విసర్జించాలని కులం అనే మూడు పాదాల కవితలో సమాజానికి ఒక చైతన్య వీచికను అందించారు.

అడుగులు మొదలు పెట్టిన కాలం నుంచి అడుగులు తడబడే కాలం వరకు కాలాన్ని ఎదురొడ్డిన వారున్నారు. కాలగర్భంలో కలిసిపోయినవారున్నారు. మనిషి ఎంత కాలం బతికాడన్నది ముఖ్యం కాదు. జీవించిన కాలంలో ఏం సాధించాడన్నదే ముఖ్యమన్న భావాన్ని 3+33లో అంతర్లీనంగా తెలియజేస్తూ మనిషికి సన్మార్గమనే చైతన్య వీచికను అందించారు. మరణం అనివార్యమనే తాత్వికతను పరిచయం చేశారు.

సమాజంలో ఎన్నో అవమానాలను, చీత్కారాలను అనుభవిస్తూ జీవచ్ఛవంలా బ్రతుకుతున్న మహిళా... ఇకనైనా నోరు (కళ్ళు) తెరువు... జగతిలో అర్థభాగమైన నీవు మౌనం వీడు. నీ కళ్ళనుండి నీరు కాదు. నిప్పు రవ్వలు రావాలి. నోరు తెరిస్తే పోయేదేమీ లేదు.. అవ మానాలు తప్ప అంటు నోరు తెరవండి కవితలో మహిళా లోకానికి సందేశాత్మక వీచికలనందించారు.

ఎదుటివాడు ఆనందంగా ఉంటే భరించలేని వ్యక్తులున్న సమాజంలో నవ్వినా ప్రమాదమే... నవ్వకున్నా ప్రమాదమే. ప్రమోదం ప్రమాదమై కూర్చున్న వేళ మనిషి కృత్రిమనవ్వుల్ని పులుముకోవల్సిందేమో... ఇదే విషయాన్ని నవ్వుల రకాలు తెలుపుతూ "చెక్కు చెదరని నవ్వు" కవిత

లోనూ ఉటంకించారు. దండేనికి తగలేసిన చిరునవ్వు తొడుక్కుని మరుసటి రోజు మళ్ళీ తయారు అంటూ జీవితంలో నవ్వు కూడా నటనలో భాగమైందన్న విషయాన్ని స్పష్టపరిచారు. నవ్వు నిజంగా ప్రమోదమా.... ప్రమాదమా.... అన్న సందేహం కలుగుతుంది.

శబ్దం చేసిన గొప్ప పనులను వివరిస్తూనే 'శబ్దంపై నిశ్శబ్దంగా జరిగేదాడిని శబ్దం సహించదన్న' నిజాన్ని నిష్కర్షగా వివరించారు. దృష్టిని బట్టి సృష్టి కన్పిస్తుం దన్నట్లు, మంచి ఆలోచనలతో ఉన్నవాడికి అందరూ మంచి వాళ్ళుగా కన్పిస్తారు.... పచ్చ కామెర్ల రోగికి అన్న సామెత చందంగా... ఈ లోకంలో శత్రువులంటూ ఎవరూ లేరని, మన దృక్పథాన్ని బట్టి ఈ లోకం కన్పిస్తుందని, సదృక్పథంతో మెలగడమే ఉత్తమమని 'శత్రువు'లో తెలిపారు.

'రెండంచుల కత్తి'లో మనిషిలోని రెండు రకాల ప్రవృత్తని ఎండగట్టారు. మనిషిలోని రెండు నాల్కల ధోరణి ఇటు వ్యక్తులకు అటు సమాజానికి ఆమోద యోగ్యం కాదు. ఇలాంటి వ్యక్తులు సమాజ అహిత కారులగా మిగిలిపోతారు. ప్రజాస్వామ్యం, ప్రజలు, పాల కులు రెండంచుల కత్తికిందే అంటూ ద్వైధీభావంతో కూడిన లోకాన్ని పరిచయం చేశారు. రెండు రకాల జీవితాలని కొనసాగిస్తే.... ఆ రెండంచుల కత్తే అవతల వాడినే కాదు మనల్ని కూడా కోస్తుందన్న హెచ్చరికను జారీచేశారు.

ప్రకృతి ప్రశ్నార్థకం కావడానికి మనిషే కారణమని, ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్న నిజాన్ని స్పష్టపరిచారు. సేవకు ప్రతిరూపాలుగా సూర్య చంద్రులని ఉదాహరిస్తూ సేవ చేసేవారికి నిలకడ నిద్ర ఉండదని సేవ గొప్పదనాన్ని విశదపరిచారు. ఈ మధ్య కరోనా ప్రభావంలో ఇలాంటి సేవా దృక్పథం కలిగిన వారి సేవాకార్యక్రమాలనెన్నో ప్రత్యక్షంగా మనం చూశాం.

పువ్వులు, ఆకులు, పండ్లు ఒక పరమార్థంతో రాలి పడుతాయి. మనిషి మాత్రమే చావడానికి ఎందుకు ఏడుస్తాడు? ఇదీ మనుషులకు సంధించిన ప్రశ్న. లోకానికి ఉపయోగపడే పనులు చేసినవారు. జనం కోసం బ్రతికే వారు చావుకు భయపడరు. ఆ నిజాన్ని 'ఏడుపు'లో చక్కగా వివరించారు.

అవిశ్రాంతంగా వ్యవసాయం చేస్తూ, కలానికి బదులు నాగలి ఉపయోగించి పంటకావ్యాలను పండించే రైతు జీవితంలోని వ్యధలను గాధలుగా మార్చి తనకైతాను ఆత్మకథ రాసుకోలేని అసామాన్యుడిగా రైతును అభివర్ణిం చడం అభినందనీయం.

శునకావేశంతో రొడ్డపై కుక్కలు తిరుగు తుంటాయి. వాటికి వేళాపాళా ఉండదు. జాగ్రత్తంటూ 'కుక్కలుం టాయి జాగ్రత్త' కవిత ద్వారా ప్రస్తుత పరిస్థితులు వివరిస్తూ.... మన జాగ్రత్తలో మనముండాలని అన్యాప దేశంగా హెచ్చరించారు. ఆచార్య సంపత్ కుమార్ 'వికారి' ద్వారా అడుగడుగునా మనలను హెచ్చరిస్తూ, మనలోని లోపాలను, మనం చేస్తున్న పాపాలను తత్ఫలితాలను వివరిస్తూ చైతన్య వీచికలను ప్రసరింపచేసారు. 29 కవితలతో కూడిన 'వికారి'లోని ప్రతి అక్షరం. ప్రతి పదం, ప్రతి వాక్యం అందరికీ సుబోధకం... మార్గదర్శకం.. ఆచరణీయం. అనుసరణీయం. అందుకే 'చైతన్య వీచికల విహారి - వికారి' అంటాను నేను.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపత్ కుమార్ కవిత్వం - సామాజిక తత్వం

- ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్తు సెకండరీ స్కూలు - ఇటికాలపల్లి మం॥, నర్సంపేట, వరంగల్ రూరల్, తెలంగాణ

"దారి తప్పిన జీవితానికి
కవిత్వం వెలుగు చూపిస్తుంది".

తెలుగు సాహిత్య వికాసంలో మైలురాయిగా 'ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ సాహిత్య సమాలోచన' పేర 2020 జూన్ 17, 18, 19 తారీఖులలో మూడు రోజుల 'అంతర్జాల అంతర్జాతీయ సదస్సు'ను తమిళనాడు రాష్ట్ర రాజధాని నగరం అయిన చెన్నైలోగల మద్రాస్ యూని వర్సిటీ - తెలుగు శాఖ వారు నిర్వహిస్తున్న బృహత్తర కార్యక్రమంలో చేస్తున్న పత్ర సమర్పణ ప్రసంగ వ్యాసంగా 'డా॥ సంపత్ కుమార్ కవిత్వం - సామాజిక తత్వం' అనే అంశాన్ని నేను ఎంచుకోవడం జరిగింది.

డాక్టర్ మాడభూషి గారి రచనలు :

1. "ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం",
2. "మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ",
3. "తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు",
4. కవాతు, జన్మభూమి, అమ్మవాసన,
5. సామాజిక శాస్త్రవేత్త పెరియార్,
6. "కవితా ఓ కవితా: వస్తువు, భాష, శైలి"

సంపత్ కుమార్ గారి కవితా సంపుటాలు :

1. జీవితం - కవిత్వం (ఏప్రిల్ - 2013)
2. శత్రువుతో ప్రయాణం (మార్చి - 2015)
3. ఆలోచనలు (డిసెంబర్ - 2015)
4. చివరకు నువ్వే గెలుస్తావు (ఏప్రిల్ - 2016)
5. మూడో మనిషి (మార్చి - 2017)
6. వికారి (ఏప్రిల్ - 2019)
7. మొదటి అబద్ధం (మార్చి - 2020)

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు కొరకు నేను ఈ ఏడు కవిత్వ గ్రంథాలలో సామాజిక తత్వాన్ని డా॥ సంపత్ గారు ఏ విధంగా కవిత్వీకరించారో విశ్లేషించే ప్రయత్నం చేశాను.

జీవితం - కవిత్వం :

108 ముక్తక కవితల సంపుటి ఇది. పాలపిట్ట బుక్స్ హైద్రాబాద్ వారు 2013లో అచ్చువేశారు.

"జీవితాన్ని విడిచి పెట్టి / కవిత్వం ఎలా రాస్తావ్ ? / కవిత్వానికి తెలియకుండా / జీవితాన్ని ఎలా దాస్తావ్?" ఈ కవితా సంపుటిలోని మొదటి కవిత ఇది. 'కవిత్వం' అనేది మనిషి జీవితాన్ని ప్రతిబింబించేదిగా ఉండాలని ఈ కవితలో గల ధ్వని. మనిషి సామాజిక జీవి. కనుక కవిత్వం సామాజిక ప్రయోజనం కలిగి వుండి, మానవ వికాసానికి తోడ్పడాలని డా॥ మాడభూషి గారి ఉద్బోధ.

"కవిత్వంలో / జీవితం / ప్రతిఫలిస్తుంది ! / జీవిత మంతా / కవిత్వం నిలుస్తుంది !" - కవిత్వానికి జీవితానికి ఉన్న అవినాభవ సంబంధాన్ని తెలుపుతున్నది. ఇదే విధంగా "జీవిత మార్గం / కవిత్వం ! / కవితా మార్గం / జీవితం" అంటారు మరో కవితలో. ఇదే ధోరణిలో గల కొన్ని కవితా పంక్తులు -

"జీవితానికి కవిత్వం నలుగు
కవిత్వానికి జీవితం వెలుగు"
.....
"జీవితానికి పోరాటం తప్పదు
కవిత్వానికి ఆరాటం తప్పదు"
.....

"మునిగిన జీవితాన్ని / కవిత్వం తేలుస్తుంది ! / తుని గిన కవిత్వాన్ని / జీవితం అతుకుతుంది" /అంతరాంత రాల్లో నుంచి / ఉబికేది కవిత్వం ! /అనంతవాయువుల్లోకి

/ దూకేది జీవితం!" / "జీవితమొక వెతుకులాట / కవిత్వమొక బతుకుబాట" / "కవిత్వం / జీవితాన్ని వెలిగిస్తుంది / జీవితం / కవిత్వాన్ని వెలికితీస్తుంది" / "జీవితం / కవిత్వాన్ని మురిపిస్తుంది / కవిత్వం / జీవితాన్ని మరిపిస్తుంది" - / "కవిత్వాన్ని / నిర్లక్ష్యం చేశాడు / జీవితం / నిర్లక్ష్యానికి గురయింది!"

కవిత్వానికి - జీవితానికి గల అనుబంధాన్ని కైగట్టిన తీరు అద్భుతం. జీవితం అంటే సామాజిక జీవనమే. సమాజంతో కలిసి జీవించే తీరు తెన్నుల్ని కవి సంపత్ గారు కవితా రూపంగా చెప్పారు. ఎంతో జీవితానుభవాల్ని కలిగి ఉన్న కారణంగానే ఈ కవిత్వం రాయగలిగారని కవిత్వాన్ని చూస్తేనే తెలుస్తున్నది.

శత్రువుతో ప్రయాణం :

ఈ గ్రంథంలో 35 కవితలు ఉన్నాయి. పాలపిట్ట బుక్స్, హైద్రాబాద్ తరుపున 2015లో ప్రచురితమైంది. ఈ కవితా సంపుటిలోని కవితల పేర్లు అతడు అడవిని జయించాడు, అడవిలో పొద్దు గూకింది. కత్తి కింద పడకుండానే ..., అలలు అలసిపోవు, కవిభేరి, నిజం, విరోధి, తెలుగు వెలుగులు, ఆమె, విరుగుడు, పాలస్తీనా దృశ్యాలు, కవి, స్వభానుకు స్వాగతం, స్వర్గం, తండ్రి, మగాడు, చరిత్ర, భయం, కలలు కూడా, చెప్పలు, రూపాంతరం, విలువ, సమాజం, పని, కుల నిర్మూలన, జెండా, కన్ను, మనిషి, రంగులు, ఇంకని సముద్రం, భవిష్యత్కాలం వచ్చేసింది, ప్రభుత్వం, పాట్లు, మహా కామ్రేడ్.

ఈ కవితల్లోని సామాజిక అంశాల్ని ఇక్కడ విశ్లేషిస్తాను. "అచ్చుల్ని / హల్లుల్ని వేరు చేస్తే / పదం ఎలా పుడుతుంది / వాక్యం ఎలా వర్ధిల్లుతుంది ? / ..... / వర్ణానికి వర్ణం / కలిస్తే / అక్షరం సాకారమవుతుంది". (విరుగుడు) దీనిలో అంతరార్థం సమాజంలోని వర్ణాలు కలిసినప్పుడే సామాజికాభివృద్ధి సాధ్యమయితది.

"వాడు తిరగనున్నట్లు / నేను తిరగాలి ! / వాడు వాడుగా ఉంటాడు / నేను నేనుగా ఉండకూడదు / వాడికి సంతోషం కలిగితే / నేనూ సంతోషించాలి" - (మగాడు) ... పురుషాధిక్య సమాజాన్ని ప్రశ్నించే ఈ కవిత - సామాజికంగా మహిళలు అణచివేతకు గురవుతున్న తీరుకు నిదర్శనం.

"చరిత్రను తవ్వడమంటే / వర్తమానంపై / మనకు మనకే మటిపోసుకోవడమే ! / చరిత్రను తెలుసుకోవడమంటే వర్తమానానికి చరిత్రను కల్పించడం ! (చరిత్ర) - గతకాలంలో జరిగిన వాటి గురించి బాధపడుతు ఉండటం కంటే, గతం ... పునాదులపై భవిష్యత్తును నిర్మించేందుకు వర్తమానాన్ని అవగాహన చేసుకోవాల్సిందిగా కవి గారు కోరారు.

"కొన్ని కలలు మొసళ్ళలా భయంకరంగా ఉంటాయి / కొన్ని కలలు ముత్యాల్లా అందంగా ఉంటాయి / అలలు సముద్రాన్ని దాటినట్టు / కలలు కళ్ళను దాటితే / మనిషి ప్రతి ఉదయం / సునామీని ఎదుర్కోవలసిందే!" (కలలు కూడా) - ఈ కవితలో ఎన్ని కష్టాలొచ్చినా, వాటితో పోరాడాల్సిందిగా మనుషులకు తెలియజేస్తున్నారు డా॥ సంపత్ గారు.

ఆలోచనలు :

ఈ గ్రంథాన్ని హైద్రాబాద్ - పాలపిట్ట బుక్స్ వారు డిసెంబర్ 2015లో ప్రచురించారు. దీనిలోని కవితలు - కవితాత్మక ఆలోచనలు, డెబ్భై అయిదు పేజీలు గల ఈ పుస్తకంలో సుమారు పది శీర్షికలతో కవితలు ఉన్నాయి. వాటి పేర్లు - జెండా సాక్షిగా ..., ఆలోచనలు, రైతేకూలి, బాణీలు, విషాదాశ్రు తుషారాలు, కొన్ని ఆలోచనలు, వికృతులు, దృశ్యాలు, గాంధేయాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు.

'జెండా సాక్షిగా' అనే మొదటి కవితలో వివిధ సందర్భాలు, సంఘటనలు, చారిత్రకాంశాల్ని కవిత్వీకరించడం ఎంతో అద్భుతంగా ఉన్నది. ఉదా॥ "తిరగబడిన జనం / విరిగి పడిన ప్రభుత్వం / 1947 ఆగష్టు 15" - బ్రిటీష్ అధికారం ఇండియాలో ఏపతనాన్ని సూచిస్తున్నది. "కలిసుండమంటే / కాల్చేసే లోకం /

1948 జనవరి 30", - గాంధీ హత్య కవిత్వీకరణం "మాటకోసం పోట్లాట / తెలుగు వారికి తేటగీత / 1956 నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు సందర్భం. "అసలే కోతి / ఆపై కల్లు తాగెను / 1992 డిసెంబర్ 6" బాబ్రీ మసీదు కూల్చివేత కాలం.

"పేరు చుండూరు / హృదయం మండే చూరు / 1991 ఆగష్టు 6" - తెలుగు నాట చుండూరు సంఘటనగా చరిత్రకెక్కిన వాస్తవికతకు కవితా రూపమిది".

ఈ విధంగా చిన్న చిన్న కవితల్లో పెద్ద పెద్ద చారిత్రక సందర్భాల్ని కైగట్టడం డా॥ సంపత్ గారు సాధించిన ప్రతిభగా చెప్పవచ్చు.

చివరకు నువ్వే గెలుస్తావు :

ఏప్రిల్ 2016 లో పాలపిట్ట బుక్స్ హైద్రాబాద్ వారు ప్రచురించిన ఈ కవితా సంపుటిలో మొత్తం 57 కవితలు ఉన్నాయి. అవి : బావి, కారణం, కుక్కపిల్ల, నేను, మనం, అగ్గిపుల్ల, దీపావళి జువ్వలు, నోరు, మీరు - మేము, వేర్లు, సబ్బుబిల్ల, కులం, పదాలు, చివరికు నువ్వే గెలుస్తావు, నువ్వు , రొట్టెముక్క, మరణం నా శాశ్వత చిరునామా, ముళ్ళు, రహదారి, అరటితొక్క, భూమ్యాకాశాలు, గాలి, ఆకాశం, భూమి, ఆకు, డాలర్‌మయం, సముద్రం తీర్పుం, బల్ల చెక్క, చెరువు, జెండా, కవి, తలుపు గొళ్ళెం, ఓడినవాడు, కోడి, చెట్టు, హారతి పళ్ళెం, నాన్నా వాన, అమ్మ, సునామీ, గుర్రపు కళ్ళెం, అంతదాకా, అఖండజ్యోతి, ఒక సాయంత్రం, ఏప్రేమ, రైతేకూలి, పిచ్చుకపై బ్రహ్మాస్త్రం, రాత్రి, ఉగాది, కుడికాలు, దుర్ముఖం, జెండర్ స్పృహ, తడి ఆరిపోయిన హృదయం, స్వముఖం, చెరువు, త్రిశంకుడు, వృథా ! వృథా ! నోరు, అనే కవితలో నోటి కారణంగా వచ్చే సమస్యల్ని కవిత్వీకరించారు - "కొందరికి నోరు / తినడానికి మాత్రమే వుంటుంది / మూగబోయిన గొంతులా ! ... ఇంకొంకదరికి / మాట్లాడ్డానికి మాత్రమే ఉంటుంది / డబ్బాలో రాళ్ళలా! ... చాలా మందికి / ఇతరుల్ని దూషించడానికి / పరుల సొమ్ము తినేయడానికి / చాలా బాగుంటుంది!" - ఈ కవితలో నోరు ఉండాల్సిన తీరు గురించి మరింత వివరిస్తే ఇంకా బాగుండేది.

'మీరు - మేము' అనే కవితలో - "మీరు మమ్మల్ని / భిక్షగాళ్ళలా ! / గబ్బిలాలుగా / హీనంగా చూస్తే / ... మేము మిమ్మల్ని / చింతమొద్దుల్లా / పందికొక్కుల్లా / అసహ్యంగా చూస్తాం" - 'మీరు - మేము' కలిసి 'మనం'గా మారాల్సిన పరిస్థితిని వివరిస్తే బాగుండేది.

మూడో మనిషి :

ముప్పది ఎనిమది కవితలు గల కవితా సంపుటి ఇది. మార్చి 2017లో పాలపిట్ట బుక్స్ హైద్రాబాద్ వారు అచ్చు వేశారు. ఈ గ్రంథంలోని కవితల పేర్లు : మహా ఆత్మఘోష, ఆకురాలిన కాలం, నేను - నువ్వు, కవిత్వం, తల్లి, ప్రకృతి, జయించడం, అబద్ధం, ప్రయాణం, బాధ, లెనిన్, మైనారిటీలు, రాజ్యాధికారం, అభివృద్ధిపథం, నల్లమొహాలు, తప్పు, శవం లేచిన ఇల్లు, ఒక వాన, ఒక గాలి, రైతు, మూడో మనిషి, ఇద్దరు, అమెరికా, ఏడ్చినట్టుంది వాన, కెమెరా, మనం, వడ్డించిన విస్తరి, పక్కా ఇళ్ళు, శవ ప్రేమికుడు, ఎద్దు, సుఖం, మారని దృశ్యాలు, అక్షరాలు, కన్ను, వలస, అవిష్కరణ, సముద్ర, భ్రమలు.

'కవిత్వం' అనే కవితలో - "కవిత్వంతో / అందలం ఎక్కడం కాదు / అందరినీ ఎక్కించాలి" - సామాజిక ప్రయోజనాన్ని చాలా చక్కగా చెప్పారు.

'మూడో మనిషి' కవితలో థర్డ్‌జెండర్ గురించి కైగట్టిన తీరు అబ్బుర పరుస్తున్నది" - మూడో మనిషిని / మనిషిగా గుర్తించడానికి / అంగవైకల్యాన్ని / ఆదరించడానికి / మనోవైకల్యం అంతరించాలి" అంటే, మూడో మనిషిని మనం చూసే తీరులో మార్పు రావాలని కవి గారు కోరుతున్నారు.

'ఇద్దరు' అనే చిన్న కవితలో అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించారు - "మేమిద్దరం / మా కిద్దరు / వారికిద్దరు

/ చివరకు / మేమిద్దరమే '' ... నేటి ఆధునిక కాలంలో కుటుంబ వ్యవస్థ అవస్థల్ని ఈ కవితలో తెలిపారు. పిల్లలు పై చదువులు చదివాక, ఉద్యోగాల నిమిత్తం యితర ప్రదేశాలకు, దేశాలకు వెళ్ళిన వాస్తవాల్ని ధ్వన్యాత్మకంగా వివరించారు కవి డా॥ సంపత్ కుమార్ గారు.

వికారి :

కవితా సంపుటిగా హైదరాబాద్ పాలపిట్ట బుక్స్ వారు ఏప్రిల్ 2018లో ప్రచురించారు. దీనిలో ఇరవై తొమ్మిది కవితలు ఉన్నాయి. అవి: భిక్షగాడు, చెరువు, హత్య, ఆత్మహత్య, దాహం, కులం, 3+3=33, నోరు తెరవండి, నవ్వు, శబ్దం, శత్రువు, మరణ శాసనం, చెక్కు చెదరని నవ్వు, గొప్ప, మరణం, రెండంచుల కత్తి, ప్రకృతి, సేవ, భయం, ఏడుపు, చీకటి, గుణపాఠం, చింతన, విసర్జన, అభినందన, రైతు ఆత్మహత్య, అద్దం, యుద్ధం, అభయం, కుక్కలుంటాయి జాగ్రత్త.

'భిక్షగాడు' కవితలలో ... ''నాకు / దేవుడి మీద కన్నా / మనిషి మీదే / ఎక్కువ నమ్మకం / అందుకే / గుడి బయటే / అడుకుంటాను'' - 'గొప్ప' అనే కవితలో ... ''మరణం లేని / సమాజం కన్నా / మానవత్వం లేని సమాజం గొప్పది కాదు'' - మానవత్వం గురించి తెలుపడం బాగుంది. అయితే, 'మానవత్వం' అనేది ఏ విధంగా ఉంటే బాగుంటుందో వివరిస్తే ఇంకా బాగుండేది. డా॥ మాడభూషి గారు కోరుకునే మానవత్వం ఎటువంటిదో అందరికి అర్థమయ్యేది.

మొదటి అబద్ధం :

ఇదొక తాత్వాక దీర్ఘ కావ్యం, ఇందులో ఉన్నది కవిత్వం కాదన్నా, ఇది కవిత్వమే అనక తప్పదు. ఎందుకంటే, ఈ రచన కవితా మార్గంలోనే ఉన్నది కాబట్టి మార్చి 2020 లో పాలపిట్ట బుక్స్, హైద్రాబాద్ వారు అచ్చువేసిన ఈ గ్రంథం - అరవై నాలుగు పేజీలుగా ... ఒకే ఒక్క అంశాన్ని ... అదే ... అబద్ధాన్ని గురించి సుదీర్ఘంగా చెప్పింది. అందుకే ఇది దీర్ఘ కవిత్వమైంది. మానవ జీవితంలోని, సమాజంలోని, సాహిత్యంలోని, సంస్కృతిలోని ... ఇంకా .. ఇంకా ... అనేకానేకాంశాల్లో గల అబద్ధాల్ని వెతికి వెతికి ఈ రచనలోకి తెచ్చారు డా॥ సంపత్ సార్. అబద్ధాల్ని ఇంతగా విశ్లేషించిన మరొక గ్రంథం మన తెలుగు సాహిత్యంలో మరొకటి లేదేమో అనిపిస్తుంది. ఈ గ్రంథం చదివాక దీన్ని చదివిన వారందరికీ నైతిక జ్ఞానోదయం కలిగి, నిజానికి కట్టుబడి, అబద్ధానికి పులిస్టాప్ పెట్టే పరిస్థితి ఉంటుందంటే, ఈ గ్రంథం వేసే ప్రభావం చాలా గొప్పదిగా ఉంటుందని చెప్పవచ్చు.

ఈ విధంగా డా॥ మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వం నేల విడిచి సాము చెయ్యలేదని, సామాజిక చేతనాన్ని కలిగి వున్నదని, వీరి కవిత్వ అధ్యయనం ద్వారా తెలుస్తున్నది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వంలో స్త్రీవాదం

- శ్రీమతి జి.యన్.శ్యామలరాణి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

మద్రాసు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ మాకు చదువుతోపాటు జీవిత పాఠాలు కూడా నేర్పింది. మనలో మనకు తెలియకుండా ఉన్న మేధాశక్తిని అందరికి పరిచయం చేసింది. నేడు నేను అన్న నా గుర్తింపును నాకు పరిచయం చేసింది మా తెలుగుశాఖ. అందులోనూ మా గురువుగారి గురించి చెప్పాలంటే ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు మాకు పాఠాలు బోధించిన గురువు మాత్రమే కాదు, వెన్నుతట్టి నడిపే మానవతామూర్తి. పాఠాల్లో సందేహం అడిగితే వెంటనే చిరునవ్వుతో ఆ సందేహాన్ని తీర్చి బోధపడేలా చేసేవారు. ఆయన కంఠంలో శ్రీశ్రీ కవితలు వింటుంటే శరీరం ఉత్తేజాన్ని పొందుతుంది. ఆ శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వాన్ని మా గురువుగారి నోట వినే అవకాశం మాకు లభించడం మా అదృష్టం. గురువు గారు గొప్ప వ్యక్తి మాత్రమే కాదు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగిన మహోన్నతులు. ఎప్పుడూ అనుకూలమైన మాటలే తప్ప మా గురువుగారి నోట నుండి ప్రతికూలమైన మాటలు రావు. ఎంతోమంది విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును ఏర్పరచి ఇచ్చిన మహానుభావులు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించినప్పటికి, తన విద్యార్థుల వలనే అది అంత ఘనంగా జరిగిందని చెప్పేవారు. అంతేతప్ప ఆయనలో నేనే చేశానన్న గర్వం కనిపించదు, ఎంతోమంది విద్యార్థులకు జీవితాన్ని ఇచినప్పటికి మూడో మనిషికి ఆ సహాయం గురించి గొప్పగా చెప్పుకోరు. గురువుగారు నిరంతరాయంగా వనిచేసినప్పటికి ఆయనలో అలసటను మేము ఇంతవరకు చూడలేదు.

'మా గురువుగారు / నిరంతర అభ్యాసి / ఎప్పుడూ విద్యార్థుల హితాన్ని మాత్రమే కోరే నిస్వార్థి / ఆయనే మాకు మార్గదర్శి / మా అందరి శ్రేయోభిలాషి'.

విశ్లేషణ :

గురువుగారు రాసిన ప్రతి కవితలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అందుకే అవి పాఠకులను అంతగా ప్రభావితం చేస్తున్నాయి. గురువుగారి కలం నుండి జాలువారిన ఒక్కో కవిత ఒక్కో కోవకు చెందింది. ప్రతిదీ మనలను మనలా ఆలోచింపజేస్తుంది. సమాజ శ్రేస్సయస్సుకొరకు సామాజిక చైతన్య స్పృహతో రాయబడిన కవితలు మనుషుల్లో మరుగున పడిన మానవత్వాన్ని తట్టి లేపే విధంగా ఉన్నాయి. స్త్రీకి ప్రాధాన్యత ఇస్తూ రాసిన కవితలు చదువుతుంటే ఆ స్త్రీకి కలిగిన వేదన కళ్ళకు కట్టినట్లు చూపబడినట్లు ఉంది. చదువుతుంటే ఏదో తెలియని అనుభూతి కలిగింది. నేటి స్త్రీ పరిస్థితి ఎలా ఉందో, యథాతథంగా ఈ కవితల్లో చెప్పబడింది.

ఆనాడు ఎన్నో ఆంక్షాలు, కట్టుబాట్ల పేర్లతో స్త్రీలను ఇంట్లో బానిసలుగా చేశారు. ఆ కట్లనుండి నుండి స్త్రీ ఇప్పుడిప్పుడే కాస్త బయటపడుతుంది. ప్రభుత్వం కూడా స్త్రీల కాపుదల కోసం అనేక చట్టాలు చేశారు. సాహిత్య పరంగా కూడా స్త్రీలను ఉత్తేజపరచడానికి వారిపై జరిగే అరాచకాలను ఎదిరిస్తూ స్త్రీవాద కవితోద్యమం ఆరంభమైంది. అయినప్పటికీ స్త్రీకి స్వాతంత్ర్యం ఇంకా రాలేదని పించింది. మృగాలు అడవుల్లో కాదు అవి కొంతమంది మగాళ్ల రూపంలో ఈ సమాజంలోనే స్వాతంత్రంగా తిరుగుతున్నాయనిపించింది.

స్త్రీవాద రచనలు చేసేవారిలో చాలామంది స్త్రీలే ఉన్నారు. కాబట్టి వారు ఎదుర్కొన్న సమస్యలనే వారు ప్రత్యక్షంగానో, లేక పరోక్షంగానో తెలియజేశారని చెప్పవచ్చు. వాటిని చూసి అనేకమంది మారారు. అయినా కూడా నేడు ప్రపంచ మొత్తంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నవారిలో స్త్రీలే ఎక్కువ ఉన్నారు. వాటిని

ఆపాలంటే కావాల్సింది స్త్రీలో ధైర్యం కాదు, ఉత్తేజం కాదు. అందుకు కావాల్సింది హింసించే మనిషిలో మార్పు. స్త్రీల అనుభవాలను, వారి బాధలను మన ముందుంచడానికి గురువుగారు రాసిన కవితలు మగాళ్లకు, సమాజానికి స్త్రీ వేదనను తెలియజేసే సాధనాలుగా ఉన్నాయి. ఆడది తన నిరంతర జీవనయానంలో మానసికంగా, శారీరకంగా ఎన్నో అత్యాచారాలను ఎదుర్కొంటుంది. శత్రువుతో ప్రయాణం అనే శీర్షకను గురువుగారు ఎంత లోతుగా ఆలోచించి పెట్టియుంటారో. నిజంగానే స్త్రీ తన జీవన గమనంలో ప్రతి రోజు శత్రువుతోనే ప్రయాణం చేస్తుంటుంది. ఆ శత్రువు కొన్ని సార్లు ఆకారం కలియుంటుంది. మరికొన్నిసార్లు నిరాకారంగా ఉంటుంది. ఆ శత్రువు ఒక మనిషి కావచ్చు లేదా తన మనస్సాక్షే కావచ్చు. ఈ కవితా సంపుటాల్లో స్త్రీవాదానికి సంబంధించిన కవితలు కొన్నే ఉన్నప్పటికి ఆ కవితలు స్త్రీల ఆవేదనకు, ఆలోచనలకు అద్దం పట్టినట్లు ఉన్నాయి.

'ఆమె' అనే కవితలో ఆడపిల్ల చిన్నప్పటి నుండి కన్నతల్లిదండ్రుల వలన సొంత ఇంట్లోనే ఎంతగా పక్షపాతానికి లోనౌతుందో చెబుతూ

"చేసిన పనికి కృతజ్ఞత లేదు
చెయాల్సిన పనికి మాత్రం దబాయింపులు-
మొగుడింటికి
పోతే చెప్పుదెబ్బలు తింటావని శాపనార్థాలు
ముందుగానే మొగుడికి అనుమతి లభించింది"

(శత్రువుతో ప్రయాణం-26)

తల్లిదండ్రులు ఆ ఆడపిల్ల తమ రక్తమే అన్న విచక్షణ కూడా లేకుండా కన్న కూతురికే శాపనార్థాలు పెడుతుంటారు. ఇది జరుగుతున్న వాస్తవం. ఆ తల్లిదండ్రుల శాపలే ఆమె భవిష్యత్తును ముందుగా నిర్ణయిస్తున్నాయని ఈ కవితను చదివినప్పుడు నాకు అనిపించింది.

బయటకు వెళ్ళిన ఆడపిల్ల తిరిగి వచ్చేంత వరకు ఏదో తెలియని ఆదోళన నేడు ప్రతి తల్లిదండ్రులలోను కనిపిస్తుంటుంది. అందుకే గురువుగారు

జాగ్రత్తగా వెళ్ళిరావమ్మా
రోడ్డుమీద కుక్కలుంటాయి
అర్ధరాత్రే కానవసరం లేదు
పట్టపగలే కావచ్చు
..... జాగ్రత్తగా వెళ్ళి రావమ్మా"

అంటూ సమాజంలో జరుగుతున్న అరాచాకాలను గురించి హెచ్చరిస్తారు. ఆ కవితను చదువుతుంటే కూతురికి జాగ్రత్తలు చెప్పే ఒక తండ్రి హృదయం కనిపిస్తుంది.

పురాణకాలం నుండి పురుషులకు అధికారాన్ని ఇచ్చి స్త్రీలు లోబడి జీవించేవారు. తమ తల్లి, అవ్వ చెప్పిన వాటిని బట్టి మగాడంటే యజమాని తాను బానిస అన్నట్టు మగాడి కాళ్ళ క్రింద బ్రతికారు. భర్త ఆలోచనలే తన ఆలోచనలు, భర్త ఇష్టాలే తన ఇష్టాలు, అన్నట్లు మరమనిషిగా తనకంటూ స్వయచింతన లేకుండా బ్రతికే స్త్రీలలోని అభ్యుదయాన్ని తట్టి లేపడానికి కొంతమంది భర్తల నిజస్వరూపాన్ని బయటపెట్టిన కవితే 'మగాడంటే'

"మగాడంటే
మనిషి అని చెప్పింది కూతురు
మగాడంటే
కూడా ఉండి గొంతుకోసేవాడంది!
నన్ను నీడపట్టులో ఉండమన్నట్టు చెబుతూ
ఇంట్లో బానిసను చేశాడు"

(శత్రువుతో ప్రయాణం- 46)

అందరు అలా ఉన్నారని, ఉంటారని కాదు. కానీ భార్యపై అక్కర కలిగినవాడిలా నటించే భర్తల హృదయ కాఠిన్యానికి సరైన ఉదాహరణ పై కవిత.

తనపై జరిగే దాడులను బట్టి భర్త నిరంకుశత్వాన్ని భరించలేక ఆమె "వాడు లేని నరకం నాకు స్వర్గం" అంటుంది.

"అతగాడికి కావలసింది ఒక మరమనిషి
సంపాదించడానికి

వండిపెట్టడానికి
కోరికలు తీర్చడానికి
...కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదు"

(శత్రువుతో ప్రయాణం-26)

దేశంలో స్వాతంత్ర్యం ఎప్పుడో వచ్చినప్పటికి స్త్రీ మాత్రం ఇంకా స్వాతంత్ర్యం రాలేదనే చెప్పాలి. ఎందు కంటే నేటికి కూడా చాలా చోట్ల స్త్రీకి చదువుకొనే స్వాతంత్ర్యం లేదు, పనికి వెళ్లే స్వేచ్ఛ లేదు, కొన్ని ఇళ్ళలో అయితే మాట్లాడానికి తన సలహా చెప్పడానికి కూడా స్త్రీ పనికిరాదు. దీనికి చక్కటి ఉదాహరణే గురువుగారి ఈ కవిత

"ఆమె నిఘంటువులనుంచి 'ఎ' నిషేధితం
అందుకే
ఎందుకు? ఏమిటి? ఎవరు? ఎలా? ఎప్పుడు? ఎక్కడ?
లాంటి ప్రశ్నలు ఆమెనోట్లో రాకుడదని శాసనం"

(శత్రువుతో ప్రయాణం-27)

ఆమె ప్రశ్నిస్తే చాలు మొగుడివి నువ్వా లేక నేనా? అంటూ దబాయింపులు. అన్ని నీకే తెలుసన్నట్లు మాట్లాడకు అంటూ ఆంక్షాలు.

"ఇంట్లో సెలవు లేదు
పనిలో సేదలేదు
జీవితమంతా పిల్లల కోసం పరుగెత్తి పరుగెత్తి
అలసిపోయిన ఆమెకు
ఆసరా లేదు"

(శత్రువుతో ప్రయాణం-28)

భార్య ప్రశ్నించకూడదు. ఒకవేళ ప్రశ్నిస్తే ఎక్కడ లేని కోపం వస్తుంది భర్తకు, అతని తిట్లకు 'ఓర్చుకొని పడివుంటేనే లోకంలో భార్యనే అంతస్తు నిలబడుతుంది. స్వాతంత్ర్యం పుట్టినింటి నుండి స్త్రీకి ఇస్తేనే తాను తన స్వేచ్ఛను నోరు తెరిచి అడిగి అత్తాగారింట్లో పొందు కోగలదు. బాల్యం నుండే 'ఆడపిల్లలకు' మాట్లాడే హక్కు కూడా లేకుండా చేస్తుంటారు కొంతమంది. అందుకే గురువుగారు అంటారు.

"చెవులు కుట్టారు
ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా
భరించాను నోరుమూసుకొని
అంతా నా అందంకోసమేనని
తీరా నోరు తెరవాలని
ప్రయత్నించినప్పుడుగానీ
తెలియలేదు
ముందుగానే
నోరు కూడా కుట్టేశారని!"

ఇందులో చాలా వాస్తవం ఉంది. ముక్కు చెవులతో పాటు నోరు కూడా కుట్టేసి వాక్‌స్వాతంత్ర్యం కూడా లేకుండా చేశారు, అమ్మనాన్నల మధ్య మాట్లాడలంటే నీకేం తెలీదు చిన్నపిల్లవి నోరుమూస్కో అంటారు, అత్తగారింట్లో నోరు తెరిస్తే ఎంత నోరో చూడు తల్లి ఎలా పెంచిందో అంటారు, భర్తకు సలహా ఇస్తే సంపాదించే నాకు తెలుసా నీకు తెలుసా, ఇంట్లో ఉండేదానివి నీకేం తెలుసంటాడు, పిల్లలు కుడా అమ్మా నీకేం తెలియదు ఊరుకో అంటూ నోరు మూయించేస్తారు. ఈ యథార్థ సంఘటనలనే పై కవితలో తెలియజేశారు.

కొంతమంది అమ్మాయిలు అమ్మగారింట్లో స్వేచ్ఛగా, గారాలపట్టిగా, మహారాణిలా ఉంటారు, కాని మెట్టినింట్లో అందరి తరువాతే తాను, తనకంటూ ప్రత్యేక అభిరుచి ఉండకూడదు, భర్తకు, పిల్లలకు నచ్చిందే తను చెయ్యాలి, వారి ఇష్టాన్నే తన ఇష్టంగా మార్చుకోవాలి అందుకే గురువుగారంటారు

"రెక్కలు తొడుక్కొని / పక్షిలా ఎగిరే మనసుని
ముక్కలు చేసి / మూలకూర్చోబెట్టారు
దానిపేరు పెళ్ళి-"

ప్రతి స్త్రీ ఎక్కడో ఒక్కచోట శత్రువుతో ప్రయాణం చేసే పరిస్థితి రావచ్చు. ప్రతి స్త్రీలోను ఉత్తేజం రావాలి

అంటూ ''నోరు తెరచి మాట్లాడమని'' చెప్తారు.

''ఇకనైనా నోరు తెరిచి మాట్లాడవమ్మా / కొంచెం తలపైకెత్తి చూడు / లోకం మారిపోయి చాలా రోజులైంది / నువ్వు మోసపోతే / నీకు ఎవరూ సానుభూతి చూపరు / నోరు తెరవమ్మా'' ఈ కవితలో విప్లవం ఉట్టిపడుతుంది. ఈ కవితను చదివినప్పుడు 'నీకు నీవుగా మేలుకోవాలి, మోసపోతే సానుభూతి చూపే కాలం పోయింది, అదీ కాక తిరిగి నిన్నే అంటారు. కాబట్టి నువ్వే నోరు తెరచి మాట్లాడాలి అంటూ ధైర్యం నూరిపోసే తల్లి వాత్సల్యం కనబడుతుంది.

మరో కవితను 'మగాడినయిందుకు తలవంచుకుంటున్న' అంటూ మొదలుపెడతారు గురువుగారు. స్త్రీల పట్ల జరిగే అత్యాచారాలను బట్టి గురువుగారు పడిన వేదన ఏంటో అనేది 'ఈ నేరాలను చూస్తు బ్రతకడం కన్నా ఆత్మహత్యలు చేసుకోవడమే నయం' అనే అర్థంలో ఈ కవితను ముగించడం ద్వారా ప్రతి ఒక్కరికి అర్థం అవుతుంది. ఆడది పగలే ధైర్యంగా ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి నేటికీ ఉంది.

''అర్ధరాత్రి ఆడవాళ్ళ / ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం / సామూహిక అత్యాచారం'' (గాంధేయ వాదం 37) నిజాన్ని నిర్ఘయంగా తెలియజేసిన కవిత అది.

ముగింపు :

ఆడపిల్లలకు వారు ఎలా నడచుకోవాలి, ఎలా ప్రవర్తించాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి, అందరితో ఎలా ప్రవర్తించాలి, త్వరగా ఇంటికి రావాలి, మగవారితో ఎక్కువ స్నేహం చేయకూ అంటూ జాగ్రత్తలు చెప్పేది మంచితే కానీ చిన్నప్పటి నుంచే మగపిల్లలకు స్త్రీలను గౌరవించడం నేర్పాలి. ప్రతి స్త్రీ తన తల్లిలా, అక్కలా, చెల్లిలా చూడమని కుదిరితే వారికి రక్షగా ఉండమని చెప్పం చదువుకంటే ముందుగా వారికి సంస్కారం నేర్పించండి. గురువుగారు తన కవిత్వంలో ఆ స్త్రీ వేదనను, ఆమె పడిన కష్టాలను, అనుభవించిన నరకాన్ని తన మాటల్లో తెలియజేయడం ద్వారా ఆడదాని మనసు ఆడదానికే తెలుసు అనే వాక్యంలో పూర్తి వాస్తవం లేదని తెలుస్తుంది. గురువుగారి ఒక్కో మాట ఒక్కో మాట ఒక్కో అస్త్రంతో సమానం. ఒక్కటైనా ఆ మానవ మృగానికి తగలాలని ఆశిద్దాం. స్త్రీకి కావలసింది సమాన హక్కు కాదు, మగాడిపై పెత్తనం కూడా కాదు, ఆమెకు కావలసింది రక్షణ మరియు స్వేచ్ఛ. ఆమెకు ఇవాల్సిన గౌరవాన్ని ఇవ్వండి. ఎందుకంటే ''ఆమె లేకుండా మానవ చక్రం పరిభ్రమించదు, అందుకే ఆమెను పరిమళించ నివ్వండి, లోకాన్ని సుభరితం చెయ్యండి''.

ఆధార గ్రంథాలు :

1. ఆలోచనలు
2. శత్రువుతో ప్రయాణం
3. వికారి
4. చివరకు నువ్వే గెలుస్తావు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడోమనిషి - జండర్ స్పృహ

- జొగర్ల మహేందర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సాహిత్యరత్న ఆంధ్రభాషా విభూషణ, ధ్రువతార, కవికోకిల వచనకవి ఆచార్య మాడభూషి సంపత్కుమార్ గారు. అణగారిన గొంతును చాటడానికి ఉదయించిన అయన కలం రాస్తూనే ఉంది. ఆధునిక కాలంలోని అంధకారపు జీవితాల బ్రతుకుల కడుపు నింపేది తన అక్షరం. ఇప్పటివరకు వారు స్పృశించని అంశం లేదు. సమాజంలోని అన్ని వ్యవస్థలపై తన కలంతో యుద్ధం చేసి పీడనకు గురి అయిన జీవితాలను చరిత్రపుటల్లో నిలిపారు.

మూడో మనిషి కవితా సంపుటిలో 30కి పైగా కవితలున్నాయి. దానిలో మూడో మనిషి శీర్షికతో ఒకే ఒక కవిత ఉంది. అది హిజ్రాల వ్యవస్థపై రాసిన కవిత. కవిగారి వచన కవితా సంపుటి పేర్లను చూసినట్లయితే మనకు కవి స్వభావం తెలుస్తుంది. సమాజంలో ఇప్పటికే అంతుచిక్కని ప్రశ్న థర్డ్ జెండర్. మూడో మనిషి కవితా సంపుటి పేరు పెట్టడంలోనే వారి గొప్పతనం తెలుస్తుంది. వీరు అణగారిన వర్గాల ఆశాజ్యోతి అనడానికి ఇదే సాక్ష్యం.

జెండర్ అనేది ఒక సామాజిక భావన. సమాజంలో లింగ భేదాన్ని సూచించే మాపకం జెండర్. ఒక ట్రాన్స్ జెండర్ తన మనసును అంగీకరించిన జెండర్ చట్రంలో బతుకుతూ మానసికంగా శారీరకంగా ఎంతో చిత్రవధ అనభవిస్తున్న మహిళ అందుకే కవి చెలించాడు వారి దుస్థితిని వెలిబుచ్చాడు.

"రెండో మనిషి గురించి
ఆలోచించే తీరిక లేని మనిషికి
మూడో మనిషిని గురించిన
ఆలోచన ఎక్కడిది?"

ఆధునిక తెలుగు సాహిత్యంలో జండర్ స్పృహ అనేది ఒక స్త్రీ లింగానికి పరిమితం చేయడమే కాక ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో మూడో మనిషిని కూడా అందులో క్రోడీకరించ వలసివస్తుంది. సమస్తం నేనే అనే పితృ స్వామ్యానికి, ఆకాశంలో సగం మేము కూడా అనే విరుద్ధ భావాల మధ్య జన్మించే థర్డ్ జెండర్ మూడో మనిషి. ఇలాంటి వ్యక్తి గురించి ఆలోచించే తీరిక ఎవరికీ లేకుండా పోయింది అని కవి తెలిపారు.

"ఇక్కడ ఆడ బిడ్డ బరువు
మూడో బిడ్డ నిషేదం
ఇక
మూడో మనిషి గురించా!!?"

ప్రపంచీకరణ ప్రభావంతో మానవుని అలవాట్లు, కోరికలు, అభిప్రాయాలు అన్ని మారుతూ వచ్చాయి. అలాగే మొన్నటి వరకూ మానవుడు ఉన్న తీరు మనిషిలో రెండు భేదాలు మాత్రమే కనబడ్డాయి. మంచి, చెడు లాగా స్త్రీ, పురుష భేదం మాత్రమే చూసాము. మనిషి సాధిస్తున్న వాటిలో ఇప్పటి వరకు స్త్రీ, పురుషుల విజయాలను చూసాము కానీ ఇప్పుడు మూడవ కోణం జన్మించింది.

పూర్వం నుండి 'నపుంసకులు' అని వాడి వాడి సమాజంలో వేడి పెరిగి పిరమిడ్ బద్దలు అయినట్టుగా ఈ మూడవ కోణం జన్మించిది అని ఈ కవిత ద్వారా తెలియజేయడం జరిగింది.

"ఎన్ని పేర్లు పెట్టిన
ఎంత హేళన చేసినా
సహించాల్సిందే
తప్ప
మూడో కన్ను తెరవకూడదు?" అంటారు కవి.

బృహన్న, శిఖండి, పేడీ, నపుంసక, అంగానక, ఉదంబర, ఊబ, పోట, హిజ్రా ఇలా ఎన్ని పేర్లు పెట్టి వారికి తోచిన పేరుతో హేళన చేస్తూ వివక్ష చూపుతున్నారు, సమాజం ఇప్పటికయినా మారాలి అని కవి చెప్పారు.

"ఎందుకు పనికిరాని వారిగా ముద్ర వేసి
దౌర్జన్యంగా భిక్షాపాత్ర చేతిలో పెట్టే
అడుక్కోడానికి అనుమతిచ్చేశారు."

ఇప్పటి ప్రభుత్వాలు కూడా వారి మనోగతాన్ని అర్థం చేసుకోకుండా వీరికి విరుద్ధమైన బిల్లులు Bill 2016 NAPM ద్వారా తెచ్చి వీళ్లకు సమాజంలో దేనిపై హక్కులు లేకుండా చేశారు. కాగా ట్రాన్స్జెండర్స్ kill the bill అంటూ ఉద్యమం చేస్తూనే ఉన్నారు. దీనిని ఎప్పుడో కవి ప్రస్తావించారు వారి భవిష్యత్తు ముందే గ్రహించి ఇప్పటి పరిస్థితులు తెలియజేశారు.

"ఆస్తిపాస్తుల కోసం కాదు
ద్వితీయ శ్రేణి పౌరులుగా
గుర్తింపు కోసం ఆరాటం" అంటారు కవి గారు.

ఈ ఆధునిక పోరులో మూడవ వాదం ఎలా నిల దొక్కుకోవడం, అందుకు ఎంతకలంపడుతుందో చూడాలి. వాళ్ల యుద్ధం మొత్తం బుక్కెడు బువ్వ కోసమే. వారిని గుర్తించండి అని కవి అంటారు. తృతీయ శ్రేణి వారిగా గుర్తించి కనీన అవనరాలను తీర్చాలని కోరుకున్నారు. స్వేచ్ఛ లేదని వాదన ఉన్న కాలంలో వాళ్లని గుర్తించి సమాజంలో తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

"ఆడ మగ చేసిన తప్పుకు
ఆడ మగ కాకుండా పోయారు
ఎవరిది శిక్ష
ఎవరిది తప్పు" అంటూ

మూడో మనిషి (హిజ్రా) జీవితాన్ని మన అందరి ముందు మూడో మనిషి పుస్తకం శీర్షిక ద్వారా ఉంచాడు కవి. చివరికి సమాజంలో ఉన్న మనోవైకల్యం అంత రించాలని కవి కోరుతున్నారు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. యాదగిరి కె. తెలుగులో కవిత్వోద్యమాలు.తెలుగు అకాడమీ.హైదరాబాద్ 2003.
2. సంపత్కుమార్ మాడభూషి. మూడోమనిషి. పాలపిట్ట బుక్స్. హైదరాబాద్ 2017.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వికారి' వస్తు వైవిధ్యం

- -సుజిత రెడ్డి , పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం. తిరుపతి.

ఆధునిక తెలుగు కవులలో కవిగా, విమర్శకులుగా, సంపాదకులుగా, పరిశోధకులుగా, అనువాదకుడిగా సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి మాడభూషి సంపత్ కుమార్ గారు. 1958లో సెప్టెంబర్ 17 తేదిన శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు చిత్తూరు జిల్లా దేవళంపేట, కమ్మపల్లె గ్రామంలో జన్మించారు. హైస్కూల్ విద్యను చిత్తూరు జిల్లాలో పూర్తి చేశారు. తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ తెలుగు చదివి అక్కడ జి.వి.యస్. ఆర్ కృష్ణమూర్తి పర్యవేక్షణలో "ఎరుకల తమిళ బంధం వాచకాలు - సామాజిక భాషా శాస్త్ర విశ్లేషణ" అన్న అంశం పై1986 లో ఎం.ఫిల్ పూర్తి చేశారు. ఆచార్య చల్లా రాధాకృష్ణ శర్మ పర్యవేక్షణలో ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాసి మధురై కామరాజు విశ్వవిద్యాలయం నుంచి 1990లో డాక్టరేట్ పొందారు. 2015లో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి 'అత్యాధునిక ఆధునిక తెలుగు కవితీ దృక్పధాలు" అన్న అంశం పై పరిశోధన చేసి డి.లిట్ పట్టాను పొందారు.

మాడభూషి సంపత్ కుమార్‌గారు ఆచార్యులుగా మంచి అభివృద్ధి పదంలో నడిచిన వ్యక్తి. సాహిత్యంలో అందేవేసిన చెయ్యి. కలం చేత బూనితే అక్షరాలు ముత్యాలుగా మారి ఎన్నో రచనలు చేసిన సుప్రసిద్ధ వ్యక్తి. సమాజంలో ఏ చిన్న విషయం చూసినా వెంటనే స్పందించి ఆ స్పందనను కాగితం మీద కలం పెట్టి అక్షర రూపం అమర్చేవారు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దు:ఖాలు, సమాజంలో జరిగే దోపిడి ఇలా చెప్పుకొంటూ పోతే ఆయన చేతి నుండి జాలువారిన రచనలు అనేకం. వీరి రచనలు సాహిత్యానికి, సమాజానికి కాకుండా భావి పరిశోధకులకు ఉపయోగపడే విధంగా ఉంటాయి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

గడ్డ పరకతో విప్లవం, సామాజిక శాస్త్ర వేత్త పెరియార్, అమ్మవానన, జన్మభూమి, కవితా! ఓ కవితా, జీవితం, కవిత్వం, వ్యాస సంపద, తెలుగు జానపద కళలు, శత్రువుతో ప్రయాణం, అనూవాద విజ్ఞానం, ప్రజారోగ్యానికి పనికి వచ్చే సూత్రాలు, సులభమైన మార్గాలు, ఒక విజేత, ఆలోచనలు, పరిశోధన! నాడు నేడు, రేపు, చివరకు నువ్వే గెలుస్తావు,మూడోమనిషి, వికారి ఇవే కాక వందలకు పైగా వ్యాసాలను వెలువరించారు.

ఆంధ్రభాషా విభూషణ, తెలుగు వాఙ్మయ ప్రగతి రత్న, కరుణ శ్రీ జాతీయ పురస్కారం, సాహిత్య రత్న అవార్డు, జీవిత సాఫల్య పురస్కారం, శ్రీ కృష్ణ దేవరాయల జాతీయ పురస్కారం, శ్రీ నర్ర నరసయ్య కోటమ్మల స్మారక సామితీ ప్రతిభా పురస్కారం, తెలుగు వెలుగు అవార్డు, జీవితకాల సాఫల్య పురస్కారం ఇలా అనేక పురస్కారాలను పొందారు. 24 గంటల నిరవధిక కవి సమ్మేళనం నిర్వహించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో నమోదయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ బిరుదుతో పాటు వివిధ సంస్థల నుంచి 'కవికోకిల', 'ధ్రువతారు' మొదలైన బిరుదులను అందిపుచ్చుకొన్న వ్యక్తి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారు. సంపత్ కుమార్ గారి రచనల్లో కవిత్వం ఒక భాగం. కవిత్వంలో ఆలోచనలు, కవితా ఓ కవితా వస్తువు- భాష - శైలి, చివరకు నువ్వే గెలుస్తావు, జీవితం కవిత్వం, శత్రువుతో ప్రయాణం, వికారి, మూడో మనిషి, కవాతు, మొదటి అబద్ధం, రెండో ఓటమి; ఇవి కవిత్వానికి సంబంధించిన రచనలు. వికారి కవితా సంపుటిలోని వస్తు వైభవం ఎలా ఉంది అని పరిశీలించడమే నా పత్ర సమర్పణ ముఖ్యోద్దేశం.

వికారి కవితా సంపుటిలో మొత్తం 29 కవితలున్నాయి. ప్రతి కవితలో సామాజిక స్పృహ ద్యోతకం

అవుతుంది. కళ్లముందు కనిపించే దృశ్యాలకు నిజరూపం వికారి.

ఇందులో చెరువు శాపం'' అనే కవితలో చూస్తే!

చెరువులో అపార్ట్‌మెంట్ కట్టినప్పుడు
చెరువు కడుపులో మట్టిగొట్టినప్పుడు
అది ఎంత విలపించిందో
ఎవరికి తెలుసు
చెరువు కూడా ఏడుస్తుందని.....

హాయిగా చెట్టుపై నున్న పూలను కర్కశంగా కోసి, సూదులతో గుచ్చి, త్రాళ్ళతో బిగించి, మానవులు తమ భోగ వస్తువులుగా వాడుకోవడం క్రౌర్యం అని ఆ పూలు రోధిస్తున్నట్లుగా జంధ్యాల పాపయ్యశాస్త్రి ''పుష్ప విలాపం'' లో పేర్కొన్నారు. అలాగే ''చెరువు శాపం'' కవితలో కూడా చెరువు విలపించినట్లు, చెరువుకు ఉన్న రోధనను, బాధను చక్కగా వర్ణించారు రచయిత. చెరువులను పూడ్చడం, అపార్ట్‌మెంట్స్ కట్టడం, ఎండి పోవడం లాంటి సన్నివేశాలను చూస్తూఉంటాం. చెరువు పట్ల విశ్వాసం చూపకుండా దాని కడుపులో గుచ్చినప్పుడు చెరువు శపిస్తుందని ఊహించి ఉండరు అని రచయిత పేర్కొంటున్నారు. మనిషికే కాదు ప్రపంచంలో ఉండే ప్రతి జీవికి ప్రాణం వుంటుంది. దానితో పాటు బాధ కూడా ఉంటుంది. కాని వాటి బాధను చెప్పడం సాధ్యం కాదు, చెరువు శోకించినట్లు ఇందులో రచయిత చెప్తున్నాడు. అంతే కాకుండా చెరువు శాపాన్ని అనుభవించడమే భవిష్యత్తును కాపాడుకోవడానికి మార్గం అని రచయిత ఈ కవితలో తెలియజేశారు.

కులం :

"కులం" కవితలో

"కులం కన్నా
మలమే గొప్ప
మలాన్ని విసర్జించగులుగుతున్నాం!."

అని కులాన్ని మలంతో పోల్చారు. మలాని మనిషి విసర్జించి గలుగుతున్నాడు. కాని కుల గజ్జిని విడిచి పెట్టలేకపోతున్నాడు. నీ కులం గొప్ప, నా కులం గొప్ప అని చివరకు చంపుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. అందరూ ఇలా చేస్తున్నారని చెప్పడానికి వీలు లేదు. కాని కులం అనే జబ్బు పట్టిన మనుష్యులు మాత్రం అందులోనే కొట్టుమిట్టాడుతున్నారు.

నోరు తెరవండి :

ఇకనైనా
నోరు తెరచి మాట్లాడండమ్మా...
హృదయంలో దాచుకున్న
దుఃఖాన్ని దిగమింగకుండా
కొంచెం బయటికి కక్కండి
గుండెల్లో మండుతున్న
అగ్ని గుండాన్ని
కొంచెం రగలనివ్వండి....

ముదిత అనగా స్త్రీ. ముదితల్ నేర్వగా రాని విద్య కలదే ముద్దర నేర్పించినన్ ఎక్కడైతే స్త్రీలు గౌరవించ బడతారో ఆ దేశం సస్యశ్యామలంగా ఉంటుంది. భారత దేశ జనాభాలో సగం మంది స్త్రీలున్నా సాంఘీకంగా స్త్రీ సమాజంలో మోసగించబడుతోంది. కేవలం ఒక పని ముట్టుగానే స్త్రీని చూస్తున్నారు.వారికి ఆర్థిక స్వేచ్ఛ ఉండటం లేదు. మత గ్రంథాలలోనూ స్త్రీని చులకనగానే చూపారు. వ్యాపార ప్రకటనల్లోనూ, సినిమాల్లోనూ స్త్రీని ఒక ఆటబొమ్మగా సెక్స్ సింబల్‌గా మాత్రమే చూపిస్తున్నారు.

ఆడది అబల కాదు సబల అంటే పురుషులతో సమాన స్థాయికి చేరుకోగలదు అని నిరూపించు కొంటున్నారు. నేడు స్త్రీలు పురుషులతో పోటీగా చదువుతూ ఉద్యోగాలు చేస్తూ. పురుషులకు పరిమితమైన విజయాల్ని సైతం దక్కించుకొంటున్నారు. కొంత వరకు ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నారని చెప్పవచ్చు. "నోరు తెరవండి" కవితలో స్త్రీకి ఉన్న బాధను నోరు తెరచి బయటకు చెప్పమని ,

దు:ఖాన్ని పంచుకొమని, కష్టాలను తేంచుకొమని చెప్తున్నాడు కవి. బయట ఎదురుక్కొనే అవమానాలు, అపనిందలను నుండి ఎదురుక్కొవాలంటే స్త్రీ నోరు తెరిస్తే చాలు నీ ముందు అందరూ బలాదూర్ అని రచయిత స్త్రీ చైతన్యాన్ని కాంక్షించాడు.

ప్రకృతి :

మనం కళ్ళతో చూడగలిగే, మనసుతో భావించే, శరీరంతో స్పర్శించే వాస్తవ ప్రపంచం ప్రకృతి. ప్రకృతిని ఇష్టపడని వ్యక్తి ఈ భూమి మీద ఉండకపోవచ్చు. సంతోషాన్ని కలిగించి ఆరోగ్యంగా జీవించడానికి సహజ పర్యావరణాన్ని అందిస్తుంది. పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం ప్రకృతికి మూల కారకాలే.

సహజసిద్ధంగా మానవుడు అనుభవిస్తున్న ప్రకృతిని నాశనం చేసే వ్యక్తి కూడా మానవుడే. ఎన్నో వైపరిత్యాలు కలుగుతున్నాయి. ''ప్రకృతి కవిత'' లో రచయిత ఏం చెప్తున్నారు అనే విషయం చూస్తే.....

ఎండ
వాన.....
అనే ఒకదానితో ఒకటి
విశ్వాసంగా ఉన్నంత కాలం
నిశ్వాసానికి కొరతలేదు
మనిషి
అనే ఒకే ఒక
బొట్టు కాలుష్యం
వీటితో కలిసి
ప్రకృతి ప్రశ్నార్థకమైంది.

ఎండ, వాన, గాలి, నీరు మొదలైన వన్నీ అన్నీ కూడా ఒక దానితో ఒకటి ఏకం ఉన్నంత కాలం విశ్వాసానికి కొరత లేదంటూ, ప్రకృతిని కాలరాసేవాడు మనిషే అని తెలియజేస్తున్నారు రచయిత. అనేకమైనటువంటి కాలుష్యాల నుండి ప్రకృతిని రక్షిస్తేనే మానవుడు నంతోనంగా జీవించగలడు. వంచభూతాలు సామనన్యంగా సమరసంగా మనిషి హాయిగా జీవిస్తాడు

రైతు ఆత్మకథ :

మనల్ని సృష్టించిన ప్రకృతి గొప్పదైతే మన కడుపునింపే ఆహారాన్ని పండించే రైతన్న అంతకన్నా గొప్పవాడు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. కిలోల కొద్దీ బంగారం, కోట్ల కొద్దీ డబ్బు ఇచ్చినా రాని సంతృప్తి కడుపునిండా అన్నం పెడితే అంతటి గొప్పతనం అన్నంలో ఉంది. అందుకే అన్నం పరబ్రహ్మం స్వరూపం అంటారు. ఒక రకంగా చెప్పాలంటే పరబ్రహ్మకంటే గొప్పతనం అన్నం సొంతం. మరి ఆ అమృతాని మనకు అందించే రైతు దేనితో సమానం. ఇది ఆలోచించదగ్గ విషయమే. రోజూ మన చేతి ఐదు వేళ్లు నోట్లోకి వెళ్ళడానికి రైతు నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. వినడానికి పాతదే అయినా అన్నదాత గొప్పతనం గురించి చెప్పడానికి ఇంతకు మించిన పదం మరొకటి ఎక్కడ వెతికినా దొరకదు. పెట్టేవాడు పై స్థాయిలో ఉంటే తీసుకొనేవాడు కింది స్థాయిలో ఉంటాడు. కానీ రైతు విషయములో మాత్రం అందరికీ అన్నం పెట్టే రైతులు అధ:పాతంలోనే ఉన్నారు. ఇంకా సాయం కోసం నేతల దగ్గర చేతులు చాస్తూనే ఉన్నారు.

ఒక రైతుకు వరిశిక్ష! మరో రైతుకు పత్తి కత్తిలాంటింది. ఇంకొరైతు నిలువెల్లా కురగాయాలు ఇలా ఏ రైతును చూసినా కష్టమే! సాగు నష్టమే! పాలాలనన్నీ హాలాల దున్నే రైతులు తమ బలాన్ని మాత్రమే కాదు ప్రాణాలను పాలానికే అర్పిస్తున్నారు. అటువంటి రైతు గురించి మాడభూషిగారు ''రైతు ఆత్మకథ''అనే కవితలో రైతుకు స్వేచ్ఛ కరువైందని, ఎన్నో కష్టాలు పాలవుతున్నాడని పేర్కొంటున్నాడు.

కోటీశ్వరుడు
కోట్ల నోట్ల కట్టల మీద పడుకున్నట్టు
రైతు మట్టి మీద పడుకుని మురిసిపొతాడు
పొలమే వాడికి కాయితం
కష్టమే వాడికి జీవితం.....

అంటూ రైతు యొక్క ఆత్మకథను వివరిస్తున్నాడు.

దేనికి నోచుకొలేని రైతు అతి దారుణంగా మోసగించ బడుతున్నాడు. అన్యాయానికి గురైతున్నాడు. చివరికి ప్రాణం తీసుకొంటున్నాడు. రైతుకు విశ్రాంతి ఉండదు, విరామం ఉండదు. ఎల్లప్పుడు శ్రమిస్తూనే ఉంటాడు. ఈ శ్రమ తరతరాలకు కొనసాగుతూనే ఉంటుంది. ఆత్మవంచన చేసేవాళ్ళే ఉన్నంత వరకు రైతు ఎప్పటికి అనగదొక్కబడుతూనే ఉంటాడు. తన ఆత్మకథను రాసుకో లేని దుస్థితిలోనే ఉంటాడు అని రచయిత పేర్కొన్నారు.

సంపత్‌గారు అటువంటి రచనలు చేయడంలో మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తి అని ఆయన రచనల ద్వారా తెలుస్తుంది. ఇంకా ఎన్నో రచనలు ఆయన కలం నుండి జాలువారలని కొరుకొంటూ భావితరాల వారికి అవి ఉపయోగపడాలని ఆశిస్తు, ఇంకా అభివృద్ధి పథంలో నడవాలని కొరుకొంటున్నాం. వస్తువుని వస్తువుగా చూడక దానిని మనిషికి ఆరోపించి రచనలు చేయడంతో మాడభూషి సంపత్ కుమార్ గారు మంచి సిద్ధహస్తుడని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

❖ ❖ ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద కళలు - కావడి చిందు

- డాక్టర్ జి. సుహాసిని, ఎస్వి క్యాంపస్ స్కూలు, తిరుపతి.

తమిళజానపద కళాసంస్కృతిలో సుబ్రహ్మణ్యేశ్వరుడికి మొక్కుబడి తీర్చుకొనే క్రమంలో కావడి ఎత్తుట సంప్రదాయంగా అనాదిగా వస్తున్నది. ఈ సంధర్భంలో పాటలు పాడుట, నృత్యము చేయుట కూడా ఆచరణలో వుంటుంది. కావడి మోసే భక్తులు ఆలపించేపాటలను కావడిప్పాట్టు అంటారు. వీని ప్రాశస్త్యాన్ని మాడభూషి సంపత్ కుమార్ గారు రచించినటువంటి "తమిళజానపద కళలు" అన్న గ్రంథంలో వివరించినారు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులుగా, పరిశోధకుడిగా, పర్యవేక్షకుడిగా, విద్యార్థులకు మార్గనిర్దేశంచేసిన మంచి గురువుగా గుర్తింపు గడించారు. కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, పాత్రికేయుడిగా, భాషావేత్తగా, సాహితీవేత్తగా సుపరిచితులు. తెలుగు భాష ఖ్యాతిని విశ్వవ్యాప్తిచేయుటకు ఈయన చేసినకృషి అనన్యసామాన్యము. ఈయన వల్లనే తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి కలిగినది అనుట అతిశయోక్తికాదు. తెలుగులో ఎన్నో ప్రఖ్యాతి గాంచిన రచనలు, కవితా సంపుటాలు, అనువాదాలు చేశారు.

జానపదము :

మానవ పరిణామ క్రమంలో భాషకు ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితమే లిపి ఆవిర్భవించక పూర్వం ప్రజలు భాషను ఉపయోగించే వాళ్ళు. జనులచేత ఉపయోగించబడే పదమే జానపదం "జన" అంటే ప్రజలు అని "పద" అంటే తెగ అని అర్థం. సాంఘిక జీవనం మొదలైన తరువాత మనిషి నిత్యం వివిధరకాలైనటువంటి పనులు అనగా వ్యవసాయము ఇతరవృత్తులు చేయుచున్న సమయంలో సహజసిద్ధంగా ఏర్పడినటువంటి పాటలనే జానపదాలు అంటారు. పూర్వకాలంలో జంగమ దేవరలు వివిధ ప్రాంతాలను సంచరిస్తూ వారికివున్న జ్ఞానాన్ని జానపద పాటల ద్వారా ఇతర ప్రాంతలకు వ్యాప్తిచేశారు. దానసాహిత్యము, వచనసాహిత్యము కూడ ఈవిధంగానే వ్యాప్తిచెందినది.

జానపదపాటలు నిత్యజీవితంలో చేసేటటు వంటి పనులలో అలసట తెలియకుండా పంటపొలాల దగ్గర నుండి వంటపనిచేసే సమయంలో పాడేపాటలన్నియు కూడా జానపదపాటలే అదేవిధంగా వివాహము, పండుగలు, యాత్రలు, చేసేటటువంటి సమయాలలో కూడా జానపద పాటలను పాడుతారు. అంతేకాక సాంఘికదురాచారాలను కట్టుబాట్లను విరోచితగాథలను కూడ ఈ జానపదాలు తరతరాలుగా తెలియజేస్తున్నాయి. జానపదాలలో ఎన్నో సామెతలు కూడ ఆవిర్భవించి నేటికి ఉపయోగంలో వున్నాయి. గురుశిష్య పరంపరకు వున్న వైశిష్ట్యం జానపదాలకు కూడా వున్నాయి అనుట అతిశయోక్తి కాదు.

తమిళ జానపదాలు :

భారతీయ సాహిత్యంలో తమిళ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. తమిళ జానపద సాహిత్యం చాలా ప్రాచీనమైనది తమిళులు దీనిని ప్రత్యేకంగా భావిస్తారు. తమిళులు జానపదసాహిత్యాన్ని ఆరాధించిన విధంగానే జానపద కళలకు కూడా ప్రాధాన్యతను ఇస్తారు. ఎన్నో ఆధునిక పోకడలు వచ్చినప్పటికి తమిళ జానపదకళలు అంతరించిపోకుండ ఇప్పటికి వున్నాయి.

తమిళ జానపదకళలు :

తమిళ జానపదకళలకు వున్న వైశిష్ట్యాన్ని కొంతైన తెలుగు ప్రజలకు పరిచయం చేయాలన్న ఉద్ధేశ్యంతో మాడభూషి సంపత్‌కుమార్ గారు 21 తమిళ జానపద కళలను గురించి తన గ్రంథంలో పొందుపరచినారు

వాటిలో "కావడి పాట్టు" అనే విశేషమైన తమిళ జానపద కళను గురించి వివరిస్తున్నాను. తమిళదేశంలో ఈశ్వరుడ్ని ఆరాధించే వాళ్ళు ప్రతిసంవత్సరం తమిళ కాలమాన పట్టిక ప్రకారం పదవనెల అయినటువంటి "తై" మాసంలో పౌర్ణమి నుండి ఒకవారం రోజుల పాటు జరిగేటటువంటి పండుగను "తైపూసం" అంటారు. ఈశ్వరుడి రెండవ కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి పుట్టినరోజునే తైపూసంగా జరుపుకుంటారు. మొదట ఈ పండుగ తమిళ దేశానికే పరిమితమై వున్నప్పటికి 19వ శ॥ లో తమిళులు మలేషియా, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లి స్థిరపడిన తరువాత నేటికి ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఆచరించడం చూడవచ్చు.

ఈ పండుగలో కావడి ఎత్తడం అన్నమొక్కుబడి ప్రత్యేకత సంతరించుకున్నది. భగవంతుడు తమ కోరికలను కష్టాలను తీరిస్తే కావడి ఎత్తుకునివస్తాను అని మ్రొక్కుకుంటారు. తమ కోరికలు నెరవేరితే మురుగుడి గుడి దగ్గరికి కావడి ఎత్తుకుని వెళ్ళడం అన్నది నేటికి వున్నటువంటి సంప్రదాయం. ఈ కావడి అనునది ప్రార్థనతో కూడిన మ్రొక్కు అందుచేతనే ఇది ఒక విధమైన ప్రదర్శనగా, కళగా, జానపద కళాకారులచే ప్రదర్శింప బడుతూ ఉంది.

కావడిచ్చిందు :

కావడిని భుజంమీద పెట్టుకుని వివిదరకాలుగా తిప్పుతు శరీరాన్ని ముందుకు వెనుకకు కదలిస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగిస్తారు. దీనినే "చ్చిందు" (సిందు) అని అంటారు. ఇది ఒక రకమైన "సంగీతకళ" తమలోన్ని భావాన్ని చిందించడమే చిందు కనుక దీనికి తప్పకుండా సంగీతముకూడ తోడవుతుంది. దీనిని ముఖ్యంగా వళినడై సిందు (నడిచేపాట) కావడి సిందు (కావడి పాట) నొండి సిందు (పిల్లలు కుంటుతూ పాడే పాట) నెళివు సిందు (సందర్భోచితంగా పాడేపాట) అని అనేక రకాలుగా విభజించవచ్చు.

కావడిచ్చిందులోఅనేకరకమైన పాటలున్నప్పటికి అన్నామలై రెడ్డియార్ రచనలు భాగా ప్రాచుర్యం పొందినవి.

ఉదా :

పల్లవి : సెన్నిక్కుల నగర్ వాసన్
తమిళ తేరుమ్ అన్నామలై దాసన్
చెప్పుమ్ జగమెచ్చియు మధురక్కవి
అధనైప్పుయు వరైయిల్
పునై ధీరన్ అయిల్ వీరన్

అర్థం : సెన్నిక్కులంలో నివసించు అన్నామలైదాసన్ చేత కూర్చబడిన ఈ అందమైన రచన, ఈటెను తన భుజముల మీద పర్వతమువలె ధరించిన వీరుడైన ఓ మురుగా ! అని దీని భావము.

చరణం-1 :

వణ్ణమయిల్ మురుగేశన్
కుర వళ్ళి పదమ్ పణి నేసన్
ఉరై వరమేత్తరు కరుగాచ్చు
పదిక్కోయిలిన్ వాలమ్ నాన్
వారేవాదే సోల్ వనమాదే

అర్థం :

కజుహ్‌కచ్చలీమ్ దేవాలయం యొక్క ప్రాభావాన్ని తెలుపుతూ ఈ దేవాలయం కోరిన కోరికలను తీర్చే ఆ మురుగుడు కొలువై వుంటాడని ఇతడు నెమలి వలె నర్తిస్తూ వళ్ళి అనే తన ప్రేయసి కాళ్ళకు బంధం వేశాడని చెప్పుచున్నది.

చరణం-2 :

సన్నిధియిల్ భుజస్తమ్బమ్
విణ్ణిల్ త్తావి వరుగిన్ర కుమ్బమ్
ఎన్నుమ్ చలరాసియై వడివాఫల
కోడిసూదియ ముదిమీథినిల్
తాన్గుమ్ ఉయర్‌న్దోన్గుమ్

అర్థం :

ఈ దేవాలయం మీద ఉన్న పతాకం ఎన్నో ఇతర పతాకల సమాహారంతో ఎంతో ఎత్తులో ఎగురుతూ ఒక మహా సముద్రమే ఆకాశంలో ఉన్నది అన్న భావన కలిగిస్తుంది.

చరణం - 3 :

కరుణై మురగనైప్ పోట్రి
తంగ కావడి తొలిన్మేల యేట్రి
కొళుమ్ కనలేరియ యెజుహ గావ్యారు
భవరే వరుమేగతి
కాన్బార్ ఇన్బమ్ పూన్బార్

అర్థం :

సువర్ణముతో సమానమైన కావడిని భుజాలమీద మోసుకుంటూ ఆ మురుగుడిని స్తుతిస్తూ దీపములో వెలుగు ఇచ్చుట కొరకు కరిగేటటువంటి మైనంలాటి భక్తునకు మోక్షము, స్వర్గము కలుగుతుంది! అని భావన.

అదేవిధంగా మరొక కావడిసిందు ఉదా :

పల్లవి : వళ్ళిక్కనవన్ పేరై వజహప్పొక్కన్
సొన్నాలుమ్ ఉల్లమ్ కుజహయుడది
కళియే ఉన్నుమ్ వురుదాది

చరణం:ఎన్నుమ్ నిరైన్దిరుప్పోన్ యెట్టియుమ్
ఎట్టాదిరుప్పోన్ కుమ్కుమ వరనడి కిలియే
కుమరప్పెరుమాన్దది

ఈవిధంగా తమిళ ప్రజలు తమ సాహితాన్ని కళల్ని రక్షించుకోవడానికి ఎంతోకృషిచేశారు. దాని ఫలితంగా ఆధునిక యుగంలో ఎన్ని పరిణామాలు జరిగినా అంత రించి పోకుండా అవి ఇప్పటికి నిలచివున్నాయి. తెలుగు దేశంలో ఎన్నో జానపద కళలు వున్నప్పటికి తెలుగు ప్రజలకు తమిళ జానపద కళలను పరిచయం చేయాలన్న సదుద్ధేశంతో మాడభూషి సంపత్‌కుమార్ గారు తన ప్రతిభా పాటవాలను క్రోడీకరించి తమిళ జానపద కళల ప్రాశస్త్యాన్ని సరళమైన భాషలో అందరికి అర్థమయ్యే విధంగా తమిళ జానపదకళలు అనేటటువంటి గ్రంథాన్ని రచించారు. ఈ రచనను విశ్లేషణతో చూసినప్పుడు ద్రావిడ దేశంలో జానపదాల గురించి ఒక అవగాహన కలక జేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఉపయుక్త గ్రంథసూచిక :

1) తమిళ జానపదకళలు - డా॥ మాడభూషి సంపత్ కుమార్
2) పల్లెపదాలు - ఆచార్య పేరు శ్రీనివాసులు రెడ్డి.
3) South Indian Music - P. Sambamurthy
4) http://carnatica.net/composer/Annamalai Reddiar.htm.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చివరకు నువ్వే గెలుస్తావు - సామాజిక విశ్లేషణ

- డాక్టర్ డి. సుశీల, తెలుగు అధ్యాపకురాలు, డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఐఐఐటి, ఒంగోలు.

సాహిత్యం సమాజ హితానికి నిదర్శనం. సమాజంలో సాహిత్యం వలన ఎంతో మంచి జరగడమే కాకుండా, ఒక దిశానిర్దేశాన్ని ఏర్పరుస్తుంది. సాహిత్యము లేకుండా విలువలతో కూడిన సమాజ నిర్మాణం జరుగుతుంది అనుకోవటం అసంభవం. సాహిత్యం మానవజీవితంతో ఒక విలువైన బంధాన్ని పెనవేసుకుంది. కనుక సాహిత్యం లేని సమాజాన్ని ఊహించుకోవడం అసాధ్యం.

నవసమాజ నిర్మాణం జరగాలి అంటే ప్రతీ ఒక్కరూ చేయీ చేయి కలిపి తమవంతుగా సమాజ నిర్మాణానికి దోహదపడాలి. ముఖ్యంగా కవులు మరియు రచయితలు వారి వారి కాలాల్లో సమాజంలో జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని తమ కలంతో తమ గళంతో నిర్మొహమాటంగా ప్రజలందరికీ విషయవ్యక్తీకరణ జరిగేలా కృషి సల్పాలి. మనం ఇదివరకు అనేకమార్లు ఈ మాట విన్నాము "కత్తికి లేని విశిష్టత కలానికి ఉంది" అని. అటువంటి కలంతో విలువైన అక్షరాలు అనే ఆయుధాల్ని సంధింపజేసి, ప్రజలను చైతన్యపరచే దిశలో కవులు రచనా నిర్మాణం కొనసాగించాలి.

కవిత్వం అనేది హృదయాంతరాలలో నిద్రిస్తున్న అనేకమైన ప్రశ్నలకు సమాధానం చెప్పే ఒక ప్రక్రియ. అటువంటి కవిత్వాన్ని రాసే కవులు చైతన్యవంతమైన దిశగా అడుగులు వేసే భావిభారత పౌరులకు దిశానిర్దేశం చేయాలి. వారి కవితల ద్వారా సమాజంలో జరుగుతున్న అన్యాయాల్ని, అవినీతిని, అక్రమాల్ని, దోపిడీల్ని ఎండగట్టి ప్రజలలో మేల్కొలుపు తేవాలి.

సాహిత్యంలో అనేక ప్రక్రియలు వెలువడుతున్నప్పటికీ 'కవిత్వం' అనేది ఆధునిక కాలంలో కొత్త పోకడలకు వెలుగులు దిద్దుతూ మానవున్ని ఉత్తేజపరుస్తుంది అనటంలో ఎంతమాత్రము అతిశయోక్తి లేదు. మనుషుల యొక్క హృదయాంతరాలను తాకుతూ తన్మయత్వంలో మునిగేలా చేసే గొప్ప ప్రక్రియ కవితా ప్రక్రియ.

'చివరకు నువ్వే గెలుస్తావు' ఈ కవితా సంపుటిని ప్రముఖ సాహితీవేత్త, రచయిత ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారు రాశారు. వీరు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా తమ విధులను నిర్వహించడంతో పాటు, ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పరిశోధకులుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి. మాడ భూషి సంపత్ కుమార్ గారు రాసిన ప్రతీ కవితలో ఒక వైవిధ్యం కనబడుతుంది. కొత్త కొత్త పోకడలకు వీరి కవితలు అలవాలుగా నిలుస్తాయి. వీరి కవితా సంపుటాలలో ఒక అణిముత్యం 'చివరకు నువ్వే గెలుస్తావు'. ఈ కవితాసంపుటిలో మొత్తం 51 కవితల వరకు ఉన్నాయి. వాటి విశిష్టతలను గురించి కొంత వరకు తెలుసుకుందాం.

'నోరు' కవితలో మనిషి యొక్క మనస్తత్వం ఎలా ఉంటుంది మరియు మనిషి భావవ్యక్తీకరణకు దోహదపడే నోటితో ఎలా ప్రవర్తిస్తాడు అనే విషయాల్ని ఈ కవిత ద్వారా చక్కగా వ్యక్తపరిచారు.

కొందరికి నోరు / తినడానికి మాత్రమే ఉంటుంది
మూగబోయిన గొంతులా!/ ఇంకొందరికి
మాట్లాడ్డానికి మాత్రమే ఉంటుంది / డబ్బాలో రాళ్ళలా!
చాలామందికి / ఇతరుల్ని దూషించడానికి
పరుల సొమ్మునేయడానికి
చాలా బాగుంటుంది! /

భగవంతుడు మనిషికి ఇచ్చిన అద్భుతమైన వరంలో 'నోరు' అనేది విశిష్టమైనది. ఆనోటి ద్వారా మనిషి మహోన్నతుడిగా ఉన్నత శిఖరాల్ని అధిరోహించవచ్చు

లేక నోటి దురుసువలన పాతాళానికి పడిపోవచ్చును కూడా. చాలామంది వారు ఎందుకు పుట్టారో తెలియక అయోమయపు జీవితాన్ని గడుపుతూ విలువైన మానవజన్మకు మచ్చ తెచ్చే విధంగా తమ జీవన ప్రయాణం సాగిస్తుంటారు.

పై కవితలో ఈ మూడు విషయాలను స్పష్టం చేశారు. 'చివరకు నువ్వే గెలుస్తావు' అనే కవితా సంపుటిలో మాడభూషిగారు రాజకీయనాయకుల స్వార్థపు, కపటపు బుద్ధిని వివరంగా తెలియజేసారు.

నేను పచ్చని చెట్టుగా ఎదిగాను / నువ్వు వెచ్చని కుర్చీలో కూర్చున్నావు / నావేలుకు మచ్చపూసి / నువ్వు అధికారాన్ని చేపట్టావు / నిన్ను చూస్తున్నంతసేపు / నాకు నేనే గుర్తొస్తాను / నువ్వునా వేలికి పూసిన మచ్చ / నా జీవితానికి అంటుకుంది /చివరకు నువ్వే గెలుస్తావు / నీ గెలుపులో నా హస్తం ఉంది /కానీ / నువ్వు నాకు చెయ్యి స్తావు! ఒకప్పటి మనదేశంలో రాజకీయనాయకులు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేవారు. వారి స్వప్రయోజనాల కొరకు ప్రజల సొమ్మును వాడుకొనేవారు కాదు. కానీ నేటి రాజకీయనాయకులు దానికి పూర్తిభిన్నం. ప్రజాధనాన్ని వారి స్వప్రయోజనాలకు ఖర్చు చేసుకుంటూ హుందాగా వ్యవహరిస్తున్నారు. కోట్లు కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. తరతరాల వరకూ సొమ్మును కూడబెట్టి తమ వారసులకు బహుమానంగా ధారాళంగా ధారపోస్తున్నారు.

రాజకీయనాయకుల దుశ్చర్యలకు ప్రజలు యిబ్బందులు పడుతున్నారు. దానికి కారణం ప్రజల యొక్క అవివేకం, అజ్ఞానం. ఎందుకంటే అటువంటి నాయకుల్ని తమ ఓటు ద్వారా ఎన్నుకొని గద్దె ఎక్కిస్తున్నారు. కనుక ప్రజలు చేసిన చిన్న తప్పిదంవలన చివరకు స్వార్థరాజకీయ నాయకులే గెలుస్తున్నారని ఈ కవిత ద్వారా మాడభూషి గారు గొప్పగా తెలియజేసారు.

'రొట్టెముక్క' కవితాసంపుటిలో కవిగారు సామాన్యుడి ఆర్తిని, సంపన్నుడి దర్జాని తెలియజెప్పారు.

వాడు దొంగగా మారింది / వీడు దొరగా పేరు పొందింది / రొట్టెముక్క కోసమే! / రొట్టెముక్కతోనే! / ఒకడికి కడుపు మంట / ఇంకొకడికి కడుపులో మంట / రొట్టెముక్క కోసమే తంట!

పై కవితలో ఒక విషయం విధితమవుతుంది. 'కోటి విద్యలు కూటి కొరకే' అనేది అందరికి తెలిసిందే. అయితే కాలం కలిసి రాక చాలామంది దొంగలుగా బతుకు సాగిస్తారు. కాని ఆకలి అనేది దొంగకి, దొరకి ఒకటేగా! ఆకలి బాధని తట్టుకోలేక దొంగతనాలకి పాల్పడి చావుదెబ్బలు తినే అన్నార్తులు కోకొల్లలు. మరికొందరు వారు తిన్నది జీర్ణం కాక, ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి రకరకాల వ్యాయామాలు చేస్తూ జీవనం సాగిస్తారు. పై కవితలు మానవజీవితానికి అత్యంత సన్నిహితంగా ఉండే విషయాలను వెల్లడిచేస్తున్నాయి.

చివరకు నువ్వే గెలుస్తావు కవితాసంపుటి మానవులలో ఉండే విభిన్న మనస్తత్వాలకు, అభిరుచులకు నిలువెత్తు నిదర్శనం. ఇందులో ప్రతీ కవితా సంపుటి హృదయాంతరాలను కదిలించే ఒక గొప్ప ప్రక్రియకు శ్రీకారం చుట్టింది అనడంలో ఎంత మాత్రము అతిశయోక్తి కాదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. చివరకు నువ్వే గెలుస్తావు కవితాసంపుటి - మాడభూషి సంపత్ కుమార్ గారు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'వికారి' కవిత్వం - పరిశీలన

- డాక్టర్ ఐ.వెంకు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్.ప్రభుత్వ కళాశాల (స్వ), చిత్తూరు.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ చిన్నప్పటి నుండి భాషా సాహిత్యాలపై అభిమానం ఎక్కువగా ఉండటం వల్ల ఆ దిశగా ముందుకెళ్తూ తెలుగులో ఎం.ఎ.పట్టభద్రులై, పిహెచ్.డి చేసి పాత్రికేయునిగా జీవితం కొనసాగించి, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో చేరి, తెలుగు శాఖాధ్యక్షులుగా ఉంటూ మరెన్నో పదవులు అలంకరించడమే కాకుండా తెలుగులో అనేక రచనలు, కవితలను రాయటం జరిగింది. ముఖ్యంగా కవాతు, జీవితం-కవిత్వం, వికారి, కవితా ఓ కవితా: వస్తువు భాషా శైలి, శత్రువుతో ప్రయాణం, చివరకు నువ్వే గెలుస్తావు మొదలగు కవితా సంపుటాలు. ఇంకా వ్యాకరణ విజ్ఞానం, మూడో మనిషి, తమిళ జానపద కళలు, మొదటి అబద్ధం, ఒక విజేత మొదలగు రచనలు చేశారు. సరళమయిన భాషలో, భావవ్యక్తీకరణలో పాఠకులను తనవైపు మళ్ళించుకోగల గొప్ప రచనా నైపుణ్యం గల సమర్థులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. మచ్చుకు మనము వారి 'వికారి' కవితా సంపుటిలోని కొన్ని కవితలను పరిశీలిస్తే మనకు అతని కవితా నైపుణ్యంలోని గొప్పతనం అవగతమవుతుంది.

నోరు తెరవండి :

ఇకనైనా / నోరు తెరచి మాట్లాడండమ్మా / వేల సంవత్సరాలనుంచి
మౌనంగా ఉంచిన నోరు / తెరవడానికి కొంచెం ఇబ్బందిగా ఉన్నా / నోరు తెరచి మాట్లాడండి
..... / ..... /..... నువ్వు నోరు తెరిస్తేచాలు
పరారు / నోరు తెరవమ్మా / నీకు పొయ్యేది ఏమిలేదు / అవమానాలు తప్ప.

ఈ కవితలో సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, అవమానాలను మనస్సులో దాచుకోకుండా ధైర్యంగా ఎదిరించి నిలబడాలని, ఇంటా, బయట ఇబ్బంది పడుతున్న స్త్రీ నోరు తెరిచి మాటతోనే సమాధానం ఇవ్వాలని నోరు తెరిస్తే పోయేది ఏమి లేదు అవమానాలు తప్ప అని ఈ కవితలో నేటి సమాజంలో స్త్రీలు ఇబ్బందులు ధైర్యంతో ఎదుర్కొవాలని సూచించారు.

కులం :

కులంకన్నా
మలమేగొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం!

నేటి సమాజంలో ఎంత అభివృద్ధి సాధించినప్పటికి కులవ్యవస్థ అనేది అంటువ్యాధిలాగా వ్యాపిస్తున్నది. ప్రతి వ్యవస్థలోను కులమౌఢ్యం వీడటం లేదు. మనమంతా ఒకటే భావన లేదు. అందుకే ఈ కవితలో కులంను మలంతో పోల్చుతూ మలాన్ని కులం కంటే గొప్పగా వర్ణిస్తూ మలంను మనం విసర్జించగలుగుతున్నాం. కాని కులంను విడిచిపెట్టలేక పోతున్నామని కులం యొక్క హీన గుణాన్ని పోల్చడం జరిగింది.

శత్రువు :

నీకు / శత్రువులెవరూలేరు / నీకు / నువ్వే శత్రువు
ఆత్మ శుద్ధిలేని వాళ్ళకు / అంతరాత్మే పెద్ద శత్రువు
అవతలివాళ్ళను సహించలేని వాళ్ళకు / అంతా శత్రుత్వమే!
అసూయతో కృంగి పోయేవాళ్ళకు / శరీరమంతా శత్రుమయమే

సమాజంలో శత్రుత్వానికి కారణం మన మాటతీరు, ప్రవర్తనా విధానమే. అంతేకాకుండా మన జీవన విధానంలో ఇతరుల పట్ల ద్వేషం, అసూయ, మాటతీరు ఇవన్నీ ఎదుటివారిపట్ల మనకు శత్రుత్వాన్ని కలిగేటట్లు చేస్తాయని. కాబట్టి మన ప్రవర్తనలో మార్పురావాలని మన

పెద్దలు అన్నట్లు "నోరు మంచిదైతే ఊరు మంచిదవు తుంద"న్నట్లు మన ప్రవర్తనే మనకు ముఖ్యమని ఈ కవితలో పేర్కొనడం జరిగింది.

గొప్ప :

మరణంలేని
సమాజంకన్నా
మానవత్వం లేని
సమాజం గొప్పదికాదు!

ఈ కవితను పరిశీలిస్తే మనం సమాజంలో ఎన్ని రోజులు జీవించామని కాదు. మనం ఏం చేస్తున్నాం అనేది చాలా ముఖ్యం. మంచిగా మానవత్వంతో ఒక్కరోజు జీవించినా చాలు. అందుకే అందెశ్రీ గారన్నట్లు "మాయ మౌతున్నాడమ్మ మనిషన్నవాడు" అని 'మనిషి' ఖండికలో మానవత్వం వున్నవాళ్ళు మచ్చుకైనా లేరని చక్కగా చెప్పినట్లు ఈ కవితలో మానవత్వం గురించి చక్కగా వర్ణించారు.

మరణం :

ప్రాణాలను సైతం / త్యాగం చేసేవాడిని / మరణం అంటదు
అతను పొందే మరణం / మరణం కాదు త్యాగం / అతణ్ణి మరణం అంటదు

ఈ కవితలో సైనికుల త్యాగాలను వర్ణిస్తూ, చలిలో నిలబడి తుపాకీ పట్టుకొని శత్రువులను సంహరించి ఎక్కడో పర్వత అంచులో దేశం కోసం కాపలాగాస్తు సరిగా నిద్రలేకుండా, సరైన ఆహారం లేకుండా, తల్లి, భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ.. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడే వీర సైనికులకు మరణం పొందినా అది మరణం కాదని, అది దేశం కోసం చేసే త్యాగమని సైనికుల గొప్పతనాన్ని ఈ కవితలో చక్కగా వివరించారు.

రెండంచులకత్తి :

ఈ కత్తికి / రెండంచులపదును / ఏటైనా కొస్తుంది!
...../ రెండునాల్కలతో / రెండు రకాల జీవితాన్ని సాగిస్తే
రెండంచుల కత్తి / రెండు వైపుల కోస్తుంది / అవతలివాణ్ణే కాదు / మనల్నికూడా!

ఈ కవితలో నేటి సమాజంలో వున్న మనుషుల స్వభావాలను వర్ణిస్తూ అవసరాల కోసం అటూ, ఇటూ రెండు వైపుల మాట్లాడే మనుషులు, అవసరాల కోసం పార్టీలు మారే నాయకులు ముందుకెళుతున్నారు. అవసరాల కోసం స్నేహితులు శత్రువులవుతున్నారన్నారు. మిత్రులు విరోధులవుతున్నారు. ధర్మం అధర్మం అవుతుంది. న్యాయం అన్యాయం అవుతున్నది. కొందరు మనుషులు రెండు నాల్కల ధోరణితో ఉన్నది లేన్నట్లు, లేనివి వున్నట్లు చెప్పి బ్రతికేస్తుంటే. ఒకే మాట, మంచితనం వున్నవాళ్ళు సమాజంలో బ్రతకలేక నలిగి పోతున్నారని పేర్కొన్నారు.

ప్రకృతి :

ఎండ / వాన / చలి / గాలి / నీరు / నిప్పు / ఆకాశం / చెట్లు
..... అన్ని ఒక దానితో ఒకటి / విశ్వాసంగా ఉన్నంత కాలం
నిశ్వాసానికి కొరత లేదు / మనిషి అనే ఒకే ఒక / బొట్టు కాలుష్యం
వీటితో కలసి / ప్రకృతి ప్రశ్నార్థకమైంది.

ఈ కవితలో ప్రస్తుతం సమాజంలో మన పరిసరాలు, నీరు, ఆహారం, పీల్చేగాలి మొత్తం జీవరాశి కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. దీనికి కారణం మనమే. దీని వల్ల పక్షులు, జీవరాశులు అంతరించిపోతున్నాయి. భూప్రపంచమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుని వాతావరణంలో మార్పులు ఎక్కువై భూతాపం పెరిగిపోయింది. కరవులు, వరదలు ఎక్కువైనాయి. చెట్లు పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడుకోకపోతే మనిషి జీవితమే ప్రశ్నార్థకమవుతుందని ఈ కవితలో వర్ణించారు.

సేవ :

రాత్రంతా / వెలిగిన చంద్రుడు / ఉదయాన్నే లేచి / ఇంకోచోట

వెలగడానికి / వెళుతున్నాడు తప్ప / సేదతీరటానికి కాదు

ఈ కవితలో సేవా గుణం గురించి వివరిస్తూ మనకు చంద్రుడు సూర్యుడు రాత్రి, పగలు వెలుగునిస్తున్నారు. మరియు ఇక్కడ అస్తమించినా వేరేచోట ఉదయిస్తున్నాడు సూర్యుడు. అలాగే చంద్రుడు. కావున మనం సేవ చేయడానికి వెనకడుగు వేయకూడదని దానికి నిద్ర, నిలకడ ఉండదని గొప్పగా చెప్పారు.

భయం :

భయం / భయపెడుతూనే ఉంటుంది / దాన్ని
మోసినంతకాలం!
ఒకసారి / భయపెట్టి చూస్తేచాలు / జీవితాంతం
భయపెడుతూనే ఉంటుంది.

ఈ కవితలో మనం భయపడుతుంటే, మనల్ని అందరూ బెదిరిస్తూనే ఉంటారు. అలా కాకుండా ధైర్యంగా ముందుకెళితే, నిలబడితే మన నుంచి భయం పారి పోతుంది. మన అంచులకు రాదు. దానికే భయ మేస్తుందని, కాబట్టి ధైర్యంగా బ్రతకాలని చక్కగా ఈ కవితలో పేర్కొన్నారు.

ఏడుపు :

పువ్వులు / రాలిపోయేటప్పుడు / కన్నీళ్ళుకార్చవు
..... మనిషి / చావడానికి ఎందుకు ఏడుస్తాడు?

అనే కవితలో పువ్వులు రాలిపోయినా హృదయాన్ని పరిమళింపజేస్తాయి. ఆకులు రాలిపోయినా, పండ్లు పరిపక్వం చెంది రాలిపోయినా ప్రజలకు ఉపయోగపడు తాయి. కాని మనిషి చావు అంటే ఏడుస్తాడు. కారణం ఎవరికి ఉపయోగపడలేదనే భాదతో. అందుకే పూలు, పండ్లు లాగా మనమూ మరో పదిమందికి సహాయపడితే దానికి మించిన సార్థకత జీవితంలో వేరేది ఉండదని ఈ కవితలో చెప్పారు.

ముగింపు :

'వికారి' కవితా సంపుటిలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు తన కవితలో నిజ జీవితంలో మనం అనుభవించే అనేక అంశాలను, సమాజంలో వ్యక్తుల మధ్య ఉన్న స్వార్థపూరిత ఆలోచనలను, సామాజిక రుగ్మతలను, కులవ్యవస్థను, ప్రకృతిని, రైతు కష్టనష్టాలను ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చక్కగా వర్ణించారు. సమాజంను అన్ని కోణాలలో క్షుణ్ణంగా పరిశీలించి తన కవితల ద్వారా సమాజానికి చక్కటి సందేశాన్ని ఇచ్చారని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. 'వికారి' కవితా సంపుటి - మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపత్ కుమార్ ఆవిష్కరించిన "మూడో మనిషి" అంతరంగం

- డాక్టర్ కాళిశెట్టి సంధ్య, తెలుగు మెంటర్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణాజిల్లా.

"అక్షరాలు నక్షత్రాల్లాంటివి
అందుకుంటే
వెలుగునిస్తాం"

(మూడో మనిషి, పుట.54)

అంటూ అందమైన తెలుగు అక్షరాలతో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించి కాగితాల్లో నింపి భావితరాలకు దాచి ఉంచిన దార్శనికులు, కవి, రచయిత, విమర్శకులు, అనువాదకులు, పాత్రికేయులు, భాషావేత్త, అంతుకు మించి నిత్య పరిశోధక విద్యార్థి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. చిత్తూరు నుంచి చెన్నై దాకా సాగిన వీరి జీవిత ప్రయాణంలో తనను కదిలించిన, కలచివేసిన పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, సామాజిక దోపిడీ, స్త్రీల దు:ఖం, దేశభక్తి వంటి అనేకానేక విషయాలను; దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలను కవితలుగా, వ్యాసాలుగా, సంపాదకీయలుగా, పరిశోధన పత్రాలుగా వెలువరించిన ఘనత వీరిది.

చెన్నైలో స్థిరపడ్డ తెలుగు వారిలో ఒకరైన శ్రీ మాడ భూషి సంపత్ కుమార్ గారు తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక రంగాలకు చేసిన, చేస్తున్న సేవ కొనియాడ దగింది. ముఖ్యంగా 2012 అక్టోబర్‌లో బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేసి తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకురావడం తెలుగు భాష గర్వించదగ్గ విషయం.

సంపత్ గారి రచనా వ్యాసంగంలో కవిత్వం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వారి "మస్తిష్కంలో వేలాడుతున్న అక్షరాలు పదాలై వాక్యాలుగా ఎదిగి కవిత్వంగా ఒదిగి"(మూడో మనిషి, పుట.59) మన మనస్సులను ఆనంద డోలికలలో ముంచెత్తుతున్నాయి. భావి తరాలకు దాచి ఉంచబడుతున్నాయి.

"కవిత్వంలో
మడికాదు
తడి ఉండాలి"

(మూడో మనిషి, పుట.14)

అని భావించే సంపత్ గారు విభిన్నమైన అశాల్ని కవితా వస్తువులుగా గ్రహిస్తారు. అలాంటి భిన్నమైన అంశాల్లో మూడోమనిషి అంతరంగాన్ని ఆవిష్కరిస్తున్న 'మూడో మనిషి', 'జెండర్ స్పృహ' అనే రెండు కవితలను మాత్రమే నా పత్రసమర్పణకు పరిమితం చేశాను. తెలుగు సాహిత్యంలో అతి తక్కువమంది మాత్రమే స్పృశించిన మూడోమనిషి జీవితాన్ని, వారి అంతరంగ భావాల్ని, ప్రకృతి ప్రసాదించిన శరీరాకృతిపై వారు చేసే పోరాటాన్ని ఈ రెండు కవితల్లో మనం దర్శించవచ్చు.

ఎవరీ మూడో మనిషి? అసలు
"రెండో మనిషిని (స్త్రీ) గురించి
ఆలోచించే తీరికే లేని మనిషికి
మూడో మనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది"

(మూడో మనిషి, పుట.36)

బృహన్నల, శిఖండి, పేడి, కొజ్జా, హిజ్రా, పాయింట్ పైవ్, ట్రాన్స్ జెండార్.... ఇలా ఎన్నో పేర్లతో మనం ఎగతాళిగా మాట్లాడే ఆ మూడోమనిషిని గురించి సంపత్ కుమార్ గారి కవితల ద్వారా కొంత తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

మన సమాజంలో పురుషులకు ఉన్న గౌరవం స్త్రీలకు లేదు. పురుషులకూ, స్త్రీలకూ ఉన్న గౌరవం 'మూడో మనిషి' అనుకునే ట్రాన్స్ జెండర్ / హిజ్రాలకు లేదు. అసలు మనలాంటి మనిషిగానే వారిని గుర్తించం. పైగా వారిని చూస్తే భయపడతాం, ద్వేషిస్తాం, అసహ్యించుకుంటాం. కారణం వారిలో ఉన్న కొద్దిపాటి అసహజత్వపు లక్షణం. వారికి

"తాళి కట్టే అర్హత
తాళి కట్టించుకొనే అర్హత
లేదనే కదా ఇంత నువ్వులాట!"

(మూడో మనిషి, పుట.36).

ఆసహజత్వం వల్లే వారు కుటుంబం చేత, సమాజం చేత తిరస్కారానికి గురై, ఒంటరిగా పోరాడలేక తనను తనలాగే అర్థం చేసుకునే తనలాంటి వారితో కలిసి గుంపులుగా జీవిస్తారు. ఈ అనమ సమాజం చేసే అవమానాల్ని సహించలేక సమాజంపై తమ ధిక్కారాన్ని ప్రదర్శిస్తుంటారు.

ఒకప్పుడు ట్రాన్స్ జండర్లు భారతీయ సంస్కృతిలో ప్రముఖపాత్ర పోషించారు. గౌరవింపబడ్డారు. రామాయణ, మహాభారత రచనల్లో వీరి ప్రసక్తి కనిపిస్తుంది. మధ్యయుగంలో మొఘల్, హిందూ పాలకుల ఆస్థానాల్లో వీరు ప్రముఖ పాత్ర పోషించారని చరిత్ర చెప్తుంది. మనదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు 1871లో వారు చేసిన 'క్రిమినల్ ట్రైబ్స్' చట్టం ద్వారా ట్రాన్స్ జండర్లు నేరస్తులుగా పరిగణింపబడి దుర్భరమైన జీవితాన్ని గడిపారు. స్వాతంత్ర్యం వచ్చాక 1949లో చట్టాన్ని రద్దు చేశారు. అయినా కూడా ఆ చట్టం తాలూకూ భావాలు మనలో అలాగే పాదుకుపోవడం వల్ల ట్రాన్స్ జండర్లు సామాజిక వివక్షను ఎదుర్కొనక తప్పలేదు.

"కుక్కని, పిల్లిని
చంకనెక్కించుకొని తిరిగే మీకు
మనుషులు మనుషులుగా కనిపించరు
మేం కనిపించగానే
మీ ముఖంలోని ముడతలు
మీ మనసులోని భావనల్ని పట్టిస్తాయి
మా మనసుల్ని వేదనలతో కుట్టేస్తాయి"

(మూడో మనిషి, పుట.93)

అంటూ వారిని మనిషిగా గుర్తించలేని మన హృదయాలను సూటిగా తాకే ప్రశ్నను సంధించారు సంపత్. అలా పుట్టడం వారి చేతుల్లో లేదు. అలా పుట్టడమూ వారి తప్పు కాదు.

"మనసుకు, శరీరానికి
ఈడు జోడు కుదరక
మా కర్మ కాలింది"

(మూడో మనిషి, పుట.93)

అంటూ నిషిద్ధజీవి ఆవేదనకు అక్షరరూపమిచ్చారు సంపత్.

ట్రాన్స్ జండర్ల పరంగా కాస్త ఆనందించదగిన విషయ మేమిటంటే భారతదేశంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు వీరి ఆశీర్వాదాలను శుభప్రదంగా భావిస్తారు. వారిని అమితంగా గౌరవిస్తారు. అటువంటి ప్రదేశాలలో వీరు వివాహ వేడుకల్లో పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తునో లేక పుట్టిన శిశువులకు తమ ఆశీస్సులకు అందించడం ద్వారానే డబ్బులు సంపాదిస్తుంటారు. అలానే ఆధ్యాత్మిక మత సంబంధమైన కార్యక్రమాలలో కూడా వీరిది ప్రత్యేక స్థానం. అర్ధనారీశ్వర రూపంగా వీరిని భావించి గౌరవిస్తారు కనుకే వీరు ఎక్కువగా ఉత్తరాది ప్రాంతాలైన ముంబై, ఢిల్లీల్లో నివాసముంటారు. కనీసం కొంతమంది నమ్మకమైనా వారిని వారిగా గుర్తిస్తుంది.

"ఆకలికి
వాకిలితీస్తుంది జీవితం"

(జీవితం - కవిత్వం, పుట. 36)

కనుకనే ఇటువంటి నమ్మకాలు లేని ప్రదేశాల్లో ఉపాధి కరువై భిక్షాటన చేస్తూనో, వ్యభిచారం చేస్తూనో తమ జీవనాన్ని గడుపుతున్నారు వీరు.

"ఎందుకూ పనికిరానివారిగా ముద్రవేసి
దౌర్జన్యంగా భిక్షాపాత్ర చేతిలో పెట్టి
అడుక్కోవడానికి అనుమతిచ్చేశారు!"

(మూడో మనిషి, పుట.37)

అంటూ తమ పట్ల సమాజం చూపే వివక్షను, నిర్లక్ష్యాన్ని మౌనంగా భరిస్తూ జీవన పోరాటాన్ని సాగిస్తుంటారు వీరు. అసలే

"రెక్కలు తెగిన
పక్షికి
కాళ్ళు సరికెయ్యడం
కళ్ళు పొడిచెయ్యడం
నోరు నొక్కెయ్యడం / ఎగరడానికేనా?"

(మూడో మనిషి, పుట.31)

"కాలు, కన్ను, మనసు / ఏది వికలమైనా కనికరిస్తారు / కానీ మా అంగవైకలాన్ని అంగీకరించరు"(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.94) అంటూ నైతికత లోపించిన సమాజాన్ని ఆత్మావలోకనం చేసుకొమంటున్నారు సంపత్. మానవత్వం లేని సమాజం బతికుండీ మరణించినట్లే. అందుకే

"మీది మానసిక దౌర్బల్యం
మాది శారీరక దౌర్భాగ్యం"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.94)

అంటూ వారి తరపున మనలో లేని 'మనిషి'ని ప్రశ్నించారు.

ట్రాన్స్ జెండర్ల పోరాటం
"ఆస్తిపాస్తులకోసం కాదు
తృతీయశ్రేణి పౌరులుగా గుర్తింపు కోసమే ఆరాటం!"

(మూడో మనిషి, పుట.37)

అందుకే సమాజమూ, ప్రభుత్వమూ తమ ఉనికిని గుర్తించేలా వీరు అనేక పోరాటాలు చేశారు. ఫలితంగా భారత ఎన్నికల సంఘం 1994 నుంచి ట్రాన్స్ జెండర్లకు ఓటుహక్కును కల్పించింది. కానీ అప్పుడు కూడా వారు మహిళలుగానే పరిగణింపబడ్డారు.

రాజకీయ ఎత్తుగడలలో భాగంగా కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ట్రాన్స్ జెండర్ల గురించి ఆలోచించే నాయకులను

"మేం ఎజెండాలో లేనివాళ్ళం
మీ జెండా నీడలోకి రానివాళ్ళం
మా జెండర్ గురించిన స్పృహ ఎవరికీ లేదు"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.93)

అంటూ దుయ్యబట్టారు సంపత్.

"మా వంతు వచ్చినప్పుడల్లా
మీరు పాదరసంలా జారుకొంటూ ఉంటే
మాకిక ఎవరి ఎజెండాలు అక్కర్లేదు
మా జెండాలు మేమే మోస్తాం!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.93)

అంటూ నాయకుల నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టారు కవి.

ట్రాన్స్ జెండర్ల అస్తిత్వాన్ని నిలబెడుతూ సుప్రీంకోర్టు 2009 నుంచి ఓటర్ల లిస్టులో థర్డ్ జండర్ కాలమ్‌ను ప్రవేశపెట్టమని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు అధికారిక పత్రాల్లో కూడా థర్డ్ జండర్ కాలమ్‌ను తప్పని సరిగా ప్రవేశపెట్టమని 2014లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు జారీచేసిన ఈ మార్గదర్శకాలు వారి మనుగడకు శాశ్వత రూప మిచ్చాయి. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతి పౌరులుగా వారిని గుర్తించి చదువుల్లోనూ, ఉద్యోగాల్లోనూ వారికి రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వారికి రేషన్ కార్డులు మంజూరు చేసి 1500 రూపాయలు పింఛన్ ఇస్తుంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

2011 జనాభా లెక్కల ప్రకారం 4.9 లక్షల మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. వీరు గురువులను నమ్ముతారు. గురుశీల పరంపర వారికి ఎంతో పవిత్రమైంది. జూన్, జూలైల్లో ముంబై ఢిల్లీలలో హిజ్రాల జాతర జరుగుతుంది. అక్కడ అందరూ కలుసుకొని సంబరాలు చేసుకుంటారు. జనుల వల్ల తిరస్కరింపబడి, సంఘంచేత బహిష్కరింపబడిన ట్రాన్స్ జండర్ల మరణం కూడా రహస్యమే. కులమతాల పేర్లతో శ్మశానవాటికలను ఏర్పాటు చేసుకున్న మనిషి స్వార్థం వల్ల ఈ పరిస్థితి వచ్చిందో లేక మరే ఇతర కారణమో తెలీదు కానీ వీరి అంత్యక్రియలు రాత్రి పూట మాత్రమే అతి రహస్యంగా జరుగుతాయి. మరణాన్ని వారు దు:ఖంగా భావించరు. అటువంటి జీవితం మరు జన్మలో ఇవ్వద్దంటూ భగవంతుకి సంబంధించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

"మూడో మనిషిని
మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని
ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి!"

(మూడో మనిషి, పుట.38)

అప్పుడే వారిపట్ల మనకున్న భేదభావం నశిస్తుందని కవి కాంక్షించారు. అప్పుడే ఈ అసమానతలన్నీ పోయి సమ సమాజ స్థాపన కలుగుతుంది.

ప్రస్తుతం సమాజం కూడా ట్రాన్స్ జండర్ల గురించి ఆలోచించడం ప్రారంభించింది. ఫలితంగా 2019లో జరిగిన కుంభమేళాలో మొదటిసారి పాల్గొనే అవకాశం వీరికి లభించింది. అంతేకాదు ఎన్నికల్లో వీరు కేవలం ఓటర్లుగానే కాక అభ్యర్థులుగా కూడా పోటీ చేస్తూ తమ సత్తా చాటుతున్నారు. రాజకీయం, పోలీస్, మీడియా, సినిమా..... ఇలా ఒకటేమిటి అన్ని రంగాల్లో వీరు తమదైన ప్రతిభను కనబరుస్తున్నారు.

పుట్టిన ప్రతి మనిషీ హుందాగా, గౌరవ ప్రదమైన జీవితాన్ని పొందాలి. అప్పుడే మనిషి జన్మకు సార్థకత ఏర్పడుతుంది. ట్రాన్స్ జండర్లు చేస్తున్న జీవన పోరాటాల పట్ల మనం సానుకూలంగా స్పందించగలగడమే మనం వారికి ఇచ్చే నిజమైన గౌరవం. సామాజిక స్పృహ కలిగిన సంపత్ గారి ఈ కవితలు ట్రాన్స్ జండర్ల అంతర్యుద్ధాన్ని బహిర్గతం చేస్తూ సామాజిక బాధ్యత వైపుకు మనల్ని మళ్లిస్తున్నాయి.

తెలుగులో ట్రాన్స్ జెండర్లపై వచ్చిన సాహిత్యం చాలా చాలా తక్కువ. బహుశా మనం వారి పట్ల చూపే నిరాదరణే ఇందుకు కారణమనుకుంటా. ఒకరిద్దరు మాత్రమే కాదు యావత్సమాజమూ వారిని గురించి ఆలోచించే రోజు త్వరలోనే రావాలని ఆకాంక్షిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. మాడభూషి సంపత్ కుమార్ - జీవితం-కవిత్వం, ఏప్రిల్ 2013, శత్రువుతో ప్రయాణం, మార్చి 2015, చివరకు నువ్వే గెలుస్తావు, ఏప్రిల్ 2016, మూడో మనిషి, మార్చి 2017, పాలపిట్టబుక్స్, మలక్ పేట, హైదరాబాదు-500 036.
2. అంతర్జాలం

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వ్యాకరణ విజ్ఞాన గ్రంథం భాషా దృక్కోణ పరిశీలన

- ఆచార్య శ్రీని రాజేశ్వరి, డీన్, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఒక రచయిత రచనను పరిశీలించేటపుడు రెండు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అవి - 1. రచనోద్దేశం, 2. రచన ప్రయోజనం. రచన ఉద్దేశంలోనే ఏం రాయాలనుకుంటున్నారు. ఎవరికోసం రాయాలనుకుంటున్నారో ఉంటుంది. రచయిత ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు తన ముందు మాటలోనే స్పష్టంగా వీటిని ప్రస్తావించారు. వ్యాకరణం పట్ల ప్రాథమిక అవగాహన కలిగించడం కోసం. విద్యార్థులకు వ్యాకరణ అంటే ఉన్న భయాన్ని పోగొట్టటానికి తానీ పుస్తకాన్ని రాస్తున్నట్లు తెలిపారు. సదుద్దేశంతో మొదలైన రచన సత్ఫలితాన్ని ఇస్తుంది. భాషకు సంబంధించిన జ్ఞానార్జన ఇవ్వడమే ఈ రచన ప్రయోజనం.

2013లో వెలువడిన 'వ్యాకరణ విజ్ఞాన' గ్రంథంలో 10 అధ్యాయాలు ఉన్నాయి.

1. పరిచయం, 2. వ్యాకరణం - ప్రాచీనత, 3.వ్యాకరణం - వ్యుత్పత్తి, నిర్వచనం, 4.వ్యాకరణ ప్రయోజనం, 5.తెలుగు వ్యాకరణాలు పరిచయం, 6. బాలవ్యాకరణం విశిష్టత, 7.బాలవ్యాకరణ పరిచ్ఛేదాల పరిచయం, 8.బాల ప్రౌఢ వ్యాకరణాలు, 9.వ్యాకరణ సంజ్ఞలు, 10.పారిభాషిక పదాల వివరణ

మొదటి 5 అధ్యాయాలు భాషకు వ్యాకరణానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలుపుతాయి. తరువాతి 5 అధ్యాయాలు బాలవ్యాకరణ విశిష్టతను స్పష్టం చేస్తాయి.

1. వ్యాకరణ నిర్వచనం :

పదాలను ప్రకృతి, ప్రత్యయాలుగా విభాగించి, వాని వ్యుత్పత్తిని తెలిపేది వ్యాకరణం. సూత్రాలు,ఉదాహరణలే కాక వ్యాఖ్యానాలు కూడా వ్యాకరణంలో ఉంటాయి.

2. వ్యాకరణ ప్రయోజనం :

జీవద్భాషకు మార్పు సహజం. మార్పును నియంత్రిస్తూ క్రమబద్ధీకరణ చేసేది వ్యాకరణం. పరస్పర విరుద్ధాంశాలైన 'మృదుతనం' (Flexibility) 'దృఢత్వం' (Regidness) రెండూ భాషకు అవసరమే. రెండిటిలో ఏ ఒకటి లోపించినా భాష నిర్మాణం దెబ్బతింటుంది. భాష వాగ్రూపంలో ఉన్నప్పుడు ఎన్నో మార్పులకు లోనవుతుంది. అదే భాష లిఖిత రూపంలోకి మారేటప్పుడు స్థిరత్వాన్ని పొందుతుంది. ఈ స్థిరీకరణ దశలో భాషలో దాగున్న సూత్రాలను వెలికి తీస్తుంది. వ్యాకరణం కాల క్రమేణ భాష తన రూపాన్ని మార్చుకున్నప్పుడు వ్యాకరణం కూడా నవరణలు, పూరణలు చేసుకుంటుంది. అందుకే ఒక వ్యాకరణ గ్రంథానికి అనుబంధంగా మరెన్నో వ్యాకరణ గ్రంథాలు పుడతాయి (ఆంధ్ర శబ్దచింతామణికి సంస్కృతంలో 5, తెలుగులో 14 వ్యాఖ్యానాలు పుట్టాయి.)

'ప్రయోగ శరణం వ్యాకరణం' అన్నారు వ్యాకర్తలు. వ్యాకరణం భాషను నియంత్రిస్తుంది అన్నది ఒక అపోహ మాత్రమే వ్యాకరణం భాషలో వచ్చేమార్పుల్ని అంగీకరిస్తూనే మార్పుపేరుతో భాష అపభ్రంశం కాకుండా చూస్తుంది.

ఈ నేపథ్యంలో, షడాంగాలలో ఒకటైన వ్యాకరణ ప్రయోజనాన్ని 'పతంజలి' తన 'మహాభాషకం'లో రక్ష, ఊహ, ఆగమం, లఘ్వర్థం, అసందేహం అని ఐదింటిని పేర్కొన్నారు. రచయిత వర్తమాన కాలానికి ఈ ప్రయోజనాలకు అనుసంధిస్తూ భాషకు వ్యాకరణానికి మధ్య ఉన్న అనుబంధాన్ని వెలికితీస్తారు. అవి.

1. వ్యాకరణం వలన భాషతో ఉన్న వర్ణ క్రమం తెలుస్తుంది. తద్వారా వ్యవహర్త అక్షర దోషాలు లేకుండా రాయడం, అపశబ్దాలు ఉచ్చరించకుండా మాట్లాడడం తెలుస్తుంది. (స్వజనం - శ్వాజనం)

2. వ్యాకరణం వలన పద స్వరూపం తెలుస్తుంది. తద్వారా దీర్ఘసమాసాల్లో పదాలవిరుపు అర్థ వంతంగా ఉంటుంది. (రామునితో కపివరుడిట్ల నియె) ధీర + హితుండు (ధీరులకు హితుడు) ధీ + రహితుండు (బుద్ధిలేని వాడు)
3. ప్రకృతి, ప్రత్యయజ్ఞానానికి వ్యాకరణం తప్పనిసరి
4. వ్యాకరణం కావ్య ప్రయోగాల్లోని సుశబ్దాలను, అప శబ్దాలను తెలియజేస్తుంది.
5. ప్రతి భాషకు కొన్ని నియమాలు ఉంటాయి అ నియమాలను తెలిపేవే వ్యాకరణం. ఉదా.

వాక్యంలో కర్త - క్రియల మధ్య నిర్మాణ సంబందం (Coordination) తప్పనిసరి

(నామం) సీతా రాములు అడవికి వెళ్ళారు (ద్వంద్వ సమాసం)

(విణ) సీతారాముడు అడవికి వెళ్ళాడు (విశేషణ కర్మధారయ సమాసం)

ఇలా భాషలో ఉన్న వ్యాకరణాంశాల్ని సూత్రాల్ని వివరిస్తుంది వ్యాకరణం.

3. తెలుగు వ్యాకరణాల పరిచయం :

తెలుగు భాషకు 300 పైగా వ్యాకరణ గ్రంథాలు వెలువడ్డాయి. అవి తెలుగులోనే కాక, సంస్కృతం, ఇంగ్లీషు, లాటిన్, రష్యన్ భాషల్లో కూడా వెలువడ్డాయి. సంస్కృతంలో వచ్చిన వ్యాకరణాలు శ్లోక రూపంలోను, సూత్రరూపంలోను ఉంటే, తెలుగులో వచ్చిన వ్యాకర ణాలు పద్యాల రూపంలోను, సూత్రరూపంలోను, వచనాత్మకంగాను ఉన్నాయి. ఇతర పాశ్చాత్య భాషలో రచింపబడిన వ్యాకరణాలు వివరణాత్మకంగా ఉన్నాయి. ఇవి తెలుగు భాషేతరులు తెలుగు భాష నేర్చుకోవడం కోసం రచింపబడినవి. వీనిని పట్టిక రూపంలో చూపడం జరిగింది.

తెలుగు వ్యాకరణాలు, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, లాటిన్, రష్యన్ శ్లోకాలు, సూత్రాలు, పద్యాలు సూత్రాలు వచనం వివరణాత్మకం.

ఈ వ్యాకరణ గ్రంథాల్లో ప్రధానమైన వానిని కాలానుగుణంగా 'తెలుగు వ్యాకరణాల పరిచయం' అన్న అధ్యాయంలో రచయిత సంక్షిప్తంగా పరిచయం చేశాను. తద్వారా విద్యార్థులకు వ్యాకరణాల చరిత్ర తెలిసింది.

వ్యాకరణం	వ్యాకర్త	కాలం
1. ఆంధ్రశబ్దచింతామణి (14 వ్యాఖ్యానాలు, సంస్కృతంలో శ్లో.)	నన్నయ	11 శ.
2. కవిజనాశ్రయం (ఛందోగ్రంథం)	వేములవాడ భీమకవి	12 శ.
3. ఆంధ్ర భాషా భూషణం (పద్యం, తొలితెలుగు వ్యాకరణం)మూలఘటిక	కేతన	13 శ.
4. కాకానిలంకారచూడామణి (ఛందస్సు, పద్యం)	విన్నకోట పెద్దన	15 శ.
5. ఛందోదర్పణం (ఛందస్సు, పద్యం)	అనంతామాత్యుడు	15 శ.
6. కవి చింతామణి (వ్యాకరణం, పద్యం)	వెల్లంకి తాతంభట్టు	16 శ.
7. లక్షణసార సంగ్రహం (పద్యం)	చిత్రకవి పెద్దన	16 శ.
8. ఆంధ్ర కౌముది (పద్యం)	గణపవరపు వేంకటకవి	17 శ.
9. సర్వలక్షణసార సంగ్రహం	కూచిమంచి తిమ్మకవి	18 శ.
10. బాలవ్యాకరణం (సూత్రం)	చిన్నయసూరి	19 శ.
11. ప్రౌఢ వ్యాకరణం	బహుజనపల్లి సీతారామాచార్యులు	19 శ.
12. వ్యవహారిక భాషా వ్యాకరణం	వడ్లమూడి గోపాల కృష్ణయ్య	20 శ.

13. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం	వజల వేంకటేశ్వర్లు	20 శ.
14. ఆధునిక తెలుగు వ్యాకరణం	ఎ.న్. శివరామమూర్తి	20 శ.

పాశ్చాత్య భాషలో వెలువడిన తెలుగు వ్యాకరణాలు :

1. గ్రమటికా తెలుగికా (ఇటాలియన్)	బెంజిమన్ షూల్జ్	18 శ.
2. ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్	ఎ.డి. కాంబెల్	19 శ.
3. ఎ గ్రామర్ ఆఫ్ ద జెంతు లాంగ్వేజ్	విలియంబ్రౌన్	19 శ.
4. ఎ గ్రామర్ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్	సి.పి. బ్రౌన్	19 శ.
5. ఎ తెలుగు లాంగ్వేజ్ (రష్యన్)	పెంట్రుంచెవా	20 శ.

తెలుగు వ్యాకరణాల చరిత్ర చాలా విస్తారమైనది. వందలాది వ్యాకరణాలు ఉన్నా 'తెలుగు వ్యాకరణ దీపం చిన్నది' అన్న అపవాదం ఉంది.

వ్యాకరణ విజ్ఞాన గ్రంథంలోని రెండవ భాగంలోకి ప్రవేశిస్తే- తెలుగు భాషకు 162 సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రామాణిక వ్యాకరణ గ్రంథం 'బాలవ్యాకరణం' వైశిష్ట్యం అర్థమవుతుంది. ఇది 1858 లో రచింపబడింది. చిన్నయసూరి (1806-1862) కర్త. ఇందులో పది పరిచ్ఛేదాలు, 465 సూత్రాలు, 3,193 ప్రయోగాలు ఉన్నాయి. 'బాలవ్యాకరణం వెయ్యేళ్ళ తెలుగు కావ్య భాషకు సంబంధించిన ప్రామాణిక వర్ణనాత్మక వ్యాకరణం'. 'అల్పాక్షరమసందిగ్ధం' అన్న శ్లోకంలోని పది లక్షణాలు ఇందులో ఉన్నాయి. సంక్షిప్తత అసందిగ్ధత, నిర్దుష్టత, బహురూప సాధకత, శ్రావ్యత సారవంతత, అర్థవంతత, నిర్దిష్టత, సభ్యత, సౌమ్యత అన్న లక్షణాలతో శిల్పాన్ని పాటిస్తూ వ్యాకరణ గ్రంథాన్ని 'వ్యాకరణ కావ్యంగా' తీర్చిదిద్దారు. తెలుగు వ్యాకరణ చరిత్రను బాల వ్యాకరణానికి ముందు, బాలవ్యాకరణం తరువాత అని విభాగిస్తున్నారంటే ఇది ఒకమైలు రాయిలాగా నిలబడింది. అని అర్థం అవుతుంది.

బాలవ్యాకరణంలో పదిపరిచ్ఛేదాలు ఉన్నాయి. అవి సంజ్ఞా, సంధి, తత్సమ, ఆచ్చిక, కారక, సమాస, తద్ధిత, క్రియ, కృదంత, ప్రకీర్ణక పరిచ్ఛేదాలు. వీనిలో క్రియా పరిచ్ఛేదం పెద్దది 124 సూత్రాలు ఉన్నాయి. తరువాత స్థానం తత్సమ పరిచ్ఛేదం (87) ఆక్రమిస్తుంది. కృదంత (22) సంజ్ఞాపరిచ్ఛేదాలు (23) చిన్నవి. రచయిత బాలవ్యాకరణ పరిచ్ఛేదాల్లోని సారాంశాన్ని 7 అధ్యాయాలలో పొందుపరిచారు. బాలవ్యాకరణానికి, భాషాశాస్త్రానికి మధ్య సమన్వయం చేయడం, సంధిని భాషాశాస్త్ర కోణం నుంచి పరిచయం చేయడం రచయితకున్న లోతైన భాషా పరిజ్ఞానాన్ని బయటపెట్టాయి సంజ్ఞా, సంధి, పరిచ్ఛేదాలు వర్ణానికి, పదజాల విభజనకు ప్రాధాన్యం ఇస్తే, తత్సమ, ఆచ్చిక, తద్ధిత, కృదంత, పరిచ్ఛేదాలు నామనిర్మాణాన్ని, క్రియ పరిచ్ఛేదం క్రియా నిర్మాణాన్ని, సమాస, కారక పరిచ్ఛేదాల వాక్యనిర్మాణానికి వివరిస్తాయి.

బాలవ్యాకరణానికి సవరణ, పూరణ గ్రంథంగా ప్రౌఢ వ్యాకరణం 1885లో వెలువడింది. బహుజనపల్లి సీతా రామచార్యులు కర్త. 10 పరిచ్ఛేదాల, 314 సూత్రాలు ఉన్నాయి. బాలవ్యాకరణంలో లేని వాక్య పరిచ్ఛేదం ఇందులో ఉంది. బాల, ప్రౌఢ వ్యాకరణాల విద్యార్థులకు ప్రామాణిక పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. ఎం.ఏ. తెలుగు సాహిత్య విద్యార్థుల్లో ఈ వ్యాకరణ గ్రంథాలు తెలియని వారు ఉండరు.

బాలవ్యాకరణంలో 150 పైగా పారిభాషక పదాల ఉన్నాయి. వీటిని 'సంజ్ఞలు' అంటారు. ఇవి గురు, లఘు సంజ్ఞలు. వీటిని బాల వ్యాకర్త పూర్వ వ్యాకరణ గ్రంథాలైన అష్టాధ్యాయి, ఆంధ్రశబ్ద చింతామణి ఇంకా ఇతర గ్రంథాల నుంచి గ్రహించి, కొన్ని తానే స్పృసించి

బాలవ్యాకరణాన్ని సులభ బోధకంగా తీర్చిదిద్దారు. నామ, విభక్తి సంప్రదానం, అధికరణం, ప్రధమ, మధ్యమ, ఉత్తమ పురుషులు, అష్టాద్యాయి నుంచి, పరుష, సరళాలు, స్థిరాలు, సవర్ణం, తత్సమ, తద్భవ, దేశ్య, గ్రామ్య, సంధి, మహత్తు, ఔపవిభక్తికాల అన్న సంజ్ఞలు ఆంధ్రశబ్దచింతామణి నుంచి గ్రహించారు. చిన్నయసూరి. డుమంతం, త్రికం, ముత్తు వంటివి తానే కల్పించారు. ఈ సంజ్ఞలన్నింటిని 91 పారిభాషక పదాల పేరిట సేకరించి, వానిని సంక్షిప్తంగా వివరిస్తూ, అకారాది క్రమంలో చేర్చడం. అ సంజ్ఞలు ఏ పరిచ్ఛేదాల్లో వస్తాయో సూచించడం రచయిత ఆచార్య సంపత్‌కుమార్ గారి అపార శ్రమకు, ప్రజ్ఞకు నిదర్శనం. ఈ వ్యాకరణ నిఘంటువు విద్యార్థులకు బాలవ్యాకరణాన్ని సులభంగా అర్థమయ్యేటు చేస్తుంది.

విద్యార్థులకు వ్యాకరణం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి అందులోని ఔన్నత్యాన్ని తెలిజేస్తూ, వ్యాకరణం పట్ల ఆసక్తి కలిగించే విధంగా ఈ పుస్తకం రచించబడింది. వ్యాకరణాలపట్ల ఉన్న అపోహల్ని తొలగిస్తూ, భాషా శాస్త్ర సమన్వయం చేస్తూ రచింపబడిన ఈ గ్రంథం నూతన ఒరవడినికి శ్రీకారం చుట్టింది. రచయిత ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారికి అభినందనలు.

ప్రభావితం చేసే కవిత్వం

- రమణ వెలమకన్ని

'జీవితం-కవిత్వం' అనే తొలి కవితా సంపుటి తర్వాత రెండేళ్ళకు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ తాజాగా వెలువరించిన మలి సంపుటి 'శత్రువుతో ప్రయాణం'. 32 కవితలను పొందుపరిచిన ఈ పొత్తంలో మంచి కవితలు చాలానే ఉన్నాయి. 'అతడు కూడా మనిషే... మనసే అతనికి గుర్తింపుతెచ్చింది. మనిషి కోసం వెతుక్కుంటూ.... తిరుగుతున్నాడు' అంటూ మనసున్న మనిషి తనలాంటి మనిషి కోసం, మనసుతో సంభాషించడం కోసం అన్వేషిస్తుంటాడు. ఎక్కడా అలాంటి వ్యక్తి సమాజంలో తారసపడకపోగా, తన మనస్సునే ముక్కలు చేసిన మామూలు మనుషులే ఎదురౌతారు. 'ఇప్పుడు అతను కూడా తనువుల్లో కలిసిపోయాడు... అతడు మనిషిని జయించాడు... మనిషిని వెతకడం మానేశాడు!' అంటూ ముక్తాయిస్తాడు కవి. సమాజాన్ని ప్రభావితం చేసేవాళ్ళు కొందరయితే... సమాజంలో ప్రభావితం అయ్యేవారు అనేకమంది. తన కన్న తండ్రి స్మృతిపథంలో పలువరిస్తు 'కోడికన్న కోకిల కన్నా... ఆయననే ముందులేస్తాడు. రెక్కాడితే కాని డొక్కాడని... కుటుంబం కోసం పక్షులతో పాటు రెక్కలు విదుల్చుకుని బయలుదేరతాడు. ఆ రోజు రాత్రిదాకా... మాకు పెట్టడం తప్ప ఒక్క పిడెకుడు మెతుకులు...ఆశించని ధన్యుడు' అంటూ జ్ఞాపకాల్ని తడుముకుంటాడు. 'కత్తి కిందపడ కుండానే...మరణించిన వీరుడు' నిజమే! ఆఖరి శ్వాస వరకు కుటుంబ క్షేమమే ధ్యేయంగా శ్రమించే పితృదేవులు ఎందరో! స్త్రీ సమస్యల మీద అతి సున్నితంగా స్పందిస్తారు మాడభూషి. 'ఆమె', 'స్వర్గం', 'మగాడు', 'భయం' ఇంకా పలు కవితల్లో స్త్రీల సమస్యల్ని పలుకోణాల్లో దర్శిస్తాడు. బలంగా చర్చిస్తాడు. 'జెండా / మీటరు గుడ్డ కాదు / లక్షల మంది / ప్రాణ త్యాగం చేసిన కన్న బిడ్డ!' వంటి అభివ్యక్తులు. సంపుటి నిండా పరుచుకుని ఉన్నాయి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపత్ కుమార్ వచన కవిత్వం - సామాజిక స్పృహ

- డాక్టర్ బుశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి.ట్రిపుల్ ఐటీ, ఆర్.కె.వ్యాలీ (ఇడుపులపాయ), కడప.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో వినూత్న ప్రక్రియలు రూపుదాల్చాయి. వాటిలో చెప్పదగినవి కథానిక, నవల, నాటిక, ఏకాంకిక, వ్యాసం, వచన కవిత, గేయ కవిత, హైకూ, నానీలు, రుక్కులు. అయితే వీటన్నింటిలో అత్యంత పాఠకాదరణ పొందిన ప్రక్రియ వచన కవిత. ప్రతి సామాజిక అంశాన్ని వచన కవిత ద్వారా అభివ్యక్తం చేయవచ్చు. ఈ సౌలభ్యం మరే ఇతర ప్రక్రియలోనూ లేదనవచ్చు. ఈ వాస్తవాన్ని గుర్తించిన లబ్ధ ప్రతిష్ఠులైన కవులు వచన కవితలు రాశారు, రాస్తున్నారు. ఈ కోవలో చెప్పదగిన కవి మాడభూషి సంపత్ కుమార్ గారు. వీరు వందలాది కవితలు రాశారు. వీరి ప్రతి కవితలోనూ చక్కని సామాజిక స్పృహ ఉంటుంది. వీరి కవితా వస్తువు వినూత్నంగా ఉంటుంది. వీరి ఆలోచనా ధోరణి వైవిధ్యంగా ఉంటుంది.ప్రతి జీవికి చావుపుట్టుకలు సహజం. మనం ఒక జీవిని పుట్టకుండా చేయగలం గాని మరణించకుండా చేయలేం. ఈ సత్యాన్ని గుర్తించిన కవి మరణాన్ని గూర్చి 'మరణం నా శాశ్వత చిరునామా' అనే కవితలో ఇలా అంటాడు.

"మరణం గురంచి నాకు భయం లేదు / మరణాన్ని నేను చంకలో పెట్టుకొని తిరుగుతాను / మరణాన్ని నేను గుండెల్లోపెట్టుకొని నిద్రపోతాను / మరణం నా కళ్ళలో మెరుస్తూ ఉంటుంది/ మరణం నా దగ్గరి బంధువు / మరణం నా ప్రాణ స్నేణితుడు / మరణం నా గురువు / మరణాన్ని నీడలా లాక్కొని వెళతాను పారిపోకుండా / మరణాన్ని నేను పక్కలో పడుకోబెట్టుకుంటాను / మరణం నా చిరునామా!

మరణం కేరాఫ్ నేను / నేను మరణంలో జీవిస్తాను / మరణాన్ని మననం చేసుకుంటాను / మరణం నా శాశ్వత చిరునామా! / ఒకసారి మరణాన్ని ఆస్వాదించినవాడు దాన్ని పరిత్యజించలేడు

దేవుడా నాకు మరణాన్ని ఎప్పుడు ప్రసాదిస్తావు స్వామీ! / అని మరణం కోసం వేచి ఉండే వాళ్ళు / మరణాన్ని దేవుడిలా చూసుకునే వాళ్ళు / మరణాన్ని దేవుడిలో చూసుకునే వాళ్ళు / దేవుడు ఏ కోరిక కోరకపోయిన / ఇచ్చే వరం మరణం / ఎవ్వరూ మరణాన్ని కోరుకోరు / కానీ అందరికీ ఇస్తాడు / రాని మరణం నుంచి డాక్టరు రక్షిస్తాడు / రాబోయే మరణాన్ని 24 గంటల ముందే పసిగడతాడు / మరణించే ముందు / ఒక చెట్టుకు ప్రాణం పోస్తే / జీవించి ఉన్న వాళ్ళకు మరణించిన వాడు స్మరణీయుడవుతాడు" అంటాడు కవి. వీరి మాటలు అక్షర సత్యాలనవచ్చు.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ 'జాతస్య మరణం ధ్రువం' అని అర్జునుడికి బోధిస్తాడు. పుట్టిన జీవి గిట్టక మానదు అన్నది దానర్థం. అయితే గిట్టిన జీవి మళ్ళీ పుడుతుందన్నాడు ఆ పరమాత్మ. మొదటిది మనందరికీ అనుభవైకవేద్యమే. కానీ ఆరెండోది ఏ జీవికి ఎవరుకానిది. గిట్టినవాడు లేదా జీవి తిరిగి పుడుతున్నాడో లేదో చెప్పలేకున్నాము. మరణమంటే ఏమిటో ఋషులు, మునులు కూడా చెప్పలేకపోయారు. తత్వవేత్తలూ చెప్పలేకపోయారు. పాశ్చాత్య తత్వవేత్తలైన సిగ్మండ్ ఫ్రాయిడ్ లాంటివారు ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ నిర్వచించలేకపోయారు. గౌతమబుద్ధుడు, మహావీరుడూ చెప్పలేకపోయారంటే ఇక వేరేవారి సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు. అందువల్ల పుట్టిన ప్రతిజీవి మంచి పనులు చేస్తూ, పరోపకారం చేస్తూ జీవించాలంటాడు కవి. తాను చనిపోయేలోగా ఒక మొక్కనాటి వృక్షాన్ని చేస్తే, ఇక ఈ జన్మకు అదే ధన్యత చేకూరుస్తుందంటాడు. తాను తిన్నది ముఖ్యం కాదని, తనస్వార్థం హితకరమైనది కాదని, చనిపోతానేమోనని క్షణక్షణం భయపడుతూ బతకరాదని కవి చక్కని సామాజిక స్పృహతో హితము బోధిస్తున్నాడు.

సహజంగా కవులు మరణాన్ని వర్ణించే ప్రయత్నం పెద్దగా చేయరు. అయితే సంపత్‌కుమార్ గారు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి కాబట్టి చక్కగా మరణాన్ని వర్ణించారు. ఆ మరణాన్ని గురించి సవివరంగా కవితాత్మకంగా చెప్పి తన ప్రతిభను నిరూపించుకున్నారు. నేడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రాత్రిపగలు నిద్రను త్యజించి పనిచేస్తున్నారు. వారి శ్రమ శక్తిని, శ్రమ దోపిడీని కవి ఇలా వర్ణించాడు 'డాలర్ మయం' అనే కవితలో అమెరికాలో నిద్రిస్తున్నవాడికోసం / పగలంతా మెదడు మొద్దుబారే విధంగా పనిచేస్తున్నా! / అమెరికాలో మేల్కొని దర్జాగా ఉన్నవాడి కోసం / రాత్రింతా నిద్రమేల్కొని మెదడును కరిగిస్తున్నా! / ఆర్థిక మాంద్యంలో కొట్టుకుపోయిన / నా రూపాయిని ఫణంగా పెట్టేవాడు డాలరు విలువ పెంచడాని కోసం శ్రమను ధార పోస్తున్నా!/ నా రూపాయిని చీప్‌గా కొన్నట్టే / నా శ్రమను కూడా చీప్‌గా కొంటున్నాడనే ధ్యాసే నాకు లేదు! / చల్లని గదుల్లో వెచ్చని డాలర్ల కోసం పరితపిస్తున్నా / ఏ నాడూ దేశం కోసం పని ముట్టుకోని నేను వాడికి పనిముట్టుగా మారిపోయాను - అంటూ చివరిలో చురక అంటించాడు కవి. ఒక సాఫ్ట్‌వేరు ఇంజనీరు భారతదేశంలో రాత్రలందు నిద్రమేల్కొని కంప్యూటర్ ద్వారా పని చేస్తుంటే, అమెరికావాడు మాత్రం హాయిగా నిద్రపోతుంటాడు. మేల్కొన్నాక మనవారి శ్రమను డాలర్లుగా మార్చుకుంటాడు. శ్రమ చేసిన వాడికి ఒక డాలరు విదిలిస్తాడు.. మన వారు కూడా ఏనాడు దేశం కోసంశ్రమ పడలేదని వాడి కోసం శ్రమపడుతున్నారని అంటారు కవి. లక్షల కోట్ల డాలర్ల వ్యాపారం కేవలం ఒక్క సాఫ్ట్‌వేర్ ద్వారానే ప్రపంచ వ్యాప్తంగా నేడు జరుగుతున్నది. ఇది సమకాలిన సత్యం అయితే అందులో బాగా నష్టపోతున్నది, దోపిడీకి గురవుతున్నది మన సాఫ్ట్‌వేరు నిపుణులే ఈ విషయాన్ని నిర్ణయంగా చెప్పిన కవి మాడభూషి సంపత్‌కుమార్ గారు. మాడభూషి సంపత్‌కుమార్ గారు చక్కని సామాజిక స్పృహ కలిగిన కవి. కవి కాబట్టి కవి బాధ్యలేమిటో 'కవి' అనే కవితలో ఇలా తెలిపాడు.

ప్రజల కొరకు రోదించేవాడు / ప్రజల కొరకు క్రోధించేవాడు / ప్రజలను ఆరాధించేవాడు / ప్రజలకు బోధించేవాడు, / ప్రజల కోసం వాదించేవాడు / ప్రజల కోసం భోదించేవాడు / ప్రజల కొరకు పోరాడేవాడు / ప్రజలకై ప్రయోజనాలు సాధించేవాడు / ప్రజలకై యుద్ధం సాగించేవాడు / ప్రజల్లోహితాన్ని పెంచేవాడు / ప్రజల్లో మతాన్ని చంపేవాడు / గతాన్ని స్మరించేవాడు / భవిష్యత్తును దర్శించేవాడు / ఆకాశాన్ని అందుకునేవాడు / పాతాళాన్ని పరిత్యజించేవాడు / తిరుగుబాటు సాగించేవాడు /వెనుకబాటు నహించలేని వాడు / గౌరవాన్ని నేర్పించేవాడు

గురుత్వాన్ని పోషించేవాడు - కవి అంటాడు కవి మాడభూషి సంపత్‌కుమార్. ఈ మాటలు అక్షర సత్యాలని చెప్పక తప్పదు. కవులందరూ ఈ లక్షణాలను అలవరుచుకుంటే ప్రజలు అనతికాంలోనే చైతన్యవంతులవుతారు. దాని ద్వారా ఆదర్శ సమాజం రూపుదాలుస్తుంది. మాడ భూషి సంపత్‌కుమార్ గారు సమకాలీనాంశాలను తీసికొని వాటిని సామాజికస్పృహతో వివేచిస్తూ చక్కని కవితలు రాశారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చివరకు నువ్వే గెలుస్తావు - సామాజిక దృక్పథం

– పి.జ్యోతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

'రవికాంచనిచోట కవి కాంచును' అని నానుడి అనగా రవి చూడని చోటును కూడా కవి తన హృదయంతో చూడగలుగుతాడు అని అర్థం. కవి భావవ్యక్తీకరణకు వాస్తవికతను ప్రతిబింబించేది కవిత్వం. సమాజంలో జరుగుతున్న సాంఘిక దురాచారాలు, సామాజిక పరిస్థితులపై ప్రజలలో అవగాహన కలిగించడానికి, ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి, వారికి జరుగుతున్న అన్యాయాలను, మోసాలను, శ్రామిక దోపిడిని తెలియ జేయడం కోసం కవి ఎంచుకున్న ఆయుధం కలం, మార్గం కవిత్వం. కవిత్వం అనేది ప్రజలలో సామాజిక దృక్పథాన్ని ,సామాజిక స్పృహను తీసుకొనిరావడానికి అని భావించిన కవి కలం నుండి జాలువారిన కవితా సంపుటి 'చివరకు నువ్వే గెలుస్తావు'.

ఈ కవితా సంపుటిని ప్రముఖ సాహితీవేత్త, రచయిత ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ రాశారు, వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పని చేస్తూ, ఉత్తమ ఆచార్యునిగా కీర్తిని గడించారు. వీరి మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉత్తమ పరిశోధకులగా తీర్చిద్దిబడ్డారు. మాడాభూషి వారి కలం నుండి జాలు వారిన ఆణిముత్యాలు వంటి కవిత్వాలు 'జీవితం - కవిత్వం', 'కవాతు', 'ఆలోచనలు', 'మూడో మనిషి', 'శత్రువుతో ప్రయాణం', 'మొదటి అబద్ధం' మొదలగునవి. అటువంటి ఆణిముత్యాలలో ఒకటి 'చివరకు నువ్వే గెలుస్తావు' కవితా సంపుటి. ఈ కవితా సంపుటి మొదటి ప్రచురణను శ్రీ దుర్ముఖనామ ఉగాది, ఏప్రిల్ 2016 న పాలపిట్ట బుక్స్ వారు ప్రచురించారు. ఈ కవితా సంపుటిలో మొత్తం 100 పేజీలు, 51 కవితలు ఉన్నాయి.

సామాజిక దృక్పథానికి సంబంధించిన కవితలు:

సమాజంలో సామాజిక స్పృహ, సామాజిక పరివర్తన తీసుకొనిరావడమే కవిత్వం ఉద్ధేశ్యం. కవిత్వం అనేది కేవలం ప్రజలలో మార్పు తెవడమే కాకుండా సమస్య లను పరిష్కరించేదిగా ఉండాలి అనేది కవి అభిప్రాయం. సామాజిక దృక్పథంకు సంబంధించి, కవిత్వాలు వచ్చాయి, వస్తున్నాయి. మాడభూషి సంపత్ కుమార్ గారు రాసిన 'చివరకు నువ్వే గెలుస్తావు' కవితా సంపుటిలో సామాజిక దృక్పథానికి సంబంధించిన కవితలు చాలా ఉన్నాయి అందులో కొన్ని కవితలను మాత్రమే నేను స్పృశించాను.

అగ్గిపుల్ల :

లోకానికి అన్నం పెట్టె రైతులు, వస్తువులను ఉత్పత్తి చేసే కార్మికుల జీవిత దుస్థితిని గురించి 'అగ్గిపుల్ల' కవితలో కవి ఇలా అంటాడు.

లోకానికి తిండి పెట్టి / కడుపుమాడి చనిపోయిన
రైతులా!/ అందరికీ వెలుగునిచ్చి
చీకటిగా మారిపోయింది / అగ్గిపుల్ల!

ఈ కవిత్వం శ్రామిక దోపిడికి నిదర్శనం. సమాజంలో తరతరాల నుండి దోపిడికి గురి అవుతున్నవారు ఒకరు రైతు, మరొకరు కార్మికుడు. రైతుపండించిన పంటకు వెలకట్టేది దళారులు. రైతు పండించిన పంట తను తినలేక అప్పుల ఊబి నుండి బయటపడలేక ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. మరొకరు కార్మికులు, వీరు తయారుచేసిన వస్తువులను డబ్బున వాళ్ళు విదేశాలకు ఎగుమతి చేస్తారు.వీరు ఆ వస్తువును ఉపయోగించలేరు. అందరి జీవితాలలో వెలుగు నింపే వీరి జీవితాలు మాత్రం చీకటిమయం అవుతున్నాయి అని తెలియజేశారు.

ఎన్నెనో ఉత్పత్తులు చేసి / ఏదీ అనుభవించలేని
కార్మికునిలా! / అందరికీ వెలుగునిచ్చి
చీకటిగా మారిపోయింది / అగ్గిపుల్ల!

ఈ కవిత్వం శ్రామిక దోపిడికి నిదర్శనం. సమాజంలో తరతరాల నుండి దోపిడికి గురి అవుతున్నవారు ఒకరు రైతు, మరొకరు కార్మికుడు. రైతు కష్టపడి పండించిన పంటకు వెలకట్టేది దళారులు. లోకానికే అన్నం పేట్టే రైతుకు తినడానికి తిండిలేక, అప్పుల ఊబి నుండి బయటపడలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరొకరు కార్మికులు, వీరు తయారుచేసిన వస్తువులను డబ్బున వాళ్ళు విదేశాలకు ఎగుమతి చేస్తారు. వీరు ఆ వస్తువును ఉపయోగించలేరు. అందరి జీవితాలలో వెలుగు నింపే వీరి జీవితాలు మాత్రం చీకటిమయం అవుతున్నాయి అని తెలియజేశారు.

కులం :

మనిషి భూమ్యాకాశాలలో జీవిస్తున్న జీవుల నుంచి, తను తిండికి, కట్టుకునే బట్ట వరకు కులమతాలను ఆపాదించిన విషయాన్ని 'కులం' కవితలో కవి ఈ విధంగా వ్యక్తపరిచారు.

రంగుకి / తిండికి / బట్టకు / నీళ్ళకు
భాషకు / వేషానికి / మోసానికి / చెట్టుకు
పుట్టకు / జంతువులకు / పక్షులకు /
అన్నింటికీ కులం, మతం అంటగట్టడానికి
మనిషి నిండా అంటురోగం ఉంది
అంటరానిరోగం ఉంది!

కులం, మతం అనేవి రెండు అంటురోగాలు అని. ఈ రోగాలు సమాజంలో జీవం వున్న ప్రాణి నుంచి జీవం లేని ప్రాణుల వరకు వ్యాపించి వున్నాయి. ఇవి మనిషి రక్తనాళాలలో కలసిపోయి నరనరాలలో ప్రవహిస్తున్నాయి. కులం, మతం ప్రభావాలు సమాజంలో ఏవిధంగా వ్యాపించివున్నాయో కవిత్వంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

చివరకు నువ్వే గెలుస్తావు :

ప్రజలందరికి వున్న ఆయుధం ఓటు హక్కు. ఇది భావితరాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది, అటువంటి హక్కు ద్వారా మనం ఏవిధంగా మోసపోతున్నామో కవి ఈ కవిత ద్వారా ఈవిధంగా తెలియజేసారు.

నేను పచ్చని చెట్టులాగా ఎదిగాను
నువ్వు వెచ్చని కుర్చీలో కూర్చున్నావు
నా వేలుకు మచ్చపూసి
నువ్వు అధికారాన్ని చేపట్టావు
నిన్ను చూస్తున్నంతసేపు
నాకు నేనే గుర్తొస్తాను
నువ్వు నా వేలికి పూసిన మచ్చ
నా జీవితానికి అంటుకుంది
చివరకు నువ్వే గెలుస్తావు
నీ గెలుపులో నా హస్తం ఉంది
కానీ
నువ్వు నాకు చెయ్యిస్తావు!

మనం కష్టపడి సంపాదించిన డబ్బుతో సమాజంలో కొంతమంది పెద్దమనుషులుగా చెలామణి అవుతారు. ఆ తరువాత ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగి ఓటు అడిగి, మీ కష్టాలన్నింటిని నేను తీరుస్తాను అని చెప్పి, మన వేలికి రంగుపూసి, అధికారాన్ని సంపాదించుకుంటారు.వాళ్ళ నమ్మి ఓటు వేసిన ప్రజలకు అవే కష్టాలు, బాధలు. ఆ నాయకులే మరల ఐదు సంవత్సరాల తరువాత వస్తారు. చివరకు వాళ్ళే గెలుస్తారు, మనకు చెయ్యిస్తారు అని తెలియజేశాడు.

డాలర్ మయం :

పుట్టి పెరిగింది, విద్యాబుద్ధులు నేర్చుకుంది ఈ దేశంలో, కాని పనిచేసేది పరాయి దేశం కోసం.

మన శ్రమను మనమే పరాయి దేశస్థుడికి ధార పోస్తున్నామనే విషయాన్ని రచయిత 'డాలర్ మయం' కవితలో ఈవిధంగా చెప్పారు.

అమెరికాలో నిద్రిస్తున్న వాడికోసం

పగలంతా మెదడు మొద్దుబారే విధంగా పనిచేస్తున్నా!
అమెరికాలో మేల్కొని దర్జాగా ఉన్నవాడికోసం
రాత్రంతా నిద్రమేల్కొని మెదడును కరిగిస్తున్నా!
ఆర్థికమాంద్యంలో కొట్టుకుపొయిన

నా రుపాయి పణంగా పెట్టి
వాడి డాలర్ విలువ పెంచడానికోసం శ్రమను ధారబోస్తున్నా!
నా రూపాయి చీప్‌గా కొన్నట్టే
నా శ్రమను కూడా చీప్‌గా కొంటున్నాడన్న ధ్యాస్యే నాకు లేదు!
చల్లని గదుల్లో వెచ్చని డాలర్లకోసం పరితపిస్తున్నా
ఏ నాడూ దేశంకోసం పనిముట్టుకోని నేను
వాడికి పనిముట్టుగా మారిపోయాను.

సమాజంలో చదువుకున్న వాళ్ళు వారి తెలివితేటలతో మాతృదేశం అభివృద్ధి చేయడం కంటే డబ్బుకే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. మాతృదేశం ఋణం తీర్చుకోకుండా, పరాయి దేశం డాలర్ మాయలో పడిపోయి కష్టపడి వాడి కోసం పనిచేస్తే, రూపాయికి విలువకట్టినట్టే తన శ్రమకు కూడా విలువకడుతున్నాడన్న విషయం గుర్తించకపోగా, మన శ్రమను మనమే పరాయి దేశస్థులకు దానం చేస్తున్నామనే విషయం తెలుసుకోలేకపోతున్నారు. పుట్టిన దేశం కోసం ఏమి చేయని వాళ్ళు పరాయిదేశస్థుల డాలర్ విలువ పెంచడానికి ఎ.సి గదులలో కూర్చొని యంత్రం వలె పనిచేస్తున్నారు.కష్టం ఒకరిది దాని ఫలితం పొందేది మరొకరని ఈ కవిత ద్వారా రచయిత తెలియ జేశాడు.

మరికొన్ని కవితలు 'కుక్క పిల్ల' ఈ కవితలో కుక్కలో ఉండే విశ్వాసం, మానవత్వం మనుషులలో లేవని తెలిపారు. 'చెట్టు' కవితలో దీనిని నుంచి కాయలు, పండ్లు, అకులు ఉపయోగించుకొనే మనం చెట్టును కాపాడలేకపోతున్నామని, 'రొట్టెముక్క' కవితలో ఆహారం కోసమే మనిషి దొంగగామారుతాడని, అతను దొంగ కావడానికి సమాజంలో మానవత్వం లేకపోవడమేనని, 'నువ్వు' కవితలో రైతే దేశానికి వెన్నుముక,అతను కష్టపడితేనే అందరికి ఐదువేళ్ళు నోటిలోకి వెళుతాయి. అటువంటి రైతును గుర్తించడంలేదని తెలిపారు. 'జెండర్ స్పృహ' కవితలో ఆడ మగ గాకుండా పుట్టిన వారే మూడో మనిషి. వీరిని సమాజం చిన్న చూపు చూస్తుందని తెలిపారు. 'కవి' కవితలో కవి కలం పట్టేది ప్రజలలో సామాజిక ధృక్పథం, సామాజిక చైతన్యం తీసుకొని రావడానికేనని చెప్పారు. ఇలాంటి సామాజిక ధృక్పథాన్ని తెలియజేసే కవితలు ఈ కవితా సంపుటిలో చాలా ఉన్నాయి. ఇవేకాకుండా ఇతరాంశాలకు సంబంధించిన కవితలు ఉన్నాయి అన్ని వైవిధ్యమైనవి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వం - సందర్భాలు - చంద్రశేఖర్ రెడ్డి రాచపాళెం
2. ఆధునిక కవిత్వము సంప్రదాయాలు - ప్రయోగాలు - నారాయణ రెడ్డి
3. చివరకు నువ్వే గెలుస్తావు కవితా సంపుటి - మాడాభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడోమనిషి- సామాజిక విశ్లేషణ

- డాక్టర్ టి. పర్ణిలా ప్రతిమ, అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఐఐఐటి, ఒంగోలు.

తెలుగు లిపికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చి, నిరవధిక కవి సమ్మేళనాలతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో నిలిచి, కవికోకిల, సాహితీరత్న ఆంధ్రభాషావిభూషణ, ధ్రువతార బిరుదులతో సత్కారాలు పొందిన సాహితీ వేత్త ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు.

''ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం'' అన్న అంశంపై పరిశోధన చేసిన భాషావేత్త. ''తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు'' అన్న అంశంపై డి.లిట్ పట్టా పొంది, జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, నువ్వే గెలుస్తావనే మొదలైన కవితా సంపుటాలు రచించిన కవీంద్రుడు.

హిందీ, ఇంగ్లీషు, తమిళం వంటి భాషలనుండి జన్మ భూమి, అమ్మవాసన వంటి రచనలను తెలుగీకరించిన అనువాదకుడు.

మద్రాసు విశ్వవిద్యాలయ శాఖాధ్యక్షులుగా వివిధ పరిశోధనాంశాలపై సదస్సులు నిర్వహించిన పరిశోధకుడు. వీరు రాసిన ''మూడోమనిషి'' కవితా సంపుటిలోని సామాజిక అంశాలను విశ్లేషించడమే ఈ పత్ర ఉద్దేశ్యం. ఇందులో మొత్తం 38 కవితలు ఉన్నాయి.

సృష్టికి మూలం అమ్మ. అందుకే 'మాతృదేవోభవ' అంటూ తల్లికి ప్రథమస్థానం ఇచ్చారు. భూమిపై పడింది మొదలు మనం చూసే మొదటిరూపం అమ్మ. పిల్లల ఆలనాపాలనలో మొదట ఉండేది అమ్మే. మనం పలికే మొదటి మాట అమ్మ. అలా పిల్లల బాల్యమంతా అమ్మ చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఆవిడా అంతే. తన పిల్లలను తీర్చిదిద్దడానికే తనజీవితమంతా ధారపోస్తుంది. అటువంటి అమ్మ మనసు ఎలా ఉంటుందో, ఆమెను అర్థం చేసుకోవడం అంత సులభం కాదని ''భ్రమలు'' అనే కవితలో ఇలా తెలియజేస్తున్నారు.

"అమ్మకు / పక్షపాతం ఉంటుంది.
అమ్మకు / స్వార్థం ఉంటుంది.
అమ్మ / నిర్దాక్షిణ్యంగా ఉంటుంది
నీకవి ఎరుక్కావు/ నీ కారణాలను
అమ్మకు పుయ్యకు
నువ్వనుకునేదంతా భ్రమ
అమ్మ కారణాలు అమ్మకుంటయి
అమ్మకు పక్షపాతం ఎక్కువ
తన బిడ్డ ఇసుమింటోడు అయిపోవాలని
అమ్మకు స్వార్థం ఎక్కువ
తన బిడ్డ అసుమింటోడు అయిపోవాలని
అమ్మకు నిర్దాక్షిణ్యం ఎక్కువ
తనబిడ్డ దారితప్పిపోకుండా ఉండాలని

అవునుబిడ్డా /అన్నింటికీ అమ్మకారణాలు అమ్మ కుంటయి / నీ ఊహలన్నీ / నిజాలు కావు / భ్రమలు!" అంటూ అమ్మ మనసును స్పష్టంగా తెలియజేశారు. ఇలా తనజీవితాన్ని కుటుంబానికే అంకితంచేసే తల్లి, ముసలి వయస్సులో తన పిల్లల ఆదరణకు నోచుకోలేక పోతోంది. ఎంతోమంది తల్లులు వృద్ధాప్యదశలో అనాథలై వీధిన పడుతున్నారు. అందుకే ''అమ్మ ఆకులా రాలిపోయింది.

పచ్చని చెట్టులా వెచ్చని తన ఒడిలో ప్రజలకు
సేదతీర్చిన అమ్మ
క్రమశిక్షణను పెంచి పోషించిన అమ్మ"
'ప్రేమ, ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం, చాతుర్యం,
చేవ గలిగిన'
"అమ్మే లేకపోతే ఎవరిదారి వారిది.
ఎవరికి వారు
అమ్మలేకపోతే అధినాయకులమనుకున్నారు
ఇప్పుడు అమ్మ లేకపోవడంతో
అందరూ అనాధలే."

అంటూ ''ఆకురాలు కాలం'' అనే కవితలో తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కవి.

నవమాసాలూ కని, పెంచి, అభివృద్ధిలోకి తీసుకొచ్చిన అమ్మకు దోసెడు గంజి పొయ్యడంకూడా బరువుగా భావించి రోడ్లపై, వృద్ధాశ్రమాల్లో, శ్మశానాల్లోనూ విడిచిపెట్టి అమ్మలను వదిలించుకొంటున్న బిడ్డలను, వారి మనస్తత్వాన్ని విమర్శిస్తూ, ''ఒక తల్లి/ పదిమంది పిల్లల్ని /కని పెంచి పోషిస్తుంది! / పదిమంది/ పిల్లలు/ ఒక తల్లిని పోషించలేకపోతున్నారు!

అందుకే తల్లి/ ఇప్పుడు/ ఒకే బిడ్డతో సరి పెట్టు కొంటోంది.'' అంటూ ''తల్లి'' కవితలో అమ్మలు కూడా మారాల్సిన దుస్థితిని చూసి ఆవేదనవ్యక్తం చేశారు.

అధికారంకోసం ప్రాకులాడే రాజకీయ నాయకులు ఎన్నెన్ని ఎత్తుగడలు వేస్తారో, కుతంత్రాలు పన్నుతారో, ప్రజల్ని రెచ్చగొట్టి, తమ అధికారంకోసం ఎలా బలి పెడతారో తెలుపుతూ, ''యాగం కోసం, రాజయోగం కోసం/వేదఘోష విని పిస్తోంది. / యజ్ఞవాటికలో బలిపశు వుల్ని /బంధించి ఉంచారు..... / ఇంద్రుడు ఇంకో పారి జాతాన్ని తుంచి పడవేశాడు / గోవులు కుడితినీళ్ల తాగేసి మైకంలోకి జారుకున్నాయి.

ఆత్మనిషేధించిన మత్తుని ఆత్మపేరు నినదిస్తూనే
గోవులకు ఎక్కిస్తోంది అధికారం

యజ్ఞవాటిక తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. / మహాఆత్మ యజ్ఞవాటిక చుట్టూ ఘోషిస్తూ ఉంది. / ఇంద్రుడు సింహాసనం మీదే ఉన్నాడు / రుషులు శాంతివేదం పఠిస్తూనే ఉన్నారు.'' అంటూ ప్రస్తుతకాలంలో తమ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, ప్రజల్ని, వారి బలహీనతల్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు చేస్తూ, తమ పదవుల్ని, అధికారాన్ని నిలబెట్టుకొంటూ, పైకి మాత్రం శాంతివచనాలు వల్లించే వారి మనస్తత్వాన్ని ఇప్పటికైనా తెలుసుకోవాలని ప్రజలకు ఉద్బోధిస్తున్నారు కవి.

సంసారమనే జీవన ప్రయాణానికి రెండు చక్రాలు భార్యా భర్తలు. ఈ ప్రయాణంలో ఇద్దరూ సమానమే. కానీ భర్త తన భార్య సహకారాన్ని, తోడ్పాటునీ గుర్తించడు. అలా గుర్తించని భర్త మనస్తత్వాన్ని, తన ఉనికికోసం భార్య పడే తపనను తెలుపుతూ,

''నువ్వు నీకోసం పోరాడుతావు, నేనూ నీకోసమే పోరాడుతాను / నువ్వు పైకి రావడానికి నేను మెట్టుగా ఉన్నాను / నువ్వు మెట్టుమరచి / కాలికింద రాయి అను కుంటున్నావు / నువ్వు అధికారం కోసం పాకులాడు తున్నావు / నేను సాధికారతకోసం పాటు పడుతున్నాను / ఈ పోరాటంలో చివరకు నువ్వే గెలుస్తావు/ ఎందుకంటే - / అధికారంకోసం పోరాడేవాడే ఎప్పుడూ గెలుస్తాడు./ నేను అనుకొన్నది కూడా అదే / నీకు అధికారం కట్ట బెట్టాలనే!'' అని ఒక స్త్రీ తన కుటుంబం కోసం చేసే త్యాగానికి , సేవకు గుర్తింపు ఇవ్వాలని ''నువ్వు-నేను'' కవితలో చక్కగా ఆవిష్కరించారు.

''వృక్షోరక్షతి రక్షితః'' అని అంటారు పెద్దలు. వృక్షాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని అర్థం. ఈ విషయం తెల్సినా మానవుడు టెక్నాలజీ పేరుతో ఉరుకులు పరుగులతో ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తున్నాడు. వాయు కాలుష్యం, ధ్వనికాలుష్యం,జలకాలుష్యం వంటి వివిధ కాలుష్యాలతో ప్రకృతికి హానికలిగిస్తున్నాడు. ఇలా ప్రకృతికి హానికలిగిస్తూపోతే ఏం జరుగుతుందో, ఎలాంటి పరి ణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందో తెలుపుతూ,

''ప్రకృతి ఎదిరించి బెదిరించి
గుప్పిట్లో పెట్టుకున్న మానవుడా
ప్రకృతి జూలు విదిల్చిందంటే
నీటెక్నాలజీ నీ టెక్నిక్కులూ
టైటాన్ లా కుప్పకూలిపోవలసిందే!''

అంటూ ప్రకృతి సంరక్షిస్తే మానవునికి ఎంత మేలుచేస్తుందో, నిర్లక్ష్యం చేస్తే అంతే హాని కలుగజేస్తుంది. కాబట్టి ప్రకృతిని కాపాడాలని మానవులకు హితబోధ చేస్తున్నాడు కవి.

జీవితమొక ప్రయాణం. ఒక్కొక్కరిది ఒక్కొక్క ప్రయాణం. ఈ ప్రయాణంలో ఒక్కొక్కరిది ఒక్కోగమ్యం.

ఇందులో ఎవరూ శాశ్వతంగా ఉండరు. దానికోసం కులాలు, మతాలు, ఈర్ష్యాద్వేషాలు, ఎత్తుకు పైఎత్తులు అంటూ కాలం వృధా చేయక వారి వారి జీవితాలను సరైన రీతిలో సార్థకం చేసుకోవడానికి మార్గాలు వెదకాలని ఉద్బోధిస్తూ, జీవితం చాలా విలువైనదన్న విషయాన్ని గ్రహించమని తత్వబోధచేస్తున్నారు.

"ఎవరూ పూర్తిగా ప్రయాణించరు
ఎవరు ఎప్పుడు దిగుతారో,
ఎవరు ఎప్పుడు ఎక్కుతారో..
దిగేవాడు టాటా చెప్పేసి దిగిపోతాడు,
ఎక్కేవాడు కూర్చొన్నవాళ్లు ఎప్పుడు దిగుతారాని చూస్తూంటాడు.
చిటికెలో ముగిసే ప్రయాణానికి
చిందులు తొక్కడం దేనికి
ఎప్పటికైనా ముగియాల్సిందే ఈ ప్రయాణం.
ముగించే లోపు
నువ్వు ఎవరనేది
ఎదుటివాడికి అర్థమయితే చాలు.

అంతేకానీ ప్రతి ఒక్కరు మరొకరిపై పోటీలు, ఆశలూ, ఆవేశాలు, చర్చలు, సమరాలు, కోపాలు, గొడవలు ఇవన్నీ అనవసరం అంటారు కవి "ప్రయాణం" అనే కవితలో.

ఈ సృష్టిలో ప్రతిప్రాణికి జీవనాధారం వర్షం. నీరు లేకపోతే ప్రాణులకు మనుగడే లేదు. ప్రకృతి ప్రపంచానికి ఇచ్చేవరం వాన. అలాంటి నీరు ఎక్కువైనా ప్రమాదమే. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తున్న మానవుడికి చోటు చేసు కొంటున్నాయి. ప్రకృతి కూడా తనను నిర్లక్ష్యం చేస్తున్న మానవుడిపై ఇలా తన కోపాన్ని ప్రదర్శిస్తోంది.

"ఒకే ఒక వాన /ఒకే ఒక రాత్రి / పగలంతా కురిసిన వానకు/ మురిసి పోయి వాళ్లు/ రాత్రికి రాత్రి కొంపముంచుతుందని పసిగట్టలేక పోయారు./ ఆకాశం ఇంతగా ప్రేమ ఒలకబోస్తున్నప్పుడే /సందేహపడాల్సింది / అమ్మ ప్రేమకు /చిన్నమ్మ ప్రేమకు/ తేడా తెలియక / నిద్రలోకి జారుకున్నారు. / మళ్లీ లేవని వాళ్లు /లేచి తేలుతున్నవాళ్లు/తేలి మునిగిపోయిన వాళ్లు/ మునిగి పోయినవాళ్లను చూసి/పుట్టెడు దుఃఖంలోకి జారుకున్న వాళ్లు / మొదటిరోజున ఊరు మునిగితే/రెండోరోజున జీవితం మునిగింది. / ఆకాశం ఇంతగా భోరున వర్షిం చాల్సిన అవసరం / భూమి ఇంతగా విలపించాల్సిన అవసరం/ఎవరికీ అంతుబట్టలేదు." అంటూ ప్రకృతి ప్రకోపించే తీరును కళ్లకు కట్టినట్టు "ఒక వాన" కవితలో చక్కగా తెలియజెప్పారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎన్నోచెట్లను నరికి, చెరువులను పూడ్చి అంతస్తులపై అంతస్తులతో సౌధాలను నిర్మించేస్తున్నారు. జీవనోపాధికై అనేకమంది వలసలు రావడం, విద్య, ఉద్యోగ, వ్యాపార అవసరా లంటూ రోజురోజుకీ నగరాల్లో జనాభా పెరిగిపోతోంది. వాహనాలు, ఫ్యాక్టరీలు ఎక్కువయ్యాయి. దీనివల్ల నగరాల్లో అనేక రకాల కాలుష్యాలు పెరిగిపోతున్నాయి. ఒక్క రోజు వర్షం పడితే ఆనీరు పోవడానికి సరైన మార్గాలు లేక మురికి కాలువలు పొంగి, చెరువులు, నదులను తలపిస్తున్నాయి. నగరంలో ఈ గజిబిజి వాతావరణానికి తగినట్టు చెట్లు కూడా విస్తృతంగా పెంచాలి. కానీ నేటి నగరాల్లో చెట్లు చాలా తక్కువ. ఉన్న చెట్లను ఆధునికీ కరణ పేరుతో నరికేస్తున్నారు. నీటి కోసం నగరాల్లో పడే పాట్లు చెప్పనక్కరలేదు. ఇలాంటి పరిస్థితులకు ప్రధాన కారణం

ప్రకృతిని పట్టించుకోకపోవడమే. అందుకే ప్రకృతి ఒక్కరోజు కన్నెర్ర చేసింది.
"ఉరుములేవు, మెరుపులేవు / అకస్మాత్తుగా ఉన్నట్టుండి వచ్చిన వర్షాన్ని చూసి
ఎప్పుడో ఊళ్లో వదిలేసి వచ్చిన తల్లిదండ్రులు/ ఇంటికి వచ్చినట్టు అనందించాం
వీధిలో నిలబడి / వాన వయ్యారంలో తడిసి ముద్దవ్వాలనుకున్నాం."

"పగలంతా కురిసిన వానకు రాత్రి మూల్యం చెల్లించింది
ఇంట్లోకిదొంగలా దూరి నిలువుదోపిడీ చేసింది."
"ధనవంతులు, పేదవాళ్లు సమానంగా ఆకాశంకేసి
అన్నం పొట్లంకోసం చేతులు చాస్తూ నిలబడ్డారు
వళ్ళంతా చెమటతో తడవడం తప్ప /కళ్ళు నీళ్ళతో చెమర్చిందిలేదు
ఎప్పుడో ఇంకి పోయిన కళ్లు ఇప్పుడు కుండపోతగా వర్షిస్తున్నాయి
వెక్కివెక్కి ఏడ్చినా , మా ఏడుపులు వాన హోరులో ఎవరికీ వినిపించలేదు." అంటూ

ఎప్పుడూ ఎండలు, ఉక్కపోత వాతావరణంతో, ఉరుకులపరుగులతో గజిబిజిగా ఉండే చెన్నై నగరం ఒక్కసారిగా కుండపోతగా పడ్డ భారీ వర్షాలకు ఎలా కుదేలయ్యిందో, వాన వాళ్ల జీవితాలను రాత్రికి రాత్రి ఎంత దుర్భరంగా మార్చేసిందో, ఎంతమంది ప్రాణాలు హరించిందో, దొంగలా ఇంట్లోకి దూరి వారి జీవితాలను నిలువుదోపిడీ చేసిందో "ఏడ్చినట్టుందివాన" కవితలో చక్కగా ఆవిష్కరించారు.

పెరుగుతున్న జనాభాకు తగినట్లు ఉపాధి, సౌకర్యాలు లేవు. ప్రతి ఒక్కరికీ తాము డబ్బుసంపా దించాలనీ, ఉన్నతస్థాయిని చేరుకోవాలనే ఆశ. వీటికోసం మనిషి తన మనస్తత్వాన్ని మార్చుకొంటున్నాడు. తనలో ఉండాల్సిన మంచి లక్షణాల స్థానంలో చెడును నింపు కొంటున్నాడు. తను బ్రతకాలంటే పక్కవాడిని అణగ దొక్కాలి. తాను గెలవలేకపోయినా ఫరవాలేదు కానీ పక్కవాడు గెలవ కూడదు. కాబట్టి

"మన బాధ మందికాదు / అవతలివాడు సాధించాడనే కదా మనం ఏడ్చేది
మనసంతోషం మంది కాదు / అవతలివాడు ఏడుస్తున్నాడనే కదా మన ఆనందం
ఎంతమంది కన్నీళ్లు కారిస్తే / నువ్వు అంత బాగా పన్నీటి స్నానం చెయ్యగలవు
ఎంతమంది ఏడిస్తే / నీ కళ్లలో ఆనంద బాష్పాలు అంత రాలుతాయి"

అంటూ మనిషి ఎంతగా దిగజారిపోతున్నాడో, అతనిలో ఎంత క్రూరమైన మనస్సు దాగిఉందో , తేనె పూసిన కత్తిలా ఎలా మారుతున్నాడో "బాధ" కవిత ద్వారా తెలియజేశారు. అంతేకాదు తను బ్రతకడంకోసం, అధికారం చేజిక్కించుకోవడంకోసం ఎంత దుర్మార్గాలకైనా పాల్పడడానికి వెనుకాడని మనిషి నైజాన్ని "అభివృద్ధి పథం" అనే కవితలో ఇలా వర్ణిస్తున్నారు.

"కింద ఉంటే/ పైవాణ్ణి కాళ్లుపట్టి లాగేస్తాడు!
పైనుంటే /కిందివాణ్ణి కాళ్లతో అణగదక్కేస్తాడు!
వాడు అభివృద్ధిలోకి రావడానికి /అవతలివాడి అంతు చూస్తాడు!
రాత్రికి రాత్రి
భూమ్యాకాశాలను తారుమారు చేస్తానంటాడు
ఆకాశాన్ని సులభంగా కిందికి లాగుతాడు
మరి భూమిని?" అంటూ

ఇన్ని అక్రమాలు చేసే మనిషి భూమిని నాశనం చేయాలనుకొంటే మాత్రం, వాడే భూమిలో కలిసి పోతాడని హెచ్చరిస్తున్నారు.

దేశానికి వెన్నుముక రైతు. ఇలాంటి రైతు వ్యవసాయం చేస్తేనే అందరికీ తిండిదొరుకుతుంది. అలా వ్యవసాయం చేయాలంటే సకాలంలో వర్షాలు పడాలి. సకాలంలో వర్షాలుపడకపోతే భూమిని నమ్ముకున్న రైతు జీవితం అష్టకష్టాలపాలౌతుంది. పెట్టుబడికి అప్పుగా తెచ్చిన డబ్బు కొండంతై అతని ప్రాణాలు తీస్తున్నా, కుటుంబం రోడ్డున పడినా ప్రభుత్వాలు పట్టించుకోవు. ఆ రైతుని ఆదుకొనే నాథుడే ఉండడు. ఈ విషయాన్ని "రైతు" కవితద్వారా తెలియజేస్తున్నారు.

"మట్టిని పిసుక్కుంటూ ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటూ
ఆవేదన చెందుతూ ఉన్నాడు

పాలం ఎండిపోయి వెక్కిరిస్తోంది
ఆకాశం ఎండమావిలా ఉంది
పిల్లల కడుపులు కాయితం పొరల్లా అతుక్కు పోయాయి
మట్టిని నమ్ముకున్నవాడు నట్టేట్లో మునగడానికి కూడా నీళ్లులేవు
మట్టిని అమ్ముకున్నవాడు మహారాజులా బతుకుతున్నాడు
తీసుకున్న అప్పు అప్పణంగా
ఎరువుగా, విత్తనంగా మట్టిలో ఎప్పుడో కలిసి పోయింది
అప్పుమాత్రం అభివృద్ధిచెంది
అరుగుమీద వచ్చి కూర్చుంది.
అరుగు అరక కూర్చొనే దిన్నెకాదు
పొద్దున్నుంచి సాయంత్రందాకా
అరిగిన కండరాల్ని కూడదీసుకోవడానికి
కూర్చొనే సింహాసనం
ఇప్పుడు ముళ్లమీద కూర్చున్నట్టుంది
అరుగంటే అతనికి భయం
అప్పుతీసుకున్నరోజే ఆస్తితో పాటు అరుగు కూడా వాడికి దఖలైపోయింది
రైతుకు ఇప్పుడు తలదాచుకోవడానికి
తలతాకట్టు పెట్టడానికి కూడా మార్గంలేదు
మట్టిని నమ్ముకున్న రైతును
మట్టితల్లి మోసం చేసింది."

అంటూ రైతు దయనీయమైన జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

ఈ లోకంలో ప్రతిప్రాణికి జీవించే హక్కు ఉంది. ప్రతిప్రాణికి వాటి వాటి ప్రత్యేక లక్షణాలు, ప్రత్యేకతలూ ఉన్నాయి. ఇవన్నీ జీవవైవిధ్యంలో భాగమే. అయినా మనిషి లింగ భేదానికి అధికప్రాధాన్యతనిస్తూ, అసమానతలను సృష్టించి, సమాజాన్ని శాసిస్తున్నాడు. అలాంటి మనిషి మూడవ లింగంగా గుర్తింపబడాలని కోరుకునే హిజ్రాలకు సమాజంలో ఏస్థానం కల్పిస్తున్నాడో, వారిని ఎంత చులకనగా చూస్తున్నాడో. వారిని సమాజంనుండి వెలివేసి వారి జీవితాలను ఏవిధంగా మరింత దుర్భరంలోకి నెట్టేస్తున్నాడో గమనించమని, సమాజంలో మనుషుల మనస్తత్వాలు మారాల్సిన అవసరాన్ని " మూడవ మనిషి" కవితద్వారా తెల్పుతున్నారు.

"రెండోమనిషిని గురించి
ఆలోచించే తీరికే లేని మనిషికి
మూడోమనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది
ఇక్కడ /అడబిడ్డబరువు
మూడోబిడ్డ నిషేధం
ఇక మూడో మనిషిని గురించి.....
మూడో మనిషిని చూస్తే అందరికీ ఎగతాళే
తాళే కట్టే అర్హత
తాళి కట్టించుకొనే అర్హత
లేదనే కదా ఇంత నవ్వులాట
అన్నీ ఉన్న జండర్లను గురించే జెండాలు పట్టుకొని తిరుగుతున్నారు తప్ప
అందరూ నిర్లక్ష్యం చేసే జెండర్ వాళ్లకు ఏ జెండా నీడా దొరకడంలేదు.
బృహన్నల/ శిఖండి/ పేడి/ కొజ్జా/ నపుంసక / హిజ్రా..... ఎన్ని పేర్లు పెట్టినా
ఎంతహేళన చేసినా
సహించాల్సిందే తప్ప
మూడోకన్ను తెరవకూడదు
ఎందుకూ పనికిరానివారిగా ముద్రవేసి
దౌర్జన్యంగా భిక్షాపాత్ర చేతిలో పెట్టి
అడుక్కోవడానికి అనుమతిచ్చేశారు
ఆస్తిపాస్తులకోసం కాదు
తృతీయ శ్రేణి పౌరులుగా గుర్తింపు కోసమే ఆరాటం
మూడో మనిషిని
మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి."

అంటూ సాటి మనిషిలోని లోపాన్ని అంగీకరించలేని వాళ్లవల్ల హిజ్రాల జీవితాలు ఎంత దయనీయంగా ఉన్నాయో, మనిషిని మనిషిగా గుర్తించాల్సిన బాధ్యతను గుర్తుచేశారు.

ముగింపు :

ఈ విధంగా మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వంలో సముద్రం మనపై ముద్ర వేయకుండా చూడాలని, మట్టి, నీరు, గాలి జీవులకు ప్రాణాధారాలనీ, అటువంటి వాటితోనిండిన ప్రకృతిని ఆస్వాదించాలంటే దానిపట్ల కృతజ్ఞతాభావం ఉండాలికానీ నిర్లక్ష్యం తగదనీ హెచ్చరిస్తూ, మనిషి మారాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ, మనిషి సాటిమనిషిని గౌరవించాలని హితబోధ చేస్తున్న అనేక సామాజిక, మనస్తత్వ విశ్లేషణాంశాలు ఈ కవిత్వంలో చోటుచేసుకున్నాయి.

ఆధారగ్రంథాలు :

1. సంపత్ కుమార్ మాడభూషి: మార్చి 2017 ''మూడోమనిషి'' (కవితాసంపుటి), పాలపిట్ట బుక్స్, హైదరాబాదు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వంలో రాజకీయాలు

- ముద్దిరెల సత్యనారాయణరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడానికి ఎర్పడినవే రాజకీయాలు. కాని ప్రస్తుతం ఉన్న రాజకీయాలు స్వార్థంతో కూడుకొని ఉన్నాయి. దోచుకొని దాచుకో అన్న చందంగా రాజకీయాలు మారిపోయాయి. దేశంలో ఎక్కువ మందిని ప్రభావితం చేసి, అవినీతి అనే బురదలో కూరుకొనిపోయి, తమ అస్థిత్వం కోసం ఈ రాజకీయాలు పాకులాడుతున్నాయి. ఇవాళ దేశాన్ని రాజకీయాలు శాసిస్తున్నాయి కాబట్టి కవులు తమ కవితా వస్తువులుగా ఈ రాజకీయాలను తీసుకొని కవిత్వీకరించారు. రవిగాంచని చోటు కవిగాంచునే అన్న చందంగా రాజ కీయాలలో జరుగుతున్న వివిధ కోణాలను కవులు నిశితంగా గమనిస్తారు. రాజకీయాలలో జరుగుతున్న హత్య, అవినీతిని ఎండగడుతూనే, ప్రజల గంతుకై కవులు కవిత్వం రూపంలో స్పందిస్తారు. ఇలా రాజ కీయాలపై గళమెత్తిన కవులలో ప్రముఖుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ వృత్తిరిత్యా తెలుగు ఉపన్యాసకులు. ఒక పక్క విద్యార్థులకు పాఠాలు బోదిస్తూనే, మరో పక్క సాహిత్య సృజన చేశారు. సమాజంలో ఉన్న సమస్యలను కవితా వస్తువులుగా తీసు కొని వినూత్నమైన కవితా సంపుట్లాలను వెలువరించారు. ఒక్కొక్క కవికి ఒక్కొక్క అభివ్యక్తి పద్ధతి కనిపిస్తుంది. వస్తువు ఒక్కటే అయినప్పటికీ కవుల వ్యక్తీకరణలో భిన్నత్వం కనిపిస్తుంది. అదే ఆ కవి ముద్ర. వస్తువుకు కలిగించే రూపకల్పన, కవిత్వమనే ఇంద్రజాలం, ఆ విద్య సంపత్తుకు సహజంగానే అబ్బింది అని ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు అన్నారు. అలా తనకు సహజంగా అబ్బిన కవిత్వంతో రాజకీయాలపై కవితాస్త్రాలను సంధించారు. రాజకీయాలలో జరుగుతున్న యాదార్థ విషయాలను తీసుకొని సంపత్‌కుమార్ కవిత్వీకరించడం పెద్ద సాహస మనే చెప్పవచ్చు. దేశ రాజకీయాలలో జరుగుతున్న అనేక కారణాలను తన కవితలలో బందించి సమాజం మీదికి పదిలాడు. జాతీయ రాజకీయ నాయకుల ముసుగులను తొలగిస్తూ తనదైన రీతిలో ప్రశ్నలను సంధించాడు.

రాజకీయ నాయకులు అవసరానికి ఒక మాట, అవసరం తీరినాక మరోమాట మాట్లాడుతారని, వారి నోటి నుండి వచ్చె ప్రతిమాట అబద్దమేనని కవి 'రెండంచుల కత్తి' అనే కవితలో కుండబద్దలు కొట్టినట్టు కవిత్వీక రించారు.

"ఓటేస్తే
అంత ఇస్తానంటాడు
అంతలో కొంతే ఇస్తాడు
ఇంకొంత తరువాతంటాడు
నవ్వు అంతా ఒకేసారి ఇస్తాడనుకొంటావు
వాడు అబద్దం ఆడొడనుకొంటావు
అంతా ఇస్తానని ఎప్పుడన్నానంటాడు"

(వికారి పుట సంఖ్య 20)

పై కవితలో రాజకీయ నాయకుడు చేసే బూటకపు వాగ్ధానాల గురించి కవి వివరించాడు. ఎంతో ఇస్తానని ఓటర్లను నమ్మించి, గెలిచిన తరువాత కొంత మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటారని, గట్టిగా అడిగితేదే నెప్పుడిస్తానని అన్నా అని మాటమారుస్తారని రాజకీయ నాయకుల మాటలు నీటి మీది మూటలని కవి వివరణ చేశాడు.

"నేను సైతం
అవినీతికి ఆజ్యం, పోశాను
లాలు ప్రసాద్ యాదవ్"

(ఆలోచనలు - పుట. 20)

రాజకీయ నాయకుల అవినీతి గురించి 'బాణీలు' అనే కవితో కవి క్లుప్తీకరించారు. రాజకీయ నాయకుల అవినీతి గురించి వివరించడం సాహసమనే చెప్పాలి. బీహార్‌లో లాలుప్రసాద్ యాదవ్ చేసిన అవినీతి గురించి ధైర్యంగా పై కవితలో వివరించారు.

చాలామంది రాజకీయ నాయకులు ఎన్నికలలో గెలుపొందడం కోసం అనేక కల్లబొల్లి మాటలు చెబుతారు. తాము గెవడం కోసం శ్రమించిన కార్యకర్తలను పట్టించు కోకుండా అధికారం కోసం ఆర్రులు చాచుతాడని సంపత్ కుమార్ "రాజ్యాధికారం" అనే కవితలో అక్షరీకరించారు.

"అందరూ రాజ్యాధికారం కోసమే
తమ అధికారంలోనే సమత్వమంటారు
అధికారం వచ్చిన తరువాత
కొమ్మల్లేని చెట్టులా
తాము మాత్రం పెరుగుతూ ఉంటారు"

(మూడో మనిషి - పుట 23)

మా పార్టీ అధికారంలో ఉంటే అందరికి సమానమైన అవకాశాలు ఉంటాయని నమ్మించి, అధికారం రాగానే తానొక్కడే పైకి ఎదిగే మనస్తత్వం రాజకీయ నాయకులకు ఉంటుందని పై కవిత ద్వారా తేటతెల్లం చేశాడు కవి. "అబద్దాలే బతుకుగా చేసుకున్న రాజకీయ నాయకులు ఇందులో ఆరితేరి ఉంటారన్న విషయంలో సందేహం లేదు" అని మరో సందర్భంలో కవి వివరిస్తూ వారి మాటల్లో ఉన్న బొల తనాన్ని వివరించారు.

"పాలించడానికి ఒక పార్టీ
పరిపాలించడానికి ఒక రాష్ట్రం
నాయకుల అత్యవసరాలు"

(ఆలోచనలు - పుట 51)

రాజకీయ నాయకుల అత్యవసరాలేమిటో కవి ఈ కవితలో చక్కగా వివరించారు. ఓట్లేసిన ప్రజలు, సేవ చేసిన కార్యకర్తలు, అనుచరులు, నాయకులకు అవసరం లేదు. కాని వీరికి అత్యవసరంగా ఒక పార్టీ, దాని అధికారం ఖచ్చితంగా కావాలనే వారి స్వార్థ బుద్ధిని, కుటిల నీతిని క్లుప్తంగా "విషాదాశ్రు తుషారాలు" అనే కవితలో వివరించారు.

ఎన్నికలలో గెలవడానికి నాయకులు అనేక విచిత్రాలు చేస్తారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రవర్తిస్తుంటారు. కొందరు ఓట్లను డబ్బుతో కొంటే, మరికొందరు కులం, మతం, వర్గం పేరుతో ఓట్లను కోనేస్తారు. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి అవసరమైతే కాళ్ళు కూడా పట్టుకుంటారు. ఇలాంటి ఓటు రాజకీయాల గురించి ఆచార్య సంపత్‌కుమార్ 'విషాదాశ్రు తుషారాలు" అనే కవితలో అక్షరీకరించారు.

"అద్వానీ సభలో బాంబులు
పేలినాయట
ఇక సింపతి మొదలై
ఓట్లు రాలుతాయట"

(ఆలోచనలు - పేజీ - 71)

ఓట్ల కోసం రాజకీయ నాయకులు చేసే జిమ్మికులను కవి వివరిస్తూ అద్వానీ సభలో బాంబులు పేలడం ద్వారా సింపతి పెరిగి ఓట్లు రాలుతాయని ఆలోచనలతోని ఇలా చేస్తున్నారని అక్షరీకరించారు.

"బిజేపి రాష్ట్రాల్లో మత కల్లోలం
లేదంటున్నారు విజయశాంతి
అధికారం కోసం ఇతర రాష్ట్రాల్లో
లేకుండా చేస్తారు శాంతి"

(ఆలోచనలు-పుట.73)

"విషాదాశ్రు తుషారాలు" అనే పై కవితలో రాజకీయ నాయకుల సన్నాయి నొక్కుల గురించి కవి విశదపరి చారు. బిజేపి పరిపాలిస్తున్న రాష్ట్రాలలో మత కల్లోలాలు లేవని మిగతా ప్రాంతాలలో ఉన్నాయని విజేయశాంతి వ్యంగ్యంగా అన్నారని వారు అవరమైతే..... "అధికారం కోసం ఇతర రాష్ట్రాల్లో లేకుండా చేస్తారు శాంతి" అనే పాదాలు చూస్తే అధికారం కోసం నాయకులు ఏమైనా

చేస్తారని తెలు స్తుంది. ఆచార్య సంపత్ కుమార్ తన కవిత్వంలో రాజ కీయాలలో ఉన్న కుళ్ళును కడిగిపారేసారు. రాజకీయాలు బురదకంపు మనకెందుకులే అని అనుకోకుండా తనదైన శైలిలలో కవి ప్రజలను చైతన్యవంతం చేశారు. రాజకీయ నాయకులు చేసే బూటకపు వాగ్ధానాలు, అవినీతి, హత్యా రాజకీయాలు, అశృత, పక్షపాతం, స్వార్థం మొదలైన అన్ని విషయాలు సంపత్ కుమార్ కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓటర్లను చైతన్యవంతం చేయటంలో ఈయన కవిత్వం విజయం సాధించిందని చెప్పవచ్చు. నేటి రాజకీయ నాయకులకు ఉండవలసిన కనీస విలువలు కూడా లేకుండా పోతున్నాయని, ఓటేసేటప్పుడే మంచి వ్యక్తికి ఓటేయ్యాలని నందేశం ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కవిత్వంలో కనిపిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. వికారి (కవితా సంపుటి) ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ -పుట సంఖ్య -12
2. కవాతు -ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ -పుట సంఖ్య -71
3. ఆలోచనలు (కవితా సంపుటి)
4. మొదటి అబద్ధం (కవితా సంపుటి)

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వంలో మహిళా సమస్యలు

- **పోల్కం రాములు,** తెలుగు ఉపన్యాసకులు, రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, బాసర.

ఆమె తల్లిగా లాలిస్తుంది. చెల్లిగా తోడుంటుంది. భార్యగా భాగోగులు చూస్తు, దాసిలా పని చేస్తుంది. కుటుంబ భారాన్ని మోస్తు సర్వం త్యాగం చేస్తుంది. స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అలాంటి స్త్రీని తాను ఎదుర్కొనే సమస్యలను కావ్య వస్తువుగా తీసుకొని రచనలు చేసిన వారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. కావ్య వస్తువులో వైవిధ్యం, అభివ్యక్తిలో విలక్షణతో ఉంటే ఆ కావ్యాలు పాఠకుని హృదయాన్ని దోచుకుంటాయని తెలుసుకొని పాఠకుల పఠన నాడిని పసిగట్టిన వారిలో ముఖ్యులు మాడభూషి. ఒకానొక చరిత్రకారుడన్నట్టు సమాజంలో స్త్రీకి ఉన్న గుర్తింపును బట్టి ఆ సమాజ నాగరికతను గుర్తించవచ్చు. సమాజ నిర్మాణంలో సగభాగం స్త్రీయే. సమానత్వమే ప్రగతికి మూలం కాని మాతృస్వామ్య వ్యవస్థ నుండి నేటి పితృస్వామ్య వ్యవస్థ వరకు ప్రతిచోట స్త్రీ లింగ వివక్ష, అసమానతలు ఎదుర్కొంటుందని కవి వివరించాడు.

విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయం, క్రీడలు, బ్యాంకింగ్ అంతరిక్షం వంటి అనేక రంగాలలో స్త్రీలు రాణిస్తున్నప్పటికి అది నాణెంనకు ఒక వైపు మాత్రమే. నేటి సమాజం స్త్రీని ఒక మర మనిషిగా పురుషుల అవసరాలు తీర్చే యుంత్రంగా నేటి సమాజం భావిస్తుం దని కవి వ్యాఖ్యానించాడు. ఎక్కడ చూసిన స్త్రీ వంచనకు గురి అవుతునే ఉంది. సమాజ చైతన్యాన్ని, సామాజిక బాధ్యతను సవాలు చేస్తున్నప్పటికి స్త్రీలపై దారుణ అగాయిత్యాలు జరుగుతున్నాయని స్త్రీల కన్నీటి గాధను కవి వివరించాడు. సంపత్ కుమార్ వృత్తి రీత్యా ఆచార్యుడే అయినప్పటికి ఆయనలో ఎక్కడ కవిత పిపాస అడుగంటి పోలేదు. కవిత్వంనే ప్రవృత్తిగా ఎన్నుకొన్న సమాజంలోని అనేక విషయాలను తనదైన కోణాలనుండి, ఆలోచించి రచనలు చేయగల దిట్ట మాడభూషి.

మహిళలు వివక్షకు గురికావడం, ఇంటిచాకిరి చేయడం, పిల్లల్ని కనడం, తమ అవసరాలకోసం స్త్రీని ఒక యంత్రంగా వాడుకోవడం అనేది నేటి సమాజంలో ఉందని కవి ఆలోచన.

"పునాదిగా మొలకెత్తి
సౌధంగా లేస్తుంది
ఆకాశానికి భూమికి
అంచుల మధ్య నిలబడి
దూరాన్ని చేరువ చేస్తుంది"

(శత్రువుతో ప్రయాణం పుట.25)

స్త్రీ ఒక అందమైన కుటుంబ నిర్మాణంలో పునాదిగా నిల్చి ఎన్నో బాధ్యతలను తన భుజాలపై మోసే అనేక తరాలకు తానే ఆధర్శంగా నిల్చి ఒక అందమైన సౌధంగా నిల్చి ఉదయిస్తుంది. ఆకాశానికి భూమికి అనుసందాన కర్తగా తాను నిల్చి ఉంటుంది. అనగా స్త్రీని ఒక అనంత విశ్వంగా కవి పోల్చడం జరిగింది. ఈ సమాజం ఆమెపై అనేక రకాల నిందలు మోపుతునే ఉంటుంది. తాను కూడా ఆకాశంలోని మెరుపువలె తన కోపంను ప్రదర్శి స్తుంది. కాని అది క్షణికాలు మాత్రమే. ఆ మెరుపు వెనకాల అహ్లాదంను పంచె పున్నమి చంద్రుని వలె ప్రకాశిస్తుంది.

"రెక్కలు ముక్కలు చేసుకొని
ఆకాశానికి ఎగురుతున్న ఆమె రెక్కల్ని
ముక్కలు చేయ్యడానికి ఎందరో
చిన్నప్పటి నుంచి అంతే
చిన్న చూపుతోనే పెరిగింది"

(శత్రువుతో ప్రయాణం పుటలు.25,26)

స్త్రీ తన రెక్కలను ముక్కలుగా చేసి తన కుటుంబం కోసం ఈ సమాజ అభివృద్ధి కోసం పాటుపడుతు వివిధ హోదాలలో ఆకాశానికి ఎగురుతు ఉంటే ఆకాశ మార్గంలో కొందరు ముష్కరులు ఆమె రెక్కల్ని ముక్కలు చేసి ఆమె ఎదుగుదలను ఆటంక పరుస్తునే ఉన్నారు. స్త్రీ చిన్నప్పటినుండి చిన్న చూపుతోనే పెరిగింది. తనతో పాటు పెరిగిన మగ తోబుట్టువులకు లభించే మర్యాద తనకు లభించకపోయేది. నన్ను కన్న తల్లిదండ్రులే ఒసేయ్ కర్రముండా అని కాలితో తన్ని నన్ను నిద్రలేపి, తన ముద్దుల కొడుకును నిద్రపుచ్చుతుంది. ఆడదానికి ఆడదే శత్రువు అని కవి అభిప్రాయ పడ్డాడు.

"వాడంటే నాకు ఒళ్ళుమంట
నా ఒళ్ళు వాడికి పంట
వాడొక హంస
నేనొక హింస
స్వర్గాన్ని **దోచుకొని నరకాన్ని దారబోస్తాడు"**

(శత్రువుతో ప్రయాణం పుట.44)

నా దేహం వాడికి ఒక సిరులపంట వాడి వంశ అభి వృద్ధికి తోడ్పడుతుంది. ఈ శరీరం తనదే. దానిపై సర్వ అధికారాలు నావే అంటు సిగరెట్‌తో కాల్చడం, తన్నడం చేస్తాడు. మగాడు అంటేనే ఒళ్ళుమంట నాకు. నాదేహం వాడికి ఒక హంస పాన్పు సర్వ సుఖాలు అనుభవిస్తాడు. నన్ను పూర్తిగా దోచుకొని స్త్రీని చచ్చిన శవంలా మారు స్తాడని. స్త్రీ కన్నీటి ఘోషను కవి విషదీకరించాడు.

"జీవితంలో ప్రతికష్టానికి పరిష్కారముంటుంది
ముఖ్యంగా ఆడవాళ్ళకు
బావి స్త్రీలింగం
బావి స్త్రీ కాబట్టి
ఆడవాళ్ళను అక్కున చేర్చుకుంటుంది
హక్కుగా చేర్చుకుంటుంది"

(చివరకు నువ్వే గెలుస్తావు పుట.6)

కష్టం తర్వాత సుఖం, బాధ తర్వాత ఆనందం, చీకటి తర్వాత వెలుగు వస్తుంటాయి కాని, స్త్రీ జీవితంలో కష్టాలకు ,కడగండ్లకు మాత్రం పరిష్కారం లేదు. ఈ కష్టాలను భరించలేక బావిలో దూకితే ఆ బావి స్త్రీ లింగం కాబట్టి ఆ బాధలన్నిలంటి నుండి విముక్తి కల్పించడానికి తనలో చేర్చుకుంటుందని ఇలా స్త్రీ జీవితం అర్థాంతరంగా ముగిసిపోతుందని స్త్రీ బాధలను విన్నవించాడు కవి.

"ఒక తల్లి
పదిమంది పిల్లల్ని
కని పెంచి పోషిస్తుంది!
పది మంది
పిల్లలు
ఒక తల్లిని పోషించలేక పోతున్నారు"

(మూడో మనిషి పుట.25)

స్త్రీ తాను తల్లిగా తన పిల్లలకి నిస్వార్థ సేవ చేస్తుంది. తన పిల్లల కోసం తన జీవితాన్ని అర్పిస్తుంది. తాను తల్లిగా మారినప్పుడు పదిమంది పిల్లల్ని అయిన పోషించగలదు. కాని తాను, తన శిరీరం, తన అవయవాలు సహకరించక వృద్ధాప్యంలోకి వచ్చినపుడు ఎంత మంది పిల్లలు ఉన్నప్పటికి తాను ఒక అనాధగా బ్రతికి అనాధగా చావల్సి వస్తుందని తల్లి ఆత్మ ఘోషను వివరించాడు.

"అర్ధరాత్రి ఆడవాళ్ళు
ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం
సామూహిక అత్యాచారం"

(ఆలోచనలు పుట.37)

ఎప్పుడైతే దేశంలో స్త్రీలు అర్ధరాత్రి ఒంటరిగా సంచ రిస్తారో అప్పుడు దేశంలో నిజమైన స్వాతంత్ర్యం సమాన హక్కులు ఉంటాయని గాంధీ గారి అభిప్రాయం.పట్ట పగలే చీకటి కూడా కనిపించనంతగా వెలుగు ఉన్న సమయంలో మహిళలపై అత్యాచారం జరుగుతుంది. స్త్రీలకు స్వాతంత్ర్యం స్వేచ్ఛ ఎపుడు లభిస్తుందని, స్త్రీ గొంతుకై కవి గాంధేయ వాదులను ప్రశ్నించాడు.

స్త్రీవాద కవయిత్రులు తమ హక్కుల పోరాటంలో

భాగంగా తమ సమస్యలను, కష్టాలను, అవమానాలను, అణచివేతను కావ్య వస్తువుగా గ్రహించి రచనలు చేశారు. వారి సమానంగా స్త్రీలు ఎదుర్కొనే లింగవివక్ష, అసమానత్వం వంటి అనేక లక్షణాలను కావ్య వస్తువుగా గ్రహించి కవయిత్రులకు సమానంగా వారి గుండె ఘోషను తన కావ్యాలలో నిక్షిప్తం చేసిన కవి మాడభూషి. స్త్రీ లేకుంటే మానవ చక్రం లేదు. అలాంటి వారిని ఎదగ నివ్వాలి. ఎగరనివ్వాలి అని మాడభూషి గారి అభిప్రాయం.

ఉపయుక్త గ్రంథాలు :

1. శత్రువుతో ప్రయాణం
2. చివరకు నువ్వే గెలుస్తావు
3. మూడో మనిషి
4. ఆలోచనలు

సామాజిక రుగ్మతలపై శికారి

- కె. తారనాథ్

"నాకు / దేవుడి మీద కన్నా / మనిషి మీదే / ఎక్కువ నమ్మకం / అందుకే / గుడి బయటే / అడుక్కుంటాను" అంటూ భిక్షగాడి స్వగతంగా కవిత్వం చెప్పిన కవి మాడభూషి సంపత్‌కుమార్. ఈ కవి అందిస్తున్న కవితా సంపుటి పేరు 'వికారి'. వికారి అంటే తెలుగు సంవత్సరాల్లో 33వది. త్రిసంధ్యలు, త్రికాలాలు కలిసి ఒండురులు చేరి 33 అయ్యాయని భావించి ఈ శీర్షికను 3+3=33గా పెట్టాడు. వికారిని సంబోధిస్తూ "కాలానికి ఎదురొడ్డి / నిన్ను దాటినవాడు / మహోన్నత పౌరుడు" అన్న వాక్యాల్లో ఎంతో తాత్వికత వుంది. "కులం కన్నా / మలమే గొప్ప / మలాన్ని విసర్జించగలుగుతున్నాం" అన్న చిన్న పంక్తుల్లో ఈ దేశ దురాచారతత్వం కుల పోకడలనేది కవి భావన. మలం విసర్జించగలిగే మనిషి కులం విసర్జించలేకపోవడం దారుణం, బాధాకరం. అత్యల్ప పదాల్లో అనల్పార్థ విషయాల్ని చెప్పడమంటే ఇదేమరి. అట్లే "మరణం లేని / సమాజం కన్నా / మానవత్వం లేని / సమాజం గొప్పదికాదు!" అనడంలో మాయమైపోయే మానవత్వంపై కవిగారి ఆవేదన ఇది. 'సేవ' అనే కవితలో సూర్యచంద్రుల గమనాలను ఇలా అన్వయించి చూపుతూ "ఇతరులకు / సేవ చేసేవాళ్ళకు / నిద్ర ఉండదు / 'నిలకడ' ఉండదు " అంటాడు. సమాజంలో ఆకాశంలో సగభాగంగా భావించే మహిళల పట్ల 'నోరు తెరవండి' అని సంబోధిస్తూ "నువ్వు మోసపోతే నీకు ఎవరూ సానుభూతి చూపరు / నువ్వు నోరు తెరవనంత మాత్రాన / లోకం నోరు మూసుకోదు" అంటూ మహిళను తమ సమస్యల సాధనలో నోరు పెకల్చమంటాడు కవి. బాధ్యతతో రాసిన కవిత్వం ఇది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామాజిక సమస్యలకు దర్పణం 'శత్రువుతో ప్రయాణం'

– డాక్టర్ ఒభిన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు,రాజీవ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో పేరెన్నిక గల రచయిత మాడభూషి సంపత్ కుమార్. ప్రతిష్టాత్మకమైన మద్రాస్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యునిగా పనిచేస్తూ తన రచనల ద్వారా తెలుగు సాహిత్యం మీద తనదైన ముద్ర వేసిన రచయిత. ఆధునిక తెలుగు కవుల్లో మాడభూషి సంపత్ కుమార్ గారు కవిగా, విమర్శకులుగా, అనువాదకులుగా సాహిత్యలోకంలో ప్రసిద్ధిచెందారు. వీరు 1959లో సెప్టెంబర్ 17వ తేదీన శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం కమ్మపల్లె గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుండి భాష సాహిత్యాలపై అభిమానం ఉండడం వలన ఆ దిశగా కృషి చేయడం మొదలుపెట్టాడు.

సంపత్ కుమార్ వృత్తి రీత్యా తెలుగు ఆచార్యులే అయినా ఆయన సమాజంలో ఏ చిన్న సంఘటన అయినా ఆయన మనసును కదిలించిన వెంటనే దానికి స్పందించి అక్షరరూపం ఇచ్చారు. ఆయన దేశ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై తన అనుభవాలను కవితా సంపుటిల రూపంలో వెలువరించారు. సంపత్ కుమార్ గొప్ప భావకుడు తను చెప్పదలచుకొన్న అంశాన్ని సూటిగా స్పష్టంగా ఎటువంటి డొంకతిరుగుడు లేకుండా చాపుతారు. దేశంలో పేదరికం, మధ్యతరగతి వారి సమస్యలు, స్త్రీల సమస్యలు, మతతత్వం, కులతత్వం, సమకాలీన దేశ రాజకీయాలపై, అవినీతిపై ఇలా అనేక అంశాల మీదా ఆయన కవితలు వెలువరించారు.

సంపత్ కుమార్ కవితా సంపుటిలోని వివిధ కవితలు చదివినప్పుడు ఆయన ఒక అభ్యుదయ కవిగా, స్త్రీ వాదకవిగా, దళితవాద కవిగా, ముస్లిం మైనారిటీవాద కవిగా కనిపిస్తారు. ఇలా అన్ని వాదాలను తనలోని ఇముడ్చుకొన్న గొప్ప మానవతవాది మాడభూషి సంపత్ కుమార్. ఎప్పుడూ ఇజాల వెంట పరుగుపెట్ట కుండా సమకాలీన సామాజిక సమస్యలపై నిరతరం కలమనే ఆయుధంతో పోరు సల్పిన మహాయోధుడు మాడభూషి. ఆయన పత్రికా రంగ0లో పనిచేయడం వలన సమకాలీన రాజకీయలపై అవగాహన ఏర్పడింది. అందువల్ల నేటి రాజకీయాలపై సునిశితమైన విమర్శ ఆయన రచనలలో కనిపిస్తుంది. అంతర్జాతీయ అంశాలపై కూడా ఈయన స్పందిస్తూ అనేక కవితలు వ్రాసారు. సరళమైన భాషతో చక్కనైన భావ వ్యక్తీకరణతో పాఠకులను మెప్పిస్తాడు.

సంపత్ కుమార్ ఉత్తమ అధ్యాపకుడు, నిరంతర పరిశోధనా పిపాసి. అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాలను ప్రచురించారు. అనేక పుస్తకాలు ప్రచురించారు. ఈయన ఆచార్యునిగా ఈయన పర్యవేక్షణలో 28 పీ.హెచ్.డి 78 మండి ఎం.ఫిల్ చేశారు. ఈయన డీ.లిట్ కూడా పూర్తి చేశారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో డీలిట్ చేసిన మొట్టమొదటి ఆచార్యుడు మాడభూషి వారే. అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు.

మాడభూషి సంపత్ కుమార్ గారి రచనల్లో ప్రస్తుతం నేను ఆయన వ్రాసిన "శత్రువుతో ప్రయాణం" అనే కవితా సంపుటిని నా పరిశోధనాంశంగా తీసికొన్నాను. దీనిలో మొత్తం 36 కవితలు ఉన్నాయి. ఈ కవితలు సామాజిక, సంస్కృతిక, సాహిత్య, రాజకీయ ఇలా వివిధ పార్శ్వాలను స్పృసిస్తూ వ్రాయడం జరిగింది. సంపత్ కుమార్ ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఆయన వివిధ సామాజిక సమస్యలకు ఈ కవితలో ప్రస్తావించి, వాటి ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించే గొప్ప ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. ప్రస్తుత నా యీ

వ్యానంలో సామాజిక సమస్యలను ''శత్రువుతో ప్రయాణం'' కవితా సంపుటిలో ఎంత ప్రభావంత0గా చిత్రించారో వివరిస్తాను

'కత్తి క్రింద పడకుండానే' అనే కవితలో ఆయన నాన్న గారు మాడభూషి శ్రీనివాసాచార్యులు గారిని గుర్తు చేసుకొంటూ ఆయన తన కుటుంబం కోసం పౌరోహిత్యం చేస్తూ పేదరికం అనుభవిస్తూ కుటుంబం కోసం ఎంతో త్యాగం చేశారని చెపుతూ

"ఆ రోజూ రాత్రి దాకా
మాకు పెట్టడం తప్ప
ఒక్క పిడికెడు మెతుకులు
ఆశించని ధన్యుడు
జీవన సమరంలో
కత్తిక్రింద పడకుండానే
మరణించిన వీరుడు."

అటు తండ్రి చేసిన త్యాగాని గుర్తు చేసుకొన్నారు. నేటి సమాజంలో పౌరోహిత్యం చేస్తూ దుర్భర జీవనం గడుపుతున్న వారు కోకొల్లలు. వారసత్వంగా వచ్చిన పౌరోహిత్యాన్ని కొందరు వదిలిపెట్టి, వేరే వృత్తులలోకి వెళ్లలేక అలాగే పేదరికంతో కాలం వెల్లదీస్తున్నారు.

మరొక కవితలో 'కవి భేరి' అని శ్రీశ్రీ నేను సైతం అన్న కవితకు పేరడీ వ్రాసినట్టుగా నేటి సమాజంలో ఉన్న సామాజిక సమస్యల మీద స్పందించారు. కవితలో

"ఎమర్జనీ వచ్చినప్పుడు
కవి గొంతు
మూత పడలేదా"

అంటూ సాగుతూ, తాను విప్లవం చేయడం ద్వారా

"గద్దెనెక్కే వెక్కిరించే
బుద్ధిలేని పెద్దలంతా
పదవి పోయి ఏడ్చుకొంటూ
క్రిందకు వస్తారు"

అంటారు. అలాగే

భావజాలం మారిపోయి
మూఢతత్వం కదిలిపోయి
అభ్యుదయమే జగమంతా
నిండిపోతుంది"

అంటారు. ఈ విధంగా ఈ కవితలో సమాజంలో పాతుకుపోయిన కుల, మత తత్వాలను తాను కవిగా ఏ విధంగా ప్రశ్నిస్తాడో తెలియచేసాడు. సంపత్ కుమార్ చివర్లో కవిత అయిపోయాకా ''పులిని చూసి నక్క వాతలు పెట్టుకొన్నట్లు'' అని తనను తాను అనుకొన్నా సమకాలీన సామాజిక సమస్యలపై చాలా గొప్పగా, ప్రజలలో చైతన్యం కలిగించేలా ఈ కవిత వ్రాసారు.

మరొక 'నిజం' కవితలో నేడు కొందరు ప్రజలు, రాజకీయ నాయకులు, చివరకి విద్యార్థులు కూడా కుల, మత, ప్రాంతాలనే సంకుచిత భావజాలంతో దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆవేదన వెలుబుచ్చారు. తాను చూస్తున్న దేశం గురించి చెపుతూ

"నే చూసిన
నా దేశంలో
ఎన్ని ఇజాలు
కులిజం మతిజం భాషిజం, ప్రాంతీయిజం
లేదొక్కటే దేశీజం"

అంటూ సాగే కవితలో వివిధ వర్గాల వారు నా కులం, నా ప్రాంతం, నా భాష, అంటు సంకుచిత మనస్తత్వ0తో ఉంటున్నారే కానీ ఎవరూ నా దేశం అంటూ ముందుకు వెళ్ళడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. నిజంగా కవి చెప్పినట్లు దేశ పరిస్థితులు ఆ విధంగానే ఉన్నాయి. విశాల దృక్పథంతో ఆలోచించే వారు తక్కువైపోతున్నారు. దేశాన్ని పరిపాలించే కొందరు నాయకులలో కూడా సంకుచిత భావజాలం కనిపించడం బాధాకర0.

మరొక కవితలో విరోధి నామ సంవత్సరాన్ని గురించి చెపుతూ అది ఏ సంవత్సరమైనా దేశంలో సమస్యలు తగ్గడం లేదని ఆవేదన చెందారు.

"ఈ ఉగాది
నాకు విరోధి
షడ్రుచులు వడ్డించిన
భూమి తల్లిపై/ హత్యాచారం/"

అంటూ సాగే ఈ కవితలో నేటి సమాజ పరిస్థితిని వివరించారు. ఈ కవితలో కుహనా మేధావుల గురించి చెపుతూ

"కులాల్ని ఒంటికి పూసుకొని
ప్రాంతాలపై పవలిస్తున్న
మేధావులు!"

అంటూ కొందరు దుర్మార్గులు మేధావుల పేరుతో చెలామనీ అవుతున్నారనే విషయాన్ని సమాజానికి వివరించారు.

మరొక 'తెలుగు వెలుగులు' కవిత అద్భుతమైన కవిత. నాటి ఆదికవి నన్నయ నుండి నేటి ఆధునిక కవి జాషువా వరకూ వరకు తెలుగు సాహిత్యానికి వారు చేసిన సేవను విశదీకరించారు.

"మబ్బు చాటున
తెలుగు సొబగులకు
మల్లె వాసనలు జోడించి
తెలుగు సాహితీ తేనెలొలికించాడు నన్నయ"

అంటూ ఈ కవితా సాగుతూ తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాధుడు, పోతన, ఆధునిక కవులలో కందుకూరి, గురజాడ ఇలా ఎందరో కవులను ఈ కవితలో స్మరిస్తూ వారి సాహిత్య సేవను కీర్తించాడు. చివర్లో తెలుగు సొరభాలు/ విరజిమ్మినారు విశ్వమంతా/ ఆధునిక కవులందరో/ అద్భుతమైన సాహిత్య ప్రక్రియా ధోరణులతో/ తాడిదన్నువాడి తలదన్ను వాడొకడు" అంటు ముగిస్తాడు.

మాడభూషి వారు అంతర్జాతీయ సమస్యపై కూడా కలాన్ని ఎక్కుపెట్టి 'పాలస్తీనా దృశ్యాలు' కవితలో ఆ దేశంలో అమాయకులు ఏ విధంగా ఇజ్రాయిల్ దమకాండకు బలియవుతున్నారో వివరించారు. ఈ కవితలో

"జన్మభూమి విముక్తికై
పోరాడిన కన్న తల్లి శవం మీద
పాలకై పరితపించే పసిపాప"

అంటూ సాగే ఈ కవితలో అక్కడి ప్రజలు అనుభవిస్తున్న నరకయాతనను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఎక్కడ సమస్య ఉన్నా, అది ఏ దేశమైనా మానవతావాదిగా స్పందించే గొప్ప గుణం కలిగిన వారు మాడభూషి వారు. ఒక బలవంతుడు ఒక బలహీనున్ని ఏ విధంగా దోచుకొంటాడో ఈ కవితా ద్వారా చక్కగా వివరించాడు. పాలస్తీనాలో మానవ హక్కులు ఎంతగా అణగారి పోతున్నాయో మనం ఈ కవితా చదివితే చకగా అర్థమవుతుంది.మరొక కవి కవితలో రాక్షస భర్తను భరిస్తున్న ఒక భార్య అనుభవితున్న మానసిక, శారీరక క్షోభను 'స్వర్గం' కవితలో చకగా వివరించారు, సాధారంగా స్వర్గం అన్నది భర్తే అనుభవిస్తున్నాడని అనుక్షణం నా జీవితం నరకంగా మారిందనే భార్య ఆవేదన ఈ కవితలో చెప్పారు. కవితలో

"ప్రతీ రాత్రీ/ వాడికి స్వర్గం
ప్రతీరాత్రీ/ నాకొక నరకం
దెయ్యంలా మారిన వాణ్ణి/ దేహంలా ఎలా
భరించగలను"

అంటూ ఈ కవిత సాగుతుంది. శారీరకంగా పడక సుఖం కోసం భార్యను హింసించే ఒక రాక్షసుడు పెట్టె బాధను చెపుతూ ''స్వర్గాన్ని రుచిచూస్తూ/ నరకాని తాగిస్తాడు'' అంటారు.

కవిత చివర్లో ''వాడు సచ్చి స్వర్గానికి పోతాడు/ నేను సచ్చి నరకానికి పోతాను/అక్కడ కూడా వాడు స్వర్గ సుఖాలు అనుభవిస్తాడు/ వాడులేని నరకం/ నాకు స్వర్గం/ నేను స్వర్గస్తురాలినవుతున్నా'' అంటూ చాలా విషాదంగా ముగుస్తుంది. అంటే వాడి హింసను తట్టుకోలేక

స్వర్గస్తురాలినవుతున్న అంటూ తాను ప్రాణాలను విడిచిపెట్టడానికి సిద్ధపడింది. ఇటువంటి రాక్షసులు సమాజంలో చాలామంది ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా ఇటువంటి నరరూప రాక్షసులు ఉ ంటూనే ఉన్నారు. ఒకవైపు స్త్రీ స్వేచ్ఛ అంటూనే ఇంటి నుండి బయటకు రాకుండా వేధిస్తున్నారు. ఇటువంటి వ్యవస్థ మారాలి, అప్పుడే స్త్రీ సమానత్వం సాధించినట్టుగా చెప్పుకోవాలి. కానీ ఒకరిద్దరు మహిళలు సాధించిన సాధికారికతను చూసి అందరూ అలానే ఉన్నారని చెప్పలేం. ఈ కవితలో చెప్పినట్లు ఇటువంటి గృహ హింస నేటికీ ఎన్నో వేలమంది స్త్రీలు అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితి మారి, స్త్రీ సమానత్వం పూర్తిగా రావాలి.

మరొక 'తండ్రి' కవితలో పైన చెప్పినట్లు కొందరు మగాళ్లు మృగాళ్ళుగా మారి మరీ రాక్షసంగా కన్న కూతురు కూడా చెరబట్టే నీచులు నేటి సమాజంలో ఉండడం వల్ల ఒక మగాడిగా ఎందుకు పుట్టానా అని రచయిత బాధపడుతూ కవితలో

"మగాడినయినందుకు
తలవంచుకొంటున్నా
తండ్రి నయినందుకు సిగ్గుపడుతున్నా
ఈ రోజు/ పత్రికల్ని దాచిపెట్టేసా
టీవీల్ని కట్టేశా/ ఎక్కడ కూతురు
ఆ వార్తలు విని
తండ్రిని అసహ్యించుకొంటుందేమోనని"

అంటూ బాధపడతాడు, ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని చెపుతాడు. రచయిత చెప్పినట్లు ఇటువంటి సంఘటలు సమాజంలో పెరుతున్నాయి, కానీ తగ్గడం లేదు.

నిర్భయ, దిశ ఇలా ఎన్ని చట్టాలు చేసినా పరిస్థితి మారడం లేదు. మరీ దారుణంగా బయట సంఘటనలే కాకుండా సొంత ఇంట్లో కూడా నీచంగా కన్న తండ్రి, తోడబుట్టిన వాడు చెరబడుతుంటే మగాడిగా పుట్టి నందుకు సిగ్గుపడాలి, ఏ కుక్కగానో, ఏ పందిగానో ఎందుకు పుట్టలేదనుకొని బాధపడాలి. అటువంటి వార్తలు చదివి విని ఇంకా మనం ఉన్నందుకు బాధపడాలి. ఒక స్త్రీగా పుట్టిన దగ్గర నుండి, చనిపోయెంతవరకూ ఎన్ని రకాలుగా శారీరకంగా, మానసికంగా బాధ అనుభవిస్తుంతో ఒక్కసారి ఆలోచించాలి. అందరూ ఒక మనిషిగా మానవత్వమున్న మనిషిగా బ్రతకాలి.

అటువంటిదే 'మగాడు' కవితలో రచయిత ఒక స్త్రీ తన ఆవేదనను చెపుతూ "నేను సహవాసం చేస్తున్నది/ శత్రువుతో/ నేను సహజీవనం చేస్తున్నది/ శత్రువుతో/ నేను పని పంచుకొంటున్నది/ శత్రువుతో/ పనిచేస్తున్నది శత్రువుతో/ నాకు దుఖం వచ్చినా/ వాడు ఆనందిస్తాడు/ వాడు భర్తయినందుకు బరితేగిస్తున్నాడు/నేను భార్యయి నందుకు/ భరిస్తున్నాను" అంటు ఒక భర్త వేధింపులను భరిస్తున్న భార్య ఆవేదన కనిపిస్తుంది.

అలాగే కవితలో చివర్లో "చెవులు కుట్టారు/ ముక్కు కుట్టారు/ బాధగా ఉన్నా/ భరించాను నోరుమూసుకొని/ అంతా నా అందం కోసమేనని/ తీరా నోరు తెరవాలని/ ప్రయత్నించినప్పుడు గానీ/ తెలియలేదు/ ముందుగానే/ నోరు కూడా కుట్టేశారని/ రెక్కలు తొడుక్కొని/ పక్షిలా ఎగిరే మనసుని/ ముక్కలు చేసి/ మూలకూర్చో బెట్టారు/ దానిపేరు పెళ్లి" అంటూ కవితా సాగుతూ "అంతా వాడిష్టం/ ఇతరుల ఇష్టాని గురించి/ ఆలోచించడానికి/ ఏ తల్లోనూ మెదడుండదు" అంటు కవితా ముగిస్తాడు.

పై కవితలో ఇంతకు ముందు 'స్వర్గం' కవితలో చెప్పినట్టు ఒక రాక్షస భర్త వేధింపులు భరిస్తున్న ఒక స్త్రీ ఆవేదనను కళ్ళకు కట్టినట్లు చూపాడు. 'నేను సహవాసం సహజీవనం చేస్తుంది శత్రువుతో' అంటూ ఒక భర్తని భార్య శత్రువుగా భావిస్తుందంటే వాడు ఎంత రాక్షసుడో అర్థ మవుతుందన్నది. ఈ కవితలో స్త్రీ చిన్నతనం నుండి చెవులు కుట్టడం, ముక్కుకుట్టడం వంటి వాటి ద్వారా అణగద్రొక్కడం అన్నది చిన్నతనం నుండే ప్రారంభ మవుతుందని చాలా చక్కగా రచయిత వివరించాడు. స్వేచ్ఛ అన్నది లేకుండా ఒక యంత్ర0లా జీవితం

మారడం చాలా బాధాకరమైన విషయం. తను బాధ అనుభవిస్తున్నా, వాడు ఆనందించడం రాక్షస ప్రవృత్తి. చివరకు రకరకాలుగా భార్యను హింసిస్తున్న వాడికి కనీసం మొదడు అన్నదే ఉండదని తన ఆవేదనను చెందడం మనకు ఈ కవితలో చూస్తాము.

మరొక కవితలో సమాజంలో కుల వివక్షను నిరసిస్తూ ఈ కవితలో 'చెప్పులు' కవితలో ''నన్నేకాదు/ నేను కుట్టిన/ చెప్పుల్ని కూడా/ వాడు బయట వదిలేస్తాడు/ కానీవాణ్ణి/ అక్కడదాకా తీసుకెళ్ళిందెవరు?/ ఇల్లు చేరాక/ చెప్పుల్ని వదిలేయడం/ తరతలుగా అలవాటే/ అయిన చెప్పులు/ విశ్వాసంగా/ అరుగు దగ్గరే కూర్చున్నాయి/మళ్ళీ వాణ్ణి మోసుకెళ్లడానికి'' అంటారు.

సంపత్ కుమార్ కుల వివక్ష గురించి మరియు దళితులను అనేక రకాలుగా మోసం చేయడం గురించి ఈ కవితలో చాలా బాగా చెప్పారు. కొందరు దుర్మార్గులు దళితులను అంటరాని వారిగా చూస్తూ వారిని తమలో కలవనియ్యరు. కానీ దళితులను అనేక రకాలుగా వాడుకోవడం నేడు మనం సమాజంలో చూస్తున్నాం.

కానీ దళితుడు విశ్వాసంగా అరుగు దగ్గర కూర్చుంటాడు అని కవి చెప్పినట్లు వారిని అనేక సార్లు మోసం చేస్తూ ఉన్న కూడా మరలా వాడినే నమ్ముతున్నారని ఈ కవితలో చెపుతున్నాడు. తరతరాలుగా మనిషి ఎంతగా అభివృద్ధి చెందిన ఈ కుల వివక్ష పోవడం లేదు. ప్రభుత్వాలు దళితులను కేవల ఓటు బ్యా0కుగా చూసుకొంటున్నారు, కానీ చిత్తశుద్ధితో వారి జీవన స్థితి గతులలో మార్పులు తీసుకువచ్చే ప్రయత్నం దాదాపుగా ఎవరూ చేయడం లేదనే చెప్పవ్చు.

మరొక 'విలువ' కవితలో అమేరికా డాలర్ల మోజులో మనిషిని కూడా డాలర్లలాగ గుర్తిస్తున్నారని కవి తన ఆవేదన వెలుబుచ్చాడు. కవితలో ''మనిషి విలువ/ రూపాయిలాగా/ పడిపోతూనే ఉన్నది/ నేను మనిషిని/ డాలర్‌తో కొలుస్తాను/అతను ఎన్ని ఎంబిలో/ తెలుసుకొని మర్యాదిస్తాను'' అంటాడు. ఈ అమెరికా డాలర్ల మోజులో పడి మానవ సంబంధాలు చాలా వరకూ క్షీణిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా వెళ్ళి కన్న తల్లిదండ్రులను కనీసం చూడకుండా, మరీ దుర్మార్గంగా వారికి ఏమి జరిగినా పట్టించుకోకుండా ఉంటున్నవంటి అనేక మంది పిల్లలి నేటి సమాజంలో చూస్తూనే ఉన్నాం.

అలాగే డాలర్ల మోజులో పడి నేడు అనేకమంది తల్లిదండ్రులు ఎంతో గొప్పగా వారి కూతురు పెళ్ళికి అమెరికా సంబంధమని కొన్ని కోట్ల కట్నం ఇచ్చి పెళ్లి చేస్తే చివరకు వాడు పెట్టె నరక యాతన భరించలేక ఆ అమ్మాయి చనిపోవడం, లేదా మనం దేశం తిరిగిరావడం చూస్తూనే ఉన్నాం. దీనికి కారణం డాలర్ల మోజు అదే విషయం కవి ఈ కవితలో చెప్పాడు. డాలర్ల వేటలో పడి మానవ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా చూస్తున్న అనేక మంది నేడు సమాజంలో ఉన్నారు, వారిలో మార్పు రావాలి. మాతృమూర్తికి, మాతృభూమిని మరచిపోకూడదు. నువ్వు బ్రతుకు దెరువు కోసం ఏదేశానికి వెళ్ళినా అక్కడ నువ్వు పరాయివాడివేనన్న విషయం మరువకూడదు.

మరొక కవితలో ఆధునిక మానవున్ని ప్రవర్తనను గురించి చింతిస్తూ 'మనిషి' అన్న కవితలో

"యుద్ధాన్ని గురించి భయం లేదు
మరణాన్ని గురించి భయం లేదు
క్రూరమృగాల గురించి
విష నాగుల గురించి
సునామీల గురించి
ఉప్పొంగే నదుల గురించి భయంలేదు
నా భయమంతా మనుషుల గురించే
మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే"

అంటాడు. ఈ విధంగా నేటి మానవుడు డబ్బు కోసం ఎంతగా దిగజారడానికైనా సిద్ధంగా ఉన్నాడు. మానవ సంబంధాలు లేవు, తన, మన భేదాలు లేవు. వాడికి ఈ

సృష్టిలో కాలసినది కేవలం ఒక్క డబ్బు మాత్రమే. అదే కవితలో "చెట్లను, పుట్లను/ నదుల్ని, సముద్రాలను/ పులుల్ని, పాముల్ని/ అన్నింటినీ చంపేసి/ మనుషులపై కత్తిగట్టాడు/ మమతలపై కత్తిదూసాడు/ సర్వమానవ సంహారానికి సమాయత్తమయ్యాడు/ స్వప్రయోజనకోసం/ మానవ ప్రయోగశాలను/ పణంగా పెట్టాడు/ మనిషిగా మారేంత వరకూ/ మనిషంటే నాకు వణుకు/ మనిషంటే నాకు బెణుకు" అంటూ కవిత ముగిస్తారు. కవి చెప్పి నట్లుగా నేడు మనుషులుగా ఎంత మంది ప్రవర్తిస్తున్నా రంటే వేళ్ళ మీదే లెక్కించవచ్చు. అభివృద్ధి పేరుతో మనం చేసే పర్యావరణ విధ్వంసం అన్నది మాటల్లో చెప్పలేనిది. కొన్ని కోట్ల జీవరాశులలో మనిషి కూడా ఒక జీవేనన్న విషయం మరువకూడదు. తన కోసం ఇతర జీవులను ప్రత్యక్షంగా పరోక్షంగా బాధపెడ్డకూడదు. కానీ నేడు మానవుని సౌకర్యాల కోసం ఎన్నో జీవాలను బాధపెడు తున్నాడు. అలా కాకుండా మానవుడు అన్ని ప్రాణులను సమానంగా చూస్తూ, ఒక మనిషి మనిషిగా బ్రతికే రోజు రావాలని మనందరం కోరుకోవాలి. బాధపెడ్డకూడదు. కానీ నేడు మానవుని సౌకర్యాల కోసం ఎన్నో జీవాలను బాధ పెడుతున్నాడు. అలా కాకుండా మానవుడు అన్ని ప్రాణు లను సమానంగా చూస్తూ, ఒక మనిషి మనిషిగా బ్రతికే రోజు రావాలని మనందరం కోరుకోవాలి.

ఈ విధంగా ఈ 'శత్రువుతో పోరాటం' కవితా సంపుటిలో మాడభూషి సంపత్ కుమార్ వివిధ సామాజిక సమస్యలకు అక్షర రూపం ఇచ్చాడు. ఈయన కవిగా, వ్యాసకర్తగా, అనువాదకుడిగా, విమర్శకుడిగా, పాత్రి కేయుడిగా, భాషావేత్తగా, ఉత్తమ సాహితీవేత్తగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. తెలుగు బాష సాహిత్యాలకు ఈయన చేసిన సేవ అజరామరమైనది. ఈయన స్నేహ శీలి, నిగర్వి నిరాడంబరుడు. సాధారణ జీవితాని గడు పుతూ తను అనేక విధాలుగా నేటి తరానికి ఆదర్శ ప్రాయుడిగా నిలిచారు.

సంప్రదింపు గ్రంథాలు :

1. 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటి, మాడభూషి సంపత్ కుమార్ పాలపిట్ట బుక్స్, హైదరబాద్, 2015.
2. నలభై సంవత్సరాల భాషా, సాహిత్యాల ప్రత్యేక సంచిక, తెలుగు అకాడమి, - జె. ప్రతాప రెడ్డి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వికారి' కవిత్వం - తాత్త్వికత

- డాక్టర్ పి. కరలక్ష్మి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ, పి.జి. కళాశాల, పుత్తూరు.

వ్యక్తిని వ్యవస్థను నడిపించేది మనిషిలోని మానవత్వపు శక్తి, మనిషికి ప్రాణం పోసే, అన్నం పెట్టే వ్యవసాయక శక్తి. ఈ రెండు విభిన్న శక్తులు కేంద్రీకృతమై ఒక్కదానితో ఒకటి సహకరిస్తేనే మనిషి ఫలితాల్ని పొందడానికి వీలవుతుంది. మన శరీరంలో భిన్న అవయవాలు ఉంటాయి. ఒక్కో అవయవం పనీ, ప్రయోజనం వేరు వేరు అయినా అవన్నీ ఒకే కేంద్ర శక్తి సంకల్పాన్ని బట్టి నిర్దేశాన్ని బట్టి ఏకోన్ముఖంగా పని చేస్తాయి అలా ఈ రెండు శక్తుల సముదాయం ఏకీకృతమైనప్పుడు మానవ సమాజం మనుగడ ప్రపశాంతంగా కొనసాగుతుంది. అయితే మధ్యయుగం తరువాత దాదాపు 17వ శతాబ్దం నుంచీ కూడా వ్యక్తిని,వ్యవస్థను నడిపించాల్సిన ఈ రెండు శక్తులూ కూడా తన బలిమినీ కలిమినీ కోల్పోయి నిర్వీర్యమైపోయిన సంగతిని మనం కళ్ళారా చూస్తున్నాం. ఈ మార్పు సమాజపు సంస్కృతి మూలాలనే మార్చేసింది. ఈ మార్పు కారణంగా నేడు సమాజాన్ని ఆలోచింపజేసే ''వికారి''లాంటి తాత్విక కవితాసంపుటాలు మనల్ని పలకరించసాగాయి. మనమూ వాటిని పలకరిద్దాం!

''రైతు ఆత్మకథ'' కవితలో ''కవులకు కావ్యం కన్యక అయితే రైతుకు కావ్యం తల్లి, రైతు ఆత్మ కథలో అప్పులుంటాయి, ఆత్మహత్యలుంటాయి. అవమానాలుంటాయి అవరోధాలుంటాయి'' అని రైతు హృదయాన్ని రైతుఆత్మను తాత్విక కోణంలో అభివర్ణించిన తీరు ప్రతి మనిషినీ ఆలోచింపజేస్తుంది. రైతుకు కావ్యం తల్లి అన్నారు. ఇక్కడ తల్లి అంటే భూమాత అని అర్థం. అన్నదాతగా పేరొందిన రైతు ఆత్మకథ ఈ స్థాయికి దిగజారడానికి కారణం అన్నమే ప్రాణం, దైవం అనే సత్యాన్ని గ్రహించలేని అజ్ఞానమే.

అసలు మనిషి లేదా ఏ ప్రాణి అయినా పుట్టుకకు కారణం ఆహారం. ఆహారం నుండే ప్రాణులు ఉద్భవిస్తున్నాయి. భూమ్మీద ఉన్న అన్నీ ప్రాణులు ఆహారం నుండే రూపొందాయి.అంటే రైతు సర్వప్రాణి సృష్టికర్త. అన్నదాతకు మట్టే వస్తువు. ఒళ్ళంతా మట్టి పూసుకొని పంటను ఎంతో ఆప్యాయంగా, ఆత్మీయంగా, పసికందులా చూసుకొని మననోటికి ఆహారం అందించే అన్నదాతకు ఆహారం తినలేని దుస్థితి. అంతరిక్షం దాగా ఎదిగిన ఆధునిక ప్రపంచంలో అన్నదాతకు అన్నం కడుపు నిండా పెట్టలేని పరిస్థితి. అలాంటి రైతును కవి ''కోటీశ్వరుడు కోట్ల నోట్ల కట్టల మీద పడుకున్నట్లు రైతు మట్టి మీద పడుకుని మురిసిపోతాడు'' అని వర్ణించడం అటు కోట్లతో ఆడుకునే నోట్లను చూసి మురిసిపోయేవారికి. ఇటు అన్నదాతకు అన్నంపెట్టలేని సమాజానికి కూడా హెచ్చరిక-

అన్నాద్వై ప్రజాః ప్రజాయన్తే,అథో అన్నేనైన జీవన్తి అన్నం హి భూతానాం జ్యేష్ఠం,అన్నాద్భూతాని జాయిన్తే - అని తైత్తిరీయోపనిషత్తు 2.2

ఆహారం నుండే మనష్యులు పుట్టారు.ఆహారమే ప్రాణుల ఆరంభానికి కారణం. సర్వప్రాణులు ఆహారం నుండే ఉద్భవిస్తున్నాయి. ఆహారం వల్లనే జీవిస్తున్నాయి. అని మనకు ఆహారాన్ని నమకూర్చే అన్నదాత ప్రాధాన్యతను ఉపనిషత్తులు వేదాలు స్పష్టంగా పేర్కొన్నాయి. దీన్నిబట్టి మనం వాటిపట్ల ఎంత భక్తితో,శ్రద్ధతో వ్యవహరించాలో మనకు తెలియవస్తుంది. మనం ఆహారం ఒక ఔషధం అన్న విషయాన్ని అవగతం చేసుకోవాలి. ఆకలి అనే రుగ్మతకు ఔషధమే ఆహారం అని ఆది శంకరాచార్యులు తన సాధనాపంచకంలో పేర్కొన్నారు. అంటే రుచికోసం తినడం కాదని మనకు తెలియాలి. ఔషదం తీసుకున్నట్లు నరైన పద్ధతిలో సముచిత

సమయాల్లో మితిమీరకుండా తీసుకోవాలి. ఈ నియమాన్ని అనుసరిస్తూ జీవించే వారిని ఆ ఆహారమే వృద్ధి చేస్తుంది. అలాంటి వారికి ఎల్ల వేళలా లభించడానికి ఆహారం సహకరిస్తుంది. ఈ నియమాన్ని విస్మరిస్తే 'ప్రారంభంలో ప్రాణులు ఆహారాన్ని తింటున్నాయి. చివరకు ఆహారమే ప్రాణుల్ని భక్షిస్తుంది. అనే హెచ్చరికను కూడా ఈ మంత్రం ఉపదేశిస్తుంది. ఎంతో ప్రగాఢమైన చింతన ఫలితంగా ఈ భావన పరిణమించింది. తద్వారా మనం ఆహారం తినడానికి ఉపక్రమిస్తున్నాం. అలా ఆహారం దేహాన్ని పోషించడానికి అనే ఉద్దేశాన్ని మరచిపోయి ఆహారం నానారకాల రుచులు మనల్ని లొంగదీసుకునే పరిస్థితి ఉద్యమించింది. తద్వారా మనం ఆహారం తింటున్నామనే స్థితి మారి మనల్ని భక్షించే స్థితి ఏర్పడు తుంది. కాబట్టి ఈ పరిస్థితి నుండి మనిషి ఆలోచనా విధానం మారాలి. ఆహారాన్ని ఓ దివ్యమైన ఔషధంలా, ప్రసాదంలా, ప్రాణంలా,దైవంలా భావించి దైవానికే సమర్పించి భక్తి శ్రద్ధలతో స్వీకరించాలి.

ఇలా మనం ఆలోచించినప్పుడు ఆహారం వేరు అన్నదాత వేరు కాదు కదా! అయితే మరి సర్వప్రాణి సృష్టికర్త, పోషకుడు అయినటువంటి రైతుకు మాత్రం ఆత్మహత్యే శరణ్యమౌతున్న దుస్థితిని చూసిన కవి రైతు ఆత్మ కథను ఈ కవితా సంపుటంలో చొప్పించారు. అయితే ఇలాంటి కవితలు కథలు కూడా గ్రంథాలకు, వార్తలకూ, పత్రికలకే పరిమితమైపోవడం గమనార్హం. ఈ అంశాన్ని గురించి ప్రభుత్వం గాని ప్రజలు గాని ఆలో చించలేదా! అంటే ఆలోచిస్తున్నారు అయితే ఆచరణకు నోచుకోలేదా!అంటే అదికూడా ప్రశ్నార్థకమే! కాబట్టి

అన్నాద్భవంతి భూతాని, పర్జన్యాత్ అన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో, యజ్ఞః కర్మ సముద్భవః

- 3.14 భగవద్గీత

అన్న గీతా చార్యులవారి మాటను అటు ఉపనిషత్ వాక్యాలను ఇటు కవి హెచ్చరికను దృష్టిలో ఉంచుకొని అన్నదాతను గురించి ఆలోచించి ఆచరణగావించే దిశగా అడుగులు వేయాలని ఈ రైతు ఆత్మకథ మనకు ఉద్బోధిస్తుంది. ఇక్కడ రైతు ఆత్మకథ అంటే మనం తినే ఆహారం యొక్క ఆత్మ కథ అని గుర్తించాలి. కాబట్టి మనం తినే ఆహారాన్ని మనమే పరిరక్షించుకోవాలి.

అన్నం రక్షతి రక్షితః, అన్నదాత రక్షతి రక్షితః,ఓం నమో అన్నదాత !
శత్రువు అనే కవితలో
నీకు శత్రువులెవరూ లేదు
నీకు నువ్వే శత్రువు
మానసిక పరిపక్వత లేని వాళ్ళకు
ఆత్మ శుద్ధి లేని వాళ్ళకు అంతరాత్మే
పెద్దశత్రువు
అవతలి వాణ్ణి సహించలేని వాళ్ళకు అంతా
శత్రుత్వమే!
అసూయతో కృంగిపోయే వాళ్ళకు
శరీరమంతా శత్రుమయమే!

నిజానికి మనిషి తనలోని శత్రువును గుర్తించలేని, తనలోని శత్రువుకు లోబడిన మనషి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ తనలోని శత్రుత్వాన్ని బయట వారికి ఆపా దిస్తూ, బయట వారిపై ప్రదర్శిస్తూవుంటాడు. అలా తనలోని బలహీనతను, అల్పత్వాన్ని గ్రహించలేని మనిషి పరిస్థితిని ఈ కవిత ఎత్తిచూపుతుంది.

కామఏష క్రోధఏష రజోగుణసముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహవైరిణం

- 3.37 భగవద్గీత

ప్రాణుల అనర్థాలన్నింటికీ కారణం ప్రాణిలోని కామం. ఇక్కడ కామం అంటే అవపరానికి మించి కోరుకోవడం. అత్యాశ అని అర్థం. ఈ కామానికి (అత్యాశకు) ఏదైనా అడ్డు తగిలితే అది క్రోధంగా మారుతుంది. ఇదే లోభానికి మదమాత్సర్యానికి కారణమౌతుంది. ఈ అత్యాశే ప్రాణు లను ప్రేరేపించి పాపం చెయ్యిస్తుంది. కనుక నీలోని అత్యాశే నీకు శత్రువని విద్ధి (తెలుసుకో). ఈ అవగాహన ఉన్న రచయిత నీకు శత్రువులెవరూ లేదు నీకు నువ్వే శత్రువు.

నిత్యశత్రువైన ఈ కామమే మనిషిని అనర్థలోకి నెట్టేస్తుంది. ఎదుటి వారిని సహించలేని నీలోని లోభమే నీకు శత్రుత్వం అదే నీ శరీరమంతా పాకిపోయివుంది. కాబట్టి నీశరీరమంతా శత్రుమయిమే అని తేల్చాడు. రచయిత

తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ.
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనం.

- 3.41 భగవద్గీత

మనలోని శత్రువే మన జ్ఞాన విజ్ఞానాలను నశింప జేస్తుందని స్పష్టంగా పేర్కొంది భగవద్గీత. కాబట్టి గీతీ సందేశంతో మాడభూషివారి భాషణంతో మనలోని శత్రువును అంతమొందించే దిశగా మనం అడుగులు వేద్దాం.

తరువాత మరణశాసనం అనే కవితలో

నా మరణానికి ఎవరూ కారకులు కారు.
నా పుట్టుకే కారణం జాతస్య మరణం ధ్రువం. అన్నారు

పుట్టుక అనేదానికి ఖచ్చితంగా గిట్టడం ఉంటుంది. జాతస్య హి ధ్రువో మృత్యుః .....భగవద్గీత 2-27 వశ్లోకం పుట్టినదానికి మరణం ఉంటుంది మరణించిన దానికి పుట్టుక ఉంటుంది మనకు వీటితో సంబంధం లేదు. ఇలాంటి రాకపోకలు గల్గిన వాటిని గురించి శోకించే అర్హత లేదు. అని ధ్రువీకరిస్తాడు. ఎందుకు శోకించే అర్హతలేదు అంటే సృష్టిలోని పుట్టుకకు మరణం ధ్రువీకరించడం జరిగిపోయింది. అందుకు నీవు శోకించడం తగదు ఆ అర్హత నీకు లేదు అని అర్థం చేసుకోవాలి.

ఇందులో నిగూఢంగా దాగి ఉన్న ఆంతర్యాన్ని మనం చూస్తే నేనెవరు అని రమణ మహర్షిలా ప్రశ్నించుకుంటే ఈ దుఃఖం అంతమై నువ్వుగా ఉన్న నిన్ను గుర్తిస్తావు. అది గుర్తించడం నీ బాధ్యత గాని శోకించడం కాదు అందుకు నీకు అర్హత కూడా లేదు. చూశారా ఈ సత్యాన్ని మనం గ్రహించగల్గాలి. లేకపోతే మన జీవితంలో మనం జీవించడం కంటే మృత్యువును చూసి బాధపడటానికే సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. అందుకే అది ధ్రువీకరింబడిన వాస్తవమని తెలిసి జనన మరణాల సంగతిని,భయాన్ని వీడాలి. వీటికి అతీతమై నిత్య సత్యమైన నాలోని "నేను"ను పట్టుకోవాలి. అదే అమృత స్వరూపం. మత్యుచ్ఛాయ కూడా "నేను" దరిదాపుకు రాదు. అది నిజమైన జీవితం. జీవించే జీవశక్తికి జీవం చడమే తెలుసు అదే మన నైజం దానికి మరణం తెలియదు. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని మృత్యువు భయ్యాన్ని బాధను వీడుదాం జీవంతో కూడుకున్న నిత్యసత్యమైన మనలోని 'మనం'ను గుర్తిద్దాం.

రచయిత సమాజాన్ని అన్నీ కోణాల్లో స్పృశిస్తూ తమ కవితలు ఈ సంపుటంలో పొందుపరిచారు. అందులో భాగంగా సమాజ పురోభివృద్ధికి అన్ని రకాలుగా అవ రోధంగా ఉన్న ప్రధానమైన సమస్య కులమతాలు.

కులం కన్నా మలమే గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం!

ఆహారం అందరికీ సమానంగా ఆకలి తీరుస్తున్నప్పుడు ప్రకృతి అందరికీ సమానంగా తన సంపదను అందిస్తున్న ప్పుడు మనిషిలో కులమతాలు అనే కరోనా క్రిమికి మించిన వైరస్, రోగం ఎందుకు మొలకెత్తిందో తెలియదు. కారణాలు ఏదైనా అది ఆమాంతం సమాజాన్ని ఆవహించి సర్వ అనర్థాలకు దారితీస్తున్న పరిస్థితులు మనం మన కళ్ళారా చూస్తున్నాం. అందుకే ఆ వైరస్‌ని తప్పించలేమని అర్థం చేసుకున్న రచయిత ఆ కులమనే వైరస్‌ను మలంతో పోలుస్తూ తన నిరసను ఈ రూపంలో వ్యక్తం చేస్తున్నాడు.

గుర్రం జాషువాలాంటి వారు

కుల మతాలు గీసుకున్న గీతలు చొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిల లోక మెట్లు నిర్ణయించిన గాని
తిరుగు లేదు విశ్వ నరుడ నేను

అంటూ మానవులందరూ ఒక్కటే అని చాటి చెప్పినా చివరకు మళ్ళీ గుర్రం జాషువా నా కులంవాడు నా

మతంవాడు అని మళ్ళీ కుక్కతోక వంకరలాగా కుల మతాల భావవనతోనే, ఆ ఊబిలోనే వెళ్ళి చిక్కుకోవడం గమనార్హం. అందుకే జాషువా విశ్వమానవ గోత్రేయులకు కర్మబంధంబు కట్ట బెట్టి, పులుము చుందురు తలమీద కులమురంగు, తొలగిపోవదు లక్ష సబ్బులకు గూడ అని వాపోయాడు.

వేదాలు ఉపనిషత్తుల నుండి నేటిదాకా ఎందరో మహానుభావులు అంతాఒక్కటే అని ఎలుగెత్తి చాటినా మనిషి కులాన్ని మాత్రం ఛేదించలేని విసర్జించలేని మనిషితనాన్ని మాడభూషి మలంతో పోల్చి కులం కన్నా మలమే మిన్న అని తేల్చి చెప్పారు.ఇంకా మరణంలేని సమాజం కన్నా మానవత్వంలేని సమాజం గొప్పది కాదని మనిషిలో మానవత్వం అంతరించిపోయిన వైనాన్ని ఎత్తి చూపే కవితలు ప్రకృతి పరిరక్షణ దిశగా ఆలోచింపజేసే కవితలు అలాగే మనిషి అర్థంపర్థం లేకుండా అనాలోచితంగా యుద్ధం...యుద్ధం... అంటూ ఉంటారు. అయిన దానికీ కానిదానికీ యుద్ధాలు అంటూ తనతో తాను యుద్ధం చేసి తననుతాను గెలవాలనే అసలైన ధర్మయుద్ధం చెయ్యడాన్ని మరచిన మనిషిని గురించిన కవిత. ఇలా సామాజిక స్పృహను సంతరించుకున్న కవి తనదైన రీతిలో సామాజిక దృష్టితో వెలువరించిన కవితా సంపుటం వికారి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మధురాక్షరాల మృదుభాషి - మాడభూషి

- డాక్టర్ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

మంచితనం ఇంటిపేరు, మానవత్వం అసలుపేరుగా గల నిగర్వి మాడభూషి. మంచిగంధంలాగా పరిమళించే మమకారం ఆయనకు సహజాలంకారం. కష్టాలను, కన్నీళ్లను అల్పాక్షరాల్లోకి ఒదిగించి అనల్పార్థాన్ని సృజించ గల మానవతావాది. భావాలను ఊహల ఉయ్యాలలో ఊపగల భావుకుడు. అక్షరాలతో ఆడుకోవడం, పదాలతో పాడుకోవటం, పదబంధాలతో అనుబంధాలను అక్షర బద్ధం చేయగల సృజనశీలి మాడభూషి సంపత్‌కుమార్ గారు. ఆధునిక కవిత్వం అర్థంకాలేదంటే ఆధునిక జీవితమే అర్థం కాలేదన్న మాట అన్నాడు మహాకవి శ్రీశ్రీ. జీవితం లేకుండ కవిత్వం ఉందా? జీవితమే కవిత్వమా? కవిత్వమే జీవితమా అనే ప్రశ్నలు మనసుకు వేసుకుంటే జీవితం, కవిత్వం అనే రెండు పదాలు మూడక్షరాలతో ముడిపడి పోయిన బంధాల ఆనవాళ్లుగా కన్పిస్తాయి.

"జీవితమొక ఆకాశం
కవిత్వమొక సముద్రం
అందుకోనూలేం
ఈదనూలేం"

పై కవితలో ఆకాశం ఎత్తుని, సముద్రంలోతుని, ఎంత సులభంగా అందుకోనూలేం, ఈదనూలేం అని సహజమైన పదప్రయోగంతో పాఠకులను పరిగెత్తించగల పదాశ్వికుడు మాడభూషి. బోధన, కవిత్వసృజన వృత్తి, ప్రవృత్తిగా గల మాడభూషివారు "జీవితాన్ని అమ్ముకోవడం వృత్తి, కవిత్వాన్ని నమ్ముకోవడం ప్రవృత్తిగా అభివ్యక్తీకరించుకొని 'జీవితం-కవిత్వం' అనే అక్షరసృజనను గ్రంథరూపంలో కవిత్వీకరించారు.

ఎన్నో జీవిత సంఘర్షణలకు లోనైనప్పుడు "జీవితానికి పోరాటం తప్పదు, కవిత్వానికి ఆరాటం తప్పదు జీవితానికి కవిత్వానికి వెటకారం నప్పదు" అని జీవనభాష్యాన్ని ఆవిష్కరించారు. జీవితానికి - కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని "కవిత్వం రాయడానికి ముందు జీవితాన్ని చదవాలి! జీవితాన్ని చదవడానికి ముందు కవిత్వంలో ఎదగాలి!" అని అవిభాజ్యాలుగా స్పష్టం చేశారు. అక్షరాన్ని కూడా వాక్యంగా కవిత్వీకరించగల కూర్పరి, నేర్పరి మనకవి. జీవితమంతా ముళ్ళు! కవిత్వమంతా కళ్ళు! కళ్ళలో ముళ్ళు! ముళ్ళలో కళ్ళు!గా అభివ్యక్తీకరించడంలో అక్షర, పదపటుత్వంతో పాటు లోతైన భావుకత, భావుకతలో వాస్తవికత ప్రతిధ్వనిస్తున్నాయి. కవిత్వంలోనే జీవితపరమార్థాన్ని గ్రహించాలని "కవిత్వాన్ని బతిమాలుకో / జీవితంలో మేలుకో /కవిత్వాన్ని నమ్ముకో/ జీవితాన్ని ఏలుకో అంటారు. వైరాగ్యాన్ని గూడా మనసుకి పట్టించ కొని మనతో అంతా భ్రాంతియేనా అనిపించడంలో మమేకమై

"పాడు జీవితానికి
పాట దొరకదు!
పాట జీవికి
జీవితం దొరకదు!"
జీవితంలో పాడడానికి లేదు!
పాడడానికి జీవితం లేదు!"

అనే వైరాగ్యం వచనంలా నడచి దారి తప్పిన జీవితానికి వెలుగు చూపిస్తుంది. గురిపెట్టిన కవిత్వానికి జీవితం లక్ష్యమై నిలుస్తుంది.

కవిత్వమే నాకు ప్రాణం. నేనే కవిత్వానికి ప్రాణం అన్న భావనలో కవికి కవిత్వమంటే ఎంత ప్రాణమో అభివ్యక్తం చేశాడు.

"నేను
కవిత్వమై మొలుస్తా
జీవితమై నిలుస్తాను

జీవితాన్ని కవిత్వంతో తొలుస్తాను
కవిత్వాన్ని జీవితంతో కొలుస్తాను."

కవిత్వాక్షర బీజాలను నాటి జీవితమై నిలిచి కవిత్వాన్ని జీవితంతో కొలుస్తాను అని

"జీవితమంతా
కవిత్వమే!
కవిత్వమంతా
జీవితమే!
జీవి కవిత్వమంతా
కవిత్వ జీవితమే.
కవిత్వ జీవితమంతా
జీవి కవిత్వమే."

నా జీవితంలో కవిత్వం ఎంతగా మమేకమైందో కేవలం రెండు పదాలతోనే కవిత్వసృజన చేసిన అక్షర బ్రహ్మ సంపత్‌కుమార్ గారు.

పండువెన్నెలను వర్ణించిన కవులున్నారు కాని "పండు వెన్నెల్లో కవిత్వాన్ని ఆరబోసి జీవితమంతా కాపలా కాస్తాను" అన్న కవి సంపత్‌కుమార్ గారొక్కరే. "కవిత్వం జీవితానికి హాయినిస్తుంది! జీవితం కవిత్వానికి ప్రాణ మిస్తుంది" అని ఎన్నిసార్లు జీవితాన్ని, కవిత్వాన్ని గూర్చి చెప్పినా వినూత్నంగా, విభిన్నంగానే కవిత్వానికి జీవితాన్ని ధారబోసినట్లుగా వ్యక్తీకరించారు.

చెప్పవలసిన భావాన్ని అందాల్సినవాళ్ళకి అందినప్పుడు మనసు బరువు తేలికవుతుంది. కవిత్వం, జీవితాల బరువుతేలికల నిష్పత్తిని, సమతూకంగా కవిత్వంలో నిలిపారు.

కవిత్వం బరువయింది
జీవితం తేలికయింది
కవిత్వాన్ని జీవితంలోకి
తర్జుమా చేస్తే
జీవితం బరువుగా సాగుతుంది
కవిత్వం తేలికగా ఎగురుతుంది.

మానవ జీవితం అంటేనే మమతానురాగాలు, బంధాలు, అనుబంధాలు. జీవితపార్శ్వాలను స్పృశిస్తేనే కవిత్వానికి వెలుగు.

"జీవితానికి కవిత్వం నలుగు
కవిత్వానికి జీవితం వెలుగు
కలుగులో వెలుగు కావాలి
వెలుగులో కలుగును వెతకాలి
కవిత్వాన్ని వెలిగించడానికి
జీవితాన్ని రగిలించడానికి
పరస్పరం ఆధారం కావాలి"

జీవితం ఒక ఆట. జీవితం ఒక చదరంగం, జీవితం ఒక పోరాటం అంటాం కాని ఇక్కడ "కవిత్వం ఒక ఉ బలాటం, జీవితం ఒక పెనుగులాట, రెండూ ఆటలు కావు".

జీవితం, కవిత్వం అన్నవి రెండూ రెండు కళ్ళు, కాళ్ళూగా భావించి ఒకటి జీవితాన్ని చదవడానికి, రెండోది కవిత్వంలో సంచరించడానికి అంటారు. జీవన గమనాన్ని కవిత్వంగా నడిపించే శక్తి సంపత్‌కుమార్ గారిలో పుష్కలంగా కనిపిస్తుంది.జీవితం ఖేదం,కవిత్వం మోదం, అంగీకరిస్తే ఆమోదం అని జీవితానికి, కవిత్వానికి ఉన్న భేదం అందరిచేత ఆమోదయోగ్యంలా భాష్యం చెప్పారు.

'అబద్ధానికి జీవితంలో, కవిత్వంలో ఉన్న భేదాన్ని చక్కగా స్పష్టం చేశారు.

"కవిత్వంలో
ఎన్ని అబద్ధాలయినా అందమే!
జీవితంలో
ఒక అబద్ధమయినా అసంబద్ధమే"

వైవిధ్యమేగాని, జీవితానికి, కవిత్వానికి వైరుధ్యం లేదంటారు. జీవిత భాగస్వామిగా కవిత్వాన్ని, కవితా

భోగస్వామిగా జీవితాన్ని చక్కగా రెండింటి అవినాభావ సంబంధాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. "జీవితం పిచ్చివాడి చేతిలో రాయిగా, కాని కవిత్వం రాసేవాడి చేతిలో పరసువేదిగా భావించారు. "జీవితం ఊరేగింపు, కవిత్వం పవ్వళింపు" అని నాలుగు పదాల్లోనే జీవితం, కవిత్వసారాలను స్పష్టం చేశారు. "జీవితంలో నుంచి కవిత్వం, కవిత్వంలో నుంచి జీవితం పిండుకోవడమే పరమార్థం" అంటారు. జీవితానికి పరిష్కారం కవిత్వం కావచ్చు, కవిత్వానికి పురస్కారం జీవితంగా ఉండొచ్చు. కాని పురస్కారమే జీవితమనుకొంటే, కవిత్వానికో నమస్కారం అంటారు. చెప్పదలచుకున్న విషయాన్ని కవి తాత్మకంగా కుండబద్దలుకొట్టినట్లు సరళశైలిలో చిన్న చిన్న పదాలతో పాఠకులకు ప్రత్యక్షమవుతారు.

"ఉత్తరం వంగి
దక్షిణానికి నమస్కరిస్తుంది
దక్షిణం లేచి
ఉత్తరానికి పాదాలు కడుగుతుంది" అని.

కవిత్వం, జీవితం ఉత్తరదక్షిణ ధ్రువాలుగా అభివర్ణించిన వైనం వినూత్నంగా దర్శనమిస్తుంది.

"జీవితం ఎవరికీ గులాంగిరి కాదు!
కవిత్వం ఎవరికీ వంగి సలాం చెయ్యదు !"

నిలువెత్తు కవిత్వంతో జీవితం తలెత్తుకు తిరుగుతుంది అని జీవితం, కవిత్వాల నైజాన్ని ఆవిష్కరించడంలో గుంటూరు శేషేంద్రశర్మగారి శైలి కనిపిస్తుంది. "కవిత్వంతో పైకి వచ్చినవాడు కవి జీవితంలో పైకి వచ్చినవాడు రవి అని రవిగాంచని చోటు కవి గాంచును!" అని కవి, రవిల జీవన గమ్యాన్ని చక్కగా నిర్దేశించారు.

"జీవితం తెరచిన పుస్తకం
కవిత్వం మూసి ఉంచిన జీవితం"

అంటూ ఎన్నో పార్శ్వాలుగా కవిత్వాన్ని, జీవితాన్ని అభివర్ణించిన తీరు, అనూహ్యమైనది. జీవితానికి కవిత్వం దిద్దుబాటయితే కవిత్వానికి జీవితం సర్దుబాటు అంటారు. జీవితానికి సృష్టికర్త బ్రహ్మ అయితే, కవిత్వానికి సృష్టికర్త కవి అని, బ్రహ్మకవి కాలేడుగాని కవిబ్రహ్మ కాగలడు అని శబ్దాలపై అధికారాన్ని చలాయించిన శబ్దబ్రహ్మ మాడభూషి. "చివరకు పోయేది జీవితం... చివరివరకూ మిగిలేది కవిత్వం" ఇలా మధురాక్షరాల మృదుభాషిగా మాడభూషిగారు సాహితీచరిత్రలో నిలిచిపోతారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వికారి' కవిత్వం - ప్రకృతి స్నేహం

- డాక్టర్ సి. చిన్నపాలమ్మ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ,పి.జి. కళాశాల, పుత్తూరు.

"చెరువులో అపార్ట్‌మెంటు కట్టినప్పుడు
చెరువు కడుపులో మట్టిగొట్టినప్పుడు
అది ఎంతగా విలపిస్తుందో
ఎవరికి తెలుసు"

ప్రకృతి దివ్యచైతన్యమైనది.ఆ చైతన్యం నుండి పుట్టిన మానవుడు మాత్రం ప్రకృతి చైతన్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఆవిషయాన్నే ఈ కవితలో రచయిత స్పష్టంగా పేర్కొన్నాడు.

భూమి రాపో నలో వాయుఃఖం మనోబుద్ధి రేవచ ।
అహంకార మితీయంమే భిన్నా ప్రకృతిరష్టధా ॥

- 7.4-భగవద్గీత

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారం అనే 8 అంశాల సముదాయమే ప్రకృతి.

వీటిలో భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు భగవంతుని మహత్తర సృష్టి అని గ్రహించలేని మానవుడు ఈ జగత్తు అంతా కేవలం తన విషయ భోగాలకే ఉందని భావించి, దానికి తానే అధిపతినంటూ విర్రవీగుతూ, ప్రకృతితత్వాన్ని గ్రహించక దానివినాశనానికి పూనుకుంటున్నాడు. పంచమ హాభూతాల్లో ఒకటైన నీరు సర్వప్రాణికోటికి జీవనాధాం ైమైనది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులనే తత్వాలతో విరాజిల్లుతూ, మనిషిలో అంతర్లీనంగా ఉండి మనిషి మనుగడకు ఆధారమై ఉంది. జాహ్నవిగా ప్రసిద్ధిగాంచిన గంగామతల్లి మనిషిలోని సర్వపాపాలను ప్రక్షాళనం చేస్తున్నది. నీరు లేకపోతే ప్రాణికోటి మనుగడ కకావికలై పోతుంది. మనిషి శరీరంలో అధికశాతం నీటితో నిండి వుంటుంది. ప్రాణాన్ని నీటి బుడగతో పోలుస్తారు. మనిషికి బాహ్య,అంతర శుద్ధికి నీరు అత్యంత ఆవశ్యకం. ఒక్క మాటలో చెప్పాలంటే మానవాళి సమస్తజీవనం నీటిపై ఆధారపడివుంది. అలాంటి నీరు నిల్వ ఉండడానికి ఆలవాలములు కుంటలు,చెరువులు,నదులు.

ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే ఈ కుంటలు, వాగులు, వంకలన్నీ జలకళతో కనువిందుచేసేవి. నెలల తరబడి ప్రవహిస్తూవుండేవి.కానీ ఆధునాతననాగరికత అనే ముసుగును అందంగా ఆనందంగా తొడుక్కోవడం మొదలు పెట్టిన ఆధునిక మానవుడి ఆశకు అంతూ, పొంతూ లేకుండా పోయింది. స్వచ్ఛమైన పల్లె ప్రకృతి ఒడిలో జీవించిన ఒకప్పటి మానవుడు పట్నవాసపు హొయలకు మోసపోయి నాగరికతను అడ్డంపెట్టుకొని తాను కూర్చున్న కొమ్మనే నరుక్కున్నచందంగా, తన ఉనికికి తానే ముప్పు తెచ్చుకొంటున్నాడు. శరీరమనే క్షేత్ర మనుగడకు ఆధారభూతమైన నేలతల్లిని దాని సహజ త్వానికి విరుద్ధంగా సమూలంగా ఆక్రమించుకొనే ప్రయత్నంలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలన్నింటినీ మానవుడు తన హస్తగతం చేసుకొంటు న్నాడు. వాటి స్థానాల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల సంస్కృతి వెర్రితలలు వేస్తున్నది. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లను చిరునామాగా మార్చుకున్న మనిషి,మనతోపాటు జీవించే ఇతర ప్రాణకోటి మనుగడకు కూడా ముప్పుతెస్తూ తన ఉనికినే ప్రశ్నార్థకం చేసుకొంటున్నాడు. అందువల్ల ఇప్పుడు చెరువులన్నీ చాలా మటుకు మరుగున పడిపోయాయి. వికారి కవితా సంపుటంలోని "చెరువు శాసనం" ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.ఇందులో "చెట్టుతో పాటు చెరువు కూడా ఏడుస్తున్నదని" చెప్పాడు.

చెరువు గుండెల్లో గునపాలు దించుతుంటే అది నిజంగానే విలపిస్తుందని, మనిషి జల పంచకంలో ఒకటైన 'స్పర్శ' జ్ఞానం అర్థం చేసుకొంటే, అప్పుడు ఆ మనిషికి తెలిసేది కాబోలు. సృష్టిలో ప్రతీదీ జీవచైతన్యంతో కూడు

కొని ఉంటుంది కదా!ఆ స్పర్శ జ్ఞానం తెలియక, ధనసంపాదనే జీవిత లక్ష్యంగా మార్చుకున్న మనిషికి చెరువు ఏడుపు ఎలా వినిపిస్తుంది?

'విశ్వాసంగా ఉన్న చెరువు
కుడిచేతికి, ఎడమచేతికి
నీళ్ళిచ్చి ఆదుకుంది....."

శరీర పోషణకు ఆధారమైనది ఆహారం కదా! చెరువు నీటిని పంటలు పండించుకోవడానికి ఒకవైపు రైతన్న సాగుకు ఉపయోగిస్తూ, ఇంకోవైపు మనిషిలోని మాలిన్యాల్ని పరిశుభ్రం చేస్తోంది చెరువు. మనిషీ, గొడ్డూ గోదా, పిట్టా ఇలా అన్ని జీవరాశులు చెరువునీటిని ఉపయోగించుకొని జీవిస్తున్నాయి. అలా మనిషి జీవితంలో అంతర్లీనంగా ప్రవహించే చెరువుగుండెల్లో గునపాలు దించితే అది శపించకుండా ఉంటుందా !?

"ఇప్పుడు నాలుక పిడచకట్టిన తరువాత
ఇక్కడ చెరువు ఉన్నట్లు గురుతుకొస్తోంది కదూ..."

నీటికొరత తలెత్తి తీవ్రమైన సమస్యగా మారినప్పుడు మనిషికి ఇప్పుడు చెరువు గురించి స్పృహ కలిగితే ఒరిగే ప్రయోజనం శూన్యమే కదా! సంపదలోనే ఆనందాన్ని వెదుక్కొనే మనిషికి అసలైన పరమసంపద ప్రకృతితల్లి అని, ఆ ప్రకృతితల్లిని పరిరక్షించాలన్న ఇంగింతజ్ఞానం కోల్పోయి ఇప్పుడు బాధపడి ప్రయోజనమేమిటని ప్రశ్నిస్తున్నాడు రచయిత.

"చెరువు గట్టు చుట్టూ ఉన్నచెట్లు
ఎవడి గొడ్డలికి బలయ్యాయో....."

నీడనిచ్చి పశుపక్ష్యాదుల్ని తన బాహువుల్లోకి చేర్చుకొని ఆదరించి, అన్ని జీవరాశుల ఆహార పచనానికి ఆధారమైన చెట్టుతల్లిని మనిషి విల్లాలవిలాసభవంతులకు బలిదానంగా ఇచ్చాడు.ఇప్పుడు వర్షాభావం ఏర్పడి గొంతులు తడారిపోతున్నాయని ఎంత మొత్తుకున్నా ఏం ప్రయోజనం!?

ప్రకృతే తన జీవననాదం అని గుర్తెరిగుంటే "ఊరు మునిగి, నోరుఎండి ఉండదు" కదా! ఇప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం ఏమిటి?

అలాగే 'ప్రకృతి' కవితలో

"ఎండ, వాన, చలి, గాలి, నీరు, నిప్పు, ఆకాశం, చెట్టు.....
బావులు, పొలాలు, పంటలు అన్నీ ఒకదానితో ఒకటి
విశ్వాసంగా ఉన్నంత కాలం, నిశ్వాసానికి కొరతలేదు"

అన్నాడు రచయిత. "ఈ మాయమయ జగత్తుకు కారణం పురుషుని (పరమాత్ముని) మాయ అయిన ప్రకృతి కారణం.ఈ ప్రకృతినుండే త్రిగుణాలు (సత్వరజస్తమో గుణాలు) జనించాయి.ఈ త్రిగుణాల నుండి 24 తత్వాలు పుట్టాయి.వీటి నుండి దృశ్యమాన జగత్తు, దేహం, మనసు, బుద్ధి అహంకారం మొదలై నవి పుట్టాయి. త్రిగుణాల ద్వారా ఏర్పడిన దేహేంద్రియాలను ఉపాదిగా చేసుకొని మనిషి సమస్త కర్మలను చేస్తున్నాడు".ఇలా ప్రకృతినుండి పుట్టిన త్రిగుణాల ద్వారా ఈ సమస్త జీవకోట ఉద్భవించింది. ఆ త్రిగుణాలతోనే మనిషి విరాజిల్లు తున్నాడు. అయితే తన తత్వాన్ని నిర్ణయించి నిర్దేశించే మూల హేతువుల (త్రిగుణాల) స్వరూప స్వభావాన్ని ఎరుకలోకి తెచ్చుకోలేకపోతున్నాడు. మానవుడు తన అసలు తత్వాన్ని మరుగున పరచుకొని ప్రకృతిపట్ల వికృతిగా మారినాడు. అందుకే ఇప్పుడు గాలి కూడా విషమైంది. ఆకాశమే నాకు హద్దు అని విర్రవీగిన మానవుడు కరోనా అనే చిన్న క్రిమి చేతిలో చిక్కి బిక్కరిస్తున్నాడు. దానికి కారణం తనలో తలెత్తిన వికృత చేష్టలే. కావున ప్రకృతితో సామరస్యం, ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకొని, విశ్వాసంగా ఉంటే మనిషి ఊపిరికి భయం లేదు. లేకుంటే వినాశనం తప్పదు.

"మనిషి అనే ఒకేఒకబొట్టు కాలుష్యంవీటితో
కలిసిప్రకృతి ప్రశార్థకమైంది"

మనిషి తన తత్వాన్ని మార్చుకొని తనంటే ఏమిటో తాను అర్థం చేసుకొని అంతర్ముఖుడై ప్రకృతిని అర్థం చేసుకోవాలి. లేకుంటే జవాబు లేని ప్రశ్నగా మనిషి జీవితం

మిగిలిపోతుంది!. 'గుణపాఠం' అనే కవితలో ఋతువుల ధర్మాన్ని కవి ఇలా వివరించాడు.

"వానా కాలం వస్తుంది
తడిసి ముద్ద చేస్తుంది
ఎండాకాలం వస్తుంది
కాల్చిబూడిద చేస్తుంది....."

కాలానికి అనుగుణంగా ప్రకృతి తన ధర్మాన్ని తాను క్రమం తప్పకుండా నిర్వరిస్తూ ఉంటే.ఆ ప్రకృతి జనిత గుణాలతో పుట్టిన మనిషి మాత్రం, ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాడు. కోరికలకు ప్రాధాన్యం ఇస్తూ, తన సంతోషం చూసుకుంటూ, సర్వమూ కోరికలను తీర్చుకోవడంలోనే దాగివుందన్న అజ్ఞానంతో జన్మాంతం మునిగిపోయి, తీరా చివరిలో జీవితం వృథా అయిందని బాధపడుతున్నాడు. ఇపుడు మేల్కొని ప్రయోజనం ఏమి? దిక్కుతోచని పరిస్థితిలో ముందుకుసాగే మనిషి ఇక ప్రకృతిని చూసి ఏమి నేర్చుకొన్నట్లు?!

"ప్రకృతి నేర్పించడానికే తప్ప
శిక్షించడానికి లేదు
నువ్వు మరీ మొండికేస్తే తప్ప
బెత్తం పట్టుకొని గుణపాఠాలు నేర్పదు'
ప్రకృతి అన్ని విధాలా
(సునామీలు, భూకంపాలు, ప్రకృతిప్రళయాలు, విలయాలు.....)

మనిషిని హెచ్చరిస్తూనే ఉంటుంది. అయినా మూర్ఖ మానవుడు అర్థం చేసుకోలేదని, మానవ ఉనికిని ప్రశ్నార్థకం లోనికి నెట్టి,కొరడా ఝుళిపిస్తోంది.ఈ సూక్ష్మాన్ని గ్రహించలేక మనిషి ప్రకృతికే ఎదురొడ్డి పోరాడాలను కొంటున్నాడు. అంతేకానీ అర్థం చేసుకోవాడానికి ప్రయత్నించలేకపోతున్నాడు.

ప్రకృతిని పూజిస్తే దీవిస్తుంది, విస్మరిస్తే వినాశనం చేస్తుంది. ప్రకృతి ప్రతి ఒక్కరికీ పరమ పూజ్యం. మన జీవం, జీవనం సమస్తమూ ప్రకృతి ప్రసాదితాలు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి ప్రకృతి పట్ల విశ్వాసంతో.....

"ఎవరికి నచ్చినట్లు వారుండాలని ఎవరి సుఖం వారిద'ని
మనిషి దగ్గర నేర్చుకున్నట్లున్నాయి,
భూమ్యాకాశాలు ఒద్దిక చెడి, తమకు
నచ్చినవి తాము చేసుకుపోతున్నాయ్,
సుఖమెరుగని సగటు ప్రజ కడుపుల్లో
కార్చిచ్చు పెడుతున్నాయ్.
చేతికందింది నోటి కందడం లేదు
నోటికందింది గూటినాపడం లేదు
ఏది ఆపుతుందో ఏ నిసర్గరూపు
మాపుతుందో తెలియదు
నిలిచిన్నాళ్ళు పుటక
నిలిపిన్నాళ్ళు పుడమి

- సర్వేజనా సుఖినోభవంతు.

❖ ❖ ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవితసత్యాలు - కవితాతత్వాలు

- డాక్టర్ ఎ. రవీంద్రబాబు, సహ ఆచార్యులు (అతిథి అధ్యాపకులు), తెలుగు విభాగం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

జీవితానిది కవిత్వానిది తార్కిక బంధం. తాత్విక సంబంధం. సాహిత్యం మానవ జీవన వాస్తవాన్ని కళాత్మకంగా ప్రతిబింబిస్తుంది. ఆ కళాత్మకతలో కవిత్వానిది మొదటి మెట్టు. ఆవేశం, బాధ, ఆనందం లాంటి మనఃప్రమేయాలన్నీ కళాత్మకంగానే వ్యక్తమవుతాయి. ఆ వ్యక్తంలో, అవ్యక్తంలో కవిత్వం అగ్రగామి. జీవితాన్ని తార్కికతతో తూచినా, సంఘర్షణ నుంచి బయటపడేసినా, ఆత్మతృప్తి కలిగించినా, దుఃఖం నుంచి విముక్తి చేసినా, సౌందర్యంతో నింపినా కవిత్వమే దాని పరమావధి. ప్రయోజనకారి. అందుకే ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కవిత్వానిది ఎప్పుడూ మొదటిస్థానమే. అలాంటి కవిత్వం జీవితానికి దిశా నిర్దేశం చేస్తుంది. జీవితం నుంచి ఉద్భవించి, జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. జీవితాన్ని కవిత్వమయం చేయడం, కవిత్వాన్ని జీవితంలోంచి వెలికితీసి కళాత్మకత అద్దడం అందరికీ చేతనయ్యే పనికాదు. అందుకే కవిని క్రాంతదర్శి అన్నారు లాక్షణికులు. జీవిత సత్యాలను వెలికితీసి, జీవితాన్ని చక్కదిద్దే కవిత్వాన్ని, కవికి.. కవిత్వానికి ఉన్న సంబంధాన్ని విమర్శకులు, కళాతాత్వికులు, కవులు, తత్వవేత్తలు, సామాజికవేత్తలు... అనేకవిధాలుగా నిర్వచించారు. కావ్యం కీర్తి ఇస్తుందని, కావ్యం డబ్బు చేకూరుస్తుందని, ఒకే వాక్యం రమణీయంగా ఉంటే కవిత్వం అయిపోతుందని, వ్యంగ్యమైన వాక్యం కవిత్వమని, అలాంకారాలు ప్రధానమని, ధ్వనే ముఖ్యమని ఎందరో ఎన్నో రకాలుగా కవిత్వతత్వాన్ని పట్టుకోవాలని ప్రయత్నం చేశారు. మరికొందరు సౌందర్యం కంటే కవిత్వంలో ప్రతిఫలించే జీవనాంశాలు ముఖ్యమన్నారు. సామాజిక ఆర్థిక కోణాలను సామాన్యుల పక్షం నుంచి వ్యక్తం చేసేదే కవిత్వమన్నారు. కవిత్వం రూపం, వస్తువుగా విడివడినా, రెండింటి మధ్య గతితార్కిక బంధం బలంగా ఉందన్నారు. జీవితమే కవిత్వం, కవిత్వమే జీవితం. వీటిని సౌందర్యాత్మక దృష్టితో అల్లడమే కవితా స్వభావం. లక్షణ స్వరూపం అన్నది మాత్రం అందరూ అంగీకరించే సార్వకాలిక నిజం.

కవిత్వానికి జీవితానికి ఉన్న బంధాన్ని కవిత్వమయం చేసే ప్రయత్నం చేశారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. జీవనలోతుల్లోంచి కవిత్వలోతులను తరచి చూశారు. కవిత్వ విమర్శ, భాషాశాస్త్రాంశాలపై అవగాహన, జీవన విలువలు, సామాజికాంశాల పరిశీలన... అన్నింటిని కలిపి "జీవితం - కవిత్వం" అంటూ 108 కవితా ముక్తకాలను పాఠకలోకానికి అందించారు. ఇవి కేవలం ముక్తకాలు మాత్రే కాదు, విమర్శకులకు, పరిశోధకులకు, సామాజికవేత్తలకు, సాహిత్య ప్రేమికులకు సరికొత్త పరిమళ పుష్పాలు. ప్రతి ముక్తకం విద్యుల్లతలా మెరుస్తుంది. ఇంద్రధనుస్సులా వెలుగుతుంది. అవలోకిస్తే కవిత్వ రహస్యాలను, జీవిత తత్వాలతో ముడిపెట్టి అందిస్తుందీ పుస్తకం.

కవిత్వం రాయడమంటే అక్షరాలను పదాలుగా, ఆ పదాలను వాక్యాలుగా మార్చడం కాదు. ఆ అక్షరాల వెనుక జీవితం ఉండాలి. ఆ జీవితంలోని అనేకానేక సంఘటనలు, సన్నివేశాలు, సంఘర్షణలు, బాధాతప్త క్షణాలు ఉండాలి. ఆ అనుభవాల అనుభూతుల లోతుల్లోంచి కవిత్వం జనించాలి. జీవితం అంటే ఏమిటో తెలికుండా కవిత్వం జోలికి వెళ్లకూడదు. వెళ్తే కవిత్వం సాధారణ వాక్యమై తేలిపోతుంది. వెక్కిరిస్తుంది. బాధపడుతుంది. అందుకే సంపత్ కుమార్

"కవిత్వం రాయడానికి ముందు
జీవితాన్ని చదవాలి!
జీవితాన్ని చదవడానికి ముందు
కవిత్వంలో ఎదగాలి!"

అన్నారు. అంతేకాదు జీవితం లేని కవిత్వం ఉండదని నిజాయితీగా తేల్చి చెప్పేశారు. కవిత్వం పాలిమేరల్లో నీడల్లా కాకుండా పంటలా కవిత్వం పండాలి. మనిషి అంతఃచైతన్యంలోంచి కవిత్వాన్ని వెలికితీ సేటప్పుడు, ఈ లోకాన్ని కాదని, కవి తనదైన మనో లోకంలో సంచరించేటప్పుడు కవిత్వం జీవితాన్ని దర్శి స్తుంది. ఇదే విషయాన్ని చెప్తూ సంపత్ కుమార్..

"జీవితాన్ని విడిచిపెట్టి
కవిత్వం ఎలా రాస్తావ్?
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా దాస్తావ్?"

అంటూ కవిత్వం జనించే అథోమనోనేత్ర పరిచర్యను అభివర్ణించాడు. అది అందరికీ సాధ్యమయ్యే, సాధించే క్రియ కాదు. కవి చేసే ''అంతర్, బహిర్ యుద్ధారావం'' అన్నాడు చలం. ఆ యుద్ధంలోంచి నిజమైన కవిత్వం ఆకృతి దాలుస్తుంది. దాని రహస్యాన్ని పట్టుకోవడం అంత తేలికేం కాదు. అందుకే జీవితాన్ని ఎలా సంపూర్ణంగా నిర్వచించలేమో, కవిత్వాన్ని నిరూపించి, నిక్కర్షగా లక్షణాలను చెప్పలేం అంటారు సంపత్ కుమార్. ఈ తాత్వికమైన జీవిత, కవిత్వ అనులోమ, విలోమ బంధాన్ని వివరిస్తూ..

"దేహికి / ప్రాణికి ఉన్న బంధాన్ని
కవికి / కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని
సంకలించడనికి / పుస్తకం చాలదు
జీవిలాగే / జీవితం లాగే"

జీవితాన్ని కవిత్వం చేయడం, కవిత్వాన్ని జీవితం చేయడం అంత సులభమైన పనేంకాదు. ఒకవేళ చేయాలన్నా కవులందరికీ పరిపూర్ణంగా సాధ్యమయ్యేది కాదు. చేయలన్నా పేజీలు, పుస్తకాలు చాలవు. అదో అధఃభౌతిక చర్య. పురాగాథల నుంచి నేటి వచన కవిత్వం వరకు అంతుచిక్కని చిదంబర రహస్యం.

కవిత్వం జీవితానికి పహరా కాస్తుంది. జీవితానికి చేయూతనిచ్చి పైకిలేపుతుంది. తప్పుఒప్పులను తూచి విలువల వైపు నడిపిస్తుంది. లక్ష్యాన్ని నిర్దేశించి అటువైపు వేలుపట్టి నడిపిస్తుంది. బాధలోంచి సంతోషం వైపు ఎలా వెళ్లాలో నేర్పుతుంది. అనేకానేక సందిగ్ధ సమరాల్లో మనసుకు దారి చూపుతుంది. వైరుధ్యాల్ని, వైవిధ్యాల్ని, చిక్కుముళ్లను విప్పి వాస్తవికమైన కళాత్మక దృష్టిని మనలో నింపుతుంది. అలాంటి కవిత్వాన్ని రాయటం అంటే జీవితాన్ని కాచివడపోయాలి. లోలోపలికి తవ్వుకొని అంత స్సత్యాలను వెలికితీయాలి. సమూహంలోంచి ఒంటరిని, ఒంటరిలోంచి సమూహాన్ని దర్శించగలగాలి. ఈ కవి ఆలాంటి కవిత్వాన్ని రాయ డానికే తనను తాను పూర్తిగా ధారబోస్తానంటున్నాడు.

"పండువెన్నెల్లో
కవిత్వాన్ని ఆరబోసి
జీవితమంతా కాపలా కాస్తాను
జీవితానికి పండువెన్నెల్ని
ఆసరా చేస్తాను!
కవిత్వానికి జీవితాన్ని ధారబోస్తాను" ఇలా..

ప్రతి ముక్తకాన్ని జీవితం తాలూకు తనకున్న అనుభవంతో, కవిత్వ టెక్నిక్‌తో నింపే ప్రయత్నం చేశాడు ఈ కవి. కవిత్వంలోని ప్రతి వాక్యాన్ని జీవితానికి వెలుగునిచ్చే బావుటాగా భావించాడు. మనిషిలో చైతన్యాన్ని నింపి లక్ష్యం వైపు నడిపే శరంలా ఊహించాడు.

"దారితప్పిన జీవితానికి
కవిత్వం వెలుగు చూపిస్తుంది
గురిపెట్టిన కవిత్వానికి
జీవితం లక్ష్యమై నిలుస్తుంది"

అని నేటి అత్యాధునిక విమర్శకులు చెప్పే కవిత్వం ప్రయోజనాన్ని చిన్న ముక్తకంలో ఇమిడ్చాడు సంపత్ కుమార్. ప్రాచీన లాక్షణికులు కవిత్వ ప్రయోజనం ఆనందం అంటే ఆధునిక విమర్శకులు సాహిత్య

ప్రయోజనం సమాజహితం అన్నారు. ఆ సమాజంలోని మనుషులను ఉన్నతమైన విలువలతో నింపి, అభ్యుదయం వైపు నడిపడమే నిజమైన కవిత్వ స్వభావం అని చాటాడు.

జీవితానికి కవిత్వానికి ఉన్న సంబంధాన్ని వాటి పుట్టుకనుంచి కూడా విశ్లేషించాడు సంపత్ కుమార్. కవిత్వం పైపై ఉద్వేగాల్లోంచి వచ్చేది కాదు. అంతరంగాన్ని మధించి, హృదయాన్ని మండించి, బతుకును రగిలించి రాసేదే కవిత్వం. అలాగే మనిషి చనిపోయిన తర్వాత పాంచభౌతిక శరీరం గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి అనే పంచభూతాల్లోకి చేరిపోతుంది. ఈ రెండింటి ఆత్మతత్వాన్ని కవిత్వీకరించాడు సంపత్ కుమార్ కేవలం రెండు వాక్యాల్లోనే...

"అంతరాంతరాల్లోనుంచి
ఉబికేది కవిత్వం
అనంత వాయువుల్లోకి
దూకేది జీవితం"

ఆధునిక జీవితంలో మనిషి డబ్బు, హోదా, ఆస్తే సర్వస్వంగా బతుకుతున్నాడు. తనను తాను మర్చి పోతున్నాడు. జీవితాన్ని ఆనందించడం లేదు. సమాజాన్ని అర్థం చేసుకోవడం లేదు. తోటి మనుషుల గురించి పట్టించుకోవడం లేదు. స్వార్థంతో నా, నేను అనే మితి మీరిని ఆత్మాధిక్యతాభావంతో జీవిస్తున్నాడు. అలాంటి వాళ్లకు కవిత్వం అంటే, జీవితం అంటే ఏమిటో తెలియ కుండా పోతుంది. ఎందుకు జీవిస్తున్నాం? జీవిత పరమావధి ఏమిటి? ఆనందాన్ని ఎలా పొందాలి? కవిత్వం చదవడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? లాంటి వాటి గురించి ఆలోచించడం లేదు. కవి అలాంటి వాళ్ల గురించి చిన్న ముక్తకంలో..

"కవిత్వం, జీవితం
ఎరుగకుండానే
గడిపేస్తున్నాడు!" అని బాధపడతాడు.

మరో కవితలో జీవితం అంటే ఒకరికి తలొంచి బతకడం కాదు, ఒకరి చెప్పుచేతల్లో ఉండటం కాదు, తలెత్తుకు తిరగడం, తనదైన వ్యక్తిత్వంతో తనదైన మార్గంలో ముందుకెళ్లడం అంటాడు. అలాగే కవిత్వం కూడా పొగడ్తలకు, చప్పట్లకు లొంగదని చెప్తాడు. నిజమైన కవిత్వం బతుకుపుటల్ని చించుకొని దానికదే వస్తుంది తప్ప, మరొకరికి ఊడిగం చేయదని వర్ణించాడు. జీవితం, కవిత్వం అనేవి మనిషిని సమాజంలో వ్యక్తిగా, వైయక్తికంగా తలెత్తుకు నిలబెడేలా చేస్తాయని వెల్లడించాడు.

"జీవితం
ఎవరికీ గులాంగిరీ కాదు!
కవిత్వం ఎవరికీ వంగి సలాం చెయ్యదు!
నిలువెత్తు కవిత్వంలో
జీవితం తలెత్తుకు తిరుగుతుంది!"

అని జీవితం గొప్పతనాన్ని, కవిత్వ హోదాను అద్భుతంగా వర్ణించాడు కవి.

సంపత్ కుమార్ స్వయంగా అధ్యాపకులు కావడం చేత, బోధనానుభవం చేత లోకంలోని వస్తువు కవిత్వంగా మారేటప్పుడు జరిగే టెక్నిక్స్ మీద అవగాహన, పట్టు ఉంది. వస్తు రూప సంబంధాల్లోని కవిత్వీకరణ పద్ధతులను అలవోకగా ఈ కవితల్లో చెప్పాడు. శిల్ప రహస్యాలను పదచిత్రాలుగా వ్యక్తీకరించాడు. కవిత్వ గాఢతలోని నిబద్ధతను తేలిగ్గా వర్ణించాడు. వర్ణిస్తూ జీవితానికి సమన్వయించాడు. "కవిత్వం ఒక ఆల్కెమీ" అన్నాడు తిలక్. సంపత్ కుమార్...

"జీవితం
తెరచిన పుస్తకం!
కవిత్వం
మూసి ఉంచిన పుస్తకం!"

అన్నాడు. జీవితాన్ని కవిత్వం చేసేటప్పుడు కవిత్వ రహస్యాల్లో జీవితం అంతర్గతంగా ఇమిడిపోతుంది. అందరికీ అర్థంకాదు. శిల్పంలోని వెలుగును చూసినప్పుడే

కవిత్వం, అందులోని జీవితం అర్థమవుతుంది. అందుకే కవిత్వం ఎప్పుడూ మూసి ఉంచిన పుస్తకమే. దాన్ని తెరిచే శక్తి ఉన్నవారికే అందులోని జీవితం దొరుకుతుంది. పైకి జీవితం మామూలుగానే కనిపించినా, అది కవిత్వంగా మారితే పుటల మధ్య అందంగా దాక్కొని పాఠకులతో దోబూచులాడుతుందన్నాడు ఈ కవి. "కవిత్వమొక తీరని దాహం" అన్నాడు శ్రీశ్రీ. సంపత్ కుమార్..

"కవిత్వమొక ఆరని దీపం
జీవితమొక తీరని దాహం"

అన్నాడు. ఈ కవితా పంక్తుల్లోని ఐరనీలో మనిషిలోని చావని ఆశ, కవిత్వం జీవితానికి వెలుగునిచ్చే దీపం కనిపిస్తున్నాయి. మనిషి తీరని కోర్కెల వల. కవిత్వం ప్రపంచం ఉన్నంతవరకు సమాజానికి వెలుగుచూపే గవాక్షం. అంతేకాదు జీవితంలోని ప్రతిక్షణాన్ని అనుభూతి చెందే స్వభావం ఉండాలే కానీ దాన్ని కవిత్వం చేయొచ్చు. ఆనందాన్ని పొందొచ్చు. దుఃఖాన్ని అధిగమించొచ్చు. అలాగే కవిత్వాన్ని చదివి అనుభూతి చెంది, జీవితానికి అన్వయించుకొని, తనను తాను చైతన్యం చేసుకునే గుణం ఉంటే సంతోషంగా బతకొచ్చు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటొచ్చు. మనసుకు స్వచ్ఛతను ఆపాదించే గొప్పగుణం ఉంటే, శిలలాంటి బతుకును కూడా కవిత్వంతో శిల్పంగా మార్చుకోవచ్చు అంటాడు సంపత్ కుమార్.

"జీవితం శిల
కవిత్వం శిల్పం"

అని జీవితానికి, కవిత్వానికి ఉన్న మార్మికమైన కళాత్మక సంబంధాన్ని రెండు పంక్తుల్లో వ్యక్తీకరించాడు.

సంపత్ కుమార్ "జీవితం - కవిత్వం" కవితా సంపుటిలో అటు జీవిత రహస్యాలను చెప్తూనే, దాన్ని కవితామయం చేశాడు. జీవితానికి, కవిత్వానికి ఉన్న బంధాన్ని కొన్ని చోట్ల తార్కికంగా, మరికొన్ని చోట్ల సాధారణంగా, ఇంకొన్ని చోట్ల శిల్పరహస్యాలతో, ఇంకా కవిత్వ ప్రయోజనాలను వివరిస్తూ, వర్తమాన మనిషి అనిబద్ధ చట్రాన్ని బద్ధలుకొడుతూ, అభ్యుదయ మార్గాన్ని చూపుతూ, వర్తమానానికి అవసరమైన తాత్వికభావనలను నిర్దేశిస్తూ, నిష్కర్షగా, నిజాయితీగా వర్ణించాడు ఈ కవి. శీర్షిక పరిధిలో అటు ప్రాచీన, ఆధునిక అలంకారిక శాస్త్రాలను, ఇటు మనోవికాస సామాజిక శాస్త్రాలను అద్భుతంగా కవిత్వీకరించాడు. అక్కడక్కడా కవిత్వం వచనమై తేలిపోయినా, బలమైన అభివ్యక్తులు కొరవడినా ఆచార్య సంపత్ కుమార్ కృషికి, విజ్ఞతకు, సమాజ పరిశీలనకు, సాహిత్యాధ్యయనానికి, కవితాశక్తికి ఈ పుస్తకం ఓ నిండైన ఉదాహరణ. సూక్ష్మ పరిశోధనకు అంగీకారమైన పుస్తకం.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వం - వస్తు వైవిధ్యం

- దోర్నాదుల సిద్ధార్థ , పలమనేరు.

కవిత్వం అనేది అక్షర రూపం దాల్చిన ఒక ఊహ, కళాత్మక వ్యక్తీకరణ, కవిత్వమంటే క్లుప్తంగా, గుప్తంగా, ప్రతీకాత్మకంగా, సంక్లిష్టంగా, ధ్వన్యాత్మకంగా, అమూర్త భావాలతో, భిన్న పొరలతో కూడుకొని ఉంటుంది. కవి తన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి ఆలోచిస్తాడు. తన ఊహలలో అనేక భావనలు తన అనుభవాలలోంచి ఏర్పడతాయి. వాటిని కవిత్వీకరిస్తాడు.

కవిత్వంలో ఏమి చెప్పాలి? ఎలా చెప్పాలి? అనేవి రెండు ముఖ్యమైన అంశాలు. ఏం చెప్పాలనేది కవి స్వేచ్ఛకు, జీవితంపై అవగాహనకు సంబంధించింది. ఇక్కడ కవి ఏం చెప్పాలని అనుకుంటాడో అది వస్తువు అయితే, వస్తువును గురించి చెప్పే విధానం శిల్పం. ఒక కవి యొక్క ఏ ఒక్క కవితనోగాక, మొత్తం అతని సాహిత్యాన్ని పరిశీలించినపుడు వస్తు వైవిధ్యం బయట పడుతుంది. విస్తృతమైన వస్తు వైవిధ్యంతో రాసారంటే ఆ కవికి జీవితం పట్ల లోతైన అవగాహన, ప్రపంచంపై నిశిత దృష్టి ఉందని అర్థం చేసుకోవచ్చు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులు అయిన శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు పరిశోధకులు, విమర్శకులు, రచయిత మరియు కవి. ఆయన అనేక వ్యాస సంపుటాలు, పరిశోధక గ్రంథాలు, అనువాదాలతో పాటు ఏడు కవితా సంపుటాలు వెలువరించారు. జీవితం-కవిత్వం (2013), శత్రువుతో ప్రయాణం (2015), ఆలోచనలు (2015), చివరకు నువ్వే గెలుస్తావు (2016), మాడో మనిషి (2017), వికారి (2019) మొదటి అబద్దం (2020). ఇందులో మొదటి అబద్దం, జీవితం - కవిత్వం అనేవి దీర్ఘకవిత్వ రూపంలో ఉంటాయి. ఆలోచనలు అనేవి పూర్తిగా కవిత్వమని చెప్పలేము. ఆయన ఆలోచనలు మినీ కవితలుగా వ్యక్తీకరించారు. ఇక పూర్తిస్థాయి వచన కవిత్వంగా వెలువడిన పుస్తకాలు, శత్రువుతో ప్రయాణం చివరకు నువ్వే గెలుస్తావు, ముడో మనిషి, వికారి.

మాడభూషి గారు ప్రస్తుతం ఆచార్యులుగా పని చేస్తున్నప్పటికీ, పూర్వాశ్రములో హైదరాబాదులో 12 ఏళ్ళ పాటు పాత్రికేయులుగా పనిచేశారు. లోకాన్ని విస్తృతంగా చదివారు. ఆ లోకానుభవం వలన కావచ్చు ఆయన కవిత్వంలో వస్తు వైవిధ్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఆయన కవిత్వంలో భిన్నవాదాలు, విభాగాలకు చెందిన అనేక వస్తువులు కనిపిస్తాయి. అంతేకాక ఆయన ఆ వస్తువులను చాలా లోతుగా విశ్లేషిస్తాడు. కొత్త డైమన్షన్‌లో ఆ వస్తువును మనకు పరిచయం చేస్తాడు. అభ్యుదయ వాదం, భావ కవిత్వం, స్త్రీవాదం, ప్రపంచీకరణ, తాత్వికత అనేవి ఆయన కవిత్వంలో ప్రముఖంగా కనిపిస్తాయి.

భావ కవిత్వం - వస్తు వైవిధ్యం :

వచన కవిత్వం ప్రారంభమయినది భావకవిత్వం నుంచే అని చెప్పవచ్చు. ప్రాచీన పద్యాల నుంచి ఆధునిక ఖండ కావ్యాలలోకి ప్రయాణించేటప్పుడు ఈ కవిత్వం ఎక్కువగా చెప్పబడింది. భావ కవిత్వంలో ప్రధానంగా ప్రకృతి పరిశీలన, ఆరాధన, వర్ణన, బంధాలు, ప్రేమలు, మోహాలు, స్మృతి కవిత్వం కనిపిస్తాయి. 21వ శతాబ్దంలో భావకవిత్వం ఉధృతి తగ్గినప్పటికి కవిత్వం వెలువడుతూనే ఉంది. మాడ భూషి గారి కవిత్వంలో ప్రకృతి పరిశీలన, ఆరాధన స్పష్టంగా కనిపిస్తాయి. చివరకు నువ్వే గెలుస్తావు సంపుటిలో "భూమ్యాకాశాలు" అనే కవితలో అందమైన వర్ణన మనకు కనిపిస్తుంది.

ఆకాశం
తన మొహాన్ని సముద్రంలో చూసుకుంటుంది.
(భూమ్యాకాశాలు - చివరకు నువ్వే గెలుస్తావు)

ఇదే సంపుటిలోని మరో కవిత "భూమి"లో

భూమి మట్టి గొట్టుకొని
అందంగా కనిపిస్తోంది
ఆకాశం వానకు తడిసి
బురద పూసుకొన్నట్టుంది ....

(భూమి - చివరకు నువ్వే గెలుస్తావు)

మన జీవితంలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించేది అమ్మ, నాన్న. వీరిని గురించి రాయని కవి ఉండరేమో. సార్వజనీనమైన అమ్మతనాన్ని నిర్వచిస్తూ మాడభూషి గారు రాసిన అమ్మ కవితలో

పగలంతా చెట్టు నీడలా ఉన్న అమ్మ
రాత్రిళ్ళు ఇంట్లో దీపంలా ఉంటుంది

(అమ్మ - చివరకు నువ్వే గెలుస్తావు)

అంటూ ఇంటికి ఆధారం, నీడ, వెలుగు మొత్తం అమ్మే అంటారు. అంతే కాకుండా కవిత చివరలో అమ్మ మరణించిన తరువాత అమ్మలానే పుడుతుందని చెబుతారు.

భావ కవిత్వంలో మరో ముఖ్యమైన కవితా వస్తువు స్మృతి. మనకు కావలసిన వారినో మనం ఆరాధించే వారినో కోల్పోయినప్పుడు మనలోని ఉద్వేగాలు ఈ కవిత్వంలో కనిపిస్తాయి. మాడభూషి గారు "నాన్న" అనే కవితలో

చెమట ముక్కల్ని
నీటి చుక్కల్ని చేసి
పిడచ కట్టిన పిల్లల
నాల్కలపై పోస్తాడు

(శత్రువుతో ప్రయాణం)

అంటూ తన తండ్రిని తలుచుకుంటూనే నాన్నతనాన్ని పరిచయం చేస్తాడు. "అఖండ జ్యోతి" అనే కవితలో డా. అబ్దుల్ కలాం గారిని తలుచుకుంటూ.

భూగోళంలో అజాత శత్రువు
ఖగోళంలో విజేత మిత్రువా
మరణించి జీవించిన వాడా

(అఖండ జ్యోతి - చివరకు నువ్వే గెలుస్తావు)

అంటూ కలాం గారి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాడు. "మూడో మనిషి" కవితా సంపుటిలో "లెనిన్" గురించి తలుచుకుంటూ కవిత రాసాడు. మొత్తంగా చూసినప్పుడు ప్రకృతి ప్రేమికుడు మాడభూషి గారిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈయన గాలి, ఆకు, సముద్రం, ఆకాశం, చెరువు, చెట్టు, సాయంత్రం, ప్రేమ, ఉగాది, అక్షరాలు, కవిత్వం, చిరునవ్వు ఇలా అన్నింటిని కవితామయం చేసేశారు.

అభ్యుదయం - వస్తు వైవిధ్యం :

కవి ప్రధానంగా సమాజం యొక్క శ్రేయస్సును కోరుకుంటాడు. కళ కళ కోసమే అనే వారు, కళ సమాజం కోసం అనే వారు ప్రధానంగా కనిపిస్తున్నప్పటికీ అనేక మంది కవుల మనోగతం కవిత్వం సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తూ, సమాజంలో మార్పుని కోరుకుంటూ ఉంటుందని. అభ్యుదయ కవిత్వంలో దేశభక్తి, శ్రామిక శక్తి, ప్రజాస్వామ్యం, ప్రజల మధ్య భేదాలు తొలగి సమ సమాజం, నవసమాజం ఏర్పడాలని ఆశిస్తారు. మాడభూషి గారి కవిత్వంలో అభ్యుదయం విస్పష్టంగా కనిపిస్తూ, సూటిగా, మన ఆలోచనలు మరోస్థాయికి తీసుకెళ్ళేలా ఉంటాయి.

మనిషిపై నమ్మకం :

అభ్యుదయంలో మూఢనమ్మకాల నిరసన ఉంటుంది. సాటి మనుషులపై ప్రేమ, నమ్మకం కలిగి వుండాలని చెబుతుంది. అలాంటి ఒక అద్భుతమైన కవిత "భిక్షగాడు" కవిత చిన్నదిగా ఉన్నా లోతైన భావనతో కవిత్వంలో ఎప్పటికీ నిలిచిపోయే మాటలుగా ఉంటాయి.

నాకు
దేవుడి మీద కన్నా
మనిషి మీదే
ఎక్కువ నమ్మకం
అందుకే
గుడి బయట అడుక్కుంటాను

(భిక్షగాడు - వికారి)

మనమంతా రాయిలో దేవుడిని చూస్తూ గుడి లోపల అడుక్కుంటాము. కానీ వాడికి సాటి మనిషిపై నమ్మకం అందుకే బయట అడుక్కుంటాడు.

దేశభక్తి :

"జెండా" అనే కవితలో దేశభక్తిని చక్కగా ఆవిష్కరించారు.

ఒక గుడ్డముక్క
ఒక కొయ్య ముక్క
కొంచెం దేశభక్తి
కలిపి కడితే
నిలువెత్తు జెండా అవుతుంది
(జెండా - చివరకు నువ్వే తెలుస్తావు)

సమ సమాజం :

ప్రజాస్వామ్యయుత దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజలకు చెరడం లేదని బాధపడుతూ "రాజ్యాధికారం" అనే కవితలో

మనం ఎప్పుడూ అసమ
సమాజం వైపే పయనిస్తూ ఉంటాం
పట్టాల్లా ప్రవహిస్తూ ఉండడం తప్ప
జంక్షన్‌కు చేరనే చేరరు
(రాజ్యాధికారం -చివరకు నువ్వే గెలుస్తావు)

అలాగే నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య కులం. దీని గురించి "కులం" అనే కవితలో చెబుతూ మన మలం కన్నా నీచమైనది కులం కానీ దానిని వదిలి పెట్టలేక పోతున్నామని చెబుతారు.

కులం కన్నా
మలమే గొప్ప
మలాన్ని విసర్జించ గలుగుతున్నాం.
(కులం - వికారి)

ఇవే కాక మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా "చివరకు నువ్వే గెలుస్తావు" అంటూ నినదిస్తూ మనలో కొత్త ఊపిరి నింపుతారు.

స్త్రీవాదం - వస్తు వైవిధ్యం :

స్త్రీలు తరతరాలుగా అణగారిన వర్గంగా మారి పోయారు. కులం, మతంతో సంబంధం లేకుండా అంతటా స్త్రీలు హింసకు గురి అవుతున్నారు. స్త్రీ వాద కవయిత్రులు చాలా మంది గొంతెత్తి వారి సమస్యలు చెప్పాక కానీ వారి సమస్యలు, వారి అంత:సంఘర్షణ బయట పడలేదు. మాధభూషి గారు స్త్రీల సమస్యల్ని ప్రస్తావిస్తూ వారిని మేల్కొలిపేలా కొన్ని కవితలు రాశారు. వికారి అనే కవితా సంపుటిలో ప్రధానంగా నోరు తెరవండి, కుక్కలుంటాయి జాగ్రత్త, అనే కవితలలోను, శత్రువుతో ప్రయాణం అనే సంపుటిలో "మగాడు, ఆమె" అనే కవితలలో కనిపిస్తాయి.

ఇకనైనా
నోరు తెరచి మాట్లాడండమ్మా
వేల సంవత్సరాల నుంచి
మౌనంగా ఉంచిన నోరు
అగ్ని గుండాన్ని కొంచెం రగలనివ్వండి.
(నోరు తెరవండి - వికారి)

అంటూ నోరు తెరిస్తే మీ అవమానాలు తప్పుతాయి అని చెబుతారు. "కుక్కలుంటాయి జాగ్రత్త" అనే కవితలో కామంతో కళ్ళు మూసుకుపోయిన మగాళ్ళను కుక్కలతో పోలుస్తూ

చిత్తకార్తె కుక్కలు
చిత్త చాంచల్యంతో తిరుగుతూ వుంటారు
.....
ఋనకావేశంలో
తిరుగుతూ ఉంటారు
జాగ్రత్తగా వళ్ళిరావమ్మా
రోడ్డు మీద కుక్కలుంటాయి. (కుక్కలుంటాయి జాగ్రత్త - వికారి)

ప్రతి స్త్రీ యొక్క సమస్యల్ని ప్రస్తావిస్తూ, వారి ప్రస్తుత స్థితిని వివరిస్తూ మాధభూషి గారు "ఆమె" కవితలో

ఆమె నిఘంటువు నుంచి ఎ నిషేధం
అందుకే
ఎందుకు? ఏమిటి? ఎవరు? ఎలా? ఎప్పుడు? ఎక్కడ
లాంటి ప్రశ్నలు ఆమె నోట్లో రాకూడదని శాసనం.
(ఆమె - శత్రువుతో ప్రయాణం)

నేటి మగవాడి ఆలోచనా తీరు, మగవాడి పట్ల స్త్రీలకున్న అభిప్రాయాన్ని 'మగాడు' అనే కవితలో కుండ బద్దలు కొట్టినట్లు చెబుతారు.

వాడికి / పది తలలు / ఇరవై కళ్ళు
కళ్ళతో పొడుస్తాడు
.....
అంతా వాడిష్టం
ఇతరుల ఇష్టాన్ని గురించి
ఆలోచించడానికి
ఏ తల్లోను మెదడుండదు.
(మగాడు - శత్రువుతో నా ప్రయాణం)

ప్రపంచీకరణ - వస్తు వైవిధ్యం :

ప్రస్తుతం సాహిత్యంలో ముఖ్యంగా వచన కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తున్నది. ప్రపంచీకరణ గ్లోబలైజేషన్ ప్రారంభమయినప్పటి నుండి మనం కోల్పోతున్న మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పాతకాలం వస్తువులు ఇలాంటి వాటిని గుర్తు తెచ్చుకుంటూ ఉంటాము. అలాగే ప్రపంచీకరణ దుష్పరిణామాలైన, అమెరికా ఆధిపత్యం, కాలుష్యం, రైతు ఆత్మహత్యలు, విలువలు కోల్పోవడం, లంచగొండితనం, యుద్ధం, ఇలాంటివన్నీ ఉంటాయి. మాడభూషి గారి కవిత్వంలో ప్రపంచీకరణ పరిణామాలు చాలా కవితలలో కన్పిస్తున్నాయి.

అమెరికా ఆధిపత్యం - నిరసన :

అందరూ అమెరికా భూతల స్వర్గమని భావిస్తూ అక్కడికి పరుగెత్తుతుంటారు. కానీ అక్కడా వర్ణ వివక్ష, దోపిడీ, స్వార్థం ఎక్కువగానే ఉన్నాయని "అమెరికా" అనే కవితలో చెబుతూ...

దూరపు భవనాలు తెలుపు
వైట్ హౌస్ రక్తపు మరకలు
దగ్గరకు వెళితేగానీ కనిపించవు
(అమెరికా - మూడో మనిషి)

"విలువ" అనే మరో కవితలో

నేను మనిషిని
డాలర్‌తో కొలుస్తాను
అతను ఎన్ని ఎంబీలో
తెలుసుకొని మర్యాదిస్తాను
(విలువ - శత్రువుతో ప్రయాణం)

అంటూ ఆధునిక కాలంలో మనిషి మనసుకు కాక, అతని డబ్బుకి, జ్ఞానానికి మాత్రమే విలువిస్తున్నారని చెప్పారు.

నల్లధనం :

ప్రతి మనిషి స్వార్థంతో అందినకాడికి దోచుకుంటున్నాడు. అది తెలియని వాడు పేదవాడు, మధ్యతరగతి వాడు. డీమోనిటైజేషన్ సమయంలో బ్యాంకుల ముందు పేద, మధ్య తరగతి వారు ఇబ్బంది పడ్డారే కానీ నల్లధన కుబేరులు కారని

"నల్ల మొహాలు" అనే కవితలో

రోడ్డు మీద
ఎవణ్ణి చూసినా
నల్లగా కనిపిస్తున్నాడు.

అంటూ అందరూ నల్లధనాన్ని పోగేస్తున్నారని చెబుతూనే ఎన్ని సార్లు ఇలాంటి డీమోనిజేషన్ చేసినా నల్లధనం తగ్గదని ముక్తాయిస్తారు.

కరెన్సీ నోట్లు
రంగులు మార్చుకొని మళ్ళీ
రంగం మీదకి వచ్చాయి
రంగు కాగితాలు
నల్లగా మారడానికి క్షణాలు చాలు.

ఇవేకాక మనిషి స్వార్థంతో చెరువుల్ని, నదుల్ని, అడవుల్ని కబలిస్తూ పోతున్నాడని వాటి పర్యవసానాలే ఇప్పుడు అనుభవిస్తున్నామని "చెరువు శాపం" కవితలో చెబుతారు. రైతు గురించి అనేక కవితలలో ప్రస్తావించారు. కాలుష్యాన్ని గురించి ప్రస్తావిస్తారు.

ఇవే కాక మాడభూషి గారి కవిత్వంలో తాత్వికత అనేది అడుగడుగునా కనిపిస్తుంది. మనిషి, మానవీయ విలువలు, జీవితం గురించి ముఖ్యంగా మరణం గురించి అనేక కవితలలో ప్రస్తావిస్తారు. మానవీయ జీవన ప్రయాణాన్ని, దాని అంతిమ లక్ష్యాన్ని వివరిస్తూ అనేక కవితలున్నాయి.

కవిత్వం, కవిత్వానికి జీవితానికి ఉన్న సంబంధాన్ని వివరిస్తూ "జీవితం - కవిత్వం" అనే కవితా సంపుటినే వెలువరించారు. చాలా తక్కువ మంది కవులు రాసిన కవితా వస్తువు థర్డ్ జెండర్ - మాడభూషి గారు వారిని గురించి " మూడో మనిషి" అనేక కవితలో ఇలా అంటారు.

రెండో మనిషి గురించి
ఆలోచించే తీరికేలేని మనిషికి
మూడో మనిషి గురించిన ఆలోచన ఎక్కడిది
ఇక్కడ
ఆడ బిడ్డ బరువు
మూడో బిడ్డ నిషేదం మూడో మనిషి

మాడభూషి గారి కవిత్వంలో ఇలా వస్తువైవిధ్యం చాలా ఎక్కువ కనిపిస్తుంది. వస్తు వైశాల్యంతో పాటు, వస్తువు యొక్క లోతును కూడా బాగా ఆవిష్కరిస్తారు.

సులభ కవిత్వమే కానీ.... భావసంద్రం!

- కన్నోజు లక్ష్మీకాంతం

కవిత్వం రాసేవాళ్లు చాలామందే ఉంటారు కానీ, పాఠకులకు నచ్చే కవిత్వం కొద్దిమందే రాస్తుంటారు. అలాంటి వాళ్లలో మాడభూషి సంపత్‌కుమార్ ఒకరు. రాశిగాకుండా వాసి గురించి ఆలోచించే ఆయన కవిత్వంలో అంతర్గతంగా శిల్పంతో పాటు సాంద్రత కనిపిస్తుంది. పదాల ఆడంబరంతో మాయచేసే అర్థంకాని 'కవిత్వం' జోలికి పోకుండా సులభశైలిలో 36 కవితలలో ఈ 'శత్రువుతో ప్రయాణం' కవితా సంకలనాన్ని అందించారు. ఇందులో 30ఏళ్ల కిందట రాసిన కవితతో పాటు, కొత్తగా సృజించినవీ ఉన్నాయి. అన్నీ మళ్లీ మళ్లీ చదవాలనిపించేవే. నాన్నను జ్ఞప్తికి తెచ్చుకుంటూ రాసిన 'కత్తి కింద పడకుండానే..' కవిత, నన్నయ నుంచి జాషువా వరకు 16మంది కవిశ్రేష్ఠుల గురించి 'తెలుగు వెలుగులు', అతివ పడే పాట్లు గురించి చెప్పే 'ఆమె' లాంటివన్నీ వేటికవే ప్రత్యేకం. నీటితోపాటు 'భయం, ఇంకని సముద్రం, ఇజాలు మారాయి, మహాకాప్రేడ్' లాంటివీ కవిత్వాన్ని పులుముకుని కనిపిస్తాయి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వం - మానవతావాదం

- డాక్టర్ కె. లక్ష్మణ్, చెన్నై, తమిళనాడు.

ప్రస్తావన :

మాడభూషి సంపత్ కుమార్ అభ్యుదయ కవి. విమర్శకుడు. అనువాదకుడు. బహుభాషాకోవిదుడు. తమిళనాట తెలుగు భాషను నలుదిశలా వ్యాపింప చేయడానికి తనవంతు కృషిచేస్తున్న మరో కృషీవలుడు. ఈయన 15 నవంబర్ 2000 నుంచి 30 జూన్ 2020 వరకు తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడి స్థాయి నుండి శాఖాధ్యక్షులు స్థాయి వరకు పదవీ బాధ్యతలను చేపట్టారు. తెలుగు శాఖకే కాకుండా "ప్రాచ్య భాషా పరిశోధన సంస్థ"కు సంచాలకులుగా మూడు సంవత్సరాలు తన కర్తవ్యాన్ని నిర్వహర్తించారు. ఈ విధంగా మాడభూషి గారు వివిధ పదవుల్లో రాణించారు. మాడభూషి గారికి చిన్న తనం నుండి తెలుగు సాహిత్యం మీద మక్కువ ఎక్కువ. ఆ మక్కువే ఆయనను తెలుగు సాహిత్యాన్ని చదివించింది. అలా తెలుగు సాహిత్యాన్ని చదువుకోవడమే కాకుండా ఎంతో మందికి తెలుగు భాషా, సాహిత్యాల్లో ఉండే పలు అంశాలను గురించి తెలియజేశారు. అంతేకాకుండా రచయితలకు, రచయిత్రులకు, విమర్శకులకు, అనువాదకులకు మార్గదర్శకంగా కూడా ఉన్నారు. ఈ విధంగా మాడభూషి సంపత్ కుమార్ తెలుగు భాషకు సేవలను అందిస్తున్నారు. తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం 17,18,19 జూన్ 2020లో "ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ సాహిత్య సమాలోచన" అనే అంశం మీద అంతర్జాలంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహస్తున్నారు. ఈ అంతర్జాలం అంతర్జాతీయ సదస్సులో ఏడువందల ఇరవైకు పైగా పరిశోధకులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. అంటే ఒకే ఒక రచయిత రచనలు మీద ఇంత మంది పాల్గొనడం గొప్ప విషయం. ఆ విధంగా అంతర్జాలంలో అంతర్జాతీయ సదస్సు విజయవంతం కావడమే కాకుండా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి పేరు నమోదు అయ్యిందంటే వీరిలో ఉండే మానవతావాదం ఎంతటిదో మనకందరికీ అవగత మవు తుంది. మాడభూషి గారి మానవతావాదం ఏ విధంగా ఉండేదనడానికి చిన్న ఉదాహరణ కూడా ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. నేను మాడభూషి కలం నుండి జాలువారిన కవితా సంపుటాల్లోని మానవతావాదాన్ని గురించి పరిశీలించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం. దీనికంటే ముందుగా అసలు మానవతావాదం అంటే ఏమిటనే విషయాన్ని చూద్దాం.

మానవతావాదం :

ఆచార్య గంధం అప్పారావు "ప్రాచీన తెలుగు సాహిత్యంలో మానవతా రీతులు" అన్న వ్యాసంలో మానవతావాదం గురించి- మానవత అనండి, మానవతా వాదం అనండి - భావం ఒక్కటే! అన్నారు. గంధం అప్పారావు గారే మరొక చోట చెప్పినట్లుగా "ఆదర్శ వాదం కానివ్వండి, భౌతిక వాదం కానివ్వండి, ఆస్తికత్వ నాస్తికత్వాలలో ఏ తాత్విక సిద్ధాంతానికి చెందిన వారైనా మనకభ్యంతరం లేదు. అది మానవుని మానసికాభివృద్ధికీ, అతని పురోగమనానికి తోడ్పడాలి. మానవ లోకానికి సుఖ శాంతులు ప్రసాదించే వాదం, నాదం, సిద్ధాంతం, తత్వం." అన్నారు.

"మానవుడే అన్ని విషయాలకూ ప్రమాణం అని చెప్పిన గ్రీకు దార్శనికుడు ప్రోటాగోరస్. మానవతా వాదాన్ని ఒక తత్వంగా ఆలోచన చేసిన ప్రసిద్ధాచార్యుడు. ఈతడు క్రీ.పూ.485-415 ప్రాంతంలో ఉన్నట్లు చరిత్ర చెబు తున్నది. ఈతని మొట్టమొదటి గ్రంథం ట్రూత్. ఈ పుస్తకంలోని మొదటి వాక్యమే ఉల్లేఖనం."(ప్రాచీన

తెలుగు సాహిత్యంలో మానవతా రీతులు, ఆచార్య గంధం అప్పారావు, పుట.99)

''ఈనాటి ఆధునిక విజ్ఞాన శాస్త్ర ఫలితాల ప్రభావంతో సమస్త మానవాళి సౌఖ్యానికి, ఆనందానికీ తోడ్పడేదే నిజమైన మానవతావాదం''.(ప్రాచీన తెలుగు సాహిత్యంలో మానవతా రీతులు, ఆచార్య గంధం అప్పారావు, పుట.99)

''ప్రోటాగోరస్‌కు ముందు వెనుకా గొప్ప గొప్ప మానవతా వాదులు ఎంతమంది ఉన్నా మానవతా వాదం అనేసరికి ప్రోటాగోరసే ముందుగా మనకి జ్ఞప్తికి వస్తాడు. ఎందుకంటే, ఈతడొక్కడే మానవతా వాదాన్ని ఒక తత్త్వంగా ఆలోచించాడు. తక్కినవారు అలా ఆలోచించ లేదు. గౌతమ బుద్ధుడు ఎప్పుడో 6,5 శతాబ్దాలలోనే మానవతా వాదాన్ని విశ్వమానవ లోకానికి అందించాడు. అహింసా ధర్మానికి, సహేతుక దృష్టికి, కరుణ ప్రేమలకు సమ సమాజ నిర్మాణానికి, శీల సంపదకు బుద్ధుని మానవతా వాదం పట్టాభిషేకం చేసింది. ''బహుజన సుఖాయ బహుజన హితాయ'' అన్నదే బౌద్ధ సిద్ధాంతం, ధర్మం. తరువాత క్రీ.పూ.469-399 మధ్య జీవించిన మహోన్నత తత్త్వవేత్త సోక్రటీస్ మన హృదయ నేత్రాలకు కనిపిస్తాడు. ఈ మహా పురుషుడు మానవతా విలువలను ప్రదర్శించి సత్య ధర్మాలకై అనువులర్పించిన ధీరోదాత్తుడు. (ప్రాచీన తెలుగు సాహిత్యంలో మానవతా రీతులు, ఆచార్య గంధం అప్పారావు, పుట.99)

''సోక్రటిస్ తాత్త్విక సిద్ధాంతాలను ఆయన శిష్య రత్నాలైన ప్లేటో మొదలైన వారు విశ్వవ్యాప్తి గావించారు.

బుద్ధుని తరువాత సరిగ్గా 563వ సంవత్సరం ఏసు క్రీస్తు అవతరించాడు. ఈతడు పుడమి కవతరించిన దేవదూత అని క్రైస్తవుల పరిపూర్ణ విశ్వాసం. ఈ మహోన్నత మానవతా మూర్తి మానవాళికి బోధించిన సూత్రాలివి. నీ పొరుగు వారిని ప్రేమించు! దయా దాక్షిణ్యాలతో క్షమాగుణ సంపన్నులైన ప్రశాంత జీవితాన్ని గడపండి. ఎంత పాపులైనా పశ్చాత్తాపం పొందిన వారిని ప్రేమతో ఆదరించండి. ప్రేమ సూత్రాన్ని ఆరాధించండి అని ఎన్నో మానవతా ధర్మాలను బోధించాడీ కరుణా సముద్రుడు, పతిత పావనుడు. మహమ్మదు కూడా ఈ ధర్మాలనే బోధించాడు. ఈ మహాపురుషుడు బోధించిన ధర్మాలలో ఏకేశ్వరోపాసన, సాంఘిక సమభావన అత్యంత ముఖ్యమయినవి. ఇంకా ఎందరో మతప్రవక్తలు రూసో, టాల్ స్టాయ్, విక్టర్ హ్యూగో లాంటి సాహిత్య సుధా కరులు మానవతా రీతుల్ని ప్రపంచం నలుమూలలా వెదజల్లారు. మార్క్సు, ఏంగిల్స్, లెనిన్ మొదలైన మహాపురుషుల గతి తార్కిక భౌతిక వాదం, యమ్.ఎన్. రాయ్ నవ్య మానవతా వాదం మానవాభివృద్ధికి తోడ్పడేదే. అబ్రహమ్ లింకన్ మానవత్వానికి అంకితమైనాడు. తెలుగు సాహిత్య ప్రపంచంలో సాటిలేని మానవతా మూర్తి వేమన్న'' అని తెలియజేశారు. (ప్రాచీన తెలుగు సాహిత్యంలో మానవతా రీతులు, ఆచార్య గంధం అప్పారావు, పుటలు.100,102) ఇకపోతే అనలు విషయానికి వద్దాం.

కవిత్వం-మానవతావాదం :

మానవతావాదానికి సంబంధించిన ప్రోటాగోరస్ ప్రభావం మాడభూషి సంపత్ కుమార్ గారి మీద ఉన్న దనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకంటే మాడభూషి కవిత్వంలోని ప్రతి అక్షరంలో మానవత్వం ఉట్టిపడుతుంది. అలా మానవతా వాదానికి పెద్ద పీఠం వేసిన వారిలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ కూడా ఉన్నారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ విధంగా ఆయన వెలువరించిన కవితా సంపుటాలే కాకుండా ఆయన మనస్సులో ఉండే నిలువెత్తిన ప్రతిరూపం మానవత్వమే. ఆ మానవత్వమే ఆయన సాహితీ వ్యాసాంగానికి ప్రతిరూపంగా నిలిచిందని చెప్పుకోవాలి.

''శత్రువుతో ప్రయాణం'' కవితా సంకలనంలోని 'అతడు మనిషిని జయించాడు!' కవితలో-

"అతడు కూడా మనిషే-
అందరికి లాగా
అతని తనువు కనిపించదు
మనసే అతనికి గుర్తింపు తెచ్చింది
మనిషికోసం వెతుక్కొంటూ
తిరుగుతున్నాడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట. 9)

రచయిత ఓ మనిషి గురించి ప్రస్తావిస్తున్నారు. అతడు కూడా మనిషే అంటున్నారు. అందరికి లాగానే అతనికి తనువు (దేహము, తోలు) కనిపించదన్నారు. అతని మనసే అతనికి గుర్తింపును తెచ్చిందని వ్యక్తం చేశారు. కానీ చివరకు అతను కూడా మరో మనిషి కోసం వెతుకు తున్నాడని వెలిబుచ్చారు.

"అతని తనువును మాత్రమే చూసినవాళ్ళు
పిచ్చివాడన్నారు / అనామకుడనుకొన్నారు
మనసును కనిపెట్టి రాళ్ళు విసిరారు
తమ నేర్పుకు తామే సంతోషించారు
మనసును విరగ్గొట్టిన విజయగర్వం
వాళ్ళ తనువుల్లో వికటాట్టహాసం చేసింది!"

(శత్రువుతో ప్రయాణం, పుట. 9)

అతని దేహాన్ని మాత్రం చూసినవాళ్ళు పిచ్చివాడని సంబోధించారు. చదువురానివాడనుకొని అతని మీద రాళ్ళు విసిరి, తమ నేర్పుకు తామే సంతోషించారన్నారు. అతను కూడా ఓ మనిషే అనే ఆప్యాయత లేకుండా విజయగర్వంతో తమ దేహాల్లో వికటాట్టహాసం చేస్తున్నా రన్నారు మాడభూషి సంపత్ కుమార్.

"ఇప్పుడు అతను కూడా
తనువుల్లో కలిసిపోయాడు
అతడు మనిషిని జయించాడు
మనిషి కోసం వెతకడం మానేశాడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట.9)

చివరకు అతను కూడా దేహంలో కలిసి పోయా డన్నారు. అతను కూడా మనిషిని జయించాడని ప్రస్తావించారు. చిట్ట చివరకు నన్ను అవమానించినటు వంటి మనిషి కోసం వెతకడం మానేశాడని వాపోయారు.

మరో కవిత 'విలువ' లో-

"మనిషి విలువ
రూపాయిలాగా
పడిపోతూనే ఉంది!
నేను మనిషిని
డాలర్‌తో కొలుస్తాను-
అతను ఎన్ని ఎంబీలో
తెలుసుకొని మర్యాదిస్తాను!"

(శత్రువుతో ప్రయాణం, పుట.57)

నేటి కరోనా కాలంలో అంతర్జాలంలో జరుగుతున్న కార్యక్రమాలన్నీ కూడా డాలర్‌తో ముడిపడి ఉంది. కవి మనిషి విలువ రూపాయిలాగా పడిపోతూనే ఉందన్నారు. ఇక్కడ రచయిత మానవత్వాన్ని చాటుకున్నారు. ఒక రూపాయి చాలా ఖరీదైంది. ఒక రూపాయి ఉంటేనే మరొక రూపాయిని చేర్చడానికి. అలాంటిది మాడభూషి మనిషి విలువను రూపాయితో పోల్చారు. ఈ రూపాయి విలువ పడిపోతుందనే నేపంతో నేను మనిషిని డాలర్‌తో కొలుస్తా నని వెలిబుచ్చారు. డాలర్‌తో కొలవడమే కాకుండా అతను ఎన్ని ఎంబీలో తెలుసుకొని అతనిని మర్యాదిస్తానని కవిత్వీ కరించారు. రచయిత పై కవితా పాదాల్లో ఒక పక్క మనిషి గురించి, మరొక పక్క రూపాయి గురించి, వేరొక పక్క డాలర్లు గురించి, చివరకు ఎంబీల గురించి ప్రస్తావిం చారు. ఇన్ని విషయాలను ప్రస్తావించడానికి గల కారణం కూడా మానవతావాదమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే మనిషి మానవతావాదైతేనే పలు విషయాలను ప్రస్తావించ డానికి వీలుంటుంది.

'రూపాంతరం' అనే కవితలో పుస్తకాన్ని గురించి, వేదాన్ని గురించి, మడిగుడ్డ గురించి, మనిషి గురించే కాకుండా రాయి గురించి, చెట్టు గురించి, నీళ్ళు గురించి, మొక్క గురించి పలు విషయాలను ప్రస్తావించారు. కవిత ప్రారంభంలో-

"నేను పుస్తకమై పుడతా
నీ చేతిలో ఉంటా!
నేను వేదమై పుడతా
నే నోట్లో ఉంటా!
నేను మడిగుడ్డనవుతా
నీ నడుముకు చుట్టుకుంటా!
మనిషిగా ఉంటేనే కదా
నువ్వు అంటకుండా ఉండేది!"
(శత్రువుతో ప్రయాణం, పుట.56)

మానవత్వంతో నడుచుకోవాలి. మానవతా వాదాన్ని చాటుకోవాలి. మనిషి మరొక మనిషిని అంటకుండా ఉండకూడదనే విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ నేను ఒక గ్రంథంగా ఆవిర్భవించి నీ చేతిలో ఉంటానన్నారు. నేను ఒక వ్యాసుని నోటి నుండి వచ్చే వేదమై పుడతా నన్నారు. అలాగే నేను స్నానం చేసుకొన్న తరువాత నడుముకు చుట్టుకొనే మడిగుడ్డనవుతానన్నారు. పలు విషయాలను ప్రస్తావించడానికి కారణం కూడా మనిషి రూపంలో ఉన్న మనిషిని తాకకూడదనే కవి భావన.

"రాయిగా మారుతా
పూజలందుకొంటా!
చెట్టుగా మొలుస్తా
నీళ్ళు పోయించుకొంటా!
మనిషిగా ఉంటేనే కదా
నువ్వు అంటకుండా ఉండేది!"
(శత్రువుతో ప్రయాణం, పుట.56)

కుల, మత, భేదాలు పట్టింపు లేకుండా నడుచు కోవడమే మానవత్వం, మానవతావాదం అని కూడా చెప్పుకోవాలి. వివిధ వర్గాలకు చెందిన వారు విభిన్న అభి ప్రాయాలతో సంప్రదాయాలతో జీవన యానం సాగిస్తుం టారు. అలాంటిది రచయిత ఇక్కడ రాయిగా ఉంటే నీచేత పూజలు అందుకొవచ్చనే అభిప్రాయంతో రాయిగా మారుతానన్నారు. ఒక విత్తనమై చెట్టుగా మొలిచి నీచేత నీళ్ళు పోయించుకుంటానని చెప్పడమే కాకుండా మనిషిగా ఉంటేనే కదా నువ్వు అంటకుండా ఉండేదనే విషయాన్ని ప్రస్తావించారు. అందువల్లే రచయిత తమ కవితల్లో మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రతి ఒక్కరూ మానవతావాదంతోనే రచనలను వెలువరించారనే విషయాన్ని మరోసారి గుర్తు చేశారు మాడభూషి.

"రాతిలో మొక్క మొలకెత్తినట్టు
మనిషిలో మనసు మొలకెత్తినప్పుడు
నేనూ మనిషిగా నిలబడతా!
మనిషి మారకపోతే
మనిషిపైనే తిరగబడతా!"
(శత్రువుతో ప్రయాణం, పుట.56)

పై కవితా పాదాల్లో ఎంతటి లోతైన మానవతా వాదాన్ని తెలియజేశారంటే, రాయిలో మొక్క మొలకెత్తిన విధంగా మనిషిలోని మనసు మొలకెత్తినప్పుడు నేను మనిషిగా నిలబడతానన్నారు. అంటే రచయిత ఆలోచన ధోరణి ఎంతటిదో మనకు అవగతమవుతుంది. అదే మనిషి మారకపోతే మనిషిపైన కూడా తిరగబడతానని తనకు తానే ప్రశ్నించుకొని కవిత్వీకరించారంటే ఆయనలో కవితా పటిమ కావచ్చు, మానవతా వాదం కావచ్చు. ఈ రెండు విషయాలు మాత్రం మానవత్వానికి గట్టి పునాదిగానే భావించాలి.

మాడభూషి సంపత్ కుమార్ 'ఆలోచనలు' అనే కవితా సంకలనంలో-

"మనుషులకే కాదు
మానవత్వానికీ మరణమా?
విశ్వమాత మదర్!"
(ఆలోచనలు, పుట.21)

మదర్ థెరిసా చేసినటువంటి ప్రజా సేవ ప్రశంస నీయమైనది. ఆమె చేసినటువంటి సేవ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా కూడా ఉన్నదనడంలో అతిశయోక్తి కాదు. ఇక్కడ రచయిత మానవత్వాన్ని చాటుకొన్న మదర్ థెరిసాకు మరణమా? అని ఆవేదనను వ్యక్త పరిచారు.

మదర్ థెరిసా లాంటి మంచి మనస్సును వ్యక్తి, సమాజ సేవకుడు, ఎందరికో తనవంతు సహాయ సహకారాలందిస్తున్న మాడభూషి నిజమైన మానవతావాది అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

"మూడో మనిషి" కవితా సంకలనంలోని 'ఇద్దరు' అనే కవితలో అలతి అలతి పదాల్లో అనల్పార్థాన్ని ఇచ్చే విధంగా కవిత్వీకరించడంలో మాడభూషి వారికి మాత్రమే సాధ్యమని చెప్పుకోవాలి. ఎందుకంటే ఆయన కలం నుండి జాలువారిన కవితలన్నీ కూడా చిన్నవిగానే ఉంటాయి. వాటిలో ఉండే భావాన్ని మనం అర్థం చేసుకోంటే చాలా లోతైన దృక్పథంతో, ఆవేశంగా, ఆలోచనాత్మకంగా, పరిశోధనాత్మకంగా, ఉత్సాహంగా, ఇతర రచయితలను ప్రోత్సహించే విధంగా కూడా వీరి కవితలు ఉంటాయి. 'ఇద్దరు' అనే కవిత ప్రారంభంలో-

"మేమిద్దరం
మా కిద్దరు
వారిద్దరిద్దరు
చివరకు
మేమిద్దరమే"

(మూడోమనిషి, పుట.39)

మానవుడు ఒంటరి వాడే అనేది నా అభిప్రాయం. తల్లిదండ్రులు, భార్యాభర్తలు, అక్కాచెల్లెలు, అన్న దమ్ములు ఇలా ఎన్ని రకాల బంధువాచకాలను గురించి ప్రస్తావించినా గానీ చివరకు మానవుడు ఒంటరివాడే. పై కవితా పాదాల్లో రచయిత మేమిద్దరం అన్నారు. అంటే తల్లిదండ్రులు, భార్యాభర్తలు వేరెవరైనా కావచ్చు. ఉదాహరణకి భార్యాభర్తలను తీసుకొంటాం. భార్యాభర్తలు ఇద్దరు అనే విషయం తెలిసిందే. వాళ్ళకి పుట్టినటువంటి పిల్లలు ఇద్దరు. ఆ పిల్లలకు పెళ్ళైన తరువాత వాళ్ళకు పుట్టినటువంటి పిల్లలు ఇద్దరు. ఒక భార్యాభర్తలకు జన్మించినటువంటి పిల్లలు ఇద్దరు, వాళ్ళ పిల్లలకు పెళ్ళై, వాళ్ళకు జన్మించినటువంటి పిల్లలు ఇద్దరు, ఇంతమంది ఉన్నా గానీ చివరకు మేమిద్దరమనే భార్యాభర్తల గురించి మనకు చాలా చక్కగా మాడభూషి కవిత్వీకరించారు. అంటే మానవత్వం నానాటికీ దిగజారి పోతుందనే ఆవేదనను రచయిత వెలిబుచ్చారు.

"వికారి" కవితా సంకలనంలోని 'భిక్షగాడు' అనే కవితలో మానవత్వం కలిగిన మనిషి గురించి ప్రస్తావించారు.

"నాకు
దేవుడి మీద కన్నా
మనిషి మీదే
ఎక్కువ నమ్మకం-
అందుకే
గుడి బయటే
అడుక్కుంటాను!" (వికారి, పుట.17)

మాడభూషి సంపత్ కుమార్ మానవతావాది కాబట్టే ఆయన రచనల్లో కూడా మానవత్వం పదిలంగా, పటిష్ఠంగా ఉన్నాయి. నాకు దేవుడి మీద కంటే మనిషి మీదే ఎక్కువ నమ్మకం అని చెప్పారు. అందువల్లే గుడి బయటే కూర్చొని అడుక్కుంటానని వెలిబుచ్చారు. ఇక్కడ రచయిత దేవుడి మీద కన్నా అంటే మానవత్వం ఉన్నటు వంటి మనుషులు మరో మనిషికి సహాయ సహకారాలందించడానికి ముందుకు వస్తారు. అందుకే మనిషి దేవుడి మీద నమ్మకం లేదన్నారు. కాబట్టి మనిషి మీద ఉన్న నమ్మకంతో జీవనాన్ని సాగిస్తున్నానన్నారు.

"చివరకు నువ్వే గెలుస్తావు" కవితా సంకలనంలోని 'తడి ఆరిపోయిన హృదయం' అనే కవితలో-

"భూమిలో
నీరు ఇంకిపోయినట్టే
గుండెలో కూడా తడి ఆరిపోయింది!
కవచం తొడుక్కొని
గుండె దిటవుగా ఉంది
ఇక ఏ ప్రమాదం రాదు!
శస్త్రచికిత్సచేసి

శాస్త్రీయంగా అమర్చిన గుండె
మానవీయంగా ఆలోచించలేదు!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట. 90)

మానవతావాదిగా ఆలోచించాలి. అప్పుడే భూమి గురించి, భూమ్మీద ఉన్నటువంటి మనుషుల గురించి ఆలోచించే విధానంలో కూడా మార్పు ఉంటుంది. ఆ ఆలోచన సమాజానికి మేలు చేకూర్చే విధంగా ఉంటుందన్నదే కవి భావన. పై కవితా పాదాల్లో రచయిత భూమిలో నీరు ఇంకిపోయినట్టే, గుండెలో కూడా తడి ఆరిపోయిందని ఆవేదన చెందారు. భూమి మీద ఎంత నీరు ఉన్నా గానీ ఇంకిపోతుంది. అది సహజమే. కానీ గుండెలో తడి ఆరిపోయిందంటే మనిషి స్వర్గస్తులైయ్యారనుకోవాలి. మనిషికి శస్త్రచికిత్సచేసి శాస్త్రీయంగా అమర్చిన గుండె దిటవుగా ఉందని, ఇక మీదట ఆ మనిషికి ఏ ప్రమాదం రాదని మానవతావాదిగా ఆలోచించలేకపోతున్నాడు మరో మనిషి.

"ప్రాణం నిలబెట్టడానికి
గుండె కొట్టుకుంటుంది తప్ప
మానవీయతను నిలపడానికి కాదు!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట. 90)

మనిషి ప్రాణాన్ని నిలబెట్టడం కోసం గుండె కొట్టుకుంటుంది తప్ప మానవత్వాన్ని నిలపడానికి కాదనే విషయాన్ని ప్రస్తావించారు. ఇక్కడ మానవత్వంతో మనిషి ఆలోచించ లేకపోతున్నారని కవి భావన. అందువల్ల ప్రతి మనిషి మానవత్వంతో ఆలోచించి మానవతావాదిగా నిలబడ్డాలని కవి మరోసారి హితబోధ చేశారు. మానవతావాదిగా ఉంటేనే మనిషి పలువురికి సహాయ సహకారాలను అందించడమే కాకుండా తాను ప్రశాంతంగా జీవించగలడని తెలియజేశారు.

మాడభూషి సంపత్ కుమార్ ''వికారి'' కవితా సంకలనంలోని 'గొప్ప' అనే కవితలో-

"మరణంలేని
సమాజంకన్నా
మానవత్వంలేని
సమాజం గొప్పదికాదు!"(వికారి,పుట.40)

మానవత్వమే మిన్నగా జీవిస్తున్నవారు మాడభూషి. పై కవితా పాదాల్లో సమాజంలో పుట్టుక, చావు సహజమే. ఎంతోమంది జన్మిస్తుంటారు, చనిపోతుంటారు. సమాజంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికీ మానవత్వం ఉండాలని, మానవత్వంతో తన జీవితాన్ని సాగించాలి. రచయిత మానవత్వం ఉన్న సమాజమే గొప్పదిగా భావించారు. మానవత్వం లేని సమాజం గొప్పదికాదని తన కవిత్వంలో కవిత్వీక రించారు. ప్రజాకవి వేమన ప్రభావం కూడా మాడభూషి సంపత్ కుమార్ మీద ఉన్నదని చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదు.

ముగింపు :

మాడభూషి మానవతావాది అనడంలో నిస్సందేహం లేదు. అలాంటిది ఆయన కవిత్వంలో మానవత్వం లేదంటే అతిశయోక్తి కాదు. రచయిత ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలియజేసినా విషయాలన్నీ కూడా మానవతావాదం గురించే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అవలోకనం చేసుకోవాలి. ఎందుకంటే నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో నడుచుకోవాలన్నది రచయిత ఉద్దేశ్యం. అందువల్లే రచయిత కలం నుండి జాలువారిన కవితల్లో మానవత్వం నిండుగా ఉన్నదనడంలో సందేహం లేదు. కాబట్టి వీరి కవిత్వం నేటి తరానికే కాకుండా రాబోయే తరానికి కూడా మార్గదర్శకంగా ఉంటుంది. మాడభూషి అంటే మానవత్వం. మానవత్వం అంటే మాడభూషి అనే చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఆ సందేహం కూడా ఎవరికీ ఉండనవసరంలేదని ఈ వ్యాసం ద్వారా మీకందరికీ తెలియజేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. బహుజనపల్లి సీతారామాచార్యులు 1827-1892 - శ్రీ: శబ్దరత్నాకరము సంపూర్ణనిఘంటువు మరియు అనుబంధం, విక్టోరియా పబ్లిషర్స్, సింగరాజువారి వీధి, కొత్తపేట, విజయవాడ-01, మూడవ ముద్రణ: సెప్టెంబర్ 2007
2. బి.ఎ.,బి.ఎస్సీ.,బి.బి.ఏ, ఇతర డిగ్రీ తరగతులకు, సెమిస్టర్, నాన్-సెమిస్టర్ విధానాలు, తెలుగు పాఠ్యగ్రంథం, గద్యభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600 005, 2003-2004
3. మాడభూషి సంపత్ కుమార్ :

1. ''శత్రువుతో ప్రయాణం'' శ్రీ మన్మథనామ సంవత్సర ఉగాది, మార్చి 2015,
2. ''ఆలోచనలు'' డిసెంబర్, 2015,
3. ''మూడోమనిషి'' హేవిళంబి ఉగాది, మార్చి 2017, 4.''వికారి'' వికారి ఉగాది, ఏప్రిల్ 2019, పాలపిట్టబుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036.

❖ ❖ ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'వ్యాస సంపద' వైశిష్ట్యం

- ముళ్ళేలు రఘుల గణేష్ కుమార్, బి.ఎ.తృతీయ సంవత్సరం, తెలుగు, ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ.

పూజ్యులు శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారి జీవితం ఆదర్శప్రాయం. వారి రచనలు ప్రతి ఒక్కటి విలువైన సంపద ని చెప్పాలి. అంటే వారి పేరులోనే సాహితీ సంపదను నిలుపుకొని సాహితీ లోకానికి ఆణి ముత్యంగా ఎందరికో స్ఫూర్తి దాయకంగా వారి జీవితం ఉన్నది. వారి రచనలు తరతరాలకు చెరగని ముద్రగా నిలిచి ఉంటాయి. వారి రచనలు అన్ని గొప్ప సాహితీ సంపదే అందులో నుంచి నేను ఒక ఆణిముత్యం లాంటి అద్వితీయమైన వ్యాస సంపదలో ద్రావిడ భాషలలో భారత అనువాదం వివరించాలని సాహసం చేయదలి చాను. భారతం అనగానే గుర్తుకు వచ్చే సామెత 'తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి' అని మన పెద్దలు అన్నారు. ఎందుకంటే భారతం సనాతన ధర్మాన్ని, హైందవ సంస్కృతిని నిలబెట్టిన అద్వితీయమైన గ్రంథం. ప్రపంచం సాహిత్యంలో భారతం ఉన్నత స్థానంలో ఉన్నది. వ్యాసుడు చెప్తుండగా సాక్షాత్తు గణపతి లిఖించాడు, అందుకే భారతం ఒక దేవ గ్రంథంగా భాసిల్లుతోంది. సర్వజగత్తుకు అన్ని లోకాలకు ఈ గ్రంథాన్ని వ్యాసుడు ప్రచారం చేయించెను. కనుకనే ఇది పూజ్యనీయమైన గ్రంథంగా నిలిచింది.

ధర్మే చార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ!
యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తిన తత్ క్వచిత్!

ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి మహా భారతంలో ఉన్న అంశాలు ఎక్కడైనా ఉండవచ్చు. కానీ భారతంలో లేని అంశాలు మరోచోట ఉండవని అర్థం. దీన్ని బట్టే భారతం ఎంత గొప్పదో మనకు తెలుస్తుంది. ఈ భారతం లాంటి రచన ప్రపంచంలో మరొకటి లేదు. మహా భారతం ఇంత ప్రసిద్ధి కావడానికి కేవలం అందు లోని కథాంశం మాత్రమే కాదు, అందులో జీవితానికి కావలసిన అన్ని అంశాలు పొందుపరచి ఉండడమే కారణం. సంస్కృ తంలో వ్యాసుడు 8,800 శ్లోకాలు రచించారు. వాటిని 24,000 శ్లోకాలుగా భూలోకంలో వైశంపాయనుడు పెంచాడు. తరువాత సుతుడు వాటిని లక్షశ్లోకాలుగా పెంచాడు అని వ్యాసకర్త చాలా బాగా వివరించారు.

ద్రావిడ భాషలలో భారతం :

తమిళం :

ద్రావిడ భాషలలో ప్రప్రథమంగా భారతాన్ని అను వాదం చేసిన ఘనత తమిళ భాషకు చెందుతుంది. క్రీస్తు శకారంభం నుండి వారి సాహిత్యమూ లభిస్తుంది. భారతాన్ని 9వ శతాబ్దం 'పెరుం దేవనార్' అని కవి చంపూ కావ్యంలో రచించారు. 'విల్లిపుత్తూర్ భారతం' విల్లకవి రాసారు. తరువాత కాలంలో 20కి పైగా భారతాలు వచ్చినవి. అర్వాచీన మహాభారత కర్తలు సుబ్బరాయలు నాయుడు, రామానుజ నాయుడు, ముత్తుస్వామి మొదలియార్,ఎం.వి.రామానుజాచార్య, ఎ.ఎల్.నట రాజన్, కృపానంద, రాజాజీ లాంటి అనేక మంది కవులు అనేక విధాలుగా భారతాన్ని రచించారు. ఇక్కడి ప్రజలు స్వతంత్ర కావ్యాలకు ఇచ్చినంత ప్రాముఖ్యత భారతానికి ఇవ్వలేదు అని తెలుస్తుంది. అదే కాకుండా తమిళంలో ప్రాచీన కాలంలో వెలువడిన భారతాలన్ని యథా మాతృకలు కావు. కానీ ద్రావిడ భాషలన్నిటిలో భారతాన్ని అనువదించుకున్న మొదటి భాష తమిళం అనే చెప్పాలి అని వ్యాసకర్త వివరించారు.

కన్నడం :

తమిళం తరువాత కన్నడంలో భారతం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ కూడా అనేక ప్రక్రియలలో భారతం అనువదించారు. మొట్టమొదట కన్నడంలో పంపడు 'విక్రమార్జున విజయం' పేరిట రచించారు. తరువాత

రన్నడు సాహసభీమ విజయం పేరిట భారతాన్ని రాసాడు. తరువాత కాలంలో జైనుల ప్రభావంతో జైన సాంప్రదాయ భారతం ఏర్పడాయి. తరువాత కాలంలో కుమార వ్యాసుడు మొదలగు వారు అనేక మంది అనేక భారతాలు రాసారు కానీ చాలావరకు కన్నడనాట భారతాలు కొందరు అర్జునుడ్ని, భీముడిని కథానాయ కులుగా చేసుకోని రచనలు చేసారు. అయితే కన్నడ భాషలో పంప, రన్న, కుమారవ్యాస ముగ్గురు మూడు రకాలుగా రాయడం వలన ఈ ముగ్గురు కవులు రాసిన మూడు భారతాలు సమగ్రమైనవి కావు. మూల భాషకు దగ్గరగా కూడా లేవు అని మాడభూషి వారు వివరించడం జరిగింది.

తెలుగు :

ద్రావిడ భాషలో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఇక్కడ కూడా మొదట పదకొండవ శతాబ్దంలో నన్నయ రాజరాజనరేంద్రుడి కోరిక మేరకు భారతం అనువదిం చారు. వీరు రెండున్నర పర్వాలు రాసినట్లు తెలుస్తుంది. తరువాత 13వ శతాబ్దంలో తిక్కన్న గారు విరాటపర్వం నుండి స్వర్గారోహణపర్వం వరకు రచించారు. 15వ శతాబ్దంలో ఎర్రన నన్నయ్య మిగిల్చిన అర్ధభాగాన్ని పూర్తి చేసారు. అందుకే తెలుగు నాట కవిత్రయం ఏర్పడింది. వీరు సహజ సిద్ధంగా వ్యాస భారతాన్ని తెలుగులో అనువదించారు. ఆంధ్రులకు 'ఆంధ్రమహాభారతాన్ని' అందించారు. వీరి తరువాత అనేక మంది వచన కావ్యాలుగా, నాటకాలుగా రచించారు. అలాగే భారతంలో కథలనూ ఆధారంగా తీసుకోని కావ్యాలుగా రాసారు. ఉ దాహరణకు శ్రీనాథ వారి శృంగార నైషధం, తాళ్ళపాక తిమ్మక్క సుభద్రపరిణయం, భట్టుమూర్తి వసుచరిత్ర మొదలైనవి చెప్పవచ్చు. వ్యానభారతాన్ని యథాతథ అనువాదం చేయగలిగాము అందుకనే ద్రావిడ భాషలలో సంపూర్ణ భారతం అనువాదం చేసిన ఘనత తెలుగు వారికి దక్కుతుంది అని వ్యాసకర్త శ్రీమాడభూషి వారు అద్భుతంగా విశదీకరించారు.

మలయాళం :

మలయాళంలో సాహిత్యం ఆలస్యంగా ప్రారంభ మైనది అని చెప్పవచ్చు. కానీ సంస్కృత భాషను యథాతథ అనువాదం చేయడంలో మలయాళం అగ్రస్థానంలో ఉన్నది. ఇక్కడ శంకఫణిక్కర్ 'భారతమాల' పేరుతో భారత కథను రచించాడు. అలాగే రామాఫణిక్కర్ భారతం అనే పేరుతోనే భారతాన్ని రచించారు. తరువాత తరం వారు చేరిచ్చేరి నంబూద్రి, ఎళుత్తుచ్చన్, కొత్తయ్యత్తు తంబురాన్ మొదలగు వారు మలయాళంలో అనేక భారతాలు రాసారు. ఆ తరువాత అనేక మంది ఇప్పటి వరకు అనువాదం చేస్తూనే వున్నారు. అలాగే మలయాళ భారతాల్లో వచ్చిన మార్పులన్నీ జానపదుల కథల్లో నుంచి తీసుకున్నట్లు తెలుస్తుంది. వీరి భారతంలో కృష్ణుడు ముసలి వయస్సు కలిగినట్టు అందువల్ల యుద్ధం శ్రీకృష్ణుడు చేయలేకపోయారు అని వీరు కథల్లో ఉ ంటుంది. ఏమైనప్పటికి మలయాళ భారతం ఎటుచూసినా మూల భాషకు కొంచెం భిన్నంగా సాగినట్లు తెలుస్తుంది.

విశ్లేషణ :

ద్రావిడ భాషల్లో భారతం రచన సుదీర్ఘకాలం నడి చిందని చెప్పవచ్చు. భారత రచన ద్వారా తరువాతి తరం వారికి మార్గదర్శకాలు ఏర్పడ్డాయి. చాలామంది తరువాతి తరం వారు భారత కథలను ఆధారంగా తీసుకొని కావ్యాలు, యక్షగానాలు, నాటకాలు రాయడం మొదలు పెట్టారు. ఈ నాటకాల ద్వారా పామరులకు సైతం భారతం యొక్క సారాంశం చేరింది. భారతం ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ద్వారా పూర్తి దక్షిణ భారత దేశంలో ప్రతి ఒక్కరికి చేరువైనది. అందుకే మన పూర్వికులు 'తింటే గారిలే తినాలి - వింటే భారతమే వినాలి' అని అన్నారు. ఈ సమస్త జీవరాశులు ఉన్నంత కాలం ఈ విశ్వ మానవాళి హృదయాలలో మహాభారతం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది అని వ్యాసకర్త ఎంతో చక్కగా వివరించారు.

ముగింపు :

ద్రావిడ భాషలో అనేక భారతాలు వచ్చినవి వాటి వలన ప్రజలలో చైతన్యం వెల్లివిరిసింది అని చాలా చక్కగా పూజ్యులు శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు వివరించారు. ద్రావిడ భాషలు ప్రాముఖ్యత వాటిలో ఉన్న మాధుర్యం సారూప్యతను చాలా చక్కగా వర్ణించారు. భారతం అంటే భావితరాలకు మార్గం అన్న విషయాన్ని చాలా అందంగా చెప్పారు. వారి వ్యాసం లోతుగా ఉండటమే కాకుండా ప్రతి ఒక్కరికి చదవాలనే ఆసక్తి కలిగించే విధంగా ఉంది. వారి వ్యాసం చదివిన ప్రతి ఒక్కరికి భారతం అన్ని భాషలలో చదవాలి అన్న ఆసక్తి కలుగుతుంది.

❖❖❖

సాహితీసేవలోకాంతి - సమాజ ప్రగతికి రంతి
సాహితీ వాఙ్మయ వారధి - నవ్య సాహితీ సారథి
అవని యవనికపై వెదజల్లిన నవీన సాహిత్యం
అమృత భావాల అక్షరార్చనకు మరో సంకేతం!

జనతను సన్మార్గంలో నడిపించే కలం, కవనం
ప్రతి రచన సమాజాభ్యుదయానికి మార్గనిర్దేశకత్వం
వచన రచనలతో ఆవిష్కరించిన అక్షర బ్రహ్మోత్సవం
సాహితీ రంగంలో ఇల బహుముఖీనమైన 'సాహిత్యరత్నం'!!

సాహితీ సేవలో తరించిన నవీన తెలుగు వల్లభుడు
సాహితీ యజ్ఞంలో నిమగ్నమైన నవ సాహితీ సార్వభౌముడు
అష్టదిగ్గజాలనే కవులను ఆదర్శంగా కొలిచిన అభినవభోజుడు
రాయలవారి సాహితీసంపదను హృదయసీమలో దాచుకున్న దార్శనికుడు

శ్రీకృష్ణదేవరాయల సాహితీ పరిమళాన్ని ఆస్వాదించిన సచ్ఛీలుడు
శ్రీకృష్ణదేవరాయల వైభవ స్ఫూర్తిని ఆరాధించిన సాహితీ యోధుడు
శ్రీకృష్ణదేవరాయల రాజనీతిని ప్రశంసించిన అభినవ పథికుడు
సంస్కృతికీ,సాహిత్యానికీ పట్టాభిషేకంచేసిన నవ్యసాహితీ సమరాంగణ ధీశుడు!

-'సాహితీకేసరి' మురికిపూడి దేవేంద్రరావు

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడో మనిషి - సామాజిక ప్రతిబింబం

- డాక్టర్ కందిరొజు వేణుగోపాలరొజు, జూనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామకుప్పం, చిత్తూరు జిల్లా.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పని చేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో ఎం.ఎ.పట్టా పొందిన తరువాత 'ఎరుకుల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం' అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పొందారు. 'తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు' అన్న అంశంపై డి.లిట్. పట్టా పొందారు. వివిధ పత్రికల్లో విభిన్న సామాజిక, సాహిత్యాంశాలపై వందలాది వ్యాసాలు రాశారు. గాఢమైన విమర్శతోపాటు, హాస్య, వ్యంగ్య రచనల్లో కూడా చెయ్యి తిరిగిన రచయిత. సరళమైన భాషతో, చక్కనైన భావవ్యక్తీకరణతో పాఠకుల్ని తనతోపాటు తీసుకొని వెళ్ళగలిగిన సామర్థ్యం ఉన్నాయి.

తెలుగు లిపిపై బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ లిపుల సమావేశంలో పాల్గొని తెలుగులిపికి ఉత్తమ లిపి అన్న ఖ్యాతని తీసుకొని వచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య, గుర్రం జాషువా, సి.పి.బ్రౌన్, పరిశోధన నాడు, నేడు, రేపు మొదలైన అంశాలపై అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు. 24 గంటల నిరవధిక కవిసమ్మేళనం నిర్వహించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ బిరుదుతో పాటు వివిధ సంస్థల నుంచి కవికోకిల, సాహిత్యరత్న, ఆంధ్రభాషా భూషణ, ధ్రువతార మొదలైన బిరుదులు పొందారు.

సమాజంలో వృత్తి వేరు, ప్రవృత్తి వేరు అన్నట్లు వ్యవహరించేవారు కొందరుంటారు. ఆ కొందరిలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు ఒకరు. ఆయన చేస్తున్న వృత్తి తెలుగు అధ్యాపకత్వం. ఒక వైపు పి.జి.విద్యార్థులకు తెలుగు పాఠాలు చెపుతూ, మరో వైపు పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ ఇంకో వైపు సాహిత్య రచనా వ్యాసంగాన్ని కూడా కొనసాగించటం అభినందనీయం.

సంపత్ కుమార్ గారు సహజ కవి. కొన్నాళ్ళపాటు పత్రికా రచయితగా కూడా పనిచేశారు. వారి వృత్తి అధ్యాపకత్వం అయితే ప్రవృత్తి రచనా వ్యాసంగం. వీరు కవిగా, విమర్శకునిగా సాహిత్య ఉపన్యాసకునిగా ఇప్పటికే సాహిత్య జగత్తులో విస్తృతమైన కీర్తిని సంపాదించుకున్నారు. వీరి రచనలలో కవిత్వం ప్రధానమైన భాగంగా ఉంటుంది. సమాజంలోని అనేకమైన అంశాలకు స్పందించే మాడభూషి వారు జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడో మనిషి, వికారి, మొదటి అబద్ధం మొదలైన కవితా గ్రంథాలను వీరు వెలువరించారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో రెండు దశాబ్దాలు వివిధ హోదాలలో పనిచేసి ప్రస్తుతం పదవీ విరమణ చేస్తున్న సందర్భంలో వీరి సాహిత్యాన్ని గూర్చి అంతర్జాతీయ సదస్సును నిర్వహించటం మెచ్చుకోదగ్గ విషయం. వీరికి రచనలలో "మూడో మనిషి" అనే కవితా సంపుటిని పరిచయం చేయటమే నా పరిశోధన పత్రం ప్రధాన ఉద్దేశం.

ఆచార్య సంపత్ కుమార్ గారు రచించిన "మూడో మనిషి" అనే వచన కవితా సంపుటి మొదటి సారిగా 2017 మార్చిలో ప్రచురింపబడింది. ఈ కవితా సంపుటిలో 'మహా ఆత్మఘోష' అనే కవిత నుంచి 'భ్రమలు' అనే కవిత దాక 38 శీర్షికలు ఉన్నాయి. సంపత్ కుమార్ గారు ఎంచుకునే కవితా వస్తువులు నిత్యము మనకు అనుభవంలో ఉన్నవే. సంపత్ ఊహలోకాలలో విహరించకుండా సమాజంలో మన కళ్ళ ఎదుట జరిగే సన్నివేశాలకు అక్షర రూపం ఇచ్చి వాటికి శాశ్వతత్వాన్ని కలిగిస్తారు. ఈ కవితా సంపుటిలో 'అక్షరాలు' అనే ఒక కవిత ఉంది. ఈ కవితను చదివితే అక్షరాలకున్న శక్తిని కవిగా సంపత్‌గారు ఎంత బలంగా ఉపయోగించారో మనకు తెలుస్తుంది.

అక్షరాలు :

చాలా విలువయినవి
లక్షల విలువయినవి
అందుకే అక్షర లక్షలన్నారు!
అక్షరాలు నక్షత్రాల్లాంటివి
అందుకుంటే
వెలుగునిస్తాయి!
కాయితాలమీద ప్రవహించి
జీవితానికి జీవాన్నిస్తాయి!
అక్షరాల్ని
ఆయుధాలుగా ప్రయోగించవచ్చు!"

అని అక్షరశక్తిని ఎంతో బలంగా కవిత్వీకరించారు. ఇంకా అక్షరాలు ప్రేమికులను కలిపే పావురాలని, అక్షరాలకు అంతం లేదని అక్షరాలు అనంతంగా జీవితాంతం సాగుతూ జీవితాన్ని సాగుచేస్తూ ఉంటాయని సముచితంగా తెలియజేశారు.

సంపత్ గారు తల్లిని గూర్చి 'ఆకురాలిన కాలం' అనే శీర్షికతో రచించిన కవిత గుండెలను పిండేస్తోంది అమ్మ లోకాన్ని వదిలి వెళ్ళిన తీరును-

"అమ్మ ఆకులా రాలిపోయింది
పండీ పండకముందే
నిండా పండకముందే
ఎన్ని గాలుల్ని
ఎన్ని తుఫానుల్ని
తట్టుకొని నిలబడినట్టే
కాలాన్ని ఎదిరించి నిలబడుతుందనుకొన్నాం
కానీ అమ్మ పండుటాకులా రాలిపోయింది!"

అని ఎంతో కరుణరసాత్మకంగా రచించారు. అలాగే అమ్మ ప్రేమను, పట్టుదలను, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, చాతుర్యాన్ని, చేవను ప్రశంసిస్తూ అమ్మ లేకపోతే ఎవరి దారి వారిది అని అమ్మ మాహత్మ్యాన్ని తెలియజేశారు. "ఇపుడు అమ్మ లేకపోవడంతో అందరూ అనాథులే" అని కవితను ఎంతో సముచితంగా ముగించారు.

సంపత్ కుమార్ గారు 'తల్లి' అనే పేరుతో ఒక కవితను రాశారు. తల్లి పదిమంది పిల్లల్ని కని పెంచి పోషిస్తుందని చెప్పిన కవి పదిమంది పిల్లలు ఒక తల్లిని పోషించలేక పోతున్నారని నేటి సమాజాన్ని తమ కవిత్వంలో ప్రతిబింబించారు. అందుకే ఈనాటి పరిస్థితిని స్పష్టం చేస్తూ సంపత్ గారు "అందుకే తల్లి ఇపుడు ఒకే బిడ్డతో సరిపెట్టుకొంటోంది" అని ఇప్పటి తల్లులు పరిమిత సంతానాన్ని కంటున్న తీరును తెలియజేశారు.

సంపత్ కుమార్ గారు 'కవిత్వం' అనే శీర్షికతో కవిత్వ స్వభావాన్ని-

"కవిత్వంలో / మడి కాదు / తడి ఉండాలి!
కవిత్వం /గుడికి కాదు / బడికి నడిపించాలి!
కవిత్వంతో/ అందలం ఎక్కడం కాదు
అందరినీ ఎక్కించాలి!".

అని కవిత్వాన్ని ఎంతో సముచితంగా నిర్వచించడమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా గుర్తుచేశారు.

సంపత్ కుమార్ గారు ఒక్కొక్కసారి అల్పాక్షరాలలో అనల్పార్థ రచన అనే రీతిలోను కవితలు రచించాడు. 'జయించడం' అనే శీర్షికతో

"ప్రేమలో / పరిగెత్తి పోవడమంటే
పారిపోవడం కాదు / జయించడం"

అని ప్రేమలో పిరికితనం పనికిరాదని ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంతో ముందుకుసాగి విజయాన్ని సాధించాలని ఒక చక్కటి సామాజిక సందేశాన్ని అందించాడు.

సంపత్ గారు రచించిన మరో మినీ కవిత 'సుఖం'. ఈ కవితలో 'దు:ఖం' మీదుగా సాగుతుంది.

"దు:ఖం మీదుగా
సుఖం సాగుతుంది
ఒకడి దు:ఖం
ఇంకొకడికి సుఖం"

అని అద్భుతమైన సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే కవితను రచించాడు. సమాజంలో కొంతమంది వేరేవారిని

వీడినన్తా తామము నుఖాన్ని అనుభవిన్తా ఉ ంటారు.అలాంటివారికి చెంపపెట్టులాంటిది ఈ కవిత.

కవితా సంపుటికి శీర్షికగా పెట్టిన "మూడో మనిషి" అనే కవిత సమాజంలోని అనాదరణకు గురి అవుతున్న ప్రత్యేక జెండర్‌కు సంబంధించిన వారిని గూర్చిన కవిత. హిజ్రాలుగా సమాజం చేత చిన్నచూపు చూడబడుతున్న వారి పట్ల సానుభూతిని ప్రకటించమని ప్రబోధించిన కవిత ఇది.

"తాళికట్టే అర్హత / తాళికట్టించుకునే అర్హత
లేదనేకదా ఇంత నవ్వులాట
అన్ని ఉన్న జెండర్‌లను గురించే"

జెండాలను పట్టుకొని తిరుగుతున్నారు తప్ప అందరు నిర్లక్ష్యం చేసే జెండరువాళ్ళకు ఏ జెండా నీడ దొరకడం లేదు అని మూడో జెండర్ వారి పట్ల సానుభూతిని ప్రకటిం చారు. కవితను ముగిస్తూ

"మూడో మనిషిని / మనిషిగా గుర్తించటానికి
అంగ వైకల్యాన్ని
ఆదరించటానికి
మనో వైకల్యం అంతరించాలి"

అని సమాజానికి ఒక ప్రబోధాన్ని అందించారు.

ప్రస్తుతం సంతానం తల్లిదండ్రులను విడిచి దూరంగా వెళ్ళిపోవడం అన్నిచోట్ల జరుగుతూ ఉన్నదే. ఈ వాస్తవాన్ని గుర్తించిన సంపత్ కుమార్ గారు 'ఇద్దరు' అనే శీర్షికతో ఒక కవితను రాశారు.

"మేమిద్దరం / మాకిద్దరు
వారిద్దరిద్దరు / చివరకు
మేమిద్దరమే!"

దీనిని బట్టి సంతానం తమ తల్లిదండ్రులను పట్టించు కోవడం లేదని చివరి దశలో వృద్ధ దంపతులు వారికి వారే తోడుగా ఉండవలసి వస్తున్నదని ప్రస్తుత సామాజిక స్థితిని అద్భుతంగా కవిత్వీకరించారు.

"మూడో మనిషి" అనే ఈ కవితా సంపుటిలో ఇంకా నేను-నువ్వు, ప్రకృతి, ప్రయాణం, రాజ్యాధికారం, ఒకగాలి, ఒక వాన, ఏడ్చినట్టుంది వాన, కెమెరా, వడ్డించిన విస్తరి, మనం, శవ ప్రేమికుడు, భ్రమలు మొదలైన కవితలు సంపత్ కుమార్ గారి సామాజిక పరిశీలన శక్తిని ఆలోచనా ధోరణిని, భావప్రకటన ప్రతిభను వ్యక్తం చేస్తున్నాయి.

సమకాలీన సమాజంలో జరుగుతున్న అనేక సంఘ టనలకు అక్షర రూపమే సంపత్ కుమార్ గారి కవిత్వం. వీరి కలం నుంచి పదవీ విరమణ అనంతరం మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను. సంపత్ గారి సాహిత్యం మీద జరిగిన అంతర్జాల అంతర్జాతీయ సదస్సులో అవకాశం కల్పించిన నిర్వాహకులకు నా నమస్సులు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వికారి కవిత్వం- మాడభూషి వ్యక్తిత్వం

- యు. లావణ్య, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

నేటి తెలుగు సాహిత్యంలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి గురించి తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎలా అంటే, వ్యక్తి పరంగా, సాహిత్య వ్యక్తిత్వ పరంగా తెలుగు సాహిత్యంలో అత్యంత ఆత్మీయ వ్యక్తిగా నిలిచారు. ఎదుటివారిపట్ల వారు చూపే ప్రేమ, ఆదరణ, అందరినీ ఆకర్షింపచేస్తుంది. ఆత్మీయులుగా మారుస్తుంది. అటువంటి సంపత్ కుమార్ గారి వ్యక్తిత్వం, వారి మాటల్లోను, చేతల్లోను మనకు కనిపిస్తుంది. (అలాగే ఒక చిత్రకారుని వ్యక్తిత్వం తన మనోభావాలను అనుగుణంగానే అందమైన చిత్రం రూపుదిద్దుకుంటుంది.) మాడభూషి గారి నైపుణ్యానికి వారి వ్యక్తిత్వమే నేపథ్యం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో మాడభూషి గారి వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే అభ్యుదయ భావాలతో కూడిన సమాజాన్ని ఎప్పటికప్పుడు చైతన్య పరచాలనే అభిలాష వారు చేసే రచనలల్లో కనిపిస్తుంది. మరి అటువంటి వ్యక్తిత్వం నుండి జాలువారిన కవిత్వం కూడా ఆ భావాలతో నిండి ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మాడభూషి గారి కలం నుండి ఎన్నో విలక్షణమైన రచనలు వెలువడ్డాయి. ప్రతి రచన ఒక వైవిధ్యంతో కూడుకొని ఉంటుంది. ఈ నేపథ్యంలో వికారి కవిత్వం ఒకటని చెప్పవచ్చు.

వికారి కవిత్వం ఆధారంగా మాడభూషి గారి వ్యక్తిత్వం సంక్షిప్తంగా పరిశీలిద్దాం. ఈ వికారి అనే కవితా సంపుటి 2019 ఏప్రిల్ లో ప్రథమ ముద్రణ పొందింది. దీనిని పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ నుండి ప్రచురించారు. ఈ రచనను తన మనవడు మాడభూషి సమర్థ్‌కి అంకితం ఇచ్చారు. ఈ కవితా సంపుటి మొదట్లో 'ఆనంద విహారి' అనే శీర్షికతో కవితా లోతుల్ని ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు గారు ఆవిష్కరించారు. ఇక ఈ కవితా సంపుటి వెలువడడానికి నేపథ్యమైన, శ్రేయోభిలాషులకు, ధన్యవాదాలను కవితా రూపంలో వెలువరించారు. ఇక కవితా సంపుటిలో మొత్తం ఇరవై తొమ్మిది కవితలతో డెబ్భై రెండు పుటలతో నిండి ఉంది. ఈ కవితలన్ని కూడా విశిష్టమైన మైలురాళ్ళు లాంటివే అని చెప్పవచ్చు. ఎలా అంటే ప్రతి కవిత సంక్షిప్తంగా సూటిగా విశేష అర్థాలతో కూడి ఉంటుంది. కనుకనే అల్పాక్షరాలతో అనల్పార్థ రచన అనే మాట ఈ వికారి కవిత్వానికి చక్కగా వర్తిస్తుంది. ఇందులోని కొన్ని కవితల ఆధారంగా మాడభూషి గారి వ్యక్తిత్వాన్ని మనం దర్శిద్దాం. ఈ కవితా సంపుటిలోని మొదటి కవితను చదివిన పాఠకులు ఒక్కసారిగా ఆలోచించే విధంగా ఎంత గొప్పగా చెప్పాడని కవిని గురించి చక్కగా రాశాడని ప్రశంసలు ఇస్తారు.

"నాకు
దేవుడి మీద కన్నా
మనిషి మీదే
ఎక్కువ నమ్మకం
అందుకే
గుడి బయటే
అడుక్కుంటాను"

అని 'భిక్షగాడు' కవితలో రాశారు. ఇందులో ప్రతి అక్షరం పాఠకుల హృదయాన్ని సూటిగా తాకుతుంది. మనిషి మీద తనకు గల నమ్మకం ఎలా ఉందో స్పష్టం చేశారు. కనిపించని దేవుడి కన్నా కనిపించి, ఆదరించే ఈ మనిషి అంటేనే నాకు నమ్మకం ఎక్కువ అన్నారు కవి. చిన్న చిన్న పదాలతో తన మాటల్లో మనిషి పట్ల అపారమైన విశ్వాసాన్ని ప్రకటిస్తాడు. ఇందులో మనిషి గొప్పతనాన్ని మాడభూషి గారి వివరించడం అద్భుతం.

అలాగే 'కులం' అనే కవితలో కూడా మాడభూషి గారు ఈ సమాజానికి ఒక సందేశం ఇచ్చారని చెప్పవచ్చు. సాంకేతిక పరిజ్ఞానంలో ఉరకలు వేస్తున్న నేటి తరంలో కూడా 'కులం' అనే ఈ మాట నేటి మనిషిని హీనంగా చూడటం. నేడు మనం కూడా చూస్తూనే ఉన్నాం. నేటి నాగరిక మానవుడు ఆ కులం అనే మురికిని వదలలేక పోతున్నాడని ఈ కులం అనే కవితలో చాలా చాకచక్యంగా చెప్పారని ఈ కవిత ద్వారా మనకు తెలుస్తుంది.

"కులం కన్నా
మలమే గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం"

అని చాలా వివరంగా అర్థమయ్యే విధంగా చెప్పారు. ప్రతి మనిషి తనలోని వ్యర్థాలను మలం రూపంలో బయటకు పంపుతారు. ఇలా ప్రతి రోజు ఆ వ్యర్థాన్ని తొలగించకపోతే మనిషి కనుమరుగౌతారు. మనం ఇప్పుడు కలియుగంలో ఉన్నా కూడా ఇంక కొంత మందిలో ఈ కులం పిచ్చి పోలేదు. కులం అనే భేదం లేకుండా కలిసి ఉండేది. మనం చదువుకునే చోట (బడులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో) మాత్రమే. ఈ కవిత ఇంత అద్భుతంగా రాసిన మా గురువు గారికి నా పాదాభివందనాలు తెలియచేసు కుంటున్నాను.

'నవ్వు' కవితలో

"కొందరికి నవ్వేరాదు
నవ్వితే
సంతోషంగా ఉన్నామని
అవతలివాడు
సమస్యలు సృష్టిస్తాడని భయం!
కొందరికి నవ్వేపోదు
నవ్వకుంటే
మనం దు:ఖంలో ఉన్నామని
అవతలివాడు
సంతోషిస్తాడని బాధ!"

మానవుని జీవితంలో నవ్వుకు ఎంతో ప్రాధాన్యత, ప్రత్యేకత ఉన్నాయి. "నోరారా నవ్వితే నూపుల్లన్ని పోతా యని" ఒక సామెత జన ప్రచారంలో ఉంది. ఇక ఈ నవ్వు గురించి ఎందరో కవులు ఎన్నో రకాలుగా తమ భావాలను వ్యక్తం చేశారు. అలాగే మాడభూషి గారు కూడా నవ్వును గురించి విలక్షణమైన రీతిలో వ్యక్తీకరించారు. ఆ నవ్వును చూస్తూనే వారి అసలు స్వరూపం తెలుస్తుంది. కొంతమందిలో అలాగే సంపత్ గారు తన కవిత్వంలో నవ్వు గురించి ఇలా అన్నారు. నవ్వు నాలుకు రకాలుగా చెడ్డ అని మన పెద్దవాళ్ళు అంటారు. నవ్వడం ఆరోగ్యానికి మంచిదని మరి కొందరు అంటారు.ఈ నవ్వులో అంత ప్రాధాన్యత ఉంది. నవ్వు గురించి చెప్పాలంటే 'నవ్వు' ఒక అందమైనది. నవ్వితే అందగా కనిపిస్తాఉ. కాని కొంతమంది నవ్వు వెనకలా విషం, కోపం, దాగి ఉం టుంది. ఈ కవిత్వంలో మాడభూషి గారు తన మాటల్లో ఎంత విలువైన అర్థాన్ని తెలియజేశారో ఈ కవితను చదివినప్పుడు తెలుస్తుంది. మనిషి యొక్క నిజస్వరూపం, ఈ కవిత మనకు అక్షరాల తెలుస్తుంది. సంపత్ కుమార్ గారి ప్రతి కవితలోను ఒక నిగూఢమైన అర్థం దాగి ఉం దని తెలుస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కవిత నేటి మానవుని జీవితాన్ని ఆవిష్కరించే విధంగానే కాకుండా సమాజ పోకడలకు అద్దం పట్టినట్లుంది. ఎలా అంటే ఈ రోజుల్లో పెద్ద పెద్ద పుస్తకాలు చదివే తీరిక, ఓపిక పాఠకలోకానికి లేదు. ఈ విషయం అందరికీ తెలిసిందే. అంత ఎందుకు రెండు పుటల కవిత చదవమన్నా తెల్ల ముఖం వేసు కొంటున్నారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు కనిపిస్తుంది. అందకేనేమో ప్రతి కవితలోనూ సంక్షిప్తతను పాటించారు మాడభూషి గారు. ఈయన రాసినటువంటి ప్రతి కవితలో అపూర్వమైన భావాలను రంగరించి జీవం పోసారు. ఈ కవితా సంపుటికి తెలుగు సంవత్సరంలో ఒకటైన 'వికారి' అనే పేరును నిర్ణయించారు. తెలుగు భాష పట్ల వీరికి

గల మక్కువ మనకు తెలుస్తుంది. ఇలా వికారి కవిత్వంలో ప్రతి కవితలోను సంపత్ గారి వ్యక్తిత్వం అక్షరాల రూపంలో ప్రాణం పోసుకున్నాయని చెప్పవచ్చు. ఏ కవికి అయినా శీర్షిక ఎంచుకోవడంలో కాని అందులోని భావాలను వ్యక్తచేయడంలో కాని, కవికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అలాంటిది ఈ వికారి కవిత్వాన్ని చదివిన ప్రతి ఒక్కరు మాడభూషి వారి వ్యక్తిత్వాన్ని ఈ సంపుటి ద్వారా తెలుసుకోవచ్చు. కాబట్టి ప్రతి కవితలో కూడా మానవుని ఆలోచన, ఆవేదన, తీరును, ప్రకృతి, స్వరూప స్వభావాలను తీర్చిదిద్దే విధంగా ఉన్నాయి.

ఆధార గ్రంథం :

1. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ - వికారి, ఏప్రిల్ 2019, వికారి, ఉగాది - పాలపిట్టబుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036.

❖❖❖

భాషా సేవకుడు

గురుబ్రహ్మ గురువిష్ణు: - గురుదేవ మహేశ
మాడభూషితవంశ - మానధనుడు
బోధింప పాఠాలు - సాధింప జ్ఞానాన్ని
విద్యార్థి ఘనుడుగా - వినుతకెక్కి

వేదాలు వల్లింప - వేదపండితకీర్తి
దిశదశగురు కీర్తి - విశదమయ్యె
తెలుగుభాషా సేవ - తేజస్వరూపుడు
గురువనుట మిగుల - గుర్తుగాదె

తే॥గీ॥ గురువు కీర్తి కిరీటంబు - పరువునిల్పు
సర్వశిష్యుల జ్ఞానంబు - సల్పువాడు
నిచ్చెనై నిల్చు శిష్యుని - ఉచ్ఛస్థితికి
దైవశక్తికి మించిన - పావనుండు

తే॥గీ॥ తల్లిపట్టమ్మ గర్భాన - కళ్ళు తెరచి
తండ్రి శ్రీనివాసాచార్య - తలపునిండ
కమ్మ పల్లెగ్రామానికే - సమ్మతమున
ధర్మబుద్ధిని నేర్పేటి - ధార్మికుండు

సీ॥ బ్యాంకాకు నగరాన - ప్రాపంచక లిపులలో
తెలుగు లిపికినెంతో - వెలుగునిచ్చె
తమిళనాట తెలుగు - తరియింపజేయంగ
వెలుగునిచ్చి ఘనత - విశదపరచె
పరిశోధనారంగ - ప్రావీణ్యతను పొంది
అత్యాధునిక కవితారుధురులుగ
ఆదర్శవంతుడై ఆశీర్వదించెడి
కవితా సమ్మేళన - కవుల కూర్చ

తెలుగు భాషా ఉనికి - దేశదేశములకు
తెలుగు భాషా కవు - లెందరికిని
తెలుగు కవులను నొకత్రాట - తెచ్చినాడు
మార్గదర్శిగా "పరిశోధ" - మంచి మనిషి

- పులివర్తి గురునాథం

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవితం - కవిత్వం - అవినాభావ సంబంధం

- మూధవి బొల్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

జీవితమే కవిత్వంగాబీ కవిత్వమే జీవితంగా చేసుకొన్న డా॥ మాడభూషి సంపత్‌కుమార్ గారి కవితా సంపుటి పేరు "జీవితం-కవిత్వం". ఇది వచన కవితాప్రక్రియ. ఈ కవితా సంపుటిలోని కవితలపై నా అభిప్రాయాలను విశ్లేషణ రూపంలో వివరించే అవకాశం నాకు రావటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అన్ని సాహిత్య ప్రక్రియలలో చేయి తిరిగిన వ్యక్తి, కవి పుంగవులు, మృదుస్వభావి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. ఈయన అనేక అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని తెలుగు సాహిత్యానికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చారు. తెలుగు సాహిత్యంపై ఆయనకున్న అభిమానం, పట్టు ఆయనను ఒక స్థాయిలో నిలబెట్టాయి. పాత్రికేయునిగా మొదలుపెట్టిన ఆయన జీవితం వారికి గల భాషాసాహిత్యం పై ఉన్న ఆదరణ, కృషి పట్టుదలలే మద్రాసు విశ్వవిద్యాలయ శాఖాధ్యక్ష పదవీ స్థాయివరకు చేర్చాయి. ఎన్నో దేశ, విదేశ వేదికలపై అనేక సాహిత్య సదస్సులలో పాల్గొని తెలుగుకు అంతర్జాతీయంగా అఖండఖ్యాతిని తెచ్చి పెట్టారు. వీరిదగ్గర శతకం పైగా పరిశోధకులు పరిశోధన చేశారు.

ఆచార్య మాడభూషి కవిత్వానికి, జీవితానికి అవినాభావ సంబంధాన్ని అన్ని కోణాల్లో దర్శించి ప్రతి కవితను విడమరిచారు. ఎందుకంటే కవిత్వమే ఆయన జీవితంగా కవిత్వంతో జీవించారు. జీవితంలో కవిత్వంబీ కవిత్వంలో జీవితం పెనవేసుకొని జీవనం సాగిస్తాయి అని యువతరం కవులకు సందేశం ఇచ్చారు.

జీవితం నుంచి కవిత్వం పుట్టుకొస్తుందని కొందరి నమ్మకం. కాని కవిత్వం నుంచి జీవితం పుట్టుకొస్తుందని ఆయన విశ్వాసం. ఈ రెండు నమ్మకాల్ని ఒకటికొకటి అనుసంధిస్తూ విడదీయరాని బంధాల్ని ఏర్పరిచారు. కవిత్వంతో జీవితం పరిమళిస్తుంది. జీవితంలో కవిత్వపు వాసనలు ఉంటేనే జీవితానికి సాఫల్యము-పరమార్థం అని వారి విశ్వాసం.

నాకు తెలిసినంతవరకు కవిత్వం వ్రాస్తున్న వారిలో చాలామంది అధ్యాపక వృత్తిలో ఉన్నవారే. కవిత్వం సృజనాత్మకమైన కళ. ఏ కవిత్వమైనా సమాజానికి ఉపయోగపడేదిగా ఉంటుంది. అది విద్యార్థులకు మార్గ దర్శకమే. చదువు మనిషిని తీర్చిదిద్దుతుంది. కవిత్వం బ్రతకడం నేర్పిస్తుంది. ఒక కవి ఆచార్యులుగా ఉంటే విద్యార్థులు మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారు. ఆచార్య వృత్తిని నిర్వహిస్తూ తనకు కవిత్వంపై ఉన్న ఆకాంక్షతో తన పదవీకాలంలో వృత్తిప్రవృత్తులను రెండింటినీ ఎంతో నైపుణ్యంతో మాడభూషి వారు నిర్వహించారు.

ఈ కవితాసంపుటిలోని కవితలన్నీ కూడా వారి మనోభావానికి అనుగుణంగా అంటే జీవితానికి కవిత్వానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని కళ్ళకు కట్టినట్లు పోలికలు, ఆధారాలతో సహా నిరూపించారు. జీవితం-కవిత్వం కవితా సంపుటిలో నాకు నచ్చిన కొన్ని కవితలను విశ్లేషిస్తూ మీ ముందుంచుతున్నాను.

"సముద్రాన్ని గురించి ఆలోచించు!" అనే కవితలో జీవితాన్ని, కవిత్వాన్ని సముద్రంతో పోల్చారు. సముద్రంలో అలలు, కెరటాలు, తుఫానులు, అల్లకల్లోలాలు ఉన్నట్లే జీవిత ప్రవాహం ఎన్ని అడ్డంకులు వచ్చినా కొనసాగుతూనే ఉంటుంది. మనిషి మనిషికి గల ఆలోచనా ధోరణులను బట్టి జీవనయాన గమనం మారుతుంది. కవిత్వం వ్రాయడంలో కూడా ఎన్నో ఇబ్బందులు వాటినన్నింటిని తట్టుకొని అధిగమించి నిలబడాలి. అపుడే సముద్రంలో ముత్యాలు, రత్నాలు దొరికినట్లు అమూల్యమైన మంచి జీవితం, మంచి కవిత్వం దొరుకుతుంది - బయట పడుతుంది. ఇంత నిగూఢమైన అర్థం నిండి వున్న

కవితలెన్నో! రచయిత తన జీవిత మార్గం కవిత్వం అని చెప్పుకొచ్చారు. కవిత్వమే తన జీవితం, కవనమే జీవనం అంటూ తన లక్ష్యం, గమ్యం. కవిత్వం అన్న దానికే తన జీవితాన్ని ధారపోస్తానంటారు మరొక కవితలో. కవిత్వం అనేది వాస్తవాల్ని చూపించగలగాలి అని వారి మనసు పొరల్లో దాగిన మాటలను ''జీవితానికి కవిత్వానికి చుక్కెదురు ఉండకూడదు'' అనే కవితలో ఎక్కడో ఆకాశపు కవిత్వం అంటే గాలిలో ఊహించడంబీ నేలబారు కవిత్వం అంటే సమాజానికి ఉపయోగపడని కవిత్వం కవితా వస్తువు కాగూడదని మాడభూషిగారి భావన.

జీవితం, కవిత్వం నిరంతర ప్రయాణాలే అని చెబుతూ ''జీవితాన్ని కవిత్వం ముంచదు'' అనే కవితలో జీవితాన్ని కవత్వం ముంచదు అంటూ మునిగిన జీవితాన్ని పైకి తేలుస్తుంది అంటారు కవి. కవిత్వం ఎంతటి క్లిష్ట పరిస్థితులలో కూడా మానసిక శాంతిని కలుగజేస్తుందని వారి నమ్మకం.

మరొక కవితలో ''కవిత్వానికి చావులేదు. జీవితానికి పొడిగింపు లేదు'' అనే కవితలో కవిత్వాన్ని నిర్లక్ష్యం చేస్తే జీవితం కూడా నిర్లక్ష్యమై నిర్వీర్యమౌతుందని, కాబట్టి ఉన్నంతకాలం కవిత్వంతో జీవితాన్ని సుఖమయం చేసుకోమంటారు. జీవితంలో వెలుగునీడలు రెండూ ఉంటాయి అని అంటూ ''జీవితంలో ఏడిస్తే'' అనే కవితలో కవిత్వం అందంగా రావాలంటే జీవితంలో ఎన్నో బాధలు పడాలి అంటారు అంటే సాగరమథనంలోంచి అమృతం పుట్టినట్లు జీవిత బాధలలోంచి మంచి కవిత్వం పుట్టుకొస్తుందని రచయిత నమ్మకం.

జీవితాన్ని ఎడారితో కవిత్వాన్ని ఒయాసిస్సుతో పోలుస్తూ జీవితమనే ఎడారిలో కాస్తంత దాహార్తిని కవిత్వం తీరుస్తుంది అని వారి ఉద్దేశం. చివరిగా ''జీవితం మొక ముళ్ళబాట అయితే కవిత్వమొక మల్లెతోట'' అనే కవితలో జీవితంలో ఎన్ని ముళ్ళబాటలున్నా కవిత్వమనే మల్లెపూల పరిమళాలు ముళ్ళబాధను మరిపిస్తాయి. అవి పూలబాటలను వేస్తాయి.

చిట్టచివరిగా సమాజంలో ఉన్న రుగ్మతలను ఎత్తి చూపుతూ సమాజమే మనిషి మనిషే సమాజం అయినపుడు మనిషి జీవితంలోకి కవిత్వం తొంగిచూడ కుండా జీవితం ముందుకు సాగదు. మాడభూషిగారి దృష్టిలో కవిత్వానికి జీవితం మూలం. భాషలు ఎన్ని ఉన్నా కవితా భావం ఒక్కటే. కవితారసాత్మకమైన మనిషికి కవిత్వం అనేది జీవితపు రహదారిలో సేదతీర్చే చెట్టు వంటిది.

ఈ విధంగా వారి కవితలన్నీ పైకి సాధారణంగా కనిపిస్తున్నా ఎంతో జీవితపు అర్థాన్నీ, విలువలనూ తెలియజేస్తాయి. కవితలన్నీ జీవితాన్నీ కవిత్వాన్నీ సమన్వయం చేస్తూ సాగాయి. ఎక్కడ జీవితం ఉంటుందో అక్కడ కవిత్వం ఉంటుంది. ఎక్కడ కవిత్వం ఉంటుందో అక్కడ జీవితం ఉంటుంది అంటారు కవి. ఈ కవితలపై ఒకే విషయంపై ఇన్ని భావాలు వ్యక్తీకరించిన మాడభూషి గారి నేర్పు కనిపిస్తుంది. కవితలన్నీ ఆది, అంత్య ప్రాసలతో సాగాయి. పదాల కూర్పు, పదాల అల్లిక గజిబిజిగాకుండా కవితాగమనం చివరివరకూ చదివేటట్లు సాగింది. పోలికలు సందర్భోచితంగా ఉన్నాయి. ప్రతి కవితలో జీవితాన్ని కవిత్వంతో ముడివేసి సమన్వయం చేస్తూ వచ్చారు. తన కవితా సంపుటిలో జీవితానికీ, కవిత్వానికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని అలతి అలతి పదాలతో సూక్ష్మ రూపంలో దర్శించగల ఘనత మాడభూషిగారిది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవితమే కవిత్వం - కవిత్వమే జీవితం

- డాక్టర్ కె.కరుణశ్రీ, సహాయ ఆచార్యులు, డి.కె.ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం), నెల్లూరు, ఆంధ్రప్రదేశ్.

జీవితాన్ని విడిచిపెట్టి కవిత్వాన్ని రాయలేని వాడు, కవిత్వానికి తెలియకుండా జీవితాన్ని దాచలేని వాడు, కవిత్వం రాయడానికి ముందు జీవితాన్ని చదివిన వాడు, జీవితాన్ని చదివిన తర్వాత కవిత్వంలో ఎదిగినవాడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. ఆచార్య మాడ భూషి సంపత్ కుమార్ 'జీవితం-కవిత్వం' అన్న కవితా సంకలనం చదివాక అయన జీవితమే కవిత్వం అని అయన కవిత్వంలో జీవితం ఉందని అవగతమౌతుంది. అయన కవిత్వంలో ఏ ఒక్క అక్షరం కూడా జీవితం నుంచి పక్కకు వెళ్లలేదు. జీవితంలోని ప్రతి క్షణాన్ని అక్షరబద్ధం చేశాడు. ఆలోచనామృతమైన సాహిత్యాన్ని స్పష్టంగా సూటిగా మనసుకు హత్తుకునేటట్లు చెప్పడం సంపత్ కుమార్ కవిత్వంలో ఉండేటటువంటి ఒక లక్షణం.

"సముద్రాన్ని గురించి ఆలోచించు
జీవితాన్ని అందులో దించు
కవిత్వాన్ని గురించి ఆలోచించు
సముద్రాన్ని అందులో ముంచు
అప్పుడు కవిత్వంలో
జీవితం ప్రతిఫలిస్తుంది
జీవితమంతా కవిత్వం నిలుస్తుంది"

అంటూ తన జీవితమంతా కవిత్వమే అంటాడు సంపత్ కుమార్. మాడభూషి దృష్టిలో జీవితం కవిత్వం రెండు వేర్వేరు కాదు. కవిత్వమే జీవితం. జీవితమే కవిత్వం. వాటికి ఉన్న అనుబంధాన్ని వ్యక్తం చేయడానికి ఒక పుస్తకం చాలదు అంటాడు. జీవితానికి కవిత్వానికి చుక్కెదురు ఉండకూడదు అన్నది ఆయన అభిప్రాయం. కవిత్వం తనకు, కవిత్వానికి తను ప్రాణమైనప్పుడు తనను కవిత్వాన్ని వేరు చేసి చూడడం అవసరం లేదని చాలా స్పష్టంగా విశదీకరించాడు.

"నేను
కవిత్వమై మొలుస్తాను
జీవితమై నిలుస్తాను
జీవితాన్ని కవిత్వంతో కొలుస్తాను
కవిత్వాన్ని జీవితంతో కొలుస్తాను"

కవి కవిత్వం కోసమే జీవితాన్నే ధారపోస్తాడు. దాన్ని హృద్యంగా చెబుతూ మాడభూషి-

"పండువెన్నెల్లో
కవిత్వాన్ని ఆరబోసి
జీవితమంతా కాపలా కాస్తాను
జీవితానికి పండు వెన్నెల్ని
ఆసరా చేస్తాను
కవిత్వానికి జీవితాన్ని ధారపోస్తాను" అంటాడు.

జీవితం నుంచి కవిత్వం పుట్టిందో, కవిత్వంలో నుంచి జీవితం పుట్టిందో కానీ రెండు ఒకదానికొకటి పోషణను హాయినిస్తాయి అంటాడు మాడభూషి. కవిత్వం జీవితానికి హాయినిస్తుంది. జీవితం కవిత్వానికి ప్రాణం ఇస్తుంది అంటాడు.

''దారి తప్పిన జీవితానికి కవిత్వం వెలుగు చూపిస్తుంది
గురిపెట్టిన కవిత్వానికి జీవితం లక్ష్యమై నిలుస్తుంది"

కవిత్వం ఏదో ఒక విమర్శకు గురికాక తప్పదు. కానీ ఆ వెటకారం ఎవరికీ నచ్చదు ఆ విషయాన్ని చెబుతూ-

"జీవితానికి పోరాటం తప్పదు
కవిత్వానికి ఆరాటం తప్పదు
జీవితానికి కవిత్వానికి వెటకారం నప్పదు"

కవిత్వ ప్రారంభంలో జీవితానికీ కవిత్వానికీ అభేదం చెప్పిన మాడభూషి కవితాసంకలనం చివర్లో కవిత్వం జీవితం రెండూ ఒకటే అయినా ఒకదానినుంచి ఒకటి

పుట్టిన ఈ రెండింటిలోనూ భేదం ఉందంటాడు. జీవితానికి కవిత్వానికి ఉన్న భేదం ఆయన మాటల్లోనే-

"జీవితం ఖేదం
కవిత్వం మోదం
అంగీకరిస్తే ఆమోదం"

కొన్ని సందర్భాల్లో మాడభూషి కవిత్వంలో శ్రీశ్రీ కూడా తొంగి చూస్తాడు. "ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వ మొక తీరని దాహం" అన్న శ్రీశ్రీ కవిత్వం పలుకులు మాడభూషి కవిత్వంలో కనిపిస్తాయి.

"కవిత్వం ఒక ఆరని దీపం
జీవితం ఒక తీరని దాహం
కవిత్వం ఒక శక్తి
జీవితం ఒక యుక్తి
రెండూ కలిసి నడవటం ముక్తి
జీవితం ఆలోచనల పద్మవ్యూహం
కవిత్వం లోచనాల అస్త్ర స్వరూపం"

జీవితం కవిత్వం ఒకటిగా ప్రారంభమైన ఈ కవిత్వ ప్రస్థానంలో చివరికి కవిత్వం ఒక శిలగా మిగిలింది. జీవితపు రహదారిలో సేద తీర్చే చెట్టు కవిత్వం అయింది. జీవితంలో అనుభవాన్ని బట్టి అభిప్రాయాలు నిరంతరం మారిపోతుంటాయి. అలాంటి జీవన వైవిధ్యాన్ని ఈ కవితా సంకలనంలో మనం గమనించవచ్చు.

"కవిత్వమొక శిల
జీవితమొక అల
జీవితపు రహదారిలో
సేదతీర్చే చెట్టు కవిత్వం"

ఏది ఏమైనా జీవితంలో కనిపించే భిన్న వైరుధ్యాలు, భావాలు, ఆలోచనలు, మాడభూషి కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తాయి. జీవితంలో వైరుధ్యాన్ని కవిత్వంలో, కవిత్వ వైవిధ్యాన్ని "జీవితం-కవిత్వం" అన్న తన కవితా సంకలనంలో చూపించిన ఆధునిక కవి మాడభూషి సంపత్ కుమార్.

ఆధార గ్రంథాలు :

1. జీవితం - కవిత్వం - మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంపత్ కవిత్వం - ప్రకృతి

- గిడుగు శ్రీనివాసరావు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
శ్రీఅల్లు వెంకట సత్యనారాయణ మునిసిపల్ హైస్కూల్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

కవిత్వం రాయడమో కళ. ఆ కళను కళాత్మకంగా చిత్రించాలి. అప్పుడే అది కలకాలం పాఠకుల హృదయాల్లో ఆనందానుభూతులను కలిగిస్తూనే వేనోళ్ళ కొనియాడబడుతుంది. ఈ కళలో పద ప్రయోగం కీలకమైనది. రసాదులతో కూడిన శబ్దార్థ ప్రయోగం చేతనే ఆ కవిత్వం రసజ్ఞుల ప్రశంసకు పాత్రమౌతుంది. నేటి కాలంలో శబ్దాడంబరం, ప్రాసలతో, మూసగా, యాసగా రాస్తున్న కవిత్వం సంపెంగపూల సదృశ్యమే. ఇప్పుడు మనం పరిశీలించే వస్తువు మందారమకరందమైనట్టిది. విశ్వశ్రేయము కోరి రసానందమునందించునట్టిదైన శ్రీ సంపత్ కుమార్ గారి కవిత్వం. శబ్దార్థాలను పర మార్థంగా జీవనార్థంగా వాడిన పద సంపత్కవి, పద సవ్యసాచి శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు. వారి కవిత్వంలో ప్రకృతి అంతటా గోచరిస్తూ, జీవితానుభవాలు నేర్పిస్తుంది. అటువంటి కవిత్వాన్ని, ప్రకృతిని, కవి విశాల హృదయాన్ని, సంక్షిప్తంగా పరిచయం చేయడం ఈ వ్యాసోద్దేశ్యం.

"కవిత్వంతో అందలం ఎక్కడం కాదు, అందరినీ ఎక్కించాలి" అన్న కవితోద్యమ నాయకుడీయన. జీవితానుభవాలే కవనం అని, కవనమే జీవితం - జీవితానుభవం నుండే కవిత్వం రాయగలమని అదే కవనమని కవిత్వం రాయడమెలాగో చెప్పారు. అదే నిజమయిన కవిత్వం అని భావించారు. అదే లక్షణాన్ని తన రచనల్లో చూపారు. "అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి:"-ఆనందవర్ధనుని మాటను "జీవితానికి / సృష్టికర్త బ్రహ్మ / కవిత్వానికి / సృష్టికర్త కవి / బ్రహ్మ కవి కాలేడు / కవి బ్రహ్మ కాగలడు" - అంటూ తనదైన శైలిలో కావ్య స్వరూపాన్ని వివరించి, జీవనాన్ని కవనంగా రాస్తే "కవిబ్రహ్మ" కావచ్చని పై మాటల్లో ధ్వనింపజేశారు. జీవితాన్ని కవిత్వాన్ని ముడి పెడుతూ 108 కవితలతో "జీవితం-కవిత్వం" రచించారు. ఇది ఒక కావ్యంగా కనబడుతుంది. వాక్యం రసాత్మకం కావ్యం, రమణీయార్థ ప్రతిపాదకశబ్ద: కావ్యం, ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం... వీటన్నింటి కలబోతగా "జీవితం-కవిత్వం" కనబడుతుంది. శ్రీశ్రీ కవిత్వాన్ని కొలవడానికి తూకపు రాళ్ళులేవంటే -

కవిత్వాన్ని కొలవడానికి
జీవితమే తూకపురాయి

అనడం ఈ కవి ప్రతిభకు నిదర్శనం. కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్చేది కవిత్వం అని కవితా మహత్తును గురించి ఇలా అన్నారు.

"జీవితమొక ఎడారి
కవిత్వమొక ఒయాసిస్సు".

తన కవిత్వంలో కులాలను నిరసించారు. రాజకీయాలను సున్నితంగా విమర్శించారు. ప్రకృతిని కదిలించారు.

కులనిర్మూలనంటే
వేరే కులాన్ని నిర్మూలించడమే
ఎన్ని కలంటే నాకు
కులాలు గుర్తొస్తాయి తప్ప

ఓటర్లు గుర్తుకు రారు. చుక్క రాని నీళ్ళ కొళాయిలు... నోట్లు పెట్టి తవ్వించారు కాయితాల్లో / .... అన్ని జిల్లాలకు / కొన్ని కోట్లు / ఇంకా ఇప్పలేదు / పెద్దోళ్ళ మూటలు / దీనిలో ఇంకా ఇప్పలేదు అనడం చేత మూటలూ ఇప్పలేదు. కాబట్టే కొళాయిలు ఇప్పలేదని, చెప్తూ "ప్రజలారా! పడండి పాట్లు అని రాజకీయాలు ఎలా ఉంటాయో చూపారు.

సంపత్ కుమార్ గారు అడుగడుగునా ప్రకృతికి సంబంధించిన వాటిని కవిత్వీకరించి, ప్రకృతి పరిశీలకునిగా, ప్రకృతి ప్రేమికునిగా కనబడి, ప్రకృతికి, మానవునికి మధ్య అవినాభావ సంబంధం ఉందని వివరిస్తారు.

ప్రకృతి అంటే ఏమిటో 'ప్రకృతి' శీర్షికలో వివరించారు- ఎండ / వాన / గాలి / నీరు / నిప్పు / ఆకాశం / చెట్లు / ఆకులు / పూలు / పక్షులు /జంతువులు / కొండలు / గుట్టలు / అడవులు / మట్టి / రాళ్ళు / నదులు.... దాదాపుగా వీటన్నింటిని కవితా వస్తువులుగా స్వీకరించారు. ప్రకృతిని కాపాడుకోవాలని లేకపోతే ''అనుభవాలు అనుభవాలుగా / కుప్పలు పోసినా / ప్రకృతిని అర్థం చేసుకోకపోవడానికి / అనుభవం చాలడంలేదు / - అని ప్రజల్ని హెచ్చరిస్తూ 'ఏడ్చినట్టుందివాన' అన్న కవితలో - చెన్నైలో వాన కురవమని ఎవడేడ్చాడు.. అని అంటూ ఈ నగరం మునకకు కారణం చెరువులు పూడ్చడమేనని చెప్తారు.

"నా దాహం తీర్చిన కల్పవల్లి
నన్ను గుండెలకత్తుకున్న పాలవెల్లి
నాకు బువ్వ పెట్టిన అమ్మతల్లి

అని తలపోసి ఉంటే నా ఊరు మునిగి ఉండదు / నా నోరు ఎండి ఉండదు / దిద్దుకోలేని తప్పుకు చెరువు ఇచ్చిన శాపం /... కాలిన చేతులు పట్టుకోవడానికి / ఆకులు కూడా లేవు / అవి కూడా / నీ అర్థాకలికి ఎప్పుడో / రాలిపోతాయి / కూలిపోతాయి. కాబట్టి ప్రజలు అనుభవించాలని అంటారు. (దీనిలో అర్థాకలి పదం మనిషి ధనాశను తెలియజేస్తుంది) అందుకు ప్రజలందరూ ఈ విషయంను గుర్తించాలని 'గుణపాఠం' శీర్షికలో ప్రకృతి నేర్పించడానికి తప్ప / శిక్షించడానికి లేదు / నువ్వు మరీ మొండికేస్తే తప్ప / బెత్తం పట్టుకొని గుణపాఠాలు నేర్పదు" అని బోధిస్తారు. చెరువులు పూడ్చి భవనాలు కట్టుకోవడం వలననే నగరం మునిగింది. ఆ కురిసిన ఒకే ఒక్క వాన వలన జనం వాన కావాలని అడగరని అంటారు 'ఒకే వాన' శీర్షికలో రచనా శైలి గమనించండి."మళ్ళీ లేవని వాళ్ళు / లేచి తేలుతున్న వాళ్ళు / తేలి మునిగిపోయిన వాళ్ళు / .... మొదటి రోజు నీళ్ళు ఆకాశానిది / రెండో రోజు నీళ్ళు కన్నీటిది / మొదటి రోజున ఊరు మునిగితే / రెండోరోజున జీవితం మునిగింది. అంటూ ఆ నగర వాస్తవిక బాధాకరమైన దృశ్యాన్ని కళ్ళముందు ఉంచారు. "చివరకు నువ్వే గెలుస్తావు"లో 'చెరువు' శీర్షికలో చెరువులు పూడ్చి కట్టిన భవనాలు నగరం మునగడానికి కారణమే కాదు. అవి కూలటానికి కూడా కారణమని, ఇంత జరుగుతున్నా మానవుడు వాస్తవాన్ని గ్రహించలేక పోతున్నాడని అంటారు. చివరకు చెరువు తిరగబడితేనే నిజం తెలుస్తుంది అని ఇలా అంటారు. "కళ్ళముందే / నిండిన చెరువును చూశా / పండిన చెరువును చూశా / ఎండిన చెరువును చూశా / తిరిగి వచ్చే లోపల / చెరువే ఇల్లై / అపార్ట్‌మెంటై / ఊరై / చెరువున్న ఊసే లేకపోయింది / ... అది చెరువని చెప్పినా / నిర్లక్ష్యపు నవ్వుతప్ప నిజం గ్రహించలేదు / ఇప్పుడు చెరువు తిరగబడితే / అంతా ఏడుపు మొహం పెట్టుకొని .... అని వర్ణించారు.

చెట్టు శీర్షికలో చెట్లను నరకవద్దని ఇలా కోరారు.

"చెట్టు పూసిన
పువ్వులు తురుముకోండి
చెట్టు కాసిన కాయలను తినండి
చెట్టుకు కాసిన
ఆకులను ఉపయోగించుకోండి
చెట్టును మాత్రం నరికేయకండి.

చెట్టు, కవిత్వం కోసం కాగితంగా మారింది. కవిత్వం ద్వారా చెట్టు హృదయాన్ని ఆవిష్కరించారు. కాని కాపాడలేకపోయాడని అంటారు. చెట్టు / ఒక కన్నీటి బొట్టును కార్చింది / కవిత్వం కోసం కాయితంగా మారడానికి / ఆకును రాల్చేందుకు / కవిత్వంతో చెట్టు హృదయాన్ని కదిలించగలిగాను / కానీ ఆకును అతికించ లేకపోయాను.

'స-ముద్ర' శీర్షికలో సముద్రం నుండి మనల్ని మనం రక్షించుకోవాలని అందుకు మానవుడు తగిన విధంగా ప్రవర్తించాలనే విషయాన్ని సూచించారు.

మట్టి ఔషధంలా పనిచేస్తుంది తప్ప
తనలో కలుపుకోదు
శరీరంలో కొంతసేపు అతుక్కుని
తృప్తి చెందుతుంది తప్ప
తనతో తీసుకొని పోదు
గాలి ప్రాణ వాయువై
ప్రాణం లేచి వచ్చినట్టుంది తప్ప
ప్రాణం తీసేట్టు ఉండదు

అయితే సముద్రాన్ని నమ్మలేం / ఎప్పుడైనా దానికి / మన మీద ప్రేమ పుట్టవచ్చు / గుండెలకు హత్తు కోవాలనిపించవచ్చు / అందుకనే సముద్రం / తన ముద్రను / మన మీద వెయ్యకుండా చూసుకోవాలి / మనల్ని మనం కాచుకోవాలి.

'భూమ్యాకాశాలు' కవితలో ఆకాశం, సముద్రాల మధ్య దూరం ఉన్నా వాటి అనుబంధాన్ని అక్కాచెల్లెళ్ళ బంధంగా చూడగలమని, సముద్రం, ఆకాశాల అంత రంగం ఒక్కటే అని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు.

ఆకాశం
పరస్పరం రూపాంతరాలు చెందుతూ ఉంటాయి
ఒకదానికొకటి
అందనంత దూరంలో ఉన్నట్టున్నా
అంతరంగం ఒకటే
సముద్ర తరంగాలే
ఆకాశమేఘాలు
ఈ అక్కాచెల్లెళ్ళ అనుబంధాన్ని పసిగట్టగలం.

ఇలా వారికి ప్రకృతి పట్ల ఉన్న అనుబంధాన్ని తన కవితలో చూపారు. ఎద్దు, పిచ్చుకపై బ్రహ్మాస్త్రం, కోడి వంటి కవితల్లో వాటిని వర్ణించిన తీరు హృద్యంగా ఉంటుంది.

కవిత్వంలో జీవితాన్ని, జీవితంలో కవిత్వాన్ని, కవిత్వంలో ప్రకృతిని, ప్రకృతిలో జీవితాన్ని, అంతటా దర్శించి, వర్షించిన సాహితీస్రష్ట, పూర్వ కవులను స్మరిస్తూ, ఉపమాది అలంకారాలు, శబ్దాలంకారాలను ఎల్లెడలను పయోగిస్తూ, వ్యంగ్యమును కనపరుస్తూ, చదువరులకు ద్రాక్ష, కదళీపాకాలతో కవిత్వాన్ని అందించి, తన కవిత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచి, అందరినీ కవిత్వంలో అందలం ఎక్కించిన కవిబ్రహ్మ శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి వచన కవిత్వం - సామాజిక దృక్పథం

- డాక్టర్ డి. మస్తానమ్మ, తెలుగు అధ్యాపకులు, ఐఐఐటి, ఒంగోలు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో విశేష ప్రజాదరణ పొందిన ప్రక్రియ వచన కవిత. దీనినే వచన పద్యం, వచన కవిత్వం అంటారు. 'అల్పాక్షరాలలో అనల్పార్థ భావాన్ని అభివ్యక్తం చేయడానికి వచన కవిత చక్కగా దోహదపడుతున్నది. ఈ వాస్తవాన్ని కవులు గుర్తించి వచన కవితలు రాస్తున్నారు. ఆ కవిత్వాన్ని పత్రికలు ప్రచురించి పాఠకుల దరికి చేరుస్తున్నాయి.

వచన కవిత్వపు నిడివి చాలా తక్కువ కాబట్టి కవి తాను చెప్పదలచిన భావాన్ని స్పష్టంగా తక్కువ పద జాలంలో చెప్పాల్సి ఉంటుంది. ఇది కవికి కత్తి మీద సాము వంటిదే. ఎంతో మేధోమథనం జరిగితే తప్ప వచన కవి ఒక మంచి కవిత రాయలేడు. అందువల్ల చాలా మంది ఒకటి రెండు కవితలు రాసి ఆ తర్వాత స్వస్తి చెబుతున్నారు. అయితే చేయి తిరిగిన కొందరు రచ యితలు వందలాది కవితలు రాస్తున్నారు. అలాంటి వారిలో అగ్రగణ్యుడు మాడభూషి సంపత్ కుమార్ గారు. వీరు సామాజిక స్పృహతో చక్కని కవితలు రాశారు. వీరు తన కవితలను 'జీవితం- కవిత్వం' 'మూడో మనిషి' 'శత్రువుతో ప్రయాణం', 'ఆలోచనలు', 'చివరకు నువ్వే గెలుస్తావు' మొదలైన కవితా సంపుటాలు వెలువరించారు. వీరి ప్రతి కవిత ఒక ఆణిముత్యమేనని చెప్పవచ్చు.

సృష్టిలో అమ్మకు సాటి మరెవ్వరూ రారు. అది మానవ జాతులు కావచ్చు. పశుపక్ష్యాదులు కావచ్చు. అమ్మ ప్రేమ నిరుపమానమైనది. ఈ సత్యాన్ని కవి మాడభూషి సంపత్ కుమార్ గుర్తించారు. 'ఆకు రాలిన కాలం' కవితలో కవి ఇలా అంటాడు.

అమ్మ ఆకులా రాలిపోయింది
పండీ పండకముందే
నిండా పండకముందే
ఎన్ని గాలుల్ని
ఎన్ని తుఫానుల్ని
తట్టుకొని నిలబడినట్లే
కాలాన్ని ఎదిరించి నిలబడుతుందనుకున్నాం
కానీ అమ్మ పండుటాకులా రాలిపోయింది!
పచ్చని చెట్టులా వెచ్చని తన ఒడిలో ప్రజలకు
సేదతీర్చిన అమ్మ
ఆకులు రాలి మోడు వారిపోతుందను కోలేదు
మళ్ళీ చిగురిస్తుందన్న ఆశతో కాయలు కాచిన
కళ్ళకు
కళ్ళుమూసుకున్న అమ్మ మాత్రమే దర్శన
మిస్తుందనుకోలేదు" అంటాడు కవి.

అమ్మ నిండు నూరేళ్ళు నిండకముందే చని పోయిందంటాడు కవి. ఆ విషయాన్ని చెప్పడానికి 'ఆకులా రాలిపోయింది' అంటాడు. ఆకులు చెట్లకుంటాయి. చెట్లు భగవంతుడు సకల జీవరాశులకు అందించిన వరం. ఈ చెట్లు లేకుంటే ఏ జీవి మనుగడ సాగించలేదు. దానినాధారంగా చేసుకొని సకల జీవరాశులు జీవిస్తు న్నాయి. చెట్టు పై ఎన్నో పక్షులు, క్రిమి కీటకాలు జీవిస్తుంటాయి. చెట్టుకింద పశువులు నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఆది మానవుడు చెట్టు తొర్రలో నివసించాడు. అలా వృద్ధి చెందిన మనిషి నేడు ఆ చెట్టును పరిపరి విధాలుగా ఉపయోగించుకుంటున్నాడు. మనిషి తప్ప తక్కిన జీవజాలమంతా చెట్టును వినియోగించు కుంటున్నాయి కానీ ఆ చెట్టుకు ఎలాంటి హాని చేయడం లేదు. అదే మనిషి దానిని ఉపయోగించుకుంటూ దాన్ని వినాశనం చేస్తున్నాడు. దాని ద్వారా తన మనుగడకే ముప్పు తెచ్చుకుంటున్నాడు. ఈ సత్యాన్ని బాగా గుర్తించిన కవి మాడభూషి సంపత్ కుమార్ తల్లిని చెట్టు ఆకుతో

పోల్చాడు. పండిన ఆకురాలితే దాని స్థానంలో మరో ఆకు వస్తుంది. అదే విధంగా కన్నతల్లి గతిస్తే తిరిగి జన్మిస్తుందో లేదో తెలియదు. అందువల్ల పిల్లలు, పెద్దలు ఆదరించాలంటాడు కవి. తల్లి ప్రేమను చెట్టు ప్రేమతో పోల్చాడు. ఇంత భావుకత్వం అందరి కవులకూ రాదని దృఢంగా చెప్పవచ్చు.

తల్లి పదిమంది బిడ్డలను పెంచిపోషిస్తుంది. అయితే పదిమంది బిడ్డలు తల్లిని పోషించకలేకపోతున్నారు. ఇది సమకాలీన నిష్ఠుర కఠోరసత్యం. ఎందరో తల్లిదండ్రులను వీధిపాలు చేసి ఉన్నారు. మరి కొంతమంది బతికుండగానే స్మశానంలో వదిలేసిన వారూ ఉన్నారు. ఇంకొందరు సుదూర ప్రాంతంలో వదలేసిన వారున్నారు. వీరు గాక ఇంకో వర్గం ప్రబుద్ధులున్నారు. వారు అందరికంటే తెలివిమంతులు. ఆదర్శ పురుషులమని, స్త్రీలమని ఫోజులు కొడుతుంటారు వీరు చేసే పని తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదలడం. తాము నిరంతరం బిజీగా ఉంటున్నామని అందువల్ల పెద్దల ఆలనాపాలనా చూసుకోలేకపోతున్నామని నిస్సిగ్గుగా, దర్పంగా ప్రకటిస్తుంటారు. అట్లాంటి వారి తీరును గూర్చి కవి 'తల్లి' అనే కవితలో ఇలా అంటున్నారు.

ఒక తల్లి / పదిమంది పిల్లల్ని
కనిపెంచి పోషిస్తుంది!
పదిమంది / పిల్లలు
ఒక తల్లిని పోషించలేకపోతున్నారు
రాను రాను మనుషులు
బలహీన పడిపోతున్నారు
అందుకే తల్లి
ఇప్పుడు
ఒకే బిడ్డతో సరిపెట్టుకొంటోంది - అంటాడు కవి.

తల్లిదండ్రులు తమ బిడ్డలకు తాము తిని తినక సంపాదించి సంపద ఇస్తున్నారు. చాలా మంది పిల్లలు ఆ ఆస్తులను దర్జాగా దౌర్జన్యంగా పంచుకుంటున్నారు. ఆ తర్వాత వారిని నిర్దాక్షిణ్యంగా రోడ్డు పైకి నెట్టేస్తున్నారు. వాళ్ళు బస్టాండు, రైల్వే స్టేషన్లలో బిక్షాటన చేస్తూ దుర్భర జీవనం గడుపుతున్నారు. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే బాగా సంపాదించి పెట్టిన వృద్ధ తల్లిదండ్రులె ఎక్కువగా ఇలాంటి విషమ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అత్యంత నిరుపేదలు, గిరిజనులు, దళితులు, రైతులు తమ తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ఇది ఒక సర్వేలో తేలిన కఠోర సత్యం. అందువల్ల కాలానుగుణంగా తల్లి కూడా మారుతున్నదని, ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటున్నదని వ్యంగ్యంగా అంటాడు కవి.

నేడు చాలామంది డాలర్ల వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్నారు. డాక్టర్లు, ఇంజినీర్లై అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించాలని ఉబలాటపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలకు ఆ ఆశయాలను రంగరించి నూరి పోస్తున్నారు. అక్కడ వెళ్ళాక తమబిడ్డలు పడుతున్న కష్టాలను భారతదేశంలో ఉన్న తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. దాంతో పిల్లలు అక్కడ ఉండలేక ఇక్కడికి రాలేక నతమతమవుతున్నారు. ఈ విషయాన్ని కవి 'మారని దృశ్యాలు' కవితలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

రోజూ టీవీలు
గుళ్ళు దిగిన గుండెల్ని
తెర మీద పరచి చూపిస్తున్నా
నెత్తురు పంచి పోషించిన పిల్లలు
నెత్తుటి మడుగులో పడి
కొట్టుకొంటున్న దృశ్యాలు
సంపాదన కోసం వెళ్ళిన పిల్లలు
శవాలై విమానాల్లో తిరిగి వస్తుంటే
తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిన దృశ్యాలు
ఏవీ మనసుమార్చడం లేదు
ఇంకా ఇంగ్లీషు చదువులు చదివి
ఆకాశం వైపు, అమెరికా వైపు మోరెత్తి చూస్తున్నారు!
అవతలి వాడు పొమ్మంటున్నా

ఇవతలి నుంచి పోవడానికి మార్గాలు అన్వేషిస్తున్నారు.
ఆత్మగౌరవం తాకట్టు పెట్టి
ఆర్థికంగా ఎదగడం గురించి ఆలోచిస్తున్నారు
దృశ్యాలు మారాలంటే
దూరదృష్టి ఉండాలి తప్ప
దూరంపైన దృష్టి కాదు!- అని తేల్చి చెప్పాడు కవి.

ట్రంపు అమెరికా అధ్యక్షుడు కాగానే అమెరికెతరులను ఆయా దేశాలకు పంపే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. దాంతో అమెరికా పౌరులు కొందరు ఇతర దేశీయుల పైకి దాడులకు పాల్పడ్డారు. ఎందరినో నిష్కారణంగా కాల్చి చంపారు. అయినా భారతీయులు వెనక్కు రాలేకపోతున్నారు. రాకుండానే ఉండిపోతున్నారు. ఈ దృశ్యాలన్నీ నిత్యం టివీలో చూస్తున్నా ప్రజలు మారడం లేదంటాడు కవి. తమ బిడ్డలను ఇంగ్లీషు చదివించి అమెరికా పంపించాలని చూస్తున్నారని ఎద్దేవచేస్తున్నాడు. భారతీయులు కొందరు ఆత్మగౌరవాన్న చంపుకొని ఆర్థికంగా ఎదగడానికే సిద్ధపడుతున్నారని అంటున్నారు కవి. ఈ దుర్భర స్థితిగతులు మారాలంటే ప్రజల దృష్టిదూరం మీద పోకుండా ఉండాలంటాడు కవి.

ఆది మానవుని దశనుంచి ప్రజలు వలసలు పోతున్నారు, వస్తున్నారు. ఈ వలసలను మనుషులేగాక పశుపక్ష్యాదులు సైతం వెళుతున్నాయి. ఎక్కడో ఉన్న సైబీరియా నుంచి కొన్ని వేల మింగో పక్షులు ప్రతి ఏడాది డిసెంబరు, జనవరి మాసంలో నెల్లూరు జిల్లా సూళ్ళూరు పేటకు వస్తున్నాయి. ఈ వలసలన్నవి చరజీవరాశి నరనరాల్లో జీర్ణించుకుపోయాయి. వీటిని నివారించడం కష్టం సాధ్యం. ఈ విషయాన్ని గూర్చి కవి మాడభూషి సంపత్ కుమార్ ఇలా అంటున్నాడు.

"అనాది కాలంలో
నీళ్ళ కోసం ప్రారంభమయిన వలస
సొంత నేల మీద / కాళ్ళు నిలపడానికి
తావులేక కొందరు / పుట్టిన గడ్డ మీదే
వివక్షకు గురై / అణగారిన వారు కొందరు
పూట గడవడమే / గగనమై
పొట్ట చేత పట్టుకొని
కొందరు"

- వలసలు వెళుతున్నారంటాడు కవి. అనాది కాలంలో నీటి కోసం ప్రజలు వలస వెళ్ళారని ఆ తరువాత నిలువ నీడలేక వివక్ష భరించలేక, పూట గడవక వలసలు వెళుతున్నారని విస్పష్టంగా తెలిపాడు. కోవిడ్- 19 కారణంగా భారతదేశంలో 22 కోట్ల మంది వలసలు వెళ్ళారని ప్రభుత్వం గుర్తించింది. అంతకు ముందు వారి వద్ద ఈ గణాంకాలు లేవు.

ఈ విధంగా కవి మాడభూషి సంపత్ కుమార్ చక్కని సామాజిక దృక్పథంతో వచన కవితలు రాసి ఆధునిక వచన కవిత్వంలో తనకంటూ ఒక స్థానాన్ని పదిల పరచుకున్నాడని దృఢంగా చెప్పవచ్చు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నిజం విలువ తెలిపిన 'మొదటి ఆబద్ధం'

- డాక్టర్ అనుగూరు చంద్రుశేఖర రెడ్డి , తెలుగు ఉపాధ్యాయులు..

'గురువంటే గుండ్రాయికాదు' అని ఓసినీకవి ఉవాచ. గురువంటే విద్యార్థి మస్తిష్కంలోని అజ్ఞానాన్నిపారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించే వాడని అర్థం. విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే గతి తప్పిన గురువులెందరినో మనం చూస్తూన్నాం. అటువంటి పరిస్థితుల్లో విద్యార్థులను నిజమైన శిష్య వాత్సల్యం తోనూ, మిత్రవాత్సల్యంతోనూ ఆదరించే పూజ్యగురు దేవులు శ్రీ మాడభూషి సంపత్ కుమార్‌గారు. వీరు నిగర్వి, నిరాడంబరులు, స్నేహశీలి, మితభాషి అందుకే అందరికీ ఆప్తులయ్యారు. వీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలను, ఆప్యాయతలను నేను ఎప్పటికీ మరువలేను.

తెలుగేతర రాష్ట్రంలో ఉంటూ తెలుగు విభాగాన్ని కాపాడుకుంటూ రావడమే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా ఏ ప్రొఫెసర్ వద్ద జరగనంత పరిశోధన కృషి నభూతో న భవిష్యత్ అన్నట్టుగా ఈయన వద్ద జరిగింది. 76 ఎంఫిల్, 28 పి.హెచ్.డిలు చేయించిన ఘనత శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారికే దక్కుతుంది.

మద్రాసు విశ్వవిద్యాలయంతో నాకు పాతికేళ్ళ అనుబంధం ఉంది. నాటినుండి నేటివరకూ ఎందరో ఉద్దండులు, మహామహులు పనిచేసినా తెలుగు విభాగానికి కనీవినీ ఎరుగనిరీతిలో ఓగుర్తింపు తీసుకొని వచ్చిదానికి ఓ అద్వితీయమైన స్థానాన్ని సాధించిపెట్టింది మాత్రం సంపత్ గారేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఎందరెందరో కవులకు, కళాకారులకు, సినీ రచయితలకు, ఉపాధ్యాయులకు సన్మాన సత్కారాలు 24 గంటల నిర్విరామ కవిసమ్మేళనం జరపడమే గాక తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన పరిశోధకుడు. ఎందరో విద్యార్థులకు చేయుతనందించి దిక్సూచిగా మారాడు. అందుకే పదవిలో ఉండగానే ఆయనపేరుమీద ధర్మనిధి ఉపన్యాసం వారి శిష్యబృందం ఏర్పాటు చేసింది. వీరు 2015 సం॥లో మద్రాసు విశ్వ విద్యాలయంలో అత్యున్నత డిగ్రీ అయిన డి.లిట్ పట్టాను అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే తరగనంతగా ఎల్లలు లేని సాహితీ సేవ చేసిన అపూర్వ ధన్యజీవులు శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు.

ఎక్కడ మొదలు పెట్టాలి?
ఎక్కడంటే అక్కడ మొదలు పెట్టడానికి వీల్లేదు
మనం చెక్కబోయే శిల్పం / అబద్ధం

అని మొదలవుతుందీ కావ్యం. సాధారణంగా అబద్ధం అనేది మనందరికీ తెలిసిన విషయమే ఆయినప్పటికీ? అది ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు? ఎలా? చెబుతామో మనకు గణాంకాలతో సహా ఈ పుస్తకంలోని ముందు మాటలో ఆచార్య సంపత్ గారు వివరించారు. తెలుగు సాహిత్యంలో బహుశా ఇంతవరకూ 'ఆబద్ధం గురించి కావ్యరచన చేసిన వారు ఎవరూ ఉండరని అనుకుంటున్నా ఈ ఖ్యాతి కూడా ఆచార్య సంపత్ గారికే దక్కుతుందని చెప్పవచ్చు.

నేటి కాలంలో అబద్ధం అనేది మనిషి జీవితంలో విడదీయరాని భాగమైపోయింది. చాలామంది ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకొనేవరకూ ఏదోవిధంగా చాలా తేలికగా అబద్ధాలు ఆడేస్తుంటారు.

అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం వారు అబద్ధాలపై చేసిన పరిశోధనలో చాలా ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. మనిషి అబద్ధం చెప్పడానికి క్రింది కారణాలని తెలుస్తోంది.

- 22% మంది తప్పును కప్పిపుచ్చుకోవడానికి అబద్ధంచెబితే

- 16% మంది ఆర్థిక లాభం కోసం
- 15% సొంతలాభాలకోసం,
- 14% మంది ఇతరులనుంచి తప్పించుకోవడానికి
- 8% మంది గొప్పలకోసం,
- 5% మంది ఏ కారణంలేకుండా,
- 5% మంది తమాషాకి,
- 5% మంది ఇతరులకు సహాయం చేయడానికి
- 4% మంది ఇతరులను కించపరచడానికి,
- 2% మంది మర్యాద/గౌరవాలకోసం అబద్ధాలు చెబుతారట.

అయితే అబద్ధాలు అందరూ చెబుతారు. ఏ వయసు వారు ఎక్కువగా చెబుతారు అన్న ప్రశ్నకు సమాధానం రాబట్టగా

- 6-7 సం॥ల వయసు వారు 29%
- 9-12 సం॥ల వయసు వారు 43%
- 13-17 సం॥ల వయసు వారు 59%
- 18-44 సం॥ల వయసు వారు 45%
- 45-59 సం॥ల వయసు వారు 39%
- 60-77 సం॥ల వయసు వారు 34% మంది అబద్ధాలు చెబుతారని వారు నిర్వహించిన సర్వేలో తేలింది. అంటే చిన్నప్పుడు సరదాగా ప్రారంభమైన ఆబద్ధాలు యుక్తవయసు దాకా బాగా పెరిగి, ఆతర్వాత మెల్లగా తగ్గు ముఖం పడుతుం దన్నమాట.

అబద్ధానికి అనేక పార్శ్వాలు ఉన్నాయి. అబద్ధంలో అనేక రకాలు కూడా ఉన్నాయి. ఎలాగంటే చూడ్డానికి అబద్ధంలా కనిపించకుండా ఉండే అబద్ధాలు, నిజాన్ని దాచిపెట్టడం, అబద్ధాన్ని గొప్పగా చెప్పడం.ఒక విషయంలో సగంచెప్పి సగం చెప్పక పోవడం ఇలా అనేక కోణాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అబద్ధాలే!

సాధారణంగా మనం పెళ్ళి విషయం వచ్చినపుడు "వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్ళి చెయ్యాలి" అనిసామెత. ఒక అబద్ధం చాలు జీవితం చట్టుబండలై పోవడానికి ఇదే విషయాన్ని ఆచార్యుల వారు ఇలా చెప్పారు.

"ఎప్పుడో పెళ్ళిలో చెప్పిన
అబద్ధాన్ని
జీవితాంతం కాపాడుకుంటూ రావాలి
ప్రేమ మితిమీరినప్పుడో
కోపం కట్టలు తెంచుకున్నప్పుడో
ఆవేశం అదుపు తప్పినపుడో
మాటలు తడబడితే
పెళ్ళిగుల్లయిపోతుంది"

అని ఎంతో చక్కగా విశ్లేషించారు.

అబద్ధానికి ఎంతో ఒద్దిక కావాలి
ఎంతో కష్టపడి చెప్పిన అబద్ధాలన్నీ
చివరకు ఒక్కనిజంతో నాశనమైపోతాయి. అని
హెచ్చరించారు కూడా!

అలాగే ప్రస్తుత సమాజ స్థితిని కూడా మన కళ్ళకు కట్టే ప్రయత్నం చేశారు ఆచార్యుల వారు. మీరే గమనించండి.

అబద్ధం ఆడ్డంలో అందరిదీ
అందెవేసిన చెయ్యే!
చీటికి మాటికి అబద్ధం
అవసరానికీ అబద్ధమే
అవసరం లేనిదానికి అబద్ధమే
చిన్న అబద్ధం
పెద్ద అబద్ధం
ఒక అబద్ధానికి
మరో అబద్ధం
ఒక దాన్ని కప్పిపుచ్చడానికి
ఇంకొకటి అతికిస్తూ
అబద్ధాలని అకాశానికెత్తేశారు.
మనిషి జీవితంలో అబద్ధానికి ఎంత

ప్రాధాన్యాత పెరిగిపోయిందో మనకు అర్థమవుతోంది.

ఇప్పుడు
అబద్ధం లేకుండా ఏదీసాగదు!
నిజం కూడా అబద్ధాన్ని కలిపితే గానీ రాణించదు
పచ్చినిజం చెబితే ఎవరూ నమ్మరు దాన్ని ఉడికించి
ఉప్పుకారం వేసి
వడ్డిస్తే గానీ నిజం కూడా దిగదు

ఎంత గొప్పవాస్తవాన్ని ఎంత గొప్పగా చెప్పారు గురువు గారు. దీన్నిబట్టి మనకర్థమయ్యేది ఏమిటంటే ఈరోజుల్లో అబద్ధం చెప్పనివారు ఎవరైనా ఉన్నారంటే అది నేతిబీరలో నేతిచందమే అవుతుంది.అబద్ధం లేనిదే ఏదీ నడవదు. అన్నీ అబద్ధంలో తడవాల్సిందే అంటారు గురువుగారు.

వేమనలాగా అనాటి పురాణ ప్రసిద్ధ వ్యక్తులను కూడా గురువుగారు వదల్లేదు

అలనాటి హరిశ్చంద్రుడు
ఎప్పుడడిగితే అప్పుడిస్తానని
ఎప్పుడోగానీ ఇవ్వలేదు
ధరరాజు శబ్దచాతుర్యంతో
అబద్ధాన్ని నిజం చెయ్యాలనుకొన్నాడు
వసుదేవుడు కన్నబిడ్డనే లేదన్నాడు
దుర్యోధనుడు

ఇస్తానన్న రాజ్యాన్ని ఇవ్వలేదు అంటూ పురాణాల్లో ఆడిన అందమైన అబద్ధాలను సైతం వేలుపెట్టి చూపించే ప్రయత్నం చేశారు.

మనపెద్దలు కొన్ని సందర్భాల్లో అబద్ధం ఆడడానికి అనుమతిని ఇచ్చి ఉన్నారు. 'వారిజాక్షులందు వైవాహికములందు . . . . అన్న పద్యంలో అబద్ధం ఆడడంవల్ల వచ్చే ఇబ్బందులేమిటో కూడా గురువు గారు చాలా చక్కగా విశ్లేషించారు.

అంతేకాకుండా ప్రస్తుత కాలంలో జరిగిన జరుగుతున్న విషయాల్ని కూడా అక్షరబద్ధం చేశారు. బ్యాంకులకు టోపీవేసి పారిపోయిన విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీ లాంటి వాళ్ళను కూడా తన కవిత్వంలో స్పృశించారు. మీరే చూడండి.

ఇప్పుడే తీరుస్తానని
బ్యాంకులో అప్పులుతీసుకొని
వేలకోట్లు
లక్షలకోట్లు

ఎగ్గొట్టేవాడికి తాను చెబుతున్నది అబద్ధమని తెలుసు తాను అప్పు తీర్చయ్యేది లేదని తెలుసు అబద్ధం అవినీతి అనేవి రెండూ ఒక నాణానికి ఉన్న రెండు పార్శ్వాల్లాంటివి. ఇదే విషయాన్ని గురువుగారు చాలా స్పష్టంగా చెప్తున్నారు.

అవినీతికి పాల్పడే వాడు
అబద్ధాన్ని ఆశ్రయిస్తాడు
అవినీతిని ప్రోత్సహించేవాడు
అబద్ధంపై ఆధారపడతాడు

కోర్టుల్లో లాయర్లు చేసే మాయాజాలం అంతాఇంతా కాదు. పందిని నందిగాను నందిని పందిగాను మార్చగలిగే సత్తా మన లాయర్లకు మాత్రమే ఉంది. అదే విషయాన్ని గురువుగారు చక్కగా వివరించారు.

అబద్ధానికి పుట్టినిల్లు కోర్టులు
లాయర్లు
అబద్ధాలతో ఆడుకొనే ప్లేయర్లు
అబద్ధాల ఫోర్లు, సిక్సర్లతో
బోల్తా కొట్టించే
లాయర్లే రాణిస్తారు.

ఎన్నికలకు ముందూ వెనుకా రాజకీయ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే. ప్రజల్ని మోసపుచ్చి అధికారంలోకి వచ్చి ఎలా తప్పించుకుంటాడో మళ్ళీ తిరిగి ఎన్ని అబద్ధాలతో ప్రజల్ని వంచించాలను కుంటాడో సవివరంగా వినిపించే ప్రయత్నం చేశారు గురువుగారు. చివరికి అబద్ధాల్లో ఆరితేరినవాళ్లే రాజకీయాల్లో రాణించగరలని, అబద్ధం ఆడలేనివాడు ఎందుకు కొరగా కుండా పోతాడని అంటారు.

అసలు అబద్ధం చెప్పడమనేది చిన్నప్పటినుంచి పిల్లలకు మనమే నేర్పిస్తుంటాము. అది ఇంటి దగ్గర నుంచిమొదలై బడిలో, కళాశాలలో మహావృక్ష మౌతుంది. ఈవిషయాన్ని కూడా గురువుగారు అత్యద్భు తంగా అక్షరబద్ధం చేశారు.

నిబద్ధతలేని మనిషిముందు నిలబడలేక
నిజం నిష్క్రమిస్తుంది
అబద్ధం తనగెలుపుకు తానే ఆనందతాండవం చేస్తుంది
విజయతాండవం చేస్తుంది.

అబద్ధం ప్రవేశించని, అబద్ధం ఆక్రమించని, అబద్ధం కనపడని చోటంటూ ఈ భూమ్మీద ఎక్కడాలేదు. ప్రతి రంగంలోనూ ప్రవేశించి విశ్వవ్యాపితమై, అణువు మొదలు ఆజాండం వరకు నిండి నిబిడీకృతమై ఉంటుందీ అబద్ధం.

నివురు గప్పిన నిజం
మళ్ళీ నిద్రలేచే దాకా

అబద్ధానిదే అరచేతిలో స్వర్గం స్వర్గంలో కూడా అబద్ధానిదే పై వర్గం. అని ముగుస్తుందీ కావ్యం.

❖❖❖

ఆంధ్రభాషా భూషణ

శ్రీ విద్యా వినయాన్విత
భావాంబరవీధి సాగు భవ్య చరిత్రా
నీవలె భారతి గొల్చిన
సేవకు డొక్కండులేడు చెలగి కనంగా

సీ॥ ఆంధ్ర భాషా భూష! అమరిన ధృవతార
సాహిత్య రత్న! విభావధార!
పరభాషలందున్న పటిమంబు కొనిదెచ్చి
మన భాష కిచ్చిన మాన్యమూర్తి
పరిశోధనాంశాల పరిఢవిల్లగ జేసి
తెలుగు వెల్గించిన దీపమూర్తి
పత్ర సమర్పణ ప్రాకటమ్ముగ జేసి
భారతి గొల్చిన భద్రమూర్తి

ఆ॥వె॥ మాడభూషి వంశ్య- మహనీయ గుణగణ్య
తమిళనాట తెలుగు దనరునట్లు
జేయుచున్న ధన్య! చెలగి నీకు
ఏటి కోళ్లు గొనుము యిద్ధమూర్తి

తే॥గీ॥ ఆయురారోగ్య భాగ్యాల నలర జేసి
సిరులు గురిపించి, బలువైన శ్రేయమిచ్చి
గాచుగావుత దేవుండు ఘన మృదుండు
మిమ్ము మీ కుటుంబమ్మును మించునట్లు

-శ్రీ నారాయణం బాలసుబ్రహ్మణ్యం,
శతావధాని, అద్దంకి.

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'జీవితం కవిత్వం'లో అంతర్గత విశేషాలు

- డాక్టర్ జలీనాకతూబ్ షేక్

అనిర్వచనీయమైనది జీవితం. మనిషి పుట్టుక నుండి మరణం వరకు సాగించే ప్రయాణమే జీవితం. మనిషి శక్తిమంతుడు అయ్యాడు. ఎన్ని విషయాలు చుట్టు ముట్టినా అవన్నీ సరికొత్త జీవన వికాసానికి దారి చూపాయే కానీ మనిషిని జయించలేకపోయాయి. మనిషి జీవితం అనే అంశంపై ఎన్ని నిర్వచనాలు తెలిపిన అవి పూర్తి అర్థాన్ని ఇచ్చేవని చెప్పలేం. అలాంటి ఒక విశిష్టమైన విషయాన్ని కవిత్వ రూపంలో తెలపడం ఎంతో కష్టతరమైన అంశం. కాని మన కవి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ జీవితాన్ని కవిత్వీకరించడం ప్రసంశనీయమైన విషయం. ఇలాంటి కవిత్వ వస్తువు కాలానికి రాజీ పడకుండా తరాలవెంబడి నడుస్తూనే ఉంటుంది.

మాటల్లోని కర్తవ్యనిష్ఠ, క్రియాశీలత, ఆపత్కాలంలో కచ్చితంగా సమయోచితంగా ప్రపర్తించాలనే నేర్పు అవగాహనకొస్తాయి అవి మనిషికి జీవితాన్ని నేర్పుతాయి. అన్ని దిక్కుల నుండి కమ్మేసినప్పుడు దారితెన్నూ తెలియనప్పుడు ప్రాణాలను దక్కించుకోవాలనే తపన కోసం వెతికే క్రమంలో, ఆపద సమయాల్లో కూడా జీవితం పాఠాలు నేర్పుతుంది. జీవితం నుండి నేర్చుకోవడానికి ఎన్ని ఉదాహరణలు వస్తున్నా అవి తక్కువే అనిపిస్తాయి. ఏ సమయంలో ఎలా మెలగాలి, ఎందుకలా చేశారని అన్న వాటికి సమాధానాలు ఉండవు. ఈ విధమైన జీవితాన్ని కవి మనకు "జీవితం" అనే కవిత్వ రూపంలో పరిచయం చేశారు. వారి కలం నుండి జాలువారన కొన్ని ఆణిముత్యాలను పరిశీలిద్దాం, అందులోని అంతర్గత అంశాలను తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం . జీవితాన్ని విడిచి పెట్టి

కవిత్వం ఎలా రాస్తావ్ ?
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా రాస్తావ్ ?

జీవితాన్ని, కవిత్వాన్ని విడివిడిగా వీక్షించడం సమంజసం కాదునుకుంటాను, ఎందుకంటే అవి రెండు విడివిడిగా ఉండవు కాబట్టి. కవిత్వాన్ని రాయాలంటే జీవితాన్ని తెలుసుకొని ఉండాలి. మహాభారతంలో ధర్మరాజు జీవితాన్ని, ధర్మాన్ని విడివిడిగా చూడలేదు. అసత్యాన్ని పలకమని అందరూ ఆయన్ని ఒత్తిడి చేస్తే అందుకు ఆయన అంగీకరించలేదు. ఎందుకంటే అసత్యాన్ని పలకడం అధర్మం కాబట్టి. జీవితం, కవిత్వం అలాంటివే. జీవితం తెలియని వారు కవిత్వాన్ని రాయలేరు.

జీవితమంతా ముళ్ళు!
కవిత్వమంతా కళ్ళు!
కళ్ళలో ముళ్ళు!
ముళ్ళలో కళ్ళు!

చూసే కళ్ళను బట్టి పదార్థం మారిపోతుంది. అందుకే అంటుంటారు మనుషులు "నా కళ్ళు పెట్టుకొని చూడు" అని. రామాయణంలో ఏదీ కోరని సీత బంగారు జింకను కోరింది. ఈ ఒక్క సంఘటన రామాయణాన్ని మలుపు తిప్పేసింది. కవి హృదయం జీవితంలోని ముళ్ళను కవిత్వం వంటి కళ్ళతో చూశారు. అందుకే కవి కళ్ళకు ముళ్ళకు ముడిపెట్టారు.

కవిత్వమే నాకు ప్రాణం
నేనే కవిత్వానికి ప్రాణం

కమలాలకు సూర్యుడు ప్రాణం, కలువలకు నెలరాజు ప్రాణం, కవికి కవిత్వం ప్రాణం, జీవితం లేని కవి లేడు, కవిలేని కవిత్వం లేదు. రాధాకృష్ణుల కాయాలు వేరు, ప్రాణం ఒక్కటే. జీవితం, కవిత్వం అలాంటివేనని కవి ఈ కవితలో తెలిపాడు. ఒకదాన్ని వీడి మరొకటి మనలేవు.

పండువెన్నెల్లో / కవిత్వాన్ని ఆరబోసి
జీవితమంతా కాపలా కాస్తాను
జీవితానికి పండువెన్నెల్ని
ఆసరా చేస్తాను !
కవిత్వానికి జీవితాన్ని ధారబోస్తాను !

అంబరమందు నక్షత్రాలను చూసినప్పుడు మనిషి ఆనందిస్తాడు. అలాంటి వెన్నెల రాత్రి పరవసించిన మనస్సును, కవి మదిలోని భావాలను కలగలిపిన కవిత్వాన్ని జీవితంతో చిత్రం గీస్తే రవివర్మ గీసిన తైలవర్ణ చిత్రంలా ఉంటుందని కవి ఈ కవితలో చూపారు. జీవితానికి కవిత్వాన్ని ఆధారంగా చేశారు కవి.

జీవితమొక ఎడారి / కవిత్వమొక ఒయాసిస్సు

ప్రకృతితో జీవితం సంబంధం అనివార్యం. వసుధపై గల భూస్వరూపాలన్ని మనిషి మనుగడకు ఆసరానే. వాటిలో పర్వతాలు, సముద్రాలు, నదులు, ఎడారులు ఉన్నాయి. జీవితాన్ని ఎడారిగా భావించి, అందులో ఆహ్లాదాన్ని నింపడానికి ఒయాసిస్సు లాంటి కవిత్వాన్ని పొసగడం కవికే చెల్లుతుంది. భాగవతంలో తనను సంహరించడానికి వచ్చిన రాక్షసుల మధ్య పెరిగిన శ్రీకృష్ణునిలా. ఎడారిలాంటి జీవితంలో ఒయాసిస్సు లాంటిది కవిత్వం అని కవి భావం.

కవిత్వం బరువయింది / జీవితం తేలికయింది
కవిత్వాన్ని జీవితంలోకి
తర్జుమా చేస్తే జీవితం బరువుగా సాగుతుంది
కవిత్వం తేలికగా ఎగురుతుంది
జీవితాన్ని కవిత్వంలోకి మారిస్తే
కవిత్వ వేడెక్కుతుంది / జీవితం చల్లారిపోతుంది

మానవుడు జీవితంలో కర్మను అంటే చేస్తున్న పనిని ఎప్పుడు కష్టంగానే భావిస్తాడు. నిజంగా అవి కష్టమైనవేనా, అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే సమాధానం ప్రశ్నే మిగులుతుందేమో. ప్రకృతిలో ప్రతి జీవి తన పనిని తాను కష్టంగా భావించదు. నిరంతరం అంటే మరణించే వరకు తమ పనిని తాము విధిగా చేస్తూనే ఉంటాయి. చేప జీవితకాలం నీటిలో ఈదుతూనే ఉంటుంది, పిపీలికం తన కంటే ఎన్నో రెట్లు ఎక్కువ బరువైన పనులను చేస్తూనే ఉంటుంది. అదే విధంగా కవి జీవితం బరువుగా కవిత్వ తేలికగా వాటిని తారుమారు చేస్తే జీవితం తేలికగా కవిత్వం బరువుగా అంటూ గారడీ చేశారు.

పక్కలో ఉన్నప్పుడే కవిత్వం జీవితమవుతుంది
పక్కకు తప్పుకుంటే జీవితం నిర్వీర్యమవుతుంది

జీవితం నిర్వీర్యం కావడానికి మరొకరు ఎప్పుడూ కారణంకారు. సొంతగా మనిషి మరొకరి నుండి ఎప్పుడూ ఏదో ఒకటి ఆశించడమే అందుకు కారణం. కవిత్వాన్ని జీవితంగా, జీవితాన్ని కవిత్వంగా ప్రక్కప్రక్కనే రైలు పట్టాలుగా భావించాలి ఎందుకంటే అవి కలవవు, కాని రైలు నడవాలంటే రెండూ పట్టాలు కావాలి అలాగే జీవితాన్ని, కవిత్వాన్ని విడివిడిగా గ్రహించలేం. కవి దాన్ని ఇక్కడ ఇలా కవిత్వీకరించారు.

జీవితమంతా / కవితామయం
జీవికన్నా / కవి నయం
జీవితంలో భయం / కవిత్వంలో అభయం

"భయం" ఇది నరుని శాంతంగా బ్రతకనివ్వదు. పుట్టినప్పటి నుండి మరణించే వరకు విద్య, ఉద్యోగం, వ్యాపారం, సంసారం, ఒక్కటేమిటి అన్ని అంశాలలోనూ భయం. ఒక నిర్ణీతమైన మార్గంలో ప్రయాణం చేయాలి, నియమబద్ధమైన జీవితాన్ని సాగించాలి అని ఎప్పుడూ భావించడు మనిషి. కంసుడు, కృష్ణుడు వచ్చి తనని సంహరిస్తాడేమోనని ఎప్పుడూ భయపడుతూనే ఉన్నాడు, భయంతో కంసుడు పొందిదేమీలేదు, మరణించడం తప్ప. వాలి వల్ల భయంతో ఉన్న సుగ్రీవుడు శ్రీరాముని శరణు వేడి అభయాన్ని పొంది, వాలి సంహారంతో రాజ్యాన్ని పొందాడు. భయాన్ని వీడి మంచి కవిత్వాన్ని చదివినా, విన్నా, రాసిన పొందేది అభయమేనని కవి భావం.

జీవితానికి / కవిత్వానికి
ఉన్న భేదం / కవిత్వం మోదం
అంగీకరిస్తే ఆమోదం!

హృదయాంతరాలలో గల భేదాన్ని ఛేదించి నప్పుడు కవిత్వం జీవితానికి అమోదమవుతుంది, జీవితం కవిత్వానికి ఆధారమవుతుంది. ధర్మరాజు విధురుని మాటను ఆమోదించాడు లక్క ఇంటి నుండి బయట పడగలిగాడు. కురుక్షేత్రయుద్ధంలో కృష్ణని మాటలను ఆమోదించాడు అర్జునుడు, విజయం తన పాదా క్రాంతమైంది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు సర్దార్ వల్ల భాయ్ పటేల్ మాటను ఆమోదించిన 500 సంస్థానాలు భారతదేశంలో విలీనమైనాయి. భారతదేశం సుసంపన్న మైంది. జీవితానికి కవిత్వం భేదంలేని మోదం ఆమోదం అవుతుంది.

జీవితాన్ని / కవిత్వం ముంచదు
కవిత్వాన్ని జీవితం తుంచదు
మునిగిన జీవితాన్ని / కవిత్వం తేలుస్తుంది!
తునిగిన కవిత్వాన్ని / జీవితం అతుకుతుంది!

కాగితాన్ని ముక్కలు ముక్కలు చేస్తే దాన్ని తిరిగి అంటించడం చాలా కష్టం, అదేవిధంగా విరిగిన కొమ్మను తిరిగి వృక్షానికి అతికించలేము. జీవితంలో జరిగిన కొన్ని విషయాలను తిరిగి బాగు చేయడం కష్టమైన పని కాని జీవితాన్ని మళ్ళి మనకు నచ్చిన విధంగా మార్చుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. అహల్య గౌతమ మహర్షి భార్య జీవితంలో జరిగిన తప్పును మళ్ళీ సరిదిద్దు కోవడానికి ఎన్నో సంవత్సరాల తపస్సు చేసి శ్రీరాముని స్పర్శతో పునీతురాలై భర్తను చేరింది. అదేవిధంగా మనిషి జీవితం అలలపై కదిలే నావలా మునుగుతూ, తేలూతూ ఉన్నట్లు కనిపిస్తుంది. కవిత్వం జీవితం ఒడ్డును చేరే మార్గదర్శి అవుతుందన్నారు కవి.

అంతరాంతరాల్లోనుంచి / ఉబ్కింది కవిత్వం!
అనంతవాయువుల్లోకి / దూకేది జీవితం!

ఇహము, పరము అను రెండు అంశాలను దృష్టిలో ఉంచుకొని భారతీయ జీవనం సాగుతుంది. మానసికంగా ఉన్నతమైన ఆలోచనా సరళిని అంతరాల్లో నుండి తీసు కొని దాన్ని ఆచరణలో పెట్టగలగడం కవిత్వం చేస్తుంది. జీవితం కూడా అంతే అనంతమైన ఆలోచనలను సన్మార్గంలో పెట్టగలగడమే ఉన్నతమైన పనిగా చేస్తుంది. ప్రతిజ్ఞాబద్ధుడైన భీష్ముడు ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా తన అంతరాలలో ఉన్న సంఘర్షణను అనుభవించినప్పటికి జీవితాన్ని సార్థకత చేసుకోవడానికి, ఇచ్ఛామరణాన్ని కూడా ధర్మబద్ధంచేసి అనంతమైన వాయువుల్లోకి తన ప్రాణశక్తిని మిళితం చేశాడు. జీవితం, కవిత్వం రెండూ అలాంటివే. ఇతరుల హృదయాంత రాల్లోకి కవిత్వం ప్రసరించాలంచాలంటే తల్లి గర్భం నుండి శిశువు జననం జరిగినట్లుగా కవిత్వం కూడా అలాగే పురుడుపోసుకుంటుంది. అలా పురుడుపోసుకున్న కవిత్వం జీవితంగా మారుతుంది.

జీవితం / ఎవరికీ గులాంగిరికాదు!
కవిత్వం / ఎవరికీ వంగిసలాం చెయ్యదు!
నిలువెత్తు కవిత్వంలో / జీవితం తలెత్తుకు తిరుగుతుంది!

శ్రీశ్రీ కవిత్వం చదివితే నిరాశా, నిస్పృహలతో కాక తలెత్తుకు బ్రతకడం మనిషి నేర్చుకుంటాడు. జీవితం లోనూ, కవిత్వంలోనూ ఒకరికి తలవంచి బానిసలా బ్రతకడం అవసరం ఉండదని తెలుసుకుంటాడు. కవి తెలిపిన "గులాంగిరి, వంగిసలాం" వంటి పదాలలోని లోతును గమనించడం అంత చిన్న విషయం కాదు. అది అనుభవించేవారికే తెలుస్తుంది. విభీషనుడు రావణా సురుని అధర్మప్రవర్తనకు గులాంగిరి చేయలేక సొంత సోదరునితోనే బంధాన్ని తెంచుకొని శ్రీరాముని శరణు వేడాడు. కష్టించి శ్రమించేవాడు ఎవరి వద్ద వంగిస లాములు చేయాల్సిన పనిలేదు, ఎవరికి గులాంగిరి చేయాల్సిన అవసరం లేదు. అదే పోలికను కవి ఇందులో ప్రతిక్షేపించాడు. కవిత్వం, జీవితం ఎవరికి బానిస కాదు, గులాంగిరి చేయడానికి, వంగిసలాం చేయడానికి.

జీవితాన్ని / అమ్ముకోవడం వృత్తి
కవిత్వాన్ని / నమ్ముకోవడం ప్రవృత్తి

జీవితంలో ప్రతి నిమిషం ఎవరోవకరి కోసం ఏదోవొకటి త్యాగం చేయాల్సిన అవసరం వస్తూనే ఉంటుంది. అదే జీవితాన్ని అమ్ముకోవడంగా కవి భావించారు దాన్ని వృత్తితో పోల్చారు. కవిత్వం నమ్మి నడిపించేదిగా స్వీకరించాలి. నమ్ముకున్న భావాలను కవిత్వంగా చిత్రించి అందులోగల ఆపదలను స్వీకరించి జైలు గోడలను కాగితాలుగా మార్చుకున్న కవులు దాశరథి, కాళోజీ లాంటివారు ఉన్నారు అదే ప్రవృత్తి. ఇలాంటి కవులకు వృత్తి, ప్రవృత్తి కవిత్వంగా ఉంటుంది, దాన్ని అనుసరించాలన్నదే కవి చెప్పదలుచుకుంది.

జీవితమంతా / ఇజాలు
కవిత్వమంతా / నిజాలు
ఇజాలకు నిజాలకు / పొంతన లేకపోతే
కవిత్వమే జీవితం / జీవితమే కవిత్వం

మనుజుడు ఎప్పుడూ "నేను, నా" అనే రెండు పదాల దగ్గరే ఇంకా ఆగిపోయాడు. "నిజం, ఇజం" ఇవి రెండు మానవుని ఒకదానితో ఒకటి కలిసి ఉండటం ఆసాధ్య మేమో. రెండు కత్తులు ఒక ఒరలో ఇమడలేవు. అలా మనిషి జీవితంలో నిజం, ఇజం అలాంటివే. దుర్యోధనుడు ఇజంతో ఎప్పుడూ నిజాన్ని చూస్తూ తనకు అన్ని దక్క కుండా పోతున్నాయని నిరంతరం పరివేదన చెందుతూనే ఉన్నాడు. అందుకే అన్నీ ఉన్నా జీవితాన్ని ఆస్వాధించలేక పోయాడు. ఎప్పుడూ నిజాన్ని ఇజంతో పోలిక చేయకుండా ఉంటే సహజమైన ఆనందాన్ని పొందవచ్చు.అందుకే ఇజాలను తీసిన జీవితం నిజాలనే కవిత్వంతో పొందికగా ఉంటాయాని కవి ఊహించారు.

జీవితమొక ఆకాశం / కవిత్వమొక సముద్రం
అందుకోనూలేం / ఈదనూలేం

జీవితం ఆకాశం, కవిత్వం సముద్రం అంతంలేనివిగా కవి భావం. మనిషి మరణించినా జీవించవచ్చు అదే కీర్తి, అశోకుడు, ఈ రోజుకు చక్రవర్తులో చెప్పుకునే మొదటి పేరు, ప్రజల హృదయాల్లో జీవించే ఉన్నారు. అశోకుని జీవితం ఆకాశమంత ఎత్తుకు ఎదగడమంటే. రచన చిరకాలం ఉంటుంది సముద్రంలా. వాల్మీకి రచన అలాంటిదే. రామాయణం ధర్మానికి నిదర్శనమైన కావ్యం. ఎన్ని యుగాలైన అలాగే ఉంటుంది సముద్రంలా. అందుకోనక్కరలేదు, ఈదనూ అవసరంలేదు మనం ఎంచుకున్న మార్గం సరైనది ఐతే అదే మనకు శాశ్వత స్థానాన్ని కల్పిస్తుందని కవి తెలిపారు.

కవిత్వాన్ని / రంగరిస్తే
రంగుల జీవితం! / జీవితంలోకి
తొంగిచూస్తే / రంగుల కవిత్వం!

ఇంద్రధనస్సు రంగులమయం. మానవుడు రంగు రంగు జీవితాన్ని గడపాలని ఆశిస్తాడు. కాని తెలుపు రంగు ఏ రంగులోనైనా కలిసిపోతుంది, నలుపు రంగు అన్ని రంగులను తనలో కలుపుకుంటుంది. జీవితం, కవిత్వం కూడా అంతే మనిషిని ఉన్నతమైన స్థానంలోనూ నిల బెట్టగలవు, పాతాళంలోకి తోసేయగలవు. ఆనందం, సంతోషం, సుఖం అన్నింటిని తెలుపుతో పోల్చుకుంటే, బాధను, దు:ఖాన్ని నలుపుతో పోల్చుకుంటే మనిషిలో రెండూ ఎప్పుడూ ఉంటాయి. తుఫానులో కొట్టుకుపోతున్న మనిషిని, ఒక దుంగ ఆధారంగా ఒడ్డుకు చేర్చినట్లు. భగవంతుని కోసం వెదుకుతున్న వివేకానందకు రామ కృష్ణపరమహంస కల్పవృక్షంలా దొరికినట్లు. వెతకపోయిన తీగ కాలికి తగిలినట్లు. జీవితం కవిత్వంలా రంగుల మయం చేసుకోవాలన్నదే కవి ఆలోచన.

జీవితాన్ని / కాచి వడబోసిన వాడు
కవిత్వాన్ని రుచి కూడా చూడలేడు!
కవిత్వంలో / మునిగి తేలినవాడు
జీవితాన్ని అవలీలగా ఈదగలడు!

జీవితంలోని ఒడిదుడుకులను తెలుసుకున్న వాడు కవిత్వాన్ని చక్కగా రుచి చూడగలడు. మన రాష్ట్రపతి అబ్దుల్‌కలాంగారు అలాంటివారే. పేదరికం నుండి

ఉన్నత పదవులను అధిరోహించిన అబ్రహాంలింకన్ అలాంటి వారే. వారు ఎలాగైతే పేదరికం నుండి అత్యున్నత స్థానానికి చేరారో మనిషి తన జీవితంలో పట్టువదలని విక్రమార్కుడిలా తన గమ్యాన్ని చేరాలని, లక్ష్యాన్ని అధిరోహించాలని కవి ఆశిస్తున్నారు.

కవిత్వానికి / రెండు కళ్ళు
వస్తువు, శిల్పం / జీవితానికి
రెండు ఒళ్ళు / కవిత్వం, మానవత్వం

వస్తువు, శిల్పం లేని కవిత్వ ఉండదు, కవిత్వం, మానవత్వం లేని జీవితం ఉండదు. మహాభారతంలోని సక్తుప్రస్థని కథ అందుకు ఉదాహరణ. సప్తఋషులలోని విశ్వామిత్రుని కథ అలాంటిదే. వారివి కథలు కాదు జీవితాలు. అన్నింటిని జీవితంలోనూ, కవిత్వంలోనూ చూడగలగడం కవి గొప్పతనం.

కత్తితో / జీవితం తెగుతుంది!
కలంతో / కవిత్వం అతుకుతుంది!

కత్తి, కలం మనిషికి సాధనాలు. అవనరాని ఉపయోగపడే ఆయుధాలు. కత్తితో యుద్ధం చేయగలం, కూరగాయలు కోయగలం. కలంతో పిచ్చి గీతలు గీయగలం, చిత్రాలు వేయగలం. జీవితానికి కవిత్వానికి సంబంధం అలాంటిది. గడియారంలో పెద్దముల్లు, చిన్నముల్లు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. నీటికి చేపకు గల సంబంధం అలాంటిదే.

జీవి / ఉలితో
రాతిని శిల్పం చేస్తాడు!
కవి / శిల్పంతో
కవిత్వానికి జీవం పోస్తాడు!

శిల్పి ఉలితో శిల్పం చెక్కుతాడు, కవి శిల్పంలో కవిత్వాన్ని చూస్తాడు. కవికి, శిల్పికి తేడాలేదు. రాతిలో శిల్పాన్ని, శిల్పంలో కవిత్వాన్ని చూపించగలగడం అద్భుతం. మహాభారతంలో పాండవుల రాజధాని ఇంద్ర ప్రస్తంలో నిర్మించిన మయసభలో ఉన్నవి లేనట్లుగా లేనివి ఉన్నట్లుగా నిర్మించాడు దేవశిల్పి మయుడు. అదేవిధంగా కవి, శిల్పి అందరూ జీవితాన్ని కాచి వడపోసిన వారే. అందుకే వారు జీవితానికి అవసరమైన శిల్పాలను, కవిత్వాన్ని ప్రపంచానికి అందించగలరు, అందించ గలిగారు.

జీవితాన్ని చదివితే, పరిశీలిస్తే, ఆలోచిస్తే,
ఆలోచన సంద్రం జీవితం

ఈ పదాల సమూహాన్ని.... జీవితాన్ని కడలిని పర్యాయ పదంగా భావించవచ్చు. సముద్రంగా జీవితాన్ని పోల్చడం ఇతిహాస, పురాణాల నుంచి మనం గమనిస్తూనే ఉన్నాం. సంద్రం వల్ల ఉపయోగం లేదా?, ఉంది అవి తాగడానికి పయోగపడవు కాని తాగడానికి ఉపయోగపడే వర్షాన్ని ఇచ్చేవి సముద్రాలే, రత్నగర్భగా జలధినే వర్ణిస్తారు, వసుధ పై కంటే సంద్రంలోనే ఎక్కువ జీవులు నివసిస్తున్నాయి. భగవంతుని సృష్టిలో ఉపయోగపడనిదంటూ ఏదీ లేదు. అందుకే కవులు జలధిని జీవితంతో పోలుస్తూ ఉంటారు. సముద్రాన్ని అయినా ఈదగలం కాని సంసారాన్ని ఈద లేమనే నానుడి పుట్టింది. జీవితాన్ని ఎన్ని విధాలుగానైనా నిర్వచించవచ్చు. అందుకే జీవితాన్ని కవిత్వాంతో నిర్వచించారు కవి.

ఆకలికి / వాకిలి తీస్తుంది జీవితం
ఆ కలికి / వాకిలి మూస్తుంది కవిత్వం

జీవితంలో ఆకలికే మొదటి స్థానం. ప్రాచీన మానవుడి నుండి ఆకలితోనే మనిషి ప్రయాణం సాగింది. కొత్త కొత్తవి అన్వేషించినా, నూతన మార్గాలను కనుగొన్న, గ్రహాంత రాలకు వెళ్ళినా అవన్నీ ఆకలి తీర్చే సాధనాల కోసమే. అగ్రతాంబూలం ఆకలిదే. ధర్మరాజు ఎన్ని కష్టాలు వచ్చినా మూర్ఛపోలేదు. అరణ్యవాసానికి వెళ్ళుతూ తనతో వచ్చేవారికి భోజనం పెట్టలేకపోతున్నానని భయపడి మూర్ఛపోయాడు. ఆకలి తీర్చడమే మనిషి మొదటి కర్తవ్యం కూడా. శిబి చక్రవర్తి చరిత్ర మనకు అదే తెలుపు తుంది. జీవితానికి ఆకలితో ముడిపెట్టి ఈ కవితలో కవి తన మానవత్వాన్ని చాటారు.

జీవితపు / రహదారిలో / సేద తీర్చే చెట్టు / కవిత్వం! / చెట్టు సేద తీర్చేదే కాదు, మనిషి ప్రాణాన్ని నిలబెట్టేది కూడా. మనిషి జీవితం చెట్టుతో మిళితమై ఉంటుంది. అదే విధంగా మనిషి నిరాశతో ఉన్నప్పుడు కవిత్వం దానికి ప్రాణం పోస్తుంది. జీవితంలో ముందుకు వెళ్ళే మార్గాన్ని సుగమం చేస్తుంది. సంకటాలను ఎదుర్కునే ధైర్యాన్ని స్తుంది. భారతీయ సంస్కృతిలో పుస్తకపఠనం అనేది ఒక భాగం. అందుకే మన పెద్దలు కష్టాలు ఎదురైనప్పుడు ఇతిహాసాలను, పురాణాలను చదవమని మనకు హితబోధ చేస్తారు. అవి మనకు ఉత్తేజాన్ని ఇస్తాయి. మంచి కవిత్వం మంచి మార్గానే చూపుతుందిని కవి తెలిపారు.

"మార్గనిర్దేశం జీవితం .. కవిత్వం
జీవితం ఒక కవనం / పాట జీవితం
నేలబారు జీవితం.../ చుక్కెదురు...
నేను కవిత్వమై మొలుస్తాను ...
కవికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని . . . .
పిండుకోవడమే పరమార్థం
కవిత్వం, జీవితం - ఉత్తరదక్షిణ ధ్రువాలు"

ఇలాంటి అనేక పదబంధాలను సృషించారు కవి. కవి గురించి, కవిత్వం గురించి పూర్తిగా చెప్పలేం, ఎందుకంటే జీవితంలోనూ, కవిత్వంలోనూ వారి విభిన్నమైన అంశాలను తట్టిలేపుతారు కాబట్టి.

ఏ విషయమైన సరే కొత్తగా ఉండాలని కవి కోరుకుంటాడు. సహృదయంతో కవి ప్రపంచంలోని అందరూ వసుధైక కుటుంబంలా ఉండాలని ఆశిస్తాడు. అదే ఈ కవిత్వంలో మనం గమనించగలం. సంపత్‌కుమార్ "జీవితం" కవిత్వం మరపురానిది. స్థిరంగా ఎన్నోకాలాలు నిలచివుండేది. లోకహితమే కవిత్వం యొక్క పరమార్థం. సాహిత్యంలోని కవిత్వం హృదయానందాన్ని పూర్తిస్థాయిలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా మనుషులకు ఇవ్వగలిగేదే. ఈ "జీవితం" కవిత్వం రాయడంమే కవి తన జీవితానికి సార్థకతను సంపాదించుకున్నట్లుగా భావించవచ్చు. పెను మార్పులు జీవితంలో వచ్చినా, ప్రళయాలే సంభవించినా, ఎలాంటి జాడ్యాలు వేధించినా, ఉప్పెనలు ఉపద్రవాలు మీదపడినా, మనిషి సంక్షేమమే కవి కలం రాయాలి, అదే ఈ కవిత్వంలో జరిగిందనుకోవచ్చు. ప్రతి జీవితం సుఖాంతం అవుతుందిని భావంతలేం, అలాగే విషాదమవుతుందని చెప్పలేం కాని కవి తన కలంతో కవిత్వంలో అన్నింటిని మార్చగలడు అని నిరూపించగలిగే ''జీవితం'' అనే కవిత్వాన్ని సమాజానికి అందించే ప్రయత్నం చేశారు సంపత్ కుమార్.

"మనమందరం భారతీయులం - భావితరాలకు సారధులం"

ఆధార గ్రంథాలు :

1. జీవితం - మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'సంపాదక' ఆచార్యులు మాడభూషి

- డాక్టర్ లేబాకు విజయకృష్ణారెడ్డి (ఎల్వీ7కే), రిజిస్ట్రార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

జర్నలిజం తొలినాళ్లలో సామాజిక రుగ్మతలపై పోరాటం, సామాజిక చైతన్యం, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం, భాష, సంస్కృతి, సాంప్రదాయాల్ని పునర్జీవింపజేయడం వంటి అలిఖిత లక్ష్యాలతో ఊపిరి పోసుకుంది. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్ని భాగ స్వాములను చేయడానికి సోపానంగా నిలిచింది. అనేక మంది జర్నలిస్టులు లక్ష్యసాధనలో జైలు జీవితాలు గడిపారు. జీవితాల్ని త్యాగం చేశారు. ఉత్తమ జర్నలిస్టులుగా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరు, ప్రతిష్టలు సంపాదించుకున్న తెలుగువారు అనేకమంది ఉన్నారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా జర్నలిజం పూర్తిస్థాయి వ్యాపారరంగంగా మారిపోయింది. యాజమాన్యాల కనుసన్నల్లో వార్తలు, వార్తాకథనాలు, వ్యాసాలు రాయాల్సిన తప్పని పరిస్థితి ఏర్పడింది.చివరకు సంపాదకీయాలకూ మినహాయింపులేకుండా పోయింది. యజమాని అభీష్టానికి అనుగుణంగానే ఏదైనా ఉండాలనే పరిస్థితికి జర్నలిస్టులు కూడా అలవాటు పడిపోయారు. ఈ నియంత్రణలు ఉన్నా తమ ఆత్మసాక్షిగా వార్తలు, వ్యాసాలు రాసే జర్నలిస్టులు మనకు తారసపడుతూనే ఉంటారు. నేటి పత్రికలు ఏదో ఒక రాజకీయపార్టీ కొమ్ము కాస్తున్నాయి. అవకాశం దొరికినప్పుడల్లా పాఠకదేవుళ్లనడంతప్ప వారికి అందించే ప్రసాదం (వార్తలు) మాత్రం నాసిరకంగానే ఉంటున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. గడిచిన మూడు దశాబ్దాలకాలంలో ఈ వైఫరీత్యం మరింత పెరిగింది. ఇలాంటి పరిస్థితిలో 1999, 2000 సంవత్సరాల్లో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ హైదరాబాదు నుంచి వెలువడిన 'విజేత' దినపత్రిక కోసం రాసిన సంపాదకీయాలు మణిపూసలని చెప్పవచ్చు. ఆయన సంపాదకీయాల్ని పరిశీలిస్తే సరళత, సమగ్రత, సంక్షిప్తత, స్పష్టత, ఏకరూపశైలి స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిన్న వాక్యాలు, లోతైన విశ్లేషణ, ఎక్కడా తొట్రుబాటు లేకుండా ఆకట్టుకునే వాక్యాలతో సాఫీగా సాగుతుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పాఠకుల్ని అక్షరాలవెంట నడిపించే శక్తి సంపత్‌కుమార్ సొంతమా? అనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా దాకా అనేక అంశాలపై సంపత్‌కుమార్ సంపాదకీయాలు రాశారు. సమాజంలో నిత్యం కనిపించే, ప్రజల్ని ప్రభావితం చేసే పలు విషయాలపై సవివరంగా, సమగ్రంగా సంపాదకీయాలు ప్రచురితమయ్యాయి. రాజకీయ, సామాజిక, ఆర్థిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలు విదేశీ సంబంధాలపైన విశ్లేషణాత్మకంగా రాసిన సంపాదకీయాలు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. ప్రభుత్వాలు తీసుకునే డీజల్ ధరలపెంపు వంటి కొన్ని నిర్ణయాలు సామాన్యుల జీవితాలను ఎలా ప్రభావితం చేసి వారి జీవితాల్ని ఎంతలా అతలాకుతం చేస్తాయో వివరించిన తీరు నిజంగా అభినందనీయం.

పత్రికలు పూర్తిగా రాజకీయ పార్టీలతో అంటకాగుతూ, ఏదో పక్షానికి అండగా, దన్నుగా నిలుస్తున్న కాలంలో రాసిన సంపత్‌కుమార్ సంపాదకీయాల్లో ఎక్కడా రాజీ పడినట్లు కనిపించకపోవడం విశేషం. నిజానికి సంపాదకీయాలు పత్రిక విధానాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. వివిధ అంశాలపై లోతైన విశ్లేషణ, ఆయా అంశాలపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు లేదా సమాజానికి మేలు జరుగుతుందనే విషయాల్ని ఉటంకిస్తూ సంపాదకీయాలు సాగుతాయి. పత్రికల్లో విలువలు సన్నగిల్లిన దశ ప్రారంభమయ్యాక సంపత్‌కుమార్ రాసిన సంపాదకీయాలు రాజకీయపార్టీలవైపు మొగ్గు చూపకుండా ఖచ్చితత్వాన్ని ప్రదర్శించడం అభినందనీయం. ఆయన రాసిన సంపాద

కీయాల్లో 44 ఎంపిక చేసి 'రెండో ఓటమి' పేరుతో ప్రచురించారు. ఆ సంపాదకీయాల్ని స్థూలంగా సమీక్షించడమే ఈవ్యాసం ఉద్దేశం. వర్తమాన పరిస్థితిలో ఉండే వివిధ అంశాలపై పత్రికలు రాసే సంపాదకీయాలు ఆ పత్రిక అభిప్రాయానికి దర్పణాలుగా ఉంటాయి. ఆయా అంశాలపై పత్రిక తన అభిప్రాయాన్ని, విధానాన్ని వెల్లడించేందుకు ఉన్న ఏకైక మార్గం సంపాదకీయం. అదే సందర్భంలో సంపాదకీయాల్లో విశ్లేషణ, పూర్వాపరాల ప్రస్తావనతో తన విధానాలకు అనుగుణంగా పాఠకుల అభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నం కూడా పత్రిక చేస్తుంది. తద్వారా సమాజాభ్యున్నతికి బాటలు వేస్తుంది.

సంపాదకీయాల్లో సామాజిక స్పృహ :

సంపత్ కుమార్ రాసిన సంపాదకీయాలు చదువుతుంటే ఆయనలోని సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత కనిపిస్తాయి. రాష్ట్రంలో, దేశంలో తీవ్రవాదాన్ని శాంతి భద్రతల సమస్యగా ప్రభుత్వాలు భావిస్తున్నదృష్ట్యా ఆ సమస్య పరిష్కారం కావడంలేదనేది సామాజికవేత్తల భావన. హేతుబద్ధమైన పరిష్కారం దిశగా ప్రభుత్వాలు ఆలోచనలు చేయకపోవడంతో తీవ్రవాద సమస్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయింది. ఈ సమస్య గురించి "హింసే మార్గమా?" శీర్షికన రాసిన సంపాదకీయంలో "తీవ్రాద సంస్థలు ఎక్కడో మొదలై ఎక్కడో తేలుతున్నాయి. ఏ లక్ష్యంకోసం ప్రజల మద్ధతు సంపాదించాయో ఆ లక్ష్యాన్ని మరిచి పోతున్నాయి. గమ్యాన్ని చేరుకొనే మార్గం తోచక అగమ్యగోచరంగా తయారవుతున్నాయి. దారి తప్పిన తీవ్రవాదులు సరైన దారి వెతికే జ్ఞానంలేక, వెనక్కి రావడానికి ఇష్టంలేక లక్ష్యం లేని హింసా మార్గంలో పయనిస్తున్నారు. తమ దారి తప్పుని అంగీకరించే స్థయిర్యం లేకపోవడంతో హింసామార్గాన్నే సమర్థించుకుంటున్నారు" అని వాస్తవపరిస్థితిని కుండ బద్ధలు కొట్టారు. "మూడు దశాబ్దాలుగా సాగుతున్న తీవ్రవాద ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచివేయడానికి తప్ప పరిష్కరించడానికి ఎప్పుడూ పూనుకోకపోవడం విచారించాల్సిన అంశం" అంటూ అటు ప్రభుత్వ తీరును కూడా తప్పుబట్టారు. అదే విధంగా తీవ్రవాద సంస్థల డిమాండ్లను విస్మరించి వాటి హింసను మాత్రమే పదే పదే చెబుతూ ప్రభుత్వాలు ఉద్యమాల్ని అలక్ష్యం చేయడంవల్ల సమస్య పరిష్కారం కాదని, మొదటి నుంచే శాంతి స్థాపనకు కృషి చేస్తే మంచిదనే అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పారు.

ప్రజాస్వామ్యంలో డొల్లతనం :

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమని మన నాయకులు, పాలకులు అవకాశం దొరికినప్పుడల్లా చెబుతుంటారు. ఎన్నికల్లో హింస, ఓటర్లలో నిర్లిప్తత, ఓటర్ల జాబితాలో పేర్ల గల్లంతు, పోలింగ్ స్టేషన్‌కు వెళితే ఓటు పోల్ అయిందనే మాటలు, ఓటర్లను మభ్యపెట్టేందుకు సారా, మధ్యం, డబ్బులు పంపిణీ చేయడం, ఆలయాల్లో ప్రమాణాలు చేయించడం, కులాల వారీగా, మతాల వారీగా ప్రచారాలు నిత్యం కనిపిస్తున్న వాస్తవాలు. ప్రజాస్వామ్యంలో కనిపించే ఈ డొల్లతనాన్ని "బోగస్ ప్రజాస్వామ్యం" శీర్షికన సంపత్‌కుమార్ కళ్లకు కట్టారు. "50-60 శాతానికి మించని పోలింగ్‌శాతం, అక్షరజ్ఞానం లేని అమాయకులైన ప్రజలను మభ్యపెట్టి, ప్రలోభపెట్టి, భయపెట్టి ఓట్లు వేయించుకోవడం ఒకవైపు, వాళ్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండాచేసి వాళ్ల ఓట్లను పార్టీలే వేసుకోవడం మరోవైపు సజావుగా సాగిపోతోంది" అంటారు సంపత్‌కుమార్. "ఓట్లు వేయడానికి వెళ్లిన ప్రజలకు ఓటర్ల జాబితాలో తమ పేర్లు కనిపించవు. సాక్షాత్తు ఎన్నికల కమిషనర్ జి.వి.జి. కృష్ణమూర్తి పేరు కనిపెట్టడానికి అధికారులంతా కిందా మీదా పడ్డారు. ...పోలైన వాటిలో 21 శాతానికి పైగా బూటకపు ఓల్లేనని లోక్‌సత్తా తన పరిశోధనలో వెల్లడించింది" అంటూ ససాక్ష్యంగా వివరాల్ని పాఠకుల ముందుంచారు. ఎన్నికల పరిస్థితి ఇలా ఉండగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్ని కొనుగోలు చేయడం, ఇతర పార్టీల నుంచి అప్రజాస్వామికంగా తమ వైపు తిప్పుకోవడం, అధికారంకోసం అడ్డుదారులు తొక్కడాన్ని "అమ్మకాలు - కొనుగోళ్లు" శీర్షికన రాసిన

సంపాదకీయంలో కళ్లకు కట్టారు. పార్టీ, ఆతర్వాత కూటమికి మెజారిటి సీట్లు రాని సమయంలో ఎదుటి పార్టీ లేదా కూటమిలో బీటలు సృష్టించి లబ్ధిపొందేందుకు రాజకీయ నాయకులు అనునరించే విధానాన్ని ఉదాహరణలతో విశ్లేషించారు.

ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు సాగించే దౌర్జన్యాలు, హింసను గురించి ప్రస్తావిస్తూ బీహార్‌లో తుపాకులు పేలినా... నరసరావుపేటలో బాంబులు పేలినా ప్రభుత్వాన్ని చేజిక్కించుకోడానికి ప్రజాస్వామ్యం కన్నా బలస్వామ్యమే సులభమార్గమని నిర్ణయించు కోవడమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఎన్నికల సందర్భంగా జరిగిన హింసపై "బీహార్‌లో ముగిసిన మారణహోమం" శీర్షికన రాసిన సంపాదకీయం ప్రజాస్వామ్యవాదుల మనసును మెలి పెడుతుంది. హింసాత్మక సంఘటనలకు విదేశీ శక్తులు కారణమని సాక్షాత్తు ప్రధాని వాజ్‌పేయి ప్రకటించడం విడ్డూరం. ఆ విషయాలు తెలిసికూడా అడ్డుకునే ప్రయత్నాలు సక్రమంగా చేయకపోవడాన్ని ఎమనాలి?. "విదేశీ శక్తుల గురించి వాజ్‌పేయి ప్రకటన చేసిన తరువాత జరిగిన మూడో విడత ఎన్నికల్లో ఐఎస్‌ఐతో సంబంధం ఉన్న అండర్‌గ్రౌండ్ డాన్ హింసకు పాల్పడుతూ ప్రజల చేతిలో మరణించాడంటే పరిస్థితిని పసిగట్టినా అదుపు చేయలేక పోయారన్న సత్యం బయటపడినట్టేకదా?" అని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్లిప్తతను ఎండగట్టారు.

ప్రజాభిప్రాయాన్ని గాలికొదిలేస్తున్న పార్టీలు :

రాజకీయాల్లో సిద్ధాంతాలు ఎప్పుడో కనుమరు గయ్యాయి. అధికారమే పరమావధిగా రాజకీయ పార్టీలు ప్రస్తానం సాగిస్తున్నాయి. నాయకులు విలువలకు తిలోద కాలు ఇచ్చేశారు. ఒకపార్టీ తరపున గెలిచిన ప్రతినిధులు అధికారంలోకి వేరేపార్టీ వచ్చినా వచ్చే అవకాశం ఉన్నా వెంటనే సొంతపార్టీకి 'విడాకులు' ఇచ్చేస్తారు. నియోజకవర్గ అభివృద్ధికోసం పార్టీమారు తున్నామని ప్రకటనలు చేస్తారు. నిజానికి పార్టీలు మారుతోంది స్వప్రయోజనాలకోసమేనని అందరికీ తెలుసు. అరుణాచల్ ప్రదేశ్, గోవా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మెజారిటీ ఉన్న పార్టీలు కాకుండా ఇతరులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, ఉన్న ప్రభుత్వం కూలిపోవడం మనకు తెలుసు. అదే తరహాలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎన్నికైన ప్రతినిధులు పదుల సంఖ్యలో అధికారపార్టీల్లో చేరిపోవడం చూశాం. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్లు, గవర్నర్ల తీరుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా వారు పట్టించుకోరు. ఆయా పదవుల ప్రతిష్టకు మచ్చతెస్తున్నారు. ఇలాంటి సందర్భం 2000 సంవత్సరం మార్చిలో బీహార్‌లో చోటుచేసుకుంది. ఎన్నికలు ముగిసి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ఆర్‌జెడికి స్వల్ప మెజారిటి ఉంది. భారతీయ జనతాపార్టీ నాయ కత్వంలోని ఎన్‌డిఎ మ్యాజిక్ ఫిగర్ దగ్గరలోనే నిలిచి పోయింది. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలవల్ల ఆర్‌జెడికి మద్ధతు ఇచ్చే అవకాశం ఉండదని బిజెపి భావించింది. తీరా కాంగ్రెస్ ఆర్‌జెడికి మద్ధతు ప్రకటించడంతో బీజేపీ అధికారాన్ని దక్కించుకోడానికి యుద్ధప్రాతిపదికన పావులు కదిపి గవర్నర్‌ద్వారా ఆ ఆకాంక్షను నెరవేర్చుకుంది. గవర్నర్ ఎన్.డి.ఎ.ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వా నించడం, సభలో బలనిరూపణకు పది రోజులు గడువు ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. 'ఎన్‌డిఎకి బలపరీక్ష, ప్రతిపక్షాలకు శీలపరీక్ష' శీర్షికన సంపత్ రాసిన సంపాద కీయంలో పార్టీలు, గవర్నర్ వ్యవస్థల అసంబద్ధ వ్యవహారా లను దునుమాడారు. సంప్రదాయాల్ని పట్టించు కోకుండా పార్టీలకు అనుగుణంగా వివిధ సందర్భాల్లో గవర్నర్లు తీసుకున్న నిర్ణయాల్ని ఉటంకిస్తూ బీహార్ గవర్నర్ నియామకం నుంచే ఆయన సశ్చీలతపై ఉన్న అనుమానాల్ని ప్రస్తావించారు. మెజారిటి లేదని తెలిసి అధికారం అప్పగించి బలనిరూపణకు పదిరోజులు గడువు ఇవ్వడమంటే ఖచ్చితంగా బేరసారాలకు ద్వారాలు తెరవడమనే విషయాన్ని స్పష్టంగా రాశారు. ఎన్‌డిఎ చేపట్టే బలపరీక్ష నిజానికి బీహార్‌లోని అన్ని పార్టీలకు శీలపరీక్ష అన్నారు సంపత్. ప్రజాప్రతినిధులు గోడదూకకుండా

అమ్ముడు పోకుండా చర్యలు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డంలో ప్రతిపక్షపార్టీలన్నీ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారాయన.

అధికారం చేపట్టాక బలం నిరూపించుకోవాలి. సంఖ్యా బలంలేని కూటమి ఎలా నిరూపించుకుంటుంది?. ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన నితీష్‌కుమార్ రాజీనామా తప్పనిసరి. పదోరోజు అదే జరిగింది. ఈ పరిణామాల్ని ముందురాసిన సంపాదకీయానికి కొనసాగింపుగా... 'రెండో ఓటమి' శీర్షికన భారతీయ జనతాపార్టీ నేతృత్వం లోని ఎన్‌డిఎ శాసనసభలో బలం నిరూపించుకోలేక నవ్వుల పాలైందని రాశారు సంపత్‌కుమార్. సంఖ్యాబలం లేకుండా రాజ్‌భవన్ రాజకీయాలతో ముఖ్యమంత్రి పదవిని అధిష్టంచిన ఎన్‌డిఎ నాయకుడు నితీశ్‌కుమార్ తొమ్మిదిరోజులపాటు పార్టీలను చీల్చడానికి, సభ్యులను కొనడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తనకుతాను పదవీచ్యుతుడు కావాల్సివచ్చిందని చురక వేశారు. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించి జరగబోయే పరిణామాల్ని సంపాదకీయాలద్వారా పాఠకుల ముందు ఉంచడం సంపత్ కుమార్‌లోని విశ్లేషణాదృక్పదం, రాజకీయ అంచనాల్ని గుర్తించవచ్చు.

ఎన్నికల ప్రచారం... అదో తంతు :

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు విడుదల చేసే మ్యానిఫెస్టోకు అధికారంలోకి వచ్చాక చేపట్టే కార్యక్రమాలకు చాలా సార్లు సంబంధమే ఉండదు. ప్రచారంలో నాయకులు చేసే ప్రసంగాల్లో కూడా ప్రజల సమస్యలకంటే ఇతర అంశాలే ఎక్కువగా ఉంటుం టాయి. వ్యక్తిగత విమర్శలు, ప్రతివిమర్శలు, రెచ్చగొట్ట మాటలతో ఎన్నికల ప్రచారం సాగుతుంటుంది. ఇదే విషయాలపై సంపత్‌కుమార్ 'ఒక తంతు ముగిసింది!' శీర్షికన రాసిన సంపాదయకీయంలో జనాభ్యుదయం, సామాజిక అభ్యున్నతికి సంబంధించిన విషయాలు ఎన్నికల ప్రచారంలో వినిపించలేదని స్పష్టీకరించారు. పేదరిక నిర్మూలన, ఉచిత విద్య, ఉపాధికల్పన, రౌడీయిజాన్ని రూపుమాపడం, మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, అవినీతి నిర్మూలన అంశాలు ఎన్నికల ప్రచారంలో వినిపించలేదని రాశారు. "ఎన్నికలకు ముందు జయలలిత అవినీతి గురించి ఊదరగొట్టిన పార్టీలు ఎన్నికల సమయంలో అవినీతి ప్రస్తావనే తేలేదు. నదుల అనుసంధానం, జాతీయ విద్యావిధానం, భారతీయ శిక్షాస్మృతి సవరణ లాంటి సమస్యలు చర్చకు రాలేదు" అని విశ్లేషించారు. అన్ని పార్టీలు ఆ తానుముక్కలే అన్నట్లు అన్ని పార్టీలదీ అదే తీరు అని రాజకీయపార్టీల వైఖరిని ఎండగట్టారు.

ఎన్నికల సందర్భంగా రాజకీయపార్టీలు ఇంకోరకమైన కుప్పిగంతులు కూడా వేస్తుంటాయి. సర్వేల పేరుతో తమకు అనుకూలంగా ఫలితాలు వస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుంటాయి. ఇందుకు మళ్లీ వేదికలు మాత్రం మాధ్యమాలే. ఏ ఎండకాగొడుగు అన్నట్లుగా ఉండే మాధ్యమాలు కావచ్చు.... పార్టీలతో అంటకాగే మాధ్య మాలు కావచ్చు... అర్ధసత్యాలు, అసత్యాలని తెలిసికూడా సర్వే ఫలితాలంటూ ప్రచురిస్తుంటాయి. ప్రసారం చేస్తుం టాయి. ఇదంతా ఓటర్లను ప్రభావితం చేయడంలో భాగమేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. వివిధ సర్వేసంస్థల అభిప్రాయాలకు, వాస్తవఫలితాలకు నక్కకూ నాగలోకానికి ఉన్నంత అంతరం వివిధ సందర్భాల్లో రుజువయింది. ఎగ్జిట్‌పోల్స్ విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని నిషేధం కూడా విధిం చింది. ఈ విషయాల్ని సర్వేల మధ్య ఉన్న తేడాలు, సర్వే ఫలితాలు, వాస్తవ ఫలితాలకు ఉన్న తేడాల్ని గణాం కాలతోసహా 'సర్వేల శిరోభారం' శీర్షికన కళ్లకు కట్టారు ఆచార్య సంపత్‌కుమార్.

సైన్యం గుప్పెట్లో పాకిస్థాన్ :

మన పొరుగుదేశం పాకిస్థాన్‌లో ఎప్పుడు ప్రజా ప్రభుత్వాలు కూలిపోతాయో చెప్పడం కష్టం. సైన్యం చేతిలో అక్కడి ప్రభుత్వాలు ఎపుడూ బంధీలే. అధి కారంలో ఎవరు ఉన్నా అంతర్జాతీయ సంబంధాలు

ముఖ్యంగా భారతదేశంతో సంబంధాల విషయంలో మాత్రం సైన్యం మాటే చెల్లుబాటు అవుతుంటుంది. సైన్యం అభీష్టానికి భిన్నంగా అక్కడ ప్రజా ప్రభుత్వాలు వ్యవహరిస్తే తక్షణం ఆ ప్రభుత్వాన్ని కూలదొసి అధికారం చేపట్టడం పాకిస్థాన్‌లో సైన్యానికి రివాజు. "ఆధునిక కాలంలోకూడా ప్రజా ప్రభుత్వాలను సైన్యం రద్దు చేయడం ఒక్క పాకిస్తాన్‌లో మాత్రమే యధేచ్ఛగా సాగుతోంది. అక్కడి ప్రజాపాలకులకు, సైన్యానికి సాగుతున్న అంతర్గత కుమ్ములాటలో ఎప్పుడూ సైన్యందే పైచేయిగా ఉంటోంది" అని పాకి స్తాన్ అంతర్గత పరిస్థితిని వివరించారు సంపత్ తన "పాకిస్తాన్‌లో తిరుగుబాటు" శీర్షికన రాసిన సంపాదకీయంలో. అక్కడి ప్రధాని నవాజ్‌షరీఫ్, సైన్యాధ్యక్షుడు ముషారఫ్ మధ్య ఉన్న విభేదాలు, అందుకు దారితీసిన కారణాలు విశ్లేషించిన తీరు ఆయనకు పాకిస్థాన్ రాజకీయ, సామాజిక, విషయాలపై ఉన్న అవగాహనను ప్రస్ఫుటం చేస్తుంది. కార్గిల్‌నుంచి చొరబాటుదారుల్ని వెనక్కి పిలిపించమని ప్రధాని నవాజ్‌షరీఫ్ ఆదేశించడం సైన్యానికి ఆగ్రహం కలిగిందని, సైనిక పాలనకు దారి తీసిన పరిస్థితిని విశ్లేషించారు. మొత్తం స్వతంత్ర పాకిస్తాన్‌లో సంవత్సరాల వారీగా ప్రజాప్రభుత్వాల్ని సైన్యం ఎలా కూల దోసిందో వివరించారు. ఒక ప్రభుత్వాన్నికూలదోసినప్పుడు అక్కడి ప్రతిపక్షాలు నోరుమెదపని తీరును ఎండగట్టారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా పాకిస్తాన్‌లో ప్రజలు అవిద్య, ఆకలితో సతమతమవుతున్నారని ప్రజల్లో చైతన్యం రాకుండా పాలకులు, ప్రజాస్వామ్యం బలపడ కుండా సైన్యం జాగ్రత్త పడుతున్నట్లు విడమరిచి చెప్పారు. అదే విధంగా అమెరికా అధ్యక్షుడు క్లింటన్ ఆసియా పర్యటన నేపథ్యంలో 7 ఫిబ్రవరి, 2000న రాసిన సంపాదకీయంలో పాక్ సైనిక పాలకుడు ముషారఫ్ బెదిరింపులను ఉటంకిస్తూ రాసిన సంపాదకీయంలో... భారత్, పాకిస్తాన్ మధ్య సంబంధాలు, భవిష్యత్తు పరిస్థితిని విశ్లేషించారు. భారతదేశం, బంగ్లాదేశ్‌లో పర్యటించి క్లింటన్ పాకిస్తాన్‌ను విస్మరిస్తే తను ఏకాకిగా మారిపోతాననే బెంగతో దిగజారి మాట్లాడిన బెదిరింపులను చక్కగా విశ్లేషించారు. స్వదేశంలో మద్ధతు కూడగట్టు కోవడం, అంతర్జాతీయ సంబంధాల్ని పెంపొందించు కోవడం, అమెరికా ప్రాపకాన్ని సంపాదించడం లక్ష్యాలుగా ముషారఫ్ బెదిరింపులు ఉన్నాయనే విషయాన్ని ప్రస్తావిస్తూ ముషారఫ్‌లోని సైనిక పోకడల్ని వివరించారు. ఈ సంపాదకీయాలు చదివితే పాకిస్తాన్ స్థితిగతులపై సంపత్‌కుమార్‌కు ఎంత సాధికారిత ఉందో అట్టే అర్థమవుతుంది.

అధికారుల వైఫల్యాలపై....

పాలకులు, అధికారుల వైఫల్యాలపై తీవ్రంగా స్పందించడం సంపత్‌లో ఉన్న మరో గుణం. దేశంలోని జైళ్లలో ఉండే ఖైదీల్లో మానసిక పరివర్తనకోసం తొలిదశలో కిరణ్‌బేడి పెద్దఎత్తున కృషి చేశారు. జైళ్లలో మగ్గిపోయేలా కాకుండా వారిలో మానసికమార్పు తీసుకొచ్చి పరివర్తన వచ్చేలా చేస్తే శిక్షాకాలం ముగిశాక కుటుంబంతో.... సమాజంలో గౌరవనీయమైన జీవితాన్ని సాగిస్తారు. పరివర్తనకోసం చేసే కృషి ఎలా ఉన్నా.... కొన్ని సందర్భాల్లో జైళ్లలో అవాంచీనయ సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. 1999 నవంబరులో చెన్నైలోని కేంద్ర కారాగారంలో జరిగిన దుర్ఘటన జైళ్ల ప్రతిష్టను మసక బారేలా చేసింది. అక్కడి రక్షణ ఏర్పాట్లలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. శిక్ష అనుభవిస్తున్న వడివేలు అనే ఖైదీ మరణించారు. వడివేలు అనుచరులుగా భావించే కొందరు ఖైదీలు అక్కడి సిబ్బందిపై దాడికి తెగబడ్డారు. రికార్డుల్ని దహనం చేశారు. అడ్డుకోబోయిన డిప్యూటి జైలర్‌ను మంటల్లో వేసి సజీవదహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో పదిమంది మరణించారు. వడివేలు మరణవార్త తెలియగానే ఆయన అనుచరులైన ఖైదీలే కాకుండా బయటివ్యక్తులు కూడా హింసాకాండలో పాల్గన్నారంటే కేంద్రకారాగారాల్లో ఉండే రక్షణ వ్యవస్థ ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. నిషేదిత

ఆల్ ఉమ ఉగ్రవాదసంస్థకు చెందిన ఖైదీలు కూడా ఉన్న జైలులో రక్షణ, భద్రత ఏర్పాట్లు ఎలా ఉండాలి? ఖైదీల విషయంలో అమానవీయంగా ఉండే అధికారులు, రాక్షసంగా ప్రవర్తించిన ఖైదీలు, వారిని అదుపుచేసే పరిస్థితిలేని సిబ్బంది గురించి వ్యధ, నిరసనతో కూడిన వాక్యాలతో సాగిన సంపాదకీయం జైళ్లస్థితి గతులపై ప్రతిఒక్కరు దృష్టిసారించాలనే భావనను కలిగిస్తోంది.

ప్రజల పక్షాన ఆలోచన :

జర్నలిస్టుకు సామాజిక బాధ్యత ఉండాలి. ప్రజల పక్షాన ఆలోచించాలి. ప్రభుత్వ నిర్ణయాలు, వివిధ సందర్భాల్లో ప్రజలకు కలిగే లాభనష్టాల్ని విశ్లేషించి వారికి గరిష్టంగా మేలు జరిగేలా జర్నలిస్టుల రాతలు ఉండాలి. సమస్యను ప్రస్తావించడంతోపాటు పరిష్కారానికి మార్గమూ చూపాలి. సంపత్‌కుమార్ సంపాదకీయాలు దాదాపుగా అదే కోణంగా సాగాయి. డీజిల్ ధరల పెంపునకు నిరసనగా మోటారు ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ సమ్మెబాట పట్టిన సందర్భంగా 1999 అక్టోబరులో 'ప్రజలకు రవాణా 'సమ్మె'ట పోటు!' శీర్షికన రాసిన సంపాదకీయంలో వాహనదారుల సమ్మెకు కారణమైన డీజిల్ ధరలపైంపునకు దారి తీసిన కారణాల నుంచి ఆ పెంపు ప్రభావం సమాజంలో ఏఏ వర్గాలపై ఎలా పడతుందో విశ్లేషించిన తీరు ప్రజలపక్షాన సంపత్ చేసే ఆలోచనలకు అద్దంపడుతోంది. అంతర్జాతీయంగా చమురు ధరలపెంపు నుంచి మొదలు ఆయిల్ కార్పొరేషన్ లోటును భర్తీ చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆయిల్ ధరలను పెంచాలని అంతకుముందు ఎప్పుడో నిర్ణయించడాన్ని ప్రస్తావించారు. ఆయిల్‌ధరల పెంపు వాహనదారుకంటే అన్ని విధాలా ప్రజలకే భారమనే విషయాన్ని విస్పష్టంగా విశదీకరించారు. డీజిల్‌ధర పెంపుతో రవాణా ఛార్జిలు, బస్సుఛార్జీలు పెరగడం అనివార్యమని, తద్వారా నిత్యావసరాల ధరలు పెరిగిపోతాయని వివరించారు. రైతులు వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్ వాడాల్సినందువల్ల వ్యవసాయ ఖర్చులూ తడిచి మోపెడవుతాయని స్పష్టంగా రాశారు. ప్రపంచబ్యాంకు నిర్దేశాలను అమలు చేయడంలో భాగంగానే సబ్సిడీలు ఎత్తివేయడానికి ప్రభుత్వం తొందరపడుతోందని డీజిల్‌పెంపునకు దారితీసిన అసలు కారణాన్ని చెప్పకనే చెప్పారు. మరోవైపు ప్రజలపై భారం వేయడానికి ఆసక్తి చూపుతున్నారుకానీ, మంత్రుల సంఖ్యను తగ్గించి వారు చేసే వ్యయంపైన దృష్టిపెట్టి ఉంటే బాగుండదనే సూచన చేయడం ఆయన నిర్మొహమాటానికి నిదర్శనం.

మధ్యతరగతికి భారం :

ఇల్లు కట్టిచూడు... పెళ్లి చేసి చూడు అనేది సామెత. ఈ ఆధునిక రోజుల్లో ఇల్లు కట్టుకోకుండా అపార్టుమెంట్లలో ఫ్లాట్‌లను కొంటున్నాం. ఇందుకు అనేక కారణాలున్నాయి. స్థలాల ధరలు పెరిగిపోవడం, ఇంటి నిర్మాణానికి అవసరమైన సామాగ్రి కొనుగోలు, అనుమతులు పొందడం, సమన్వయం కుదుర్చుకుంటూ పనులు చేయించుకోడానికి వీలుకాకపోవడం వంటి అనేక కారణాలతో అపార్టుమెంట్లలో ఫ్లాట్ కొనగోలుకు మధ్యతరగతి కుటుంబాలు మొగ్గుచూపడం మొదలైంది. కొన్ని నిర్మాణ సంస్థలు, ఆ రంగంలోని వ్యక్తులు స్వార్థంతో నాసిరకమైన నిర్మాణాలు చేపట్టడం, సరైన అనుమతులు లేకుండా నిర్మించి ఇవ్వడం కొనుగోలు చేసిన యజమానులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. బిల్డర్లకు నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థల్లోని అధికారుల చేతివాటమూ తోడవుతోంది. ఫలితంగా వివిధ సందర్భాల్లో బహుళ అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోతున్నాయి. 2000 సంవత్సరం మార్చిలో 'ఫ్లాటుకొని చూడు' శీర్షికన రాసిన సంపాదకీయంలో ప్రభుత్వ, అధికారుల బాధ్యరాహిత్యాన్ని దునిమాడారు. ఒకటి తర్వాత ఒకటిగా ఈ భవనాలు కూలిపోతుంటే నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండిపోయిన వారి వైఖరిని ఎండగట్టారు. "కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న

భవనాల పనుల్ని ఆపించేశారు. ఇలాంటి నిర్ణయం ఇన్నాళ్లు ఎందుకు తీసుకోలేదు. ఇప్పుడు హైకోర్టు కళ్లు తుడవడానికా? చిత్తశుద్ధితో చేసిందా?" అని ప్రశ్నించారు. 2000 సంవత్సరానికి కొంచెం అటు ఇటు అపార్టుమెంట్ల నిర్మాణాలు బాగా పెరిగాయి. పాలకులు పట్టణాలను మాత్రమే పట్టించుకుంటారు. గ్రామాలపై సహజంగా అశ్రద్ధ ఉంటుంది. పట్టణాల విస్తరణతో అక్కడ మౌలికవసతుల కల్పనకోసం కోట్ల రూపాయలు కేటాయించడం పరిపాటి అయింది. ఇంట పక్కనే ప్రవహించే నది ఉన్నా పల్లె ప్రజలకు తాగడానికిగానీ, వ్యవసాయానికిగానీ నీళ్లు దొరకవు. అవే నీళ్ల కోట్ల రూపాయల ఖర్చుతో వివిధ పథకాల కింద నగరాలకు తరలుతుంటాయి... అని తీవ్రమైన వేదనాభరితమైన మనసుతో సంపాదకీయం రాసిన సంపత్ కుమార్ గ్రామీణులపైనా దృష్టి సారించాలని అంతర్లీనంగా సూచించారు.

కూలిపోయిన అపార్టుమెంట్లకు సంబంధించి ఎవరికీ శిక్షపడిన ధాఖలాలులేవు. కొనుగోలు చేసినవారు నష్టపోవడం మాత్రం షరా మామూలే. ఇల్లు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాంకదా? అని మున్సిపల్ కమిసనర్ చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు... ఎన్ని అంతస్తులయినా కట్టుకోండి... దానికి పన్నులు చెల్లించండని ప్రభుత్వం తన ఆదాయ మార్గాలను పెంచుకోవడంకోసం కళ్లుమూసుకుని అనుమతివ్వడానికి తెగించింది. ... ప్రభుత్వం తాను చేస్తున్న పనులకు కూడా ప్రజలను బాధ్యత వహించమనడం దారుణం.. అని సంపత్‌కుమార్ తన సంపాదకీయంలో నిర్లక్ష్యంగా... నిర్లిప్తంగా... బాధ్యతారహితంగా ప్రవర్తించే పాలకుల్ని, అధికారుల వైఖరుల్ని ఎండగట్టారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి రష్యాతో మైత్రి నెరపిన భారతదేశం మారిన పరిస్థితిలో అమెరికాతో స్నేహం కుదుర్చుకున్న విషయాలు.... ఎన్నికల సందర్భంగా పార్టీలమధ్య సీట్ల సర్దుబాటుకు దారి తీసే పరిస్థితులు.... అవసరాలు.. కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు అందించాల్సిన ఆర్థిక సహాయం విషయంలో అత్తెసురు వ్యవహారాలు.... రాజ్యసభ ఎన్నికలు... ధరల పెరుగుదల... ఇలా ఒకటనేమిటి? ఏ అంశం తీసుకున్నా దేనికదే అన్నట్లు విశ్లేషణ... సమీక్ష... పూర్వాపరాలు... సునిశిత విమర్శలు... సూచనలతో ప్రతి సంపాదకీయానికి నిండుదనాన్ని కల్పించారు.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకవృత్తి చేపట్టకముందు వివిధ పత్రికల్లో దశాబ్దకాలంపైగా జర్నలిస్టుగా పనిచేశారు. ఆ సందర్భంగా పత్రికల్లో విభిన్న సామాజిక, సాహిత్యాంశాలపై వందలాది వ్యాసాలు రాశారు. గాఢమైన విమర్శ, హాస్య, వ్యంగ్య రచనల్లో చెయ్యి తిరిగిన రచయిత ఆయన. సరళమైన భాష, సూటిగా ఉండే భావవ్యక్తీకరణ సంపత్‌కుమార్ రచనలకు వన్నెతెస్తాయి. ఈ ప్రత్యేకతతో ఆయన పాఠకుల్ని తన అక్షరాలవెంట నడిపిస్తారు.

ప్రస్తుతం 'రెండోఓటమి'లో ప్రచురించిన సంపాదకీయాలు రాసిన, పత్రికల్లో ప్రచురించిన కాలానికి ఇవన్నీ వర్తమాన విషయాలు .... రెండు దశాబ్దాల తరువాత మార్పులు చేయకుండా పాఠకుల మందుకు పుస్తక రూపంలో తీసుకురావడం చరిత్రను అక్షరబద్ధం చేసినట్లుగా అనిపిస్తోంది. ఒకటో రెండో ఇప్పటి దృష్టితో చూస్తే కొంత అప్రధానం అనిపించవచ్చుగాక ... నేటి తరానికి, రాబోయే తరానికి ఆనాటి పరిస్థితి... రాజకీయ, సామాజిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన కల్పించడానికి ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఒక విధంగా పోటీపరీక్షలకు తయారయ్యే అభ్యర్థులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

టుడేస్ న్యూస్‌పేపర్ ఈజ్ టుమారోస్ వేస్టుపేపర్... అనేది సాధారణంగా అనేమాట. కానీ పత్రికలు వర్తమాన చరిత్రకు దర్పణాలు. గడిచిన రోజుల్లో సంభవించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక ఇలా ఒకటనేమిటి? ఏ పరిణామాన్నైనా సమగ్రంగా తెలుసుకోవాలంటే పత్రికలే

ఆధారం. ముఖ్యంగా వక్రీకరణ లేకుండా ప్రచురించిన సంపాదకీయాలు, వ్యాసాలు భావితరాలకు ఎంతో ఉపయుక్తం. ఇలా అనుకుంటే ఆచార్య సంపత్ కుమార్ రాసిన సంపాదకీయాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. ఔత్సాహిక జర్నలిస్టులు, పోటీపరీక్షలకు తయారయ్యేవారు తప్పకుండా చదవాల్సిన, తమ వద్ద ఉంచుకోవాల్సిన అవనరం ఉందని చెప్పడం అతిశయోక్తికాదు.

మనకున్న సంపదతో సంతృప్తిపడటం ఉత్తమం. కానీ, మనకున్న విజ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం-అన్న సర్వేపల్లి రాధాకృష్ణ మాటల్ని ఒంటపట్టించుకున్నవారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. అందుకే ఆయన నిత్యం విజ్ఞాన సముపార్జలో లీనమవుతుంటారు. అదే సంద ర్భంలో ఆ జ్ఞానాన్ని పదుగురికి పంచడానికి తాపత్రయ పడుతుంటారు. ఇలాంటి ప్రయత్నాలు ఇంకా కొనసాగిం చాలని ఆశిద్దాం.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'చెరువు శాపం' - మానవ స్వభావ చిత్రణం

- డాక్టర్ దోకుల ధైర్యకుకూరి, సహాయాచార్యులు, తెలుగు శాఖ, వై.ఎ.ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల.

పరిచయం :

ఆంధ్రభాషా విభూషణ, ధ్రువతార బిరుదాం కితులు, సాహిత్య రత్న, ఆచార్య మాడభాషి సంపత్ కుమార్‌గారు రచించిన 'వికారి' కవిత్వ సంపుటి నుండి 'చెరువు శాపం' అనే కవిత వెలువడింది. ప్రస్తుతం ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు 'ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం' అన్న అంశంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టా పొందారు. 'తెలుగులో అత్యాధునిక కవితా దృక్పథాలు' అన్న అంశంపై డి.లిట్. పట్టా పొందారు. సరళమైన భాషలో, చక్కని భావవ్యక్తీకరణతో వీరి ప్రత్యేకత. వీరు 'జీవితం-కవిత్వం', 'శత్రువుతో ప్రయాణం', 'ఆలోచనలు', 'చివరకు నువ్వే గెలుస్తావు', 'మూడో మనిషి' 'వికారి' వంటి కవితా సంపుటాలను వెలువరించారు.

'వికారి' అనగా తెలుగు 60 సంవత్సరాలలో ఒక సంవత్సరం పేరు. వికారి అనగా వికారము గలది, మార్పు నొందినది, మాఱునది, చెఱుచునది అని (సూర్యయాంధ్ర నిఘంటువు) నైఘంటికార్థం. ఇక్కడ మార్పు అంటే సమాజములోని మానవుల ఆకారంలో, స్వభావంలో మార్పు అని అర్థం. ఈ వికారి 'కవిత్వ సంపుటిలో మనిషి చేసే వివిధ కృత్యాల వలన జరిగిన, జరుగుతున్న అనర్థాల ఫలితాన్ని విశ్లేషిస్తూ, దానిమూలంగా ఈనాడు మానవుడు అనుభవిస్తున్న విపత్తును గురించి ప్రధానంగా తెలియజేశారు. 'చెరువు శాపం' అనే కవితలో మానవులు చెరువును పూడ్చివేసి దాని హృదయాన్ని గాయపరచి, దాని కడుపులో మట్టిగొట్టి అపార్టుమెంట్‌లను కట్టి మానవుడు చేస్తున్న తప్పిదాలను గురించి పర్యావరణ దృక్కోణంతో హెచ్చరిక చేశారు. చెరువు శాపం కవిత ద్వారా మాడభూషిగారి హృదయాన్ని ఆవిష్కరించుటే ఈ పత్ర సమర్పణ ప్రధానోద్దేశ్యం.

ప్రస్తుత నాగరిక సమాజంలో పట్టణీకరణ పెరిగిపోతోంది. రకరకాల కారణాలతో ప్రజలు పట్టణాల మీద వ్యామోహంతో పల్లెల్ని ఖాళీ చేస్తున్న వైనం ఒకవైపు, పట్టణాలకు, కార్పోరేషన్లకు దగ్గరగా పచ్చని పంటపొలాలతో, చెరువులతో అలరారుతున్న గ్రామాల్ని, పల్లెల్ని జనావాసానికి వీలుగా నాశనంచేసి అపార్టుమెంట్‌లను కడుతున్న వైనం మరోవైపు మనందరికీ తెలిసినదే కదా! ఈ నేపథ్యంలోనే ఆచార్య మాడభూషిగారు ఆధునిక కాలంలో మానవులు స్వార్థంలో చెరువుల్ని త్రవ్వి ఎన్నెన్ని రూపాల్లోకి మార్చుతున్నారో వాటి దుష్ఫలితాలేవో 'చెరువు శాపం' కవిత ద్వారా స్పష్టంగా మన కనులముందు నిలిపారు.

ఈ కవిత మొదటి పాదాల్లోనే...

చెరువులో అపార్ట్‌మెంట్ కట్టినప్పుడు
చెరువు కడుపులో మట్టిగొట్టినప్పుడు
అది ఎంతగా విలపించిందో
ఎవరికి తెలుసు! - అంటారు.

పై వాక్యాలలో రియల్ ఎస్టేట్ పేరు చెప్పి అప్పటి వరకూ ఊరందరికీ సాగునీటిని, త్రాగునీటిని అందిస్తున్న చెరువును ఉన్న పళంగా త్రవ్వి వేయడాన్ని చూసి కలత చెందారు. 'నీ నోట్లో మట్టి గొట్ట' అనే నానుడికి అర్థం చనిపొమ్మని అలాగే చెరువు కడుపులో మట్టిగొట్టి చెరువును చంపేశారనే భావాన్ని స్ఫురింపజేశారు. మనిషిని చంపబోతుంటే ఎంత విలపిస్తాడో అదే విధంగా చెరువు కూడ విలపిస్తుందని, దానికి భౌతికాకృతిని కల్పిస్తూ దాని బాధని ఎవరూ పట్టించుకోవట్లేదని వ్యధ చెందారు. చెరువును త్రవ్వినప్పుడు అక్కడ ఉండే చెట్లను కూడ నాశనం చేస్తారు. కావున వాటినుద్దేశించి

"చెట్టు కూడా ఏడుస్తుందని
సుభాష్ చెప్పినట్లు"

- అని సామాజిక, పర్యావరణ స్పృహతో స్పందించారు. చెరువు వలే చెట్టు కూడా బాధపడుతుందని మానవు లందరూ గ్రహించాలన్నారు. మొక్కలకు కూడ ప్రాణ ముందని జగదీష్ చంద్రబోస్ కనుగొన్న విషయం ప్రపంచానికి తెలియజేశారు కదా! అలాగే వాటికీ హృదయ ముంటుందని అవి కూడా ఏడుస్తాయని కోల్‌కతాకి చెందిన ప్రముఖ పర్యావరణ పరిరక్షకుడు, కార్యకర్త, 1977 నుండి "మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన సుభాష్ దత్తగారి అభిప్రాయాన్ని ఉటంకిస్తూ సంపత్ గారు సామాజిక, పర్యావరణకు సంబంధించిన వర్తమాన అంశాల స్పృహను మనలో కలిగించే ప్రయత్నం చేశారు. అదేవిధంగా మొక్కలకు వలే చెరువుకు కూడ హృదయ స్పందన ఉంటుందనే పోలికను చెప్తూ

చెరువు కూడా ఏడుస్తుందని
దాని కంటి నిండా ఉన్న నీళ్ళను చూస్తే తెలియదా?

- అని వినూత్న ప్రయోగం చేశారు. నిండా నీరున్న చెరువును త్రవ్వితే ఆ నీరంతా పోతుంది. కాబట్టి చెరువు నీటిని కన్నీటితో పోలుస్తూ చెరువుకు మానవాకృతి కల్పించి దాని హృదయ వేదనను మనముందు ఆవిష్కరింప జేశారు కవి. అన్ని విషయాలలో చెరువు ఊరందరికీ సహాయకారిగా ఉంటుందనే విషయాన్ని గుర్తుచేస్తూ...

"విశ్వాసంగా ఉన్న చెరువు
కుడి చేతికి
ఎడమచేతికి
నీళ్ళిచ్చి
ఆదుకున్నందుకు"

ఒక్క నిమిషం కూడా ప్రతి విశ్వాసం చూపకుండా దాని కడుపులో గునపాలు గుచ్చినప్పుడు అది శపిస్తోందని ఊహించి ఉండరు" అంటారు. మనం స్వార్థంతో చెరువుకు చేస్తున్న ద్రోహాన్ని కూర్చున్న కొమ్మనే నరుక్కుం టున్న మానవుని వైనాన్ని ఎంతో చక్కగా వివరించారు.

పై పంక్తుల్లో 'విశ్వాసంగా ఉన్న చెరువు' అనే ప్రయోగం మానవుడికి చెరువు చేస్తున్న మేలును గురించిన భావనను స్ఫురింపజేస్తుంది. చెరువును త్రవ్వినందుకు గాను అది (ఊరికి ఉపయోగపడేలా) ప్రజలందరి పట్ల ఎంతో విశ్వాసం కనబరుస్తుందని, తన నిండా నీటిని నింపుకొని ఊరి ప్రజలందరికీ త్రాగునీటిని అందించటంతో పాటు ఇతర అవసరాలన్నింటినీ తీరుస్తుందని ఆ విషయం మనిషి మరచిపోరాదని మనిషి స్వార్థాన్ని గర్హించారు. మనుషులపై విశ్వాసం, కృతజ్ఞత చూపి ఆదుకున్న చెరువుపై మనుషులు మాత్రం ఏమాత్రం ప్రతి విశ్వాసం చూపకుండా కృతఘ్నులై ప్రవర్తించడం సరికాదన్నారు.

నిర్దాక్షిణ్యంగా చెరువును త్రవ్వి దాని కడుపులో గున పాలు గుచ్చారని కవి ఆక్రోశించారు. కర్కశంగా గునపాలు గుచ్చేటప్పుడు మనిషి ఏమాత్రం చెరువు హృదయవేదనను గురించి ఆలోచించలేకపోయాడని, 'ఆ' చెరువే కదా! అది మనల్ని ఏం చేస్తుందిలే అనే ధోరణితో ఉన్నాడన్నారు. అందుకే "అది శపిస్తుందని ఊహించి ఉండరు" అని మనిషి లెక్కలేనితనాన్నీ, చెరువు మానసిక వ్యధనీ పరికిం చారు. మనుషులు చేసిన ఆ పనికి చెరువు హృదయ వేదనతో శపించిందని హెచ్చరించారు. ముందు వెనుకలు ఆలోచించకుండా చెరువును నాశనం చేసినప్పుడు తన తప్పును మనిషి గుర్తించలేకపోవడం సబబు కాదన్నారు.

చెరువు లేకపోవటంతో ఆ తర్వాతి కాలంలో నీరు లేక త్రాగునీటికి సైతం మనిషి కటకటలాడినప్పుడు మనిషి స్వయం కృతాపరాధాన్ని గుర్తు చేస్తూ

"ఇప్పుడు నాలుక పిడచకట్టిన తరువాత
ఇక్కడ చెరువు ఉన్నట్లు గుర్తుకొస్తోంది కదూ!"

అంటూ చెరువును నాశనం చేసినపుడు గుర్తుకు రాని బాధ నీటి అవసరం రాగానే గుర్తుకురావడం వలన ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. అయ్యో! ఇక్కడ అంతకుపూర్వం చెరువుండేది, అది ఇప్పుడు వుంటే ఎంతో బాగుండేదని చెరువు గొప్పతనాన్ని గురించి తలచుకొని చింతించటం తగదన్నారు.

ఎక్కడైనాసరే చెరువు ఉంటే దాని చుట్టూ ఒడ్డు లేదా గట్టు చుట్టూ పచ్చని చెట్లు ఉండి అవి కల్తీలేని మంచి ఆక్సిజన్‌ని అందిస్తాయి. చెరువును త్రవ్వి, చెరువును లేకుండా చేసినపుడు దాని గట్టు చుట్టూ ఉండే చెట్లను కూడా గొడ్డళ్లతో నరికి వేస్తారు కదా! ఆ విషయాన్ని గురించి చెప్తూ

"చెరువు గట్టు చుట్టూ ఉన్న చెట్లు
ఎవడి గొడ్డలికి బలయ్యాయో"

- అని వ్యధ చెందారు.చెరువు పూడ్చటం అయి పోయింది. దానిలో భాగంగానే గట్టు చుట్టూ ఉండే చెట్లను నరకటం కూడ పూర్తయింది. ఇక మిగిలింది ఆకాశ సూర్యరశ్మిలను నిర్మించడమే. అపార్టుమెంట్ సంస్కృతి వచ్చాక 50 గదులు స్థలం దొరికితే చాలు సంవత్సరం తిరిగేలోపు బిల్డర్ అవతారమెత్తి ఎవడో ఒకడు అక్కడ అంతస్థుల మీద అంతస్థులను వేసి అపార్టుమెంట్‌ను పూర్తిచేస్తాడు. అప్పుడు అక్కడ ప్రకృతి రమణీయత స్థానంలో ఆకాశన్నంటే భవనాలు దర్శనమిస్తాయి. ఆ బిల్డర్ అపార్టుమెంట్ కట్టడం పూర్తవగానే డబ్బంతా సేకరించుకొని, జేబులు నింపుకొని ఎవరికీ కనిపించ కుండా విదేశాలకు విమానాల్లో పారిపోతున్నారు. ఆ వైనాన్ని వివరిస్తూ

"చెరువులో ఎవడు భవనాలను తాకే
భవనాలను లేపాడో
వాడు ఇప్పుడు కనిపించడు
జేబులు నింపుకొని వాడు ఎప్పుడో
విమానాల్లో పారిపోయాడు"

- అని అంటూ అటువంటి వారిని తన కవిత ద్వారా సూటిగా విమర్శించారు. ప్రతినిత్యం చాలా మంది బిల్డర్లు రియల్ ఎస్టేట్ పేరు చెప్పి ఎంతోమందిని మోసం చేసి బోర్డులు తిప్పేయడం మనం వార్తాపత్రికల్లో, టీవిల్లో చూస్తూనే ఉన్నాం కదా!

కట్టినవాడు ఆ ప్రదేశంలోని ప్రజల స్థానిక ఇబ్బందు లను గురించి పట్టించుకోడు. చివరికి నీరు లేక బాధపడేది అక్కడి ప్రజలే. ఆ వాస్తవాన్ని గ్రహించకుండా చెరువును పూడ్చటానికి అంగీకరించి పెద్ద తప్పు చేసిన ప్రజలే దానికి బలి అయ్యారనే వాస్తవాన్ని మన ముందుంచారు కవి. ఆ విషయాన్ని గురించే చెప్తూ

'చెరువు తల్లి గుండెల మీద
కూర్చున్న నీకె
ఇప్పుడు నోరు ఎండిపోతోంది'

- అని ఇప్పుడు ఎంత వగచినా ప్రయోజనం శూన్య మనే అర్థాన్ని స్ఫురింపజేశారు. ఆ తప్పు జరుగకుండా ముందే జాగ్రత్త వహించాలన్నారు.

'ఒక్క క్షణమయినా
నువ్వు
ఇది నా 'చెరువు తల్లి'
నా దాహం తీర్చిన 'కల్పవల్లి'
నన్ను గుండెలకత్తుకున్న 'పాలవెల్లి'
నాకు బువ్వపెట్టిన 'అమ్మ తల్లి'
అని తలపోసి ఉంటే
నీ ఊరు మునిగి ఉండదు
నీ నోరు ఎండి ఉండదు'

- అంటూ మనిషి చేసిన సరిదిద్దుకోలేని తప్పిదాన్ని గురించి తెలియజేశారు.

పై పంక్తుల్లో 'చెరువుతల్లి', 'కల్పవల్లి', 'పాలవెల్లి', 'అమ్మతల్లి' అని చెరువు ప్రాశస్త్యాన్ని గురించి, అంత్య ప్రాసాలంకారంలో చక్కని శబ్ద సౌందర్యం కలిగించేలా ప్రతీకలను చెప్పారు. అంతకుమించిన అర్థగాంభీర్యంతో చెప్పారు. ఇక్కడ కవి ముందుగా చెరువును 'తల్లి' తో పోల్చారు. కన్నతల్లిని మనం ఎంత కష్ట పెట్టినా సరే నొచ్చుకోకుండా మన యోగక్షేమాన్ని ఎలా విచారిస్తుందో చెరువు కూడ అలాగే మనకు అన్ని విధాలా తోడ్పడు తుందనే భావాన్ని స్ఫురింపజేసేలా 'చెరువు తల్లి' అనే చక్కని పదప్రయోగం చేశారు.

చెరువును 'కల్పవల్లి' అని పోల్చారు. ఈ ప్రతీకకి అర్థం

ఇంద్రుని నందనోద్యాన వనంలో ఉండే పారిజాత వృక్షంతో చెరువు సమానమైనదని. కల్పవృక్షం ఎవరు ఏది కోరితే దాన్ని క్షణాల్లో కోరినవారి ముందుంచుతుందని ప్రతీతి కదా! అదేవిధంగా చెరువు కూడ సమృద్ధిగా నీరుండేలా చేస్తే ఆ ఊరి ప్రజలందరి దాహాన్ని తీర్చి ఊరికి ఏ లోటూ రానివ్వకుండా కాపాడు తుందని అలా ప్రతీకని వాడారు.

ఇహ చెరువును గుండెలకత్తుకున్న 'పాలవెల్లి' తో పోల్చారు. పాలసముద్రం ఎంతో విశిష్టమైనదని, దానిలోనుండే సృష్టికి ఆధారభూతమైనవన్నీ జనించాయని, చెరువు కూడ ఊరికి అంతే విశిష్టమైనది అనే ఆంతర్యాన్ని తెలియజేసే ప్రతీకని ఉపయోగించారు కవి.

ఈ అంత్యాలంకార క్రమంలో ఉపయోగించిన నాల్గవ ప్రతీక అమ్మతల్లి. 'అమ్మతల్లి' అంటే మనల్ని ఎల్లవేళలా కాపాడే దేవత అని అర్థం. అలాగే ప్రకృతి ప్రసాదించిన చెరువు దేవతైన అమ్మతల్లిలా మనకు 'అన్నం' పెట్టి మన ఆకలిని తీర్చుతుందని అటువంటిదాన్ని మనం త్రవ్వి పాడుచేయటం తగదని హెచ్చరించారు. అందుకు ప్రతిఫలాన్ని మానవుడు అనుభవించితీరుతున్నాడని చెరువును లేకుండా నాశనం చేసినందుకు అది బాధపడి, పగబట్టి శపించిందని, దానిని నాశనం చేసిన ఫలితంగానే మానవులు అనేక కష్టాలు పడుతున్నారనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

'దిద్దుకోలేని తప్పుకు
చెరువు ఇచ్చిన శాపం
తప్పకుండా ఫలించింది
ఫలితమిచ్చింది' - అని పేర్కొన్నారు.

చెరువును పూడ్చినందుకు చెరువు శాపం పెట్టిదన్నారు. మనిషి ప్రకృతి వనరులను నాశనం చేసి పర్యావరణాన్ని దెబ్బతీయడం మూలంగా నేడు మానవ మనుగడకు పెనుముప్పు వాటిల్లిందని, వాటి ఫలితంగానే వాతా వరణంలో అనూహ్యమైన మార్పులు సంభవిస్తున్నా యని పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా హెచ్చరించారు కవి.

మనల్ని ఇన్ని రకాలుగా సంరక్షించి, మనిషిగా చేసిన చెరువును గురించి త్రవ్వకముందే ఒక్కసారైనా ఆలో చించాల్సి వుందని మానవుని వివేకాన్ని ప్రశ్నించారు. రానున్న విపత్తును ఆలోచించకుండా చెరువును త్రవ్వే శారన్నారు. అంటే చెరువు వుంటే అధిక వర్షాలు పడినప్పుడు ఆ నీటిని తనలో నింపుకొని ఊరందరికి అన్ని కాలాల్లో అన్ని పనులకు ఆ నీటిని వారు ఉపయోగించుకొనేలా చేస్తుంది.

అంతేకాదు, చెరువు వరదల నుండి ఊరిని రక్షిస్తుంది కదా! చెరువును పూడ్చటం వలన భారీ వర్షాలు సంభ వించినపుడు దానిలో నిల్వచేయబడే నీటికి స్థానం లేక పోవడంతో ఆ నీరంతా ఊరిపైకి వచ్చి ప్రవహించి ఊరి నంతటినీ ముంచెత్తుతుంది. పర్యవసానంగా నీరు లేక తర్వాతి రోజుల్లో కరువులు కూడ సంభవిస్తాయి. చెరువు లేకపోవడం వలన ఒక్క మంచి కూడ లేదని, అన్నీ అనర్థాలేనని తెలియజేశారు.

ప్రకృతి కన్నెర్రజేయడం వలననే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులెన్నో సంభవిస్తున్నాయి. ఆ విషయాన్నే ఇక్కడ ప్రస్తావిస్తూ...

'చెరువు శాపానికి
కాలిన చేతులకు పట్టుకోవడానికి
ఆకులు కూడా లేవు'- అంటారు సంపత్ గారు.

అంటే సరిదిద్దుకోలేని తప్పు జరిగిపోయిన తర్వాత దానిని సరిదిద్దుకోవటానికి ప్రయత్నించినా ఫలితం లేదనే విషయాన్ని గుర్తుచేశారు. "చేతులు కాలాక ఆ వేడిమి బాధని తట్టుకోలేక ఉపశమనం కోసం పట్టు కోవడానికి ఆకులు కూడా లేవంటారు" కవి. ఇక్కడ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అనే సామెత ద్వారా మన తప్పును తెలియజేస్తూనే ఆ కాలినదానికి ఉపశమనం కలగడానికి కూడా మనం నరికేసిన (చెట్లే) చెట్ల ఆకులే కావాలని, ఆ ఆకులు కూడా లేకుండా పోయాయని మన వినాశనం మనమే కొని తెచ్చుకున్నా మని విమర్శించారు.

'చేసిన పాపాలు చిరదుఃఖాలై బండి చక్రాలవలే మన వెన్నంటును' అని 'దమ్మపదం'లో గజ్జెల మాలారెడ్డి గారు చెప్పినట్లు మనం చేసిన చెడ్డ పని మనకే చేటయ్యిందని మన తప్పును మనకి గుర్తుచేస్తున్నారు. ఆకులన్నా పట్టుకుందామంటే అవి కూడా లేవని చెప్పూ, సామెతలో నుంచి కూడ వాస్తవాన్ని గుర్తుచేశారు.

ఆకులు కూడా లేవు
అవి కూడ
నీ అర్థకలికి ఎప్పుడో
రాలిపోయాయి
కూలిపోయాయి

- అంటారు. కనీసం ఊహించడానికి కూడా వీలు లేకుండా మనిషి ప్రకృతిని నాశనం చేయడాన్ని కవి సహించలేకపోయారు. ఇక్కడ 'అర్థకలి' - అంటే చాలీచాలని తిండితో ఆకలికి తట్టుకోలేక వాటిని కూడా తినివేశారన్నట్లు పైకి కనిపించినా, ధనాశతో చెరువుతో పాటు చుట్టూ చెట్లని కూడా నరకడం మూలాన అవి కూడా లేకుండా చెట్లన్నీ చనిపోయాయనే గూడార్థాన్ని స్ఫురింపజేశారు మాడభూషి వారు. మనిషి దెబ్బకి బ్రతకలేక చెట్లు కూలిపోయా యంటూ మానవుని దుశ్చర్యలను గర్హించారు కవిగారు.

అంత బాధని అనుభవించిన చెరువు తట్టుకోలేక మనల్ని శపించిందని అందుకే భూగర్భజలాలు కూడ ఇంకిపోయి ప్రకృతి అసమౌతుల్యంగా అయిపోయిందని అదే నేడు అనుభవిస్తున్న శాపమన్నారు. ఆ పాపానికి నివృత్తిగా రాబోయే తరాల వారైనా అలాంటి పనులు చేయకుండా మనం వారికి మార్గదర్శకం కావాలనే భావాన్ని వ్యక్తం చేశారు కవి.

చెరువు శాపాన్ని అనుభవించడమే
భవిష్యత్తును కాపాడుకోవడానికి మార్గం!

- అని ఉద్బోధించారు. పూర్వకాలంలో రాజులు ఊరు సమృద్ధిగా ఉండి, ప్రజలందరూ సుఖసౌఖ్యాలతో వర్ధిల్లాననే సదుద్దేశ్యంతో బావులను, చెరువులను తవ్వించేవారు. వారి పేరు చెప్పుకుని ఆ ప్రాదేశిక ప్రాంతాలన్నీ సుభీక్షంగా ఉండేవి. నేడు దానికి భిన్నంగా వాటిని త్రవ్వి వాటి పునాదులపై ఎత్తైన భవనాలను నిర్మించే విష సంస్కృతి ప్రబలిపోయింది. దీనివలన మానవాళి మనుగడకే పెనుముప్పు వాటిల్లుతుందని, అలా చేయ వద్దని ఆవేదనతో మాడభూషివారు మానవులలో మార్పును ఆశిస్తూ పర్యావరణ పరిరక్షణ తత్వాన్ని అందరూ అలవరచుకోవాలని హితవు పలికారు.

ముగింపు :

"చెరువు శాపం" కవిత ద్వారా చెరువు ఆత్మఘోషను గురించి ఎంతో ఆవేదనతో వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సహజ వనరులను, ఊరి వనరులను, ఊరి నీటి వనరులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమాజాన్ని జాగృతపరచిన ప్రకృతి కవి, ప్రకృతి ప్రేమికుడు అయిన మాడభూషిగారు ధన్యజీవి.

ఉపయుక్త గ్రంథాలు :

1. వికారి - కవిత్వం - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
2. సుభాష్ దత్త - తెలుగు వికీపీడియా - అంతర్జాలం
3. దమ్మ పదం - గజ్జెల మల్లారెడ్డి

❖❖❖

రచియించెనా? కళాప్రజ్ఞాధురీణతా
గంధముల్, కృతులందుఁ గ్రాలుచుండుఁ
బల్కెనా? భారతీభవ్యవీణాధ్వనుల్
రసనాంచలముపైఁ బరగుచుండు
నడచెనా? సన్మార్గనైపుణీకాంతులు,
గతియందు, మతియందుఁ, గానిపించు
నవ్వెనా? ప్రజ్ఞాననైతికమర్మముల్
పెదవులఁ, గన్నుల, మెదలుచుండు,

అతఁడు 'మాడభూషి'కులుఁడు, సతత భార
తీపదార్చకుఁడు, సుకవి, తీవ్రశోధ
కుఁడు, గురుజనవిధేయుఁడు, కోమలుండు,
చారుశీలుండు 'సంపత్కుమార' బుధుఁడు.

– డాక్టర్ వొరుగొప్పు శివరామకృష్ణ
(అవధాన శిరోమణి, అవధానకంఠీరవ,
మహాకవి, శతావధాని)

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మొదటి అబద్ధం' - పరిశీలన

- చిట్టూరి జగదంబిక, అధ్యాపకురాలు, ఎన్.సి.ఐ.ఎమ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు

గాలి లేకుండా బ్రతకలేనట్లే అబద్ధం లేకుండా ఎవరికీ రోజు గడవదేమో అన్నట్లుంది నేటి సమాజం. ఇది ఒక నిత్యావసరం అని కవి అన్నారంటే ఇది మనం ఏమాత్రం కాదనలేని అనుభవసారం. ఒక కవికి అనేక విషయాలపై అవగాహన ఉంటేనే ఆ రచన శోభిల్లుతుంది అని అనుకునేవారికి కవికి కావలసినది నిశిత పరిశీలన అనేది ఈ కవిత్వం చదివితే అర్థం అవుతుంది. దీనిలో అబద్ధం అనే అంశంపైనే గ్రంథం మొత్తం కొనసాగింది.

సరళమైన భాష, చక్కటి భావవ్యక్తీకరణలో తాత్వికతతో సాగిన ఈ కవితా ఝరిలో అందరికీ తెలిసిన విషయాలనే నేను చెపుతున్నాను అని కవి అన్నారు. అది నిజమే కానీ మన నిత్యజీవితంలో అబద్ధం ఇంతలా మమేకమై వ్యవస్థలనే శాసించే స్థాయికి చేరిందని చెప్పకనే చెప్పిన తీరు రమ్యం. 'అబద్ధం చెప్పని వాడిది అరుదైన జన్మ' అన్నారంటే అబద్ధం చెప్పకూడదనే నిబద్ధత ఉన్నవాడిని ఒక వింత జంతువుగా, చేతకాని వాడిగా ముద్రిస్తారనేది కవి భావన. ఇది నేటి సమాజాన్ని ప్రతిబింబిస్తోంది. ఇలా రచనలో ప్రతిచోటా సమాజం కన్పిస్తూనే ఉంది. 'చివరికి నిజం కూడా అబద్ధాన్ని కలిపితే కానీ రాణించదు' అని, 'పచ్చి నిజాన్ని ఉడికించి ఉప్పుకారం వేసి వడ్డిస్తేగానీ నిజం కూడా దిగదు' అని కవి అన్నారంటే అసలు నిజం పరిస్థితి, అబద్ధం స్థితి, మనిషి అధోగతి ఎలా ఉన్నాయో చెప్పడానికి ఈ కవితా పంక్తులే తార్కాణాలు.

'విద్య, వైద్యం, వ్యాపారం, పెళ్ళి, పేరంటాలు, న్యాయస్థానాలు, రక్షకభట నిలయాలు, అమ్మకాలు, పంపకాలు, కళలు, కవితలు అన్నీ అబద్ధంలో తడవాల్సిందే' అని కవి అనటంలో ప్రతివ్యవస్థలోనూ తాను ఓ భాగమై కుటుంబలోని సొంత వ్యక్తిలా అబద్ధం కలిసి పోయింది అని మనకు అనిపిస్తుంది. ఇక్కడ కవి బాధ, ఆవేదన పాఠకులకు స్పష్టమవుతాయి.

ఈ కవి కవితా పంక్తులు బింబ ప్రతిబింబ భావనతో ఉండటం కూడా మనం చూస్తాము.

'అబద్ధం చెప్పిన వాడికి సమస్య ఉండదు
నిజం చెప్పిన వాడికి సంతోషం ఉండదు'

అని చెపుతూ, హత్యను చూసిన వ్యక్తి తానేమీ చూడలేదని అబద్ధం చెపితే ఏ తంటా లేదని, అదే నిజం చెపితే ఇక సంతోషమే ఉండదని అన్నారు. అలాగే 'చిన్న అబద్ధం చెప్పమంటారు దానికి పెద్ద ప్రయోజనం ఉంటుంది' అని కవి అన్నారు. దీనికి ప్రతిబింబంగా పెళ్ళిలో అబద్ధం చెప్పి పెళ్ళికూతురు గొంతు కొయ్యడమే దీనికున్న పెద్ద ప్రయోజనం అని హాస్యధోరణిలో అన్నప్పటికీ కవికి సమాజంలోని హెచ్చుతగ్గుల గురించి, స్థితిగతుల గురించి ఆవేదన చెందుతున్నారని అర్థమవటమే కాక స్త్రీమూర్తి పట్ల ఉన్న ఆదరణ భావం, వివక్షతను ప్రశ్నించాలన్న సంకల్పం కనిపిస్తాయి.

ప్రాణం పోతూ ఉండగా అబద్ధం చెప్పవచ్చు బతికున్న వాడిని జీవితాంతం చంపడానికి అని కవి అన్నప్పుడు మనకి ఫక్కున నవ్వు వచ్చినా, ఆహా! మనిషి నైజం ఎలా మారిపోయింది అని మనుషులమైన మనమే నివ్వెర పోయేలా పాఠకుల కళ్ళు తెరుచుకునేలా ఉంటాయి కవి గారి కవితా పంక్తులు.

ఎవరైనా అబద్ధం ఆడితే అతకాలంటారు. కానీ కవి మాత్రం అతకనట్టుండాలి, అతుకే లేనట్టుండాలి అనటంలో కవి స్పష్టత మనకు ప్రస్ఫుటమవుతుంది. ఇక న్యాయ వ్యవస్థ నిజాలను గురించి మాట్లాడుతూ ఖూనీ చేసినా రక్షిస్తానంటాడు. నీది కాని దాన్ని నీదిగా చేస్తానంటాడు. నీతిగా చేస్తానని మాత్రం అనడు అంటూ చెప్పిన వాక్యాలు ఎవరు ఔనన్నా, కాదన్నా అక్షర సత్యాలు. లాయర్లు, పోలీసులు అబద్ధాలకు రక్షణ కల్పిస్తూ

ఉంటే న్యాయదేవత వినలేక కళ్ళు మూసుకుని అబద్ధాల్లోంచి న్యాయాన్ని తీస్తుంది అని కవి అనటంలో అసలు సమాజంలో నీతి, న్యాయం నిజం స్థానమేమిటో పాఠకుడికి అవగతమవుతుంది.

ఇలా మనం ఉంటున్న ప్రపంచాన్ని మనం మనవల్ల, మన మాటల వల్ల, మన మనస్సువల్ల, మన అబద్ధం వల్ల ఎంతదూరం తీసుకువెళ్ళాం అని మనకే కొంత బాధ కలుగక మానదు. మన చిన్న అబద్ధం వల్ల ధర్మం గాడితప్పి సరిదిద్దుకోలేని స్థితికి చేరిపోతోందా? అని ఆవేదన కలుగుతుంది. సమాజంలోని సంస్థలు చిన్నగా స్వార్థంతో మనిషిలో ప్రారంభమైన అబద్ధం బారిన పడి కొట్టుకు పోతున్నాయని అనిపిస్తుంది.

అబద్ధం చిన్నగా ప్రారంభం అవటానికి అసలు తర్ఫీదు కేంద్రాలు ఇళ్ళు, బళ్ళు అంటూ కవి చూపిన నిదర్శనాలు కవి పరిశోధనా దృష్టికి తార్కాణాలు. నాన్న ఇంట్లో ఉండి లేడని చెప్పిస్తాడు. అమ్మ వంటింట్లో ఉన్న వస్తువు పక్కింటావిడతో లేదంటుంది. అన్న, అక్క కాలేజీ నుంచి లేటుగా వచ్చినందుకు కారణాలు వెతుకుతారు. ఇటువంటి పరిసరాలను చూసిన మనకు అబద్ధం ఆడటం పెద్ద విషయం కాదు అంటూ ఇలామన జీవితంలో అబద్ధాలు మమేకం అయ్యాయంటారు.

"ఉన్న దాన్ని రెట్టిస్తే అతిశయోక్తి
లేనిదాన్ని ఊహిస్తే ఉత్ప్రేక్ష"

- అంటూ అబద్ధాలకే అలంకారాలని పేరు అంటే మనకు కూడా ఇది నిజమేగా అనిపిస్తుంది.

"చదువు పెరిగితే నమ్మకాలు తగ్గుతాయి
శాస్త్రం పెరిగితే వ్యాధులు తగ్గుతాయి
సాంకేతికత పెరిగితే కష్టాలు తగ్గుతాయి

కాల క్రమేణా వస్తున్న మార్పులను పరిశీలిస్తే అబద్ధాలు కూడా పెరుగుతూనే ఉన్నాయి అన్నది కవి సమాజంలో నిశితంగా పరిశీలించిన అంశం.

దేవుడి వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి మనకు హక్కు లేదు, అదో సంఘ విద్రోహ నేరం, ప్రశ్న అడిగిన వాడు పాపాత్ముడు అంటూ కవి తన భావాలను వెలిబుచ్చటంలో హేతువాదం కనిపిస్తోంది. నేటి సమాజంలో హేతువాదుల మనుగడ ఎలా ఉన్నదనేది కూడా ఈ కవితా పంక్తులు చెపుతున్నాయి.

రాజకీయ నాయకులు అబద్ధానికి ఎంత పెద్ద పీట వేస్తారోనని చెపుతూ వారు ఇచ్చిన మాటలు, నిజాలు మరుగున పడతాయి అంటారు. కోర్టు, కష్టపడి పాతేసిన నిజాలను బయటకు తీస్తే కోర్టులు, రక్షణ కార్యాలయాలు, రాజకీయ నాయకులు ఆధారాలు సరిగా లేవని కొట్టిపారేస్తారని అనటంలో వ్యవస్థలో మనకు తెలియకుండా చాపక్రింద నీరులా మారిన అబద్ధం ఎంత బలపడిందో అర్థమవుతుంది.

వ్యవస్థల స్వరూప స్వభావాలనే మార్చివేసే ఈ అబద్ధానికి అసలు మూల కారణంను కూడా కవి చెప్పారు. బడికి ఆలస్యంగా ఎందుకు వచ్చావన్నప్పుడు నిద్రలేవడం ఆలస్యమైందని, హోంవర్క్ చేయకపోవటానికి కారణం బద్ధకమే అని చెప్పలేక మనం చెప్పిన అబద్ధాలే వయసుతో పాటు పెరిగిపోయాయని మూలాన్ని ఛేదించారు. చిన్న నాడు మనం ఆడిన అబద్ధం ఇంత దృఢమై ఎంత ముప్పును తెచ్చిపెట్టిందని పాఠకునికి అనిపించక మానదు.

భూలోకంలోని మనిషి స్వర్గ, మోక్షాల కోసం ఆరాట పడుతూ నోరు కట్టుకుని, చేతులు కట్టుకుని, కోరికలు అణచుకుని నీతి మంతుడిగా ఉండాలనుకుంటాడు. కానీ ఎంత వద్దనుకున్నా అబద్ధం ముందుగానే సిద్ధమై పోతుందని, బతుకు ఈడవడానికి నియమ నిష్ఠలతో, నిర్ణీత సమయాల్లో, నియమిత విషయాల్లో అబద్ధం చెపుతూ బ్రతుకు సవ్యంగా సాగించేస్తాడట. ఇక్కడ మనకు వ్యంగ్యం కనిపించినప్పటికీ స్వర్గ, మోక్షాలను ఆశలుగా చూపినా మనిషి మనసు అబద్ధం వైపుకే పరుగులు తీస్తోందని తెలుస్తోంది.

సమాజంలోని అన్ని రంగాలలో అబద్ధం చేరి ఎంత దూరం తీసుకువెళ్ళాలో అంతదూరమూ తీసకువెళ్ళిందని, సుఖదు:ఖాలనే ద్వైదీ భావాల మాదిరే మళ్ళీ నిజం రాజ్యమేలాలలని కవి సకారాత్మకంగా స్పందించిన తీరు అభిలషణీయం. అందరూ చూసే విషయాన్నే చూసినా కవి కావటం వల్ల స్పందన కలిగింది. అబద్ధాలకు కారణాలు, మూలకారణాలను ఛేదించారు. ఏయే సందర్భాల్లో ఎక్కడెక్కడ అబద్ధాలను వాడుతున్నాం అన్న వాటిని కనుక మనం గమనిస్తే వాటికి కవి చెప్పిన కారణాలు కాక మరో కారణాన్ని మనం కనిపెట్టలేమేమో అనిపిస్తుంది. మొత్తంగా చూస్తే ఈ కవిత్వం ఒక అనుభవసారం. నేటి సమాజానికి ప్రతిబింబం.

❖❖❖

అక్షర దీపం

నదికి రెండో జన్మఉదధి
మనిషికి ఉద్యోగే విశ్రాంతి
సంకల్ప సిద్ధికి కాలం ప్రసాదించిన బహుమతి
ఎంత దూరం ప్రయాణించామో
బేరీజు వేసుకోవటానికి
సమాజానికి చేసిన బౌద్ధిక దానం పునశ్చరణకి
నిజానికిది రెండో జన్మకి పునాది
మళ్ళీ పసిపాపలై పారాడటానికి కాదు
పండుటాకులై బోధి వృక్షానికి వేలాడటానికి
జ్ఞానకిరణ సమూహంతో సంభాషించడానికి
పక్షుల పాటల్లో ప్రవహించే ప్రాణమంత్రం
సృష్టి చైతన్యానికి బీజావాపం కావటం దర్శించటానికి
అనుభవాల చలువ పందిళ్ల కింద
సహస్ర చంద్రోదయ దర్శన క్రీనీడలో
"శత్రువుతో ప్రయాణం"లో సాధించిన విజయాన్ని
"చివరకు నువ్వే గెలుస్తావు"అని చాటి చెప్పిన
"మూడో మనిషి"తో సంభాషించటానికి
"గడ్డి పరకతో విప్లవం"
సాధించను నీవు పడ్డ ప్రయాస
"అమ్మవాసన" సోకిన చోటల్లా
"తెలుగు దీప్తి" ని ఆఘ్రాణించటానికి
వింశతి పైగా రచనల వెలుతురులో
నీవు చేసిన అక్షర యాగం
రెండో జన్మలో పునశ్చరణ కోసం
సాగనీ సాగనీ జీవనయానం
సప్త జన్మల సాగరాలు దాటి
పాడనీ పాడనీ కొత్తపాటని
భూతభవ్యిద్వర్తమానాలు మీటి
స్వాగతించు నేస్తం! పంచప్రాణాలతో
ఉత్సాహంగా ఏలుకో జగదేక శాంతి కాంక్షతో!

- ఈతకోట సుభద్రారెడ్డి,
సంపాదకులు,విశాలాక్షి

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తమిళ జానపద కళలు - తెలుగు వారితో సంబంధాలు

- పూషడపు.సుబ్బిరెడ్డి, తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అవనిగడ్డ, కృష్ణాజిల్లా.

అనాదిగా ఈ దేశంలో పరమేశ్వరునికి చేసే వేడుకైనా, పండిత సభల్లోనైనా, పెండ్లైనా ఒక్క మాటలో చెప్పాలంటే కయ్యానికైనా, వియ్యానికైనా ఎవరి పక్షం వారు వారి ప్రవరో, పద్ధతో, ఉద్ధతో చెప్పకునే లేదా చెప్పించే సాంప్ర దాయమొకటి సాగివస్తున్నది. అలాగే మాడభూషి సంపత్‌కుమార్‌గారి కీర్తి జ్యోత్స్నలో స్నానం చేసే ముందు వారి వంశ ప్రతిష్ట గురించి రేఖామాత్ర పరిచయం చేసుకోవడం ముదావహంగా ఉంటుంది. "మాడ" అనేది తెలుగున "దేశ్య" పదం. అంటే ప్రాయికం గా వీరు తెలుగువారు. మన దేశంలో చలామణిలో ఉన్న ఒకప్పటి బంగారు నాణెములలో "మాడ" ఒక విశేషం. అవి పలువిధాలు. వాటి జోలికి వెళితే అసలు విషయం కాంతి విహీనం అవుతుంది గనుక వదిలిపెడుతున్నాను. అగర్భ శ్రీమంతులని, వెండి చెంచా నోట్లోపెట్టుకుని పుట్టారని తరతరాలుగా ధనికులుగా వర్ధిల్లుతున్నవారిని మనం ఎలా పిలుస్తామో, అలాగే విద్వత్తుతో వైకుంఠ నాథుని పట్టపురాణి అనుగ్రహం పొంది, అది తరముల పాటు నిలబెట్టుకోవడం వలన కొన్ని పండిత కుటుంబాల వారి అసలు ఇంటి పేర్లు మరుగున పడి మాడభూషులుగా సార్థక నామధేయులయ్యారు. అనగా ప్రభువుల చేత సన్మానించబడి, బంగారు మాడలను వడమాలలుగా వేయించుకున్న వారిని, మెడనిండుగా కాసులపేర్లు అలంకరించుకున్న వారిని మాడభూషివారన్నారు. వీరంతా శ్రీవైష్ణవులు. అందునా తెంగలై వారూనూ. అలా జగత్ప్రసిద్ధమైన వీరి వంశం ఆంధ్రదేశంలో కృష్ణవేణి నదికి ఇరుపార్శ్వాల స్థిరపడింది. ఆపై తెలుగు నాడంతా విస్తరించింది. తెలిసినంతమేర పండిత లోకంలో శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యులు వీరి వంశంలో ముందుగా మన మధ్య తళుక్కుమంటున్నతార.

వేదపన్నాలను ధారణపట్టి, 8రకాల పద్ధతులలో స్వరయుక్తంగా గానం చేస్తూ అభ్యసించి, యాగశాలల్లో 'సదస్యం' జరిగినప్పుడు,వేదవిద్యా పరీక్షా సభలలోనూ తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించేవారిని అవధానులనేవారు. 64కళలలో ఇది 15వది. ఈ కళ ఆంధ్రదేశంలో నన్నయ గారి కాలానికే ఉంది. అది అనేక రకాల మార్పులు పొంది యావత్ భారతదేశంలోనూ ఒక్క తెలుగు భాషలోనే నిలబడింది. అలాంటి అవధాన ప్రక్రియకు తొలిగా లక్షణాలు నిర్వచించి, నియమాలను కట్టుదిట్టం చేసిన అఖండ ప్రజ్ఞాశాలి శ్రీ మాడభూషి వేంకటాచార్యులు కృష్ణాజిల్లా నూజివీడు సంస్థాన పండితులుగా వాసికెక్కారు. ది.22.02.1872లో కృష్ణాజిల్లా ఆగిరిపల్లి లోను,1879 నవంబరు మాసంలో పిఠాపురం సంస్థానంలోనూ శతా వధానములు నిర్వహించారు. తెలుగు భాషలో మహా కవులందరూ సహస్రావధానులే అయినా మాడభూషివారి రంగప్రవేశం తో అప్పటి వరకు రాచవారి మొగసాలల్లో రత్నకంబళుల మీద పారాడుతున్న అవధాన సరస్వతికి చక్రాలు పూన్చిన శకటం దొరికినట్లయ్యింది.ఆ బండి వెంట నడిచి వెళ్ళిన అపూర్వ ప్రతిభా సంపన్నులు తిరుపతి వేంకటకవులు. బాలసరస్వతిని పెంచి ప్రౌఢసరస్వతిని చేసి, ఏనుగునెక్కించి నానారాజ సందర్శనం చేశారు. వెంకట రామకృష్ణకవులు, కొప్పరపు కవిసోదరులు ఆమెకు అపరంజి అంబారిని సమకూర్చారు. ఇంతటి ఘన కార్యమూ మాడభూషివారి సంకల్పం నుండి పుట్టడం సర్వ కళావిలాసిని ప్రేరణేగానీ కాకతాళీయం కాదు.

పుల్లరి సత్యాగ్రహం అనగానే కన్నెగంటి హనుమంతు గుర్తుకు వస్తారు. 1920-30ల మధ్య గుంటూరులో పుల్లరి సత్యాగ్రహాన్ని నడిపించిన ఉన్నవ లక్ష్మీనారాయణగారికి అన్ని విషయాలలోనూ సైదోడు మాడభూషి వేదాంతం

నరసింహాచార్యులు గారని జనం మర్చిపోయారు. బమ్మెర గ్రామంలో మహాకవి పోతన జన్మస్థలమని ప్రజలు గుర్తుంచుకొని, ఆరాధిస్తున్న చోట ఒక స్మారకమందిరానికి శంకుస్థాపన చేసిన క్రాంతదర్శి, భారత లోక్‌సభను - సభాపతిగా ఒడ్డోలగంగా నిర్వహించిన ధీశాలి మాడభూషి అనంతశయనం అయ్యంగారు, తెలుగు అయ్యవారే. ఇటీవలి కాలంలో కేంద్ర సమాచార హక్కు చట్టం అమలు సంఘానికి అధ్యక్షులుగా వన్నె తెచ్చిన మాడభూషి శ్రీధరాచార్యులు జగమెరిగినవారే కదా. అధ్యయన, అధ్యాపనాలలో అక్కడక్కడా మాడభూషులు ఎదురౌతునే ఉన్నారు.

ఆంధ్రదేశానికి పాదపీఠం చిత్తూరు జిల్లాలో శ్రీరంగ రాజపురం మండలంలోని గ్రామం కమ్మపల్లిలో ది.17.09.1959లో పుట్టిన సంపత్ కుమార్‌గారి తండ్రి శ్రీనివాసాచార్యులు పరహితమే ఎరిగిన పురోహితులు. దశరథరాముని సేవ దుడ్డు రాల్చకపోయినా, ఇదంతా కంచి గరుడసేవ అని తోటి వారు ఎత్తిపొడిచినా పట్టాభి రాముని పాదార్చన విడువనివారు. తల్లి పట్టమ్మ ఆశీర్వాద బలమే సంపత్ కుమార్‌గారు ఎన్నో పట్టాలు పొందడమూ, పట్టములు అధిరోహించడమేగాక మరెందరికో యోగ్యతా పట్టాలు వారి చేతుల మీదుగా ఇవ్వగలగడానికి మూలమని మనసున్న బంధువులు ముచ్చటించు కుంటారు. తాను కూలీగా రాళ్ళెత్తిన సౌధంలో తనకు రాజ్యాభిషేకం జరిగితే ఆ వ్యక్తి పొందిన ఆనందం ఎలా ఉంటుందో, తాను పలకమీద బలపంతో దిద్దుకున్న బడికి తానే ఉపాధ్యాయునిగా వెళ్ళిన వారికి అలాంటి ఆనందమే కలుగుతుంది. అటువంటి అదృష్టం మాడ భూషి వారికి మద్రాసు విశ్వవిద్యాలయంలో దక్కింది. కర్ణుడంతటి వాడికి పుట్టుకతో వచ్చిన కవచకుండలాలు బలిచి ఇస్తేనే గానీ మోక్షం దక్కలేదు. కేవలం మానవ మాత్రులమైన మనం జన్మతో పాటే అంటివచ్చిన కులం, జాతి, హోదా, అధికారం లాంటి ఎన్నో కవచాలను ధరి స్తున్నాం. వీటన్నింటినీ వదిలించుకొని, సంస్కారములనే మేని చర్మంతో మిగిలిన వినయశీలి సంపత్‌కుమార్‌గారు. కరోనా మహమ్మారితో ప్రపంచమంతా కలుగులో దూరి దాక్కున్న వేళ,ఆయన పట్ల అభిమానం అంతర్జాలంలో నుండి ఉబికి వచ్చింది. గురువులు (జి.వి.ఎస్.ఆర్.కె.) ఆచార్య గోపాల వేంకట షణ్ముఖ రాధాకృష్ణమూర్తి గారు ద్రోణాచార్యుడై పర్యవేక్షిస్తుండగా, భీష్మ, కృపాచార్యుల వంటి మేరు సాహితీ శిఖరాల ఆధ్వర్యంలో జరుప బడుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు "సంపత్ కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం" లాగా ఉంది. ఇందులో స్వపక్ష, విపక్షములు లేవు. విద్వజ్జనాశీర్వాదమే రంగస్థలంగా అమరింది. కేవలం విజయ విలాసమే అంతటా పరచుకున్నది. విశ్వాంతరాళం లో నుండి వీక్షిస్తున్న ప్రతి ఒక్కరినీ అది సమ్మోహితం చేసింది.

2014 మార్చి నెలలో శ్రీ సంపత్ కుమార్ గారు ప్రకటించిన "తమిళ జానపద కళలు" అన్న 21 విభాగాల పుస్తకంలో 111పుటాలున్నాయి. రచయిత తనకున్న పరిమితులలో ముందుగా పాఠక జనానికి వీటిని సంక్షిప్తంగా పరిచయం చేశారు. వారు పేర్కొన్న చాలా తమిళ జానపద కళలు, కళాకారులు నేరుగా తెలుగు మూలాలున్న వారవ్వడం చేత నేను విహంగవీక్షణ పద్ధతిలో తులనాత్మక అధ్యయనం చేశాను.

తమిళంలో కవిత్వమంటే పాటలే. ఏ భాషలోనైనా పాట ఎప్పుడు పుట్టిందో ఎవరెరుగుదురు. ప్రాచీన సంగంసాహిత్యంలోనివన్నీ కైగట్టి పాడిన పాటలే కదా. అటువంటి పాటలను కాపాడుకోవడంలో తమిళు లకున్నంత పట్టుదల చాలా తక్కువ భాషా కుటుం బాలలో మాత్రమే కనిపిస్తున్నది. మూలాలను భద్రపరచు కోవడంలో ఆంధ్రులు అలసత్వాన్ని ప్రదర్శించారు. పాట వెంట ఆటలు సాగుతాయి. అందులో వినోద గేయాలు, క్రీడా గేయాలు, పిల్లల పాటలూ మతసంబంధమైనవి, అద్భుతాలను, సంఘటనలను వర్ణించేవి ఇలా పలు రకాలుంటాయి.

"ఆట" పాటలు :

ఈ విభాగంలో చర్చించిన పాటలు లాంటివి మన దేశంలో అన్ని మూలలా వ్యాపించి ఉన్నాయి. తమిళ నాట "కణ్ణముచ్చి" ఆట తెలుగు వారి దాగుడుమూతల ఆటలాంటిది. అచ్చనకాయలు, అచ్చనగండ్లు/అచ్చం గాయలు ఆట తెలుగు పిల్లలకు ఇష్టమైనది. దీనిలో చిన్న చిన్న రాళ్ళు, ఈతగింజలు, చింత పిక్కలు, బాడిద గింజలు ఉపయోగిస్తారు. పందెంలో గెలిచిన గింజలను ఏనుగు, గుఱ్ఱం అని భావిస్తూ దాచుకుంటారు. దీనిని తమిళనాట "సొట్టాంగళ్" అంటున్నారు. అల్లిబిల్లి ఆట, తింబిచుట్రుదల్ ఒకటే. ఈ ఆటలన్నింటికీ పాటలిద్దరికీ ఉన్నాయి. సడుగుడు ఆట (కబడ్డి) మహారాష్ట్ర దీనికి జన్మస్థానం. దీనిని తెలుగువారంతా చెడుగుడు ఆటగా ఆడతారు. చెడుగుడు-చెడుగుడు అంటూ కూత పెట్టడము ఉందిగానీ తమిళులకున్నటువంటి చక్కని పాటలిక్కడ లేవు.

ఏట్రప్పాట్టు (ఏతం పాటలు) :

వర్షాధార సేద్యంలో అదనపు నీటి అవసరాలు తీర్చడామెనికి రైతులుపయోగించిన జలసేకరణ సాధన మిది. తీరాంధ్ర ప్రాంతాలలో దీనిని ఏతమంటే, రాయల సీమ లాంటి మెట్ట ప్రాంతాల్లో "కపిల" అనే వారు. ఇప్పుడు కరెంటు మోటారున్న పొలాలకు ఎలా విలువ ఉందో పూర్వం ఏతాము గుంట ఉన్న పొలాలకు అలా విలువ ఉండేది. మాడభూషి వారు 3రకాల ఏతాము లను ప్రస్తావించారు. ఎన్ని బానలు నీళ్ళు తోడింది లెక్క వేసుకునే పద్ధతులను చెప్పారు. ఇవన్నీ తెలుగు వారు గుర్తుంచుకొలేదు. కపిల పాటలు గ్రంధస్తం అయ్యాయి గానీ కాలువల క్రింద సాగయ్యే పంట బోదుల్లో తెలుగు ఏతం పాటలు ఇంచుమించు కొట్టుకు పోయాయి.

ఏర్‌ప్పాట్టు (వ్యవసాయ పాటలు) :

ఇవి ప్రధానంగా తమ ప్రాంతంలో సాగుభూమి దున్నేటప్పుడు పాడే పాటలన్నారు రచయిత. ఇందులో పేర్కొన్న వాచ్చు నాగలి, బోను నాగలి రెండూ తెలుగు వారికీ ఉన్నాయి. గొర్రి, గుంటక, 3పళ్ళగుంటక, 5పళ్ళ గుంటక, కత్తి గుంటకలాంటి పలు నాగళ్ళు, తెలుగు వారికి ఉన్నాయి. మడక, నాగలి, మేడి పదాలు ఊళ్ళ పేర్లలోనూ, ఇళ్ళ పేర్లలోనూ ఉన్నాయి. హలాయుధుడైన బలరాముడు తన నాగలితో దున్నిన చాలు వెంట వచ్చిన నది "లాంగుల్య" శ్రీకాకుళం జిల్లా గుండా పాఱుతున్నది. "నీళ్ళతో నిండిన కడవ నేల మీద పడితే పగిలి పోనంత మెత్తగా దుక్కిదున్ని" వ్యవసాయం చేసిన నేర్పుగల రైతులు ఇంకా కృష్ణాడెల్టాలోను, మా దివిసీమలోనూ జీవించే ఉన్నారు. కళింగాధిపతి కారవేలుడు తెలుగు నేల పై వీర విహారం చేసి పగవారి రాజధానులను గాడిదలకు కట్టిన నాగళ్ళతో దున్నించడం, ఆనక అముదపు విత్తులు విత్తించడం చారిత్రక చాళ్ళ వెంట తిరుగాడిన వారికి విదితమైన విషయమే. రచయిత పేర్కొన్న 1) కొడైఓట్టు - తెలుగు వారి పొడిదుక్కు అంటే వర్షారంభానికి ముందే వేసవిలో పొలం దున్నించడం 2) నడవు సాల్ ఓట్టు - తెలుగు వారి తడిదుక్కు అంటే తొలకరి వానలు పడ్డాక ఇది వరకైతే ఏరువాకకు వెళ్ళి విత్తనాలు చల్లి వచ్చేవారు. నేడు అరకదున్ని పొలాన్ని సిద్ధం చేస్తున్నారు. చాళ్ళ మధ్య కలుపు తీయటానికి దున్నే దుక్కును పైపాటు దుక్కు అంటారు. 3) పిరంబడిసాల్ ఓట్టు - తెలుగు వారి తొడుగు మండతొక్కడం-మెట్టపంట పొలాల్లో దుక్కి దున్నాక ఎత్తు పల్లాలుంటే సరి చేయడం. మాగాణులలో నేల చదును చేయటానికి తాటి పట్టెను రెండు చివర్ల తాళ్ళు కట్టి ఇద్దరు మనుష్యులు లాగుతారు. దీనికి "తరం లాగటం" అని పేరు. పుదుక్కోట, తంజాఊరు, రామనాథ పురం జిల్లాల్లో ఉపయోగించే చాలా వ్యవసాయక పదాలు రాయలసీమలోనూ వాడుకలో ఉన్నాయి. దున్ని దున్ని అలసిపోయావా ఓ బావయ్యా లాంటి పాటలు ఇద్దరికీ ఉన్నాయి.

కణియన్ :

దక్షిణ తమిళనాడు జిల్లాల్లో కనిపించే సమూహంగా

రచయిత వీరిని పరిచయం చేశారు. తమ చెయ్యి నరుక్కుని రక్త తర్పణం చేస్తూ దేవతలకు కొలువు చెయ్యడం వీరి ఆచారం. ఆంధ్ర, తెలంగాణములలో "గావు" పట్టడం ఉంది గానీ స్వీయ హింసా పద్ధతులు అంతరించాయి. మైలారు వీరభటులు, వీర శైవాచార వంతులు, చంపుడు గుళ్ళ విషయాలు కాకతీయుల చరిత్రలో తరచూ ప్రస్తావించబడ్డాయి. 1261 సి.ఇ.లో కాకతీయ గణపతి దేవుని అనతి మీద కాకతి రుద్రమదేవి తమ రాజ గురువు విశ్వేశ్వర శంభువుకు చేసిన దానం-నేటి నవ్యాంధ్రప్రదేశ్ సచివాలయం ఉన్న వెలగపూడి, దాని సమీప మందడం గ్రామాలను కలిపి ఆనాడు విశ్వేశ్వర శంభువు దానం పుచ్చుకొని దానిని తిరిగి మందడం విశ్వేశ్వర గోళకీ మఠానికి దానం ఇస్తూ వివిధ వృత్తులను ఏర్పరిచారు. అందులో చోళ దేశం నుండి పిలిపించబడిన బీజచ్ఛేద, శిరచ్ఛేద, అంగచ్ఛేద, కుక్షిచ్ఛేదం చేసే, గ్రామాలను రక్షించే, వీరభద్రులనే వారికి మరియు వీరముష్టి వారికి భూమి దానం చేశారు.

కాళీ వేషం :

తమిళనాట ఇది భక్తి సంబంధమైన కళ. అత్తి చెట్టు కలపతో తయారైన కాళీమాత శరీరాంగాలను ఆచార వంతులు ధరించి ఆడి పాడతారు. తెలుగునాట దసరా ఉత్సవాలలో నేటికీ శక్తి వేషం వేస్తున్నారు. తెలుగు వారి పగటివేషాలలో కాళీ వేషం/శక్తి వేషం ఒకటి. కూచిపూడి వారు వీధి భాగవతాలాడడంలో ఎంతో ప్రసిద్ధులు. గడ్డిపాడు గ్రామ కళాకారులు పగటి వేషాలకు పెట్టింది పేరు. తమిళుల గరగాట్టం గోదావరి జిల్లాలలో నేటికీ ప్రసిద్ధమైన గరగాట ఒకటే. ఇందులో ఆట, పాటలా ఇద్దరికీ ఒకేలా ఉన్నాయి. మొక్కు తీర్చుకోడానికి కాళీ వేషం వేసే వారిని రచయిత ప్రస్తావించారు. ప్రసిద్ధ తిరుపతి గంగ జాతరలో ఎన్నో రకాల వేషాలు వేసి ఆబాలగోపాలం నేటికీ ఏటా మొక్కులు తీర్చుకుంటూనే ఉన్నారు. గోదావరి మండలంలో కూడా ఇలాంటి ఆచారం కొనసాగుతున్నది.

కాళైమట్టు నడనం: (ఎద్దు బొమ్మలతో ఆట) :

తమిళనాడు జానపద కళా జగత్తుకు తంజావూరు, మదురై జిల్లాలు రెండు కళ్ళు లాంటివి. అక్కడి కళాకారులు అభివృద్ధి చేసినదే ఈ కళ. ఎద్దు తొడుగు తయారు చేసుకొని, అందులో ప్రవేశించిన కళాకారుడు వాద్యాలకనుగుణంగా నాట్యం చేస్తాడు.13వ విభాగంలో చెప్పిన కొయ్య గుర్రం ఆట కూడా తమిళుల ప్రాచీన క్రీడా విశేషం. సిలప్పదికారంలో మాధవి ఆడిన 11ఆటల్లో ఈ ఆట ఉందని తొల్కాప్పియంలోనూ దీని జాడ ఉందని రచయిత పేర్కొన్నారు. నేడందరూ మెచ్చుకుంటున్న కొయ్యగుఱ్ఱం కళారూపాన్ని కూర్చింది తిరువయ్యూరు నివాసి తెలుగువారైన రామకృష్ణమ నాయుడు. 1910కి ముందే ఆయన ఈ ఆటను పునరుద్ధరించారు. తెలుగువారికి కీలుగుఱ్ఱం, కొయ్య గుఱ్ఱం మంచి కథా వస్తువులు. కీలు గుఱ్ఱం ఆట కూడా ప్రదర్శిస్తారు. ఎద్దు బొమ్మలాట మాత్రం వీరికి లేదు.

కావడిపాట్టు :

భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరునికి కావడికట్టి తీసుకు వెళ్ళేటప్పుడు పాడేపాటలు. కుమారస్వామి ఆరాధన ద్రావిడ దేశంలో మిక్కిలి జాస్తి అయినా తెలుగువారూ వారికి సమ ఉజ్జీలే. కార్తికేయారాధన శాతవాహనుల కాలానికే ఆంధ్రులలో ప్రబలంగా ఉంది. శరవణభవునికి సమానార్థం గల చక్కని తెలుగు పేరు "పులోమావి"ని వాశిష్ఠీపుత్రుడైన శాతవాహన చక్రవర్తి ఇష్టంగా ధరించాడు. షణ్ముఖుని చిహ్నాలున్న నాణాలను కూడా శాతవాహనులు ముద్రించారు. తూర్పు చాళుక్యుల కాలంలో అత్యంత వైభవోపేతంగా సుబ్రహ్మణ్యునికి కొలుపులు జరిగేవి. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో (9వ శ॥ సి.ఇ.) చేబ్రోలు మహాసేనుని జాతర వర్ణించబడింది. నేటికీ తెలుగు దేశంలో అడికృత్తిక, సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలలో కావడులు తేవడం, పాటలు పాడడం జరుగుతున్నది. కానీ ఆ పాటలు పరంపరాగతమైనవికావు. ఆ పరంపరకు విఘాతం కలిగింది. కానీ రాయలసీమ నుండి గోదావరి

మండలం వరకు సుబ్బారాయుడుగా శివపుత్రుని పేరు ఏదో ఒక రకంగా వినిపిస్తూనే ఉంటుంది.

కురవర్ :

దక్షిణాదిలోని 4 రాష్ట్రాలలోనూ వ్యాపించి ఉన్న రాజరికమూలాలున్న ప్రాచీన జనసమూహమిది. కురవలు అంటే కొండ ప్రాంతానికి (కురింజి) చెందిన ప్రజ అని తమిళసాహిత్యంలో వర్ణలున్నాయి. కొరవంజి అంటే తెలుగులో ఎరుకజాతి స్త్రీ అని, ఎరుకలు చేసే నాట్య విశేషమని అర్థాలున్నాయి. వీరి ఆహార, విహారాలు, వృత్తి విశేషాలు ఆంధ్ర, తమిళ ప్రాంతాలలో ఇంచుమించు ఒకటిగానే ఉన్నాయి. రచయిత వీరిలో, వర్గాలు, జీవన స్థితిగతులను, అణచివేతలను వివరించారు. తెలుగు నాడులోనూ వీరికి అలాంటి అన్యాయమే జరిగింది. ఏతావాతా వీరి కళ గురించి చెప్పాల్సిన సంగతులు మరుగునపడ్డాయి. చోళుల పరిపాలనలోనే శైవాలయాలలో కురవంజి ఆడటానికి ఏర్పాట్లుఉన్నట్లు మనకు శాసన సాక్ష్యాలున్నాయి. తెలుగులో శ్రీనాధ, అయ్యల రాజు రామభద్రుడు లాంటి కవులు తమ రచనల్లో ఈ నాట్యాన్ని పేర్కొన్నారు. శృంగార, వేదాంత కురవంజిగా రెండు విధాలా ఇది ప్రదర్శించబడేది. పరిశోధకుల అభిప్రాయంలో కురవంజి యొక్క పరిణామక్రమ రూపమే ప్రసిద్ధ యక్షగాన కళ.

కుళువర్ :

తమిళనాడులో తెలుగు మాతృభాషగా గల 9 సంచార జాతుల వారి ఉమ్మడి పేరు ఇది. వీరు మేదర పని (వెదురుతో వస్తువులు) చేయడం, పాములు పట్టడం, కోతులను ఆడించడంలో నిష్ణాతులు. వీరు తీరాంధ్రదేశం మీదుగా శ్రీలంక వరకు వ్యాపించి ఉన్నారు. తెలుగు నాయకరాజులకు, పాలెగాళ్ళకు వీరికి మొదటి నుండీ సంబంధాలున్నాయి. శ్రీలంకలో వీరిని "అహికుంటక" జాతి వారంటారు. అక్కడే వీరు పాములు పట్టడం వృత్తిగా, అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ జీవిస్తున్నారు. తెలుగు వీరి మాతృభాష. ఆంధ్రదేశంలో నక్కలవాళ్ళు, పాముల వాళ్ళుగా పిలువబడుతున్న తెగ వీరి చుట్టాలే.

జాతి పిళ్ళైలు :

వివిధ కులాల చరిత్రలను పాడివినిపిస్తూ వారిని ఆశ్రయించి బ్రతికేవారు. తమిళనాడు ఉత్తర జిల్లాల్లో వణ్ణియర్ సామాజిక వర్గం వారి ఆశ్రిత కులంగా రచయిత వీరిని పరిచయం చేశారు. వీరి మాతృభాష తెలుగు. ఆంధ్ర, తెలంగాణములలో 18 కులాల వారికి ఆశ్రిత భిక్షుక గాయకులున్నారు. వారిలో వీరినీ చేర్చవలసి ఉంటుంది. వెతికితే మరికొందరు దొరుకుతారు. కన్యాశుల్కం పద్ధతి ఉన్న వీరు ఇత్తడి పాత్రల తయారీ, కళాయివేయటం చేస్తారు.

నడుపుప్పాట్టు :

నాట్లు వేసేటప్పుడు పాడేపాటలివి. ఇవి భారతదేశ మంతా వినిపిస్తాయి. తమిళనాడులో వేసే త్రిభుజాకృతి (ముక్కణిసాల్) నాటు విధానం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉంది. నత్తుపైరు (దారం కట్టి వరుసగా నాటడం) అది ఇక్కడా ఉంది. 50సం॥ల క్రితం దీనిని "జపాన్ నాటు" అనేవారు. ఇటీవల వంగ రాష్ట్రం నుండి వచ్చే వలస కూలీలు దారం కట్టకుండానే వరుసగా వేస్తున్నారు. దీనికి ప్రస్తుతం "బెంగాల్ నాటు" (ఆంధ్రప్రదేశ్) అని పేరు. ప్రాంతాలవారీగా నాట్లువేసేటప్పుడు వివిధ మాండలికాలలో కొన్ని వందల పాటలు తెలుగు రాష్ట్రాలలో ప్రచారంలో ఉన్నాయి. అయితే సంప్రదాయ పాటలు, చలనచిత్రాల్లో పాటలు, వరుసైన వారిని ఆటపట్టించే పాటలతో 30సం॥ల క్రితం వరకూ పంటపొలాలు ఎంతో సందడిగా ఉండేవి. కాలప్రభావంతో నేడు చేలు మూగబోయాయనే చెప్పవచ్చు. నేడు సంపాదన మోజులో ఎంత తొందరగా నాటువేశామన్నదే ముఖ్యం. ఎంత ఆనందంగా వేశామన్నదానికి ప్రాధాన్యత లేదు. పైరు పాటలు వెనుకబడటానికి ఇదొక కారణం.

పళమొళికదై :

(సామెత కథలు) కథానబంధంగా సామెతలును,

సామెతలను వివరించడం కోసం కథలను చెప్పడం ఇరు ప్రాంతాలలోనూ ఉంది. పళమొళి అంటే తమిళంలో ''పాతమాట'' అని అర్థం. సంగం సాహిత్యంలోనే ''పళి మొళినానూఱు'' అనే గ్రంధం వెలువడింది. తెలుగులో లక్షల సామెతలున్నాయి. లక్ష సామెతలను సేకరించిన తెలుగు పండితులున్నారు. వ్యవసాయం మొదలు అన్ని రకాల విషయాలపైన సామెతలు, వాటితో ముడిపెట్టిన కథలు తెలుగులో కోకొల్లలు.

ఫకీరు పాటలు :

రచయిత 14,15 విభాగాలలో వివరించిన పాటలివి. తెలుగు రాష్ట్రాలలో ముస్లిం జనాభా అధికంగా నివసించే జిల్లాలో ఈ ఫకీరులు భక్తి పాటలు, యుక్తి పాటలు పడుతూ యాచన చేస్తారు. అలాగే దర్గాలలో జరిగే ''ఉరుసు'' ఉత్సవాలలో గంధం సమర్పణ, ఛాదర్ సమర్పణ రోజుల్లో ఈ ఫకీర్లు ''కవ్వాలీ''లు చేస్తారు. రంజాన్ మాసంలో తప్పక వీరు కనిపిస్తారు. తెలంగాణలో నిజామ్ పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఈ ఫకీరు వేషాలలో కోస్తా జిల్లాల నుండి నిజామ్ రాజ్యంలో ప్రవేశించి ''మీ పిల్లాజెల్లా చల్లగా ఉండాలి అల్లాకే నామ్-మిమ్మల్ని లొల్లి చేసేవాళ్ళని గల్లీగల్లీలో ఎదురించాలి అల్లాకే నామ్'' అంటూ ఊరూరా పాటలు పాడుతూ ప్రజల్ని చైతన్యపరిచేవారు. తీరాంధ్రదేశంలో సంక్రాంతి పండుగ దినాలలో నేటికీ గంటాసాహెబ్ వచ్చి ఆశీస్సులు అందించి వెళతాడు.

బండివాండ్లపాట :

ఎద్దుల బండ్లు రవాణా విరివిగా సాగిన రోజుల్లో పుట్టిన పాటలివి. ఆంధ్రదేశంలో బ్రిటీష్‌వారి సైనిక పటాలాల సరుకు రవాణాకు, వారు కట్టే కట్టడాలకు నిర్మాణ సామగ్రి రవాణాకు పూర్తిగా ఎద్దుల బండ్లే సాయపడేవి. తిరునాళ్ళకు, తీర్థాలకు గూడు బండ్ల మీద వెళ్ళేటప్పుడు జనం పాటలు పాడేవారు. నేడు ఈలలు వేయడం, ''వాలా, వాలా'' అనో '' హర హర '' అనో అనడమే మిగిలింది.

బూం బూం మట్టుకారర్ : (గంగిరెద్దుల వారు):

తెలుగు మాతృభాషగా గల వీరు తమిళనాడులో తమను తాము (పూవిడయర్) పూలు కట్టే వారుగా చెప్పుకుంటారు. కానీ దీనర్థం పర్వత పాదతలంలో నివసించే వారని రచయిత వివరించారు. ఆంధ్రదేశంలో గంగిరెద్దుల వారికి కొద్దిగా వ్యవసాయం,భూములు ఉన్నాయి. తమిళనాడులో స్థిరపడిన వారికి లేవు. అయితే తెలుగునాడులోని గంగిరెద్దులకు, దేవరెద్దులకు కొన్ని తేడాలున్నాయి. గంగి అంటే పూజనీయమైన అన్న అర్థం ఉంది. గంగిగోవు అన్న ప్రయోగం అలా వచ్చినదే. గంగి+ఎద్దు = గంగెద్దు కావాలి. మరి గంగిరెద్దు ఎలా అయ్యింది అంటే ''గంగి దేవరెద్దు'' అన్న పదం గంగిరెద్దుగా రూపాంతరం చెందింది. తెలుగువారైన ఈ గంగిరెద్దుల వారు వైష్ణవదాసరులు. వీరిలో ఒక శాఖ ప్రస్తుతం తమిళనాడులో జీవిస్తున్నది. వీరు అలంకరించిన దేవర ఎద్దును ఇంటింటా తిప్పుతూ యాచన చేస్తారని, దేవాలయాలకు దానం చేసిన ఎద్దులను సేకరిస్తారు గనుక ''పెరుమాళ్ మాట్టుకారర్'' లుగా వీరు పిలువబడతారని రచయిత వివరించారు. వీరు తోలువాద్యం (ఉఱుము) పై బూం, బూం అన్న శబ్దం చేస్తారు గనుక బూం బూం మాట్టుకారర్లు అయ్యారు. ఆంధ్రదేశంలోని గంగిరెద్దులతో ఎన్నో విన్యాసాలు చేయిస్తారు. ఈ సంప్రదాయం అటు కర్ణాటకలోనూ ఉంది. ఇక దేవరెద్దు సాంప్రదాయం అటు సింహాచలం చుట్టు ప్రక్కల గ్రామాల్లోనూ ఇటు చిత్తూరు జిల్లా దక్షిణ మండలాల్లోనూ నేటికీ ఉంది.

తమటం ఎద్దు :

చిత్తూరు జిల్లా కుప్పంకు 10కి.మీ దూరంలో ఉన్న ''కంగుంది'' గిరి దుర్గం పరిసర ప్రాంతాల్లో ఏటా మహా శివరాత్రినాడు దేవర ఎద్దు (తమటం)ను దైవంగా కొలుస్తారు. సంప్రదాయ వాద్యాలలో గొరవయ్యలు దేవరెద్దును. తొడ్కొని మల్లప్పకొండపైనున్న మల్లేశ్వరాలయానికి వెళతారు. భేరీపూజ చేస్తారు. హనుమధ్వజాన్ని

పూజిస్తారు. దేవర ఎద్దు వీరితో పాటు జాగారం చేస్తుంది. ఈ క్రతువునంతా నడిపే వారిని "సేవగాండ్లు" అంటారు. ఈ తమటం ఎద్దునే కనుమనాడు కొలిచి, సేవగాండ్లు పాటలు పాడుతూ ఉత్తర వాన, మఖవాన, ఆరుద్రవాన అని చెప్పినప్పుడు ఎద్దు ఏ సందర్భంలో మూత్రం పోసిందో ఆకార్తెలో వానలు పడతాయని జనం నమ్ము తారు. "ఆరుద్ర కురిస్తే ఆరు నెలలు కురుస్తుందని కదా సామెత. ఉత్తర కార్తె కూడా చినుకు రాలకపోతే కరువు తరుముకొస్తుంది గనుక "ఉత్తర చూసి ఎత్తర గంప" అంటూ పూర్వం వలస వెళ్ళిపోయేవారు. తమిళనాడులో దేవర ఎద్దు వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమెలాగో అలాగే సింహాచలం అప్పన్న ప్రతిరూపంగా అక్కడి జనం ఎద్దును పూజిస్తారు.

మన్మదన్ నాట్య నాడకం :

దక్ష యజ్ఞం విధ్వంసం, అనంతరం పార్వతీకల్యాణం బాగా ప్రచారంలో ఉన్న పౌరాణిక ఘట్టాలు. ఆ సందర్భంలో జరిగిన కాముని దహనం, తిరిగి మన్మధుడు పుట్టడం ప్రజల్ని బాగా ఆకర్షించాయి. తమిళనాడులోని కడలూరు, తిరుచ్చి, తంజావూరు, నాగపట్టణం జిల్లాల్లో శతాబ్దాలుగా మన్మధ దహనం నాటకాన్ని స్వల్ప బేధాలతో ప్రదర్శిస్తున్నారు. ఇది రెండు వారాల పాటు జరిగే నాట కోత్సవం అన్నారు రచయిత. ఇది తెలుగు వారు వంద లేండ్లుగా సంబరంగా చేసుకొని ఒక శతాబ్దం క్రితమే మర్చి పోయిన పండుగ. కామున పున్నమిగా తరచూ తెలుగు సాహిత్యంలో దర్శనమిస్తోంది. ఫాల్గుణ పౌర్ణమికే కాముని పున్నమి అని పేరు. ఉత్తరం భారత దేశమంతా హోళికా పూర్ణిమగా రంగులు జల్లుకోవడం, దక్షిణాపథమంతా మదనుని పునరుజ్జీవనాన్నికోలాహలంగా ఉత్సవం చేసుకోవడం అనాదిగా ఉంది. ఇది ప్రధానంగా యువజ నోత్సవం. కాముని పున్నమిని నేటికీ సంప్రదాయబద్ధంగా జరుపుతున్న తమిళులు సదా ప్రశంసనీయులు. అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం క్షేత్రంలో ఒక్కచోట మాత్రం ఈ మదనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దానికి "డోలాయాత్ర" అని పేరు. మన్మధునికి ప్రతీకగా తమిళనాడులో మట్టి బొమ్మను పెట్టినట్లు ఇక్కడ పచ్చటి అరటి చెట్టును పెడతారు. కామ దహనం, తిరిగి అనంగుడు జన్మించడం సముద్ర తీరాన ఒక క్రతువుగా నిర్వహించి సింధుస్నానం చేస్తారు.

మయిల్ నడనం :

హంస నడకలను, నెమలి నాట్యాన్ని అనుకరిస్తూ భారతీయ శాస్త్రీయ నృత్యాలలోను, దేశీ నృత్తములలోనూ ఎన్నో కేళికలు, రూపకాలు రూపొందించబడ్డాయి. అయితే నేడు తమిళనాడులో చక్కగా, గొప్పగా ప్రదర్శింప బడుతున్న ఈ జానపద కళ ఆ రాష్ట్రానికొక గుర్తింపు తెచ్చింది. ఇటువంటి కళ తెలుగు వారికి లేదు.

వళినడైప్పాట్టు :

పుణ్యక్షేత్రాలకు కాలినడకన, ఎద్దులబండ్ల మీద వెళ్ళేటప్పుడు భక్త జనం ప్రయాణాయాసాన్ని మర్చి పోవడానికి పాడే పాటలు ఇవి అని రచయిత పరిచయం చేశారు. ఇలాంటివి తెలుగువారికీ ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో శ్రీశైల మల్లికార్జునుని దర్శనం కోసం వచ్చే భక్తులు శ్రీ పర్వతం ఎక్కుతూ చేదుకో మల్లయ్య-ఆదుకో మల్లయ్య అంటూ పాడిన పాటలు, శంకర పదాలు, తుమ్మెద పదాలు ఇలా ఎన్నో వివరించారు. నేటికీ పాదయాత్రగా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి శ్రీశైలం వచ్చే జనం శరణు పదాలను పాడుతూనే ఉన్నారు. ఇక తిరుమలకు పాదయాత్రగా వెళ్ళే భక్తులు అనాదిగా పాటలు పాడు తూనే ఉన్నారు. నేడు అయ్యప్ప, హనుమంత, భవానీ దీక్షలు చేపట్టిన లక్షలాది భక్తులు తమ ఇష్టదైవాలన్న క్షేత్రాలకు, తమ ఊళ్ళ నుండి పాదయాత్రలుగా బయలుదేరి ఎన్నో పాటలు పాడుతూ సాగుతున్నారు.

విపత్తు పాడల్ గళ్ :

జానపదులు శ్రమ మర్చిపోవటానికి, ఆనందాన్ని వ్యక్తీకరించటానికి ఎలా పాటలు కల్పించి పాడతారో,

ఏదైనా ఉపద్రవం, ఉత్పాతం సంభవించినప్పుడు ఆ విషాదాన్ని పాటలు గట్టి పాడతారు. జానపదుని హృదయ వైశాల్యం అలాంటిది. నాగరికులమని చెప్పుకునే వారికీ లక్షణ లేదు. చెన్నపట్టణం నుండి రామేశ్వరం బయలు దేరిన రైలు అరయలూరు వంతెన వద్ద ప్రమాదానికి గురై ప్రజలు చనిపోయిన దుర్ఘటన 1883లో జరిగింది. ప్రజలు అంతా కలత చెందారు. మదురైకి చెందిన టి.వి. పచ్చయ్యప్పన్ అనే నిరక్షరాస్యుడు ఈ సంఘటన పై పాట కట్టాడు. పెద్ద ఉప్పెనలో ధనుష్కోటి కొట్టుకు పోయిన విషాదం పై కూడా ఆయన పాట కట్టాడు. అవి ఎంతో ప్రసిద్ధమై మరెందరికో ప్రేరణ కలిగించాయని రచయిత వివరించారు. ఇలాంటివి తెలుగు వారికీ ఉన్నాయి. 1864వ సంవత్సరం నవంబరు 1వ తేది (రక్తాక్షి నామ సంవత్సర కార్తీక శుద్ధ విదియ మంగళవారం) తీరాంధ్ర పై ముఖ్యంగా కృష్ణాజిల్లా పై సముద్రుడు ఉ ప్పెన రూపంలో దండెత్తి అపార నష్టం కలిగించాడు. ఈ విపత్తును కళ్ళారా చూచిన జానపదులు పాడే పాటలు విని కృష్ణాజిల్లా దివిసీమలోని మాచవరం గ్రామస్తుడు ఇనుపకుతిక రాఘవరాజు అనే కవి అక్కడికి సమీపంలోని చల్లపల్లి సంస్థానం జమిందారిణికి ఆశువుగా ఒక సీసమాలికలో చెప్పాడు. ఇది ఆనాటి ప్రళయాన్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంది. దీనిని కీ॥శే॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సేకరించారు. ఇది గాక 1977లో వచ్చిన మరో ఉప్పెన మిగిల్చిన నష్టం గురించి దివిసీమ జానపదులు "ఎందుకే మాపై కోపము-ఓ చుప్పనాతి ఉప్పెన గాలి-ఏమి చేసితిమి నేరము"-అంటూ పాటలుగా కట్టి పాడేవారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో "కొమరవెల్లి మల్లన్నసాగర్" జలాశయం ముంపు గ్రామాల ప్రజలను అక్కడి ప్రభుత్వం వేరే ప్రాంతాలకు తరలించ డానికి సిద్ధమయ్యింది. స్థానిక గ్రామాల ప్రజలు పుట్టిన ఊళ్ళను వదలలేక కన్నీటి మధ్య కైగట్టి పాటలు పాడుతుంటే విన్న ప్రతి ఒక్కరి గుండె బరువెక్కిపోతుంది.

ముగింపు :

పరిశోధకులు చదువదగిన "తమిళ జానపదకళలు" అనే రచనలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారి కృషి మెచ్చుకోదగినది. వేల గొంతుల సవ్వడి అది. వారితో అంతా కలసి 12గంటల ప్రత్యక్ష పరిచయం ఉన్న నేను ఈ నాలుగు మాటలూ వ్రాయగలిగాను. వినయ సంపన్నత, నిరాడంబరత్వం, ధనాపేక్షలేని దార్శనికత. అపార శిష్యవాత్సల్యం మూర్తీభవించిన వ్యక్తి ఆయన. మాడభూషి వారి స్వరం మెత్తనిది-సంకల్పం మాత్రము గట్టిది. తెలుగులో జానపద వాఙ్మయోద్ధారకులు శ్రీ నేదు నూరి గంగాధరంగారు, శ్రీ బిరుదురాజు రామరాజు గార్లు చూపిన త్రోవలో ఎందరో పరిశోధకులు అపార జానపద వాఙ్మయాన్ని సేకరించి పదిలపరిచారు. తెలుగునాట ప్రస్తుతం మౌఖిక సాహిత్యం తెలంగాణంలో సజీవ స్రవంతిగా పాఱుతున్నది. మిగిలిన శేషాంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడా మడుగులు గట్టి ఉన్నది. తమిళ ప్రజలకు వారి భాష, సంస్కృతులపట్ల ఉన్న వీరాభిమానము వలన అక్కడ కళలకు, కళాకారుల ఆదరణకు కొరత లేదు.

ఆధార గ్రంథ సూచి :

1. తమిళ జానపద కళలు - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారు - 2014- టుడే పబ్లిషర్స్ ప్రచురణ, చెన్నై
2. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము - 3వ సంపుటి - తెలుగు సంస్కృతి మొదటి భాగము (మల్లంపల్లి వారి సంపాదకత్వము)
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - శ్రీ సురవరం ప్రతాపరెడ్డి
4. కాకతీయ సంచిక - డా॥ మారేమండ రామారావు, పురావస్తు ప్రదర్శన శాఖ ఆంధ్రప్రదేశ్ 1991
5. శ్రీ నేలటూరి వెంకట రమణయ్య, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగార్ల వ్యాసములు
6. నా స్వీయ పరిశీలనలు

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవ సమాజ వికారాలను పోకార్చే విబోధి - వికారి

- పి. యామిని అమ్మాజీ, డి.ఎన్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఒంగోలు.

తరతరాల వికారాలను
నరనరాల జీర్ణించుకొన్న విషాలను
విశ్లేషించి, వివరించి, వివర్ణం చేస్తూ,
వికారాన్ని విసర్జించమని,
వివేకాన్ని ఆర్జించమని
"వికారి" ద్వారా బోధించిన బోధిసత్త్వులు
సత్కవి పరులు - సంపత్కుమారులు,
సందేశం, భాపశబలత, భావచిత్రణ,
మార్మికత, ప్రతీకవాదం, వ్యంగ్య చిత్రణ,
ఈ సత్కవి భావాన్ని అందుకోవడమంటే
ఆ సమున్నత నయగరాలో నాట్యమాడినట్లే !

ఉపోద్ఘాతము :

సహితస్య జ్ఞానం సాహిత్యం, సాహిత్యం హితాన్ని బోధిస్తూ, జ్ఞానాన్ని అందించాలి, అందు కొరకే సాహిత్యం, సమాజానికి దర్పణమై లోటుపాట్లను ఎత్తి చూపుతూ, సరిదిద్దుతూ, సందేశమివ్వాలి. అది కవి బాధ్యత. ఆ బాధ్యతను ఈ వికారి సృష్టికర్త "న భూతో న భవిష్యతి" అన్నట్లు పూర్తి చేశారు. వారి వికారి సమాజ చిత్రణలో, సందేశంలో మార్మికతతో, ప్రతీకవాదంతో, వ్యంగ్య చిత్రణతో తటిల్లతలాంటి మెరుపులతో, స్వార్థ పూరిత అన్యాయంపై ఉరుములతో విశ్వ విహారం చేసినది.

సందేశం :

"వికారి" మొత్తము వికారాలను త్యజించమను సందేశమే! కానీ సూటిగా సందేశాన్ని చెప్పి కవితలో మొదటిది

"భిక్షగాడు"
"నాకు దేవుని మీదకంటే
మనిషి మీదే నమ్మకం" అనే

ఒక్క వాక్యంతో మహా సముద్రమంత మానవతా వాదాన్ని పుడిసిన పట్టారు.

"చెరువు" అను కవిత ద్వారా కోరలు చాస్తున్న రియల్ ఎస్టేట్ స్వార్థం దాని ప్రతిఫలం మద్రాస్‌లోనే కాదు, ప్రతీ నగరంలోనూ ఉన్నదే ! తప్పుకుంటే ప్రతీ నగరంలోనూ చెరువు కథలు, ప్రజలు అనుభవిస్తున్న వ్యధలు మనస్సు చెరువవుతుంది మరి.

హత్య - ఆత్మహత్య :

కవితలో విశ్లేషణతో కూడి సందేశమున్నది. ఎదుటి వాడి మీద కోపంతో ఆత్మహత్యలు చేసుకోవద్దని సందేశ మిచ్చారు.

స్త్రీలను ఉద్బోదించే సందేశం :

'నోరు తెరవండి" అంటూ "నువ్వు నోరు తెరవనంత మాత్రాన" లోకం నోరు మాసుకోదు. అంటూ మౌనంగా భరిస్తే లోకం ఇంకా బాధపెడుతుందనీ, తిరగబడమని, తద్వారా వచ్చే పరిణామాలకు జంకవద్దని, సూటిగా, వాడిగా, వేడిగా సందేశమిచ్చారు. ఇది అక్షర సత్యం. ఎందరో మహిళలకు అనుభవైకవేద్యం.

శత్రువు :

ఆత్మశుద్ధి లేని వాళ్ళకు అంతరాత్మ పెద్ద శత్రువు" ఇది గొప్ప సూక్తి దీనికి ఉదాహరణలు వెదికితే, నేడు గొప్ప వాళ్ళమని బోర విరుచుకొనే వారందరూ, వెన్ను తడుముకోవలసినదే !

మరణ శాసనం :

చనిపోయిన వారిపై దుమ్ము కొట్టవద్దని సందేశం, గొప్ప మానవత్వాన్ని సందేశిస్తుంది.

"మరణం లేని
సమాజం కన్న
మానవత్వం లేని
సమాజం గొప్పదికాదు"

అల్పంలో అనల్పార్థ సందేశమిది.

ప్రకృతి :

ప్రకృతి కవిత ద్వారా, ప్రకృతిని, మనిషి ఎలా నష్ట పరుస్తున్నాడో, తద్వారా తానెంత నష్టపోతున్నాడో చెప్పారు. ప్రస్తుత కరోనా దీనికి మంచి ఉదాహరణ కూడా.

"మనిషి అనే ఒకే ఒక బొట్టు కాలుష్యం" ప్రకృతిని ప్రశ్నార్థకం చేసిందట ! 100% శాతం నిజమే కదా !

భయం :

అను కవిత ద్వారా భయపడొద్దని ధైర్యం పలికారు.

రైతు ఆత్మహత్య :

ద్వారా నాడు, నేడు అన్నదాత రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని మనస్సు ద్రవించేలా చిత్రించారు.

గుణపాఠం ద్వారా ఒక తుఫాను, ఒక వరద, ఒక సునామీ (ఒక కరోనా) ప్రకృతి గుణపాఠమని చెప్పారు.

చింతన :

"సిద్ధాంతం లేని వానికి
జీవితానికి సంబంధించిన
చింతన ఉండదు
చింతన లేని వాడికి
జీవిత మంతా చింతలు తప్ప
మరేమి మిగలదు"

లక్ష్యం లేకుండ పెరిగే, తిరిగే నేటి తరానికి ఇది చెంపపెట్టు లాంటి హెచ్చరికతో కూడిన సందేశం.

అభయం :

ద్వారా భయంతో పనిచేసి విజయం పొందమని, పనిమాని నష్టపోవద్దనీ సందేశమిచ్చాడు.

కుక్కలున్నాయి జాగ్రత్త :

ద్వారా కాప ప్రకోపి అయిన దుర్మార్గుల చేతిలో బలి అయిన ఆడపిల్లల తల్లుల మనసు క్షోభను గుర్తుచేస్తూ "జాగ్రత్తగా వెళ్ళిరమ్మని, పోకిరీలు, రౌడీలు, శత్రువులే కాదు, మిత్రులు, తండ్రులు, అన్నదమ్ములు, ఆఫీసర్లు, అధికార్లు, బంట్రోతులు, భూస్వాములు, శునకావేషంలో తిరుగుతుంటారు" అని నిర్భయంగా మగవాని మృగకాంక్షను బట్టబయలు చేస్తూ, సగటు ఆడబిడ్డకు జాగ్రత చెప్పారు.

భావ చిత్రణ - భావశబలత :

ఆచార్య బూదాటి గారన్నట్లు వికారి అనన్యమైన భావ చిత్రణలో ఆనంద విహారం చేయిస్తుంది.

దాహం :

కవితలో హిమాలయాలను నీటికొండ, సముద్రాన్ని నీటి కుండగా అభివర్ణిస్తూ ఆ రెంటి మధ్యనే జీవితం.

"మంచు చుక్కలాంటి కవిత్వాన్ని జుర్రుకొని
జీవితం గడ్డకట్టి పోతుంది"

అనడం అద్భుత భావచిత్రణ.

మార్మికత - ప్రతీకవాదం :

శబ్దం :

"శబ్దంపై నిశ్శబ్దంగా జరిగేదాడిని శబ్దం సహించదు" దీనిని విశ్లేషించాలంటే వేయి ఉదాహరణలూ సరిపోవు అంతటి మార్మికత దాగుంది. నేటి ఎల్లో జనర్నలిజంని, మీడియాని గుప్పిట పట్టి చూచిన ప్రభుత్వాన్ని....ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు.

చెక్కు చెదరని చిరునవ్వు ద్వారా ఎయిర్ హోస్టేస్ జీవితాన్ని శిల్పంలా నిలిపారు.

రెండంచుల కత్తి తో రాజకీయ రంగాన్ని చెక్కి వేశారు. ఇప్పటి రాజకీయ గోడ దూకుళ్ళకు ఇది అద్దం పడు తుంది. ఇందు ప్రతీకవాదం మార్మికతతో కూడిన సందేశం ఉంది.

నభూతో నభవిష్యతి అనదగ్గ మార్మికత 3+3=33:

ఈ కవితలో కూడా వికారి నామ సంవత్సరం 33వది. 3 కాలాలు, త్రిసంధ్యలు అని బూదాటి గారు విశ్లేషిం చారు. మానవ వికారాలన్ని ఇందులో పోగుచేసి మరీ చూపారు.

సామాజిక రథానికి / గుర్రాలే కాదు,
చక్రాలు కూడా సమంగా లేనప్పుడు
ఏదైనా సాధ్యమే.

పాలకులే కాదు, ప్రజలు కూడా అసమానతతో ఉన్నప్పుడు సమాజం ధర్మాన ఎలా నడుస్తుంది. అద్భుతమైన ప్రతీకవాదం ప్రదర్శించబడింది.

వ్యంగ్యం :

నవ్వకుంటే మనం దుఃఖంలో ఉన్నామని అవతలి వాడు సంతోషిస్తాడు. అని కొందరు బలవంతంగా నవ్వు తారట ఈ నాటి హిప్పోక్రసీకి అద్దం పడుతుంది ఈ కవిత.

ఆత్మానందం :

సేవ కవిత ద్వారా సేవ జేసే వారిక తీరిక ఉండదనడం నేటి పరిస్థితిని గుర్తుచేస్తుంది. కవి ద్రష్ట, ద్రష్ట, కదా ! అందుకే రాబోయే కాలానికి తగిన కవిత వెలిబుచ్చారు.

విసర్జన :

పాకీ అమ్మను గురించి చెప్పడం ఇప్పటి స్కావెంజర్స్‌నీ గురించి, కరోనా కాలంలో సానిటైజేషన్‌లో వారి పాత్రను గురించి చెప్పినట్లుగా ఉంది.

అభినందన :

మొన్న కార్గిల్ అయితేనేం, నిన్నటి చైనా బోర్డర్ అయితేనేం, సైనికుని స్థైర్య ధైర్యాలను త్యాగ నిరతికి అభినందన అమోఘం.

సూక్ష్మంలో మోక్షం :

అల్పాక్షరాలలో అనల్పార్థమును పొందడం తిక్కన నేర్పిన కళ. అది చక్కగా పాటించారు కులం అను కవితలో.

"కులం కన్నా / మలం నయం
విసర్జించగల్గుతాం గనుక"

నిజమే మలం కంటే నిరుపయోగమైన, హీనమైన కులాన్ని విసర్జించలేకపోవడం సమాజ దౌర్భాగ్యం.

ముగింపు :

ఈ విధంగా వివిధ భావాలతో వికారాలపై, విమర్శ నాస్త్రాలతో, సహస్ర పద్మవ్యూహమై వికారి విద్వత్ కవివరులు సంపత్ కుమార్ గారి సమున్నత సేముషి దీప్తిని సాకారం చేసింది.

స్వంత రాష్ట్రంలో తెలుగును చేజేతులా చంపేసు కుంటున్నామా, చేవలేక, చేతకాక పొరుగు రాష్ట్రంలో తెలుగుతల్లిని అందలమెక్కించారు మీరు అనితర సాధ్యం మీ సాహితీ సేద్యం ! మిమ్మల్ని ముద్దుబిడ్డగా పొందిన తెలుగుతల్లి మురు స్తోంది. తమిళ దేశాన తెలుగు వెన్నెల దశదిశలా కురుస్తోంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తమిళ, తెలుగు జానపద కళలు - తులనాత్మక అధ్యయనం

- డాక్టర్ డి. విజయకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఉపోద్ఘాతం :

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు 2014 సంవత్సరంలో "తమిళ జానపద కళలు" అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఆ గ్రంథంలోని తమిళ జానపద కళలను ఆధారంగా చేసుకుని ఈ వ్యాస రచన జరిగింది. తమిళ దేశంలో ప్రదర్శింపబడే కొన్ని జానపద కళలను, తెలుగు జానపద కళలను ఈ వ్యాసంలో తులనాత్మకంగా చర్చించ బడింది. వివిధ ప్రాంతాలలోని జానపద కళలను తుల నాత్మకంగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. జానపద విజ్ఞానాన్ని ఆంగ్లంలో 'Folklore' అంటారు. W. J.Thoms 1846లో 'Folklor' అన్న పదాన్ని వాడాడు. రిచర్డ్ ఎమ్. డార్సన్ (Richard M. Dorson) జానపద విజ్ఞానాన్ని నాలుగు రకాలుగా విభజించాడు.

1. మౌఖిక జానపద విజ్ఞానం (Oral folklore)
2. సాంఘిక జానపద ఆచారాలు (Social folk customs)
3. వస్తు సంస్కృతి (Material culture)
4. జానపద కళలు (Folk arts) (సుందరం, ఆర్.వి.ఎస్. 2004. పుట: 5)

సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళ లన్నీ ఈ విభాగంలో చేరతాయి. అనగా గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలుబొమ్మలాటలు, యక్షగానం, వీధిబాగోతం, కోలాటం, పగటివేషాలు, బహురూపులు, గారడి విద్యలు మొదలైనవి ఈ విభాగం కిందికి వస్తాయి.

ఈ జానపద కళలు మూడు రకాలుగా విభజింప బడ్డాయి. 1.సంగీతం. 2.నృత్యం. 3.రూపకం.

సంగీతం మరల రెండు రకాలుగా వాద్య సంగీతం, గాత్ర సంగీతం. రెండవదైన నృత్యం పాటతోకూడిన నృత్యం, పాట లేకుండా చేసే నృత్యం. చివరిదైన రూపకం కూడ రెండు రకాలుగా చెప్పబడింది. 1. ధార్మికం. 2. లౌకికం.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు గ్రంథీక రించిన తమిళ జానపద కళలు పై విభాగం కిందికి వస్తాయి.

పాయ్యక్కాల కుదిరైయాట్టం (కొయ్యగుఱ్ఱం ఆట):

ఒకటింపావు అడుగులు ఉన్న కట్టెలను కాళ్ళకు కట్టుకుని, పత్రికలు, గోతం గాడాగుడ్డ, చింతపండు, జిగురు, వెదురు, ఇనుప రేకులు మొదలైన వాటితో తయారు చేసిన గుఱ్ఱపు గూడును దారంతో కట్టుకుని ఆడే వరకూ వేలాడే విధంగా దారాన్ని భుజానికి కట్టుకుని గుఱ్ఱపు గూడును మోస్తూ కోందళం లేదా నయ్యాండి మేళం సంగీతానికి అనుగుణంగా ఆడే ఆటనే కొయ్య గుఱ్ఱం ఆట అంటారు. (సంపత్ కుమార్, మాడభూషి. 2014. పుట: 64).

మధురై ప్రాంతంలో అబద్ధపు గుఱ్ఱపు ఆట (పాయ్ కుదిరై) ప్రచారంలో ఉంది. కాళ్ళకు కట్టెలు కట్టుకోకుండ అబద్ధపు గుఱ్ఱం గూడును కట్టుకుంటారు. కొన్ని ప్రాంతా లలో దీన్ని "పురవి ఆట" అంటారు. క్రీ.శ. 2వ శతాబ్దంలో వెలువడిన "సిలప్పదికారం" అనే కావ్యంలో మాధవి "మరక్కాళ్ ఆడళ్" అనే ఆట ఆడినట్లు వ్యక్తమవుతుంది. "మక్కాళ్" అనగా కొయ్యకాలు. "తొల్కాప్పియం"లో నాయకుడు తాను ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకోడానికి, ఆమె తల్లిదండ్రులు అంగీకరించరు. అందు చేత అతడు తాటిమట్టలతో గుఱ్ఱంవలె చేసుకుని తన శరీరాన్ని కప్పుకుని, తనకు ఆ అమ్మాయితో వివాహం చెయ్యమని అడగడానికి వెళతాడు. దీన్ని 'మడలేరుదల్' అంటారు. ఇదే తొల్కాప్పియంలో 'వీరియర్మడల్ తిరం' అని ఉన్నట్లు చెప్పబడింది.

మొట్టమొదట 1910లో ఈ కొయ్యగుర్రం ఆటను తంజావూరు ప్రక్కన గల తిరువయ్యూరులో నివసించే రామకృష్ణమ నాయుడు అనే వ్యక్తి కనిపెట్టినట్లు తెలుస్తుంది. ఇతడు నాగపట్నంలో ప్రదర్శింపబడే 'బాదుషా' అనే ఆటను చూసి ప్రేరణ పొందాడట. ఆ నాటకంలో నాయకుడు అప్పాసిమణ్ణన్, కళ్యాణ మురుంగై మరంతో గుఱ్ఱం మొహాన్ని తయారుచేసి, గుఱ్ఱం ఎక్కి వస్తున్నట్లు నటించాడట. అది చూసి రామకృష్ణమ నాయుడు కూడ గుఱ్ఱం గూడును తయారు చేస్తాడు. మఱ్ఱి ఊడలతో కాళ్ళకు కట్టెలను, గుఱ్ఱపు నాడాలను అమరుస్తాడు. దీని వల్ల గుఱ్ఱం నడిచినపుడు వచ్చే శబ్దం వస్తుంది. స్త్రీ పురుష కళాకారులు, మరాఠీ రాజు వలె, మరాఠీ రాణి వలె అలంకరించుకుని గుఱ్ఱపు ఆట ఆడతారు. ఈ ఆటలో 'కేందలం' అనే సంగీత వాద్యాన్ని, డోలు, నయ్యాండి మేళం పక్క వాద్యాలుగా ఉప యోగించి ఈ ఆట ఆడతారు. పురుష కళాకారుడు తనకు లొంగ కుండా పరుగెత్తే గుఱ్ఱాన్ని అణచి తన అదుపులోకి తీసుకుని వచ్చినట్టు, గుఱ్ఱం మీద కూర్చుని, గుఱ్ఱపు గూడును కిందికి పైకి కదిలిస్తూ ఆడతారు. కొయ్యగుఱ్ఱపు ఆటలో కొన్ని నాటకాల్లోని ఊమైక్కూత్తు (మూగాట) అనే ఆటలాగా కూడ ఆడతారని తెలుస్తుంది. ఈ ఆటను టి.సి. సుందరమూర్తి అనే వ్యక్తి ప్రారంభించాడట. అతడు తంజావూరు నుంచి బెంగుళూరుకి వచ్చాడట. అతడు రాజు రాణితో బాటు యువరాజు, యువరాణిని కూడ చేర్చి రెండు కంటే ఎక్కువ కొయ్యగుఱ్ఱాలను ఈ ఆటలో చేర్చాడు. ఈ ఆట తమిళనాడులోని గ్రామ ఉత్సవాలు, పండుగల సమయాలలో, పెళ్ళి ఊరేగింపులలో, రాజకీయ ఊరేగింపులలో రాజకీయ మహాసభలలోను ప్రదర్శిస్తారు.

ఆంధ్ర రాష్ట్రంలో గుఱ్ఱపు నృత్యం :

గుంటూరు, నెల్లూరు జిల్లాలలో ఈ కీలుగుఱ్ఱం ప్రచారంలో ఉంది. కాగితాలు, మెంతులు కలిపి గుఱ్ఱం తలను తయారు చేస్తారు. మిగిలిన వాటికి వెదురు కర్రలను ఉపయోగిస్తారు. కాళ్ళకు కొయ్యలు కట్టు కుంటారు. రంగు గుడ్డలను గుఱ్ఱం మీద వేస్తారు. గుఱ్ఱా లని తోలే వ్యక్తులు కిరీటాలు, భుజ కీర్తులు, హారాలు, కడియాలు మొదలైనవి అలంకరించుకుంటారు. ముఖానికి రంగు వేసుకుంటారు. పక్క వాద్యాలు కూడా ఉంటాయి. స్త్రీ పురుషులు ఇరువురు గుఱ్ఱం మధ్య భాగంలో నిలబడి ఉన్న పెద్ద రంధ్రంలో నిలబడి గుఱ్ఱా లను తోలుతున్నట్టుగా అభినయిస్తారు. గుఱ్ఱాల బొమ్మ లను ఉపయోగించి నృత్యం చేసేది ఒక రకం. ప్రత్యక్షంగా గుఱ్ఱాలనే ఉపయోగించి నృత్యం చేసేది ఒక రకం. గుంటూరు జిల్లాలో గుఱ్ఱాలతో నృత్యం చేయడం ప్రచారంలో ఉంది. చిరు గంటలను కాళ్ళకు కట్టి, పెళ్ళి ఊరేగింపులు మొదలైన సందర్భాలలో గుఱ్ఱాల చేత నృత్యం ప్రదర్శన చేయిస్తూ ఉంటారు.

పైన తెలియజేసిన గుఱ్ఱపు నృత్యం కళాకారులు ప్రదర్శించేది, తమిళ ప్రాంతంలోను, తెలుగు ప్రాంతం లోను ఒకే విధంగా ఉందని చెప్పవచ్చు. ఈ గుఱ్ఱం గూడును తయారు చేయడంలో కూడ పోలిక కనిపిస్తుంది. కాని గుంటూరు జిల్లాలో గుఱ్ఱాలతో నృత్యం చేయడం కూడా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా చేయడానికి అయా కళాకారులకు ఎంతో ధైర్యసాహసాలు ఉండాలి. ఎందుచేత నంటే ఆ గుఱ్ఱానికి మొదట నృత్యం నేర్పి, దాన్ని అదుపు చేయగలగాలి. ఈ విధమైన ప్రదర్శన వల్ల ఆ కళలోని వాస్తవికత వెల్లడి అవుతుంది.

భారతీయుడు సినిమాలో ''పచ్చని చిలుకలు తోడుంటే'' అనే పాటలో గుఱ్ఱపు బొమ్మలను ఉప యోగించి నృత్యాన్ని చిత్రీకరించారు.

బూం బూం మాట్టుకారర్ (గంగిరెద్దుల వాళ్ళు) :

తమిళనాడు ఉత్తర జిల్లాలో ఈ గంగిరెద్దులను ఆడించేవాళ్ళు (బూం బూం మట్టుకారర్). వారి మాతృభాష తెలుగు. వీరికి తమిళం కూడా తెలుసు. వీరిని పూవిడయర్ అని కూడ పిలుస్తారు. ప్రజలు వీరిని

పూమాట్టుకారర్, బూం బూం మాట్టుకారర్, పెరుమాళ్ మాట్టుకారర్ అని అంటారు. దక్షిణ జిల్లాలో వీళ్ళను అళగర్ మాట్టుకారర్ అని పిలుస్తారు. వీరు తమ జాతి గురించి అడిగినపుడు అట్టియిడర్, మాట్టిడయర్, పాన్నుడయర్, సాంబుల్ ఇడయర్, వన్నిడియర్ వలెనే పూవిడయర్ అనే జాతికి చెందినవారమని చెబుతారు. ఈ పూవిడయర్ పూర్వీకులు అయోధ్య రాముడికి పూలమాలలు కట్టి ఇచ్చేవారు అని చెబుతారు. కాని 'అభిధాన చింతామణి' అనే గ్రంథంలో పూవిడయర్ అనే పదానికి వేరే అర్థం చెప్పబడింది. పూ + ఇడయర్ = పూవిడయర్ అంటే పూ(భూ) భూమి మధ్యలో ఉన్నవారు అని అర్థం. కురింజి అనగా కొండ ప్రాంతం. మరుద అంటే మైదాన ప్రాంతం. నెయిదల్ అంటే ప్రాంతం. కొండను ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఉన్న వాళ్ళే పూవిడయర్ అని ఉంది. (మాడభూషి, సంపత్ కుమార్. 2014. పుట: 82)

వీరికి సంబంధించిన కథ భాగవత కథ కూడ ఉందని తెలుస్తుంది. కుంఱ్రెడెత్తమాయవన్ చరిదై (కొండను ఎత్తిన చరిత్ర) ''అభిధాన చింతామణి'' గ్రంథంలో వీరి మాతృభాష తెలుగు అని ఉన్నట్టు రచయత తెలియజేశారు. పూవిడియార్‌లకి బూం బూం మాట్టుకారర్ (గంగిరెద్దుల వాళ్ళు), పూఎద్దులవాళ్ళు, పెరుమాళ్ మాట్టుకారర్ (దేవర ఎద్దులవాళ్ళు) అని పేర్లు గలవని తెలుస్తుంది.

పూవిడియర్ల కథ :

ఈ పూవిడియర్లు ప్రతి గ్రామానికి తిరుగుతు భిక్షాటన చేసేవారు. ఒకరోజు రాముడు భిక్షకుడిలా వేషం వేసుకుని ఈ పూవిడియర్లు నివసించే ప్రదేశానికి వచ్చి, నాకు ఆకలిగా ఉంది ధర్మం చేయమని అడుగుతాడు. అపుడు పూవిడియర్లు రాముడికి ధానం చేయడానికి నిరాకరిస్తారు. కానీ వారు రాముడి దగ్గర నుండి తప్పించుకోడానికి పండిన పంటలో సగభాగం కావాలా, కింది భాగం కావాలా అని అడుగుతారు. అందుకు రాముడు పై భాగం కావాలని అంటాడు. కాని వారు వ్యూహం ప్రకారం ఆ ఏడాది వేరుశెనగ పంట వేస్తారు. అనుకున్న ప్రకారం పంట పండినపుడు రాముడు వస్తాడు. అపుడు పూవిడియర్లు రాముడికి వేరుశనగ తీగలను ఇస్తారు. రాముడు వాటినే తీసుకుంటాడు. వారు వచ్చే ఏడాది కింది భాగం కావాలా, పై భాగం కావాలా అని రాముడిని అడుగుతారు. అపుడు రాముడు కింది భాగం కావాలి అంటాడు. కాని వారు ఆ సంవత్సరం వరి పంట వేసి రాముడికి కింది భాగమైన గడ్డి ఇస్తారు. ఈ విధంగా వారు ప్రతి సంవత్సరం రామున్ని మోసగిస్తూ ఉంటారు. అపుడు రాముడు వారికి తన నిజరూపంలో దర్శనమిస్తాడు. ఒక భిక్షకున్ని మోసగించి నందుకు రాముడు వారిపై కోపగించుకుంటాడు. వారికి ఒక సొరకాయ బుర్రను ఇచ్చి, దానిని పాత్రలా చేసుకుని రామా! గోవిందా! అంటూ ఊరూరా తిరిగి భిక్షమెత్తు కుంటూ జీవితాన్ని గడపండి అని శాపమిస్తాడు. అప్పటి నుండి పూవిడియర్లు ఈ విధంగా జీవిస్తున్నారు. మరో కథలో వేంకటేశ్వరస్వామి ఆజ్ఞ మేరకు వీరి పూర్వీకులు దేవుడి ఎద్దుని తీసుకుని సంచార జీవితాన్ని గడుపు తున్నారని తెలుస్తుంది. పూర్వం తిరుపతిలో వేంటేశ్వర స్వామికి రెండు తోకలు, ఐదుకాళ్ళు, నాలుగు కొమ్ములు ఉన్న ఎద్దులు దూడలు కానుకగా వచ్చేవి. వాటిని మేపడానికి ఈ పూవిడియర్లను నియమించారు. వారు అది పాపంగా భావించి, వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తారు. అపుడు వెంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై వీళ్ళ కోరికను మన్నించి 'దేవుడి ఎద్దు' అని తన పేరుతో ఒక ఎద్దుని ఇచ్చి, ఆ ఎద్దును వారి పిల్లలవలె చూసుకోవాలని, ఆ ఎద్దుని ఇచ్చి, ఆ ఎద్దుతో ప్రతిరోజు ఇంటింటికీ వెళ్ళి, భిక్ష మెత్తుకుని వస్తే మీ పాపం తీరుతుందని, అప్పటి నుండి వారు ఆ విధంగా జీవిస్తున్నారని ఒక కథ ఉంది.

తెలుగువారి గంగిరెద్దులాట :

గజాసురుడు అనే రాక్షసుడు శివున్ని గురించి తపస్సు చేసి శివున్ని తన మనస్సులోనే ఉండిపోవాలని కోరు కుంటాడు. గజాసురుడి కోరికపై శివుడు అతని మనస్సులో బందీగా ఉండిపోతాడు. అపుడు పార్వతీదేవి ఆ విష

యాన్ని విష్ణుమూర్తికి చెబుతుంది. ఆ తరువాత విష్ణు మూర్తి, బ్రహ్మ, దేవేంద్రుడు మొదలైన దేవతలందరూ కలసి, ఉపాయాన్ని ఆలోచిస్తారు. నందికి గంగిరెద్దు వేషం వేసి, వీపు మీద చిత్రవిచిత్రమైన రంగు బొంతలు వేస్తారు. వెండి గురజలు తగిలిస్తారు. కొమ్ములకు బంగారపు తొడుగులు తొడుగుతారు. నడుముకి బంగారం పట్టి, మెడలో మువ్వలు గంటలు వేస్తారు. ముక్కుకు ముగుడు తాడు వేస్తారు. ముట్టికి బాసికం కడతారు. బ్రహ్మ, విష్ణు, మొదలైన దేవతలు దాసుల వేషం వేసుకుని, రంగుల వస్త్రాలు, రంగు, రంగుల పూసలపేర్లు వేసుకుంటారు. తలపాగాలు ధరించి, చంక జోలెలు కట్టుకుంటారు. విష్ణుమూర్తి గంటను, బ్రహ్మ వీరణం, ఇంద్రుడు డోలు, నారదుడు సన్నాయి పట్టుకుని, గంగిరెద్దుని తీసుకుని గజాసురుడి వద్దకు వెళతారు. గజాసురుడి కొలువులో అందరూ పరవసించేలా గంగిరెద్దుని ఆడిస్తారు. అపుడు గజాసురుడు ఆనందించి ఏం కావాలో కోరుకోమంటాడు. దేవతలు శివుడు కావాలని కోరుకుంటారు. గజాసురుడు ఇచ్చిన మాట నిలుపుకున్నాడు. దేవతలు తిరిగి వస్తుండగా మిథిలాపట్నం పొలిమేరలో ఒక వ్యక్తి ఏడుస్తూ కనబడతాడు. అపుడు దేవతలు అతని కారణమడుగు తారు. అతనికి ఏ కులవృత్తి లేకపోవడం చేత ఏడుస్తున్నా నని చెబుతాడు. అది విని దేవతలు అతనికి ఆ గంగిరెద్దు నిచ్చి, ఆట నేర్పించి వెళతారు. అప్పటి నుండి గంగిరెద్దు కులవృత్తి అమలులోకి వచ్చిందట.(మున్నీరు. పుట: 333-334)

పైకథలో చెప్పబడిన విధంగానే ఈ గంగిరెద్దులను ఆడించేవారు అలంకరించుకుని ప్రదర్శనలిస్తుంటారు. వీరు సంక్రాంతి నెలలో గంగిరెద్దులను అందంగా అలంక రించి, గ్రామాలలో ప్రదర్శనలిచ్చి, ఆ గ్రామస్తులు ఇచ్చిన ధనం, ధాన్యం, స్వీకరిస్తారు. కొంతమంది ధనవంతులు ఆ గంగిరెద్దుల అలంకరణకు కాలసిన చీరలు, దండలు మొదలైనవి కూడ ఇస్తారు. కొత్తగా వివాహమైన ఇంటివారు ఆ వధూవరులకు అలంకరించిన దండలను దాచిపెట్టి, గంగిరెద్దుకి అలంకరిస్తారు. ఈ విధంగా చేయడం వల్ల, వారికి మంచి జరుగుతుందని వారు భావిస్తారు. గ్రామం లోకి గంగిరెద్దులు రావడం శుభ సూచకంగా ఆయా గ్రామస్తులు భావిస్తారు. ఇటువంటి నమ్మకాలు తెలుగు ప్రజలలో చాలా ఎక్కువగా ఉంటాయి.

తమిళ జానపద కళారూపమైన బూం బూం మాట్టు కారర్ (గంగిరెద్దుల వాళ్ళు)కు సంబంధించిన నిర్వచనాలు, వార జీవన విధానం గురించి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ విపులంగా వివరించారు. తమిళ, తెలుగు గంగిరెద్దు ప్రదర్శనలలో రెండంటిలోను దేవతా సంబంధ మైన కథలే ప్రచారంలో ఉన్నాయి. తమిళంలో రాముడు, వెంకటేశ్వరస్వామి గురించి కథలు చెప్పబడ్డాయి. వీరు వైష్ణవ మతస్తులు అయుండవచ్చు. అందువల్లే వారు రాముడు, వేంకటేశ్వరస్వామి పై వారికి గల భక్తిని చాటుకునే ప్రయత్నం చేశారు. పూవిడయర్లకు స్వయంగా వేంకటేశ్వరస్వామే వారికి దేవర ఎద్దుని ఇచ్చినట్టు కూడ ఈ కథలో తెలియజేశారు. అంతేగాక పూవిడయర్లు భిక్షకుడి వేషంలో వచ్చిన రాముడిని మోసగిస్తారు. వారు ఆ విధంగా చేయడం వల్ల గంగిరెద్దలను ఆడించు కుంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారని వెల్లడి అవుతుంది. తోటివారిని, ముఖ్యంగా భిక్షకులను మోసం చేయకూడ దనే నీతి ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. ఇటువంటి కథల వల్ల కొంతమందైనా ధర్మబద్ధంగా వ్యవహరించడానికి అవకాశమేర్పడుతుంది.

తెలుగు గంగరెద్దులాటలో శివుడికి సంబంధించిన కథ చెప్పబడింది. అంతేగాక గజాసురుడు, ఈశ్వరుడిని తనలో బంధించినపుడు, శివుణ్ణి తిరిగి తీసుకురావడానికి స్వయంగా బ్రహ్మ, విష్ణు, దేవేంద్రులు 'నంది'ని గంగిరెద్దు వలె అలంకరించి, వారు కూడా గంగిరెద్దును ఆడించే వారి వలె వేషం వేసుకుని వెళతారు. ఇక్కడ ఈ కళా కారులు శైవ మతస్తులై ఉండవచ్చు. అందువల్లే వీరు గజాసురుడు శివుడిని బంధించిన కథను ఆధారంగా తీసుకుని, వారి జీవితానికి అన్వయించుకుని, ఆ కథను ప్రచారం చేస్తున్నారు.

ఈ విధంగా తమిళ, తెలుగు దేశాలలోని గంగిరెద్దు లాటలకు సంబంధించి విభిన్నమైన కథలు ప్రచారంలో ఉన్నాయి.

మయిల్ నడనం (నెమలి ఆట) :

తమిళనాడులోని తంజావూరు ప్రాంతంలో ప్రాచీన జానపద కళాకారులుంటారు. వీరు తిరుచ్చికి చెందిన సుందరరావు అనే వ్యక్తి తమిళనాడులో మొట్టమొదటగా నెమలి ఆటను ఆడినట్లు చెబుతున్నారు. అతడు 1949లో బీడీ ప్రకటన కొరకు తిరుచ్చి నుండి తంజావూరికి వచ్చి ఈ ఆట ఆడుతుంటాడు. సుందరరావు దగ్గర నుంచి చిన్నయ్య అనే వ్యక్తి ఈ ఆటను ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తుంది. జానపద కళాకారులు అబద్ధపు గుఱ్ఱం గూడులాగే, నెమలి గూడును తయారుచేసి, దాని పై భాగంలో నెమలి శరీరంలా అనిపించే పచ్చ నీలం రంగులను అద్దుతారు. ఈ నెమలి గూడును భుజానికి తగిలించుకుని ఆడతారు. నెమలి ఈకలతో తయారు చేసిన కుండను పెట్టుకుని, కాళ్ళకు గజ్జెలు కట్టుకుని, తలగూడులో రెండు ఇనుప రేకులను ముక్కువలె అమర్చి, తెరవడానికి మూయడానికి అనుకూలంగా అమర్చి ఆడుతారు. నెమలి వేషం వేసుకున్న జానపద కళాకారుడు నెమలి ముక్కుతో పొడిచి తీసుకోవడం, నెమలి నోటిలో ఒక ట్యూబ్ పెట్టుకుని అదిముక్కుతో నీళ్ళను పీలుస్తున్నట్టు నటిస్తాడు. ప్రస్తుతం ఈ ఆట తంజావూరు, మధురై, సేలం, చెన్నై, పాండిచ్చేరి లాంటి ప్రదేశాల్లో ప్రదర్శింబడుతుంది.

తెలుగు ప్రాంతాలలో నెమలి నృత్యం :

ప్రాచీన కాలంలో ఖోందులు నెమలి నృత్యం చేసే వారు. విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలలోని దుర్గమ్మ కొండ ప్రాంతం అడవులలో సామంతులు ఉంటారు. వీరు మయూర నృత్యం చేస్తారు. ఈ సామంతులను గోండులు అని కూడ అంటారు. వీరు వివాహ సందర్భాలలోను, ఏప్రిల్ నెలలో వచ్చే చైత్ర పర్వదిన సందర్భంలోను ఈ మమూరి నృత్యం చేస్తారు. వీరు నృత్యం చేసేటప్పుడు తెల్ల ధోవతి కట్టుకుని కాళ్లకు గజ్జెలు కట్టుకుంటారు. ఈ గజ్జెలను 'ముయ్యంగ' అంటారు. వీరు తలకు 'తోయంగ' అనే తలపాగాను పెట్టుకుంటారు. తుంగ గడ్డితో పాగా చేసి దానికి రంగుల గుడ్డ పీలికలను కుచ్చులుగా కడతారు. వీరు ముందుకు వంగుతూ లేస్తూ నృత్యం చేస్తారు. నడుము వంచి నృత్యం చేసేటప్పుడు పించం విప్పిన నెమలి వలె కనిపించడానికి, నెమలి ఫించాల గుత్తిని నడుముకి కట్టుకుంటారు. వీరు భూములకు సూర్య భగవానుడికి మ్రొక్కి నృత్యం ప్రారంభిస్తారు. నోటితో నెమలి అరుపును పోలిన శబ్దాన్ని కూడ చేస్తారు.

తమిళ ప్రాంతంలో ప్రదర్శింపబడుతున్న మయిల్ నడనం (నెమలి ఆట) తమిళనాడు తంజావూరు ప్రాంతంలో తిరుచ్చికి చెందిన సుందరరావు అనే వ్యక్తి నెమలి ఆటను ప్రదర్శిస్తాడు. కాని తెలుగు ప్రాంతంలో నెమలి నృత్యాన్ని గిరిజనులు ప్రదర్శించినట్లు చెప్పబడింది. విశాఖపట్టణం, శ్రీకాకుళం ప్రాంతంలో సామంతులు నెమలి నృత్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. వీరిని గోండులు అని కూడా అంటారు. వీరు వివాహ సందర్భాలలోను, ఏప్రిల్ నెలలో జరిగే చైత్ర పర్వదిన సందర్భాలలో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఇక్కడ మొదటి నుండి నేటి వరకు గిరిజనులే ఈ నృత్యం చేస్తున్నట్లు వెల్లడి అవుతుంది. ఈ నృత్యం వీరి సంప్రదాయంలో భాగంగా చెప్పవచ్చు. కాని తమిళనాడులో ప్రదర్శింపబడే మయిల్ నడనం ఒక వ్యక్తి ఉద్ధేశ పూర్వకంగా ప్రదర్శనలిస్తున్నట్లు తెలుస్తుంది.

మన్మదన్ నాట్యనాడకం :

మన్మదన్ నాట్యనాడకం నాగపట్నం జిల్లాలోని, పడక్కు పొయగై నల్లూరులో ప్రచారంలో ఉంది. ఇది మన్మథ నాచకం అని పిలువబడే ఒక కళ. ప్రతి సంవత్సరం కాముడి పండుగరోజు కాముణ్ణి కాలుస్తారు. అపుడు కాముడు కాలిన దృశ్యం, కాలని దృశ్యం అని రెండుగా విభజించి పాటను నాట్యనాటకంగా ప్రదర్శిస్తారు. మాసి (ఫిబ్రవరి) నెల మూడో వారంలో గుడి పక్కన మన్మథుడి మట్టిబొమ్మను లేదా ఫోటోను పెట్టి రెండు వారాలు

అనగా పౌర్ణమి వరకు ప్రదర్శనలను ఇస్తారు. దక్షుడి యజ్ఞం ధ్వంసం చేసిన తరువాత శివుడు కఠోర తపస్సు చేస్తాడు. ఆ తపస్సు భంగం చేయడానికి మన్మథుడు శివుడి మీద బాణం వేస్తాడు. అపుడు శివుడు తన మూడో కన్ను తెరవగా మన్మథుడు కాలిపోతాడు. ఆ తరువాత రతీదేవి శివుణ్ణి ప్రార్థిస్తుంది. అపుడు శివుడు ఆమె ప్రార్థనను మన్నించి మన్మథుణ్ణి బ్రతికిస్తాడు. ఈ ప్రదర్శనను కడలూరు జిల్లాలో వీధినాటకంగా (కామన్ తీ... కాముడి అగ్ని)ను, తంజావూరు, తిరుచ్చి జిల్లాలలో లావణి పేరుతో ఈ కామ దహనం చేస్తారు. తంజావూరు జిల్లాలో కాపు కట్టిన (మన్మథుడి బొమ్మను పెట్టడం) తరువాత మన్మథుడి చరిత్రను పాడడం, రతీమన్మథుల వాగ్వివాదం, మన్మథుడు కాలిపోయిన తరువాత రతీదేవి ఏడుపు, లావణి మొదలయినవి. రతీ, మన్మథుల వివాహం, రతీదేవి, శివుని తపస్సు భంగం చేయవద్దని మన్మథుడు హెచ్చరించడం, ఆ మన్మథుడు శివునిపై బాణాలను ప్రయోగించడం ఈ కళలో ప్రదర్శిస్తారు.

తెలుగు వారి కామన్న పండుగ :

తెలుగు ప్రాంతాలలో కామ దహనాన్ని కామన్న పండుగ అంటారు. తెలుగువారు ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి పౌర్ణమి వరకు జరుగుతుంది. అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాంతాలవారు ఈ పండుగను జరుపు కుంటారు. ఈ ప్రాంతపు ప్రజలు ఈ పండుగను 'కామన్న పున్నమ' అంటారు. కొన్ని ప్రాంతాలలో కాముని పండుగ, హొళీ పండుగ, వసంతోత్సవమని అంటారు. ఫాల్గుణ పౌర్ణమి రోజున రాత్రి నాలుగు రోడ్లు కలిసిన చోట కాముని బొమ్మను ఉంచి, దాని మీద పిడుకలు, కట్టెలు మొదలైనవి వేసి కాలుస్తారు. అది కాలుతున్నపుడు కొంతమంది ప్రజలు అక్కడ చేరి హాహాకారాలు చేస్తూ, నోరు కొట్టుకుంటారు. వారు కాముని దహనం అయిన తరువాత ఆ బూడిదను ఇళ్ళ మీద, పొలాల్లోను చల్లు కుంటారు. ఈ విధంగా చేయడం వల్ల క్రిమి కీటకాలు నశించి పంటలు బాగా పండుతాయని ప్రజలు నమ్ము తారు.

ఈ పండుగ సందర్భంగా వసంతాలను కూడ చల్లు కుంటారు. వధూవరులకు కంకణాలు విప్పే సమయంలో కూడ వసంతం ఆడుతుంటారు. దేవాలయాలలో ముఖ్యంగా సీతారాముల కల్యాణం సమయంలో ఈ వసంతం ఆడతారు. తమిళనాడు ప్రాంతంలో కాముని పండుగ రెండు వారాల ముందు నుండి 'మన్మథన్ నాట్య నాటకం' పేరుతో ఒక కళారూపంగా ప్రదర్శింపబడు తుంది. ఇక్కడ ఆ కథను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు ప్రాంతంలో ఈ కాముని పున్నమిని ఒక పండుగ వలె జరుపుకంటున్నారు. ఈ విధంగా ఈ కాముని పున్నమి పండుగ జరుపుకునే విధానంలోను, ప్రజల ఆచార సంప్రదాయాలలోను కొంత భేదం కనిపిస్తుంది.

ముగింపు :

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి 'జానపద కళలు' అనే గ్రంథంలో గల జానపద కళలను ఆధారంగా చేసుకుని, కొన్ని తమిళ, తెలుగు జానపద కళలు ఈ వ్యాసంలో విశ్లేషించబడ్డాయి. గుళ్ళపు నృత్యం, గంగి రెద్దులాట, నెమలి నత్యం, కాముని పండుగ మొదలైన కళలను పరిశీలించన తరువాత రెండు ప్రాంతాలలోను కళాప్రదర్శనలోను, ప్రజల ఆచార సంప్రదాయాలలోను కొంత సామ్యం, కొంత భేదం కనిపిస్తుంది. గంగిరెద్దులాట ప్రదర్శకులు దేవతా సంబంధమైన కథలను వారి జీవన విధానానికి అన్వయించుకుని చెప్పుకుంటున్నారు. ఆ కథలను పరిశీలించినట్లైతే వారి మతసంబంధ విషయాలు కూడ వెల్లడి అవుతున్నాయి. ఇంకా అనేక జానపద కళ లున్నాయి. వాటన్నింటిని నిశితంగా పరిశీలిస్తే, మంచి పరిశోధనలు వెలువడడానికి అవకాశముంది. వివిధ ప్రాంతాలలోగల జానపద కళలకు, తెలుగు ప్రాంతంలో

గల జానపద కళలకు గల సామ్య భేదాలను పరిశోధనల ద్వారా వెలువరించవచ్చు. భాషా సంబంధమైన విషయాలు కూడా వెల్లడి అవడానికి అవకాశముంది. ఈ విధమైన పరిశోధనలు చేయడం వల్ల సాహిత్యానికి ఎంతో మేలుగలుగుతుందని చెప్పవచ్చు. కాబట్టి ఇటువంటి పరిశోధనలు జరగవలసిన ఆవశ్యకత ఉంది.

ఉపయుక్త గ్రంథములు :

1. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి సాహిత్యం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. గంగాధరం, నేదునూరి. 1976. మున్నీరు. ప్రాచీన గ్రంథావళి, రాజమహేంద్రవరం.
3. సంపత్ కూమార్, మాడభూషి. 2014. తమిళ జానపద కళలు. టుడే పబ్లిషర్స్, చెన్నై.
4. సుందరం, ఆర్వీయస్. 2004. ఆంధ్రుల జానపద విజ్ఞానం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
5. మోహన్, జి.యస్. 2001. జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, బెంగుళూరు.

❖ ❖ ❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అబద్ధాన్ని అందంగా చెక్కిన మాడభూషి కవిత్వం

– శ్రీపతి మారుతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

ప్రతి వ్యక్తి తమ జీవన ప్రయాణంలో తెలిసో తెలియకో, చిన్న వాటికో పెద్ద వాటికో ఎదో ఒక సమయంలో అబద్ధం మీద ఆధారపడటం అనివార్యంగానే జరుగుతుటుంది. అబద్ధం మానవ జీవితంలో ఒక విడదీయలేని విషయంగా పెనవేసుకు పోయిందంటే అతిశయోక్తి కాదేమో! మనిషి జీవితమే ఒక పెద్ద అబద్ధం అనుకుంటే అందులో మనుషులు చెప్పే అబద్ధాల గురించి వాటిని చెప్పడం వెనక నేపథ్యాన్ని అందంగా కవిత్వ రూపంలో చెప్పడం ఒక మాడభూషి గారికే చెల్లింది.

అబద్ధం అంటే ఎవరో ఒకరు మనల్ని మాటలతో లేదా చర్యలతో మోసం చేయడం. కానీ వాస్తవానికి సాధారణ సంభాషణ మాత్రమే వాస్తవాల మధ్య నడుస్తుంది. అందుకే అంటారు 'అబద్ధం ఆడితే అతికినట్లునుండాలి' అని. మంచి విషయాల కోసం కూడా కొన్నిసార్లు అబద్ధం ఆడాల్సి వస్తుంది. అందులో కూడా చాలా జాగ్రత్తగా మెలగాల్సి ఉంటుంది. అందుకే

"అబద్ధం ఆడినా
అతికనట్టుండాలన్నారు
అతుకు తెలిస్తే
బతుకు బండారం బయటపడిపోతుంది
అబద్ధం అతకనట్టుండాలి
అతుకే లేనట్టుండాలి!" (14) అని

అస్సలు అబద్ధంలో ఉన్న అతుకు తెలిస్తే అది అబద్ధం అన్న విషయం తెలిసిపోతుందని అందుకే అబద్ధం అనేది అతుకే లేనట్టుండాలి అని కవి తనదైన కొత్త కోణంలో వ్యక్తీకరించారు.

సమాజంలో సత్యానికున్న విలువ, గొప్పతనం అబద్ధానికి వుండదని తెలిసి కూడా అవసరాలకొద్దీ అబద్ధం చెప్పేస్తుంటారు. మాటలవరకే చాలా మంది పరిమితం అయిపోతుంటారు. ఎంత అందంగా అబద్ధాలు చెప్పినా ఆచరణాత్మకం కాని మాటలు వాగ్దానాలు అబద్ధాలుగానే మిగిలి పోతాయి. అందుకే అంటాడు సుమతీ శతక కర్త "చేతులకు దొడవు దానము/ భూతలనాధులకుఉ దొడవు బొంకమి ధరలో/ నీతియ తొడ వెవ్వారికి" అంటే చేతులకు దానం, పాలకులు అసత్యం పలక కుండడం అందరికీ న్యాయం అని. మన న్యాయ స్థానాల్లో న్యాయ దేవత కళ్ళకు ఎందుకు గంతలు కట్టి ఉంటాయనే విషయం చాలా మందికి తెలియదు. దీన్నే రచయిత కొంత వ్యంగంగా

"ఒక పక్క లాయరు
మరో పక్క పోలీసు
అబద్ధాలకు రక్షణ కల్పిస్తూ ఉంటే
న్యాయ దేవత వినలేక
కళ్ళు మూసుకొని
అబద్ధాల్లోంచి న్యాయాన్ని తీస్తుంది!"(18)

అని చెబుతూ నిర్దోషులకు న్యాయం జరగాల్సిన చోట ఎంతమందికి సరైన న్యాయం దొరుకుతుంది అనే ప్రశ్నను ఈ కవిత సంపుటి ద్వారా మనందరిని కవి అడుగుతున్నాడు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో ఆలోచనను కొంత ఆహ్లాదాన్ని కలిగించేలా చేయాలి కానీ చాలా తక్కువ మంది రచనల్లో మాత్రమే నిజాన్ని నిర్భయంగా చెప్పే శక్తి ఉంటుంది. అటువంటి రచయితల గురించి కవిత్వరీకరిస్తూ,

"సామాన్యుడు
కూటి కోసం అబద్ధం నేర్పిస్తే
అబద్ధాన్ని కూలికోసం నేర్పించేవాడు మేధావి!
కావ్యాల అల్లికలో జిగిబిగి చూపిస్తాడు

సమాజమంతా అష్టవక్రమయినా
ఏ వక్రమూ లేనివాణ్ణి
కథానాయకుడిగా నిలబెడతాడు!"(47)

అని ప్రపంచంలో ఎన్నో సమస్యలుండగా వాటన్నిటిని పక్కనపెట్టి ఎన్నో అభూత కల్పనల ద్వారా ఎలాంటి సమస్యలు లేని ఒక మాయ జగత్తును సృష్టిస్తారని చెప్పి మొత్తం సాహిత్య ప్రపంచాన్నే ఒక ఆలోచనలో పడేసేలా చేశారు సంపత్ కుమారు గారు.

"నూరు బావుల కంటే ఒక దిగుడు బావి మేలు, నూరు దిగుడు బావులకంటే ఒక యజ్ఞం మేలు, నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు మేలు, నూరుమంది పుత్రులకంటే ఒక సత్య వాక్యం మేలు" అని ఆదికవి నన్నయ్య మహాభారతంలో చెబుతాడు. కానీ అలాంటి ఒక వాక్యం ఎంత మంచి చేస్తుందో ఒకసారి చెప్పిన అబద్ధం కుడా కొన్ని సార్లు జీవితాలనే నాశనం చేస్తుంది. అలాంటి వాక్యాలు కొన్నిసార్లు పిల్లలకు బాల్యదశలో పాఠశాల స్థాయిలోని పుస్తకాలలోనే ప్రారంభమవుతుందని తెలియజేస్తూ,

"పుస్తకాలనిండా
అబద్ధాలే అతికించి ఉంటాయి
రంగుల బొమ్మల్లా-
ప్రతి పుటలోనూ
అబద్ధం అందంగా అమరి ఉంటుంది"(24)

అని ఎన్నో సార్లు పుస్తకాలల్లో వుండే ప్రపంచం బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండే విషయాన్ని ఈ సందర్భంగా కవి మరోసారి గుర్తుచేశారు.

అబద్ధం అనేది ప్రతి మనిషి జీవితంలో ఎప్పటినుండో ఒక భాగం అయిపొయింది. అటువంటి అబద్ధం అనే క్రియ గురించి మాడభూషి సంపత్ కుమార్ గారు 'మొదటి అబద్ధం' అనే తన పుస్తకంలో మనిషి జీవితంలో ఎన్ని కోణాల్లో అబద్ధం ప్రభావం ఉంటుందో అందంగా తెలియజేశారు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. ముద్దు కృష్ణ. వైతాళికులు (సంకలనం) జూలై 1987: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్.
2. సంపత్ కుమార్ మాడభూషి. ఆ లోచనలు. డిసెంబర్ 2015. పాలపిట్ట బుక్స్ హైదరాబాద్.
3. సంపత్ కుమార్ మాడభూషి. మొదటి అబద్ధం(కవిత్వం కాదు తత్వం). మార్చి 2020: పాలపిట్ట బుక్స్ హైదరాబాద్.
4. సంపత్ కుమార్ మాడభూషి. శత్రువుతో ప్రయాణం. మార్చి 2015: పాలపిట్ట బుక్స్ హైదరాబాద్.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"మనోవైజ్ఞానిక కోణంలో సాహితీ సవ్యసాచి - మాడభూషి "జీవితం - కవిత్వం"

- లంకా ఎల్.ఆర్.వెంకటరమణ, ఉపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల,అనంతపురం.

వ్యక్తులలో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ వారి మనసును వికసింపచేయడం సాహిత్యగుణంగా చెప్పుకోవచ్చు. మనిషి మానసిక ఉన్నతికి చేసే ప్రయత్నాలు "వ్యక్తిత్వ వికాసానికి" దారితీస్తాయి. ఈ క్రమంలో మానవ జీవితాన్ని సుసంపన్నం చేయడానికి సాహిత్యం తోడ్పడుతుంది. అపుడు జీవితానికి సాహిత్యం ఒక ఆలంభన మవుతుంది. సాహిత్యంలో కవిత్వం ఒక భాగం. జీవితంలో కవిత్వం గురించి పరిశీలిస్తే అది పాలలోని వెన్నలా కలగలసిపోయి ఉంటుంది.

సుప్రసిద్ధ కవి, వ్యాసకర్త, అనువాదకుడు, పాత్రికేయుడు, భాషా వేత్తగా జగమెరిగిన ఉత్తమ సాహితీవేత్త ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు. వీరు 2013లో తెచ్చిన పుస్తకం "జీవితం-కవిత్వం" ఇందులోని కవితలన్నీ కూడా జీవితం-కవిత్వం అన్నవి పడుగు-పేకల్లా జమిలిగా అల్లుకుపోయి ఒక పట్టువస్త్రంలా కనిపిస్తాయి. ఇందులో "కవిత్వం-జీవిత్వం" అన్నవి ఎన్నో శీర్షికల బాటలో పయనిస్తూ మన హృదయ ద్వారాలను చేరుకుంటాయి. జీవిత పరమార్థాన్ని తెలిపేవి, మార్గ నిర్దేశాన్ని చేసేవి కొన్ని, ప్రకృతిని తలపిస్తూ సాగేవి కొన్ని, భౌతిక శాస్త్రసూత్రాలను ఆధారం చేసుకొని జీవితకవితాతత్వాన్ని ఆవిష్కరించే కవితలు ఇలా సాగుతూ, మన హృదయ రసతంత్రులు మీటుతూ ముందుకు సాగుతాయి.

మనకున్న లక్ష్యాలేవి... మనలో ఉండాల్సిన లక్షణాలేవి... అంటూ అరటిపండు వలచిపెట్టినట్లుగా మనోవైజ్ఞానిక దృష్టి కోణంలో ఈ రచన మొత్తం సాగుతుంది. ఈ పుస్తకానికి ముందు మాటగా "కవితానుశీలనం" పేరుతో ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి గారు రాశారు. వీరు చెబుతూ "మానవ జీవిత యానం అవిచ్ఛన్నంగా కొనసాగుతూనే ఉంటుంది. కాగా అంతర్గత ప్రభావాలు కొన్ని అడ్డంకులను కలుగచేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికి వాటిని అతిక్రమించి జీవిత యానం కొనసాగుతూనే ఉంటుంది.. వ్యక్తికీ వ్యక్తికీ ఆలోచనా ధోరణిలో భిన్నత్వం 'జీవితం-కవిత్వం' అనే ఈ కవితల్లో పై చెప్పిన వాక్యార్థాలన్నీ పూర్తిగా ద్యోతకమవుతాయి" అంటారు.

ప్రొఫెసర్ శిఖామణి గారు "కావ్యజీవితమ్" పేరున ముందుమాట రాశారు. వారు ఎందరో ముందుకవుల 'జీవితం-కవిత్వానికి' చెప్పిన సంబంధాన్ని చెబుతూనే, మాడభూషి గారి కోణాన్ని ఆవిష్కరించారు.

ఆచార్య మాడభూషి గారు ఈ కవితా సంపుటిలోని కవితల ద్వారా ప్రకృతి సంబంధ విశేషాలు ప్రస్తావించారు. జీవిత పరమార్థంను చెప్పారు. మార్గనిర్దేశాన్ని చేశారు. ఇంకా భౌతిక శాస్త్ర సూత్రపరంగా జీవితాన్ని, కవిత్వాన్ని రూపు కట్టించారు.

ప్రకృతి సంబంధ కవితా వర్ణన :

ఆచార్య మాడభూషి గారు అన్నట్టు "మంచుకురుస్తున్నప్పుడు/కవిత్వం గుర్తొస్తుంది/గాలి వీచినప్పుడు/జీవితం మురిపిస్తుంది/కవిత్వం జీవితానికి హాయినిస్తుంది/జీవితం కవిత్వానికి ప్రాణమిస్తుంది". మంచుకురుస్తున్నపుడు మనసుకు హాయి కలిగి ద్రవించిన హృదయాలతో ఆనందాన్ని పొందుతాము. తప్పక అపుడు కవిత్వం గుర్తుకు వస్తుంది. గాలి వీచినపుడు ఆగాలి తెమ్మరకు జీవితం మురిపిస్తుంది. తన సమస్యలు ఆగాలికి కొట్టుకుపోతే

బాగుండునని లోని మనిషి ఆశపడతాడు. సమస్యకు పరిష్కారం లభిస్తుందని, హాయి పొందుతాడు. ఇలా కవిత్వం జీవితానికి హాయిని, జీవితం కవిత్వానికి ప్రాణాన్ని-మనకు ప్రాణశక్తిని ఇస్తాయి.

ఆచార్య వారు మరో కవితలో ఇలా అంటారు -

"జీవితంలో కెరటాల్లా
కవిత్వాలు!
కవిత్వంలో అలల్లా
జీవితాలు! దేనికి ఏది చుక్కాని! చుక్క నీళ్ళులేని
బతుకు సముద్రంలో కవిత్వమే దిక్కు!"

జీవితంలో ఆటుపోటులు సహజమే. ఒకసారి ప్రసాంతంగా ఉండవచ్చు. మరోసారి ఉత్తుంగ కెరటాల్లా మారవచ్చు. కవిత్వంలో అలల్లా సాగిపోతున్న జీవితాలు. జీవితంలో కష్టసుఖాలు సర్వసాధారణాలు మానవవునికి జీవితంలో కవిత్వం ఒక మార్గం అంటూ -''చుక్క నీళ్ళులేని బతుకు సముద్రంలో కవిత్వమే దిక్కు'' అంటారు.

భౌతిక శాస్త్ర సూత్రాధారిత కవితలు :

ఆచార్యవారు ఒక కవితలో ఇలా అంటారు -

"కవిత్వం బరువయింది
జీవితం తేలికయింది"

అంటూ పరస్పర వైవిధ్యాలు చెబుతారు.

"కవిత్వాన్ని జీవితంలోకి /తర్జుమా చేస్తే
జీవితం బరువుగా సాగుతుంది
కవిత్వం తేలికగా ఎగురుతుంది".

దీనినే మారుస్తూ -

"జీవితాన్ని కవిత్వం లోకి మారిస్తే
కవిత్వం వేడెక్కుతుంది
జీవితం చల్లారిపోతుంది"

అంటారు జీవితంలో వైరుధ్యాలు లేవు కేవలం వైవిధ్యాలు మాత్రమే'' అంటారు.

దీనినే కవితగా ఇలా చెబుతారు -

"జీవితానికి/కవిత్వానికి
వైరుధ్యం లేదు
జీవింలోను/కవిత్వంలోను/వైవిధ్యం!"

మనోవైజ్ఞానిక దృష్టి కోణం :

''ఒక గమ్యం వైపుగా నిర్దేశించబడిన భావపరంపరల సమ్మిళిత మానసిక చర్యను చింతన'' అని వాలెంటైన్ అంటారు. వ్యక్తి కొత్త సంబంధాలను కనుగొనాలనే ప్రత్యకమైన ఉద్దేశ్యం వైపు తన ఊహాలను మళ్ళిస్తూ ఆలోచించే ప్రక్రియ, మనిషికి విచక్షణా జ్ఞానాన్ని నేర్పు తుంది. కవితంలో -

"జీవితమార్గం / కవిత్వం
కవితామార్గం / జీవితం
జీవి-కవి / తం-త్వం / జీవికవిత్వం".

మనజీవిత మార్గంలో కవితా సుమాలు పూయిస్తూ జీవకవిత్వాన్ని సృష్టించాలన్నది కవి భావన.

మరో కవితలో -

"జీవితానికి పోరాటం తప్పదు
కవిత్వానికి ఆరాటం తప్పదు
జీవితానికి కవిత్వానికి
వెటకారం నప్పదు"

అంటారు. వ్యక్తి తన ఆలోచనలలలో క్రొత్తదనాన్ని చొప్పించి, గతానుభవాల ప్రతిరూపాలతో మార్పు తెచ్చుకొని భవిష్యత్‌లో ఉపయోగపడే విధంగా చేయ గలిగే అంతర్గత మానసిక చర్యను ప్రోది చేసుకుంటాడు. అపుడు జీవితానికి పోరాటం, తప్పదు. జీవితం పోరాట మయమైతే కవితలో ఆరాటం తప్పదు. ఎదురయ్యే సమస్యల పట్ట సానుకూల దృక్పధంతో వ్యవహరిస్తూ, వెటకారాలు లేకుండా సంచరిస్తే ఉన్నత శిఖరాలు అందుకోగలడు. ఇదే మనో వైజ్ఞానికంగా సృజనాత్మకత, వ్యక్తి యందలి అమూర్తచింతనలకు, ప్రతీకలు ఏర్పడుట ద్వారా క్రొత్త విషయాలు కనుగొంటూ ప్రగతి వైపు సాగిపోవడమే ''సృజనకార్యం''.

ఆచార్య గారే మరో కవితలో ఇలా అంటారు -

"జీవితమొక వెతుకులాట
కవిత్వమొక బతుకుబాట"

అంటారు. మరో కవితలో

"జీవితానికి పరిష్కారం
కవిత్వం"

అంటూ సూత్రీకరిస్తారు. నిరంతరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యక్తి ఎప్పటికప్పుడు సర్దు బాటు కావలసి ఉంటుంది. మనిషి సర్దుబాటు కాని సందర్భంలో అనేక ఆసంతృప్తులకు గురి కావలసి వస్తుంది. ఆల్‌పోర్ట్ ఇలా అంటారు "ఒక వ్యక్తి తన పరిసరాలకు ప్రత్యేకంగా సర్దుబాటు కాగలగటాన్ని నిర్ణయించు అతని లోని మానసిక గతిశీలక వ్యవస్థ అతని మూర్తి మత్వం" అంటాడు.

ఆచార్య గారన్నట్లు -

"జీవితమంతా/ఇజాలు
కవిత్వమంతా/నిజాలు" అంటారు.

మరో కవితలో

"కవిత్వం/కవిత్వాన్ని మెచ్చదు
జీవితం/జీవితానికి నచ్చదు
కవిత్వం/ జీవితాన్ని మెచ్చుతుంది
జీవితం/కవిత్వానికి నచ్చుతుంది" అంటారు.

ముగింపు :

ఆచార్య మాడభూషి గారి కవితల్లో సమకాలీనత, కవితా నిర్మాణపటిమ, సృజన పుష్కలంగా ఉంటాయి. వారి కవితల్లో వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా కూడా మనకు దర్శనమిస్తారు. "జీవితం-కవిత్వం" అన్న 108 కవితలున్న ఈ సంపుటి కవిత్వంలోని - జీవితం లోని ఎన్నో పార్శ్వా లను చూపగలిగింది. వారి కవితల్లో వారు పేర్కొన్నట్లుగానే -

"కవిత్వమొక అరని దీపం
జీవితమొక తీరిన దాహం".

ఆధారగ్రంధాలు :

1) ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, "జీవితం-కవిత్వం" పాలపిట్ట బుక్స్, హైదరాబాదు, ఏప్రిల్, 2013.
2) ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, "వికారి', పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, ఏప్రిల్ 2019.
3) ఆచార్యమాడభూషి సంపత్‌కుమార్, "వ్యాససంపద" టుడే పబ్లిషర్స్, చెన్నై, సెప్టెంబర్, 2013.
4) మనోవైజ్ఞానిక శాస్త్రం, తెలుగు అకాడమి ప్రచురణ.
5) శ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్య, "డా॥ మాడభూషి కవి-తా స్ఫూర్తి". పాలపిట్ట మాసపత్రిక, సెప్టెంబర్ - అక్టోబర్-2016.

❖❖❖

"ధన్యమాడభూషి వంశాబ్ధి చంద్ర!
మాన్యమహోన్నత ప్రతిభావిలసితకీర్తిసాంద్ర!
నాన్యతోదుర్లభ ప్రజ్ఞాధురీణ!
అనన్యసామాన్యదృఢ దీక్షాలక్ష్యసాధనా ప్రవీణ!
విశ్వవిద్యాలయ విలక్షణ శేముషీ ధుర్య!
సతులు అభినుతలు సంపత్‌కుమారాచార్య!

- డాక్టర్ పి.ఐ.సుభ్భారెడ్డి,
సాహితీ విమర్శకులు, విశ్రాంత ఆచార్యులు
సి.ఆర్.కళాశాల, చిలకలూరిపేట, గుంటూరు.

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'వ్యాకరణ విజ్ఞానం' - పరిశీలన

- డాక్టర్ కె. బాలకృష్ణ

పరిచయం :

ఆర్షమతాన్ని అనుసరించి ప్రతివ్యక్తి తన జీవిత కాలంలో సముపార్జించిన విజ్ఞానానికి నాలుగు దశలు. గురువుదగ్గర నేర్చుకున్నది మొదటిదశ. స్వయంకృషితో నేర్చుకున్నది రెండవదశ. సతీర్థ్యుల వల్ల నేర్చుకున్నది మూడవ దశ. అనంతరదశ కాలక్రమంలో నేర్చుకున్నది 1). ఇందులో మొదటిదశ ప్రాథమికమైనది ప్రధానమైనదే కాక మిగిలిన దశలకు ఆధారమైనది కూడా.

అట్లాగే 'విద్వాంసుడు కావాలనుకున్నవాడు మొదట వైయాకరణి కావాలి. అన్ని విద్యలకూ వ్యాకరణమే మూలం' 2) అన్న శాస్త్రకారుని మాటలలో కూడా వ్యాకరణవిజ్ఞానం ప్రాథమికమైనదేకాక ప్రధానమైనదీ ఆధారమైనది కూడా అనే తాత్పర్యాన్ని గమనించవచ్చు. భావవినిమయానికి ప్రధాన సాధనమూ, అమూర్తమూ అయిన భాషలో తగినంత పరిజ్ఞానం విద్యార్థులకు అవశ్యం. భాషాతత్వాన్ని గ్రహించడానికి వ్యాకరణాధ్య యనమే దగ్గరిదారి.

భాషాశాస్త్రవేత్త, బహుభాషాపండితులు, నిరంతర పరిశోధకులు, అనువాదకోవిదులు, కావ్య నిర్మాణ చతురులు, కార్యనిర్వహణాదక్షులు, సంపాదక శిరోమణి, పాత్రికేయ శిఖామణి గా ప్రసిద్ధులైన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు రచించిన 'వ్యాకరణ విజ్ఞానం' అనే గ్రంథవైశిష్ట్యాన్ని ప్రస్తావించవమే ఈ వ్యాన రచనోద్దేశ్యం.

వ్యాకరణ విజ్ఞానం - విశేషాలు :

ఎనబై పుటలు కలిగిన ఈ గ్రంథంలో పరిచయం, వ్యాకరణం-ప్రాచీనత, వ్యాకరణం-వ్యుత్పత్తి నిర్వచనం, వ్యాకరణ ప్రయోజనం, తెలుగు వ్యాకరణాల ప్రయోజనం, బాలవ్యాకరణం-విశిష్టత, బాలవ్యాకరణం-పరిచ్ఛేద పరిచయం, బాలప్రౌఢ వ్యాకరణాలు, వ్యాకరణ సంజ్ఞలు, పారిభాషిక పదాల వివరణ - అనే పది అధ్యాయాలు ఉ న్నాయి.

''సాహిత్య విద్యార్థులు సాహిత్యాధ్యయనంలో ప్రవేశించినప్పుడు వ్యాకరణాన్ని అవగాహన చేసుకోవ డానికి ఈ వ్యాసం ఉపయోగపడుతుంది''(మనవి:పుట 4) అంటూ గ్రంథకర్త ఆశించినట్లు కేవలం విద్యార్థు లకేకాక సాహిత్యాభిమానులకు, జిజ్ఞాసువులైన పాఠకు లకు, ఉపాధ్యాయులకు కూడా ఈ గ్రంథం కరదీపిక వంటిదని నిశ్చయంగా చెప్పవచ్చు.

సాహిత్యాంశంగా మాత్రమే కాక వ్యాకరణాన్ని భాషాంగంగా భావిస్తే అందులో అభినివేశం పెరుగు తుందన్న ఆచార్యులవారి అభిప్రాయం అక్షర సత్యం.

భాషలో కనిపించే మౌఖికం, లేఖనం - అనే రెండు సంప్రదాయాలలో మొదటిదానికి స్థలకాల పరి మితులు ఉంటాయి. వక్త(మాట్లాడేవాడు), శ్రోత(వినేవాడు)ల మధ్య జరిగే మౌఖిక సంభాషణలో అవసరా న్నిబట్టి వక్త శ్రోతగానూ, శ్రోత వక్తగానూ మారవచ్చు. అభిప్రాయ వినిమయాన్ని, పరస్పర అవగాహనను ముఖాముఖిద్వారా మెరుగుపరచుకోవచ్చు. లేఖనభాష దాని ప్రయోజనాన్ని బట్టి చాలాకాలం నిలిచి వుంటుంది.

మౌఖిక, లేఖన భాషా సంప్రదాయాలలోని విశేషాలను గ్రంథకర్త మొదటి అధ్యాయంలో 'పరిచయం' చేశారు.

ప్రపంచంలోనే ప్రాచీనగ్రంథాలుగా ప్రసిద్ధమైన వేద వాఙ్మయంలోని వ్యాకరణ ప్రస్తావనలను 'వ్యాకరణం-ప్రాచీనత' అనే అధ్యాయంలో వివరించారు. మూడవ అధ్యాయంలో వ్యాకరణ శబ్దవ్యుత్పత్తిని, నిర్వచనాన్ని విశదీకరించారు. నాలుగవ అధ్యాయంలో వివరించిన వ్యాకరణ ప్రయోజనాలద్వారా రచయిత సునిశిత

పరిశీలనా నైపుణ్యాలు తెల్లమౌతాయి. ఇందులో ప్రమాణభాషా లక్షణాలను కూడా చర్చించారు.

ఆంధ్రశబ్దచింతామణి మొదలుకొని పాశ్చాత్యుల వ్యాకరణాల వరకూ ప్రసిద్ధ తెలుగువ్యాకరణ గ్రంథా లను 'తెలుగువ్యాకరణాల పరిచయం' అనే అయిదవ అధ్యాయంలో విశ్లేషణాత్మకంగా వివరించారు. ఒకేచోట ప్రాచీనుల, పాశ్చాత్యుల తెలుగు వ్యాకరణ గ్రంథాలను గురించిన వివరణ ఉంచడం విశేషం.

ఏడవ అధ్యాయంలో చిన్నయసూరి సూత్రరచనా పాటవాన్ని సోపపత్తికంగా వివరించారు. ప్రతి పరి చ్ఛేదంలోని ప్రధానాంశాలను కరతలామలకంగా ప్రదర్శిం చారు. ఎంతో వివరణ అవసరమైన అంశాలను కూడా సంగ్రహంగా, సుబోధకంగా, అలతి అలతి తేటతెలుగు పదాలలో వర్ణించడం ఆచార్యుల వారి తెలుగు వ్యాకరణాభినివేశానికీ, అభిమానానికీ నిదర్శనాలు.

బాలప్రౌఢవ్యాకరణాల కారక, సమాస పరిచ్ఛేదాలలోని విశేషాలను ఎనిమిదవ అధ్యాయంలో తులనాత్మకంగా వివరించారు. ఇందులో "బాలవ్యాకరణం వ్యాకరణాన్ని చదివే ప్రారంభకులకు పనికొచ్చే గ్రంథమన్నమాట" (పుట 52) అని రచయిత చెప్పినమాటలు సత్యదూరంకాదు. అయితే వ్యాకరణం భాషా విశే షాలను గ్రహించడంకోసం. లయాత్మక సూత్రరచన ధారణకోసం. వృత్తి, సంజ్ఞలు, పరిభాష, ప్రయోగాలు తదితరాలు విస్తృతపరిజ్ఞానం కోసం. కనుక 'గ్రహణధారణపటు: బాల:' అనే ఆర్యోక్తి స్ఫూర్తితో సూరిగారు బాల అనే శబ్దాన్ని గ్రహించి ఉండవచ్చు.

తొమ్మిదవ అధ్యాయంలో ఆయా పరిచ్ఛేదాలలోని పారిభాషిక పదాలను వివరించారు. పదవ అధ్యా యంలో పారిభాషికపదాలను అకారాది నైఘంటుకక్రమంలో వివరణాత్మకంగా ప్రదర్శించారు.

బాలవ్యాకరణవైశిష్ట్యం :

ఈ గ్రంథంలో ఆచార్యులవారు చిన్నయసూరి సూత్రరచనాపాటవాన్ని విశ్లేషణా త్మకం గా కొనియాడారు. బాలవ్యాకరణ వైశిష్ట్యాన్ని సోపపత్తికంగా, సాధికారికంగా వివరించారు. సంధిపరి చ్ఛేదం లో ఆగమకార్యాలను వివరించే సందర్భంలో రుగాగం(రుక్,ఆగమం), టుగాగం (టుక్,ఆగమం), నుగాగమం (నుక్,ఆగమం) అని చెప్పి 'య్' ఆగమాన్ని మాత్రం యడాగమం(యట్,ఆగమం) అని పేర్కొన్నారు. పాణిని మహర్షుల 'ఆద్యన్తౌటకితౌ' అనే సూత్రాన్ని అనుసరించి 'అయ్యమరులు' వంటి త్రికసంధి రూపాలను సాధించడంకోసం యక్ బదులు యట్ గ్రహించడం చిన్నయసూరిగారి ప్రతిభకు ఒక మచ్చుతునక (రామకృష్ణారావు 2011:24). అటువంటి పటిష్ఠమైన, ప్రణాళికాబద్ధమైన చిన్నయసూరి గారి బాలవ్యా కరణంలోని విశేషాంశాలను ఎన్నింటినో ఆచార్యులవారు విశదీకరించారు.

ప్రౌఢవ్యాకరణ వైవిధ్యం :

చిన్నయసూరిగారి బాలవ్యాకరణానికి దీటుగా తెలుగువ్యాకరణం రచించాలనే లక్ష్యంతో బహుజన పల్లివారు త్రిలింగలక్షణశేషము అనే వ్యాకరణగ్రంథాన్ని రచించారు. బాలవ్యాకరణ సూత్రాలకు వివరణ, సవరణ, పూరణ అనే అంశాలకే పరిమితమనే విమర్శలు ఎదు ర్కొన్నప్పటికీ ఇది ప్రౌఢవ్యాకరణంగా ప్రశంసలందు కుంటున్నది. శ్రీ మాడభూషివారు ఎనిమిదవ అధ్యాయంలో బాలప్రౌఢ వ్యాకరణాలలోని ఆయా అంశాలను తులనాత్మకంగా విశ్లేషించారు. సూత్రాలు పెద్దవైనప్పటికీ విశేషలక్షణ ప్రయోగాలతో నిండిన ప్రౌఢవ్యాకరణ విలక్షణతను ప్రస్తావించారు. వాక్య పరిచ్ఛేదాన్ని రచించి తెలుగులో యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి, పదం వంటి అంశాల గురించి ఆలోచింపజేసిన ప్రౌఢవ్యాకరణం ఔత్సాహికు లైన విద్యార్థులకు అవశ్యపఠనీయగ్రంథం.

ఉపసంహారం :

ఆచార్య మాడభూషివారు ఎం.ఫిల్. లో సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం చేసారు. పిహెచ్.డి. కోసం

లిఖితసాహిత్యం కష్టసాధ్యమైన ఎరుకలభాషకు వర్ణనాత్మక వ్యాకరణం సిద్ధంచేశారు (తెలుగు దీప్తి - 2019 : 112). ఈ పరిశోధనలద్వారా భాషాశాస్త్రంపట్ల, వ్యాకరణం పట్ల వారికి ఉన్న ఆసక్తి, అభినివేశాలు అవగత మౌతాయి. బాలప్రౌఢవ్యాకరణాలలోని అన్ని పరిచ్ఛేదాల నూతుల నాత్మకంగా పరిశీలించడం, పారిభాషిక పదాలలో వాక్యపరిచ్ఛేద పదాలను ఉదాహరణ సహితంగా చేర్చడం అనే అంశాలు విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా ఎంతో ఆవశ్యకమని మనవి. ఆసాంతం చదివించే సరళసుందర మైన శైలిమాత్రం ఒక పుష్కరకాలంపాటు వారు ఆయా ప్రసిద్ధ పత్రికల కోసం రచించడం కారణమై ఉండవచ్చు. ఏమైనప్పటికీ వ్యాకరణశాస్త్రంలో ప్రావీణ్యంకలిగిన మాడ భూషివారు సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు రచించిన ఈ వ్యాకరణ విజ్ఞానగ్రంథం తెలుగు భాషా సాహిత్యాలను అధ్యయనం చేసేవారందరూ తప్పక చదవదగినది.

సంప్రదించిన గ్రంథాలు :

1. తెలుగు దీప్తి. ఆచార్య మాడభూషి సంపత్కుమార్ (సం) 2019. హైదరాబాద్: పాలపిట్ట బుక్స్.
2. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము.2011. వంతరాం రామకృష్ణారావు(వ్యాఖ్యాత). హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.(ప్రథమ ముద్రణ 1999)
3. బాలవ్యాకరణ ఘంటాపథము.2011. వంతరాం రామకృష్ణారావు(వ్యాఖ్యాత). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.(ప్రథమ ముద్రణ 1970)
4. వ్యాకరణ విజ్ఞానం. 2013. ఆచార్య మాడభూషి సంపత్కుమార్. చెన్నై: టుడే పబ్లిషర్స్.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడో మనిషి కవిత్వం - మనోవిశ్లేషణ

- డాక్టర్ వి.శాంతిలక్ష్మి, అతిథి ఉపన్యాసకులు, తెలుగు విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి హృదయాంతరంగంలో జీవం పోసుకుని, అక్షర రూపం దాల్చి, 'మూడో మనిషి'గా పాఠక లోకానికి పరిచయం అయిన కవిత్వం 'మూడో మనిషి'.

"అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక!" - కాళోజీ.

అన్నట్లు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి 'మూడో మనిషి' కవిత్వంలోని ప్రతి అక్షరం పాఠక హృదయాలను కదిలించి, ఆలోచింప చేసేలా ఉంది. 'మహా ఆత్మఘోష'తో మొదలై 'భ్రమలు' వరకూ సాగే కవిత్వం ద్వారా, ఒక జీవిత కాలాన్ని మొత్తంగా పాఠకుడి మనసుకు స్పృశింప చేశారు.

అధికారానికి, లొంగుబాటు తనానికి ఉన్న అవినాభావ సంబంధంలోని కిరాతకత్వం 'మహా ఆత్మఘోష'.

"ఆత్మ ఘోషిస్తూ ఉంది / మార్చురీ గదుల్లో శవాలు /..... / గోవ్యాఘ్రాలు రెండూ ఒకే సంతతి / అయినా గోవులు గజగజ లాడుతూ ఉన్నాయి! / ...../ బైరాగి విషం తాగేసి ఊపిరి పీల్చుకొన్నాడు /ఐరావతం అయ్యగారి పాలైంది / గోవులు కుడితి నీళ్ళు తాగేసి / మైకం లోకి జారుకున్నాయి! / ఆత్మ నిషేధించిన మత్తుని/ ఆత్మ పేరు నినదిస్తూనే / గోవులకు ఎక్కిస్తోంది అధికారం/ గోవులు మైకం నుంచి తేరుకొని / కొమ్ములు విదిలించాయి! .....

'మహా ఆత్మ' యజ్ఞవాటిక చుట్టూ ఘోషిస్తూ ఉంది"

కవితలో ఇలా సాగిన ఈ భావ తరంగాలు, 'సమాజంలో బలం, బలగం ఉన్న వాడికే అధికారం' అన్న సంస్కృతిని చూపించింది.

'ఆకురాలినకాలం' ద్వారా అమ్మ అనురాగాన్ని, అమ్మ ప్రేమ స్పర్శను స్పృశించుకుంటూనే, అమ్మకు తానేం చేశానన్న ఆత్మ పరిశీలన చేసుకుంటాడు పాఠకుడు.

"అమ్మ ఆకులా రాలిపోయింది
పండీ పండకముందే
నిండా పండకముందే"

అంటూ సాగే ఈ కవితలో అమ్మపైన ఈ భావ తరంగాలు రెండు కోణాలను ఆవిష్కరించిందని చెప్పవచ్చు.

"అమ్మకు ఎంత ప్రేమ
అమ్మకు ఎంత పట్టుదల
అమ్మకు ఎంత ధైర్యం
అమ్మకు ఎంత ఆత్మవిశ్వాసం
అమ్మకు ఎంత చాతుర్యం
అమ్మకు ఎంత చేవ
అమ్మే లేకపోతే ఎవరిదారి వారిది!"

అమ్మ అనగానే, ప్రతి బిడ్డకు మదిలో మెదిలే రూపం తన అమ్మ. కనుక అమ్మకు దూరమైన వారు కవితను చదివే సందర్భంలో ఆ అమ్మ రూపంతో మమేకమై, ఆత్మ పరిశీలన చేసుకోకమానరు.

"క్రమశిక్షణను పెంచి పోషించిన అమ్మ
కాలుడి అక్రమానికి గురైనప్పుడు
ఒక్కరూ నోరు మెదపలేకపోయారు
ఎవరికి వారు
అమ్మలేకపోతేమా
అధినాయకులమనుకున్నారు
ఇప్పుడు అమ్మలేకపోవడంతో
అందరూ అనాథలే!"

తమిళనాడు ఇంటింటి వేల్పుగా, అమ్మగా కొనియాడబడి, ముఖ్యమంత్రిగా, పదవీ బాధ్యతలను ఎంతో

చాకచక్యంగా, ఓర్పుగా మోసి, చివరకు అర్ధాంతరంగా తనువు చాలించిన 'జయలలిత' గారిపై, తమిళనాడుతో సంబంధ బాంధవ్యాలు ముడిపడిన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి భావ ప్రకంపనలుగా ఆవిష్కృత మయ్యిందన్న కోణం మరొకటి.

"నువ్వు / నీ కోసం పోరాడతావు
నేనూ / నీకోసమే పోరాడుతాను
.....
నువ్వు అధికారం కోసం పాకులాడుతున్నావు
నేను సాధికారతకోసం పాటుపడుతున్నాను"

అంటూ ఆధిపత్యం, సాధికారతల మధ్య వ్యత్యాసాన్ని, ఆవేదనను నిక్షిప్తం చేసి చూపిన కవిత "నేను - నువ్వు".

తల్లి స్వార్థం చూపిస్తే కలిగే పరిణామాలెలా ఉంటాయో తెలిపే కవిత "తల్లి".

"ఒక తల్లి / పదిమంది పిల్లల్ని
కని పెంచి పోషిస్తుంది!
పదిమంది / పిల్లలు
ఒక తల్లిని పోషించలేకపోతున్నారు!
రాను రాను మనుషులు
బలహీనపడిపోతున్నారు!
అందుకే తల్లి / ఇప్పుడు
ఒకే బిడ్డతో సరిపెట్టుకొంటోంది!"

ఒక బిడ్డ కూడా ఒద్దనుకునే ప్రమాదం కూడా నేటి సమాజంలో ఇప్పటికే కనిపిస్తోందన్నది వాస్తవం.

ప్రకృతి ప్రశాంతంగా ఉన్నంత వరకే భూమ్మీద ఎవ్వరికైనా జీవితం, ప్రకోపిస్తే ప్రళయం తప్పదు. టెక్నాలజీ లేకున్నా బతికేయొచ్చు కానీ, ప్రకృతి మూడో కన్ను విప్పితే మిగిలేది భస్మమే అన్న సందేశాన్నిచ్చిన కవిత "ప్రకృతి". కరోనా ప్రస్తుతం చేస్తున్న మారణ హోమం అలాంటిదే మరి.

ప్రేమలో జయించడాన్ని "జయించడం" కవితలో; ఒక్కసారి అబద్ధం చెప్తే, ఇక మొత్తం జీవితం ఎలా అబద్ధాల బతుకవుతుందో "అబద్ధం" కవితలో; భూమ్మీద పుట్టుక కేవలం ఒక మజిలీ మాత్రమే, ఎవ్వరమూ శాశ్వతం కాదన్న సత్యం తెలిసినా, ఆశలు, ఆవేశాలు ఎందుకంటూ "ప్రయాణం" కవితలో; తన సంతోషం కన్నా, ఎదుటి వ్యక్తి దు:ఖాన్ని చూసి ఎక్కువగా సంతోష పడే మనిషి నైజాన్ని "బాధ" కవితలో; జనం కోసం, జనం మనుగడ కోసం తపించిన లెనిన్ మరణించి జనియించిన వైనాన్ని "లెనిన్" కవితలో; జనబలం, ధనబలం లేక, హీనంగా, బలహీనంగా బతుకీడుస్తూ, తలరాతలనే నమ్ముకుని, బలహీనపడుతున్నవారి గురించి "మైనారిటీలు" కవితలో; అధికారం ఎప్పుడూ సమత్వం కాదన్న ఆవేదనను "రాజ్యాధికారం" కవితలో; అవతలివాడి అంతు చూసైనా సరే అభివృద్ధిలోకి రావడానికి చేసే ప్రయత్నం ఎలాంటిదో "అభివృద్ధిపథం" కవితలో; ఇలా ఎన్నో సందర్భాలను, మరెన్నో భావ ప్రకంపనలను తన కవితలలో స్పృశించారు కవి.

సమాజంలో సంభవించే ప్రతి కొత్త విషయాన్ని కవి స్పృశించాడనడానికి "నల్లమొహాలు" కవిత నిదర్శనం. పాత కరెన్సీ కాగితాలు ఇక చెల్లవని డీమానిటైజేషన్ ప్రకటించగానే సమాజంలో రేగిన కల్లోలానికి ఈ కవిత అద్దం పట్టిందని చెప్పొచ్చు.

"రాత్రికి రాత్రి / కుబేరులందరూ
కబీరులై / నల్లధనంపై
వియోగంతో ఉపన్యాసాలివ్వడం
ప్రారంభించారు!
..... / .....
నాలుగేసి 500, 1000 కాయితాలు పట్టుకొని
నాలుగేసి సార్లు ఎంచుకొంటున్న వాళ్ళు తప్ప!
అంబానీ సోదరులెవరూ కనిపించలేదు
వాళ్ళంతా / రాత్రికి రాత్రి
ఎలా తెల్లవాళ్ళుగా / మారిపోయారో
చిదంబరరహస్యంగానే మిగిలిపోయింది!"

అంటూ సామాజిక న్యాయాన్ని పాఠకుడి ముందుకు తెచ్చారు.

తప్పు చేసి గెలిస్తే, గెలుపులన్నీ తప్పులుగానే సాగుతాయి. ఆ తప్పులు చెయ్యడం అలవాటుగా మారితే, తప్పుచేసి సమర్థించుకొనే వైనం అలవడిపోతుంది. అది చాలా ప్రమాదకరం అన్న సందేశం పంచిన కవిత "తప్పు". "తప్పతాగే వాణ్ణి మార్చవచ్చు / కానీ తప్పుచేసేవాణ్ణి మార్చలేం!" సూచన కూడా ఈ కవిత అందించింది.

మనిషి ప్రాణాలతో ఉన్నంతవరకే భూమ్మీద అందమైన జీవనం. ప్రాణం గాలిలో కలిసి శవంగా మారిన క్షణంతో కథ ముగిసిపోతుంది. రుణాను బంధాలన్నీ, ఒక్క క్షణం మౌనం పాటించడంతో ముగిసిపోతాయి. మనిషి జీవితం ఇంతేనా, ఇందుకేనా ఈ హంగామాలన్నీ అన్న ఆలోచనలు చుట్టుముట్టి, పాఠకుణ్ణి భావోద్వేగాలకు లోను చేసే కవిత "శవంలేచిన ఇల్లు". మొత్తం జీవితం కళ్లముందు సాక్షాత్కరింప చేస్తుంది.

"అది శవంలేచిన ఇల్లు
ఊరు ఊరంతా అక్కడే ఉంది
బంధువులు, స్నేహితులు
ఎక్కడెక్కడినుంచో ఎంతో మంది వచ్చారు
కానీ అందరి నోళ్ళు మూతపడ్డాయి
..... / .....
నీళ్ళుపోసి కడిగేశారు
రుణానుబంధం తీరిపోయిందని
వాకిట్లో ముగ్గువేసేశారు
ఇక ఏ రూపంలోనూ ఆ మనిషికి ప్రవేశంలేదని!"

ఈ పంక్తులు పాఠకుణ్ణి కదిలించేస్తాయి.

రాత్రికి రాత్రి ఊరు మొత్తాన్ని ముంచేసిన పరిస్థితిని "ఒకవాన" కవిత; ఏ చెట్టు గాలిని సృష్టించిందో ఆ చెట్టును అదేగాలి సమూలంగా నాశనం చేసిన దృశ్యం "ఒకగాలి" కవిత; మట్టిని నమ్ముకున్న రైతు జీవితం చిద్రమైన దృశ్యాలను "రైతు" కవిత ఆవిష్కరించాయి.

"ఆలోచించే తీరికే లేని మనిషికి
మూడో మనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది
ఇక్కడ / ఆడబిడ్డ బరువు
మూడో బిడ్డ నిషేధం / ఇక
మూడో మనిషి గురించి....!?"

అంటూ ఆవేదన వ్యక్తమవుతున్న ఈ కవిత హిజ్రాల జీవితాన్ని ఆర్ద్రతగా ఆవిష్కరించింది. బృహన్నల, శిఖండి, పేడి, కొజ్జా, హిజ్రా అంటూ ఎన్ని పేర్లతో హేళనచేస్తున్నా సహించాల్సిందే తప్ప మరో మార్గం లేని వీరి జీవితం పై స్పందనాక్షర యుద్ధం చేశారు కవి.

"ఆడమగా చేసిన తప్పుకు
ఆడామగా కాకుండా పోయారు!
ఎవరిది తప్పు / ఎవరికి శిక్ష!
మూడో మనిషిని / మనిషిగా గుర్తించడానికి
అంగవైకల్యాన్ని / ఆదరించడానికి
మనోవైకల్యం అంతరించాలి!"

అంటూ హిజ్రాల గురించి మానవత్వం నిండిన స్వరం వినిపింపచేసింది.

"మేమిద్దరం / మాకిద్దరు
వారిద్దరిద్దరు / చివరకు
మేమిద్దరమే!"

అంటూ ప్రస్తుత కుటుంబ స్వరూపాన్ని "ఇద్దరు" కవిత ద్వారా ఆవిష్కరించారు.

అమెరికా వ్యామోహంతో అక్కడికి వెళ్లే దారి చూపే చదువులే చదువుతూ, అక్కడి కలలే కంటూ, జీవితాలను ఫణంగా పెడుతున్న యువతనూ, దాన్ని సమర్థిస్తున్న వర్గాన్ని మేలుకొలిపే ప్రయత్నం చేసిన కవిత "అమెరికా". నిజానికి ప్రస్తుతం కరోనా మహమ్మారి ప్రపంచాన్నే చుట్టుముట్టిన తరువాత, అందరికన్నా ఎక్కువగా అమెరికా బలి అయిన తరువాత ఇకపై అమెరికా కలలు కాస్త అయినా తగ్గుతాయని ఆశించొచ్చు.

చెన్నైలో పిలవని చుట్టంలా వచ్చిన వాన, కుండపోతగా మారి నగరాన్ని మొత్తం ముంచెత్తగా, జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం, వీధిన పడిన బతుకుల జీవితాలెన్నో చవి చూపించిన తీరుకు "ఏడ్చినట్టుంది వాన" కవిత అద్దం పట్టింది. మాట మౌనం దాల్చినప్పుడు కెమెరా కన్నువిప్పి దృశ్యాన్ని సమీకరిస్తుంది అంటూ "కెమెరా" కవిత; మనం విన్నవన్నీ నిజం కావు. మనం చూసేవన్నీ నిజం కావు. మనం చేసేవన్నీ మంచివి కావు, మనం చెప్పేవన్నీ సత్యాలు కావు అంటూ "మనం" కవిత చెప్పూ అసలు మనమెక్కడికి పోతున్నాం అంటూ ప్రతి ఒక్కరూ తమని తాము ప్రశ్నించుకొనేలా చేస్తుంది.

"వడ్డించిన విస్తరి", "పక్కాఇళ్ళు", "శవప్రేమికుడు", "ఎద్దు", "సుఖం", "కన్ను" వంటి కవితల్లో అంటరాని తనం నేటికి బతికే ఉందన్న దృశ్యాలు ఆవిష్కృత మయ్యాయి. "మారని దృశ్యాలు", "వలస", "భ్రమలు!" కవితలు సామాజికావిష్కరణ చేశాయి. అక్షర సంపదను కొనియాడిన కవిత "అక్షరాలు". కవి హృదయం స్పందించినప్పుడు ఎలా కవిత్వం ఉద్భవిస్తుందో చూపిన కవిత "ఆవిష్కరణ". సముద్రపు లోతులను కొలవడం సాధ్యం కాదు. అలానే జీవిత లోతులను కూడా, కనుకనే అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ జీవితాన్ని కాపాడు కోవాలన్న సందేశం "స-ముద్ర" కవిత ఆవిష్కరించింది.

కవిత్వం అంటే ఏమిటో ఎలా ఉండాలో కవిత్వం ద్వారానే చెప్పిన కవిత "కవిత్వం".

"కవిత్వంలో / మడి కాదు / తడి ఉండాలి!
కవిత్వం / గుడికి కాదు / బడికి నడిపించాలి!
కవిత్వంతో / అందలం ఎక్కడం కాదు
అందరినీ ఎక్కించాలి!"

కవిత ఎలా ఉండాలని పై కవితలో చెప్పారో అలానే "మూడో మనిషి" కవిత్వం ద్వారా పాఠకుడి హృదయాన్ని తడిపి, అక్షరాక్షంలో సందేశాన్ని నింపి, పాఠకుడి మేధను పెంచి, పోషించారనడంలో అతిశయోక్తి లేదని భావిస్తున్నాను.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సాహిత్యం సృజనాత్మకత - పరిశోధనా దృష్టి

- విద్వాన్ ఆర్.రమేష్, తెలుగు ఉపాధ్యాయుడు, ప్రాథమిక మహోన్నత పాఠశాల, ఒన్నల్వాడి, హొసూరు.

"సంగీత సాహిత్యములు రెండూ సరస్వతి దేవి కుచద్వయాలు" అంటారు పెద్దలు. ఒకటి ఆ పాత మధురం అయితే మరొకటి ఆలోచనామృతం. ఆ సాహిత్యాన్ని "హితేన సహితం సాహిత్యం", "హితస్య భావ: సాహిత్యం" అని రకరకాలుగా తెలియజేయడం జరిగింది. అనగా మానవులకు హితాన్ని తెలియజేయడమే సాహిత్యం యొక్క ముఖ్య ఉద్దేశం. అది లేకుండా కవి యొక్క ప్రయత్నం సార్థకత నొందదు. ఆ సమాజానికి హితాన్ని కలిగించడానికి కవికి సామాజిక స్పృహ అవసరం. ఆ సామాజిక స్పృహ సంపూర్ణంగా కలిగి ప్రతి రచనలోనూ జగత్తును మేల్కొలిపిన కొద్దిమంది రచయితలలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు ఒకరు.

కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, పాత్రికేయుడుగా, భాషావేత్తగా, పరిశోధకుడిగా ప్రసిద్ధి చెందిన ఆచార్యులు మాడభూషి సంపత్ కుమార్ గారిని పరిచయం చేయడం దుస్సాహసమే అవుతుంది. నవీన కాలంలో తెలుగు తమిళ రాష్ట్రాలలో సాహిత్యాభి లాషులలో ఆయన తెలియనివారు అరుదుగా ఉంటారు. అంతటి ప్రసిద్ధి పొందిన సాధారణ వ్యక్తి అహర్నిశలు తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతూ తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన పరిశోధకుడు శ్రీ మాడభూషి సంపత్ కుమార్‌గారు.

తను కవిత్వం రాయడమే కాక నిర్విరామంగా 24 గంటలు కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి వంద మందిని కవిత్వం రాయడానికి పురిగొల్పి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో తెలుగుకు స్థానం కల్పించిన మహావ్యక్తి. ఇక మాడభూషి సంపత్ కుమార్ గారి సాహిత్యం ఒక సాగరం లాంటిది. చెన్నైలో ఒకవైపున బంగాళాఖాతం ఉంటే దానికి ప్రక్కనే మద్రాసు విశ్వవిద్యాలయంలో మాడభూషి సంపత్ కుమార్ అనే సాహిత్య సముద్రం మనకు కనిపిస్తుంది. రెండూ చూడడానికి ఒకే విధంగా కనిపించినా "దిగితేనే కదా లోతు తెలిసేది" అన్న చందంగా ఆ సముద్రంలోతైనా కనుగొనవచ్చుగాని ఈ సాహితీ సముద్రం లోతు కనుగొనుటకు సాధ్యం కాదేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఏ వైపున లోతు కనుగొనుటకు ప్రయత్నించాలో ఎవరికీ అర్థం కాకపోవడమే. తెలుగు సాహిత్యానికి వారు అందించిన రచనలు, అందులోని సామాజిక స్పృహ, నిజాన్ని నిక్కచ్చిగా తెలిపే తత్వం ప్రతి ఒక్క సంపాదకీయం, ప్రతి యొక్క కవితలో కనిపిస్తుంది. "సమాజాన్ని చదవని వాడు కవి కాలేడు" అనే ఆర్యోక్తికి అర్థం చాటే విధంగా అతని రచనలు, సంపాదకత్వాలు, కవితా సంపుటాలు కనిపిస్తాయి. "విశ్వమంతా తెలుగు సొరభాలు విరజిమ్మిన ఆధునిక కవులు ఎందరో అద్భుతమైన సాహిత్య ప్రక్రియ ధోరణులతో తాడిదన్ను వాడితలదన్ను వాడొకడు"(తెలుగు వెలుగు) అని కవి తెలిపిన చందంగానే ఆ తల దన్నువాడు ఒకడుగా వెలుగొందు శ్రీ మాడభూషి రచనలలో సాహిత్యాన్ని గూర్చి సంపూర్ణంగా తెలియజేయడం సాధ్యం కాదు గాని అతని రచనలలోని పరిశీలనా దృష్టి, పరిశోధన శక్తి సామాజిక స్పృహ అంశాలను గూర్చి నేను గమనించిన విశేషాలను ఈ వ్యాస రూపంలో తెలియజేస్తున్నాను.

పరిశీలన - పరిశోధన :

శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారి రచనలలో ప్రముఖ పాత్ర వహించు అంశాల పరిశీలన, పరిశోధన, సామాజిక స్పృహ. ఈ మూడు అంశాలు లేక అతని సాహిత్య రచనలు ఉన్నాయి అని తెలుపుట తలకు మించిన పని అవుతుంది. అతను రచించిన "వ్యాస సంపద"లను తిరగేస్తే మనకు ఈ విషయం చక్కగా అర్థ

మవుతుంది. ఆ వ్యాస సంపదలలో అతని విశ్లేషణా ధోరణి ప్రతి ఒక్కరికి ఆమోదయోగ్యంగా కనిపిస్తుంది. అందులోనూ అతను పరిశోధించిన చారిత్రకాంశాలు, శాసనాలు, భక్తితత్వాలు, ఆహారపు అలవాట్లు, క్రొత్త పదాలు, తెలంగాణ ప్రజల పోరాట విశ్లేషణా ధోరణి వీరి యొక్క పరిశోధన శక్తికి తార్కాణాలు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని తెలిపిన శ్రీకృష్ణదేవరాయల గారి తమిళ నాడులోని శాసనాలను గూర్చి పరిశోధించి దాదాపు 40 శాసనాలను మారుమూల ప్రాంతాలకు, గ్రామాలకు తిరిగి సేకరించి ఈ వ్యాసాన్ని తయారు చేసినట్లుగా తెలుస్తుంది. అంతేకాక విజయ నగర రాజుల శాసనాలలో గల శివ, విష్ణు, గణపతి ప్రార్థనలను "నమస్తే చంద్ర సర్వే----- సంభవే" లాంటి శ్లోకాలద్వారా శ్రీకృష్ణదేవ రాయల కాలంలోని మతసహనాన్ని గూర్చి తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో విహరించిన, మనకు తెలియని రాయబారులను గూర్చి చరిత్రలో కనుమరుగు గానున్న టాంపిరేస్, బార్బోసా, డొమింగో, ఫయాస్, కేస్టస్ షేడ న్యూనిజ్ పర్షియాకు చెందిన ఫిరస్తా మొదలైన వారి గురించి రాశారు. ఆ వ్యాసంలో శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని కవి విశ్లేషించిన తీరు అత్యద్భుతంగా కనిపిస్తుంది. ఇక అన్నమయ్య కీర్తనలోని భక్తితత్వాన్ని గూర్చి వివరిస్తూ కవి "పరపీడన చేయుట కంటే మరిపాపము ఎందునూ లేదు, పరోపకారము కంటే బహు పుణ్యము లేదు నిరత శాంతము కంటే నిజమైన ధర్మం లేదు" అను మూడు వాక్యాల్లో గల పాపం పుణ్యం ధర్మం అను మూడు పదాల యొక్క అర్థాన్ని ప్రజలకు విశ్లేషణ రూపంలో తెలియజేశారు. ఈ మూడింటిని పాటిస్తే ప్రపంచంలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అన్నమయ్య కీర్తన లను ఉదాహరణద్వార విశ్లేషించారు. అలాగే అన్నమయ్య కీర్తనలు "ధనికుడైన ఫలమేది ధర్మము చేయు దాకా, చదివియు ఫలమేది శాంతి కలుగు గాక, పెదవెత్తి పలమేది ప్రియమాడు దాకా" మొదలగు వాక్యాలను వివరిస్తూ అత్యంత కఠినమైన, నిగూఢమైన విషయాలను జనాలకు అర్థం కానటువంటి విషయాలను సచిత్రంగా వివరించి, విశ్లేషించి చెప్పారు. ఇదే విధంగా ప్రాచీన సాహిత్యంలో ఆహారపు అలవాట్ల గురించి, కొత్త పదాలను గూర్చి విశేషంగా పరిశీలన చేసి రాసిన ఎన్నో వ్యాసాలు వారి పరిశోధన శక్తికి నిదర్శనాలు.

సామాజిక స్పృహ :

"సామాజిక స్పృహ లేని కవిత్వం బూడిదలో పోసిన పన్నీరు" లాంటిదే. కవిత్వం యొక్క పరమావధి సమాజ సేవ. కవి సమాజంలో ఒక భాగంగా జీవిస్తూ సామాజిక సమస్యలను తన కవితల ద్వారా తెలియజేయుట కవి యొక్క నిజమైన బాధ్యత. ఆ బాధ్యతను ప్రతి ఒక్క కవిత్వంలోనూ చొప్పించిన మహా మేధావి మన మాడ భూషి సంపత్ కుమార్ గారు. "వారి ప్రజా కవిత్వం ఒక నిశ్శబ్ద యుద్ధంగా" మారి మనసును కలవరపెడుతూ, తిమిరంలో సమరం సలిపి మనిషిలో వెలుగునురేపి, పుస్తకంగా ప్రవహించి మానవ మనుగడకు శాశ్వత రూపం ఇస్తుందనుటలో అతిశయోక్తి లేదు.

అధికార దాహంతో చెరువులను కబ్జా చేసిన వ్యక్తులను గూర్చి "చెరువు శాపం" అనే గేయంలో "చెరువులో ఎవడు భువనాలను తాకే భవనాలను లేపాడో వాడు ఇప్పుడు కనిపించడు. జేబులు నింపుకుని వాడు ఎప్పుడో విమా నాల్లో పారిపోయాడ"ని ఉన్న నిజాన్ని వివరించాడు. వారి కవితలలో ముఖ్యంగా సమాజంలోని స్త్రీ చైతన్యం కోసం స్త్రీలను ఉసిగొల్పిన కవిత "నోరు తెరవండి" లో "ఇకనైనా నోరు తెరిచి మాట్లాడమ్మా" అంటూ దీనంగా వేడు కుంటున్నట్లున్న వాక్యాలతో ప్రారంభిస్తూ స్త్రీ జాగృతిపై తనకు గల ఆసక్తిని గేయం ప్రారంభ వాక్యంలోనే తెలియ పరిచారు. ఆ బాధలో గల దు:ఖాన్ని "హృదయంలో దాచుకున్న దు:ఖాన్ని దిగామింగకుండా కొంచెం బయటికి కక్కండి" అంటూ తన ఆరాటాన్ని కవి తెలియజేశాడు. అందులోనే "లోకం మారిపోయి చాలా రోజులు అయింది నువ్వు మోసపోతే నీకు ఎవరు సానుభూతి చూపరు" అంటూ హెచ్చరికలు కూడా చేశాడు.

అలాగే ''శత్రువు'' అనే కవితలో ''నీకు శత్రువులు ఎవరూ లేరు నీకు నువ్వే శత్రువు'' అని తెలుపుతూ ''పరిపక్వత లేని వాళ్లకు ప్రపంచమంతా శత్రు సమూహంలా కనిపిస్తుంద''ని వివరించారు. అలాగే ''గొప్ప'' అనే కవితలో ''మరణం లేని సమాజం కన్నా మానవత్వం లేని సమాజం గొప్పది కాదు'' అని మానవత్వాన్ని గూర్చి సమాజానికి వివరించారు. ''మరణం'' అనే కవితలో సైనికుని గొప్పతనాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. ''రెండంచుల కత్తి'' లో నేటి సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తిని, ముఖ్యంగా రాజకీయ నాయకుల ద్వంద నాలికలను, పార్టీలు మారే సిద్ధాంతాలను నిక్కచ్చిగా దుయ్యబట్టారు. ''ఇదేమి శాశ్వతం కాదు'' అంటూ ''పరివర్తన పొందుతూ ఉంటారు కాలంలో కొట్టుకు పోతూ ఉంటారు'' అని తెలుపుతూ చివరిగా ''ధర్మం న్యాయం చట్టం అన్ని రెండంచుల కత్తులే ఏది ఎప్పుడు ఎలా మారుతుందో ఎవరికీ తెలియద''ని కవి సమాజంలో జరిగే విషయాలను వివరించారు.

ఇక మాడభూషి గారి కవితలలో కనిపించే అణగారిన స్త్రీల యొక్క వేదనలు కళ్ళకు కట్టినట్లు తెలుస్తుంది. అవి సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. ''ఆమె'' అనే గేయంలో ''చిన్నప్పటి నుంచి అంతే చిన్న చూపుతోనే పెరిగింది'' అంటూ ''రెక్కలు విప్పిన చేతనకు కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదు'' అంటూ ప్రాచీన కాలం నుండి వస్తున్న స్త్రీ పరిస్థితిని ఒక్క ముక్కలో తేల్చేశాడు. అలాగే ''స్వర్గం'' అనే గేయంలో ''స్వర్గాన్ని రుచి చూస్తూ నరకాన్ని తాగి స్తాడు'' అంటూ స్త్రీల యొక్క మనోవేదనను ఇంతకన్నా చక్కగా సూటిగా తెలియజేయడం ఇతరులకు సాధ్యం కాదేమో. ఇక ''మగాడు'', ''తండ్రి'' ఇలాంటి గేయాలు మనుషులలో మార్పులతోపాటు ''పెళ్లి'' అనే పదానికి ''రెక్కలు తొడుక్కుని ఎగిరే మనసుని ముక్కలు చేసి మూల కూర్చోబెట్టారు దాని పేరు పెళ్లి'' అని ఒక్క కొత్త నిర్వచనం ఇచ్చారు.

అదే రకంగా చరిత్రకు కొత్త అర్థం చెబుతూ ''అయి పోయిందికాదు, కాబోయేది'' అని తెల్పారు. ఇక ''రూపాం తరం'' లో ''మనిషి మారకపోతే మనిషిపై తిరగబడతాం'' అని అతని మనసులోని మాటను నిర్భయంగా వెలి బుచ్చారు.

అదే ''మనిషి'' అను కవితలో ''నా భయమంతా మనుషుల గురించే మనిషి రూపంలో ఉన్న మనిషి గురించి'' అంటూ ప్రస్తుత సమాజాన్ని గురించి ఆందోళన వ్యక్తపరిచారు. మనుషులు నటిస్తున్న విషయాన్ని

"భవిష్యత్కాలంలోనైనా
మానవత్వాన్ని నటించకు
మోహానికి నవ్వు పులుముకుని
కడుపులో కత్తులుదించకు
మనసులకు అంతరాయం కలిగించకు"

అంటూ మనుషులను వేడుకొన్నాడు.

ఇవిగాక కవిగారు తన రచనలలో ప్రభుత్వాన్ని, ప్రభుత్వ వైఫల్యాలను కూడా దుయ్యబట్టారు. ''ప్రభుత్వం'' అనే గేయంలో ''నీళ్లు లేక కన్నీళ్లు నింపి ప్రజలకు ఏమీ చేయలేక పోయింది ప్రభుత్వం'' అని అన్నారు. ఇలా వివరిస్తూ పోతే కవి గారి ప్రతి ఒక్క కవితలో సామాజిక స్పృహ, ఒక సామాజిక సమస్యను తెలియజేయవచ్చు. వీరి సంపాదకీయాలు తులనాత్మక దృష్టితో పరిశీలించి నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా రాసినవి. వారు రాసిన అనేక సంపాదకీయాల లోని వార్తలు అటు రాజకీయ నాయకులను, ఇటు ప్రజానీకాన్ని ఆలోచింప చేసేదిగా ఉన్నాయి. వారు రాసిన సంపాదకీయాలు ''రెండో ఓటమి'' అనే పుస్తకంలో ప్రచురించబడినది. వాటిలో ముఖ్యంగా ఆనాటి సామాజిక సమస్యలు, రాజకీయ సమస్యలపై తన వ్యక్తిగత అభిప్రాయాలు వివరించబడినది. ఆ సంపాదకీయాలకు వారు పెట్టిన శీర్షికలను గమనిస్తే వారి యొక్క ధైర్యం ప్రజలకు అర్థమవుతుంది. ఉదాహరణకు ''బోగస్ ప్రజాస్వామ్యం'' ఎన్డీఏ కి బలపరీక్ష ప్రతిపక్షానికి శీల పరీక్ష''

అంటూ ఎన్నికల ప్రక్రియను విమర్శించిన "సర్వేల శిరో భారం" అంటూ సర్వేలను గురించి వివరిస్తూ "సర్వేలు నిష్పక్షపాతంగా శాస్త్రీయంగా వెలువడాలంటే ఆయా సంస్థలు చేసిన సర్వేల ఫలితాలను వాస్తవ ఫలితాలతో సరిపోల్చి వాటికి పొంతనలేనప్పుడు మళ్లీ అటువంటి సంస్థలకు సర్వే చేసే అర్హత లేకుండా చేయాలి" అని తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పత్రికలపై తెలియజేసిన సంపాదకుడు శ్రీ మాడభూషి సంపత్ కుమార్ గారు. అలాగే లాయర్ల సమ్మె గూర్చి "కేవలం ప్రజలను పీక్కు తినడానికి నల్ల కోట్లు ధరించాలని భావించే స్థితికి వారు తమ వృత్తిని నిర్వహిస్తున్నార"ని చెప్పడం జరిగింది. "మూడో మనిషి" కవిత్వంలో తన అభిప్రాయాలను తెలుపుతూ కవి "కవిత్వంలో మడి కాదు తడి ఉండాలి, అందలం ఎక్కడం కాదు ఎక్కించాలని" తెలియజేశారు. వారు తెలియజేసిన అనేక హెచ్చరికలు వారి కవితలలో కనిపించాయి. "ప్రకృతి జూలు విదిల్చింది అంటే నీ టెక్నాలజీ నీ టెన్నిక్కులు టైటాన్లా కుప్పకూలి పోవాల్సిందే"

"ప్రయాణం ముగించే లోపు నువ్వు ఎవరు అనేది ఎదుటివారికి అర్థమైతే చాలు" / "రంగులరాట్నంలో గతులు మారడంలేదు"

"రాత్రికి రాత్రి కుబేరులు అంతా కబీర్ లై నల్లధనంపై వియోగంతో ఉన్నారు" / "తప్ప తాగేవాడిని మార్చవచ్చు గాని తప్పు చేసే వాడిని మార్చలేము"

"దూరపు భవనాలు తెలుపు వైట్‌హౌస్ రక్తపు మరకలు దగ్గరికి వెళితే గానీ కనిపించదు" / "నిజం కూడా అబద్ధాలని కలిపితే గానీ రాణించదు అబద్ధం లేనిదే ఏదీనడవదు"

"అబద్ధాలను అలంకారాలుగా మార్చి చట్టబద్ధత కల్పించారు" / "జెండా అంటే మీటరు గుడ్డకాదు లక్షల మంది ప్రాణత్యాగం" అంటూ అనేక రకాలైన విషయాలలో కవి రచనా చమత్కృతిని ప్రదర్శిస్తారు.

ఇక చివరగా ఒక మాట, కనుమరుగవుతున్న తెలుగు భాషా పునరుద్ధరణకు కంకణం కట్టుకున్న కవి. "ఉగాదికి స్వాగతం"లో "తెలుగువారికి తెలుగు మీద కొంచెం మమకారం పుట్టించు" అని వేడుకోవడం చూస్తే తెలుగు భాషపై అతనికి గల మమకారం అర్థమవుతుంది. దానిని చేతల్లో చూపిస్తూ అనేక రకాల సభలు సమావేశాలు జరుపుతూ సన్మానాలు అందుకోవడమే కాక సన్మానాలు చేయడం కూడా తన బాధ్యతగా భావించి గత ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంలో వందమంది ఉపాధ్యాయులకు "జీవిత సాఫల్య పురస్కారా"న్ని అందించటం వారి గొప్పతనం అయితే ఆ అవార్డును అందుకున్న అదృష్టవంతులలో నేను ఒకరిని అని తెలియజేయడానికి గర్విస్తూ వారి సాహిత్య ప్రక్రియలు ఇంకా కొనసాగించ గలరని కోరుతూ వారి సాహిత్యాలను గూర్చి సంపూర్ణంగా విశ్లేషించుటకు ఎవరికి సాధ్యం కాదని తెలియజేసు కుంటున్నాను.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కవితే తానై.....!

- డాక్టర్ ఎస్. ఎల్. వి. ఉమామహేశ్వరరావు

"జీవితాన్ని విడిచిపెట్టి
కవిత్వం ఎలా రాస్తావ్?
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా దాస్తావ్!"

ఈ మాటలు వింటుంటే ఆచార్య సి.నారాయణరెడ్డి గారి 'కవి ఎక్కడ తల దాచుకోగలడ తన కవిత్వంలో తప్ప' అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి! కవిత్వాన్ని శ్వాసగా మలుచుకున్న వ్యక్తి తప్ప మరొకరు అనలేరు ఈ మాటల్ని. అలా జీవితంలోని ప్రతి సంఘటనా, సమాజంలోని ప్రతి విషయాన్ని అది కంటికింపైనా, కంటగింపైనా తన కలం ద్వారా వ్యక్తీకరించిన కవి మాడభూషి సంపత్ కుమార్ గారు. మనిషిలోని అతి చిన్న స్పందనకు స్పందించే ఈసిజీ రేఖలా సమాజంలోని అవసరమైన ప్రతి సన్నివేశానికి స్పందించే మనసూ, కలం వారిది. కవిత్వం రాయాలంటే పుస్తకాన్ని కాదు జీవితాన్ని చదవాలి అనేది వారి సిద్ధాంతం.

ఒక నవలకు సరిపడే ఇతివృత్తాన్ని నాలుగు పాదాల్లో తీసుకురాగల కవితా నైపుణ్యం వీరిది. ఈ మాటలు బహుశా అతిశయోక్తుల్లా అనిపించవచ్చు. ఎవరైనా చెబితే ఈ మాటల్ని బహుశా నేను కూడా నమ్మనేమో. కానీ "ఇద్దరు" అనే ఈ కవితలోని నాలుగు పాదాలు చూసినప్పుడు ఆ మాటలు కేవలం అభిమాన పూరితాలు కావని అక్షర సత్యాలని అనిపించకమానదు.

"మేమిద్దరం
మాకిద్దరు
వారిద్దరిద్దరు
చివరకు
మేమిద్దరమే!" అంతే కవిత.

కనిపెంచిన బిడ్డలు బతుకు తెరువు కోసమో, భవిష్యత్తు కోసమో ఉన్న ఊరిని, కన్న తల్లిదండ్రుల్ని ఒంటరిగా వదిలి దూరంగా వెళ్లిపోతే అటు పల్లెల్లోనో లేదా ఇటు పట్టణాల్లోనో ఒంటరి జీవితాల్ని వెళ్లదీసే వృద్ధుల మూగవేదనలోని నిష్ఠుర సత్యాన్ని కేవలం ఐదంటే ఐదే పదాల్లో మనసుకు హత్తుకునేలా చెప్పటం సామాన్య విషయం కాదు. ఇటువంటిదే "పక్కా ఇల్లు" అనే మరో కవిత. ఇందులో అంటరానితనం గురించి చెప్తూ-

"పక్కా ఇల్లు తప్ప
పక్కనే ఇల్లు కట్టలేకపోయారు"

అంటారు సంపత్ కుమార్. సమాజంలో అడుగడుగునా కనిపిస్తున్న అవకాశవాదం గురించి, అందులో మూర్తీభవించిన స్వార్థం, వంచనల్ని విశ్లేషించిన కవిత **"వడ్డించిన విస్తరి" -**

"ఎన్నిసార్లు విస్తర్లు వేసినా / వాడే ముందు కూర్చుంటాడు.
ఎన్నిసార్లు వడ్డించినా మీ వరకు రావు
వడ్డించే వాడు మావాడే ననుకుంటారు మీరు
కానీ వాడు వాడికే వడ్డించుకుంటాడు
మీరు ఇలానే ఉంటారు /.....
మిమ్మల్ని గీత దాటకుండా చూసుకుంటాడు
మీరు దాటేస్తే వాడి కథ అయిపోతుంది
అందుకనే మీకు విస్తర్లు వేస్తూ ఉంటాడు
వడ్డన మాత్రం జరగదు
కారణాలను పాయ్యి పెనం పైకో నెడుతూ ఉంటాడు
మీరు పాయ్యిలో నుంచి పెనంలోకి
పెనంలో నుంచి పాయ్యిలోకి మారుతూ ఉన్నంతకాలం
వాడు కాలాన్ని నెడుతూ ఉంటాడు"

ఈ కవితను అనువర్తింపజేసుకునే విశ్లేషణా శక్తి ఉంటే సమాజంలోని ఏ విషయానికైనా అనువర్తింప

చేయవచ్చు. నేటి సమాజంలో అణగారిన వర్గాల కోసం కేటాయించిన సంక్షేమాన్ని పొందినవాడే మళ్లీ మళ్లీ పొందటం, తనవాణ్ణి తనవాడే దోచుకోవడం, సమాజంలో కొన్ని వర్గాల మధ్యనే చేతులు మారుతున్న రాజకీయాధికారం గానీ దేన్నైనా తీసుకోండి! నూరు శాతం అన్వయించ దగ్గ కవిత ఈ "వడ్డించిన విస్తరి".

"రైతు" అనే కవితా ఖండికలో-

"మట్టి పిసుక్కుంటూ
ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటూ
ఆవేదన చెందుతున్నాడు"

అంటూ మట్టిని నమ్ముకున్న రైతుల్ని ఆ మట్టే మోసం చేసిన విధానాన్ని ఆవేదనతో వ్యక్తం చేశారు సంపత్ కుమార్. జన్మత: వచ్చిన విభిన్నత్వంతో సమాజంలో వివక్షకు గురవుతున్న హిజ్రాల గురించి వీరు రాసిన కవిత

"మూడో మనిషి"-

"రెండో మనిషి గురించి
ఆలోచించే తీరిక లేని మనిషికి
మూడో మనిషిని గురించిన ఆలోచన ఎక్కడిది?"

అంటూ హిజ్రాల గురించి చెప్పూనే స్త్రీలపట్ల సమాజంలో ఉన్న వివక్షను కూడా స్పృశించి పాఠకుని మనస్సులో ఆలోచనా బీజాల్ని నాటుతారు సంపత్ కుమార్.

వలస జీవితానికి వంద కారణాలు. ఒకడు పొట్టచేత పట్టుకొనిపోతే, మరొకడు పట్టా చేతపట్టుకుని పోతాడు. ఇంకొకడు ఇంకోదానికి, మరొకడు మరోదానికి, వలస మాత్రం సాధారణం. "అమెరికా", "మారని దృశ్యాలు", "వలస" మొదలైన కవితల్లో వలస జీవుల వెతల్ని ఆవిష్కరించారు సంపత్ కుమార్.

"ఎవడు ఎందుకెళ్ళినా / వలస వెళ్లిన చోట
రెండో వరుసలోనో / మూడో వరుసలోనో
చివరి వరుసలోనో / బిక్కుబిక్కుమంటూ
కూర్చోవాల్సిందే! / ముందుకు రావడానికి
ప్రయత్నిస్తే / మరో వలస తప్ప
వరుస మారదు"

అంటూ వలస విధానంలో ఉన్న నిష్ఠుర సత్యాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా బహిర్గతం చేశారు.

ఈ విధంగా మనసును కదిలించిన అన్నీ అంశాలపై స్పందించే వీరిలో అంతర్లీనంగా కనిపించే ఒక ప్రధాన మైన అంశం అభ్యుదయ దృక్పథం. కవిత్వమే జీవితం, జీవితమే కవిత్వంగా సాగిన వీరి సాహితీ జీవనగమనంలో కవిత్వ లక్ష్యాన్ని కూడా కవితలోనే చెప్పారు సంపత్ కుమార్.

"కవిత్వంలో / మడి కాదు / తడి ఉండాలి!
కవిత్వం / గుడికి కాదు / బడికి నడిపించాలి!
కవిత్వంతో / అందలం ఎక్కడం కాదు
అందరినీ ఎక్కించాలి!".

ఆధార గ్రంథాలు :

1. మూడో మనిషి - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
2. జీవితం-కవిత్వం - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వం - వాస్తవిక ధోరణులు

- జ్ఞానేశ్వరి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పరిచయం :

మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో 17,18,19 జూన్ 2020న "ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ సాహిత్య సమాలోచన" అన్న అంశంపై అంతర్జాల వేదికగా అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖా ధ్యక్షులు ఆచార్యులు మాడభూషి సంపత్ కుమార్ గారి 'జీవితం-కవిత్వం', 'వికారి', 'శత్రువుతో ప్రయాణం' అనే కవితా సంపుటాలను తీసుకొని "మాడభూషి కవిత్వం - వాస్తవిక ధోరణులు" అనే అంశంపై ఈ వ్యాసం రాయటం జరిగింది. ఈ మూడు సంపుటాలలో కొన్ని కవిత ఖండిక లను ఉదాహరణలుగా తీసుకొని వాస్తవిక ధోరణులలో విశ్లేషించటం జరిగింది.

జీవితం - కవిత్వం :

జీవితానికి - కవిత్వానికి మధ్య ఉన్న పరస్పర సంబం ధాన్ని గురించి ఈ 'జీవితం-కవిత్వం' అనే కవిత సంపుటిలో చెప్పబడింది.చిన్న చిన్న కవిత్వాలనుంచే జీవితంలోని అసలైన సత్యాలను వివరించారు మాడభూషి సంపత్ కుమార్ గారు. జీవితంలో ఉన్నతస్థాయి విలువలను, కవిత్వం నుంచి జీవితానికి సంబంధించిన అంశాలు వెల్లడవుతాయని, ఈ రెండు అంశాలను సమానమైన కోణంలో వివరించారు.

"జీవితాన్ని విడిచిపెట్టి
కవిత్వం ఎలా రాస్తావ్?
కవిత్వానికి తెలియకుండా
జీవితాన్ని ఎలా దాస్తావ్

(జీవితం-కవిత్వం, పుట. 1)

ఈ కవిత్వం ద్వారా 'జీవితం-కవిత్వం'కి మధ్య ఎటువంటి సంబంధం ఉందో పూర్తిగా అర్థమవుతుంది. కవిత్వం రాయాలంటే అందులో ప్రధానంగా జీవితంలో ఉన్న అంశాలే కవితా వస్తువులుగా పాత్రపోషిస్తున్నాయి. అలాగే కవిత్వానికి తెలియకుండా జీవితాన్ని కప్పిపుచ్చ లేవు. జీవితంలో ఉన్న ప్రతిసంఘటన కవిత్వంలో ఏదో ఒక రూపంలో ప్రతిబింబిస్తుంది.

జీవితం-కవిత్వం సమాజంలో జరుగుతున్న సంఘ టనలను వివరిస్తుంది. రెండింటిలో ఒకటి లేకుండా ఇంకోటి ఉండదని కవిగారు స్పష్టం చేశారు.

"దారి తప్పిన జీవితానికి...
జీవితం లక్ష్యమై నిలుస్తుంది"

(జీవితం - కవిత్వం, పుట.10)

నిత్యజీవితానికి ఈ కవిత ఎంతో స్ఫూరిదాయక మైనది. జీవితంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి కవిత్వం ఒక మార్గదర్శకమైనది. అలాగే కవిత్వం రాయ టానికి, అది ఉత్తమంగా ఉండటానికి 'జీవితం' అందులో ప్రధానం లక్ష్యంగా ఉంటుందని నిరూపించారు.

"కవిత్వానికి.....
కవిత్వం, మానవత్వం"

(జీవితం - కవిత్వం, పుట. 30)

కవిత్వానికి వస్తువు, శిల్పం ఎంత ప్రధానమైనవో జీవితానికి మానవత్వం ఎంత ముఖ్యమైనదో అటువంటి స్థానాన్ని జీవితంలో కవిత్వానికి కల్పించారు.

"ఓకే వ్యక్తి..... వైవిధ్యం తప్పదు"

(జీవితం - కవిత్వం, పుట.37)

కవిత్వంలో వైరుధ్యానికి, వైవిధ్యానికి సామ్యం చెప్తూ కవిత్వానికి, జీవితానికి ఇవి రెండు తప్పక ఉంటాయని వివరించారు. జీవితంలో ఉన్న భావాలు, కవిత్వంలోనూ వ్యక్తమవుతాయని నిరూపించారు.

"కవిత్వానికి మూలం....భావాలు మారవు"

(జీవితం-కవిత్వం,పుట.39)

ఈ కవిత పైన చెప్పిన కవితకి (94) కొంత పోలిక కలిగి ఉంది. చెప్పే విధానం మారుతుంది. కానీ, భావాలు అలాగే ఉండిపోతాయి. 'జీవితానికి అనువాదం కవిత్వం అన్నారు'.

"కవిత్వానికి కొలవటానికి కవిత్వమై మైలురాయి"

(జీవితం-కవిత్వం,పుట.40)

కవిత్వానికి కొలమానం 'జీవితమే తూకపురాయి' అదే విధంగా జీవితాన్ని విజయవంతం చేయటానికి కవిత్వామే ప్రధానం అన్నారు. ఈ విధంగా 'జీవితం-కవిత్వం'లో సమాజంలో జరిగేవి జీవితానికి తెలిస్తే, కవిత్వం జీవితంలో ఉన్న వాటిని వివరిస్తుంది. ఈ విధంగా 'సమాజం - జీవితం - కవిత్వం' అని చెప్పవచ్చు.

వికారి :

"నాకు దేవుడి మీద కన్నా.... అడుకుంటాను"

(వికారి, పుట.17)

ఈ కవిత హేతువాదాన్ని ప్రతిబింబించే విధంగా ఉంది. ఇందులో దేవుడి కంటే మనిషికే ప్రాధాన్యత నిచ్చారు. వాస్తవిక కోణంలో చూసినట్లయితే చలించని దేవుడి కంటే సహాయం చేసే మనిషి మీద నమ్మకాన్ని ఉంచుకోవటం ముఖ్యమని నిరూపించారు.

''3+3లో + తీసేస్తే 33 అవుతుంది.....
ప్రయాణిస్తూనే ఉంటాడు!"

(వికారి, పుట.24)

ఈ కవిత తెలుగు సంవత్సరాలలోని 'వికారి'ని గురించి మాట్లాడుతూ మనిషి తన జీవితంలో జరిగిన సంఘటనలను ప్రతీకలుగా చెప్తున్నాడు, కాలం ముందు మనమెంత నిమిత్త మాత్రులమే అంటూ, ఈ జీవితంలో మనం నడుస్తున్నప్పటి నుంచి నడవలేకపోయేంత వరకు జరిగిన అనుభవాలను తెలియచేస్తూ '33వ సంవత్సరం అయిన 'వికారి' రెండు సార్లు దాటిన వారు కొందరే ఎందుకంటే తన వికారాన్ని తానే చూడలేక కావచ్చు' అని కవి గారు అన్నారు.

"కొందరికి నవ్వేరాదు.....
సంతోషిస్తాడని బాధ!"

(వికారి, పుట.31)

స్వార్థపు సమాజంలో ఇతరుల నవ్వుని పరోక్షంగా ఏ విధంగా అవుతుందని చెప్పటానికి ఈ కవిత ఖండిక నిదర్శనం. ఇతరుల నవ్వులనే ఓర్వలేని సమాజంలో మనమెంత గర్వంగా బ్రతుకుతున్నామో అర్థమవుతుంది. ఈ సమాజంలో నిస్వార్థం ఎండమావిలాగే మిగిలి పోతుంది.

"ఈ కత్తికి రెండంచుల పదును...
అవతలి వాణ్నే కాదు మనల్ని కూడా!"

(వికారి, పుట.43)

ఈ కవిత మనిషిలోని మనస్సు అంతరంగిక కథనాలను స్పష్టంగా చెప్పింది. మనస్సుకు సంబంధించిన చంచలమైన స్వభావాన్ని ఇతరుల జీవితాల మీద చూపే ప్రభావం, సమాజంలో జరుగుతున్న సంఘటనల మీద ప్రభావం వివరించింది.

"ధర్మం, న్యాయం, చట్టం అన్నీ రెండంచుల కత్తులే
ఏది ఎప్పుడు ఎలా మారుతుందో ఎవరికీ
తెలియదు"

అని కవి అన్నారు. సమాజంలో ఏది ఎప్పుడు ఎటువైపు నిలబడుతుందో ఎవరికీ తెలియదు. నిన్న నిన్ను అసహ్యించుకున్నవాడే నేడు నిన్ను ప్రేమించవచ్చు. ఈ సమాజంలో అవసర నిమిత్తం అందరూ అవకాశవాదులే. ఆశయం తీరాక అహంకారం చూపించేవాళ్లే. ఇటువంటి మనస్తత్వాల వల్ల అవతలి వారి జీవితాన్నే కాదు తమ జీవితాల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. రెండు వైపుల ఉండటం వల్ల ఎక్కువ అనర్థాలకే దారి తీస్తుంది.

"ప్రాణాలను సైతం..... అతన్ని మరణం అంటదు!"

(వికారి, పుట.41)

ఈ కవితలో మరణానికి అసలు అర్థం ఎంటో తెలియజేసింది. మనందరిని కాపాడటం కోసం, తన వాళ్లందరిని వదులుకొని, ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని శత్రువులను పసిగడుతూ, తన ప్రాణాలను లెక్కచేయ కుండా పోరాడే సమయంలో తాను కోల్పోయేది మరణం కాదు. దానికి అసలు అర్థం త్యాగం అని నిరూపించారు కవి గారు.

"రైతు ఆత్మకథ..... రైతు ఆత్మకథ రాసుకోలేడు"

(వికారి, పుట.60)

సమాజంలో అన్ని అంశాలలో మార్పులు వస్తున్నప్ప టికీ, ఒక రైతు జీవితం మాత్రం తరతరాలుగా ఒకే విధమైన జీవనం. ఈ విధానానికి పరోక్షంగా ఎన్నో అంశాలు ఉండవచ్చు. కానీ రైతు మాత్రం తాను పండించే ప్రతి గింజకీ తన చెమటను ధారపోస్తాడు. ఆ మట్టినే బంగారం అనుకుంటాడు. రైతు ఎంత త్యాగం చేసినప్ప టికీ వారి చరిత్రలో ఆత్మహత్యలే మిగులుతున్నాయి. దీనికి కారణం ఒక్కరని ప్రశ్నించలేము. 'రైతుకు తెలియదు తన వ్యధల్లో యథార్థాలున్నాయని తెలియదు' అని సంపత్ కుమార్ గారు అన్నారు. రైతుని గురించి ఆత్మ కథను రాసేవారు లేరు. తాను రాసుకోలేడు.

"అబద్ధాలు చెప్పడంలో.... నీ అసలు స్వరూపం తెలుస్తుంది!"

(వికారి, పుట. 63)

అద్దం ముందు నువ్వు చెప్పిన అబద్ధాలు అద్దం నిన్ను ప్రశ్నిస్తుంది. నీలో ఉన్న విషయాలను దాచి ఉంచి నిన్ను నీకు నిజాయితీగా చూపిస్తుంది. అద్దంలో నిన్ను నువ్వు చూసుకుని గర్వంగా మురిసిపోకు, అద్దం ముందు ఎవరికి వారే గొప్పవాళ్ళు "కానీ గ్రూప్ ఫోటోలో నిలబడి చూడు నీ అసలైన వాస్తవాలు ఎంటో బయటపడుతుంది అని కవిగారు విశ్లేషించారు.

శత్రువుతో ప్రయాణం :

"ఆమె పుస్తకంగా ప్రవహిస్తుంది..... లోకాన్ని సుభరితం చేయండి"

(శత్రువుతో ప్రయాణం,పుట.25)

సమాజంలో ఆమె చేయూత లేనిదే ఏమి సాధించ లేరు. జీవితంలో వివిధ పాత్రలను పోషిస్తూ, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు లేకుండా, తన వాళ్లకోసం జీవితాంతం త్యాగం చేయటంలోనే తన జీవితం ముగు స్తుంది. అలాంటి తనను సమాజం, కుటుంబం, ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన దృక్పథంతో చూస్తారు. తండ్రి దగ్గర నుండి కొడుకుదాక అందరూ తనని తక్కువ చేసి చులకనగా మాట్లాడటమే జరుగుతుంది. తన అభి ప్రాయాలకు అస్తిత్వం లేకుండా పోయింది. తను ప్రశ్నించే అర్హతను పుట్టకముందు నుండే కోల్పోయింది. ఈ అణచివేతను సమాజం నిర్ధారించి, సమర్థిస్తుంది. ఈ విధంగా 'ఆమె' అనే కవితలో స్త్రీ చేసే త్యాగాలను, తనకు జరుగుతున్న అన్యాయాలను తెలియచరున్తూ, పితృస్వామ్య వ్యవస్థలో తన అణచివేతని, భర్త దగ్గర కూడా అస్తిత్వం లేకుండా చేశారని పురుషాధిపత్యాన్ని నిరసించింది. 'ఆమె లేకుండా మానవచక్రం పరిభ్ర మించదు' అంటూ మాడభూషి సంపత్ కుమార్ గారు ఆమెకు సమాన స్థానాన్ని కల్పించి 'లోకాన్ని సుభరితం చేయండి' అన్నారు.

"మగాడంటే మొనగాడని చెప్పింది అవ్వ.... ఆలోచించడానికి ఏతల్లోనూ మెదడు ఉండదు"

(శత్రువుతో ప్రయాణం,పుట.46)

ఈ కవితలో పురుషుడు మీద ఒక్కొ తరంలో ఒక్కో విధమైన దృక్పథంతో స్త్రీ ఆలోచనలు ఆవిష్కరించ బడ్డాయి. దీనికి కారణం మారుతున్న స్థల కాలాలు అని చెప్పవచ్చు. అవ్వ దగ్గర నుండి మనవరాలు దాకా ఒక్కో విధమైన భావజాలాలు ఏర్పడ్డాయి.కాగా, నాడు అనుసరించి అర్థం చెప్పారు. నేడు అన్వేషించి ఆలోచనాత్మ కంగా అర్థం చెప్పారు. తమకు సమానంగా హక్కులు, న్యాయాల కోసం నేటి స్త్రీ ప్రశ్నించి పోరాడుతుంది. స్త్రీతన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధంగా అర్థం చెప్పింది.

కవి గారు ''తరతరాలుగా స్త్రీ ఆలోచన విధానాన్ని, పురుషుని మీద స్త్రీ అభిప్రాయాన్ని'' ఈ విధంగా కవితా ఖండికలో చిత్రించారు.

"అబల కాదు సబల" అని నిరూపించారు.
"చరిత్రని తవ్వడం అంటే వర్తమానంపై....
అయిపోయింది కాదు రాబోయేది, కాబోయేది!"

(శత్రువుతో ప్రయాణం,పుట.50)

సామాన్యులకు చోటు లేని చరిత్ర, సామాన్యుల చరిత్ర ప్రశ్నార్థకాలుగానే మిగిలిపోయిన చరిత్రలను తెలుసుకోవడం కంటే వర్తమానానికి ఒక చరిత్రను సృష్టించండి. జరిగింది చెప్పడం చరిత్ర, జరిపించి చెప్పేది కాదు.

భవిష్యత్తుకు వర్తమానం బాట వేస్తోంది కాబట్టి 'అయిపోయింది కాదు రాబోయేది, కాబోయేది' అని కవి చరిత్రకు అసలైన అర్థాన్ని వివరించారు.

"మనిషి విలువ రూపాయిలాగా.... అతను ఎన్ని
ఏంబిలో తెలుసుకొని మర్యాదిస్తాను"

(శత్రువుతో ప్రయాణం, పుట.57)

ప్రాణం ఉన్నదాని కంటే, ప్రాణం లేని దానికే విలువ ఎక్కువ అంటే ఇదేనేమో. ప్రతి వస్తువుకి కొలమానం ఉన్నట్లే మనిషి విలువకి ఈ సమాజం రూపాయి అనే కొలమానాన్ని నిర్దేశించింది.

ఎక్కువ విలువనిచ్చే 'డాలర్'తో మనిషి విలువ ఆధారపడి ఉంటుందని, ఎన్ని విలువలు ఉన్నాయని కాదు ఎన్ని డాలర్లు ఉన్నాయనే సమాజం ఆలోచిస్తుంది.

"మనం ఎప్పుడూ అసమ సమాజంలోనే పయనిస్తూ
ఉంటాం...
కొమ్మల్లేని చెట్టులా తాము మాత్రం పెరుగుతూ
ఉంటారు!"

(శత్రువుతో ప్రయాణం,పుట.58)

నిస్వార్థ పరులుగా వచ్చి, తాము అందరిలా సమానం అంటూ, అధికారం కోసం తొంగి చూస్తూంటారు. అందరూ అధికారం కోసమే వేచి చూస్తుంటారు. ఒక్కసారి అధికారం చెయ్యిలోకి వచ్చాక తాము మాత్రమే ఉన్నతస్థాయిలో ఉండాలనుకుంటారు. దీనికి ప్రతీకగా

''కొమ్మల్లేని చెట్టులా తాము మాత్రం పెరుగుతూ ఉంటారు'' అని నరైన ఉపమానాన్ని కవిగారు వివరించారు.

"జెండా వంగి వాడి మొలతాడుకు చుట్టుకుంది...
లక్షల మంది ప్రాణత్యాగం చేసి కన్నబడ్డి!"

(శత్రువుతో ప్రయాణం,పుట.62)

దేశంలో జరుగుతున్న అన్యాయాలను చూడలేక, ప్రశ్నించలేక, తెలుసుకోలేక జెండా ఘోషిస్తుంది. ఇలాంటి సమాజం కోసమా మహావీరులు త్యాగం చేసింది అని బాధ పడుతుంది. ఇటువంటివి చూడలేక కట్లు విప్పుకొని స్వేచ్ఛగా ఎగరాలనుకుంటుంది. దేశాన్ని రక్షించే వాడి కోసం ఎదురుచూస్తోందని ఈ వాస్తవిక సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించేవారి కోసం చూస్తుంది. జెండా వెనకున్న అర్థాన్ని చక్కగా వివరించారు కవి గారు.

"ఇప్పుడు దేశాన్ని ఏలుతున్నది రౌడీయిజం, దాదా
యిజమే...
నీటి బుడగల్ని మొయ్యకు, నీటిలో బుడగల్ని
తొయ్యకు!"

(శత్రువుతో ప్రయాణం,పుట.71)

ప్రస్తుతం నడుస్తున్న సమాజం గురించి ఈ కవితా ఖండిక వివరిస్తుంది. ప్రపంచీకరణంలో సామాన్యుడి కష్టాలను తెలియజేస్తుంది. అవసరమైన వాటికి ధరలు తగ్గింపు, నిత్యావసరాలకు ధరలు పెంచడం. నదులలో నీటిని స్వేచ్ఛగా వాడుకోలేకపోతున్నారు. రైతులకి, స్త్రీలకి నేడు ఇస్తున్న గౌరవాన్ని ప్రశ్నించారు. ప్రాంతీయవాదులు, కులమత భేదాలలోనే కాలం గడిచిపోతుంది. నిన్ను కీలుబొమ్మను చేసే కాలానికి చోటు ఇవ్వకు. మారుతున్న కాలంలో అన్నీ మారిపోవడమే కాని, మనిషి విలువలతో ఉండాలి అని నిలబడే వాళ్ళు ఎవరూ లేరు.

ముగింపు :

ఈ వ్యాసం రాయటం వల్ల కవిత్వంలో ఉండే అనేక కోణాలను రచించటం ఎంతో గొప్ప విషయం. ఒకే కవిత వస్తువు ఆధారంగా ఎన్నో అంశాలను దర్శించి మన ముందు ఉంచారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. అలాగే వికారి, శత్రువుతో ప్రయాణం అనే కవిత సంపుటాలలో వివిధ కవిత వస్తువులు ఆధారంగా సమాజంలో ఉన్న వాస్తకవితను చాలా అద్భుతంగా, స్పష్టంగా, సందేశాత్మకంగా రచించారు ఆచార్యులు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. జీవితం-కవిత్వం, మాడభూషి సంపత్ కమార్, 2013.
2. శత్రువుతో ప్రయాణం, మాడభూషి సంపత్ కుమార్, 2015.
3. వికారి, మాడభూషి సంపత్ కుమార్, 2019.

❖❖❖

Wonderful Gifts!

Sir

Completed going through the two books authored by you. One has introduced me to the poet in you. The other has opened my eyes to the amount of work done on Mahabharata alone in our own dept. right under my nose and I have been ignorant about it - a fact to be ashamed of. You deserve to be congratulated and appreciated for taking up the stupendous task of revisiting all the research work done in our dept. I thoroughly enjoyed reading your poems. I was disturbed by katti kinda padakundaane, magaadu…. Inspired by some like swabhanuku swaagatam…. Motivated by lines of adaviloo poddu guukindi, aame… loved telugu velugulu… kavi helped me assert the man who always inspired you… ultimately made me understand what you stand for and by….congratulations!

Thank your so much for presenting such wonderful gifts!

Regards

- Dr. Madhavi Rani, USA

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శత్రువుతో ప్రయాణం' స్త్రీ మనోవిశ్లేషణ

- పులి చినబాబు, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

19వ శతాబ్దంలో భారతదేశంలో సాహిత్యంలో నూతన యుగారంభం జరిగింది. ఆంగ్లప్రభావంతో భారతదేశంలో అనేక నూతన ప్రక్రియలు వెలుగు చూశాయి. ఈ విధంగా తెలుగు సాహిత్యంలో అనేక నూతన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆధునిక కవిత్వం, నవ్య కవిత్వం, అభినవ కవిత ఇలా ఎన్నో పర్యాయ పదాల్లో ఆధునిక కవిత్వంగా మన సాహిత్యంలో వ్యవహరించబడింది. నోబెల్ బహు మతి ద్వారా రవీంద్రునికి ప్రపంచ ప్రఖ్యాతి రావటంతో భారతీయ సాహిత్యాలలో అతని ముద్ర ప్రసరించడం మొదలైంది.

ఇది క్రమంగా ఆంగ్ల భాషా ప్రభావం తెలుగు కవులపై చూపింది. దాంతో ఆ కవుల రచనలను ఆంగ్ల పాఠం నుంచి తెలుగులోకి తెచ్చారు.

నవ్య కవిత్వం వల్ల కవితా వస్తువులో, భాషలో, అభివ్యక్తిలో ఎంతో మార్పు వచ్చింది. ఎన్నో సంవత్స రాలుగా వస్తున్న తెలుగు కవిత్వం పూర్తిగా మార్పుకు లోనైంది. ఈ రోజుల్లోనే పద్యం నడకలోను, విడుపులోను, ఎత్తుగడలోను, ఉపసంహా రంలోను ఒక అపూర్వమైన సౌందర్యం సంతరించుకుంది. సంప్రదాయ కవులు, యువకవులు క్రమక్రమంగా నవ కవిత వైపు పయనిం చారు. సహృదయ పాఠకులు కూడా కొత్త కవితకు ఆహ్వానం పలికారు. రాయప్రోలు నుండి ఈనాటి కవులు ఎందరో నవ్య కవిత్వంలో అనేక రచనలు చేసి తరించి, పాఠకులను తరింప జేశారు.

నవ్యకవిత్వంలో ఎన్నో శాఖలు ఏర్పడ్డాయి. కవుల పరంపరలో భాగంగా ఈ నాటి కవులలో కవిత్వాన్ని తమ దైన శైలితో భావవ్యక్తీకరణ కావించిన వారిలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు ఒకరు. వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. పరిశోధకుడిగా, పర్య వేక్షకుడిగా, ఎందరో విద్యార్థులకు మార్గదర్శిగా తెలుగు శాఖ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింప జేసిన ఘనత వీరిదే! కవిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, అనువాద కుడిగా, పాత్రికేయుడుగా, భాషా వేత్తగా తెలుగు భాషా సాహిత్యా నికి ఆయన చేసిన కృషి అపారం.

వీరు వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు. వీరు రచించిన కవితా ప్రక్రియల్లో 1.జీవితం-కవిత్వం (2013), 2.శత్రువుతో ప్రయాణం (2015), 3.ఆలోచనలు (2015), 4.చివరకు నువ్వే గెలుస్తావు (2016), 5.మూడో మనిషి (2017), 6.వికారి (2019), 7.మొదటి అబద్ధం (2020) మొదలైన వాటితో ఈ పత్రం సమర్పించడం జరిగింది.

పైన పేర్కొన్నవాటిలో తండ్రి నుండి కడుపున పుట్టిన మగబిడ్డ వరకు స్త్రీపై వివక్షతో కూడిన అనేక సంఘ టనలను తాను ప్రత్యక్షంగానో పరోక్షంగానో చూసిన అంశా లను హృదయాన్ని తాకే తనదైన శైలి, భావ వ్యక్తీకరణలతో కవిత్వీకరించారు.. స్త్రీల హృదయాన్ని పాఠకులకు కంటతడి పెట్టించే విధంగా చూపారు. తన స్త్రీవాద పటిమను ఆచార్య మాడభూషి సంపత్ కుమారాచార్యుల వారు తొమ్మిది 'ఆమె', పద్నాలుగు 'స్వర్గం', పదిహేను 'తండ్రి', పదహారు 'మగాడు', పద్దెనిమిది 'భయం' మొదలైన కవితాఖండికలలో ప్రకటించారు. ఇవి స్త్రీవాద కవితలుగా ఉన్నాయి,.. మొదటగా 'ఆమె' అనే కవితలో ఎన్నుకున్న అంశం తన కుటుంబ బాంధవ్యాలలోనో, ఇరుగు పొరుగు కుటుంబాలలోనో జరిగిన సంఘటనకావచ్చు.

చిన్నప్పటి నుంచి అంతే - అంటూ మొదలైన ఈ కవితా కదంబం ఆమెను పరిమళించనివ్వండి లోకాన్ని సుభరితం చేస్తుంది అంటూ.. తన ప్రమేయం లేకుండానే నల్లగా పుట్టిన ఆడపిల్లను 'స్త్రీకి స్త్రీయే' శత్రువని చెబుతున్న పెద్దల మాటని ఖాయం చేస్తూ కన్నతల్లే చిత్రహింసలకు గురి చేయటం మాతృవ్యవస్థకు సిగ్గు

చేటనే నిజాన్ని చక్కగా చెప్పారు. పురుషహంకారమే కాదు కన్నబిడ్డల రంగుపట్ల వివక్షత చూపే తల్లి కూడా వివక్షతతో చూస్తుందనే దృక్పథాన్ని పాఠకులకు తెలిసిన నిజాలే అయినా వారి మనోభావాలలో మార్పు కోసం చేసిన ప్రయత్నంగా అనిపిస్తుంది. అందుకు స్త్రీ పక్షపాతియై చివరగా సమాజానికి హితం చెబుతూ... ఆమెను పరిమళించనివ్వండి లోకాన్ని సుభరితం చెయ్యండి అని స్త్రీ పట్ల తన ఆర్ద్రతా సందేశాన్ని పాఠకులకు అందించారు.

ఆ తరువాత 'స్వర్గం' అనే కవితలో భార్యా భర్తల మధ్య ఉండాల్సినది శారీరక హింసాత్మక శృంగారం కాదని పరస్పరావగహనతో కాపురం చేయాలనే సందేశం కనబడుతుంది. అనురక్తి లేని శరీరాన్ని భర్త అనే పశువు చిత్రహింసల పాలు చేసి నరకాన్ని చూపిస్తాడనే విషయాన్ని ఈ కవితలో చక్కగా తెలియచేశారు. భార్యగా తాను నరకం అనుభవిస్తూ ఇష్టం లేని అతని చేష్టలను ఓర్పుతో భరిస్తూ అతనికి స్వర్గ సుఖాలను ప్రసాదిస్తూ ఆమె అనుక్షణం నరకాన్ని అనుభవించే బ్రతుకును ప్రతి క్షణం హింసను అనుభవించే జీవితాలను చక్కగా తెలియజేశారు. ఈ కవిత 'రవిగాంచనిచో కవి గాంచున్' అనే నానుడికి అద్దం పడుతుంది.

ఇంకొకటి 'తండ్రి' అనే కవితలో సమాజంలో ఆనాటి నుండి నేటి వరకు వృద్ధ స్త్రీల నుండి నెలల పసిపాపలు అనే జాలి కూడా లేక అత్యాచారాలు జరుపుతున్న 'మానవ మృగాళ్ళు' నైజం పై ఓ ఆడపిల్ల తండ్రి ఆత్మ హత్యకు పాల్పడే మానసిక వేదన. పేపర్లు, టి.వి.ల్లో నిత్యం వచ్చే వార్తలను చూచి తన తండ్రి కూడా మగవాడే కదా, అనే భయంతో, అసహ్యంతో తనకు సమాజంలో అత్యాచారాలు చేసే మగాళ్ళ సారీ మృగాళ్ళ నైజాన్ని ప్రస్తావిస్తూ లోకానికి కవి చక్కగా వివరించారు.

ఇంకో కవిత 'మగాడు'లో మగాడంటే మొనగాడని చెప్పింది. అన్న దగ్గర నుండి ప్రారంభమై.. స్త్రీలోకం యావత్తు పురుష పక్షపాతే అనే నిజాన్ని కవి చక్కగా వివరించారు. ఎందుకంటే బామ్మ, అమ్మమ్మలు ఆపై తరాల నుండి నేటి ఈ తరం ఆడ పిల్లలను అత్తారింటికి పంపే అమ్మలదాకా తమకు అన్యాయం చేసినా ఎదురు చెప్పవద్దన్న విధానమే స్త్రీ కర్మగా భాసిల్లుతున్నది. మన భారతీయ కుటుంబాలలోని మూర్ఖత్వాన్ని నిరసిస్తూ తమపై పురుషజాతి సృష్టించే సమస్యలను ఎదుర్కొవడం నేర్పక, తలవంచి బ్రతకమని సూచించే స్త్రీలు ఆడపిల్లలో పిరికితనం నూరిపోయడం పై కవి తన నిరసనను తెలియజేయడం కనబడుతుంది.

ఈ కవి క్రాంత దర్శి. కాబట్టి సమాజంలోని స్త్రీ వివక్షను చక్కగా పరిశీలించిన వైనం కనబడుతుంది. పుట్టిన నాటి నుండి చచ్చేవరకు ఆడపిల్ల మనసు తెలుసుకొని ఏమీ చేయరని, ఆఖరికి పెళ్ళి కొడుకు విషయంలోనైనా ఆమె ఇష్టా ఇష్టాలకు పరిగణనలోకి తీసుకోరని ఆవేదన చెందుతారు. ఇది స్త్రీ పట్ల అతనికున్న గౌరవంగా మనకు దర్శనమిస్తుంది.

చివరిదైన 'భయం' అనే కవితలో ఆడపిల్లలకు స్వేచ్ఛ లేదని అంటూ.. ఇంట్లోను సమాజంలోనూ భద్రత కరువైందని చివరకు ఆడపిల్లలు ఎక్కడకు వెళ్ళవలసి వచ్చినా, అత్యాచారాలు ఏ మూల ఎప్పుడు, ఎక్కడ పొంచి ఉంటాయోననే భయం వణికిస్తున్న పరిస్థితులను చక్కగా అధ్యయనం చేసిన కవి ఆవేదన చెందుతారు. మహిళలు ఇప్పటికీ పాఠశాలలనుండి కార్యాలయాలకు ఇంట్లో నుండి వీధి వరకు తామ జీవితాలకు అభద్రతా భావంతో భయంతో వణుకిపోతున్నారన్న నిజాన్ని చక్కగా వివరించారు.

ఈ విధంగా వస్తువులో వైవిధ్యం అభివ్యక్తీకరణ లో విలక్షణత ఉన్న ఈ కవితా సంపుటిలోని కవితలు స్త్రీ మనో విశ్లేషణాత్మకంగా ఉండి కవిని స్త్రీ పక్షపాతిగా నిరూపిస్తూ 'యాత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా' అని మనవు చెప్పినట్లుగా స్త్రీ ఎక్కడ పూజింపబడుతుందో అక్కడ దేవతలు నివసిస్తారనే మాటకు సాక్షీభూతంగా అన్పించడంలో వివాదం లేదు.

❖ ❖ ❖

విజ్ఞాన 'సంప'త్

ఎదిగిన కొద్దీ ఒదిగే తత్వం
మూలాలు మరువని నిగర్వి
పెద్దల్లో పెద్ద పిన్నల్లో పిన్న
గురువుకు తగ్గ శిష్యుడు
గురువు మెచ్చిన శిష్యుడు
గురువులకు విధేయుడు
శిష్యులకు ఆరాధ్యుడు
మిత్రులకు పరమాప్తుడు
మూర్తి చిన్నదైనా కీర్తి దొడ్డది
బుడుగైనా ఆర్తి పొడుగు
వ్యక్తి కాదు అదో శక్తి
అలుపెరుగని ఆచార్యునికి
పనిలోనే విశ్రాంతి
అందుకే....
ఎన్నెన్ని సభలు-ఎన్నెన్ని సదస్సులు
ఎన్నెన్ని మన్ననలు-ఎన్నెన్ని పురస్కారాలు
ఉద్యోగంతో పాటే సద్యోగం
వృత్తితోపాటే ప్రవృత్తి
తమిళనాట తెలుగుబావుటాపై 'కవి'రాజు

అంతర్జాతీయ వేదికలపై
'అమ్మ' లిపికి పట్టం కట్టి
రుణం తీర్చుకున్న బిడ్డడు
నిరంతర సాహితీ హాలికుడు
అహరహరం అక్షర తపస్వి
ఆయన 'తెలుగుశాఖ కరదీపిక'
అందరి బంధువు-ఆనందవిహారి
'జీవితం-కవిత్వం' అంటూ
'ఆలోచనలు' పంచుకుంటూ
వికారాలను సయితం
సకారాలుగా మార్చుకుంటూ
'చివరకు నువ్వే గెలుస్తావు'అంటూ
'శత్రువుతో ప్రయాణం'లోనూ ధీశాలి
మన సం'పదా'చార్య!
'గురుమిత్రులూ'!అందుకోండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
పునరంకితం కావాలి
భాషామతల్లి సేవకు
జయహో తెలుగుతల్లీ!!

-డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వికారి' కవిత్వం - సామాజిక దృక్పథం

- టి. సోమశేఖర్

"నిశితమైన దృష్టితో, దృఢమైన నిష్ఠతో, నిరంతరం సాహిత్యాన్ని సృష్టిస్తూ, సంఘసంస్కర్తగా జీవిస్తూ అడుగడుగున ఆవరించిన అసమానతలపై, అమరికలపై అక్రమాలను, అన్యాయాలపై కలం పట్టి గళం విప్పి తూటాలాంటి మాటలతో పదునైన పద ప్రయోగాలతో ప్రశ్నిస్తూ తన హృదయాన్ని ఆవిష్కరిస్తూ సమసమాజ భానుతేజ సంపూర్ణ స్వరాజ్య సంఘాన్ని కాంక్షిస్తూ కదులుతున్న రవికిరణం, ఉదారమైన హృదయ తోరణం, మానవతకు నిదర్శనం 'వికారి' కవిత్వాన్ని సృష్టించిన వారే మా గురువు మాడభూషి సంపత్ కుమార్ వారే ఆనంద విహారి అలుపెరుగని సంఘ సంచారి".

ఈ 'వికారి' సంకలనంలో మొత్తం 29 కవితలతో వివిధ రకాల అక్షర పూల మాలను అల్లి తెలుగు తల్లికి ఆభరణంగా వేశారు. ప్రతి కవిత సమాజంలో ఉన్న రోతను సూచిస్తుంది. రాజకీయ నాయకుల రాక్షసత్వాన్ని, కులవాదుల కర్కశత్వాన్ని, మత మూర్ఖుల మూఢత్వాన్ని సైశాచికంగా వావివరుసలు లేని కామ మృగత్వాన్ని కళ్ళకు కట్టినట్లు నాలుగు పాదాల కవితలోనే నిగూఢమైన నగ్న సత్యాన్ని కుండ బద్దలు కొట్టినట్టు అలతి అలతి పదాల లోనే అనంతమైన అర్థాన్ని తెలుపుతూ 'తెలుగు వీర లేవరా, దీక్షబూని సాగరా' అన్న శ్రీశ్రీ గారి మాటను బాటగా చేసుకుని మనసును తాకే బలమైన పదునున్న కవిత్వాన్ని సృష్టించారు. ఏ కవిత చదివినా అందులో సమాజం ప్రతిబింబిస్తుంది. సంఘంలోని వికారాన్ని అంతా ఈ 'వికారి' కవిత్వం బెరుకు లేకుండా గంభీరమైన కంఠంతో నిండైన భావప్రకటనతో ప్రశ్నిస్తుంది.

సామాన్యునికి సహితం అర్థమయ్యే సరళ తేట తెనుగు భాషలో భావాన్ని నింపి షడ్రుచుల ఉగాది పచ్చడిని తినిపించారు. మొదటి కవిత మొదలుకొని చివరి కవిత వరకు ఆశాంతం వికారాలతో ఉన్న సంఘాన్ని దృశ్య చిత్రంలా చిత్రీకరించారు.

ఈ 'వికారి' కవితా సంకలనంలో మొదటి కవిత 'భిక్షగాడు'. ఈ కవిత ఎంత గొప్పగా ఉందంటే నిజంగా మనిషిలో మానవత్వాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తుంది.

"నాకు / దేవుడి మీద కన్నా
మనిషి మీదే / ఎక్కువ నమ్మకం-
అందుకే / గుడి బయటే
అడుక్కుంటాను!"

(వికారి, పుట.17)

ఇందులో ఎంత అర్థం ఉందో ఒక భిక్షగాడి మనసును ఎంత గొప్పగా ఆవిష్కరించారో కదా! కవి ఈ కవితలో.

'చెరువు శాపం' అనే కవితలో మాడభూషిగారు ఇలా అంటున్నారు.

"చెరువులో అపార్ట్‌మెంట్ కట్టినప్పుడు
చెరువు కడుపులో మట్టిగొట్టినప్పుడు
అది ఎంతగా విలపించిందో
ఎవరికి తెలుసు!"

(వికారి, పుట.18)

అంటూ చెరువు పడే వేదన, నిజంగా చెరువుకు మాటలు వస్తే వీరిలాగే ప్రశ్నించేదేమో అన్నట్లుగా చెరువు పడే బాధను వివరిస్తారు. నేడు మనం చూస్తున్నాము. ఎన్ని చెరువులు కబ్జా చేయబడ్డాయి. రాజకీయ నాయకుల చేతుల్లో పడి చెరువులు ఇళ్ళయ్యాయి. ఎందరికో దాహం తీర్చే చెరువులు నేడు అపార్ట్‌మెంట్‌లై తాగడానికి నీరు లేని దుస్థితికి డబ్బులు ఇచ్చినా నీరు లేని పరిస్థితికి దిగజారిపోయిన సమాజాన్ని చూసి కవి ఎంత గొప్పగా చెరువు యొక్క ప్రాధాన్యాన్ని దాని ఔన్నత్యాన్ని ఈ 'చెరువు శాపం' అనే కవితలో వివరించారు.

'హత్య-ఆత్మహత్య'కు ఉన్న చిన్న తేడాన్ని ఈ విధంగా అంటున్నారు.

"ఇతరులు / మన మీద
కోపంతో చేసేది హత్య!
ఇతరుల మీద
కోపంతో మనం చేసుకొనేది ఆత్మహత్య!"

(వికారి, పుట.21)

అంటూ కోపం ప్రాణం తీసే కరోనా లాంటిదని, అది ఎంతటి పనినైనా చేయిస్తుందని కోపం యొక్క స్వరూపాన్ని స్వభావాన్ని ఈ కవితలో కవి మాడభూషి సంపత్ కుమార్ గారు తెలియజేశారు.

'దాహం' అనే కవితలో

"ఎక్కడో ఉత్తరాన నీటికొండ
ఎక్కడో దక్షిణాన నీటికుండ
ఎక్కడెక్కడో ఉన్నా / ఒకదాని జీవితంతో ఒకటి
ఒకదానికొకటి / జీవితాల్ని పంచుకొంటాయి
పంచనే ఉన్నట్టు ఉంటాయి!"

(వికారి, పుట.22)

ఈ కవితలో నీటి కొండ కరిగి నీటి కుండలోకి చేరి ఒకదానికొకటి అన్నట్టుగా కలసిపోయి జీవిస్తాయి. అలాగే మనిషి ఎక్కడో పుట్టి పెరిగి ఎవరితోనూ పరిచయ బంధం ఏర్పడి స్నేహంగా మారి వారిని ఒకరికొకరం అనేలా స్నేహ దాహం ఒకటి చేస్తుందనే విషయాన్ని కవి సంబంధ బంధవ్యాల గురించి ఎంత చక్కగా వివరిస్తారు.

కులం గురించి పోరాటాలు చేస్తూ ఒకరినొకరు నిందించుకుంటూ ద్వేషించుకొంటూ నరం లేని నాలుక లతో కులంపై చర్చిస్తూ కుల రాజకీయాలు చేస్తున్న కింకరుల అరాచక ధోరణిని ఎండగట్టారు.

"కులంకన్నా / మలమే గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం!"

(వికారి, పుట.23)

మూడు వాక్యాల్లో కుల రహిత సమాజాన్ని నిర్మించాలన్న వారి ఆకాంక్ష స్పష్టంగా ఈ కవితలో తెలుస్తోంది.

'3+3=33' ఈ కవితలో కవి జీవిత సత్యాన్ని ఎంతో క్లుప్తంగా అలతి అలతి పదాలలో అనల్పమైన అర్థాన్ని, అసలైన సత్యాన్ని సరళంగా పామరులకు సహితం బోధపడేలా ఎంతో చక్కగా వివరించారు. అంటే చెప్పడానికి రాయడానికి మాటలు లేవు. అంత అందంగా సత్యాన్ని అల్లిన విధానం అంతే గొప్పగా ఉంటుంది.

ఈ కవితలో కవి వైరాగ్య చిత్తుడై జీవితం పట్ల మనిషికి ఉన్న మోహాన్ని దాహాన్ని అమితమైన ఆశల వెల్లువల చెబుతూ చివరకు మిగిలేది ఉత్త చేతులే అంటారు.

వాస్తవమైన సత్యాన్ని కొన్ని వాక్యాలలోనే చెప్పి మనిషికి కనువిప్పు కలిగిస్తారు.

"ఓడిన వాడికి మిగిలేదీ ఉత్తిచేతులే
జయించిన వాడికి మిగిలేదీ ఉత్తిచేతులే
అందరి కత్తులూ
చివరికి కిందపడిపోవాల్సిందే"(వికారి, పుట.26)

అంటారు దార్శనికతతో కవి మాడభూషి సంపత్ కుమార్ గారు. ఇంకా ముందుకెళ్లి ఆశతో కదిలిన వాడి మన స్థితిని ఇలా అంటారు.

"సాగినవాడు
సాధించామనుకుంటాడు
సాగనివాడు
సాగిలపడుతూ ఉంటాడు"

(వికారి, పుట.25)

ఈ పంక్తులు చదవగానే మనిషి యొక్క మానసిక స్థాయిని బట్టి మనిషి ప్రవర్తన ఉంటుందని తెలియ జేస్తారు. అంతేకాకుండా జీవితంలో మనిషికి అరుదైన వరం తను పుట్టిన సంవత్సరాన్ని మళ్లీ చూడడమనే విషయాన్ని ఈ కవితలో ఇలా అంటారు కవి.

"ఈ జీవిత కాలగమనంలో
ఈ 33 ఎన్నోసార్లు వచ్చింది
ఎన్నోసార్లు పోయింది
ఈ 33ని ఎంతోమంది దాటివెళ్ళారు

ఎంతోమంది దాటలేక పోయారు
రెండోసారి చూసినవారు అరుదు
తన వికారాన్ని తానే చూడలేక కావచ్చు!"

(వికారి, పుట.24)

ఇలా మనిషి తన ప్రయాణాన్ని ఎప్పుడు ముగించుకొని వెళ్ళిపోతాడు తెలియదు అంటారు. అంతేకాకుండా మనిషి చావాలని ప్రయత్నించినా ఆ ప్రయత్నం విఫలం అవుతుందని మనిషి అమరుడు అవ్వాలని ప్రయత్నించినా అది ఫలమే అవుతుందని కవి ఇలా అంటారు.

"అత్యవసరంగా వెళ్ళాలనుకుంటే
గంటసేపు కాముకొని కూర్చున్నా
బస్సురాదు / వచ్చిన బస్సులో
నిలబడ్డానికి కూడా తావుండదు"

(వికారి, పుటలు.26,27)

ఈ వాక్యాలను గమనిస్తే ఏ ఒక్క వ్యక్తి చిన్ని చిన్ని సమస్యలకే కృంగిపోయి బలహీనుల ఆత్మహత్య ప్రయత్నాలు చేయడం సబబు కాదు. జీవితం ఒక అనుభవం దానిని అనుభవించడమే మనిషి అసలు పని అని కవి తెలియజేస్తారు.

మనిషికి కాలంతో పరుగులు తియడం అలవాటె పోయింది. దానికి ఏ అవరోధ అడ్డు కాదు అన్న విషయాన్ని ఇలా అంటారు రవి గారు-

"మనిషి మాత్రం సామాన్యుడా
కళ్లు లేకపోయినా / కాళ్ళు లేకపోయినా
పాకుతూ దేకుతూ / ప్రయాణిస్తూనే ఉంటాడు
కాలంతో పాటు / పరుగు పెడుతూనే ఉంటాడు
ప్లస్, మైనస్సుల్ని = చేసుకుంటూ
ప్రయాణిస్తూనే ఉంటాడు!"

(వికారి, పుట.27)

ఇలా అని చివరి పంక్తులతో కవితను ముగిస్తారు.

"నోరు తెరిస్తే
నీకు పోయ్యేదేమీ లేదు
అవమానాలు తప్ప!
పక్కింటి వాళ్ళను గురించి మాట్లాడంకన్నా
నీ దుఃఖాన్ని పంచుకో
నీ కష్టాలను తెంచుకో
ఇంట్లోని కామాంధులు
ఆఫీసులోని అల్లరిమూకలు
వీధిలోని రౌడీలు / నీకు ఎరవేసేవాళ్ళు

నిన్ను కాలరాసేవాళ్ళు / నువ్వు నోరు తెరిస్తే చాలు / పరారు / నోరు తెరవమ్మా / నీకు పొయ్యేది ఏమీ లేదు / అవమానాలు తప్ప!"(వికారి, పుట.30) అంటున్నారు కవి. నాటి నుంచి నేటి వరకు మహిళ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య కామాంధుల చేతుల్లో పడి నలుగుతున్న ఆడబిడ్డల మానాన్ని ప్రాణాన్ని కాపాడాలనే కవి ఆకాంక్ష ఈ కవితలో స్పష్టమవుతోంది.

అయిదేళ్ళ పాప నుంచి డెబ్భై ఏళ్ల ముసలమ్మ దాకా ఏ ఒక్కరిని వదలకుండా వావివరసలు లేకుండా మృగంలా మీదపడి క్షణిక సుఖం కోసం చిత్రవధకు గురి చేసి హింసించి మరీ తన కోరికను తీర్చుకుందట, కామాంధుల రాక్షసత్వంపై నోరు తెరవమని మౌనం వీడమని కవి మాడభూషి సంపత్ కుమార్ గారు తన 'వికారి' కవితా సంకలనం ద్వారా మహిళలకు పిలుపునిచ్చారు. ఇంకా మహిళల అభివృద్ధి దేశానికే సమృద్ధి అని మహిళా స్వాతంత్ర్యం అసలైన సమసమాజ నిర్మాణం అంటూ కవి అభిప్రాయపడ్డారు.

నవ్వు గురించి నవ్యంగా భావం వ్యక్తీకరణ చేసిన నవ కవిత బ్రహ్మ వీరు 'నవ్వు' గురించి ఇలా ఆయన భావాన్ని వ్యక్తీకరించారు.

"కొందరికి నవ్వేరాదు
నవ్వితే / సంతోషంగా ఉన్నామని
అవతలివాడు / సమస్యలు సృష్టిస్తాడని భయం!
కొందరికి నవ్వేపోదు
నవ్వకుంటే / మనం దుఃఖంలో ఉన్నామని
అవతలివాడు / సంతోషిస్తాడని బాధ!"

(వికారి, పుట.31)

ఈ పంక్తులు చదువుతుంటే మనిషి మనో వికారాన్ని మానసిక రుగ్మతలను ఎంత చక్కగా నవ్వు గురించి చెప్పారంటే నేడు ఇలాంటి వారే ఎక్కువగా సమాజంలో ఉన్నారు. లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్టుగా మూతికి మాస్కు వేసుకున్నట్లు తన మనసుకు ముసుకు వేసుకొని శవాలు వలె బ్రతుకుతున్నారు అన్న విషయాన్ని కవి మాడభూషి సంపత్ కుమార్ గారు ఈ నవ్వు కవిత ద్వారా తెలియజేశారు.

శబ్దం యొక్క గొప్పతనాన్ని 'శబ్దం' అనే కవితలో కవి ఇలా వివరిస్తున్నారు.

"శబ్దం / నిశ్శబ్దంగా / కవిత్వంలోకి దూరి / మనసును కలవరపెడుతుంది! / తిమిరంతో సమరం సలిపి / మనిషిలో వెలుగును రేపుతుంది! / మనిషికి / అక్షరజ్ఞానం కలిగించి

స్థిరమైన భావజాలం ముద్రిస్తుంది"(వికారి, పుట.32) ఎదలో మెదిలే భావాన్ని పలికిస్తుంది శబ్దం అన్న సత్యాన్ని కవి ఎంత అందంగా వివరించారు. మరి అంతేకాకుండా

"నాలుకమీద నర్తించి
కీర్తికిరీటాన్ని అలంకరిస్తుంది!
పుస్తకంగా / ప్రవహించి
మానవ మనుగడకు / శాశ్వత రూపమిస్తుంది
శబ్దంపై / నిశ్శబ్దంగా జరిగేదాడిని
శబ్దం సహించదు!"

(వికారి, పుటలు.32,33)

శబ్దం చాలా శక్తివంతమైనదని దానిని అంతం చేయడం అంత సులువు కాదని, అందుకు శబ్దం సుముఖంగా లేదని శబ్దంపై అద్భుత పద యుద్ధం చేసిన మాడభూషి సంపత్ కుమార్ గారి ప్రయత్నం అమోఘమైనది, అపురూపమైనది.

వివేకానంద చెప్పినట్లు నీ దృష్టిని బట్టే సృష్టి, ఎలా ఆలోచిస్తావు అలానే మీ మానసిక స్థితి ఉంటుందని అలానే మాడభూషి సంపత్ కుమార్ గారు కూడా వారి కవితలో ఇలా అంటున్నారు.

"నీకు / నువ్వే శత్రువు
మానసిక పరిపక్వత లేనివాళ్ళకు
ప్రపంచమంతా
శత్రుసమూహంలా కనిపిస్తుంది
ఆత్మశుద్ధిలేనివాళ్ళకు
అంతరాత్మే పెద్ద శత్రువు"

(వికారి, పుట.34)

అసలైన సత్యాన్ని ఎంతో అందంగా నాలుగు వాక్యాలలో నాలుగు వేదాల సారాన్నికొని అందులో పెట్టినట్లు ఉంది. శత్రువైన మిత్రువైన నీలోనే ఉంది. నువ్వు ఎలా భావిస్తే అదే బాట అవుతుంది. నవ్వు ఎలా చూస్తే అదే ప్రపంచం అవుతుంది. రియల్ ట్రూత్‌ను బద్దలు కొట్టారు ఈ కవిత మన మాడభూషి సంపత్ కుమార్‌గారు.

'మరణశాసనం' అనే కవితలో వీరు బుద్ధుడు చెప్పినట్లు అప్పో దీపో భవ నీ దీపాన్ని నువ్వే వెలిగించుకో నిన్ను ఉత్తర్ ఉంచుకో భగవద్గీతలోని సారాంశాన్ని ఈ కవితలో కవి కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరించారు.

"నా మరణానికి / ఎవరూ కారకులు కారు
నా పుట్టుకే కారణం / జాతస్య మరణం ధ్రువం!"

(వికారి, పుట.35)

భగవద్గీత సారాంశం అంతా ఈ కవితలో ఉంటుంది. అంతేకాకుండా మరణానికి కారణాలు వెదక కూడదు. నీ మరణానికి నీ పుట్టుకు కారణం అంటున్నారు మాడభూషి సంపత్ కుమార్ గారు. కారణాలు వెతికి కలత చెందకు సాక్షిగా ఉండు తుదివరకు అంటున్నారు. తెలుగు మాటకు పాట వేస్తున్న రథసారధి మాడభూషి సంపత్ కుమార్ గారు.

'చెక్కు చెదరని నవ్వు' అనే కవితలో మనిషి ఎన్ని రకాలుగా నవ్వును ప్రదర్శిస్తారో పైకి ఎంత చక్కగా నటిస్తారో అనే విషయాన్ని కవి ఎంత చక్కగా వివరిస్తారో ఈ కవితలో.

"అంతా సజావుగా / నడుస్తున్నట్లు
నటిస్తూ / చెక్కుచెదరని

అదే చిరునవ్వుతో పలకరింపు!"

(వికారి, పుట.37)

మనసులో ఎన్ని వికారాలు ఉన్నా పైకి మాత్రం నవ్వుతూ ముఖాన్ని ఉంచుతారు అన్న విషయాన్ని వివరిస్తారు ఈ కవితలో కవి.

'గొప్ప' అనే కవితలో కవి వెటకారంగా వ్యంగ్యంగా మనస్సులోని ఆవేదనను అక్షరాలలో నింపారు.

"మరణంలేని / సమాజంకన్నా
మానవత్వంలేని/ సమాజం గొప్పదికాదు!"

(వికారి, పుట.40)

అంటూ పరోపకారం లేని మనిషి పరుగులు పరుగులు స్వార్థంతో కూడిన సాంగత్యలు సహాయం చేయగల అవకాశం ఉన్న చేయకుండా హృదయమంతా కల్మషంతో నింపుకుని పైకి నటిస్తున్న మనిషి మనుగడను ప్రశ్నిస్తారు కవి మాడభూషి సంపత్ కుమార్ గారు.

ఇవాళ అందరం హాయిగా ఉన్నామంటే అందుకు కారణం చలిని లెక్కచేయకుండా ఐన వాళ్లకు దూరంగా ఏ ఫలితం ఆశించకుండా భయమెరుగని వీరుడిలా శత్రువు గుండెలను చీల్చే గునపంలా రేయి పగళ్ళు రెప్పార్చకుండా మరణ భయం లేని సైనికుని గురించి ఎంత గొప్పగా వివరించారో అంటే ఈ మరణం అనే కవితలో మాటల్లేవు అంత అద్భుతంగా చెప్పారు.

"దేశంకోసం / అతను పొందే మరణం
మరణం కాదు త్యాగం / అతణ్ణి మరణం అంటదు!"

(వికారి, పుట.42)

సైనికుడు చేసే త్యాగాన్ని కవి ఈ కవితలో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. మరణం లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది సైనికుడే అని నిగ్గు తేల్చి చెబుతున్నారు ఈ కవితలో కవి మాడభూషి సంపత్ కుమార్ గారు.

'రెండంచుల కత్తి' కవిత చదువుతున్నంత సేపు మనసు ఒక రకమైన ఆందోళనకు గురి అవుతుంది. ఈ కవితలో కవి రాసిన ప్రతి అక్షరం అక్షరసత్యంగా నేటి మనిషికి సాక్షిగా నిలుస్తుంది. మనిషి మనసులో ఉన్న కుళ్ళు, కుతంత్రం, స్వార్థం, ద్వేషం, అసూయ, ఈర్ష వంటి అర్వద్ వర్గాలు అన్ని కలపోసుకుని అశాంతితో గడుపుతున్న మనిషి మానసిక స్థితిని గురించి ఈ కవితలో అద్భుతంగా వివరించారు. మనసు చేసే మాయలో మనిషి బలి అయి నిజాన్ని అబద్ధంగా అబద్ధాన్ని నిజంగా అటూ ఇటూ మార్చి మార్చి ఏది తనకు మేలు చేస్తుందో అటువైపు తిరుగుతూ నీచమైన ధోరణిలో నడక సాగిస్తున్న మనిషి మానసిక స్థితిని గురించి చెబుతారు.

"జీవితం మీద మమకారంతో
రెండు కళ్ళు / రెండు కాళ్ళు
రెండు చేతులు / రెండు చెవులలాగే
రెండు నాల్కలతో / రెండు మనసులతో
రెండు రకాల జీవితాన్ని / రెండంచుల కత్తి
రెండు వైపులా కోస్తుంది / అవతలివాళ్లేకాదు
మనల్ని కూడా"

(వికారి, పుటలు.47,48)

అంటూ మనిషి ప్రవర్తన గురించి ఈ కవితలో ప్రకటిస్తారు.

'ప్రకృతి' అనే కవితలో కవి ఇలా అంటున్నారు. ప్రకృతిలో ఉన్న అన్ని ఒకదానితో ఒకటి విశ్వాసంతో మెలుగుతూ ఉంటే మనిషి అనే కాలుష్యం చేత ప్రకృతి పాడవుతుందని ఆందోళనను ఈ కవితలో కవి వ్యక్తపరుస్తారు. అందుకు నిదర్శనం నేడు మనం చూస్తున్న కరులాంటి మొహం వ్యాధులు రావడానికి కారణం అనడంలో అతిశయోక్తి లేదు. ప్రకృతి మాత పచ్చగా ఉన్నంతకాలం మనిషి సజావుగా సమాజంలో బతకగలడు. ప్రకృతిమాత కోపగిస్తే నేడు జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలిసినవే కదూ ఇదే అంటున్నారు కవి ఈ కవితలో.

"అన్నీ ఒకదానితో ఒకటి
విశ్వాసంగా ఉన్నంతకాలం
నిశ్వాసానికి కొరత లేదు

మనిషి / అనే ఒకే ఒక
బొట్టు అనే కాలుష్యం
వీటితో కలిసి / ప్రకృతి ప్రశ్నార్థకమైంది"

(వికారి, పుట.50)

ప్రకృతికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ప్రకృతి సంరక్షణ మనందరి సురక్షణ అంటున్నారు.

'సేవ' అనే కవితలో సేవకుల గురించి సోషల్ వర్కర్స్ గురించి సూర్య చంద్రులతో పోలుస్తూ అలుపెరుగని నిరంతర కర్మ యోధులుగా చెప్పారు.

"ఇతరులకు / సేవచేసే వాళ్ళకు
నిద్ర ఉండదు / 'నిలకడ' ఉండదు"

అంటారు. సేవే లక్ష్యంగా పని చేస్తారు. పరోపకారమే పరమాత్మగా భావించి పాదం కదిపి పవళించిన ప్రయత్నిస్తూనే ఉంటారని కవి ఎంతో చక్కగా ఈ కవితలో సేవ చేసే వాళ్ల గురించి తెలియజేశారు.

భయం అనేది మనిషికి అతి పెద్ద రోగం. అదే అన్ని సమస్యలకు మూలం. భయం ఉండడం వలన ఏ పని చేయలేక బద్ధకస్తులై బ్రతుకుతున్న బలహీన జీవితాలు ఎన్నో ఉన్నాయి. భయాన్ని జయిస్తే విజయం లభిస్తుంది అంటున్నారు కవి ఈ 'భయం' అనే కవితలో.

"భయం / భయపెడుతూనే ఉంటుంది
దాన్ని మోసినంత కాలం!
ఒకసారి / భయపెట్టి చూస్తేచాలు
జీవితాంతం / భయపడుతూనే ఉంటుంది"

అంటున్నారు. పువ్వులు పరిమళిస్తూ రాలిపోతాయి. ఆకులు గాలి చేసే ఊసులకు రాలిపోతాయి. పండ్లు పరిపక్వం చెంది రాలిపోతాయి. ఇలా ఉపమానాలు చెబుతూ మనిషి ఎందుకు ఏడుస్తాడు అన్న విషయాన్ని చెబుతూ ఈ 'ఏడుపు' అనే కవితను ముగిస్తారు కవి మాడభూషి సంపత్ కుమార్ గారు.

"మనిషి / చావడానికి
ఎందుకు ఏడుస్తాడు?
జీవితకాలంలో
ఎవరికీ ఉపయోగపడలేకపోయామే- అని కావచ్చు"

(వికారి, పుట.53)

అని చెబుతూ పరోపకారమే పరమావధిగా సూచిస్తారు. పక్కవాళ్లకు సహాయపడాలి అన్నా మహాభారత గ్రంథకర్త అయినా వ్యాస మహర్షి గారి మార్గంలో పరోపకారం పుణ్యం పాపాయ పరీపడనం అన్న భావానికి ప్రతినిధులు కావాలని, అలా అయినప్పుడు ఏడుపు ఉండదని మరణం భయం చేయించగలరని కవి అభిప్రాయపడతారు.

'చీకటి' అనే కవితలో కవి మాడభూషి సంపత్ కుమార్ గారు గొప్ప సత్యాన్ని చెబుతారు. న భూతో న భవిష్యతి అన్నట్టుగా ఏది చూస్తే అదే కనిపిస్తుంది. నీ దృష్టిని బట్టే దృశ్యం అంటారు. ఈ కవితలో ప్రతి మనిషికి నీడ ఉన్నట్లే వెలుతురు ఉంటుంది. అదే విషయాన్ని ఈ కవితలో చెబుతారు.

"వెలుగును వెతికేవారు
వెలుగుతారు / చీకటిని
చూసే కళ్ళకు
చిమ్మచీకట్లు కనిపిస్తాయి!"

(వికారి, పుట.54)

అంటారు వీరి దృష్టి కోణం ఏ పాటిదో అర్థం అవుతుంది. ఓ ద్రష్టలా ఈ వికారి కవిత్వాన్ని సృష్టిస్తారు. సంఘంలో సంచరించి సమాజ శ్రేయస్సు కాంక్షించి స్పూచర్ ఇలా తిరుగుతూ తీర్చిదిద్దిన మహోన్నతమైన కవిత్వమే ఈ వికారి కవిత్వం.

'గుణపాఠం' అనే కవితలో ప్రకృతి ఒడిలో పుట్టి ఒడిలో ఒదిగే మనిషికి ఎన్ని పాఠాలు ఎన్నో గొప్ప సత్యాలు నేర్పిస్తుంది. ఆరు ఋతువులలోని అంతర్లీనమైన సత్యాలని నేర్పిస్తున్న ప్రకృతిమాత గొప్పతనాన్ని చెబుతారు. అంతేకాక మనిషికి కష్టసుఖాలు అన్నవి సర్వ సాధారణమైనవి. వాటిని అధిగమిస్తూ సాక్షిగా కదలడం మనిషి పని అని అందుకు ఉదాహరణ ప్రకృతిలోని ఆరు ఋతువులు నిదర్శనమని ఈ కవితలో చెబుతారు.

"నువ్వు జీవితంలో ఏం పాఠాలు నేర్చుకొంటావు
ప్రకృతి నేర్పించడానికి తప్ప
శిక్షించడానికి లేదు
నువ్వు మరీ మొండికేస్తే తప్ప
బెత్తం పట్టుకొని
గుణపాఠాలు నేర్పదు!"

(వికారి, పుట.55)

నేడు మనం చూస్తున్నాము మన జీవితాలని అతలా కుతలం చేస్తున్న నాలాంటి మహమ్మారి రోగాలు వ్యాపించ డానికి ప్రకృతికి వ్యతిరేకంగా మనం చేస్తున్నది అందుకు నిదర్శనం ప్రకృతిని కలుషితం చేసే వికృతిని సృష్టిస్తున్న నేటి మనిషికి ప్రకృతి నేర్పిస్తున్న గొప్ప గుణపాఠం కరోనా అని కవి తెలియజేస్తున్నారు.

ఈ 'వికారి' కవితా సంకలనంలోని కవి ఒకదానికి మించి మరొకటి అన్నట్టుగా 'వికారి' అనే వికారాలతో ఉన్న మనిషి శిల్పాన్ని చెక్కుతారు కవి. వి.ఎ.కె ఎక్కడ లేనిది కల్పించి రాయలేదు అంతా ఉన్నది ఉన్నట్లు వాస్తవాన్ని మాత్రమే రాసి ధైర్యంగా భావ ప్రకటన చేసిన దిశాలి ప్రజ్ఞాశాలి కవి మాడభూషి సంపత్ కుమార్ గారు. వీరు రాసిన మరో కవిత 'చింతన' ఈ కవితలో మనిషి యాతన గురించి యథార్థంగా చిత్రీకరించారు. జీవితం పట్ల చింతన లేని వాడికి చింతలు తప్పవంటున్నారు. అత్యాశకు అడ్డుకట్ట వేయమంటారు. భూమి మీద నిలబడి నడవ మంటారు. బద్ధకస్తుల మానసిక స్థితిని వివరిస్తారు. సంతోషాన్ని సుఖంలో వెతికే వానికి పని విలువ తెలియదు అంటారు. సరైన స్పష్టత లేని వాడికి ప్రతిదీ అస్పష్టంగానే కనిపిస్తుందని, ఏ సిద్ధాంతం లేనివాడికి ప్రతిదీ రాద్ధాంతంగా కనిపిస్తుందని తెలియజేస్తారు.

'విసర్జన' అనే కవితలో ఆయా పని అనగా పాకీ పని చేసే వారి గురించి ఎంతో గొప్పగా చెబుతారు.

"ఎవడి విసర్జన
వాడికే అసహ్యం
ఎవడిదో విసర్జన
అసహ్యించుకోకుండా
శుభ్రం చేసి
వాణ్ణి సంతోష పెట్టాలి"(వికారి, పుట.57)

ఈ మాటలు చదువుతుంటే ఎంతకీ మానవత్వం ఉంటే అంత గొప్పగా అంతే శ్రద్ధగా మానవ సేవే మాధవ సేవ అన్న త్రోవలో నడుస్తున్న ఆ స్త్రీ మూర్తులకు ఎన్ని దండాలు పెట్టినా తక్కువే అంటారు. వాళ్లని తల్లితో పోలుస్తారు. అంతేకాకుండా కవి ఇలా ప్రశ్నిస్తారు. అది శిక్షలేని ఉద్యోగం పేరుతో ఏమార్చడమా? వారిని ఎలా వాడుకున్న వారు చేస్తున్న పని పవిత్రమైనది. ఆ పని చేయాలంటే పరిపక్వత కావాలి అంటారు కవి మాడభూషి సంపత్ కుమార్ గారు.

అలాగే 'అభినందన' అనే కవితలో మరొకసారి దేశ భక్తినీ చాటుతున్న సైనికుల సాహస కృత్యాలను ఎంతో చక్కగా వివరిస్తారు.

రైతు ఆత్మ కథలో తానే రైతుల మారి రైతు పడుతున్న వేదనను చెబుతారు.

"కోటీశ్వరుడు
కోట్ల నోట్లకట్టల మీద పడుకున్నట్టు
రైతు మట్టి మీద పడుకుని మురిసిపోతాడు!"

(వికారి, పుట.60)

ఎన్ని సమస్యలు చుట్టు ముట్టిన నేల తల్లిని ముద్దా డుతూ ప్రకృతి కన్న కొడుకులా రైతు మట్టి కోసం తన గాయాన్ని త్యాగం చేస్తాడు.

"పొలమే వాడికి కాయితం-
కష్టమే వాడికి జీవితం-
కలానికి బదులు వాడు నాగలిని ఉపయోగిస్తాడు
కవులకు కావ్యం కన్యక అయితే
రైతుకు కావ్యం తల్లి"

(వికారి, పుట.60)

అంటూ రైతు ఆత్మ కథలో రైతు యొక్క స్వభావాన్ని అక్షర రూపంలో నిక్షిప్తం చేస్తారు.

'అద్దం' గురించి రాస్తూ అద్దం మనకు ప్రతిబింబం. అలాంటిది అక్కడ ఎవడికి వాడే అందగాడుగా ప్రకటించుకుంటాడు. అదే అందరిలో ఉన్నప్పుడు అతని స్వరూపం ఏమిటో తెలుసుకోమంటారు.

'యుద్ధం' అనే కవితలో యుద్ధం వల్ల కొందరికి వచ్చే ప్రయోజనాల గురించి వారి మానసిక స్థితిని గురించి వివరిస్తారు. యుద్ధం వల్ల రాజకీయ నాయకులకు వచ్చే ప్రయోజనం, వ్యాపారులకు వచ్చే ప్రయోజనం, మీడియా వాళ్లకు వచ్చే ప్రయోజనం అంతా ఇంతా కాదు. యుద్ధం అనే ప్రకటనతో ఇక అనేక చర్చలు మొదలవుతాయి. దేశంలో సామాన్యుడి నుంచి ప్రధాని వరకు ఇదే చర్చ కొనసాగుతూ ఉంటుంది అంటారు. ఈ 'యుద్ధం' అనే కవితలో కవి వర్షం పడకపోయినా ఉరుములు మెరుపులుతో మనిషి వర్షం వస్తుందేమో అని భయంతో పరుగులు తీసినట్లు యుద్ధం అని ప్రకటించగానే ఎదుటి వానికి భయం ఉంటుందని అంటారు. ఈ 'యుద్ధం' అనే కవితలో మరొకసారి ఈ పాలకుల విశ్వరూపాన్ని వారి అరాచకత్వాన్ని వాళ్ల నీచమైన ఆలోచనలు అన్నీ ఈ కవితలో ఎంతో గొప్పగా చిత్రీకరిస్తారు.

"యుద్ధం అంటే
పాలకులకు చలికాచుకోవడమే
ఎవడో పెళ్ళాం పిల్లల్ని వదిలేసి
మంచుగడ్డపై నిలబడి
దేశం కోసం వణుకుతూ ఉంటాడు
వాడి ప్రాణంపోతే
వీడు త్యాగం చేసినట్లు విర్రవీగుతాడు
వాడు విజయం సాధిస్తే
వీడు పోరాడి గెలిచినట్టు మీసం మెలివేస్తాడు
ఏం జరిగినా / యుద్ధంవల్ల లాభమే"

రాజకీయ నాయకులు నీచత్వాన్ని ఎండబెడతారు అని ఈ 'యుద్ధం' అనే కవితలో మాడభూషి సంపత్ కుమార్ గారు వివరిస్తారు.

'అభయం' అనే కవితలో అడుగు వేసే అంత వరకే భయం. ఆ తరువాత భయం ఉండదని అది అభయంగా మారుతుందని చెబుతారు. ఆత్మవిశ్వాసంతో చేసే ప్రతి పని దిగ్విజయంగా నెరవేరి అభయాన్ని ఇస్తుందని తెలియజేస్తారు.

"భయంతో పనిచేస్తే
ఫలితాలు భిన్నంగా ఉంటాయి
భయంతో పనిచేయడం మానేస్తే
ఫలితాలు చిన్నాభిన్నంగా ఉంటాయి"

(వికారి, పుట.69)

ఒక పని చెయ్యాలని తలచినప్పుడు ఆ పని పట్ల శ్రద్ధ ఉన్నప్పుడు భయం భయంగా మారుతుందని చెబుతున్నారు.

'వికారి' కవితా సంకలనంలో చిట్ట చివరి కవిత 'కుక్కలుంటాయి జాగ్రత్త' చిత్త కార్తే కుక్కలు చిత్త దాంచల్యంతో తిరుగుతూ ఉంటాయి. అంటూ ఆడ తల్లులకు చెబుతున్నారు. తండ్రిలా స్నేహితుడిలా మగ మృగం ఏదైనా నిన్ను ముట్టడించవచ్చు పోకిరీలు, రౌడీలు శత్రువులే కానవసరం లేదు. మిత్రులు, తండ్రులు, అన్న దమ్ములు, ఆఫీసర్లు, భూస్వాములు, ధనికులు, దారిద్రం కల వాళ్ళు ఎవరైనా ఉండవచ్చు. శునకావేశంతో తిరుగుతూ ఉంటారు. తస్మాత్ జాగ్రత్త. వీరు ఎవరిని వదలరు. పసికందు నుంచి పండు ముసలి వరకూ వారి పైశాచిక కృత్యానికి బలి అవ్వాలి. అంత నీచమైన కామ మృగాలు అంటారు. బయటకు వెళ్లే ఆడబిడ్డకు ఆత్మ రక్షణ లేని సమాజంలో స్త్రీకి స్వతంత్రమే లేదా కామాంధుల చేతుల్లో కాళి బూడిద కావాల్సిందేనా ఇంకా ఎన్ని రోజులు ఇలా మానభంగానికి మహిళా మారుపేరా అంటూ ఎంతో ఆవేశంతో ప్రశ్నిస్తూ నిలదీస్తూ ఆడబిడ్డకు తండ్రిలా స్నేహితునిల చిత్త కార్తే కుక్కలు ఉంటాయి. తస్మాత్ జాగ్రత్త అంటున్నారు మాడభూషి సంపత్ కుమార్ గారు.

ఈ 'వికారి' కవితా సంకలనాన్ని వారి ముద్దుల

మనవడు అయినా మాడభూషి సమర్థకి అంకితం ఇవ్వడంలో అంతరార్థం వారికి పిల్లల పట్ల ఉన్న ప్రేమ మమకారమే కారణం. పిల్లలు అంటే వారికి చాలా ఇష్టం అన్న విషయం యన్.టి.ఆర్.తన అవుతుంది. 'వికారి' కవిత్వాన్ని ముందు మాట రాసిన ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు గారు 'వికారి' కవిత్వాన్ని సృష్టించిన మాడభూషి సంపత్ కుమార్ గారిని 'ఆనంద విహారి' అనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. వారు రాసిన ముందుమాట వెలుగుబాటగా చూపింది. వికారాలతో ఉన్న సమాజ గౌరవాన్ని 'వికారి' అనే తెలుగు సంవత్సరం పేరు పెట్టి సంఘంలో ఉన్న వికారాలనన్నిటిని కళ్లకు కట్టినట్లు చిత్రీకరిస్తారు. సంఘ సంచారై సమాజం యొక్క తీరుతెన్నులను, మనిషి యొక్క మనుగడను ఈ 'వికారి' కవిత్వం ద్వారా చెప్పడం జరిగింది.

ఆధార గ్రంథం :

1. వికారి - మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

చదువులందున సురగురు సములు మీరు
సహన శాంతుల మహికన్న జాల మేలు
నిత్య కవితాను రక్తితో నిలచి వెలుగు
సంపదా చార్య వరేణ్యా! సన్నుతింతు

- డాక్టర్ కప్పగంతుల మధుసూదన్

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'ఆ'లోచనలు - వస్తుతత్త్వం

- డాక్టర్ జి. శైలమ్మ, సహాయ ఆచార్యులు, ప్రసారంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

'కవిత్వం' కొంత మందికి పుట్టుకతో వస్తుంది. కోయిల కంఠంలా వినసొంపుగా వుంటుంది. 15వ శతాబ్దానికి చెందిన పోతన గారిని ఎవరూ ప్రోత్సహించలేదు. ఆర్థిక సహకారమూ అందించలేదు. కలాన్ని చేతపట్టి తనకిష్టమైన భగవంతుని స్మరిస్తూ వ్యాసమహర్షి సంస్కృతంలో రాసిన భాగవతాన్ని ఆంధ్రీకరించి తెలుగు వారి మన్ననలు పొందిన పోతన వలె, తమిళనాడులో వుంటున్నా ఆంధ్ర పట్ల వున్న అభిమానం, దేశ జనులపట్లున్న మమకారం చెప్పడం మాత్రమే చేసి వూరుకోలేదు. ఆలోచనలు మెరీనా బీచ్, అలల సవ్వడులై 'ఆ'లోచనలు పేర మనముందు ప్రత్యక్షమైంది.

మాడభూషి గారు స్వతహాగా మితభాషి, అపార జ్ఞాన సంపన్నుడు, విద్యార్థులకు మంచి మార్గాన్ని చూపే అధ్యాపకుడిగా, నదన్నుల సంచాలకులుగా పత్ర సమర్పకులకు చిన్నాడాబు ఖర్చు కానీయక ఆత్మీయతాను రాగాల పలకరింపుతో మంచి విందు భోజనాలు పెట్టి శాలువాలు కప్పి, దారి ఖర్చుకి ప్రయాణపు అలసట తెలియకుండా చేసేలా మంచి పుస్తకాలిచ్చి, ప్రయాణపు ఖర్చును భరించి అతిథులను సర్వ సంపూర్ణ సంతుష్టలను చేసిన మాడభూషిగారు మద్రాసు విశ్వవిద్యాలయంలో పని చేయడం తెలుగు వారు చేసుకొన్న పుణ్య భాగ్యఫలం. తను సమాజంలో చూసిన ఆర్థిక, విద్య, రాజకీయం, పేదరికం, ధనికస్వామ్యం, కుల, మత కలహాలు మొదలై నవి. అన్నిటిని గురజాడ ముత్యాల వంటి ఆలోచనలను ఒక దండగా గుచ్చి సమాజానికి చైతన్య కెరటమోలే 19వ శతాబ్దంలో ఒక ప్రభంజనం సృష్టిస్తే 21వ శతాబ్దంలో తనదైన శైలిలో సమాజహితాన్ని కోరి ప్రజలకు తొందరగా అర్థమయ్యేలా హైకూ, మినీ కవితా ప్రక్రియలను ఎంచుకొన్న సంపత్‌గారి గొప్ప ఆలోచనల రూపశిల్పమే 'ఆ'లోచనలు.

మనస్సుకు తొడుగు మనిషి
మనిషికి ఉడుపు జగతి
ఇదే విశ్వంభరా తత్త్వం
ఇదే అనంత జీవిత సత్యం"

సి.నా.రె. ఇప్పుడు లేడు. ఆయన చెప్పిన ఈ మాట మాత్రం వాస్తవం. మనిషికి ఈ మనస్సు అనేది లేకపోతే పిచ్చోడే కదా. మనస్సులో పూచిన పూలను గుచ్చి మాడ భూషిగారు 'ఆలోచనలు' పేర ముద్రించారు. ఈ గ్రంథాన్ని పరిశీలించినప్పుడు కవితా ప్రక్రియలు తెలుగు సాహిత్యాభి మానులకు సుపరిచితమే. "అవయవాలు చస్తాయి గానీ ఆలోచనలు చావవు" అన్న సినారె ఈ కవితా సంపుటి ద్వారా ప్రతిఫలిస్తాయి. సంపత్ గారు 'మినీ కవితా' మార్గాన్ని ఎంచుకొని కవితలు రాయడానికి కారణం లేకపోలేదు. కవితను సుదీర్ఘంగా రాస్తే చదివిన పాఠకుడు త్వరగా అర్థం చేసుకొని తన జీవితానికి అన్వయించు కోలేడు. కనుక ఆధునిక కాలంలో అద్దేపల్లి రామమోహన రావు, రావిరంగారావు గారు, కొల్లూరి ప్రభృతులు మినీ కవిత్వాన్ని ఉద్యమ స్థాయిలో ప్రచారం చేశారు. దీని ఫలితమే ఆలోచనలు. పత్రికల్లో ఒక రచన ప్రచురణ కావాలంటే ఆ రచనకు ఎంత స్థలం ఆక్రమిస్తుందో పరిగణనలోకి తీసుకొంటారు.

అనల్పార్థాన్ని అల్పాక్షరాలలో కూర్చి చెప్పేవాడు కవి. ఈ కవితా సంపుటిని పరిశీలిస్తే మాడభూషి సంపత్ గారు అపార పండిత కవిత్వ భావ జాలానికి ప్రతిరూపం.

దేశభక్తి :

దేశాభివృద్ధికోసం పాటుపడే వారిలో కవి ఒకరు. తన రచనల ద్వారా ప్రజలకు మంచి సందేశాన్ని అందించి ప్రజలందరిని దేశాభివృద్ధివైపు మరలించవచ్చు. మాడభూషి గారికి దేశంపట్ల వున్న భక్తి భావన కవిత్వంలో ప్రతి

ఫలించింది. జెండా సాక్షిగా అన్న కవితను పరిశీలిస్తే భారతదేశం బ్రిటీషు వారి ఉక్కు పిడికిలి బిగించి పాలించిన కాలంలో భారతీయులు చేసిన తిరుగుబాటు బ్రిటీషు వారు తీసుకొచ్చిన చట్టాలు మొదలైన విషయాలపట్ల కొంచమైనా అవగాహన వుంటే తప్ప ఈ కవిత్వం అర్థం కాదు.

తిరగబడిన "జనం" - భారతీయులందరు తిరుగుబాటు చేస్తేనే స్వాతంత్ర్యం వచ్చింది. ఇక్కడ రెండు క్రియా పదాలను ప్రయోగించడం వలన కవిత్వానికి ప్రాణం వచ్చిందనుటలో సందేహం లేదు. తిరగబడు, విరగబడు - ఇలాంటి ప్రాసాత్మక క్రియాపదాలు శ్రీశ్రీ కవిత్వంలో దొరికినట్లు మాడభూషి సంపత్ గారి కవిత్వంలో దొరుకుతాయి. ఈ కవితలు పలురకాల సంఘటనలు కవిత్వీకరించి, దానిని ఆధారంగా సంవత్సరాన్ని, నెలను, తేదీని తెలియజేశారు.

భారతదేశాన్ని సరిహద్దు సమస్య వేధిస్తుంది. భారత దేశానికి ఉత్తరంగా పాకిస్థాన్ వుంది. మిత్ర దేశంగా వుంటే ఇరుదేశాలకు మంచిదే. పాకిస్థాన్‌లో మారణాయుధాలు భారతీయులను ఏ క్షణమైనా అంతమొందించవచ్చు. అందుకే అగ్రరాజ్యమైన అమెరికాతో పొత్తు కుదుర్చుకోడం భారతీయులకు మంచిదని అందుకవనరవ్వైన రాయబారాలను గుర్తు చేశారు.

చర్చలు చర్చలే
కాల్పులు కాల్పులే
భారత్ పాక్ మిత్రభేదం!
భారత్ - పాక్ మైత్రికి
అమెరికా అండదండలు
శ్రీకృష్ణరాయబారం!

దేశాల మధ్య ఐక్యత మానవుని ఉనికిని కాపాడుకోడానికి అవసరమని తెలియజేస్తారు. దాయాది దేశం పాకిస్తాన్. ఎప్పుడు భారతదేశానికి ప్రమాదం పొంచివుందని చెప్పడానికి అనేక మార్లు పాకిస్తాన్ భారతదేశ సరిహద్దుల్లో యుద్ధాలు జరగడమే ఇందుకు నిదర్శనం.

"అసలే దాయాదులు
పై అమెరికా
భారత్ - పాక్ సంబంధాలు!

(పుట : 34)

అమెరికా ప్రపంచ దేశాలను శాసిస్తుంది. కాబట్టి పాకిస్తాన్ భారతదేశంతో సన్నిహితంగా వుండకపోతే అమెరికా దేశం అంతం చేస్తుంది. ఈ కాలంలో భారతదేశానికి అనేక మంది రాయబారులు వచ్చారు. అందుకే బ్రిటీషురాణి డయానా గురించి కవి స్మరించారు.

ఆమె ప్రపంచం గురించి బాధపడింది.
ఆమె గురించి ప్రపంచం బాధపడింది
మదర్ డయానా! (పుట:24)
అని అంటే మరోచోట
సూర్యుడస్తమించని సామ్రాజ్యం
వెలుగు చూడని రాణివాసం
కాంతిపుంజం డయానా! (పుట:23)

మధర్ థెరిస్సా మనదేశానికొచ్చిన (యుగోస్లేవియా) తల్లి. ఎంతోమంది తల్లి లేనివారికి పేదవాళ్లకి తల్లిగా రుణం తీర్చుకొంది. ఆమె సేవను మాడభూషి సంపత్‌గారు విషాదాశ్రు తుషారాలు! పేర తెలియజేశారు.

మనుషులకే కాదు
మానవత్వానికీ మరణమా?
విశ్వమాత మదర్!

ఆమె మరణాన్ని జీర్ణించుకోలేని వారు విలపించారు. వారిలో ఒకరు మాడభూషి సంపత్ గారు

ప్రపంచం తల్లిలేక
తల్లడిల్లిపోతోంది
మదర్ థెరిసా! (పుట:21)

పూర్వకవుల స్తుతి - కవిత్వం :

కాళిదాసు మహాకవి. ఈయన అనేక రచనలు చేశాడు. ప్రచురణ చేయడానికి ముద్రణామాద్యమాలు అందుబాటులో లేవు. తనురాసి పెట్టిన కావ్యాలు కాలంతోపాటు చిరుగు పడుతాయి. ఎలుకలు కొట్టేసే అవకాశం వుంది.

కాళిదాసు ఇంట్లో
కావ్యాలు పొడి అయిపోయాయి
పాండిత్యం గడించిన ఎలుకలు (పుట:31)

కాళిదాసు సంస్కృతంలో మహాకవి ఈయన రచనలు కొన్ని అలభ్యం అయ్యాయి. కారణం ఎలుకలు తినడం ఒక కారణంగా చెప్పడం అవి వున్నట్లయితే తెలుగు సాహిత్యంలోకి అనువదించబడేవి. ఎలుకలు చేసిన నష్టాన్ని తెలియజేశారు.

కులం :

దేశంలో కులం అనేది ఒక రక్కసిలా ప్రజల మధ్య గొడవలను పెంచుతూ, ఒకర్ని ఒకరు చంపుకొంటూ వుండటంవల్ల వచ్చే నష్టం వారికేనని తెలియజేసే వాస్తవ కథనాన్ని కవి కవిత్వీకరించారు. మాలమాదిగలు అన్న దమ్ములా కలసి వుండి ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్లు పోగొట్టుకొనేలా వుంటున్న దళితుల నుద్దేశించి కలిసి మెలసి వుండండని హితోపదేశం చేశారు. కలిసుండకపోతే రిజర్వేషన్ల ఫలితం అనుభవించకుండాపోయే ప్రమాదం వుందని తెలియజేశారు.

దళితులూ దళితులూ రాసుకొంటే
రిజర్వేషన్లు రాలిపోతాయి
మాలమాదిగల హింసారిహింస!

దీనివల్ల ఫలితం అగ్రవర్ణస్తులకే వుంటుంది. నిజం తెలుసుకొని మసలండని దళితులను మేల్కొపుతాడు.

వాడకూ వాడకూ
మధ్య రగిలెను చిచ్చు
ఊళ్ళో ఆనంద బాష్పాలు! (పుట:42)

కుల కక్షలు, 'రక్త ప్రవాహసి' క్తం కావడానికి కారణం సమాజం. సమాజంలో అనేక రకాల కులాలకు చెందిన వారుంటారు. ఎవరి పని వారు చూసుకుంటే దానివల్ల వారికే నష్టముండదు. దీనికి భిన్నంగా నడుచుకుంటే నష్టపోయేది దళితులే. దళితుల్లో ఎవరో ఒకరు ఎదిరించే చురకత్తిలా విజృంభిస్తారని తెలియజేశారు.

నరికేసినకొమ్మ
కొడవలై మొలుస్తుంది
దళిత చైతన్యం! (పుట:27)

తెలుగుభాష :

తెలుగుభాషకు అనేకమంది పాశ్చాత్యులు, ప్రాచ్యులు విశేషమైన సాహిత్య సంపదను, వ్యాకరణ గ్రంథాలను రాసి వెలుగులోకి తెచ్చారు. మనదేశంలో రాజరికపాలనలో రాజులు పాలనను, తెలుగులోనే నడిపేరనటానికి శాతవాహనులు, గుప్తుల, ప్రబంధయుగ కాలపు నాటి రచనలే సాక్ష్యం.

అహో ఆంధ్రభోజా
శ్రీకృష్ణదేవరాయ
తెగులు పట్టిన తెలుగు! (పుట:20)

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కవి. ఈ కాలంలో అనేక రచనలు వెలువడ్డాయి.

స్త్రీలు - సమాజం :

సమాజంలో స్త్రీలు అనేక రకాలుగా మోసపోతూ వున్నారు. పుట్టినప్పటి నుండి మరణించే వరకు గృహ హింస. వీడని నీడలా ఎప్పుడు వెన్నంటి వుంటాయి. స్త్రీలకు పురుషునితో సమాన హక్కులు పొందాలని ఆకాశంలో సగం కావాలని పోరాటాలు. ఆకాశంలో ఏముంది. భాగం తీసుకుంటే ఏమన్నా ఆదాయం వుందా? లేదు కదా? ఆస్తిలో సమభాగం లేకుండా వుండటాన్ని అంబేద్కర్ గమనించాడు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన స్త్రీల ఆస్తి హక్కు బిల్లు పాస్ కాకుండానే పోయింది.

శూన్యంలో సగం
సంపదలో శూన్యం
స్త్రీలకు సమాన హక్కులు! (పుట:33)

ఆకాశంలో సగం ఎందుకు, ఆస్తిలో సగభాగమిస్తే వారి అభివృద్ధికి తోడ్పడిన వారమవుతామని అంటారు.

స్వాతంత్ర్యం వచ్చిందని జెండా పండుగలెన్ని చేసుకొన్నా స్త్రీలకు స్వాతంత్ర్యం రాలేదు. తరాల నుండి

ఇదే. పలురకాలుగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమెను పాతాళానికి అణచివేస్తున్నాయి. 1997లో సామూహిక అత్యాచారాలు ఇప్పుడు జరిగిన ప్రియాంకరెడ్డి హత్యల వరకు ఎంతమంది స్త్రీలు బలైపోయారో లెక్కలకందని దీనగాథలెన్నో...

అర్ధరాత్రి ఆడవాళ్ళ
ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం
సామూహిక అత్యాచారం!(పుట:35)

బాలలు :

నేటి బాలలే రేపటి పౌరులు వారిని సక్రమంగా పెంచితే దేశం ఉన్నతస్థానంలో వుంటుంది. బాలల్ని ఎదగనివ్వాలని బాల్యం గర్భంలోనే అంతమైతే, బాల్యం కర్మాగారాల చుట్టూ, వీధి కుక్కలతోపాటు ఇనుపముక్కల సేకరణలో మునిగిపోయింది.

దారాన్ని తెంచుకోడానికి
తనకలాడుతున్న పూలు
బాలకార్మికులు! (పుట:52)

పాలు తాగాల్సిన వయస్సులో పాలరుచి నెరుగక, పాలబుడ్డి పట్టుకోవాల్సిన వయస్సులో రాళ్లను కొడుతూ బండలను మోస్తూ శ్రమననుభవిస్తున్న బాలలు ఈ వ్యవస్థ నుండి బయట పడేయాలని కాంక్షిస్తున్నారు.

పూలను కాళ్ళకింద పడేసిందీ
మెడలో వేసిందీ మనిషే
నలిగిపోతున్న బాల్యం! (పుట:52)

ఇంత మాత్రమే కాదు బయట ప్రపంచాన్ని చూడాలన్న ఆశ వున్న గర్భస్థ శిశువు బాల్యంలోనే వాడిపోతున్నారని చింతిస్తారు.

మొగ్గలోనే తుంచేస్తున్నది
పూలనే కాదు పిల్లల్ని కూడా
భ్రూణహత్యలు! (పుట:52)

పిల్లలను ప్రాథమిక విద్యాభ్యాసం చేయించాలి. ఆ విద్య కిండర్ గార్డెన్‌లా వుండాలే తప్ప పిల్లల బాల్యం అణచి వేసేలా వుండకూడదనంటాడు.

పుట్టుకతోనే పిల్లలు
విద్యాభ్యాసం ప్రారంభం
'క్రష్' అయిపోతున్న బాల్యం! (పుట:36)

బాల్యానికి రెక్కల తొడగాలని, పుస్తకాలు మోసే బాలలు శిలువని మోసే బాలక్రీస్తులాగా వున్నారన్న కవి మాటలు గుర్తొస్తాయి.

బాల్యం ఒక్కోసారి వెక్కిరింతల పాలవుతుంది. అపురూపత, అమ్మ ఆదరణ, పొత్తిళ్లలో వెచ్చదనం, తల్లిపాలామృతం ఇవేమి పొందకుండానే కొంత మంది బాల్యంలోకి ప్రవేశిస్తారు. చెత్త కుప్పే తల్లిగా, కుక్కలు, పందులే తోబుట్టువులుగా, విసిరిపారేసే విస్తరాకులు తమపాలిట పంచభక్ష్యపరమాన్నాలుగా భావిస్తారు. వీరికి తల్లీతండ్రి ఎవరూ లేరని వారిపట్ల ఆదరణ చూపమంటారు.

ప్లాట్‌ఫామే తల్లి
చెత్తకుప్పే తండ్రి
అనాథ బాలలు! (పుట:5)

పిల్లలు సీతాకోక చిలుకలను పట్టుకోడంలో ఆనందిస్తారు. ఇదే పని పెద్దలు చేస్తున్నారని అంటాడు. పెద్దలు గాల్లో మేడలు కట్టి ఎగురుతుంటే పిల్లల్ని ఎవరు చూస్తారు. వారి గతి అధోగతే కదా!

సీతాకోక చిలకల కోసం
వెతుకుతున్న పిల్లలు
తల్లిదండ్రులదీ అదేబాట! (పుట:5)

బాల్యానికి అండగా తల్లితండ్రి నిలవాలన్న వాస్తవాన్ని గుర్తు చేశారు.

ప్రజలు - ఓట్లు :

ప్రజలు తమ ప్రతినిధిగా ఎన్నుకోడానికి 18 సంవత్సరాలు నిండినవాళ్ళు అర్హులు. వారికి మాత్రమే ప్రజాప్రతినిధిని ఎన్నుకొనే హక్కుంది.

రాజకీయ దొంగ ఓట్లేసే
రౌడీలు నాయకులవుతారు

50 ఏళ్ళ ప్రజాస్వామ్యం!

(పుట : 17)

ఓటు వేసిన వ్యక్తి పలుమార్లు ఒకరికే వేస్తే అవి దొంగ ఓట్లు. అలా వేయడంవల్ల రౌడీలు నాయకులవుతారే తప్ప ఓటుకు విలువ లేకుండా పోతుందని తెలియజేశారు.

రాజకీయ నాయకులను పాములతో పోల్చారు. పాము కాటేసి గాయపరుస్తుంది. అయినా నాగులచవితి నాడు పూజలు చేసి ఆరాధిస్తారు. పూజలు చేయడానికి బారులు తీరినట్టున్నారని ఓటేయడానికి బారులు తీరిన జనాన్ని ఉద్దేశించే రాజకీయ నాయకుల విషస్వభావాన్ని వివరించారు.

ఎన్నిసార్లు కాటేసినా
పాము ఆరాధ్య దైవమే
ఓట్లెయ్యడానికి బారులు తీరిన జనం!

(పుట:31)

ఓటు హక్కు అంటే కలిగి వుండటం. మంచి పాలనను అందించే మంచి నాయకుడ్ని ఎన్నుకొనే హక్కు ప్రజలకుంది. రాజకీయ ఉచ్చులో దీనికి విరుద్ధంగా హక్కుని దోపిడీ చేస్తున్నారని ఓటరు తెలుసుకోవాలని హెచ్చరిక జారీ చేశారు.

రాజకీయ నాయకుడు
ఓట్లు దోచుకు వెళుతున్నాడు
హరించుకుపోయిన హక్కు!

(పుట : 26)

దీన్ని గమనించిన వాళ్లు నిజమే అని అనకతప్పదు.

రాజకీయం :

దేశాన్ని పరిపాలించాలంటే రాజకీయమన్న రథాన్ని ఎక్కాలి. ఇందులో కార్యనిర్వహణ శాఖ, శాసనసభ, న్యాయం వుంటాయి. రాజకీయ నాయకులను ప్రజలు ఓట్లేసి గద్దెనెక్కిస్తారు. ఎన్నికలకు ముందు ఓటరుని హత్తుకోవడం, పదవి గెలుచుకొన్నాక ఓటరు మొహం చూడకపోవడం కనిపిస్తుందని ఓటరను జాగరూక పరుస్తాడు.

అధికారం అశాశ్వతం
ప్రజాసేవే పరమార్థం
ఎన్నికలు దగ్గర పడ్డట్టుంది!

(పుట : 43)

నక్కలు జానపద కథల్లో మోసం చేసే గుణం కలదిగా చెప్పుకోవడం అనవాయితీ. నక్క గుణాన్ని రాజకీయ నాయకులకి ఆపాధించారు నక్కలన్ని శాసనసభలో ఉన్నాయంటారు. అందువల్లె అడవిలో నక్కల జాడ లేదంటారు.

అడవంతా వెదికినా
ఒక నక్కా కనిపించలేదు
రాజధానిలో రాజకీయాల ఊళ!

(పుట:56)

అవకాశవాదం రాజకీయానికి మంచి పేరు తెస్తుందని పలురకాల రాజకీయ నాయకుల ప్రవర్తనలో ప్రతిఫలించింది.

అవకాశం
ఒక్కరికే ఉంటే
అవకాశవాదమే రాజీ ఫార్ములా! పు:57.

ఎన్నికలు రాజ్యాంగం ప్రకారం ప్రతి ఐదేళ్లకొకసారి వస్తాయి. ప్రతిపక్ష నాయకులు అధికారం పొందాలంటే మధ్యంతర ఎన్నికలు పెట్టాల్సిందే దీనిని బాహాటంగా తెలియజేశారు.

"అధికార దాహం
తీరడానికి మార్గాంతరం
మధ్యంతరం! (పుట:57)

ఇలా పలురకాల రాజకీయ ధోరణులు కవి గుర్తు చేస్తూ 1997, 1998 కాలంలో రాజకీయ నాయకులను,

మధ్యంతర ఎన్నికల ఫలితాలను వ్యక్తి, స్థలకాలాలనుబట్టి విమర్శించి పాఠకునికి సూటిగా అర్థమయ్యే టాబ్లెట్స్ అందించారు. రాజకీయరంగం దినదినం వృద్ధి చెందుతుంది. ఏదో చేస్తాం, ముందున్న పార్టీల్లో అవినీతిని తోడేస్తాం, ప్రజలకు అండగా నిలుస్తామని పలురకాల పార్టీలు ఏర్పాటు చేయడం, జెండాలు నాటడం వారి విగ్రహాలను వీధుల్లో నాటడం. దీనివల్ల ప్రజలకు ఏమి లాభం లేదంటారు.

చివరకు చెట్లకన్నా
జెండా కొమ్మలే ఎక్కువవుతాయి
నాయకుడికో పార్టీ! (పుట:47)

చెట్లుండాల్సిన చోట జెండాలుంటున్నాయి అని చెప్పడంలో రాజకీయరంగం ఒక సంపాదన రంగం కావడమన్నది సమాజంలో సర్వసాధారణమైందంటారు.

ముగింపు :

ఆలోచనలు నిజంగా సమాజానికి అద్దం వంటివే. దీన్ని రాజకీయ కోణంలోను, సామాజిక న్యాయ కోణంలోను, తాత్విక ధోరణిలోను, వాస్తవ సమాజ ధోరణిలో తర్కించుకొంటూ, పరస్పర సంబంధాలను మినీ కవితలో అందించడం. అవి పలురకాల వార్తాపత్రికల్లో ప్రచురితం కావడం ముదావహం. 'ఆ'లోచనలు మాడభూషి సంపత్‌గారిని ప్రౌఢకవిగా, సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ కలం యోధుడిగా అధికారబలాన్ని ప్రశ్నిస్తూ ప్రజల బాధ్యతను గుర్తు చేస్తున్న సకల సంపత్ సంకల్ప సిద్ధిగల లోచనాలకందిన సాక్ష్యాలను అక్షరబద్ధం చేసిన కవి ఆచార్య మాడభూషి సంపత్కుమార్ గారి ఆలోచనలు పాఠకుని ఆలోచింప చేసి ఆచరణలో తీసుకొంటారు అనుటలో సందేహం లేదు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డాక్టర్ మాడభూషి కవిత్వంలో స్త్రీవాద కోణం

- డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, రాజధాని కళాశాల, చెన్నై.

ఒక గొప్ప కవిత్వాన్ని చదివిన్నప్పుడో లేదా ఓ గొప్ప సంగీతాన్ని విన్నప్పుడో మన హృదయం బరువెక్కుతుంది. అనాలోచితంగా అశ్రువులు రాలిపడతాయి. కారణం శ్రోత మనస్సులో ఈ కవిత్వం కాని సంగీతంకాని ఏవో కొన్ని అనుభూతుల్ని కలిగిస్తాయి. ఆ అనుభూతుల వల్ల శ్రోత ఏదో ఒక లోకాన్ని విహరిస్తున్నట్లు ఆనందాన్ని పొందుతాడు. భౌతికంగా ఈ భూమండలంలో ఒక ప్రవాసాన్ని గడుపుతున్న స్థితిని అనుభవిస్తాడు. కాని వాస్తవంగా అతని హృదయం మాత్రం ఏవో దివ్యలోకాలను విహరిస్తున్నట్లు ఉవ్విళ్ళూరుతూ దైన్య స్థితిలో అచేతనంగా ఉండిపోతాడు. కనుక కవిత్వం సంగీతం అనాది నుండి అజరామరంగా మానవాళిని అలరిస్తున్నాయి.

ఏ కవికైనా ఏ సంగీతకారునికైనా తమదైన ఒక స్వంత బాణి ఉంటుంది. దీన్నే యాస అని, ముద్ర అని రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. అలాగే ప్రతి కవికి కవిత్వాన్ని వ్యక్తీకరించటంలో పలు రకాలుంటాయి. వస్తువు ఏదైనా కవి హృదయంలో మరిగి మరిగి ఆవిరై కవిత్వ రూపంలో అభివ్యక్త మవుతుందనడంలో డాక్టర్ మాడభూషి సంపత్కుమార్ గారి కవిత్వాన్ని ప్రమాణంగా తీసుకొవచ్చు. ఈ అంశాలను బలపరిచే ఉదాహరణలు శత్రువుతో ప్రయాణంలో పరిశీలించవచ్చు.

ఈ కవితా సంపుటిలో మొత్తం 36 కవితా గుళికలున్నాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించాలంటే అలంకారికులు పేర్కొన్న షట్‌త్రింశత్ కావ్యలక్షణాలను ప్రతిపాదించటమే. అక్షరాల వెంట అలుపెరగని ఆచార్యుని ఆలోచనలు మన జీవితాల్లో ఏ పార్శ్వాల మాటున దాగి ఉన్నాయో సరిచూసుకొవాలి. కవి వ్యక్త పరచిన భావాలను కాస్త నిదానంగా గమనిస్తే ఆత్మానందాన్ని పొందుతూ వీలైతే తప్పులను సరిదిద్దుకుని శేష జీవితాన్ని సాగించాలి.

సాధారణంగా కవితా సంపుటిలో ఏదో ఒక ఆకర్షణీయమైన శీర్షికను సంపుటికి పేరు పెట్టడం ఆనవాయితి. ఈ సంపుటిలో అలా వెతికితే కలిగేది నిరాశే. ఇలా సంపుటాలకు కొత్త కోణంలో పేర్లు పెట్టడం కూడా ఒక నూతన పంధానే. ఆ కవితా శీర్షికెక్కడుందో కనుక్కోవలసిన బాధ్యత పాఠకుడిదే. ఏ కారణాల వల్ల ఈ సంపుటికి శత్రువుతో ప్రయాణం అన్న పేరు పెట్టారో తెలిపే ధోరణిలోనే నా పరిశీలన ప్రారంభిస్తాను.

స్త్రీ వాద సాహిత్యంలో వ్యక్తమైన నిరసనలుగాని అసహనంగాని పురుషాధిపత్య సమాజం మీదే గాని పురుషుల మీద కాదు. వ్యక్తి గతంగా స్త్రీ పురుషులలో అన్ని రకాల మనస్తత్వాలున్న వారుంటారు. వారి ఆలోచనలని వారి జీవితాలని నిర్దేశించే భావజాలం ఏదైతే ఉందో దాని ప్రభావమే మనకాలం నాటి సమాజాన్ని అందులోని విలువల్ని అంచనా వేస్తాం. సమాజంలో అని రంగాల్లోనూ చెలామణి అవుతున్న పురుషుల అధికార స్వభావాన్ని ప్రశ్నిస్తూ దాన్ని మార్చే దిశగా చైతన్యవంతం చేసి ఒక మంచి మానవ సమాజం కోసం అందరూ కలిసికట్టుగా నడవాలన్నదే స్త్రీవాద కవిత్వాశయం.

శత్రువుతో ప్రయాణం కవితల్లోని స్త్రీ వాద కోణంలో స్త్రీ జాతికి మగవాడు అన్ని దశల్లోను శత్రువుగానే ప్రవర్తిస్తున్నాడు. స్వేచ్ఛను అణగద్రొక్కుతున్నాడు. తన సహాయం లేనిదే సంఘంలో జీవించలేదన్న అపోహతో కాలరాయచూస్తున్నారు. శత్రువన్న పదాన్ని ఏ మాత్రం మొహమాటపడకుండా సర్వ స్త్రీ జనామోదకంగా కవితలో ప్రయోగించారు. డాక్టర్ మాడభూషి వారు. స్త్రీ మనో భావాలను సమగ్రంగా అవగాహన చేసుకుని ఆమె దైన్యస్థితిని పట్టించుకోమని తన కవితలో తెలియజేశారు.

'మగాడు' కవితలో ప్రతి అక్షరం స్త్రీ జాతి పట్ల జరుగుతున్న అన్యాయాలను ఆరబోస్తుంది...అవి

నేను సహవాసం చేస్తున్నది
శత్రువుతో
నేను సహజీవనం చేస్తున్నది
శత్రువుతో
నేను
పని పంచుకొంటున్నది
శత్రువుతో

(శత్రువుతో ప్రయాణం, పుట.47)

అన్న పదాలు గమనిస్తే తమ సేవలని, సహకారాన్ని తీసుకోవడంలో చూపిన శ్రద్ధ కుటుంబపు ఆధీనం నుంచి ప్యూడల్ భావజాలం నుంచి ఆడవాళ్ళని తప్పించటం కోసం సమాజంలో ఏ ఆలోచనలు చేయకుండా ఉన్న సత్యాన్ని గమనించవచ్చు. అలాగే ఆడా మగా

వైవిధ్యం అనుకున్నా
కానీ వైరుధ్యం
వివిధ భావాలతో
కట్టుకున్న గూడు వైవిధ్యం
వివిధ విరోధాలతో
నడిచే తోడు వైరుధ్యం!

(శత్రువుతో ప్రయాణం, పుట.48)

అనడంలో ప్రజాస్వామ్య దృక్పథం సర్వమానవ సమానత్వం అంటూ మాట్లాడే మగమహారాజుల వైఖరి నిజానికి ఆడవాళ్ళ పట్ల ఆచరణలో ఎంత అప్రజాస్వామికంగా ఎంత అసమానతగా ఉంటుందో తెలుస్తోంది.

అలాగే 'స్వర్గం' అనే కవితలో

నా శరీరంమీదికి
తాచుపాములా పాకుతాడు
నండ్రగబ్బలా పట్టుకుంటాడు
వాడి ఉడుంపట్టునుంచి
తప్పించుకోవడానికి వీలుకాదు
పులిలా మీద పడుతాడు
నక్కలా నాకు ఫేవర్ చేస్తున్నట్టు నటిస్తాడు
బుసలు కొట్టే ఎద్దులా మారుతాడు
స్వర్గాన్ని రుచిచూస్తూ
నరకాన్ని తాగిస్తాడు!

(శత్రువుతో ప్రయాణం, పుట.43)

పై వాక్యాలు చదువుతుంటే స్త్రీ ఘోషను ఎలుగెత్తి నినదించిన పాటిబండ్ల రజని, ఘంటశాల నిర్మల, మందరపు హైమావతి, శిలాలోలిత, జయప్రభ లాంటి ఎందరో కవయిత్రులు ఈ సందర్భంలో గుర్తుకొస్తారు.

అలాగే 'ఆమె' అనే కవితలో స్త్రీ ఆవేదన సంపూర్ణంగా కనిపిస్తుంది. స్త్రీ ఆవేదనను లక్ష్యపెట్టనిమూర్ఖపు శిఖామణులకు చెంపపెట్టులా సాగుతుంది. కొన్ని వాక్యాలను గమనిస్తే ఆమె గుండె కరిగి, రక్తం లావాలా ఎలా ప్రవహిస్తుందో తెలుస్తోంది.

అతడికి కావలసింది ఒక మర మనిషి
సంపాదించటానికి
వండి పెట్టడానికి
కోరికలు తీర్చడానికి
పెళ్ళిరోజున ఎ.టి.ఎం లాంటి
పెళ్ళాం దొరికిందని మురిసి పోయాడు
తాను దొరికి పోతున్నానని ఆమె మరచిపోయింది
బానిస దొరికిందని అతడు ఆనందించాడు
రెక్కలు విప్పిన చేతనకు
కనీసం ప్రశ్నించే హక్కుకూడా లేదు
ఆమె నిఘంటువునుంచి 'ఏ' నిషేధితం
అందుకే
ఎందుకు? ఏమిటి? ఎవరు? ఎలా? ఎప్పుడు? ఎక్కడ?
లాంటి ప్రశ్నలు ఆమె నోట్లో రాకూడదని శాసనం
శాసనోల్లంఘన చేస్తే
తిట్లు రాళ్లే పాట్లు

(శత్రువుతో ప్రయాణం, పుటలు. 26,27)

ఇలా సాగుతుంది.

మన భారతీయ సమాజం ప్రత్యేకత ఏమిటంటే దేనిని కూడా అంత తేలిగ్గా తెగొట్టదు. రాముణ్ణి దేవునిగా కొలుస్తూనే, ఏకపత్నీ వ్రతుడని పొగుడుతూనే బహు భార్యాత్వాన్ని హాయిగా కొనసాగిస్తారు. దేవతల్ని తలకెత్తుకుని కుంకుమబొట్లు దిద్దుకుని కొలుస్తాం కానీ కన్న తల్లిని కట్టుకున్న భార్యని నానా హింసలూ పెడతాం. భారతీయ సంస్కృతి స్త్రీలని హింసించే సంస్కృతి దీనిలో భాగమే. స్త్రీల కట్టు బొట్టు నడక నడత మాట ఆలోచన ఆచరణ ఆదరణ అంతరంగం అన్నింటినీ నియంత్రించే అదుపు చేసి పితృస్వామ్య సంస్కృతి భారతీయ సంస్కృతిలో మిళితమైపోయింది. స్త్రీ వాదుల మాటల్లో గోరంత మాత్రమే కాదు కొండంత సత్యం కూడా ఉంది.

ఇదే కవిత్వంలో ఇష్టంలేని ఆడదాన్ని మగవాడు ఎంత సులభంగా వదిలించుకుంటాడో ఈ కవితను గమనిస్తే అర్థమవుతుంది.

కలిసిరాని దానిపై చివరి అస్త్రంగా
రంకని బొంకి
ఇంకొకరి మెడలో
ఉరితాడు బిగించడానికి సిద్ధం!
మొగుణ్ణి వదిలేసిందన్న
నెపాన్ని మోస్తూ
బతుకును ఈడుస్తూ
పిల్లల్ని పెద్ద చేయాలి
తాను మరణించడానికి సిద్ధపడి
బిడ్డకు జీవాన్ని పోస్తుంది
బిడ్డలకోసమే జీవితాన్ని దారపోస్తుంది
బిడ్డ కాళ్లో ముల్లు గుచ్చుకుంటే
తన గుండెల్లో గునపం దిగినట్టే
మాంసపు ముద్దను మనిషిగా మారుస్తుంది
గుండెల మీద తన్నినా
గుండెకు హత్తుకుంటుంది!

(శత్రువుతో ప్రయాణం, పుట.27)

అన్న వాక్యాల సునిశితంగా చూస్తే ఆడవాళ్ళ మనస్సులోని అగ్ని పర్వతాలెన్నింటినో మాడభూషి వారు దర్శించి తన మనోవేదనను అక్షరాల రూపంలో చూపించారు.

'ఆమె' అనే కవితలో స్త్రీ జీవితాలెప్పుడూ విషాదాంత ఉదంతాలే అని తెలియజేస్తూ

వయసుడిగిన
ఆమెతో ఎవరికీ పనిలేదు
ఆమె ఏ పనికీ పనికిరాదు
మానవజీవితాన్ని నడిపించే
ఆమెకు / మానవతిగా పేరులేదు
ఆమెను / మానవత్వంతో చూడ్డంలేదు
కనీసం
మనిషిగా గుర్తింపు లేదు
అయినా
ఆమె లేకుండా
మానవ చక్రం పరిభ్రమించదు
అందుకే
ఆమెను
పరిమళించనివ్వండి
లోకాన్ని సుభరితం చెయ్యండి!

(శత్రువుతో ప్రయాణం, పుట.28)

అంటూ ఆమె తరుపున వకాల్తా పుచ్చుకుని సందేశా నిచ్చాడు కవి. నూట ఏభైఏళ్ళ కిందట గురజాడ అప్పా రావు, కందుకూరి వీరేశలింగం స్త్రీ జనోద్ధరణ ఒక ఉ ద్యమంగా ప్రచారం మొదలు పెట్టిన నాటి నుంచి ఇప్పటి దాకా స్త్రీ చాలా దూరం ప్రయాణించింది. ఆధునిక స్త్రీ భారత దేశ చరిత్రను తిరగరాస్తుంది అన్న మాట అక్షరాలు నిజమైంది. ఆధునిక కాలపు మహిళ పురుషులను కూడా దాటి ముందుకు వెళ్ళపోయింది. చదువు విషయంలో ఉద్యోగాల విషయంలో ఆర్థిక విషయాల్లో సంపాదన

విషయంలో నేటి స్త్రీ చెప్పుకోతగ్గ అభివృద్ధి సాధించింది. వ్యాపార విషయాలలో ఆర్థిక విషయాలలో సామాజిక విషయాలలోను అడుగు పెట్టిన ప్రతి రంగంలోనూ తన శక్తి సామర్థ్యాలను ప్రతిభాపాట వాలను ప్రదర్శిస్తోంది.

స్త్రీ అన్యాయానికి గురవుతున్నప్పుడల్లా గళమెత్తి నినదించడంలేదన్న మనోవేదన కలగడం జహజం. స్త్రీలని అణచి ఉంచే అన్న అంశాల మీద పురుషాధిక్యం మీద జరుగుతున్న అన్ని రకాల చర్చలు ప్రతిఘటనలు పోరాటాల వలన స్త్రీ సమస్యలన్నీ మాయమైపోతాయనో లేదా అద్భుతాలు ఆకాశం నుండి ఊడిపడతాయనో చెప్పలేం కాని స్త్రీ దృక్పథం పట్ల తప్పని సరిగా అవగాహన కలుగుతుంది. స్త్రీల అనుభవాలకి ఆలోచనలకి కవిత్వంలో ఎక్కువ చోటు కల్పించడం స్త్రీల జీవితాలను శాసించే పురాణకాలం నాటి నమ్మకాలను ప్రశ్నించటం ప్రాచీన సాహిత్యాన్ని స్త్రీవాద దృక్పథంతో పునర్విశ్లేషణ చేయటం, అలాగే స్త్రీ పాత్రచిత్రణ ప్రతీకలు తీసుకుని కవిత్వాలు రాయటం ఇలా భిన్న కోణాల నుంచి సాహిత్య సృజన అవసరం అని నా పరిశీలనను ముగిస్తున్నాను.

❖❖❖

కవిత్వంతో ప్రయాణం

సర్! నమస్తే. మీ 'శత్రువుతో ప్రయాణం' చదివాను. నిన్న రాత్రికి చదవడం పూర్తయింది. చాలా చక్కటి పుస్తకం సర్ ఇది. అతి తేలికైన పదాలతో బరువైన భావాలను ప్రకటించారు. సమ సమాజాన్ని కాంక్షిస్తూనే సమాజంలోని అవాంఛనీయ సంఘటనలను, మానవ నైజాలను మీరు విమర్శించిన తీరు బాగుంది. నన్నయకు నమస్కారం చేస్తూ ప్రాచీనతను, పనిచేయాలంటూ కార్మిక శ్రమ జీవన సౌందర్యాన్ని, భయమంటూ మహిళా పక్షపాతాన్ని ఒకే పుస్తకంలో మీరు ప్రకటించిన తీరు చాలా బాగుంది సర్. పుస్తకం అంది వారం రోజులు దాటినా ఇతర పని ఒత్తిడుల కారణంగా చదవలేకపోయాను. నిన్ననే చదివాను. ఓ చక్కని ప్రయాణం చేశాను. (మీరు శత్రువుతో ప్రయాణం అన్నారు. కానీ అది చక్కని కవిత్వంతో ప్రయాణంగా సాగింది)

నమస్కారాలతో

- మీ డాక్టర్ కె.రామకృష్ణ

విజయవాడ

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవతావాదం డాక్టర్ మాడభూషి కవిత్వం

- డాక్టర్ నందనవనం శివకుమార్, తెలుగు అధ్యాపకులు, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, ఒంగోలు, ప్రకాశం.

ఆచార్య డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ రచనలు నేటి సామాజిక పోకడలకు ప్రతీకగా నిలుస్తుంది. దానికి తోడు సమాజ స్థితిగతులలోని దుర్మార్గపు అరాచకాలపై విరుచుకుపడతారు. మానవతా విలువలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన చెందుతారు. వీరు సహజ మైన తెలుగు పదాల మేళవింపుతో అసాధారణమైన, లోతైన భావాలతో కూడిన భావం వ్యక్తపరుస్తారు. తేలికైన శైలితో ఘాటైన భావాలను వ్యక్తపరచడం వీరికే చెల్లు తుంది. తన ప్రతి కవితలోను ఓ చక్కని మానవతా విలువ లను చాటుతున్న వైనం గోచరిస్తుంది. ఈయన కవిత్వంలో ప్రధానంగా సమాజంలో నానాటికి అంతరించిపోతున్న మానవ సంబంధ బాంధవ్యాలు, భూ బకాసురుల బాగోతాలు, ప్రభుత్వాల జిమ్మిక్కులు, రాజకీయ నాయకుల కుటిల బుద్ధిని, సమాజంలో జరుగుతున్న అరాచకాలు, మోసగాళ్ళు, నయవంచకులను సైతం ఎండగట్టిన వైనం కనబడుతుంది.

అయితే కవిత్వంలో ఏ కవి అయినా తన రచనలకు పెట్టే పేరులోనే కవి అంతర్గత భావాలు, ఆయన వ్యక్తిత్వం తేటతెల్లమవుతాయి. అదే విధంగా ఆచార్య మాడభూషి తన కవితా సంపుటాలకు పెట్టిన పేర్లే ఆయన సామాజిక దృక్కోణానికి అద్దం పడతాయి. అంతే కాకుండా ఆయా కవితలు సైతం మనం చదువుతున్నప్పుడు ఏ కవితకు ఆ కవితే సర్వ స్వతంత్రంగా కనపడుతుంది.ప్రతి కవిత లోనూ ఓ ప్రత్యేకత, ఓ చక్కని సందేశాత్మక సామాజిక తత్వంతోబాటు మానవతావాదం కనబడతాయి. అంతే కాకుండా ఈ సమాజంలోని చీకటి కోణాలను తరిమేయా లన్న తపన వారి కవిత్వంలో గోచరిస్తుంది. అంతే కాదు మానవతా విలువలు మంట గలిసిపోతున్న నేటి కాలంలో ఒక మానవతా నైజం ఉన్న వ్యక్తి. అంతేగాకుండా మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే విధంగా సమాజం లోని ప్రతి మనిషి పోకడలను సైతం ఆయన తన కవితా కలం ద్వారా దుయ్యబట్టారు. తేటనైన తెలుగు పదాల అక్షరాల మేళవింపుతో ఆయా వ్యక్తుల మనస్సు లను, మానవత్వాన్ని ఆలోచింపచేసే విధంగా తన కవితలు సాగుతాయి. తన రచనలకు పెట్టిన పేర్లలోనే వారి మనోనేత్రం దర్శించవచ్చు. తన కవితా రచనలకు పెట్టే పేర్లు సైతం ఓ ప్రత్యేకతను కన్నుల ముందు సాక్షాత్కరింపచేసే విధంగా ఉండడం చెప్పదగిన విశేషం.

మాడభూషి వారి రచనలలో నన్ను ఆకర్షించిన కవితా సంపుటి ''శత్రువుతో ప్రయాణం'' ఆ పేరు చూడగానే నాలో ఎంతో ఆసక్తి గుబులు రేగింది. శత్రువుతో ప్రయాణం ఎలా సాధ్యం అన్నది నా ప్రశ్న? తీరా ఒక్క టొక్కటిగా కవితలు చదువుతుంటే అందులో అంతర్లీ నంగా ఉన్న భావాలు నా మదిని తాకుతుంటే నిజమే నేటి సమాజంలో బ్రతకడమంటే శత్రువుతో ప్రయాణం సాగించడమేనని. మరొక విషయమేమంటే నా జీవన గమనంలో ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న ఒడు దుడుకులు, కష్ట నష్టాలకు, నా భావాలకు, అనుభవాలకు ఎంతో దగ్గరగా నిలుస్తున్నది ఈ 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటి.

అందుకే కాబోలు నేనెవరో తెలియకపోయినా, నన్ను పరిచయం చేసిన డాక్టర్ విస్తాలి శంకరరావు గారు పర్యవేక్షకులుగా ఉండగా మొదటి పరిచయంలోనే ఆచార్యులు మాడభూషి సంపత్ కుమార్ గారు మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ సీటు పొందేందుకు తగిన సూచనలంద చేసి తోడ్పాటు నందించారు. అప్పటి తెలుగు శాఖాధిపతి ఆచార్య శమంతకమణి గారు తెలుగుశాఖలో చేరేందుకు అనుమతిచ్చారు. అదే విధంగా

పిహెచ్‌డి సైతం పూర్తి చేసి 2009లో గురువుల జ్ఞానభిక్ష వల్లే డాక్టరేటు పట్టా పొందగలిగాను. మద్రాసు విశ్వ విద్యాలయంతో నా ప్రయాణం "మిత్రులతో ప్రయాణం" లా సాగిందని మాత్రం ఘంటాపథంగా చెప్పగలను.

''శత్రువుతో ప్రయాణం'' గురించి పరిశీలించి నట్లయితే.....

సహజంగా ఎవరైనా శత్రువని తెలిసి కూడా అతనితో ప్రయాణం చేస్తారా! చెయ్యరు కదా! కానీ ఇక్కడ మన మాడభూషి శత్రువుతో నేటికీ ప్రయాణం సాగిస్తున్న వైనంతోబాటు సమాజం ఆయన బద్ధశత్రువు అని చాటడం చెప్పదగిన విశేషం. 'శత్రువుతో ప్రయాణం' అనే తన కవితా ప్రయాణంలో నేటి సామాజిక నైజాన్ని వెల్లడించిన వైనం అంతర్లీనంగా గోచరిస్తుంది.

శత్రువుతో ప్రయాణం అంటే ఓ విధంగా సర్కస్సు లాంటిదే. ఏ మాత్రం గాడి తప్పినా ప్రాణానికే లేదా జీవితానికే ప్రమాదం అన్న విషయం తెలిసి కూడా శత్రువుతో ప్రయాణం సాగించాల్సిన వైనం నేటి సమాజంలో వున్న నైజం అని వారు చాటిచెప్పారు. నేటి అసమ సమాజంలోని పోకడలను సైతం కన్నులకు కట్టినట్టు చూపెట్టారు. ఇది కవి తన వ్యక్తిగతానుభవానికి ప్రతీకగా నిలుస్తుంది. ప్రధానంగా తన జీవనగమనంలోనే గాకుండా వృత్తిరీత్యా కూడా తను ఎదుర్కొన్న ఎన్నో ఒడుదుడుకులను సైతం తన కవితా వెల్లువ ద్వారా శత్రువుల మనసులను సైతం స్పృశించే విధంగా ఉంటుంది. వారిలో మార్పును ఆయన ఆకాంక్షించారు. కాబట్టి సద్విమర్శతో కూడిన నడక ఈయన కవితాతత్వం. శత్రువులను ప్రేమించమని పెద్దల ఉవాచ. అదే రీతిలో కవి సమాజంలోని శత్రువులతో ప్రయాణం సాగించి శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకునే శక్తి యుక్తులు మనకుండాలని సూచించారు. చెడులోనైనా మంచిని వెతుక్కోమని విజ్ఞుల ఉవాచ. ఎంతటి బద్ధ శత్రువుతోనైనా తాపీగా తన జీవన ప్రయాణం సాగించ వచ్చునే ధోరణిలో కవి తన రచనలను కొనసాగించారని చెప్పవచ్చు. ఇందులోని కవితలను పరిశీలించి నట్లయితే.....

నేడు సమాజంలో మానవత విలువలు కనుమరు గౌతున్న వైనానికి ప్రతీక "అతడు మనిషిని జయించాడు" అనే కవిత. నేడు సమాజంలో మనుషులను గౌరవిస్తున్నారే తప్ప అతని మనసు ఎలాంటిది అని చూడడం లేదం టారు. అంటే సమాజంలో మనుషుల రూపు రేఖలకు గౌరవమిస్తున్నారే తప్ప మంచి మనసున్న వ్యక్తిత్వం గల మనుషులను తక్కువచేసి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మంచితనాన్ని వదిలేసి తాత్కాలికమైన భౌతిక రూపాలైన దుస్తులు, డాబులు, బడాయిలకు ప్రాధాన్యత నిస్తూ మంచితనాన్ని సైతం ఒక బలహీనమైనదిగా భావించి ఇబ్బందుల పాలుచేసి ఆనందిస్తూ నేను విజయం సాధించాననే ధోరణిలో ప్రవర్తిస్తున్న సమాజం లోని మనుషులు గాని మనుషులను ఆయన దుయ్య బట్టారు. మనిషి అంటే మానవతా విలువలున్న వాడే మనిషి అనేది కవి భావన. "అతడు మనిషిని జయించాడు - మనిషి కోసం వెతకడం మానేశాడు!" (శత్రువుతో ప్రయాణం, పుట.9) అంటారు. రెక్కాడితే గాని డొక్కాడని - కుటుంబం కోసం - పక్షులతో పాటు - రెక్కలు విదుల్చు కొని - బయలు దేరుతాడు! - చెమట ముక్కల్ని - నీటి చుక్కలు చేసి - పిడచ కట్టిన పిల్లల నాల్కలపై పోస్తాడు (శత్రువుతో ప్రయాణం,పుట.13) సమాజంలో రైతులు పెందలకడనే లేచి పొలం గట్టుకు వెళ్ళి రెక్కలు ముక్కలు చేసుకొని కాయా కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతారంటారు. జీవనయానంలో ఎప్పటికి ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా సృష్టి సహకరించకపోయినా సమాజం నిలువునా మోసం చేస్తున్నా, ''అలలు అలసి పోవు - తీరం దాటక పోవు''(శత్రువుతో ప్రయాణం, పుట.14) అనడంలో రైతులు మాత్రం అలుపెరుగక తాము చేరాల్సిన గమ్యం దగ్గరలోనే ఉందంటూ ఎప్పటికైనా మంచితనమే గెలుస్తుందని రైతులకు భరోసానిస్తూ అనుకున్న గమ్యం చేరగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. రైతుల పక్షపాతిగా నిలిచారు.

'కవిభేరి'లో శ్రీశ్రీ భావాలు ఆయా శైలి ఇందులో కొంత కనబడుతుంది. శ్రీరంగం శ్రీనివాసరావు మహా ప్రస్థానంలో "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అంటే ఇక్కడ మాడభూషి శత్రువుతో ప్రయాణంలో "నేను కూడా స్వతంత్ర్యానికి కవిత నొక్కటి రాసి యిచ్చాను!" అనడంలో ఈయనలో శ్రీశ్రీ విప్లవ భావాలు సైతం ఉన్నట్లు గోచరిస్తుంది.

'నిజం' అనే కవితలో సమాజంలో పేరుకుపోయిన కుల, మత, భాష, ప్రాంతాల వారీగా ఉన్న అల్లర్లను కులిజం, మతిజం, భాషిజం అంటూ దేశంలోపల ఉన్న జనులు కొట్టుకు చస్తుంటే వీరందరికి దేశ సరిహద్దులో కాపలా కాస్తున్న వీర జవానులు ఈ బేధాలకతీతంగా ప్రాణాలను సైతం అర్పిస్తున్న వైనాన్ని చూసైనా మన కుల, మత, ప్రాంతీయతత్వ ధోరణులను వీడాలంటారు. "తుంచేసెను బంధాలను బార్డర్లో వాడలు!" (శత్రువుతో ప్రయాణం,పుట.19)

విరోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా చేసిన రచన "విరోధి" ఇది. ఆనాడు సమాజంలో పేరుకు పోయిన అత్యాచారాలు, ఆకాశాన్నంటుతున్న ధరవరలు, పదవులకోసం పాకులాడే రాజకీయ దురంధురల నైజాన్ని ఎండగట్టారు. ''మానవులు బంధాలకు బదులు బాంబులు కట్టుకు తిరుగుతున్నారు ఎవరు ఎప్పుడు పేలుతారో నిర్జీవంగా!"(శత్రువుతో ప్రయాణం,పుట.21) అంటారు. మానవ సంబంధాలు అంతరించిపోతున్న వైనాన్ని చూచి చలించిపోయిన కవి తన ఆవేదనను ఈ "విరోధి" కవిత ద్వారా వ్యక్తంచేశారు.

"తెలుగు వెలుగులు" కవితలో ప్రాచీన కాలంనాటి కవుల నుంచి ఆధునిక కాలం కవుల వరకు ఎవరూ ఎవరికీ తీసి పోరంటూ "తెలుగు సొరభాలు విరజిమ్మి నారు విశ్వమంతా ఆధునిక కవులెందరో అద్భుతమైన సాహిత్య ప్రక్రియా ధోరణులతో - తాడి దన్నువాడి తలదన్ను వాడొకడు!" అంటారు. (శత్రువుతో ప్రయాణం, పుట.24)

"ఆమె" కవితలో మాడభూషి స్త్రీవాదం కనిపిస్తుంది. ఈ సృష్టిలో స్త్రీ ఒక తేజోమూర్తిగా వెలుగులీనుతుంటేనే ఈ కాలచక్రం నడుస్తుంది అంటారు. ఆ మానవతా తేజోమూర్తి అయిన మహిళల మనుగడకే పెను ప్రమాదం పొంచివున్న నేటి సమాజ నైజాన్ని ఆయన తీవ్రంగా గర్హించారు.

నేటి ఆధునిక సమాజంలో పేరుకు పోయిన వర్ణ వివక్షకు అద్దం పడుతుందీ "విరుగుడు" కవిత. "ఆకులు కూడా కాలాక చేతులు చూసుకొంటే ప్రయోజనం లేదు!" (శత్రువుతో ప్రయాణం,పుట.31) ''చేతులు కలిపి సాధించలేంది కత్తులు దూసి గెలవగలమా?"-"గ్రహిస్తే గెలుస్తాం! మరిస్తే విలపిస్తాం!" (శత్రువుతో ప్రయాణం, పుట.32) అంటారు. ఇలా మాడభూషి కవిత్వంలో మరుగున పడిపోతున్న తెలుగు సామెతలు/పలుకు బడులు తరచుగా సందర్భోచితంగా వాడారు. "పాలస్తీనా దృశ్యాలు" కవితలో దేశం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వారి గురించీ దేశ రక్షణకై పరితపిస్తున్న జనం గుండె చప్పుళ్ళను తన కలం ద్వారా లోకానికి చాటారు మాడభూషి. కవితా! ఓ కవితా! అంటూ శ్రీరంగం శ్రీనివాసరావు మహాప్రస్థానంలో రాసిన ధోరణిలో మాడభూషి "కవి" పేరిట రాసిన కవిత్వంమిది. ఆయన శీర్షికలో కవి కవితను కవితా! ఓ కవితా! అంటూ ప్రారంభించడం బట్టి చూస్తే శ్రీశ్రీ ప్రభావం మాడభూషి కవిత్వం అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

స్వభానుకు స్వాగతం! అంటూ చిత్రభాను సంవత్సరంలో చవిచూసిన అశాంతి, అమానవత్వపు పోకడలు, అవినీతి, కులమత ఘర్షణలు, దోపిడీ, దౌర్జన్యకారుల నుండి ప్రజలను, సమాజాన్ని కాపాడాలని వేడుకుంటూ ఉగాది సందర్భంగా జ్యోతిష్యులు చెప్పే ఆదాయ వ్యయాల లెక్కలను గురించి ప్రస్తావిస్తారు.

"స్వర్గం" కవిత స్త్రీవాద కవితా ధోరణికి ప్రతీకగా నిలుస్తుంది. స్వర్గం నరకం అంటూ సమాజంలోని వెలయాలుల మానసిక ఘోషను తన కవిత ద్వారా

అంతర్లీనంగా వినిపించే ''ధ్వని'' ఈ కవితలో మనం గమనించవచ్చు.

''మగాడు'' కవితలో పురుషుల అహంకార భావాల్ని ఎండగట్టారు. మగాడు అనే పదంలోనే పురుషుడు, మొగుడు, మొనగాడు, మోసగాడు, అధికారపు అహంకారి ఇలా పలు కోణాలను సైతం అతి తేలిక పదాలతో విశాల భావాలను వ్యక్తీకరించే నైపుణ్యం మాడభూషి స్త్రీవాద కవితా నైజం.

చరిత్ర గతులను తవ్వడం వృథా ప్రయాస తప్ప మరొకటి కాదంటారు. ఎప్పటికైనా వర్తమానమే భవిష్యత్తుకు బాధ్యత వహించాలంటారు. చారిత్రక కాలంలో జరిగిన తప్పులు భవిష్యత్తులో దొర్లకుండా వర్తమానంలో నడుచుకోవాలని ఉపదేశించారు. 'చరిత్ర' కవితలో ''చరిత్ర అంటే/అయిపోయింది కాదు/ రాబోయేది/కాబోయేది''(శత్రువుతో ప్రయాణం, పుట.50) అంటూ చరిత్రకు నూతన భాష్యం చెప్పారు.

నేటి సమాజమంతా భయం గుప్పిట్లో నడుస్తున్న వైనాన్ని కవి కన్నులకు కట్టినట్లు చూపెట్టారు. పగలనక, రాత్రనక అనునిత్యం భయభ్రాంతులతో కాలం వెళ్ళ దీసుకు పోవాల్సిన దుస్థితిని కవి తన ఆవేదనతో ''భయం'' కవిత ద్వారా వ్యక్తం చేసారు. భయం గురించి వర్ణిస్తూ ''భయం ముసురుకొన్న వానలా ఉంది/ కమ్ముకొన్న మబ్బులా ఉంది/చిమ్మచీకటిలా ఉంది/ ప్రచండమయిన ఎండలా ఉంది/ దట్టమయిన మంచులా ఉంది / చుట్టమయిన దెయ్యంలా ఉంది!'' (శత్రువుతో ప్రయాణం, పుట.52) అంటూ వర్ణనాత్మకంగా భయం యొక్క స్వరూపాన్ని సాక్షాత్కరింపచేసారు మాడభూషి.

కలలు - అలలు ఈ రెండూ ఒకటేనన్నట్లు కవి చమత్కరిస్తారు. అలలను చూస్తుంటే ఎంతో అందంగా, ఒక్కోసారి పెద్ద అలలు భయాన్ని సైతం కలిగిస్తాయి. ఆ అలలు ఎలా పట్టుకోలేమో అదే విధంగా మనకు వచ్చే కలలు సైతం మంచి చెడులతో కూడిన కలలు వస్తుంటాయి. అవన్నీ నిజం కావచ్చు, కాకపోవచ్చు అంటారు. అలలకు గమ్యం తీరం అయితే కలలకు గమ్యం కళ్ళు అంటూ మితీమీరిన కలలకు అడ్డుకట్ట వేస్తారు.

''చెప్పులు'' కవితలో సమాజంలోని అంటరానితనాన్ని దుయ్యబట్టిన వైనం కనబడుతుంది. గుఱ్ఱం జాషువా 'గబ్బిలం' లోని భావాలు మాడభూషి ''చెప్పులు'' కవితలో స్పష్టంగా చూడవచ్చు. ''రూపాంతరం'' కవితలో కూడా సమాజంలో పేరుకుపోయిన అంటరానితనాన్ని ఎండ గట్టారు. ఈ అంటరానితనం రూపుమాపాలంటే సమాజంలో ప్రతి ఒక్కరు మానవత్వం ఉన్న మనుషులుగా మారాలి. లేకపోతే ఏదో ఒకరోజు అంటరాని వాళ్ళు నీపై తిరగబడతారని హెచ్చరికలు చేశారు.

నేడు సమాజంలో మనుషులకు విలువ నివ్వడంలేదు అని వాపోతూ సమాజంలో మనుషుల ఆస్తిపాస్తులకు, సిరి సంపదలకు ఇచ్చే గౌరవం మానవతా విలువలకు ఇవ్వడంలేదని నానాటికి కుంచించుకుపోతున్న మానవతా విలవల గురించి కవి తన ఆవేదన వ్యక్తం చేశారు.

''మనిషి విలువ రూపాయి లాగా పడిపోతూనే ఉంది!'' అంటారు. (శత్రువుతో ప్రయాణం,పుట.57)

''సమాజం'' కవితలో అసమ సమాజానికి మాత్రమే ఊతమిచ్చే నాయకులనే ప్రతిసారీ ఎన్నుకుంటూ ఓటర్లు చేస్తున్న తప్పిదాన్ని ఎత్తి చూపారు. పని చేస్తేనే పనిమనుషులకు బువ్వ గడుస్తుందనే రీతిలో పనిచేసే వాడు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాడు. పని ఎగ్గొట్టి తిరిగే వారు హాయిగా ముప్పూటలా తిని కాలక్షేపం చేస్తూ కాలం గడుపుతారనే నగ్నసత్యాన్ని ''పని'' కవితలో వ్యక్తపరిచారు.

కులనిర్మూలనకు కొత్త భాష్యం ఈ ''కులనిర్మూలన'' కవిత. అది కవియొక్క అనుభవైక నైవేథ్యం అని గ్రహించవచ్చు. కుల నిర్మూలన అంటే వేరే కులస్తులను ఎదగనివ్వకుండా అడ్డుకోవడమే అన్న రీతిలో సమాజం నడుస్తున్న వైనాన్ని తానెప్పటికో గ్రహించగలిగానని

విస్తుపోతున్న వైనం ఈ కవితలో కొట్టొచ్చినట్లు కనబడుతుంది. "జెండా వంగి గూండాగిరికి సలాం చేస్తోంది ఈ దేశంలోని దౌర్జన్యాన్ని ఎదిరించలేక!" (శత్రువుతో ప్రయాణం,పుట.62) దేశంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మంగళం పాడిన వైనాన్ని కవి తన ఆవేదనను వ్యక్తం చేసిన వైనమిది.

నిలువెత్తు మనిషి హావ భావాలకు సాక్ష్యంగా కన్ను నిలుస్తుందంటూనే నేడు సమాజంలో ఎందరో మొసలి కన్నీరు కార్చే వారున్నారంటూ సమాజంలో మోసపూరిత మైన కంటతడిని చూసి మోసపోవద్దంటూ హెచ్చరికలు జారీచేశారు . అది ఎలాగంటే "నేను కంటిని నమ్మను అది గ్లిజరిన్ తాగిందేమోనని భయం!" (శత్రువుతో ప్రయాణం, పుట.63) ఇలా తేలికైన సంక్షిప్తమైన పదాలతో నిగూఢమైన భావాలను వ్యక్తీకరించడంలో దిట్ట డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ కవితా స్రష్ఠ. ఈనాటి సమాజంలో మనిషి తన జీవన గమనంలో దేనికీ భయపడకుండా ఎదుర్కో గల సత్తావున్నా మనిషిని చూస్తే చాలు భయభ్రాంతులకు గురయ్యే దుస్థితులు నెలకొన్నాయంటూ "స్వప్రయోజనాలకు మానవ ప్రయోగ శాలను పణంగా పెట్టాడు!" (శత్రువుతో ప్రయాణం, పుట.64) అంటారు. ఈ సమాజంలో మనుషులు మారాలని అప్పటిదాకా మానవ జాతిని చూసి మానవ జాతే భయపడే పరిస్థితులు ఉన్నాయంటూ జాగ్రత్తపడ మంటారు. "రంగులు" కవితలో సైతం మానవనైజాన్ని దుయ్యబట్టారు. వర్ణ సంకరణం గురించి మానవతా విలువలు అడుగంటిపోతూ మనిషి మనిషిగా బ్రతక లేకపోతున్న వైనాన్ని ఎండట్టారు.

ఇంకని సముద్రం విశాలమైన భావాలకు ప్రతీకగా నిలుస్తుంది. సముద్రంలో చెత్తా చెదారం కలిసినా, మంచి వర్షపు నీరు కలిసినా సముద్రం చలించదు. అన్నింటిని తనలో తాదాత్మ్యం చేసుకుంటుంది. అదే విధంగా విశాలహృదయ భావాలున్న వ్యక్తులు సైతం సమాజంలో శత్రువులు, మిత్రులనే భేదభావం లేకుండా అందరూ మనవారేననుకునేలా ప్రవర్తించే తీరును సముద్రంతో పోలిక చేస్తూ భావవ్యక్తీకరణ చేశారు. సముద్రం ఎలా యింకిపోదో అలాగే సహృదయత గల మనుషులు సైతం దేనికీ చలించరంటూ తన మనోనైజాన్ని వ్యక్తీకరించారు.

కాలానికి కాలమే జవాబుదారీతనం వహించాలంటూ భవిష్యత్కాలం గురించి దిశానిర్దేశం చేశారు కవి. "కాలాన్ని నిలదీసే కాలం వస్తుంది!" అంటూ కాలం కలిసివస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేసే మానవతా విలువలు గల మనుషులకు "భవిష్యత్కాలం" కవిత ద్వారా అండగా నిలబడ్డాడు మాడభూషి.

ఇజాలు మారాయి అంటూ కాల ప్రవాహంలో కొట్టుకు పోవడమే తప్ప మారుతున్న బడాబాబుల రౌడీయిజాలు, దాదాయిజాలు చేసిన వారు చివరికు వెనుదిరిగి చూస్తే వారి జీవితంలో సాధించిందేమీ ఉండదంటూ సమాజంలో శత్రువులుగా మెలిగే వారికి కనువిప్పు కలిగేలా వారిలో మార్పు రావాలని వ్యక్తిత్వ వికాస లక్షణాలను తెలియచేస్తున్న వైనమిది. "ఒక్కసారి వెనక్కి తిరిగి చూడు - ఎంతో దూరం వచ్చావు - ఎన్నో మోసుకొచ్చావు - వీటిలో కాలానికి నిలిచేదెంత? - భవిష్యత్తుకు పనికొచ్చేదెంత? - నీటిబుడగల్ని మొయ్యకు - నీటిలో బుడగల్ని తొయ్యకు!"(శత్రువుతో ప్రయాణం,పుట,72) అంటూ శత్రుమూకలకు సైతం కనువిప్పు కలిగించే ప్రయత్నం చేసారు.

స్వాతంత్ర్యం వచ్చి 39 ఏళ్ళయినా ఈ దేశంలో కార్మికులు, కర్షకులు, దళితులు, పంచములు ఇలా ఎందరో మట్టిపని చేసుకు బ్రతికే కుల వృత్తుల వాళ్ళకు నేటికి స్వాతంత్ర్యం రాకపోయినా పెట్టుబడిదారులు, జమీందారుల ధాటికి భయపడి స్వాతంత్ర్యం వచ్చిందని ఒప్పుకోక తప్పని పరిస్థితులలో మట్టి బ్రతుకులు బ్రతుకుతున్న జనం గుండెలలో నిలిచే విధంగా దళిత పక్షపాతిగా నిలుస్తారు మాడభూషి. ప్రభుత్వాలు మారినప్పటికీ సామాన్య ప్రజానీకంలో వెలుగురేఖలు చూడలేని

దుస్థితిని కవి ఎండగట్టారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ప్రజలు ఏదో మేలు జరుగుతుందని భావించినా ఏమీ మేలు జరగకపోగా కనీసం ప్రజల దాహార్తిని సైతం తీర్చలేని దుస్థితిని "ప్రభుత్వం" కవితలో ఎద్దేవా చేశారు. "పాట్లు" కవితలో రాయలసీమ ప్రాంత జనులు త్రాగు నీటికోసం పడుతున్న పాట్లు వర్ణనాతీతం అని కోట్ల రూపాయల నిధులు విడుదలవుతున్నా ఆ బడాబాబులు మాత్రం నిధులు కాజేసి ప్రజలకు అవసరమైన త్రాగునీటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడాన్ని దుయ్య బట్టారు. త్రాగునీటికోసం ప్రక్కింటికి వెళ్ళి అడుక్కునే దుస్థితి దాపురించిందంటూ కవి తన బాధాతప్త హృదయ వేదన వెలిబుచ్చారు.

చివరగా "మహాకామ్రేడ్" కవితలో "నాకు మనసుంది/ స్వాతంత్ర్య పిపాసుంది/సమ భావనుంది/భౌతికవాదం ఉంది/తార్కిక చింతన ఉంది/కలగలిపి నేనొక కామ్రేణ్ణి" డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ తనలో దాగివున్న కమ్యూనిస్టు భావాల్ని చివరగా వ్యక్తంచేశారు. అంతే కాకుండా నేటి సమాజంలో కమ్యూనిస్టులు వారి సిద్ధాంతాలకు తిలోదకాలు యిస్తున్న వైనాన్ని దుయ్య బట్టారు. అందుకే కాబోలు "నేను సామాన్య కామ్రేణ్ని, నువ్వు మహాకామ్రేడివి!"(శత్రువుతో ప్రయాణం,పుట.79) అంటూ కమ్యూనిస్టులు ఆ సిద్ధాంతాలను వమ్ము చేస్తున్నారని వంచనకు గురౌతున్న కమ్యూనిస్టులలో తానొకరుగా నిలిచారు. అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దళిత సాహిత్య పోకడలతోబాటు నేడు సమాజా నికి అవసరమైన మానవతావాద కవిత్వం దర్శించవచ్చు.

ఉపసంహారం :

మొత్తం మీద వీరి కవిత్వంలో శ్రీరంగం శ్రీనివాసరావు, గుళ్ళం జాషువాల ప్రభావం ఉన్నట్లు స్పష్టంగా గోచ రిస్తుంది. అదే విధంగా ఆయన కవితల్లో మరుగున పడిపోతున్న తెలుగు సామెతలు / పలుకుబడులు సందర్భోచితంగా తరచుగా వాడడం బట్టి తెలుగు భాష మనుగడకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పవచ్చు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి కవితాధోరణి గమనించినట్లయితే స్త్రీ పక్షపాతి, దళిత పక్షపాతి, కార్మిక-కర్షక పక్షపాతి, ఆయన మాత్రం నిష్పక్షపాతి. అయితే సమాజం మేలు కోరే పక్షపాతి ఆయన ఓ గొప్ప మానవతావాది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'సంప'ద్వంత కవితా విరించి 'మాడభూషి'

- డాక్టర్ జడా సుబ్బారావు, సహాయ ఆచార్యులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఏపీఐఐఐటీ, నూజీవీడు.

ఉపోద్ఘాతం :

'బాధ కవిత్వానికి పర్యాయపదం' అంటాడు తిలక్. 'కవిత్వమొక తీరని దాహం' అంటాడు శ్రీశ్రీ. 'వేలాడుతున్న మేఘాల్లా మస్తిష్కంలో ఎక్కడో వేలాడుతున్న అక్షరాలు ఎప్పుడు పదాలై వాక్యాలుగా ఎదిగి కవిత్వంగా ఒదిగి మనసు నిండుతుందో ఎవరికీ తెలియదు' అంటారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్. కవిత్వం పుట్టడానికి కారణం కచ్చితంగా తెలియకపోయినా మనసు స్పందించడం మాత్రం ప్రధానం. ఒకవైపు అధ్యాపకవృత్తిలో తీరికలేని జీవితం గడుపుతూనే, పర్యవేక్షకునిగా పరిశోధక విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూనే తనలోని 'కవి'ని మాత్రం నిరంతరం చైతన్యవంతంగా ఉంచడం ఈ కవి ప్రత్యేకత. అంతరాంతరసీమల్లో నిబిడీకృతమైన భావజాలాన్ని కవితలుగా బహిర్గతం చేస్తూనే 'కవిత్వంలో మడికాదు తడి ఉండాల'ని చెప్తూ ఆధునిక భావాలకు ఊపిరి పోస్తారు.

అధ్యాపకులుగా, తెలుగుశాఖ అధ్యక్షులుగా, సహృదయులుగా వీరు ఎంత ప్రసిద్ధులో కవితా సృజనలోనూ వీరి ప్రతిభ బహుముఖీనంగా సాగింది. గాఢమైన విమర్శనే కాకుండా హాస్య, వ్యంగ్య రచనల్లో కూడా వీరి అసామాన్య ప్రతిభ గోచరిస్తుంది. అందరికీ అర్థమయ్యే సరళమైన భాషను ఉపయోగిస్తూనే చక్కని భావవ్యక్తీకరణతో ఆయా ప్రక్రియలకు న్యాయం చేయగలిగిన నైపుణ్యం వీరిది. ఉత్తమ ఉపాధ్యాయ బిరుదుతో పాటు కవికోకిల, సాహిత్యరత్న, ఆంధ్రభాషా విభూషణ, ధ్రువతార మొదలైన ఎన్నో బిరుదుల్ని సొంతం చేసుకున్నారు. అనుకోకుండా జరిగిన చిన్న పరిచయం వీరి గురించి విస్తృతంగా తెలుసుకోవడానికి దోహదం చేసింది. హిమాలయ శిఖరమంత ఎదిగిన వీరి ఔన్నత్యాన్ని వివరించడానికి అవకాశం కల్పించింది. కవిత్వాన్ని అందరికీ చేరువచేయాలనే వారి తపన నాలో ఈ వ్యాసాన్ని రాయడానికి ప్రేరణనిచ్చింది. 'శత్రువుతో ప్రయాణం', 'చివరకు నువ్వే గెలుస్తావు, మూడోమనిషి, వికారి అనే కవితా సంపుటాలను ఈ వ్యాసంకోసం పరిశీలించాను. సామాన్య వాక్యాలను అర్థవంతమైన కవిత్వంగా మలిచిన వారి నైపుణ్యానికి అబ్బురపడుతూనే ఆయా కవిత్వంలో కనిపించే కీలకాంశాలను వివరించే ప్రయత్నం చేశాను.

శత్రువుతో ప్రయాణం :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు 2015లో వెలువరించిన కవితా సంపుటి 'శత్రువుతో ప్రయాణం'. మొత్తం ముప్పైయారు కవితలున్న ఈ సంపుటి సమాజాన్ని అధ్యయనం చేయడానికొక దిక్సూచీలాగా ఉపయోగపడుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. 'కవిత్వం రాయడం నాకు వెన్నతో పెట్టిన విద్యకాదు... అలాగని కవిత్వమే రాయనివాణ్ణి కాదు' అంటూనే ఈ సంపుటిలోని కవితల్ని సమాజ దర్పణంగా తీర్చిదిద్దారు. తాను చూసిన సమాజ కోణాల్ని, తన దృష్టిలో కనిపించే సమాజ రూపాల్ని, అసమానతల్ని చూపించిన కొన్ని కవితలు పరిశీలిద్దాం.

'కోడికన్నా, కోకిలకన్నా / ఆయనే ముందు లేస్తాడు!
చంద్రుడికి చాపచుట్టేసి / సూర్యుణ్ణి నిద్రలేపుతాడు!
రెక్కాడితేగానీ డొక్కాడని / కుటుంబం కోసం
పక్షులతో పాటు / రెక్కలు విదుల్చుకుని
బయలుదేరుతాడు!
జీవన సమరంలో / కత్తి కిందపడకుండానే
మరణించిన వీరుడు!'

(శత్రువుతో ప్రయాణం: కత్తి కింద పడకుండానే..: పుటలు.11,12).

జీవన విషాదాన్ని గురించి రాసే ఎలిజీ తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమైంది. ఆత్మీయులు దూరమైనప్పుడు పడే మానసిక వేదనకు అక్షరరూపంగా 'స్మృతికవిత్వం' పేరుతో ఇది వెలుగులోకి వచ్చింది. పై కవిత తండ్రిని గుర్తుచేసుకుంటూ ఆయనకి నివాళిగా రాశారు. జీవితంలో తండ్రి పాత్ర మరువలేనిది. ఆయనిచ్చిన వారసత్వమే కాదు, ఆయన మార్గదర్శనం కూడా సంతానానికి దిశానిర్దేశం చేస్తుంది. అడుగడుగులోనూ తండ్రి జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. స్వర్గీయ మాడభూషి శ్రీనివాసాచార్యులవారి దినచర్యను, కుటుంబంకోసం వారు పడిన శ్రమను, రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంకోసం వారి త్యాగాన్ని ఈ కవితలో వివరిస్తారీ కవి. 'చంద్రుడికి చాప చుట్టేసి సూర్యుణ్ణి నిద్రలేపుతాడు' అనేది ఈ కవితలో కనిపించే గొప్ప అభివ్యక్తి. పౌరోహిత్యాన్ని ఎదుటివ్యక్తి హితానికే గానీ తన స్వార్థానికి ఉపయోగించుకోని ధన్యచరితగా తండ్రిని కీర్తిస్తారు. గుప్పెడుమెతుకులు పిల్లలకు పెట్టందే తాను తినని త్యాగమూర్తిగా వారి చరిత్రను గుర్తుచేసుకుంటారు. అద్భుతమైన సమయపాలన, పరహితం తప్ప స్వార్థ బుద్ధిలేని నిస్వార్థమైన పురోహితుడు.

'నన్నేకాదు / నేను కుట్టిన / చెప్పుల్ని కూడా
వాడు బయటే వదిలేస్తాడు!
అయినా చెప్పులు / విశ్వాసంగా / అరుగు దగ్గరే
కూర్చున్నాయి మళ్ళీ వాణ్ణి / మోసుకెళ్ళడానికి!'

(శత్రువుతో ప్రయాణం: చెప్పులు: పుట.55)

కులభావన మనసులో పుట్టిననాటినుండీ మనిషి మనిషిగా లేడు. అహంకారంతోనూ, ఆధిపత్యభావంతోనూ చెలరేగిపోతున్నాడు. తినే తిండీ, కట్టే బట్టా, ఉండే ఇల్లూ ఎవరి శ్రమ ఫలితంగా వచ్చాయో ఆలోచిస్తే తయారు చేసిన వారి కష్టం మనకు తెలుస్తుంది. చెప్పులు కుట్టడం వృత్తిగా ఉన్న కులాలను అవమానించడం మంచిది కాదనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాడు కవి. అవసరానికి అన్ని కులాలవాళ్లనీ వాడుకుని, అవసరం తీరిన తర్వాత వారిని నీచంగా చూసే మనుషుల వికృతరూపాన్ని చెప్తున్నాడు కవి. చెప్పుల్ని సంకేతంగా వాడుకుంటూనే వారిలోని విశ్వాస గుణాన్ని చాటిచెప్తున్నాడు.

'యుద్ధాన్ని గురించి భయంలేదు
మరణాన్ని గురించి భయంలేదు
క్రూరమృగాల గురించి
విషనాగుల గురించి
సునామీల గురించి
ఉప్పొంగే నదుల గురించి భయంలేదు
నా భయమంతా మనిషుల గురించే
మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే'

(శత్రువుతో ప్రయాణం: మనిషి: పుట.64)

ఆలోచనకు, ఆచరణకు మూలమైన వ్యక్తి మనిషి. మనిషి మాత్రమే మాట్లాడగలడు, అభినందించగలడు, సహాయం చేయగలడు, అవసరమైతే నమ్మకద్రోహం చేసి ప్రాణం తీయగలడు. మనిషిలోనే ఉన్న మరో మనిషిలో ఎన్నో వికృత కోణాలు కనిపిస్తాయి. మనిషి తన విజ్ఞానాన్ని ఉపయోగించి అణుబాంబులు తయారుచేస్తే వాటిని సమాజ శ్రేయస్సు కోసం కాకుండా వినాశనానికి వాడుతున్నాం. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నామని ఆనందపడుతున్నామే గానీ వాటివల్ల మనిషి తనలోని మానవత్వాన్ని మరిచిపోయి మృగంగా తయారవుతున్నాడని గుర్తించలేకపోతున్నాం. మనుషుల కంట పడకుండా అడవుల్లో సంచరించే క్రూరమృగాల వల్ల ఎప్పుడో ఒకసారి ప్రమాదం వస్తుంది. విషసర్పాలు, సునామీలు ఎప్పుడు పడితే అప్పుడు మనుషుల మీద విరుచుకుపడవు. నదులు ఇష్టానుసారం తీరందాటి మానవాళికి వినాశనాన్ని తీసుకురావు. కానీ మనిషి మాత్రమే ఇతరులతో మంచితనం నటిస్తూ వారిని మట్టుపెడతాడు. ఎప్పుడెలా ప్రవర్తిస్తాడో, ఎవరికి ఎలాంటి కీడు తీసుకు వస్తాడో ఎవ్వరికీ తెలియదు. అందుకే ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన, స్వభావసిద్ధంగా మన మధ్య తిరుగుతున్న జంతువుల గురించి భయంలేదుగానీ నాకు సాటి మనిషివల్లే భయం

కలుగుతుందని చెప్తున్నాడు కవి. చివరకు నువ్వే గెలుస్తావు నూతనత్వాన్ని, ఉత్తేజాన్ని నింపే కవితలతో 2016లో ముద్రించిన కవితా సంపుటి 'చివరకు నువ్వే గెలుస్తావు'. యాభైఏడు కవితలతో ఉన్న ఈ సంపుటిలో ఓడిపోయే వాళ్లలో చైతన్యాన్ని నింపే చేయూత ఉంది. పడిపోతున్న వాళ్లకు చేయందించే స్నేహహస్తముంది. ప్రతీ కవిత ఒక ప్రత్యేక నేపథ్యాన్ని కలిగివుంది. ఏ కవితకి ఆ కవిత జీవితమంత వ్యాఖ్యానానికి అవకాశమున్న కవిత. 'కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బుబిళ్ళ... కాదేదీ కవిత కనర్హం' అంటాడు శ్రీశ్రీ. అవే శీర్షికలను వాడి ఎంతో వైవిధ్యమున్న కవిత్వాన్ని సృష్టించారు ఈ కవి. కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, రొట్టెముక్క, అరటితొక్క, బల్లచెక్క, తలుపు గొళ్లెం, హారతిపళ్లెం, గుర్రపు కళ్ళెంలాంటి శీర్షికలతో రాసిన కవితలలో ఈ వైవిధ్యం మనకు కనిపిస్తుంది. అందరికీ వెలుగునిచ్చి/చీకటిగా మారి పోయింది అగ్గిపుల్ల' అని చెప్పిన కవితలో అగ్గిపుల్లను ఆకలితో చనిపోయిన రైతుని, ఏదీ అనుభవించలేని కార్మికునితోనూ పోలుస్తాడు. అందరికోసం పండించే రైతు, ఎన్నో ఉత్పత్తులు చేయడంలో శ్రమపడిన కార్మికులలాగా అందరికీ వెలుగు పంచిన అగ్గిపుల్ల కూడా చీకటిగా మారిపోయిందని చెప్తాడు కవి. 'లోక పరిశుభ్రతకు కరిగిపోయిన జీవితం నీది' అంటూ సబ్బుబిళ్ల గురించీ, 'వాడు దొంగగా మారిందీ, వీడు దొరగా పేరుపొందింది రొట్టెముక్క కోసమే' అంటూ రొట్టెముక్క గురించీ, 'నీకు తెలుసు నువ్వు చిన్నప్పటి నుండీ బానిసవని, ఎందరి రాజులకోసం నువ్వు ఒళ్లు కాల్చుకున్నావో' అంటూ హారతిపళ్ళెం గురించీ చెప్పిన కవితల్లో అర్థవిస్తృతి, భావవైవిధ్యం కనిపిస్తుంది. ఇంకా అనేక కవితల్లో కనిపించే వైవిధ్యాన్ని మనం చూడ వచ్చు.

'కవిత్వానికి సముద్రానికి
సంబంధం ఏమిటి?
సముద్రంలో ఉప్పునీళ్ళు
కవిత్వంలో కన్నీళ్ళు'
(చివరకు నువ్వే గెలుస్తావు: సముద్రం: పుట.49)

ప్రాచీనకాలం నుండీ, ఆధునిక కాలందాకా 'సముద్రం' కవిత్వానికి ఊపిరయింది. సముద్రం ఉవ్వెత్తున ఎగిసిపడే ఉద్యమానికి ప్రతీక. సముద్రం రగులుతున్న అగ్నిపర్వతానికి సూచిక. అలుపెరగని కెరటాల్ని చూసినప్పుడల్లా మనిషిలో ఏదో తెలియని చైతన్యపీచిక కదలాడుతుంది. సాహిత్యంలో సముద్రాన్ని ఒక్కో కవీ ఒక్కో రకంగా ఉపయోగించుకున్నారు. అద్భుత మైన ప్రతీకగా సముద్రాన్ని కవిత్వంలో వాడుకున్నారు. అందుకే పై కవితలో కవి సముద్రానికి కవిత్వానికి సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నాడు. సముద్రాన్ని చూసిన కవులు తమను తామే మర్చిపోయి అద్భుతమైన కవిత్వాన్ని సృష్టించడానికి కారణమేమిటని అడుగుతాడు. నిండా నీరున్నా దాహం తీరని ఉప్పునీళ్లతో ఉన్న సముద్రం ఎంతోమందికి ప్రేరణిచ్చింది. కవిత్వం కూడా మనిషికి చైతన్యాన్ని నింపి కర్తవ్యం పట్ల కార్యోన్ముఖుల్ని చేస్తుంది. కన్నీళ్లను తుడుస్తుంది. ఓదారుస్తుంది. కనుకనే సముద్రానికి, కవిత్వానికీ పోలిక చెప్తున్నాడు కవి.

'చెట్టుపూసిన / పువ్వులను తురుముకోండి
చెట్టుకాసిన / కాయలను తినండి
చెట్టుకు కాసిన / ఆకులను ఉపయోగించుకోండి
చెట్టును మాత్రం నరికేయకండి!'
(చివరకు నువ్వే గెలుస్తావు: చెట్టు:పుట.63)

చెట్టు మానవాళి మనుగడకు ఊతకర్ర. ఆది మానవులు చెట్టుతొర్రలనే ఆవాసాలుగా చేసుకున్నారు. చెట్టునొక దైవంగా పూజించారు. చెట్టును అవసరాలు తీర్చే కల్పవల్లిగా భావించారు. అందుకే 'చెట్లు ప్రగతికి మెట్లు' అనే నినాదం వెలుగులోకొచ్చింది. కాలక్రమంలో జనాభా పెరిగిపోయింది. పెరిగిన జనాభా అవసరాలకు తగినట్లుగా ఇంటి నిర్మాణాలకు చెట్లు కొట్టక తప్పింది కాదు. ప్రస్తుతంకాలంలో అవసరం అయినా కాకపోయినా చెట్లు కొట్టడం ఎక్కువయిపోయింది. చెట్టుకు పూసిన పువ్వులను వాడుకుంటున్నాం, చెట్టుకు కాసిన కాయలను తింటున్నాం, అన్ని అవసరాలకు చెట్టు ఆకులను

వాడుకుంటున్నాం. అయినా నిర్దాక్షిణ్యంగా చెట్లను కొట్టేస్తున్నాం. ఇది భవిష్యత్తరాల మనుగడకే ప్రశ్నార్థకంగా మారింది. అందుకే బలమైన అంశాన్ని సున్నితంగా, హెచ్చరికగా చెప్తున్నాడు కవి.

గెలిచినవాడికన్నా / ఓడిన వాడే గొప్ప
గెలవడం కోసం / చాలా ప్రయత్నించి ఉంటాడు!'
(చివరకు నువ్వే గెలుస్తావు: ఓడినవాడు: పుట.59)

జీవితం గెలుపోటముల సమ్మేళనం. 'గెలిస్తే నువ్వు లోకానికి పరిచయమవుతావు, ఓడితే నీకు ప్రపంచం పరిచయమవుతుంది' అంటూడొక సినీ రచయిత. వాస్తవంలో గెలుపుకిచ్చిన ప్రాధాన్యత ఓటమికివ్వరు. జీవితంలో గెలుపు లభించినా, ఓటమి పలకరించినా దాని పరమార్థం జీవితంలోని ఎత్తుపల్లాలను పరిచయం చేయడానికేననే విషయాన్ని అందరూ గుర్తించలేరు. అందుకే గెలిచినవాడికన్నా ఓడినవాడే గొప్ప అంటున్నాడు కవి. ఒక్కసారి గెలిస్తే ఆ గెలుపు ఇచ్చిన తృప్తితో ఇంకోటి సాధించాలన్న దానిమీద దృష్టి ఉండదు. కానీ ఓటమి మాత్రం మళ్ళీమళ్లీ గెలిచేదాకా ప్రయత్నం చేయిస్తూనే ఉంటుంది. అందుకే గెలవడానికి పదేపదే ప్రయత్నించే ఓటమి కూడా గొప్పదని చెప్తున్నాడు కవి.

మూడో మనిషి :

2017లో ముద్రించిన ఈ సంపుటంలో ముప్పై ఎనిమిది కవితలున్నాయి. సమకాలీన సమాజంలోని అనేక వైరుధ్యాలను అక్షరీకరించిన కవిత్వమిది. ప్రతీ కవిత వారి ఆవేదనకు అద్దం పడుతుంది, పాఠకులలో ఆలోచనను రేకెత్తిస్తుంది. మనిషి తనను తాను తెలుసుకుంటూ, సంస్కరించుకుంటూ ముందుకు సాగమని ప్రబోధిస్తుంది. ఈ సంపుటిలో వారి ప్రతిభకు, కవితాశక్తికి తార్కాణంగా కనిపించే కొన్ని కవితల్ని పరిశీలిద్దాం.

'మట్టిని పిసుక్కుంటూ / ఆనందించే రైతు
ఇప్పుడు చేతులు పిసుక్కుంటూ / ఆవేదన చెందుతూ
ఉన్నాడు / అప్పిచ్చినవాడు / అరుగుమీద
కూర్చున్నాడు పాలం ఎండిపోయి వెక్కిరిస్తోంది'
(మూడోమనిషి: రైతు: పుట.34)

భారతదేశం వ్యవసాయాధారిత దేశం. నూటికి డెబ్భై మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. జాషువా చెప్పినట్లు 'వాని రెక్కల కష్టంబు లేనినాడు సస్యరమ పండి పులకింప సంచయించు' అన్నట్లుగా ఈ దేశంలోని రైతులు కష్టంమీదే ఆధారపడి బతుకు వెళ్లదీస్తున్నారు. ఆరుగాలం శ్రమించినా గంజిలోకి రాని గింజల్ని చూసి రైతులు దిగాలు పడుతూనే ఉన్నారు. వాతావరణం మీద ఆధారపడిన పంట అతివృష్టికో, అనావృష్టికో దెబ్బతింటే రైతులంతా మళ్ళీ పంట వేయడానికి అప్పులమీద ఆధారపడక తప్పని స్థితి. వేసిన పంటనుండి లాభాలు రాకపోగా, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయాన్ని, రైతుల్ని, నకిలీ పురుగు మందులు, అప్పులు మొదలైన వాటితో రైతులు పడుతులు ఇబ్బందుల్ని, కళ్లముందే ఎండిపోయి వెక్కిరిస్తున్న పంటల్ని చూసి ఆవేదన చెందుతున్నాడు కవి. ఎన్నేళ్లు గడిచినా మారని రైతు పరిస్థితిని చూసి దుఃఖిస్తున్నాడు.

'ఇంటినిండా జనం / ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది ఏదో పాగ అలుముకున్నట్టు దుఃఖానికి ఒక ఇల్లుకట్టినట్టు ఉంది!' (మూడోమనిషి: శవం లేచిన ఇల్లు: పుట.28) చావు పుట్టుకలు అనివార్యం. ఎన్ని సంపదలతో తుల తూగినా, ఎంత వైభోగంగా బతికినా మనిషి జీవితం నీటి బుడగలాంటిదే! అయినవప్పటికీ అయినవాళ్లో, ఆత్మీయులో దూరమైనప్పుడు మనసు అంతులేని దుఃఖంతో నిండిపోతుంది. చనిపోయినవారితో ఉన్న అనుబంధాలు, ఆత్మీయతలు అన్నీ గుర్తొచ్చి మనసు శూన్యంగా అనిపిస్తుంది. ఆ పరిస్థితిని పై కవితలో వ్యక్తం చేస్తున్నాడు కవి. ఆత్మీయుల మరణంతో ఏర్పడిన ఖాళీని 'దుఃఖానికి ఒక ఇల్లు కట్టినట్టు ఉంది' అనడం ద్వారా పాఠకుల మనసులో భావోద్వేగాన్ని నింపుతారు.

'ఎన్నిసార్లు విస్తళ్ళువేసినా / వాడే ముందు కూర్చుంటాడు /ఎన్నిసార్లు వడ్డించినా మీ వరకూ రాదు వడ్డించేవాడు మావాడేననుకుంటారు మీరు / కానీ వాడు వాడికే వడ్డించుకుంటున్నాడు'

(మూడో మనిషి: వడ్డించిన విస్తరి: పుట.47)

భారతదేశం కులాల ఆధారంగా, మతాల ఆధారంగా, ప్రాంతాల ఆధారంగా మనుగడ సాగిస్తున్న దేశం. 'భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు' అని ప్రతిజ్ఞ చేసినా వాస్తవంలో పరిస్థితి అందుకు భిన్నం. కొన్ని ప్రాంతాలలో ఇంకా రెండు గ్లాసుల పద్ధతి అమలులో ఉండడం దురదృష్టకరం. అంటరానికులాల వారిని చేసుకున్న కారణంగా జరుగుతున్న పరువు హత్యలకు అంతేలేదు. ఆటవిక దశనుండి అంతరిక్షం దాకా మనిషి ఎదిగాడు. మేధస్సుతో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నాడు గాని 'మన కులంవాడే' అనే విషయంలో మాత్రం తన విజ్ఞతను కోల్పోతున్నాడు. మనుధర్మశాస్త్ర కాలం నుండీ ఈ జాడ్యం కొనసాగుతూనే ఉంది. గుర్రమెక్కాడనీ, టోపీ పెట్టుకున్నాడనీ, పక్కన కూర్చుని భోజనం చేశాడనీ కారణాలు చూపుతూ అధీన కులాల వ్యక్తులను అత్యంత క్రూరంగా చంపుతున్నారు. ఈ పరిస్థితులన్నీ వార్తాపత్రికల ద్వారా, టీవీ మాధ్యమాల ద్వారా మనం నిరంతరం చూస్తూనే ఉన్నాం. ఆ విషయంలో ఈ కవిత ద్వారా ఒక ఆలోచనను రగిలించడం స్ఫూర్తిదాయకం. అధికారం ఎవరి పేరుమీద ఉన్నా దానిని వాస్తవంగా ఎవరు అనుభవిస్తున్నారో, నిధులు అణగారిన వర్గాల వారికి వచ్చినా వాటిని ఎవరు అనుభవిస్తున్నారో బహిరంగ రహస్యమే. సర్పంచుల దగ్గర్నుంచి దేశాధినేతల వరకూ పదవుల్లో ఉన్నా అధికారం లేకుండానే మనుగడ సాగించడం మనకు తెలిసిందే. అందుకే 'పక్కా ఇళ్ళు' అనే మరో కవితలో 'పక్కా ఇళ్ళు తప్ప పక్కనే ఇళ్ళు కట్టుకోలేకపోయారు' అంటూ చెప్పిన కఠోర నిజం కింది కులాల వారి విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి నిదర్శనం.

'పుట్టినరోజునుంచి / కలల్లో కళ్ళల్లో / అమెరికా కనిపిస్తూ ఉంటే పసితనాన్ని / అనుభూతుల్ని / అనుభవాల్ని / పాతరేసి గూగుల్నే ప్రపంచంగా తీసుకుని మార్కులు ర్యాంకులు / తప్ప రెండో ధ్యాసలేకుండా / జీవితమంతా పరిగెత్తి పరిగెత్తి / సాధించిన అమెరికా ప్రయాణం / చివరికి ఒకే ఒక క్షణంలో / విధిపేరుతో వివక్షకు బలయిపోయింది' (మూడో మనిషి: అమెరికా: పుటలు.40,41) భారతీయుల కలల్లోనూ, కళ్ళల్లోనూ కనిపించే భూతల స్వర్గం అమెరికా. ప్రతి ముస్లిం తాను చనిపోయేనాటికి ఒక్కసారైనా మక్కా వెళ్లాలని ఎలా అనుకుంటాడో, ప్రతీ భారతీయుడూ ఎప్పటికైనా అమెరికా వెళ్లాలని కలలు కంటాడు. అందుకోసం ఎన్నో కష్టాలు పడతాడు. అనుభూతుల్ని, ఆప్యాయతల్ని ఫణంగా పెట్టి భూతలస్వర్గానికి నిచ్చెనలు వేసుకుంటాడు. పుట్టిన ఊరినీ, కన్నవారినీ విడిచిపెట్టి తను సాధించాలనుకున్న లక్ష్యాల కోసం పరుగులు పెడతాడు. అక్కడికి వెళ్లాకగానీ తత్వం బోధపడదు. తను పొందుతున్న దేమిటో, పోగొట్టుకున్న దేమిటో తెలిసేటప్పటికి జీవితం విధి చేతిలో బలయిపోతుంది. వివక్ష దారుణంగా ఉసురుతీస్తుంది. అనుభూతుల్ని, అనుభవాల్ని తనఖాపెట్టి సాధించిన అమెరికా ప్రయాణం చివరికి దేన్ని కానుకగా ఇస్తుందనే విషయాన్ని చాలా లోతుగా చెప్తున్నారు కవి.

వికారి :

2019లో ప్రచురించిన 'వికారి' కవితాసంపుటిలో 29 కవితలున్నాయి. జీవితంలో ఎదురైన ప్రతీ సంఘటనను అత్యంత ప్రతిభావంతంగా మలచిన తీరు అభినందనీయం. మాట్లాడే మాటలను కవితా వాక్యాలుగా పేర్చుకుండా, తనను ఉద్విగ్నతకు గురిచేసిన సమకాలీన సంఘటనలను కవిత్వంగా మలిచి మన ముందుంచుతారు. కళ్లముందు కనిపించే వ్యవస్థ వికృతరూపాన్ని, అభ్యుదయ భావాల్ని అతిసున్నితంగా, కొన్ని చోట్ల వ్యంగ్యంగా, మరికొన్ని చోట్ల ఎంతో ఆర్ద్రంగా, హృద్యంగా కవితామయం చేయడం కవి ప్రతిభకు తార్కాణం.

నీకున / శత్రువులెవరూ లేరు / నీకు / నువ్వే శత్రువు మానసిక పరిపక్వత లేనివాళ్లకు / ప్రపంచమంతా / శత్రుసమూహంలా కనిపిస్తుంది (వికారి: శత్రువు: పుట.34) ఈనాటి సమాజాన్ని, మనుషుల్ని బలమైన బంధాలకంటే నోట్లకట్టలు నడిపిస్తున్నాయన్నది అంగీకరించవలసిన వాస్తవం. పోటీ ప్రపంచంలో పరిగెడుతూ, మనిషితో మనిషికి సంబంధం లేనంత తీరికలేని జీవితాన్ని గడుపు తున్నాం. ఈ పోటీ ఒక్కోసారి పక్క వ్యక్తులతో ఉంటే, ఒక్కోసారి మనతో మనకే ఉంటుంది. పోటీ ప్రపంచంలో ఎక్కడ వెనుకబడతామో అనే భయంతో ఇతరుల్ని నాశనం చేసైనా పైకి రావాలనే తీవ్రమైన కాంక్ష నేడు మనం చూస్తున్నదే. మనిషికి తన మనసును మించిన శత్రువు మరొకటి లేదు. ప్రపంచాన్ని జయించిన మనుషులు కూడా మనసును జయించలేక కనుమరుగైన సంఘటనలు చరిత్రనిండా మనకు కనిపిస్తాయి. 'మనిషికి మనసే తీరని శిక్ష' అంటాడొక సినీకవి. నిజమే కామం, క్రోధం, లోభం, మోహంలాంటి అరిషడ్వర్గ లక్షణాలన్నీ మనసులో నుండి పుట్టి మనిషి అంతం చూసేవరకూ విడిచి పెట్టవు. అందుకే మనిషి తనను తాను తెలుసుకోవడం, పరిపక్వత పొందడం అవసరం అని చెప్తున్నాడు కవి.

'ఒకడు గంటకొట్టి / పలకరిస్తాడు-పళ్ళు ఇకిలిస్తూ ఒకడు కళ్లతోనే / నవ్వుతాడు-సంకేతంగా /ఒకడు సకిలిస్తాడు / గొంతు సవరించుకొంటున్నట్టు ఒకడు చేత్తో స్పర్శిస్తాడు / ఏదో సాధించినట్టు' (వికారి: చెక్కు చెదరని నవ్వు: పుట.38) నవ్వడం భోగం, నవ్వకపోవడం రోగం అంటాడు జంధ్యాల. సంస్కృతం ఆరు రకాల నవ్వుల్నే చెప్పింది. కానీ మనిషి తన నిత్యవ్యవహారంలో ఎన్నో నవ్వుల్ని సృష్టిస్తాడు. మనిషికి మాత్రమే ఉన్న అరుదైన వరం నవ్వడం. మన నవ్వు ఇతరుల్ని ప్రోత్సాహపరిచేదిగా ఉండాలి. భరోసా ఇచ్చేదిగా ఉండాలి. ప్రేమను పంచేదిగా ఉండాలి. అంతేగానీ వెకిలిగా, చిలిపిగా, కసిగా విసిరే నవ్వులు ఎదుటివారి మనసుల్ని గాయపర్చి మనోభావాల్ని దెబ్బతీస్తాయి. కానీ ఇతరుల్ని పలక రించడం, ఎదుటివారిని చూసి నవ్వడం అభయం ఇచ్చేలా హుందాగా ఉండాలని చెప్తున్నాడు కవి. 'అయినవాళ్ళకోసం / వాకిట్లో కాపలాకాసినట్లు / శత్రువుల కోసం / సరిహద్దులో కాపలాకాసే / సైనికుణ్ణి / మరణం అంటదు!' (వికారి: మరణం: పుట.42)

ప్రతి భారతీయుడు తిండిగింజలు పండిస్తున్న రైతుకీ, దేశానికి కాపలా కాస్తూ భద్రతనిస్తున్న సైనికుడికీ తప్పనిసరిగా రుణపడి ఉండాలి. ఎన్ని అవరోధాలొచ్చినా ప్రాణత్యాగం చేసైనా సరే రైతు దేశానికి తిండిగింజలు పండిస్తున్నాడు. మనం మన కుటుంబాలతో సుఖంగా, సంతోషంగా, భద్రతగా ఉండడానికి సైనికుడు తన జీవితాన్ని ఫణంగా పెడుతున్నాడు. సైనికులు తమ జీవితాలను ఎంత తృణప్రాయంగా ఎంచు కుంటారో దేశంకోసం వారు చేసే త్యాగాల ద్వారా మనం గమనించ వచ్చు. ఊరికి దూరంగా, చలిలో, తుపాకీ పట్టుకుని కాళ్లు కదల్చకుండా, చేతులు వణక్కుండా కాపలా కాస్తూ ప్రాణభిక్ష పెడుతున్న సైనికుడికి అందరూ శిరసువంచి నమస్కరించాల్సిందే! వాతావరణ పరిస్థితులకు ఎదురీది, ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ సరిహద్దుల్లో భారతీయుల రక్షణ కోసం పోరాటం చేసే ప్రతీ సైనికుడు భౌతికంగా మరణించినా వారు చేసిన త్యాగాల ద్వారా మరణం అంటని మనుషులుగానే భారతీయుల గుండెల్లో నిల్చిపోతారని చెప్తున్నాడు కవి.

'అన్నీ ఒకదానితో ఒకటి / విశ్వాసంగా ఉన్నంతకాలం / నిశ్వాసానికి కొరతలేదు / మనిషి / అనే ఒకే ఒక / బొట్టు కాలుష్యం / వీటితో కలిసి / ప్రకృతి ప్రశ్నార్థకమైంది' (వికారి: ప్రకృతి: పుట.50) భూమ్మీద భగవంతుని అద్భుత సృష్టి ప్రకృతి. మనిషి తనను తాను కాపాడుకుంటూనే ప్రకృతిని కాపాడాలి. చెరువులు, బావులు అన్నీ మనిషి అవసరాల కోసమే అయినా తన స్వార్థంతో వాటిని పూడ్చేసి వాటిమీద బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి తన మరణశాసనం తనే రాసుకుంటున్నాడు. విపరీతమైన స్వార్థం కారణంగా నదుల్ని కలుషితం చేస్తున్నాడు. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని, ప్రకృతిని పూర్తిగా ధ్వంసం చేసుకుంటున్నాడు. పచ్చని అరణ్యాల్ని కూడా కాంక్రీటు

కీకారణ్యంగా మార్చేస్తున్నాడు. అందుకే 'మనిషి అనే ఒకే ఒక బొట్టు కాలుష్యంతోనే ప్రకృతి ప్రశ్నార్థకమైంద'ని కవి తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. మనిషికి వరంగా లభించిన చెట్లు, అడవులు, కొండలు, నదులు అన్నిటినీ కాపాడు కోవాలనే ఉద్బోధతో పాటు వాటి పరిరక్షణకు పాటు పడమని హెచ్చరిస్తున్నాడు కవి.

'కోటీశ్వరుడు / కోట్ల నోట్లకట్టల మీద పడుకున్నట్లు
రైతు మట్టిమీద పడుకుని మురిసిపోతాడు!
పాలమే వాడికి కాయితం- / పాలమే వాడికి జీవితం-'
(వికారి: రైతు ఆత్మకథ: పుట.60)

చక్కటి అభివ్యక్తితో రైతు జీవితాన్ని కళ్లముందుంచే గొప్ప కవిత ఇది. తీసుకున్న ఉపమానాలు పాఠకులలో కవితాశక్తిని పెంచి తీవ్రమైన ఆలోచనలో మునిగేటట్లు చేస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు. రైతు మట్టిమీద పడుకుని మురిసిపోవడం అనేది గొప్ప తాదాత్మ్యతకు చిహ్నం. తరతరాలుగా మట్టికీ మనిషికీ అనుబంధం ఉంది. అది ఒకరకమైన బంధం. కానీ మట్టికీ - మట్టిమనిషిగా బతికే రైతుకీ మధ్య పెనవేసుకున్న ఈ బంధం అనిర్వచనీయమైంది. కష్టాన్ని నమ్ముకుని రాత్రీపగలూ వ్యవసాయం చేసే రైతు తన ఆత్మకథను తాను రాసుకోలేడు. అప్పులున్నా, ఆత్మహత్య చేసుకునే పరిస్థితులెదురైనా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తన మనుగడ సాగిస్తూనే ఉంటాడు. తన కష్టం దేశానికి చేసే పరోపకారంగానే భావిస్తాడు తప్ప తన అవసరాల గురించి ఆలోచించడు. అందుకే విరామ మెరుగని, విశ్రాంతి తెలియని రైతు తన జీవితాన్ని ఆత్మకథగా రాసుకోలేడని చెప్తున్నాడు కవి.

'నువ్వు పసికందువు కావచ్చు / పండు ముదుసలివి కావచ్చు / యవ్వనవతివి కావచ్చు / గర్భవతివి కావచ్చు / ఒంటరిదానివి కావచ్చు /కామాంధుడికి / ఇవన్నీ కనిపించవు కలిసివచ్చే అంశాలుగానే ఉంటాయి' (వికారి: కుక్కలుంటాయి జాగ్రత్త: పుట.70) కుక్కలుంటాయి జాగ్రత్త అనే శీర్షికతోనే చెప్పదలచిన విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాడు కవి. స్త్రీలపై జరుగుతున్న శారీరక, లైంగిక హింసకు ప్రతీక పై కవిత. వావివరసలు మరిచి స్త్రీలపై అత్యాచారాలు చేస్తున్న దారుణమైన పరిస్థితుల్ని మనం నిత్యం వార్తాపత్రికల ద్వారా చూస్తూనే ఉన్నాం. నెలల చిన్నారుల్నీ, చిన్నపిల్లల్నీ, పండుముసలి వాళ్లనీ, వయసులో ఉన్నవాళ్లనీ, గర్భవతుల్నీ, ఒంటరివాళ్లనీ కూడా వదల కుండా కామాంధులు తెగబడడం సిగ్గుచేటు. నిర్భయ చట్టాలు వచ్చినా, దిశ పేరుతో చట్టాలు చేసినా ఈ అత్యాచారాలు ఆగట్లేదు. ఇటువంటి సంఘటనలు చూసినప్పుడల్లా మనుషులుగా మనం ఎటువైపు పయనిస్తున్నామో తెలియని ఆవేదన పై కవితలో వ్యక్తం చేస్తున్నాడు కవి.

ముగింపు :

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి కవిత్వం నిండా మానవత్వం పరుచుకుని ఉంటుంది. ఎదలో జ్వాలను రగిల్చి దానికి కారణాలను వెతకమనే ఉద్బోధ ఉంటుంది. మనిషిని మనిషి అర్థంచేసుకోలేని అంతరంగ కల్లోలముంటుంది. అణగారినవారికి ధైర్యం నూరిపోసే తెగువ కనిపిస్తుంది. ఓడిపోయి నిరాశచెందేవారిలో ఉత్తేజం కలిగించే ప్రబోధం తొంగిచూస్తుంటుంది. మన మూలాలను మనమే నాశనం చేసుకోకూడదనే సందేశం కనిపిస్తుంది. సమాజంలో కనిపించే అన్ని అంశాలను, కోణాలను వీరు తమ కవితలలో పొందుపర్చి కవిత్వాని కొక నిండుదనాన్ని చేకూర్చారు. మనిషి బుద్ధిజీవి, ఆలోచన జీవి, ఆచరణశీలి అనే విషయాలను తమ కవిత్వంలో నిరూపించారు. నిజాయితీగా, నిక్కచ్చిగా, తాను నమ్మిన సిద్ధాంతాల్ని ముక్కుసూటిగా, కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పడం వీరి వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే మరొక కీలకాంశం. కవిత్వమంటే కేవలం కాగితాన్ని నలుపు చేయడం కాదని, నలిగిపోతున్నవారికి భరోసానిచ్చే బతుకుసూత్రమని తెలియజేస్తుంది. తాను చూసిన, తనను కదిలించిన ప్రతీ విషయాన్నీ తన దృక్కోణంలోనుండి విశ్లేషిస్తూనే దాన్ని సమాజానికి అన్వయించిన తీరు మాడభూషిగారి 'సంప'ద్వంతమైన కవిత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవన సమరం

- డాక్టర్ డి.వేలాయుధం, తెలుగు ఉపన్యాసకులు.

తెలుగు సాహిత్యానికి చిత్తూరు జిల్లా కవుల గురించి, రచయితల గురించి మాట్లాడుకునేటప్పుడు మాడభూషి సంపత్‌కుమార్ గారు రచించిన 'కత్తి కింద పడకుండానే..' అనే కవిత్వాన్ని గురించి చెప్పకుండా దాటివేయలేం. అయినా ఈ కవిత్వాన్ని గురించి తెలుసుకునే ముందు మాడభూషి గారిని గురించి నాలుగు మాటలు చెప్పుకోవలసిన అవసరం ఉంది. మాడభూషి మంచి కళాకారుడు. చిన్నవయసు నుంచే వీధి నాటకాలంటే ప్రాణం. అభినయంగా పాడగలడు, ఆడనూగలడు. అతి చిన్న వయస్సులోనే అంటే ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడే "మహాప్రస్థానం" కావ్యాన్ని ముందుమాట నుంచి అందులో ఉన్న కవిత్వాన్ని అవపోసనపట్టి అనర్గళంగా చెప్పేవాడు. తెలుగు పాఠ్యపుస్తకాల్లోని పద్యాలన్నీ నోటికి వచ్చేవి. ఆధునిక సాంకేతి పరిజ్ఞానం మెండు, మంచికి మారు పేరు, మానవతావాది మాడభూషి. ప్రాథమికోన్నత పాఠశాల విద్య తల్లిదండ్రుల గారాబంతో అన్నవదినల అనురాగ ఆప్యాయతలతో ఆరంభమైంది. చిన్న వయస్సులోనే సంస్కృత శ్లోకాలను కంఠస్థం చేశాడు. భాషమీద అభిమానంతో చిత్తు కాగితాల మీద చిన్న చిన్న కవితలు రాసిన సందర్భాలు లేకుండాపోలేదు. ఇంటర్మీడియట్ పిసిఆర్ కళాశాలలో, డిగ్రీ చిత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివారు. తనలో ఉన్న భాషాభిమానాన్ని ఆపుకోలేక మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.చదివే రోజుల్లోనే తమ జూనియర్స్‌కు మహాప్రస్థానం బోధించే వారంటే ఆయన ప్రతిభను గుర్తించడానికి దీనికంటే వేరే చెప్పనక్కర్లేదు. భాషాభిమానంతో వివిధ ప్రాంతాలు తిరిగి కవులతో రచయితలతో పరిచయాలు పెంచుకొని మధురై కామరాజు విశ్వవిద్యాలయంలో 1990లో ఎరుకల భాష మీద పరిశోధన చేసి పిహెచ్.డి.పట్టా పొందారు. పరిశోధన చేసేటప్పుడు ఎరుకలవారితో కలసిమెలసి వారి నివాసంలోనే ఉండి వారితోపాటు నిరాడంబర జీవిగా, సహృదయుడిగా కలిసిపోయేవాడు. ఆయనకు తెలుగుభాషలో నచ్చనివదం 'కులం'. ఈ విషయం నేనెందుకు చెబుతున్నానంటే కేవలం నోటిమాటలతో రచనలతో ఏదో చెప్పాము, ఏదో చేశామని కాకుండా ఒక దళితుణ్ణి తన కుటుంబ సభ్యుల్లో ఒక్కనిగా గుర్తించి కాపాడాడంటే ఆయన అంటరానితనం నిర్మూలనకు చేపట్టిన కార్యసాధన ఎలాంటిదో ప్రశంసనీయం గర్వించదగ్గ విషయం. నేనేకాదు నాలాగ ఎందరినో ఎందరెందరినో ఆదరిస్తూ ఉన్నారు. నేడు కుల వ్యవస్థతో కుమ్ములాడుకుంటున్న ప్రతి ఒక్కరు మాడభూషి గారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరుకుంటున్నాను.

మాడభూషిగారు బహు భాషాకోవిదుడు నేను ఆయన పర్యవేక్షణలో తిరుక్కురళ్ గురించి పరిశోధన చేసేటప్పుడు ప్రతి మాటకు ప్రతిపాటకు తమిళంలో లోతైన అర్థాలు చెప్పేవారు. అపారమైన సామాజిక దృక్పథం ఆయన ప్రతి రచనలోను కనబడుతుంది. భాషకోసం, సాహిత్యం కోసం తనవంతు పత్రికల్లో కొన్నాళ్ళు, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో కొన్నాళ్ళు, విద్యార్థులతోను, పరిశోధకులతోను తన జీవితాన్ని సాగిస్తూనే ఉన్నారు. ఇంకా ఎన్నో విషయాలు చెప్పాలని ఉంది. అయితే ఈ వ్యాసం సరిపోదు. అందువల్ల ఆయన రచించిన 'కత్తి కింద పడకుండానే...' అనే కవితలో తన తండ్రి పడ్డకష్టాలు, తన కుటుంబ జీవన విధానం, చుట్టు పక్కల వుండే పర్యావరణ ప్రాంతాలు గ్రామీణ వాతావరణంలో కోడి మేల్కొల్పులు కోకిల పాటలు బిడ్డలను కాపాడడానికోసం వాళ్ళ నాన్న పరిగెత్తిన పరుగు, తండ్రి రాకకోసం పిల్లల ఎదురు చూపులు తదితర అంశాలన్నీ ప్రతి తండ్రికి వర్తిస్తాయని, ప్రతి బిడ్డను తల్లిదండ్రులు ఎలా

కాపాడతారన్న విషయాలన్నీ ఈ కవిత్వంలో కవి పొందుపరిచాడు. ఇంతేకాకుండా చిత్తూరు జిల్లా పుర జనుల కోసం వాళ్ళ నాన్న చేసిన వృత్తి, పూజలు పునస్కారాలు ఈ కవితలో తేట తెల్లమవుతాయి.

ఈ కవిత వాళ్ళ నాన్న గురించే రచించినా దీనిని వినిన, చదివినా, ప్రతి ఒక్కరికి ఎవరి నాన్న పడే కష్టాలు వారి వారికంటికి కట్టినట్లు చూపించడం ఈ కవిత ప్రత్యేకత. ఇందులో ఉన్న ప్రతి చరణాన్ని విశ్లేషించినట్లయితే ఆ కవిత గొప్పతనం ఏమిటో తెలుస్తుంది.

"కోడికన్నా / కోకిలకన్నా
ఆయనే ముందు లేస్తాడు!
చంద్రుడికి చాప చుట్టేసి
సూర్యుణ్ణి నిద్రలేపుతాడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట.11)

గ్రామాల్లో కోడికూస్తేనే మేల్కొంటాం కోకిలగానం వింటూ పరవశించి పోతాం. కోడి, కోకిలా ముందుగానే నిద్రలేస్తాయి. అయితే కోడికన్నా కోకిలకన్నా ముందుగానే నిద్రలేవటం అసాధ్యం. ఒకవేళ నిద్రలేచినా ఒకటి రెండు రోజులైతే సరే, ఆయన నిత్యం నిద్రలేచేవారు. కోడి కూసిందంటేనే మేల్కొంటాం. తెల్లవారిందని తెలుస్తుంది. ఒకవేళ కోడికూయకపోయినా కోకిల పాటవినిపిస్తుంది. అంటే ఇంకా బాగా తెల్లవారిందని అర్థం. కాని కోడి మేల్కొలుపులకన్నా, కోకిల గానం కన్నా ఆయనే ముందు లేచేవారు. ఈ రెండింటికంటే ముందుగానే నిద్రలేచి చంద్రుడికి చాపచుట్టడం, సూర్యుణ్ణి నిద్రలేపటం అతిశయోక్తి. ఎందుకంటే సూర్యచంద్రులు ఎవరి పని వారే చేసుకుంటారు. ఇక్కడ ప్రవృత్తిని చూసి మనం నేర్చుకోవాలి. అయితే మాడభూషి శ్రీనివాసాచార్యులు ప్రకృతికే కాలగమనం నేర్పాడనడం ప్రకృతిని ఎంతగా ప్రేమిస్తున్నా రనడానికి నిదర్శనం.

"ఊరు ఒళ్ళు విరుచుకొంటూ ఉండగానే
ఊరికోసం
దేవుణ్ణి స్మరిస్తూ-"

(శత్రువుతో ప్రయాణం, పుట.11)

సూర్యుడొచ్చాడు బాగా తెల్లవారింది ఊరి జనాన్ని కాపాడమని ఆ ఊరి దేవుణ్ణి స్మరిస్తూ నిత్యం పూజచేసి వారిని ఏ విధంగా పనులకు పంపుతాడో వారి పరిస్థితి లేమిటో చూద్దాం.

"రెక్కాడితేగానీ డొక్కాడని
కుటుంబంకోసం
పక్షులతో పాటు
రెక్కలు విదుల్చుకొని
బయలు దేరుతాడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట.11)

ఆ ఊళ్ళో ఉన్న పరిస్థితిని తన కుటుంబం జీవనాన్ని పై చరణాలలో చాలా చక్కగాను, కంటికి కట్టినట్లుగాను చూపించడం మాడభూషి సంపత్‌కుమార్ గారి ప్రత్యేకత. కష్టపడితేనే కడుపు చల్లారుతుంది. బిడ్డల్ని కాపాడాలంటే తల్లిదండ్రులు నిరంతరం కష్టపడాలి. గూటిలో పక్షుల్ని పెట్టి పక్షులు బయలుదేరుతాయి. అదేవిధంగా బళ్ళో బలపం చేత పట్టించి రెక్కలను ముక్కలుగా చేసుకొనే తమ తల్లిదండ్రులు పిల్లలకోసం ఎలా బయలుదేరి తమ రక్తాన్ని ఏవిధంగా దారబోస్తారో కింది చరణాల్లో చూడవచ్చు.

"చెమట ముక్కల్ని
నీటి చుక్కలు చేసి
పిడచ కట్టిన పిల్లల
నాల్కలపై పోస్తాడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట.11)

ఎవరైనా తమ బిడ్డలను పైవిధంగా పోషిస్తారన్న విషయాన్ని అందరూ గుర్తించుకోవాలి. అయితే చెమట ముక్కలను నీటి చుక్కలుగా చేసి వారి నాల్కలపై పోశారంటే వారి దాహం తీర్చారని అర్థం. ఆ దాహం తీర్చడానికి ఎవరు ఏ పని చెప్పినా బిడ్డలను కాపాడాలనే

తపనతో ఎక్కడికైనా ఒకటే పరుగు. ఆ పరుగు ఎక్కడికనే విషయాన్ని ఒక్కసారి పరిశీలిద్దాం.

"అడవిలో ఎక్కడో వెన్నెల కాస్తుందంటే
అమృతం కోసం అక్కడికి పరుగు!
ఎడారిలో కొబ్బరి నీళ్ళున్నాయంటే
అక్కడికీ ప్రయాణమే!
కళ్ళలో కనిపించే పిల్లల ముందు
అడవి మైదానంలా మారిపోతుంది
ధ్యాసంతా
అర్థం గురించి కాదు
పరహితం గురించే!"
(శత్రువుతో ప్రయాణం, పుట.12)

అడవిగాంచిన వెన్నెల్లో ఏమీ ఉండదు. అది నిరుపయోగం. అక్కడ ప్రయోజనం ఉండదు. అయినా బిడ్డల దప్పిక తీర్చడానికి అమృతం కోసం పరిగెత్తడమంటే ధ్యాసంతా బిడ్డల దప్పిక తీర్చాలి, ఈ ఒక్కటి తప్పితే తమ చెవికి ఏమీ వినపడదు. అమృతం తాగితే బిడ్డలు హాయిగా ఉంటారని ఆలోచన తప్ప అడవి అనే మాటను తన చెవిలో ఏ మాత్రం పట్టించుకోకుండా అక్కడి నుండి కొబ్బరి నీళ్ళకోసం ఎడారికి ప్రయాణమై, ముళ్ళు రాళ్ళను లెక్కచేయకుండా తమ పిల్లలను కళ్ళలో పెట్టుకొని అడవిని మైదానంగా తల్చుకొని పరిగెత్తటమే. డబ్బు గురించి కాదు. పరహితం గురించే అన్న రెండు ముక్కలు మాడభూషి శ్రీనివాసాచార్యుల వ్యక్తిత్వం ఎలాంటిదో చెబుతాయి.

"కోటీశ్వరుడైనా
కటికి దరిద్రుడైనా
కరెక్ట్ టైముకే హాజరు!"
(శత్రువుతో ప్రయాణం, పుట.12)

ఈ విషయాన్ని ప్రత్యేకించి కవి ఎందుకు చెబుతున్నాడంటే వాళ్ళ నాన్నకు కోటీశ్వరుడైన కటికి దరిద్రుడైనా ఇద్దరూ సమానమే. మాడభూషి సంపత్‌కుమార్ గారికి వాళ్ళ నాన్ననుంచే అభ్యుదయ ధోరణి అలవడిందని అర్థం చేసుకోవచ్చు. కోటీశ్వరునికి ప్రత్యేకతలు, కటికి దరిద్రుడికి చీదరింపులు ఆయన రక్తంలో లేనిది. లేనివాడు 10 రూపాయలు ఇచ్చినా, ఉన్నవాడు 100 రూపాయలు ఇచ్చినా చేరవలసిన టైమ్‌మాత్రం ఇద్దరికి సమానమే. శ్రీనివాసాచార్యులు నమ్మిందంతా ఒక్కటేనంటారు కవి. అదేమిటంటే-

"పంచాంగంలోని
హితం తప్ప
అహితం పట్టదు!
వృత్తీ, ప్రవృత్తీ
ఒకటే - పౌరోహిత్యం!"
(శత్రువుతో ప్రయాణం, పుట.12)

కొందరికి వృత్తి ఒకటి, ప్రవృత్తి వేరొక్కటుంటుంది. అయితే శ్రీనివాసా చార్యులకు రెండూ ఒక్కటే అదే పౌరోహితం. ఆయన పంచాంగంలో ఉన్న హితం తప్ప, అహితం ఏమాత్రం పట్టని ధన్యజీవి అంటారు. అందరికీ వృత్తి, ప్రవృతి ఒక్కటి కావాలన్నదే కవి తపన.

వృత్తి ప్రవృత్తి ఏకమైతే ఉన్నత శిఖరాలను అందుకుంటామని దీని భావన. తన తండ్రి బిడ్డలకోసం తనువు చాలించేంతవరకు ఏ విధంగా ఉన్నాడో చూడండి.

"ఆరోజు రాత్రిదాకా
మాకు పెట్టడం తప్ప
ఒక్క పిడికెడు మెతుకులు
ఆశించని ధన్యుడు!"
(శత్రువుతో ప్రయాణం, పుట.12)

తాను తనువు చాలించేంత వరకు బిడ్డలకు పెట్టడమే తప్ప బిడ్డల ద్వారా పిడికెడు మెతుకులు కూడా ఆశించని ధన్యజీవి. ఇది కేవలం వాళ్ళ నాన్నను గురించి రచించినా కొనప్రాణంతో కొట్టిమిట్టాడుతున్నంత వరకు ప్రతి తండ్రి పిడికెడు మెతుకులు కూడా ఆశించకుండా బిడ్డలను కాపాడుతారని తన తండ్రి లాగానే అందరి తండ్రులు బిడ్డలను కాపాడుకుంటారని తన బాధను తన ఆవేదనను

వ్యక్త పరుస్తున్నారు. ఇక ఆయన తండ్రి జీవిత సమస్యలతో ఎలా పోరాడి ఎలా వీర స్వర్గం పొందాడో కవి మాటల్లోనే చూడండి-

"జీవన సమరంలో
కత్తికింద పడకుండానే
మరణించిన వీరుడు!"

(శత్రువుతో ప్రయాణం, పుట.12)

సాగరాన్ని ఈదవచ్చును. అయితే సంసారం అనే సాగరాన్ని ఈదడం చాలా కష్టం. ఇక్కడ కవి సాగరం గురించి చెప్పకుండా సమరంలో అని కవి చిత్రీకరించారు. ఒకరోజు యుద్ధమైతే విరామం ఎరుగకుండా పోరాడవచ్చు. ఈ యుద్ధం కురుక్షేత్ర యుద్ధం కాదు. రాజులు రాజ్యాల మధ్య జరిగే చారిత్రక యుద్ధం అంతకంటే కాదు. పై యుద్ధాలన్నీ ఏదో కొన్ని రోజులు జరుగుతాయి. అయితే ఇది జీవన సమరం పుట్టిన ప్రతిమనిషి ఈ జీవనసమరంలో జీవితాంతం పోరాడుతూ ఉండాల్సిందే. ఇలా జీవితాంతం జీవన పోరాటం చేసి చేసి అందరిని గట్టెక్కించి తాను మాత్రం గట్టెక్కే వారికంతా గట్టుగా ఉండి, కత్తి కింద పడకుండానే వీర స్వర్గం పొందారంటారు కవి. ఈ కవిత్వం చదివిన ప్రతి ఒక్కరు తమ తండ్రి బిడ్డలకోసం అహర్నిశలు శ్రమించి, బిడ్డలను ఉన్నత స్థితికి చేర్చడానికి ఎంత ప్రయత్నిస్తారో తెలుసుకోవచ్చు. ఈ కవితను చిత్తూరు జిల్లా గ్రామీణ వాతావరణాన్ని ప్రాణంగా తలంచి జీవించిన మాడభూషి శ్రీనివాసాచార్యుల వారికే కవి అంకితం చేశారు.

మన చిత్తూరు జిల్లాకు చెందిన మాడభూషి సంపత్‌కుమార్ గారు కవిగా, రచయితగా తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవ అపారం, ఆదర్శప్రాయం.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సంపత్ కుమార్ కవిత్వం - వస్తు విశ్లేషణ

- గొంగులూరి కృష్ణవేణి, పరిశోధక విద్యార్థి, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాదు.

సహృదయుడు మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వం తెలుగులో కవితా సంపుటాలుగా వెలువడినవి ఆరు ఉన్నాయి. అవి జీవితం- కవిత్వం (2013), శత్రువుతో ప్రయాణం (2015), ఆలోచనలు (2015), చివరకు నువ్వే గెలుస్తావు (2016), మూడోమనిషి (2017), వికారి(2019), ఇవే కాకుండా ఇతర భాషా కవితలు కూడా అనువదించి ఉన్నారు కాబట్టి, నేను నా పత్రాన్ని ఈ ఆరు కవిత సంపుటిలోని వస్తు వైవిధ్యానికి పరిమితమై రాయడం జరుగుతుంది. గురువుగారి అనుభవమంతా లేదు నా వయస్సు కానీ వీటిని చదివాక నా అనుభూతిని పంచుకోవాలనిపించింది. కవి ఈ కవితా సంపుటాలలోని కవితల్ని రాసిన కాలం, సందర్భం వేరు. కానీ ప్రాథమికంగా నేను కొన్ని అంశాలని ప్రత్యేకంగా తీసుకుని వస్తువును చర్చించదలచాను. వీటిలో 'జీవిత -కవిత్వం' కవితాసంపుటిని ప్రత్యేకంగా చెప్పి ఉన్నాను.

'జీవితం-కవిత్వం' కవితా సంపుటిని 2013లో 108 కవితలతో వెలువరించి తన తల్లిదండ్రులు అయిన మాడభూషి పట్టమ్మ శ్రీనివాసాచార్యులకు అంకితమిచ్చారు. జీవితానికి, కవిత్వానికి మధ్యగల అవినాభావ సంబంధాన్ని చమత్కారంగా కవిత్వీకరించారు. జీవితాన్ని కవిత్వీకరించడం అందరూ చేయదగినదే. కానీ కవిత్వాన్ని కూడా కవితాత్మకంగా చెప్పడంలో మాడభూషి గారి ప్రత్యేకత కనబడుతుంది. ఒక్కొక్క కవితపై ఒక చర్చనే జరపవచ్చు. ఎంతో పరమార్థంతో, సరళపదాలతో, తనదైన శైలిలో కవిత్వాన్ని, జీవితాన్ని చిత్రీకరించారు. "జీవితాన్ని విడిచి పెట్టి కవిత్వం ఎలా రాస్తావ్? కవిత్వానికి తెలియకుండా జీవితాన్ని ఎలా దాస్తావ్?" అనే కవితతో మొదలై "జీవితపు రహదారిలో సేదతీర్చే చెట్టు కవిత్వం" అనే కవితతో ముగుస్తుంది. మనిషి పుట్టుక నుండి మరణం వరకు అతని జీవన ప్రయాణం ఏ విధంగా సాగుతుందో, జీవితానికి కవిత్వానికి మధ్య ప్రయాణాన్ని అదే బాటలో కవి నడిపించారు.

ఇందులో కవితలన్నీ జీవితానికి-కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని తెలియజేసేవే. ఒకే అంశంపై ఇన్ని భావాలను వ్యక్తీకరించడం సామాన్యమైన విషయం కాదు. ఈ కవిత్వం వచన కవిత్వ ధోరణిని కలిగి ఉన్నప్పటికీ, అన్ని కవితల్లో కొంత నిబద్ధత కనిపిస్తుంది. కవిత్వతత్వ విచారణ చేసినప్పుడు ఈ కవితల్లో నడక సజావుగా సాగిపోయింది. వాగర్థాలు పెనవేసుకున్నాయి. జీవితానికి-కవిత్వానికి గల సంబంధం ఈ కవితలో సంశయ రహితంగా ద్యోతకమవుతుంది. ఈ కవితా సంపుటిలోని వస్తువు "కవిత్వం - జీవితం" అయినప్పటికీ ఎంతో గూఢార్థాన్ని,తాత్వికత్వాన్ని నింపి కవితలు రాయడం అనేది అంత సులువు కాదు.

కవిత్వం రాయడానికి ముందు
జీవితాన్ని చదవాలి!
జీవితాన్ని చదవడానికి ముందు
కవిత్వంలో ఎదగాలి!

(జీవితం కవిత్వం, పుట:2)

జీవితాన్ని చదివితే తప్ప కవిత్వం పుట్టదు. అదే జీవితాన్ని చదవాలంటే కవిత్వం తప్పనిసరి. అని సరళ శైలిలో చెప్పారు. ఇలాంటివి ఈ సంపుటిలో కోకొల్లలు.

జీవితమంతా కవిత్వమే!
కవిత్వమంతా జీవితమే!
జీవి కవిత్వమంతా కవిత్వ జీవితమే!
కవిత్వ జీవితమంతా జీవి కవిత్వమే!

(జీవితం కవిత్వం పుట: 13)

జీవితాన్ని కవిత్వం నుండి వేరు చేసి చూడడం ఉం

డదు. కవిత్వం జీవితంలో జీవితం కవిత్వంలో అంతర్భాగ మని ఎన్నో కవితలు వేరు వేరుగా చెప్పినప్పటికీ, అంతరార్థం మాత్రం ఒక్కటే. జీవితం కంటే కవిత్వాన్ని నమ్ముకుంటే జీవిని పైకి తేలుస్తుంది. కానీ ఆ కవిత్వానికి ఆధారం జీవితమే అంటాడు కవి.

ఊరేగింపుగా సాగే జీవితంలో పవ్వళించేది కవిత్వమే. నిత్యం ఏదో ఒక అసంతృప్తితో మానవుడు వెతుకుతూనే సాధించుకోవాలనే ఆరాటంతో ఉంటాడు. సంతృప్తి అనేదే లేనిది జీవితం. "అందుకే జీవితం ఒక వెతుకులాట కవిత్వం ఒక బతుకుబాట"(జీవితం కవిత్వం పుట: 40).

జీవితాన్ని గురించి రాసేటప్పుడు
కవిత్వం గురించి ఆలోచించకు
కవిత్వంలో జీవితం
జీవితంలో కవిత్వం జొరబడితే
ఎందులోనో జారి పడతావ్ (45)

ఒక చోట 'జీవితం ముళ్లబాట అయితే కవిత్వం మల్లె తోట అంటాడు'. శిలగా ఉన్న కవిత్వాన్ని చెక్కితే శిల్పంగా, అందంగా రూపుదిద్దుకుంటుంది. అదే జీవితాన్ని కదిలిస్తే అలనే.

ఈ సంపుటి నిండా ఇలాంటి తాత్విక గాఢతను నింపుకున్న ముక్తకాలు అనేకం. అయితే కవిత్వానికి జీవితానికి గల అంతర్గత సంబంధాన్ని చాలా సూక్ష్మ రూపంలో విశ్లేషించడానికి పూనుకోవడం వల్ల కొన్ని సూక్తులుగాను, నిర్వచనాలుగాను, వ్యాఖ్యానాలుగాను అనిపించవచ్చు. కవిత్వ వస్తువు ఒక్కటే అయినప్పుడు ఇటువంటివి సాధారణమే. ఈ ఒక్క సంపుటిలోవే కాకుండా మిగిలిన సంపుటాలలోని వస్తు వైవిధ్యాన్ని గమనిస్తే స్త్రీ, రైతు, ప్రకృతి, మరణం, రాజకీయం, ప్రభుత్వం, దేశం, ప్రపంచీకరణ, బాల్యం, చెరువు, భయం వంటి అంశాలను మనం గమనించవచ్చు. ఇవే కాకుండా ఇజాలు, సామాజిక చైతన్యం కలిగించే కవితలు, మానవత్వం, సమానత్వం వంటి అంశాలు కూడా నిక్షిప్తమై ఉన్నాయి.

స్త్రీ :

సృష్టికి మూలం స్త్రీని పేర్కొంటారు. నేడు మహిళలపై జరుగుతున్న అనేక సంఘటనలను తన కవితల ద్వారా ఎత్తిచూపారు. వివిధ రూపాలలో మహిళలపై జరుగుతున్న ఆగడాలను, అన్యాయాలను, అఘాయిత్యాలను, హత్య లను, మానవ సంబంధాలు మంటకలుపుతూ కన్న తండ్రులూ, తోబుట్టువులు సైతం అరాచకాలకు పాల్పడుతున్న వైనాన్ని కళ్ళకు కట్టినట్లు తనదైన శైలిలో కవిత్వీకరించారు. మాడభూషి గారి కవిత్వం 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలో ఎక్కువగా స్త్రీని వస్తువుగా కేంద్రీకరించుకున్నట్లు కనిపిస్తుంది.

చిన్నప్పటినుంచీ అంతే
చిన్న చూపుతోనే పెరిగింది
తాను నిద్రపోతూనే
ముద్దులకొడుకుని నిద్రపుస్తూ
కర్రిముండా అని తన్ని నిద్రలేపే అమ్మ!
తన బద్ధకానికి దుప్పటికప్పుకుంటూ
పనులు పురమాయిస్తూ
వీపు విమానం మోతమోయించే తండ్రి!
(శత్రువుతో ప్రయాణం,పుట.26)

ఇంట్లో సెలవు లేదు / పనిలో సేదలేదు
జీవితమంతా పిల్లల కోసం పరుగెత్తి పరుగెత్తి
అలసిపోయిన ఆమెకు / ఆసరా లేదు / ఆమెతో
ఎవరికీ అవసరం లేదు/ వయసుడిగిన / ఆమెతో
ఎవరికీ పనిలేదు/ఆమె ఏ పనికీ పనికి రాదు!
(శత్రువుతో ప్రయాణం,పుట.28)

భార్యాభర్తల మధ్య అనుబంధం, ఇష్టం లేకుండా చేసే సంసారం, మానభంగాలు ఇలా అన్ని రకాలుగా ఒక ఆడది పడే ఆవేదనను 'స్వర్గం' కవితలో చక్కగా ఆవిష్కరించారు.

నా శరీరం మీదికి
తాచుపాములా పాకుతాడు
నండ్రగబ్బలా పట్టుకుంటాడు

వాడి ఉడుంపట్టునుంచి
తప్పించుకోవడానికి వీలుకాదు
పులిలా మీద పడుతాడు
నక్కలా నాకు ఫేవర్ చేస్తున్నట్టు నటిస్తాడు
బుసలు కొట్టే ఎద్దులా మారుతాడు
స్వర్గాన్ని రుచిచూస్తూ/నరకాన్ని తాగిస్తాడు!

(శత్రువుతో ప్రయాణం, పు.43)

సమానత్వం అంటూనే ఇప్పటికీ సమాన అవకాశాలు లేవు. 'ఆడ మగా/వైవిధ్యం అనుకున్నా/కానీ వైరుధ్యం/ వివిధ భావాలతో కట్టుకున్న గూడు వైవిధ్యం/వివిధ విరో ధాలతో నడిచే తోడు వైరుధ్యం' అని ప్రస్తుత సమాజంలో ఆడవాళ్ళ యొక్క స్థితిని చెప్పుకొచ్చాడు.

చెవులు కుట్టారు/ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా/భరించాను నోరుమూసుకొని
అంతా నా అందంకోసమేనని
తీరా నోరు తెరవాలని
ప్రయత్నించినప్పుడు గానీ
తెలియలేదు/ ముందుగానే
నోరు కూడా కుట్టేశారని!
రెక్కలు తొడుక్కుని/పక్షిలాఎగిరే మనసుని
ముక్కలు చేసి/మూల కూర్చోబెట్టారు
దాని పేరు పెళ్లి!

(శత్రువుతో ప్రయాణం, పుట.48)

ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ధైర్యంగా ఉండాలని, జరిగిన జరుగుతున్న ఆగడాలపై మాట్లాడమని, స్పందించాలని, తమ హక్కులకై పోరాటం చేయమని 'ఇకనైనా నోరు తెరిచి మాట్లాడండమ్మా! వేల సంవత్సరాల నుంచి మౌనంగా ఉంచిన నోరు తెరవడానికి కొంచెం ఇబ్బందిగా ఉన్నా నోరు తెరచి మాట్లాడండి!' అంటాడు కవి.

లోకానికి నిన్ను గురించి
కావలసినంత సమాచారం ఉంది
రోజూ నిన్ను గురించే మాట్లాడుకుంటుంది
వదిలేసినదానివి/తెగించినదానివి
బరితెగించినదానివి/బలిసినదానివి
మట్టుమర్యాదలేనిదానివి/ఇవన్నీ నీకు బిరుదులు
దీనికన్నా / ఎదిరించేదానివి
బెదిరించేదానివి/అదిలించేదానివి
కదిలించేదానివి
విదిలించేదానివిగా ఉండవమ్మ
నోరు తెరిస్తే / నీకు పోయేదేమిలేదు/అవమానాలు
తప్ప! (వికారి,పుటలు.29, 30)

పసికందు నుండి పండు ముసలి దాకా గర్భవతి, యవ్వనవతి, ఒంటరిగా, జంటగా ఉన్న సరే, పిచ్చిదానివి అయినా సరే, ఆడదానివి అయితే చాలు అన్నట్లుగా అనాథవు, ధనవంతురాలివి, పేదరాలివి ఇవన్నీ కామాం ధుడికి కన్పించవు. రాత్రి పగలు తేడా లేకుండా ఇంటా, బయట, ఆఫీసు, కాలేజీలు వీధిలోనే కాకుండా పోకిరీలు, రౌడీలు, శత్రువులే కానవసరంలేదు

మిత్రులు, తండ్రులు, అన్నదమ్ములు,
ఆఫీసర్లు, అధికారులు
బంట్రోతులు, భూస్వాములు
ధనికులు, దరిద్రులు
ఖనకావేశంలో / తిరుగుతూ ఉంటారు
జాగ్రత్తగా వెళ్లి రావమ్మా
రోడ్డుమీద కుక్కలుంటాయి!

(వికారి, పుట.70)

కాలమేదైనా, ప్రాంతం ఏదైనా ఆడవారిపై జరిగే అకృత్యాల గురించి కవి పలువిధాలుగా విచారం వ్యక్తం చేశారు.

రైతు :

మన దేశానికి వెన్నెముక వంటిది వ్యవసాయం. దేశానికి అన్నం పెట్టే రైతు గురించి, అతని కష్టం, పరిస్థితుల గురించి ఎవరూ అడగరు. అండగా నిలబడరు. రోజు రోజుకి రైతుల ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయి. మన

ఆకలి తీర్చే రైతు కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్న సందర్భాలు చూడవచ్చు. ఇంతటి దౌర్భాగ్య స్థితిలో ఉన్నాం.

కొనేవాడికి/అమ్మేవాడు లోకువ/దళారివాతపడ్డ రైతు!

(ఆలోచనలు, పుట.13)

రైతులు పస్తులతో చావాలా? ఆత్మహత్యలు చేసుకోవాలా? బిక్షం ఎత్తుకోవాలా? ఎటూ పాలుపోని స్థితిలో రైతు ఎంత దీనస్థితిలో ఉన్నాడో తెలుసుకోవచ్చు.

భిక్షగాడు వెళుతున్నాడు/జోల నిండిపోయింది/
దుర్భిక్షకుడైన రైతు!

(ఆలోచనలు, పుట.13)

పనిలో మునిగిన రైతుకు ఎండ, వాన, చలి, కష్టం, సుఖం అనేది తెలియదు. ధ్యాసంతా ఒక్కటే పంట పొలం. ఇతరులతో వాగ్దానాలు తెలియవు. గొడవలు తెలియవు ఇతరులను ఏ విధంగా అణగదొక్కాలో తెలియక కపటం లేని మనిషి తోటి వాడు కష్టాల్లో ఉంటే విని ఆనందించే రకం కాదు వారికి అండగా నిలబడి ధైర్యం చెబుతూ ముందుకు తీసుకెళ్లే మంచి మనస్సు కలవాడు.

అందరికీ పొద్దు పొడుస్తుంది
నాకు పని పొడుస్తుంది
అందరూ నీళ్ళలో స్నానం చేస్తారు
నేను పనిలో స్నానం చేస్తాను
అందరూ సబ్బురాసుకొంటారు
పౌడర్ పూసుకొంటారు
నేను పని రాసుకుంటాను/పని పూసుకొంటాను
ముప్పూటలా అందరూ బువ్వతింటారు
నేను పొద్దున్నుంచి రాత్రి దాకా పనినే తింటాను
అందరు జీవితం కోసం పనిచేస్తారు
నేను పని కోసం పని చేస్తా!

(శత్రువుతో ప్రయాణం, పుట.59)

రైతు కష్టాన్నే నమ్ముకుంటాడు. పొద్దంతా ఎద్దులతో పాటు తాను ఒక ఎద్దులా, మొద్దులా వాటితో పాటు శారీరక అలసట తెలియకుండా పని చేస్తాడు. "దూడగా పుట్టినప్పటినుంచి అది ఎద్దుగా ఎదిగేంతవరకూ పాలుపట్టి, గడ్డిపెట్టి, అంబా అంటే అంబా అంటూ అది పరిగెడితే పరుగెత్తి, దాని కాలికి నల్లదారం కట్టి, నేను పని చేయకపోతే పనే ఉండదు

మెడకు పలుపుతాడు చుట్టి, ముక్కుకు ముకుతాడు వేసి, బండిలో ఎంత బరువు వేయాలి? మడిలో ఎంత సేపు దున్నాలి? ఎప్పుడు సేదతీర్చాలి? ఎప్పుడు తవుడు పెట్టాలి? ఎక్కడ కట్టేయాలి!" అని కన్న కొడుకులా భావించి దాని ఆలనాపాలనా చూసుకుంటాడు.

దానికి కాల్లో ముల్లుగుచ్చుకుంటే తల్లడిల్లి/దాని
కాలికి బిళ్ళలు కొట్టి
కంటికి రెప్పలా కాపాడుకొనే రైతుకు
ఎవడో ఎద్దును గురించి తెలియని మొద్దుగాడు
వచ్చి / జీవహింసగురించి నేర్పుతున్నాడు!

(మూడో మనిషి, పుట.51)

తండ్రిలా దాని మంచిచెడ్డలను చూసే రైతుకి ఇప్పుడు అవి మూగజీవాలు అని 'ఎద్దుని గురించి తెలియని మొద్దుగాడు జీవహింస గురించి నేర్పడం' అంటే 'తల్లి ప్రేమ గురించి తల్లితో చెప్పడం వంటిదే. వీటితోపాటే ఆర్థికపరమైన ఇబ్బందులు కూడా రైతుకు ఉచ్చు బిగిస్తున్నాయి. ఎక్కడో ఎవడి దగ్గరో విత్తనాలు, ఎరువులు కొని వాడు చెప్పినట్టుగా విత్తనాలు వేసి, వాడి ఆజ్ఞ ప్రకారం పంటలు పండించాలి. ఎవరో నిర్ణయించిన ధరకు అమ్మకాలు సాగించాలి. రైతు తనభూమిలో తానే కూలి. అన్నం పెట్టే చెయ్యి అప్పు కోసం అర్రులు చాస్తుంది. 'బాంచన్ కాల్మొక్త' అంటూ అప్పు కోసం తిరిగి తిరిగి పిప్పి అవుతున్నాడు. పండించినదంతా పరాయి చేతిలో పెట్టి, ఆకలి తీర్చుకోవడం కోసం తానే అడుక్కునే పరిస్థితి.

అప్పు కోసం బ్యాంకు మెట్లు ఎక్కి, అది కట్టడానికి కష్టపడుతూ అదే బ్యాంకు దగ్గర మోకరిల్లుతున్న దృశ్యాలు మనం ఎన్నో చూడవచ్చు. అరకొర అప్పు

తీసుకున్న రైతు దగ్గర ముక్కుపిండి బాకీలు వసూలు చేస్తుంటే, వేలకోట్లు రుణం తీసుకున్నవాడు విదేశాలకు పారిపోతే అప్పు కట్టమని దండలువేసి దండాలు పెడుతున్న బ్యాంకులు అప్పు తీర్చమని వారి దగ్గర మోకరిల్లుతున్నాయి. అప్పుతీర్చమని వాణ్ణి మాలలు వేసి బతిమాలుతున్నాయి. అప్పు తీర్చకుంటే ఉరితాడని వీణ్ణి బెదిరిస్తున్నాయి. రైతు తనభూమిలో తానే కూలి.

అందరికీ అన్నం పెట్టడంకోసం
అప్పుచేసిన పాపానికి
తన చేత్తో తనకే ఉరి!

(చివరకు నువ్వే గెలుస్తావు: 81)

రైతు మీద కథ, కవిత, కావ్యం ఏదైనా రాయాలంటే ప్రత్యేకంగా వాటికోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ప్రతి రైతు ఒక కథే, కవితే అని కవి అంటారు.

రైతు తన ఆత్మకథను
తాను రాసుకోడు/కథగా బతకగలడు
ఇతరులకు కథకాగలడు/తన కథను తాను రాసుకోలేడు!

(వికారి,పుట.61)

ఇన్ని కష్టాలు కడగండ్ల మధ్య రైతు ఏదైనా సాధించాడా అంటే చివరికి ఆకలి కేకలు, కడుపు ఎండపెట్టుకోవడం, కుటుంబం పట్నానికి వలసపోవడం, వ్యవసాయాన్ని వదిలేసే తనకు తెలియని కొత్త వేషాన్ని వేసుకుని వలసవెళ్లి ఆత్మాభిమానాన్ని చంపుకొని బతకడం మనం చూస్తూనే ఉన్నాం. కవి తన కవితలద్వారా రైతు స్థితిగతులను కళ్లకు కట్టినట్లు చూపాడు.

ప్రకృతి :

పంచభూతాలు, అష్టదిక్కులు, ముల్లోకాలు అన్నీ కూడా ప్రకృతితో మమేకమై ఉన్నాయి. మానవుడు కూడా ప్రకృతిలో అంతర్భాగం. ప్రకృతి లేనిదే ఏ జీవి మనుగడ అయినా ప్రశ్నార్థకమే. కేవలం గాలి, నీరు, నిప్పు, ఆకాశం, ఎండా, వాన, వంటివే కాకుండా చెట్లు, ఆకులు, పక్షులు, జంతువులు, గుట్టలు, రాళ్ళు, మట్టి, నదులు, కొండలు, పొలాలు అన్నీ కూడా ప్రకృతిలో భాగమే. ఇవి అన్నీ కలిసి వాటివాటి పనులను యధావిధిగా ప్రకృతి ధర్మం ప్రకారం చేస్తూ ఉంటే అందరికీ లాభమే. కానీ నేడు మనిషి వీటన్నింటిని తన అధీనంలో పెట్టుకుని ఎలా బ్రతుకుతున్నాడు దాని వల్ల జరిగిన పరిణామాలను చూస్తూనే ఉన్నాం.

ప్రకృతిని / బెదిరించి / ఎదిరించి
గుప్పిట్లో పెట్టుకున్న మానవుడా
ప్రకృతి జూలు విదిల్చిందంటే
నీ టెక్నాలజీ / నీ టెక్నిక్కులు
టైటాన్‌లా కుప్పకూలిపోవలసిందే!

(మూడో మనిషి, పుట.16)

ప్రపంచీకరణ ముసుగులో మనం నేడు ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ప్రకృతి అంటేనే పచ్చదనం పచ్చదనం అంటేనే చెట్లు. అటువంటి చెట్లను మనం నిత్యావసరాలకు అవసరం ఉన్నా, లేకున్నా నరికేస్తున్నాం. చెట్టుకు పూసిన పువ్వులు, కాయలను, ఆకులను, పండ్లను ఉపయోగించుకోండి. చెట్టును మాత్రం నరికేయకండి. చెట్లను నరకడం వల్ల భవిష్యత్తులో ఎప్పుడో రావాల్సిన ప్రకృతి విపత్తులు ఇలా అర్ధాంతరంగా సంభవించడం మనం గమనించవచ్చు. పంచభూతాలకు మధ్య సంబంధాన్ని కవి ఈ విధంగా చెప్తున్నాడు.

చెట్టు గాలిని / సృష్టించింది! / గాలి చెట్టును / పీడించింది!

(చివరకు నువ్వే గెలుస్తావు,పుట.43)

మరణం :

అకాలంగా, అకారణంగా వచ్చేది మరణం. కొందరికి ముందూ, కొందరికి వెనక, తెలిసీ తెలియక సమాజాన్ని, ప్రపంచాన్ని ఏలుతూ తన గుప్పెట్లో పెట్టుకునేది మరణం. అందర్నీ ఏలేటోడు ఎవరికీ భయపడని వాడు కూడా మరణానికి భయపడతాడు. రకరకాలుగా మనిషి

మరణ శాసనం రాయబడి ఉంటుంది. హత్యల రూపంలో, ఆత్మహత్యల రూపంలో, యాదృచ్ఛికంగానూ జరిగేవి కూడా ఉంటాయి. అయితే వీటన్నింటిని తన కవితల ద్వారా కవి చెప్పుకొచ్చాడు. నేటి రాజకీయ శవయాత్రలను, రాజకీయాలను, కులాల్ని, మతాల్ని, వర్గ, లింగ భేదాల్ని చూపే మనస్తత్వం గల నేటి సమాజాన్ని గురించి చెప్పిన విధానం చూద్దాం.

వాడి చావుకి / ఎవరూ కారణం కాదు
వాడి చావుకి / వాడు కూడా కారణం కాదు
ఎప్పుడూ / ఒకడి మీదకి ఒకణ్ణి ఉసిగొల్పుతూ
ఒకణ్ణి చూస్తే ఇంకొకడికి పడకుండా చేస్తూ.....
(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.17)

మరణం కోసం వేచిచూసే వాళ్ళు, పడిగాపులు కాసే వాళ్ళు చాలామంది ఉన్నారు. ఒకసారి మరణాన్ని ఆస్వాదించిన వాడు దాన్ని పరిత్యజించలేడు.

మరణం నుంచి తప్పించుకోవాలని చూస్తే
నరకం చూపిస్తుంది
మరణాన్ని స్వాగతిస్తే
హాయిగా అక్కున చేర్చుకుంటుంది
మరణం రాకముందే మరణిస్తే
మరణం మన్నించదు!
(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.36)

హత్యకు, ఆత్మహత్యకు ఒకటే తేడా. ''ఇతరులు / మన మీద / కోపంతో చేసేది హత్య! / ఇతరుల మీద / కోపంతో మనం చేసుకొనేది ఆత్మహత్య!'' (వికారి, పుట.21)

అని ఒక్క మాటలో రెండింటికి భేదం చెప్పాడు. మరణం గురించి ఇన్ని రకాలుగా చెప్పుకున్నప్పటికీ మరణం కూడా కొందరికి భయపడుతుంది.

ఎవరో కోన్ కిస్కాగాడు
చేసే దురాగతానికి
అన్నీ వదిలి పెట్టుకొని
ఎదురొడ్డేవాణ్ణి/మరణం అంటదు!
అయినవాళ్లకోసం
వాకిట్లో కాపలాకాసినట్టు
శత్రువుల కోసం / సరిహద్దులో కాపలాకాసే
సైనికుణ్ణి / మరణం అంటదు!
దేశం కోసం / అతను పొందే మరణం
మరణం కాదు త్యాగం
అతణ్ణి మరణం అంటదు!
(వికారి, పుట.42)

మరణం రావడానికి సవాలక్ష కారణాలు ఎవరో హత్య చేశారని, అత్యాచారం చేసినందుకు, హింసించినందుకు, ఆస్తిలాక్కున్నందుకు, మోసం చేశారని, నిందలు మోపారని, రుణం తీర్చాలన్నారని, ఉద్యోగంలేదని, ఇవ్వ లేదని, ఆకలి తీర్చలేదని, చీదరించారని, మొగుడు కొట్టాడని, పెళ్ళాంతిట్టిందని, ప్రేమలో మోసపోయానని, నన్నెవరూ ప్రేమించలేదని, పెళ్లి అయిందని, కాలేదని, అడిగింది కొనివ్వలేదని, అడగకుండానే అన్ని ఇస్తున్నం దుకు ఇలా ఎన్నో కారణాలు 'మరణశాసనం' అనే కవితలో చెప్తూ...

ఇందులో ఏ కారణమూ
కాలుడిముందు నిలబడదు
కాలం తీరిపోయింది
ప్రాణం పోయింది/అదొక్కటే ప్రతి ఒక్కరి
మరణానికీ కారణం!
(వికారి,పుట.36)

ఇవన్నీ ఇలా ఉంటే మరణించిన వ్యక్తి శవమై ఇంట్లో ఉన్నప్పుడు మన చుట్టూ జరిగే రకరకాల సంభాషణలను, పరిస్థితులను 'శవంలేచిన ఇల్లు' అనే కవితలో చక్కగా వర్ణించారు.

ఇంటినిండా జనం
ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది
అక్కడక్కడా కొంతమంది
నోళ్ళు తెరవకుండానే పలకరించుకొంటున్నారు!

ఎప్పుడు వచ్చారు / ఎలా ఉన్నారు
ప్రశ్నలు, సమాధానాలు
అన్నింటికీ మౌనమే భాష!
సంతోషకరమైన విషయాలను కూడా
గద్గదస్వరంతోనే పంచుకుంటున్నారు
చాలా రోజుల తర్వాత కలిసిన బంధువులు!
(మూడో మనిషి,పుటలు.28,29)

రాజకీయం :

నేడు తీవ్ర పరిణామంగా మారుతున్న వాటిల్లో రాజకీయం ఒకటి. దీనిని నేను ప్రధాన సమస్యగానే పరిగణిస్తాను. ఒకప్పుడు రాజకీయాలు ప్రజలకు మంచి చేసేందుకు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు ప్రజలను ముంచడానికి పుట్టి, చివరికి అదే రాజకీయంలో అందరూ చచ్చే స్థితికి వచ్చింది. అన్యాయాన్ని ఎదిరించడం, అవినీతిని అంతమొందించడానికి, దౌర్జన్యాలను ఎండగట్టడానికి రాజకీయం మొదలైంది. నేడు అదే అన్యాయాలను, అక్రమాలు, దౌర్జన్యాలు, అవినీతిలో మునిగితేలుతుంది.

ఇది పదవీ వ్యామోహం వల్ల ఏర్పడవచ్చు. ఈ కాలంలోనే కాదు రామాయణ, మహాభారత కాలంలో నుండి ఇది ఉన్నది. అక్కడ యుద్ధాల రూపంలో జరిగేవి. ఇక్కడ హత్యల రూపంలో జరుగుతున్నాయి. 'బల్లచెక్క' అనే కవితలో మహాభారతంలో జరిగిన సన్నివేశాన్ని చక్కగా రూపుకట్టించారు కవి.

అర్ధరాజ్యమంటాడు/అయిదూళ్ళంటాడు
ఒక ఊరికోసం బతిమాలుతాడు
బల్లచెక్కమీద కూర్చోవడానికి
సూదిమోపినంత కూడా ఇవ్వకుండా
సర్వనాశనం అవుతాడు,
సర్వ నాశనం చేస్తాడు
బల్లచెక్కదిగడం ఇష్టం లేక!
(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.52)

'ఆలోచనలు' అనే కవితా సంపుటిలో కవి ఎక్కువగా రాజకీయం, ప్రభుత్వం, పదవీ వ్యామోహం, అధికారం గురించే తన ఆవేదనను వ్యక్తం చేశారు.

ఓటేస్తే మరచిపోగలను
మరచిపోతే ఓటెయ్యగలను
ప్రజా,నాయకుడు!
దొంగ ఓట్లేసే / రౌడీలు నాయకులవుతారు
50ఏళ్ల ప్రజాస్వామ్యం!
ఎన్నికలెప్పుడొస్తాయో
అధికారమెన్నినాళ్ళో/రాజకీయ పార్టీలు!
(ఆలోచనలు, పుటలు.17,19)

ఎన్నికల సమయంలో నాయకులు ఎలా వంచించి, ప్రజల దగ్గర నమ్మబలికి ఓట్లు వేయించుకుంటారో వారిని గూర్చి, గొర్రెల లాగా ప్రజలు కూడా ఎలా తలాడిస్తారో ఆయా సన్నివేశాలను కవి చూపించాడు. 'ఆలోచనలు' కవితాసంపుటి 2015 లో వెలువడింది. ఆ సమయంలో జరిగిన రాజకీయ అంశాలు, అంతకుముందు జరిగిన అంశాలన్నింటినీ అక్షరీకరించాడు కవి.

ప్రజలు ఎజెండాలోలేని/ జెండా పండుగలు
ఎన్నికలు!
(ఆలోచనలు,పుట.61)

అప్పుల బాధ తాళలేక
సాగిపోతున్నాయి ఆత్మహత్యలు
అధికార దాహం తీరక
పుంజుకొంటున్నాయి ప్రచారాలు!
(ఆలోచనలు, పుట.65)

ఇవన్నీ ఇలా ఉంటే రోజుకో నాయకుడు, రోజుకో కొత్త పార్టీ పుట్టుకొస్తూనే ఉంది. అందరి లక్ష్యం ఒక్కటే అయినా ఇన్ని పార్టీలు, జెండాలు, ఎజెండాలు సామాన్య ప్రజలను వెర్రి వాళ్ళని చేయడం కోసం ఎవరికి తోచింది వారు చేస్తూనే ఉంటారు. అర్ధాంతరంగా నాయకుడిని అని చెప్పుకుంటూ రోజుకో కొత్త పార్టీ పెడుతూ, పూటకో పార్టీలను మార్చే రాజకీయ నాయకులను మనం చూస్తూనే ఉన్నాం.

జనంలో మరోచీలికకు/ చిహ్నం కొత్తజెండా
తృతీయ శక్తి!

(ఆలోచనలు,పుట.56)

పాలించడానికి ఒకపార్టీ
పరిపాలించడానికి ఒక రాష్ట్రం
నాయకులఅత్యవసరాలు!

(ఆలోచనలు, పుట.48)

గోడదూకితే ఫిరాయింపు
గోడవతలే ఉంటే అవినీతి
రాజకీయ సహకారం!

(ఆలోచనలు,పుట.48)

చివరకు చెట్లకన్నా
జెండాకొమ్మలే ఎక్కువవుతాయి
నాయకుడికో పార్టీ!
(ఆలోచనలు,పుట.47)

అధికార దాహం తీరడానికి మార్గం మధ్యంతర ఎన్నికలని అధికారంపై వ్యామోహాన్ని ఒక్కమాటలో చెప్పారు.

బాల్యం :

ప్రతి ఒక్కరి జీవితంలో మరో అవకాశం వస్తే కోరుకునేది బాల్య జీవితం. అంత అపురూపమైనది బాల్యం. కానీ నేటి పిల్లల బాల్యం అంతా అయోమయంలో పడింది. పాలు తాగే వయసులో నీళ్ల సీసాలు మోయడం, మనం పిల్లలను ఎత్తుకునే వయసులో వయస్సుకు మించిన భారంతో, పుస్తకాల రూపంలో ఉన్న బడులనే మోస్తున్నారు. తల్లిదండ్రులతో గడపాల్సిన సమయాన్ని చదువులు, ఉద్యోగాలు, అంటూ 'బ్రతుకు జీవుడా' అని పరుగులు పెడుతున్నారు. ఇటువంటి అంశాలను కవి కవితల రూపంలో చెప్పారు.

పిల్లలమీద ప్రేమ/ నెహ్రూ అమరత్వం
బాలల దినోత్సవం!
గదినిండా బందీలైన/ సీతాకోకచిలుక
బడిపిల్లలు! (ఆలోచనలు,పుట.50)

చదువుకోవాల్సిన వయస్సులో పరిశ్రమల్లో, బాల కార్మికులుగా మారుతున్న పిల్లలు, కడుపులోనే చిదిమేస్తున్న సన్నివేశాలు, బాల్యం ఒక వరమే కాదు, శాపం అని అనుకునే అంశాలు చాలానే ఉన్నాయి.

దారాన్ని తెంచుకోడానికి
తనకలాడుతున్న పూలు
బాల కార్మికులు!

(ఆలోచనలు,పుట.52)

బాల్యం ఒక వరం/ బాల్యమే శాపం కూడా
డబ్బుచేతిలో కీలుబొమ్మ!

(ఆలోచనలు,పుట.53)

చెరువు :

కబ్జాలకు, దౌర్జన్యాలకు నిలువెత్తు సాక్ష్యాలు నేడు లేస్తున్న అక్రమకట్టడాలైన మల్టీప్లెక్సులు, అపార్ట్మెంట్లు. ఇవన్నీ పరోక్షంగా సరస్సులకు, కాలువలకు, చెరువులకు ప్రత్యక్షసాక్ష్యాలు. పెరుగుతున్న జనాభా కనీస అవసరాలు తీర్చడానికి ఎవరికి వారు భూస్వాములై, యజమానులై, ఓనర్లుగా చలామణి అవుతూ అక్రమంగా ఆస్తులు సంపాదిస్తూ, చెరువులు, నదులనే ఆక్రమించుకుని భారీ కట్టడాలను నిర్మిస్తున్నారు.

'చెరువు కవిత'లో చెరువు గురించి, దాన్ని అక్రమంగా దొంగిలించిన విషయం, అదే చెరువు ఉగ్రరూపం, అది తిరగబడితే జరిగే అనర్థాల గురించి, పరిణామాల గురించి చెప్పారు.

కళ్ళముందే / నిండిన చెరువును చూశా
పండిన చెరువును చూశా
ఎండిన చెరువును చూశా/తిరిగి వచ్చేలోపల
చెరువే ఇళ్లై /అపార్ట్మెంటై /డూరై
చెరువున్న డూసే లేకపోయింది
ఇది చెరువంటే ఎవడూ నమ్మలేదు
ఇప్పుడు చెరువు తిరగబడితే

అంతా ఏడుపు మొహం పెట్టుకొని

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.53)

నిద్రలేచింది మొదలు నిద్రపోయే వరకు మనం చేసే అన్ని కార్యకలాపాలకు, అన్ని అవసరాలను తీర్చేది నీరే.

విశ్వాసంగా ఉన్న చెరువు/కుడిచేతికి
ఎడంచేతికి నీళ్ళిచ్చి
ఆదుకున్నందుకు
ఒక్క నిమిషం కూడా ప్రతివిశ్వాసం చూపకుండా
దాని కడుపులో గునపాలు గుచ్చినప్పుడు
అది శపిస్తుందని ఊహించి ఉండరు
ఇప్పుడు నాలుక పిడచకట్టిన తరువాత
ఇక్కడ చెరువు ఉన్నట్టు గుర్తొస్తోంది కదూ!

(వికారి,పుట.18)

భవనాన్ని తాకే భవనాలను లేపిన వాడికి చెరువు శాపం వర్తించదు. ఎందుకంటే వాడు జేబులు నింపుకుని ఎప్పుడో పారిపోయాడు. ఇక్కడ చెరువు తల్లి గుండెల మీద కూర్చున్నా నువ్వే ఆలోచించాల్సింది.

ఇది నా చెరువుతల్లి
నా దాహం తీర్చిన కల్పవల్లి
నన్ను గుండెలకత్తుకున్న పాలవెల్లి
నాకు బువ్వపెట్టిన అమ్మతల్లి
అని తలపోసి ఉంటే/నీ ఊరు మునిగిఉండదు
నీ నోరు ఎండి ఉండదు/దిద్దుకోలేని తప్పుకు
చెరువు ఇచ్చిన శాపం
తప్పకుండా ఫలించింది
ఫలితమిచ్చింది!

(వికారి,పుట.19)

చెరువు శాపాన్ని అనుభవించడమే భవిష్యత్తును కాపాడుకోవడానికి మార్గం! ఇది భవిష్యత్ తరాలకు హెచ్చరిక వంటిది.

వలస :

పొట్టకూటి కోసం పక్క ఊరు వలస వెళ్లి బతికేవారిని చూసాం. అది కాస్తా పక్క ఊరి నుండి పట్టణం, రాష్ట్రాలు దాటి దేశాలకు వలసపోయే కాలం వచ్చింది. ఈ వలస ఎక్కువ జీతం కోసమో, చదువుల కోసమో, గౌరవార్థమో, బ్రతకలేకనో కావచ్చు. వీటి మోజులోపడి కన్న తల్లి దండ్రులను, ఊరిని, రాష్ట్రాన్ని విడిచి ఎక్కడో, ఎవడి దగ్గరో, ఎవరికో సలాం చేస్తూ బతుకుతున్నారు. కవి వలసవాదాన్ని గురించి చక్కగా చెప్పారు.

అనాది కాలంలో
నీళ్ళ కోసం ప్రారంభమైన వలస-
ఎవరు ఎందుకు వెళ్ళినా
వలసవెళ్లిన చోట/రెండో వరుసలోనో
మూడో వరుసలోనో/చివరి వరుసలోనో
బిక్కుబిక్కుమంటూ/ కూర్చోవాల్సిందే!
ముందుకురావడానికి ప్రయత్నిస్తే
మరో వలస తప్ప
వరస మారదు!

(మూడోమనిషి, పుటలు.57,58)

డాలర్ మోజులో పడి తనరూపాయిని అమ్ముకునే స్థితికి మనిషి ఎదిగాడు. కేవలం ఎన్ఆర్ఐ అని గర్వంగా చెప్పుకునే స్థాయికి ఎదిగారు. సొంతదేశాన్ని అవహేళన చేస్తూ మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు.

ఆర్థికమాంద్యంలో కొట్టుకుపోయిన
నా రూపాయిని పణంగాపెట్టి
వాడి డాలర్ విలువ పెంచడానికోసం శ్రమను
ధారబోస్తున్నా! / నా రూపాయిని చీప్ గా కొన్నట్టే

నా శ్రమను కూడా చీప్ గా కొంటున్నాడన్న ధ్యాసే నాకు లేదు! / చల్లని గదుల్లో వెచ్చని డాలర్లకోసం పరితపిస్తున్నా / ఏ నాడూ దేశంకోసం పనిముట్టుకోని నేను / వాడికి పనిముట్టుగా మారిపోయాను! (చివరకు నువ్వే గెలుస్తావు, పుట.47)

చదువుకోసమో, సంపాదనకోసమో పరాయి దేశం వెళ్ళిన పిల్లలు శవాలుగా కొట్టుకొస్తున్న సందర్భాలను గురించి కవి 'మారని దృశ్యాలు' అనే కవితలో చెప్పాడు.

గూగుల్నే ప్రపంచంగా చేసుకుని
మార్కులు ర్యాంకులు
తప్ప రెండో ధ్యాసలేకుండా
జీవితమంతా పరుగెత్తి పరుగెత్తి
సాధించిన అమెరికా ప్రయాణం
చివరకు ఒకే ఒక క్షణంలో
విధి పేరుతో వివక్షకు బలైపోయింది!
దూరపు భవనాలు తెలుపు
వైట్ హౌస్ రక్తపు మరకలు
దగ్గరికి వెళితే గానీ కనిపించవు!

(మూడో మనిషి, పుట.41)

ప్రస్తుతకాలంలో అభివృద్ధి అంటే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి కాదు వ్యక్తిగత వృద్ధి మాత్రమే. ఆ వ్యక్తిగతం కూడా స్వార్థపూరితమైంది. ఎదుటివాడు బాగుపడుతుంటే చూసి ఓర్వలేని వాళ్ళు కిందికి లాగాలని చూస్తారు. కింద ఉంటే పైవాళ్ళని కాళ్లు పట్టిలాగేస్తారు. పైన ఉంటే కిందివాణ్ణి కాళ్లతో అణగదొక్కేస్తారు. వాడు అభివృద్ధిలోకి రావడానికి అవతలివాడి అంతు చూస్తాడు!.

మనిషి విలువ/రూపాయిలాగా / పడిపోతూనే ఉంది! / నేను మనిషిని/డాలర్‌తో కొలుస్తాను /అతను ఎన్ని ఎంబీలో / తెలుసుకొని మర్యాదిస్తాను! (శత్రువుతో ప్రయాణ, పుట.57)

దేశం :

క్రికెట్ అభిమానుల్లో, స్వాతంత్ర వేడుకల్లో ఉప్పొంగేదో, విదేశాలకు వెళ్ళినప్పుడో, దేశాల మధ్య యుద్ధసన్నాహాల ఊసు వినిపించినప్పుడో, స్వాతంత్ర సమరయోధులు పేర్లు వినబడినప్పుడో, జాతీయగీతం విన్నప్పుడో, నరనరాల్లో దేశభక్తి నిక్కబొడుచుకుని అందరినీ ఒకే తాటిపై నిలుతుంది. దేశభక్తి అనేది జెండా రూపంలోనో, ఎజెండాల రూపంలోనో ఉండేది కాదు. అది సహజంగా అందరి గుండెల్లో నిక్షిప్తమై ఉంటుంది.

మన దేశభక్తి ఏ విధంగా ఉంటుందో కొన్ని కవితల ద్వారా కవి చెప్పాడు. మనదేశానికి పాకిస్తాన్‌కి మధ్య సంబంధాలు ఏ విధంగా ఉంటాయో కొన్నింటిని చర్చించాడు.

చర్చలు చర్చలే / కాల్పులు కాల్పులే / భారత్-పాక్ మిత్రభేదం! / భారత్-పాక్ మైత్రికి / అమెరికా అండ దండలు/ శ్రీకృష్ణ రాయబారం! /అసలే దాయాదులు/ ఆపై అమెరికా / భారత్-పాక్ సంబంధాలు! (ఆలోచనలు, పుటలు.23,34) యుద్ధం అనే ఒక్కమాట మిగిలిన అన్ని సమస్యలను పక్కకునెట్టి అందరినీ ఒకే మాటపై నిలబెడుతుంది. అప్పటివరకూ వివిధ అంశాలపై పోరాటం చేస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజానీకం అంతా దేశంవైపు నిలబడి ఉంటారు. ఎవరి దేశం వారికి గొప్ప. ఆయా దేశాల జెండాలు ఆ దేశం యొక్క ఐక్యతకు చిహ్నం. అప్పటివరకు కులం, మతం, వర్గం, వర్ణం వంటి అంశాల్లో భిన్నంగా ఉన్నప్పటికీ అందరినీ ఏకం చేసేది దేశ జెండానే.

ఒక గుడ్డ ముక్క / ఒక కొయ్యముక్క /కొంచెం దేశభక్తి / కలిపి కడితే /నిలువెత్తు జెండా అవుతుంది! ఎంతటి వాడినైనా జెండా ఏవిధంగా రక్షిస్తుందో కింది విధంగా కవి చెప్తారు.

నువ్వు ఎంత త్రాష్టుడివైనా/దాని నీడలో / సుభాష్ చంద్రబోస్‌లా కనిపిస్తావు / అది జెండా మహత్యం! / నువ్వు ఊసరవెల్లివైనా/ఆ రంగుల నీడలో /కళ్లద్దాలు పెట్టుకొని / కొయ్య పట్టుకొని / నడిచే గాంధీలా కనిపిస్తావు /అది జెండా మహత్యం! / నువ్వు చెప్పే అబద్ధాలన్నీ / జాతీయ గీతంలా వినిపిస్తుంది / అది జెండా మహత్యం! / నువ్వు జెండాకు / కొంచెం ఎడంగా జరిగి చూడు / నా అసలు రంగు అందరికీ అర్థమవుతుంది! (చివరకు నువ్వే గెలుస్తావు, పుటలు.54,55)

ఇతర అంశాలు :

ప్రపంచీకరణ నేపథ్యంలో మారిపోతున్న జీవన విధానం, దానివల్ల ఇతర జీవరాశుల ఏ విధంగా ప్రభావితం అవుతాయి అనే అంశాలను ''పిచ్చుకపై

బ్రహ్మాస్త్రం'' కవితలో కవి పేర్కొన్నాడు. పిచ్చుక చెట్లపై గూడుకట్టుకొని నివసిస్తూ ఉండేది / చెట్టుకొట్టేస్తే/ పిచ్చుక పూరిళ్ళలో గూడుకట్టుకుంది / పూరిళ్ళు మాయమైతే/ పెంకుటిళ్ళలోకి చేరింది / పెంకుటిళ్ళు వగిలి పోయాక/ మిద్దింట్లోకి మకాం మార్చింది / మిద్దిళ్ళు పోయి అపార్‌కమెంట్లు వచ్చాక/ ఏ అపార్ట్‌మెంట్లోకి దూరినా / ఎవరూ బతకనివ్వలేదు / ఎంతదూరమని తరుముతారు / ఎక్కడికి వెళ్ళింది పిచ్చుక/ ఏమై ఉంటుంది పిచ్చుక! (చివరకు నువ్వే గెలుస్తావు, పుట.82) కేవలం పిచ్చుకలే కాకుండా, ఇతర పశుపక్ష్యాదులు, మూగజీవాలు మనవల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కనుమరుగవుతున్నాయి. భయం అనేది ఏ రూపంలోనైనా ఉండవచ్చు. తీవ్రమైన ఎండైనా, కుండపోత వర్షం అయినా, గడ్డకట్టే చలైనా, చావుకి, బ్రతుకు కి, ఏపని చేసినా భయమే. డబ్బు రూపంలో అప్పుగా, కట్నంగా, కష్టంగా, భారంగా అన్ని విధాలుగా భయమే.

కళ్ళలో భయం/కాళ్ళలో భయం/హృదయంలో భయం / శరీరమంతా వణుకుతోంది/చలికి కాదు, భయానికి! (శత్రువుతో ప్రయాణం,పుట.51)

భయానికి మరో పేరును, మరో అర్థాన్ని కవి 'అభయం'గా చెప్పారు.

కుండపోతగా కురిసే వర్షం/మనల్ని భయపెడుతుంది / వర్షం ఆగిపోయిన తరువాత/ఎంతో హాయిగా ఉంటుంది / హాయి వర్షం ఆగిపోయినందుకు కాదు/ వర్షం కురిసినందుకు / ఏది ఇంతసేపు భయపెట్టిందో /అదే ఇప్పుడు మనకు హాయినిస్తోంది /అంటే/భయానికి మారుపేరు హాయి! (వికారి,పుట.68)

భయంతో పనిచేస్తే ఫలితాలు భిన్నంగా ఉంటాయి/ భయంతో పనిచేయడం మానేస్తే ఫలితాలు చిన్నాభిన్నంగా ఉంటాయంటాడు కవి. అనేక అంశాల్ని తన కవితా వస్తువులుగా ఎన్నుకొని తనదైన శైలిలో ఈ కవితా సంపుటాలను వెలువరించారు.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆవేదన, సంవేదనల అక్షరరూపం 'ఆలోచనలు'

- షేక్ జలీనా, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు వృత్తిరీత్యా ఆచార్యులు, ప్రవృత్తిరీత్యా కవి హృదయులు. అధిక విద్యాసంపన్నులుగా, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా, అనేకమంది పరిశోధకులకు మార్గదర్శిగా, మృదుస్వభావిగా, కవిత్వ సృజనశీలిగా వీరు ప్రసిద్ధులు. 'అల్పాక్షరముల అనల్పార్థ రచన' తిక్కన భారతానికి వన్నె చేకూర్చితే, హైకూతత్వం, మినీ కవితాతత్వం అనేవి 'ఆలోచనల' సంపుటికి కవితా శక్తినిచ్చింది. ఆయనే చెప్పుకున్నట్లు 'ఇది అచ్చంగా కవిత్వం కాదు, కొన్ని ఆలోచనలు మాత్రమే'. అయినా ఆలోచనలు పదునుగా, తీవ్రంగా, సమకాలీన సంఘ టనల పట్ల సూటిగా ఎక్కుపెట్టిన బాణాల్లా రూపం ధరిం చడం విశేషం.

కవిత్వదృష్టితో రాసినవి కాదు కాబట్టి వీటిని 'జర్నలిస్టిక్' కవితలుగా ఈ కవి పేర్కొన్నారు. వార్త దినపత్రికలో ఉ ద్యోగం చేసినపుడు మానవి, ఎమెస్కోలాంటి కలం పేర్లతో రాసిన ఈ కవితలు చదివాక పాఠకుడు సమకాలీన అంశాల పట్ల కవికి గల అభ్యుదయ భావాలకు అశ్చర్య చకితులవుతారు. ఎం.ఫిల్ పరిశోధనలో నాకు మార్గ దర్శనం చేస్తున్న మా పర్యవేక్షకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారి కవితా హృదయాన్ని, 'ఆలోచనలు' కవిత్వంలోని భావుకత్వాన్ని, తీవ్రతను పరిచయం చేసే అదృష్టం ఈ వ్యాసం ద్వారా కలుగుతున్నందుకు సంతోషంగా ఉంది. సమాజాన్ని విస్తృతంగా అవగాహన చేసుకోవడానికి ఈ సంపుటిలో వారు వ్యక్తం చేసిన అంశాలు అభ్యుదయ దృక్పథానికి ప్రతీక. ఈ సంపుటిలో జెండాసాక్షిగా, ఆలోచనలు, రైతేకూలి, బాణీలు, విషాదాశ్రు తుషారాలు, కొన్ని ఆలోచనలు, వికృతులు, దృశ్యాలు, గాంధేయాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు అనే శీర్షికలు న్నాయి. ఒక్కో శీర్షికకూ తన ఉద్యోగ ధర్మాన్ని అను సరించి, ఆనాటి సంఘంలోని అసమానతల్ని అనుసరించి రాసిన అక్షరతూణీ రాలున్నాయి. తక్కువ అక్షరాలతో ఎక్కువ భావాన్ని చెప్పడం వీరి 'ఆలోచనలు' సంపుటిలో కనిపించే ప్రత్యేక లక్షణం. విన్న వెంటనే ప్రతిస్పందించి కార్యాచరణకు పురిగొల్పే లక్షణం మనకు కవిత్వంలో కనిపిస్తుంది. ఆయా శీర్షికల కింద వారు వ్యక్తపర్చిన అంశాలను ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తాను.

'తిరగబడిన జనం
విరిగిపడిన ప్రభుత్వం
1947 ఆగస్టు 15'

(ఆలోచనలు: పుట.4)

దాదాపు మూడువందల సంవత్సరాల తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా భారతీయులు తిరగబడ్డారు. 'మా దేశం మాకు కావాలి', 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ నినదించారు. 'స్వదేశీ ముద్దు - విదేశీ వద్దు' అంటూ పోరాట పటిమను ప్రకటించారు. ఎన్నో పోరాటాలు, మరెన్నో ఆత్మత్యాగాలు జరిగాక ఎట్టకేలకు 1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఎన్నోవందల సంవత్సరాల పాటు సాగిన భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అతి తక్కువ పదాలతో చెప్పడం కవిలోని ప్రతిభకు నిదర్శనం.

'పేరు చుండూరు
హృదయం మండే చూరు
1991 ఆగస్టు 6'

(ఆలోచనలు: పుట.8)

ఆంధ్రప్రదేశ్‌లోని చుండూరు గ్రామంలో 1991 ఆగస్టు 6వ తారీఖున అత్యంత ఘోరమైన, హేయమైన సంఘటన నమోదు చేయబడింది. తల్చుకుంటే ఈనాటికీ

ఒళ్ళు గగుర్పొడిచే దారుణాలు కళ్ళముందు మెదులు తాయి. చుండూరు గ్రామంలోని దళితులపై అగ్ర కులస్తులు వేటకొడవళ్లతో, గొడ్డళ్లతో, బరిసెలతో వెంటాడి, వేటాడి చంపడమే కాకుండా మృతదేహాలను ముక్కలుగా నరికి గోనెసంచుల్లో కట్టి నదిలో పడేశారు. చుండూరు అనే పేరు తల్చుకున్నప్పుడల్లా హృదయం మండుతూనే ఉంటుంది. ఆ దారుణం కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. పదునైన పదాలతో అనంత మైన భావాన్ని ఇమిడ్చి చుండూరు దారుణ నరమేధం పట్ల స్పందన తెలియజేస్తారు కవి.

'యంత్రాలు పండిస్తాయి
మంత్రాలు ప్రాణాలు తీస్తాయి
పల్లె మెదడులో మౌఢ్యం'

(ఆలోచనలు: పుట.16)

పల్లెలు ప్రగతికి చిహ్నాలు. 'గ్రామాలకు తరలిపొండి' అనేది ప్రసిద్ధిచెందిన నానుడి. పచ్చని పైరులతోనూ, ప్రకృతి పరవశంతోనూ, వ్యవసాయ నేపథ్యంగా ఒకప్పుడు గ్రామసీమలు విలసిల్లాయి. రోజులు మారిపోయాయి. కూలీలు, ఎడ్లబళ్ళ స్థానంలో యంత్రాలు ప్రవేశించాయి. వందమంది కూలీలు చేసే పనిని యంత్రాలు సునాయా సంగా చేస్తున్నాయి. అవిద్య, నిరక్షరాస్యతల కారణంగా చేతబడులు, చిల్లంగి మొదలైన మూఢనమ్మకాలకు పల్లెటూళ్ళు ఆలవాలంగా మారిపోయాయి. సాంకేతికంగా ఎంత ఎదిగినా, వైద్యపరంగా ఎంత అభివృద్ధిని సాధించినా వాటి ఫలితాలు పల్లెలకు చేరడంలేదు. వాతావరణ పరిస్థితుల వల్ల, అపరిశుభ్రత వల్ల కాలానుగుణంగా వచ్చే రోగాలకు, జబ్బులకు మంత్రగాళ్లను ఆశ్రయించడం మామూలుగా జరుగుతూనే ఉంది. నిరక్షరాస్యత, చైతన్యలేమి అనేవి నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలు. వాటినే శక్తివంతంగా పై కవితలో చిత్రించాడు ఈ కవి.

'దళితుడికొక దళితుడు
తిరగబడితె బలితుడు
మాదిగ దండోరా'

(ఆలోచనలు: పుట.11)

దళితుల్లో విస్తృతంగా వ్యాప్తిచెందిన మాదిగ దండోరా అనతికాలంలోనే అనేక కొత్త విషయాలను చర్చకు పెట్టింది. మాల-మాదిగల మధ్య ఐక్యతకు గొడ్డలిపెట్టులా మారింది. వాళ్లల్లో వాళ్లే బద్ధశత్రువులుగా మారే వాతావరణాన్ని సృష్టించింది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయపరంగా తాము కోల్పోయిన హక్కులను పొందడంలో భాగంగా చైతన్యం పొందిన మాదిగ దండోరా పల్లెల్ని దాటి విశ్వవిద్యాలయాల్లోనూ తమ ఉనికిని చాటింది. దళితుల్లోని ఉపకులాల మధ్య నున్న ఈ అనైక్యతను రాజకీయ నాయకులు వాడుకుని వారి మధ్య బాగా చిచ్చుపెడుతున్న సంఘటనలు మనం చూస్తూనే ఉన్నాం. కనుకనే వాస్తవ పరిస్థితుల్ని అవగాహన చేసుకుని సయోధ్యతో కలిసికట్టుగా ఉండి పోరాటం చేస్తే వారిని మించిన బలవంతులు లేరనే ఉద్బోధ చేస్తున్నాడీ కవి.

'దేశమంటే మనిషికాదోయ్
దేశమంటే మట్టోయ్
భూ బకాసురులు'

(ఆలోచనలు: పుట.17)

'దేశమంటే మట్టికాదోయ్, మనుషులోయ్' అంటాడు గురజాడ. ప్రజల్లో దేశభక్తిని నింపి, దేశాభివృద్ధికై వారిని కార్యోన్ముఖుల్ని చేయడానికి 1910లో గురజాడ దేశభక్తి గేయం రాశారు. ఆ గేయంలోని 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే రెండు పాదాల్ని ప్రస్తుత పరిస్థితులకు అన్వయించేలాగా రాసిన తీరు ఆశ్చర్య పరుస్తుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకున్నాక రెండు పంటలు పండే భూములు కూడా పెద్దపెద్ద భవనాలకు నిలయంగా మారి పోయాయి. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం, ప్రభుత్వాలు వ్యవసాయానికి తగిన ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం వల్ల దళారులు చెప్పిన మాటలను విని రైతులు ఎక్కువ డబ్బువస్తుందనే ఆశతో తమ భూముల్ని అమ్మేసుకుంటున్నారు. అంగబలం,

అర్థబలం కలిగిన వారు జనాల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా భూముల్ని ఆక్రమించుకుంటున్నారు. వేల ఎకరాల భూముల్ని ఆక్రమించే క్రమంలో హత్యలు చేయడానికి కూడా వెనకాడడంలేదు. అందుకే ఆధునిక కాలంలో మనిషి కంటే మట్టికే అధిక ప్రాధాన్యం ఉందని వ్యంగ్యంగా చెప్తున్నాడు కవి.

ఆమె ప్రపంచం గురించి బాధపడింది
ఆమె గురించి ప్రపంచం బాధపడింది
మదర్, డయానా!'

(ఆలోచనలు: పు-24)

మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం పేరుతో ముందు మాట రాస్తూ చలం 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ' అంటాడు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ పంక్తులను నేపథ్యంగా తీసుకుని మాడభూషి వారు చెప్పిన పై కవిత హృదయాంగమం. మదర్ థెరిస్సా గురించి తెలియనివారు ఉండరు. దేశంకాని దేశం నుండి భారతదేశానికి వచ్చి కుష్టువ్యాధి గ్రస్థుల మధ్య ఎంతో సేవచేసిన మదర్ ప్రజల గుండెల్లో నిల్చిపోయింది. 'మానవ సేవే మాధవసేవ' అనే సూక్తికి అసలు అసలు అర్థంలా భాసించింది. ఆమె చనిపోయినప్పుడు భారతదేశ ప్రజలు ఒక ఆత్మీయురాల్ని కోల్పోయినట్లుగా విలపించారు. బ్రిటిష్ రాజకుటుంబానికి చెందిన డయానా ఎంతో అందగత్తెగా మాత్రమే కాకుండా సాంఘిక సేవాకార్యక్రమాలలో కూడా విరివిగా పాల్గొంది. రాజకుంటుంబ నియమాలను ధిక్కరించి సామాన్య యువతిలా తన సేవల ద్వారా ప్రజలకు దగ్గరైంది. అనుకోకుండా జరిగిన ఒక కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి ప్రపంచాన్ని దుఃఖసాగరంలో ముంచెత్తింది. అందుకే ప్రపంచం గురించి బాధపడిన మదర్ థెరిస్సాను, డయానా గురించి బాధపడిన ప్రపంచాన్ని మన కళ్ల ముందుంచాడు కవి.

'ఆయుష్షు తీరిపోయిన/ నీ కళ్లను ఇలా పడెయ్
పసిగుడ్డును చేసి / మరో వందేళ్లు బతికిస్తా'

(ఆలోచనలు: పుట.29)

మరణానంతరం వచ్చే స్వర్గాలు ఎలా ఉంటాయో ఎవరికీ తెలియదు. చేసిన పుణ్యం మనల్ని మరోలోకంలోకి తీసుకెళ్తుందో లేదో తెలియదు. కానీ చనిపోయాక మనం చేసే అవయవదానం మాత్రం మనల్ని మరణం తర్వాత కూడా బతికించి ఉంచుతుందనే విషయాన్ని అద్భుతంగా చెప్పిన కవి అభినందనీయుడు. ఆధునిక వైద్యశాస్త్రంలోని పురోగతి వల్ల అవయవాలను మార్చి ప్రాణాలను నిలబెట్ట గలిగిన సామర్థ్యం మన వైద్యుల్లో ఉన్నప్పటికీ, అవయవ దానం పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేదు. మరణించాక మనతోపాటే మన అవయవాలు కూడా మట్టిలో కలిసి పోయేకంటే, అవసరంలో ఉన్న వాళ్లకు అవి ఉపయోగడడం అవసరం అనేది అవయవదానానికి మార్గమేసిందని చెప్పవచ్చు. గుండె, కళ్లు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు మొదలైన వాటిని దానం చేయడం ద్వారా ఆ వ్యక్తులకు పునర్జీవితాన్ని ఇచ్చిన వారవుతారు. ఒక వ్యక్తి అవయవదానం చేస్తే సగటున ఆరుగురికి ప్రాణం పోయవచ్చని గణాంకాలు చెప్తున్నాయి.

'ఎన్నిసార్లు కాటేసినా /పాము ఆరాధ్యదైవమే
ఓట్లేయడానికి బారులు తీరిన జనం!'

(ఆలోచనలు: పుట.31)

ప్రస్తుతం కాలంలోని ఎన్నికల వ్యవస్థకు, వాగ్దానాలిచ్చే రాజకీయ నాయకుల పనితీరుకు మచ్చుతునకగా నిల్చే కవిత పైది. నాగులచవితికి పుట్టలో పాలు, గుడ్డువేసి మన భక్తిని ప్రకటించుకుంటాం. అదే పాము రోడ్డుమీదో, మరోచోటో కనిపిస్తే చంపడానికి వెంటబడుతుంటాం. రాజకీయ నాయకులు కూడా తమ పదవిని కాపాడుకోవడానికి ఎన్నికల సమయంలో అమలులో సాధ్యంకాని అనేక వాగ్దానాలను చేస్తారు. తనకున్న అయిదేళ్లకాలంలో ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమవుతారు. అయినా జనాలు బారులుతీరి మళ్లీ అదే రాజకీయ నాయకుడికి

ఓటేయడమంటే పాలుపోని పాముచేతే కాటేయించుకోవడం లాంటిదనే విషయాన్ని సూటిగా, ప్రతిభావంతంగా చెప్పిన తీరు కళ్లముందు నిలుస్తుంది.

'ఒక చెంపమీద కొడితే
రెండో చెంప చూపించాలి
వాచిపోయిన రెండు చెంపలు!'

(ఆలోచనలు: పుట.36)

భారత స్వాతంత్ర్యోద్యమం అంటే గాంధీ కళ్లముందు నిలుస్తాడు. గాంధీలేకుండా ఆ ఉద్యమాన్ని మనం అంచనా వేయలేము. తాను నమ్మిన అహింస, సత్యాగ్రహం లాంటివాటిని ఉద్యమాలకు ఆయుధంగా వాడుకుని రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన జాతిపిత గాంధీ. ఆయన మాట్లాడిన మాటలు, రాసిన రాతలు భారతీయులకు భగవద్గీతలా మారాయనడం అతిశయోక్తి కాదు. గాంధీ చెప్పిన సూక్తుల్లో ఒక సూక్తి పైన చెప్పిన కవితాపాదాలు. శత్రువులో పరివర్తన తీసుకురావడానికి గాంధీ పాటించిన అహింసా సూత్రం ఒక చెంపమీద కొడితే రెండో చెంప చూపించడం. కానీ ఆధునిక కాలంలో ఆ వాక్యానికి అర్థం మారిపోయింది. ఒకప్పుడున్న వ్యక్తిగత ప్రవర్తనా నియమావళి, క్షమాగుణం, ఓర్పు మొదలైన లక్షణాలు ఇప్పుడున్న వ్యవస్థలో నశించాయి. బలవంతుడిదే రాజ్యమన్నట్లుగా వ్యక్తుల ప్రవర్తన కనిపిస్తుంది. ఆ విషయాన్ని ఇప్పుడున్న వ్యవస్థకు ప్రతిబింబంలా చిత్రిక పట్టారీకవి

'గదినిండా బందీలైన
సీతాకోక చిలుక / బడిపిల్లలు'

(ఆలోచనలు: పుట.50)

ప్రతీ వ్యక్తి జీవితంలోనూ బాల్యం ఒక మధురానుభూతి. అయిదేళ్లు వచ్చాక పిల్లలని బడిలో వేయడం అనేది ఒకప్పుడు అందరూ పాటించేవారు. రోజులు యాంత్రికంగానూ, పరుగుపందెంలాగా మారిన తర్వాత పిల్లల చదువుల్లోనూ మార్పులొచ్చాయి. రెండేళ్లు రాగానే స్కూల్లో చేర్పించి తమ పని అయిందన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు తల్లిదండ్రులు. ప్రకృతితో స్వేచ్ఛగా ఆడుకోవాల్సిన పిల్లలంతా ఇరుకుగదుల్లో ఇంగ్లీషు అక్షరాలతో కుస్తీ పడుతున్నారు. బాల్యం హాయిగా గడపితే మెదడు వికసించి జీవితం హాయిగా గడుస్తుంది. కానీ బందిఖానాలో గడిపితే దాని ఫలితాలు తర్వాత అతని జీవితంపై చెరగని ముద్రవేస్తాయి. సీతాకోకచిలుకలు స్వేచ్ఛగా ఎక్కడికైనా ఎగరగలవు. కానీ బందీలైన పిల్లలనే సీతాకోక చిలుకలు బాల్యమనే అద్భుత ప్రపంచాన్ని కోల్పోతున్నారనే ఆవేదన పై కవితలో మనకు కనిపిస్తుంది.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారి ఆలోచనలు పాఠకులను వర్తమాన సమాజం పట్ల అవగాహన కలిగించగలవు. భవిష్యత్తు పట్ల ఆలోచన రగిలించగలవు. వార్తా దినపత్రికలో ఒక్కో శీర్షికతో వారం వారం రాసిన చిన్న కవితలుగా కనిపించినా, ఆ కవితల్లోని అంతరార్థం మాత్రం హృదయానికి హత్తుకుంటుందని చెప్పడం అతిశయోక్తి కాదు. 'హృదయం లేని మనిషికి చిహ్నం తడి ఆరిపోయిన కళ్లు' లాంటి కవితలు కవిలోని ఆర్ద్రతను అణువణువూ స్పృశింపజేస్తాయి.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మొదటి అబద్ధం': విశ్లేషణ

– డి. స్వాతి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఎవరికి వారు తాము నిజమే చెబుతున్నామని భావిస్తుంటారు. ఒకటి అర చెప్పినా అవి అంతగా పరిగణించవలసినవి కావని అనుకొంటుంటారు.పైగా ఒకవేళ అలా అబద్దాలు చెప్పవలసి వస్తే అందులో ఆడవాళ్లే ముందుంటారనే అపోహ, వారు ఎక్కువ అబద్దాలు ఆడతారని వాదన వినిపిస్తుంటారు. 'అబద్దాలు చెబితే ఆడపిల్లలు పుడతారు'అనే సామెతను ప్రస్తావిస్తూ ఉంటారు. అసలు అబద్దం అనేది అవసరమే తప్ప దానికి పుంలింగ, స్త్రీలింగ వివక్ష ఎందుకుంటుంది? అనే ఆలోచన రాదు. అబద్దం ఆడేవారికే అడపిల్లలు పుడ తారనే వాదన నిజమైతే నిజాలు చెప్పే (అలాంటి వారు ఉంటే)వారికి ఆడపిల్లలు ఉంటే...? అలాగే అసత్యాలు చెప్పే వారికి మగసంతానమే తప్ప ఆడసంతానం లేకపోతే.. ?

అసలు 'అబద్ధాలు ఆడ్డానికి కారణాలేమిటి? అన్న ప్రశ్నకు అబద్ధపు సమాధానాలే ఉన్నాయి. ప్రతి అబద్ధానికి కారణం ఒక అబద్ధపు సమాధానమే' అంటారు కవి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. అబద్ధాలపై అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధన చేసిన నేపథ్యంలో అవసరం ఉన్నా, లేకపోయినా చెప్పే అబద్ధా లను రచయిత 'మొదటి అబద్ధం' పేరుతో క్రోడీకరిం చారు.

అబద్ధాలాడడానికి కారణాలను, ఏయే వయస్సులు వారు ఎంత శాతం మేర అబద్ధాలు చెబుతారనే గణాం కాలను కూడా ఆ పరిశోధనలో వెల్లడించింది. వీరిలో తమ తప్పు కప్పిపుచ్చుకునేందుకే అత్యధిక శాతం (22) అబద్ధాలు చెబుతున్నారని ఆ పరిశోధన పేర్కొంది.

ఆర్థిక ప్రయోజనాల కోపం 16 శాతం మంది,ఇతర సొంతలాభాల కోసం 15 శాతం, ఇతరుల నుంచి తప్పించుకోవడానికి 14 శాతం, గొప్పలు చెప్పుకోవడానికి 8 శాతం, అబద్ధాలు ఎందుకో చెబుతారో తమకే తెలి యని వారు 5శాతం, తమాషాకి అబద్ధం చెప్పేవారు 5 శాతం,ఇతరులకు సహాయం చెయ్యడానికి 5 శాతం, ఇతరులను కించపరచడానికి 4 శాతం, పదిమందిలో మర్యాద/గౌరవం కోసం 2శాతం, నిజంపైన మర్యాద లేకపోవడంవల్ల 2 శాతం మంది అబద్దాలు చెబుతారని పరిశోధన ఫలితాలు చెబుతున్నాయి.

ఇక అబద్ధాలు చెప్పడంలో చిన్నా,పెద్దా అనే మినహాయింపులేదు. వారి వారి అవసరాల మేరకు అదా అధారపడి ఉంటుంది.

సత్యం వద, పలికి బొంకరాదు, సత్యమేవ జయతే.... ఇలా ప్రాథమిక పాఠశాల నుంచే బోధిస్తారు. కాని చిన్నపాటి అబద్ధాలు అక్కడి నుంచి మొదలవుతాయి.

అబద్ధాలన్నీ ఒకే కోవకు చెందినవి కావు. కొన్ని అవసరార్థం, మరికొన్ని అవకాశవాదంతో, ఇంకొన్ని పరోపకారార్థం అబద్ధాలు ఆడవలసి రావచ్చు. కారణ మేదైనా అబద్ధం అనేది దాదాపు నిత్యావసరవస్తువు అయిపోయింది. తెలిసో తెలియకో అబద్ధాలు చెప్పని వారుండరంటే అతిశయోక్తి కాదు.'కంటతడి పెట్టనివాడు, వానలో తడవని వాడు ఉండడు'అనే సామెత ఏమో కానీ ఈ లోకంలో ఒక్క అబద్ధం కూడా చెప్పని వారు ఉండి ఉండరు.

'న్యాయస్థానాలు, రక్షకభటనిలయాలు
అమ్మకాలు, పంపకాలు
అందం, అలంకరణ
కళలు, కవితలు
అబద్ధంలేనిదే ఏదీ నడవదు
అన్నీ అబద్ధంలో తడవాల్సిందే!'

అని 'ఇందుగలడందులేదు'అన్నట్లు అన్ని రంగాలలో, అన్ని విషయాలలో అబద్ధం అనేద ఇమమేకమైపోయింది.

'అబద్ధాలు చెబితే ఆడపిల్లలు పుడతారు'అనేది కాలం చెల్లిన సామెత. నిజం చెప్పేవారికి ఆడసంతానం కలగదా? అనేది ప్రశ్న. అంతేకాకుండా ఈ సామెత స్త్రీ జాతిని అవమానించేదిగా ఉంటుంది.

'మొదటి అబద్ధం' అనే ఈ సుదీర్ఘ సంచికలో కవి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ వివిధ రకాల అబద్ధాలను, అందుకు సందర్భాలను వివరించారు. వాటిని కొన్ని అంశాల కింద విభజించి పరిశీలిస్తే .....

నిజం కంటే అబద్ధానికి శక్తి ఎక్కువ. నిజం గడపదాటేలోగా అబద్ధం లోకం చుట్టివస్తుందని సామెత.

అబద్ధం కళ :

అబద్ధం ఆడడం కూడా ఒక కళే. అది విశ్వసనీయంగా, ప్రణాళికాబద్ధంగా ఉండాలి. ఎవడు పడితే వాడు అబద్ధం ఆడలేడు, ఆడి జయించలేడు.

'అబద్ధం ఆడినా
అతికినట్టుండాలన్నారు
అతుకు తెలిస్తే
బతుకు బండారం బయటపడిపోతుంది'

అంటారు కవి. కురుక్షేత్ర యుద్ధంలో ధర్మరాజు చెప్పేచెప్పకుండా చెప్పిన అబద్ధం అలాంటిది. ఆయన పట్ల గల విశ్వసీయత కారణంగానే ద్రోణుడు ఆయన పలుకులను నమ్మాడు.

'కొందరికి
అబద్ధం వెన్నతో పెట్టిన ముద్ద
అవలీలగా మింగగలరు
వాళ్ళ కడుపులో ఎన్ని అబద్ధాలుంటాయో!' అని ఆశ్చర్యపోయారు కవి.

'అబద్ధానికి ఎంతో ఒద్దిక కావాలి
నిజం చెప్పేవాడికి ఒద్దిక అవసరంలేదు
అబద్ధం చెప్పేవాడు ఒద్దికలోనే ఉంటాడు
.....
లేనిపక్షంలో....
ఎంతో కష్టపడి చెప్పిన అబద్ధాలన్నీ
చివరకు ఒక్క నిజంతో నాశనమైపోతాయి!'

అంటారు. పొరపాటున పచ్చినిజం చెప్పినప్పటికీ స్థిరంగా నిలిచేదే సిసలైన అబద్ధం. అందుకే తెలిసో తెలియకో అబద్ధం చెప్పేవారు విజ్ఞతతో సరిచేసుకుంటే అదో పద్ధతి. కాని పక్షంలో తను చెప్పినదానిపైనే నిలిచి నిజాన్ని కూడా అబద్ధంగా భ్రమింపచేయగలుగుతారు.

'మనుషులు
రాత్రుల్లో
హాయిగా నిద్రపోవడానికి కారణం
రోజంతా అబద్ధాలు చెప్పి అలసిపోవడమే!
రోజులో ఒక అబద్ధం కూడా చెప్పనివారికి
రాత్రంతా నిద్రపట్టదు!'

అని వ్యంగ్యీకరించారు. చివరి రెండు పంక్తులు మనుషులు అబద్దాలకు ఎంత అలవాటుపడ్డారో చెబుతున్నాయి. సాధారణంగా కాయకష్టం వల్ల అలసిపోతారు. కానీ ఇక్కడ అసత్యాలు చెప్పీచెప్పీ అలసిపోయారంటే అలాంటి వారికి అది అలవాటు కావచ్చు. లేదా వృత్తి కావచ్చు అనిపిస్తుంది.

అవినీతి - అబద్ధం :

అవినీతికి,అబద్ధానికి అవినాభావ నంబంధం ఉందంటారు మాడభూషి. నీతినియమాలు తప్పితేనే అబద్ధాలు అవసరమవుతాయి.

'అవినీతికి పాల్పడేవాడు
అబద్ధాన్ని ఆశ్రయిస్తాడు
అవినీతిని ప్రోత్సహించేవాడు
అబద్ధంపై ఆధారపడతాడు!'

అని వ్యాఖ్యానించారు. మరణంతో శత్రుత్వం అంతరించాలంటారు. కానీ కొందరు కాటికి పోతున్నా కక్ష(ల)ను విడనాడలేరు అలాంటి వారు

'ప్రాణం పోతూ ఉండగా
అబద్ధం చెప్పవచ్చు
బతికి ఉన్నవాణ్ణి జీవితాంతం చంపడానికి- ..'

అంటారు కవి. తాను చె(ప)డిపోతున్నప్పటికీ ఎదుటి వాడు బాగుపడకూడదనే కుత్సిత మనస్తత్వానికి ఇదో ఉదాహరణ.

పురాణాలు - అబద్ధాలు :

ప్రతి విధానానికి సవరణ లేదా సర్దుబాటు ఉన్నట్టే, నిజం చెప్పకపోవడానికి కూడా కొంత వెసులుబాటు కల్పించారు. శ్రీమత్ మహాభాగవతంలో

'వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణ మాన విత్త భంగమందు
చకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము పొందడధిప'.....

'స్త్రీలను ఒప్పించవలసినప్పుడు, వైవాహిక వినోద వేడుకలందూ, ప్రాణాలకు, ధనానికీ, గౌరవానికి ప్రమాదం వాటిల్లనప్పుడు, భయాతురులైన గోవులను, బ్రాహ్మణులను రక్షించవలసి ఉన్నప్పుడు అసత్యం చెప్పినా పాపం కలగదు సుమా'అని అబద్దాలు చెప్పడానికి మినహాయింపు ఇచ్చినట్లయింది.....' అంటూ పోతన గారు కొన్ని మినహాయింపులు ఇచ్చారు. అబద్ధాలు చెప్పే వారు ఇలాంటి పురాణాలనుంచి ఉదాహరణలు తీస్తారు.తనకు అనుకూలంగా పాత్రలను మలుచుకొని, నిజాలను కాలరాస్తాడు.

అన్నిటికీ అది అనాదిగా ఉందంటాడు
వీడికి అనుకూలంగా
పాత్రలను మారుస్తాడు
నిజాలను హతమారుస్తాడు
అది లాజిక్కుకు నిలవదంటాడు
ఇది మేజిక్కంటాడు
అది అసాధ్యమంటాడు
ఇది దుస్సాధ్యమంటాడు
వీడి అబద్ధాలను కప్పిపుచ్చుకోవడానికి
ఎంతదూరమయినా వెళతాడు
ఎంతసేపయినా మాట్లాడుతాడు!
.....
'అలనాటి హరిశ్చంద్రుడు
ఎప్పుడడిగితే అప్పుడిస్తానని
ఎప్పుడోగానీ ఇవ్వలేదు-
ధర్మరాజు శబ్దచాతుర్యంతో
అబద్ధాన్ని నిజం చెయ్యాలనుకొన్నాడు-
వసుదేవుడు
కన్నబిడ్డనే లేదన్నాడు!
ధుర్యోధనుడు
ఇస్తానన్న రాజ్యాన్ని ఇవ్వలేదు!'

అని మాడభూషి వారు పురాణాల నుంచి కొన్ని అబద్ధాల ఉదాహరణలు ఇచ్చారు.

ఇలాంటివే మరికొన్ని ప్రస్తావించవచ్చు. మహాదాతగా కీర్తిగాంచిన కర్ణుడు కులాన్ని దాచి పరాశురాముడి వద్ద అస్త్ర విద్యలు నేర్చి భంగపడ్డాడు.

రాజకీయం :

ఇతర రంగాలతో పోలిస్తే రాజకీయాలలో అబద్ధాల శాతం ఎక్కువనే అభిప్రాయం ఉంది. ఇక్కడ అబద్ధాలు ఇంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంఅని అర్ధం చేసుకోవాలి. అన్న మాటను అనలేదని బుకాయించే యత్నం మరో విపరీత పరిణామం. నాయకులు అనవలసింది అనేసి, ఇవి తమ మాటలు కావని, అవి మాధ్యమాల లేదా ప్రతిపక్షాలు సృష్టి అని వాదించడం ఇటీవల ఎక్కువైంది. సాంకేతిక పరిజ్ఞానం అంతగా అందుబాటులో లేని కాలంలో ఇలాంటి వైఖరి చెల్లిందేమో కానీ, వారి మారి మాటలు నమోదు చేసే సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత కూడా ఇలాంటి డబాయింపులు ఆశ్చర్యం కలిగిస్తోంది.

'ఓటేస్తే
అంత ఇస్తానంటాడు
అంతలో కొంతే ఇస్తాడు
ఇంకొంత తరువాతంటాడు
నువ్వు అంతా ఒకేసారి ఇస్తాడనుకొంటావు
అంతా ఇస్తానని ఎప్పుడన్నానంటాడు'

అనే కవితా పంక్తులు అదే చెబుతున్నాయి.

'అది ఉచితం
ఇది ఉచితం అంటాడు
చివరకు
అన్నీ అనుచితాలుగానే ఉంటాయి'

అని రాజకీయ నేతల తీరును పేర్కొన్నారు.

.....

'చెప్పిన అబద్ధాన్నే
మళ్ళీ మళ్ళీ చెబుతూ
జీవితాంతం రాణించేవాడు రాజకీయనాయకుడు!'

అని వ్యాఖ్యానించారు కవి.

'నువ్వేసిన ఓటుతో గెలుస్తాడు
నువ్వుచెప్పిన పార్టీలో ఉండడు
ఇందులో అబద్ధాన్ని కనిపెట్టలేవు!'

అని ఫిరాయింపులను ఎత్తిచూపారు. ఇది ప్రజా ద్రోహమే అవుతుంది. ఒక రాజకీయ పక్షానికి వ్యతిరేకంగా నాయకుడిని ఎన్నుకుంటే, ఆ నాయకుడు అదే పార్టీలోకి ఫిరాయిస్తే ఇది నమ్మకద్రోహమే. ఒకపక్షం తరపున విజయం సాధించిన వ్యక్తి ఆ పక్షంలో ఎంత కాలం ఉంటాడో తెలియని పరిస్థితి. అలాంటి వారి అసత్యపు మాటల చదరంగంలో పావులాంటివాడు. అధికారం చలామించేవారంతా సత్యవంతులే అనే భ్రమలో బతికేస్తుంటారు.....

'ఎవడు అధికారంలో ఉంటే
వాడే నిజమని భ్రమిస్తూ
సామాన్యుడు అబద్ధాలతో
జీవితాంతం సంసారం చేస్తున్నాడు!
.....
నమ్మినంత సేపూ నిజమని నమ్మి
నమ్మలేనప్పుడు నమ్మలేక అబద్ధమనుకుంటాడు!'

తప్ప అంతకు మించి చేసేది, చేయగలిగేది లేదను కంటాడు. ఎందుకంటే ఈ సామాన్యుడి 'భ్రమ' కంటే, అసాధరణమైన అబద్ధమనే అయుధం ఎదుటి వారి దగ్గర ఉంది కనుక.

ఆర్థికం :

మోసాన్ని అబద్ధానికి పర్యాయపదంగా పరిగణిస్తే బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థలు రుణగ్రహీతల నుంచి ఎదుర్కొంటున్న అబద్ధాలు అన్నీఇన్నీ కావు.

'నిజం చెప్పేవాడికి
ఏ బ్యాంకులోనూ అప్పు దొరకదు
అబద్ధం చెప్పేవాడికి అన్ని బ్యాంకులు
అప్పులు ఇవ్వడానికి వరుసలో నిలబడతాయి
అబద్ధానికి ఉన్న ఆదరణ అలాంటిది!'

అందుకే దానినే ఆచరిస్తాడు. లోకంలో నిజం కంటే అబద్ధం బాగా చలామణి అవుతున్నప్పుడు సత్యం చెప్పి నష్టం పోవడం కంటే అబద్ధాన్ని ఆశ్రయించడం మేలన్నా దృక్పథం పెరిగిపోతోంది.

'ఇప్పుడే తీరుస్తానని
బ్యాంకులో అప్పులు తీసుకొని
వేలకోట్లు లక్షలకోట్లు ఎగ్గొట్టేవాడికి
తాను చెబుతున్నది అబద్ధమని తెలుసు
తాను అప్పు తీర్చబోయేదిలేదని తెలుసు
ఇచ్చేవాడూ అంతే/ తాను ఎగ్గొట్టేవాడికి
అప్పు ఇస్తున్నానని తెలుసు'.

అయినా అప్పు ఇవ్వడానికి సిద్ధం'అని అవినీతికి అబద్ధానికి ఉన్న 'లంకె'ను,అధికారుల స్వయంకృతాప రాధాన్ని వివరించారు.

సామాజికం - అబద్ధం :

వెయ్యి అబద్ధాలు చెప్పయినా ఒక పెళ్లి చేయాలని సామెత. అన్ని అబద్ధాలతో పెళ్లి ఎందుకన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. కానీ చాలా పెళ్లిళ్లు అబద్ధాల మయమే. పెళ్లి మీద పెళ్లి చేసుకునే ఎందరో 'నిత్యపెళ్లి కొడుకులు' కనిపిస్తున్న కాలం. ఒకవేళ అబద్ధాల పెళ్లి జరిగినా జీవితాంతం ఆ అబద్ధాన్ని కాపాడుకోవలసి ఉంటూనే ఉంటుంది. అలా కానిపక్షంలో పెళ్లి పెటకాలకు దారితీయవచ్చు. అందుకే....

'ఎప్పుడో పెళ్ళిలో చెప్పిన/అబద్ధాన్ని
జీవితాంతం కాపాడుకొంటూ రావాలి!
ప్రేమ మితిమీరినప్పుడో
కోపం కట్టలు తెంచుకొన్నప్పుడో
ఆవేశం అదుపు తప్పినప్పుడో
మాటలు తడబడితే
పెళ్ళి గుల్లయిపోతుంది!' అని హెచ్చరించారు.

ఒక చిన్నపాటి అబద్ధంతో కలసివస్తుందనుకుంటే అబద్ధంవైపు మొగ్గేవారే అధికమని చెబుతోంది ఈ కవిత. ఇహలోకం యాత్ర చాలించిన తరువాత స్వర్గసుఖాలు దక్కుతాయో లేదో?అసలు పాపపుణ్యాలకు ప్రతీకలుగా చెప్పే నరక, స్వర్గాలు ఉన్నాయో!లేవో!అనే సందేహాలు కూడా మనిషిని అబద్ధాలకు పురికొల్పుతాయని భావించవచ్చు. 'స్వర్గం/మోక్షం/ఎన్ని ఆశలు చూపినా/ మనిషి మనసు మాత్రం'.....

'అబద్ధంవైపే మొగ్గుచూపింది
ఎప్పుడో వచ్చే సుఖంకన్నా
అబద్ధం ఇచ్చే సంతోషం మిన్న
స్వర్గాన్ని ఎడంకాలితో
మోక్షాన్ని మోకాలితో తన్ని
అబద్ధాన్ని ఆసరా చేసుకొని జీవనయానం
చేస్తున్నాడు!'

అని మానవనైజాన్ని ఆవిష్కరించారు.

అంతే కాదు...'యదార్థవాది లోకవిరోధి'అన్నట్లు నిజం చెప్పి ఇతరులతో శత్రుత్వం పెంచుకోవడం కంటే 'పదుగురాడు మాట పాడియై ధరజెల్లునట్లు.....'రాజీ మార్గం అనుసరించే వారు కూడా ఉన్నారు.

'నిజం చెప్పినోడికీ చావే
అబద్ధాలకోరుకీ చావే
నిజం చెప్పి నిష్కారపడ్డంకన్నా
అబద్ధంచెప్పి ఆనందంగా ఉండడమే లోకం తీరు!'

అని భావించేవారు ఉన్నారని చెబుతోంది ఈ కవిత.

అవినీతికి,అబద్ధానికి అవినాభావ సంబంధం ఉందంటారు మాడభూషి. నీతినియమాలు తప్పితేనే అబద్ధాలు అవసరమవుతాయి.

'అవినీతికి పాల్పడేవాడు
అబద్ధాన్ని ఆశ్రయిస్తాడు
అవినీతిని ప్రోత్సహించేవాడు
అబద్ధంపై ఆధారపడతాడు!' అని వ్యాఖ్యానించారు.

వైద్యం :

వైద్యం ఖరీదైన వ్యవహారంగా, వ్యాపారంగా మారింది. రోగ లక్షణాలు కనుగొనేందకు పరీక్షల మీద పరీక్షలు. అవసరమం ఉన్నా లేకున్నా పరీక్షలు. శస్త్రచికిత్సలు అనివార్యం (ఏ కొందరు వైద్యులనో మినహాయిస్తే). వ్యాధి కుదరడం ఏలా ఉన్నా రోగి సంబధికుల 'జేబు'కరిగి పోతుంది.

'అబద్ధానికి/వైద్యంచేసి సిద్ధంచేసేది వైద్యులే!
రోగానికి మించిన వైద్యం/రోగిని ముంచే వైద్యం
జ్వరం నుంచి/శవం దాకా
అబద్ధాలు మాత్రమే మందులు
ప్రిస్క్రిప్షన్‌తో మొదలై
సూదులు/ఎక్స్‌రేలు/ఈసీజీలు/స్కానింగులు/
ఆపరేషన్లు
అవసరాన్నిబట్టి కాకుండా
అబద్ధాన్ని బట్టి అవసరమవుతాయి

ఆపరేషన్‌లేకుండా
బిడ్డ భూమ్మీదకు రాదు'

అని ఈ కవితలో పేర్కొన్నారు.

'వైద్య రాజ నమస్తుభ్యం!యమరాజ సహోదర!
యమస్తు హరతి ప్రాణాన్!వైద్యः ప్రాణాన్ ధనానిచ!!'

(యమ సహోదరుడవైన ఓ వైద్యరాజా! నీకు నమస్కారం. ఎందుకనగా....యుముడు ప్రాణాలనే తీసుకుపోతాడు. వైద్యుడు ప్రాణాన్నీ, ధనాన్నీ కూడా హరిస్తాడు. కనుక నా జోలికి రాకుండుటకే ఈ నమస్కారం) అనే సుభాషితానికి ఈ కవిత చక్కగా పొసగుతుంది. 'వైద్యో నారాయణో హరిः' ఆర్యోక్తిలో 'విసర్గ 'లోపించి 'హరీ'అనే పరిస్థితి దాపురించిందని 'వైద్యోనారాయణో అంటూనే/హరీమనాల్సిందే'అని కవి వ్యాఖ్యానించారు.

న్యాయస్థానాలు :

న్యాయస్థానాలు తమ వంతుగా పనిచేయడానికి ప్రయత్నిస్తున్నా చట్టంలోని లొసుగులు కొంత అడ్డంకిగా నిలుస్తుంటాయి. ఇతర విభాగాలు/రంగాల మాదిరిగా కాకుండ ప్రతి అంశాన్ని సునిసితంగా పరిశీలించి పరిష్కరించవలసి ఉంటుంది. 'వంద మంది దోషులకు తప్పించుకోవచ్చేమో కానీ ఒక నిర్దోషికి శిక్ష పడకూడదు'అనే నినాదం కొందరు దోషులు బయటపడేందుకు చట్టంలోని లొసుగలు, మినహాయింపులను ఉపయోగించుకునే యత్నాలు ఎన్నెన్నో!! క్రీడా మైదానంలో అయినా, న్యాయస్థానంలో అయినా (రెండూ కోర్టులే) విజేత ఒకరే. ఆటలో విజేత నిర్ణయించడంలో అంతగా ఇబ్బంది ఉండదు. న్యాయాస్థానికి వచ్చే సరికి ఇరుపక్షాల న్యాయవాదులు తమతమ కక్షిదారులవైపే న్యాయం ఉందనే వాదనలు వినిపిస్తారు.

'ఖూనీ చేసినా రక్షిస్తానంటాడు
హత్యాచారం చేసినా కాపాడుతానంటాడు
నీది కానిదాన్ని నీదిగా చేస్తానంటాడు
నీతిగా చేస్తానని మాత్రం అనడు!'

అలాంటి సమయంలో దొంగసాక్షులు పుట్టుకొస్తారు.

'చిన్న అబద్ధం చెప్పమంటారు
దానికి పెద్ద ప్రయోజనం ఉంటుంది
పెద్ద నిజం చెప్పినా
చిన్న ప్రయోజనం కూడా ఉండదు!' ..

అందుకే పెద్ద నిజం చెప్పి నష్టం పోవడం కంటే చిన్న అబద్ధంతో లబ్ధిపొందవచ్చు కదా అనే ధోరణి ప్రబలుతుంది. అలా.....

'అబద్ధాలు చెప్పడానికే జన్మనెత్తేవారు సాక్షులు
.....
అబద్ధాలను నిజాలుగా/నిజాలను అబద్ధాలుగా

నిరూపించడానికి/ సాక్ష్యాలతో ఇరుపక్షాలు సిద్ధం! అన్నారు కవి. విచారణ పూర్తయి, తీర్పు వెలువడిన తరువాత ఓడిన వారి తరపు నుంచి సాక్షులకు రక్షణ ఉంటుందనడంలో అనుమానమేనంటారు కవి.అందుకే.....

'ప్రత్యక్షంగా చూసిన హత్యను
చూశానని నిజం చెబితే
వాడిపని ఖతం!
చూడలేదని అబద్ధం చెబితే
ఏ సమస్యా లేదు!'

అని రాజీ ధోరణి అవలంబిస్తాడట. సినిమాల నుంచి నిజజీవితం వరకు కనిపిస్తున్న దుష్ట సంస్కృతికి అక్షర రూపం.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ జీవితం - సాహిత్యం

- డా॥. బూసి వెంకటస్వామి, తెలుగు శాఖాధిపతి, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ తెలుగు సాహిత్యాన్ని సునిశితంగా పరిశీలించే శిష్ట విశిష్ట గుణగణాలు కలిగిన సాహితీ తపస్వి. అనువాదంలో అందె వేసిన చెయ్యి. పత్రికా రంగంలో వంగ్య, హాస్య రచనలు చేయగల నేర్పరి. భాషాశాస్త్ర నిపుణుడు. బహుభాషా కోవిదుడు, సాహితీ దురంధరుడు. వ్యాకరణంలో దిట్ట. సదస్సులు, సన్మానాలు జరిపి కవులను సత్కరించడంలో పేరెన్నిక పొంది ఎంతో మంది ఆచార్యులకు ఆదర్శ ప్రాయుడిగా నిలిచిన ఆదర్శమూర్తి. విద్యార్థుల పాలిట కల్పతరువు. ఇలా ఎన్నో గుణాలు ఇముడ్చుకొని పరిశోధకులకు మార్గదర్శకులుగా చేయూతనిస్తూ నిరంతరం వృత్తినే దైవంగా భావిస్తున్న మాడభూషి కవిగా ఎంతో మంది సాహితీ పిపాసకులకు సుపరిచితులు. కవిత్వంలో సామాన్యుల సమస్యలను, స్త్రీల బాధలను, తల్లిదండ్రుల ఆవేదనలను, ప్రజల ఆక్రందనలను, ప్రకృతి వైపరీత్యాన్ని, ప్రపంచీకరణ విపరీతాలను, దేశదౌర్భాగ్యాన్ని, రాజకీయపు దురంతాలను, ఈనాటి సాంఘిక, ఆర్థిక, మత, పరిస్థితులనే గాకుండా దేశ భవితను పసిగట్టి పెన్నును గన్నులా పేల్చడం, కవితను ఖడ్గంలా విసరడం మాడభూషి కవిత్వ లక్షణమనే విషయాన్ని నిర్భయంగా చెప్పవచ్చు. తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన ఇటువంటి సాహితీ మూర్తి మానవతా మూర్తి అయినటువంటి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ జీవితం - సాహిత్యం గురించి తెలియజేయడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

బాల్యం - విద్యాభ్యాసం :

"సామాన్య నిరుపేద కుటుంబంలో సెప్టెంబర్ 17,1959 వికారి నామ సంవత్సరం, చిత్తూరుకి 25 కిలోమిటర్ల సమీపం, తిరుపతికి 50 కిలోమీటర్ల దూరంలోని శ్రీరంగరాజపురం (ఎస్.ఆర్.పురం) మండలం, 49వ కొత్తపల్లిమిట్ట ప్రాంతం, దేవళంపేటకు సమీపంలో కమ్మపల్లె అనే కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు జన్మించారు. నిబద్ధత కలిగిన తండ్రి నడవడిక, తల్లి ఆదర్శం మాడభూషి జీవితానికి పునాదులు వేసింది. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబ జీవన పరిస్థితుల ప్రభావం ఆయనను ఆలోచింపజేశాయి.

మాడభూషి సంపత్‌కుమార్‌గారి విద్యాభ్యాసం వారి కుగ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేని కారణంగా పసిప్రాయంలోనే ప్రాథమిక విద్యకోసం పల్లె దాటవలసి వచ్చింది. చదవాలనే ఆసక్తి, చలాకీతనం రోడ్లులేని పొలాల గట్లుమీద నడక సాగించి, బోడిదేవర పల్లె పాఠశాల ప్రాంగణంలోకి చేరేవారు. చిన్న వయస్సులోనే సరస్వతీదేవి అనుగ్రహం మాడభూషి సంపత్‌కుమార్ గారి నాల్కమీద నాట్యమాడింది. అపారమైన మేధోసంపత్తితో గురువుల మన్ననలను పొందారు. మాడభూషి తెలివితేటలను గ్రహించిన గురవులు ఉన్నత విద్యాభ్యాసం చదివేందుకు చేయూతనిచ్చారు. హార్థికంగా గురువుల ఆదరణ ఉన్నప్పటికీ కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు వెంటాడుతున్నాయి. చదువు మీద జిజ్ఞాస వల్ల అతి పిన్న వయస్సులోనే రామాయణ, భారతం, భాగవతం, పురాణాలను వీధినాటకాల రూపంలో వాళ్ళ గ్రామంలో ప్రదర్శిస్తున్న సమయంలోనే వాటి మీద మక్కువతో శ్రద్ధగా వినడం, వినిన దానిని పఠనం చేయడం, నృత్యంగా ప్రదర్శించడం బాల్యంలోనే అలవరుచుకొన్నారు. దీనిని బట్టి మాడభూషిగారికి చిరుప్రాయంలోనే పురాణాల మీద ఎంత పట్టు ఉందో చెప్పవచ్చు. బాల్యంలో బాలకృష్ణుడిలా చెట్లు ఎక్కడం, స్నేహితులతో కలివిడిగా మెలగడం, వాగుల్లో ఈత కొట్టడం వంటి బాల్య చేష్టలతో తన్మయత్వం పొందేవారు.

మాడభూషి సంపత్‌కుమార్ గారు హైస్కూల్ విద్య చదవాలంటే కొత్తపల్లిమిట్టకు రావాలి. కొత్తపల్లి మిట్టకు రావాలంటే రెండు మైళ్ళు నడవాలి. హైస్కూల్ చదివే సమయంలోనే శ్రీరంగం శ్రీనివాసరావు గారి 'మహా ప్రస్థానం' కవితా ఖండికలతోపాటు ముందు మాటతో సహా ఔపాసన పట్టారు. సంప్రదాయ కుటుంబంలో జన్మించిన మాడభూషి ప్రాచీన సాహిత్యంలో అందల మెక్కిన కవులను గురించి అవలీలగా నేర్చుకున్నాడు. వీరేశలింగం, గురజాడ మొదలయిన వారి రచనలు చదివి ఆధునిక భావాలను ఆకళింపు చేసుకున్నారు. ఆ కారణం గా సంప్రదాయపు కట్టుబాట్లు, అంటరానితనం, మూఢనమ్మకాలనుంచి బయటపడ్డారు. హైస్కూల్ విద్య పూర్తి చేసేనాటికే స్కూల్ గ్రంథాలయం లోని ప్రతి పుస్తకాన్ని చదివి ఆకళింపుచేసుకున్నారు.

పదవ తరగతి ఉత్తీర్ణుడైన మాడభూషి ఇంటర్ మీడియట్ విద్య కోసం చిత్తూరు పి.సి.ఆర్ కళాశాలలో కామర్స్ గ్రూపులో చేరి, టైప్ రైటింగ్ లోయర్, హైయర్ పూర్తి చేశాడు. చదువు మీద జిజ్ఞాస ఉన్నా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతూ వేదిస్తూ ఉండేవి. ఆ క్రమంలో చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. అయినా చదవాలనే కోరిక, చదువును కొనసాగించాలనే తపన మాడభూషి గారిని ఉత్తేజ పరిచింది.

పి.వి.కె.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.కాం. పట్టా పొందటానికి అవకాశం కలిగింది. అప్పటికే ఆ పరిసర ప్రాంతాల్లోని స్థితిగతులను తెలుసుకొని ఉన్నతచదువును ఎక్కడ చదవాలి అని ఆలోచిస్తున్న మాడభూషికి ఎం.కాం.చదవాలనే కోరిక కలిగింది. అయితే ఇంట్లో పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండంతో ఇక మాస్టర్ డిగ్రీని చదవలేమని నిరుత్సాహంగా ఉన్నా లేని ఉత్సాహంతో చెన్నపట్నానికి పయనమయ్యారు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో 1983లో తెలుగు ఎం.ఎ.లో చేరిన మాడభూషి జీవితం మట్టిలో మాణిక్యంలా మెరిసింది. ఆ మెరుపులకు రూపురేఖలు దిద్ది గురువుగా పాఠాలు బోధించిన ఆచార్య జివిఎస్ఆర్ కృష్ణమూర్తిగారు మాడభూషిగారి ప్రతిభను గుర్తించి భుజం తట్టి ప్రోత్సహించారు. ఆ నూతన ఉత్సాహం ఉన్నత శిఖరాలను అధిరోహించేటట్లు తయారుచేసింది. జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తిగారికి మేథా సంపత్తుకు తగ్గ సంపత్‌గా అంచెలంచెలుగా సంపత్ ఎదిగేందుకు సహ కరించిన ఘనత ఆచార్య జివిఎస్ఆర్ కృష్ణమూర్తి గారికి దక్కుతుందన్న మాడభూషి గారి ముఖాముఖి మాటలు అక్షర సత్యం. అలా ఎం.ఎ.తెలుగు పూర్తి చేశారు.

ఎం.ఎ.చదివేటప్పుడే ఆకలితో అలమటించిన రోజు లున్నాయి. పడుకోవడానికి గూడులేక వీధివీధి తిరిగిన రోజులు ఉన్నాయంటారు మాడభూషి. మాడభూషిగారి మెతకదనం, చదువులోని చురుకుదనం స్థితిగతులు తెలుసుకొన్న జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తిగారు చదువుకు సహాయం చేయాలనే తలంపుతో పరిశోధన చేయమని భుజంతట్టి ప్రోత్సహించారు. అలాగే రచయిత అయిన మల్లిక్‌గారు సంపత్‌గారికి తన ఇంట్లోనే నీడనిచ్చి ప్రోత్స హించి ముందుకు నడవడానికి అవకాశం కల్పించారు. 1986వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో ఆచార్య జి.వి.ఎస్. ఆర్.కృష్ణమూర్తిగారి పర్యవేక్షణలో 'ఎరుకల తమిళ భాషల్లో బంధువాచక పదాలు - సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం' అన్న అంశంపై ఎం.ఫిల్. చేశారు.

ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉపకార వేతన నిమిత్తం పరిశోధన కోసం మధురై కామరాజ విశ్వవిద్యా లయానికి వెళ్ళారు. తెలుగుశాఖలో ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో 'ఎరుకలభాషకు వర్ణనాత్మక వ్యాకరణం' అన్న అంశంపై పరిశోధన చేయడానికి 1987వ సంవత్స రంలో పిహెచ్.డి.లోకి ప్రవేశించారు. ఆ సమయంలోనే 'మధుర, రామనాథ పురం జిల్లాల్లో తెలుగుభాష, జానపద సాహిత్యం' అనే అంశంపై యు.జి.సి. ప్రాజెక్టులో పని చేశారు. అప్పుడే ఆ పరిసర ప్రాంతాల్లోని భాషను కూడా అధ్యయనం చేశారు. సరిగ్గా రెండు సంవత్సరాలకు

1989లో సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించారు. 1990వ సంవత్సరంలో పిహెచ్.డి. మౌఖిక పరీక్ష నిర్వహించడానికి మౌఖిక పరీక్షకులుగా ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తిగారే రావడం తన జీవితంలో జరిగిన మరో విశేషం.

పిహెచ్.డి.పూర్తి చేసిన మాడభూషికి ఏదో చదవాలని తలంపు పుట్టింది. ఏదైనా ఒక ట్రైనింగ్ చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ వృత్తిమీద ఉన్న గౌరవంతో అన్నామలై విశ్వవిద్యాలయంలో బి.ఎడ్.కోర్సు పూర్తి చేశారు. అంతకుముందే తమిళంలో డిప్లొమా, కన్నడం డిప్లొమా, మలయాళంలో సర్టిఫికెట్‌కోర్సులను పూర్తిచేయడమే గాకుండా యుజిసి వారు నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత సాధించారు. భాషాశాస్త్రంలో కూడా ఎం.ఎ. చదివారు. మరో విశేషం ఏమిటంటే ఇదే మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో 'అత్యాధునిక తెలుగు కవితా దృక్పథాలు' అన్న అంశంపై పరిశోధన చేసి అత్యున్నతమైన డి.లిట్.పట్టాని కూడా 2015వ సంవత్సరం పొందారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో పనిచేసిన ఆచార్యులలో డి.లిట్. పొందిన వారిలో మొదటివారు వీరే.

వివాహం - సంతానం :

పట్టమ్మ, శ్రీనివాసాచార్యులకి ఆరుగురు సంతానం. వారిలో నలుగురు కూతుర్లు. ఇద్దరు కొడు కులు. వీరిలో పెద్ద కూతురు శాంతను అనంతపురం జిల్లాలో, రెండవ కూతురు ప్రేమను వేలూరు జిల్లాలో, మూడవ కూతురు ఆండాళ్‌ను కోలారు జిల్లాలో, నాల్గవ కూతురు రంగ నాయకిని చిత్తూరుజిల్లాలో ఇచ్చిపెళ్ళిళ్ళు చేశారు. పెద్దకొడుకు మాడభూషి వెంకటరమణకు చిత్తూరు జిల్లా నాగలాపురంలోని రంగనాయకితో పెళ్ళి చేశారు. చివరి సంతానం మాడభూషి సంపత్‌కుమార్‌కు పెద్ద కూతురుకి జానకి పుట్టగానే మాడభూషి సంపత్‌కుమార్ గారి కోసమే పుట్టిన వధువని నిర్ణయించారు. ఆ నిర్ణయమే మాడభూషి సంపత్‌కుమార్ గారికి సుగుణశీలి అయిన జానకితో 1987వ సంవత్సరం సెప్టెంబర్ 7వ తారీఖున వివాహ మైంది.

ఉద్యోగ జీవితం :

సంపత్‌కుమార్ గారు విద్య, వివాహం, ఉద్యోగం ఈ మూడింటిని ఒక ఒరలో ఇమిడ్చి జీవన పోరాటం సాగించారు. అటూ పరిశోధన కోసం పరితపించి ఫలితాలు చూసి, పరిశోధనను పూర్తి చేసి ఉద్యోగం కోసం నిర్విరామంగా కృషి చేస్తూ సంసార సాగరంలో ఈదడం ప్రారంభించారు. మాడభూషి సంపత్‌కుమార్‌గారికి 'రెక్కాడితే గానీ డొక్కాడని' పరిస్థితి. అయితే శ్రీనివాసాచార్యుల చేదోడు వాదోడు, అత్త మామల అండదండలు, అన్న మాడభూషి వెంకటరమణ సహాయసహకారాల వల్ల ఊపిరి పీల్చుకోగలిగారు. అయితే మాడభూషి సంపత్‌కుమార్‌గారికి చెట్టులో కొమ్మలు ఎన్ని ఉన్నా తన రెక్కల మీదే ఎగరాలనే సంకల్పం తనను వెంటాడి పురికొల్పింది. నూతన జీవితానికి మార్గం చూపింది. అందువల్ల ఒక పక్క పత్రికా రంగంలో మరో పక్క విద్యారంగంలో పయనించవలసి వచ్చింది.

మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో పరిశోధన చేస్తున్నప్పుడే పెళ్ళి చేసుకొని తన జీవితం గురించి ఆలోచిస్తూ సతమతమవుతున్న సమయంలోనే 1988వ సంవత్సరం అక్టోబర్ 26వ తారీఖున తనకు ప్రథమ సంతానం మాడభూషి మనీష్ పుట్టడంతో తన గమనం కొడుకు మనీష్ భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. 1989వ సంవత్సరం నుంచి 12 సంవత్సరాలపాటు హైదరాబాదులో కడుపు చేత పట్టుకొని వివిధ ఉద్యోగాలు చేశారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా పత్రికలతో పాటు వివిధ విద్యా రంగాల్లో పని చేసి కుటుంబాన్ని పోషించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తన భాషాభిమానాన్ని ఏమాత్రం వదలలేదు. 1991వ సంవత్సరం అక్టోబర్ 17వ తారీఖున మాడభూషి మానవి జననాన్ని అదృష్టంగా భావించి తన సమస్యలను సవాలుగా ఎదిరించి పోరాటానికి ఉపక్రమించాడు.

పత్రికారంగం - తెలుగు భాషా కృషి :

1989వ సంవత్సరం నుంచి 12 సంవత్సరాల పాటు

ఈనాడు, ఉదయం, వార్త, మహానగర్, మాభూమి, విజేత, తెలుగు పత్రిక తదితర పత్రికల్లో సబ్ ఎడిటర్ స్థాయి నుంచి న్యూస్ ఎడిటర్ స్థాయి వరకు పనిచేశారు. పత్రికల్లో పనిచేసేటప్పుడే వాసికెక్కిన పాత్రికేయులు పతంజలి, గజ్జెల మల్లారెడ్డి, కె.రామచంద్రమూర్తి, ఎ.బి.కె.ప్రసాద్ మొదలైన పాత్రికేయులకు సన్నిహితుడై, బూదరాజు రాధాకృష్ణ గారి సఖ్యతతో పత్రికా భాష మీద పట్టు సంపాదించారు. భాషాశాస్త్రంలో గాఢమైన పరిచయం పెంచుకొని ప్రముఖ భాషావేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తితో శబాష్ అనిపించుకొని వారి చేతుల మీదుగా సన్మానం చేయించుకొన్నాడు. పత్రికల్లో పనిచేస్తున్న సమయంలోనే ఎంతోమంది కవులతో, రచయితలతో పరిచయాలు పెంచుకొన్నారు. ఏటూకూరి ప్రసాద్‌తో కలిసి అభ్యుదయ పత్రికను కొంతకాలం నడిపించారు. సామాజిక పరిస్థితులను అవలోకం చేసుకొన్న మాడభూషి వార్త పత్రికలో 'కవాతు' పేరుతో వ్యంగ్య శీర్షికను చాలా కాలం నడిపారు. పత్రికల్లో పనిచేసేటప్పుడే ఎన్నో కవితలను రచించి ప్రచురించారు. వీరు పత్రికల్లో పనిచేస్తున్న సమయంలోనే తన తండ్రి మాడభూషి శ్రీనివాసాచార్యులు అకస్మాత్తుగా మరణించడంతో తన కన్నీటిని కవిత్వంలో ఇమిడ్చి, తన వ్యథను కవిత్వంగా మార్చి రాసిన 'కత్తి కిందపడకుండానే....!' అనే కవిత రాసి రచయితగా పితృఋణం తీర్చుకున్నారు.

కోటి విద్యలు కూటి కొరకే అన్నట్లు పత్రికల్లోని సంపాదన పసిబిడ్డల పాలకు కూడా సరిపోవటం లేదు. వారి దప్పిక తీర్చడానికి కోసం మంచినీటిని వేడినీళ్ళుగా కాచి అందులో చక్కెర వేసి తాగించారు. జీతం సరిపోని కారణంగా హైదరాబాద్‌లోని నానక్ రామ్ భగవాన్ దాస్ సైన్స్ కాలేజీలో అతి తక్కువ పారితోషికంతో పనిచేశారు. ఉన్నదానితో తృప్తి చెందుతూ తన బిడ్డలైన మనీష్, మానవిలకు హైదరాబాద్‌లోనే విద్యాభ్యాసానికి నాంది పలికారు. ఎన్నో కష్టాలకు, కడగండ్లకు ఓర్చి జీవితంలో పోరాటం సాగించి మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో 2000 సంవత్సరంలో సహాయ ఆచార్యులుగా ఉద్యోగం పొందారు.

పదవులు - బాధ్యతలు :

1. మద్రాసు విశ్వవిద్యాలయం మెరీనా క్యాంపస్ డైరెక్టర్‌గా మూడుసార్లు పదవీ బాధ్యతలను నిర్వహించారు. తెలుగుశాఖలో క్యాంపస్ డైరెక్టర్ అయిన మొదటివారు వీరే.
2. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్స్ ఫోరమ్ ప్రెసిడెంట్‌గా పదవీ విరమణ వరకూ ఉన్నారు.
3. మద్రాసు విశ్వవిద్యాలయం తరపున తెలుగువారి కళాశాలలయిన సర్ త్యాగరాయ కళాశాలకు, హిందూ కళాశాలకు ప్రాతినిధ్య పదవిని చేపట్టారు. ఇలా ఎన్నో కళాశాలలకు ప్రాతినిధ్య బాధ్యతను చేపట్టారు.
4. శ్రీపొట్టి శ్రీరాములు మెమోరియల్ సోసైటీకి కార్యదర్శిగా పదవి పొందారు.
5. తెలుగు భాషా పరిరక్షణ వేదిక, చెన్నైకు కార్యదర్శిగా ఉన్నారు.
6. యుజిసి, యుపిఎస్‌సి, సిబిఎస్ఇ లలో వివిధ రూపాల్లో సేవలందిస్తున్నారు.
7. తెలంగాణా సెట్, తమిళనాడు సెట్ పరీక్షలకు సేవలందిస్తున్నారు.
8. పదిహేను విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్, బోర్డ్ ఆఫ్ క్వశ్చన్ పేపర్ సెట్టర్స్ పదవుల్లో పనిచేశారు.
9. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేశారు.
10. మద్రాసు విశ్వవిద్యాలయం అకడమిక్, సెనేట్ మెంబర్‌గా ఉన్నారు.
11. తమిళనాడు 1-10 తరగతులకు, +1,+2 తరగతులకు పాఠ్యపుస్తక తయారీలో కీలక పాత్ర పోషించారు.

12. కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారాల ఎంపికలో సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి అనేక పదవుల్లో ఆయన రాణించారు,
13. ఇప్పటివరకూ సుమారు 300 మంది పిహెచ్‌డి సిద్ధాంతవ్యాసాలకు పరీక్షకులుగా ఉన్నారు.

మాడభూషి రచనలు :

మాడభూషి సంపత్‌కుమారి గారి కలం నుండి ఆణిముత్యాల్లాంటి రచనలు వెలువడ్డాయి. ఆయన రచనల్లో స్పృశించని సాహిత్యాంశం లేదంటే ఆశ్చర్యమే. వ్యాకరణం, భాషాశాస్త్రం, జానపదం, అనువాదం, జర్నలిజం, సాహిత్యం అన్నింటిలో అడుగు పెట్టి తనకున్న బహుముఖ ప్రజ్ఞను చూపించారు. తనలో తొలుస్తున్న కవితావేశాన్ని వివిధ కోణాల్లో దర్శించి, ప్రదర్శించారు. మహాకవి శ్రీశ్రీ రచించిన 'కవితా! ఓ కవితా!' ఉపాధ్యాయులకే బోధించడానికి సాధ్యంకానిది, అటువంటి కవిత్వాన్ని విశ్లేషించి తెలుగు పాఠకులకు దారి దీపంగా నిలిచారు. తెలుగు పరిశోధకుల నిమిత్తం 'మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ' గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చారు. 'పరిశోధన : నాడు, నేడు, రేపు' అనే అంతర్జాతీయ సదస్సును నిర్వహించి, పరిశోధక విద్యార్థులకు సంబంధ బాంధవ్యాలను నెలకొల్పి పరిశోధనకు కాణాచిగా నిలబడ్డారు. ఇలా సాహిత్యాన్ని సమాజ శ్రేయస్సు కొరకే ఉపయోగించిన మాడభూషి రచనలను గురించి తెలుసుకోవడం భావ్యం. సంపాద కత్వాలు కొన్నైతే, అనువాదాలు మరికొన్ని. కవితా సంపుటాలు మెండు. వ్యాస సంపదలు కోకొల్లలు కలిగిన మాడభూషి సంపత్‌కుమార్‌గారి రచనా వ్యాసంగం ఎలాంటిదో పరిశీలిద్దాం.

1. కవితా! ఓ కవితా! - వస్తువు, భాషా శైలి, 2010.
2. మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ, 2012,
3. వ్యాస సంపద, 2013,
4. వ్యాకరణ విజ్ఞానం, 2013,
5. తెలుగు జానపద కళలు, 2014,
6. అనువాద విజ్ఞానం, 2014.
7. కవాతు, 2020
8. రెండో ఓటమి,2020
9. జీవితం - కవిత్వం,2013
10. శత్రువుతో ప్రయాణం,2015
11. ఆలోచనలు, 2015
12. చివరికి నువ్వే గెలుస్తావు, 2016
13. మూడో మనిషి,2017
14. వికారి, 2019
15. మొదటి అబద్ధం, 2020

మాడభూషి గారికి కవితా శీర్షికను ఎన్ను కోవడంలోనే ఒక ప్రత్యేకత ఉంది. కవితా శీర్షిక వినిన వెంటనే ఆ గ్రంథం కొని వెంటనే చదవాలనే ఆసక్తి పాఠకులకు కలిగించటం వీరి ప్రత్యేకత. శీర్షికే కాదు, ఆ కవితా సంపుటి ముఖచిత్రం కూడా చూపరులను ఆకర్షింప చేస్తుంది. కవిత్వాన్ని తిరగవేస్తే ఒక కవిత్వాన్ని చదివి మరో కవిత్వాన్ని వదిలి వేయలేం. అందులో ఏదైనా ఒక కవిత్వాన్ని తప్పక చదవాలనిపిస్తుంది. చదవటమే కాదు కంఠస్థం చేయాలనే ఆశపుడుతుంది. ఒక పక్క స్త్రీ వాద రచయితగా నిలబడి వాదిస్తూనే, మరో పక్క మనిషిగా తన కర్తవ్యాన్ని ప్రబోధిస్తారు. ప్రకృతిలో జరిగే వైపరీత్యాలను అరచేతిలో అద్దంలా చూపించడమే గాక పరిష్కార మార్గాలను కూడా పొందుపరుస్తాడు. సమాజ స్థితిగతులను అంచనా వేసి సామాన్య పాఠకులకు కవితావేశాన్ని కలిగింపజేస్తారు. ఆయన వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని వేరు చేసి చూడలేమనడానికి ఆయన కవితా సంపుటాలే నిదర్శనం. వారి ఒక్కో కవితా సంపుటాన్ని గురించి ప్రముఖులు ఎలా ప్రస్తావించారో ఆయా రచనలను గురించి చర్చించుకునేటప్పుడు తప్పక తెలుసుకోవాలి.

సంపాదకీయాలు :

1. ఆంధ్ర మహాభారతం-వివిధ శాస్త్రపరిజ్ఞానం,(సం.) 2009

2. ఒక విజేత (అబ్దుల్ కలాముకు తెలుగు వారి నివాళి), 2015
3. పరిశోధన : నాడు, నేడు, రేపు, 2016
4. ధనికొండ హనుమంతరావు సాహిత్యం, 20 సంపుటాలు, 2019
5. తెలుగు దీప్తి, 2019

అనువాదం - రచనలు :

1. గడ్డిపరకతో విప్లవం, 2001,
2. సామాజిక శాస్త్రవేత్త పెరియార్, 2002,
3. అమ్మవాసన, 2008
4. జన్మభూమి, 2008
5. ప్రజారోగ్యానికి పనికొచ్చే సూత్రాలు, సులభమైన మార్గాలు, (అనువాదం), 2015

మాడభూషి అవార్డులు - బిరుదులు :

మాడభూషి వారి భాషా కృషికి, సాహిత్యానికి చేసిన సేవలకు మెచ్చి-

1. 2007-2008 సంవత్సరంలో హైదరాబాదు లయన్స్ క్లబ్ వారు "ఆంధ్ర భాషా విభూషణ" బిరుదునిచ్చి సన్మానించారు.
2. 2012 అక్టోబర్‌లో తెలుగు లిపిపై బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేసి తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొని వచ్చారు. ప్రపంచంలోనే తెలుగు లిపి రెండవ ఉత్తమ లిపిగా ఎన్నిక కావడానికి కారణం ఆయనే.
3. 2014 జనవరి 10వ తేదీన తమిళనాడు హిందీ అకాడెమీవారు విశ్వ హిందీ దివస్‌నాడు 'శిక్షక్ సిందు సమ్మన్' అవార్డును ప్రదానం చేశారు.
4. 2014 జనవరి, 22వ తేదీన మల్లవరపు జాన్ మధుర సాహితీ భారతి, తెలుగు సాహిత్య సేవసంస్థ సంస్కృతి, ఒంగోలు వారు విశిష్ట సన్మానం అందజేశారు.
5. 2014 ఫిబ్రవరి 29వ తేదీన భాషా పరిరక్షణ సమితి, పుంగునూరు వారు 'తెలుగు వాఙ్మయ ప్రగతిరత్న' అవార్డును బహూమతి చేశారు.
6. 2016 ఫిబ్రవరి 13వ తారీఖున చిత్తూరు జిల్లా యూనివర్సల్ పీస్‌క్రాస్‌వారు చిత్తూరులో సరోజిని నాయుడు 137వ జయంతి సందర్భంగా 'కవికోకిల అవార్డు'ను ప్రదానం చేశారు.
7. 2016 జులై 29వ తేదీన చిత్తూరు జిల్లా యూనివర్సల్ పీస్‌క్రాస్‌వారు చిత్తూరులో 'సాహిత్యరత్న జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.
8. 2016, అక్టోబర్ 1వ తేదీన కళాభారతి ఫౌండేషన్ మరియు రేవతి ఫౌండేషన్, వి.కోట సంయుక్త నిర్వహణలో 'జాతీయ తెలుగు కవి సమ్మేళనం'లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారా'న్ని ప్రదానం చేశారు.
9. 2017 ఆగస్టు 29వ తేదీన చిత్తూరు జిల్లా లలితకళాసాగర్ అధ్వర్యంలో 'శ్రీకృష్ణదేవరాయల జాతీయ పురస్కారం-2016' ప్రదానం చేశారు.
10. కళామిత్ర మండలి 11వ వార్షికోత్సవ వేడుకల్లో జాతీయ స్థాయి పురస్కారం-2017కు గాను శ్రీనర్రా నరసయ్య కోటమ్మల స్మారక సాహితీ ప్రతిభా పురస్కారాన్ని నవంబర్ 5, 2017లో ప్రదానం చేశారు.
11. 2019వ సంవత్సరంలో 'తెలుగు వెలుగు' అవార్డును పెరంబూరు తెలుగు సాహితీ సమితి ప్రదానం చేశారు.
12. 2019వ సంవత్సరంలో 'జీవిత కాల సాఫల్య పురస్కారం', ఆంధ్ర భాషా రంజని, తెలుగు శాఖ మద్రాసు క్రైస్తవ కళాశాల, చెన్నై.

మాడభూషి - విదేశీ పర్యటనం :

సింగపూర్, మలేషియా, శ్రీలంక, థాయిలాండ్, మారిషస్ తదితర దేశాలలో అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్రసమర్పన చేశారు. తెలుగు లిపిపై

బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేసి తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొని వచ్చారు.

మాడభూషి - సాహిత్య జీవితం :

ఉద్యోగం ఆచార్యులే అయినా ఆయనలో ఉన్న కవితా పిపాస అడుగంటిపోలేదు. అదే ఆయన ప్రవృత్తి. సమాజంలో ఏ చిన్న విషయాన్ని చూసినా వెంటనే స్పందించి కాగితం మీద కలం పెట్టి అక్షర రూపం అమర్చే వారు. దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, అంశాలపై ఆలోచన మెండు. అందువల్లనే తనకు సమయం ఉన్నప్పుడెల్లా తన భావాలను కవితల రూపంలో వెలువ రించేవారు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దు:ఖాలు, నాయకుల ఆగడాలు, సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి ఇలా చెప్పుకుంటూపోతే పలు విషయాలను కలంతో చెక్కేవారు. అలతి అలతి పదాలతో అనంత అర్థాలు వచ్చే విధంగా చేసేవారు. బూదరాజు రాధాకృష్ణ, ఎ.బి.కె.ప్రసాద్, భద్రిరాజు కృష్ణమూర్తి తదితర భాషావేత్తల సాంగత్యం తెలుగు భాషను ఉన్నత శిఖరాలవైపు మరల్చేటట్లు చేసింది.

మాడభూషి సంపత్‌కుమార్ గారి జీవితం ఒక ఎత్తైతే, తాను రచించిన "జీవితం - కవిత్వం" ఒక ఎత్తు. ఈ కవితా సంపుటిని ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య గారు ఆవిష్కరించి అందులోని అలతి అలతి పదాలను జీవితానికున్న నిర్వచనాలను, కవిత్వానికున్న లక్షణాలను అన్నిటిని ఈ కవితలో మాడభూషిగారు పొందుపరిచారన్నారు. తెలుగు మీద మంచి పట్టు ఉన్న రోశయ్య వంటి రాజకీయ మేధావి, నేటి సమాజానికి ఈ కవిత్వం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్వతహాగా ఈ సంపుటిలో ఉన్న కవితలన్నీ చదివాను, దీనిని ప్రతి ఒక్కరు చదవాలని సామాజిక స్పృహ ఉన్న ఇలాంటి కవులను వెన్నుతట్టి ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారంటే అందులో ఎలాంటి కవిత్వం, భాష, శైలి, వస్తువు తదితర విషయాలున్నాయో ఊహించవచ్చు. వాటిలో కొన్ని కవితలను విశ్లేషించుకుందాం. ఈ కవితా సంపుటిమీద ఒక సిద్ధాంత వ్యాసాన్ని రాయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మహాకవి శ్రీశ్రీ రచించిన "మహాప్రస్థానం"లోని కవితా! ఓ కవితా ఆధునిక తెలుగు కవిత్వానికి నిలువుటద్దం. ఈ కవిత్వాన్ని డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశపెడితే దీనికి అర్థాలను బోధించడానికి ఎంతో మంది నానాతంటాలు పడ్డారు. ఆ లోటు మాడభూషిగారు తీర్చారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సాహిత్య అంశాలపై వందలాది వ్యాసాలు రాశారు. అనువాదాలు చేశారు. వ్యంగ్య విమర్శనాత్మక రచనలు చేశారు. వివిధ ధోరణులలో విరివిగా కవిత్వం రాశారు. తెలుగు సాహిత్యం, భాషాశాస్త్రం, తులనాత్మక సాహిత్యం, జర్నలిజం, అనువాదం ప్రీతిపాత్రమైన అంశాలు. సరళమైన రచనా విధానం, సామాజిక న్యాయం వైపు మొగ్గుచూపటం వీరి దృక్పథానికి సంబంధించిన విషయాలు.

మాడభూషి - పరిశోధన :

"పరిశోధనలకు పుట్టినిల్లు మద్రాసు విశ్వవిద్యా లయం. అలాంటి మద్రాసు విశ్వవిద్యాలయం లో ఆచార్యులుగా ఉన్నటువంటి మాడభూషి సంపత్‌కుమార్ గారు ఆధునిక పరిశోధకుల్లో తనకంటూ ప్రత్యేకతను స్థానాన్ని సంపాదించుకొన్నారు. తెలుగు విద్యార్థులకు పర్యవేక్షణ బాధ్యతను నిర్వహించడమే కాకుండా ఎంతో మంది ఇతర శాఖల్లో పరిశోధనలు చేస్తున్న పరిశోధక విద్యార్థినీ విద్యార్థులకు సహాయ సహకారాలను అందించిన ఘనత ఒక్క మాడభూషి వారికే దక్కింది. మాడభూషి సంపత్‌కుమార్ గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ అవార్డు అయిన వాళ్ళు 75 మంది, ప్రస్తుతం చేస్తున్న వాళ్ళు ముగ్గురు. ఇరవై ఆరు మంది పిహెచ్.డి. పట్టాలను పొందారు. ప్రస్తుతం మౌఖిపరీక్ష కోసం ఇద్దరు వేచి ఉన్నారు. ఎనిమిది మందిలో అయిదుగురు సిద్ధాంత

వ్యాససంగ్రహాన్ని సమర్పించి సిద్ధాంత వ్యాస రూప కల్పనకు నడుం బిగించి ఉన్నారు. ఇక ముగ్గురు పరిశోధనలో నిమగ్నులై తమ పరిశోధనను కొనసాగిస్తు న్నారు. ఇంతేకాకుండా వీరి పర్యవేక్షణలో ద్రావిడ విశ్వవిద్యాలయంలో కూడా డాక్టరేట్లు పొంది ఉన్నారు. తెలుగుశాఖలో ఎక్కువ పిహెచ్.డి.లకు, ఎక్కువ ఎం.ఫిల్.లకు పర్యవేక్షణ వహించిన ఘనత ఈయనకే దక్కుతుంది.''

జాతీయ-అంతర్జాతీయ సదస్సులు :

గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలుగుశాఖలో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈయన ఆధ్వర్యంలో- 1. ప్రసారమాధ్యమాలు : భాష, సాహిత్య, సమాజం, 2.ఇంగ్లీషు-ద్రావిడ భాషలు : అనువాదాలు, 3. రామాయణం, 4.మీడియా: నాడు, నేడు, 5.శ్రీభగవద్రామానుజ వైభవం, 6.శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి- భాష, సాహిత్య సేవ, 7.ఆల్ ఇండియా కాన్ఫరేన్స్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్, 8.తెలుగు సాహిత్యం శ్రీకృష్ణతత్వం 9.భగవద్గీత - వర్తమాన సమాజం, 10.మహాకవి గురజాడ అప్పారావు 11.పాలగుమ్మి పద్మరాజు 12.తెలుగు, తమిళ వర్తమాన సాహిత్యం - తులనాత్మక అధ్యయనం 13.తిరుమల రామచంద్ర సాహిత్య మూర్తిమత్వం 14.'తాళపత్ర గ్రంథ పరిష్కరణ' 15.'వీరేశలింగం సాహిత్యం - సామాజిక దృక్పథం', వంటి జాతీయ సదస్సులే కాకుండా, 1.'మహాకవి: శ్రీశ్రీ జీవితం, సాహిత్యం, దృక్పథం', 2.శ్రీకృష్ణదేవరాయల సాహితీ శేముషి 3.వర్తమాన తెలుగు కవితా ధోరణులు 4.'అన్నమయ్య పదాలు వివిధ దృక్పథాలు', 5.'మహాకవి జాషువా సాహిత్యం సమాలోచనం', 6.'సి.పి.బ్రౌన్: జీవితం, వ్యక్తిత్వం, వ్యాసంగం', 7.'తెలుగు, తమిళ సాహిత్య సంబంధాలు', 8.'పరిశోధన: నాడు, నేడు, రేపు', 9.'భారతీయ భక్తి సాహిత్యం' అన్న అంతర్జాతీయ సదస్సులను కూడా నిర్వహించారు. ఇవికాకుండా ప్రతి సంవత్సరం కవి సమ్మేళనాలు, ఉగాది ఉత్సవాలు, అవధానాలు, పుస్తకావిష్కరణలు, ధర్మనిధి ఉపన్యాసాలు మొదలయిన సాహిత్య కార్యక్రమాలు ఎడతెరపి లేకుండా నిర్వహించారు. అన్నిటికన్నా మించి 24 గంటలసేపు రాత్రింబవళ్ళు నిరవధికంగా కవిసమ్మేళనం నిర్వహించి ప్రపంచరికార్డు సృష్టించారు. మద్రాసు మహానగరంలో తెలుగువారికి, తెలుగు విద్యార్థులకు తలలో నాల్కలా మెలుగుతూ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఇలా మాడభూషి సంపత్‌కుమార్‌గారు తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవ అపారమయింది. మాడభూషి సంపత్‌కుమార్ గారు వివిధ విశ్వవిద్యా లయాలల్లో, వివిధ కళాశాలల్లో, రాష్ట్రేతర ప్రాంతాలలో 200 పైగా జాతీయ సదస్సుల్లోనూ, ఇరవై ఏడు అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పిం చారు.

ఉపసంహారం :

మాడభూషి సంపత్‌కుమార్ గారు ఎంతోమంది భావి కవులకు ప్రేరణ కలిగించి కవిత్వం రాయించారు. వారికి సన్మానాలు చేశారు. కొంతమందిని కవితా సంపుటాలు వేయడానికి కూడా ప్రేరేపించారు. ఇలా చెప్పుకొంటూపోతే మాడభూషి గారి జీవితమే ఒక సంపుటి అవుతుంది. అన్నీ చెప్పుకోవడానికి వీలు కుదరడం లేదు. అయినా చెప్పకుండా దాటలేకపోతున్నాం. విశ్వవిద్యా లయంతో అనుసంధానంగా మద్రాసులో ఉన్న తెలుగు సంస్థలను కలుపుకొని ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు. అటు ఆంధ్ర, తెలంగాణాలలో ఉన్న విశ్వవిద్యాలయాలకు అడుగుపెట్టి అక్కడున్న అన్ని విశ్వవిద్యాలయాల ఆచార్యులను కూడా తెలుగు శాఖకు ఆహ్వానం పలికిన ఘనత కూడా మాడభూషి గారిదే. ఆంధ్ర, తెలం గాణాలలో ఉన్న విశ్వవిద్యాలయాల అనుసంధాన కళాశాలల ఉపన్యాసకులను కూడా గుర్తించి వారిని విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. రెండు దశాబ్దాల కాలంలో ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల్లో తెలుగు చదువుకుంటున్న ప్రతి

ఒక్కరికి మాడభూషి సుపరిచితులే. మద్రాసు విశ్వ విద్యాలయాన్ని పుస్తక ఆవిష్కరణలకు, పుస్తక సమీక్షలకు, కవుల సత్కారానికి, ఉగాది సంబరాలకు, చర్చాగోష్ఠులకు, మంచి మంచి ఉపన్యాసాలకు మద్రాసు విశ్వవిద్యా లయంలోని తెలుగు శాఖను వేదికగా చేశారు.

తెలుగు శాఖల్లో అంతర్జాతీయ సదస్సులకు నాంది పలికింది ఈయనే. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో జీవన సాఫల్య పురస్కారాలను అందచేసిన ఘనత మాడభూషి గారికే చెందుతుంది. తెలుగు లిపి గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసిన ఘనత కూడా మాడభూషిదే. మారిషస్‌లో ఉన్న తెలుగు కళాశాలలను, వివిధ సంస్థలను దర్శించిన మాడభూషి తెలుగు ఖ్యాతి కోసం ఎంతో పాటుపడ్డారు. ఆయన నిర్విరామంగా అంకిత భావంతో తెలుగు కోసం నిరంతరం పరితపిస్తున్న తపస్వి అని చెప్పటంలో సందేహం లేదు. మాడభూషి గారి జీవితాన్ని, తెలుగుని వేరు చేసి చూడలేం.

❖❖❖

చెన్నపట్టణమందున చెన్నుమీరు
విశ్వవిద్యాలయ విభాగ వృద్ధి గోరు
మాడభూషి శ్రీ సంపత్కుమారా వరుని
సరసహృదయమ్ములో నింత నిరవు గొనుట
సత్యనారాయణు సుకృత సత్ఫలమ్ము

- శ్రీ వెలది జగన్నాథరావు

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి సంపత్కుమార్ సాహిత్యం - అత్యాధునికత, సామాజికత

- డా॥. పి. కాళియప్ప , చెన్నై, తమిళనాడు.

అత్యాధునిక తెలుగు కవుల్లో మాడభూషి సంపత్ కుమార్ గారు కవిగా, విమర్శకులుగా, అనువాదకులుగా సాహిత్యలోకంలో ప్రసిద్ధిచెందారు. సమాజంలో ఏ చిన్న విషయాన్ని చూసినా వెంటనే స్పందించి కాగితం మీద కలం పెట్టి అక్షరరూపం అమర్చేవారు. దేశ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై ఆలోచన మెండు. అందు వల్లనే తనభావాలను కవితల రూపంలో వెలువరించే వారు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దుఃఖాలు, సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి ఇలా చెప్పుకుంటూపోతే పలువిషయాలను తలచినవెంటనే, ఊహకు వచ్చిన వెంటనే కలంతో చెక్కేవారు. అలతి అలతి పదాలతో అనంత అర్థాలు వచ్చేవిధంగా సాహిత్య సృజన చేయడం వీరి సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ క్రమంలో మాడభూషి సంపత్కుమార్ గారి సాహిత్యంలో అత్యాధునికత, సామాజికత కోణాల్ని గురించి చర్చించడమే ప్రధాన ఉద్దేశం.

మాడభూషి సంపత్కుమార్ జీవనరేఖలు :

సాహితీవేత్తగా, భాషావేత్తగా, పరిశోధకులుగా, పర్యావేక్షకులుగా, పాత్రికేయులుగా, కవిగా, రచయితగా, ఆచార్యులుగా తెలుగు భాషకు సేవలందిస్తున్న మహోన్నత వ్యక్తి, గురువర్యులు ఆచార్య. మాడభూషి సంపత్‌కుమార్‌గారు. వీరు చిత్తూరు జిల్లా కమ్మపల్లె అనుకుగ్రామంలో శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు సెప్టెంబరు 17వ తేదిన 1959వ సంవత్సరాన జన్మించారు. ప్రాథమిక విద్య నుండి డిగ్రీ వరకు చిత్తూరులోనే చదువుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, ఎం.ఫిల్, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి లను పూర్తిచేశారు.12 యేండ్లు పాత్రికేయులుగా పనిచేసిన తరువాత 2000 నవంబరు 16న మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్‌గా చేరారు. దాదాపు 20 సంవత్సరాలు నిరంతరాయంగా కృషి చేసి అనేకమంది విద్యార్థులకు మార్గదర్శకులైయ్యారు. ఉగాదికి పెద్ద ఎత్తున కవిసమ్మేళనాలు జరుపడంలో వీరికి వీరే సాటి. తమిళనాడులోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి డి.లిట్. అందుకున్న తొలి వ్యక్తి ఆయన. తమిళనాట తెలుగుదనాన్ని పరిరక్షించేందుకు విశేష కృషి చేస్తున్నవారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్.

మాడభూషి సాహిత్య ప్రయాణం :

- 2001 గడ్డిపరకతో విప్లవం
- 2002 సామాజిక శాస్త్రవేత్త పెరియార్
- 2008 అమ్మవాసన
- 2008 జన్మభూమి
- 2009 ఆంధ్రమహాభారతం - వివిధ శాస్త్రపరిజానం
- 2010 కవితా ! ఓ కవితా ! - వస్తువు, భాషా శైలి
- 2012 మద్రాసులో తెలుగు పరిశోధన, ప్రచురణ
- 2013 జీవితం కవిత్వం
- 2013 వ్యాస సంపద
- 2013 వ్యాకరణ విజానం
- 2014 తెలుగు జానపద కళలు
- 2014 అనువాద విజానం
- 2015 శత్రువుతో ప్రయాణం
- 2015 ప్రజారోగ్యానికి పనికివచ్చే సూత్రాలు, సులభమైన మార్గాలు (అనువాదం)

- ♦ 2015 ఒక విజేత (అబ్దుల్ కాలముకు తెలుగు వారి నివాళి)
- ♦ 2015 ఆలోచనలు
- ♦ 2016 పరిశోధన : నాడు, నేడు, రేపు
- ♦ 2016 చివరకు నువ్వే గెలుస్తావు
- ♦ 2017 మూడో మనిషి
- ♦ 2019 వికారి
- ♦ 2019 ధనికొండ హనుమంత రావు సాహిత్యం 21 సంపుటాలు

ఒక్కమాటలో చెప్పాలంటే - అత్యాధునిక తెలుగు సాహిత్యం నిర్దిష్టత దిశగా ప్రయాణిస్తోంది. మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే' - అని లుప్తమైపోతున్న మానవతను గురించి భయపడుతూ, బాధపడుతూ కవిత్వం చెప్పిన కవి ఆచార్య మాడభూషి సంపత్కుమార్. కొంతకాలం పాత్రికేయునిగా చేసిన అనుభవం చిన్నప్పటి నుంచి తెలుగుభాషమీద ఉన్న మమకారం, కవిత్వంపట్ల ఉన్న ప్రీతి అప్పుడప్పుడు కవితలు రాయించింది.

భాషారక్షకులుగా మాడభూషి :

తమిళనాట తెలుగు భాష ఎదుర్కొంటున్న సమస్యలు, మాతృభాష కోసం తమిళులు అనుసరిస్తున్న విధానాల గురించి నేటి సమాజంలో భాష యొక్క స్థితిని చూస్తే... "తమిళనాడులో తెలుగు భాష దీన స్థితిలో ఉంది. దాదాపుగా వెంటిలేటర్‌పై ఉందని చెప్పొచ్చు. 2006లో అక్కడ పాఠశాలల్లో నిర్బంధ తమిళం ప్రవేశ పెట్టారు. దాంతో తెలుగు విద్యార్థులు తమ మాతృభాషలో చదువుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల తెలంగాణ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారి పిల్లలు ఎక్కువ నష్ట పోతున్నారు. చాలా మంది తెలుగు విద్యార్థులు తమిళ మాధ్యమంలో చదువు సాగించక తప్పడం లేదు. కొన్ని వేల మంది తెలుగు విద్యార్థులు మాతృభాషకు పూర్తిగా దూరమవుతున్నారు. ఆ నేలలో తెలుగు జాడ అంతరించి పోయే ప్రమాదం పొంది ఉంది" అని తమ ఆవేదన వ్యక్తపరుస్తారు.

సామాజికవేత్తగా మాడభూషి :

తమిళ కథానిక విస్తృతి గురించి తన వ్యాసంలో సామాజికతను ఇలా ప్రస్తావిస్తారు. తమిళంలో చిన్నకథకు ఉన్న ఆదరణను పురస్కరించుకొని తమిళ కథ భారతీయ కథా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపు కొంటూ ముందుకు సాగిపోతోంది అంటారు. అలాగే రాజకీయ, స్త్రీ, దళితులకు సంబంధించిన కథలను గురించి ప్రస్తావిస్తూ... కథ చిన్నదయినా వస్తువు మాత్రం పెద్దదే. సమాజంలోని చీకటి మూలల్ని వెలికితీసిన ఘనత కథానికకు ఉంది. శిల్ప నైపుణ్యంగా మొదలైన ఈ సాహిత్య ప్రక్రియ సంఘసంస్కరణకు ఊతమయింది. సంఘంలోని వివిధ సమస్యలను బయటికి తియ్యడానికి, పరిష్కరించడానికి, బహిష్కరించడానికి ప్రయత్నం చేసింది. అంటరానితనం, మానవ నైజంలోని అనేక దృక్కోణాలు, మోసాలు, కుటుంబంలోని కలతలు, స్త్రీల అణచివేత, మహిళా సాధికారికత, దళితుల సమస్యలు, వివిధ కులాల స్వాభిమానం మొదలైనవి కథానికా వస్తువులుగా కనిపిస్తాయి అంటారు.

మొదటిసారిగా జీవితం-కవిత్వం అనే కవితాసంపుటిని ముద్రించారు. జన్మభూమి, అమ్మవాసన, సామాజిక శాస్త్రవేత్త పెరియార్, శ్రీశ్రీ కవితా ఓ కవితా, వస్తువు, భాష, శైలి మద్రాసులో తెలుగు పరిశోధన ప్రచురణ అనే పుస్తకాలు ప్రచురించారు. వీరు అప్పుడప్పుడు రచించిన కవితల్ని 'శత్రువుతో ప్రయాణం' అనే సంపుటిగా వెలయించారు. దీనిలోని సామాజికాంశాలను గమనిస్తే...

'జీవితం - కవిత్వం' అనే తొలి కవితా సంపుటి తర్వాత రెండేళ్ళకు మాడభూషి సంపత్‌కుమార్ తాజాగా వెలువ రించిన మలి సంపుటి 'శత్రువుతో ప్రయాణం'. 32 కవిత లను పొందుపరిచిన ఈ పొత్తంలో మంచి కవితలు చాలానే ఉన్నాయి. 'అతడు కూడా మనిషే... మనసే అతనికి గుర్తింపుతెచ్చింది. మనిషి కోసం వెతుక్కుంటూ... తిరుగుతున్నాడు' అంటూ మనసున్న మనిషి తనలాంటి మనిషి కోసం, మనసుతో సంభాషించడం కోసం

అన్వేషిస్తుంటాడు. ఎక్కడా అలాంటి వ్యక్తి సమాజంలో తారసపడకపోగా, తన మనస్సునే ముక్కలు చేసిన మామూలు మనుషులే ఎదురౌతారు. 'ఇప్పుడు అతను కూడా తనువుల్లో కలిసిపోయాడు. అతడు మనిషిని జయించాడు. మనిషిని వెతకడం మానేశాడు!' అంటూ ముక్తాయిస్తాడు కవి. సమాజాన్ని ప్రభావితం చేసేవాళ్ళు కొందరయితే సమాజంలో ప్రభావితం అయ్యేవారు అనేకమంది.

మనిషిరూపంలో ఉన్న మనిషి గురించే' - అని మానవతను గురించి భయపడుతూ, బాధపడుతూ కవిత్వం చెప్పిన కవి ఆచార్య మాడభూషి సంపత్కుమార్. సమాజంలో అన్ని విషయాలు ఆర్థిక అంశాలమీద, స్వార్థం మీద, ఆధారపడి ఉండటంతో మానవతాచ్ఛాయలు మరుగైపోతున్నాయని సంపత్ ఆవేదన చెందాడు. అతను కూడా మనిషే. అందరిలాగా అతనికి తనువు కనిపించదు - మనసే అతనికి గుర్తింపుతెచ్చింది. మనిషికోసం వెతుక్కుంటూ తిరుగుతున్నాడు అని మంచి మనసున్న మనిషి కూడా మారిపోయాడని చెబుతూ 'ఇప్పుడు అతను కూడా తనువుల్లో కలిసిపోయాడు. అతడు మనిషిని జయించాడు, మనిషి కోసం వెతకడం మానేశాడు అని చురక అంటించాడు. మంచిమనసున్నవారు కూడా కాలక్రమంలో స్వలాభం చూసుకొని మానవతా దృక్పథానికి దూరమవుతున్నారనే ఆవేదన ఈ కవితలో భంగ్యంతరంగా ఉంది.

సమాజం నైతికంగా అధోగతి పాలవుతున్నది. మానవత అదృశ్యమైపోతోంది. నైతిక విలువలు పడిపోతున్నాయని కవి 'మనిషి విలువ-రూపాయిలాగా పడిపోతూనే ఉంది అని చెప్పటంలో ఎంతో సామాజిక పరిశీలన, అవగాహన ఉంది. మత మౌఢ్యం మానవత్వాన్ని నాశనం చేస్తున్నదని చెబుతూ అయోధ్య, మసీదు - మానసికంగా కుంగదీస్తే గోద్రారైలు మానవత్వాన్నే కూల్చేసింది. చుండూరులో ఊచకోత కోస్తే కారంచేడులో కడుపుకోత నింపింది అని కవి మతం, కులం పేరుతో సాగుతున్న దారుణాల్ని కళ్లకు గట్టాడు. భవిష్యత్కాలంలోనయినా మానవత్వాన్ని నటించకు, మొహానికి నవ్వుపులుముకొని కడుపులో కత్తులు దించకు అని మానవునికి హెచ్చరిక చేశాడు.

'కత్తికింద పడకుండానే... అనే స్మృతి కవితలో తన తండ్రిని తలచుకొంటూ శ్రమజీవి స్వరూపాన్ని, కష్టాన్ని పాఠకులకు సాక్షాత్కరింపచేశాడు. అద్భుతమైన భావుకతతో ఈ కవితను రచించాడు. 'కోడికన్నా-కోకిలకన్నా ఆయనే ముందులేస్తాడు. ఇంతవరకు ఏ సాధారణ కవి అయినా రచిస్తాడు. కానీ 'చంద్రుడికి చాపచుట్టేసి-సూర్యుణ్ణి నిద్రలేపుతాడు' అనటంలో సంపత్లోని కవి కనిపిస్తాడు. తన తండ్రి శ్రమిస్తున్న తీరును వివరిస్తూ చెమట ముక్కల్ని-నీటి చుక్కలుచేసి పిడచకట్టిన పిల్లల - నాల్కలపై పోస్తాడు' అని చెప్పటంలో కవి ఎంతో పరిణతి చెందిన భావకునిలా కనిపిస్తాడు.

'విరోధి' కవితలో 'షడ్రుచులు వడ్డించిన - భూమి తల్లిపై - అత్యాచారం, కులాన్ని ఒంటికి పూసుకొని ప్రాంతాలపై పవ్వళిస్తున్న మేధావులు. మానవ సంబంధాలకి సెల్లుచీటీరాసి ద్రవ్యోల్బణంలో తలదాచుకొన్న మధ్యతరగతి అని సమాజ స్వరూపాన్ని అక్షరాల చిత్రపటంలో ప్రదర్శింపజేశాడు.

స్త్రీ సమస్యల మీద అతి సున్నితంగాను, స్త్రీ క్షేమమే ధ్యేయంగా శ్రమించే పితృదేవులు ఎందరో! స్త్రీ సమస్యల మీద అతి సున్నితంగా స్పందిస్తారు మాడభూషి. 'ఆమె', 'స్వర్గం', 'మగాడు', 'భయం' ఇంకా పలు కవితల్లో స్త్రీల సమస్యల్ని పలుకోణాల్లో దర్శిస్తాడు. బలంగా చర్చిస్తాడు. 'జెండా/ మీటరు గుడ్డ కాదు / లక్షల మంది / ప్రాణ త్యాగం చేసిన కన్న బిడ్డ!' వంటి అభివ్యక్తులు. సంపుటి నిండా పరుచుకుని ఉన్నాయి.

పురుషాహంకారంతో స్త్రీని వేధించేవారు ఎంతోమంది ఉంటారు. స్త్రీ మనసును గుర్తించకుండా పైశాచికంగా ప్రవర్తిస్తూ ఉంటారు. అలాంటివారి మీద కవి ప్రయోగించిన వ్యంగ్యాస్త్రం 'స్వర్గం' అనే కవిత. 'ప్రతి రాత్రీ - వాడికి స్వర్గం - ప్రతి రాత్రీ నాకొక నరకం అనటంలో స్త్రీవేదన ధ్వనిస్తుంది. వాడికోరికలు తీర్చే - దేవతను నేను..నా

కోరికల్ని అణచివేసే రాక్షసుడు వాడు - స్వర్గంపైకి దండయాత్ర చేస్తాడు - నరకాన్ని స్థాపించాలంటాడు అని పురుషాహంకార ప్రదర్శనను నిరసిస్తాడు. వాడంటే నాకు ఒళ్లుమంట. నా ఒళ్లు వాడికి పంట... వాడొక హింస-నేనొక హంస-స్వర్గాన్ని దోచుకొని-నరకాన్ని దారబోస్తాడు' అని చెప్పటంలో స్త్రీ ఆవేదన స్పష్టమవుతుంది. ఎదుటివారి ఇష్టానిష్టాలను గుర్తించకుండా ప్రవర్తించటం రాక్షసం. అందుకే ఆమె 'వాడులేని నరకం-నాకు స్వర్గం-నేను స్వర్గస్తురాలినవుతున్నా' అని చెప్పటంలో నిస్స హాయత, నిరసన ధ్వనిస్తాయి.

మనుషుల కంటివెంట కారే నీటిలోనూ కృత్రిమత్వం ఉందనే విషయాన్ని పరోక్షంగా చెబుతూ 'కన్ను' అనే కవితలో ఎర్రబడిన కన్ను - హృదయంలోని గాయానికి రంగుల రూపం అయినా నేను కంటిని నమ్మను, అది గ్లిజరిన్ తాగిందేమోనని భయం అని చెప్పటం గమనార్హం.

ముగింపు :

బూదరాజు రాధాకృష్ణ, ఎ.బి.కె. ప్రసాద్, భద్రిరాజు కృష్ణమూర్తి తదితర భాషావేత్తల సాంగత్యం తెలుగు భాషను ఉన్నత శిఖరాలవైపు మరల్చేటట్లు చేసింది అని చెప్పక తప్పదు వారి సాహిత్యాన్ని గమనిస్తే తెలుస్తుంది. మాడభూషి వారి రచనలు సాహిత్యానికి, సమాజానికి కాకుండా భావి పరిశోధకులకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. వివిధ సామాజిక, సాహిత్యాంశాలపై వంద లాది వ్యాసాలు, వ్యంగ్య కవితలు రచించారు. 'నేను కూడా యుగకర్తనై - స్థిరస్థాయిగా ఉండిపోతాను'.. నేను కూడా కర్మవీరుల కవిగానే ఖ్యాతి వహిస్తాను అని జయభేరి ధోరణితో రచించాడు. వీరి కవిత్వాన్ని, ఏ రచనను చూసినా అందులో కవికిగల అంతర్జాతీయ అవగాహన కనిపిస్తుంది. కాబట్టే సామాజిక స్పృహలో మహారాజు మాడభూషి సంపత్ కుమార్.

ఆధారగ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు - ప్రయోగాలు - సి. నారాయణరెడ్డి
2. ఆధునిక కవితోద్యమాలు ధోరణలు - కె.కె. రంగనాథాచార్యులు
3. ఆలోచనలు- మాడభూషి సంపత్‌కుమార్
4. చివరకు నువ్వే గెలుస్తావ్- మాడభూషి సంపత్‌కుమార్
5. వికారి- మాడభూషి సంపత్‌కుమార్
6. మూడోమనిషి- మాడభూషి సంపత్‌కుమార్
7. శత్రువుతో ప్రయాణం- మాడభూషి సంపత్‌కుమార్

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి 'ఆలోచనల' హృదయావిష్కృతి

– డా॥ డి.యువశ్రీ, సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆంధ్రసాహిత్యం అనంతం. అనుపమం. పఠనా సౌలభ్యం కోసం, విమర్శనా సౌలభ్యం కోసం ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని రెండు విభాగాలుగా చేశారు. వీటిలో ఆధునిక సాహిత్యం ఎంతో విస్తృతంగా పెంపొందింది. బహుప్రక్రియలతో భాసిల్లింది. వాటిలో నవల, కథ, కవిత్వం, నాటకం, నాటిక చెప్పుకో దగ్గవి. వీటన్నిటిలోనూ కవిత్వానికి అగ్రస్థానమే వుంది. ముక్కుపచ్చలారని పసిపిల్లల దగ్గర నుంచి ముదివితో మూలుగుతున్న పెద్దల దాకా అందరూ కవిత్వం రాస్తు న్నారు. తమ ఆలోచనలను యథోచితంగా ఆవిష్కరిస్తు న్నారు. కొందరైతే బాల్యం నుంచి వృద్ధాప్యం దాకా నిరంతరాయంగా రాస్తూనే వున్నారు. సుదీర్ఘకాలంగా రాస్తున్న అలాంటి వారిలో చెప్పుకోదగ్గ వారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు.

సంపత్‌కుమార్ గారు కవిగా, విమర్శకులుగా సుప్రసిద్ధులు. వీరు చిత్తూరు జిల్లా కమ్మపల్లెలో జన్మిం చారు. తల్లి పట్టమ్మ, తండ్రి మాడభూషి శ్రీనివాసా చార్యులు. వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ చేశారు. ఎం.ఫిల్ కూడా అక్కడే పూర్తి చేశారు. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. పట్టా పొందారు. హైదరాబాద్‌లో పత్రికారంగంలో చాలా రోజులు పనిచేశారు. ప్రాచీనమూ, ప్రసిద్ధమూ అయిన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఉపన్యాస కులుగా చేరారు. బోధనలోనూ, పరిశోధనలోనూ ఆరి తేరారు. వీరి పర్యవేక్షణలో ఎం.ఫిల్ కోసం 73మంది, పిహెచ్.డి. కోసం 25 మంది పరిశోధన చేశారు. సంపత్ కుమార్ గారు మలేషియా, సింగపూర్, శ్రీలంక, థాయి లాండ్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని అమూల్య పత్రాలు సమర్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన చాలా సదస్సుల్లో పాల్గొని 200లకు పైగా పత్ర సమర్పణలు చేసియున్నారు. వీరి ఆధ్వర్యం లోనూ మద్రాసు విశ్వవిద్యాలయంలో దాదాపు 10 సదస్సులు జరిగాయి. సంపత్‌కుమార్ గారికి ఎన్నో పురస్కారాలు, బిరుదులు వచ్చాయి. ఇవన్నీ వీరి వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తాయి.

సంపత్‌కుమార్ గారు చాలా పుస్తకాలు రాశారు. వాటిలో విమర్శలూ వున్నాయి, పత్రికా రంగానికి చెందినవీ వున్నాయి, అనువాదాలు వున్నాయి. వీరి మాతృభాష తమిళం కావడం వల్ల తమిళ, తెలుగు భాషల్లో ఈయన పట్టు సాధించారు. తమిళభాష నుంచి ఎన్నో పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. బాల్యం నుంచే కవిత్వం పట్ల మిక్కిలి మక్కువ గల సంపత్‌కుమార్ గారు చాలా కవితా సంపుటాలు వెలయించారు. వాటిలో చెప్పుకోదగ్గవి జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఒక విజేత, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడోమనిషి, వికారి, మొదటి అబద్ధం.

ఈ సంపుటాల్లో 'ఆలోచనలు' సంపత్‌కుమార్ గారి ఆలోచనలను ఆవిష్కరిస్తూ వుంది. ఇందలి కవితలు కవి హృదయాన్ని ఏమేరకు ఆవిష్కరిస్తూవున్నాయో పరామర్శిం చడమే ఈ పత్రపరమావధి.

'ఆలోచనలు' కవితల సంపుటంలో దాదాపు చాలా కవితలున్నాయి. అన్నీ మినీ కవితలే. వివిధ విషయాల మీద వీరి కవితలున్నప్పటికీ ఒక శీర్షిక క్రింద ఒకే విషయాన్ని తెలియజేసే పలు మినీ కవితలున్నాయి. కొందరు తాము చెప్పదలచుకొన్న విషయం పాఠకులకు బోధపడకుండా ప్రతీకాత్మకంగా కవితలు చెబుతారు. ఇక్కడ పిందె కనిపించదు. ఆకు మాత్రమే అగుపిస్తుంది. కొందరు తాము చెప్పదలుచుకున్నది తెలిసీ తెలియని

విధంగా కవితలు వెలయిస్తారు. ఇవి అకుచాటు పిందెలను తలపిస్తాయి. కాబట్టి పాఠకుల మనస్సులకు ఇవి దగ్గరగా వుంటాయి. మాడభూషి వారి సంపుటాల్లోని కవితలు రెండవకోవకే చెందినవి కావడం విశేషం. కవి పాఠకుడి హృదయానికి ఎంతో చేరువకావడం ఎంతయినా అవసరం. మాడభూషి వారు ఈ పనిచేసి మనసుకెక్కడం ముదావహం.

ఈ సంపుటంలో వున్న కవితలన్నింటినీ తీసుకొని ప్రస్తుతం పరామర్శించటం సాధ్యమయ్యే పని కాదు. విషయానుగుణంగా కొన్నిటిని మాత్రమే తీసుకొని పరామర్శించడం సమంజసం. 'ఆలోచనలు' కవితా సంపుటంలో వున్న కవితలను స్థూలంగా 4 అంశాలుగా విభజించుకొని పరిశీలించవచ్చు. అవి

1) చారిత్రకాంశాలు

2) విచిత్రాంశాలు

3) ప్రబోధాంశాలు

4) పరిశిష్టం

1) చారిత్రకాంశాలు :

మాడభూషి సంపత్‌కుమార్ గారు కవేగాదు పాత్రికేయులు కూడా. విలేఖరిగానే కాక ఉపసంపాదకులుగా కూడా పనిచేసి విశేషానుభవం గడించారు. అందువల్ల భారత జాతీయ చరిత్రలో చోటుచేసుకొన్న పలు అంశాలు వీరి దృష్టిని బలంగా ఆకర్షించాయి. పర్యవసానంగా సంఘటణల వారీగా వీరు కవితలను వెలయించారు. వాటిలో ప్రధానమైన వాటినైనా ఇక్కడ గమనించడం సమంజసం.

పలుమతాల వారికి నివాసమైన భారతదేశం మతప్రాతిపదిక మీద రెండుగా విభజించబడింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేటప్పుడే ఈ విభజన జరగడం గమనార్హం. ముస్లింలు పాకిస్తాన్‌ను కోరుకున్నారు. తక్కినవారు హిందుస్తాన్‌లోనే మిగిలిపోయారు. ఈవిధంగా విభజన జరిగినప్పటికీ భారతదేశంలో ముస్లింలు, పాకిస్తాన్‌లో ముస్లీమేతరులు లేకపోలేదు. రెండు దేశాల్లోనూ మెజారిటీ వారు మైనారిటీ వారిని ఇబ్బందిపెట్టడం ప్రారంభమైంది. అప్పటి తూర్పు పాకిస్తాన్ నేటి బంగ్లాదేశ్‌లోని నవకాళీ జిల్లాలో మతకలహాలు భారీఎత్తున జరిగాయి. అక్కడి మైనారిటీ ప్రజలైన హిందువులు భయంకర హింసకు గురైనారు. మత మార్పిడులు, మానభంగాలు, గృహదహనాలు, హత్యలు, దమనకాండ నిత్యకృత్యాలయ్యాయి. గాంధీజీ అక్కడ పర్యటించారు. హింసను విడనాడమని ప్రబోధించారు. హిందూ-ముస్లీం సక్యతను ప్రతిపాదించారు. అది గిట్టని కొందరు గాంధీజీని తుద ముట్టించాలనుకున్నారు. వారి తరఫున నాథూరామ్ వినాయక్ గాడ్సే గాంధీజీని 1948 జనవరి 30వతేదీన తుపాకీతో కాల్చిచంపాడు. ఈ నేపథ్యంలో మాడభూషి వారి మదిలో కవిత వెలసింది. అదే ఈ కవిత -

"కలిసుండమంటే
కాల్చేసే లోకం
1948 జనవరి 30"

(ఆలోచనలు - జెండాసాక్షిగా - పేజి: 4)

బ్రిటీష్ వారి కాలంలో పెద్ద పెద్ద ఉమ్మడి రాష్ట్రాలుండేవి. వాటిలో మద్రాసు, కలకత్తా, బొంబాయి చెప్పుకోదగ్గవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఒరిస్సాలోని బరంపురం దాకా వ్యాపించి వుండేది. ఆంధ్రులు తమకు రాష్ట్రం కావాలని పోరాటం చేయడం 1953 అక్టోబర్ ఒకటవ తేదీ కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. అప్పటి ప్రధాని పండిత జవహర్‌లాల్‌నెహ్రూ భాషల ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పాటు చేసే చట్టాన్ని తీసుకువచ్చారు. దీని ప్రకారం అప్పటి నిజాం రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు కర్ణాటకకు, మరికొన్ని జిల్లాలు మహారాష్ట్రకు, ఇంకొన్ని జిల్లాలు ఆంధ్రరాష్ట్రకు వచ్చాయి. పర్యవసానంగా తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమలతో కలిసిన ఆంధ్ర ప్రదేశ్ 1956 నవంబర్ ఒకటిన ఏర్పడింది. హైదరాబాదే రాష్ట్ర రాజధాని అయ్యింది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని

మాడభూషి వారు ఈ కవిత రాశారు. ఇక్కడ మాట అంటే భాష అని ఊహించుకోవలసి వుంది.

"మాట కోసం పోట్లాట
తెలుగువారికి తేటగీత
1956 నవంబర్ 1"

(ఆలోచనలు - జెండాసాక్షిగా - పేజి:5)

భారతదేశానికి, చైనాకూ సంబంధమేర్పడేటప్పుడు ఈ సంబంధం పంచశీల ప్రాతిపదికగా ఏర్పడాలని భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చువన్‌లై ఒప్పందానికి వచ్చారు. ఇలా పంచశీలం బోధించిన పండితనెహ్రూ గారు 1964 మే 27న గుండెపోటుతో పరమపదించారు. ఈ విషయాన్నే కవి ఇక్కడ తెలియజేశారు.

"పంచశీల బోధించాడు
పాంచభౌతికం చాలించాడు
1964 మే27"

(ఆలోచనలు-జెండాసాక్షిగా-పేజి:5)

కాశ్మీర్‌ను కబళించజూసిన పాకిస్తాన్ అనేకసార్లు భారత్‌మీద దాడి చేసింది. అలాంటి వాటిలో 1965, 1971 సంవత్సరాల్లో జరిగిన యుద్ధాలు చెప్పుకోదగ్గవి.

పడమటి పాకిస్తాన్ వారు పాలకులు. తూర్పు పాకిస్తాన్ వారు పాలితులు. తూర్పు పాకిస్తాన్ వారు మొదటి నుంచి అణచివేతకు గురయ్యారు. తిరగబడ్డారు. పోరాటం చేశారు. పాకిస్తాన్ ప్రభుత్వం వారిని దమన నీతితో అణచి వేయాలని చూసింది. తూర్పు పాకిస్తాన్‌లో అల్లరులు, హత్యలు జరిగాయి. ప్రభుత్వం చాలా మందిని ఖైదు చేసింది. అలాంటి వారిలో బంగబంధువు ముజబూర్ రహిమాన్ ఒకరు. ఆయన పాకిస్తాన్ నుంచి తప్పించుకొని వచ్చి భారతదేశాన్ని శరణుకోరారు. అప్పుడు భారత్ తూర్పు పాకిస్తాన్‌కు మద్దతునిచ్చింది. తూర్పు పాకిస్తాన్ విముక్తి సైన్యంతో కలిసి భారత్ కూడా పాకిస్తాన్‌తో యుద్ధం చేసింది. ఆ యుద్ధంలో పాకిస్తాన్ ఓడిపోయింది. సేనాని కొంత సైన్యంతో భారత సైన్యానికి లొంగిపోయారు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని సంపత్‌కుమార్ గారు కవిత రాశారు. అదే ఈ కవిత

"మన్నొడెను, తన్నొడెను
భారత్-పాక్
1971 డిసెంబర్ 3"

(ఆలోచనలు -జెండాసాక్షిగా-పేజి:6)

1980 దశకంలో పంజాబ్‌లో భయంకరవాదం క్రమంగా ఊపందుకొంది. సిక్కురాష్ట్రం కావాలని కొందరు చిక్కు తెచ్చిపెట్టారు. శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించారు. ప్రభుత్వం స్పందించింది. సైన్యాన్ని పంపి వాళ్ళను అదుపు చేసేందుకు ప్రయత్నించింది. చేసేదిలేక భయంకరవాదులు సిక్కులు పవిత్రంగా భావించే అమృత సర్‌లోని స్వర్ణదేవాలయంలో తలదాచుకున్నారు. అప్పుడు ప్రధానిగా వున్న శ్రీమతి ఇందిరాగాంధీ టెర్రరిస్టులను ఏరిపారేశారు. సైన్యాన్ని స్వర్ణదేవాలయంలోకి పంపారు. దానితో సిక్కులంతా ఒక్కటై ఆమె మీద పగబట్టారు. ఆమెకు అంగరక్షకులుగా పనిచేస్తున్న సిక్కులచేతనే ఒక పథకం ప్రకారం ఆమెను చంపించారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొనే సంపత్‌కుమార్ గారు ఈ కవిత రాశారు.

"రక్షకులే భక్షించినారు
రణతంత్రము సృష్టించినారు
1984 అక్టోబరు 31"

(ఆలోచనలు - జెండాసాక్షిగా - పేజి:7)

2) విచిత్రాంశాలు :

లోకంలో తరచూ ఎన్నో జరుగుతుంటాయి. వాటిని సాధారణ దృష్టితో చూస్తే ఏమీ అనిపించదు. అయితే ఆలోచిస్తే మాత్రం వాటిలోని విచిత్రత బోధపడుతుంది. ఆశ్చర్యకరమైన అటువంటి విషయాలను కూడా కొన్నింటిని తీసుకొని మాడభూషి వారు కవితలు వెలయించారు. అలాంటి వాటిలో మచ్చుకు కొన్ని.

వయసు పొంగు అభద్రతను అలక్ష్యం చేస్తుంది. యువతీయువకులు పరస్పరాకర్షణకు గురౌతారు. దగ్గరవు

తారు. అనేక అభ్యంతరాలు తలెత్తుతాయి. ప్రేమగా భావింపబడే వాళ్ళ అనుబంధం పెళ్ళిదాకా రాదు. ఈ అంశమే ఈ కవితలో ప్రతిబింబిస్తుంది.

"పూసిన పూలన్నీ
గుడికి చేరవు
పెళ్ళికాని ప్రేమికులు!"

(ఆలోచనలు - ఆలోచనలు - పేజి:9)

లాలూ ప్రసాద్‌యాదవ్ ఒకప్పటి బీహార్ ముఖ్య మంత్రి. ఈయన కొందరు అధికారుల సహాయంతో, మరికొందరు నాయకులతో కలసి దుంక సబ్‌ట్రజరీ నుంచి డబ్బు డ్రా చేశాడు. పశుగ్రాసం కోసం దాన్ని ఖర్చు పెట్టినట్టు దొంగ లెక్కలు చూపెట్టాడు. అది అప్పటిలో మంచి సంచలనాన్నే లేవదీసింది. ఆశ్చర్యకర మైన విషయం ఏమంటే మళ్ళీ కూడా జనం అతన్నే గెలిపిం చారు. ఈ విషయం మాడభూషి వారి కవితకు వస్తువయ్యింది.

"ఆవులకు అన్నంలేదు
నాయకులు గడ్డితిన్నారు
లాలూ గెలుపు!"

(ఆలోచనలు-ఆలోచనలు-పేజి:9)

అవినీతి అన్నిరంగాల్లోనూ వ్యాపిస్తూ వుంది. అందరూ దీని గురించే మాట్లాడుతూ వున్నారు. నిందిస్తూ వున్నారు. అయితే నీతిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. నీతి మార్గాన్ని అవలంబించడం లేదు. 'ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులువున్నాయి' అనే విధంగా ప్రవర్తిస్తు న్నారు. ఈ అంశమే ఈ కవితకు వస్తువు.

"అందరిదీ ఒకటే బాట
అవినీతి ప్రతిఘటన
నీతి బుట్టమాయం!"

(ఆలోచనలు - ఆలోచనలు - పేజి:12)

భారతదేశంలో అధికభాగం పల్లెటూర్లే. అధికశాతం మంది వ్యవసాయం పైన ఆధారపడి జీవించేవాళ్ళే. రైతులు కష్టించి, పండించి అందరికీ ఆహారాన్ని అంది స్తారు. అయితే దురదృష్టవశాత్తు వాళ్ళ ఆదాయంలో గణనీయమైన మార్పు ఉండదు. జీవితంలో ఎదుగూ బొదుగూ ఉండదు. ఏదో ఒక వృత్తి చేసి పొట్టపోసు కోవడానికి రైతులు పట్టణాలకు వలస వెళుతున్నారు. ఇది మాడభూషి వారి మరోకవితకు వస్తువయ్యింది.

"పల్లెపొమ్మంటోంది
పట్నం రమ్మంటోంది
పొట్ట కోసం వలస!"

(ఆలోచనలు - రైతేకూలీ! - పేజి:14)

కంప్యూటర్లు వచ్చాయి. ఇంటర్నెట్ ప్రాభల్యం అధిక మయ్యింది. సమాచార విప్లవం సంభవించింది. ఏదైనా ఎప్పుడైనా ఎక్కడనుంచైనా తెలుసుకోవడానికి చాలా సులభంగా వీలయ్యింది. ఒక్కమాటలో చెప్పాలంటే అరచేతిలోనే ప్రపంచం వుందని విజ్ఞులు విశ్వసిస్తున్నారు. ఇంత పురోభివృద్ధిలోనూ వెనుకబాటు తనం కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తూ వుంది. మొన్నమొన్నటి దాకా దాదాపు మనభారతదేశంలో చాలా గ్రామాలకు కరెంటే లేదు. 6 లక్షల గ్రామాలున్న భారతదేశంలో చాలా ఊర్లకు బస్సుసౌకర్యం లేదు. ఈ విషయాన్నే సంపత్‌కుమార్‌గారు ఇలా చమత్కరించారు.

"ప్రపంచమంతా కంప్యూటరీకరణ
హైటెక్ సేద్యం, గ్లోబలీకరణ
బస్సుమొహం చూడని పల్లె!"

(ఆలోచనలు - రైతేకూలి - పేజి:15)

3) ప్రబోధాంశాలు :

కావ్యానికి గానీ, కవితకు గానీ, అమాటకొస్తే ఏ రచనకైనా ప్రబోధం లేదా సందేశం ప్రాణం. సందేశం లేని ఏరచనైనా నిర్జీవంగానే పరిగణింపబడుతుంది. కాబట్టి కవితల్లో వున్న సందేశాన్ని కూడా గ్రహించవలసి వుంది. సంపత్ కుమార్ గారి కవితల్లో సందేశం ఏ మేరకు సందడి చేస్తూ వుందో కొన్ని కవితల ద్వారానైనా తెలుసు

కొనే ప్రయత్నం చేయడం సమంజసం.

పట్టణాల సివార్లల్లో ఏర్పరుపబడిన స్మశానాలు పట్టణాలు పెరగడంతో నడిబొడ్డునే వచ్చేస్తున్నాయి. స్మశానాలకు నలువైపులా కూడా ఇండ్లురావడం వల్ల పట్టణాలన్నీ స్మశానాలైపోతున్నాయేమో! అనే భ్రమ కలుగుతూ వుంది. ఈ విషయాన్ని స్పృశించిన మాడభూషి వారు పట్టణాల్లో నివసించే మనుషులు కూడా యాంత్రికంగా తయారవుతున్నారని, వారిలో మానవత్వం, జీవకళ కొరవడుతూ వున్నాయని ఈ కవితలో వారిని జీవచ్ఛవాలుగా అభివర్ణించారు.

"శ్మశానాలు కూడా
డొళ్ళయిపోతున్నాయి
మనుషులూ జీవచ్ఛవాలే కదా!"

(ఆలోచనలు - ప్రత్యక్ష సాక్ష్యాలు - పేజి : 42)

ప్రపంచంలోనూ అందునా భారతదేశంలోనూ నిరక్ష రాస్యత నిండిపడి వుంది. అక్షరాశ్యులైన వారికి కూడా జ్ఞానం అంతంత మాత్రమే. అందువల్ల అభివృద్ధి కుంటు పడుతూ వుంది. ప్రగతి ప్రశ్నార్థకంగానే మిగిలిపోతూ వుంది. అందరూ విద్యావంతులు కావాలి. ఆలోచన అనాలోచనాలతో అట్టి అన్నింటినీ చూడాలి. వివేకం విచ్చుకోవాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం. దీన్ని ఆవిష్కరించే కవితే ఇది.

"గొంగళిపురుగును
సీతాకోక చిలుకగా మార్చండి
అందరికీ విద్య!"

(ఆలోచనలు-ప్రత్యక్షసాక్ష్యాలు-పేజి:51)

కొన్ని రకాల మధ్యతరగతి కుటుంబాల్లోనూ, నిరుపేద కుటుంబాల్లోనూ కనీస అవసరాలు తీరే అవకాశం కూడా మృగ్యమే. అందువల్ల వాటిని తీర్చుకునేందుకు ఇంటిల్లి పాది కష్టించవలసి వుంటుంది. ఇందులో భాగంగా పిల్లలను కూడా పనులకు పంపుతున్నారు. ఇష్టం లేక పోయినా పిల్లలు పనులకు వెళుతున్నారు. పనికి వెళ్ళే పిల్లల్లో ఈ పని భారాన్నుంచి ఎప్పుడెప్పుడు బయట పడదామా! అన్న తహతహ వుంటుంది. వాళ్ళ మనసులు స్వేచ్ఛనే కోరుకుంటాయి. ఈ అంశాన్నే సంపత్ కుమార్ గారి కవిత ప్రతిబింబిస్తుంది.

"దారాన్ని తెంచుకోడానికి
తనకలాడుతున్న పూలు
బాలకార్మికులు!"

(ఆలోచనలు - ప్రత్యక్ష సాక్ష్యాలు - పేజి:52)

మాట మృదువుగా వుండాలి. మధురంగా వుండాలి. మానసికోల్లాసానికి దోహదం చేసేదిగా వుండాలి. అలా కాకుండా నిష్కరోక్తులు వెదజలెతే హృదయం గాయ పడుతుంది. ఆ మాటలు ఎన్నటికీ మరపుకురావు. కఠినమైన హృదయమైతే ఎటువంటి కఠినోక్తులనైనా తట్టుకోగలదు. మృదు హృదయం తట్టుకోలేదు. ఈ విషయాన్నే మాడభూషి గారు ఇలా తెలియజేశారు.

"మాటలు
గుచ్చు కొన్నాయంటే
హృదయం గులాబిదై ఉంటుంది!"

(ఆలోచనలు - ప్రత్యక్ష సాక్ష్యాలు - పేజి:55)

ఓటర్లు ప్రతి 5 సంవత్సారలకొకసారి తమ నాయకు లను ఎన్నుకుంటారు. వాళ్ళు చాలా అవినితిపరులై నప్పటికీ, అరాచకం సృష్టించినప్పటికీ మళ్ళీ ఎన్నికలు వచ్చేటప్పటికి అన్నీ మరచిపోతారు. మందుకో, నోటుకో లేదా వాళ్ళిచ్చే ఇతర వస్తువులకో అమ్ముడుపోతారు. దీన్ని నాయకులు తమకు అనుకూలంగా మలుచుకొని పబ్బం గడుపుకుంటారు. ఈ విషయాన్నే ఈ కవిత ఇలా తెలియ జేస్తుంది.

"ఓటరు మహాశయులకు
మతిమరుపుజాస్తి
అవినీతి మహానాయకులకు
అదేకదా ఆస్తి!"

(ఆలోచనలు - ప్రత్యక్ష సాక్ష్యాలు - పేజి:64)

4) పరిశిష్టం :

విభజింపబడిన ఏ అంశాల్లోనూ ఇమడలేనివి కొన్ని వుంటాయి. అంటే అచ్చంగా మిగిలిపోయినవన్నమాట. వీటిని పరిశిష్టం కింద పరిశీలించడం ఆనవాయితి.

వర్షాభావ పరిస్థితి. దేన్నీ పట్టించుకోని గ్రామం. అయితే రైతుకు మాత్రం అగచాట్లే. నిరాశే బాధే. ఈ విషయాన్ని ఒక చిన్న కవితలో ఇమిడ్చారు మాడభూషివారు. మగ మేఘాలు అనడం వల్ల వర్షాన్ని కురిపించలేని మేఘాలు అని అభిప్రాయం.

"ఊరంతా నిద్రపోతోంది
ఆకాశమంతా మగమేఘాలు
చెమ్మగిల్లిన కళ్ళతో రైతు!"

(ఆలోచనలు - రైతేకూలి! - పేజి:14)

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాలను ఎన్నుకోవాలి. తమ ఓట్ల ద్వారా పాలించే నాయకులను ఎన్నుకోవలసి వుంది. అయితే దురదృష్టవశాత్తు అక్రమంగా ఓట్లెయ్యడం ఆచరణలోకి వచ్చింది. కొందరు దౌర్జన్యంగా ఓట్లేస్తున్నారు. వాళ్ళే తరువాత నాయకులుగా చలామణి అవుతున్నారు. వీళ్ళ చేతిలో ప్రజాస్వామ్యం నవ్వులపాలవుతూ వుంది. అరాచకం అందలమెక్కుతూ వుంది. ఇదే ఈ కవితకు వస్తువు.

"దొంగ ఓట్లేసే
రౌడీలు నాయకులవుతారు
50 ఏళ్ళ ప్రజాస్వామ్యం!"

(ఆలోచనలు - బాణీలు - పేజి:17)

బాల్యంలోనే భారతదేశానికి వచ్చి కలకత్తాలో స్థిరపడిన మదర్‌థెరిసా అందరికీ సేవ చేసింది. నోబుల్‌శాంతి బహుమతిని కూడా పొందింది. మానవత్వం పరమళించిన ఆమె మరణం కవిని బాగా గాయపరచింది. పర్యవ సానంగా ఈ కవిత పల్లవించింది.

"మనుషులకే కాదు
మానవత్వానికీ మరణమా?
విశ్వమాత మదర్!"

(ఆలోచనలు - విషాదాశ్రుతుషారాలు - పేజి:21)

భూమ్మీద జనం అధర్మానికి పాల్పడుతున్నారు. కొందరు దైన్యంతో బాధపడుతున్నారు. మొత్తానికి భూభారం పెరిగిందనే చెప్పాలి. భూగోళానికి సంబంధించిన ఈ పరిస్థితిని తలుచుకొని ఆకాశం బాధపడింది. కన్నీళ్ళు కార్చింది. అదే వాన. ఇది కవి అందమైన ఆలోచన.

"భూమిని గురించే
ఆకాశం బాధంతా
జోరున కురుస్తున్న వర్షం!"

(ఆలోచనలు - కొన్ని ఆలోచనలు - పేజి:26)

పిల్లలు స్వేచ్ఛనే కోరకొంటారు. వాళ్ళకు చదవాలని పించదు. ఆడుకోవాలనిపిస్తుంది. ఆనందంగా గడపాలని పిస్తుంది. కష్టాలను సహించే ఉద్దేశం గానీ, శక్తిగానీ వాళ్ళకుండవు. అలాంటి పిల్లల్ని పాఠశాలల్లో అట్టిపెట్టడం వాళ్ళను బంధించినట్టే అవుతుంది. ఈ అంశాన్నే ఈ కవిత తెలియజేస్తుంది.

"గదినిండా బందీలైన
సీతాకోక చిలుక
బడి పిల్లలు!"

(ఆలోచనలు - ప్రత్యక్ష సాక్ష్యాలు - పేజి:50)

ప్రతివారికీ ఆలోచనలు వస్తుంటాయి, పోతుంటాయి. కొందరు మాత్రమే వాటికి అక్షరరూపం ఇవ్వగలరు. అలాంటివారే కవులు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు తమ ఆలోచనలను కవిత్వీకరించి ఆవిష్కరించారు. వివిధ అంశాల మీద వారికున్న అభిప్రాయాలను తెలియజేశారు. వీటి నుంచి స్ఫూర్తిపొందడం, ఆలోచనలకు పదును పెట్టడం పాఠకులవంతే అవుతుంది.

❖❖❖

BHAVAVEENA
Vol. 17, Issue. 9, September 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అబద్ధపు సౌందర్యం

– డా॥. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి-2, చిత్తూరు (జిల్లా), ఆం.ప్ర.

"అబద్ధాలకోరు దొంగకంటే ప్రమాదం. దొంగను చూసి కాదు అబద్ధాలు చెప్పేవారిని చూసి మనం భయపడాలి." అన్నారు పెద్దలు. కాని నేడు అబద్ధం అనేది మనిషి జీవితంలో ఒక భాగమై కూర్చొంది. అది లేకుండా రోజు గడవని స్థితి. ఒకవేళ ఎవరైనా నిజాయితీగా ఉండాలని అనుకొన్నవారిని బతకనివ్వని దుస్థితి నేటిది. ప్రతి చిన్న విషయానికీ అబద్ధం. దాన్ని కప్పి పుచ్చడానికి మరొక అబద్ధం. చిన్నప్పుడు చిన్నచిన్న విషయాల దగ్గర మొదలైన అబద్ధాలు పెద్దయ్యాక కూడా కొనసాగుతూ వస్తున్నాయి. ఇలా పదేపదే అబద్ధాలాడుతూ అదొక నిత్యావసరంగా మారిపోయిన స్థితిని చాలా సౌందర్యభరితంగా కవనం చేశారు సంపత్ గారు.

అబద్ధానికి "అసత్యం, అనృతం, కల్ల, కల్లబొల్లి మాటలు, ఆలము, బొంకు, బూటకం, మాయ, మిథ్య, వ్యళీకం, నటము, హుళక్కి" (తెలుగు పర్యాయపద నిఘంటువు- ఆచార్య జి.యన్.రెడ్డి) వంటివి ఎన్నో పర్యాయపదాలున్నాయి. ఇవి చాలా వ్యక్తీకరణలలో మన భాషలో నిలబడ్డాయి. అసత్యమాడటం అనే స్థితి ఈనాటిది మాత్రమే కాదు. ఇది ఆదికావ్యం మహాభారతంలోనే కనిపిస్తుంది. శకుంతలను గాంధర్వ వివాహమాడిన దుష్యంతుడు ఆమె ఎవరో తెలియనట్లు మాట్లాడటం అసత్యాలు ఆనాడే చెలామణిలో ఉన్నాయనడానికి నిదర్శనం. మాట తప్పిన దుష్యంతుడి ప్రవర్తనను మార్చడానికి గృహస్థాశ్రమ ధర్మంలో సంతానం కంటె సత్యం గొప్పదని శకుంతల చెప్పిన పద్యం ఈ సందర్భంగా స్ఫురణకు వస్తూ ఉంది.

చం॥ సుతజల పూరితంబులగు సూతులు నూఱిటికంటె సూనృత
వ్రత!యొక బావి మేలుబీ మఱి బావులు నూఱిటికంటె నొక్క స
త్క్రతువది మేలుబీ తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలుబీ త
త్సుత శతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడఁగన్.

నూతులుకన్నా, యజ్ఞాలకన్నా, సుతులకన్నా, ఒక సత్యవాక్యమే మంచిదని ఎవరెంతగా ఉద్ఘాటించినా సమాజంలో అబద్ధాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. సత్యవాక్య విశిష్టత ఎందరు చెప్పినా అలకించని స్థితి ఎక్కువైంది. మన సమస్త సనాతన జీవన విలువలను మరచి ప్రవర్తిస్తున్న తీరు నేడు నిత్యమూ చూస్తూ ఉన్నాం. దాని ప్రభావం ఎన్నో విపరిణామాలకు దారి తీస్తూ ఉంది.

'మొదటి అబద్ధం' కవితా సంపుటిలోని కవితలన్నీ సమకాలీన సంఘటనలకు ఆకృతులే! కళ్ళముందు కనిపిస్తున్న నగ్న సత్యాలకు నిదర్శనాకృతే! కవిత్వమంటే కేవలం కొన్ని వాక్యాల్ని పేర్చటం కాదు. సాధారణ వాక్యాన్ని కవితావాక్యంగా మార్చటమే. అదే కవిత్వమని బుజువు చేశారు. కేవలం వాక్యాలను రాసి జనంమీద రుద్దకుండా అలంకారికంగా, ఆలోచనాత్మకంగా రాశారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనలనే అక్షరాలుగా తీర్చిదిద్దారు. చాలావరకు కవితలన్నీ చిన్నిచిన్ని మాటల ఈటెలు. సరళంగా సామాన్యులకు సైతం అర్థం కాగలిగేలా రాసిన ఈ కవితల్లో అందమైన భావాలను కూడా మిళితం చేసి రాశారు మాడభూషి సంపత్ గారు. ప్రతి కవిత రమణీయం. అందులోని ప్రతి పదమూ చమత్కారకం. సమకాలిక జీవితంమీద చురుకైన విసుర్లతో, కరుకైన

కసుర్లతో ఈ కవితలు రసానందాన్నిస్తున్నాయి. అందుకే ఇది 'అబద్ధపు సౌందర్యం'అన్నాను. చెప్పేమాటలో కవి బిగువు, పదును స్పష్టంగా కన్పిస్తూ ఉంది. వ్యంగ్యం, వక్రత, అలంకారస్పర్శ, సంవేదన, ఆర్ద్రత వంటి ఎన్నో అంశాల సమాహారంగా నిలుస్తుంది ఈ 'మొదటి అబద్ధం'.

మాడభూషిగారి కవిత్వంలో మనిషి అంతరంగపు టాలోచనల నుండి అబద్ధపు సౌందర్యం మొలకలా ప్రారంభమై అది ఓ వృక్షంలా విస్తరించింది. మనిషి నడిచొస్తుంటే అబద్ధపు సౌందర్యం నడిచొస్తున్నట్టుగా ఉంది. అబద్ధానికి పార్శ్వాలెన్నో! అబద్ధం అనిపించనివి, నిజం చెప్పనివి, నిజాన్ని కించపరిచేవి, గొప్పలు చెప్పుకొనేవి, సగం చెప్పి సగం దాచేవి. ఇలా ఎన్నో కోణాలు. అన్నీ అబద్ధాలే! వాటిని ఎంతో అందంగా కవిత్వీకరించారు. అందులో ఓ కవిత - ప్రపంచమంతా / అనివార్యంగా అబద్ధాలపై ఆధారపడి ఉంది / సామాన్య జనం అన్నంపై ఆధారపడినట్లు! (53) అంటారు. తిండి లేకపోతే మనిషి జీవనం ఏవిధంగా కష్టసాధ్యమో అదేవిధంగా అబద్ధాలు అనివార్యమైన స్థితిని బహుచక్కగా వివరించారు. మరో కవితలో ఈ అబద్ధం చెప్పడానికి ఎంత ఒద్దిక కావాలో కూడా విన్నవిస్తున్నారు. అబద్ధానికి ఎంతో ఒద్దిక కావాలి / ఎంతో కష్టపడి చెప్పిన అబద్ధాలన్నీ / చివరకు ఒక్క నిజంతో నాశనమైపోతాయి. అందంగా చెక్కిన శిల్పం మీద దెబ్బపడితే ఎలా శిలగా మారిపోతుందో అదేవిధంగా ఎంతో కష్టపడి శిల్పంలా మలచిన అబద్దాలు కూడా బయటపడితే నాశనమైపోతాయి. అదే సత్యవాక్యానికి ఉన్న గొప్పతనమని కూడా హెచ్చరిస్తారు. సత్యం ముందు అన్నీ బలాదూరేననడానికి మన పూర్వీకులు చాలా నిదర్శనాలే పేర్కొన్నారు. యుద్ధ సమయంలో ధర్మరాజు గురువైన ద్రోణాచార్యుడితో 'అశ్వత్థామ హతః అని చెప్పి కుంజరః' అని మెల్లిగా అంటాడు. దానితో ద్రోణుడి ప్రాణాలు పోవడానికి కారకుడవుతాడు. అందుకు వేమన- 'కులము నీఱుచేసి గురువును వధియింప / బొసగ నేనుగంత బొంకు బొంకె / పేరు ధర్మరాజు పెను వేపవిత్తయా/ విశ్వదాభిరామ వినురవేమ' అంటూ అబద్ధం బొంకి ద్రోణుడి ప్రాణాలు పోవడానికి కారణమైన ధర్మరాజును దెప్పి పొడుస్తాడు. పేరును బట్టి మనిషి గుణాన్ని అంచనా వేయకూడదనే అభిప్రాయానికి వచ్చేస్తాడు. ధర్మబద్ధంగా ఉంటాడన్న ధర్మరాజు కూడా అబద్ధాలాడతాడనే నింద పడుతుంది. నిజాలు మాత్రమే మాట్లాడే వాడుగా పొందిన గుర్తింపు ఒక్క మాటతో పూర్తిగా తొలగిపోతుంది.

ప్రజలందరూ పదేపదే "అబద్ధాలు ఆడ్డానికి కారణాలేమిటి? అన్న ప్రశ్నకు చాలా అబద్ధపు సమాధానాలు ఉన్నాయి. ప్రతి అబద్ధానికి కారణం ఒక అబద్ధపు సమాధానమే. అబద్ధం చెప్పకుండా బతకచ్చు. కానీ బతకలేక పోతున్నాం" (మొదటి అబద్ధం -ముందుమాట) అంటారు సంపత్ గారు. అది అక్షరాలా నిజం. ఎందుకంటే - పచ్చి నిజం చెబితే ఎవరూ నమ్మరు / దాన్ని ఉడికించి / ఉప్పుకారం వేసి / వడ్డిస్తేగానీ నిజం కూడా దిగదు! (9) అంటూ ఎంతో అందంగా కవనం చేశారు. నిజాన్ని కూడా అబద్ధాలతో జోడించి చెప్పాల్సిన పరిస్థితి నేడు ఉంది. కారణం నిజాన్ని కూడా అనుమానించే దౌర్భాగ్యం మన సమాజంలో ఉండటమే. ఎందుకంటే ఎవరు నిజం చెప్తున్నారో, ఎవరు అబద్ధం చెప్తున్నారో తెలియని అయోమయం. నిజమే చెప్పాలనుకొన్నా ఎంతో ఇబ్బంది పడాల్సిన దుస్థితిలో మనమున్నాం. మరోకవితలో నేటి సమాజంలో వ్యవహారంలో ఉన్న తీరును ఎత్తి చూపిస్తూ సంపత్ గారు కవనం చేస్తున్నారిలా! అబద్ధానికి సర్వత్రా ఆమోదం / అబద్ధం చెప్పిన వాడికి / ఏ సమస్యా ఉండదు / నిజం చెప్పిన వాడికి / ఏ సంతోషమూ మిగలదు! (11) 'యధార్థవాది లోకవిరోధి' అని సామెత. నిజాలు మాట్లాడేవాళ్ళు విరోధులుగా మారుతున్నప్పుడు నిజం అరుదైపోతుంది. ఎందుకంటే నిజం ఎవరికీ నచ్చదు. నిజాయితీగా ఉండే వ్యక్తికి సమాజంలో శాంతి లేదు. ఫలితం అబద్ధాలే రాజ్యమేలుతాయన్నది స్పష్టం. అబద్ధాలాడే వాడికి అంతటా ఆమోదయోగ్యమే. ఎలాంటి

సమస్యాలేక ప్రశాంతంగా జీవితం సాగిస్తున్న తీరుకు సాక్ష్యం ఈ కవిత! నిజాయితీగా ఉండేవాడు అతలాకుతల మవుతూ ఎలాంటి సంతోషానికీ నోచుకోని స్థితిని స్పష్టపరిచారు. అంతేకాదు వాస్తవాలను బహిర్గతం చేయడంలో అందెవేసిన చేయి సంపత్ గారిది. అందుకే "అబద్ధాలు మాత్రమే మందులు!" అంటారు. ప్రిస్క్రిప్షన్‌తో మొదలై సూదులు, ఎక్సరేలు, ఈసీజీలు, స్కేనింగులు, ఆపరేషన్లు అవసరాన్ని బట్టి కాకుండా అబద్ధాన్ని బట్టి అవసర మవుతాయంటూ చాలా అందంగా కవిత్వీ కరించారు.

కవులకు ఒక సామాజిక బాధ్యత ఉంటుంది. మంచి కవులు కళ్ళ ముందు జరుగుతున్న దురాగతాలను చూస్తూ ఊరుకోరన్నది స్పష్టం. ఒకవేళ ఊరుకొంటే అది ప్రమాద కరం కూడా! ఈ విషయంలో మాడభూషిగారూ ఊరు కోలేదు. వారి కవిత్వంలో సూటిదనం, ధైర్యం ప్రస్ఫుటాలై నవ్యకవులకు మార్గదర్శనం చేస్తాయి. అలాంటి ఓ కవిత!- అప్పు ఎగ్గొట్టేవాడు / విమానంలో ఊరేగుతాడు / అప్పు తీర్చలేనివాడు / చెట్టుకు ఊగుతాడు. (14) సమాజంలో నిత్యమూ చూస్తూ ఉన్న సంఘటనలకు నిదర్శనం ఈ కవిత. రైతులు వ్యవసాయానికై అప్పులు తీసుకొని వాటిని కట్టలేక, కట్టకపోతే పరువు పోతుందనే బాధతో ప్రాణాలను పణంగా పెడుతున్న సంఘటనలెన్నో అను నిత్యం పత్రికలలో చదువుతూ ఉన్నాం. అప్పు ఎగ్గొట్టాలను కొనేవాడు మాత్రం విమానంలో తిరుగుతూ ఆనందంగా జీవనం సాగిస్తున్న సందర్భాలూ ఎన్నో మనం చూస్తూనే ఉన్నాం. ఈ విషయాన్ని చాలా ధైర్యంగా ప్రస్ఫుటం చేశారు. మరో కవితలో నేటి సమాజ దుస్థితిని వివరిస్తున్నాడిలా! వకీలుతో/ సరితూగేవారు పోలీసులు /ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ రిజిష్టర్‌తో / మొదలయ్యే అబద్ధం / న్యాయస్థానం ముందుకూడా / తలెత్తుకు నిలబడుతుంది / ఒకపక్క లాయరు / మరోపక్క పోలీసు / అబద్ధాలకు రక్షణ కల్పిస్తూ ఉంటే / న్యాయదేవత వినలేక / కళ్ళు మూసుకొని /అబద్ధాల్లోనుంచి న్యాయాన్ని తీస్తుంది (17). సమాజంలోని వాస్తవాలను నిర్భయంగా చెప్పటం కవి ధర్మం. ఇక్కడ కవి అదే చేశాడు. రక్షణ కల్పించాల్సిన స్థానాల్లో ఉన్న బాధ్యతాయుతమైన వ్యక్తులు సైతం అబద్ధాలనే కాపాడుతూ ఉంటే మరింకెవరు ఈ సమా జాన్ని రక్షిస్తారనే ఆవేదన కనబడుతూ ఉంది. నీతి, నిజాయితీలు రెండు కళ్ళుగా జీవించే నాయకత్వం మనకు లేదు. అందువల్ల ఈ ధోరణి నేడు సామాన్య ప్రజానీకాన్ని సైతం ఆకర్షించింది. దాని ఫలితమే రకరకాల దారుణా లకు ఒడిగడుతున్న సమాజాన్ని దర్శిస్తూ ఉన్నాం. ఇది నిజంగా బాధాకరమైన విషయమే!

అబద్ధాల్లో ఆరితేరిన వాళ్ళలో మరొకరు రాజకీయ నాయకులు. వీరు మా పార్టీని గెలిపిస్తే ఇది చేస్తాం! అది చేస్తాం! అంటూ ఎన్నో వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయకుండా దాటవేస్తుంటారు. అలాంటి నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ-'చెప్పిన అబద్ధాన్నే / మళ్ళీ మళ్ళీ చెబుతూ / జీవితాంతం రాణించేవాడు రాజకీయనాయకుడు' (20) అంటారు. అంతేకాదు "అబద్ధానికి ముసుగులుంటాయని ఊహించలేం" (21) అని కూడా పేర్కొంటారు. పరమ స్వార్థపరులైన రాజకీయ నాయకులు చేస్తున్న దారుణాలను ఇంత చిన్న వాక్యంలో చెప్పి....'వాక్యం రసాత్మకం కావ్యం' అని విశ్వనాథుడు అన్న మాటలకు అక్షరసాక్ష్యంగా నిలుస్తారు సంపత్‌గారు. మరో కవితలో - ఇంద్రుడు ఎన్ని బొంకినా / నరకానికి రాడు / యముడు ఎంత ధర్మాత్ముడయినా / స్వర్గానికి పోడు (59) అంటారు. నిజమే! ఇంద్రుడు తూర్పు దిక్కుకు అధిపతి కనుక దక్షిణ దిక్కుకు రాడు. అంటే స్వర్గం వదిలి నరకానికి రాడు. అదేవిధంగా యముడు దక్షిణ దిక్కుకు అధిపతి కనుక తూర్పు దిక్కుకు రాడు అంటే నరకాన్ని వదిలిపెట్టి స్వర్గంలోకి అడుగు పెట్టలేడు. కాని ఇద్దరూ మంచి స్నేహితులు. ఇంద్రుడు ఎన్నో అబద్ధా లాడుతూ స్వర్గసుఖాలను అనుభవిస్తుంటే, యముడు ధర్మాత్ముడై ఉండి కూడా నరకంలో ఉంటూ నలుగురి దగ్గర మాటలు పడాల్సిన దుస్థితి. ఈ విషయాన్ని

ప్రతిబింబంగా తీసుకొని సంపత్ గారు అబద్ధాలాడే వాళ్ళు ఇంద్రుడిలా హాయిగా సంతోషంగా జీవిస్తున్నారనీ, నిజాయితీగా, ధర్మబద్ధంగా జీవించేవాళ్ళు ఎలాంటి సుఖమూలేక బాధపడుతున్న నేటి సమాజస్థితికి దర్పణంగా నిలుస్తుంది ఈ కవిత!

అబద్ధాన్ని అలంకారాలతో పోలుస్తూ అద్భుతమైన కవనం చేశారు. ఈ కవనానికి అలంకారాన్ని, వ్యంగ్యాభివ్యక్తిని జోడించి తన ఆలోచనలను, భావస్ఫురణను వైచిత్రితో కల్పిస్తారు. అలా చెప్పిన కవితల్లో ఒకటి - అబద్ధాలే పుస్తకాలకు అలంకారాలు / ఉన్నది ఉన్నట్టు చెబితే సహజం / ఉన్నదాన్ని రెట్టిస్తే అతిశయోక్తి / లేని దాన్ని ఊహించి చెబితే ఉత్ప్రేక్ష / అబద్ధాలకే అలంకారాలని పేరు' అంటూ అబద్ధాలకే సౌందర్యాన్ని ఆపాదించి కొత్త సొగసును తీసుకొచ్చారు. ఇంకో కవితలో - సామాన్యుడు / కూటికోసం అబద్ధం నేరిస్తే / అబద్ధాన్ని కూలికోసం నేర్పించేవాడు మేధావి! / కావ్యాల అల్లికలో జిగిబిగి చూపిస్తాడు/ సమాజమంతా అష్టావక్రమయినా/ ఏ వక్రమూ లేని వాణ్ణి / కథానాయకుడిగా నిలబెడతాడు! (47) అంటారు. ఈ కవితలు ఆరుద్ర కూనలమ్మ పదాలు లాగా ఉన్నాయి. చిన్న వాక్యాలుగా ఉండి చమక్కున మెరిపిస్తూ ఉన్నాయి. ఆధునిక జీవితం మనిషికి నేర్పింది స్కిల్ మేనేజ్‌మెంట్. అంటే స్వచ్ఛంగా, నిజాయితీగా ఉండకుండా వాళ్ళ స్వభావాన్ని మార్చుకొంటూ సందర్భానుసారంగా మాటలు మార్చివేయడం. గోడమీద పిల్లిలా ప్రవర్తించడం. అది తప్పని తెలిసినా హిపోక్రిటిక్ జీవితంలో అలా ఉండటమే సరైనదని భావించడం. ఈ భావనే మనిషిని పూర్తిగా మార్చివేస్తూ ఉంది.

''ఆనందంతోపాటు సత్యాన్ని సమ్మిళితం చేసే గుణం.'' ఉండాలంటారు తత్త్వవేత్త జాన్‌సన్. సంపత్‌గారి కవిత్వంలో ప్రతి అక్షరంలోనూ సత్యాన్ని ధైర్యంగా చెప్పే గుణం కనిపిస్తూ ఉంది. ప్రగతిశీల జపం చేస్తున్న కుహనా నాయకులు కూడా ఎందరో ఈ సమాజంలో! వారిని నిలదీస్తూ - నిజానిజాలు నిగ్గు తేల్చడానికి ఎవరికీ తరంకాదు / ఇజాల పేరుతో నిజాలను దాచేసే వాళ్ళు / నిజాల పేరుతో ఇజాలను మార్చేసే వాళ్ళు / చరిత్ర కారులుగా భాసిల్లారు (26) అంటూ చాలా ముక్కుసూటిగా మాట్లాడతారు. మార్క్సిస్టులు అని చెప్పుకొంటూ ఎన్నో ఘనకార్యాలు చేసిన ఘనత కొందరికి ఉంది. వారు దేవుడిని నమ్మమంటూనే నమ్మటం. అదేవిధంగా మరి కొందరు నిజాన్ని వక్రీకరించి ఆస్తులు కూడబెట్టడమూ ఉంది. చేసేది చెప్పేది అంతా అబద్ధమే. కాని చరిత్ర కారులుగా భాసిల్లుతూ ఉన్నకొందరి స్థితిని సంపత్‌గారు చాలా బాగా విశదపరిచారు.

మనిషి మనస్తత్వంలోని భిన్నధోరణులను అక్షరీకరించిన తీరు హృద్యంగా ఉంది. వీరు సృష్టించే భావ చిత్రాలు సమకాలీన చైతన్యంతో తళుకులీనుతాయి. 'హస్తవాణి' అలాంటి అద్భుతమైన భావచిత్రం. ఈరోజు ప్రపంచమే కుగ్రామమైనదని అంటున్నాం గాని ఆ మొబైల్ వలన ఎన్ని అబద్ధాలు బయటికొస్తున్నాయో ఎంతమంది ఎన్ని రీతులలో వాటిని అల్లుతారో మాడభూషి వారి కవనంలో దృశ్యమానమవుతాయి. హస్తవాణి -అబద్ధానికి రాణి / ఎంతటి అబద్ధానికైనా వెనుకాడదు/ అక్కడే ఉంటూ / ఆకాశంలో ఉన్నట్లు భ్రమింప చేస్తుంది (30) అంటారు. 'హస్తవాణి అబద్ధానికి రాణి' అని చమత్కరించడమే కాదు. అబద్ధాల ప్రచారానికి / అవి చేస్తున్న సేవలకు/ 'అబద్ధ సేవారత్నం'/ బిరుదు ప్రదానం తప్పనిసరి! అంటూ కొనియాడకమాననూ లేదు. వాచ్యంగా కాకుండా వ్యంగ్యంగా చెప్పేదే కవిత్వం అంటారు. వ్యంగ్యంలోనూ భిన్నతతోపాటు చమత్కారాన్ని, ముక్తాయింపును కలిగిన కవితలు మాడభూషివారి కవన వైశిష్ట్యాన్ని తెలియజేస్తాయి. అలాంటిదే అబద్ధసేవారత్నం బిరుదు కవిత! 'గుండెల్లో సూటిగా నాటుకోవడమే కవిత లక్షణం.'అంటారు సినీ గేయరచయిత భువనచంద్ర. సంపత్‌గారి ప్రతి కవితా పాఠకుల మనసులను సూటిగా తాకుతున్నాయి. నిద్రాణంగా ఉన్నవారిని చైతన్యవంతం చేస్తున్నాయి, ఆలోచింప జేస్తున్నాయి.

కవిత్వంలో ఆవేశం, ఆలోచన జతగా సాగుతాయి. కవితావేశం వల్ల పాఠకుడి మనసు ఉద్వేగభరితమైనా, ఆలోచనాత్మక శైలివల్ల ఆవేశం కూడా అర్థవంతమూ, అవసరమూ అనిపిస్తుంది. సమకాలీన సమస్యను చర్చిస్తూ పాఠకుడిని అందులో లీనం చేయగలగటం కవి ప్రతిభకు తార్కాణం. ప్రతిభ ఉండటమే కాదు, పాఠకుడిని ఆలోచింపచేయడం మాడభూషిగారి కవితాశైలి. అబద్ధాల వలయంలో చిక్కుకున్న ప్రకృతిమాత / రోడ్డున పడ్డ తల్లిలా రోదిస్తున్నా / మనిషి మాత్రం / అబద్ధాల వలయాన్ని బిగిస్తున్నాడు / ప్రకృతిని దహిస్తున్నాడు (60) చక్కటి అభివ్యక్తి కలిగిన కవిత ఇది. చెప్పాలనుకొన్న వస్తువుపట్ల స్పష్టత కనిపిస్తూ ఉంది. అక్షరం పరుషంగా పలకడం ఉంది. పరుషంగా పలికి అభివ్యక్తి సమన్వయంతో వ్యక్తికీ, సమాజానికీ వారధిగా నిలబడ్డ కవిత్వం కవిది! అబద్ధాల వలయంలో చిక్కుకొని అల్లాడుతున్న మనిషి మాత్రం అబద్ధాలను వదలడం లేదు. ప్రకృతి యావత్తునూ దహింపచేస్తున్న వైనం మనిషిలోని కర్కశత్వానికి నిదర్శనంగా తోస్తుంది. ''బొంకని వాడే యోగ్యుడు.'' అని దాశరథి అన్నట్లుగా సంపత్ గారు 'అబద్ధం చెప్పని వాడిది అరుదైన జన్మ' అంటారు. కాని ఎలాంటి ఉపయోగములేని అబద్ధాలే ప్రాణంగా జీవిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు మనుషులు. సంపత్‌గారు వారిని ఉద్దేశించి ఈ లోకంలో నిజాలు కరవవుతున్న స్థితికి దర్పణంగా నిలిపారు 'మొదటి అబద్ధం'. నివురు గప్పిన నిజం / మళ్ళీ నిద్రలేచేదాకా / అబద్ధానిదే అరచేతిలో స్వర్గం / స్వర్గంలో కూడా అబద్ధానిదే పైవర్గం!(64) అవును నిజం నిలకడ మీద నిలుస్తుందన్నది సత్యం. అలాంటి నిజం బయటపడేదాకా అబద్ధాలే చెలామణి అవుతా యన్నది స్పష్టమవుతూ ఉంది.

ఆధునిక మానవ జీవితంలో అంతరాత్మను నొక్కేస్తూ బయటికి మరోలా మాట్లాడుతూ ఉన్న లోకం మనకు నిత్యమూ కన్పిస్తూ ఉంది. దానివల్ల ఇటు శారీరకంగానూ, అటు మానసికంగానూ రకరకాల వ్యాధులకు లోనవుతూ ఉన్నాడు మనిషి. శరీరానికి, మనసుకు సంబంధం పోతూ ఉంది. పదిమంది చుట్టూ ఉన్న ఒంటరివాడిననే భావన మనిషిని కృంగదీస్తూ ఉంది. దీనితో నిజం నిర్భయంగా మాట్లాడటానికి ఎవరికి వీలవుతుందో అలాంటి ఒక వ్యక్తికోసం మొహం వాచిపోయి ఉన్నాం. వెతుకుతూ ఉన్నాం. అలాంటి వ్యక్తికే ఈ సమాజంలో గౌరవం, మర్యాద కూడా ఉంటాయి. అందువల్ల మనమున్న గాఢాంధకార సమాజంలో ఉషోదయ రేకలు కోసం వేచి చూద్దాం! అలాంటి ఉషోదయం భవిష్యత్తరాలకు రావాలని ఆశిద్దాం!

❖❖❖

సెప్టెంబర్ 2020 భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Arts, Literary, Culture & Language Study

UGC Care List Group - 1 Journal Sl. No 34 under Arts and Humanities Category

ఆచార్య మాడభూషి సంతప్ కుమార్

సాహిత్య సమాలోచన

(అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో సమర్పించిన వ్యాసాలు)











